శ్రీ రామ సేవ

శ్రీ మదాంధ్ర
వాల్మీకి రామాయణము

(మందరము) అయోధ్య కాండము-1

గ్రంథకర్త:
వావిలికొలను సుబ్బారావు



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

శ్రీమదాంధ్ర

వాల్మీకి రామాయణము

(మందరము) అయోధ్యకాండము-1

రచన

వావిలికొలను సుబ్బారావు

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

SRI MADANDHRA VALMIKI RAMAYANAMU

(MANDARAMU) AYODHYA KANDAMU-1

T.T.D. Religious Publication Series No:
© All Rights Reserved

e_Book Edition : 2023

Copies:

Published by :
Sri A.V. Dharma Reddy, IDES
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

D.T.P:
Publications Division,
T.T.D, Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

శ్రీ రామ

శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణము
మందరసమేతము

అయోధ్యాకాండము - విషయసూచిక

	పుటలు
1. మందరము, వ్యాఖ్యానారంభము	౧
2. భరతుఁడు శత్రుఘ్నునితోడఁ దన మేనమామయింటికిఁ బోవుట	౫
భాగవత పారతంత్ర్యము	౬
2. శ్రీరామచంద్ర కళ్యాణగుణ వర్ణనము	౧౨
స్వధర్మానుష్ఠాన మపరిత్యాజ్యమను విషయము	౧౮
దశరథుఁడు రామచంద్రుఁ యువరాజుఁ జేయ యోజించుట	౨౭
4. దశరథుఁడు శ్రీరామునిఁ యువరాజుఁ జేయఁ బౌరులతో నాలోచించుట	౩౧
5. దశరథు నుపన్యాసము	౩౩
పౌరులు శ్రీరాముఁడు యువరాజగుటకు సమ్మతించుట	౩౭
6. పౌరులు శ్రీరాముని గుణములు వర్ణించుట	౪౩
7. పట్టాభిషేక సంభారంబులు గూర్ప దశరథుఁ డాజ్ఞాపించుట	౫౬
8. వసిష్ఠుఁడు మంత్రులతో వలసిన సంభారములఁ జెప్పుట	౬౦
9. దశరథుఁడు శ్రీరాములను సభకుఁ బిలిపించుట	౬౪
10. దశరథుఁడు శ్రీరామునకుఁ దనయభిప్రాయంబుఁ దెలుపుట	౭౧
వినయగుణ వివేచనము	౭౫
స్త్రీధన చర్చ	౭౯

		పుటలు
11.	దశరథుఁడు శ్రీరామునిఁ దననగరునకుఁ బిల్పించుట	౭౯
12.	దశరథుఁడు శ్రీరాముని యువరాజుఁ జేయుటకుఁ గారణము	
	లాయనతోఁ జెప్పుట	౮౧
	ఋణత్రయ వివరణము	౮౨
	మరణకాల సూచనలు	౮౯
	స్త్రీలకు దేవపూజాదులు చేయు నధికారము గలదా అను	
	విషయమును గుఱించి	౯౧
13.	కౌసల్య శ్రీరాముని దీవించుట	౯౭
14.	దశరథుపంపున వసిష్ఠుఁడు శ్రీసీతారాముల నుపవాసముంచుట	౯౯
	గురువులను శిష్యులెట్లు పరిచరింపవలెను ?	౧౦౦
15.	శ్రీరామ పట్టాభిషేకమునకై జనులు గుంపులు గూడుట	౧౦౧
16.	శ్రీరాముఁడు నారాయణార్చనము చేయుట	౧౦౪
	హవిస్సు భుజించుటవలన నుపవాసవ్రత భంగమగునా	౧౦౭
	గృహాలంకరణమును స్త్రీలు సూర్యోదయమునకే ముందే	
	చేయవలయునను విషయము	౧౦౮
	సంధ్య	౧౦౯
	స్నాన వివరణము	౧౧౨
17.	శ్రీరామ పట్టాభిషేకమునకై యయోధ్య యలంకరింపఁ బడుట	౧౧౩
18.	పట్టాభిషేకవిషయ జన సంభాషణము	౧౧౫
19.	మంథర యయోధ్యాలంకారముఁ జూచుట	౧౧౮
	అవతార ప్రయోజనారంభము	,,
20.	మంథర కైకేయికి శ్రీరామ పట్టాభిషేకవార్తఁ దెలిపి దుఃఖించుట	౧౨౨
21.	పట్టాభిషేకవార్తఁ జెప్పిన మంథరకుఁ గైక పారితోషక మిచ్చుట	౧౨౭
22.	మంథర కైకను దూషించుట	౧౨౯
23.	మంథరకుఁ గైక శ్రీరాముని గుణములు వర్ణించి చెప్పుట	౧౩౩
24.	మంథర కైకకు దుర్బోధము సేయుట	౧౩౫
25.	కైక మంథరను శ్రీరామ పట్టాభిషేకము విఘ్నము సేయ	
	నుపాయ మడుగుట	౧౩౯
26.	మంథర కైకకు శ్రీరామ పట్టాభిషేకము విఘ్నము సేయ	
	నుపాయంబుఁ జెప్పుట	౧౪౩

పుటలు

27. మంథర కైకకు రాజుపైఁ గోపము వచ్చినట్లు నటింప బోధించుట ౧౪౫
28. కైక మంథరను మెచ్చుకొనుట ౧౫౦
29. కైక కోపగృహముఁ జొచ్చుట ౧౫౪
30. దశరథుఁడు పట్టాభిషేకవార్తఁ దెలుపఁ గైకగృహంబునకుఁ బోవుట ౧౬౦
31. దశరథుఁడు కైక దుఃఖించుటకుఁ గారణ మడుగుట ౧౬౬
32. కైకకోర్కి నెఱవేర్చెదనని దశరథుఁడు ప్రమాణముసేయుట ౧౬౮
33. కైక తనపూర్వవరముల వృత్తాంతము దశరథునకుఁ జెప్పుట ౧౭౨
34. కైక భరత పట్టాభిషేకము శ్రీరామ ప్రవాసము వరంబులుగఁ గోరుట ౧౭౩
స్త్రీల యనురాగము స్వాభావికమా యను విషయము ౧౭౫
35. కైకగోరిన వరముల విని దశరథుఁడు పరితపించుట ౧౭౬
36. దశరథుఁడు కైకను దూషించుట ౧౭౭
37. దశరథుఁడు శ్రీరాముని గుణముల వర్ణించుట ౧౮౩
38. దశరథుఁడు కైకను వేఁడుకొనుట ౧౮౭
39. కైక దశరథుని దూషించుట ౧౮౯
స్త్రీలకు పుత్రప్రేమకంటె సపత్నిమాత్సర్య మెక్కుడను విషయము ౧౯౨
40. కైక నిష్ఠురోక్తులకు దశరథుఁడు విహ్వలుఁడగుట ౧౯౩
కైకకిచ్చిన వరముల నేల దశరథుఁడు కాదనరాదు ? ౧౯౫
41. దశరథుఁడు కైకేయితో న్యాయనిష్ఠురము లాడుట ౧౯౬
42. దశరథుఁడు కైకను ప్రార్థించుట ౨౦౧
43. దశరథునకు సత్యంబు కైక బోధించుట ౨౦౨
44. దశరథుఁడు కైకను విడనాడుట ౨౦౫
దశరథుఁడు కైకను శపించుట శాస్త్రీయమా ? ౨౦౬
దశరథుఁడు ధర్మపాశబద్ధుఁడగుట యథార్థమా ? ౨౩౪
వసిష్ఠ శబ్ద వ్యాఖ్య ౨౩౫
45. వసిష్ఠుఁడు పట్టాభిషేక సంభారములతోఁ జనుదెంచుట ౨౩౬
46. వసిష్ఠుఁడు దనరాక దశరథునకుఁ దెలుప సుమంత్రుఁబంపుట ౨౩౭
47. సుమంత్రుఁడు దశరథుని నిద్రమేలుకొలుపుట ౨౩౯
48. కైక సుమంత్రునితో శ్రీరాముని దోడితెమ్మని చెప్పుట ౨౪౨
49. సుమంత్రుఁడు సామంతరాజులతో సంభాషించుట ౨౪౬
50. దశరథుఁడు సుమంత్రునితో శ్రీరామునిఁ బిలుచుకొనిరమ్మని చెప్పుట ౨౪౮

		పుటలు
51.	సుమంత్రుఁడు శ్రీరామునితో దశరథుని వాక్యంబుఁ జెప్పుట	౨౫౩
52.	శ్రీరాముఁడు సీతాదేవికి రాజాజ్ఞ నెఱింగించుట	౨౫౮
	భార్యలు భర్తల నాశీర్వదింపవచ్చునా ?	౨౬౪
53.	శ్రీరాముఁడు దశరథుఁ గృహంబునకు బోవుట	౨౬౬
54.	ప్రజలు శ్రీరాముని దీవించుట	౨౭౧
55.	శ్రీరాముఁడు దశరథుని స్థితికి వగచుట	౨౭౬
56.	శ్రీరాముఁడు కైకను దశరథు దుఃఖపాటునకుఁ గారణమడుగుట	౨౭౯
57.	శ్రీరామునితోఁ గైక తన వరముల వృత్తాంతముఁ దెలుపుట	౨౮౪
58.	అరణ్యమునకుఁబోవ శ్రీరాముఁ డంగీకరించుట	౨౮౮
59.	శ్రీరాముఁడు కౌసల్యా గృహమునకుఁ బోవుట	౨౯౫
60.	శ్రీరాముఁడు కౌసల్యను జూచుట	౩౦౦
61.	శ్రీరాముఁడు తల్లితోఁ దానరణ్యమునకుఁ బోవువార్తఁ జెప్పుట	౩౦౩
	నిరామిషశబ్ద విచారము	౩౦౫
62.	శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవుట విని కౌసల్య దుఃఖించుట	౩౦౬
63.	లక్ష్మణుఁడు కౌసల్యతో శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోరాదని చెప్పుట	౩౧౩
64.	లక్ష్మణుఁడు శ్రీరామునితో నరణ్యమునకుఁ బోవలదని చెప్పుట	౩౧౬
65.	శ్రీరాముఁడు కౌసల్యాలక్ష్మణుల నూరార్చుట	౩౨౨
	తల్లిదండ్రుల నిర్బంధింపరాదుకదా శ్రీరామచంద్రమూర్తి	
	తల్లిని నిర్బంధించుట సరియా ?	౩౨౯
66.	శ్రీరాముఁడు లక్ష్మణునకు ధర్మోపదేశంబు చేయుట	౩౩౩
	తప్పుత్రోవలఁబోవు గురువును దండింపవచ్చునని లక్ష్మణు మతము	
	దండింపరాదని శ్రీరాముని మతము-ఇందేది యనుసరణీయము?	౩౩౪
67.	శ్రీరాముఁడు లక్ష్మణునితో మేలుగీళ్ళకు దైవము కారణమనిచెప్పుట	౩౪౨
68.	లక్ష్మణుఁడు శ్రీరామునితో దైవముకంటెఁ బౌరుషమే	
	శ్రేష్ఠమని చెప్పుట	౩౪౭
	దైవపౌరుష విచారము	౩౬౨
69.	కౌసల్య శ్రీరాము నిశ్చయమెఱింగి పరితపించుట	౩౬౮
70.	భార్యలు భర్తల విడిచిపోఁగూడదని శ్రీరాముఁడు కౌసల్యతో జెప్పుట	౩౭౦
71.	శ్రీరాముని వనవాసంబునకుఁ గౌసల్య యొయ్యకొనుట	౩౭౮

పుటలు

72. కౌసల్య శ్రీరాము నాశీర్వదించుట ౩౭౯
కౌసల్య శ్రీరామునకు మంగళాశాసన మొనర్చి రక్షగట్టుట ౩౮౫
వినతకథ ౩౮౬
73. శ్రీరాముఁడు సీతను జూడఁబోవుట ౩౯౦
మాతృ వియోగముకంటె భార్యావియోగము తీవ్రతరమా ? ౩౯౩
74. శ్రీరాముఁడు సీతతోఁ దానరణ్యమునకుఁ బోవువార్తఁదెలుపుట ౩౯౫
75. శ్రీరాముఁడు సీతకు నీతులు చెప్పుట ౩౯౮
76. సీత శ్రీరామునితో నరణ్యమునకుఁ దాను వచ్చెదనని చెప్పుట ౪౦౨
భార్యాభర్తల సంబంధమును గుఱించి ౪౦౪
ఎట్టి కష్టదశయందును భార్యభర్తను విడువరాదను విషయము ౪౦౭
77. శ్రీరాముఁడు సీత కరణ్యమునందలి కష్టములఁ జెప్పుట ౪౧౧
వానప్రస్థ ధర్మ వివరణము ౪౧౪
78. సీత శ్రీరామునితోఁ దానడవికి వచ్చుటకుఁ గారణములఁ జెప్పుట ౪౧౭
స్త్రీలకుఁ బతిపూజవలననే స్వర్గము కలదను విషయము ౪౨౧
79. సీత శ్రీరాము నిష్ఠురము లాడుట ౪౨౪
80. శ్రీరాముఁడు సీత వనంబునకు వచ్చుట కంగీకరించుట ౪౩౩
81. శ్రీరాముఁడు సీతతో నరునకుఁ బితృపూజ యవశ్య
కర్తవ్యమని చెప్పుట ౪౩౫
తల్లితండ్రి యాచార్యుల శుశ్రూషయే పరమతపము ౪౩౭
82. శ్రీరాముఁడు దానముసేయ సీతను నియోగించుట ౪౪౦
భార్యకుఁ బుత్రునకుఁ దాసునకు వేరు ధనములేదను న్యాయ
ముండగా శ్రీరాముఁడెట్లు దానము చేసెను ? ౪౪౧
83. లక్ష్మణుండు తాను వనమునకు వచ్చెదనని శ్రీరాముఁ బ్రార్థించుట ౪౪౨
తల్లిదండ్రి బ్రతికియుండఁగా వారినివిడిచి శ్రీరాముని గొలువ
లక్ష్మణుఁ డడవికిఁబోవుట ధర్మమా ? ౪౪౩
శరణాగతి వివరణము ౪౪౪
84. శ్రీరాముఁడు లక్ష్మణుని నయోధ్యయందుండుమని చెప్పుట ౪౪౬
85. లక్ష్మణుఁ డరణ్యమునకు వచ్చుటకు శ్రీరాముఁడు సమ్మతించుట ౪౫౨
86. శ్రీరాముఁడు తన పదార్థములను దానముచేయుట ౪౫౪
మితాహార నియమము బ్రహ్మచారులకు లేదను విషయము ౪౫౭

		పుటలు
87.	త్రిజటుఁడను బ్రాహ్మణుని వృత్తాంతము	౪౫౯
	బ్రాహ్మణుఁడు దేహధారణ కుటుంబ రక్షణములకై చేయు యాచన దూష్యముకాదు	౪౬౧
88.	సీతా రామ లక్ష్మణులు తండ్రియొద్దకుఁ బోవఁజూచి ప్రజలు దుఃఖించుట	౪౬౫
89.	పౌరులు కైకేయీ దశరథుల నిందించుట	౪౬౭
90.	శ్రీరాముఁడు తనరాకను దండ్రికిం జెప్పిపుచ్చుట	౪౭౨
91.	దశరథుఁడు సీతారామ లక్ష్మణులఁ జూచుట	౪౭౬
92.	శ్రీరాముఁడు సీతాలక్ష్మణులతో వనమునకుఁబోవ ననుజ్ఞ వేఁడుట	౪౭౭
	తనకు వశవర్తినియగు సీత విషయమై శ్రీరాముఁడు దశరథునకుఁ దెలుపుట విధియా ?	౪౭౮
93.	శ్రీరాముఁ డరణ్యమునకుఁబోవ దశరథుఁడు సమ్మతించుట	౪౮౦
94.	శ్రీరాముఁడు తన మనోనిశ్చయముఁ దండ్రికిం జెప్పుట	౪౮౩
95.	సుమంత్రుఁడు కైకను దూషించుట	౪౮౯
96.	దశరథుఁడు శ్రీరామునితోడ సైన్యాదులు పంప సుమంత్రునితోఁ జెప్పుట	౪౯౬
97.	సిద్ధార్థుండు కైకకు బుద్ధిచెప్పుట	౫౦౦
98.	కైక సీతారామలక్ష్మణులకు నారచీరలిచ్చుట	౫౦౩
	సీతను దోడ్కొనిపోవలదని రాజకాంతలు శ్రీరామునిఁ బ్రార్థించుట	౫౦౬
99.	సీత నారచీరలు కట్టఁగూడదని వసిష్ఠుఁడు నిషేధించుట	౫౦౭
	భార్య భర్తకు ఆత్మయనుటకుఁ బ్రమాణములు	౫౦౮
100.	సీతకు నారచీరల నిచ్చుటకు దశరథుఁడు కైకను నిందించుట	౫౧౨
	భర్త నారచీరలు ధరింపఁ దాను పట్టుచీరలు సీతాదేవి ధరించెను గదా అది వ్రతభంగముగాదా ?	౫౧౪
101.	శ్రీరాముఁడు తనతల్లిఁ గాపాడుమని తండ్రిని వేఁడుకొనుట	౫౧౬
102.	మునివేషధరుండైన శ్రీరామునింజూచి దశరథుఁడు దుఃఖించుట	౫౧౮
103.	కౌసల్య సీతకు ధర్మోపదేశములు చేయుట	౫౨౧
	పతివ్రతా ధర్మములు	౫౨౪
104.	శ్రీరాముఁడు కౌసల్యాది మాతలయొద్ద సెలవు తీసికొనుట	౫౨౮
	సుమిత్ర లక్ష్మణునకు శ్రీరామువెంటఁబోవ ననుజ్ఞ యిచ్చుట	౫౨౯
	"రాముఁడ యెఱుంగుమీ దశరథుఁడు నిజము" అను పద్య వ్యాఖ్యానము	౫౩౨

	పుటలు
105. సీతారామలక్ష్మణులు తేరెక్కి వనములకై పోవుట	౫౩౮
106. శ్రీరాముని బోకకుఁ బ్రజలు దుఃఖించుట	౫౩౯
107. దశరథుఁడు శ్రీరామునిఁ జూడవచ్చుట	౫౪౧
శ్రీరామునకై యంతఃపుర స్త్రీలు దుఃఖించుట	౫౪౭
సోపాధిక బంధువులు త్యాజ్యులనియు నిరుపాధిక బంధువు శ్రీరాముఁడే విశ్వసనీయుండనుటకుఁ గారణములు	౫౫౩
108. దశరథుఁడు మరలి తనగృహమునకుఁ బోవుట	౫౫౪
109. దశరథుఁడు కౌసల్యా గృహమునకుఁ బోవుట	౫౬౧
దశరథుని పంచేంద్రియములు శ్రీరామునకే యనన్యార్హంబులయిన విషయము	౫౬౨
110. కౌసల్య శ్రీరామునిఁ దలఁచి దశరథునితోఁ జెప్పుకొని యేడ్చుట	౫౬౬
నీరుత్రావు గోవును పాలుత్రాగు లేఁగను నీవల కీడ్వరాదను విషయము	౫౭౦
111. సుమిత్ర కౌసల్యకు శోకోపశమనము చేయుట	౫౭౨
సుమిత్ర వాక్యములచే వాల్మీకి శ్రీరాముఁడు పరమాత్మయను విషయమును జెప్పుట	౫౭౨
జీవునకు భగవత్కైంకర్యమే స్వరూప స్వభావములను విషయము	౫౭౪
112. శ్రీరాముఁడు పౌరులను మరలిపోవఁ బ్రార్థించుట	౫౮౩
113. పౌరవృద్ధులు శ్రీరామునిఁ బురికిరాఁ బ్రార్థించుట	౫౮౮
114. శ్రీరాముఁడు తమసా నదీతీరముఁ జేరుట	౫౯౪
115. శ్రీరాముఁడు పౌరుల మోసగించిపోవుట	౫౯౯
తనను నమ్మివచ్చిన పౌరులను శ్రీరాముఁడు మోసగించిపోవచ్చునా?	౬౦౧
116. పౌరులు శ్రీరామునిఁగానక దుఃఖించుట	౬౦౩
117. పౌరు లయోధ్య మరలఁ జేరుట	౬౦౬
118. పౌరు లయోధ్యకుఁబోవ స్త్రీలు వారిని నిందించుట	౬౦౮
119. పురస్త్రీలు శ్రీరాముఁ దలంచి దుఃఖించుట	౬౧౨
120. శ్రీరాముఁడు కోసలదేశంబు దాఁటిపోవుట	౬౧౯
శ్రీరాముఁడు క్షుద్రదేవతలకు నమస్కరింపవచ్చునా ?	౬౨౩

పుటలు

121. శ్రీరాముఁడు గంగానదిఁ గాంచుట ౬౨౭

122. గుహుఁడు శ్రీరాము దర్శించుట ౬౩౪

ఆత్మనిక్షేప వివరణము ౬౩౫

భగవంతుఁడు తనను బూజించువారికంటెఁ దనభక్తులఁ
బూజించువారి విషయమున విశేషముగ సంతోషించునను విషయము ౬౩౯

౦—౦

శ్రీః.

శ్రీసీతాలక్ష్మణ భరతశత్రుఘ్న హనుమత్సమేత శ్రీరామచన్ద్ర పరబ్రహ్మణేనమః

శ్రీమతే రామానుజాయ నమః.

శ్రీ హయగ్రీవ ప్రసన్న.

శ్రీ శారదాయై నమః.

శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణము

మం ద ర స మే త ము.

అ యో ధ్యా కాం డ ము

మత్ సుగుణాభరణా :
ధీమత్స్మరణ ప్రసూన•దీపితచరణా :
స్వామీ చిదచిద్ద్వివిణా :
శ్రీమహితా యొంటిమిట్ట•సీతారమణా :

మం ద ర ము

వ్యా ఖ్యా నా రం భ ము.

శ్రీ రామచంద్ర ప్రభో పాహిపాహి.

సీ. తనపాద భక్తుల తనయునిఁగాఁజేసి, యనుకంప వీక్షించె జననమంద
ఆవలఁదాలక్ష్మణార్యుఁడై రక్షించి, రామాయణంబనుగ్రహముచేసె
స్వీయమంత్రంబును జెట్లూరి నరసింహ, దేశికుండయి యుపదేశమిచ్చె
ఏకశిలానగరాకుఁడై గ్రహియించె, నాంధ్ర వాల్మీకి రామాయణంబు

వాసుదాసునిఁగావించి వాసుకిగను, మందరభరంబువహియించిమాధవుండు
శ్రీకృపాపాత్రులనుజేసి స్వీయులైన భక్తబుధులకు నమృతంబుఁ బంచిపెట్టి
కం॥ హృదయగతుండయి రాముఁడు।

సదయుండై తెలియరానిసద్విషయంబుల్।
విదితముగఁజేయు నుండఁగఁ।దదనుమతిన్ వ్యాఖ్యవాసుదాసుఁడుపలుకున్

వ్యా ఖ్యా న ము

శ్రీమత్=శ్రీమంతములయిన, శోభావంతములయిన, లక్ష్మీప్రదములయిన సుగుణ=కల్యాణగుణములే. ఆభరణా=అలంకారములు గాఁగలవాఁడా, శ్రీమంతుఁడవైన సుగుణాభరణా యనియైనఁ జెప్పనగు, ధీమత్=బుద్ధిమంతులయొక్క స్మరణ=స్మరణమనెడి, ప్రసూన=పుష్పములచేత, దీపిత=ప్రకాశముగలవగు, చరణా=పాదములుగలవాఁడా, స్వామీ=చరాచర ప్రపంచమంతయు జీవకోటి తోడ తనసొమ్ముగాఁగలవాఁడా! చిత్-అచిత్-ద్రవిణా=చేతనులు ప్రకృతి యీ రెంటికి వాసస్థానమైన వాఁడా, "ద్రవిణంగేహే వి త్తేస్వర్గేపరాక్రమే" నానాఇది నారాయణ శబ్దార్థవివరణము శ్రీమహితా=లక్ష్మిచే నుత్కృష్టుఁడవైనవాఁడా, ఒంటిమిట్ట=ఏకశిలానగరమను నామాంతరముగల యొంటిమిట్టయందు వేంచేసి యుండు, సీతారమణా=సీతయందు రమించువాఁడా రామచంద్రా వినుము అని అధ్యాహారము.

శ్రీమత్=ఇది ద్వయమందలి ప్రథమపదము. బాలకాండము మొదటి పద్యమున నీ గ్రంథమునఁ బ్రతిపాదింపఁబడిన భగవన్మూర్తి శ్రీరాముల ముఖ్యమంత్రము షడక్షరి సబీజముగఁ జెప్పఁబడెను. ఇక్కడనుండి ద్వయము ప్రారంభమగును.

ఈ గ్రంథమునందలి మంత్రములన్నియు నుత్తరకాండముతోఁ బూర్ణ మగును గావున నందవి సమన్వయించి చెప్పఁబడును.

శ్రీమత్ అనుచోట మత్తుననది ప్రత్యయము. దీనినే మతుప్ప్రత్యయ మందురు. "భూమ, నిందా, ప్రశంసాసు నిత్యయోగేతిశాయినే, సంసర్గేస్తి వివక్షయాం భవంతి మతుబాదయ" యని యీ ప్రత్యయము నానార్థములు బ్రయోగింపఁబడును. దీనికిఁ గలయని యర్థము. శ్రీమత్=శ్రీ కల యని యర్థము. ఏవిధముగాఁగల? యనఁగా నిత్యయోగముగఁగల యనియర్థము. కావున సర్వకాల సర్వావస్థలయందును నెడఁబాటులేని కలయిక చెప్పఁబడెను, కావున "శ్రీధర శ్శ్రీకర శ్శ్రేయ శ్శ్రీమాన్ లోకత్ర యాశ్రయ' యని భగవన్నామములందు శ్రీమాన్ అనునదియు నుండుటచే శ్రీమంతుఁడైన యన్నప్పుడు శ్రీతో నిత్యసంయోగము గల వాఁడని యర్థము గ్రహింపవలెను.

"కృష్ణాజినేన సంవృణ్వన్ వధూం వక్షస్స్థలాలయా" మ్మన్నట్టు (వామనావ తారమున బ్రహ్మచారి కావున లక్ష్మీదేవి వెలికిఁగానరాకుండఁ గృష్ణాజినముచేఁ

గప్పెనవియు, నామె మౌంజియం దుండెననియుఁ జెప్పుదురు. అట్టులే 'భాస్కరేణ ప్రభాయథా' యన్నట్లు సీతారాములకు, లోకమునకు గానవచ్చినను రాకున్నను, వియోగము లేమిని నిది సూచించును వనప్రయాణకాలమున సీతారామ సంభాషణము. 'నిన్నుఁబాసి ధరాతనూజయు నేను నొక్క ముహూర్తమే నిన్నిలం గలవారమే. (ప. ౧౧-౨౩) యను లక్ష్మణు వాక్యము చూచునది.

సుగుణాభరణా=ముఖ్యముగ నీ యయోధ్యాకాండమందు శ్రీరాముని వాత్సల్య-స్వామిత్వ-సౌశీల్య-సౌలభ్య - సర్వజ్ఞత్వ-సర్వశక్తిత్వ - సర్వసంకల్పత్వ-పరమకారుణికత్వ-కృతజ్ఞత్వ-స్థిరత్వ-పరిపూర్ణత్వ- పరమోదారత్వాదులు వర్ణింపఁబడినవి. ఈగుణముల లక్షణములు రామచంద్రమూర్తియం దెట్లన్వయించునది మున్ముందు విస్తరింపఁబడును.

ఈవిధముగ శ్రీమత్సుగుణాభరణా యనుటచే నయోధ్యాకాండ మందలి ముఖ్యార్థము సూచితము. శ్రీరామచంద్రమూర్తియందు వాత్సల్యాది సుగుణము లుండుటయు సత్యమే. అవియును శ్రీమంతము లగుటయు(సంపత్కరములగుటయు) సత్యమే. అవి మనపై శ్రీరామచంద్రమూర్తి ప్రయోగించునుపాయమెట్లు?

బుద్ధిమంతుల స్మరణప్రసూనములచే దీపించు పాదములు గలవాఁడా యనుటచే శ్రీరామచంద్రమూర్తి శ్రీపాదముల నాశ్రయించుట యనునది పూలఁచే బూజించుట యనియు,నాస్మరణమనునది ధీమంతమై యనఁగానిండు మనస్సుతో శ్రద్ధాభక్తులతోడ నుండవలయు ననియు, గ్రహింపవలెను. దీని వలన శ్రీరామనామస్మరణమే మనల శ్రీరామానుగ్రహమునకుఁ బాత్రులఁ జేయుననియు నదియే తరుణోపాయ మనియుఁ దెలియనగు.

ఆయనను మన మేలస్మరింపవలెననిన మనముస్వమ్ము (సొమ్ము), ఆయనస్వామి, (సొమ్ముగలవాఁడు) కావున మన మాయనవిషయమునఁ బ్రాతికూల్యము వర్జించి, యనుకూలురమై,యాయనయే రక్షకుఁడని దృఢవిశ్వాసము గలవారమై, యున్నయెడల నాయన మనల నెక్కువ ప్రీతితో రక్షించును. ఒకనికి నూఱుగోవులుండిన వానిలో నొకటి దుష్టపశువుండెనేని దానికిని మేపు నీళ్లు పెట్టి వాఁడు కాపాడినను సాధువైన గోవును దనయందుఁ బ్రీతివిశ్వాసములుగల గోవునాదరించినట్టు దానినాదరింపఁడు గదా. ఆయన స్వామియు మన మాయనసొమ్మై యాయన మనలను మన ప్రార్థనలేకయే సంరక్షించుచుండఁగా గృతజ్ఞులమై మఱేమిచేయలేకున్నను జేయకున్నను నాయన నామమైన స్మరింపమేని మనకంటెఁ గృతఘ్నులెవరు? ఆయన మనకు స్వామియెట్లయ్యెనన చిదచిద్విభుఁడు కావున. జీవులకు-ప్రకృతికిఁ గూడ ధారణ పోషణముల కాయనయే కర్త కావున. శ్రీరామపరత్వమందుఁ జెప్పఁబడిన నారాయణ శబ్దార్థమిట ననుసంధించునది. ఈయన కీగొప్పతన మెట్లువచ్చెను? శ్రీ

మహితుఁడు కావున, ఈయనయందు గొప్పగుణములు గలవు. వానిని భక్తుల యందు వినియోగపఱిపించి భక్తుల రక్షించుచుఁ దన్మూలమున భగవంతునకు పేరుప్రతిష్ఠ తెచ్చునది శ్రీ. చెఱువునిండ నీరున్నది. దాని క్రిందఁ గావలసినంత పొలమున్నది. తూములేకున్న నేమి ప్రయోజనము? మనకుఁగావలసినది తూము నీరే. చెఱువు నీటితోఁ బనిలేదు. ఎండని తఱుగని నిండుచెర్వు. ఎంత నీరు దీసిన నేమిభయము. శ్రీయను తూమునుండి భగవత్కృపయను నీరు తెచ్చుకొని తనక్షేత్రమును బాగుపఱుచుకొననివాఁడు పాపాత్ముఁడు. ఇట్టిస్వామి యెవఁడు? ఒంటిమిట్టయందు నర్చావతారముగ వేంచేసియుండు సీతాలక్ష్మణ సహితుఁడైన శ్రీరామచంద్రమూర్తియే. "శ్రీరంగస్థల వేంకటాద్రి కరిగిర్యాదౌశ తేష్టోత్తరే, స్థానే గ్రామనికేతనేషుచ సదాసాన్నిధ్యమాసేదుషే। అర్చారూపిణి మర్చకాభిమతితః స్వీకుర్వతే విగ్రహం। పూజాంచాఖిల వాంఛితాన్వితనుతే శ్రీ శాయతస్మైనమః." కావున నర్చావతారమే యీ కాలమున సేవ్యము.

అవతారిక :— "ఈ లోనన జాంబూనదచేలుఁడు త్వరవిచ్చేసెన్" అనుటచే భగవంతుఁడైన శ్రీ మన్నారాయణుండు "రక్ష్యాపేక్షామపేక్షతే" తన్ను రక్షింపుమని కోరువానికై యెదురుచూచుచుండి రక్షరక్షయను నార్తనాదము విన్నమాత్రముననే, కట్టఁబడిన దూడకూఁతవినఁగానే పరుగుదెంచుగోవువలె, నార్తరక్షకై పరుదెంచుననియు, దశరథునకుఁ బుత్రుఁడగుటచే జన్మంబుననైన సకామముగనైన భగవంతుని సేవించియుండినచో మరల జన్మంబుల మనము మఱచినను దాను మఱవక మనకోరిక నెవవేర్చుననియు, పరత్వదశయందుఁగల మహత్త్వమవతారదశయందును గలదని యేనెఱుంగుదు రాజేంద్ర యీ మహాత్ము"నను వాక్యముచేఁ బురుషసూక్తోక్తభగవన్మహత్త్వమున కిప్పుడు కొఱఁతలేదనియు, నీవనిర్దేశ్యుండవులోనగు కశ్యపోక్తులవలన భగవద్వైభవం బచింత్యమనియు, శివధనుర్భంగ-పరశురామ వాక్యములవలనను విష్ణువేయధికుఁడని దేవతలు తలంచిరనుటచే నవతారదశ యందుఁగాని యితర దశ యందుఁగాని శ్రీరామచంద్రమూర్తియే పరమదైవతమనియు బాలకాండము వలన నేర్పడుచున్నది.

ఇట్లు పూర్వకాండమందు స్వరూపము స్థాపించి యీకాండమందు స్వభావ మనఁగా హేయగుణ రహితత్వము కల్యాణగుణ సహితత్వము దెలుపఁబడుచున్నది. ఇఁక జెప్పఁబడుచున్న ధర్మముల ననుష్ఠించు యోగ్యతకుపయోగపడు రామాయణ పురుషమహాకుల ప్రసూతిత్వము, గుర్వనుగమనము, గురు కృపాపాత్రులై కులవిద్యను సరహస్యముగానేర్చి, గుర్వాజ్ఞానుసారము వర్తించి, తాటకా తాటకేయాది రాక్షసులఁదునిమి, గురుప్రీతి గావించుటయు, శైవధనుర్భంగంబుఁ గావించి విద్యాపూర్తి తెలిపి గుర్వాజ్ఞ స్నాతకుండై ద్వితీయాశ్రమ స్వీకారంబుగావించి సహధర్మచారిణియు సమానకులజయు నగు భార్యను గ్రహించుటయు, వైష్ణవధర్మ పరిగ్రహంబును బూ

మహితుఁడు కావున, ఈయనయందు గొప్పగుణములు గలవు. వానిని భక్తులయందు వినియోగపఱిపించి భక్తుల రక్షించుచుఁ దన్మూలమున భగవంతునకు పేరుప్రతిష్ఠ తెచ్చునది శ్రీ. చెఱువునిండ నీరున్నది. దానిక్రిందఁ గావలసినంత పొలమున్నది. తూములేకున్న నేమి ప్రయోజనము? మనకుఁగావలసినది తూము నీరే. చెఱువు నీటితోఁబనిలేదు. ఎండని తఱుగని నిండుచెర్వు. ఎంత నీరు దీసిన నేమిభయము. శ్రీయను తూమునుండి భగవత్కృపయను నీరు తెచ్చుకొని తనక్షేత్రమును బాగుపఱుచుకొననివాఁడు పాపాత్ముఁడు. ఇట్టిస్వామి యెవఁడు? ఒంటిమిట్టయందు నర్చావతారముగ వేంచేసియుండు సీతాలక్ష్మణ సహితుఁడైన శ్రీరామచంద్రమూర్తియే. "శ్రీరంగస్థల వేంకటాద్రి కరిగిర్యాదౌశ తేష్టోత్తరే, స్థానే గ్రామనికేతనేషుచ సదాసాన్నిధ్యమాసేదుషే। అర్చారూపిణి మర్చకాభిమతితః స్వీకుర్వతే విగ్రహం। పూజాంచాఖిల వాంఛితాన్వితనుతే శ్రీ శాయతస్మైనమః." కావున నర్చావతారమే యీకాలమున సేవ్యము.

అవతారిక :— "ఈ లోనన జాంబూనదచేలుఁడు త్వరవిచ్చేసెన్" అనుటచే భగవంతుఁడైన శ్రీ మన్నారాయణుండు "రక్ష్యాపేక్షామపేక్షతే" తన్ను రక్షింపుమని కోరువానికై యెదురుచూచుచుండి రక్షరక్షయను నార్తనాదము విన్నమాత్రముననే, కట్టఁబడిన దూడకూఁతవినఁగానే పరుగుదెంచుగోవువలె, నార్తరక్షకై పరుదెంచుననియు, దశరథునకుఁ బుత్రుఁడగుటచే జన్మంబుననైన సకామముగనైన భగవంతుని సేవించియుండినచో మరల జన్మంబుల మనము మఱచినను దాను మఱవక మనకోరిక నెఱవేర్చుననియు, పరత్వదశయందుఁగల మహత్త్వమవతారదశయందును గలదని యేనెఱుంగుదు రాజేంద్ర యీ మహాత్మ"నను వాక్యముచేఁ బురుషసూక్తోక్తభగవన్మహత్త్వమున కిప్పుడు కొఱఁతలేదనియు, నీవనిర్దేశ్యుండవులోనగు కశ్యపోక్తులవలన భగవద్వైభవం బచింత్యమనియు, శివధనుర్భంగ-పరశురామ వాక్యములవలనను విష్ణువేయధికుఁడని దేవతలు తలంచిరనుటచే నవతారదశ యందుఁగాని యితర దశయందుఁగాని శ్రీరామచంద్రమూర్తియే పరమదైవతమనియు బాలకాండము వలన నేర్పడుచున్నది.

ఇట్లు పూర్వకాండమందు స్వరూపము స్థాపించి యీకాండమందు స్వభావమనఁగా హేయగుణ రహితత్వము కల్యాణగుణ సహితత్వము దెలుపఁబడుచున్నది. ఇఁక జెప్పఁబడుచున్న ధర్మముల ననుష్ఠించు యోగ్యతకుపయోగపడు రామాయణ పురుషమహాకుల ప్రసూతిత్వము, గుర్వనుగమనము, గురుకృపాపాత్రులై కులవిద్యను సరహస్యముగానేర్చి, గుర్వాజ్ఞానుసారము వర్తించి, తాటకా తాటకేయాది రాక్షసులఁదునిమి, గురుప్రీతి గావించుటయు, శైవధనుర్భంగంబుఁ గావించి విద్యాపూర్తి తెలిపి గుర్వాజ్ఞ స్నాతకుండై ద్వితీయాశ్రమ స్వీకారంబుగావించి సహధర్మచారిణియు సమానకులజయు నగు భార్యను గ్రహించుటయు, వైష్ణవధర్మ పరిగ్రహంబును బూ

తన యానుకూల్య ప్రాతికూల్యములు విచారించుట పరతంత్రుని కార్యము గాదు. భాగవతుఁడుండు స్థలమే వానికి బరమపదము.

మహేశ్వర తీర్థవ్యాఖ్య లక్ష్మణుఁడు మహదాశ్రయముఁగోరి శ్రీరాము నాశ్రయించినట్లు శత్రుఘ్నుఁడును భరతు నాశ్రయించెను. తీసికొనుచున్=మేనమామగారి యింటఁగలుగు సుఖము శత్రుఘ్నుఁడు లేక తానొక్కఁడే యనుభవించుట సుఖానుభవము కానట్లే. కావునఁ దీసికొనిపోయెను. అనురక్తు ననుటచే భరతునియందలి ప్రీతిచే శత్రుఘ్నుఁడు పోయెనుగాని యితరకారణ మునఁగాదని భావము.

తిలకము. అనురక్తున్=దీనివలన భరతుని నిర్బంధమువలన శత్రుఘ్నుఁడు పోయెనేమో యను సందేహము నివారణమగుచున్నది. ఇది పరస్పరానురాగము సూచించుచున్నది.

మునిభావ ప్రకాశిక- అనఘున్=జననము మొదలు రామచంద్రమూర్తిని లక్ష్మణువలె భరతు ననుసరించియుండుటచే మాతా పితా భ్రాతృవియోగ దుఃఖము లేనివానిని, నిత్యశత్రుఘ్నున్=కన్నులు వీనులులోనైనవి నిత్య శత్రువులు. వానిని జంపినవాఁడనఁగా జితేంద్రియుఁడని భావము - చూచువారి దృష్టిని జిత్తమును హరించుకాలమునందు లగ్నమైన చక్షురింద్రియమును నిగ్రహించి భరతుని వెంటఁబోవుటచేత జితేంద్రియత్వము ప్రత్యక్ష సిద్ధము. గోవిందరాజీయ వ్యాఖ్య-తీసికొనుచున్ అని వర్తమానకాలము నిర్దేశించుటచే భరతశత్రుఘ్నులగమనమేక కాలమందని యేర్పడుచున్నది. దానివలన భరతుని ఖడ్గశస్త్రములవలెఁ దదేక పారతంత్ర్యము స్ఫుటమగుచున్నది. మేనమామ సదనంబునకున్=ఉద్దేశద్వితీయకు షష్ఠీవిభక్తి-కావున భరతుని యుద్ధేశ్యమే శత్రుఘ్నుని యుద్దేశ్యమని యేర్పడుటచే భాగవత పారతంత్ర్యము స్ఫురించుచున్నది. భగవత్పారతంత్ర్యమే భాగవత లక్షణము. భరతుఁడు భాగవతుఁడు. రామలక్ష్మణు లరణ్యమునకు, దశరథుఁడు స్వర్గమునకుఁ బోఁగా కేవలరామాజ్ఞ శిరసావహించి, తనకనుకూల తిథివార నక్షత్రములైనను జూడక, రాజ్యభారమును భరతుఁడు వహించుటచేతను యతఁడు రామపరతంత్రుఁడని స్పష్టము.పరతంత్రునకు భగవదాజ్ఞయే ప్రధానముగాని తక్కినవేదియుఁగాదు. కావున భరతుఁడు తిథివార నక్షత్రములు చూచినవాఁడు కాఁడు.

అనఘు=ఈ ప్రకరణమందు అఘశబ్దముచే (అఘము=పాపము) కేవల రామభక్తి చెప్పఁబడుచున్నది తనకు స్వామియగు భరతునకు రాముఁడు స్వామికదాయని శత్రుఘ్ననకు రామభ క్తియేకాని యవ్యవధానమైన భక్తి గాదు. కావున శత్రుఘ్ననకు రామభక్తి లేక పోలేదు. కావుననేకదా భరతుఁడు శత్రుఘ్నుని నింకను నిద్రించుచున్నావా యన్నప్పుడు "నాహం స్వపిమి జాగర్మి,తమే వార్యం విచింతయన్" నిద్రపోలేదు. అన్న నేతలఁచితలఁచి మేలుకొనియున్నాను. (ప. ౮౦౪౪) అని చెప్పెను. శ్రీరాముని పట్టాభిషేక

ప్రయాణకాలమందు భరతుఁడు పగ్గములు పట్టుకొనఁగా శత్రుఘ్నుఁడు ఛత్రము పట్టుకొనెను. మథురాపురమునకుఁ బట్టము కట్టుకొమ్మని రామచంద్ర మూర్తి చెప్పినపుడు వల్లెయని యంగీకరించెను. పరతంత్రుఁడు కావున మాఱు చెప్పరాదు గనుక భాగవతపరతంత్రుఁడు సందర్భము కొలఁది భగవంతుని విడువవలయునా భాగవతుని విడువవలయునా యను సందేహము వచ్చి నప్పుడు భగవంతుని వదలవలయునేకాని భాగవతుని విడువరాదు. భాగవత పరతంత్రునకు భాగవతుని విడిచి భగవత్సేవచేయుట దోషము-కావున నట్టి (యఘము) దోషము శత్రుఘ్ననందులేదని భావము.

శత్రుఘ్నుఁడు=లవణాసురాదులనితఁడు చంపఁగలఁ డని తెలిసి యాయన కీ పేరు పెట్టఁబడెను.

నిత్యశత్రుఘ్నన్=నిత్యశత్రువులు జ్ఞానేంద్రియములు. అవి దేహమందే యెల్లవేళలనుండి విషయాంతరములందుఁ బ్రీతిపుట్టించుటయను విపరీతకార్య ములకుఁ గారణము లగుచుండును గావున-నవి నిత్యశత్రువులు. వానినిజంపిన వాఁడు నిత్యశత్రుఘ్నుఁడు. అనఁగా నింద్రియ నిగ్రహము గలవాఁడని భావము. పురుషుల దృష్టులను మనస్సును గూడ హరించు శ్రీరామచంద్రుని యందుఁ గూడ మగ్నముగాని యింద్రియములు గలవాఁడు.

రామవిషయభక్తి భాగవత పరతంత్రునకు స్వాధికార విరుద్ధము కావున రామచంద్రునియందు మనస్సు దృష్టి మగ్నముకాకుండ వానిని ద్రిప్పుట యవశ్యకార్యము.

శత్రుఘ్నుఁడు పోయెనని చెప్పక తీసికొనిపోఁబడినట్లు చెప్పుటచే నచేతన ములవంటి పారతంత్ర్యము చెప్పఁబడెను.

అనురక్తున్=ఏమిచేయవచ్చును. తోడరమ్మనుచున్నాఁడు పోక తప్పదు. కనుక పోద మని శత్రుఘ్నుఁ డిష్టములేక యర్ధాంగీకారముతోఁ బోయినవాఁడు కాఁడు. కేవలానురాగముచే భాగవతుఁడున్న చోటఁ దానుండుట విధి యని తలఁచిపోయెను. కావున నచిత్పారతంత్ర్యమునకు చేతనుని పారతంత్ర్యము నకు భేదము చెప్పఁబడెను. అచేతన పారతంత్ర్యమునకంటెఁ జేతన పారతం త్ర్యమందుఁ బ్రీతిమాత్రము విశేషము. భగవత్పారతంత్ర్యము చేతనులకు నచే తనములకు సమానము.మహాఫలప్రదమని తెలిసి బుద్ధిపూర్వకముగఁగర్తవ్యమని పరతంత్రుఁడగువాఁడు చేతనుఁడు.కావున నత్యంతసారగ్రాహియగువాఁడుశత్రు ఘ్నునివలె భాగవత పరతంత్రుఁడై వర్తింపవలయు ననుటవ్యంగ్యము.

భరతునకు మేనమామయిల్లుద్దేశ్యము-శత్రుఘ్నునకు భరతుఁ డుద్దేశ్యము యుధాజిత్తు భరతుని బిలుచుకొని పోవచ్చెనుగాని శత్రుఘ్ననిగాదు.కావున భర తుఁడు బయలుదేఱువఱకు శత్రుఘ్నుఁడు తాను బోఁదలఁచినవాఁడు కాఁడు. దశ రథుఁడుకాని రామచంద్రమూర్తికాని పొమ్మని చెప్పనులేదు. ప్రయాణమునకుఁ దనకు శుభకరములైన తిథివారనక్షత్రములుకూడఁ జూచినవాఁడుకాక భరతున

కేదిశుభమోయదియే తనకు శుభమని యెంచి పోయెను. ఇది భాగవత పారతంత్ర్యలక్షణము.

అనఘున్=కామాది హేతుకమైన వ్యసనములేని వానిని, శత్రుఘ్నుఁ డనఘుఁ డనుటచే నయోధ్యయందలి జనులందఱు పాపులని యేర్పడుచున్నది. ఏలన; వారలది రామభక్తితో మిశ్రమమైన భరతభక్తి కావున ననన్య భక్తి గాదు. రామభక్తి పాపమని యేలచెప్పఁబడెననఁ దనకుద్దేశ్యమైన భరతునందలి భక్తికి విరోధము కావున, ఉద్దేశ్య విరోధిత్వమే పాపత్వము. ప్రథమావధినిష్ఠ చరమావధి నిష్ఠకు విరోధము. భాగవత పారతంత్ర్యము చరమావధి నిష్ఠ. దీనికి మించినది లేదు. ఇదియే కడపటిది. ప్రథమావధినిష్ఠయందుఁ బుణ్యమెక్కువయైననుస్వోద్దేశ్య మోక్షవిరోధియగుటచే నదియుఁ బాపమువంటిదే. భక్తి యనన్యముగనుండవలయును గాని బహుముఖముగ నుండరాదు. కావున నొకమార్గమునఁ బోవువాఁడు రెండవమార్గముపై, బ్రీతి నుంచరాదు. అట్లుంచెనేని రెంటనుజెడును. అయోధ్యయందు భరత కైంకర్యమును గోరువారు పెక్కురు గలరు. ఆయన వెంటఁబోయితినేని నేనొకఁడనే యావత్సేవ చేయవచ్చునుగదా యను భావముతో శత్రుఘ్నుఁడు భరతువెంటఁ బోయెను.

కం. తనకన్న తనయుపోలిక, ఘనతరసత్కారములను•గావించుచు లా
లనమొనరింపఁగ మాతులుఁ,డనయముఁదమిభ్రాతతోడ•నతఁడటనుండెన్.

రామభక్తిపూర్ణుఁడైన భరతుఁడు రామచంద్రమూర్తిని విడిచి మేనమామయింట నెట్లుండఁగలిగెననిన రామాభిమానమునకు విషయభూతుఁడైన శత్రుఘ్నుని సహవాస బలముచే నని చెప్పుచున్నాఁడు.

అతఁడు=భరతుఁడు. మాతులుఁడు=మేనమామ, ఘనతర సత్కారములను= మిగుల గొప్పవైన బహుమానములచే- తమిన్ = కుతూహలముచే- అపేక్షచే-

అన్వయక్రమము

ఘనతరసత్కారములను గావించుచు లాలనమొనరింపఁగ నతఁడనయముఁ దమిభ్రాతతోడ నటనుండెన్. కాకాక్షిన్యాయముచే ననయముఁ దమి రెండు శబ్దముల తోడ నన్వయించును.

తాత్పర్యము

1. తన కన్నకుమారునివలె మేనమామ మిక్కిలి యపేక్షతో దినదినము మంచి గుఱ్ఱము లోనగు బహుమానముల నిచ్చుచు లాలింపఁగా భరతుఁడు తన తమ్మునితో నట నుండఁగలిగెను.

2. అతఁడు అనఁగా శత్రుఘ్నుఁడు మేనమామయగు యుధాజిత్తు తన కన్న కుమారునివలెఁ జెల్లెలికుమారునికంటె నెక్కువ ప్రీతితో మిగులగొప్ప బహుమానము లిచ్చుచు లాలించుటవలన విడువని యపేక్షతో నన్నతోడ నుండెను.

శత్రుఘ్నుఁడు యుధాజిత్తిచ్చు బహుమానముల కాశపడి యందుండిన వాఁడుకాఁడు. భాగవతుఁడు భ్రాతయు తోడున్నాఁడుగదా యను నపేక్షచేఁ గేకయపురంబున నుండఁగలిగెను. భరతుఁడు నట్లె శత్రుఘ్నుఁడు తోడున్నాఁడు గదా యని యుండెను.

ఇచ్చట మఱియొక యన్వయము చెప్పవచ్చును. తనమాతులుఁడు శత్రుఘ్నుని సత్కారములచే ననయముఁదమి లాలించుటచే భరతుఁడచటనుండెను. భరతుని నతని మేనమామ సత్కారములచే ననయముఁదమి లాలించుటచే నాయన సుఖమే తన సుఖమనుకొని శత్రుఘ్నుఁడు భరతుతో నటనుండఁ గలిగెను.

భాగవత పారతంత్ర్యము.

కర్మయోగము-జ్ఞానయోగము- భక్తియోగము- ప్రపత్తి- ఆచార్యాభిమానము అనునవియైదు ముఖ్య ముక్తి మార్గములు- వీనిలో కర్మమునకంటె జ్ఞానము ఆరెంటికంటె భక్తి శ్రేష్ఠమైనది. దానికధికారి కానివారికి దానికంటెఁ బ్రపత్తి శ్రేష్ఠమైనది. దానికంటె శ్రేష్ఠమైనది. యాచార్యాభిమానము. ఇదియే భాగవత పారతంత్ర్యము. ఇదియే పరకాష్ఠ-(కడపటి దిక్కు) దీనికి మించినది లేదని భక్తినిష్ఠుల యభిప్రాయము. భాగవత పరతంత్రునకు భగవంతుఁడును దనయాచార్యునకంటెఁ దక్కువవాఁడే. భాగవతునకు రెండవవాఁడు భగవంతుఁడు. అట్టులని భాగవత పరతంత్రుఁడు భగవంతుని నిషేధింపఁడు కాని భాగవత సేవకు భగవత్సేవ యడ్డము వచ్చెనేని భగవత్సేవనువదలి భాగవత సేవయే చేయును. కావున శత్రుఘ్నుఁడు శ్రీరాముని వదలి భరతునివెంట నుండుట భాగవతానుగ్రహము సంపాదించు కొనినవానికి భగవదనుగ్రహము వచ్చునోరాదో యనువిచారము లేదు.

భగవంతుఁడు కోపించినవానిని నంబరీషువలె భాగవతుఁడు రక్షింపఁ గలఁడు. భాగవతుఁడు కోపించినవానిని భగవంతుఁడు రక్షింపఁడు.

ఈ విషయమునఁ గొన్ని ప్రమాణవాక్యములు గలవు.

శ్లో. దుర్లభా భగవద్భక్తా, భావినో భువి మానవాః ।
తద్దర్శనా త్తదాలాపాత్, సులభం శాశ్వతం పదమ్.

భగవంతునియందు భక్తిగల పురుషులు దుర్లభులు. వారి దర్శనము చేతను వారితో సంభాషించుటచేతను మోక్షము సులభము.

శ్లో. మమ మద్భక్త భక్తేషు, ప్రీతి రభ్యధికాభవేత్
తస్మాన్మద్భక్త భక్తాశ్చ, పూజనీయా విశేషతః.

నా భక్తులయందు నాకుండు ప్రీతికంటె నా భక్తులయందు భక్తిగల వారిపై నాకుఁబ్రీతిమెండు. కావున నాభక్త భక్తులే విశేషముగఁ బూజింపఁబడఁ దగినవారు.

శ్లో. సిద్ధిర్భవతి వా నేతి, సంశయోచ్యుత సేవినామ్.
న సంశయోత్ర తద్భక్త, పరిచర్యారతాత్మనామ్.

భగవద్భక్తులకు మోక్షసిద్ధికలదోలేదో సందేహమే. కానియాయన భక్తుల సేవించువారి విషయమున సందేహములేదు.

శ్లో. కేవలం భగవత్పాద, సేవయా విమలంమనః
న జాయతే యథానిత్యం తద్భక్త, చరణార్చనాత్.

నిత్యము భక్తపాదసేవచే మనస్సు నిర్మలమైనట్లు భగవత్పాదసేవచేఁగాదు

శ్లో. ఆరాధనానాం సర్వేషాం, విష్ణోరారాధనంపరమ్
తస్మాత్పరతరం ప్రోక్తం, తదీయారాధనం పరమ్.

అందఱ యారాధనలకంటె విష్ణునారాధనము శ్రేష్ఠము, దానికంటె నాయన భక్తుల నారాధించుట శ్రేష్ఠము.

శ్లో. తస్యయజ్ఞవరాహస్య, విష్ణోరమిత తేజసః
ప్రణామం యేపి కుర్వంతి, తేషామపి నమోనమః.

ఆయజ్ఞవరాహమూర్తియగు విష్ణువునకు నెవరు నమస్కరింతురో వారికిని మరల మరల నమస్కరించెదను.

శ్లో. పశుర్మనుష్యః పక్షీవా, యేచవైష్ణవ సంశ్రయాః
తేనైవతే ప్రయాస్యంతి, తద్విష్ణోః పరమం పదమ్.

విష్ణుభక్తులనాశ్రయించియుండు పశువులుగాని మనుష్యులుగాని పక్షులు గాని యాయన యభిమానము చేతనే విష్ణుమూర్తియొక్క పరమ పదము నొందుదురు.

శ్లో. వందే నందవ్రజస్త్రీణాం, పాదరేణు మభీక్ష్ణశః.

'యాసాం హరికథోద్గీతాం, పునాతి భువనత్రయ'మ్మనికదా యుద్ధవుఁడు తలంచెను. ఎవరి హరికథలు ముల్లోకములను బావనము చేయుచున్నవో యట్టి గోపికల పాదరేణువులకు నమస్కారము.

గీ. పరమభాగవతుల పాదధూళి సమస్త। తీర్థసారమనుచుఁ దెలియలేని,
వారివారివారి, వారిఁజేరినవారిఁ, దొలుతఁగట్టి తెండు దూతలార.

గీ. పద్మనయనుమీఁది భక్తియోగంబెల్ల ముక్తియోగమనుచు మునుదెలియని
వారి, వారి, వారిఁ వారిఁజేరినవారిఁ త్రోవఁబోవపలదు దూతలార.

శివక్రోధాద్గురుస్త్రాతా, గురుక్రోధాచ్ఛివోనహి । తస్మాత్సర్వ ప్రయత్నేన, గురోరాజ్ఞాం నలంఘయేత్.

శివుఁడు కోపించినచో గురువుకాపాడును,గురువుకోపించినవానిని శివుఁడు కాపాడలేఁడు. కావున గుర్వాజ్ఞ మీఱరాదు.

ఇత్యాది ప్రమాణము లనేకములుగలవు.

కం. అచ్చట నుండియు నిచ్చకు, నెచ్చినసుఖసంతతులను॰నెలమిం గనుచున్
నిచ్చలు స్మరించు చుండిరి, సచ్చరితులు దశరథేశు॰జనకున్ వృద్ధున్. ౪

ఎలమిన్=సంతోషమును, నిచ్చలు=ఎల్లప్పుడు, నిత్యశబ్ద భవము నిచ్చ-నిచ్చలు, కనుచున్=పొందుచుండియును.

తాత్పర్యము

అచ్చటనుండియుఁదమ కిష్టమైన సుఖములకంటె నెచ్చుసుఖముల ననుభవించి సంతోషించుచుండియును, సాధువర్తనులయిన భరత శత్రుఘ్నులు ముసలివాఁడును దండ్రియునగు "దశరథరాజు ముసలివాఁడాయెనే, రాజ్యభారము వహింపలేఁడే. రామచంద్రుని యువరాజుగా నింకనుజేయలేదేల? మన మాయన సేవచేయుటకు లేక పోయెనే" యని యెల్లప్పుడు తలఁచుచుండిరి.

కం. కోసలధరణీశుఁడును బ్ర,వాసుల నిజసుతుల శక్ర•వరుణోపములన్
భాసురతేజుఁడు గైకే, యీసుతశత్రుఘ్నుల నెద•నెప్పుడుఁ దలఁచున్.౫

అక్కడవారి మనోగతులు చెప్పి యిక్కడదశరథునిస్థితి చెప్పుచున్నాఁడు

అర్థము.

ప్రవాసుల=దూరదేశమందున్న వారలను, నిజసుతులన్=తన కుమారులను, శక్రవరుణోపములన్=బలమునందును స్నేహమందును ఇంద్రవరుణులతో సమానులై యొక్క రొకరొక్కొక దిక్కు నేలగల సామర్థ్యముగలవారిని.

తాత్పర్యము

కొడుకులవలన నత్యధిక తేజోవంతుఁడైన దశరథుఁడు దూరదేశమందున్నట్టియు బలమునందుఁ బరస్పర మైత్రియందు నింద్రవరుణులను బోలునట్టియుఁ దన కొడుకులను భరతశత్రుఘ్నులను దనమనస్సున సర్వదా సర్వసంపద లుండియు వా రిరువురు నాయొద్ద లేకున్నారుగదా యని తలంచుచుండెను.

కం. తనయొడలన జనియించిన, ఘనబాహుచతుష్క మనఁగ•క్ష్మానాథునకున్
దనయులు పురుషర్షభు లెద,ననుపున నిష్టతము లై రి•నల్వురు మిగులన్.౬

అవతారిక-ఎదురుగానున్న రామలక్ష్మణులకంటె భరతశత్రుఘ్నులెక్కువ ప్రియులగుటచే వారిని స్మరించుచున్నాఁడను సందేహము కవి దీర్చుచున్నాఁడు

తనయొడలన=తనదేహమందే-ఘనబాహు చతుష్కమనఁగ = గొప్పనగు నాలుగుచేతులో యనునట్లు-పురుషర్షభులు=పురుషశ్రేష్ఠులు-ఇష్టతములు=మిక్కిలి యిష్టులు.

దశరథుని నాలుగుచేతులుగలవానితోఁ బోల్చుటచే విష్ణురూపకధ్వని.

తాత్పర్యము

తన దేహమందే పుట్టిన నాలుగు పెద్దచేతులవంటివారై పురుషశ్రేష్ఠులైన నలువురు కుమారులు మిగుల నిష్టులగుటచేత నాలుగుచేతులలో రెండుచేతులు తొలఁగిన నెట్లు కొఱఁతదోఁచునో యట్టులందఱు నిష్టులైనను నిరువురు సమీపమందు లేమి కొఱతఁగాఁ దోఁచుచుండెను.

—♦ శ్రీరామచంద్ర కళ్యాణగుణవర్ణనము. ♦—

ఉ. అందఱలోన రాముఁడు మ♦హాత్ముఁ డనుత్తమ తేజుఁ డెంతయున్
దందడిప్రీతిఁ గూర్చుఁ దన♦తండ్రికి భూతములన్ విధాతృన
చ్ఛందమునన్ గుణాఢ్యుఁ డయి,♦సస్మయు రావణుఁ జంప దేవతా
బృందనుతిన్ సనాతనుఁడు♦విష్ణువు దోఁచె ధరన్ నరాకృతిన్. ౭

స్మరణమం దందఱను సమానముగాఁ దలచుచుండినను శ్రీరామచంద్రునకుఁదక్కినవారికిఁ గుడిచేతికిఁ నెడమచేతికిఁగల తారతమ్యము గలదని చెప్పుచున్నాఁడు.

అందఱలోనన్=నలువురుకుమారులలో- మహాత్ముఁడు = గొప్పమనస్సు-గొప్ప స్వభావము గలవాఁడు. అనుత్తమతేజుఁడు=దేనికంటె నుత్తమము లేదో యది యనుత్తమము-అట్టి తేజముగలవాఁడు. దందడిప్రీతి = తఱచగుప్రీతి; భూతములన్=ప్రాణికోటులందు-విధాతృ నచ్ఛందమునన్ = బ్రహ్మదేవునివలె-విధాతృ + అచ్ఛందము-విధాతృ నచ్ఛందము. షష్ఠిసమాసమం దుకారఋకారముల కచ్చుపరం బగునపుడు నుగాగమము. గుణాఢ్యుఁడు= గుణసంపదగలవాఁడు. తనతండ్రికి భూతములన్ విధాతృనట్లు. దందడిప్రీతిఁగూర్చున్=భూతకోటులందుఁ దనతండ్రియగు విష్ణువునకుఁ బ్రథమపుత్రుఁడగుటచే బ్రహ్మ యెట్లు ప్రీతిఁగూర్చెనో యట్లనిభావము, 'ఆత్మనః ప్రథమం పుత్రం బ్రహ్మాణ మసృజత్ప్రభుః। తతశ్చరాచరం విశ్వం విష్ణుర్విశ్వజగన్మయః॥అనుశాసనికము. లేదా. బ్రహ్మ తనతండ్రియగు విష్ణువునందుఁ దనతోడఁ బుట్టినభూతములందు నెట్లు ప్రీతిగలవాఁడయ్యెనో యట్లు రామచంద్రమూర్తియుఁ దనతండ్రి విషయమందును దోడఁబుట్టినవారి విషయమందును బ్రీతిగలవాఁ డయ్యెను. సస్మయున్=గర్వముతోఁగూడిన వానిని- దేవతాబృందనుతిన్ = దేవతాసమూహముల స్తోత్రము కారణముగ; సనాతనుఁడు=నిత్యుఁడుశాశ్వతుఁడు అజుఁడునగు విష్ణువునరాకృతిన్=మనుష్యాకారమున-ధరన్ = భూమియందు-తోఁచెన్ = కానవచ్చెను. సస్మయు రావణుననుటచేఁ బుట్టువుతోడనే వచ్చిన స్వభావగర్వముచే లోకమునంతయు హా హా యన నేడ్పించువానినని భావము. రావణున్-అనుటచే వేరుతెగఁగొట్టిన జెట్టంతయుఁ జచ్చునట్లు రావణునొకని జంపిన రాక్షసులందఱుఁ జచ్చినవారే యనిభావము. రాక్షసులనందఱను జంపుమని కోరినఁ గార్యబాహుళ్యముతోఁ మనని లాఘవము దోఁచుటకై యొకనిపేరు చెప్పిరని భావము దేవతాబృందనుతిన్=దేవతలు నీవట్టివాఁడ విట్టివాఁడని నోటమాటల స్తుతించిరే కాని యుపాసన చేసి వారునుగారు. అదియు నాత్మార్థమై చేసినవారుకారు. ప్రయోజనానంతరపరులై చేసిరి. అట్లు చేసినను విష్ణువు మనుష్యాకృతిని భూమియందుఁ దోఁచెను. ఎట్టి విష్ణువు ? సర్వవ్యాపకుఁడైన విష్ణువు. పుట్టువు లేనివాఁడయ్యు నిత్యుఁడయ్యు మఱియొక విధముచే నేకదేశమున నున్నట్లు తోఁచెను. ఎట్లుతోఁచెను? తాను బురుషోత్తముఁ డగుటచే జీవులకంటె నుత్తముఁడయ్యు దేవతలకెల్ల దేవతయయ్యు దేవతలకంటె నికృష్టులయి

దేవతలు హేయముగఁ జూచు మనుష్యునకుఁగల యాకారము ధరించి తోఁచెను. ఎందుఁదోఁచెను? దేవతలు కాలనైనఁ దాఁకనొల్లక యోజనమెత్తున నుండు భూమియందు తోఁచెను. దీనివలన భగవంతుని సౌలభ్యము తెలియవచ్చును. తోఁచెను? ఎట్లుతోఁచెను. స్తంభమునుండి నృసింహమూర్తి యెట్లు తోఁచెనో యట్లు కౌసల్యనుండి తోఁచెను. గర్భవాసము చెప్పఁబడెనుగదా యందురేని స్తంభగర్భవాస మెట్టిదో యిదియు నట్టిదే. అయినను కౌసల్యాదశరథులకుఁ బూర్వము తా నిచ్చిన వరమునను సరించి వారికి విశేషపుత్రవాత్సల్యముఁ గలిగించుటకై యందఱు శిశువులు తల్లుల గర్భములందుఁ దొమ్మిది పదినెల లుండినఁ దాను బండ్రెండునెల లుండెను. ఇది భక్తవాత్సల్యము తెలుపు చున్నది. భక్తులు తన్ను మఱచినను భగవంతుఁడు దాను వారిని మఱవఁడు. తోఁచెననుటచేఁ బద్మముల వికసింపఁజేయును జగము ప్రకాశింపఁజేయును చీఁకటుల విరియఁజేయును సూర్యుఁడు తూర్పునఁదోచినట్లు కౌసల్యయందుఁ దోఁచెనని భావము. దీనివలన గర్భనరక వేదన ననుభవించు బద్ధజీవులవలెఁ గాక స్వతంత్రుఁడై తనయిచ్ఛకొలఁది స్వశక్తిచే స్వసంకల్పముచేఁదోఁచె నని యెఱుఁగనగు. తోఁచెనుటచే సూర్యుఁడు మనకుఁగానరాక ముందు ఎట్టి స్వరూపస్వభావములు గలవాఁడై యుండి యాస్వరూపస్వభావముతోనే మనకు గానవచ్చునో యట్టులే రామచంద్రమూర్తియుఁ దన పరత్వము విడువక లోకమునకుఁ గానవచ్చెనని భావము.

ఆ. అమితతేజుఁడై నఁ•యాపుత్రకునిచేతఁ, గోసలేంద్రతనయ•కొమరుమీఱె
    నమరనాథుఁడై నఁ•యలవజ్రపాణిచే, హవణుమీఱి వెలుఁగు•నదితివోలె. ౪

కౌసల్యాసుప్రజారామా (బాల, ప ౬౨-౨) యనుచోట నెవనిని గను టచేఁ గౌసల్య సుప్రజ యయ్యెనో యని వ్రాయఁబడియెను. అది యిచ్చట విశదీకరింపఁబడుచున్నది.

అమిత తేజుఁడు=ఇంతమాత్రమని పరిమాణముఁ జెప్పసాధ్యముఁగాని తేజస్సుగలవాఁడు. అప్రమేయతేజుఁడు పుత్రకునిచేత=చిన్నకుమారునిచే-కోస లేంద్రతనయ=కౌసల్య, కొమరు మీఱె=మనోజ్ఞతచే నతిశయించెను.

అమరనాథుండు=దేవతల కధిపతి. వజ్రపాణిచే=ఇంద్రునిచే, హవణు= ఒప్పిదము.

తాత్పర్యము.

దేవతల కధిపతియైన ఇంద్రునిఁగాంచి యదితి యెట్లు శోభించెనో యట్టు లమిత తేజస్సుగల యాచిన్నికుమారుఁడగు శ్రీరాములచేఁ గౌసల్యాదేవి శోభించెను.

వామనునిచే నదితివలె నని యొకఁడు వ్రాసెను.

ఎట్టు లదితి వ్రతములు సలిపి వామనుని గాంచెనో యట్టులే కౌసల్యయు నవమీవ్రతము లోనైనవి గావించి రామచంద్రునిఁ గాంచెను. వామనుఁడు దేవ

తలకు రక్షకుఁడయ్యెను. రామచంద్రమూర్తి మానవులకు రక్షకుఁడయ్యెను.

క౦॥ అందమునన్ భుజవీర్యము. చందమున నసూయలేమిఁ జగతీస్థలి పై
నెందును బురిడింపఁగ రఘునందనుని మనోజవుం గానంబడఁ డొకఁడున్

ఏడవపద్యంబున గుణాఢ్యుఁడని చెప్పఁబడెను. ఇఁక నాగుణములెట్టివో వర్ణింపఁబడుచున్నవి.

ఇఁక శ్రీరామచంద్రమూర్తి కల్యాణగుణములే విశేషించి వర్ణింపఁబడును. మనుష్యులకుఁ దారకము ధర్మార్థకామములు గాదు. శుష్కజ్ఞానముగాదు. భక్తియే. అందు గుణవర్ణనము ముఖ్యము. శ్రవణ మననాదులు దీని ననుసరించి వచ్చునవియే కావుననే నారదమహర్షి వ్యాసమునికి "ధర్మముల్ ప్రపంచించినఁ మెచ్చునే గుణవిశేషము లెన్నినఁగాక నీకు నీకొంచెము వచ్చుటెల్ల హరిఁగోరి నుతింపమి నార్యసన్నుతా." యని బోధించెను. అందమునన్= సౌందర్యమందు-భుజవీర్యము చందమునన్=కస్తూరి వాసనవలెఁ దాను వికారపడక యితరుల వికారపఱుచు శక్తిచే; పురిడింపఁగన్=పోల్పఁగ, మనోజవుం= తండ్రిని బోలినవానిని-"మనోజవసః పితృసన్నిభః" అమరుఁడు-మనోజవుఁడు మనోజవసుఁడు రూపాంతరములు. అసూయ=ఇతరుల గుణములందు దోషమారోపించుగుణము, జగతీస్థలిన్=భూమిమీఁద-'జగతీ రత్నగర్భాచ భూతధాత్ర్యబ్ధిమేఖలా' యని నిఘంటువు. భూమిమీఁద లేఁడనుటచే స్వర్గమం దట్టి కుమారుఁడు గలఁడని భావము. విష్ణువు=వామనమూర్తి, పురిండింపగన్, పురుడు+ఇంచు=పురిడించు, ఇత్వంబుగాని, యెత్వంబుగాని కూడుచో ననాద్యంబయిన యుత్వంబున కిత్వంబగు సు, వ్యా, క్రియా౬ం వందురు- అలందురు దీని కపవాదములు.

తాత్పర్యము

సౌందర్యము నందును భుజబలమునందును అసూయ లేకుండుటచేతను భూమియందు తండ్రిని బోలిన రామచంద్రునితోఁ బోల్చుటకు నొక్కఁడైనఁ గనరాఁడు.

క॥ ఎవ్వర యేనియుఁ దన్నుఁ, నొవ్వం బలికినను దానునొడువఁడు కఱకుల్
నవ్వుచు మృదుపూర్వంబుగఁ,దెవ్వనఁ బ్రతివచనమిచ్చుఁ దిరమగుశాంతిన్

ఎవ్వరయేనియున్=ఎంతటి యల్పుఁడైనను-నొవ్వన్=మనస్సు నొచ్చునట్లు-కఱకుల్=పరుషపు వాక్యములు, నొడువఁడు=చెప్పఁడు, మృదుపూర్వంబుగన్=మెత్తనితనమే ముందు కానవచ్చునట్లు, తెవ్వనన్=చక్కఁగా, తిరము= స్థిరము.

తాత్పర్యము

తన మనస్సునకు నొప్పి కలిగింపవలయునను నుద్దేశముతో నెట్టివాఁడైనను గఠినముగ మాటలాడినను నిష్కారణముగ వీఁడిట్లు క్రోధమునకు వశపడియెఁ గదా యెంత దుర్బలమైన మనస్సు గలవాఁడని చిఱునవ్వుతో వానికోపము తొలఁగి పోవునట్లు మెత్తనిమాటలతో, ముందు మెత్తగ మాటలాడి. వెనుకఁ

గోపింపక, స్థిరమైన శాంతితో నాక్షేపమునకుఁ దగిన సరియైన సమాధానము చెప్పును.

కం॥ ఉపకార మేమిపనికే, నెపుడే నొకటే నొనర్పఁ•నెలమిఁ గను సదా;
యపకారశతము సల్పిన, విపరీతము నెంచఁ డాత్మ•విజ్ఞుం డగుటన్. ౧౧

ఎలమి=సంతోషము-విపరీతము=వ్యత్యస్తము-ఆత్మన్=మనస్సునందు, విజ్ఞుండు=విశేషము తెలిసినవాఁడు.

ఉపకారమని యేకవచన ప్రయోగముచే నొక యుపకారమైనను అని యర్థము. శతము=శతం సహస్రమయుతం సర్వమానంత్య వాచకమ్మని-శత మనఁగా ననేకములని యర్థము. తాత్పర్యము

ఎట్టివాఁడైనను నెపుడైనను నేపనికైనను నెంత కొంచెమైనను నొకయుపకారము చేసినను నప్పుడు మాత్రమేగాక కలకాలము దానిఁదలచి సంతోష పడుచుండును. ఎవఁడైనఁ దన విషయమున ననేకాపరాధములు చేసినను విజ్ఞుఁడు కావున 'నకశ్చిన్నాప రాధ్యతి' తప్పు చేయనివాఁడు ధరణిఁగలఁడె కావున నెందఱనని దండింతును. క్షమించి రక్షించుట గొప్పతనముగానిశిక్షించు టేమి గొప్ప అది క్రోధ కార్యములకుఁ గారణమగునని క్షమావంతుఁడై వానిని గుఱించి విరుద్ధముగ మనస్సునందైనఁ దలఁపడు.

కీడునకు మఱుకీడు సేయుట గొప్పగాదు. కీడునకు మాఱుకీడు చేయ శక్తి లేక సహించి యూరకుండుటయు గొప్పగాదు. తన్ను దూషించిన వారిని మరల దూషించుటకు, కీడు చేసినవారికి మఱుకీడు చేయుటకు శక్తిసామర్థ్యములు గలిగియు క్షమచే సహించి వారికి మేలే చేయుచు ప్రియములాడుట పుణ్యపురుషలక్షణము.

గీ॥ చెల్లియుండియు సైరణసేయు నతఁడు।
పేదవడియును నర్థికిఁ బ్రియముతోడఁ।
దనకుఁగల భంగి నొసఁగు నతండు పుణ్య,
పురుషులని చెప్పి రార్యులు బుధవ రేణ్య॥ భారతము.

తే॥ అతఁడు విలువిద్యఁ గఱచెడు నప్పుడైన, జ్ఞానవృద్ధవయోవృద్ధ•సజ్జనులును
శీలవృద్ధులు నయినవి•శిష్టజనులుఁ•గూడ సత్సంప్రదాయంబు•గోష్ఠి జరపు

కఱచెడు=నేర్చుకొను, అప్పుడైనన్= అట్టిసమయమందుసహితము, విలువిద్యనభ్యసించు సమయమందు దృష్టియు మనస్సు లక్ష్యమం దుంచవలయునుగాని వానిని జెదరనీయరాదు. అట్టి సమయమందుఁ గూడ ననుటచే నితర సమయములందుఁ జెప్పవలసిన పనియేలేదని భావము కైముత్తిక న్యాయము. క్షత్రియులకు విలువిద్య కులవిద్య కావున బాల్యమునుండి యభ్యసింపఁబడును. విశ్వామిత్రుని వెంటబోయి తాటకను వధించు నప్పటికే కృతహస్తుఁడని చెప్పుటచే పంద్రెండేండ్లగు లేఁత ప్రాయమందే జ్ఞానశీల వయోవృద్ధులతోను సజ్జనులైన విశిష్ట జనుల

లోను సంభాషించి వారికిఁ దెలియని సత్సంప్రదాయములు నేర్పుచుండెను. జ్ఞానవృద్ధ=మోక్షధీర్జ్ఞానమ్మని యుండుటచేఁ బరిపక్వమోక్షవిషయులని యర్థము వయోవృద్ధ=వయస్సుచే ముసలివారైనవారు, శీలవృద్ధులు=సదాచార సంపన్నులు, సజ్జనులు=సాత్త్వికులైన సాధువులు, ఈ పదమును బై మూఁటితోను నన్వయింపవలను. జ్ఞానవృద్ధులయిన సజ్జనులు, వయోవృద్ధులయిన సజ్జనులు, సజ్జనులగు శీలవృద్ధులని యర్థము. జ్ఞానము వయస్సు శీలముండియు సాధుత్వము లేదేని వ్యర్థము. అట్టివారు రాముని సన్నిధికిఁ బోవ నర్హులుగారు. విశిష్ట జనులనుటచే నన్నివర్ణములవారు నన్ని యాశ్రమములవారు పోవుచుండిరని భావము. గోష్ఠి=సంభాషణము. సభ-విలువిద్య కఱచెడు నప్పుడైనన్=అనుటచే నల్పకాలమైనను సజ్జనసాంగత్యములేక రామచంద్రమూర్తి యుండెడి వాఁడు కాఁడు.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి విలువిద్య గుఱికొట్టుటకు నేర్చుకొనుసమయమందుఁగూడ జ్ఞానవృద్ధులగు సజ్జనులు వయోవృద్ధులైన సజ్జనులు సదాచార సంపన్నులైన సజ్జనులు జ్ఞానశీల వయోవృద్ధులు శీలజ్ఞానవృద్ధులు జ్ఞానవయోవృద్ధులు శీలవయోవృద్ధులు మొదలైన వారందఱు జనులు రాఁగా నిప్పుడు సమయముగాదు ఆవలరండు. ఇప్పుడు పొందనక తన యభ్యాసము తాను జేయుమనే జ్ఞానశీలాదులందు వారికి వారికిఁగల సందేహములు దీర్చి సత్సంప్రదాయము నేర్పుచుండెను.

కొందఱు లక్ష్యము మీఁద దృష్టి నునస్సుంచిరేని నితరుల ప్రశ్నములకు సరియైన ప్రత్యుత్తరము లీయఁజాలరు. ప్రత్యుత్తరము లొసఁగువారు గుఱికొట్టలేరు. అర్జునునివలెఁగాక రామచంద్రమూర్తి రెండు నేకకాలమున జేయ సమర్థుఁడని భావము.

సందేహము:— పెద్దలతో గోష్ఠి సల్పునని చెప్పెనుగాని పెద్దవారికి నేర్పుటకని కాదుగదా. కావున వారివలన నేర్చుకొనుటకని యేల చెప్పరాదు? అని సందేహము. దీనికి భరతవాక్యము. పద్యము ౨౪౦౪ ప్రత్యుత్తరము.

కం. ఎఱుకగల పెద్దలకు వా, రెఱుఁగని యవి చెప్ప నీవె యెఱుఁగని యట్టుల్ ।
గుఱుకొని సందియ మడిగెదు । కొఱలే కవ్వారికెఱుక గూర్చెడి వాంఛన్.

రామచంద్రమూర్తి బాలుఁడు. బ్రాహ్మణాదులు పెద్దలు. వారు బాలుని యొద్దకు బోధ నిమిత్తమై రావచ్చునా యనిన 'గుణాః పూజ్యస్థానం గుణిషు నచ లింగం నవయః' పూజ్యస్థానము గుణవంతులయందలి గుణములుగాని స్త్రీ పురుష చిహ్నములు గావు. వయస్సుగాదు. ఉత్తరరామచరిత.

కం తియ్యనిపలుకులు ప్రియముగ,
నెయ్యెడఁ దా మున్న పలుకు;•నెసఁగినబలిమిన్
గ్రుయ్యించుఁ బరుల; ధీయుతుఁ,
డయ్యుత్తమశక్తి కెద న•హంకృతిఁగొనఁడున్.

క్రుయ్యించున్=పరాజయము నొందఁజేయును, పరులన్=శత్రువులను.

ఏసమయమందైనను నెంతటి నీచుఁడైనను దన దర్శనమునకు వచ్చెనేని తానే ముందుగా నెవ్వరవయ్యా యేల వచ్చితివని తియ్యని మాటలు ప్రియము కనఁబఱచుచు మాటలాడును. తన బలముచేత శత్రువులు వెనుదీయునట్లు చేయును. బుద్ధి విశేషముగల రామచంద్రమూర్తి సర్వదా లోకులకు నేమి మేలుచేయుదునా యని యాలోచించుచుండును. ఉత్తమ శక్తిచే లోకుల కెంత మేలుచేసియు సన్నాశ్రయించి యుండువారికి నేనేమి మేలు చేసితిని. ఏదో కొంచెము చేసితినిగాని నేను జేయఁగలిగినంత చేయకున్నాను గదా యని యాలోచించు చుండునుగాని నేనింత చేసితినిగదా యని పొగరు పడఁడు.

కం. దబ్బఱ లాడఁడు; గొలుచు, న్నిబ్బరమునఁ బండితులను ♦ నెఱముదుసళ్ళన్
ప్రబ్బినతమి జనులకు ముద, మబ్బించుఁ; బ్రజానురాగ ♦ యుక్తుఁడు
బుధుఁడున్.

తాత్పర్యము

అసత్యము పలుకఁడు. రాముఁడు రెండు మాటలవాఁడు కాఁడన్నట్లు ముందొకమాట వెనుక నొకమాట చెప్పఁడు. జ్ఞానులను వృద్ధులను నిబ్బరముగ సేవించును. అతిశయించు నపేక్షచే జనులకు సంతోషమే యతిశయించినట్లు చేయుచుండును. ప్రజల యనురాగముతోఁ గూడినవాఁడు. ఇట్లు రాముఁడు ప్రజలన్యోన్యానురాగముగలవారై యుండిరి.

చం. కరుణ గలండు, లోపఱుపఁ ♦ గల్గెను గ్రోధము, బ్రహ్మవిన్మహీ
సురతతిఁ బూజలం దనుపు, ♦ గ్రుక్కినవారికిఁ బొక్కఁ బ్రోచు, ధ
ర్మరతుఁడు, పాయఁ డెందు నియ ♦ మంబు, సదా శుచి, వంశవృత్తమా
దరమునఁ జల్పు నెప్పుడు, స్వ ♦ ధర్మము క్షాత్రము గౌరవించెడిన్. ౧౫

పరుల దుఃఖము తనదుఃఖముగా నెంచువాఁడు, క్రోధము రమ్మన్నప్పుడు మాత్రమే వచ్చునట్లు తనకు వశపడియుండఁ జేసికొనినవాఁడు, వేదవేత్తలయిన బ్రాహ్మణులను బూజించువాఁడు, వ్యసనముచేతనో కష్టము పాలగుటచేతనో చిక్కుపడినవారి విషయమై తాను బరితాప పడుచు నంతతో నూరకుండక ఎక్కడనది తెలియవచ్చునో యచ్చటనుండియేవారిని రక్షించువాఁడు, సామాన్యధర్మ విశేష ధర్మములందుఁ బ్రీతిగలవాఁడు, శరణాగత రక్షణమును తన నియమమేకాలమందు నేసందర్భమందును వదలఁడు. లోపల వెలుపలఁగూడ నెప్పుడు కామినీకాంచనములందు నిర్మలుఁడు. వంశాచారము ప్రీతితో నెప్పుడు చలుపును. గుణవంతమైనను గాకున్నను క్షాత్రగుణము స్వధర్మముగుటచే దాని గౌరవించును. క్షాత్రము దుష్టశిక్షణ పూర్వక ప్రజాపాలనము.

ఉ. దాన లభించుసద్యశము ♦ తప్పక స్వర్గఫలప్రదాయిగాఁ
దా నెద నెంచు, భద్రరహి ♦ తం బగుకార్యముపొంతఁ బోఁడు, వి

ద్యానిధి, ప్రొద్దుపోకకయి♦ధర్మవిరుద్ధకథాబిలాషి గాఁ
డూనిక నుత్తరోత్తరసు♦యుక్తుల గీష్పతివోలె వక్త యౌ. ౧౬

దానన్=స్వధర్మమును రక్షించుటచేత, స్వర్గ ఫలప్రదాయిఁగా = మోక్ష సిద్ధినే కలిగించునదిగాఁదలంచువాఁడు. తమతమ జాతిధర్మములందుఁ బ్రీతిగల వాఁడు మోక్షమును గాంచును. స్వధర్మమును గౌరవించు, ననుటచేఁబరత్వ మాపాదించు గుణములకంటె క్షత్రియ జాతియందుఁబుట్టిన కారణముచే దానినే యెక్కువగఁ దలఁచువాఁడు. దీనివలనఁ గులధర్మము విడువకయే మోక్షధర్మ మనుష్ఠింపనలయు నని యేర్పడుచున్నది.

స్వధర్మానుష్ఠాన మపరిత్యాజ్యము. అది శ్రేయస్కరమని శ్రేయస్కరధర్మ మని శ్రీరామచంద్రమూర్తి స్వానుష్ఠానముచే స్థాపించెను. దీనినే శ్రీకృష్ణమూర్తి యి ట్లుపదేశించెను. 'శ్లో॥ స్వధర్మమపి చావేక్ష్య,నవికంపితుమర్హసి॥ స్వధర్మమని యాలోచించియైనను నీవుక్షత్ర ధర్మమునుండి చలింపఁదగదు. "శ్రేయాన్ స్వ ధర్మోవిగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్। స్వధర్మేనిధనంశ్రేయః। పరధర్మోభయా వహః॥ స్వధర్మము గుణహీనమయినను జక్కఁగా ననుష్ఠించు పరధర్మమునకంటె శ్రేష్ఠమైనది స్వధర్మమందు మరణించుట మేలు. పరధర్మము భయంకరము. 'స్వేస్వేకర్మణ్యభిరతః సంసిద్ధింలభతేనరః' తనతన కర్మములందు నాసక్తిగల మనుష్యుఁడు మోక్షమును బొందును.

"స్వభావనియతం కర్మ, కుర్వ, న్నాప్నోతికిల్బిషమ్" జన్మముచే లభిం చిన కర్మమునుజేయుటవలనఁ బాపములేదు. 'సహజంకర్మకౌంతేయ, సదోషమపి నత్యజేత్' జన్మముచేలభించిన కర్మము దోషయుక్తమైనను విడువరాదు.'యతః ప్రవృత్తిర్భూతానాం, యేనసర్వమిదంతతమ్। స్వకర్మణా తమభ్యర్చ్య, సిద్ధిం విందతిమానవః॥ ఎవనివలన నీభూతములకుఁ బ్రవృత్తికలిగెనో యెవనిచే సర్వ ప్రపంచము వ్యాపింపఁబడియున్నదో యట్టివానిని స్వకర్మముచేతనే యర్చించి మనుష్యుఁడు మోక్షమునొందుచున్నాఁడు.'సర్వవర్ణానాం స్వధర్మానుష్ఠానే పరమ పరిమితం సుఖమ్' అన్నివర్ణములవారికి స్వధర్మానుష్ఠానమందుఁబరమున నపరి మితము శ్రేష్ఠమునగు సుఖము గలదు."యైస్స్వకర్మపరైర్నాథ,నరైరారాధితో భవాన్। తేతరంత్యఖిలామేతాం। మాయామాత్మవిశుద్ధయే. వి.పు.౫-౩౦-౧౬ నాథా! స్వకర్మపరులై యెవరు నిన్ను నాత్మవిశుద్ధికొఱకు నారాధింతురో వా రీ మాయ నంతయు దాఁటుదురు. 'స్వధర్మేవా, స్వవృత్తౌ కా పరీక్షణా' భార.౫౫-౭ స్వధర్మమందు స్వవృత్తియందు మంచిదా చెడ్డదాయను పరీక్షయేల ?

భద్ర రహితము=మేలులేనిది, ప్రొద్దుపోకకున్=కాలము గడుపుటకు,ధర్మ విరుద్ధ=ఇహధర్మమునకుఁగాని పరధర్మమునకుఁగాని విరుద్ధమైన, కథా = కథల యందు, అభిలాషిగాఁడు=కోరికగలవాఁడు కాఁడు. ఉత్తరోత్తరసుయుక్తులన్=

తాను జెప్పిన యుక్తికి నెదుటివాఁడు మఱియొకటి చెప్పిన దానినిమించి మఱి యొకటిచెప్పి తాను జెప్పినదే మంచిదని యెదుటివాఁ డంగీకరింపఁజేయును. దీనికి దృష్టాంతములు రామాయణమునఁ బెక్కులున్నవి. గీష్పతి=బృహస్పతి; వక్త=యుక్తియుక్తముగ మాటలాడువాఁడు, సుయుక్తులన్ = న్యాయ్యమైన యుక్తులచే, తన పంతమే గెలువవలయునని కుయుక్తులు పన్నఁడు.

తా త్ప ర్య ము.

కులోచితమైనక్షాత్ర ధర్మప్రకారము వర్తించుటచేఁగలుగుకీర్తియే స్వర్గఫల మిచ్చునదియని యెంచువాఁడు.ఇహపరలోక సాధకముగానికార్యము సమీపమున కైనఁబోఁడు, సర్వవిద్యలకు స్థానము. ప్రొద్దు పోవుటకై ధర్మవిరుద్ధములైన కథలు వినుటయందుఁగూడ నపేక్షలేనివాఁడు. వాదములయందు నెప్పుడును నెదుటివారి యుక్తినిమించి యుక్తులుచెప్పి తన యభిప్రాయమే సరియని యుక్తియుక్తముగ మాటలాడుటయందు బృహస్పతి ఎదుటివారికి న్యాయ్యమని తోఁచునట్లు చేసి కార్యము చేయునేకాని తానేమి చెప్పినను జేసినను సాగునని నాయిష్టము నేనిట్లే చేయుదును. ఇదియే సరియని చెప్పఁడు.

ఉ॥ రోగము లంట వెన్నఁడు, ని•రూఢబలాఢ్యుఁడు, దేశకాలముల్
బాగుగఁ దా నెఱుంగుఁ, నడి•ప్రాయమువాఁడు, ప్రశస్తభాషుఁడున్,
జేగ గ్రహించుఁ బూరుషులఁ•జెచ్చెరఁ జూచినయంతమాత్రలోఁ,
జాగియు, నద్వితీయుఁ డని, • సాధుగుణంబున నిశ్చితుండునున్. ౧౭

నిరూఢ బలాఢ్యుఁడు=ప్రసిద్ధి కెక్కిన బలశాలి, చేగ=చేవ, చాగి=త్యాగి-దాత-అద్వితీయుఁడు. అసమానుఁడు, అనిన్ = యుద్ధమందు- 'రోగములంట వెన్నఁడు' ఇత్యాది వాక్యములచే "యువాస్యాత్సాధు యువాధ్యాయకః అశిష్ఠో ద్రఢిష్ఠో బలిష్ఠ" ఇత్యాది శ్రుతివాక్యములు ప్రతిపాదింపఁబడినవి. రోగము లంట వనుటచే నాధివ్యాధులు లేనివాఁడు, దీనిచే నాశిష్ఠార్థము చెప్పఁబడెను. అశిష్ఠుఁడు=అశన సామర్థ్యముగలవాఁడు; ప్రశస్తభాషుఁడనుటచే యుపాధ్యాయ కత్వము చెప్పఁబడెను.దేశకాలము లెఱుంగుననుటచే సాధుత్వము చెప్పఁబడెను. సాధుగుణంబునన్=అపకారులందును నెవఁడు సాధువో వాఁడు సాధువు అట్టి గుణము కలవాఁడు.

తా త్ప ర్య ము

శ్రీరామచంద్రమూర్తి యాధిచేతఁగాని వ్యాధిచేతఁగాని బాధపడెడివాఁడు గాఁడు. బలవంతుఁడని ప్రసిద్ధికెక్కినవాఁడు. అధ్యయనాది కార్యములందు దేశము బలము చక్కఁగా నెఱిఁగినవాఁడు. యౌవనమం దుండువాఁడు.చక్కఁగ భాషింప నేర్చినవాఁడు. పురుషుల నొకసారి చూచిన మాత్రమునవే వారి తెలిపి బలమెంతో తెలిసికొనఁ గలవాఁడు. దానశీలుఁడు. యుద్ధమంచు అసమానుఁడు అధికుడు లేనివాఁడు. నిజమైన సాధువని లోకులచేఁ బొగడఁబడువాఁడు.

తే॥ ఇట్టిమేలిగుణంబుల♦కెల్ల రావు,రామచంద్రుండు జనమనో♦రాముఁడగుచుఁ
ప్రజల కెల్లను వెలుపలి♦ప్రాణ మయ్యె,రామరామాయటం ద్రనా♦రతమువారు
రావు=తావు- ఇది యన్యదేశ్యము.

తాత్పర్యము

ఇట్టి గొప్ప గుణములకెల్ల నిలువ స్థానమై రామచంద్రుఁడు జనుల మనస్సులను రమింపఁ జేయువాఁడై వారికందఱకు బయటి ప్రాణమయ్యెను. కావున వారందఱు రాముని విడువలేక మఱచిపోక యుపేక్షసేయక, యెల్లప్పుడు రామారామా యనుచుందురు.

కం॥ వ్రతముల విద్దియలను నవ,సితమొనరిచి స్నాతుఁడగుచుఁ♦జెలఁగెం,జదివెన్
శ్రుతులను సాంగములుగ, రఘు,పతి శస్త్రాస్త్రముల జనకు♦పై చేయయ్యెన్.

అవసితము=ముగింపు, స్నాతుఁడు=స్నానము చేసినవాఁడు, సాంగములుగన్=అంగములతోఁగూడినట్లుగ,శస్త్రాస్త్రములన్=మంత్రము లేక ప్రయోగించు కత్తి,బాణములు పరశువులోనైనవి శస్త్రములు. మంత్రించి వైచునవి అస్త్రములు నారాయణాస్త్రము బ్రహ్మాస్త్రములోనైనవి,స్నాతకుఁడు=త్రయః స్నాతకాభవంతి విద్యాస్నాతకో వ్రతస్నాతకో విద్యావ్రతస్నాతక ఇతి' హారీతస్మృతి. స్నాతకులు మూఁడు విధములవారుగలరు. విద్యాస్నాతకుఁడు=వేఁదధ్యయనము సాంతము చేసి వ్రతములు చేయనివాఁడు. వ్రతస్నాతకుఁడు=వ్రతముపూర్తిచేసి విద్య పూర్ణముగ నేరువనివాఁడు విద్యయు వ్రతములు పూర్ణముగఁ జేసినవాఁడు విద్యావ్రతస్నాతకుఁడు పరిణయానంతరమున నధ్యయనము పూర్తిచేయవచ్చును. శ్రీరాముఁడు విద్యా వ్రతస్నాతకుఁడు.

వేదములు నాలుగు ఋగ్వేదము యజుర్వేదము సామవేదము అథర్వణము. వీనియంగములు శిక్ష వ్యాకరణము ఛందస్సు నిరుక్తము జ్యోతిషము కల్పము. ఉపాంగములు. మీమాంస న్యాయశాస్త్రము పురాణము ధర్మశాస్త్రము జనకుపై చేయి అనుటచే దశరథుఁడు తక్కిన యందఱికంటె శ్రేష్ఠుఁడని భావము.

తాత్పర్యము

రామచంద్రమూర్తి వ్రతములను వేదాధ్యయనము పూర్ణముగఁజేసి స్నాతకుఁడయ్యెను. వేదములను నంగములతోడఁ జదివెను. శస్త్రాస్త్ర ప్రయోగజ్ఞానమందుఁ దండ్రిని మించెను.

సీ॥ వినుతసత్పథముగ♦వెలయించె ధర మించ, జనకవంశంబును♦జననికులము
సాధు వదీనుండు ♦ సత్యోక్తి ఋజువర్తి, ధర్మార్థదర్శన♦తత్పరు లగు
ద్విజులచే శిష్టు లౌ♦వృద్ధులచే శిక్షి,తుండు త్రివర్గ వి♦దుండు ప్రతిభ
నమరు లౌకికసమ♦యాచారకృతకల్పుఁ,డును వర్తనసమర్థుఁ♦డును నిభృతుఁడు
తే॥ సంవృతాకృతి,గలఁడు బా♦సటయు;గుప్త,
మంత్రుఁడునమోఘమైనయు♦మర్షహర్ష
ములను గల డార్జనవ్యయ♦ములకుఁ దగిన,కాలములఁజక్కఁదెలిసిన♦ఘనమనీషి

సత్కీర్తిభము=మంచికీర్తిగలది, అదీనుండు=దీనత్వము లేనివాఁడు, సాధువు=దోషములులేనివాఁడు. (౨) వేద ప్రామాణ్యము నంగీకరించువాఁడు, అదీనుఁడు=మనసుకలవర పెట్టుకారణములున్నను కలవరము నొందనివాఁడు, సత్యోక్తి=ఎటువంటి కష్టములందైనను నాత్మలాభమునకై యసత్యమాడనివాఁడు. ఇట్లనుటచే ౧౧-౨౩-వ పద్యమునందు సుమంత్రునకు నసత్యమాడనేర్పుట తండ్రి క్షేమమునకుఁగాన నసత్యముగాదు. ఇట్టులే సుందరకాండమందు సీతాదేవి హనుమంతుని విషయమై చెప్పిన యసత్య మసత్యముగాదు. (చూ. ప. ౧౧-౨౩), ఋజువర్తి=త్రికరణ శుద్ధిగల చక్కని నడవడిగలవాఁడు, శిక్షితుఁడు=నేర్పఁబడినవాఁడు, త్రివర్గ విదుండు=ధర్మము అర్థము కామము ఇవి త్రివర్గమనఁబడును. ఇవి తెలిసినవాఁడు. అనఁగా వీని నాలోచింపవలసిన సమయము అనుష్ఠించు మార్గము వినియోగింపవలసిన విధానము తెలిసినవాఁడు. పూర్వాహ్ణమందు ధర్మము, మధ్యాహ్నమందు అర్థము, అపరాహ్ణమందు కామము నాలోచించి చేయువాఁడు, ప్రతిభ=సమయమునకుఁదగినట్లు క్రొత్తక్రొత్తగ వికాసము నొందు బుద్ధిగలవాఁడు, లౌకిక=లోకమే ప్రమాణముగాఁగలదియు, సమయ=సంకేతమే "స్యాత్సంకేతస్తు సమయ" అని యమరుఁడు. అచార = ఆచారమందు, కృతకల్పుఁడు=చేయఁబడిన సంస్థాపనముగలవాఁడు, వర్తనసమర్థుఁడు=అప్రకారము వర్తించుటయందు సమర్థుఁడు, నిభృతుఁడు = వినయముగలవాఁడు. "వశ్యప్రణేయ నిభృత వినీతః ప్రశ్రితాస్సమా" యని యమరుఁడు. సంవృతాకృతి=గూఢమైన యాకారముగలవాఁడు. మనస్సునందుండు రహస్యమును ఇంగితాదులచే వెలుపలికిఁదెలియనీక దాఁచు సామర్థ్యముగలవాఁడు. బాసటయు గలఁడు=సహాయులుగలవాఁడు, గుప్తమంత్రుఁడు=ఆలోచనలను దాఁచువాఁడు, అమోఘమైన = వ్యర్థముగాని; అమర్ష హర్షములనుగలఁడు = కోపము సంతోషముగలవాఁడు, ఆర్జన=సంపాదించుటకు, వ్యయములకు=వెచ్చపెట్టుటకు, మనీషా=గొప్ప పండితుఁడు, మనస్ + ఈషా = మనీషా; పరరూప సంధి. ఇది శకంధ్వాదిగణములోఁ జేరినది. శకంధు రథకర్కంధుకుద్దాలోఽలర్కపర్వటీ. లాంగలీషా హలీషాచ మనీషాచ పతంజలిః" ఇవి శకంధ్వాదులు. మనీషగలవాఁడు మనిషి.

తాత్పర్యము

శ్రీరామచంద్రుఁడు తన తండ్రి వంశమును తల్లి వంశమును లోకమున సత్కీర్తి ప్రసిద్ధిగలవిగాఁజేసెను, ఎట్టి దోషమునులేనివాఁడు. ఎట్టి సంకట సమయమందును మనస్సున క్షోభచెందనివాఁడు సత్యసంధుఁడు ఋజువర్తనుఁడు. ధర్మార్థ విషయములను జక్కఁగాఁ దెలిసినవారును శిష్టులును ననుభవముఁగల పెద్దలునగు ద్విజులచే బోధింపఁబడినవాఁడు. ధర్మార్థ కామముల లక్షణము అవి యార్జించు మార్గములు వినియోగించు విధానములు తెలిసినవాఁడు. ఎప్పటి కప్పుడు వికసించు ప్రజ్ఞగలవాఁడు. లౌకికాచారములయు సమయాచారములయు

సంస్థాపనముగలవాఁడు. ఆ ప్రకారము నడుచుటయందును సమర్థుఁడు. వినయవంతుఁడు. తన మనస్సుననుండు విషయమును వెలికిరానరాకుండ దాఁచు నేర్పుగలవాఁడు. మిత్రసహాయసంపత్తి గలవాఁడు. అనుకొనినకార్యము సాంతమగువఱకు తన ఆలోచనముల దాఁచువాఁడు. ఆర్జించు విధము వ్యయముచేయు విధము తెలిసిన గొప్పబుద్ధిమంతుఁడు.

సీ. దృఢభక్తియుక్తుఁడు♦స్థిరబుద్ధిగలవాఁడు,
దురుసుమాటలు నాల్క♦తుదకుఁ దేఁడు
చెనఁటియర్థమునకుఁ♦జెడుజనంబులకును, మమతసేయఁడు లేశ♦మాత్రమైన
మందుండుగాఁడు ప్ర♦మత్తుండునుంగాఁడు, తనతప్పొరుతప్పుఁ♦దగనెఱుంగు
శాస్త్రంబులను జక్కఁ♦జదువరి మేలెంచు, గుణి పురుషాంతర♦కోవిదుండు
తే॥ ప్రగ్రహానుగ్రహాదిస♦త్పద్ధతులను; జరపు న్యాయంబుకొలఁది; వి♦చక్షణుండు
మంచివారలఁ జేర్చుట♦మనుచుటందు, శత్రునిగ్రహమునయందు♦స్థానవిదుఁడు

దృఢ భక్తియుక్తుఁడు = దేవగురువులయందు నిశ్చల భక్తిగలవాఁడు. స్థిర బుద్ధి గలవాఁడు = అట్టి భక్తి తత్కాలమందు మాత్రముండునదిగాక స్థిరమైన బుద్ధితో సర్వదాయుంచువాఁడు, దురుసుమాటలు=దుడుకుతనపు మాటలు, నాల్కతుదకుఁదేఁడు=కొననాలుకతో నైనఁబలుకఁడు, చదువరి=పండితుఁడు. పురుషాంతరకోవిదుండు=పురుషులను జూడఁగనే వీఁడు సాధువు వీఁడసాధువు అను తారతమ్యము తెలిసికొనుటయందుఁబండితుఁడు. పురుషుల యంతరంగమును దెలిసికొనఁగలవాఁడు. ప్రగ్రహానుగ్రహములను, ప్రగ్రహ=మిత్రాదులను స్వీకరించుటయందును, అనుగ్రహ = స్వీకరించినవారిఁ బరిపాలించుటయందును, విచక్షణుఁడు=శాస్త్రమర్యాద నతిక్రమింపక మిత్రులననుగ్రహించుట- శత్రువుల నిగ్రహించు సమర్థుఁడు.

తాత్పర్యము

గురుదేవతాదులందు దృఢమైన భక్తిగలవాఁడు; అట్టి భక్తియందుఁజలనములేని స్థిర బుద్ధిగలవాఁడు. పరుషవాక్యమును నాలుక సమీపమునకైన రానీయఁడు. దుష్ట జనంబులందును జెడుకార్యములందును లవమైన నభిమానము లేనివాఁడు. శాస్త్రాధ్యయనమందు ఆ ప్రకారము కార్యములు చేయుటయందు సోమరికాఁడు కావుననే ప్రమాదము పడఁడు. లోకమునందుఁ గొందఱు పరుల తప్పు మాత్రమే తెలిసికొనఁజాలియుందురు. రామచంద్రమూర్తి తనదోష మెదిరి దోషముకూడఁ దెలిసికొనఁగలవాఁడు. కావుననేకదా "భరతుఁడు శిరస్సుచే నమస్కరించి యాచించినను నేనతని ప్రార్థనము కొనసాగించినవాఁడనుగాను" అని తన కఠినత్వమును జెప్పుకొనెను. సాంగవేదములుగాని శాస్త్రముల జ్ఞానమందుఁ బండితుఁడు ఒకరికి మేలునేయెంచు గుణముగలవాఁడు. మనుష్యుల ముఖములు చూడఁగానే వీఁడు దుష్టుఁడు వీఁడు శిష్టుఁడని తెలిసికొను సామర్థ్యముగలవాఁడు. ధర్మశాస్త్రము ననుసరించియే మిత్రులను జేర్చును. వారిని బాలించును. శత్రువుల నిగ్రహించును. ఇవన్నియు నెప్పుడెట్లు చేయవలయునో తెలిసినవాఁడు.

సీ॥ అర్జనమందు నుపాయంబు గలవాఁడు, వెచ్చ మొనర్చును విధిహితముగ
వ్యామిశ్రకముల శా స్త్రావళిపట్టులఁ, గడుమేటి, ధర్మార్థ కలన సుఖియు
నలసుఁడు గాఁడు వైహారికంబులు శిల్పి,పను లెఱుగును నర్థభాగవిదుఁడు
ఏనుఁగు గుఱ్ఱంబు నెక్కంగ నేర్చును, శిక్షింప నేర్చును జెనఁటివాని
తే॥ విల్లుపట్టెడివారిలో నెల్లశ్రేష్ఠుఁ, డతిరథులకెల్ల నిత్యసమ్మతుఁడు ఘనుఁడు
తాన యభిముఖుఁడౌచు శాత్రవునణంచు,
దండునడపింపఁజతురుఁడుద్దండగతిని.

వెచ్చ మొనర్చును విధివిహితముగన్=ఆయంబునందు నాలవభాగమొండె మూఁడవభాగమొండెఁ దదర్ధమొండె ననినట్టు వెచ్చించువాఁడు, విధివిహితముగన్=శాస్త్రపద్ధతి ననుసరించి, వ్యామిశ్రకములన్=సంస్కృత పాకృతాది భాషాత్మక నాటకాదులందు,శాస్త్రావళిపట్టులన్=న్యాయవైశేషిక వేదాంతాదిగ్రంథములందు, కడుమేటి=మిక్కిలి శ్రేష్ఠుఁడు. అర్థధర్మముల ననుసరించియే సుఖించునుకాని కేవల కామ పరతంత్రుఁడు గాఁడు. అలసుఁడు=మందుఁడు, వైహారికంబులు=విహార ప్రయోజనములైనవి. వినోదకార్యములు-శిల్పిపనులు=శిల్పులు చేయుపనులు. గీతవాదిత్రములు చిత్రకర్మములు లోనైనవి- వాస్తుశాస్త్రము ననుసరించికదా చిత్రకూట పంచవటులయందుఁ బర్ణశాలలు నిర్మించుకొనిరి.అర్థభాగవిదుఁడు="ధర్మాయ యశసేర్థాయ, ఆత్మనే స్వజనాయచ, పంచధా విభజన్ విత్తమిహాముత్రచ శోభతే" యని ధనమును ధర్మము కీర్తి అర్థమునకును దననిమిత్తము స్వజనము నిమిత్తముగను నైదుభాగములు చేయువాఁడిందునందును శ్రేయస్సుగనును అనునీతి ననుసరించి వర్తించువాఁడు. అతిరథులకెల్లన్=యుద్ధమందు నెదురులేని రథగమనము గలవారలకందఱకు,సమ్మతుఁడు=పూజ్యుఁడు-అభిముఖుఁడౌచు శాత్రవునణంచున్ = ముందు సేనలఁబంపుట యుద్ధముసేయుట ప్రజానష్టికిఁగారణమనియు, శత్రువులరాకకుఁగాచిగాని దుర్గాదులమూలమున యుద్ధము సేయుట కాని కాలవిలంబనమనియు తలఁచి తానే శత్రువున్నచోటికి నెదురుగాఁబోయి శత్రువుల నణఁచును.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి మాలకరి పూలుగోసెడి మాడ్కి- తుమ్మెదలు పుష్పములనుండి తేనెను గ్రహించువిధమున సంపాదింప నేర్చినవాఁడు- శాస్త్రపద్ధతి ననుసరించి దుర్వ్యయముచేయక యాదాయమందు నాల్గవభాగమో- మూఁడవభాగమో యాఱవభాగమో వెచ్చించువాఁడు.తర్కన్యాయ మీమాంసాది శాస్త్రములందును నాటకాది, జ్ఞానమందుఁ బ్రయోజనపడు విద్యలందును మిక్కిలి శ్రేష్ఠుఁడు.ధర్మము నర్థముననుసరించిసుఖపడునేకాని కేవల కామమును గోరఁడు. అట్లు ధర్మము నర్థము నార్జించుటయందు మందుఁడుకాఁడు.విహారప్రయోజకములైననానియందును గీతవాదిత్రచిత్రరచనాది విద్యలందును,సమర్థుఁడు.ధనము నైదుభాగములుగ నెట్లు విభజింపవలయునో తెలిసినవాఁడు. ఎట్టి యేనుఁగును

గుఱ్ఱమునైన నెక్కఁగలవాఁడు దుష్టములైనవానిని సాధువులుగఁ జేయు నుపాయము తెలిసినవాఁడు. ధనుర్వేదమును సమర్మముగ నెఱిఁగినవారిలో గొప్పవాఁడు. అతిరథుల కందఱకుఁ బూజ్యుఁడు. శత్రువు నణఁచుటకై తానే వాని యెదుటికిఁబోయి వానిని జయించును గాని వాఁడువచ్చువఱకుఁ గాచియుండఁడు. సేనల నంపఁడు. అయినను బనిపడినప్పుడు సేనల నడపించుటకు వ్యూహములఁ బన్నుటకు సమర్థుఁడు.

కం॥ వీకునఁ బెనుఁగోపంబున, నాకౌకోఽసురచయంబు • లైనను దాఁకన్
జీకాకుపఱిచి తోలును,భీకరరణమున నజయ్య • విక్రముఁ డగుటన్. ౨౩

నాకౌకోఽసురచయంబు = నాక + ఓకస్ + అసుర చయము=నాకౌకస్ = దేవతలయు, అసుర=రాక్షసులయు, చయంబు = సమూహము, అజయ్యవిక్రముఁడు = జయింపసాధ్యముగాని పరాక్రమముగలవాఁడు, అజయ్యుఁడు = జయింపసాధ్యముగానివాఁడు, అజేయుఁడు=జయింపయోగ్యుఁడుకానివాఁడు.

తాత్పర్యము

యుద్ధమునందు దేవతలు రాక్షసులందఱు నేకమైయొక్కసారిగఁదాఁకినను బరాక్రమముచేతను గోపముచేతను నందఱుచెల్లాచెదరై పోవునట్లు పాఱఁదోలును.

బాలకాండముఁ బ్రథమ సర్గమందు వాల్మీకి నారదునడిగిన ప్రశ్నముల కన్నిటికిఁ బ్రత్యుత్తరము లీ సర్గమున నీయఁబడుచున్నవి. "కలన లీలనెవ్వండూన నాగ్రహంబు వణఁకు నమరతతియు" అని యడిగిన ప్రశ్నమునకిది ప్రత్యుత్తరము.లక్ష్యరూపక ప్రత్యుత్తర మరణ్యకాండము యుద్ధకాండము చెప్పుచున్నవి.

ఉ॥ కుందఁ డసూయచేత, జిత • కోపుఁడు, గర్వ మనంగ నెట్టిదో
డెందమునం దెఱుంగఁడు, క • డింది బలాఢ్యుఁడు నయ్యు దేని నే
నిం దెగి మానముం గొనఁడు, • నిచ్చలుఁ గాలవశానుగత్వముం
జెందఁడు మత్సరంబు మదిఁ • జేర్పఁడు, పొంగెడు నన్యవృద్ధికిన్. ౨౪

ఇంతవఱకు శ్రీరామునందుఁగల కల్యాణగుణములు చెప్పి యిఁక హేయగుణములు లేవని కవి చెప్పుచున్నాఁడు.

అసూయ = తనకంటె గొప్పవారిని జూచి సహింపలేక గుణము దోషముగాఁ జెప్పుట, కుందఁడు=దుఃఖింపఁడు, జితకోపుఁడు=కోపమును దనకు వశపఱుచుకొనినవాఁడు, డెందము=హృదయము,కడింది=మిక్కిలి యాశ్చర్యకరమైన,తెగి=సాహసించి,నిచ్చలు=సర్వదా,కాలవశానుగత్వముం జెందఁడు=(1)కాలమునకు వశుఁడై యుండువాఁడుకాఁడు; పదివేల సంవత్సరములు పదినూర్లేఁడులు ధర వసించెదనని కాలము తానే నిర్ణయించుకొనెనుగాని కర్మబద్ధులవలెఁగాలమునకు లోపడినవాఁడుకాఁడు (2) ప్రధానకాలానుగుణములైన సత్త్వరజస్తమస్సులకు లోపడియుండువాఁడుకాఁడు. అనఁగా శుద్ధ సత్త్వమూర్తి.మత్సరంబు=ఇతరుల [illegible]షము. 'మత్సరోన్యశుభద్వేష' యని యమరుఁడు.

తాత్పర్యము

శ్రీరామునం దసూయలేదు. ఆయనయే రమ్మనినఁగాని కోపము రాదు. పొగరను నది యెటువంటిదో మనస్సునందైన నెఱుఁగఁడు. బలముచే నసాధ్య కార్యములను జేయఁగలవాఁడయ్యు నెవరినిగాని దేనినిగాని యవమానింపఁడు. శుద్ధ సత్త్వస్వరూపుఁడై ప్రకృతి గుణములకుఁ గాలమునకుఁ లోపడియుండు వాఁడుకాఁడు. ఇతరులు వృద్ధిపొందిన సంతోషించునుగాని ద్వేషింపఁడు.

కం॥ గీర్పతి బుద్ధిబలంబున, స్వర్పతి వీర్యమున క్షమను•క్షమ నిత్యము సం
తర్పిత భువనత్రయుఁడు న,హర్పతివంశ్యుండు పూజ్యుఁ•డన్ని జగములన్.

గీర్పతి=బృహస్పతి, స్వర్పతి=ఇంద్రుఁడు, క్షమ=భూమి, సంతర్పిత=సంతోషపెట్టఁబడిన, భువనత్రయుఁడు=మూఁడులోకములు గలవాఁడు, అహర్పతి వంశ్యుండు=సూర్యవంశమునఁ బుట్టినవాఁడు.

తాత్పర్యము

బుద్ధిని బృహస్పతిని, వీర్యమున నింద్రుని, నోర్పునందు భూమిని బోలు వాఁడు. ముల్లోకములను సంతోషపెట్టువాఁడు. సూర్యవంశమునఁ బుట్టినవాఁడై సూర్యునివలె నన్ని లోకములవారిచేఁ బూజింపఁబడువాఁడు.

కం॥ శాంతములై కరము ప్రజా,కాంతములై జనకహర్ష • కరములు నగుచున్
దాంతములౌ గుణముల దిన,కాంతుఁడు కాంతులను బోలెఁ•గడు రాజిల్లెన్. ౨౬

కరము=మిక్కిలి, ప్రజాకాంతములై=జనులకు మనోహరములై, జనక హర్షకరములు=తండ్రికి సంతోషము కలిగించునవి, దాంతములు = ఇంద్రియ నిగ్రహములు గలవి, దినకాంతుఁడు=సూర్యుఁడు.

తాత్పర్యము

అంతరింద్రియ నిగ్రహము బాహ్యేంద్రియ నిగ్రహము కలవై జనులకు మిక్కిలి మనోహరములై తండ్రికి సంతోషకరములైన గుణములచే సూర్యుఁడు తన దీప్తిచేఁ బ్రకాశించునట్లు శ్రీరామమూర్తి మిగుల రాజిల్లెను.

ఈ పద్యమునందు శ్రీరామమూర్తికిఁ బ్రాధాన్యము చెప్పక యాయన గుణములకే ప్రాధాన్యము చెప్పఁబడెను. దినకాంతుఁడు=సూర్యుఁడు, సూర్య రశ్మిలేని దినము దుర్దినము. సూర్యరశ్మిగలదినము సుదినము. దినము (పగలు) మనోహరమగుటకుఁ గారణము సూర్యరశ్మియేకాని మబ్బుచాటుననుండు సూర్యుఁడు కాఁడు. అట్టులే శ్రీరామునందు సద్గుణములుండినను ప్రజాహితములై ప్రకాశింపవేని వ్యర్థములే. అట్టి రాముఁడుండినను లేకుండినను నొకటే. అట్టులే భగవంతుని జగద్వ్యాపార వర్జ్యమైన స్థితికంటె జగద్ధిత గుణప్రకోపముగల స్థితియే శ్రేష్ఠము. అనఁగా గుణవ్యాపార రహితమగుటచే నిర్గుణమని చెప్పఁబడు బ్రహ్మము స్థితికంటెఁ గల్యాణగుణ వ్యాపారముగల సగుణస్థితియే శ్రేష్ఠము. గుణి

గుణముల కవినాభావ సంబంధము. గుణిలేక గుణములులేవు. గుణములులేని గుణిలేఁడు. కావున నిర్గుణుఁడనఁగా సృష్ట్యాదిగుణవ్యాపార రహితుఁడు. ఈ దిన మంతయు నెండలేదనిన సూర్యునందుఁ గిరణములు లేవని భావముగాదు. సూర్య రశ్మి భూమిమీఁదఁ బ్రకాశించునట్లు రామచంద్రమూర్తి గుణములచేఁ బ్రకాశించె ననుటచే సూర్యకిరణములు పక్షపాతము తారతమ్యము లేక సర్వత్ర సమముగా నెట్లు వర్తించునో యట్లే భగవంతుని గుణములు నని యెఱుంగవలయును. 'సమోహం సర్వభూతేషు' అని భగవంతుఁడు చెప్పెఁగదా.

శ్రీరామచంద్రమూర్తి తన గుణములచేఁ దండ్రిని బ్రజలను సంతోషపఱిచె ననుటచే రాజ్యభారము వహింప సర్వవిధముల యోగ్యుఁడని భావము. శ్రీరామ చంద్రమూర్తి గుణములకుఁ దండ్రి యెట్లు సంతోషించెనో యట్లే సమస్త ప్రజలు బాలురు వృద్ధులు స్త్రీలు పురుషులు సంతోషించిరని భావము.

తే॥ అనఘు నిట్టివ్రతాఢ్యుని • నప్రదృష్య,
విక్రముని రాము గుణధాము • వితతధాము
లోకపాలోపమునిఁ గోరెఁ • బ్రాకటముగ, వసుమతీకాంత దనకూర్చు • వల్లభుఁడుగ.

అనఘున్=పాపరహితుని, వ్రతాఢ్యుని=వ్రతములే సంపత్తిగాఁగలవానిని, అనుటచే మీఁదఁజెప్పిన గుణములన్నియు శ్రీరామునిచే వ్రతములుగఁ బాలింపఁ బడుచున్నవనియు వ్రతభంగము దోషావహము గావున నట్టిదోషములు రాముని యందు లేవనియు నెఱుంగునది. అనఘు శబ్దమువలన నీయర్థము స్ఫురించు చున్నది. అప్రధృష్య విక్రమున్=తిరస్కరింపరాని విక్రమముగలవానిని, దోష రహితముగ నిన్నివ్రతము లెట్లు సాధింపఁగలిగెనన నప్రధృష్య విక్రముఁడగుటచే నని భావము. ఆయన సంకల్పించి పూనిన దానికి విఘ్నము కలిగింపఁజాలిన దేదియు లేదని తాత్పర్యము. రామున్=లోకులను వీరి వారి ననక యెల్లరును రమింపఁజేయుటే స్వభావముగాఁ గలవానిని, గుణధామున్ = అట్లు రమింపఁ జేయుటకుఁ గావలసిన సద్గుణములకు స్థానమైన వానిని, ధామము = ఇల్లు. కల్యాణ గుణములన్నియు వేఱొక చోటికిఁబోవుటకు నింతకంటె మంచిస్థానము దొరకమిచే నిందే స్థిరముగ వాసముచేయుచున్నవని తాత్పర్యము. వితత ధామున్=విస్తారముగ వ్యాపించియుండు కాంతిగలవానిని, లోకపాలోపమునిన్= లోకపాలురతో సమానుని, ఒకనిపేరుచెప్పక సామాన్యముగఁ జెప్పుటచే నింద్రాది లోకపాలుర యందుండు పాలన గుణములన్నియు నీయన యందుఁగలవు.

వసుమతీ కాంత=భూదేవి, అనఁగాఁ బ్రజలందఱనియు భూమిని నధిష్ఠించి యుండు దేవతయనియు నర్థము, కూర్చు=ప్రీతి కూర్చు, ప్రియుఁడైన వల్ల భుఁడు=ఇష్టుఁడైన భర్త,లోకపాలోపమునిన్, ఉప=సమీపమందుఁగల, మా= లక్ష్మిని గలవానిని, అనఁగా లక్ష్మీవిశిష్టుని; సీతయే లక్ష్మి, సీతాసమేతునని యర్థము. లోకపాలాశ్చ అసౌ ఉపమశ్చ అని సమాసము. హ్రీశ్చతే లక్ష్మీశ్చ

పత్న్యౌ" అన్నట్లు శ్రీవిష్ణువునకు శ్రీభూదేవులు భార్యలు, కావున శ్రీయెట్లు రాముని స్వయంవరమున వరించెనో భూదేవియు నట్లేవరించెను. సీతాదేవి వర శుల్కయై పరాక్రమమునకై రాముని వరించెను. భూదేవి పాలనారూపక కల్యాణ గుణములఁజూచి వరించెను. కీర్తి యశస్సులు రెండు రాజునందుండవలసినవే. 'తపనీయదండైక ధవళాత పత్రితోద్దండ తేజఃకీర్తి మండలుండు' నైషధము, లోకమున నందఱు పురుషులు భూమిని దామువరింతురు. ఈరాజ్యము నాకుఁ గావలె, ఈభూమి నాకుఁగావలెనందురు. కాని రాముఁడట్లు కోరినవాఁడు కాఁడు. భూదేవియే రాజ్యలక్ష్మియే శ్రీరామచంద్రమూర్తిని దనకు భర్తగా వరించెను. ఎట్టి భూదేవి ? వసుమతీకాంత-వసు+మతి = బంగారు విశేషించిగలది- అనగా మహాభాగ్యవతి-కాంత=మనోహర కాంతిగలది- అనఁగా సుందరి. మహాభాగ్యము సౌందర్యముగల యట్టి భూదేవి తానుగా శ్రీరామచంద్రమూర్తిని వరించెనని భావము. వల్లభుఁడు=ఇష్టుఁడు=ప్రియుఁడు.

తా త్ప ర్య ము

దోషరహితుఁడును; మీఁదఁజెప్పిన కల్యాణగుణములు వ్రతములుగాఁగల సంపన్నుఁడును ఇతరులచే మొక్కవోని విక్రమముగలవాఁడును, లోకులనెల్ల రంజింపఁజేయు స్వభావము గలవాఁడును అట్టి గుణములకు మందిరమైన వాఁడును- సర్వత్ర వ్యాపించిన ప్రకాశము గలవాఁడును లోకపాలురతో సమానుఁడును నగు శ్రీరామచంద్రమూర్తిని భూదేవియే తనకుఁదగిన ప్రియభర్త యని గ్రహింపఁ గోరెను.

—♦ దశరథుఁడు రామచంద్రు యువరాజుఁ జేయ యోజించుట ♦—

చం॥ అతులిత తాదృశామలగుణా♦ఢ్యుని బుత్రునిఁ గాంచి యెట్టు లేన్
బ్రతికియ యుండగా ధరణి♦పట్టముఁ గట్టఁ గలాఁడ వీనికిన్ ?
ముతుకఁడ నైతి వీనియెడ♦మోహము తద్దయుఁ బెద్ద నాకు, నే
గతి నభిషిక్తు రాముఁ విభుఁ♦గాంతునొ యంచు విచారయుక్తుఁడై. ౨౮

అతులిత=అసమానమైన, తాదృశ=అటువంటి, గుణాఢ్యుని=గుణ సంపత్తి గలవానిని, ఏన్ = నేను.

తా త్ప ర్య ము

అసమానములైన లోకోత్తర గుణములచే సంపన్నుఁడైన కుమారునిఁజూచి దశరథుఁడు నేను జీవించియుండుకాలమందే వీనికేవిధముగా రాజ్యపట్టాభిషేకము చేయుదునో- నేనాముసలివాఁడనైతిని. వీనియందా నాకుఁ బుత్రమోహము విస్తరించియున్నది. పట్టాభిషిక్తుఁడైన రాముని నేను జూచుట యెట్లు గలుగునాయని మిక్కిలి విచారముతోఁ గూడినవాఁడై, విచారశబ్దమునకు ఆలోచించు సంతాపించు అని రెండర్థములు గలవు. రామునకుఁ దాను బట్టాభిషేకము చేయకయే మరణించుట గలిగెనేని కైకకిచ్చిన వరమును బట్టి తన కత్యంత ప్రియపుత్రుఁడైన

రామునకు రాజ్యము లేకపోవునే యని సంతాపము. తాను జీవించి యుండఁగానే పట్టాభిషేకము చేయుటకు సదుపాయమేది? ఈవార్త తెలిసిన భరతుని పక్షమున కేకయరాజు మొదలగువారు ముందు నీవిచ్చిన వరము ప్రకారము భరతునకు రాజ్యమిమ్ము రాముని కెట్లిచ్చెదవని వచ్చి నిర్బంధింతురేమో- అట్లు వారు వచ్చిరా తనయల్లుని పక్షమున జనకుఁడు కౌసల్య పుట్టినింటివారు వత్తురేమో- వారికి వీరికిఁ గలహము జరుగునే- నేనెవరికేమి చెప్పుదును ఇరువుర నడుమ నేను జెడిపోదునేమో-యిట్లుగాకుండ నేయుపాయముచేత రామునకుఁ బట్టాభిషేకము చేయుదునా యని యాలోచన- కార్యము ముగిసిన తరువాత నెవరేమి చేయునది యుండదు. మించిన దానికి వగచి ప్రయోజనము లేదని యూరకుందురు. ఒకవేళఁ గలహమునకు వచ్చినను రామలక్ష్మణులే వారికి బ్రత్యుత్తరమీయఁ గలిగియుందురు అని యాలోచన.

ఉ॥ ఈతని రాజుఁ జేయుటయె•యెంతయు నిష్టతమంబు, లోకసం
ఘాతమువృద్ధిఁగోరు, జన•కాండముపై ననుకంప మెండు, వి
ఖ్యాతిగ వృష్టిమంతుఁడగు•నంబుదవాహుఁడు వోలె లోకులం
బ్రీతులఁ జేయుచుండుఁ, గడు•మెచ్చిరి నాయెడకంటె వారికిన్. ౨౯

సంఘాతము=సమూహము, కాండము=సమూహము, అనుకంప=దయ, వృష్టిమంతుఁడు=వర్షము నిచ్చువాఁడు, అంబుదవాహుఁడు = వర్షాధిదేవతపర్జన్యుఁడు-మేఘవాహనుఁడు.

తాత్పర్యము

ఇప్పుడే శ్రీరాముని రాజుగఁ జేయుదునా వలదా? చేసినమేలా చేయకుండిన మేలా? యని యాలోచించి యాలోచించి రాజును జేయుటయే మిగుల నిష్టమైన కార్యము- ఏలన-రాజగువాఁడు ప్రజలవృద్ధి గోరువాఁడై యుండవలయును. అట్టికోరిక వీనియందుఁ గలదు. ఉత్తకోరిక యుండుటయేకాదు. దానిని బ్రజలయందు దయగలవాఁడై కార్యరూపముగఁ బర్జన్యదేవుఁడు తగిన యదనునఁ దగినంత వర్షము గురియఁజేసి లోకులను బ్రీతులఁ జేయునట్లు రామచంద్రుఁడును జేయుచున్నాఁడు. నేనుమాత్రము చేయకున్నవాఁడనా యందువేని ప్రజలు నాయందుండు ప్రీతికంటె వీనియందు నెక్కువ ప్రీతికలవారై వీనిని మెచ్చుకొన్నారు. ఇట్టివాఁడేకదా ప్రభువు గాఁదగినవాఁడు. 'పుత్రాదిచ్ఛేత్పరాజయ'మ్మన్నట్లు లోకములో సందఱను దాను మించవలయును. తనకొడుకు తన్ను మించినవాఁడుగా నుండవలయునని తండ్రి కోరవలయును.

కం॥ శమనబలదమనులకుఁ దా, సముఁడు పరాక్రమమునందు; •సరి గురుపునకున్
సుమతిః ధృతి మేరుశైలో,పముఁడగు, నాకంటె సుగుణ•వంతుఁడు దలఁపన్.

శమన బలదమనులకున్=యమునకు-నింద్రునకు, సుమతిన్=మంచి బుద్ధి బలమందు, గురువునకున్=బృహస్పతికి, ధృతిన్=ధైర్యమందు, మేరుశైలోపముఁడు=

మేరు పర్వతముతో సమానుఁడు-శమనదమనులని యొకటిగా ద్వంద్వముగఁ జెప్పుట యొకరొకరు వేఱుగ సమానులు గారని తెలుపుటకే.

తాత్పర్యము

పరాక్రమమందు నింద్ర, యసులకు, బుద్ధి బలమందు బృహస్పతికి, ధైర్యమందు మేరుపర్వతమునకు సమానుఁడు, సుగుణములందు నాకంటె గొప్పవాఁడు

కం॥ సన్నుతచరితుఁడు పుత్రుం, డిన్నేలను నేలు చుండ • నీవయసున నేఁ
గన్నారఁ గని యథాగతి, బన్నుగ స్వర్గమునుఁ గాంచు • భాగ్యము గలదే. ౩౧

సన్నుత చరితుఁడు=సజ్జనులచేత స్తోత్రము చేయఁబడిన నడవడిగలవాఁడు-పుత్రుఁడు=పున్నామనరకమునుండి రక్షించువాఁడును, వంశమును బావనము చేయువాఁడు. పున్నామ నరకమునుండి రక్షించువాఁడు పెద్దకొడుకేకాని తక్కిన వారుగారు. పునాతీతి పుత్ర యనియు వ్యుత్పత్తి గలదు. యథాగతి=చేసిన పుణ్య పరిపాకముకొలఁది, స్వర్గమునుగాంచు=చేసిన పుణ్యముకొలఁది లభించు స్వర్గ సుఖము-i ii-నీతోడనుంట స్వర్గమన్నట్టు రామ సౌందర్యానుభవసుఖమని-పరిపూర్ణ బ్రహ్మానుభవాత్మకా ముక్తియని యుండుటచే సవిచ్ఛిన్నరామ దర్శనము వలనఁ గలుగు నానందానుభవమే మోక్షసుఖమని భావము- అది యచ్చట లభించిన నేమి విశేషము. ఇక్కడ లభించిన నేమిలోటు?

తాత్పర్యము

సజ్జనులచేఁ బొగడ్తగన్న నడవడిగలవాఁడును సార్థకముగఁ బుత్ర శబ్దము వహించి సన్నుఁ బున్నామ నరకమునుండి రక్షించి వంశమును బావనము చేయువాఁడునగు రాముఁ డీరాజ్యమును బాలించుచుండఁగా నీవార్ధక దశ యందు నేను గన్నులారఁజూచి యా పుణ్యముకొలఁది నేను స్వర్గమునకుఁబోవు భాగ్యము కలదో లేదో- సామ్రాజ్య పట్టాభిషేకదర్శన భాగ్యము నిర్భాగ్యులకుఁ గలుగదుగదా.

తే॥ అనుచు లోకోత్తరంబును • నప్రమేయ, మన్యరాజన్యదుర్లభ • మైన సద్గు
ణాళిగలరాము యౌవరా • జ్యంబునందు,
నిలుపఁ దలఁచెను సచివోక్తి • నిశ్చయించి. ౩౨

లోకోత్తరమును = లోక వృత్తము నతిక్రమించినదియు, అప్రమేయము= సంఖ్యపెట్టి చెప్పరానిది, సచివోక్తిన్ = మంత్రులమాట ననుసరించి.

తాత్పర్యము

అని యీప్రకార మాలోచించినవాఁడై దశరథుఁడు లోకాతీతమై ప్రమాణ సాధ్యముగానిదై యితర రాజశ్రేష్ఠులకు దుర్లభమైన గుణ సమూహముగల శ్రీరామచంద్రుని యువరాజు చేయవలయునని మంత్రులతో నాలోచించి నిశ్చయించెను.

కం॥ దివి భువిఁ బొడముచు నుండెడు,నవశకునోత్పాతములను•నాత్మతనువునన్
దవిలినముదిమిభరంబును, నవనివిభుఁడు ప్రాజ్ఞుఁడగుట•నాలోచించెన్. ౩౩

రామపట్టాభిషేక విషయమున దశరథుఁడు తొందరపడుటకుఁ గారణము చెప్పఁబడుచున్నది.

దివిన్=ఆకాశమందు, భువిన్=భూమియందు, పొడముచు నుండెడి=పుట్టుచున్న-అవశకు నోత్పాతములను=చెడు శకునములను-ఉత్పాతములను.

శ్లో॥ స్వర్భానుకేతు నక్షత్రగ్రహ తారార్క చంద్రజమ్
దివిచోత్పద్యతే యచ్చ, తద్దివ్య మితికీర్తితమ్.
వాయ్వభ్ర సంధ్యాదిగ్దాహ, పరివేషతమాంసిచ
ఖపురంచేంద్ర చాపంచ, తద్విద్యా దంతరిక్షజమ్.
భూమావు త్పద్యతేయచ్చ, స్థావరం వాథజంగమమ్
తదైకదేశికం భౌమ, ముత్పాతం పరిచక్షత. ఇతి-

ఆకాశమునందు-రాహు కేతువులు-గ్రహనక్షత్ర తారలు సూర్యచంద్రులు వీనివలనఁ గలిగిన విపరీత వికారములు దివ్యోత్పాతములు.

గాలి, మేఘము, సంధ్యా, దిగ్దాహము (దిక్కులు మండుచున్నట్లు నెఱ్ఱకాంతులు గానవచ్చుట) పరివేషము (సూర్యచంద్రుల చుట్టు గుండ్రపుఁ జక్రములు కానవచ్చుట) చీఁకట్లు-గంధర్వనగరములు. ఇంద్రధనుస్సు ఇవియంతరిక్షోత్పాతములు.

స్థావర జంగములవలనఁ గలుగునవి భౌమోత్పాతములు- స్థావర వికారములు=భూకంపము-శిలావర్షము వృక్షములందు రక్తము కాఱుటలోనైనవి.

జంగమవికారములు=పశుపక్ష్యాదులయందు మనుష్యాది జాతులు పుట్టుట, ఆత్మతనువునన్=తన దేహమందు, ప్రాజ్ఞుఁడు=తెలిసినవాఁడు.

రాజు అవశకునములకు భయపడికాదు- తాను మిక్కిలి వృద్ధుఁడగుటచే యోగ్యుఁడుసమర్థుఁడునగు పుత్రుఁడెదిగినవాఁడుండఁగా నింకను రాజ్యభారము వహించి యుండుట ధర్మముగాదని రామపట్టాభిషేక ప్రయత్నము చేసెను.

తాత్పర్యము

మరణకాలము సూచించుచు నాకాశమందు భూమియందుఁ గానవచ్చునవశకునములు నుత్పాతములును తనకుఁ బ్రాప్తించియుండు ముసలితనమును జూచి ప్రాజ్ఞుఁడగు దశరథుఁడు తనకు మరణము సమీపమందేయున్నది. ఇఁక నాలసించినఁ బ్రయోజనము లేదని యాలోచించెను.

కం॥ రామునకును ముఖనిర్జిత, సోమునకును స్వాత్మకలిత•శోకాపనయో
ద్దామునకును సద్గుణని,స్సీమున కగుప్రజలరక్తి•చింతించి మదిన్. ౩౪

ముఖనిర్జిత సోమునకును=చంద్రుని జయించిన ముఖకాంతిగలవానికి; స్వాత్మకలిత=తన మనస్సునఁదవిలిన, శోక + అవశకునముల వలనఁ గలిగిన

శోకమును; అపనయపోఁగొట్టుటయందు, ఉద్దామునకును=గొప్పవానికిని, సద్గుణని స్సీమునకును = మేరలేనిమంచి గుణములు గలవానికి, ప్రజలరక్తి=ప్రజల యందలి యనురాగము.

తాత్పర్యము

చూచినంతమాత్రముననే చంద్రునివలె మనస్సునకు సంతోషము గలిగించుచు వ్యసనము పోఁగొట్టు ముఖవర్చస్సు సౌందర్యముగల వాఁడును తన మనస్సున నుండు శోకమును బోఁగొట్టుటయందు సమర్థుఁడును ఇన్నియని లెక్కించిచెప్ప సాధ్యముగాని పరిమితిలేని కల్యాణగుణములు గలవాఁడును నగు శ్రీరామచంద్రునకుఁ బ్రజలయందుఁగల ననురాగమును నాలోచించెను.

కం॥ తనకును బ్రజకును శ్రేయము, ననుపును గూర్పంగ నవని•నాథుఁడు కాలం
బును జనుదెంచుట గని ప్రే,మను దీవరపడఁగ సాగె•మదిఁ దత్కృతికై. ౩౫

ననుపు = ప్రీతి; "ననుపు కాఁడయి వేల్పు నాగవాసముఁ గూడి" యని మనుచరిత్ర.

తాత్పర్యము

తనకును బ్రజకును శ్రేయస్సు ప్రీతి గలిగించు రామపట్టాభిషేకకార్యము జరుపుటకుఁ దగినకాలము ప్రాప్తించెనని యెఱిఁగినవాఁడై దశరథుఁడాకార్య మెప్పుడెప్పుడు నెరవేర్తునా యని తొందర పడసాగెను. శుభస్య శీఘ్రమని కలదుగదా.

—• దశరథుఁడు రాముని యువరాజుఁ జేయఁ బౌరులతో నాలోచించుట •—

కం. మంతనమునకై పతి సా,మంతుల నానావిదేశ•మహిజనముల భూ
కాంతుల ముఖ్యులు నందఱ, సంతసమునఁ బిల్వఁ బనిచె•జానపదాళిన్. ౩౬

పట్టాభిషిక్తుఁడై యుండు రాజునకు నావెనుక నాకొడుకునకు నాయిష్టము చొప్పునఁ బట్టాభిషేకము చేసెద నను నధికారములేదు- రాజ్యము ప్రజలది- రాజ్యమును బరిపాలించు శక్తి యెవనియందుఁగలదో వాని నేర్పాటుచేయు భారము ప్రజలది- కాని నారాజ్యము కావున నాయిష్టప్రకారము నాయిష్టము వచ్చినవాని కిచ్చెద నని రాజు చెప్పరాదు- ప్రజల నిమిత్తమై రాజుగాని రాజు నిమిత్తమై ప్రజలుండలేదు- కావున నన్నివిధముల రాజ్యభారము వహింప శ్రీ రామచంద్రమూర్తి సమర్థుఁడని తోఁచినను బ్రజానురాగముగలవాఁడని యేర్పడి నను బ్రజల సమ్మతిలేక యాయనకుఁ బట్టాభిషేకము చేయునధికారము లేకుండుటచే వారినందఱను దశరథుఁడు పిలిపించి విషయ మెఱుకపఱచి వారి సమ్మతిఁ బడయుచున్నాఁడు.

ఇది మన పూర్వరాజుల ధర్మపద్ధతి- ఇట్టులే యయాతి తన చిన్నకొడుకు పూరునకు రాజ్యమిచ్చునపుడు ప్రజలనందఱఁబిలిపించి "భవతోఽనున యామ్యేవం పూరౌ రాజ్యేఽభిషిచ్యతామ్" పూరునకు రాజ్యాభిషేకము చేయుటయందు మీ యనుజ్ఞ కోరుచున్నాను. అనగా వారు "యఃపుత్రో గుణసంపన్నో, మాతా

పిత్రోః హితస్సదా! సర్వమర్హతి కల్యాణం, కనీయానపి సత్తమః! అర్హః పూరు రిదం రాజ్యం యస్సుతః ప్రియకృత్తవ" అని చెప్పిరి. ఎవఁడు సద్గుణ సంపత్తి గలిగి, తల్లిదండ్రులకు హితుఁడై, యుండునో వాఁడు చిన్నవాఁడైనను, సత్పురుషుఁడు కావున సమస్తకల్యాణముల కర్హుఁడగుచున్నాఁడు. పూరుఁడు నీకుఁ బ్రియుఁడు కావున నీరాజ్యమున కర్హుఁడు- అని చెప్పిరి.

ధర్మరాజు పౌరజన ప్రియుఁడు కావుననే యాయనను యౌవరాజ్యమునుండి తొలఁగించుటకు ధృతరాష్ట్రుఁ డన్నిమాయోపాయములు పన్నెను.

మంతనమునకు=ఆలోచనకు, పతి=దశరథుఁడు, సామంతులన్=చేతిక్రింది రాజులను, నానావిదేశ మహిజనములన్=ఇతర దూరదేశములందుండు నానా జనములను- జానపదాళిన్=జనపదములనుండు జనుల సమూహమును- కేవల కుగ్రామముగాక పట్టనముగాక యుండు నూరు జనపద మనఁబడును.

తాత్పర్యము.

ఆలోచించుటకై సామంతరాజులను ముఖ్యరాజులను నానాదేశములందు దూరమున నుండువారిని గ్రామములం దుండువారిని దశరథుఁడు పిలిపించెను. రేపు పట్టాభిషేకమనఁగా నీదిన మందఱకుఁ జెప్పిపంపెనని భావముగాదు- దూర దేశవాసు లొకదినమున నెట్లురాఁగలరు. ఈదినమం దీపట్టాభిషేక కార్యము జరుగ వలయునని మంత్రులతో రహస్యముగ నాలోచించి తీర్మానించుకొనినవాఁడు కావున మీతో నాలోచింపవలసిన ముఖ్యకార్యమొ కలదు. కావున నట్టిదినమందు మీరందఱు నయోధ్యకు రావలయునని కారణముచెప్పక యేదో పని నెపమున నందఱు నొక్కనాఁడు పురిచేరునట్టు లేర్పాటు చేసెనని యెఱుఁగవలయును.

కం॥ చెవులకుఁ బండువగా వా, రవల వినం గలుగుఁగాక•యని దూరప్రభూ
ధవులగు కేకయజనకుల, నవనీపతి పిలువ నంపఁ•డయ్యెం ద్వరచేన్. ౩౬

తాత్పర్యము

అందఱకుఁ జెప్పిపంపెను గాని జనకకేకయ రాజులకు మాత్రము చెప్పి పంపఁడయ్యెను. కార్యము ముగిసినపిమ్మట వారు వినిసంతోషింపనిమ్మనియుఁ గార్యము తొందరగాఁ గావలసి యుండుటచేతను- చెప్పిపంపిన పిమ్మట వారు స్వతంత్రులు కావున సకాలమునకు రాకున్నను గార్యవిఘ్నమగు నని తలఁచి వారికిఁ జెప్పిపంపఁడయ్యెను.

వాస్తవకారణము పనితొందరయే కాదు. వారు వచ్చిన నేమి యనర్థములు కలుగునో యను గిలి ముఖ్యకారణము.

కం॥ వచ్చినతక్కటివారికి, విచ్చలవిడి నుచితరీతి • విడుదులు సొమ్ముల్
పెచ్చుగ నిడి ప్రజకు న్విధి, యిచ్చెడిగతి దర్శనంబు•నిచ్చెం బిదపన్. ౩౭

తాత్పర్యము

తనయాజ్ఞ మేరకు నయోధ్యకు వచ్చిన వారికందఱకుఁ దగిన విడుదులు మొదలైనవి వారివారి యోగ్యతకుఁ దగినట్లు తేర్పాటుచేసి కావలసిన పదార్థములు వారు సంతోషించునట్లు విస్తారముగఁబంపి వారికందఱకుఁ బ్రజలకు బ్రహ్మదేవునివలె దర్శన మిచ్చెను.

చం॥ అరిబలహంత యాదశర•థావనినాథుఁడు కొల్వు దీరఁగా
　వరుసగ నున్న భూమిధవ•వర్యులు వచ్చి నృపాలదత్త మౌ
　సురుచిరపీఠవర్గముల•సొంపుగ సమ్ముఖులై రహింపఁగా
　నరత, మహీశుఁ డొప్పె విబు•ధౌఘసమావృతశక్రుకైవడిన్.　　౩౮

అరి బలహంత=శత్రుసేనల వధించువాఁడు-ముసలివాఁడైనను జవసత్త్వములు తగ్గలేదని భావము. విబుధౌఘ=దేవతాసమూహములచే, సమావృత=చుట్టఁబడిన శక్రుకైవడిన్=ఇంద్రునివలె- ఉన్న=తక్కిన

తాత్పర్యము

దశరథుఁడు సభదీరఁగాఁ దక్కిన రాజులందఱు వచ్చి యాయనయిచ్చిన యందమైన యాసనములపై నాయనకెదురుగ సమీపమునఁ గూర్చుండఁగా నాయన దేవతలచేఁ జుట్టఁబడిన యింద్రునివలె శోభించెను.

—• ౨-వ సర్గము. దశరథు నుపన్యాసము. •—

చం॥ కలయఁగఁ జూచి యాయవని•కాంతుఁడు నిండుసభన్ వచించె ని
　స్తులహితహర్ష హేతు వయి•తోరపుఁగీర్తి ఘటింప నైనమే
　ల్పలుకులు దుందుభిస్వనని•భంబు గభీరము రాజయోగ్యము
　న్లలితము మాధురీధురము•సవ్యము నౌగతి మేఘఘోషుఁడై.　　౪౦

నిస్తుల=సమానములేని, హిత=మేలునకు, హర్ష=సంతోషమునకు, హేతువయి=కారణమయి, మేఘఘోషుఁడై=మేఘధ్వనివంటి కంఠధ్వనిగలవాఁడై.

తాత్పర్యము.

ఇట్లు సభదీరి, సభయందుండువారి నందఱఁ గలయఁజూచి, భేరి ధ్వనివంటిదై, గంభీరమై, రాజు చెప్పుటకు యోగ్యమై, మనోహరమై, మిగులఁ దియ్యనైన విధముగ, నందఱకు వినవచ్చునట్లు మేఘధ్వనివంటి ధ్వనితో నసమానమైన మేలునకు నంతోషమునకుఁ గారణమై మిగులగీర్తి కరములైన పలుకు లిట్లు చెప్పెను.

కం॥ కడుపునఁ బుట్టినబిడ్డల, వడువున నాపూర్వు లెల్ల•వసుధాప్రజలన్
　దడవుగ రక్షించిరి కడు, విడి నిది మీ కెల్లరకును•విదితంబె కదా?　　౪౧

ఇఁక దశరథునుపన్యాసము చెప్పఁబడుచున్నది.

ఆర్యులారా? మా పూర్వులెల్లరు భూజనులను దమ కడుపునఁబుట్టిన బిడ్డలఁ దండ్రులు రక్షించు రీతి దీర్ఘకాలము రక్షించిరి. ఇది మీకు సందఱకుఁ దెలిసిన విషయమేకదా.

తే॥ అట్టి యిక్ష్వాకుకులమునఁ♦బుట్టి నట్టి,యేను బూర్వులు పాలింప♦నెసఁగిసౌఖ్య
మునకు నర్హంబునౌజగం♦బునకు మిగుల,
శ్రేయమునుగూర్పయోజన♦సేయువాఁడ.

అట్టి యిక్ష్వాకువంశమునఁ బుట్టిననేను బూర్వులు పరిపాలింపఁగా వృద్ధి చెంది సుఖపడ నర్హమైన జగజ్జనంబునకు మిగుల శ్రేయస్కరమైన కార్యము నొకటిచేయ నాలోచించుచున్నాఁడను.

కం॥ పెద్దలు నడచినత్రోవన, తద్దయు హెచ్చరికతో య♦థాశక్తిగ నేఁ
బద్దుగ రక్షించితిఁ బ్రజ, సిద్దియు మీమానసములఁ♦తెలుకయ కాదే. ౪౩

మా పెద్దలే ప్రకారము ప్రజలకు హితమైనమార్గమున నడచిరో యామార్గమునందే నేనును మిగుల హెచ్చరికతోఁ బ్రమాదములేక శక్తివంచనములేక ప్రజలను రక్షించితిని. ఇదియును మీమనస్సులకుఁ దెలిసిన విషయమేకదా.

కం॥ భూతలహితముం జల్పఁగ, నేతరుణమునందుఁ గోరు♦నీమే నిట్టుల్
శ్వేతచ్ఛత్రమునీడను, ఖ్యాతిగ దుర్భరజరైక♦కలితం బయ్యెన్. ౪౪

ఏ సమయమందును భూమిజనులకందఱకు మేలేచేయవలయునని కోరుచుండు నీదేహము మీరిప్పుడు చూచురీతిగాఁ దెల్లగొడుగు నీడయందే యందఱకుఁదెలియునట్లు భరింపరాని వార్ధకముతోఁ గూడినదయ్యెను; (నీడయందే పెరుఁగుచెట్లు వేగముగఁ దెల్లపాఱునట్లు నేనును శ్వేతచ్ఛత్రము నీడచే నిట్లైతినని భావము.)

కం॥ అఱువదివే లేఁడులు నా,కఱగొఱ లేకుండఁ గడచె♦సంగంబును నొ
టఱియెను, దెఱపును మఱపును,
వఱలకమును హోయి నుండ♦వాంఛ జనించెన్. ౪౫

నాకఱువదివేల సంవత్సరములు కొఱఁతలేకుండఁ గడచెను. దేహము దుర్బలమయ్యెను. ఎఱుకమఱపులు ప్రారంభించి కర్తవ్యము మఱచుట యొకటిచేయఁబోయి మఱియొకటిచేయుట యిట్టిస్థితి దాపరింపకముందే యీభారమును వదలించుకొని సుఖపడఁ గోరెదను.

ఉ॥ ఎంతయు ధైర్యశౌర్యములు♦నేపుఁ గలాఁడు, జితేంద్రియుండు, దు
ర్దాంతవసుంధరాభరణ♦దార్ఢ్యయుతుండును, ధర్మశీలుఁ, డే
కాంతము దాల్పఁగా దగిన♦గాఢభరంబును మోచి మోచి వి
శ్రాంతికి నాస చేసితిఁ, డి♦రంబుగ నాకు ననుజ్ఞ నీయరే. ౪౬

ఏవిధముగ సుఖపడఁ దలఁచితివందురేమో నాయాలోచన చెప్పెద వినుఁడు. మిక్కిలి ధైర్యము శౌర్యము పరాక్రమము గలవాఁడును ఇంద్రియనిగ్రహము గలవాఁడును, మోయ మిగులఁ గష్టమైన యీ భూభారమును

మోయఁగల దార్ఢ్యము గలవాఁడును. ధర్మస్వభావము గలవాఁడును నగువాఁ డేకచిత్తముతో భరింపవలసిన యీ యధికభారమును దీర్ఘకాలము మోచిమోచి యిఁకభారము దొలఁగించుకొని యిన్ని దినములు కష్టించిన గాసిపాయ స్థిరముగ సుఖపడవలయునని యాసపడుచున్నాను. నాకు మీరందఱు నన్నుజ్ఞ యీయఁ బ్రార్థించెదను.

ఉ॥ ఇచ్చటఁ జేరి యుండెడిద్వి•జేంద్రుల కందఱ కిష్టమేని, మీ
రిచ్ఛగ నొనటం చనెద•రేని, మదాదిమపుత్త్రు రామునిన్
బ్రచ్ఛుఱ ధూతశాత్త్రవుఁ, బు•రందరసన్నిభు, ధార్మి కాగ్రణిన్,
సచ్చరితున్, మహామహుని,•సర్వగుణంబుల మత్సమానునిన్. ౪౭

అటైన రాజ్యముగతియేమి? ప్రజలనందఱ నేమిచేసి పోయెద వందురేమో? నాకుఁదోఁచినంతలో దానికిఁ దగిన యేర్పాటు చెప్పెదను. మీకిష్టముండిన దానిని మీ రంగీకరింపవచ్చును. అది యేదందురా? ఇచ్చటనుండెడి ద్విజుల కందఱకు సమ్మతమైనయెడల, మీరందఱు నేకవాక్యముగ నిండుమనస్సుతో నంగీకరించి సరియనెదరేని నాకుఁ బెద్దకొడుకును శత్రువుల జయించినవాఁడును-ఇంద్రునితో సమానుఁడును ధర్మాత్ములందు శ్రేష్ఠుఁడును సదాచారసంపన్నుఁడును,గొప్ప మహిమగలవాఁడునునన్నిగుణంబులయందు నాతో సమానుఁడును.

తే॥ పుష్యమునుగూడి యున్నట్టి•పూర్ణచంద్రు
చందమున నేను యౌవరా•జ్యంబు రాము
ధర్మభృద్వరు నరసింహు•శర్మయుక్తిఁ
బూన్పఁదలఁచితి మీచిత్త•ముల నెఱింగి. ౪౮

విల్లువట్టెడువారిలో శ్రేష్ఠుఁడును పురుషసింహుఁడును నగు రాముని పుష్యనక్షత్రము పున్నమతోఁగూడినట్లు మీయభిప్రాయ మెఱింగి యువరాజుగాఁ జేయఁదలఁచినాఁడను.

తే॥ నాథుఁ డగువేనిచేతను•నాథవత్త్,రం బగుచు ముజ్జగంబులేన్•రమణమీఱు
నట్టి శ్రీమంతుఁ డౌలక్ష్మ•ణాగ్రజుండు,జగతికనురూపవిభుఁడౌట•దగునకాదె!

నాయల్పరాజ్యమేకాదు. ఎవఁడు నాథుఁడుగ నైనచో మూఁడులోకంబులును నాథుఁడు గలవానిలో శ్రేష్ఠములగుచున్నవో యట్టి శ్రీమంతుఁడును లక్ష్మణున కన్నయునగు రాముఁడు భూమికిఁదగిన భర్తయగుట యర్హమేకదా. (మూఁడులోకములనైన నేలఁగలవాఁడీభూలోకములో నొకమూలలో నొకభాగమైన దీని నేలఁ జాలఁడా యని భావము.)

కం॥ ఇప్పుడ యీభూభారము, నెప్పరమున రామునందు•నిలిపి ధరణి కీ
గొప్పగుశ్రేయముఁ గూరిచి, తప్పుట భారంబు నేను•దద్దసుఖింతున్. ౫౦
నెప్పరము=వేగము. రూ. నెప్పళము.

ఇట్లిప్పుడు చేయఁదలఁచినా వందురేమో. ఇఁక నెప్పుడోకాదు. ఇప్పుడే మీసమ్మతి తెలుపుటే యాలస్యము. శీఘ్రముగ నీభూభారము శ్రీరామచంద్రు నందు నలిపి భూప్రజలకు నీమేలు సమకూర్చి భారము దొలఁగిపోవుటచేనేనును సుఖపడెదను.

కం॥ అనువగు ప్రయోజనంబిది,యొనరించున యేని,మంచి॥యోజనయిదియేస్
గొనసాగించుట యెటు లో,యనుమతిని నొసంగుఁడీ మ॥హాజనులారా! ౨౧

ఇప్పుడు నేను జెప్పిన యాలోచన ప్రయోజనపడునని, మీకు మేలు కలిగించు నాలోచనయని, మీకుఁదోఁచెనేని యీ యాలోచన కార్యముగఁ బర్య వసించుటెటులో మహాజనులారా! యట్టి విధానమును ననుమతింపుఁడు.

కం॥ ఇంతకు లెస్సయుఁ గలిగినఁ జింతింపుఁడ, యంటిఁ బ్రేమ॥చేత,స్వజనతా
చింతకుఁ గడమే లగు నడు,మంతరపున్వారు హితము॥నాలోచింపన్.౨౨

ఒకవేళ మీకునాయాలోచన సరిపడదాయెనా యింతకు మేలైన యాలోచన దెలుపుఁడు. నేను జెప్పితిని గావున నీయన జెప్పినది యంగీకరింపకుండిన నేమి నొచ్చుకొనునో యని మీరు తలంపవలదు. నాకొడుకు గావునఁ బుత్ర వాత్సల్యముచే నంటిని. వాని రాజ్యమున సుఖపడవలసినవారు మీరుగాని నేను గాను-అదియును గాక కార్యాలోచనములం దైనవారి యాలోచన పక్షపాత ముతోఁ గూడియుండును మధ్యవర్తుల యలోచన మేలై యుండును - కేవల ముదాసీన మనుష్యుల యాలోచన పనికిరాదు. వారుపేక్షచే నేదియెట్లయినమన కేమి యని యేదో యొకటి నోటికివచ్చినట్లు చెప్పెదురు. అట్టియాలోచన కొఱ గాదు. కావున రామపక్షపాతమున నేను జెప్పునాలోచనకంటె మధ్యవర్తులయిన మీ యాలోచన మేలై యుండును.

చం॥ అని జనపాలుఁ డాడిన మ॥హాముద మంది నృపాళి వర్షమున్
నినుచుఘనంబుఁ గాంచి భువి॥నిండఁగఁ గేకలు వైచు నెమ్మిపిం
డెనయఁగ మేలు మే లనుచు॥నెంతయు మెచ్చురవంబుపేర్మిఁ గం
పనమును గాంచెఁ దత్సభయు॥బాఢముగాఁ బ్రతిశబ్ద మిచ్చుచున్. ౨౩

ఘనంబు=మేఘము.

తాత్పర్యము

అని దశరథుఁడు చెప్పఁగా రాజులందఱు మిగుల సంతోషించినవారై మంచి వర్షము గురియింప సిద్ధముగనుండు మేఘమును గాంచి భూమినిండఁ గేకలువైచు నెమిళ్ళగుంపువలె మేలుమేలు బాగుబాగు అని దశరథుని శ్లాఘించు ధ్వనిచే సభామంటపము ప్రతిధ్వని యిచ్చుచు వడఁకెను.

—• పౌరులు శ్రీరాముఁడు యువరాజగుటకు సమ్మతించుట. •—

తే॥ అంత ధర్మార్థవిదుఁ డైన•యవనినాథు,
వాక్యముల విని బ్రాహ్మణ•వరులు పౌర
జానపదులునుగూడి యో•జన యొనర్చి,
యిట్టు లని రేకమతు లయి•వృద్ధనృపతి. ౨౪

దశరథుఁ డీ ప్రకారము చెప్పఁగా విన్నవారై బ్రాహ్మణశ్రేష్ఠులును బౌరులును గ్రామజనులును నందఱు గలసి మాటలాడి యాలోచించి యేకాభిప్రాయులై ముసలి రాజుతో నిట్లనిరి.

కం॥ ఏఁడులు పూఁడు లవెన్నియొ, ఱే డా! వేవేలు చనె మ•ఱిన్ వృద్ధుఁడవున్
వేఁడెదము రామచంద్రుని, బోఁడిమి యువరాజుఁ జేయ•భూతలమునకున్

ఏఁడులు పూఁడులు=అనేక సంవత్సరములు, వేవేలు = వేలకొలఁదులు- మఱిన్=అదియునుగాక-మఱియును=ఇందు 'యు' లోపింపఁగా మ 'మఱిను' అయి 'ను' మీఁది యచ్చులోపింప 'మఱిన్' అయ్యెను.

తాత్పర్యము

రాజా! నీవెన్నియో వేలసంవత్సరములు రాజ్యము పాలించితివి-ముసలివాఁడవైతివి కావున రాజ్యపాలనమునకై శ్రీరామచంద్రుని యువరాజుఁజేయఁ గోరెదము.

కం॥ కోరుదుము మహాబాహుని, శ్రీరఘువరు భూరిబలుని•శ్రీరాముఁ గనన్
వారణయూథాధిపయా,నారోహణు ఛత్రసంవృ•తాననకమలున్. ౨౬

మహాబాహునిన్ = అజానువులైనబాహువులు గలవానిని-ఇది మహాపురుష లక్షణము. శ్రీరఘువరున్=సంపద్యుక్తుఁడై రఘువంశమున నింతవఱకుఁ బుట్టినవారిలో శ్రేష్ఠుని-భూరి బలునిన్=మహాబలము గలవానిని, శ్రీరామున్= లక్ష్మీవిశిష్టుఁడైన రాముని, వారణ యూథాధిప యానారోహణున్-శ్రేష్ఠమైన యేనుఁగుపై నెక్కిన వానిని, ఛత్రసంవృతాననకమలున్ =శ్వేతచ్ఛత్రముచేఁ గప్పఁబడిన ముఖకమలము గలవానినిగాఁ జూడఁగోరెదము.

మహాబాహుని=రఘువీరుని-మహాబలుని- పట్టపు టేనుఁగుపై నెక్కి శ్వేతచ్ఛత్రము నీడచే విలసిల్లు ముఖారవిందముగల రామచంద్రమూర్తినిఁ జూడఁ గోరెదము-అని చెప్పుటచే శ్రీరామచంద్రుఁడు రాజ్యమేలుటవలనఁ గలుగు విశేష సుఖభోగముల కాశపడి మేము శ్రీరాముని రాజుగాఁజేయుమని కోరలేదు పట్టాభిషిక్తుఁడై పట్టపుటేనుఁగునెక్కి శ్వేతచ్ఛత్రము నీడను రాఁగా నాయన సౌందర్య విశేషముఁజూడ నభిలాషగలవారమై కోరుచున్నామని భావము.అటైన మీరు శ్రీరాముని సౌందర్య దర్శనమునఁ గలుగు నానంద మనుభవింపఁగోరితిరే కాని రాజ్యపరిపాలనార్హత గలవాఁడని కాదుగదా యని దశరథుఁడేను నేమో యని,మహాబాహున్=నీరాజ్యమంతయు నాయనకొక చేతికిఁ జాలదు.నీరాజ్యము

దక్షిణ సముద్రమున సగమువఱకే అవల నీకు రాజ్యము లేదు. అది లంకా రాజ్యము. రామచంద్రమూర్తి మహాబాహుఁడు కావున దానినిగూడ నేలఁ గలఁడు కదా. సుందరకాండమందు హనుమంతుఁడు సురసతో "రాముని యాజ్ఞఁ బోయెదను। రాముని రాజ్యమునందు నుండుటన్। రామరో నీకునున్ దగవురాముని కార్యముఁదీర్ప" నని చెప్పెను గావున సముద్రమధ్యము వఱకు నిక్ష్వాకు రాజ్యమే.

మహాబాహున్-అజానులంబములైన బాహువులవాఁడు అని చెప్పుటచే నాయన బాహువులు చూడఁగానే యీాయన మహాపురుషుఁడని యెట్టివారికిఁ దోఁచుచుండఁగా నాయన రాజ్యపరిపాలన శక్తియందు సందేహమెట్లు గలుగఁ గలదు. అప్రాకృత నిత్యవిభూతిని-ప్రాకృత లీలావిభూతిని రెంటిని బాలింపఁ గలదికదా యీాయనబాహువు-మహాబాహున్-దుష్టుల శిక్షించునని-శిష్టులరక్షించు నని బాహువులేకదా? ఆరెండేకదా రాజకృత్యములు కావున బాహుప్రశంస. అయోధ్య ౧౫౫౪వ పద్యము చూచునది,

శ్రీమహాబాహునిన్='బాహుచ్ఛాయామవష్టభ్య' యని చెప్పినట్లు మమ్మును రక్షింప నాయన భుజములనీడయే చాలును. ఆనీడ నున్నంతమాత్రముననే యెండవడఁబడినవాఁడు చెట్లనీడసుఖించినట్లు సంసారతాప పీడితులమగు మేము సుఖింతుము ఇచ్చట నీశ్లోకము ననుసంధించునది. శ్లో॥ ధ్యానాభ్యాసవశీకృతేన మనసా యన్నిర్గుణం నిష్క్రియం। తేజః కశ్చన యోగినోయది పరంపశ్యంతి పశ్యంతుతే। అస్మాకంతు తదేవ లోకవ చమత్కారాయ భూయాచ్చిరం కాళిందీ పులినేషు యత్కిమపి తన్నీలమ్మహోధావతి॥ ధ్యానాభ్యాస బలమున మనస్సును వశపఱచికొని యోగులు తమ హృదయమందుండు జ్యోతిని జూచినఁ జూతురుగాక దానితో మాకుఁబనిలేదు మాదృష్టికి యమునానదీ తీరమం దిసుకదిబ్బలమీదఁ బరుగెత్తుచుండినవాని నల్లనిఛాయ గోచరించినఁ జాలును. మధుసూదన సరస్వతి.

మూర్తినంతయుఁ జెప్పక బాహువుమాత్రలుఁ జెప్పనేలఁ యనిన గోటఁ బోవుపనికి గొడ్డలి కావలయునా? అదియునుగాక "రరక్షధర్మేణ బలేనచైవ" ధర్మముచేతను బలముచేతను రక్షించె నన్నట్లు రాముని భుజమందు ధర్మ బలముకూడఁగలదని సూచించుటకే-శ్రీరఘువరున్=సంపదతోఁగూడిన రఘు వంశమువారిలో గొప్పవానిని 'దీనాన్దానేన రాఘవః' దీనులను దానముచే రక్షించువాఁడు రాఘవుఁ డన్నట్లు రఘువంశమునఁ బుట్టినవారు దీనరక్షణ మందుఁ బ్రసిద్ధులు అట్టివారిలో నుత్తముఁడు శ్రీరామచంద్రమూర్తి-దీనరక్షణ మనఁగా కష్టమును తత్కాలమున నుపశమింపజేసి పంపుటకాదు.

'అనృశంస్యం పరోధర్మ' యన్నట్టు లట్టికష్టమునకు వారు మరలవశపడకుండునట్లు సదుపాయము పరుల కుపదేశించినఁగాని యారక్షణము పూర్తిగాదు. కావున మరల నట్టికష్టమునకుఁ బాలుపడకుండ రక్షించువాఁడు రామచంద్రమూర్తి.

రఘువరున్=ధర్మబుద్ధియందు రఘుమహారాజుకన్నను శ్రేష్ఠుని- ఆఁకలిగొన్నవానిని జంపిన నీకుఁబాపముఁరాదా యనియొకఁడడుగ రఘు వూరకుండెను. రాముని స్వభావమన్ననో యట్టిదిగాదు. 'అప్యహం జీవితం జహ్యామ్' ఆశ్రితరక్షణము నిమిత్తమై ప్రాణమైన నిచ్చెదనని చెప్పినవాఁడు రామచంద్రమూర్తి, భూరిబలునిన్=దృఢమగు మనోబలముగలవానిని 'సకృదేవ ప్రపన్నాయ' 'సహి ప్రతిజ్ఞాం సంశ్రుత్య' ప్రతిజ్ఞచేసి తప్పువాఁడను గాను 'సత్యజేయం' ఆశ్రయించినవానిని వదలువాఁడనుగాను. ఏతద్వ్రతంమమ' ఇది నావ్రతము. అని యిట్టి మనోబలముగలవాఁడు, రామచంద్రమూర్తి.

వారణ... ...రోహణున్=పట్టాభిషిక్తుఁడయిన రామునిఁ జూడఁగోరినవారు సభామండపమున సింహాసనాసీనుఁడైనపుడు చూడవచ్చునుగదా యనిన నట్లుగాదు. తనసుందర గంభీరవిలాసగమనమును తనపట్టపుటేనుఁగు శత్రుంజయమునకు నేర్పుచున్నాఁడాయనునట్లు దానిపై హాయలుమీఱఁ గూర్చుండి శ్వేతచ్ఛత్రము పట్టించుకొని పురవీథులవెంట వచ్చినపుడు "ఏకస్స్వాదునభుంజీత" మధురాహార మొక్కఁడే తినరాదను న్యాయ మనుసరించి మేము మాదారపుత్రమిత్రబంధువర్గములతోడ నింటింటివాకిట దర్శించి యానందానుభవమునఁ గృతార్థుల మగుదుము అని భావము. జ్ఞాని తా నొక్కఁడే తరించును. భక్తుఁడిష్టశిష్టజనులతోఁ దరించును.

ఛత్ర........కమలున్=ఛత్రము మఱుఁగు లేకుండినఁగదా మీకుఁ జక్కని దర్శన మబ్బును అట్లెప్పుడైన వచ్చినపుడు దర్శింపరాదా యనిన నప్పటి సౌందర్యమప్పుడేకాని పట్టాభిషేకమునాఁటి సౌందర్యము తక్కిన దినములలో వచ్చునా? పెండ్లికొడుకునాఁటివేషము రూపము ఆవలవచ్చునా? అట్టులేకదా యిదియును. ఇదియొక జన్మమున నొకనాఁటికార్యమే. ఛత్రము మఱుఁగు కొంచెముగా నుండవలసినదే. ఏలన: మా రాముని దివ్యసుందర విగ్రహపూర్ణసౌందర్యమును చెడుదృష్టిగలవారు చూచిన నేమైనఁ గీడు కలుగునేమో యని మాకు భయము. ఆసక్తిగల వారము మేము మాయిండ్లయొద్దకు వచ్చినపుడు హారతులిచ్చి పూర్ణముగ దర్శించి కృతార్థుల మగుదుము. చెడుదృష్టివలనికీడు తొలఁగిపోవ నింటింటి వాకిట కర్పూర నీరాజన మిచ్చెదము. ఆనెపమున మేము సకుటుంబముగా శ్రీరామచంద్రమూర్తిని సమీపించి కన్నులు కఱవుదీఱవీక్షించి కృతార్థుల మయ్యెదము. సింహాసనమున నున్నప్పుడు చూచిన మాకీ సౌకర్యసౌభాగ్యసంతోష సాహిత్యము లభించునా?

అదియునుగాక గొడుగునీడను గొంతకనఁబడి కొంతకనఁబడకయుండినఁబూర్ణముగఁ జూడవలయునని చూపఱు కోరిక యుప్పొంగారుచు మఱిమఱి దర్శించి

యానందింతురు. అదియునుగాక రాముఁ డతి సుకుమారగాత్రుఁడు. గొడుగు నీడ లేకున్న అట్టివానిముఖ మెండకు గాలికి వసివాళ్లువాఁడునేమో. అట్టులు గాకుండ నిపుడు రాముని యంతరంగ స్నేహితులే భూచక్రవాళ మనుగొడుగును జాగ్రత్తగఁ బట్టుటచే వారును ధన్యులగుదురు.తక్కినవేళ నైభృత్యుఁడో పట్టును.

ఒక పాశ్చాత్యుఁడు ఏకచ్ఛత్రాధిపత్యమున కర్థము వ్రాయుచుఁ బూర్వము హిందూరాజుల కాలములో రాజొకఁడే గొడుగు పట్టుకొనుచుండెను గాని రాజు తప్ప జనులెవ్వరు గొడుగు పట్టరాదని వ్రాసెను. అజ్ఞానపరిణామ పరిణాహ విజృంభణ మింతకన్న మఱియొండుగలదా అదియునుగాక "ఏకచ్ఛత్రాం మహీంభుంక్తే యని సాముద్రికమునఁ జెప్పియున్నట్లు మిట్టపల్లములులేక సమమై గుండ్రమై విశాలమైన శిరస్సీయనకుఁ గలదని సూచించునదియు తన నిరంకుశాధికారముచేత నితరరాజుల నీయన తనకు వశపఱచుకొన్నాఁడని తెలుపఁగలదియు నగు తెల్లగొడుగు నితనిముఖముపైఁబట్టఁగా నందుఁ బర భాగ కాంతిగలిగి వెలయుచున్న ముఖముగలవానిని రాముని, కనఁగోరెదము- ఇట్టి పట్టాభిషేక మహోత్సవాలంకారముతో నున్న రామునిఁ జూడఁగోరెదము- పుట్టువుచేతనే రాముఁడు-అందుఁ గుణాభిరాముఁడు-అందుఁ బట్టాభిషేక సౌంద ర్యాభిరాముఁడు నగు జనమనో రాముని జూడఁగోరెదము. ఆహా యేమి మా పూర్వపుణ్యవిశేషము-అట్టి పుణ్యవిశేషఫలమును మాకుఁ గలిగింపుము.

కనన్ గోరుదుము=మేము గోరునది దర్శనము మాత్రమే-రాజులు పట్టాభిషేకము చేసికొనునపుడు ప్రజలకుఁ బన్నులు తోసివేయుటలోనగు మేలు చేయుటకలదు-అట్టిలాభము మేము కోరము. మేము కోరునది దర్శనలాభమే- దానిని నీవు కలిగింపఁ గోరెదము- అంతమాత్రము నీవు చేసినఁజాలును.ఆయన ముఖారవింద దర్శనమే మాకుఁ బూర్ణ బ్రహ్మానందదాయకమైయుండ క్షుద్ర లాభముల మేమాశింతుమా?

కోరుదుము=ఇది మాకోరిక-మాయధీనమందుండునది యింతమాత్రమే- కార్యము చేయవలసిన వాఁడవు నీవేకదా.

కోరుదుము=మాకేమూ యిట్టియాశ మిక్కుటమైయున్నది - శ్రేయాంసి బహువిఘ్నాని మంచికార్యములకు విఘ్నములు మెండు. గొంతెమ్మకోరిక చేసె దవో యేమో ఇది నీవు మానోటిమాట దీసికొని మమ్ము మాటమాత్రము చేతనే సంతోషపెట్టెదవో లేక నిజముగాఁ గార్యము నెఱవేర్చి సంతోషపెట్టెదవో - ఎట్టులైనఁ జేయుము మాకోరిక యిది. ఏలయంతాశ మీకందువా? అందమైన వస్తువు చూచినపుడు దానియందాశ కలుగక మానదు.ప్రేమగలవారు శ్రేయస్సు గోరక దేనిని గోరుదురు? ఇందు శ్రేయస్సు రామునకు మాత్రమే కాదు. మాకును నీకును గలదు. మఱియును మీకింతయాశ నిజముగా నుండిన

నిన్నాళ్లు నాతో నేలచెప్పలేదు. నాయందు విశ్వాసము లేకగదా యందువేమో. అట్లుకాదు నీవు మాకు సర్వవిధముల రక్షకుఁడవే. మాకొంక నీతోఁ జెప్పవలసి నది మాకు విధియైనను నీప్రభుత్వము మఱియొకని కిమ్మని కోరిన నీవేమి తలం తువో. నాప్రభుత్వముః వీరికి సరిపడ లేదని దురభిప్రాయపడెదవేమో యని భయపడుచుంటిమి. ఇప్పుడు నీవే యావిషయము ప్రస్తావించుటచే మేము దానినే కోరుచున్నాము.

కోరుదుము అను బహువచన ప్రయోగముచే నీ విషయమున మేమందఱ మేకగ్రీవముగఁ జెప్పుచున్నారమనియు మాలో నభిప్రాయభేదము లవమైన లేదనియు భావము. ఇది నిజమని నేనెట్లు నమ్మెదు నందువా "ఇంగిత జ్ఞాశ్చ రాఘవా"యన్నట్లు మాముఖనయన వికాస కంఠధ్వనులచేతనే నీవు గ్రహించి యుండవచ్చును. నీయభిప్రాయము నీవు తెలుపఁగానే (౨౩-వ పద్యము) ఎంతయు మెచ్చురవంబుపేర్మిఁ గంపనమును నొందెఁ దత్సభయు బాఢముగాఁ బ్రతిశబ్దమిచ్చుచున్-అన్నట్లు-సభామంటపమంతయు రాజునెదుట నిట్లు ధ్వనింప వచ్చునా యను మట్టుమర్యాద లోఁ దలఁపని సభాసదుల శ్లాఘారవంబున నెట్లు సభామంటపము గడగడలాడెనో తెలియదా. నిన్ను మెచ్చనివాఁ డొకఁడైన నిందుఁగలఁడా? అదియునుగాక "లోకపాలోప మునిఁగోరెఁ బ్రాకటముగ వసు మతీకాంత తనకూర్చు వల్లభునిఁగ" నని యిట్లు పూర్వమే మాయభిప్రాయమే గాక సమస్త ధరాప్రజల యభిప్రాయమునై యున్నది. మాయభిప్రాయమన నేల భూకాంతయే రాముని స్వయముగ వరించెను. నేను ధరాపతినుండ నన్ను విడిచి వేఱొకని నెట్లువరించును? భూమిపాంసులగదా కామిని వయస్సువాని వలచినట్లు ముసలివానిని వలచునా? అదియునుగాక రాముఁడు లోకపాలోప ముఁడు. లోకపాలుఁడు విష్ణువేకాని యితరులుకారు. ఇతరులయం దా పదము గౌణముగ నన్వయించును గావునఁ దనభర్తను దాను వరించుట న్యాయ్యమే కదా. హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌయని శ్రీభూదేవు లిరువురు విష్ణుభార్యలే అందు శ్రీ దేవి సీత ముందుగా వరించెను. ఇపుడు భూదేవి వరింపక మానునా?

తాత్పర్యము

రాజా! యాజానుదీర్ఘ బాహుండును శ్రీమంతమైన రఘువంశమునఁ బుట్టిన వారిలో శ్రేష్ఠుఁడును గొప్ప దేహబల మనోబలములందు నసమానుఁడు నగు శ్రీరాముఁడు శత్రుంజయమను పట్టపుటేనుఁగుపై నెక్కి శ్వేతచ్ఛత్రము నీడలోరాఁగా మేమందఱముఁ గన్నారఁ జూడఁ గోరుచున్నారము.

కం॥ అని వారెల్లరుఁ బలికిన, విని వారిమనఃప్రియంబు•విధ మెఱుఁగఁగ నే
మిని దెలియనివానివలెన్, జనపాలకుఁ డనియె నెల్ల•జనములఁ గనుచున్.

ఏమిని=ఏమియును-ఇందు 'యు' లోపించి 'ను' వర్ణముమీఁది ఉవర్ణము నకు ఇ వర్ణము రాఁగా ఏమని యనియయ్యె.

తాత్పర్యము

ఈప్రకారము సభయందలి ప్రముఖులందఱు నేకవాక్యముగఁ దెలుపఁగా వారి మనస్సునందలి ప్రియమెంతమాత్రమో యది రామునియందలి ప్రీత్యతిశయముచేఁ జెప్పఁబడెనా లేక తనయందలి యప్రీతిచే రాముఁడు కోరఁబడెనా యని పూర్ణముగఁ దెలియఁగోరి యేమియుఁ దెలియనివానివలెనే యా సభ్యులనెల్లఁ జూచి దశరథుఁ డిట్లని యడిగెను.

కం॥ జనపతులారా! నానుడి, వినివినకయమున్న రాముఁ విభుఁ గోరితి రే
మన మీతమకముఁ జూడఁగ, ననుమానం బయ్యె నిశ్చయం బాడరయా

జనపతులారా=రాజులారా! నానుడి=నామాట, ఏమనన్=నేనేమని యందును, మీతమకము=మీకాంక్ష-తొందరపాటు.

తాత్పర్యము

రాజులారా! రాముని యువరాజు జేసెదనని నామాట నానోర వెడలెనో లేదో మీరు దానిని పూర్ణముగ వినివినకముందే రాముఁడు ప్రభువుగా నుండఁ గోరితిరి. మీతత్తఱపాటు-మీకాంక్షచూడ నన్నేదియో సందేహము బాధించుచున్నది. మీవాస్తవాభిప్రాయముఁ దెలుపుఁడు. మీరు భయపడవక్కఱలేదు. నా పరిపాలనమందు మీకేదైన లోపము గలిగి యది తొలఁగిపోయిన మేలని తలఁచుచున్నారా? లేక రామునియందలి ప్రేమాతిశయముచేతనా? నిజము చెప్పఁడు

కం॥ లేనో? ధర్మాత్ముఁడ నేఁ, గానో? ప్రజ కెల్ల సుఖముఁ గల్పింపనొ? నేఁ
బోనో మీమతి? మీరే, లా నాసుతు రాజుఁ జేయఁ లాలసపడఁగన్? ౨౯

తన యభిప్రాయమును సర్వజను లామోదించుటయే కాక యావిషయమందు వారికిఁగలయాశ వేగిరపాటుచూచి తనకోరిక సంపూర్ణముగ ఫలించెనని లోలోన నుప్పొంగుచు దానిని వెలికిఁ దెలియనీక రామునివిషయమున జనాభిప్రాయము పూర్ణముగ విని యానందింపఁగోరి మరల మరల నిట్లు దశరథుఁడు ప్రశించుచున్నాఁడు.

తాత్పర్యము

నే నింకను జీవించియున్నానుగదా. ధర్మపద్ధతిని బ్రజలఁ బాలించుటయందు నాకు మనస్సులేదా? ప్రజలకు సుఖము నేను గలిగించుటలేదా? మీ యభిప్రాయ ప్రకారము నేను నడచుకొనుటలేదా? ఏల నాకంటెఁ జిన్నవాఁడై రాజ్యపాలనమందనుభవములేని నా కుమారుఁడు రాజుగావలయునని యంత యత్యాశపడుచున్నారు. నాయందు మీకుఁ బ్రీతివిశ్వాసము లుండెనేని నీకుమారుఁ డెప్పటికైన రాజగువాఁడే అయనకేమి తొందరవచ్చెను. నీవే యింకను గొంతకాలము రాజుగా నుండుమని చెప్పక యిట్లు చెప్పుట కేమి కారణము. నేను మీకేమి ద్రోహము చేసితిని?

—◆ పౌరులు శ్రీరాముని గుణములు వర్ణించుట. ◆—

సీ॥ అనుచు మహాత్ముఁ డా◆డిన విని వారెల్ల, నొక్కమాటగ నిట్టు◆లూఁది యనిరి
భూపాల! దేవక◆ల్పుండు రాముని యందుఁ, గల్యాణగుణములు◆గలవు పెక్కు
లానందకరము ల◆య్యవి ముచ్చటింతుము, వినవయ్య వీనుల◆విందు గాఁగ
సత్యశౌర్యుఁడు రామ◆చంద్రుండు దివ్యగు,
ణంబులఁ బురుడు స్వ◆ర్నాయకునకు
తే॥ మేటి యిక్ష్వాకులం దెల్ల◆మేలుబంతి, రాముఁ డార్జవధర్మప◆రాయణుండు
లోకమున సర్వవినుతసు◆శ్లోకుఁ డతఁడె,
రామువలన జనించె ధ◆ర్మంబు సిరియు. ౬౦

భూపాల అనుటచే నీవు రాజ్యము చక్కఁగనే చేయుచున్నావని భావము. ఊఁది=ఒత్తి, దేవకల్పుఁడు=విష్ణువుతో సమానుఁడు◆సత్యశౌర్యుఁడు. సత్యమే శౌర్యముగాఁగలవాఁడు కావున నాయన సత్యము చేతనే భుజబలముతోఁ బనిలేక లోకముల జయించువాఁడు. వంచనలేని శౌర్యముగలవాఁడు. న్యాయ్య యుద్ధమందు ధర్మప్రకారము తనశౌర్యము చూపునేకాని యెట్లైన గెలువ వలయునని యధర్మము నాశ్రయింపఁడు. రామచంద్రుఁడు=చంద్రుఁ డేప్రకారము సమస్త భూతకోటులను పశుపక్ష్యాదులను సైతము సంతోషింపఁజేయునో యంతకు మించి యన్ని జీవకోటులను పక్షివృక్షాదులను గూడ సంతోషింపఁ జేయువాఁడై చంద్రునికంటె నభిరాముఁడైనవాఁడు. దివ్యగుణంబులన్= అప్రాకృతములైన భగవద్గుణంబులయందు, స్వర్నాయకునకు=వైకుంఠాధిపతియగు నారాయణునకు-పురుడు=సమానుఁడు-స్వర్ శబ్దము వైకుంఠమందే ముఖ్యాన్వయము. దేవలోకమందు గౌణము స్వర్నాయకుఁడనఁగా నింద్రుఁడను నర్థము సరిగాదు. ఆయనయందు జారత్వ చోరత్వ కామదాసత్వ క్రోధ లోభ మోహాసూయా ద్వేషాది దుర్గుణములు పెక్కుగలవు. రాముఁడో కల్యాణ గుణధాముఁడు హేయగుణ రహితుఁడు. ఆర్జవము=చక్కని నడవడి-ధర్మము వీనికి-పరాయణుఁడు=పరమగతియైనవాఁడు, సర్వవినుతసుశ్లోకుఁడు=సమస్త జనులచే స్తోత్రము చేయఁబడు మంచికీర్తిగలవాఁడు. లోకమునం దెంతటి యుత్తమ పురుషునైనఁ దప్పులు పట్టనివారుండరు. రామునందట్లు చెప్పువాఁడు లేఁడు.

తాత్పర్యము

ప్రజల క్షేమముఁగోరు గొప్పమనస్సుగల దశరథుఁ డిట్లు చెప్పఁగా విని పండితులు పామరు లనుభేదములేక యెల్లవారు నొక్కమాటగ నీప్రకారము నొత్తిచెప్పిరి. రాజా! నీపాలనమందు లోపముండుటచే మేము రామునిఁ గోరినవారముగాము. భయలాభలోభ పక్షపాతలోల బుద్ధులమై చెప్పినవారము కాము దేవునితో సమానుఁడైన రామునందు నానందకరములగు ననేక కల్యాణ గుణములు గలవేగాని హేయగుణమొక్కటైన లేదు. నీకొడుకగుటచేత నీకాయన మహిమ తెలియక పోవచ్చును నీకుఁ దెలియదేని మేము చెప్పెదము.

చెవుల పండువుగ వినుము. అట్లుండిన నేల యింతవఱకు నాకుఁ జెప్పలేదందు వేమో. నీవడుగలేదు మేము చెప్పలేదు.అడిగినప్పుడు చెప్పిననే మాయందింత సందేహము గలవాఁడవేనడుగక చెప్పిన మఱియెంత సందేహింతువో. శ్రీరాము నకు సత్యమే శౌర్యము. శౌర్యసాధ్యములైన కార్యములుగూడ శౌర్యముతోఁ బనిలేక సత్యమువలననే యాయనకు నగుచుండును. శౌర్యము చూపవలసి వచ్చినప్పుడును సత్యము దప్పఁడు. చందురునికంటెను సుందరుఁడు. అప్రా కృత గుణములందు సాక్షాన్నారాయణునకు సముఁడు. ఇక్ష్వాకుఁడు మొద లాయన వంశమునఁ బుట్టినవారిలో గొప్పవారనిపించుకొన్నవారిలో శ్రేష్ఠుఁడు. ఆర్జవమునకు ధర్మమునకుఁ బరమగతి. లోకములో నెంత గొప్పవారైనను వారిని కొందఱుమాత్రమే పొగడుదురు. రాముని కీర్తియో వీరు వారనక శత్రులు మిత్రు లుదాసీనులనక యెల్లవారిచేతను బొగడిత కన్నది. ఇంతయేల ధర్మమునకు లక్ష్మికి జనస్థానమే రాముఁడు. రాముఁడే వాని కునికిపట్టు-రాము నాశ్రయించి యవి జీవించుచున్నవి-రాముఁడు లేకుండిన లోకమున ధర్మము లేదు-సిరిలేదు.

సీ॥ చంద్రునిరీతి ప్ర•జారంజనంబున, క్ష్మసాటి విమలక్ష•మాగుణమున
  ననుపమబుద్ధి బృ•హస్పతితుల్యుండు,విబుధేంద్రునకు జోడు•వీర్యమునను
  సకలధర్మజ్ఞుండు•సత్యసంధుండును, శీలవంతుఁ డసూయఁ•జేర నీఁడు
  అపరాధులకు నైన•నాదరంబునె చూపు, దుఃఖుల కూఱట•దోఁపఁబలుకుఁ
తే॥ గృతము మఱవండునిర్జించె•నింద్రియముల,
          మనను మెత్తన స్థిరమతి•మధురవాది
  నిజమరియు నాలకించెను•నిఖిల మార్య,
          వృద్ధసద్విప్రులను గొల్చి•విహితరీతి. ౬౯

క్ష్మ=భూమి, విబుధేంద్రుఁడు=ఇంద్రుఁడు-శీలవంతుఁడు = సదాచార సంపత్తి గలవాఁడు, మధురవాది=తియ్యనిపలుకులు పలుకువాఁడు, నిజమరి= నిజము చెప్పువాఁడు, విహితరీతిని=శాస్త్రోక్తపద్ధతిని, నిజము + అరి=నిజమరి అసూయ=పరుల గుణములందు దోషమెంచు గుణము-స్థిరమతి = గొప్పసంక టము వచ్చినను దానుజేయ నంగీకరించిన కార్యము దప్పక చేయువాఁడు.

మధురవాది నిజమరియున్=మధురముగ నుండిననే యథార్థవాదిగానిజనుల కహితమైన సత్యమును బాటింపఁడు. 'సత్యం బ్రూయా త్ప్రియం బ్రూయాత్ నబ్రూయాత్ సత్య మప్రియం। ప్రియంచ నా నృతంబ్రూయా, దేషధర్మస్స నాతన।" యనికదా ధర్మశాస్త్రము చెప్పుచున్నది. (2) నిజమరియున్=సత్యం వద=సత్యమే చెప్పుము అని శ్రుతి బోధించునట్లు నిజమే మాటలాడును. అస త్యము జనులకుఁబ్రియమైయున్నను మాటలాడఁడు.3)నిజముపరలోకహితమగు

నదృష్టము 'సత్యేనలోకాన్ జయతి' యనుచో సత్యశబ్దమున కీయర్థమే చెప్పఁబడెను గదా. నిజమరి=అట్టి నిజము గలవాఁడు. మధురవాదియైనను పరలోకమునకు విరోధమగు నిచ్చకములు చెప్పఁడు. మధురవాది=వేసవికాలమునమండు నెండల వేఁడిమికి మిగులఁ దపించిననేలపై నొక్క మేఘము వర్షించిననెంతచల్లపడునో యట్లు తాపత్రయములడఁగ మాటలాడువాఁడు ఇట్టి గుణములీయన కెట్లువచ్చెను. పుస్తకములు చదువుటచేతనా? ఎట్లువచ్చినను నణఁకువతోఁ గూడినవా? గర్వముతోఁ గూడినవా? ఇట్టి సందేహమునకు సమాధానము. ఆర్యవృద్ధవిప్రులను=ఆర్య=గొప్పవారగు- ఈగొప్పతనము వీరికివచ్చుటకు హేతువు వీరనేక గురువులయొద్ద ననేకశాస్త్రములు పెక్కుతడవలు శాస్త్రమర్యాద ననుసరించి పఠించుటచే ననియెఱుంగునది. వృద్ధ=వయస్సుచేతను, జ్ఞానముచేతను ముసలివారు. ఇటువంటివారగు సద్విప్రులను=సాత్త్వికులగు బ్రాహ్మణశ్రేష్ఠులను గొలిచి=సేవించి, బ్రాహ్మణులనని చెప్పుటచే ననేకశాస్త్రములఁ జదివి బ్రహ్మజ్ఞాన సంపన్ను లయిన క్షత్రియులున్నను, వారి నుపాసింపక యట్టి గుణములు గల బ్రాహ్మణులనే యుపాసించెనని భావము. తనకు సర్వముఁ దెలిసియున్నను నంతటితోఁ దృప్తినొందక యింకను,నెవరెవరి యొద్ద నేమేమి విశేషరహస్యము లున్నవో యవియును సంపాదింపవలెనని యట్టి బ్రాహ్మణుల నుపాసించెనని భావము. తేనెటీఁగలు పుష్పములనుండు తేనెలు గొంచెమైనను విడువక సర్వమును గ్రహించునట్లు తానును బ్రాహ్మణులయొద్దనుండు సర్వశాస్త్రసారమును గ్రహించెను. తమయొద్దఁజేరి శ్రద్ధతో గ్రహించువానికి సర్వాంశములు చెప్పువారుగదా జ్ఞానాధికులగు సద్బ్రాహ్మణులు, విహితరీతిఁగొల్చి=తాను రాజకుమారుఁడ నను నభిమానముచే వారిని దనయింటికి రమ్మనక తానేవారింటికిఁబోయి తద్విద్ధిప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయాయన్నట్లు నమస్కారసేవా ప్రశ్నపూర్వకముగా గ్రహించెను. నాలుగవ పాదాదిని విసంధిగ వ్రాయుటకు కారణము పాదాంతమగుటచే నని యెఱుంగునది.

తాత్పర్యము

రాజా! చంద్రుఁడెట్లు పిన్నలని పెద్దలని స్త్రీలని పురుషులని పండితులని పామరులని ధనికులని దరిద్రులని భేదము తలఁపక లోకులను సంతోషింపఁ జేయునో యట్టులే నీకుమారుఁడు రాముఁడు సమస్తప్రజలను సంతోషింపఁ జేయువాఁడు.నిష్కల్మషమైన యోర్పునందు భూమికి సమానుఁడు అసమానమైన బుద్ధియందు దేవతలకు గురువగు బృహస్పతితో సమానుఁడు. సామాన్యధర్మములు విశేషధర్మములనఁబడు సకలధర్మములను దెలిసినవాఁడు. ఆయనప్రతిజ్ఞ తప్పునదికాదు. తాను గొప్పవాఁడు తక్కినవారు కొలఁదివారను తారతమ్యబుద్ధి లేక సమానప్రతిపత్తి యెక్కువ వారితో బోలెఁదక్కువ వారితోడను గలసి మెలసి యుండువాఁడు. అసూయాది దుష్టగుణములను దగ్గఱకు రానీయఁడు.

దోషమును జేసినవారియందైనను నాదరమును గనఁబఱుచునేకాని కాఠిన్యము వహింపఁడు-కష్టపడువానిని జూచినపుడు ప్రారబ్ధబలమున వారికష్టము ద్రోయ రానిదయ్యెనేని వారిమనస్సునకు శాంతిగలుగఁ బలుకును. కోపించినవారినిఁ జూచినను వారికోపము చల్లారుమాటలనే చెప్పును. ఒకరు తనకుఁ జేసినమే లెంతకొంచెమైనను మఱచిపోఁడు. మఱిహెచ్చుగ భావించును. ఇంద్రియము లను జయించి వానిని లోపఱిచికొనెను. వెన్నవంటి మెత్తని మనస్సుగలదయా వంతుఁడు కావున నాశ్రయించినవారిని దూరమందు విడిచిన వారేమి బాధపడుదురో యని భయపడుచుండువాఁడు. ఎవరు కొంచెము తనదీనస్థితి చెప్పుకొనినను అయ్యో పాపమేయని వారిని దగ్గఱఁదీసి కాపాడువాఁడు. చంచల మైన మనస్సుగలవాఁడు కాఁడు. తేనెవంటి తియ్యనిపలుకులు పలుకువాఁడు. సత్యవాది-ఆర్యులు=వృద్ధులునగు బ్రాహ్మణులసేవచేసి వారివలన శాస్త్రప్రకా రము సమస్తవిషయములను విన్నవాఁడు.

కం॥ వీరుఁడు రణవితరణముల, ధీరుఁడు సురమర్త్యపూర్వ•దేవావిదితం
బై రాజిలువస్త్రాస్త్ర వి,శారదుఁడును సాంగవేద•చతురతరుఁడున్. ౬౨

రణవితరణములన్=యుద్ధమందును-దానమందును, వీరరసమున మూఁడు విధములవారు గలరు. రణవీరుఁడు-దానవీరుఁడు దయావీరుఁడని - ధీరుఁడు= ధైర్యశాలి, జంకులేనివాఁడు. సుర, మర్త్య, పూర్వదేవా విదితంబై=దేవతలకు మనుష్యులకు రాక్షసులకుఁ దెలియరానివై-పూర్వదేవతలు = రాక్షసులు-పూర్వ దేవా, సురద్విషయని యమరుఁడు-విశారదుఁడు=పండితుఁడు, సాంగవేది, అంగములతోఁ గూడిన వేదవిద్యయందు, చతురతరుఁడు=మిగుల సమర్థుఁడు.

తా త్ప ర్య ము

శత్రువులతో యుద్ధము చేయుటయందును బీదలకు దానము చేయుట యందును వెనుకముందు చూచువాఁడు కాఁడు. అట్టిసందర్భములందు జంకు గొంకు లేనివాఁడు. ఇట్టిశక్తి యెట్లువచ్చెనన నది స్వభావసిద్ధముగుటయేకాక దేవతలకు మనుష్యులకు రాక్షసులకుఁ దెలియని యనేక శస్త్రాస్త్రములను సమ ర్థముగ నెఱింగిన పండితుఁడు. వేదములను వేదాంగములను నర్థముతోడ గ్రహించినవారిలో మిగుల సమర్థుఁడు- కావున శాస్త్రపాండితియందు శాస్త్ర పాండితియందు నీయననుమించిన వారు లేరు.

కం॥ వ్రతవిద్యల స్నాతుండ,
ద్భుతముగ గాంధర్వ మెఱుఁగు•బుధనుతుఁడుమహా
మతి కళ్యాణాభిజనుం, డతులితసద్గుణగరిష్ఠుఁ•డమలుఁడు సతమున్. ౬౩

వ్రతవిద్యల స్నాతుఁడు=వేద మధీత్యస్నాయాత్తని స్మృతి చెప్పినట్లు వేదములను సొంతముగఁ బఠించి వ్రతములనన్ని సలిపి స్నాతకము చేసిన వాఁడు. కల్యాణాభిజనుండు=గుణములచేఁ బవిత్రములయిన తల్లిదండ్రుల వంశములు గలవాఁడు. సతము=ఎల్లప్పుడు.

తాత్పర్యము

కొందఱు వేదాధ్యయనము సాంతముచేసి స్నాతకు లగుదురు. కొందఱు వ్రతములందు స్నాతకులగుదురు రాముఁడో రెండింటియందును స్నాతకుఁడు సామవేదాధ్యయనమున కుపయోగమగుటచే సంగీతమును నాశ్చర్యకరముగ నెఱుఁగును. ఈ కారణములచే జ్ఞానులచేతను స్తోత్రము చేయఁబడినవాఁడు. విద్యలుండియు బుద్ధిలేదను లోపములేకుండ గొప్పబుద్ధికలవాఁడు. ఈ గొప్ప బుద్ధియు గొప్పగుణములు గొప్పవారగు తల్లిదండ్రులవంశములఁ బుట్టుటచే స్వభావముగ సత్కులప్రసూతిత్వముచేఁ గలిగెను. బంగారునకు మెఱుఁగుపెట్టి నట్లు శ్రీయనయు స్వసద్గుణములచే మిగుల గొప్పవాఁడు.కావుననే సర్వకాలము లందును నిర్మలమైన మనస్సుగలవాఁడు.

కం॥ దురమునకై లక్ష్మణుతోఁ, బురమును బల్లెలను గావఁ◆బోయి యరుల సం
గరమున నిర్జింపక తా, మరలఁడు సుమి,
శరణ మన్న◆మన్నించుఁగృపన్. ౬౪

దురమునకై=యుద్ధమునిమిత్తము, ఆరులన్=శత్రువులను, సంగరమునన్=యుద్ధమందు, నిర్జింపక=జయింపక–మరలఁడు=వెనుకకురాఁడు.

తాత్పర్యము

దుష్టవర్తనులగు శత్రువులు పురములవారికిఁగాని పల్లెలవారికిగానిఁ కీడుకలిగించెదరా వారిని శిక్షించి జనులకు బాధతొలఁగించుటకై లక్ష్మణుతోడఁ బోయి బహిరంగయుద్ధమందు వారిని జయించికాని వెనుకకురాఁడు. అట్లువారు యుద్ధమునకు రాక శరణుచొచ్చి యిఁక నట్టిదుష్టకార్యములు చేయమనిచెప్పిరా యెంతటి కీడుచేసిన దుష్టులనైనను దయతో రక్షించును.

దీనివలన శ్రీరాముఁడు యువరాజగుటకుముందే కొందఱు శత్రువులను వధించినట్లు చెప్పఁబడెను. (అయోధ్య ౧౧లా౩–వ పద్యము చూడు) అందుఁ దిమిధ్వజసుతుఁడైన శంబరుని వధించినట్లు చెప్పఁబడెను.

సీ॥ రణరంగముననుండి◆క్రమ్మఱి వచ్చుచో,రథముననేఁ గుంజ◆రముననేని
తనయిల్లుచేరక◆మునుపున్న పౌరుల, నందఱఁ దనవారి◆యట్లఁజీరి
కుశలంబులడుగుమీ◆కొడుకులకరుసమే,యిల్లాండ్రు లెస్సలే◆భృత్యజనులు
శిష్యులు సుఖులె కా◆క్షేమ మే యగ్నులు,జవదాఁటి పోవుగా◆ఛాత్రగణము
తే॥ లల్లురును నాఁడుబిడ్డలు◆నలరువారె?
సౌఖ్యవతు లొకొక్క కోడండ్రు◆సాధులార!
యనుచు జనకుఁడు బిడ్డన◆ట్లడుగుఁ గ్రుచ్చి
క్రుచ్చి పేర్పేర నందఱ◆గుతుకమునను. ౬౫

రణరంగముననుండి=యుద్ధప్రదేశముననుండి, క్రమ్మఱి=మరలి–కుంజరమున=ఏనుఁగుమీఁద, అరుసమే=హర్షమా? హర్షశబ్దభవము అరుసము – ఛాత్రగణము=శిష్యసమూహము, పేర్పేర=పరుసగ నందఱిపేర్లు చెప్పుచు, దీనివలన

నయోధ్యాపురంబున నున్న ప్రతిగృహమునందుండు నెల్లవారిని వారిపేర్లతోడ రాముఁడెఱిఁగెనని తెలిసెడిని. రామునకు దెలియని మనుష్యుఁడే యయోధ్య యందులేఁడు. ఆహా యెక్కుడి జనవాత్సల్యము. అంతఃపురస్త్రీలవలె నుండు రాజులకురామునకునెక్కుడి పోలిక-ఈకారణముచేతనే యిప్పటికి రామరాజ్యము రామవాక్యమని పేరు జగమునఁ బ్రసిద్ధినొందినది. అప్పుడెంతలేకున్న నిప్ప టికికించిచ్ఛేషము మిగులును.

తా త్ప ర్య ము

మహారాజా! రాముని గుణములను మేమేమని వర్ణింతుము. గొప్పవారు గొప్పవారిని తమ కక్కఱ లవసరముల నుపయోగపడు వారిని నాదరించుట గొప్ప విషయముగాదు. అది నీవును జేయుచునే యున్నావు. నీకుమారుని జన వాత్సల్య మెట్టిదో మాయనుభవముచేఁ జెప్పెదము వినుము. యుద్ధమునకుఁ బోయి కొంతకాల మయోధ్యయందు లేకయుండి శత్రువుల జయించి రథము నందో యేనుఁగుమీఁదనో కూర్చుండి మరలి యయోధ్యప్రవేశించి తనయింటికిఁ బోయి నిన్నుఁ దల్లిని భార్యను జూచుటకు ముందే మార్గమందుఁగల పురజనుల నందఱను దనయాత్మబంధువులను బిలిచినట్లు చనవుగను మర్యాదగను బిలిచి ప్రతిగృహస్థుని నయ్యా మీకొడుకులు సంతోషముతో నున్నారా? మీభార్యలు బాగున్నారు కదా. మీసేవకులకు శిష్యులకు సుఖమేకదా. అగ్నిహోత్రునకు హానిలేదుకదా. మీశిష్యులు మీయాజ్ఞమీఱి వర్తింపరుకదా. మీయల్లుండ్రునాఁడు బిడ్డలు బాగున్నారుకదా. కోడండ్రకు సుఖమేకదా. యని ప్రతిగృహమం దుండు వారిపేర్ల నన్నిటిని వరుసగఁ జెప్పుచు నడిగి తెలిసికొని సంతుష్టిపడి యావల నింటికిఁ బోవును. ఇటువంటివాఁడు మఱి యెవ్వఁడయ్యా?

కం॥ వ్యసనంబులు జనములకును,
బొసఁగినఁ దా నధికదుఃఖముఁను బొందును; సం
తసమును గన జనములు సం,
తసమును దా నొందుచుండుఁ దండ్రి విధమునన్.౬౮

వ్యసనంబులు=దుఃఖములు, పొసఁగినన్=కలిగినయెడల, తాన్=రాముఁడు అధిక దుఃఖమును=వారుపడెడి బాధకంటె నెక్కువబాధను, సంతసము=సంతో షము, జనములకున్=దేవతలకుఁ దల్లులకు నంతఃపురస్త్రీలకే కాదు భూమి మీఁదఁబుట్టిన సమస్తప్రాణికోట్లకునని గ్రహింపవలెను. అయినను జనములను పదము మనుష్య పర్యాయముగా వాడఁబడుచుండుటను మూలమున మను ష్యాణా'మ్మని యుండుటను మనుష్యుల కనియే గ్రహింపవచ్చును. ఈ కారణ ముచే పండిత పామరస్త్రీ పురుష బాలవృద్ధ ధనిక దరిద్రాదిభేదములు రాముని దయయెఱుఁగదు. ఆయనదయ సర్వసమము. అందఱార్తులయందుఁ బ్రవర్తిం చును. అధికదుఃఖమును=అనఁగా కొంచెము సేపు దుఃఖించుటగాదు. మొదటవిశేష

ముగ దుఃఖించి యావలఁ గ్రమక్రమముగఁ దగ్గి మఱచుటగాదు. బురదలో దిగఁబడిన యేనుఁగు దానిలోనుండి తప్పించుకొని యొడ్డెక్కుటకై యెట్లు సర్వ శక్తి వినియోగించునో యట్లు తన సత్తకొలఁది దుఃఖించును. ఏల రాముని కంత దుఃఖమనిన నిది నాపరిపాలనమందలి వైగుణ్యముచేతఁగదా నాపరిపా లనమునకు లోపడిన వారి కిట్టికష్టము కలిగెను. ఎట్లు వీరిని దీనినుండి యుద్ధ రింతును. అని వారిని మరల నుద్ధరించువఱకు దుఃఖించుచుండును. నేనై మిమ్ము రక్షింపవలసియుండఁగా మీరై వచ్చి రక్షింపఁగోరువఱ కుపేక్షించితిని గదా యని సిగ్గగుచున్నదని కదా రాముఁడు దండకాటవి మునులకుఁజెప్పెను. సీతావిషయమై రామ విలాపమున కిదియే కారణము. అధిక దుఃఖమనఁగా బాధచే దుఃఖించువారుకూడఁ దమకై దుఃఖించు నీయన దుఃఖమునుజూచి తమ దుఃఖమును మఱచి యీయన దుఃఖమును నివారింప యత్నించు నంతటి దుఃఖమని భావము.

తాత్పర్యము

బిడ్డలకు వ్యాధిగాని యితరకష్టముగాని వచ్చెనేని వారుపడెడి బాధకంటె వారి తల్లిదండ్రు లెక్కువబాధ వాత్సల్యాతిశయముచేఁ బడుచుందురు. బిడ్డలు సంతోషించిరా వారికంటె నెక్కువగ వీరు సంతోషింతురు. అట్లులే యయోధ్య యందేకాదు లోకములందన్నిట నుండు జనములలో నేప్రాణికైన దుఃఖము కలిగెనా జగత్పితయగు రామచంద్రుఁడు వారికంటె నెక్కువగఁ బరితపించును. భగవంతుఁడగు రామచంద్రుఁ డత్యంత దయామూర్తి కావున దుఃఖించు జనులఁజూచి యయ్యో వీరికి జ్ఞానము రావలె బాగుపడ వలయునని నేను శాస్త్ర ములు కల్పించి విజ్ఞులచేఁ జెప్పించి యప్పుడప్పుడు నేను బ్రత్యక్షముగ బోధించి యింతశ్రమించినను వీరు వక్రమార్గములఁ బోయి కష్టముల పాలగు చున్నారుగదా. వీరినెట్లు మతిమంతులఁజేయుదునని విశేషముగ దుఃఖించును. మంచిమార్గమునుండి సుఖపడు వారిని జూచి విశేషించి సంతోషించును.

పైపద్యంబులందుఁ జెప్పఁబడినవి సర్వసజ్జన సామాన్యలక్షణములు. ఈ పద్యమునందు శ్రీరాముని యసాధారణ గుణములు చెప్పఁబడెను.

పుత్రాదుల సంతోషమువలనఁ దండ్రులకుఁగలుగు సంతోషము రెండు విధములు. తమ బిడ్డలకు ధనలాభము లౌకికసహాయము గలిగిన పామరులగు తండ్రులు సంతోషింతురు. 'ప్రనృత్యంతి పితామహాః యద్యేకోపి గయాం వ్రజేత్త'న్నటుల తమవంశ మభివృద్ధినొంది యందుఁ బెక్కుఁ రుదయించిరేని యందఱిలో నొక్కండైన గయకుఁ బోవువాఁడు గలుగునుగదా యని పితరులు నృత్యమాడుదురన్నట్లు, శ్లో॥ మనుష్యాణాం సహస్రేషు, కశ్చిద్యతతి సిద్ధయే। బహుజన్మసహస్రాంతే' దిష్ట్యాయస్తుప్రపద్యతే" వేలకొలఁదిజనులలో నెవఁడో యొకఁడే మోక్షమునకై యత్నించును. అట్టివాఁడును పెక్కువేల జన్మములు

కడచిన పిమ్మట నదృష్టము బలమునఁ బ్రవర్తిచేయును. అన్నట్లు ప్రత్యాశ కలుగును గావున అధికముగ ననుపదము సంతసించుననుచోటను ననువర్తింప వలయును. రాముఁడు సంతోషించుట పురమున నింటివారు సంతోషించు నపుడేకాదు. కూఁతురు పుట్టుటలోనగు కార్యములందు నింటివారికి ననాదరణ బుద్ధియుండినను వాకిట శుభసూచకముగ మామిడియాకు తోరణములు పూల దండలు లోనైనవి కట్టినను రాముఁడు సంతోషించుచుండెను.

కల్యాణ గుణైకతానుఁడు భగవంతుఁడగు రామునందు హేయగుణమైన దుఃఖమును జెప్పవచ్చునాయని యాక్షేపము. రామచంద్రమూర్తి తనకుఁ గలిగిన దుఃఖములకై శోకించిన వాఁడెన్నఁడుకాఁడు. బిడ్డలకుఁ గష్టమువచ్చిన వారికి దుఃఖించు తండ్రివలె నయ్యో నావారి కిట్టి దుఃఖము కలిగెనే. ఇది నివర్తించుటయెట్లని వారికై దుఃఖించును. దీనికే దయాగుణ మనిపేరు. కావుననే రామచంద్రమూర్తికిఁ గరుణాకాకుత్స్థుఁడని బిరుదు.

సీ॥ బహుళసంకటములు♦ప్రాప్తించె నేనియు,సత్యంబు దప్పని♦చదురుకాఁడు
ఎగచుచో శత్రుల♦నింద్రచాపముఁ బోలు,
పెనువిల్లు ధరియించు♦బిరుదుకాఁడు
రోషంబయేని సం♦తోషంబ యేనియుఁ,బొల్లువోవఁగ నీని♦పోటుకాఁడు
ప్రత్యక్షమైననా♦రాయణునట్టుల, నెఱి మించు తేజొప్పు♦నీటుకాఁడు
తే॥ సూటి తప్పనిబాణంబు♦నేటుకాఁడు,మంచియుక్తుల గురుఁబోలు♦మాటకాఁడు
పాటి దొఱఁగనికథలందు♦నేటుకాఁడు, దేవపతియైన నీతిని♦దీటు కాఁడు. ౬౯

సంతోషశబ్దభవము సంతసము-రూ. సంతోషము. చదురుకాఁడు=నేర్పరి చాతుర్యశబ్దభవము చదురు. బిరుదుకాఁడు=పౌరుషశాలి భీరుదము తద్భవము బిరుదు బిరుదము, ఎగచు=శత్రువులపై పడి తఱుము. పొల్లుపోవఁగ నీని= వ్యర్థపడనీయని, పోటుకాఁడు=పోటుగలవాఁడు, నెఱి=అందము. తేజము తద్భ. తేజు. గురున్=బృహస్పతిని, పాటి=క్రమము-నీతి, దీటు=సమానము. అనుబంధమైన కాఁడునకు కలవాఁడని యర్థము.

తాత్పర్యము

ఎన్నియో యెటువంటి దుస్సహమైనచో కష్టములు కలిగినను సత్యము దప్పినయెడలఁ గష్టములు దొలఁగునట్లుండినను సత్యము దప్పని సమర్థుఁడు. "వారిజాక్షులందు వైవాహికములందుఁ బ్రాణవృత్తి మానభంగమందుఁ జకిత గోకులాగ్ర జన్మరక్షణమందు బొంకవచ్చు"నను నీతి దుర్బలులకు శరణము గాని బొంకాడక కార్యము చేయఁగలిగిన సమరుని విషయముగాదు. శ్రీరాముఁడు సుమంత్రునకు నసత్యమాడ నేర్పెను. సీతాదేవి హనుమంతుని విషయమున నసత్యమాడెనందురేమో అది పరప్రాణ రక్షణార్థముగాని స్వలాభార్థముగాదు. ఆసందర్భములందు స్వసామర్థ్యమునకు వినియోగములేదు.

పగవారిని యుద్ధమునఁ దఱుమునపు డింద్రధనుస్సువంటి పెద్దవిల్లు ధరియించి చూడఁగనే శత్రువులు భయపడునట్లుండువాఁడు. ఒక్కకోపము పెదవులచేటు అన్నట్లు దుర్బలులకుఁ గోపమువచ్చిన భయములేదు. సంతోషము వచ్చిన లాభములేదు. రెండు ఫలహీనములే-రాముని విషయమం దట్లు గాదు. ఎవరి విషయ మందైన సంతోషించెనా మేలు-కోపించెనా కీడు తప్పక చేయువాఁడు. కావున రాముని నాశ్రయించిన వారికి మేలు తప్పక కలుగుట సిద్ధము. "యత్రరామో భయంనాత్ర నాస్తితత్ర పరాభవః" రాముఁడున్నచోట జననమరణ శత్రుదారిద్ర్యాది రూపకభయములేదు అవమానమును జన్మము లేదు. ఈగుణములు లేని రాజు రాజుగానుండఁ దగఁడు. "శ్లో॥ ప్రసాదో నిష్ఫలో యస్య క్రోధశ్చాపి నిరర్థకః, నతంభర్తార మిచ్ఛంతి; షండం పతిమివస్త్రియః" భార. ౫-౩౪-౨౧ నపుంసకుఁడగువానిని స్త్రీభర్తగాఁగోర నిచ్ఛగింపనట్లు ఎవనికోపము అనుగ్రహము వ్యర్థములో యట్టివానిని భర్తగా ప్రజలు గోరరు.

శ్రీమన్నారాయణుఁ డెట్టెట్టి చిహ్నములు గలవాఁడని శాస్త్రములు చెప్పుచున్నవో యట్టి చిహ్నములన్నియు శ్రీరామునం దుండుటచే నాయనను జూచినవారు శ్రీమన్నారాయణుఁడే మనకుఁ ప్రత్యక్షమైనాఁడని తలఁచున్నట్లు చేయు సౌందర్యముచే తేజస్సుచే నతిశయించువాఁడు. రామబాణము గుఱి తప్పిన దెప్పుడులేదు. చమత్కారముగ యుక్తియుక్తముగ ధర్మము తప్పక మాటలాడుటయందు బృహస్పతిని మించినవాఁడు. ఈకారణముచే వితండావాదము విరుద్ధకథలు వీనియందు సమర్థుఁడయ్యును నీతిక్రమములు తప్పని చరిత్రములందు మేటియగువాఁడు. ఇంద్రుఁడైన నీయనకు సమానుఁడు గాఁడు. ఇది వాస్తవమేకదా. మేరుపర్వతము మనకు గొప్పదియేకాని బ్రహ్మాండమున నది యెన్నవభాగము.

కం॥ ఇమ్మున విండుల నగుకను,బొమ్మలఁ గలవాఁడు విషయములకై చపల
త్వమ్మును బొరయనివాఁడు న,
హమ్మతి లేకుండువాఁడు నతిమహిముండున్. ౭౮

ఇమ్మునన్=అందమునందు-విండులన్=ఎక్కుపెట్టఁబడిన ధనస్సులను, విషయములకై=రూపరసగంధాదులకై, చపలత్వము=మనస్సు నిలుకడలేమి-అహమ్మతి=అహంకారము, అతిమహిముండు=అసాధారణమైన మహిమగలవాఁడు-అమానుషచర్యగలవాఁడు. తాత్పర్యము

ఎక్కుపెట్టఁబడి వంపుగానుండు వింటిదబ్బలవలె నందమైన కనుబొమ్మలు కలవాఁడు రూపరసగంధాది విషయములకై పాతరలాడని స్థిరమైన మనస్సు గలవాఁడు. అహంకారము లేనివాఁడు. మనుష్యులయందుఁ గానరాని గొప్ప మహిమ గలవాఁడు.

కం॥ ఈలోక మేల? యొక్కఁడె, త్రైలోక్యం బైన నేలఁ దగు; వధ్యులనే
పాలార్చెడిని; నవధ్యుల,జోలికిఁ బోవండు సత్యశూరుం డగుటన్. ౬౯
వధ్యులు=వధింపనర్హులు-అవధ్యులు=చంపరానివారు - సత్యశూరుఁడు= యుద్ధాదులందు ధర్మము తప్పనివాఁడు. సత్యమే శౌర్యముగాఁ గలవాఁడు కావున సత్యేన లోకాన్‌జయతి' యన్నట్లు ఆయుధముపట్టక సత్యముచేతనే లోకములనన్నిటిని జయించువాఁడు.

తాత్పర్యము

రాజా! శ్రీరామచంద్రమూర్తి యారాజ్యమును బాలింప యోగ్యుఁడా యని మాయభిప్రాయ మడిగితివి. తుచ్ఛమైన యీ భూలోక మేకాదు. మూఁడు లోకములను బాలింప సమర్థుఁడు ఎట్లు? బలముగలవాఁడగుటచే నందఱ హింసించి వశపఱుచుకొనియా యందువేమో అట్లుగాదు వధింపఁదగిన దోషము చేసినవారగుటచే జంపఁదగినవారిని మాత్రమే వధించును గాని యితరుల వధింపఁడు. అటైన యుద్ధాదు లెట్లుచేయును. శత్రుబాహుళ్య మగునుగదా యందువా. అట్టి భయము లేదు. ఆయన సత్యముచేతనే ముల్లోకముల జయించును. ఒకవేళ విల్లుపట్టి యుద్ధము చేయవలసివచ్చినా ధర్మమార్గమున యుద్ధముచేయునుగాని ధర్మము విడిచి యుద్ధముచేయఁడు అందు నెంత కొంచెము శత్రువులకు బాధకలిగింపవలెనో యంతే కలిగించి జయించును.

కం॥ సంతస మిడుపురుషున కే,కాంతము ఘటియించుఁ గామితార్థములన్;భా
స్వంతుఁడు కరములఁ(బోలెన్, శాంతప్రజాకాంతగుణగణంబుల వెలుఁగున్
సంతసమిడు=తనకు సంతోషము కలిగించు, ఏకాంతము=మిక్కిలి, కామితార్థములన్=కోరఁబడిన ప్రయోజనములను, ఘటియించున్ = సమకూర్చును, భాస్వంతుఁడు=సూర్యుఁడు, కరములన్=తనకిరణములచే శాంతముతోఁగూడి, ప్రజాకాంత=జనమనోహరములైన, గుణగణములన్=సద్గుణసమూహములచే - వెలుఁగున్=ప్రకాశించును.

తాత్పర్యము.

తనకు సంతోషము కలిగించిన వారికి మనస్సునందుఁగల కోరికకంటె మిక్కుటమైన ఫలము నిచ్చును (కుచేలునకుఁ గృష్ణునివలె) సుగ్రీవునిచే నాజ్ఞాపింపఁబడిన హనుమంతుఁడు భృత్యకార్యము నిర్వహించెను. అది యాయనకు విధి అట్లు చేయకుండిన నన్నికోఁతులలో నాయనయు నొకకోఁతిగా నెన్నఁబడియుండును. స్వామి కార్యమును భృత్యుఁడు నిర్వహించినపుడు ఏదో గొప్ప బహుమానమిచ్చినఁ జాలును. రాముఁడట్లు చేయలేదు. హనుమంతుఁడు చేసిన కార్యము తనకు సంతోషకరము గావునఁ ద్రిలోకాధిపత్య మిచ్చినను గొఱఁత యని భావించి తన్నేసమర్పించుకొనెను. (ఎంతో శ్రమించి తనకు సంతోషము కలిగించెనని రాముఁ డిట్లుచేసెను గాని సీతాదేవి రాముఁడు జయించెను అని

రెండుమాటలు చెప్పినదానికే సీతాదేవి తన్నర్పించుకొనుట కస్వతంత్రురాలగుటచే రాముఁడిచ్చినదానికంటె నెక్కువయేమి యిత్తునా యని యాలోచించెను. హనుమంతునకు రాముఁడిచ్చినదికూడఁ గొంచెత యనియే సీతాభిప్రాయము) తన్ను సంతోషపెట్టినవారికి మేలు చేయుటయందేమి విశేషమందురేమో భగవంతుఁడు తన్నాశ్రయించినవారికి నెక్కువమేలు (మోక్షము) చేయును. తక్కినపామరుల కైహికసుఖము లిచ్చి రక్షించును. సూర్యుఁడు లోకమున కంతయు వేఁడిమి కలిగించినను తనకిరణముల నాశ్రయించిన వారి చలినే కదా నిశ్శేషముగఁ బోఁగొట్టును.

ఇందు నాలవపాదంబున సంయుక్త నకారమునకు ణకారమునకు యతి

సూర్యకిరణములకు రామునిగుణములకుఁ బోలికచెప్పుటచే సూర్యకిరణములందు హేయకిరణములేనట్టు రామునందన్నియుఁ గల్యాణగుణములే కాని హేయగుణము లేదని భావము. భగవంతుఁడు నిర్గుణుఁడన్నప్పుడు హేయగుణములు లేనివాఁడు కల్యాణగుణములు కలవాఁడనియేగదా వాస్తవార్థము.

తే॥ అట్టిరాముని సత్యశౌర్యాదిధాము, నఖిలసజ్జననుతసద్గుణాభిరాము
లోకపాలోపమునిఁగోరెఁ బ్రాకటముగ,
వసుమతీకాంతదనకూర్చు వల్లభుఁడుగ. ౭౧

సత్యశౌర్యాదిధామున్‌—సత్యము = అధర్మమార్గమున నిష్కారణముగ నితరులకు నష్టిగాని తనకు లాభముగాని కలుగక భూతహితముగఁ జెప్పెడు మాట. నిరపరాధులకుఁ గష్టము కలిగించు సత్యము సత్యము గాదు. నిరపరాధులఁ గష్టమునుండి తొలఁగింప బొంకినను నది బొంకుగాదు. శౌర్యము=శూరభావము. మరణమునకు భయపడక యుద్ధమునఁ జొరఁబడుట శౌర్యము. 'శూరో మరణనిర్భయాత్' అని వచనము. ఆదిశబ్దముచే వీర్యపరాక్రమములు గ్రాహ్యము—వీర్యము=తాను వికారము పొందక శత్రువులను మనస్సునఁ గలవరపడి పరువెత్తునట్లు చేయుగుణము. పరాక్రమము=యుద్ధమునందులఘుసంచారము చేయుచు ప్రవేశింపరాని చక్రవ్యూహాదులందన్నిటఁ బ్రవేశించి శత్రువుల నాక్రమించుట పరాక్రమము. ఇట్టి గుణములకు ధామున్‌=వాసస్థానమైనవానిని అనఁగా నీగుణములన్నియు రామునందు స్థిరముగ నెలకొని కాఁపురము చేయుచున్నవని భావము.

సజ్జననుత=సాధువులచేఁ బొగడఁబడిన, సద్గుణ=మంచిగుణములచే—అభిరామున్‌=ఒప్పుచుండువానిని—లోకపాలోపమునిన్‌=దిక్పాలకులతో సమానుఁడగు వానిని. ఇంద్రాదులు దిక్పాలకులు—వానిలో నెవనిపేరు చెప్పక లోకపాలోపముఁడనుటచే అష్టదిక్పాలకులయందుండు గుణములు రామునందుఁ గలవనిభావము అటుగాక లోకపాలోపమునిన్‌=సర్వలోకరక్షకుఁడైన శ్రీమన్నారాయణుని, వసుమతీకాంత=భూదేవి—వసుమతి=బంగారు ధనము గలది—తనకూర్చు = తనకిష్టుఁ

డైన వల్లభుఁడు=ప్రియుఁడు. భూమిగోరె ననఁగా లక్షణచే భూమియందలి జనులందఱు నని భావము.

లోకములో రాజులందఱు తమకు భూ ప్రజాధిపత్యము కోరువారే. రాముని విషయమట్టిదిగాదు. భూప్రజలే రాముఁడు తమకుఁ ప్రభువుగా నుండఁ గోరిరి. భూమియేకోరె ననుటచే రామునివిషయమున విరుద్ధాభిప్రాయము గల వాఁ డొక్కఁడైన లేఁడని భావము. వసుమతి సుమతి మతిమతి యగుకాంత (సుందరి) దరిద్రుని దుర్మతిని మతిహీనుని గురూపిని ప్రియుఁడుగఁ గోరనట్లు భూదేవియు వసుమంతుఁడు సుమతి మతిమంతుఁడు సద్గుణాభిరాముఁడు శౌర్యాది ధాముఁడు నగుఁ రామునిఁ గోరెను. భూదేవి సాక్షాద్విష్ణువును వరించుట సమంజసమేకదా కూర్చువల్లభుఁడుగ ననుటచే గత్యంతరము లేక వరించుట కాదనియుఁ బ్రేమపూర్వకముగ నుత్కంఠతో వరించుట యనియు సర్థము తనకూర్చువల్లభుఁడుగన్=అనుచోఁ దనకు+ఊర్చు+వల్లభుఁడనియు సంధివిడఁదీయనగు, ఊర్చు=శ్వాసముపుచ్చు. తనకొఱకై శ్వాసముపుచ్చు=జీవించువల్లభుఁడని యర్థము. రాముఁడు జీపించుట భూరక్షణార్థమని భావము. ఇది సత్యమేకదా.

తాత్పర్యము

దుష్టశిక్షణమున కుపయుక్తములైన ధైర్య శౌర్య వీర్య పరాక్రమాదులును, సాధురక్షణమున కుపయోగకరములైన శాంతి దాంతి లోనగు సద్గుణములును, ధర్మసంస్థాపనమునకుఁ గావలసిన సత్యగుణమునుగల రాముని, దిక్పాలురతోడను శ్రీమన్నారాయణుతోడను తుల్యుఁడగు రాముని; నిక్కడఁ జేరిన మేము నలువురము గోరుటగాదు. భూదేవియే=భూప్రజలందఱు నేకగ్రీవముగ నాయనను దమపతిగా వరించిరి. వారి యభిప్రాయమునే మేము దెలుపుచున్నారము. కావున నీవిషయమున దేశమందు భిన్నాభిప్రాయములేదు.

కం॥ ఈరీతిని ద్వత్సుకృతా,ధారుని శ్రీరాముఁ గంటి•తనయునిఁగా నీ
వోరాజ! యేమిపుణ్యమొ, మారీముఁడు కశ్యపర్షి•మాడ్కిం జూడన్. ౩౨

త్వత్సుకృతాధారునిన్=నీపుణ్యమున కాధారమైనవానిని ఆధారహీనమైన పదార్థము నేలఁబడునట్లు నీపుణ్యము రాముని నాధారముగఁ గొనియున్నది. ఆయనను చేవిడిచిన నీకధోగతియే యని భావము. దశరథుని సత్యమును రాముఁడు కాపాడకుండిన దశరథునకు నరకప్రాప్తి తప్పియుండదుగదా. ఊరక చేవిడిచిన దానికే యాయన నికృష్టపుఁ జావు చచ్చెను.

తాత్పర్యము

రాజా! నీ వెంత పుణ్యవంతుఁడవో-పుత్రశబ్దమును సార్థకము చేయుచుఁ బున్నామ నరకమునుండి తప్పించుటయేకాక తక్కిన పుణ్యములను జెడకుండ రక్షించి రాజులవశ్యము పోవలసిన నరకమునకు నిన్నుఁబోకుండ రక్షించు

వానిని రాముని గొడుకుగాఁ గంటివి. నీకు మఱియొకఁడు పుత్రుఁడై యుండె నేని కాముకుఁడువగు నిన్ను నరకమునుండి తప్పింపఁ జాలియుండఁడు. నీవును యోగ్యుఁడవగుటచేతనే మరీచికిఁ గశ్యపుఁడు సుతుఁడై జనియించినట్లు మహర్షి తుల్యుఁడగు రాముఁడు నీకు సుతుఁడై జనించెను. ఆయన తండ్రిగా స్వీక రింపఁదగినఁవాడవు నీవు తప్ప వేఱొకఁడు లేఁడు.

కం॥ రాముఁడు సుఖియగుఁ గావుత,
రాముఁడు చిరజీవి యగుచుఁ◆రంజిలుఁ గాతన్
రాముఁడు నిరామయుం డగు,రామునకున్ దేహబలము◆ గ్రాలెడి నెపుడున్

సుఖి=సుఖముగలవాఁడు, చిరజీవి=దీర్ఘకాలము బ్రదుకువాఁడు, నిరామయుఁడు=(నిర్+ఆమయము) వ్యాధిలేనివాఁడు.

కం॥ అని వేల్పులు గంధర్వులు,జనములుఁ బన్నగులు రాష్ట్ర◆జనపదములఁ బ
ట్టనములఁ బరదేశంబులఁ, మనసీమను గోరుచుంద్రు◆మహిపా! సతమున్.

వేల్పులు=దేవతలు, జనములు=ఋషులు, దేవగంధర్వ శబ్దములతోడ వచ్చుటచే నిచట జనములనఁగా ఋషులనియే చెప్పనొప్పును. జనపదములు=గ్రామములు, పట్టనము=పత్తనము, సంస్కృత శబ్దమగు పట్టనశబ్దమందు ణత్వములేదు. తవర్గ పంచామాక్షరమే గ్రాహ్యము. శ్రీరంగపట్టనమని రామరాజభూషణుఁడు. పట్టనశబ్ద వికృతి పట్టణము.

పరదేశంబులన్=ఇతరరాష్ట్రములవారును (రాజులు ప్రజలు) రాముని క్షేమము గోరుచుందురు. వారు గోరనేల? "అసంతుష్టోద్విజో నష్టః, సంతుష్ట ఇవపార్థివః సలజ్జా గణికానష్టా, లర్లజ్జేవ కులాంగనా" తృప్తిలేని బ్రాహ్మణుఁడు. తృప్తి గలరాజు, సిగ్గుగల వేశ్య, సిగ్గులేని కులాంగన చెడుదురు. అన్నట్లు సాధారణముగా రాజులు పరరాష్ట్రములను దమ వశపఱచుకొన దండెత్తుచుందురు. ఆకారణమున నితర రాష్ట్రముల రాజులకుఁ బ్రజలకుఁ గూడఁ గష్టములు సంభవించును. రాముఁడు ధర్మాత్ముఁడు జితేంద్రియుఁడు కావున నాయనవలన నెవరి కేవిచారము భయములేదు. కావున నాయన మేలు గోరుచుందురు.

తాత్పర్యము

రాజా-రామునకు నెపుడు సుఖమే కలుగుచుండును గాక. రాముఁడు దీర్ఘకాలము జీవించునుగాక రామునకు నాధివ్యాధులవలన బాధలేకుండును గాక. రామునకు రోగబాధ లేకుండుటయే గాక దేహబలము వర్ధిల్లుచుండును గాక యని యీవిధముగ దేవతలు గంధర్వులు-ఋషులు పన్నగులు లోనగు వారు రాష్ట్రములందును గ్రామములందును పట్టనములందును మనదేశమందే కాక యితర దేశములందును సర్వకాలములందును గోరుచుందురు.

ఉ॥ రాముని మేలుకోరి నగ◆రంబున రాష్ట్రమునందుఁ బక్కణ,
గ్రామములందు నిత్యముఁ బ్రది◆కాలములందును నెల్ల వేల్పులన్

నేముమునన్ భజింత్రు తరు•ణీమణులున్ ముదుసళ్లు స్త్రీలునున్
గ్రామజనాదినాగరులు•రాముని(దప్ప స్మరింప రెవ్వనిన్.

నగరము=పెద్దపట్టనము (వ్యు-తన నడుమ పర్వతముగలది) పక్కణము=బోయపల్లె. తరుణీమణులు=నడిమిప్రాయమందుండు స్త్రీరత్నములు, ముదుసళ్ళు=వృద్ధస్త్రీలు, స్త్రీలునున్=ఆడువారుకూడ. అనుటచే పురుషులు మాత్రమేకాదు గృహకృత్యలంపటలైన స్త్రీలు నని యర్థము, నాగరులు=నగరమందుండువారు.

తాత్పర్యము

రాజా! రామచంద్రుని విషయమున మంచి యభిప్రాయముగలవారు రాజకీయ వ్యవహారంబులందు సంబంధముగల పురుషులు మాత్రమేకాదు, మనదేశమందేకాదు ఇతర దేశములందును; మన నగరమందేకాదు ప్రతినగరమందును, ప్రతి రాష్ట్రమందు బోయపల్లెలందు, నితరగ్రామములందును; నెపుడో యొకప్పుడు మాత్రముకాదు ప్రతిదినము నిత్యకృత్యముగా నుదయమధ్యాహ్న సాయంకాలములందును, రాముని మాహాత్మ్య మెఱింగిన పండితులే కారు పల్లెటూళ్ళవారు, పట్టనములవారు. పురుషులు మాత్రమేకారు ప్రాయపుస్త్రీలు, ముదుసళ్లు=పెద్దవారు మాత్రమేకారు. బాలురు బాలికలు. మనుష్యులు మాత్రమేకారు. దేవతలు గంధర్వులు పన్నగులు ఋషులుకూడ, నొకదేవతనేకాదు తమ యిష్టదేవతల నందఱను రామునకు సుఖము గలుగవలె రాముఁడు దీర్ఘాయువు కావలె. రామునకు దేహారోగ్యము స్థిరమై యుండవలనని ప్రార్థించుచున్నారు. సర్వదా యిందఱును రాముని(దప్ప మఱి యితరుల(దలంచుటయేలేదు.

శ్రీరామునందట్టి యనన్యప్రేమ భక్తిగలవా రగుటచేతనే వీరికందఱకు శ్రీరామనిర్యాణ కాలంబున ముక్తిలభించెను.

"ఉపాసతా మాత్మవిదః పురాణాః॥ పరంపుమాంసం నిహితం గుహాయామ్।
వయంయశోదా శిశుబాలలీలా, కథాసుధాసింధుషు లీలయామః॥కృష్ణకర్ణా ॥

హృదయ గుహయందుండు పురుషుని నాత్మవిదు లుపాసింపనిండు. మేము యశోదాదేవి శిశువైన బాలకృష్ణుని కథలనెడి యమృత సముద్రమున నోలలాడుచుందుము.

గీ॥ రామచంద్రుఁగూడి రాకల(బోకల(॥గదిసితిరుగువారు(గన్నవారు। నంటి
కొన్నవారు నాకోసల ప్రజ। లరిగి రాదియోగు లరుగుగతికి. భాగ.౯ ౩౮-౨

యేపితేషు భగవదం శేష్వను రాగిణః కోసలనగరః
జానపదాస్తేపి తన్మనస స్తత్సలోక మాప్నుయుః. విష్ణుపురాణము.

రామచంద్రమూర్తియం దనురాగముగలిగి యాయనయందు మనస్సునిలిపిన కోసలనగరమందలి పల్లెలయందలి జనులుకూడ సాలోక్యముక్తినందిన వారైరి.

'రాముడుఁదప్ప స్మరింపదెవ్వనిన్' అనుటచే హరిభక్తి యనన్యమై యుండవలయుననియు స్వసంప్రదాయ ప్రకార మితరదేవతల నర్చించినను నది రామభక్తి కుదురుటకే యనియు గ్రాహ్యము. 'మామేవయేప్రపద్యంతే మాయా మేతాం తరంతితే' నన్నొకనినే యెవరు ప్రపత్తిచేయుదురో వారీ మాయను దాఁటుదురు. మామేకం శరణంవ్రజ=నన్నొకనినే శరణుచొరుము. అనన్యాశ్చింతయంతోమాం యేజనాః పర్యుపాసతే, తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥ "నేను దప్పఁ దమకు వేఱుగతిలేదని చింతించు వారియొక్క యోగక్షేమములను నేనేవహింతును" అనికదా శ్రీకృష్ణభగవానుఁడు చెప్పెను. ఇట్టివాక్యము లనేకములు భగవద్గీతయందుఁ గలవు. కావునఁ బెక్కు దేవతల భక్తిగాని క్షుద్రదేవతాభక్తిగాని ప్రయోజన పడదు.

ఈజనులందఱు రామునితోడఁ బ్రత్యక్షదర్శన స్పర్శన సల్లాపాదులచే సాంగత్యము గలవారుగా నుండఁజాలరు. ఇందు నితరులు రాముని గుణా దులఁ జెప్పఁగా విని యనేకులు రామునందుఁ బ్రేమగలవారైరి. కావున భగవ ద్గుణ శ్రవణమువలనను బ్రేమజనించుటచే మోక్షసిద్ధిగలదు. రామాయణమం దును శ్రీ భాగవతమందును శ్రవణమునకు విశేషఫలము చెప్పఁబడినది. ప్రహ్లా దుఁడును దానిని ప్రథమముగ గణించెను. కావున నీకాలమువారును రామగుణ శ్రవణముచేత తరింపవచ్చును.

సీ॥ ఇందీవరశ్యాము♦సౌందర్యజితకాముఁ, గమనీయగుణపాత్రుఁ♦ గంజనేత్రు
శాత్రవమదనాశు♦జనరసనావాసుఁ గరుణాలవాలు సుం♦దరకపోలు
నవయౌవనోదీర్ణు♦నవ్యయశఃపూర్ణు, జలనిధిగంభీరు♦శైలధీరు
సజ్జనతాసక్తు♦సత్యధర్మసుయుక్తు, మంజులమృదుభాషు♦మథితదోషు
తే॥ యౌవరాజ్యపదంబున♦నలరు చుండ
దేవ! కనఁగోరెదము దేవ♦దేవతుల్యు
మాహితముఁ గోరి యీమత్స♦మీహితంబు
నే సమాహితమును జేయు♦వే యటంచు. ౩౬

ఇందీవరశ్యామున్=నల్లకలువవలె నల్లనైనవానిని-ఏదైన లోఁతుపాఁతు తెలియరాక గంభీరమైనది (ఆకాశము-సముద్రము) నీలవర్ణముగను ఒక్కొక్క సారి కొంచెము అకుపచ్చగాఁ గానవచ్చును. కాన విష్ణువు నీలవర్ణుఁడన్నప్పు డతిగంభీరుఁడనియు నాయన లోఁతెఱుఁగరాదనియు భావము. దూర్వాంకుర శ్యాముఁడనియు రామునిఁ జెప్పుటగలదు. సౌందర్యజితకామున్ = చక్కఁదన ముచే జయింపఁబడిన మన్మథుఁడు కలవానిని; సాక్షాన్మన్మథ మన్మథయన్నట్లు మన్మథుఁడును మనకిట్టి సౌందర్యము లేదాయెఁగదా యని వెతపడునంతటి సుందరుఁడు. వాస్తవమున లోకమున నెవరెంతసౌందర్యము కలవారైనను వారిసౌందర్యము భగవత్సౌందర్యములో వంశమనియే యెఱుఁగనగు. కను

నీయగుణపాత్రున్=మనోహరములైన కల్యాణగుణములకు నాధారమైనవాఁడు అనుటచే హేయగుణ మొక్కటియైన నాయనయందు లేదని భావము.

కంజనేత్రున్=ఎఱ్ఱకమలములవంటి కన్నులుగలవానిని- శాత్రవమద నాశున్=పగవారి గర్వము నణఁచువానిని- శాత్రవనాశు ననక శాత్రవమదనాశు ననుటచే వారి మదమణఁచుటకు నెంతమాత్రమువారిని దండింపవలయునో యంతమాత్రము పరాక్రమనుఁ జూపునేకాని క్రోధపరవశుఁడై సులభసాధ్యుని కఠినదండముపాలుసేయఁడు. జనరసనావాసున్ = లోకుల నాలుకయందు వసించువానిని అనఁగా మీఁది పద్యములందుఁ జెప్పినట్లు ప్రతిమనుష్యుఁడు రామశబ్దము సర్వదా యుచ్చరించు వాఁడేయైయుండెను. కరుణాలవాలు= దయకుఁ బాదైనవాఁడు. (ఆలవాలము=చెట్లపాదు) కరుణయనెడు కల్ప వృక్షమునకు జన్మభూమి-నిలువనెలవు- రాముఁడే. కరుణాకాకుత్థ్సయనికదా యాయనకు బిరుదు- సుందరకపోలున్=అందమైన చెక్కిళ్లు గలవానిని, నవ యౌవనోదీర్ణున్=క్రొత్తయగు యౌవనముచే గొప్పయగు వానిని ఇప్పటికి రామునకు ౨౫ సంవత్సరముల ప్రాయము. నవ్యయశఃపూర్ణున్=శ్లాఘ్యమైన కీర్తిచేనిండిసవానిని, జలనిధిగంభీరున్ = సముద్రమువలె లోఁ తెలియఁగరాని వానిని- శైలధీరున్=శైలమువలెఁ జలింపని ధైర్యముగలవానిని-సజ్జనతాసక్తు= (జనతా=జనసమూహము) సాధుజన సమూహమునందు మిగులఁ బ్రేమగల వానిని, సత్యధర్మసుయుక్తున్= సత్యధర్మములతో మిక్కిలి గూడినవానిని, మంజుల మృధుభాషున్=మనోహరముగను మృదువుగను మాటలాడువానిని- విరసముగఁ బరుషముగ నెప్పుడు మాటలాడఁడని భావము. మథితదోషున్= మథింపఁబడిన దోషములు గలవానిని-దోషరహితుని, దేవదేవతుల్యున్=దేవత లందఱు నెవనిఁ దమదేవుఁడుగా భావింతురో అట్టి నారాయణునితో సమానుని- మత్+సమీహితము=మాకోరిక, సమాహితముః= నెఱవేర్పఁబడినది - చేయవే= చేయుమా యని ప్రార్థించెదము.

తాత్పర్యము

నల్లకలువవంటి నీలమైనదేహకాంతి గలవానిని-మన్మథునిమించిన చక్కఁదనము గలవానిని కల్యాణగుణముల కాధారభూతుఁడైనవానిని కమలములవలె మనోహరములైన కన్నులుగలవానిని-పగవారి పొగరణఁచువానిని,సర్వజనులచే సర్వవేళల నుచ్చరింపఁబడు నామముగలవానిని-దయకుఁ బాదియైనవానిని- అందమైన చెక్కిళ్లుగలవానిని-క్రొత్తయౌవనమందుండువానిని - యశస్సుచే నిండిన లోకముగలవానిని-సముద్రమువలె లోతు తెలియనీయని వానిని, పర్వతములవలెఁ జలింపనివానిని, సజ్జనులయందు సౌజన్యమునందు నాశక్తిగల సత్యము ధర్మమును గూడియుండువానిని-ఇంపుగ మెత్తగ మాటలాడు వానిని దోషరహితుని దేవాది దేవునితో సమానుఁడగువానిని శ్రీరామచంద్రమూర్తిని,

యువరాజుగా నుండఁ గన్నులారఁజూచి సంతోషింపఁ గోరెదము. కావున మామేలు గోరినవాఁడవై మాకోరిక నెఱవేర్పుము. అని ప్రజలెల్లరు.

—♦ 3 సర్గము. పట్టాభిషేకసంభారంబులు గూర్ప దశరథుఁ డాజ్ఞాపించుట. ♦—

కం॥ పుంజికొనుసంతసంబున, నంజలి ముకుళించి యెల్ల♦రాడిన విని లో
రంజిలి వారికి రఘుకుల,కుంజరుఁ డత్యంతముదము♦గులుకఁగఁబలికెన్.

పుంజిగొను=అతిశయించిన.

తా త్ప ర్య ము

అతిశయించిన సంతోషమున నందఱొక్కమాటగఁ జేతులుజోడించి ప్రార్థింపఁగా రఘువంశ శేఖరుఁడగు దశరథుఁడు మనస్సున సంతోషించి యిట్లు చెప్పెను.

ఆ॥ ఏమి నాయదృష్ట♦మెంతయుఁ బ్రీతుండ, నైతి నార్యులార♦యైకకంఠ్య
ముగను నాతనూజుఁ♦బూన్పంగ యౌవరా,జ్యంబు నీర లెల్ల♦సమ్మతింప.

ఐకకంఠ్యము=ఏకగ్రీవముగ-ఒక్కమాటగా, ఈరలు=మీరు.

తా త్ప ర్య ము

అయ్యలారా! ఏమి నాయదృష్టము. మీరందఱొక్కమాటగ నాకొడుకును యువరాజుఁజేయ సమ్మతించితిరి. ఏమినాభాగ్యము, తండ్రికిఁ బుత్రుఁడు కలిగినప్పుడు కలుగు సంతోషము సంతోషముగాదు. ప్రజలెప్పుడు వానినిమంచివాఁడని కీర్తింతురో యప్పుడు నిజమైన సంతోషము కలుగును. అట్టిభాగ్యము నేఁడు నాకుఁ గలిగెను.

తే॥ అనుచు వారల నెల్ల మ♦న్ననలఁ దనిపి. వామదేవవసిష్ఠుల♦వంకఁ జూచి
వలయుసంభారములఁగూర్ప♦వలయుమీరు,
శ్రీరఘూత్తముపట్టాభి♦షేకమునకు. ౫౯

తా త్ప ర్య ము

అని యాప్రజలనెల్లఁ దగు మాటల గౌరవించి తృప్తిపడఁజేసి యావల వసిష్ఠుని వామదేవునిఁ బురోహితులఁజూచి మునీంద్రులార శ్రీరామచంద్రుపట్టాభిషేకమునకుఁ గావలసిన పదార్థములనెల్లఁ బ్రోగుచేయుఁడని కోరెను.

కం॥ చైత్రము సర్వసుఖశ్రీ,పాత్రము ఫలపుష్పనికర♦భరితోరువనీ
గోత్రము పుణ్యం బిది నా,పుత్రుని యువరాజుఁ జేయఁ♦బోలును నిపుడే.

చైత్రము=చైత్రమాసము సర్వసుఖ శ్రీపాత్రము=సమస్తసౌఖ్యసంపదలకు నాధారము. ఫల........గోత్రము=పండులయొక్కయు పూలయొక్కయు నసమూహముచే నిండిన గొప్ప వనప్రదేశముగలది. పుణ్యము=పుణ్యకార్యములు చేయ యోగ్యమైనది.

తాత్పర్యము

ఈ చైత్రమాసము సమస్త సౌఖ్యసంపత్తులకు నాధారమైనది. భూప్రదేశమంతయు పండ్లచేతను బూలచేతను నిండి భారముచే వంగిన వృక్షములుగలది. పుణ్యకార్యములు చేయ యోగ్యమైనది. కావున నిపుడే నాకొడుకును యువరాజుఁ జేయఁదగిన కాలము.

కం॥ అని జనపాలుఁడు విరమిం,చిన మేల్మే లనుచు జనము • చెచ్చెరఘోషిం
చిననినద మణఁగ మెల్లన, మునివరుని వసిష్ఠు రాజ•ముఖ్యుఁడుపలికెన్.

విరమించినన్=చెప్పి చాలింపఁగా, నినదము=చప్పుడు. ౫౧

తాత్పర్యము

అనిచెప్పి రాజు చాలింపఁగా శుభము శుభము అని జనులందఱు ధ్వనించిరి. ఆశబ్ద మణఁగిపోఁగా దశరథుఁడు వసిష్ఠమునితో నిట్లనియెను.

కం॥ రామాభిషేకమున కిపు, డే మీ రుపకరణములను • నేర్పఱుపుఁ డనం
గా మౌని యరత వఱలెడి, ధీమహితుల మంత్రివరుల • దిక్కుంగనుచున్.

అరతన్=సమీపమందు, మీరు=పూజ్యార్థమున బహువచనము.

తాత్పర్యము

వసిష్ఠమునీంద్రా రాముని నభిషేకించుటకుఁ గావలసిన పదార్థముల నెల్ల మీరు సిద్ధము చేయుఁడు అని చెప్పఁగా నాయన తన సమీపమందున్న బుద్ధిమంతులగు మంత్రులఁజూచి యిట్లని చెప్పెను.

—• వసిష్ఠుఁడు మంత్రులతో వలసిన సంభారములఁ జెప్పుట. •—

సీ॥ బంగారు రత్నముల్ • బలులునోషధులును లాజలు శుక్లమా•ల్యములుఁ దేనె
గమ్మనినేయియుఁ • గారికపుట్టంబు, లరదంబు ధ్వజము స•ర్వాయుధములుఁ
జతురంగబలము సు• స్తంబేరమము వెలి, చామరంబులు వెల్ల • ఛత్రమొండుఁ
బైఁడికుండలునూఱుఁబైఁడికొమ్ములయెద్దు, సంపూర్ణమౌవ్యాఘ్ర•చర్మమొకటి
తే॥ చందనము లోనుగాఁగ నే•ష్టవ్యములును
వేగకయమున్న వసుధేశు • వేశ్మమందు
నగ్నిగృహమునఁ జేర్పుఁడి • యనఘులార
యనుచును వసిష్ఠమౌనీంద్రుఁ • డనియె మఱియు. ౫౩

శుక్లమాల్యములు=తెల్లనిపూలదండలు, కారికపుట్టము = చలువచేయని వస్త్రము, స్తంబేరమము=ఏనుగు. (స్తంబము=గంట్లు, దానియందుఁ గ్రీడించునది స్తంబేరమము. సప్తమి-అలుక్సమాసము.)

వేగకయమున్న=సూర్యోదయముగాకముందే, వసుధేశువేశ్మము=రాజుగృహము, అగ్నిగృహము=రాజు హోమముచేయు నగ్నికుండముగల యింటియందు. (క్షత్రియులు నిత్యాగ్నిహోత్రులుకదా.)

తాత్పర్యము

బంగారు- రతనములు- బలులు- వనమూలికలు- పేలలు- తెల్లపూల దండలు. తేనె- కప్పుని వాసనగలనేయి- చలువచేయని వస్త్రము-తేరు-ధ్వజము క్షత్రియులు ధరించు నన్నియాయుధములు-రథములు-ఏనుఁగులు-గుఱ్ఱములు-కాలినడక భటులునను నాలుగువిధముల సేనలు- పట్టపుటేనుఁగు- తెల్లవింజామరము- ఒక తెల్లగొడుగు- బంగారుకుండలు- కొమ్ములకు బంగారుతొడుగులు వేసిన యెద్దులునూఱు-అన్ని యవయవములు సంపూర్ణముగానుండు నొక పులితోలు-శ్రీగంధము మొదలుగాఁగల తేఁదగిన పదార్థముల నుదయము కాక ముందే రాజు వాకిట నుంచవలసినవి యచ్చట, లోపల నుంచవలసినవి లోపల నగ్నిహోత్రశాల యందుంచ వలసినవియచ్చటఁ బుణ్యాత్ములారా చేర్పవలయును అని వసిష్ఠుఁడు మంత్రులకుఁ జెప్పి మఱియు నిట్లనియెను.

క౦॥ హారంబులఁ జందనమున,
ద్వారాంతఃపురములన్ సు♦ధన్ నగరము శృం ౭౮౦౧
గారింపుఁడు చల్లుఁడు ప, న్నీరంబుల ధూప మిడుఁడు♦నెఱబుగులుకొనన్.

బుగులు కొనన్=పరిమళించునట్లుగా, సుధన్=సుద్ధచే ననఁగా తెల్లని పూఁతలచేత.

తాత్పర్యము

మంత్రులారా! రాజగృహము ద్వారములను అంతఃపురములను హారములచేతను శ్రీగంధముచేతను, సున్నపుఁ బూఁతలచేతను శృఁగారింపుఁడు. పట్టనము ప్రజలందఱు వారివారి గృహములకు సున్నము కొట్టించి తెల్లని పూఁతలు పూయించి యలంకరించునట్లు చేయుఁడు వీధులందుఁ బన్నీరు చల్లుఁడు-పట్టనమంతయు సువాసనతో నిండునట్లు అగరుసాంబ్రాణి మొదలయిన వానిచే ధూపములు వేయుఁడు.

క౦॥ పాలుపెరుఁగుతో నొకనూ, ర్వే లగుద్విజులకును లెస్స♦రేపకడన్ మీ
రాలస్యము లేకన్నము, చాలఁగ నిడ వలయు భక్తి♦శ్రద్ధయుఁదోఁపన్. ౭౮౦౨

రేపకడన్=ఉదయకాలమున, ఆలస్యము = జాగు, నూఱు + వేలు= నూర్వేలు, సంయుక్తంబున నలఘురేఫము లఘువగు.

తాత్పర్యము

ఇంతియకాక రేపటి యుదయకాలమందు లక్షబ్రాహ్మణులకు జాగుచేయక పాలు పెరుఁగుతోడ నన్నము దండిగఁ బెట్టవలయును. శ్రద్ధయు భక్తియువదల రాదు. శాంతికై యీకార్యము చేయవలయును.

క౦॥ రేపటియుదయంబున మీ, రోపిక దక్షిణలతోడ♦సుర్వీసురులన్
వే పిలిపించి యొసంగుం, డీ పేలలు నేయి పెరుఁగు♦నెయ్యముమీఱన్. ౭౮౦౩

పేలలు=దీనినే వాడుకయందు పేలాలందురు. ఈశబ్దము మావ వంటిది. నేయి-నెయ్యి, నెయ్యము స్నేహశబ్దభవము.

తాత్పర్యము

ఈరాత్రి కడవఁగనే యుదయకాలంబున మీరు ప్రాలుమాలక బ్రాహ్మణులను బిలిపించి దక్షిణలతోడ లాజలు (పేలలు) నేయి, పెరుఁగు స్నేహభావముతో నొసఁగవలయును. అశ్రద్ధకూడదు.

కం॥ ఇనుఁ డుదయించినయా వెంటనె యగుఁజుడి స్వస్తివాచ•నము!దానికినై
ఘను లగువిప్రులఁ గూర్చుం,డనఘాత్మకులార!పీఁట•లమరింపరయా. ౧౧

ఇనుఁడు=సూర్యుఁడు, స్వస్తివాచనము=పుణ్యాహవాచనము. అనఘాత్మకులారా=పుణ్యాత్ములారా! పీఁట-పీఠీ-శబ్దభవము.

తాత్పర్యము

సూర్యోదయమైన వెంటనే స్వస్తివాచనము జరుగును. కావున దానికి రావలసిన యుత్తమబ్రాహ్మణుల నావేళకు సరిగా వచ్చునట్లేర్పాటు చేయవలయును. వారువచ్చి కూర్చుండుటకు నందఱకుఁ బీఁట లమర్పవలయును.

దీనివలన శుభకార్యములు నిర్వహింప నింటికివచ్చిన బ్రాహ్మణులను నేలపైఁ గూర్చుండఁ జేయరాదని సూచితము.

కం॥ కట్టింపుఁడు కల్వడములఁ, గొట్టింపుఁడు సున్న మన్ని•కూటములందున్
దట్టముగ నీరుచల్లఁగ, దిట్టము గావించి ముగ్గు•దీర్పంప రయా. ౧౨
కల్వడములు=తోరణములు.

తాత్పర్యము

వాకిండ్లకుఁ బచ్చాకుతోరణములు-పూలదండలు కట్టింపవలయును. అన్ని గోడలకు లోపల వెలుపల గదులలోఁగూడ సున్నము కొట్టింపవలయును. దుమ్ము పోవునట్లు ముందు చిమ్మి యావల నీళ్ళు బురదగాకుండఁ జల్లించి వెంటనే ముగ్గులు పెట్టింపవలయును. అలికి విడిచినఁగడప దాఁటరాదు. పచ్చాకుతోరణములని వేపాకు సుంకేసులాకు రావాకులోనైనవి కట్టరాదు. మామిడియాకు ప్రశస్తము. శుభకార్యము జరుగునింట నివియన్నియుఁ జేయవలయును.

కం॥ తాలంబులతోన ర్తక, జాలంబులతోడ వార•సతులున్ సొగసుల్
మేలిమిగఁ జేసికొని భూ,పాలయము ద్వితీయకక్ష్య•యుం దుండఁదగున్.

వారసతులు=వేశ్యలు-వెలయాండ్రు (వారము=వేశ్యలకు విటులిచ్చు పడుపుధనము. అట్టి ధనమాశించి భార్యలగువారు వారసతులు) వర్తకజాలంబులు=నృత్యముచేయువారి సమూహంబులు-భూపాలయము=రాజగృహము, ద్వితీయకక్ష్య=రెండవ తొట్టికట్టు.

తాత్పర్యము

భోగము వడుచులు చక్కఁగ నలంకరించుకొని తాళములు లోనగు సాధనములతోడను నర్తకులతోడను రాజగృహంబున రెండవకక్ష్యయం దుండవలయును.

కం॥ దేవాయతనంబుల భూ,దేవులు పూజింప వలయుఁ•దెగ కన్నాదుల్
వావిరి మాల్యాదులుఁ జై,త్యావళులం దిడఁగ వలయు•నర్హక్రియలన్.౬౦

దేవాయతనములన్=దేవాలయములందు-భూదేవులు = బ్రాహ్మణులు-స్వర్గమున నున్న దేవతఁ జెప్పునపుడు మాత్రమే దేవశబ్దమునకు దేవుఁడని యేకవచనము. మాల్యాదులు=పూలదండలు మొదలయినవి-చైత్యావళులన్= అర్హక్రియలన్=యోగ్యమైన కార్యములను.

తాత్పర్యము

దేవాలయములందు బ్రాహ్మణులు పూజగావించు చుండవలయును నాలుగు త్రోవలు కలియుచోట నుండు చిన్నదేవమందిరములు (భజనకూటములు లోనైనవి) పూలదండలచే నలంకరింపవలయును. విడువక లేదయి పోయినదనక యన్నదానము చేయవలయును. దీనివలన శుభకార్యములందు నన్నదానము. దేవాలయములందు నన్నదానము, దేవాలయము లందలి దేవతలకుఁ బూజ చేయింప వలయు ననియు భజనమందిరము లున్నచోట వాని నలంకరింపవలయు ననియు సూచన.

కం॥ రామాభ్యుదయోత్సవమున, భామానితమండలాగ్ర•భాసితయోధుల్
దా మూని మంచిచేలలు, భూమీశాంగణముఁ జొరఁగఁ•బోలున్ దీవిన్. ౬౧

రామాభ్యుదయోత్సవమునన్ = రాముని మేలునకై చేయు నుత్సవము నందు, భామానిత=తళతళమను ప్రకాశముచే గౌరవింపఁదగు, మండలాగ్ర= కత్తులచే, భాసిత=ప్రకాశించు, యోధుల్=యుద్ధభటులు, చేలలు=వస్త్రములు-భూమీశాంగణమున్=రాజు మొగసాలను.

తాత్పర్యము

రామపట్టాభిషేకకాలమున, ఖడ్గములను ధరించిన యుద్ధభటులు మంచి శుభ్రవస్త్రములు గట్టుకొని రాజుండు ప్రదేశమున నొక్కటిగఁ బ్రవేశింపవలయును. వీరాసమయమునకు బాగుగారావలయును. ముందుచెప్పినకార్యములు ముందే జరుగవలయును.

కం॥ అని కార్యంబుల నెల్లను, గొనకొని వచియించి, నృపతి•కుంజరునకుఁ దాఁ
బొనరింపవలయు పనులన్, వినిచి యచట నుండి తీర్చె•వివిధంపుబనుల్.

కొనకొని=ఆమూలాగ్రము, వినిచి=వినిపించి, ప్రేరణార్థకము.

తా త్ప ర్య ము

ఈప్రకార మెవరెవరి కేయేపనులు చెప్పవలెనో వారివారి కవి చెప్పి తరువాత రాజునకుఁ దాను చేయవలసిన పనులు వినిపించి తక్కిన కార్యములు వసిష్ఠుఁడు దా నచ్చటనుండియె చక్కఁబఱిచెను.

తే॥ అన్ని కార్యంబు లీరీతి♦ననువుపరిచి, వామదేవవసిష్ఠులు♦భూమినాథుఁ
గాంచికావించితిమి యెల్ల♦కార్యముల న,
టంచువచియింపనాతండు♦మించెనెలమి. ౬౩

అనువుపఱిచి=చక్కఁజేసి, కావించితిమి యెల్లకార్యములు=ప్రథమోత్తమ పురుషంబుల నికారమునకు సంధివై కల్పికము.

ఎలమిన్=సంతోషముచే.

తా త్ప ర్య ము

ఈప్రకారము జరుగవలసిన కార్యములన్నిటికి నేర్పాటుచేసి వసిష్ఠవామదేవులు రాజుతో సర్వకార్యములు నెఱవేఱ నేర్పాటులు చేసితి మని చెప్పఁగా నాయన సంతోషించెను.

దీనివలన యజమానుఁడు నీ వీపని చేయుము నీ వీపనిచేయుమని చెప్పి నంతనే ప్రయోజనములేదు. ఆప్రకారము సర్వము జరిగినదని ముందుగనే తెలిసికొనియుండవలయును. కార్యము చేయుచు నదిలే దిదిలే దని వానికై పరువులెత్తరాదు.

—♦ దశరథుఁడు శ్రీరాములను సభకుఁ బిలిపించుట. ♦—

ఉ॥ అంత సుమంత్రు ఱేఁడు సుకృ♦తాత్మకు నిప్పుడ రామచంద్రు నా
పొంతకుఁ దోడి తెమ్మనుడుఁ♦బోయె నతండును దోడి తేర; భూ
కాంతుఁడు నాల్గుదిక్కులను♦గల్గునృపాళులు మ్లేచ్ఛవర్యశై
లాంతవనాంతవాసులు న♦యంబున సూరెలఁ గొల్వఁ గొల్వునన్. ౬౪

ఱేఁడు=రాజు-ఇది రాట్ శబ్దభవము-సుకృతాత్మకున్ = పుణ్యవంతమైన మనస్సుగలవానిని, మ్లేచ్ఛవర్య=మ్లేచ్ఛులందు శ్రేష్ఠులు, శైలాంతవనాంత వాసులు=కొండలయందు వనములయందు వసించువారు ఇచ్చట అంత శబ్దమునకుఁ బ్రదేశమని యర్థము, శైలాంతమనఁగా పర్వతప్రదేశమని యర్థము. సూరెలన్=ప్రక్కలందు, కొల్వునన్=సభయందు.

కం॥ అమృతాంధసులు భజింపఁగ, నమరేశ్వరుఁ డనఁగఁ బొల్చి♦యతులప్రాసా
దమున నట నుండి యుజ్జ్వల, విమలశతాంగంబునందు♦వెలిఁగెడి వానిన్.

అమృతాంధసులు=అమృతమాహారముగాఁ గలవారు దేవతలు-అమరేశ్వరుఁడు=దేవతలకుఁ బ్రభువు-ఇంద్రుఁడు, అతుల=అసమానమైన, ప్రాసాదమున= మేడఇంటియందు,అటనుండి=ఆ మేడయందుండియే(వీథివెంటవచ్చు రాముని

జూచెనని యన్వయము) ఉజ్జ్వల=ప్రకాశించు, విమల=మలినములేని, శతాంగంబునందున్=తేరియందు.

౬౪-౬౫ తాత్పర్యము

వసిష్ఠవామదేవులు సర్వము సిద్ధమని చెప్పఁగానే దశరథుఁడు సుమంత్రునితో శ్రీరామచంద్రమూర్తిని నాయొద్దకుఁ బిలిచికొనిరమ్మని చెప్పఁగా నతఁడు వెడలిపోయెను. దశరథుఁడు కొలువుకూటమునందు సుధర్మయందు దేవేంద్రుఁడు దేవతలచేఁ గొలువఁబడునట్లు మ్లేచ్ఛప్రభువులచేతను పర్వత వనవాసులగు నధిపతులచేతను గొలువఁబడుచుండి యసమానమైన యా మేడ మీఁదనుండియే నిర్మలమై ప్రకాశించు తేరిమీఁద వచ్చువానిని.

సీ॥ కనియెను శ్రీరాముఁ◆గమనీయగుణధాము,సారంగగమనుఁ గం◆జాతనయను
నాజానుబాహు నీ◆లాంబుదసమ దేహు,మిహికాంశువదను గాం◆భీర్యసదను
గంధర్వపతితుల్యుఁ◆గరుణారసాతుల్యు, సన్నుతతత్త్వుఁ బ్ర◆శస్తసత్త్వు
నౌదార్యగుణసాంద్రు◆నఖిలావనాతంద్రు, నగధీరు లోకతా◆పాపహారు
తే॥ భయపఘర్మాభితప్తభూ◆ప్రజల కెల్ల, హర్షదుండగుపర్జన్యు◆నట్టివాని
మహితరూపగుణౌదార్య◆మహిమఁకలిమిఁ,
పురుషునసమానుఁ◆దాఁజూచు◆పుచ్చువాని. ౬౬

కమనీయగుణధామున్=మనోహరములైన కల్యాణగుణములకు స్థానమైనవాని; ధామశబ్దమునకుఁ దేజస్సనియు నర్థముగలదు. కావున సూర్యుఁడు కానవచ్చినను గానరాకున్నను గిరణములచేతనే యెట్లు లోకమిత్రుఁడై వర్తించునో యెట్లు చంద్రుఁడు తనశీతకిరణములచే లోకమును రంజింపఁజేయునో యట్లు రామునిఁ జూచినవారు చూడనివారుకూడ నాయన గుణములను విని కని యాయన తమకు మిత్రుఁడనియు సంతోషమే కలిగించువాఁడనియుఁ దలఁచి సంతోషింతురు. సారంగగమనున్=మదించిన యేనుఁగు నడకవంటి నడక గలవానిని. మిక్కిలి గర్వముగల వాఁడు విలాసముగా నడచుటవలె-మదముచే మందమై యందమైన నడకగలవానివలె నడచువాఁడు- గర్వముగలవారు టాకుటీకుగా నడచుటకు గర్వము కారణము. ఆనడకయు సహజముకాదు. రాముని నందో యట్టినడక సహజము. గర్వమువలన వచ్చినదికాదు. గొప్పగుణములు గలవారినడకయు గొప్పగానేయుండును. మృగము లన్నిటిలో గొప్పదియగు నేనుఁగు గుణములచే గొప్పదియై యాగుణమునకుఁ దగినట్లుగ నడచును క్షుద్ర జంతువు లట్లు నడవఁజాలవుకదా కంజాతనయనున్=కమలములవలె విశాలమై మనోహరమైన కన్నులుగలవానిని; ముఖమునకుఁ గన్నులందము. జింక చిన్న జంతువైనను దానికన్నులు విశాలము లగుటచే మృగముకూడ నందముగఁ గానవచ్చును. అట్టులే యేనుఁగునకుఁ బరిమాణమునకుఁ దగిన కన్నులులేకచిన్న కన్నులు కలదయి యున్నది. రామునకో జగన్మోహనములై ఆకర్ణాంతములై

పర్జన్యనట్టివాని= వర్షాధిదేవతవంటివానిని ఎండకాలమున మండు నెండలచేఁ దాపముఁగొన్న జనులు వర్షించు మేఘమునుజూడఁగానే యెట్లుసంతోషింతురో యట్లు తనదర్శనముచేతనే లోకుల తాపముల నన్నిటిని బోఁగొట్టువానిని.

మీఁదవ్రాసిన కొన్ని విశేషణములందుఁ గొప్ప విశేషణములు స్ఫురించు చున్నవి. గంధర్వ పతితుల్యన్=గంధర్వులు కామసౌఖ్యమునకు సౌందర్యము నకుఁ బ్రసిద్ధులు. తీక్ష్ణకామాశ్చగంధర్వా యని కలదు గదా. అట్లైనచో కామ సౌఖ్య సౌందర్యములు స్త్రీలయందును గలవుగదా యట్టివాఁడా రాముఁడని వ నట్లుగాదు సన్నుత తత్త్వుఁడనుటచే 'రాకేందు బింబమై రవిబింబమై యొప్పు నీరజా తేక్షణ నెమ్మొగం' బన్నట్లు సౌందర్యమునకుఁ దోడు పౌరుషమును గల దని భావము. అజానుబాహువనుటచేఁ బౌరుషమునకుఁ దగిన యాకారముప్రశస్త సత్త్వ ననుటచే దానికిఁదగిన బలము గలవని భావము. సారంగ గమను నను టచే నట్టి బలపౌరుషములు గలవాఁడెట్లు నడవవలయునో యట్లు నడుచువాఁడని తాత్పర్యము.

ఎండకాలమున సూర్యుఁ డెండచే లోకము తపింపఁజేయుట తన ప్రతా పముఁ జూపి లోకుల బాధింపవలయునను క్రూరబుద్ధిచేఁ గాదు. హిమ శిశిర ఋతువులందు మంచుచేఁ జెడిన యోషధులను మనుష్యులను మరల నుజ్జీ వింపఁ జేయుటకే. వాతరోగికిఁ దాపకర సేవసేయుట సుప్రసిద్ధమేకదా. అంతియకాదు. సూర్యుఁడట్లు తపింపఁజేయుట మరల వర్షము కురిపించుటకే. అట్లులే రాముని బలపౌరుషములని భావము. దీనివలన భగవంతుఁడు మనకుఁ గలిగించు తాపములు పూర్వకృత పాపము నశింపఁజేసి యుత్తరకాలమున సంతోషము గలిగింపఁ జేయుటకేకాని మనల దుఃఖితులఁ జేయవలయునను తలఁపునఁ గాదని వ్యంగ్యము. మహిత శ్లాఘ్యములగు, రూప=సౌందర్యము, గుణ=సౌశీల్యము, ఔదర్య=దానగుణము; వీని మహిమ=గొప్పతనముయొక్క కలిమిన్=సంపదచే, గుణ్యతే ఇతిగుణః అను వ్యుత్పత్తినిబట్టి సదా జను లచే ధ్యానింపఁబడు సౌశీల్యగుణమని యర్థము. గొప్పవాఁడు తన గొప్ప తనము నెంచక యల్పునితోఁ గలసి మెలసి యుండుటకు సౌశీల్యమనిపేరు. అహో నక్కయెక్కడ, నాకలోక మెక్కడ? నన్నట్టు లల్పులమైన మనమెక్కడ మహారాజకుమారుఁడు మహానుభావుఁడు నగు రాముఁడెక్కడ. అటువంటివాఁడు మన నీచత నెంచక మనలో నొకఁడుగఁ గలసిమెలసి తిరుగుచు మనకుఁ దెలియ నివి తెలుపుచు మంచికార్యములు చేయుఁ బ్రేరేపించుచు మన కోరికలఁ దీర్చు చున్నాఁడే యని లోకులాశ్చర్యముతో సర్వదా యాయననే ధ్యానించునట్టి సౌశీల్యము గలవాఁడు. ఔదార్యము=దానముచేయుగుణము ఈగుణములచేఁ బరుషములైన పురుషుల మనస్సులనైనఁ గొల్లపెట్టువాఁడు. ఇటువంటి శ్రీరాముఁడు దూరమునఁ దేరిపైఁ గూర్చుండి వచ్చుచుండ దశరథుఁడు తన మేడపైనుండి చూచెను.

పర్జన్యునట్టివాని= వర్షాధిదేవతవంటివానిని ఎండకాలమున మండునెండలచేఁ దాపముఁగొన్న జనులు వర్షించు మేఘమునుజూడఁగానే యెట్లుసంతోషింతురో యట్లు తనదర్శనముచేతనే లోకుల తాపముల నన్నిటిని బోఁగొట్టువానిని.

మీఁదవ్రాసిన కొన్ని విశేషణములందుఁ గొప్ప విశేషణములు స్ఫురించు చున్నవి. గంధర్వ పతితుల్యున్=గంధర్వులు కామసౌఖ్యమునకు సౌందర్యము నకుఁ బ్రసిద్ధులు. తీక్ష్ణకామాశ్చగంధర్వా యని కలదు గదా. అట్లైనచో కామ సౌఖ్య సౌందర్యములు స్త్రీలయందును గలవుగదా యట్టివాఁడా రాముఁడనిన నట్లుగాదు సన్నుత తత్త్వుఁడనుటచే 'రాకేందు బింబమై రవిబింబమై యొప్పు నీరజా తేక్షణ నెమ్మొగం' బన్నట్లు సౌందర్యమునకుఁ దోడు పౌరుషమును గల దని భావము. అజానుబాహువనుటచేఁ బౌరుషమునకుఁ దగిన యాకారముప్రశస్త సత్త్వు ననుటచే దానికిఁదగిన బలము కలవని భావము. సారంగ గమను నను టచే నట్టి బలపౌరుషములు గలవాఁడెట్లు నడవవలయునో యట్లు నడుచువాఁడని తాత్పర్యము.

ఎండకాలమున సూర్యుఁ డెండచే లోకము తపింపఁజేయుట తన ప్రతా పముఁ జూపి లోకుల బాధింపవలయునను క్రూరబుద్ధిచేఁ గాదు. హిమ శిశిర ఋతువులందు మంచుచేఁ జెడిన యోషధులను మనుష్యులను మరల నుజ్జీ వింపఁ జేయుటకే. వాతరోగికిఁ దాపకర సేవసేయుట సుప్రసిద్ధమేకదా. అంతియకాదు. సూర్యుఁడట్లు తపింపఁజేయుట మరల వర్షము కురిపించుటకే. అట్టులే రాముని బలపౌరుషములని భావము. దీనివలన భగవంతుఁడు మనకుఁ గలిగించు తాపములు పూర్వకృత పాపము నశింపఁజేసి యుత్తరకాలమున సంతోషము గలిగింపఁ జేయుటకేకాని మనల దుఃఖితులఁ జేయవలయునను తలఁపునఁ గాదని వ్యంగ్యము. మహిత శ్లాఘ్యములగు, రూప=సౌందర్యము, గుణ=సౌశీల్యము, ఔదర్య=దానగుణము; వీని మహిమ=గొప్పతనముయొక్క కలిమిన్=సంపదచే, గుణ్యతే ఇతిగుణః అను వ్యుత్పత్తినిబట్టి సదా జను లచే ధ్యానింపఁబడు సౌశీల్యగుణమని యర్థము. గొప్పవాఁడు తన గొప్ప తనము నెంచక యల్పునితోఁ గలసి మెలసి యుండుటకు సౌశీల్యమనిపేరు. అహో నక్కయెక్కడ, నాకలోక మెక్కడ? నన్నట్టు లల్పులమైన మనమెక్కడ మహారాజకుమారుఁడు మహానుభావుఁడు నగు రాముఁడెక్కడ. అటువంటివాఁడు మన నీచత నెంచక మనలో నొకఁడుగఁ గలసిమెలసి తిరుగుచు మనకుఁ దెలియ నివి తెలుపుచు మంచికార్యములు చేయుఁ బ్రేరేపించుచు మన కోరికలఁ దీర్చు చున్నాఁడే యని లోకులాశ్చర్యముతో సర్వదా యాయననే ధ్యానించునట్టి సౌశీల్యము గలవాఁడు. ఔదార్యము=దానముచేయుగుణము ఈగుణములచేఁ బరుషములైన పురుషుల మనస్సులనైనఁ గొల్లపెట్టువాఁడు. ఇటువంటి శ్రీరాముఁడు దూరమునఁ దేరిపైఁ గూర్చుండి వచ్చుచుండ దశరథుఁడు తన మేడపైనుండి చూచెను.

శ్రీకృష్ణుఁడు గొల్లెతల మనస్సులను దనవంకకు లాగుగొనుటకై వారి వెన్న పాలు మీఁగడ హరించెను. శ్రీరామచంద్రమూర్తియో తన సౌందర్యాతిశయమునను సౌశీల్యముచేతను దానాతిశయముచేతను కఠినములైన పురుషుల మనస్సులను గూడ నాకర్షించెనన పుష్పకోమల కోమల హృదయముల నాకర్షించుట వింతయా. ఇట్లు స్త్రీలయుఁ బురుషులయు మనస్సులను గొల్లకొట్టుటచే వారియందు మనస్సు అనునది లేక యది రామచంద్రునందే లయమైపోఁగా చిత్తరువులవలె గాఢసమాధినున్న యోగులవలెఁ దన్మయత్వము చెందిన భక్తులవలెఁ బ్రియవియోగంబున దశమావస్థకుఁ బాలైన కామినులవలె నైరని భావము.

పురుషులు పురుషుల మోహించుట యన రసాభాసముగదా యందురేమో. మనము స్త్రీలై పుట్టియుండిన నిట్టి పురుషునితో సంభోగించు నదృష్టము కల వారమై యుందుముకదా. అట్టి భాగ్యము మనకు లేదాయెగదా, యని పురుషులువ్విళులూరుచుందురని భావము. పురుషులట్లు తలఁపఁజేయు సౌందర్యము గలవాఁడు రాముఁడని భావము. "శ్లో॥ పాంచాల్యాః పత్రాక్ష్యా స్స్నాయంత్యా జఘనంఘనం. యాస్త్రీయోదృష్ట వత్యస్తాః పుంభావ మనసాయయుః" అని కలదు గదా. అనఁగా-ద్రౌపది స్నానముచేయు సమయంబున నామె పిఱుఁదులను జూచిన స్త్రీలు అయ్యో మనము మగవారము కామైతిమికదా యని విచారపడుదురఁట.

తాత్పర్యము

మనోహరములైన గుణములను స్థానమయినవానిని. మదపుటేనుఁగువలె నందముగ నడచువానిని, కమలములవంటి కన్నులు గలవానిని, మోఁకాలు దాఁకునిడుపాటి బాహువులు గలవానిని, నల్లమేఘము కాఁతివంటి కాంతిగల దేహము గలవానిని, చంద్రునివంటి ముఖముగల వానిని. గాంభీర్యమునకు నెలవైనవానిని, గంధర్వరాజుతో సమానుని, దయయందు నసమానుని, సజ్జన స్తుతి ప్రాతమగు తత్త్వము గలవానిని, బొగడఁదగిన బలము సత్త్వగుణము గలవానిని, మిక్కిలి యుదారగుణము గలవానిని లోకుల నందఱను రక్షించుట యందు హెచ్చరికగలవానిని ధైర్యమునందుఁ బర్వతమువంటి వానిని జనుల తాపత్రయము లణఁచువానిని నెండ వేఁడిమికి సొటసొటలాడు జనులకు సంతోషమిచ్చు వానదేవతవంటి వానిని,అతిశయించిన సౌందర్యగుణముచేతను ఉదారత్వముచేతను బురుషుల మనములైనఁ గొల్లపెట్టువానిని శ్రీరామచంద్ర మూర్తిని జూచెను.

కం॥ చూచియుఁ జూచియు నెంతేఁ, జూచియుసంతృప్తిలేక•సొక్కుచు నుండన్
వే చనుదెంచె రథం బా,రాచసగిరిద్వారసీమ•రహి డాయంగన్. ౬౭

చూచియు=అదాటునఁ జూచియు, చూచియు=అంతతోఁ దృప్తిలేకమరల మరలఁ జూచియు. ఎంతేఁజూచియు=అంతతోను దృప్తిలేక యేకాగ్రదృష్టితోనేకాగ్రమనస్సుతోఁ జూచియు. సంతృప్తిలేక=పూర్ణముగాఁ దృప్తిపడక; సొక్కుచు

నుండన్=తన్మయత్వమున మైమఱపు చెందుచుండఁగా, ఇది పరభక్తి-పరజ్ఞాన-పరమభక్తిపంటిదని యెఱుంగునది. అత్యంత రుచిగల పదార్థమును ముక్కు మునుఁగఁ దినినను ఇంకను దిందమా యని యాశయున్నటులని యూహించునది వేయనునదికళ. కావున పరమైన చకారము జకారము కాలేదు. డాయంగన్ సమీపించునట్లు.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తిని ఱెప్పార్పక చూచి చూచి యెంతచూచినను సంతుష్టిలేక తదేక ధ్యానానందముచే మైమఱపు వచ్చుచుండఁగా శ్రీరామచంద్రమూర్తి యెక్కినతేరు రాచనగరి వాకిటవచ్చి నిలచెను.

తే॥ అంతటసుమంత్రుఁ డవనిజా•కాంతునకును,
దానుగ్గై దండ యొసఁగి ర•థంబునుండి
దించి తండ్రిని గనఁబోవు•దేవనిభుని,
వెనుకఁ బ్రాంజలి యగుచును•జనుచుచుండె. ౯౮

అవనిజాకాంతునకును=సీతానాథుఁడైన శ్రీరామునకు, కైదండ=ప్రభువులకు సుకుమారస్త్రీలకు నెత్తునుండి దిగునపుడు అలసినపుడు పరిచారకులూఁతగా చేయి యిచ్చుట, ప్రాంజలి=చేతులుమోడ్చినవాఁడు.

తాత్పర్యము

ఇట్లు రథము నిలువఁగా సుమంత్రుఁడు తాను ముందుగా రథము దిగి రామచంద్రమూర్తికి చేయియూఁత యియ్యఁగా నాయనదిగి తండ్రియొద్దకుఁ బోవుచుండఁగా సుమంత్రుఁ డాయన వెనుఁక జేతులు జోడించుకొని పోవుచుండెను.

కం॥ జనకునిఁ గనుసుత్సుకతన్, జనవర్యుం డుండురాజ•సదనాగ్రంబున్
జనకసుతాపతి యెక్కెను,వినయంబున యెూడ్పుఁగేలు•వెలయం దఱిసెన్

కను + ఉత్సుకతన్=చూడవలయునను కోరికతో, సదనాగ్రంబున్=ఇంటిపై భాగమును, మేడమీఁదికని యర్థము. తఱిసెన్=సమీపించెను.

కేలుమోడ్చి సమీపించె ననుటచే గురువులయొద్దకుఁ బోవుటకు ముందే చేతులు జోడించుకొని పోవలయునని సూచితము.

తాత్పర్యము

తండ్రిని జూడవలయునను సంతోషముతో నాయనయుండు మేడమీఁదికి రామచంద్రమూర్తిపోయి రెండుచేతులు జోడించుకొని తండ్రిని సమీపించెను.

ఉ॥ పంబినభక్తి రాముఁడను•వచ్చితి నంచును దండవత్ప్రణా
మం బొనరించి నిల్వ సుతు•మానవపాలుఁడు చూచి హర్ష వే
గంబునఁ గౌఁగిలించుకొని•కాంచనరత్న మయాసనంబునం
దింబుగ నుండఁగా రఘుకు•లేశ్వరు రాముని బంచెనర్మిలిన్. ౧౦౦

పంబినభక్తిన్=అతిశయించిన భక్తిచే, దండవత్ప్రణామంబు=కట్టెవలె సాఁగిలబడి చేయు నమస్కారము. కాంచన రత్నమయాసనంబునన్=బంగారు రత్నములచే నిండిన యాసనమందు. ఇంబుగన్=చక్కఁగ, అక్కిలిన్=ప్రేమతో పంచెన్=ఆజ్ఞాపించెను. దండప్రణామలక్షణము. నిధాయదండవద్దేహం ప్రసార్య చరణౌకరౌ। బద్ధ్వా ముకుళవత్పాణీ। ప్రణామో దండసంజ్ఞితః॥ కట్టెవలె దేహమును నేలఁబడవైచి చేతులు కాళ్ళు చాచి రెండుచేతులు మొగ్గవలె ముకుళింపఁ జేసినచో ప్రణామమగు దండవత్ప్రణమేద్భూమా। వుపేత్యగురుమన్వహమ్. గురువులకుఁ బ్రతిదినము దండమువలె నేలఁబడి నమస్కరింపవలయునని ప్రమాణము. ఆశీర్వచనార్థము చేయు నమస్కారము అభివాదన మనఁబడును. ఎవరికెట్టు లాశీర్వదింపవలయునో యది తెలియని బ్రాహ్మణుఁడు శూద్రుఁడు గావున నట్టిబ్రాహ్మణునకు నభివాదనము చేయరాదు. అభివాదనమందు భోశబ్దము కడపట రావలయును బ్రాహ్మణుఁడు శర్మయని క్షత్రియుఁడు వర్మయని తన పేరునకు గడపటఁ జేర్పవలయును.

తాత్పర్యము

ఇట్లు సమీపించి 'రామవర్మాహమస్మిభో;యని దండాకారముగ సాష్టాంగ నమస్కారము చేసి లేచి నిలువఁగ రాజకుమారునిఁజూచి సంతోషాతిశయముచేఁ గౌఁగిలించుకొని ప్రీతితో నాయనా రామచంద్రా యా బంగారు పీఠముపైఁ గూర్చుండుమని చెప్పెను.

కం॥ దిననాథుఁ డుదయసమయం,
బున మేరువుఁ గాంతియుక్తంబుగఁ జేసెడివా
డ్కని రాముఁడు తత్పరమా,సనమును రహి మీఱఁ జేసెఁ స్వప్రభమహిమన్

తాత్పర్యము ౧౦౧

సూర్యుడుదయకాలమునఁ దనకాంతిచే మేరుపర్వతమును బ్రకాశింపఁ జేయునట్లు రామచంద్రమూర్తి బంగారుపీఠమును దనకాంతిచే వెలుఁగఁజేసెను. దీనివలనఁ బెద్దలు చెప్పక తమకుఁదామే కూర్చుండరాదని సూచన.

కం॥ కౌసల్యాసుతసహితం,బై సభ రాజిల్లెఁ బెక్కుఁ బగుచుక్కలచే
భాసుర మగుశరదభ్రము, వాసి సుధాకరునిచేతఁ భాసిలుభంగిన్ ౧౦౨

భాసురము=ప్రకాశించు-శరదభ్రము= శరత్కాలమందలి యాకాశము-శరత్కాలమున మేఘములు లేక యాకాశము నిర్మలమైయుండును. అట్టికాలమున నక్షత్రముల నడిమి చంద్రుఁడనుటచే శ్రీరాముని తేజస్సునందు తక్కిన వారి తేజస్సు లీనమై ప్రకాశ రహితములైనవని భావము. సుధాకరునిచేన్=చంద్రునిచేత భాసిలుభంగిన్=ప్రకాశించు విధమున.

తాత్పర్యము

అనేక నక్షత్రములచేఁ బ్రకాశించు శరత్కాలమందలి యాకాశము చంద్రునిచే మిగులశోభిల్లునట్లు నానారాజులచేఁ బ్రకాశించు నాసభ శ్రీరామచంద్రునిచే మిగులఁ బ్రకాశించెను.

కం॥ అద్దంబునఁ గన నగుతన, నిద్దపురూపంబు వోలె♦నృపతియుఁ దనయు
ట్లద్దిర వెలుంగురాముని,
ముద్దులసుతుఁ గాంచి మిగుల♦మురియుచుఁ దనలోన్ ౧౦౩.

అద్దిర ఆశ్చర్యార్థకము. అద్దమునఁ దనయాకారమేయున్న దున్నట్లు కానవచ్చును.అట్లే రాముఁడు దశరథునిపోలి యున్నాఁడని భావము. రామదశరథులకుఁ బోలిక రామాయణమున రెండుమూఁడుచోట్లఁ జెప్పఁబడినది. స్త్రీ పతివ్రతయగునేని యామెకొడుకు తండ్రినిబోలుట వింతగాదు. ఆత్మావై పుత్ర నామాసి యని అంగాదంగా త్సంభవసి యని కలదుగదా. రతికాలమందు పతినే స్మరించుచు ఋతుస్నానముకాఁగానే మఱియెవరినిఁ జూడకముందే తొలుతొల్త భర్తనుజూచిన స్త్రీకి జనించెడికొడుకు తండ్రినిబోలి యుండును.

తాత్పర్యము

అద్దములోఁ గానవచ్చు తనప్రతిబింబమువలెఁ నగవడు ముద్దుల కుమారుని జూచి తండ్రి యాహా నేనెంత యదృష్టవంతుఁడను ఇట్టి కుమారుఁడు నాకుఁ గలిగెఁ గదా ఇంతకంటె నాకు రాగల సుఖశుభసంతోషము లేవిగలవని తనలోనే రాజు మురియుచుండెను.

కం॥ చిన్ని చిఱునవ్వు మోము, స్వన్నియ చిలుకంగ హొయల♦వఱలెడివానిన్
జిన్నారిసుతునిఁ గనుచుం, గన్నారఁగ ననియె హరికిఁ♦గశ్యపురీతిన్.౧౦౪

చిన్ని=మనోజ్ఞమైన 'చిన్నియన్నలార మన యశోద చిన్నమగవానిఁగనెనఁట' యని భాగవతము హరికిన్=ఇంద్రునకు, హొయలన్ = విలాసముచే.
చిన్నారి=అందము.

తాత్పర్యము

ముద్దులగురియు నెమ్మోమునకు నందమైన చిఱునవు వన్నె పెట్టినట్టుకాఁగా సొగసుచే నతిశయించిన తనగారాబుకొడుకును గన్నులకఱవుదీరఁ జూచుచు నింద్రునకుఁ గశ్యపుఁడు చెప్పినట్లు చెప్పెను.

—♦ దశరథుఁడు శ్రీరామునకుఁ దనయభిప్రాయంబుఁ దెలుపుట ♦—

ఉ॥ నాయన రామచంద్ర! నిను♦నాయనురూపగుణాఢ్య పట్టపుం
దోయజనేత్రయందు సుత♦నూజునిఁ గంటిని, నీవునున్ మహో
మేయగుణాళి లోకులకు♦మెచ్చొనరించితి, పుష్యయోగమం
దే యువరాజుఁ జేయ మది♦నెంచితి నిన్నుఁ గుమారకాగ్రణీ! ౧౦౫

నాయనురూపగుణాఢ్య=నాగుణములవంటి గుణములనెడి సంపత్తిగలది.పట్టపుందోయజనేత్ర=పట్టము నాతోడఁగట్టుకొని నాతోడ సింహాసనమందుఁ గూర్చుఁడిన స్త్రీయందు నిన్నుఁ గుమారునిగాఁ గంటిని. ఇట్లనుటచే నీవు జన్మమువలననే రాజ్యార్హుఁడవని భావము కౌసల్య (1) యనురూపగుణవతి (2) పట్టపుదేవి కావునను అట్టి యామెయందుఁ బుట్టినను నీవు మంచిపుత్రుడ వగుటను రాజ్యార్హుఁడని భావము. కుమారకాగ్రణీ=జ్యేష్ఠకుమారుఁడా? నీవు పెద్దకుమారుఁడవు కావున నీవే రాజ్యార్హుఁడవు. నీకుఁదప్ప మఱియొకనికి నేసియరాదు. జన్మము వలనఁ గలిగిన యీ విశేషములేగాక నీయందు స్వతస్సిద్ధమైన యోగ్యతయుఁ గలదు. అదియే దన ప్రజలు మెచ్చుకొనునట్టి గుణములుగలవాఁడగుట.మీఁదఁ జెప్పినయన్ని గుణము లుండియు ప్రజలు సంతోషింపని నడవడిగలవాఁడు రాజ్యార్హుఁడుకాఁడు. మెచ్చొనరించితి=మెప్పుపుట్టఁజేసితివి - పుష్యయోగము=పుష్యనక్షత్రముతోఁ గూడినదినము, రాముఁడు పునర్వసువునందుఁ బుట్టినవాఁడగుటచే పుష్యము సంపత్తారయగుచున్నది. పుష్యమి యనుట సరికాదు.

తాత్పర్యము

నాయనా కుమారా రామచంద్రా నాకుఁదగిన గుణసంపత్తి గలదియు నాపట్టపుదేవియు నగు కౌసల్యా దేవియందు నిన్ను సత్పుత్రుని గంటిని.నీవును గొప్పగుణములు గలవాఁడని లోకులచే మెప్పుపడసితివి. కావున జ్యేష్ఠనందనా నిన్ను ఱేపు యువరాజుగాఁ జేయ నాలోచించితిని.

కం॥ నీవు స్వభావముచేతనె, వావిరి వినయంబు సుజన•వర్ణిత గుణసం
భావనయుం బొందితి; నీ, కేవిధమున నీడు లేమి•యెఱుఁగుదు నరులన్.

స్వభావముచేతనే=సహజముగ, వావిరి=అధికముగ, సుజనవర్ణిత గుణసంభావనయున్=సజ్జనులచేఁ గీర్తింపఁబడిన సద్గుణముల గౌరవము. ఈడు=సమానము. కొందఱు వినయమును సద్గుణములను శాస్త్రజ్ఞానమువలన, గురూపదేశమువలన లోకానుసరణమువలనఁ బ్రాయము వచ్చినపుడు నేర్చుకొందురు. రామునకో యవి సహజములు.

తాత్పర్యము

నీకు పుట్టువుతోడనే వినయము సజ్జనశ్లాఘ్యమైన సుగుణములు వచ్చినవి. నీకు సమానులు మనుష్యులందు లేరని నాకుఁ దెలియును.

మత్తకోకిలము. నీ వెఱుంగని యట్టినీత్యవి•నీతు లున్నవె యెందునే?
నేవి క్రొత్తగ నీకు నేర్పఁగ•నేను నేర్తుఁ గుమారకా!
భావితాదృతిఁ జేసి పుత్రక•వత్సలత్వముపేర్మి నే
నేవియో యొకకొన్నిటిన్ వచి•యించెద న్వీను నందనా! ౧౦౪

నీతి + అవినీతి=నీత్యవినీతులు=నీతిదుర్నీతులు, నీతు లనుసరించుటకు-అవినీతులు పరిహరించుటకును దెలియవలెను. భావిత=పొందఁబడిన, ఆదృతిన్=ప్రీతితో-ఆదరణముతో, పుత్రక=కుమారా, వత్సలత్వము = బిడ్డలయందుఁ దల్లిదండ్రులకుండు ప్రేమయొక్క, పేర్మి = అతిశయముచేత, నందనా=కుమారా. సంతోషింపఁ జేయువాఁడు కావునఁ గొడుకునకు నందనుఁడనిపేరు.

మత్తకోకిలము:-ర-స-జ-జ-భ-ర గణములు ౧౧-వ యక్షరము యతి.

తా త్ప ర్య ము

కుమారా! నీకుదెలియని నీతులు-అవినీతులు లేవు. నేనేమి నీకుఁ గ్రొత్తగా నేర్పఁగలను. అయినను నీవు పుత్రుఁడనను వాత్సల్యము పెంపునఁ గలిగిన యాదరణముచేఁ దండ్రులు కొడుకులకు హితముపదేశించుట ధర్మము గావున నేవియో కొన్ని నీకుఁజెప్పఁదలఁచితిని. నీవు నానందనుఁ డవగుట నన్ను సంతోషింపఁ జేయుట నీకుఁదగిన కార్యము 'జీవతో వాక్యకరణాత్'. తండ్రి బ్రదికియున్నకాలమున నాయన చెప్పినట్లు విని నడచువాఁడు పుత్రుఁడనఁబడును గావున నేను జెప్పినట్లు నీవు నడచిన నేను సంతోషింతును. అట్లైన నన్నేమి చేయుమనెదవా.

దీనివలన "కం॥ ఎఱుక గలవారి కైనను, గఱుపక తక్క రుచితప్రకారము తెల్లన్। గొఱలు హితులల్లగుట నఁ! దఱకును జెప్పంగవలయుఁ దగియెడి బుద్ధుల్' భార.వి.'శ్లో॥ పిత్రాపుత్రో వయస్థోపి సతతం వాచ్య ఏవతు। యథాస్యాద్గుణ సంయుక్తః ప్రాప్నుయాచ్చమహద్యశః॥ కొడుకు వయస్సు వచ్చినవాఁడైనను వానికి సుగుణ సంపత్తి మంచి గొప్పకీర్తి యెట్లువచ్చునో యదితండ్రి యెప్పుడు చెప్పుచుండవలెను. అను నీతులు సూచితములు

సీ॥ వినయవంతుండవై•విజితేంద్రియుండవై,నిత్యసుశీలివై•నెగడవయ్య
కామంబు క్రోధంబు•గలిగించుసట్టిదు,ర్వ్యసనంబులను బ్రీతి•పడకుమయ్య
తక్షకాదిఁబరోక్ష•దశఁదన్పు మను మంత్రి,తతులసమ్ముఖమునఁ•దనుపవయ్య
ధనధాన్యములకొట్లు•తతశాస్త్రశాలలు, వెలితివోకుండఁ జూ•పెట్టవయ్య
తే॥ యిట్లు ధరయేలుచున్న న•రేంద్రుఁగాంచి,
ప్రకృతిజనులెల్ల సంతోష•భరితులగుదు
రతనిహితవర్యులెల్లరు•నమృత మొంది,
సంతసిలు వేల్పులట్టుల•సంతసింత్రు. ౧౦౦

వినయవంతుఁడవై=మిక్కిలి వినయము గలవాఁడవై అనగా నామాట కెదురాడక యని భావము. ఈ నడవడి గలవాడఁగుటచేత రామా యువరాజవు గమ్మనిన నట్టులే కానిమ్మనెను.అడవికిఁ బొమ్మనిన నట్టులే కానిమ్మనెను.తండ్రియాజ్ఞ నిర్వర్తించుట పుత్రునకు విధికాని తన కనుకూలమైన వినుట తనకుఁబ్రతికూలమైన వినకుండుట గాదు. తండ్రియాజ్ఞ తన కాపదగలిగించునా సంపద గలిగించునా యని కొడుకు యోజింపరాదు.

విజితేంద్రియుండవై=ఇంద్రియము జయించిన వాఁడవై, కామక్రోధలోభమోహాదులకుఁ బాలుపడకుము. నిత్యసుశీలివై = ఎల్లపుడు సదాచారము మాననివాఁడవై.

దుర్వ్యసనములు, వెలఁది, జూదము, పానము, వేఁట, పరుషముగఁ బలుకుట, కఠినముగ శిక్షించుట, ధనము వ్యర్థముగ వ్యయముసేయుట, ఇవి యేడును వ్యసనములు.

వేఁట, జూదము, పగటినిద్ర, అపనింద, స్త్రీచాపలము, మదము, నృత్తము, గీతము, వాద్యము, వ్యర్థమైన నడక ఇవి కామమువలనఁ గలుగు వ్యసనములు కొండెములు చెప్పుట, సాహసము, ద్రోహము, ఈర్ష్య, అసూయ, ధననాశము వాక్పారుష్యము, కఠినశిక్ష ఇవి క్రోధమువలనఁ గలుగు వ్యసనములు.

ఈ ౧౮ యందు ప్రీతి యుంచకుము.

తక్షకాదిన్=వడ్రంగి మొదలైన వారిని, పరోక్షదశన్=అధికారుల మూలమున, తన్పుచును=తృప్తులఁ జేయుచు, సమ్ముఖమునన్ = ప్రత్యక్షముగ, కొట్లు=గదులు, తత=విస్తారమైన, శస్త్రశాలలు=ఆయుధాగారములు, వెలితిపోకుండన్=కొఱఁతలేక నిండియుండునట్లు, చూపెట్టవయ్యా=కనిపెట్టుము.

తాత్పర్యము

రామచంద్రా నీవు మిక్కిలి వినయముగలిగి యింద్రియముల జయించి సదాచార సంపన్నుఁడవై కామమువలనఁ గలుగు వ్యసనములను; క్రోధమువలనఁ గలుగు వ్యసనములను ప్రీతిపెట్టక వడ్రంగి మొదలగు పనివాండ్రను నధికారుల మూలమున సంతుష్టిపడఁ జేయుచు, మంత్రులు లోనగు వారిని నీవే సమక్షమునఁ బిలిచి దానమానాదుల సంతుష్టిపడఁ జేయుచు నుండుము. ధనశాలలు-ధాన్య-ఆయుధశాలలు కొఱఁతపడకుండునట్లు కనిపెట్టుము. ఇవి కావలసినపుడు సంపాదింతమని యుపేక్షింపకుము.

ఈప్రకారము రాజ్యముచేయు రాజును జూచి మంత్రులు అధికారులు ప్రజలు లోనగు నెల్లవారు మిగుల సంతోషింతురు. ఆరాజు మిత్రులను అమృతము ద్రావిన దేవతలవలె నానందభరితులై శత్రువులవలని భయము విడిచి సుఖులై జీవింతురు.

ఈ పద్యమున మొదటిపాదమునఁ జెప్పిన వినయము జితేంద్రియత్వము సుశీలము సర్వజనులు ననుష్ఠింపఁ దగినవి శ్రీరామచంద్రుఁడు వినయవంతుఁడు గనుకనే నేరమేమిచేయకయుఁ దండ్రి వాక్యమని యడవులపాలాయెను. జితేంద్రియుఁడు కనుకనే కైకమీఁదఁ గాని తండ్రిమీఁదఁగాని కోపింపక యేకాంతమున భార్యాయుక్తుఁడై పదమూఁడు సంవత్సరము లుండియు నస్ఖలిత బ్రహ్మచర్య వ్రతనిష్ఠుఁడై యుండెను. నిత్యసుశీలి గనుకనే సీతను విడిచియు మరల వివాహము చేసికొనక స్త్రీసాంగత్య మపేక్షింపక 'పుత్రార్థం

నోద్వ హేదన్యాం కర్మపుత్రాహి యోగినః। అపుత్రోపి పరంయాతి కర్మీ;నా న్యోపి సత్సుతః॥ అను నిష్ఠయందు నిలిచినవాఁడు. పుత్రులు లేరని పురుషుఁడు రెండవ వివాహము చేసికొనరాదు. వారివారి పుణ్యకర్మమే వారివారిని నుద్ధ రించును. కావునఁ బుణ్యకర్మములు చేయువాఁడు పుత్రులు లేకున్నను నూర్ధ్వ లోకమున సుఖించును. అట్టి కర్మములు చేయనివాఁడు పుత్రులుగలవాఁడైనను పుణ్యలోకముల నుండఁజాలఁడని శ్లోకార్థము. ఈవిషయమున సీతాదేవి వాక్య ములు స్మరించునది. అరణ్యకాండము ౧౦౭-౧౦౮ పద్యములు చూడుము.

వినయవంతుండవై ="శ్లో. తేభ్యోధి గచ్ఛేద్వినయం। వినీతాత్మాపి నిత్యశః। వినీతాత్మాహి నృపతి ర్వినశ్యతిన కర్హిచిత్. సహజబుద్ధిచేతను, అర్థశాస్త్రము మొదలగువానియందలి జ్ఞానముచేతను, శిక్షితుఁడైనను పెద్దలవలన వినయము నేర్వవలయును. వినయవంతుఁడైన రాజెన్నఁటికినిఁ జెడఁడు. "శ్లో॥ బహవోఽ వినయాన్నష్టాః, రాజానస్సపరిచ్ఛదాః। వనస్థాఅపిరాజ్యాని, వినయాత్ప్రతి పేదిరే. అవినయముచేఁ బెక్కురురాజులు సపరివారముగా నశించిరి. అడవియం దొంటరిగానుండు వారైనను, వినయముచే రాజ్యమును సంపాదించుకొనిరి. శ్లో॥ వేనో వినష్టోఽవినయా। న్నహుషశ్చైవపార్థివః। సుదాసో యావనశ్చైవ సుముఖో నిమిరేవచ॥ వేనుఁడు, నహుషుఁడు సుదాసుఁడు సుముఖుఁడు నిమి వీ రవినయముచేఁ జెడిరి. "శ్లో॥ పృథుస్తు, వినయాద్రాజ్యం, ప్రాపవాన్ మను రేవచ, కుబేరశ్చ ధనైశ్వర్యం, బ్రాహ్మణ్యం చైవగాధిజః॥ వినయముచే పృథుచక్రవర్తి-మనువు రాజ్యము సంపాదించిరి. కుబేరుఁడు ధనైశ్వర్యము, విశ్వామిత్రుఁడు బ్రాహ్మణ్యము సంపాదించిరి, మను-౭-వ అధ్యాయము. విజితేంద్రియుండవు. "ఇంద్రియాణాం జయేయోగం। సమాతిష్ఠేద్దివానిశమ్। జితేంద్రియోహి శక్నోతి. వశేస్థాపయితుం ప్రజాః॥రాత్రిపగలు నింద్రియముల జయింపఁ బ్రయత్నించుచుండవలయును. ఇంద్రియముల జయించిన వాఁడే ప్రజలను వశపఱచుకొనఁగలఁడు. "దశకామసముత్థాని తథాష్టౌ క్రోధజానిచ. వ్యసనాని దురంతాని, ప్రయత్నేన విసర్జయేత్॥ కామమువలనఁ బదిక్రోధము వలనఁ గలుగునని యెనిమిది నగు కష్టకారణములగు వ్యసనములను ప్రయత్న పూర్వముగ వదలవలయును."శ్లో॥ కామజేషు ప్రసక్తోహి, వ్యసనేషు మహీపతిః॥ వియుజ్యతేర్థ ధర్మాభ్యాం, క్రోధజేష్వాత్మనైవతు కామము వలనఁ గలుగు వ్యసనములం దాసక్తుఁడగువాఁడు అర్థధర్మముల నాశముచేసికొను చున్నాఁడు క్రోధమువలనఁ గలిగిన వ్యసనములం దాసక్తిగలవాఁడు తనదేహమును నాశముచేసి కొనుచున్నాఁడు. "మృగయాక్షోదివాస్వప్నః। పరివాదః స్త్రియోమదః। తౌర్యత్రికం వృథాట్యాచ కామజో దశకోగుణః॥ వేఁట - జూదము - పగటినిద్ర - పరనింద - స్త్రీసాంగత్యము -

పానమువలన మదము-నృత్తగీతాదులు-వ్యర్థసంచారము-ఇవి కామమువలనఁ బుట్టునవి. ఇవి కడపట వ్యసనమునకుఁ గారణము లగుటచే వ్యసనము లని చెప్పఁబడినవి. ఇవి మితముగనైన దోషములుకావు. అదియేపిచ్చిగా వాని యందు మనస్సు లగ్నముచేసి చేయవలసిన యితర కార్యములకు హానిగలి గింపరాదు ప్రజలకు-పశువులకు-వన్యమృగములవలన బాధగలిగినప్పుడు వేఁట దుష్టముగాదు. ఋతుకాలముల స్వస్త్రీతో సంభోగించుట దుష్టముగాదు. రాత్రి మేలుకొని యుండుటచేతనో యెండలోఁ దిరిగిన బడలిక చేతనో పగలు నిద్రిం చుట చెడ్డకాదు ఇట్టులే తక్కినవి. శ్లో॥ పైశున్యం సాహసం, ద్రోహ ఈర్ష్యా సూయార్థదూషణమ్। వాగ్దండంచ పారుష్యం క్రోధజోపి గుణోష్టకః॥ కొండెము చెప్పుట, సాధువుల బాధించుట, ద్రోహము, పరులగుణముల సహింపమి అసూయ ధనము వ్యర్థము చేయుట-కఠినముగ మాటలాడుట-కఠిన దండము; ఇవి క్రోధమువలనఁ గలుగువ్యసనములు. మనువు ౭-వ అధ్యాయము.

శ్లో॥ శబ్దః స్పర్శశ్చరూపంచ,రసోగంధశ్చపంచమః। ఏకైకమలమేతేషాం వినాశ ప్రతిపత్తయే. శబ్దము- స్పర్శము- రూపము- రసము- గంధము అను నీయైదింటిలో నొక్కొకటియే నాశముచేయుశక్తిగలది యగును. ఎట్టులన నిర్మలమైన పచ్చిక దిని చాలదూరము దాఁటఁగల జింకలు వేఁటగాని పాటవిని చంపఁబడుచున్నవి. పర్వత శిఖరములందు సంచరించుచు మహావృక్షములను పేళ్ళతోఁ బెకలించు నేనుఁగులు ఆఁడేనుఁగు స్పర్శమున కాశపడి బంధింపఁబడు చున్నవి. దీపమునుజూచి భ్రమించి శలభములు దానియందుఁబడి చచ్చు చున్నవి. జలములందెందో యడుగునఁ గన్నులకుఁ గానరాకయుండుచేఁపలు ఆమిషాశచేఁ జచ్చుచున్నవి. మదపునీళ్ళవాసనకు భ్రమసి తుమ్మెద లేనుఁగుల చెక్కిళ్ళపై వ్రాలివానిచెవుల దెబ్బలచేఁ జచ్చుచున్నవి.

కామముచే రావణుఁడు- జూదముచే నలధర్మరాజులు-వేఁటచేఁ బాండు రాజు-పానముచే యాదవులు నాశమైరి.

కం॥ అని బోధించుచు నుండఁగ, విని రామునిమిత్రవరులు♦వేగ పరువునన్
జని చెప్పిరి కౌసల్యకు, జనపాలునివచనసరణి♦సంతసమారన్. ౧౧౯

అని యీ ప్రకారము, దశరథుఁడు శ్రీరామునకు రాజనీతి యుపదేశించు చుండఁగా విని శ్రీరాముని హితులు పరువునఁబోయి కౌసల్యాదేవితో "నమ్మా దశరథ మహారాజుగారు మీకుమారునకు శ్రీరామచంద్రమూర్తికి యౌవరాజ్య పట్టాభిషేకము చేయునఁట. అయనయే శ్రీరామునకుఁ జెప్పఁగా విని వచ్చితిమి" అని దశరథుఁడు చెప్పిన మాటలనెల్లఁ జెప్పిరి.ఆమెయు మిగుల సంతోషించెను.

కం॥ ఆరామామణి యొసఁగెను, శ్రీరామునివార్త యినుసుహృద్వర్యులకున్
మేరలు మీఱ ధనంబులు,హారంబులు వివిధమణిమ♦యాకల్పంబుల్. ౧౨౦

రామామణి=స్త్రీరత్నము, సుహృద్వర్యులకున్=రాముని మిత్రులకు, ఆక ల్పంబుల్=ఆభరణములు.

తాత్పర్యము

గొప్పవారి కోపము గాని సంతోషముగాని వ్యర్థముగాఁ బోదు. కావున మహానుభావురాలయిన యా కౌసల్య తనకుమారుని విషయమైన శుభవార్త తెల్పిన యతనిహితులకు విస్తారధనములు ముత్యాలసరములు నానావిధము లయిన మణులు చెక్కిన యాభరణములు కానుకగ నొసఁగెను.

ఇది సంతోషవార్త చెప్పినవారికి బహుమానమియ్యవలయుననిసూచించు చున్నది.

కౌసల్యకు ధనమెక్కడిది? ౧౬౭-వ పద్యమున మంథరావాక్యమును బట్టి (౫౬౭) కౌసల్యావాక్యము పట్టియుఁజూడ నామెయొద్ద విశేషధనములేనట్టు తోఁచుచున్నది. అదియును శాస్త్రప్రకారము స్త్రీలధనము వారి భర్తలదే కావున వారు స్వతంత్రించి భర్తయాజ్ఞ లేక వ్యయపఱుపరాదుకదా. ఈ విషయమున మనుస్మృతి "భార్యాపుత్రశ్చ దాసశ్చ। త్రయఏతేఽధనాస్స్మృతాః। యత్తేసమధి గచ్ఛంతి, యస్యైతే తస్యతద్ధనమ్॥౮-౪౧౬ అని చెప్పుచున్నది అనఁగా భార్యకొడుకు-దాసుఁడు వీరు ధనము లేనివారలు వీరెవ్వరివారో వీరిధనము వారిదే.

"తస్మాత్ స్త్రియో నిరింద్రియో ఆదాయాదాః" యని శ్రుతియుఁగలదు. ఇట్లని స్త్రీలకు సొంతధనము లేకపోలేదు. మనుస్మృతియందే (౯-౧౯౪) శ్లో॥ అధ్యగ్న్యధ్యా వాహనికం, దత్తంచ ప్రీతికర్మణి, భ్రాతృ, మాతృ, పితృ, ప్రాప్తం, షడ్విధం స్త్రీధనం స్మృతమ్" స్త్రీధన మాఱువిధములు (౧) అధ్యగ్ని (౨) అధ్యావాహనికము (౩) భర్త అత్తమామ మొదలగువారు ప్రీతిచేనిచ్చి నది (౪) తోడఁబుట్టిన వారిచ్చినది (౫) తండ్రియిచ్చినది (౬) తల్లియిచ్చి నది. ఈయాఱువిధముల ధనము స్త్రీధనమే. దీని వినియోగమందు స్త్రీ కధి కారము గలదు.

అధ్యగ్ని=వివాహకాలమందు నగ్ని కెదుట స్త్రీకి నియ్యఁబడిన ధనము అధ్యగ్ని స్త్రీధనమనఁబడును. పుట్టినింటనుండి భర్తయింటికిఁ బోవునపుడువారు వారిచ్చిన ధనము అధ్యావాహనిక మనఁబడును. ప్రీతిచే భర్తయిచ్చినది భర్తృ దత్తము. అట్టులే అన్నదమ్ములు-తల్లిదండ్రులిచ్చినదియు స్త్రీధనమే.

ఇట్టి ధనము కౌసల్యకుఁగలదని లక్ష్మణుఁడు చెప్పెను. చూడు ప. ౮౮౩ ౮౮౪.

ఇట్లు స్త్రీలకు లభించిన ధనము వారియనంతర మామె బిడ్డలకుఁ జెంద వలయును. బిడ్డలులేక భర్తకంటె ముందు మరణించెనేని భర్తకుఁ జెందవల యును. ఈ కాలమున వివాహసమయమందు వధూవరు లగ్నిసమీపమునఁ బీటలపై నుండఁగనే వారిపేర బంధువులిచ్చు వస్త్రాభరణాదులగు కానుకలను దల్లిదండ్రులో యత్తమామలో యపహరించి వాడుకొనుచున్నారు. ఇది దోషము. ఇట్టివా రధోగతుల పాలగుదురని మనుస్మృతి చెప్పుచున్నది.

శ్లో॥ స్త్రీధనానితుయే మోహా, దుపజీవంతి బాంధవాః నారీయానాని వస్త్రంవా, తేపాపాయాంత్యధోగతిమ్॥ కన్యాదాన నిమిత్తమైన శుల్కము నిషేధము అట్టులే కన్యకకై యిచ్చినది యితరులు గ్రహించుటయు నిషేధమే. ఏ బంధువులు మగఁడుగాని తండ్రిగాని యితరులుగాని భార్యయొక్కగాని పుత్రిక యొక్కగాని వాహనముగాని వస్త్రముగాని మఱియేదైనను దీసికొని స్వప్రయోజనమునకై వాడుగొందురో వారాపాపకార్యము చేయుటచే నధోగతుల పాలగుదురు. మను. ౩-౫౨. వధువు పేరఁ జదివించినవి వియ్యంకుల పరివర్తన పదార్థములలోఁ జేరవు. అట్లైన స్త్రీకి ధనము లేదనిన నేమియర్థము? పుట్టినింట నుండునపుడు తల్లిదండ్రులయో వారు లేనపుడు తోడఁబుట్టినవారలయో యనుమతిలేక వారిద్రవ్యము తాను స్వతంత్రించి వాడరాదు. భర్తయింటనున్నప్పుడు భర్తద్రవ్యముగాని భర్తకు మఱఁదులకుమ్మడిగానుండు ద్రవ్యముగాని వారి యనుమతి లేక వాడరాదు. భర్తసమ్మతిపై నతిథులకు నభ్యాగతులకు బిచ్చములకుఁగాను వ్యయము చేయుటయందు దోషప్రసక్తియేలేదు. భర్త యూరలేనపుడు నైమిత్తిక కర్మములందు దానము చేయుట భర్తయాజ్ఞ లేక పోయినను దోషముగాదు అనఁగా భర్తశ్రేయస్సునకై యాకార్యము చేయక పోయినచో భర్తకుఁ బ్రత్యవాయము కలుగునేని దానిఁదొలఁగించుటకై భర్త యాజ్ఞ లేకయే భార్యచేయు దానము దోషయుక్తముగాదు. అటుగాక తన యిష్టప్రకారము భర్తసొత్తు వినియోగించెనేని దొంగతనము చేసినపాపము ననుభవించును దీనికిఁ బ్రమాణము ఆపస్తంబులు "నహిభర్తుర్విప్రవాసే నైమిత్తికే దానేస్తేయ ముపవిశంతి."

చం॥ జనకుని సన్నతిందనిపి• స్యందనమెక్కి రఘూత్తముండు దాఁ
జనియె నిజాలయంబునకుఁ• జయ్యనఁ బౌరు లనుజ్ఞఁ గొంచుచున్
జని తమకోర్కి పండుటకు• సమ్మతి మీఱఁగ నిల్లువేల్పులన్
దనిపి రభీష్టపూజనవి• ధానములం గడు సంప్రహృష్టులై.　౧౧౧

సన్నతిన్=విధివిహితమైన నమస్కారముచే, తనిపి=సంతోషపడఁజేసి; స్యందనము=రథము, నిజాలయంబునకున్=తన యింటికి, చయ్యన=త్వరగా; ఇల్లువేల్పులు=తమ యిండ్లయందుఁ దాము పూజచేయు నిష్టదేవతలను! కడు సంప్రహృష్టులై=హృష్టులనఁగా=హర్షము నొందినవారు, ఆనందించినవారు, ఏదియో కొంచెము లాభము కలుగఁగానే యానందించుట హర్షము. అపురూప పుటతిథి, చిరకాలవియోగమున నున్న ప్రియులు కలిసికొనిన ప్రహర్షము కలుగును. తొలిచూలు కొడుకు గలుగుట మొదలైనవి సంప్రహర్షము కలిగించును. ఇట్టి సంప్రహర్షము నతిశయించినది కడు సంప్రహర్షము బ్రహ్మానందమనియే చెప్పనగు.

తాత్పర్యము

తండ్రి చెప్పిన పలుకులు విని శ్రీరాముఁ డాయనకు ధర్మశాస్త్రప్రకారము నమస్కరించి మీరెట్టు లాజ్ఞాపించిన నట్టులే చేసెదనని చెప్పి సంతోషపడిచి తన రథమెక్కి తన యింటికిఁ బోయెను. అంతటఁ బురజనులందఱు వెంటనే రాజానుజ్ఞపడసి తమకోర్కి యిన్నాళ్ళకు ఫలించెఁగదా యని బ్రహ్మానంద మనుభవించుచున్నవారై యట్టి యదృష్టము కలుగఁజేసినందునకై తమతమ గృహములందుఁ దా మర్చించు దేవతలను విశేషముగఁ బూజించిరి.

మరలి వెడలి పోవునపుడు నమస్కరించెనని చెప్పుటచే గురువులయొద్దకు వచ్చునపుడేకాక మరలఁ బోవునపుడును వారికభివాదము చేయవలయునని సూచన. దేవతలయొద్దనుండి గురువులయొద్దనుండికాని సెలవు తీసికొనిపోవునపుడు వారికిఁ బ్రదక్షిణము చేయునపుడు వారికి వీఁపుకానరాకుండఁ బోవలెను-బ్రదక్షిణము చేయవలయును. దేవతా గురుసన్నిధి నాత్మప్రదక్షిణము నిషిద్ధము

౪-వ సర్గము

ఉ॥ పౌరులు వీడుకో ల్వడసి•పాయఁగ నావల నిశ్చయజ్ఞుఁ డౌ
ధారణినేత మంత్రి సహి•తంబుగ నెల్లియ పుష్యయోగ మై
శ్రీ రహి మీఱుఁ గాన రఘు•శేఖరునిన్ యువరాజుఁ జేయఁ బెం
పారు నటంచు నిశ్చయము•నాడీ సభం, జనె నింటిలోనికిన్. ౧౧-౨

వీడుకోలు=అనుజ్ఞ-ఇంటికిఁ బోవుటకు ననుమతి-నిశ్చయజ్ఞుఁడు=ఈ కాలమున నిట్టికార్యము నిట్టులు చేయవలయునని తీర్మానించుకొనినవాఁడు. ధారణి నేత=భూపతి-నేతృశబ్దతత్సమము నేత.

తాత్పర్యము

పురజనులు తమ యిండ్లకుఁబోవ రాజుచే ననుజ్ఞ గొనిపోఁగా నిశ్చయజ్ఞానముగల దశరథుఁడు మంత్రులతోఁగూడి ఱేపు పుష్యనక్షత్రముగావున శ్రీరామునకు యౌవరాజ్య పట్టాభిషేకము జరుగునని నిశ్చయముగఁ జెప్పి తన యింటిలోనికిఁ బోయెను.

—• దశరథుఁడు శ్రీరామునిఁ దననగరునకుఁ బిల్పించుట •—

కం॥ ఈరీతి నృపతి యంతర, గారంబును జేరి సూతుఁ•గని వేగమునన్
శ్రీరఘురాముని నిం కొక, వారముతోడితె మ్మటంచు•వాక్రుచ్చుటయున్.

అంతరగారంబు=లోపలిగృహము = గృహము లోపలి భాగము=సభాకూటము గానుట, వారము=మాఱు, వాక్రుచ్చుటయున్=చెప్పఁగా.

తాత్పర్యము

ఈవిధముగా దశరథమహారాజు గృహములోపలికిఁ బోయి సుమంత్రునిబిలిచి త్వరగా నీవుపోయి మఱియొకసారి శ్రీరాముని బిలుచుకొని రమ్మని చెప్పఁగా.

ఉ॥ చయ్యన నేగి, రాము మొగసాలను నిల్చి, యుదంత మంపఁగా,
నయ్యనఘుండు శంక గొని యాతనిఁ బిల్వఁగఁ బంచి, రాజుగా
రియ్యెడ నన్నుఁ బిల్చపని యెయ్యది నా, మిముఁ దోడితేర గా
నయ్య వచించెఁ, బోకయుఁ దదన్యము సేఁతయు మీయధీనముల్. ౧౧౪

మొగసాల=ముఖశాలా శబ్దభవము. ముంగిటిచావిడి; ఉదంతము=వార్త.

తాత్పర్యము

సుమంత్రుఁడు రాజాజ్ఞమేరకు శ్రీరాముల మందిరమునకేగి మొగసాల యందు నిల్చి సుమంత్రుఁడు రాజుగారి పనుపున దర్శనార్థమై వచ్చినవాఁడని వార్తపంపఁగా నిష్కల్మషచిత్తుఁడైన శ్రీరాముఁడు తండ్రిగారియొద్దకుఁ బోయి యుండి యిప్పుడే వచ్చితినే యింతలో నేమివిపరీతము పొసఁగెనని సందేహించి లోపల రమ్మని సుమంత్రు నాజ్ఞాపించి సుమంత్రా యింతలో మరలఁ బిలిపింప నేమికారణమని ప్రశ్నింపఁగా నదియేమో నాకుఁదెలియదు మిమ్ముఁబిలుచుకొని రమ్మని రాజుగా రాజ్ఞాపించిరి. నేను వచ్చితిని. అచ్చటికి వచ్చుటకు రాకుండుటకు మీరు స్వతంత్రులు అని యతఁడు చెప్పెను.

సుమంత్రుని చర్యవలన నెంతపరిచితి యున్నను గొప్పవారి యిండ్లలోనికిఁ దటాలున దూఱరాదు. ముందువార్తపంపి వారు రావచ్చుననినఁ బోవలయునని సూచన. "అనాహూతః ప్రవిశతి। అపృష్టో బహుభాషతే। అవిశ్వస్తే విశ్వసతి। మూఢచేతా నరాధమః॥ పిలువఁబడక ప్రవేశించుట అడుగకున్నను విశేషించి మాటలాడుట, నమ్మరాని వాని నమ్ముట మూఢచిత్తుల లక్షణము.

చం॥ అనవుడు వేగ తండ్రిఁ గన నా రఘురాముఁడు పోయి దూరమం
దున కని దండవత్ప్రణతిఁ దూర్ణముగా ఘటియింపఁ, బ్రేమమైఁ
దనయుని లేవనెత్తి, వసుధాపతి కౌఁగిటఁ జేర్చి, యోగ్యపీ
ఠిని గనిపించి, కైకొనఁ గడింది ప్రియంబునఁ బల్కె రాముతోన్.

దండవత్ప్రణతి=దండాకారముగా నమస్కారము, తూర్ణము=శీఘ్రము. చూచిన వెంటనే.

తాత్పర్యము

సుమంత్రుఁ డీప్రకారము చెప్పఁగా వెంటనే తండ్రిని జూడఁగోరి శ్రీరామచంద్రమూర్తి బయలుదేఱిపోయి దూరమునందుండియే చూచి చూచినవెంటనే సాష్టాంగనమస్కారము గావింపఁగా ప్రేమతో దశరథుఁడు నేలవ్రాలిన శ్రీరాము

లేవనెత్తి కౌఁగిటఁజేర్చి యోగ్యమైన యాసనమును జూపి కూర్చుండుమని చెప్పి యీప్రకారము పలికెను.

—• {దశరథుఁడు శ్రీరాముని యువరాజుఁ జేయుటకుఁ గారణము లాయనతోఁ జెప్పుట.} •—

శా॥ రామా! వృద్ధుఁడఁ బెక్కులేండ్లు మనితిన్,•రాజ్యంబు ప్రాజ్యంబుగాఁ
గామంబుల్ మన సారఁ బొందితిని, నేఁ•గావించితిన్ సత్క్రతు
స్తోమంబుల్ సరసాన్నదక్షిణలతోఁ•దోరంబుగా దాన ము
ద్దామశ్రీ విలసిల్లఁ జేసితి యథా•తాత్పర్యశాస్త్రంబుగన్. ౧౧౬

సత్క్రతుస్తోమంబుల్=శ్రేష్ఠములైన యజ్ఞసమూహములు,తోరంబుగాన్=విశేషముగ, యథాతాత్పర్యశాస్త్రంబుగన్=శాస్త్రవిధి నతిక్రమింపక దానియభిప్రాయప్రకారము, వృద్ధుఁడను=వయస్సుచే ముసలివాఁడను, ప్రాజ్యము=అధికము ఉద్దామశ్రీ=అధిక కీర్తిసంపద.

అన్నదక్షిణలతో=అన్నదానము-దక్షిణ-లేని యజ్ఞము తామసయజ్ఞము అదివ్యర్థము. అనర్థకరము కావున నట్టిలోపము లేకుండఁ జేసితినని భావము.

శ్లో॥ విధిహీన మసృష్టాన్నం, మంత్రహీన మదక్షిణమ్
శ్రద్ధా విరహితం యజ్ఞం, తామసం పరిచక్ష్యతే. భగవద్గీత.

శాస్త్రప్రకారము చేయఁబడనిది, అన్నదానములేనిది, మంత్రలోపము గలది, దక్షిణలేనిది, శ్రద్ధలేనిది, యగు యజ్ఞము తామసమనఁబడు నను భ॥గీ॥ వాక్య మిందుఁ బ్రమాణము, యజ్ఞమనుటచే దేవయజ్ఞము పితృయజ్ఞము రెండును గ్రాహ్యములు.

తా త్ప ర్య ము

రామచంద్రా! నాయనా! ముసలివాఁడను. అనేకసంవత్సరములు జీవించితిని. యథేచ్ఛముగా రాజ్యము పరిపాలించి మనస్సునఁగల కోరికలన్నియుఁ బూర్ణముగ ననుభవించితిని. రసవంతములయిన యన్నములతోను దక్షిణలతోను అనేకములైన గొప్పయాగములు సలిపితిని. అధికకీర్తి కేకొఱఁత లేకుండ శాస్త్రప్రకారము విశేషదానములఁ గావించితిని.

చం॥ సలిపితి సర్వదానములు,•శాస్త్రము లన్నిటి నభ్యసించితిన్,
దలఁగితి నాత్మదేవవసు•ధావిబుధర్షి పితౄణబంధముల్,
కలిమిని సర్వభోగములు•కామితము ల్తని వార నొందితి,
న్బలిమిని నతుల్యు నిష్టు నిను•నందనుఁ గాంచితిఁ బూరుషోత్తమా! ౧౧౭

ఆత్మ దేవ వసుధావిబు ధర్షి పితౄణబంధముల్ = ఆత్మఋణము-దేవఋణము-బ్రాహ్మణఋణము-ఋషిఋణము-పితృదేవతల ఋణము అను నప్పులను-తలఁగితిన్=తొలఁగఁజేసితిని-కామితముల్ = కోరికలు-తనివారన్=తృప్తి కలుగునట్లుగ తనివి + ఆరన్=అని పద విభాగము-తనివు అని శబ్దమునుగలదు,

బలియున్=బలవంతుని-ఇది రాజ్యరక్షణమునకు ముఖ్యముగఁ గావలసిన గుణము-అతుల్యున్=అసమానునిన్-రాజునకు సమానుఁడు మఱియొకఁ డుండె నేని-వైరము-కలహము దేశక్షోభము కలుగక మానదు. నిన్ను రాజును జేసిన నట్టిభయము లేదు. ఇష్టున్=నాకును లోకులకును సమ్మతమైనవానిని-తండ్రి కిష్టుఁడు గానివాఁడును రాజ్యార్హుఁడుగాఁడు. కావున రాజునకుండవలసిన గుణములన్నియు నీయందున్నవి. పురుషోత్తమున్=పురుషుఁడు, రూ-పురుషుఁడు పురుషులందు శ్రేష్ఠుఁడాయని మనుష్యులఁ జెప్పునపుడు సప్తమీ తత్పురుషము చెప్పవలయును. భగవంతునిజెప్పునపుడు పురుషులు జీవులు కావున పురుషు లందు శ్రేష్ఠుఁడని చెప్పిన భగవంతుఁడును జీవకోటిలోఁజేరిన వాఁడగును గావునఁ బురుషులకంటె శ్రేష్టుఁడని పంచమీ తత్పురుష సమాసము చెప్ప వలయును.

తాత్పర్యము

నాయనా! గోభూహిరణ్యాది సమస్తదానములు చేసితిని. అన్ని శాస్త్ర ములు నేర్చి వానియందలి విషయము లభ్యాసమందుంచితిని సుఖానుభవముచే నాత్మఋణమును, యజ్ఞాదులచే దేవఋణమును, దానముచే బ్రాహ్మణఋణ మును, బ్రహ్మచర్యముచే ఋషిఋణమును సంతానముచే పితౄణమును దీర్చి తిని. ఐశ్వర్యము సంపాదించి కోరికదీర సమస్తభోగములు కొఱఁతలేక తృప్తి యగునట్టు లనుభవించితిని. బలవంతుఁడు అసమానుఁడు తల్లిదండ్రులకుఁ బ్రజలకు నిష్టుఁడైన నందను నిన్నుఁగాంచితిని. కావున నాకెట్టికొఱఁతయులేదు.

వేదప్రకారము బ్రాహ్మణుఁడు మూఁడప్పులచేఁ బుట్టుచున్నాఁడు. "జాయ మానోవై బ్రాహ్మణ స్త్రిభిర్ ఋణ వాజాయతే బ్రహ్మచర్యేణ ఋషిభ్యః యజ్ఞేన దేవేభ్యః ప్రజయాపితృభ్యః' యని శ్రుతివచనము కలదయినను గౌందఋమత మున ఋణములైదు. అటుగాకున్నను ముఖ్యములైన యీమూఁడును దక్కినవాని కుపలక్షణముగా గ్రహింపనగు. దేవాదులు మనకుఁజేసిన యుపకార మేమి మనము పుట్టకముందే వారికెట్లు ఋణపడితిమి అనఁగా.

శ్లో॥ సహయజ్ఞైః ప్రజాసృష్ట్వా, పురోవాచప్రజాపతిః
అనేన ప్రసవిషధ్వ, మేష వో స్త్విష్టకామ ధుక్
దేవాన్ భావయతానేన, తేదేవా భావయంతు వః
పరస్పరం భావయంతః, శ్రేయః పరమవాప్స్యథ. భ.గీ.౩;౧౦-౧౧

పూర్వకాలమునఁ బ్రజాపతి యజ్ఞములతోడఁ బ్రజలను సృష్టించి యిట్లు చెప్పెను.ఓప్రజలారా యీ యజ్ఞములచే బాగుపడుఁడు. ఇవియే మీకోరిన కోరికలనెల్ల సమకూర్చును. ఈయజ్ఞములచే దేవతల నారాధింపుఁడు. మీచే నారాధింపఁబడి దేవతలు మిమ్ముఁబోషింతురు.ఇట్లు దేవతలు మీరు పరస్పరము వృద్ధిఁ బొందించువారై పరమశ్రేయస్సును బొందఁగలరు.

శ్లో॥ ఇష్టాన్ భోగాన్హి వో దేవా, దాస్యంతే యజ్ఞభావితాః
తైర్దత్తా నప్రదాయైభ్యో, యోభుంక్తే స్తేన ఏవ సః. ౧౨

యజ్ఞములచే నారాధింపఁబడి దేవతలు మీకిష్టభోగముల నీయఁగలరు. అట్టివారిచే నీయఁబడినవానిని మరల వారికియ్యక తానే భుజించువాఁడు దొంగయే.

ఈప్రకారము సామాన్యముగ మాత్రమేగాక మనుష్యుల ప్రత్యవయవమునకు నధిష్ఠానదేవతలు గలరు. ఆయాయవయవమును నాయాదేవత పోషించుచుండును. ఇది మనము తల్లిగర్భమున నున్నప్పటినుండి జరుగు కార్యము. కావున దేవతలకు మనము ఋణబద్ధులమయియే పుట్టుచున్నాము. ఆఋణముఁ దీర్చుకొనుటకై కృతజ్ఞులమై మనము యజ్ఞములు (దేవతారాధనలు) చేయవలెను. అట్లుచేయనివారు దొంగలు కృతఘ్నులు నగుదురు. కావున దేవతలఋణము దీరుటకై యజ్ఞములు (దేవతారాధనలు) చేయవలయును. యజ్ఞమునకు నారాధనమనియే యర్థము.

వేదబాహ్యులుగాని వారికందఱకుఁ గర్మాచరణమందు బ్రాహ్మణాదులకుఁ బండితులకైనను పామరులకైనను వైదికకర్మమందు హితాహిత బోధమందు బ్రాహ్మణ సాహాయ్యము కావలసియున్నది. కావున నట్టివారికిఁ బ్రత్యుపకారార్థము దానములు చేయవలెను.

ఋషుల ఋణము బ్రహ్మచర్యముచేఁ దీర్పవలయును. బ్రాహ్మణుఁ డిరుగోత్రములవాఁడు. జననముచే వచ్చినది జనక గోత్రము. రెండవది ఋషి గోత్రము. ఆయాఋషుల తేజస్సు ఆయా గోత్రముల వారియందు వంశపరంపరగా వ్యాపించి రక్షించుచుండును. ఇది పిత్రార్జిత ధనమువంటిది. పిత్రార్జితము గోలుపోయి స్వార్జితము లేకయుండువాఁడు దరిద్రుఁడెట్లగునో యట్లురే తపస్సు సంధ్యాది నిత్యకృత్యములుచేసి తేజస్సును వృద్ధిచేసికొనుటకు మాఱుగ దుష్టాహార దురాచార దుష్ట విహారములచేఁ దేజస్సు గోలుపోయిన వాఁడు క్రమక్రమముగా హీనజాతి వాఁడగును. తానార్జింప లేకపోయినను ఋషిదత్తమైన తేజస్సునైనఁ గోలుపోవక యుండుట బ్రాహ్మణ బీజమునకుఁ బుట్టిన ప్రతిబ్రాహ్మణునికి విధియైయున్నది. మనప్రార్థనము మన ప్రయత్నము లేకయే తమ తేజస్సును మన కనుగ్రహించిన ఋషుల ఋణమును దీర్చుకొనుట విధి. వారా తేజస్సును బ్రహ్మచర్యము చేతనే సంపాదించినవారు బ్రహ్మచర్యమనఁగా (1) వేదాధ్యయనము (2) వీర్యమును దుర్వ్యయము చేయక దుష్కామమునకుఁ బాలుపడకయుండుట. కావున నీరెంటిచేత తమ గోత్రఋషులను దృప్తులఁ జేయవలయును.

పితౄ ఋణమనఁగాఁ బితృదేవతల ఋణము. సంతాన దాతలు పితృదేవతలు. సంతానార్థులు పితృదేవతల నారాధింపవలయునని శ్రీభాగవతమునఁ

గలదు. మరణించిన మన తండ్రి-తాత-ముత్తాతలు వీరి స్వాధీనమందుండు వారు. కావున మన పితరులపేర మన మీదేవతల నారాధించితిమేని వారు మన పితరులకు సుఖము నూర్ధ్వలోకములు గలిగింతురు. మనము శ్రాద్ధాదులచేవారి నారాధింపక పోయితిమేని వారు మన పితృపితామహ ప్రపితా మహాదులకే సహాయముచేయరు. అకారణముచే వారథోలోకముల పాలయి మనల శపింతురు. కావున మావంశము వృద్ధియగునుగాక వారు నివా ములచేతను పిండాది దానములచేతను మాకూర్ధ్వలోకములు గలిగింతురు గాక యని మన పితరులు గోరుచుందురు. మనకుఁ గరణకళేబర దాతలైన వారి విషయమునఁ గృతజ్ఞులమై వారికి నూర్ధ్వలోకసుఖములు గలుగుటకై సదాచారసంపన్నుని శాస్త్ర విశ్వాసిని పితృభక్తిపరుని ధర్మశాస్త్ర పద్ధతిని పుత్రుఁడుగాఁగని వారి ఋణము తీర్చుకొనవలయును, శ్రాద్ధాది పితృకర్మములు చేయుట తమయొక్కయుఁ దమవంశము యొక్కయు క్షేమమునకే కాని యితరుల నుద్ధరింపఁ గాదు.

ఆత్మఋణము-భూమిమీఁదఁ బురుషుఁడు పుట్టుట యైహికసుఖము నాముష్మికసుఖము నను రెండుసుఖముల నార్జించుటకే. అనిషద్ధ సుఖత్యాగీపశు రేవ నసంశయః' యన్నట్లు శాస్త్ర నిషిద్ధములుగాని సుఖముల నిష్కారణముగ వదలువాఁడు నిస్సందేహముగఁ బశువే. దానివలన వాఁడు సాధించు పురుషార్థ మేదియు లేదు. ఆముష్మిక సుఖము గోరువాఁడైనను శాస్త్ర సమ్మతములైన తత్తదాశ్రమ విహిత సుఖముల ననుభవింప వచ్చును. అట్లు చేయనివాఁడు దేహమును ఆత్మను నిష్కారణముగఁ బీడించి చెడును. 'ఆత్మాన మవసాదయే' త్తని గీతావాక్యము కలదుకదా. ఈ విషయము భారతమందిట్లు చెప్పఁబడెను. మోక్షధర్మపర్వము. "దేవర్ష్యతిథి భృత్యేభ్యః। పితృభ్యశ్చాత్మన స్తథా। ఋణవాన్ జాయతేమర్త్య, తస్మా దనృణతాంవ్రజేత్। స్వాధ్యాయేన మహర్షిభ్యో దేవేభ్యో యజ్ఞకర్మణి। పితృభ్యః శ్రాద్ధదానేన నృణామభ్యర్చనేనచ। పాకశేషశ్చ భృత్యానాం, పాలనే నాత్మనోపిచ" మనుష్యుఁడు భూమిమీఁదఁ బుట్టుటకు దేవఋణము-అతిథిఋణము-భృత్యఋణము-పితౄణము-ఆత్మఋణము కారణములు. ఈఋణములనుండి విడివడినవానికి జన్మకారణములేదు కావున నాఋణములన్ని, తీర్చుకొని పోవలెను. వేదాధ్యయనముచే ఋషిఋణము-యజ్ఞములచే దేవఋణము- శ్రాద్ధములచేఁ బితృఋణము అతిథుల నాదరించుటచే మనుష్యఋణము వండుకొన్న దానిలో మిగిలినది యిచ్చుటచే భృత్యఋణము, ఆత్మను రక్షించుటచే (జ్ఞానమున) ఆత్మఋణము తీరిపోవును.

కం॥ రాజితగుణి వగునిను యువ, రాజుంగాఁ జేసి మిగుల•రాగంబున భూ
మీజన మలరంగను బే,రోజను గను టొకటె కొఱఁత•యుత్తమచరితా॥౧౧౮

రాజితగుణీ=ప్రకాశింపఁజేయఁబడిన గుణములు కలవాఁడు-ఇట్లనుటచే శ్రీరాముని నాశ్రయించుటచే సద్గుణములకే ప్రకాశము గలిగెను గాని వానివలన శ్రీరామున కేప్రకాశము గలుగలేదని భావము. 'అనర్ఘ్యమపి మాణిక్యం హేమాశ్రయ మపేక్షతే" మాణిక్య మెంతవెలగలదైనను బంగారు నాశ్రయింపఁ గోరుచున్నది యన్నట్లు బంగారునందుఁ బొదిగిన మాణిక్యమునకే కాంతిగాని బంగారునకుఁగాదు. ఆమాణిక్యమునే యినుమునందుఁ బొదిగిన తేజోహీనమై కానవచ్చును. కావున సద్గుణములన్నియుఁ దమలాభమునకే శ్రీరాము నాశ్రయించెనని భావము. రాగము=అనురాగము-ప్రేమ.

తా త్ప ర్య ము

నాయిహపర సౌఖ్యములకై నేను జేయవలసిన కార్యములన్నియుఁ జేసితిని. కాని యొకకొఱఁతమాత్ర మున్నది. అది యేదంటివా? గుణాధిక్యుఁడవు నుత్తమ చరితుఁడవునగు నిన్నుఁ బ్రేమతో యువరాజుగాఁజేసి భూమి జనులందఱు ననురాగముతో సంతోషింపఁజేయుట యొక్కటియే కొదువ. అది చేసితినేని నే నీలోకమున జీవించి యింకఁ జేయవలసిన కార్యములేదు.

ఉ॥ కావున నావచించునది॰కాదన కీ వొనరింపఁగాఁ దగున్,
పావనశీల! నీవు నర॰పాలుఁడుగా జను లెల్లఁ గోరి రి
చ్ఛావిధి, నట్లుగాన నిను॰జయ్యన నే యువరాజుఁ జేసెదన్,
నీవు భరింపఁ బూను మవ॰నిం, గత మే మిటుచేఁత కంటివేన్. ౧౧౯

పావనశీల=పవిత్రపు నడవడిగలవాఁడా, కతము=కారణము-చేఁత=చేయుట

తా త్ప ర్య ము

కావున నేను జెప్పఁబోవునది 'సరికాదు. నీవు జీవించియుండఁగా రాజ్యభారము నేను వహింపరాదు' అని చెప్పక నీవు తప్పక చేయవలయును - ప్రజలందఱు నాబలాత్కారములేక వారంతటవారే నిండు మనస్సుతో నిన్ను యువరాజుఁజేయ నంగీకరించిరి. కావున నేను నట్లుచేసెదను. కాఁబట్టి నీవు దీని నంగీకరింపవలయును. ఇప్పుడు దీనికేమితొందర ఇంకను గొన్నినాళ్ళు జరుగఁ గూడదా యందువేమో.

ఉ॥ భీతిదదుర్నిమిత్తములు॰పెక్కులు గాంచెద స్వప్నమందు, ని
ర్ఘాతము లుల్కలుం బడఁగ॰గంటి మహారవసంయుతంబుగా,
జ్యౌతిషికాళి రాహుకుజ॰సప్తతురంగులు జన్మతారకన్
వే తవులంగఁ జొచ్చి రన॰వింటి, నిఁ కేమి వచింతుఁ బుత్రకా! ౧౨౦

భీతిద=భయంకరములగు, దుర్నిమిత్తములు=అపశకునములు - స్వప్నమందున్=కలయందు-నిర్ఘాతములు=పిడుగులు- ఉల్కలు=కొఱవులు-మహారవసంయుతంబుగాన్=మిక్కిలిధ్వనితోఁగూడునట్లు-జ్యౌతిషకాళి=గ్రహచారశాస్త్రము తెలిసినవారు-సప్తతురంగుఁడు=సూర్యుఁడు.

తా త్ప ర్య ము

నీపట్టాభిషేకమునకై నేను దొందరపడు కారణము చెప్పెద వినుము. నా స్వప్నమందు నల్లవస్త్రము ధరించిన స్త్రీ నన్నుఁగౌగిలించుట లోనగు దుశ్శకునము లనేకములు కానవచ్చుచున్నవి. అవిగాక లోకు లందఱకుఁ దెలియునట్లు పిడుగులు కొఱవికట్టె లాకాశమునుండి రాలుచున్నవి. వీనివలనఁగీడు నీకే కలుగునని యెట్లు నిశ్చయమందువేమో: నాజాతకము చూచిన జ్యోతిశ్శాస్త్రము తెలిసిన పండితులందఱు రాహువు-అంగారకుఁడు-సూర్యుఁడు నాజన్మనక్షత్రమును బీడింప నున్నారని చెప్ప వింటిని దీనివలననే ఫలము నీవు గ్రహింపఁగలవు. నా మరణకాలము సమీపించినదని నేను వేఱుగఁ జెప్పవలయునా.

శ్లో॥ ద్వాదశాష్టమ జన్మస్థా, శన్యర్కాంగరకా గురుః
కుర్వంతిప్రాణసందేహం, స్థానభ్రంశం ధనక్షయమ్.

అని జ్యోతిషవాక్యము. అనఁగా ౧౨-౮-౧ లగ్నములందు శని-సూర్యుఁడు। అంగారకుఁడు-గురువు నుండి రేని ప్రాణసందేహము స్థానభ్రంశము ధన నాశము కలుగును.

సీ॥ ధ్రువమండలమున నరుంధతిఁ గనుశక్తి। గంటికిఁ గలుగంగఁ గానకున్న ముక్కున వలపటఁ జెక్కవాసినయట్లు దోఁచినఁబూర్ణ చంద్రుఁడు మలినుఁ। డై కానవచ్చిన నాయువు సంవత్సరమునఁ గడచను రాజముఖ్య। కాంతితొల్లిటి యట్లుగాక యంతకు నెక్కు। డైనను గడుఁజెడ్డ, యట్లుప్రజ్ఞ। క్రొత్తగాఁ బెద్దయైనను గొంచెమైన। నాఱునెలల మరణదశయగుట గలుగు। నిందుమండలమున రవియందు నడుమఁ దెఱపిగాంచినఁ దెగునేడు దివసములకు॥ కం॥ వినుగుడిలో నున్నసమయ। మున సురభిద్రవ్యములను బొలవలచుటగ। ల్గిన నాఱు దివసములఁగ। ల్గును మృత్యు సమాగమంబు గుణరత్ననిధీ॥గీ॥ ముక్కు వ్రాలుట కర్ణముల్ మొగ్గఁబడుట। రదనవైవర్ణ్య మక్షివిరాగభావ, మంగమతి కృష్ణమగు టుల్లమదరఁ జెడుట। సూచకములు సద్యో మృత్యుగోచరతకు॥ గీ॥ కారణములేక దాపలికను ద్రవించు॥ నెత్తిచక్కటి ధూమంబు నెగయునపుడ। మరణ దశ యావహిల్లెడు మానవునకు-జనకనృప యివి బ్రహ్మ చెప్పిన విధములు॥ మహాభా. - శాంతి. ౬-౧౨౬-౧౨౭-౧౨౮.

తననీడ దనకుఁ గానరాకపోవుట-అద్దమునందు నీళ్ళయందుఁ దన శిరస్సు గానరాకపోవుట-చంద్రునివలె సూర్యుఁడు కానవచ్చుట-కిరణములు కానరాకపోవుట-యీ మొదలైనవి మఱికొన్ని గలవు ఇవిమేలుకొని యున్నప్పుడు కానవచ్చునవి. నల్లరంగు నల్లదంతములు గలవాఁడు కలలోఁ గానవచ్చినను సారాయము త్రాగినట్లు తామర తూండ్లు తిన్నట్టు లొంటికమలము ధరించినట్లు గాడిదలు పందులు కట్టిన వాహనములపైఁ బ్రయాణము చేసినట్లు-కలలోవచ్చినను శీఘ్రమున మరణించును. సుందరకాండమందుఁ ద్రిజటాస్వప్నము

చూచునది త్రిజటా దశరథ భరత స్వప్నములు సత్యము లగుటచేతను స్వప్నములు భగవంతునిచే సృష్టింపబడునని శ్రుతిచెప్పుటచేతను అనుభవమందు ననేక స్వప్నములు ఫలించుటచేతను, ధాతువైషమ్యముచేఁ బైత్యవికారాదులచే వచ్చు కలలుదప్పఁ దక్కినవి సత్యములేయగు.

తే॥ ఇట్టిశకునంబులఫలంబు•నెంచి చూడ, నవనిపతి మరణించు, లే•దా మహాస
దాళి ఘటియిల్లుఁగాన రా•జ్యంబుఁగొనుము,
ప్రాణవంతుండనై యుండు•నపుడవత్స! ౧౨౧.

తాత్పర్యము

ఈ శకునముల ఫలము లన్నియు నాలోచించిచూడఁగా రాజగువాఁడు మరణించును. అటుకాదేని దానితో సమానమైన గొప్పయాపదయైన సంభవించును. కావున నేను జీవింతునో జీవింపనో. నేను జీవించియుండఁగానే నాయనా! రాజ్యము గొనుము.

తే. మన్మనోవృత్తియిప్పుడీ•మాడ్కినున్న,
దింక నెపుడెట్టులుండునో•యెఱుఁగరాదు
కాన నిప్పుడ యభిషేక•గరిమఁగనుము,
కలదె ప్రాణికి మనసుని•ల్కడతనూజ! ౧౨౨

మత్ + మనో + వృత్తి = నామనోవర్తనము - ఈమాడ్కిన్ = ఈవిధముగ - ప్రకృతాంశమును సాధింప సామాన్యన్యాయము తేఁబడుటచే నర్థాంతరన్యాసాలంకారము.

తాత్పర్యము

పుత్రా! రామచంద్రా యిప్పుడు నామనస్సున నీకే రాజ్యమీయవలయు ననియున్నది. ఇఁకమీఁద నేకాలమున నెట్లు మాఱునో తెలియరాదు. కావున నామనస్సిట్టిస్థితి యందుండఁగనే పట్టాభిషేకము చేసికొనుము. ప్రాణులచిత్తములు చంచలములని నీకుఁ దెలియునుగదా.

'అనిత్యచిత్తః పురుషః' తస్మిన్ కోజాతు విశ్వసేత్
తస్మాత్ప్రధానం యత్కార్యం, ప్రత్యక్షం తత్సమాచరేత్,
భార. ౧౨-౮౦-౯

పురుషులచిత్తములు నిలుకడగా నుండునవి కావు. కావున వాని నెవఁడు నమ్మును? ముఖ్యమైనకార్య మెప్పటికప్పుడు చేయుటేబాగుగాని ఆపుమాపని జరుపరాదు. పుణ్యకార్యములు వెంటనే చేయవలయును. పాపకార్యము లాలసింపవలెను.

తే॥ వర్తిలెడి రాఘవా! పున•ర్వసువు నేఁడు
పుష్యయోగంబు రేపాట•బుధులు నీవు

యౌవరాజ్యంబుఁ గొనఁగ యో•గ్యం బటంచుఁ
దెల్పి రటు సేయు, నను మది•తీవరించె. ౧౨౩

తాత్పర్యము

రామచంద్రా! నేడు నీజన్మతారయగు పునర్వసువు. రేపు నీకు సంపత్తారయగు పుష్యము. కావున పండితులు రేపే నీవు యౌవరాజ్యంబు గ్రహింపమేలని చెప్పిరి. కావున నీవు నట్లుసేయుము. ఈవిషయమున నామనస్సు చాలఁ దీవరించుచున్నది. ఆలస్యముకూడదు.

ఉ॥ సీతయు నీవు రే యుపవ•సింపుఁడు, దర్భలపైఁ బరుండుఁడీ,
ప్రీతి వచింపుమీ హితులు•రే నినుఁ జక్కఁగఁ గావ, విఘ్న సం
ఘాతము లెన్ని యేన్గలుగుఁగావున నిట్టిక్రియాకలాప మం
దాతతజాగరూకత న•యంబు వహింపఁగ నెట్టివానికిన్. ౧౨౪

తాత్పర్యము

అట్లైన నన్నేమి చేయుమనెదవేమో-ఈరాత్రి నీవు సీత యిరువురు నుపవాసము చేయవలయును. దర్భలు పఱచుకొని దానిపైఁ బండుకొనవలయును. ఈరాత్రియంతయు నీస్నేహితులు నిన్ను హెచ్చరికతో రక్షింప బోధింపుము. ఇట్టికార్యములందు విఘ్నము లనేకములు గలుగును. నీమేలోర్వనివా రెవరైన నీకు నేకీడైనఁ జేసి రాజ్యము నీకు లభింపకుండ యత్నముఁచేయుదురు. ఇన్నాళ్ళేలచేయలేదందువేమో తమయిష్టునికి రాజ్యమిత్తునని యాశతో నూరక యుండవచ్చును. ఇప్పుడు నానిశ్చయము తెలియఁగానే నిరాశులై నీకుఁగీడుచేసి తాము రాజ్యము హరింప యత్నింతురు. కావున నెంతవానికైనను మిక్కిలి హెచ్చరికగలిగి యుండుట నీతి.

సీతయు నీవు నుపవసింపుఁ డనుటచే శాస్త్రవిహితకర్మ మేదిచేసినను భార్యాభర్తలు కలిసి చేయవలయు నని సూచన అపస్తంబులు 'పాణిగ్రహణాద్ధి సహత్వం కర్మసు తథాపుణ్యకాలేషు ద్రవ్యపరిగ్రహేషుచ"-

భార్య సహధర్మచారిణీ కావున నామెను విడిచి యేధర్మకార్యము భర్త చేయరాదు. వ్రతవేళఁ దప్ప దర్భలమీఁదఁ బండుకొనరాదు.

కం॥ అదిగాక యొండునున్ నా, మది నున్నది భరతుఁ డిటకు•మరలకమున్నే
యెదితీరున నభిషేకము, తుదసాగించుటయె మేలు•తోఁచెం జూడన్. ౧౨౫

తాత్పర్యము

నే నీవిషయమునఁ దీవరపడుటకు నామరణభీతి యొకటియే కారణము గాదు. వేఱొక కారణము గలదు. నేను నీకియ్యనైతినేని నాయనంతరము నీకు రాజ్యము దక్కునో దక్కదో యని నాసందేహము. కావున భరతుఁడు మేన

మావు యింటనుండి యిచ్చటికి మరలి రాకముందే యేవిధముగనైన నీపట్టాభి షేకకార్యము ముగించుటయే క్షేమమని నాయభిప్రాయము.

ఉ॥ నే నిటు లంటి నా వలదు • నీయనుజుండు జితేంద్రియుండును
న్మానుగ ధర్మవర్తి కరు • ణాపరుఁ డగ్రజభక్తుఁ డైననున్
మానవమానసంబు లతి • మాత్రచలంబులు, ధర్మనిత్యులం
దేనియు సజ్జనావళుల • నేల, నవే కృతశోభు లయ్యెడిన్. ౧౭౯

నాన్=అనన్, అగ్రజభక్తుఁడు=అన్నయందు భక్తిగలవాఁడు, అతిమాత్ర చలంబులు=విశేషము నిలుకడలేనివి.

తాత్పర్యము

నాయనా! భరతుని విషయమై నేనిట్లు సందేహించుట తగునా యన కుము. అతఁడు నీతమ్ముఁడు. కావున నీయట్టి సద్గుణములు గలవాఁడే. జితేం ద్రియుఁడగుటచే రాజ్యమునకు నాశపడువాఁడు కాఁడు. ధర్మవర్తి కావున న్యాయమున నీకు రావలసిన రాజ్యమును నగ్రజన్యాయము వదలి పిన్న యైనఁ దా నాశించువాఁడును గాఁడు. దయావంతుఁడు కావున రాజ్యమునకై నీయందు నాయందు పగసాధింపఁబూనువాఁడును గాఁడు. పితృ సమోజ్యేష్ఠ యని యన్నను దండ్రివలెఁ జూచువాఁడు. ఇన్ని సద్గుణములు భరతునందు న్నను అతఁడును మనుష్యుఁడే కావునను మనుష్యుల మనస్సులు మిక్కిలి చంచలములు (చంచలం హిమనఃకృష్ణ) కావున నెంతటి ధర్మనిష్ఠులందేని యెంతటి సత్పురుషులందేని కలకాలము మనస్సుస్థిరముగనుండునని విశ్వసింప రాదు. "అన్యథాచింతితో హ్యర్థః పునర్భవతి నాన్యథా। అనిత్యమతయో లోకే. నరాః పురుషసత్తమ" భార. ౫-౮౦-౬. ఇప్పుడొక విధమున నాలోచించినదే తరువాత మఱియొక విధముగ నగును. ఏలన లోకమున మనుష్యుల మన స్సులు నిలుకడ గలవి కావు. అటయిన దుష్టులకు ధర్మనిష్ఠులయిన సత్పురుష లకు భేద మేమందువా? దుష్టులు కార్యానంతరముకూడఁ బగ సాధించి కీడు చేయయత్నించుచుందురు. సత్పురుషులు కార్యము కాకముందు భిన్నాభి ప్రాయము కలవారైనను కార్యము ముగిసిన పిమ్మట ద్వేషింపక కడచిపోయిన దానికి విచార మేల యని కలసి మెలసి యుందురు. కావున భరతుఁడు రాక ముందే నీవు పట్టముఁ గట్టుకొంటివా యతఁడు సత్పురుషుఁడు ధర్మజ్ఞుఁడు కావున నీరాజ్యము నాకుఁ గావలయు ననఁడు. అటుగాక ముందుగా వచ్చెనా తనకుఁ గావలయు నను నేమో. అతఁడట్లనినఁ గుటుంబకలహములే గాక దేశ క్షోభయుఁ గలుగును. కావున నతఁడు రాకముందే నీవు పట్టాభిషేకము చేసికొన వలయునని తొందరపడెదను.

భరతుని విషయమున సందేహించుటకుఁ గారణము ఈ కాండమందలి ౪౪-౫౦ పద్యము చూడుఁడు. దశరథుఁడు కైకను వివాహమాడు నపుడు కైకకుఁ బుట్టెడి కొడుకునకు తన రాజ్యమిచ్చెద నని ప్రమాణము చేసెను.

ఆ కారణమున భరతుఁడో, యతనికిఁ కావలసినవారో రాజ్యమపేక్షింతురో యని దశరథుభయము.

తే॥ చెల్లు నెల్లియ పట్టాభి•షేకమహము,పోయిరానాయనా! యని•భూమిధవుఁడు
పలుక సాష్టాంగ మెఱఁగి స్వ•భవనమునకు,
నరిగి వెంటనెచనెఁదల్లి•యంతిపురికి. ౧౬-౧౭

తా త్ప ర్య ము

ఎల్లియ=ఱేపే, మహము=ఉత్సవము, స్వభవనము=తనయిల్లు, అంతిపురి=అంతఃపురము, ఎఱఁగి=నమస్కరించి.

తా త్ప ర్య ము

ఈ కారణములచే నాయనా ఱేపే పట్టాభిషేకోత్సవము జరుగవలసియున్నది. రామచంద్రా! పోయిరమ్ము. ఈవిషయము చెప్పుటకే నిన్నుఁ బిలిపించితిని. అని రాజు చెప్పఁగా శ్రీరామచంద్రుఁడు సాష్టాంగ నమస్కారము చేసి తనయింటికిఁ బోయి వెంటనే తల్లియుండు నంతఃపురమునకు నామెను దర్శించి శుభవార్త తెలుపుటకై పోయెను.

సీ॥ అరిగి రాముఁడు దేవ•తాయతనంబున, వెలిపట్టుఁ బుట్టంబు•వెలయుదానిఁ
దలఁగని భక్తిని•దనయుని శ్రీయుకు; నొనరింపుమని మ్రొక్కు•చున్నదాని
నిలువేల్పుపైఁ దన•హృదయంబుఁ గీలించి,ధ్యానైకరతి మౌన•మూనుదాని
నతులితగతిని ప్రా•ణాయామమునఁ బరా,త్పరుని జనార్దనుఁ•దలఁచుదానిఁ

తే॥ దనప్రవృత్తిని వినిసుమి•త్రయును లక్ష్మ,
ణుండుమునువచ్చి జనకత•నూజనటకుఁ
దోడి తెప్పింపమువ్వురఁ•గూడియుండు, దానిసాధ్వీమతల్లిని•దల్లిఁగనియె.

దేవతాయతనంబునన్ = దేవపూజాగృహమందు, వెలిపట్టుఁ బుట్టంబు=తెల్లని పట్టు వస్త్రమును, వ్రతమునిమిత్తమై యీవస్త్రమును ధరించెను. దేవపూజవేళ తెల్లని పచ్చనివస్త్రములు ధరించుట ప్రశస్తము 'సితపీతంబులు ధార్యములని భారతము. రక్తవర్ణము నల్లవర్ణము నిషిద్ధములు-తలఁగని=చెదరని-తనయుని=తనకుమారుని, శ్రీయుక్తున్=రాజ్యలక్ష్మితోఁ గూడిన వానింగా, ఇలువేల్పున్=తమయింటఁ బ్రతిదినము నారాధింపఁబడు దేవతను శ్రీమన్నారాయణుని, కీలించి=నిలిపి, ధ్యానైకరతిని=ధ్యానమునందలి ముఖ్యాభిలాషచే ప్రాణాయామముఁ జేయుచుననఁగా రేచక పూరక కుంభకములందు, పరాత్పరుని=పరమని చెప్పఁబడు వారికంటెఁ బరుఁడైనవానిని-జనార్దనునిన్=శ్రీమన్నారాయణుని-జన + అర్దనుఁడు=భక్తజనులను సంతోషపెట్టువాఁడు. 2) దుష్టజనులను బీడించువాఁడు-ప్రవృత్తి=పట్టాభిషేక విషయవార్తను, జనకతనూజను=సీతను, తోడి తెప్పింపన్=ఆమె యే స్వతంత్రించి రాఁగూడదు గావుననో లేక యామెకీవార్త తెలియదనుకారణము చేతనో అందుఁబిలిచి సంతోష

పడవలయుననియో దాసికలను బంపి పిలిపింపఁగా, సాధ్వీమతల్లి ని=పతివ్రతల యందు శ్రేష్ఠురాలిని, మతల్లిక-మచ్చరిక-ప్రకాండము, ఉద్ఘము-తల్లజము ఇవి యుత్తరపదములై శ్రేష్ఠత్వమును దెలుపును.

తాత్పర్యము

ఇట్లు రామచంద్రుఁడు జననీగృహంబున కేగి యందుఁ దెల్లని పట్టు వస్త్రము గట్టుకొని దేవపూజా మందిరంబున నిండారు భక్తితో శ్రీరామచంద్రుని మిత్రులచేఁ దానువిన్నవార్త నిజమై శ్రీరామునికిఁ బట్టాభిషేకము జరుగవలెనని నమస్కరించుదాని, నిలువేల్పును శ్రీమన్నారాయణునిఁ దన హృదయమున నిలిపి తదేకనిష్ఠగా ధ్యానించుదాని, దేవతలయందు నధికులని చెప్పఁబడువారి కంటె నధికుఁడైన శ్రీమన్నారాయణునిఁ బ్రాణాయామమునఁ దలఁచు దానిని. తన పట్టాభిషేకవార్త విని సుమిత్రయుఁ లక్ష్మణుఁడు రాఁగా దాసికలఁబంపి పిలిపింపఁగా వచ్చియుండు సీతతోఁ గూడిన దానిని, పతివ్రతాశిరోమణియైన తన తల్లినిఁ జూచెను.

ఇందుఁ గౌసల్యాకృత్యములు చెప్పఁబడినవేకాని యన్నియు నేకకాలమున శ్రీరాముఁడు పోయినప్పుడే చేసెనని తాత్పర్యముగాదు.

ఈ పద్యమందుఁ గౌసల్య దేవపూజ చేయుచుండునట్లు చెప్పఁబడెను. ఇట్టి యధికారము స్త్రీలకుఁ గలదాయని ప్రశ్న.

స్త్రీలకుఁ బతిశుశ్రూషకంటె వేఱుదేవపూజలోనైనవి లేవని పూర్వపక్షము.

శ్లో॥ నాస్తి స్త్రీణాం పృథగ్ధర్మో. నావ్రతం నాప్యుపోషణమ్, పతిం శుశ్రూషతేయాతు, తేన స్వర్గే మహీయతే॥ మనువు స్త్రీలకుఁ బ్రత్యేకముగ వ్రతములు ధర్మములు ఉపవాసములు లేవు. ఎవతె పతి శుశ్రూషచేయునో యామెకు స్వర్గము లభించును.

అశ్వలాయనుఁడు:—శూద్రాణాం ద్విజశుశ్రూషా। విహితా బ్రహ్మణా యథా। స్త్రీణాం స్వభర్తృ శుశ్రూషా, తథైవ విహితాసదా॥ శూద్రులకు ద్విజ శుశ్రూషయెట్లు వేదవిహితమో యట్లే స్త్రీలకు భర్తృశుశ్రూషయే సదావిహితము.

అత్రి-'నవ్రతే నోపవాసేన, ధర్మేణ వివిధేనచ, నారీ స్వర్గమవాప్నోతి, ప్రాప్నోతి పతిపూజనాత్'। వ్రతములు ఉపవాసములు నానాధర్మములు చేయుటచే స్త్రీకి స్వర్గము రాదు. పతిశుశ్రూష చేతవచ్చును.

యద్దేవేభ్యోయచ్చ పిత్రాదికేభ్యః కుర్యాద్భర్తాభ్యర్చనం సత్క్రియాంచ। తస్యార్ధ సాఫలం నాన్యచిత్తానారీభుంక్తే భర్తృశుశ్రూషణేన॥ భర్తచేయు దేవపూజ-పితృపూజ-పుణ్యములు మొదలగువానిలో సగము పుణ్యఫల మాయ నకు నేకచిత్తముతో శుశ్రూషచేసి భార్యపొందును.

స్కాందము-వ్రతోపవాసనిరతా, యానారీ పరమోత్తమా। భర్తారంనాను వర్తేత, తస్యాః పాపాగతిర్భవేత్॥ వ్రతములు - ఉపవాసములు చేయు స్త్రీ

మిగుల నుత్తమురాలు. అయినను ఆమె భర్తననుసరించి చరింపక పోయెనా యామెకుఁబాపగతులే లభించును.

పరాశరుండు పత్యౌ జీవతి యానారీ– తపోష్య వ్రతచారిణీ। ఆయుష్యం హరతే భర్తుః సానారీ నరకం వ్రజేత్॥ మగఁడు జీవించియుండు స్త్రీ యుపవాస వ్రతములాచరించెనేని మగని యాయువును క్షీణింపఁజేసి తాను నరకమునకుఁ బోవును.

ఇత్యాది వాక్యములచే స్త్రీలకు జపతపములు లేవని యేర్పడెను.

సిద్ధాంతమేమనఁగా : పైవాక్యములు స్త్రీలకు భర్తృశుశ్రూష యనివార్యమనియు నదిచేయక మఱియేదిచేసిన నది వ్యర్థము దోషావహమనియుఁ గావున భర్తృ శుశ్రూష ముఖ్యమని స్థాపించుచున్నవేకాని మోక్షసాధనములైన వానికై స్త్రీలు యత్నమే చేయరాదని నిషేధించుటలేదు. స్త్రీలకు భర్తృ శుశ్రూషా ఫలమును జెప్పువాక్యము లన్నియు స్వర్గమును భర్తతోడి సాలోక్యమును జెప్పుచున్నవేకాని కేవల మోక్షవిషయమైన ప్రస్తావనయేలేదు. అకారణమున స్త్రీలు మోక్షమునకు యోగ్యులు కారా? దానికి వారు ప్రయత్నించుట దోషమా? కాదు గాని వారి జపతపో యోగములు భర్తృశుశ్రూషకు విఘ్నమాపాదించునవియై యుండరాదు. రెంటిలోనొకటి విడువవలసినట్లు తటస్థించెనేని జపతపములు వదలవలయునే కాని భర్తృ శుశ్రూష వదలరాదు. శత్రుఘ్నుని భాగవత పారతంత్ర్య విషయమై వ్రాసినది చూడుఁడు.

కౌశికుఁడు మాతాపితృ సేవవదలి తపస్సునకు మరగిన నతనికి ధర్మవ్యాధుఁడు కం॥ నీయధ్యయనము సుకృత్రాయాసము నిష్ఫలంబులై చనుగురుసే। వాయుక్తి లేక తక్కినఁ। జేయుము నాపలుకు మేలు చేకుఱునీకున్ భార. అర. ౫-౧౨౨. అని చేయఁగలిగిన రెండును జేయుము. రెండును జేయలేకున్నఁ దపస్సువదలి గురుసేవ చేయుమని బోధించెను. జపతపంబులు చేసిన మేలు. చేయకుండినఁ బ్రత్యవాయము లేదు. స్త్రీలకు భర్తసేవ పురుషులకు మాతాపితృసేవ చేయకుండినఁ బ్రత్యవాయము కలదు. ఇట్టులే గృహస్థులవిషయమై "తస్మాద్గృహాశ్రమస్థస్య నాన్యద్దైవ తమస్తివై బుతేఽతిథిమ్" అనఁగా గృహస్థునకు నతిథికంటె దైవము లేఁడని శాస్త్రము చెప్పుచున్నది కదా. ఆకారణమున నతిథిసేవతప్ప గృహస్థుఁడు జపతపములు చేయరాదని చేసినఁ బాపమని భావమా? జపముచేయు కాలమం దతిథివచ్చెనేని జపము వదలియైన నతిథిని గౌరవింపవలయునని భావము. అట్టులే స్త్రీలవిషయమందును, వారు చేయు జపతపములు మొదలగునవి భర్తృశుశ్రూషకు నడ్డమువచ్చునవిగానుండరాదు. కావున భర్తయనుజ్ఞ దీసికొని యవి చేయవచ్చును. అట్టియనుజ్ఞతీసికొని యుండినయెడలఁ గొంచెమేదేని లోపము గలిగినను నతఁడు సహించును. దాని వలనఁ బ్రత్యవాయభయము లేదు. ఒకఇల్లాలు తనచంటిబిడ్డఁడాఁకలికినేడువఁగాఁ

బాలిచ్చుటకై తీసికొని చన్నియ్యఁ బ్రారంభించెను. ఇంతలో నెందోపోయి యుండిన మగఁడెండలో సొటసొట లాడుచు నాఁకలిగొని వచ్చెను. అప్పుడా యిల్లా లేమిచేయవలె? పాలుత్రాగుబిడ్డ నీడ్చిపాఱవేసి పతికి స్నానానికి నీళ్ళియ్యఁ బోవలయునా? బిడ్డకుఁ బాలిచ్చివచ్చెదనని సమాధానము చెప్పుకొన వచ్చునా? బిడ్డకుఁ బాలిచ్చుట స్త్రీస్వధర్మము కావునఁ బతియాజ్ఞపొంది స్త్రీ యే కార్యమైనఁ జేయవచ్చును. భర్త కతిథియెక్కువయైనను ఆయన భార్య కతిథి కంటె భర్తయే యెక్కువ. కామంతు భర్తురనుజ్ఞయా వ్రతోపవాస నియమాదీనా మభ్యాసః॥ శంఖ॥ భర్తయనుజ్ఞపొంది వ్రతోపవాస నియమములను స్త్రీ యథే ష్టముగా నభ్యసింపవచ్చును. 'భార్యా భర్తృమతేనైవ వ్రతాదీనాచరేత్సతీ, పతి వ్రతయగు భార్య భర్తయనుమతి చేతనే వ్రతాదుల జరుపవలయును కాత్యా యనుఁడు.

భర్తలేని స్త్రీలు పుత్రులయనుమతి నొందవలయును; "నారీఖల్వనను జ్ఞాతా భర్త్రావాపి సుతేనవా, విఫలం తద్భ వేత్తస్యా, యత్కరోత్యౌర్ధ్వదైహి కమ్" ఆదిత్యపురాణము. నారీఖల్వననుజ్ఞాతాభర్త్రాపిత్రాసుతేనవా నిష్ఫలంతు భవేత్తస్య, యత్కరోతి వ్రతాదికమ్"

దీనివలన పతిగాని సుతుఁడుగాని లేని స్త్రీ తండ్రియుండిన నాయన యనుమతి నొందవలయును ఈముగ్గురులేని స్త్రీలు వారివారి యిష్టముచొప్పున యథేచ్ఛముగఁ జేసికొనవచ్చును. సుతాదులయాజ్ఞ వారిద్రవ్యముపయోగించు నపుడే కాని తనధనముతో ధర్మకార్యములు చేయునపుడు భగవత్సేవలకు కాదు.

కావునఁ గౌసల్య దేవతారాధనము ప్రాణాయామముచేయుట దోషావ హముగాదు. ప్రశస్తకార్యమే.

ఈవిషయమున నీవాక్యంబులు స్మర్తవ్యంబులు.

స్త్రీలు శూద్రులు బింబారాధనము చేయువచ్చుననుటకుఁ బ్రమాణములు.

శ్లో॥ బ్రాహ్మణైః క్షత్రియై ర్వైశ్యై, శ్శూద్రై స్త్రీభి స్తథేతరైః
యథార్హ మిజ్యస్సేవ్యశ్చ, నిత్యం సర్వేశ్వరో హరిః॥

బ్రాహ్మణులచేతను క్షత్రియులచేతను వైశ్యులచేతను శూద్రులచేతను స్త్రీలచేతను తదితరులచేతను సర్వేశ్వరుఁడగు హరిబింబము (ప్రతిమ) పూజింపఁదగినది. (ప్రతిమాలక్షణము పరిచ్ఛేదము)

శ్లో॥ బ్రాహ్మణైః క్షత్రియైర్వైశ్యైః। శూద్రైశ్చ కృతలక్షణైః
అర్చనీయశ్చ సేవ్యశ్చ। భక్తియుక్తై స్సదాహరిః॥

తాపాది సంస్కారములుగల భక్తులగు బ్రాహ్మణులచేతను క్షత్రియుల చేతను వైశ్యులచేతను-శూద్రులచేతను ఎల్లవేళ హరి పూజింపఁ దగినవాఁడు- సేవింపఁ దగినవాఁడు-భీష్మపర్వము.

శ్లో॥ మృదశ్మమణి రత్నేన, తామ్రేణ రజతేనవా
కృత్వాప్రతికృతింకుర్యా, దర్చనాం కాంచనేనవా॥
పుణ్యందశగుణం దద్యా, దే తేషాము త్తరో త్తరమ్
జయకామే జయేద్రాజా, విద్యాకామో ద్విజో త్తమః
వైశ్యోవాధనకామస్తు, శూద్రః పుణ్యఫల ప్రియః
సర్వకామాస్త్రియోవాపి, సర్వాన్ కామానవాప్నుయుః

మన్ను-శిల-శ్రేష్ఠమణులు, రాగి, వెండి, బంగారు, వీనిలో దేనితోనయిన భగవంతుని ప్రతిమచేసి యర్చింపవచ్చును. ముందుదానికంటె వెనుకటివానితోఁ జేసినదానికిఁ బదింతలు హెచ్చుఫలముగలదు. ఇట్టులే క్రమముగా హెచ్చింప వలెను. ఇట్లర్చించిరేని జయముకోరిన రాజు జయించును. విద్యకోరిన బ్రాహ్మణుఁడు విద్యావంతుఁడగును. ధనముకోరు వైశ్యుఁడు ధనవంతుఁడగును. పుణ్యఫలముగోరు శూద్రుఁడు పుణ్యవంతుఁడగును. స్త్రీ యేకోరికతోఁ జేసినను నా యన్నికోరికలు పొందును. ఆశ్వ-వైష్ణవధర్మశాస్త్రము. ౨౧ అధ్యా. అనుజ్ఞాతాః స్త్రియశ్చైవ, మర్చయంతో జగద్గురుమ్. యథార్హ మపి శూద్రాద్యాః। సర్వేయాంతి పరాంగతిమ్. భారద్వాజ సంహిత. భర్తచే నాజ్ఞపొందినస్త్రీలును, యోగ్యతకుఁ దగినట్లు శూద్రాదులును నీవిధముగ నర్చించిరేని యందఱు పరమపదమునకుఁ బోదురు "అనుజ్ఞాతా తుయాభర్త్రా సైవకుర్యాద్యథావిధి। వ్రతోపవాసనియమ, దేవతారాధనాదికమ్" నారదీయపురాణము. భర్తచేనను జ్ఞపొందిన స్త్రీమాత్రము యథావిధిగ వ్రతములు- ఉపవాసములు దేవతారాధనము మొదలయినవి చేయవచ్చును. 'ఇతరాతు నకుర్వీత జీవమానే స్వభర్తరి, అజ్ఞానాద్యదివాలోభా, ద్యది కుర్యాత్ర్పమాదతః। తత్సర్వం నిష్ఫలంతస్యా, ఇతి వేదవిదోవిదుః॥ నారదీయము: భర్తజీవించియుండు నితరస్త్రీ యట్లుచేయరాదు. తెలియనితనము చేతనో లోభముచేతనో చేసెనా యది యంతయు వ్యర్థమని వేదవేత్తల యభిప్రాయము. శ్లో॥ అనారాధ్య హృషీకేశం, విధవా భోక్తుమిచ్ఛతి, సాప్రజేన్నరకంఘోరం కాలసూత్రమధోముఖీ'॥ నారదీయము విష్ణువు నారాధింపక విధవభోజనము చేయఁగోరెనేని యది తలక్రిందుగఁ గాలసూత్రమను నరకమునఁబడును. అట్లైన శ్లో॥ జప స్తప స్తీర్థసేవా, ప్రవజ్యామంత్ర సాధనమ్। దేవతారాధనం చైవ. స్త్రీశూద్రపతనానిషట్॥ అను వచనము గతి యేమందు రేమో.

ఈశ్లోకము వైదికపర్యాయమని పూర్వులు వ్రాసియున్నారు అనఁగా స్త్రీలు శూద్రులు వేదమంత్రములతో నర్చింపరాదని యభిప్రాయమే కాని కేవల నిషేధమనికాదు. తాంత్రికముగఁ జేయవచ్చును. 'యథార్హమపి శూద్రాద్యా' యని యనఁగా వారివారి యోగ్యతకుఁ దగినట్లు శూద్రాదు లర్చింపవచ్చునని పెక్కు

వాక్యములు గలవు. ఇంతయేల? అతిశయ భక్తియుక్తులై సంస్కారసంపన్ను లైన యాచార్యులచే నధికారము పొంది మంత్రానుష్ఠాన నిష్ఠులై దానికిఁదగిన యాచారముగలిగి దురాచారము వదలినవా రేవర్ణమువారైనను యథాశక్తి భగవదర్చను ప్రతిదినము పూజింపవలయునని భాగవతధర్మము తనయింటి లోనే దేవతాయతనమందు నారాయణార్చనము చేయుచున్నట్లు చెప్పుటచేఁ గౌసల్య ప్రతిదినము నారాయణార్చనము చేయుచుండెనని గ్రహింపవలయును.

ప్రాణాయామ మనఁగా శ్వాసనిరోధము. దాని యిష్టమువచ్చినట్లు పోనీ యక శ్వాసమును వశపఱచుకొనుట ప్రాణాయామ మనఁబడును. లోపలి గాలిని ముక్కుతో వెలుపలికి విడుచుట రేచకమనఁబడును, మరలగాలిని లోపలికిఁ బీల్చుట పూరక మనఁబడును. పీల్చినగాలిని లోపలనే బిగించుట కుంభకమనఁ బడును. ఇందు భేదములనేకములు గలవు. ముందులోపలిగాలి నెడమముక్కు మూసి కుడిముక్కుతో వెలుపల విడిచి తరువాత కుడిముక్కు మూసి యెడమ ముక్కుతో గాలిని మంత్రోచ్చారణముచేయుచు లోపలికి మెల్లగాఁ బీలుపవల యును. అట్లుపీల్చి రెండు ముక్కులుమూసి మంత్రము జపించుచు నది పూర్తి యైన పిమ్మట లోపలి గాలిని కుడి ముక్కుతో విడువవలయును. ఇట్లు విడిచి వెంటనే యెడముముక్కుమూసి గుడిముక్కుతోనే గాలిని జపించుచుఁబీల్చి లోపల నిలిపి కుడిముక్కుమూసి యెడమ ముక్కుతో గాలిని వెలుపల విడువవలయును. ఇట్టులే మార్చి మార్చి చేయవలయును. గాలిపీల్చుట ౧౬ చిటికలు వేయుకాల మైనచోఁ గుంభకము ౬౪-రేచకము. ౩౨-మార్లుగ నుండుటయుత్తమ పక్షము, జపాదులకై చేయుప్రాణాయామమందు మూఁడును సమానముగ నుండ వచ్చును. సంధ్యావందనమునఁ బ్రాణాయామము గాయత్రీమంత్రముతోఁ జేయవలయును. కౌసల్యకు గాయత్రీ జపకాలము గాకుండుటను నారాయణుని ధ్యానించెననుటచేతను నారాయణాష్టాక్షరితో జపించెనని గ్రాహ్యము. ఈ మంత్ర మిరువదియైదుమార్లు జపించుచుఁ బ్రాణాయామము చేయవలయును. ఇందుఁగొన్ని భేదములునుగలవు. స్త్రీలకు యోగమం దధికారముగలదు.

కం॥ కాంచి యభివాదనముఁ గా,వించి రఘూత్తంస మంత•వీనులవిం దౌ
నంచితవాక్యంబుల వి,న్పించెన్ హర్షమున మేను•నెఱి గగుఱింపన్. ౧౮

ఉత్తంసము=తలయందుంచుకొను పువ్వు-ఇది శ్రేష్ఠార్థమునను బ్రయో గింపఁబడును. ఇట్టులే యవతంస వతంస శబ్దములు-ఉత్తంసశబ్దము నపుంస కము గావున మువర్ణకాంతముగఁ బ్రయోగింపఁబడెను. అవతంసంబపుపార్వతీ పతికి॥ అని ప్రయోగము. గగురింపన్=గగ్గురుపాటు కలుగఁగా.

తా త్ప ర్య ము

తల్లినిజూచి యభివాదనము గావించి శ్రీరాముఁడు విన నింపగు మాట లచేఁ దన్ను మహారాజు యువరాజుగాఁజేసెదనని చెప్పినమాటలు వినిపించెను.

ముందే వినినవార్త మరలవినిన నేమిసంతోష మనరాదు. ఇదివఱకు విన్నది పరోక్షవార్త-సేవకులు చెప్పినది. ఇది ప్రత్యక్షవార్త-ఇదివఱకు విన్నదానిని రూఢిపఱుచునది- కావున నమ్మకము. అందుఁ గొడుకు చెప్పినది.

శా॥ తల్లీ! నాయన యానతిచ్చె నను గో•త్రాపాలనప్రక్రియా
సల్లీలం జరియింప, రేప యువరా•జశ్రీ గొనన్, రేయి నే
నిల్లాలుం దగు నిట్రు వూన నఁట, నా•కీరితి మాతండ్రి దా
నల్లాపించెఁ బురోహితాన్వితుఁడు నై•సంతోష మేపారఁగన్. ౧౩౦

శ్రీరాముఁడు తండ్రి తనతోఁ జెప్పినవాక్యముల సారంశమును దల్లికిట్లు చెప్పుచున్నాఁడు.

ఆనతి=ఆజ్ఞప్తి శబ్దభవము. గోత్రా=భూమియొక్క - (గోత్ర=భూమి, గోత్రము=పర్వతము) పాలనప్రక్రియా=పరిపాలించు కార్యమనెడి, సల్లీలన్=మంచిక్రీడయందు. సల్లీల యని చెప్పుటచే నింతవఱకు నాడుచుండిన చెండాటలు లోనైనవి కాలయాపనము ప్రయోజనముగాఁగలవి. ఈ యాట ధర్మము ప్రయోజనముగాఁగలది. రాజ్యపాలన మాట యనుటచే రామునకది కష్టమైన కార్యము కాదనియు సుకరము సంతోషకరమునైన దనియు శ్రీరామచంద్రుని భావము. నిట్రువు=ఉపవాసము, పురోహితాన్వితుఁడునై=పురోహితునితోఁగూడినవాఁడై-మంత్రి పురోహిత సమ్మతిలేదేని రాజు చెప్పినను అకార్యమగుననినమ్మరాదు. వారు వలదనిన మానవలసియుండును. వారును సమ్మతించుటచే నిఁకఁ దప్పదని భావము. సంతోషమే పారఁగన్=అనుటచేఁ బరుల బలాత్కారమునుచేతనో-యిష్టము లేకయుఁ జేయకతప్పదు కావునఁ జేయుఁబూనియో చెప్పలేదు నిండుసంతోషముతోఁ జెప్పెనని భావము.

తాత్పర్యము

తల్లీ! నాయన నాకిట్లుత్తర్వు చేసెను. ఏమన-కుమారా! నీ విదివఱకుబుసుపోకకై యాడుసట్టి యాటలు చాలించి యాయాటలకు మాఱుగ భూమిపరిపాలించుట యను మంచి యాటయందుఁ బ్రవర్తింపుము. నీ వుదయముకాఁగానే యౌవరాజ్యలక్ష్మిని గైకొనుము. ఈరాత్రి నీవు నీభార్య యుపవసింపవలసినదనియు నీవిధముఁగా మాతండ్రి పురోహితులతోఁగూడి వారిసమ్మతిపై సంతోషముతోఁజెప్పెను. ఇది తండ్రియాజ్ఞ కావునఁ దప్పించుకొన సాధ్యపడదు.

కం॥ వీడ కిపుడ చేయుము నీ,కోడలికిని నాకు రేపు•కొమరుగ శుభముం
గూడఁగఁ జేసెడిక్రియలను,వాడిమెయిన్ మాకు శుభము•పరివర్ధిల్లన్. ౧౩౧

తల్లీ! యింక నీవు సందేహింపక రేపు నీ కోడలికి నాకు న్యాయపద్ధతి శుభము కలిగించు పనులేవేనియున్నవో యవి యన్నియు వదలక చేయుము.

—♦ కౌసల్య శ్రీరాముని దీవించుట ♦—

సీ. అన నిట్లు దీర్ఘకా♦లాభికాంక్షితవాక్య,మును విని కౌసల్య♦మోద బాష్ప
కలవాక్యమునఁ బల్కుఁ♦గన్నతండ్రీ! రామ!చిరంజీవి వగుచును♦బరఁగవయ్య
శ్రీసమేతుండవై♦చెలఁగి నాదుసుమిత్ర, బాంధవులను బ్రీతి♦పఱుపవయ్య
జనకుని సంతుష్టుఁ♦జలుపుటచే బలే,కళ్యాణతార ని♦న్గంటి నయ్య

తే॥ రామ! నీవిప్పుడిక్ష్వాకు♦రాజ్యరమకుఁ
బతివి గావుట నేఁజేయు♦పద్మలోచ
నార్చనము నేఁడు ఫలయుత♦మయ్యె నయ్య
మొనసి శత్రులు చెడిరయ్య♦ముద్దులయ్య! ౧౩౨

దీర్ఘకాలాభి కాంక్షిత వాక్యము=చిరకాలముగ నెప్పుడెప్పుడు విందునా యని యెదురుచూచుచున్న యీ మాట - ఇచ్చటఁ జిరకాలమనఁగా బాల్యము పోయినది మొదలుకొని యని యర్థము. ఇప్పుడు రామునకు ౨౫ సంవత్సరములు కావున ౯ సంవత్సరములుగా నని భావము.మోదబాష్ప కల వాక్యమునన్= సంతోషముచే నానంద బాష్పములు కనులనుండి కాఱ దగ్గుత్తికతోటి సూక్ష్మ వాక్కులచే, బలే=ఔరా, సంతోషమును దెలుపువాక్యము, కల్యాణతార=శుభనక్షత్రము, రాజ్యరమకు=రాజ్యలక్ష్మికి, పద్మలోచనార్చనము=శ్రీమన్నారాయణ పూజ. పద్మలోచనా+పద్మలోచన+అర్చనము=లక్ష్మినారాయణపూజ.

శ్రీరామచంద్రుఁడిట్లుచెప్పఁగా నెప్పుడీశుభవార్త వినఁగలుగుదునా యని చాలకాలముగ నెదురుచూచుచున్న కౌసల్యాదేవి యానంద బాష్పములు రాల సంతోషాతిశయముచే మాట రాకున్నను సన్నని యెలుఁగున నిట్లనియెను. తండ్రీ! నాయనా! రామచంద్రా! యిటువంటి శుభవార్త నాచెవులవేసి యానందింపఁజేసితివి కావున దీర్ఘకాలము జీవింపుము. రాజ్యలక్ష్మితోఁగూడిన వాఁడవై బంధువులకు మేలుకూర్చుటేకదా రాజలక్షణము. తండ్రిమెచ్చుకొనునడవడి గల వాఁడవగుటచే ఆహా యెటువంటి శుభనక్షత్రమున నిన్నుఁగంటినయ్యా రామచంద్రా! నీవిపు డిక్ష్వాకు రాజ్యలక్ష్మికిఁ బతివగుటఁజేసి యిన్నిదినములుగ నేను జేయు శ్రీమన్నారాయణార్చనము ఫలించెను. ఇఁక శత్రువులు మనము చెఱుపకయే చెడిరికదా కుమారా.

హితరక్షణము-అహిత శిక్షణము రాజకృత్యమైనను కౌసల్య యుత్తమస్త్రీ కావున దమకుఁ మేలుమాత్రమే చేయఁగోరెను.ఇతరులకుఁ (కైకేయ్యాదులకు) గీడుకోరినదికాదు.

జనకుని సంతుష్టుఁ జలుపుటచే ననుటచే దశరథునకుఁ గైకేయి ప్రియురాలు. సవతి మచ్చరమునఁ గైకేయికిఁ గౌసల్యయందు ద్వేషభావము గలదు. ఆకారణముచే దశరథుఁడు కామదాసుఁడై కౌసల్య నుపేక్షించి పట్టపుదేవికిఁ జూపఁదగిన

గౌరవము చూపుచుండినవాఁడు కాఁడు. భర్త తనప్రియురాలికొడుకును బహూకరించునుగాని యప్రియురాలికొడుకును బహూకరింపఁడు. అట్లుండియుఁ దన యందుఁ బ్రీతిలేని తండ్రికిఁ బ్రీతి కలుగ వర్తించుట యన సామాన్యకార్యము గాదు. అదియునుగాక రాజ్యము కైక కొడుకునకుఁ బూర్వమే దత్తము. శ్రీరామునకు రాజ్యము వచ్చుటకు నిన్ని విరోధములుండినను దశరథుఁడు శ్రీరామునకే రాజ్యమిచ్చునటుల తీర్మానించుకొనుటకు శ్రీరామచంద్రుని గుణము లెట్టివై యుండవలయును. అట్లుగాకున్న :- పెద్దకొడుకునందుఁ దండ్రికి సహజ ప్రేమాధిక్యము. శునశ్శేప చరిత్రము చూచునది. కావునఁ దండ్రిని నీవు సంతోషింపఁ జేసితివని యదియొక గొప్పకార్యముగఁ జెప్పవలసిన పనియేలేదు నీ కృత్యము నీవుచేసితివి సూర్యోదయముకాఁగానే గూబలు చెట్లతొఱ్ఱలలో దాఁగినట్లు మనప్రయత్నము లేకయే శత్రువులు చెడుదురని భావము. చెడిరి=సమీప భవిష్యదర్థమున భూతకాలముపయోగింపఁబడెను.

చం॥ అని జనయిత్రి పల్కదర•హాసవికాసవిలాసభాసురా
 ననమున లక్ష్మణుం గని ఘ•నం బగునీవసుధాతలంబు నె
 ల్లను దమి నాకుఁ దోడయి చె•లంగుము నేలుము నీవు, లక్ష్మి ని
 న్ననువుగ నాద్వితీయ మగు•నాత్మవు గావుటఁ బొందె లక్ష్మణా. ౧౩౩

జనయిత్రి = తల్లి, దరహాస=చిఱునవ్వుయొక్క, వికాస = వ్యాపించుట యొక్క, విలాస=లీలచే, భాసుర = ప్రకాశించు, ఆననమునన్ = ముఖముతో, ద్వితీయమగు నాత్మవు = రెండవ ప్రాణమవు - వెలుపలి ప్రాణము.

తాత్పర్యము

అని యిట్లు కౌసల్య చెప్పఁగాఁ జిఱునవ్వుతో వికాసము నొందిన ముఖముతో శ్రీరాముఁడు లక్ష్మణుంజూచి యీభూచక్రమంతయు నాసక్తితో నాకు సహాయుఁడవై యుండి పరిపాలింపుము. నీవు నారెండవ ప్రాణము గావున లక్ష్మి నిన్ను వరించెను. నన్ను వరించినపుడు నిన్ను వరించినట్లే.

అబ్బా! యిపుడు నాప్రాణము సుఖపడినదనుట లోకప్రసిద్ధము. కర్తృత్వము విషయసంయోగము దేహమునకుఁ గలిగినను నిజముగ సుఖదుఃఖానుభవము చేతనునకే- కావున నైశ్వర్యము నాకులభించినను దానివలన సుఖమనుభవించువారు నాకుఁబ్రాణములయిన మీరే యని భావము. ఈవాక్యమే రామచంద్రమూర్తి మనస్థితి దెలుపఁగలదు మమప్రాణాహి పాండవాయన్నట్లు

కం॥ భోగంబులు రాజ్యఫలా,భోగంబులు నిచ్చకొలఁది • భోగింపు మికన్
 రాగమున నీకు నైకా, దే గొప్పగఁ జూతు రాజ్య•మేన్ జీవితమేన్. ౧౩४

భోగంబులు=సుఖములు, రాజ్యఫలా భోగంబులు=రాజ్య మేలుటవలనఁ గలుగు ఫలముల యతిశయములు, ఇచ్చకొలఁది=ఇష్టప్రకారము, రాగమునన్ = ప్రేమముచే.

తాత్పర్యము

లక్ష్మణా! సుఖములు; రాజ్యమువలనఁగలుగు విశేష ఫలములు నీఁక నీయిష్టము చొప్పున ననుభవింపుము. నేను రాజ్యముగోరుటగాని జీవించి యుండఁగోరుటఁగాని నీ నిమిత్తమేకదా.

ఈ రాజ్యమువలన నాకుఁ గలుగు లాభము సుఖములేదు. అవి లేకుండిన నాకురాఁగల నష్టియు లేదు. నేను జీవించియుండినఁ గదా నా యాశ్రితుల యక్కఱవసరముల, సహాయపడఁగలను. నాకైశ్వర్యముండినఁగదా నాయాశ్రితుల సుఖపెట్టఁగలుగుదును. దిసమొలవాఁడా కాళ్ళకడ వానికిఁగప్పు మన్నట్లు నేను దరిద్రుండనైన నితరుల నెట్లుసుఖపెట్టఁగలను. అను తాత్పర్యముతో నేను జీవించుటను సంపద సంపాదించుటను గొప్పగఁ జూచుచున్నానుగాని యాత్మార్థముగాదు.

కం॥ అనుఁగుందమ్మున కిట్లని, జనసుల కభివాదనంబు ♦ సలుపుచు భక్తిన్
జనకజ కనుజ్ఞఁగొని తాఁ, జనియెన్ రాముండు తనని♦శాంతంబునకున్. ౧౩౫

అనుఁగుందమ్మునకున్=ప్రియసోదరునకు- కర్మధారయంబుల నుదంతంబులకుఁ బరుషసరళంబులు పరంబు లగునపుడు నుగాగమంబగు. సులభ. సం. సూ. ౪౫. ప్రకారము అనుఁగుందమ్ముఁడయ్యె, జననులకున్ = కౌసల్యా సుమిత్రలకు, నిశాంతంబునకున్ = ఇంటికి.

తాత్పర్యము

ప్రియసోదరున కీరీతి వచించి తల్లులకు భక్తితో నమస్కరించి సీతయు వెడలిపోవఁదల్లులచే ననుజ్ఞగొని శ్రీరాముఁడు తనయింటికిఁ బోయెను.

—♦ {౫-వ సర్గము. దశరథుపంపున వసిష్ఠుఁడు శ్రీ సీతారాముల నుపవాస ముంచుట.} ♦—

కం॥ క్షితిపతి వసిష్ఠసంయమి, పతినిం గని రామచంద్రుఁ ♦ బత్నీ యశశ్శ్రీ
క్షితిలబ్ధికి నుపవాస, వ్రతముం జరపింప మీరు ♦ వలయును బోవన్. ౧౩౬

క్షితిపతి = రాజు దశరథుఁడు, సంయమిపతిన్ = మునీశ్వరుని, రామచంద్రుఁబత్నిన్ = రామచంద్రుని ఆయన భార్యయగు సీతను ఇరువురను. యశశ్శ్రీ క్షితి లబ్ధికిన్=కీర్తి సంపద భూమి లభించుటకుఁగాను, భూమిమీఁదఁ బుట్టిన ప్రతిమనుష్యుఁడు యశస్సును సంపాదింపవలయును. అది సంపదలేక రాదు. కావున సంపద సంపాదింపవలెను. భూమి లేక సంపద లేదు.

తాత్పర్యము

అప్పుట దశరథుఁడు వసిష్ఠమహామునిని జూచి మునీంద్రా! యశస్సు, సంపద, రాజ్యము లభించుటకై శాస్త్రీయవిధమున వ్రతము జరుపవలయును. వ్రతము లందుత్తమమైనది యుపవాసము. నేను సీతారాముల నీరేయి యుపవసింపఁ

జెప్పితిని. వారు పిల్లవాండ్రగుట యెట్లు చేయుదురో యేమో. కావున నది శాస్త్ర ప్రకారము జరుపుటకు మీరుపోయి యేర్పాటు చేసిరావలెను.

చం॥ అని యిటు జేఁపు పల్కిన మహామతి యమ్మునినాథుఁ డట్టులే
చనె నొకవిప్రయోగ్య మగుస్యందన మెక్కి రఘూద్వహాలయం
బున, కటు మౌని కక్ష్యలను మూఁటిని దాఁటి చనంగ రాముఁడున్
విని యెదు రేగి డింపఁ గడుఁ బ్రీతిఁ బ్రియంబుగఁ బల్కె మౌనియున్.

విప్రయోగ్యము = బ్రాహ్మణులెక్కఁదగినది, స్యందనము=తేరు, రఘూద్వహాలయంబునకున్=శ్రీరాముని యింటికి, కక్ష్యలను=తొట్టి కట్టులను.

తా త్ప ర్య ము

రాజీప్రకారము చెప్పఁగా గొప్పమనస్సుగల వసిష్ఠుఁడు బ్రాహ్మణుల కర్హమైన తేరెక్కి శ్రీరాముని యింటికిఁబోయెను. ఆయనరాక విని శ్రీరాముఁడెదురుగ మూఁడవకక్ష్యకే పోయి చేయూఁత యిచ్చి రథమునుండి దింపఁగాఁ బ్రీతితో మునీంద్రుఁడిట్లనియె.

రాముఁడెదురేగె ననుటచే గురువులరాక తెలియరాఁగానే శిష్యులెదురుగఁ బోవలయునని సూచన.

శ్లో॥ ప్రతిశ్రవణ సంభాషే, శయానో నసమాచరేత్-
నాసీనో నచభుంజానో, నతిష్ఠన్న పరాఙ్ముఖః ॥

శిష్యుడు పరుండికాని కూర్చుండికాని భుజించుచుఁ గాని పెడమోముతోఁ గాని గురు మాటకు బదులు మాటాడుటగాని ముచ్చటలుగాని చేయరాదు.

శ్లో॥ ఆసీనస్య స్థితఃకుర్యా, దభి గచ్ఛం స్తు తిష్ఠతః ।
ప్రత్యుద్గమ్యతా వ్రజతః, పశ్చాద్ధావస్తు ధావతః॥

గురు వాసనమునఁగూర్చుండి యాజ్ఞ యిచ్చిన యెడల శిష్యుఁడు తాను నిలఁబడియు, నిలఁబడి యిచ్చిన యెడల నెదురేగియు,వచ్చుచు నిచ్చినయెడల నెదురుకొనియుఁ బరుగిడుచు నిచ్చినయెడలఁ దానువెంబడి పరుగిడుచు, దానిఁ గైకొనుటగాని సంభాషణముగాని చేయవలయును.

శ్లో॥ పరాఙ్ముఖస్యాభిముఖో, దూరస్థ మైత్యతచాంతికమ్
ప్రణమ్యతు శయానస్య, నిదేశేచైవ తిష్ఠతః ॥

గురువు పెడమోముతోనుండినచోఁ దా నెదురేగియు, దవ్వున నున్నచోఁ దానుదగ్గఱియుఁ,బరుండియున్నచోఁ దా నమస్కరించియు,నిలఁబడియున్నచోఁ దాను దాపున నిలఁబడియు గురువు నాజ్ఞను జేయుటగాని మాటలాడుటగాని చేయవలయును. మను. ౨-౧౯౭.

కం. అన్నా! నీజనకుండు ప్రసన్నత యువరాజుఁ జేయ సమకట్టెఁ గదా
నిన్నహుషుండు యయాతిబ,లెన్నెఁడుపవాసవిధి వలెన్ జరుపంగన్. ౧౩౮

అన్నా = ఇది ప్రీతిచేఁ జెప్పెడుమాట, ప్రసన్నతన్=నీ యందనుగ్రహ బుదిగలవాఁడై, నమకట్టెన్ = ప్రయత్నించెను.

తాత్పర్యము

నాయనా రామచంద్రా! రాజు నీయెడ సంతోషించినవాఁడై నహుషుఁడు యయాతికిఁ బట్టముఁ గట్టినట్లు నీకుఁ బట్టముఁ గట్ట యత్నించెఁగదా. ఆ కార్యము జరుపుటకు ముందు సీతయు నీవు నుపవాస వ్రతము జరుపవలెను.

ఉ॥ సీతయు నీవు, తేప యభి•షేకము తేఁ డొనరించునంట, నం
చాతరణీద్యవంశజు ధ•రాత్మభవ న్విధిచోదితంబు నా
రీతి సమంత్రకంబుగ వ•రిష్ఠతపస్వి యతోపవాసను
స్థితులఁ జేసి యర్చనల•శ్రీరఘురాముఁ డొనర్ప నందుచున్. ౧౩౯

తేఁడొనరించునంట=రాజు చేయఁదలఁచి యున్నాఁడఁట, ఒనరించు ననక 'యొనరించునఁట' యనుటచే నిది తేని యభిప్రాయముమాత్రమే. (అనఁగా నది జరుగఁబోవునది కాదు- దైవసంకల్పము భిన్నముగా నున్నదని భావము. రాజాజ్ఞ మీఱరాదు. దైవరహస్యము వెలిపెట్టరాదు.) కావున మీ రుపవాసముండ వలసినదే. తరణీద్యవంశజున్=సూర్యుని ప్రసిద్ధవంశమునఁ బుట్టినవానిని, ధరాత్మభవన్=భూపుత్రియగు సీతను, విధిచోదితంబు=శాస్త్రము విధించిన ప్రకారము, సమంత్రకంబుగన్ = మంత్రయుక్తముగ, వరిష్ఠతపస్వి = తపస్సులయందు శ్రేష్ఠుఁడు, యతోపవాససుస్థితులన్ = నియమముగల యుపవాసముచే గొప్పవారిని.

తాత్పర్యము

రామచంద్రా! రాజు నీకు తేపే పట్టాభిషేకము చేయునఁట. అని చెప్పి రాజాజ్ఞ ప్రకారము సీతాదేవిని శ్రీరాముని శాస్త్రప్రకార ముపవాసముండఁజేసెను. ఇట్లుచేసి శ్రీరామునిచేఁ బూజింపఁబడి

కం॥ వెనువెంట వచ్చు రఘురా,
ముని ముని నిలు నిలు మటంచు•ముదల నొసఁగి తాఁ
జనియెను రామనివేశన,మును వీడి రథస్థుఁ డగుచుఁ•బురమార్గమునన్.

ముదల = ఆజ్ఞ. ౧౪౦

తాత్పర్యము

తన్ను సాగనంపఁ దన వెంటవచ్చు శ్రీరాముని నీవు నిలుము నిలుము రావలదనిచెప్పి శ్రీరామునుగృహముపీడి రథమెక్కి పట్టణమున వీధులవెంటఁ బోయెను. ముని ముని నిలు నిలు ఛేకానుప్రాసము.

— • శ్రీరామపట్టాభిషేకమునకై జనులు గుంపులు గూడుట. • —

చం॥ మునికులసార్వభౌముఁ డిటు•మోదముతో నరుగం బ్రియంవదుల్
తనహితు లెల్లరుం గొలువఁ•దాఁ జని యాత్మగృహంబులోనికిన్

జనకసుతామనోహరుఁడు♦సాంత్వపువాక్కుల వారిఁ బ్రీతులం
బొనరఁగఁ జేసి వెండి రఘు♦ముఖ్యుఁ డనుజ్ఞ యొసంగె వారికిన్. ౧౪౧

ప్రియంవదుల్ = ఇంపగు వాక్కులు చెప్పువారు, ఇచ్చకాల మారులు-హితులు=మేలుగోరిచెప్పువారు, కొలువన్=సేవింపఁగా, సాంత్వపు వాక్కులన్=మంచి మాటలచే.

తాత్పర్యము

మునిశ్రేష్ఠుఁడైన వసిష్ఠుఁ డిల్లువెడలిపోఁగాఁ బ్రియవాదులు హితవాదులు నగువారు సేవించుచుఁ దోడరాఁగాఁ దనయింటిలోనికిఁబోయి శ్రీరాముఁడు వారల నెల్ల మంచిమాటలచే సంతోషింపంజేసి యిఁకఁ బొండని యనుజ్ఞయిచ్చెను.

కం॥ విచ్చినకమలంబులు మద,మెచ్చిన శకునములు నైరఁ♦హించుకొలను నా
నచ్చజిగిఁబురుషయువతిస,ముచ్చయములతోడరాము♦మొసల వెలసెన్.

శకునములు=పక్షులు, అచ్చజిగి=స్వచ్ఛమైన కాంతిగల, మోసల=మొగసాల, అచ్చజిగి=సమాసంబున విభక్తిలోపంబు, అచ్చ తెలుపు=అచ్చవెన్నల.

తాత్పర్యము

వికసించిన తామరలు- మదించిన పక్షులుగల కొలనివలె మిగులకాంతిగల స్త్రీపురుష సమూహములతో శ్రీరాము మొగసాల ప్రకాశించెను.

సీ॥ ఇసు మెత్తి చల్లిన♦నిలను రాలకయుండ,మూఁగినమూఁకచే♦మొనయువాని
నెప్పు డెప్పు డటంచు♦నెదురు చూచుకుతూహ,లప్రజచేతఁ జె♦లంగువాని
జనతాతరంగహ♦ర్ష స్వనోద్గాఢమై, యంబురాశికి నుద్ది♦యైనవాని
నంబువుల్ చల్లి వృ♦క్షంబులు గట్టి మీల్,రంగవల్లులను బ♦రంగువాని

తే॥ నెప్పు డెప్పుడు భాస్కరుఁ♦డేగుదెంచు,
ననుచు నట్టెత్తితూలుపుఁ♦గనుచు నున్న
బాలబాలావధూవృద్ధ♦పటలిచేత, మించి యిఱుకైన తెరువులఁ♦గాంచె మౌని. ౧౪౨

ఇసుము=ఇసుక, జనతా=జనసమూహములనెడి, తరంగ=అలలయొక్క (గుంపువెంబడి గుంపు వచ్చుటచే నలలకుఁ బోలిక), హర్షస్వన=సంతోషధ్వనులచే, ఉద్గాఢమై=మిక్కిలి యతిశయించినదై, అంబురాశికి=సముద్రమునకు, ఉద్ది=సమానము, రంగవల్లులు=ముగ్గులు, అట్టెత్తి=మెడలు నిక్కపెట్టి, బాలా=ఆఁడుపిల్లలు, వధూ=వయస్సువచ్చిన స్త్రీలు.

తాత్పర్యము

శ్రీరాము ధామము విడిచి దశరథునింటికి వసిష్ఠుఁడు పోవునపుడు వీథులున్నవిధమును గవి వర్ణించుచున్నాఁడు.

ఇసుక చేతులతో నెత్తియెగచల్లిన నొకయిసుకరేణువైనను భూమిమీఁదఁ బడకుండునట్లు జనసమూహముచే నిండియున్నవానిని, శ్రీరామచంద్రమూర్తికి

నెప్పుడు పట్టాభిషేకము జరగునా యెప్పుడు కన్నులారఁ జూతుమా యని మిక్కిలి కోరికగల ప్రజలచే నిండినవానిని అలలధ్వనిచే నతిశయించిన సము ద్రమువలె జనుల కోలాహలముచే వ్యాపించినవానిని, వీథులనన్నిట నీళ్లుచల్లి యరఁటి స్తంభములు గట్టి నానావిధములయిన ముగ్గులు దీర్చియుండువానిని సూర్యుఁ డెప్పుడెప్పుడు పుట్టునా యింకను బుట్టలేదే యని తీవరపడుచు సూర్యుఁడు పుట్టెనేమో యని మెడలు నిక్కపెట్టి తూర్పుచూచుచున్న మగపిల్ల వాండ్రు - ఆఁడుపిల్లలు - వయస్సుస్త్రీలు-ముదుసళ్ళు వీరి సమూహముచే నిఱుకై పోవనెడములేని వీథులను, ముని గాంచెను.

కం॥ మిద్దెల మేడల ధ్వజతతు, లద్దిర యెగురంగ సాగె • హర్షముతో నీ
సుద్దిని మింటను వేలుపు, ముద్దియలకుఁ జెప్పుచున్న • ముచ్చట దోఁపన్.

తాత్పర్యము		౧౪౪

మిద్దెలమీఁదను మేడలమీఁదను బౌరులచేఁగట్టబడిన ధ్వజములు గాలికి నెగురుట చూడఁగా నవి శ్రీరామపట్టాభిషేకవార్తను స్వర్గమునసుండు దేవతా స్త్రీలకు సంతోషముతోఁ జెప్పుచున్నవా యన్నట్టులుండెను.

అలం. ఉత్ప్రేక్ష

కం॥ జనతాలంకృతిభూతము, జనతానిసులితమోద • జనకం బగుప
త్తనమున నుత్సుకజనములఁ, గనుచుం బ్రజ బంతి దీర్చు • గతి మెల్ల చనెన్.

తాత్పర్యము		౧౪౫

జనులయలంకారముచే నిండినదియు జనుల కసమానమైన సంతోషము గలిగించునదియునైన యయోధ్యానగరమున రామపట్టాభిషేకము చూడఁగోరిక గల జనముల నడుమ వసిష్ఠునితేరు పోవునపుడు దానికి నెడమిచ్చుటకై యిరు పాయలుగాఁజీలు జనములను జూడ జనులను బంతులు దీర్చుచున్నదాయేమి యన్నట్టులుండెను.

చ॥ అరుసముతోడ మౌని యవి • యన్నియుఁ గాంచుచు నేగియేగి డాల్
వరఁగ సితాంబుదాంచలని • భం బయి క్రాలునృపాలచంద్రుమం
దిరమును జేర నేగ, గురు • దేవవిభుం డన నానృపాలుఁడున్
దొరతొర లేచి తన్నట నెదుర్కొని కార్యము ప్రశ్న సేయుడున్.	౧౪౬

అరుసము=హర్షశబ్దభవము సంతోషము, డాల్=కాంతి, సితాంబుదాంచల నిభంబు=తెల్లని మేఘము కొనతోసమానమై, గురున్=బృహస్పతిని- తొరతొర = శీఘ్రముగా.

తాత్పర్యము

ప్రజలకు శ్రీరామునందుఁగల శ్రద్ధాభక్తులు చూచి సంతోషపడుచు మెల్లగాఁ బోయి తెల్లమేఘము నంచువలెఁ గాంతికలదై యొప్పు దశరథు నగరుచేరఁ

బోఁగా నాయనయు బృహస్పతి నెదుర్కొనఁ బోయిన యింద్రునివలె నెదురుగాఁ బోయి యేమిజరిగెను? సీతారాము లుపవాసవ్రతముఁ బూనిరా? యని యడుగఁగా

కం॥ జరపితి సకలం బనియెను, ధరణీపుతోడన సభాస♦దవ్రజ మెల్లన్
గురుమతి లేచి వసిష్ఠునిఁ, గరముం బూజింప నవని♦కాంతుఁడు పిదపన్. ౧౪౭

కం॥ జరగిన వృత్తాంతము విని, గురువర్యు ననుజ్ఞఁ గాంచి♦కూడినమనుజో
త్కరమునకున్ సెల విచ్చెను, బరమ ముదంబునను దగిన♦భంగిని నిట్టుల్.

తాత్పర్యము ౧౪౮

కార్యమెట్లు జరుపవలయునో సర్వమట్టులే జరపితిని- అని సభాకూటము నకుఁ బోఁగా నచ్చటి సభ్యజనులందఱు లేచి గౌరవించిరి. అపిమ్మట సీతారాముల వృత్తము పౌరజనులచర్యలు వారి యుత్సాహము సర్వము వసిష్ఠుఁడు వివరింపఁగా విని గురువర్యుని యనుజ్ఞగొని సభయందుండువారికెల్ల మీరిఁక మీయిండ్లకుఁ బోవచ్చునని సంతోషముతో సెలవిచ్చి పంపెను.

మానిని. వారల నెల్లరఁ బోవఁగఁ బంచి నృ♦పాలుఁడు సింహము శైలగుహన్
జేరెడిరీతి సమగ్ర్యసువేషవి♦శేషవధూజనతాకులజం
భారినిశాంతమనోహరరాజగృ♦హంబును జొచ్చి సఋక్షగణో
దారనభంబును జందురునట్టులు♦దా వెలిఁగించె స్వదీధితులన్. ౧౪౯

సమగ్ర్య.......గృహంబును- సమగ్ర్య=సంపూర్ణమగు, సువేషవిశేష = క్రొత్తవై మేలయిన యలంకారములుగల, వధూజనతాకుల=స్త్రీసమూహముచే నిండినదై, జంభారినిశాంత=ఇంద్రునిగృహమగు వైజయంతమువలె- మనోహరమైన రాజగృహంబును, సఋక్షగణ=నక్షత్రసమూహముతోఁగూడిన, ఉదార = గొప్పదగు, నభంబును=ఆకాశంబును, స్వదీధితులన్=తనకాంతులచే.

తాత్పర్యము

దశరథమహారాజు సభ్యులనెల్లఁ బోవ ననుజ్ఞయిచ్చి సింహము తనగుహను ప్రవేశించునట్టులు నానావిధములైన నూతనాలంకారములచే సొబగారు స్త్రీజనములచే నందమై యింద్రునిమేడనుబోలిన తనగృహంబునఁ బ్రవేశించి తనకాంతులచే నక్షత్రములచే నిండిన యాకాశమును జంద్రునివలెఁ బ్రకాశింపఁ జేసెను.

— ♦ ౬-వ సర్గము. శ్రీరాముఁడు నారాయణార్చనము సేయుట ♦ —

కం॥ చనుడుఁ బురోధయుఁ దా మజ్జన మొనరిచి నియతమతి వి♦శాలాక్షిని ప
త్నిని గూడి రామభద్రుం, డనఘుఁడు నారాయణుని స♦మర్చన సలిపెన్.

పురోధ=పురోహితుఁడు, మజ్జనము=స్నానము, నియతమతిన్=నియమముతోఁగూడిన మనస్సుతో, విశాలాక్షిని = వెడలుపైన కన్నులుగలదియగు, పత్నిని=భార్యను, మజ్జనమొనరించి యనుటచేఁ గాయశుద్ధియు, నియతమతి యనుటచే మనశ్శుద్ధియుఁ, దెలుపఁబడెను.

తాత్పర్యము

తనకుఁ జెప్పవలసిన వన్నియుఁజెప్పి పురోహితుఁడగు వసిష్ఠుఁడు వెడలి పోఁగా శ్రీరామచంద్రుఁడు సతీసమేతుఁడై స్నానముచేసి విశాలాక్షియగు భార్యతోడ శ్రీమన్నారాయణు నారాధించెను.

ఇచ్చటఁ జెప్పఁబడిన నారాయణమూర్తి శ్రీరంగనాయకులని, యుద్ధకాండ మందును, ఉత్తరకాండమునందును జెప్పఁబడు కులధన మిదియని పురాణగాథ- విభీషణున కనుగ్రహించినది యీమూర్తినే. తానే నారాయణుఁడే మరల నీపూజ యెవరి నుద్దేశించి యనిన గృహదేవతార్చనము లోకవిడంబనార్థము లోకసంగ్రహార్థముసని యెఱుంగవలయును.

౧-౨౮-౧౩-౨-౧౩౦-౧౩౧-౧౩౩ పద్యములవలన నిక్ష్వాకువంశజుల యిలవేల్పు శ్రీమన్నారాయణుఁడని యేర్పడుచున్నది. విశాలాక్షీశబ్దమునకు లక్ష్మియనియు నర్థముగలదు. ఋతేమాయా విశాలాక్షీం తవ పూర్వ పరిగ్రహా మ్మని యీరామాయణమందే ప్రయోగము కలదు. కావునను బాలకృష్ణునిఁదప్పఁ దక్కిన పురుషమూర్తులను మాత్రము పూజింపరాదు. లక్ష్మీయుక్తముగానే పూజింపవలెను. కావున పత్నినిగూడి రామభద్రుం డనఘుఁడు విశాలాక్షిని నారాయణుని సమర్చన సలిపెన్ అనియు నన్వయింపఁదగు. ఈయర్థము బోధించుటకే క్రిందిపద్యమున శ్రీపతిన్ అని ప్రయోగింపఁబడియె. పత్నినిగూడి యనుటచే 'పత్న్యోర్నో యజ్ఞసంయోగ' యని దీక్షానియమమందు భార్యా సహాయత్వము శ్రుతిసిద్ధము, పత్నితోఁగూడి యర్చించె ననుటచే ధూపదీప గంధ తాంబూలాద్యుపకరణములు భార్య యందీయఁగా శ్రీరాముఁడు పూజించె నని యెఱుంగవలయును.

భర్తలు దేవతలఁ బూజించునపుడు భార్యలు బొమ్మలవలెఁ గూర్చుండ రాదు. లేచి పెత్తనాలకుఁ బోరాదు. ప్రక్కనకూర్చుండి భర్తకుఁగావలసినవన్ని యందిచ్చుచుండవలెను.

విశాలాక్షిని పత్నిగూడి యనుటచే సీతాదేవి విశాలమైన కన్నులు తన మనస్సు నాకర్షించుచున్నవైనను అనఘుఁడు కావున కామదూషితుఁడు గాక యర్చించెనని భావము.

మజ్జన మొనరించి యనుటచే నేవైదిక కర్మమైనను స్నానముచేసియే చేయవలయునని సూచితము.

'వేదకర్మాధి ప్రయోక్ష్య న్నాదిత ఏవతీర్థే స్నాత్వా' యని బోధాయనులు, 'మనఃప్రసాదాత్సత్యోక్త్యా తపసాస్నాన కర్మణా ఆచంత్యాచ పునశ్శుద్ధింకృత్వా కర్మసమారభేత్" అని గౌతముడు-ప్రసన్నమైన మనస్సుతో సత్యవాక్యముతోఁ దపస్సుతో స్నానముచేసి యాచమించి మనస్సు శుద్ధిచేసికొని కర్మనారంభింప వలెను.

'నహిస్నానం వినాపుంసాం, ప్రాయత్యం కర్మసుస్మృతమ్। హోమే జప్యే విశేషేణ, తస్మాత్స్నానం సమాచరేత్' వ్యాసులు. పురుషులు స్నానము చేయక ముఖ్యముగ హోమము జపము చేయరాదుగనుక స్నానము చేయవలయును.

చం॥ తలను హవిస్సుపాత్రము య॰థావిధిఁ దాల్చి, జ్వలించు నగ్నిలో
పల విధిపూత మౌఘృతము॰భక్తిమెయిం బరదైవతంబునుం
దలఁచుచు వేల్చి, శేషము॰దద్దయుఁ బ్రీతి భుజించి శ్రీపతిన్
నిలిపి యెడంద, దర్భశయ॰నీయమునన్ హరిమందిరంబునన్. ౧౨౧

యథావిధి=శాస్త్రవిధానము నతిక్రమింపక, విధిపూతము=మంత్రములచేఁ బవిత్రమైన, ఘృతము=నెయ్యి, జలించు నగ్నిలోన్ = మండుచున్న యగ్ని యందు, వేల్చి=హోమముచేసి, శేషము=హోమముచేయఁగా మిగిలినదానిని, శ్రీపతిన్=లక్ష్మీవిశిష్టుఁడైన నారాయణుని, ఎడందన్=హృదయమందు, దర్భ శయనీయమునన్=దర్భలచేఁ జేయఁబడిన పాన్పునందు, హరిమందిరంబునన్ =ప్రణవాకారమైన విష్ణుమందిరంబునందు, తలను హవిస్సు పాత్రమును,యథా విధి దాలిచి యనుచో "ఉపరిహిదేవేభ్యో ధారయంతీతి" శ్రుతివాక్య మనుసం ధింపవలయును. పరదైవము=తం దేవతానాం పరమంచదైవత'మ్మను శ్రుతి చెప్పిన నారాయణు నని యర్థము.

జ్వలించు నగ్నిలో ననుటచే మండుచున్న మంటలో హోమము చేయ వలయును గాని పొగరాఁజునప్పుడు చేయరాదని సూచన.

శ్లో॥ బహుశుష్కేంధనే చాగ్నౌ, సుసమిద్ధేహుతాశనే
విధూమే లేలిహానేచ హోతవ్యం కర్మసిద్ధయే॥ విష్ణు

ఎండిన కట్టెలు విశేషముగనుండి పొగలేక జ్వాలలుగల యగ్నియందు కర్మసిద్ధిఁగోరువారు హోమము చేయవలయును.

నిప్పులయందు, జ్వాలలు లేని యగ్నియందు హోమముచేసినఁ గీడు కలుగును. ఆజ్యధార మాషస్థూలము నాలుగంగుళముల దీర్ఘమునై యుండ వలెను. అన్నాహు పచ్చి యుసరిక కాయయంత యుండవలెను.

'యోంతర్చిషి జుహో త్యగ్నౌ, వ్యంగారేచైవ మానవః
మందాగ్నిరామయావీచ, దరిద్రశ్చోప జాయతే॥

శేషము భుజించి=హోమముచేయఁగా మిగిలినది భుజింపవలయును.

హవిరుచ్ఛిష్టం సర్వే ప్రాశ్నీయుః॥ ఆశ్వలాయనులు. ఏతస్మిన్కాల అగ్నిద్రేయజమానః పురోడాశానాం ప్రాశ్నాతి॥

దర్భశయనీయమున ననుటచే వ్రతదినములందు మంచములమీఁదఁ బఱుపులమీఁదఁ బండుకొనరాదని సూచన. "స్వాస్తీర్ణే కుశసంస్తరే" అని ప్రమా ణము. నాసం ద్యాంశయీత"బోధాయనులు,"ఉపరిత్వేన శయీ"అపస్తంబులు

'ఖట్వాసనంచ శయనం,వర్జయే ద్దంతధావనమ్। స్వపే తదేకః కుశేష్వేవ,నరేతః స్కందయేత్క్వచిత్' యముఁడు.

శ్రీపతిన్నిలిపి యెడంద ననుటచే సత్కర్మములందు భగవద్ధ్యానము చేయవలయునని సూచన.

'ఈశ్వరే నిత్యకాలాత్మా చింతనీయః సుకర్మసు'గోపాలకారిక. 'ద్వేరూపే వాసుదేవస్య, చరంచాచర మేవచ, చరం సన్న్యాసినాం రూప, మచరం ప్రతి మాదికమ్' వ్యాసులు.

భగవంతుఁడగు వాసుదేవునకు చరరూప మచరరూపమని రెండు రూపములు గలవు. సన్న్యాసులరూపము చరము-ప్రతిమాదు లచరము.

తా త్ప ర్య ము

హవిస్సుగల పాత్రమును శ్రుతియందుఁ జెప్పఁబడిన ప్రకారము శిరము మీఁదికెత్తి మండుచున్న యగ్నిహోత్రముఁలో మంత్రనంతమైన నేతిని భక్తితో శ్రీమన్నారాయణుని ధ్యానించుచు హోమము చేసి హోమముచేయఁగా మిగిలిన దానిని భుజించి శ్రీమన్నారాయణుని హృదయమున నిలిపి దర్భలచే నేర్పాటు చేయఁబడిన శయ్యయందు నారాయణు మందిరంబునందు (శయనించెను).

హవిస్సు భుజించుటవలన నుపవాసవ్రతభంగముగదా యని శంకింపఁ బనిలేదు.

శ్లో॥ అష్టాన్యే తాన్యవ్రతఘ్నాని, హ్యాపోమూలం ఘృతంపయః, హవిర్బ్రాహ్మణ కార్యంచ, గురోర్వచన మౌషధ మ్మని యుండుటచే నౌషధము హవిస్సు నీళ్ళు, పాలు, నేయి, మందు, భుజించుటవలన వ్రతభంగములేదు, బ్రాహ్మణ కార్యమనఁగా నిచట శ్రాద్ధమునందు నిమంత్రణము, గురువు చెప్పినట్టు చేసినను వ్రతభంగము లేదు.

కం॥ వినియతవాఙ్మానసుఁడై, జనకసుతాసహితుఁ డగుచుఀశయనించెను, మే
ల్కొని వేగ జాము గల దనఁ,
దనగృహ మఖిలం బలంకృఀతము సేయించెన్. ౧౨-౩

వినియత=మిక్కిలి నియమింపఁబడిన, వాక్=వాక్కు, మానసుఁడై= మనస్సుగలవాఁడై అనఁగా మౌనము వహించి మనస్సు చలింపనీయనివాఁడై, జనకసుతా సహితుఁడు=సీతతోఁగూడినవాఁడు, వేగ జాము గలదనన్=తెల్లవాఱుటకు నొకజాము కాలమున్నదనఁగా, వినియతవాఙ్మానసుఁడై యనుటచే వ్రతవేళ మాటలాడక యేకధ్యానముగ నుండవలయు నని సూచన.

'జపకాలే నభాషేత, వ్రతహోమాదికేషుచ' జపకాలమందు, వ్రతకాలమందు. హోమాదులందు మాటలాడరాదు.

తా త్ప ర్య ము

దర్భశయ్యమీఁద భార్యతోడఁ బరుండియు నామెతో మాటలాడక యామె యందు మనస్సుపోనీయక యసిధారా వ్రతచర్యానిష్ఠుఁడై పంపుకొని నాలుగవజామును పుట్టఁగనే మేల్కొని లేచి తన యిల్లంతయు స్త్రీలచే నలంకారము చేయించెను.

దీనివలన గృహాలంకరణమును స్త్రీలు సూర్యోదయమునకు ముందే చేయవలయునని సూచన.

అశూన్యదేహ ళీకార్యా, ప్రాతఃకాలే విశేషతః : యస్యాః శూన్యా భవేత్సాతు, శూన్యం తస్యాః కులంభవేత్॥ పాదస్య స్పర్శనం తత్ర,అసంపూజ్యాచ లంఘనమ్: కుర్వన్నారక మాప్నోతి, తస్మాత్తత్పరి వర్జయేత్॥ ప్రాతఃకాలే స్త్రీయాకార్యం। గోమయేనాను లేపనమ్। ప్రత్యహం సదనేతస్మా,న్నైవదుఃఖాని పశ్యతి॥ స్పృశంతి రశ్మయోయస్య గృహం సమ్మార్జ నాదృతే। భవంతి విముఖా స్తస్య, పితరోదేవ మాతరః॥ నిశాయాః పశ్చమే యామే ధాన్య సంస్కరణాదికమ్, క్రియమాణాం హినారీణాం, సర్వశ్రేయో ధనావహమ్॥ సంధ్యాకాలేతు సంప్రాప్తే, ధాన్య సంస్కరణాదికమ్। కురుతేయాతు మోహేన, వంధ్యాజన్మని జన్మని, సంధ్యాకాలేతు సంప్రాప్తే, మార్జనం నకరోతియా। భర్తృహీనా భవేత్సాతు, నిస్స్వా జన్మని జన్మని. అకృత స్వస్తికాయాతు, క్రామే ల్లిప్తాంచమేదినీమ్॥ తస్యాస్త్రీణి వినశ్యంతి, విత్తమాయుర్యశ స్తథా,నాక్రమే దంష్ట్రిణా జాతు, పుత్రదారధనక్షయాత్, ఉలూఖలంచ ముసలం, తథాచైవ ఘరట్టకమ్. యదాక్రమాణాత్పాపీయో, నాప్నుయాదు త్తమాం గతిమ్. మార్కండేయపురాణము.

ముఖ్యముగాఁ బ్రాతఃకాలమందు (సూర్యోదయమునకు 3 గడియలకు ముందిటికాలము ప్రాతఃకాలమనఁబడును) ఇల్లు పాడుగా (అలుకక) నుంచరాదు. ఎవతె యట్లుంచునో దానివంశము శూన్యమగును. అట్లు అలుకని గడపను గాలితోఁ దాఁకరాదు-దాఁటరాదు. అట్లు దాఁకినను దాఁటినను నరకప్రాప్తి యగును. ప్రాతఃకాలమందే గోమయముతో నిల్లలుకు స్త్రీయింట దుఃఖములు గలుగవు. కసవు చిమ్మకముందే సూర్యకిరణము లెవనియింటఁ బడునో వాని పితరులు విముఖులై పోదురు. రాత్రి కడపటిజామునందే ధాన్యము చక్కఁజేసియుంచుకొనుస్త్రీకి సర్వశ్రేయస్సులు ధనము గలుగును. సంధ్యాకాలమం దెవతె మోహముచే ధాన్యము జక్కఁజేయునో(దంచుట చెరుగుటలోనైనవి)యది జన్మజన్మమున గొడ్డురాలగును. సంధ్యాకాలమం దెవతె యిల్లుకసవు చిమ్మదో యది పతిలేనిదై జన్మజన్మమున దరిద్రురాలగును. ముఖము కడుగుకొనక కుంకుమ ముఖమునఁ బెట్టుకొనక చెదరిన వెండ్రుకలు వ్రేళ్ళతోనైన దువ్వుకొనక యెవతె యలికిన భూమిని దాఁటునో దానికి ధనము- ఆయుస్సు-కీర్తి నశించును.కాళ్ళచే

జోలు రోఁకలి విసరుఱాయి (తిరుగలి) దాఁటరాదు. అట్లు దాఁటు పాపాత్ముఁ డుత్తమ లోకమునకుఁబోఁడు. వాని పుత్ర దారధనములు క్షయించును.

యద్గృహం రాజతే నిత్యం, రంగవల్ల్యాను లేపనైః
తద్గృహే వసతే లక్ష్మీ,ర్నిత్యం పూర్ణ కలాన్వితా॥

ఏ యింటిలోఁ బ్రతిదిన మలుకులు ముగ్గు లుండునో యాయింట లక్ష్మీ దేవి పూర్ణకళలతో వసించును.

మేల్కొని వేగజాము గలదనన్- శ్రేయస్కాముఁడు సూర్యోదయమునకు ముందుగనే లేవవలయును. లేచి; ప్రవృత్తిమార్గమందుండు వారు ధర్మార్థ కామములను నివృత్తిమార్గమందుండు వారు యోగాభ్యాసముగాని భగవచ్చింతనముగాని కావింపవలయును గాని నిద్రింపరాదు. బ్రాహ్మేముహూర్తే చోత్థాయ। చింతయే దాత్మనో హితమ్। ధర్మార్థకామాన్ వై కాలే। యథాశక్తి నహ్యాపయేత్, యాజ్ఞవల్క్యుఁడు.

షోఢా విభజ్యరజనీం, చరమాంశే ప్రబోధితాః
పత్న్యా సహహరిం, ధ్యాత్వా, ధర్మమర్థంచ చింతయేత్॥

కం॥ సూతజనవందిమాగధ, చేతోహరవాక్యములను•జెవిపండువుగా
సీతాపతి విని నిశ్చల,చేతంబున సంధ్య వార్చి•శ్రీమధువైరిన్. ౧౩౩

సూతజన=మహాత్ములయు, దేవతలయు మహాత్త్వము వర్ణించువారి యొక్క, వంది=స్తోత్రపాఠకులయు, మాగధ=మగధ దేశమందుఁ బుట్టి రాజ వంశములఁ జెప్పువారియొక్కయు, చేతోహర=మనస్సును హరించు నింపైన, వాక్యములను పలుకులను, నిశ్చల చేతంబునన్=చలింపని మనస్సుతో.

సంధ్య.

ఏతదక్షర మేతాంచ, జపన్ వ్యాహృతి పూర్వకామ్
మహతో ప్యేనసో మాసా, త్త్వచే వాహిర్విముచ్యతే.

ఏ ద్విజుఁడు గ్రామము వెలుపల ప్రణవ వ్యాహృతి గాయత్రులను నీమూఁటిని సంధ్యలయందును దక్కినకాలములందును వేయిమాఱులు జపించునో వాఁడు పాము కుబుసమును విడిచినట్లు నెలలోపల మహాపాపములనుండి విముక్తుఁ డగును.

యోధీతేఽహన్య హన్యే యం, త్రీణి వర్షాణ్య తంద్రితః
సబ్రహ్మ పదమభ్యేతి, వాయుభూతః ఖమూర్తిమాన్.

ఎవఁడు ౩ సంవత్సరములు ప్రతిదినము దీని జపించునో వాఁడు పర బ్రహ్మమున కెదురుగాఁ బోవును. అతఁడు వాయువువలెఁ గామచారియై పర బ్రహ్మస్వరూపుఁడగుచున్నాఁడు.

శ్లో॥ ఏకాక్షరంపరం బ్రహ్మ, ప్రాణాయామః పరంతపః
సావిత్ర్యాస్తు పరంనాస్తి, మౌనాత్సత్యం విశిష్యతే.

పరబ్రహ్మమును బొందించునది ప్రణవమే-గనుకఁ బ్రణవమే, పరబ్రహ్మము ప్రాణాయామముకంటె గొప్ప తపస్సు లేదు. సప్రణవ సవ్యాహృతి సశిరస్క గాయత్రి మూఁడు మార్లు చేయుట చాంద్రాయణాదుల కంటె గొప్ప తపస్సు- మౌనవ్రతముకంటె సత్య వ్రతము మేలు.

శ్లో॥ విధి యజ్ఞా జ్జపయజ్ఞో, విశిష్టో దశభిర్గుణైః
ఉపాంశు స్యాచ్ఛతగుణః, సాహస్రో మానస స్స్మృతః

జ్యోతిష్టోమాది యాగము లొనర్చుటకంటె ఓంకార వ్యాహృతులతోడ గాయత్రి జపించుట పదింతలు మేలు. ఆ జపమే పరులకు వినఁబడకుండఁ జేయుట నూఱంతలు శ్రేష్ఠము. నాలుక పెదవి కదలింపక మనస్సులోనే చేయు జపము వేయియంతలు శ్రేష్ఠము.

శ్లో॥ యేపాక యజ్ఞ శ్చత్వారో, విధి యజ్ఞ సమన్వితాః
సర్వేతే జపయజ్ఞస్య, కలాంనార్హంతి షోడశీమ్॥

పాక యజ్ఞములు నాలుగు విధి యజ్ఞములును చేయువారు వీరందఱు జపయజ్ఞము చేయువారిలోఁ బదునాఱవ భాగమునకు సరిగారు.

శ్లో॥ జప్యేనైవతు సంసిద్ధ్యే, ద్బ్రాహ్మణో నాత్రసంశయః
కుర్యాదన్యం నవాకుర్యా, న్మైత్రో బ్రాహ్మణ ఉచ్యతే॥

మంత్రజపముచేతనే బ్రాహ్మణుఁడు సిద్ధిపొందఁగలఁడు. వాఁడితరములగు వైదికకర్మములు యాగాదులు చేయనీ చేయకపోనీ గాయత్రీజపముఁచేసెనేని వాఁడు బ్రాహ్మణుఁడని చెప్పఁబడును.(అది విడిచి తక్కినవేవిచేసినను వ్యర్థమే)

శ్లో॥ సావిత్రీ మాత్రసారోపి, పరం విప్రస్సుయంత్రితః
నాయంత్రిత స్త్రివేదోపి, సర్వాశీ సర్వవిక్రయీ.

సదాచారముగల బ్రాహ్మణుఁడు గాయత్రిమాత్రము జపించువాఁడయినను వాఁడే శ్రేష్ఠుఁడు కాని మూఁడు వేదము లధ్యయనముచేసినను శాస్త్రనియమము నకులోబడక యేదైనఁ దినుచు నేదైననమ్ముచునుండు బ్రాహ్మణుఁడు శ్రేష్ఠుఁడు కాఁడు.

శ్లో॥ దశజప్తాతు సాదేవీ, దినపాపప్రణాశినీ
శతజప్తా తథాసాతు, అబ్దపాపప్రణాశినీ
సహస్ర జప్తాతుజనాన్, పాతకేభ్యస్సముద్ధరేత్
దశసాహస్ర జప్తాతు, సర్వకల్మషనాశినీ
స్వర్ణస్తేయీ కృతఘ్నశ్చ, బ్రహ్మహా గురుతల్పగః
సురాపశ్చ విశుధ్యేత, లక్షజాపాన్న సంశయః
హస్తత్రాణపరాదేవీ, పతితాం నరకార్ణవే
తస్మాత్తా మభ్యసే న్నిత్యం, బ్రాహ్మణో నియతశ్శుచిః

గాయత్రీ జప్య నిరతం, హవ్యకవ్యేషు భోజయేత్
తస్మిన్న శ్లిష్యతే పాప, మబ్బిందు రివపుష్క రే
సావిత్రీ జాప్యనిరతః స్వర్గమాప్నోతి మానవః
గాయత్రీ జపనిరతో, మోక్షోపాయంచ విందతి.

గాయత్రి పదిమార్లుజపించిన నాదినపాపము నశించును. నూఱుమార్లు జపించిన సంవత్సరపాపము పోవును. వేయిమార్లుజపించినఁ బాతకములనుండి యుద్ధరించును. పదివేలమార్లు జపించిన సర్వపాపములు నాశముచేయును. బంగారుదొంగిలించినవాఁడు కృతఘ్నుఁడు బ్రహ్మహత్యఁ జేసినవాఁడు గురుభార్యను బొందినవాఁడు, కల్లుసారాయము త్రాగువాఁడు లక్షజపముచేఁ బరిశుద్ధుఁడగును.

నరకమునఁ బడినవారిని గాయత్రి చేయూఁతయిచ్చి వెలుపలికి లాగును. కావున బ్రాహ్మణుఁడనుట యుపలక్షకము. బ్రహ్మ క్షత్రియ వైశ్యులని భావము. ప్రతిదినము గాయత్రి నభ్యసింపవలెను.

గాయత్రీజపమందుఁ బ్రీతిగలవాఁడు హవ్యకవ్యములందు భోజనము చేసినను తామరాకు నీళ్ళవలె వానికిఁబాపమంటదు. సావిత్రీజపము చేయువాఁడు స్వర్గగామి యగును. గాయత్రీజపముచేయువాఁడు ముక్తుఁడగును.'ధేయస్సదా సవితృమండల మధ్యవర్తీ నారాయణ' యనికదా ప్రమాణము.

'తమేవ భాంతమనుభాతి సర్వంతస్యభాసా సర్వమిదం విభాతి'యన్నట్టు లాయనతేజస్సేకదా సూర్యునితేజస్సు. గాయత్రీమంత్రమందు చెప్పఁబడినది యా తేజస్సేకదా.

తాత్పర్యము

సూతులు- వందులు - మాగధులు మనోహరవాక్యములు చెప్పుచున్నను శ్రీరాముఁడు వానిపై మనస్సుపోనీయక నియమించి ప్రాతస్సంధ్యవార్చి సూర్యమండల మధ్యవర్తియగు శ్రీమన్నారాయణుని

చం॥ శిరమును వ్రాల్చి మ్రొక్కి,సిత•చేలముఁ దాలిచి, స్వస్తివాచనా
చరణము దీర్పఁ బంప ద్విజ•సత్తమముఖ్యులఁ, దద్గభీరహృ
ద్యరవము నిండెఁ బట్టనము•నం దొగిఁ దూర్యరవానుసారియై;
వరనియతవ్రతంబు నుప•వాసముఁ దీర్చె సతీద్వితీయుఁడై. ౧౫౪

శిరమును వ్రాల్చి మ్రొక్కి = ఉపస్థానాంతమున సాష్టాంగముగ నమస్కరించి, సితచేలముదాలిచి=తెల్లని పట్టువస్త్రము ధరించి, (నూతనవస్త్రము ధరించి యనుటచే శ్రీరాముఁ డపుడుచేసినది గౌణస్నానమని యేర్పడుచున్నది.మధ్యాహ్నమున వారుణస్నానము నియతము) స్వస్తివాచనాచరణము=స్వస్తి వాచనము సలుపుట, తత్=ఆబ్రాహ్మణుల, గంభీర=గంభీరమై, హృద్య=హృదయమునకింపైన, రవము=ధ్వని, తూర్యరవానుసారియై=వాద్యధ్వనుల ననుసరించినదై.

ఆపోహిష్ఠాది భిర్మాంత్రం । మృదాలంభస్తుపార్థివమ్
అగ్నేయం భస్మనాస్నానం । వాయవ్యం గోరజస్స్మృతమ్
యత్తుసాతపవర్షేణ । దివ్యంతత్స్నాన ముచ్యతే
వారణం చావగాహస్తు – మానసం హరిచింతనమ్.

ఆపోహిష్ఠాది మంత్రములచేఁ బ్రోక్షించుకొనుట మంత్రస్నానమనఁబడును. కేశవాదినామముల మంత్రములు ధ్యానించుచు నూర్ధ్వపుండ్రములు ధరించుట పార్థివ స్నానమనఁబడును. సంస్కరింపఁబడిన విభూది దేహమునకంతయుఁ బూసికొనుట యాగ్నేయస్నానమగును. ఇది జడలుధరించిశిరస్స్నానముచేయ లేని కాపాలికాదులు చేయుదురు. సాయంకాలమున నుదయమున నావు లిండ్లకు వచ్చునపుడు పోవునపుడు వానిగిట్టలధూళి గాలికివచ్చి మీఁదఁబడిన వాయవ్య స్నాన మగును. ఎండకాయునపుడు కురియువర్షములోఁ దడిసిన నది దివ్య స్నానము. నీళ్ళలోమునుఁగుట వారుణ స్నానమనఁబడును. ఖస్థితం పుండరీకాక్ష మను మంత్రములతో శ్రీమన్నారాయణుని ధ్యానించుట మానసికస్నానము. పాదములు మొదలు బొడ్డువఱకు నీళ్ళతోఁగడిగి తడివస్త్రముతో దేహము తుడుచు కొనుట కాపిలస్నానము. శిరస్స్నానము చేయలేనివారు ఆకంఠస్నానము చేయ వచ్చును. దానికి శక్తిలేనివారు కాపిలస్నానము చేయవచ్చును తరువాత వారి శక్తికొలఁది యేదైనఁ జేయవచ్చును. ఏదిచేసినను జేయకున్నను వారుణ స్నానము చేసినను మానసస్నానము తప్పక చేయవలయును.

మీఁదఁజెప్పఁబడినవికాక పంచాంగస్నానము రెండుకాళ్ళు రెండుచేతులు ముఖము కడుగుకొనుట బ్రాహ్మస్నానము.

శ్రీమద్వైరిన్ శిరమును వ్రాల్చి మ్రొక్కియనుటచే విగ్రహ సన్నిధాన మందు నీకార్యము జరగెనని యేర్పడుచున్నది. దీనివలన శ్రీరామచంద్ర మూర్తి విగ్రహారాధనపరుఁడని యేర్పడుచున్నది. ఈవిగ్రహము వంశపరం పరగా ఇక్ష్వాకు మొదలుగ వచ్చిన శ్రీరంగనాయకమూర్తియని పురాణాంతర ములు చెప్పుచున్నవి.

గృహంస్మశానం తవబింబవర్జితమ్ । కథావిహీనాశ్చ గిరశ్శ్వవారుతమ్। శ్వపుచ్ఛవద్దాస్య వినాకృతంవపు, ర్వదంతి హిత్వయ్యనివేదితం విషమ్ ॥ శ్రీభాగవతము.

భగవంతుఁడా నీబింబములేనియిల్లు స్మశానము. నీకథలుగాక యుబుసు పోకకై మాటలాడుమాటలు నక్కయీలలు నీదాస్యములేని దేహము కుక్కతోఁక (కుక్కకు తోఁకయుండియు వ్యర్థము. గుదమును మూయుటకుఁగాని యీఁగలు వ్రాలినఁ దోలుటకుఁగాని దేనికిఁ బనికిరాదు) నీకు నివేదింపనియన్నము విషము అని పెద్దలు చెప్పుదురు. అని శ్రీభాగవతమునఁ గలదు.

శ్లో॥ యోమోహా దథ వాలస్యా, ద కృత్వా విష్ణుపూజనమ్
భుంక్తే సయాతి నరకాన్, సూక రేష్వభిజాయతే.

వ్యాసులు : అజ్ఞానముచేఁ గాని సోమరితనముచేఁ గాని విష్ణుపూజ చేయక యెవఁడు భుజించునో వాఁడు నరకములపాలయి పందిగాఁ బుట్టును.

తాత్పర్యము

ధ్యేయస్సదాస వితృమండల మధ్యవర్తీనారాయణ-యన్నట్లు సూర్య మండల మధ్యవర్తియగు నారాయణుఁగూర్చి యుపస్థానానంతరము సాష్టాంగ ముగ నమస్కరించి క్రొత్త తెల్లని పట్టువస్త్రము ధరించి బ్రాహ్మణ ముఖ్యులఁ బిలిపించి స్వస్తివాచనము గావింప నియమించెను. వారల యాగభీరమై యిం పైన ధ్వనియు, పురజనుల తూర్యరవము నొకటై కలిసిపోయెను. ఇట్లుపవాస మును వ్రతమును శ్రీరామచంద్రమూర్తి భార్యతోడఁ దీర్చిన వాఁడని,

కం॥ కౌసల్యతనయుఁ డని సం,తోసంబున నాలకించి ♦ తూర్ణ మయోధ్యా
వాసులు దొరఁకొనిరి పురిం, గై సేయఁగ వేగుఁబోకఁ♦గమనీయముగన్.

తూర్ణము=శీఘ్రముగ, దొరఁకొనిరి=ప్రారంభించిరి.

తాత్పర్యము

అయోధ్యాజనులు విని సంతోషించి శీఘ్రముగ నుదయమందే నగర మలంకరింపఁ బ్రారంభించిరి.

—♦ శ్రీరామపట్టాభిషేకమునకై యయోధ్య యలంకరింపఁబడుట. ♦—

సీ॥ వెలిమబ్బులను బోలి♦వెలయు దేవళములఁ గలితచైత్యముల శృం♦గాటకముల
నట్టాలకంబుల ♦ నఖిలపణ్యసమృద్ధ మైనబేహారుల ♦ యంగడులను
రమణఁ గుటుంబిపూ♦ర్ణంబు లౌసంపత్స, మృద్ధమందిరముల ♦ నెల్లసభల
నాలక్షితోర్వీరు ♦ హంబుల నన్నిట, ధ్వజములఁ జిత్రప ♦ తాకములను
తే॥ నెత్తిరప్పుడు; నటనర్త♦కోత్తములయు,గాయకులయును గానంబు♦కర్ణపర్వ
ముగను వ్యాపించెఁ జిత్తంబు♦సొగయు చుండ,
నీడ నాడన కాపురి♦నెల్లయెడల. ౧౫౬

వెలిమబ్బులను=తెల్లని మేఘములను, చైత్యములన్=విష్ణుగుడులందు, చైత్యద్రుః కేశవాలయ, యని త్రికాండ శేషము- చైత్య మాయతనే బుద్ధ బింబోద్దేశక వృక్షయో, యనియున్నను బుద్ధ ప్రచారమప్పటికిలేదు.బౌద్ధమునకు గౌరవములేదు. కావున నాయర్థము పొసఁగదు. శృంగాటకములన్ = నాలుగు వీధులు కలియు చోటులను, అట్టాలకంబులన్=యుద్ధార్థమై కోటలపైఁగట్టఁబడిన మంటపములందును. దీనినే అట్టళ్ళందురు. అఖిల పణ్యసమృద్ధము=సకలము లైన యమ్ముడు వస్తువులచేత నిండినది,బేహారుల=వర్తకుల.బేహారి శబ్దభవము బేరి- (బేహారము=బేరము) అదిగలవారలు బేహారులు.

కుటుంబి=భార్యలు బిడ్డలుగలవారు, సంపత్=ఐశ్వర్యముచే, సమృద్ధ= వృద్ధిహొందిన, మందిరములన్=ఇండ్లను,సభలన్=జనులు చేరెడుకూటములను.

అలక్షితోర్వీరుహంబులన్ = అన్ని ప్రక్కల నందఱకుఁగానవచ్చు వృక్షములను, కర్ణపర్వము=చెవులపండువు, ఈడన్=ఈయెడన్, ఆయెడన్=ఆడన్.

తా త్ప ర్య ము

తెల్లనిమబ్బులవలెనుండు దేవాలయములందును, చైత్యములందును, నాలుగు వీథులు కలియుచోటులను అట్టళ్ళయందును, వర్తకుల యంగళ్ళయందును, జనులు చేరుకూటములందును అన్నిప్రక్కల నందఱకుఁ గానవచ్చు చెట్లయందును భార్యలు బిడ్డలు గల కుటుంబుల యిండ్లయందును, పెద్దధ్వజములను పతాకములను నెత్తిరి. నటులు నర్తకులు గాయకులు వీరిపాటలు చెవులపండువై వ్యాపించెను. ఇది రాజవీథులందేకాదు. అన్నిచోటుల సందులందును గొందులను నిట్టియలంకారములే చేయఁబడెను.

ఉ॥ శ్రీరఘురామచంద్రునభి ♦ షేకముఁ జూడఁగఁ జత్వరంబులం
భూరిగృహాంగణంబులను ♦ మూఁగిననారులుఁ బూరుషావళు
ల్దోరపువేడ్క మీఱఁ దమ ♦ లోనఁ బరస్పరముం గుతూహల
శ్రీరతి రామచంద్రునభి♦షేకముఁ గూరిచి పెక్కు రీతులన్. ౧౩౪

చత్వరములు = శృంగాటకములు = నాలుగు వీథులు కలియు చోటులు, భూరి=గొప్పవగు, గృహాంగణములను = ఇండ్లముంగిళ్ళయందు, మూఁగిన = గుంపుగూడిన, తోరపువేడ్క=అతిశయించిన సంతోషము.

తా త్ప ర్య ము

శ్రీరామచంద్రు నభిషేకము చూచుటకై నాలుగు వీథులు కలియుచోటులందును పెద్దయిండ్లముంగిళ్ళయందును గుంపులు గూడిన స్త్రీలు పురుషులు నెప్పుడెప్పుడు నభిషిక్తుఁడైన శ్రీరామచంద్రమూర్తినిఁ జూతుమాయని కోరికతో వారిలో వా రనేకవిధములఁ బట్టాభిషేకముగుఱించి ముచ్చటలాడుచుండిరి.

కం॥ ముచ్చటలాడఁగ; బాలురు, ముచ్చట నాడుచును వారి♦ముంగిళ్ళ ముదం
బెచ్చఁగ జిలిబిలిపలుకుల, నచ్చరితమె చెప్పుకొందు♦రనయముఁ దమలోన్,

శ్రీరాముని గుణవిశేషము లెఱింగిన పెద్దవా రాయనను మెచ్చుకొనుట యాయనయందు భక్తిగలవారై యుండుట వింతగాదు. ఆడుకొనుబాలురును వారివారి ముంగిళ్ళయందు నిలిచిసంతోషముతో ముద్దు ముద్దు పలుకులతో వారిలోవారు ఓరి యీప్రొద్దు మన రామునకుఁ బట్టాభిషేకమఁటరా- ముసలిరాజు రాముని యువరాజు చేయునంటరా- ఆయన యూరు మెఱవడి వచ్చునఁట- రామునిఁకై యందఱన్ని పనులు చేయుచున్నారే- మన మేమి చేయుదుమురా- రాముఁడు మంచిరాజురా- మంచిరాజయిన మనకు పప్పులు పెట్టునా అని యిట్లు శ్రీరాముని చరితము పట్టాభిషేకవిషయమే యెప్పుడు చెప్పుకొనుచుండి

సీ॥ పుష్పోపహారముల్ • పుష్కలంబుగ నిచ్చి, ధూపంబు లిడి • గంధధూళి చల్లి
ఘంటాపథంబులు • కడురమ్యములఁ జేసి, యేగుపెండ్లిని రేయి • యేగుదెంచు
నో యనుశంకచే • నున్నతదీపవృక్షంబుల నిరువంక • సర్వమార్గ
ముల నిల్పి కలయంగ • ముదితచేతస్కులై, గుమిగూడి చత్వర • కూటములను
తే॥ రాముపట్టాభిషేకంబు • రమణఁ గనుదు- మెప్పు డెప్పుడటంచును • నెదురుచూడ
రాముగుణములుగొండాడి • రాజవర్య,
మెచ్చుకొనుచును జనులెల్ల • నిచ్చమెఱియ. ౧౨౯

ఇఁకఁ బెద్దవారి కృత్యములు చెప్పఁబడుచున్నవి. పుష్పోపహారములు= పూలకానుకలు, పుష్కలంబుగన్=దండిగ, గంధధూళి=గంధపుఁ బొడి, ఘంటాపథంబులు = రాజమార్గములు, ఏగుపెండ్లని=ఊరేగింపు సమయమందు, దీపవృక్షంబులు=దీపములుంచుటకై చెట్లవలె నేర్పఱుపఁబడినది, ఇరువంక=రెండు పార్శ్వముల, ముదితచేతస్కులై=సంతోషించిన మనస్సుగలవారై, కొండాడి= పొగడి.

తాత్పర్యము.

గృహములందలి దేవాలయము లందలి దేవతలను బూజలచేఁ బూజించి ధూపములిచ్చి (ఆలయములందేకాక యిండ్లయందటను) అగరుచందనము మొదలైన చెక్కల పొగలు గలుగఁజేసి గంధపుఁ జెక్కలపొడి చల్లి (గందవొడి) పెద్ద రాచ బాటల మిక్కలి మనోహరముగఁజేసి పట్టాభిషేకము ముగిసి శ్రీరాముఁడు నగరమున నూరేగింపు వచ్చుసమయమున జీఁకటి పడునోయని వెలుతురు నిమిత్తమై యలంకారార్థమై దీపములుంచుటకుగాను వెదుళ్ళతో వృక్షములవలెనన్నిబాటల రెండుప్రక్కలఁగట్టి నిలిపి యాపనులన్నియు ముగియఁగానే యందఱు నాలుగు వీథులు కలియుచోట్లను ఇండ్లయందును గుంపులై రామపట్టాభిషేక మెప్పుడు జరుగునా యెపుడు కనులారఁ జూతుమా మనసార నానందింతుమా యని యెదురుచూచుచు రాముని గుణములు పొగడుచు మన దశరథుఁడెంత యుచితజ్ఞుఁడు, కైక తనప్రియురాలైనను ఆమెకొడుకునకు రాజ్యమీయక పెద్దభార్యపట్టపురాణియగు కౌసల్యకొడుకునకే పెద్దకొడుకను ధర్మ మనుసరించి యౌవరాజ్యమిచ్చుచున్నాఁడుగదాయని శ్లాఘించుచు సంతోషముతో నుప్పొంగుచుండిరి. దశరథుఁడు తన ప్రియురాలికొడుకునకే రాజ్యమిచ్చునేమో శ్రీరామచంద్రునకు కీయఁడేమోయను సందేహము ప్రజలను గూడ బాధించుచునే యుండినది. అటుగాక తమకిష్టుఁడైన శ్రీరామునకే దశరథుఁడు రాజ్యమిచ్చెదనన్న వార్త వారి సందేహములనుమాపి సంతోషవంతులఁ జేసెను.

— • పట్టాభిషేకవిషయ జనసంభాషణము • —

సీ॥ అహహ యెంతమహాత్ముఁఁడౌర రాజన్యుండు,
తనకేండ్లుచెల్లుట • తలఁచి తనయు
రామచంద్రుని యువరాజు సేయఁగ నెంచి, పట్టాభిషేకంబు • పరఁగఁ జేయు;

రామచంద్రుఁడు మన•రాజు గావుటఁ జేసి, ధన్యులమైతి మం•దఱము మనము;
దృష్టలోకపరావ•రేశుఁ డనుద్ధత, చిత్తుండు ధర్మాత్మ•శేఖరుండు
ఆ॥ భ్రాతృవత్సలుండు•భ్రాతలఁ దా సెట్టి, కరుణఁజూచు నట్టి•కరుణ మనలఁ
గాచు నాతఁ డింత•కాలంబునకు జన,రక్షకత్వ మూనె•రాజు కరుణ. ౧౬౦

ప్రజలమాట లిఁకఁ జెప్పఁబడుచున్నవి.

మహాత్ముఁడు=గొప్పమనస్సుగలవాఁడు, రాజన్యుఁడు=దశరథుఁడు మహారాజు, ఏండ్లు చెల్లుట=వృద్ధుడౌట, దృష్టలోక పరావరేశుఁడు = చూడఁబడిన లోకులందు గొప్పకొలఁదుల నెఱుఁగువాఁడు, అనుద్ధతచిత్తుండు=గర్వములేని మనస్సుగలవాఁడు, ధర్మాత్మశేఖరుండు=ధర్మాత్ములలో శ్రేష్ఠుఁడు, భ్రాతృవత్సలుండు=తమ్ములను బిడ్డలవలెఁ జూచువాఁడు.

తాత్పర్యము

ఆహా దశరథమహారాజెంత గొప్పమనస్సుగలవాఁడు. తాను ముసలివాఁడగుట తానెవరికిఁ బట్టాభిషేకము చేయక మరణించినచోఁ గొడుకులు వారిలో వారు కలహింతురోయని యాలోచించి పెద్దభార్యకొడుకు పెద్దకొడుకునగు శ్రీరామచంద్రుని యువరాజుచేయ నాలోచించి యాయనకే పట్టాభిషేకము చేయుచున్నాఁడు. ఎవఁడు రాజైన మనకేమి యందమా అట్లుగాదు. శ్రీరాముఁడు మనరాజగుటచే మనమందఱము ధన్యులమే. ఎవఁడోరాజైనయెడ వానివారు మాత్రమే బాగుపడుదురు. రాముఁడు రాజైనచో వీరువారనక గొప్పవారు కొలఁదివారనక యందఱు బాగుపడుదురు. అంతఃపురములోనుండు రాజునకు నెవరు గొప్పవారో యెవరల్పులో యెవరు గుణవంతులో యెవరు దుష్టులో యెట్లు తెలియును. దగ్గఱనున్న వాఁరెట్లుచెప్పిన నట్లేకదా. ఆమాత్రమునకు నెవఁడు రాజైననేమి యనరాదు. ఏలన శ్రీరాముఁడు మనుష్యులముఖము చూడఁగానే వీఁడు గుణవంతుఁడు వీడు గుణహీనుఁడని తెలిసికొనఁగలవాఁడు. కావున నాయన కొకరుచెప్పవలసిన పనిలేదు. శ్రీరాముఁడు వీరు కొలఁదివారని గొప్పవారని తెలిసికొనఁగలఁడని యనుకో. దానివలన నేమిలాభము రాజులందు రాజసము పరిపూర్ణము. అట్టివారు మన సుఖదుఃఖములు విందురా యందువేమో. అట్లుగాదు. ఆయన నిగర్వశిరోమణి– గర్వమెట్టిదో యెఱుఁగఁడు. కావున నందఱితోను మాటలాడును. అందఱి సుఖదుఃఖములు విచారించును. ధర్మాత్ములలో శ్రేష్ఠుఁడు కావున ధర్మమును బరిపాలించును. శ్రీరాముఁడు నిర్ధనులైనను ధర్మాత్ములను బరిపాలించును గాని ధనవంతులగు నధర్మాత్ములఁ బాలించువాఁడుగాఁడు. అది నిజమేకాని దాయాదులగు తమ్ములు ముగ్గురున్నారు. వారు తనరాజ్యమాశింతురో యని నేమిబాధించునో, దానివలన వారిలో వారికిఁ గలహములు పుట్టునేమో– అట్లైనచో మాప్రక్కవారమ్మని యొకరు మాప్రక్కవారమ్మని యొకరు మనలనేకదా బాధింతురు. ఏ యొకరిప్రక్కఁబోయినను తక్కిన యందఱకుఁ గోపమే. ఎవరి

ప్రక్కఁ బోకుండుటెట్లు ? కావున మనకష్టము మనకుఁ దప్పినదికాదందువేమో. అట్లు సందేహింపఁ గారణములేదు. ఏలన శ్రీరాముఁడు భ్రాతృవత్సలుఁడు. తమ్ములను బిడ్డలవలె నాదరించువాఁడు. అంతేకాదు తనసొంత తమ్ముల నెట్టు లాదరించునో యట్టి కరుణచే మనలను నాదరించును. ఇట్టివాఁ డింతకాలమునకు రాజుదయచేత మనకు రాజగుచున్నాఁడు.

కం॥ ఎవనిప్రసాదంబున మన, యవనికి శ్రీరామచంద్రుఁ • డగు రాజుగ నా
యవనిపాలుఁడు దశరథుఁ, డవనిన్ సుఖియించుఁగాత • మాయుర్వృద్ధిన్.

ప్రసాదంబునన్=అనుగ్రహముచే, అవనికి=భూమికి, ఆయుర్వృద్ధిన్ = ఆయుస్సు వృద్ధియగుటచే, గాత+ఆయుర్వృద్ధిన్=ఆశీరర్థకంబులైన ఎడు-త-వర్ణంబులకు నచ్చుపరంబగునపుడు ముగాగమంబగు సు.వ్యా.సం.సూ.క్రియ.

తాత్పర్యము   33.

ఇట్టి శ్రీరాముఁ డెవనిదయచే భూమికి రాజు గానున్నాఁడో యట్టి దశరథుఁడు దీర్ఘాయుష్మంతుఁడై జీవించి సుఖించునుగాక.

మ॥ అని పౌరుల్ దమలోన నాడుకొన న•త్యంతప్రమోదంబునన్
వినుటన్ జానపదాళి మున్దినము త•ద్వృత్తాంతము, న్గుంపులై
చనుదేర న్నలుప్రక్క నుండి జనిత • స్వానంబు రోదోంతరం
బున నిండం బురి పర్వకాలజలధిం • బోలెన్ రవోదీర్ణమై.   ౧౬౨

పౌరుల్=పురజనులు, అడుకొనన్=మాటలాడుకొనఁగా, అత్యంత ప్రమోదంబునన్=మిక్కిలి సంతోషముతో, జానపదాళి=జనపదములయందుఁగల జనసమూహము, జనితస్వానంబు = పుట్టినధ్వని, రోదోంతరంబు = ఆకాశమునకు భూమికి నడుమఁగల భాగము, పర్వకాల జలధిన్ = పున్నమనాఁటి సముద్రమును, రవోదీర్ణమై=ధ్వనిచేత నతిశయించినదై, నలుప్రక్క = అచ్ఛద్విగు సమాసము గావున నేకవచనము.

తాత్పర్యము

అని మీఁదఁ జెప్పినప్రకారము పురజనులు సంతోషముతో మాటలాడుకొనుచుండఁగా ముందుదినమందే పల్లెలవారు మిక్కిలి సంతోషముతో నీవార్త విన్నవారై గుంపులు గుంపులుగా నాలుగుప్రక్కలనుండి వచ్చుచుండ నాధ్వని భూమికి నాకాశమునకు నడిమి యంతరాళము నిండెను. ఆజనుల ధ్వని పున్నమనాఁడు సముద్రము ఘోషించునట్లుండెను.

చంద్రుఁడు సముద్రుని కొడుకగుటచే పున్నమనాఁడతని యభ్యుదయము చూచి సంతోషముచే సముద్రము పొంగునని కవి సమయము.

చం॥ అమరపురీనిభం బయిన • యప్పుర మప్పుడు వేడ్కఁ జూను పెం
దమకము మీఱ మూఁక లయి • తద్దయుఁ జేరుమనుష్యకోటిచా

వము గలయంగఁ బర్వుడు న•వారణవారిచరావళీపరి
భ్రమణమహార్భటీరటద•పాంపతిచందముగాఁగ భాసిలెన్. ౧౬౩

అపురపురీనిభంబు = దేవతానగరమగు నమరావతితో సమానము. పెంద మకము=పెనుతమకము = అతిశయించుకోరిక, రావము = ధ్వని, అవారణ = అడ్డములేని,వారి చరావళీ=జలమునందు సంచరించు జంతువుల సమూహముల యొక్క, పరిభ్రమణ=విస్తారమగు సంచారముచేఁ గలిగిన, మహార్భటీ=గొప్ప ధ్వనిచేత, రటత్ = ధ్వనించు, అపాంపతి = సముద్రము.

అపాంపతి - షష్ఠి అలుక్సమాసము; అలుక్సమాస విధాయక సూత్రమున బహుళగ్రహణముచే నీరూప మేర్పడిన దని యసురసుధాకారుఁడు వ్రాసి యున్నాఁడు శ్రియఃపతి శబ్దము నిట్టిదే.

తా త్ప ర్య ము

దేవనగరముతో సమానమైన యానగరమప్పుడు వేడుకఁ జూచుటకై మిక్కిలి కోరికతోఁ గుమిగూడిన మనుష్యుల గుంపులధ్వని నాలుగు ప్రక్కల వ్యాపింపఁగా విచ్చలవిడిగా జలచరములు సంచరించుటచే నతిశయించిన ధ్వని గల సముద్రమును బోలియుండెను.

—• ౭-వ సర్గము. మంథర యయోధ్యాలంకారముఁ జూచుట. •—

ఉ॥ ఏకడఁ బుట్టెనో, పితరు•లెవ్వరో, యేరు నెఱుంగనట్టిదై
కైకకు బంధుదాసి యయి•కర్జము దీర్చుచుఁ బొట్టకూటికై
కైకను బాయ కుండెడు నొ•కానొక మంథర దాఁ దటాలునన్
ప్రాకటశీతదీధితిని•భం బగుహర్మ్యము నెక్కి వేడుకన్. ౧౬౪

శీతదీధితినిభంబు=చంద్రునితో సమానము. అనఁగాఁ దెల్లని, హర్మ్యంబు = మేడ.

ఏప్రయోజనముగోరి లక్ష్మీనారాయణులు సీతారాములుగ భూమిపై నవత రించిరో యాప్రయోజనము దీర్చుటకు సదుపాయ కల్పనము పూర్వాంగ మీ పద్యముతోఁ బ్రారంభమగుచున్నది. అవతార ప్రయోజనములు సాధారణముగ మూఁడు. శిష్టరక్షణము, దుష్టశిక్షణము, ధర్మసంస్థాపనము. శ్రీరాముఁడు రాజై పట్టాభిషేకము చేసికొని యయోధ్యయందుఁ గూర్చుండిన నీప్రయోజనములు పూర్ణముగఁ గొనసాగనేరవు.

రావణవధ మాలోచింతము. పతివ్రతలఁ జెనకిన దోషమునకు ఫలము వంశనాశమను నీతిబోధింప రావణు సర్వసహాయులతో నాశము చేయవలసి యున్నది. ఏమి నెపముపెట్టి యట్లుచేయును? ఋషులప్రార్థనపై లవణాసురుఁ జంపినట్లు చంపియుండవచ్చునుగదా యనిన లవణాసురుఁ డొంటరిగాఁ డగుటచే వాని నొక్కఁడే చంప సాధ్యపడెను.రావణవధ మట్టిదిగాదు.సర్వరాక్షస నాశము తోడ రావణవధ కావలసియున్నది. అది మనుష్య సేనలచే నగునదికాదు.దానికి

సుగ్రీవ సాహాయ్య మావశ్యకము. సమానదశయం దుండువారికి సఖ్యము కుదురును గాని ప్రభువునకు భ్రష్టునకు సఖ్యము కుదురదు. విరాధకబంధ- ఖర వాలీత్యాదుల నేదో నెపమునఁ జంపఁ గలిగినను, తన దర్శనమునఁ గృతార్థులు కాఁగోరిన శరభంగ సుతీక్ష్ణాది ఋషీశ్వరుల కేదో నెపమున దర్శనమిచ్చినను, జటాయు శబరుల ముక్తులఁ జేయుటకుఁగాని హనుమద్విభీషణాదుల నేలుటకుఁ గాని శరణాగతి ధర్మస్థాపనమునకుఁగాని భృగు శాపానుభవమునకుఁగాని కారణము పొసఁగియుండదు. బుద్ధుఁడు సన్న్యాసియై యతఁడు చేయఁగలిగిన కార్యముచేయ సమర్థుడయ్యెనుగాని రాజైయుండిన నాకార్యము చేసియుండఁ జాలఁడు. అట్టులే శ్రీరాముఁడును రాజై యుండినయెడల వనముల నాయన చేసిన కార్యములను సకారణముగఁ జేసియుండఁజాలఁడు. ఆయనయు సీతా లక్ష్మణ భరతులయు మహత్త్వ మాహాత్మ్యములు లోకమెఱింగియుండదు. వారి చర్యలవలన లోకము నేర్చుకొనవలసినదియు నేదియుండదు. ధర్మములు నాచరణముచేఁ జూపఁదలఁచిన యాయనయుద్దేశము నెఱవేఱియుండదు. కావునఁ బట్టాభిషేక విఘ్నము లోక హితార్థ మవశ్యము జరుగవలసినకార్యమే. మహాత్ములు స్వసుఖానుభవమునకై జనించెడి వారుగారు. వారు శ్రమించి లోకులకు మార్గదర్శకులై హితరీతి వర్తించి జగము నుద్ధరింపఁ దలంపుగలవారు.

తా త్ప ర్య ము

ఏదేశమందుఁబుట్టెనో తల్లిదండ్రులెవ్వరో యెవ్వరు నెఱుంగక కైకకుఁ బుట్టినింట బంధువులయొద్ద దాసిగా నుండి కడుపుకూటి నిమిత్తమై కైక సేవ చేయు మంథరయను యొకానొకదాసి యదాటునఁ జంద్రమండలముతో సమానమైన మేడయెక్కెను.

మంథరయను కుబ్జ=ఇది కైకేయి పుట్టినింట నామె బంధువులయొద్ద నుండి కైకేయి యయోధ్యకు వచ్చినపు డామెతోడవచ్చెను.దీని పూర్వవృత్తాంత మెవ్వరెఱుంగరు. రావణవధము కోరినదేవతలు శ్రీరాముని పట్టాభిషేకము విఘ్నపఱుచుటకై దీనియందావేశించిరని కొందఱందురు. కొందఱు దేవతలొక దేవతా స్త్రీనే యీకార్యమునకై పుట్టించి యీవిధముగఁ గైకయొద్దఁ జేర్చిరనియు నా రహస్యము బయలుపెట్టరాకుండుటచే కవి ఏకడఁ బుట్టెనో తల్లిదండ్రు లెవ్వరో యెఱుఁగరానిదని రహస్యవాక్కులఁ జెప్పెననియు సందురు. ఏకడఁ బుట్టెనో యనుటచే నిది యయోధ్యయందుఁ బుట్టినది కాదనియు నయోధ్యయం దిట్టి దుష్టస్త్రీలు పుట్టరనియుఁ గవి హృదయము. యుద్ధకాండము ౧౨౩-వ పద్యము చూడుఁడు. దానివలన నిది దేవతలు పన్నిన పన్నాగమని తెలియుచున్నది.

భార. అర. పర్వమున "బ్రహ్మదుందుభియను గంధర్విని బిలిచి నీవు కుబ్జవై పుట్టి దేవకార్యము నిర్వహింపుమని చెప్పినట్లున్నది.అధ్యాత్మరామాయణమందు దేవతల ప్రార్థనచే సరస్వతి మంథరాకైకల నోరనుండి పలికెనని యున్నది.

ఒక+ఒక = ఒకానొక, దీనికి వ్యాకరణమునఁ బ్రత్యేక సూత్రములేదు. సిద్ధము గ్రాహ్యము. ఒకానొక శబ్దమునకు నొకానొక శబ్దము పరంబగునపుడొకా నొక రూపంబగు ననుటయే సూత్రము.

చం॥ జిమజిమ లాడువీథులును,♦జిత్రముగా వెదచల్లఁబడ్డపు
ష్పములు, దలంటుకొన్న జన♦సంఘముఁ, గల్వడముల్, ధ్వజాళి, హ
స్తములను మాల్యమోదవిక♦తానముఁదాల్చి చరించులోకపూ
గములును, శుభ్రదేవగృహ♦కాండములున్, హితవాద్య ఘోషముల్. ౧౬౫

జిమ జిమ లాడు=నీటితోఁ దడుపుటచే బురదగానుండు, కల్వడములు= దండలు, మాల్యమోదకవితానము=పూలసరములయు లడ్డువములు మొదలగు పిండివంటలయు సమూహము, లోకపూగము=జనసమూహము, శుభ్ర = తెల్ల నైన, దేవగృహకాండములు = దేవాలయ సమూహములు, హితవాద్య ఘోష ముల్ = మంగళవాద్య ధ్వనులు.

తా త్ప ర్య ము

మంథర కైకమేడ యెక్కిచూచునపుడు అయోధ్యయున్నస్థితి కవి వర్ణించుచున్నాఁడు.

దుమ్మొగురకుండ నీళ్లుదండిగఁ జల్లఁబడుటచే వీథులు జిమజిమ లాడు చుండెను. వినోదముగ నానావర్ణముల పూవులు, వెదచల్లఁబడియుండెను. అందఱు నభ్యంగన స్నానము చేసియుండిరి. తోరణములకుఁ బూలదండలు వ్రేలాడ వేయఁబడియుండెను. ఇంటింటిమీఁద ధ్వజపటము లెగురుచుండెను. శ్రీరామచంద్రునకుఁ గానుకలిచ్చుటకై జనులు పూలసరములు లడ్డువాలు మొదలగు పిండివంటలు చేతులందు ధరించి తీసికొనిపోవుచుండిరి. దేవా లయములన్నియు సున్నపుఁ బూఁతలచేఁ దెల్లనై ప్రకాశించుచుండెను. ఎందుఁ జూచినను మంగళవాద్యములు ఘోషించుచుండెను.

ఱేపు పట్టాభిషేకమనఁగా నీదినము సాయంకాలమున మంథర యిది యంతయుఁ జూచెను. శ్రీరామపట్టాభిషేకవార్త నగరమంతయుఁ దెలిసినను దశరథుఁడు కైకకు దానుస్వయముగఁ జెప్పఁదలఁచినవాఁడై యామెకు నెవరు చెప్పకుండఁ జేసెను. పరులెవ్వరైనఁ జెప్పిన నామెమనస్సున నేమి వికారము చెంది యేవిఘ్నము కల్పించునో యని సందేహము.

చం॥ కెరలఁ బ్రహృష్టసర్వజన♦కీర్ణము, బ్రహ్మరవాభినాదితం,
బురుతరహృష్టహస్తితుర ♦ గోత్కర, ముక్షనినాదపూర్ణమై,
కరము పరిష్కృతం బగుచుఁ ♦ గాలునయోధ్యను గాంచి లోస న
బ్బురపడి క్షౌమవాసినిఁ బ్ర♦ఫుల్లవిలోచన దాది నొక్కతన్. ౧౬౬

అయోధ్యానగరమున విశేషము లింకను చెప్పఁబడుచున్నవి.

ప్రహృష్టజనకీర్ణము=సంతోషముతోఁగూడిన సమస్త జనులచే వ్యాపించినది, బ్రహ్మరవాభినాదితంబు=బ్రాహ్మణుల యాశీర్వాదధ్వనులు గలది, ఉరుతరహృష్టహస్తి తురగోత్కరము=మిక్కిలి గొప్పగాసంతోషించిన యేనుఁగులు గుఱ్ఱములు వీని సమూహము గలది, ఉక్షనినాదపూర్ణము=ఎద్దుల అంకెలచే నిండినది- దీనిచే శ్రీరామ పట్టాభిషేకమునకుఁ దిర్యగ్జంతువులుగూడ సంతోషించె నని భావము, పరము=మిక్కిలి, పరిష్కృతము=అలంకరింపఁబడినది, క్షౌమవాసినిన్ = తెల్లనిపట్టువస్త్రము ధరించినదానిని, ప్రఫుల్లవిలోచన=వికాసము నొందిన కన్నులుగలది.

మిక్కిలి సంతోషముతోఁగూడిన సమస్తజనులచే వ్యాపించినదియు బ్రాహ్మణాశీర్వాదములతో నిండినదియు సంతోషముచేధ్వనించు నేనుఁగులు గుఱ్ఱములు అంకెలువేయు నెద్దులుగలదియు మిక్కిలి యలంకరింపఁబడినదియునైన యయోధ్యా నగరముఁజూచి యాశ్చర్యపడి శ్రీరాముని పట్టాభిషేకము తన కొడుకుపెండ్లివలె భావించి తెల్లని పట్టువస్త్రముచే నలంకరించుకొని సంతోషముచే వికాసమునొందిన కన్నులుగల యొకదానిని.

ఉ॥ చేరువఁ గాంచి యి ట్లనియెఁ ♦ జెప్పుమ యర్థపరాత్మ యయ్యుఁ బెం
పారుముదంబునన్ జనుల ♦ కర్థము లిచ్చెడు రాముమాత, యే
లా? రమణీ! పురంబు బహు♦శ్ప్రమదాకులలోక మయ్యె! భూ
మీరమణుం డొనర్చెడినొ♦ మేలిశుభం బెదియేని ధాత్రికా! ౧౬౭

చేరువన్=సమీపమందు, అర్థపరాత్మ=ధనమునం దాసక్తిగల మనస్సు గలది- అనఁగాఁ జాలినంతధనము లేనిది-కైకకుభయపడి దశరథుఁడు కౌసల్యకు ధనమేమియు నిచ్చుటలేదు.ఆమె పుట్టినింటి వారిచ్చిన గ్రామములమీఁద నాధారపడియున్నది. 2) లోభి- ఇది ద్వేషబాహుళ్యముచేఁ జెప్పుమాట, ప్రమదాకులలోకము=అతిశయించిన సంతోషముచే నుప్పొంగు జనులకోలాహలముగలది, రామమాత=కౌసల్య యనుటకుఁగూడ దాని మనస్సొప్పినది కాదు,ధాత్రిక=దాది

తాత్పర్యము

సమీపమందుఁజూచి యోసిదాదీ నిజము చెప్పుము రామునితల్లి తనకే చాలినంత ధనములేనిస్థితిలో నుండియు ఆకారణముచే పిసినియయ్యు సంతోషముతో లోకులకు ధనమిచ్చుచున్నది. ఏమికారణము? నగరమంతయు మిక్కిలి సంతోషముచే నుప్పొంగుజనులచే నల్లకల్లోలముగ నున్నది. రాజేమైన గొప్ప శుభకార్యము చేయుచున్నాఁడా ?

తే॥ పొంగిపొరలుముదాన ను♦ప్పొంగుమేన,
ధాత్రి యి ట్లనెఁ గుబ్జకు♦ధరణినాథుఁ
డెల్లి పుష్యమునందు జి♦తేంద్రియాఢ్యుఁ,
డైనరాముని యువరాజుఁగా నొనర్చు. ౧౬౮

జితేంద్రియాఢ్యుఁడు = ఇంద్రియ జయముగలవారిలో శ్రేష్ఠుఁడు, ఇంద్రియజయమను సంపదగలవాఁడు. ఇట్లనుటచే యౌవరాజ్యమును శ్రీరాముఁడు తానై కోరినదికాదనియు దశరథుఁడే బలవంతముగా నియ్యఁబూనె ననియు భావము. జితేంద్రియుఁడని చెప్పుటచే శ్రీరామునకు రాజ్యభరణయోగ్యత కలదని భావము.

తాత్పర్యము

ఇట్లు మంథరయడుగఁగాఁ గల్లకపటముగాని మంథరకుఁగల విషమబుద్ధిగాని యెఱుఁగని యాదాది సంతోషముపొంగి లోపల నిముడక వెలుపలికి పొరలివచ్చుచుండఁగా దేహ ముప్పొంగుచుండఁగా నాకుబ్జతో ఁబేపుదయము పుష్యనక్షత్రమున దశరథుఁడు జితేంద్రియుఁడగు శ్రీరామునకు యౌవరాజ్యపట్టాభిషేకము చేయునని చెప్పెను. కుబ్జ కుంటిది గాన నెక్కడకుఁబోవునదికాదు. దాది సమబుద్ధి కావున కౌసల్యయింటికి రాకపోకలుఁగలది కావున నిది యెఱింగెను.

కం॥ ఆపల్కులు చెవిఁ బడఁ గడుఁ, గోపంబున మండిపడుచుఁ॰గుబ్జయుఁ గైలా
సోపమసౌధము డిగి చని, పాపపుమతి ననియె హాయి॰పండినకైకన్. ౧౬౯

కైలాసోపమసౌధము = కైలాసమునకు సమానమైనమేడ. మేడ తెల్లనిదై మిగుల నెత్తైనదగుటచే వెండికొండవంటిదని చెప్పఁబడెను. కైలాసము దిగెనని చెప్పుటచే దానికి పుణ్యలోకమునుండి నధఃపతనము సూచితము. దానికిఁ గారణము పాపపుమతి. ఉద్దేశార్థమున ద్వితీయ.

తాత్పర్యము

శ్రీరామునకుఁ బట్టాభిషేకమని చెవినిబడెనో లేదో రామునికా రామునికా పట్టాభిషేకమని కోపమున మండిపడుచు కైలాసమువలె నెత్తై తెల్లనైయున్న మేడదిగి బిఱబిఱపోయి సుఖముగఁ బండుకొనియుండిన కైకతో నిట్లనియె.

—॰ మంథర కైకేయికి శ్రీరామపట్టాభిషేకవార్తఁ దెలిపి దుఃఖించుట ॰—

సీ॥ లేలెమ్ము మూఢాత్మ॰రాల! కొంప మునింగెఁ, దెలియవు విపదబ్ధి॰దీర మునిఁగి
భర్త యెల్లనిదాన!॰పరమదుర్భగ! వృథా, సౌభాగ్యవతి నని॰చాటుకొనెదు
మండువేసవి నేట ॰ నుండుజలం బన, నీదుసౌభాగ్యంబు ॰ నేలఁ గలయు
క్ష్మాకాంతుఁ డెప్పుడు॰నాకుఁ గైవసమని, విఱ్ఱవీఁగెద విసి॰వెఱ్ఱి వగుచు
తే॥ ననుచుఁ దనుఁ గోపపరుషోక్తు॰లాడుపాప,
దర్శినినిగాంచికడువిషా॰దమునఁ గుంది
కైక యిట్లను నేడ్చెడు॰కరణి దీన,వదన వై తేల యిపుడేమి॰వచ్చెఁ జేటు?

విపదబ్ధిన్ = ఆపదయను సముద్రమందు, తీరన్ = పూర్ణముగ, పరమ దుర్భగ = మిక్కిలి నిర్భాగ్యురాలా! సౌభాగ్యవతి = సుందరి-అదృష్టవతి, క్ష్మాకాంతుఁడు = రాజు, కైవసము = స్వాధీనము.

తా త్ప ర్య ము

ఓసీ బుద్ధిలేనిదానా? లేవేలేవే మునిఁగెనేకొంప- ఆపత్సముద్రములోఁ బూర్ణముగ మునిఁగికూడ హాయిగాఁ బండుకొన్నదానవేమే. భర్త కిష్టము లేని దానా? నిర్భాగ్యురాలా! నేను సౌభాగ్యవతిని నేనుసౌభాగ్యవతి నని వ్యర్థముగా దండోరా నీకు నీవేకొట్టుకొనెదవే. అఁ! యీనాఁడు నీసౌభాగ్యమంతయు మండెడు నెండలవేళ నేటి నీటివలె నేలఁగల సెనులే. రాజు నాస్వాధీనమందున్నాఁడు. నేనెట్టాడించిన నట్టాడును అని విఱ్ఱవీఁగెదవే. ఎంతవెఱ్ఱిదానవే.అని యీప్రకారము తన్నుఁ గోపముతోఁ గఠినవాక్యము లాడుచున్న పాపపుటాలోచనగల మంథరను జూచి మిక్కిలి వ్యసనపడి "యేమిటికే యిట్టులేడ్చెడుదానివలె మొగము వ్రేల వేసితివి. ఏమిచేటుకాలము వచ్చెనేనీకు.

చం॥ అని మధురోక్తిఁ గైక యన ♦ నానుడికారపుఁ బ్రోడ రక్తలో
చన యయి కేకయాత్మజకు ♦ శర్మము రాఘవు వేఱుపాటునుం
దనమదిఁ గోరి యశ్రువులఁ ♦ దద్దయుఁ గార్చుచు నామె కిట్లనున్
వనిత! భవద్వినాశ మిదె ♦ వర్తిలు చున్నది తప్ప దేమిటన్.   ౧౭౧

మధురోక్తిన్=తియ్యనిమాటలచే, నుడికారపుఁబ్రోడ=చమత్కారపుమాటల యందు సమర్థురాలు, రక్తలోచన=కోపముచే నెఱ్ఱని కన్నులుగలది, కోపకార ణము రామపట్టాభిషేకము శర్మము=మేలు, అశ్రువులన్=కన్నీళ్ళను.

తా త్ప ర్య ము

అని తియ్యనిమాటలచేఁ గైక యడుగఁగా సమయమునకుఁ దగినట్లు చమ త్కారముగ మాటలాడుటయందు నారితేఱిన యామంథర కోపముచేఁ గన్ను లెఱ్ఱచేసి కైకకు (నప్పటికి) శుభము, శ్రీరామునకు వేఱుపాటు గలుగఁగోరి, కన్నీళ్ళు కార్చుచుఁ గైకతో నిట్లనియె. రాణీ! నీవెఱుఁగవుకాని నీవు చెడిపోవు కాలము జరగుచున్నది. ఇది తప్పనదికాదు. గంటలకొలఁదికాలములోనే- దినములకొలఁది కూడఁగాదు- నీకుఁ గీడు మూఁడఁగలదు.

ఉ॥ రాముని నీమగండె యువ♦రాజు నొనర్చెడి నంట యెల్లి, యో
చామరొ! దీని వింట భృశ♦సాధ్వసశోకపరీతచిత్తనై
హా మెయి నిప్పులం బొరలి నట్లయినన్ సయిరింప లేక నీ
సేమము గోరుదాన నయి ♦ చెచ్చెర వచ్చితి నీకుఁ దెల్పఁగన్.   ౧౭౨

ఎల్లి=ఱేపు, భృశ=అధికమైన, సాధ్వస=భయము, శోక=దుఃఖము, వీని చేత- పరీత=చుట్టఁబడిన, చిత్తనై=మనస్సుగలదాననై, మెయి = దేహము, చామ=శ్యామా శబ్దభవము- 'శ్యామా యౌవనమధ్యస్థా' యని-నడిమి యౌవన మందుండునది.

తాత్పర్యము

ఓసీ! వయస్సుపొగరున నీమేలు గీళ్ళు నీవేయెఱుఁగనిదానా! నామగఁడు నామగఁడని యెవ్వనిఁజూచి పొంగుచుందువో యట్టినీమగఁడే-మఱియెవ్వఁడో కాఁడు జేపే- ఎన్నాళ్ళకోకాదు-నీసవతికొడుకును రాముని నే-మఱియెవ్వనినోకాదు- యువరాజుచేయునఁట- ఈవార్త వినఁగానే నాకుఁ, బట్టరానిభయముచే శోకముచేఁగలవరపడిన మనస్సుగలదాననై నిప్పులలోఁబడి పొరలినట్లయి,దేహము తపింపఁగా నీక్షేమము గోరుదాననగుటచే నీకివార్తతెల్పఁ ద్వరగా వచ్చితిని.

ఆ॥ నీకు దుఃఖ మొదవ ♦ నా కతిదుఃఖ మౌ, నీకు వృద్ధి గలుగ♦నాకు వృద్ధి
సందియంబు లేదు♦యిందీవరాక్షిరో, యీయెడాటమందు♦నెఱుఁగ వినుము.

ఎడాటము = విషయము.

తాత్పర్యము

శ్రీరామునకుఁ బట్టాభిషేకమై యది యొకవేళ నాకుఁ గీడుకలిగించునది యయ్యెనేని దాసివగు నీకు వచ్చినచేటేమి? నీవేల యేడ్చెదవందువా నీకు దుఃఖము గలిగెనా నాకు మిక్కిలి దుఃఖమగును. నీవు బాగుంటివా నేను మిగుల బాగుందును. నా యోగుబాగులు నీయోగుబాగులఁబట్టి యున్నవి. ఇందు సందేహములేదు. కాఁబట్టి నాక్షేమము నిమిత్తమై నీక్షేమము నేను గోరవలసి యున్నది. ఈవిషయమున సందేహము లేదు.

ఉ॥ పుట్టితి వీవు పేరుగల♦భూపతివంశమునందు ఱేనికిం
బట్టపుదేవి వైతి విట♦భామిని! నీ విటు లయ్యు నిస్సి యీ
మట్టు నెఱుంగ లేవ, యిఁక♦మాటల నేమగు? రాజధర్మమున్
గుట్టు న దెంత క్రూర మెదఁ♦గోమలిరో! తలపోయ లేవుగా. ౧౭౪

నీవు పేరుపెంపుగల రాజవంశమందుఁ బుట్టితివి. ఇచ్చటనా రాజునకుఁ బట్టపుదేవివైతివి. (పట్టము గట్టుకొనకపోయినను బట్టపుదేవికి జరగవలసిన గౌరవములు నీకేజరగుచున్నవి. కావున వాస్తవముఁ బట్టపుదేవివినీవే. కౌసల్యనామకార్థము) ఇట్లు పుట్టినచోటఁ జొచ్చినచోట నెంతో పూజ్యస్థితియందుండియు నీ యింతమాత్రమెఱుంగలేకయున్నావు. ఇఁక నీకేమి చెప్పి యేమి ప్రయోజనము నీవు నామాట వినఁబోవునదిలేదు. నీవు బాగుపడఁబోవునదిలేదు.రాజవంశమునఁ బుట్టియు రాజధర్మము రాజుల రహస్యము లెంత క్రూరములో యాలోచింపలేక యున్నావుగదా. దాసి రాణినింతములకనగా మాటలాడవచ్చునా? యని సందేహము; ఇది యధమ జనులందు లోకసిద్ధము. ఎదుటివారికిఁ దెలయనిదానిని దాము దెలిసి గొప్పసాహాయ్యముచేయుచున్నా మనుసహంకారము దీనికిఁ గారణము.

చం॥ పలుకులు ధర్మయుక్తములె, ♦ భావము నా సతిదారుణంబ, యు
గల్మి! పువుఁదేనెలం జిలుకు ♦ మాటలు కంఠముమీఁదనుండియే.

తెలియక మోసపోయితివి ♦ దేవి! విభున్ ఋజుమార్గవర్తిఁగాఁ
దలఁచి; తదీయదుష్ఫలము ♦ తార్కొనెని న్నిపు డింతఘోర మై. ౧౭౫

ఋజుమార్గవర్తి = చక్కని నడవడిగలవాఁడు.

తాత్పర్యము

రాజధర్మ మంత క్రూరమా యందువేమో! చెప్పెద విను. రాజనీతి వేశ్యానీతి సమానములు రాజుల మాటలుమాత్రము ధర్మశాస్త్ర మనుసరించియే యుండును. మనస్సో మిక్కిలిభయంకరమై క్రూరకార్యములు చేయుటయందు యాసక్తమైయుండును. పువ్వుఁ దేనియలవంటి మిగులఁ దియ్యనైన మాటలు కంఠము పైభాగమునుండి వచ్చునేకాని హృదయమునుండి రావు. కావున హృదయ విధము నొకటి మాటలతీరు వేఱొకటి. ఇది తెలియక దశరథుఁడు మనస్సు వాక్కు నేకవిధముగాఁగల చక్కటి నడవడిగలవాఁడని నమ్మి మోసపోయితివి. ఆ నమ్మినదోషమే యిప్పుడు నిన్ను నింతభయంకరమై ముంచుచున్నది.

కం॥ అచ్చికబుచ్చికగా నీ,మెచ్చులకై వగలుపడుచు ♦ మేదకు నటులై
యిచ్చట నసర్థకంబుగ, నచ్చటఁ గౌసల్య కిడెడి ♦ నైశ్వర్యంబుల్. ౧౭౬

మేదకు నటులై =ఏమితెలియనివానివలె నణఁగినవాఁడై.

తాత్పర్యము

రాజునకు హృదయము వాక్కు నొక్కరీతిగ లేదని నీకెట్లు తెలియునందువేమో. ఇక్కడ నీవు మెచ్చుకొనుటకై నంగినంగి యల్లిబుల్లివగలమారిమాటలేమియు దోషమెఱుంగని యఁబేదవలె, నీయందే ప్రాణములన్నియు నిలిపిన ప్రియునివలె, మాటలాడుచు నీకుఁ గీడుకలుగునట్టు లైశ్వర్యమును నీసవతికిఁ గౌసల్యకిచ్చుచున్నాఁడు. నీ విషయమున మాటలలోఁ జూపిన ప్రీతి హృదయమునుండిన నీమగఁడు నీకుఁ గీడుకలుగునటు లిటులుచేయునా? మాటలతో నీవు సంతోషింపుము. సిరితో కౌసల్య సంతోషించును.

కం॥ చుట్టంబులఁ జూడఁగ నను, సొ ట్టొక్కటిపెట్టి నీదు ♦ సుతు దూరముగా
నెట్టి తనపెద్దపెం డ్లము,పట్టిని నృపుఁ జేయు జేప ♦ పతి దుష్టమతిన్. ౧౭౭

సొట్టు = నెపము, నెట్టి = వెడలఁగొట్టి.

తాత్పర్యము

పెద్ద కొడుకునకుఁ బట్టాభిషేకముచేయుట న్యాయ్యమైన కార్యమేగదా. అందు దుష్టబుద్ధియేమున్నదందువేమో. ఎంతదురాలోచనము దూరాలోచనము చేసి నీమగఁడీపని చేయ సాహసించెనో నీవూహింపలేవు.నీకొడుకు భరతుఁడిచ్చట నుండిన వానికి రాజ్యము కావలెనని నీవడుగుదువేమో ఎదురుగానున్నప్పుడియ్యననిన నీవు నిష్ఠురపడెదవేమో యని యాలోచించి నిన్ను మోసగించుటకై చుట్టాలను జూ ‌టయను నొక నెపముపెట్టి నీకొడుకును దూరముగా నెట్టివేసి వాఁడు

లేనిసమయముచూచి తన నిక్కపు ప్రియురాలగు పెద్దపెండ్లము ముద్దుకొడుకు నకుఁ బట్టము తేపేగట్టు దురాలోచనము చేసెను.

మా యన్న వచ్చి పిలిచినఁగదా నాకొడుకును బంపెను. అందురాజుదోష మేమున్నది యందువా- దురాలోచనము దూరాలోచనము లేదేని యిన్నిసంవత్సరము లందేల యుంచవలె నీకొడుకునందుఁ బ్రీతిగలవాఁడైనచో సంవత్సరమో యాఱునెలలో యుంచక యించుమించు పండ్రెండుసంవత్సరము లుంచునా? శ్రీరాముని నిన్నాళ్ళెడఁబాసి యుండఁగలఁడా? భరతునందుఁ బ్రీతిలేదు గనుకనేపోయినవాఁ డట్టులే పోనీలే యని యూరకున్నాఁడు. ఆయన యుపాయము తెలిసికొనలేక నీవూరకయున్నావు దురాలోచనలేదేని యందఱు కొడుకుల దగ్గఱనుంచుకొని యీపని యేలచేయరాదు. బంధువుల నందఱు నేలపిలిపింపరాదు. ఈ ప్రొద్దనుకొని తేపే చేయుసంతతొందర యేమివచ్చినది. పండ్రెండేండ్లయిన భరతుఁడు మరలివచ్చును. రామునకుఁ బట్టాభిషేకముచేయ సాధ్యపడదనియేకదా పుట్టిమునిఁగినట్లింత తొందర. ఇదియంతయు నాలోచించిన రాజు దుష్టమతిగాఁడా.

కం॥ పతి యనునెపమున నరి యని,మతి నెఱుఁగక మూఢురాల♦మాతవలె సదా
హితవగుచు మరగి తహి స,మ్మతిఁ దొడ లాలించుకుమతి♦మాడ్కి మహీపున్.

అరి = శత్రువు, అహి = పాపము. ౧౭౧

తాత్పర్యము

మగఁడనుపేరుగల పగవాఁడని యెఱుఁగక బుద్ధిలేనిదానా! తొడమీఁదఁ బామునుంచుకొని పాలుపోసి పెంచు దుర్బుద్ధివలె నీవు తల్లివలె హితబుద్ధిగలదానవై రాజునందుఁ బ్రేమగలదానవైతివి.

కం॥ ఆలంబు సేయ శత్రు,వ్యాలంబు ల వెట్లుసేయు♦నప్పరుసున నో
బేలా! దశరథుఁ డిప్పుడు, వాలాయము నిన్ను సాత్మ♦భవ నటు సేసెన్.

ఆలంబు=ఉపేక్ష, 'ఆలంబాలంబు చేసి' యని తిక్కన వ్యాలంబు=పాము, అప్పరుసునన్=ఆవిధముగ, సాత్మభవన్=కుమారునితోఁగూడిన దానిని.

తాత్పర్యము

ఉపేక్షించిన పక్షమున శత్రువులు పాము లెట్లు సేయునో యావిధమున నోమూఢురాలా దశరథుఁడిప్పుడు నిన్ను నీకొడుకుతోడ తప్పకచేసెను.

కం॥ బాలా! పరిచితచిరసుఖ,జాలా! పాపియును నన్నృత♦సాంత్వుం డగుభూ
పాలుఁడు రాముని రాజుగ, నేలకుఁ జేయంగఁ జెడరె♦నీవును జుట్టల్. ౧౮౦

బాలా = ఏండ్లుగలదానవయ్యు బుద్ధియందుఁ బిల్లదానా! పరిచిత చిరసుఖజాలా=దీర్ఘకాలముగ నభ్యసింపఁబడిన సుఖసమూహముగలదానా, అనృతసాంత్వుఁడు=అబద్ధపు టుపచారములు గలవాఁడు, చుట్టల్=చుట్టములు.

తాత్పర్యము

చిన్నదానా! కావుననే తెలివిలేనిదానా! నీవు చిరకాలముగ సుఖము లనుభవించినదానవే పాపాత్ముఁడు మోసపు టుపచారముగల రాజు రామునకు బట్టాభిషేకముచేసెనా నీవు నీబంధువులుకూడఁ జెడిపోరా! ఇన్నాళ్ళుభోగముల నోలలాడినదాన విఁకమీఁద నెట్లు దుఃఖముల మునిఁగి యుండఁగలవు.

చం॥ చతురవు విన్ము విస్మయవిశాలవిలోచన! నాదుపల్కు నీ
సుతు నిను నన్నుఁ గావ నొక చొప్పు తలంపుము, నీకు మే లెదో
హితగతి దానిఁ జేయఁగ నిదే సమయంబు సుమా, ప్రమాదపు
న్మతిఁ జెడిపోకు పోకు మని మంథర యాగతిఁ దీవరింపఁగన్. ౧౮౧

చతురవు=కార్యము నెఱవేర్చు బుద్ధిచాతుర్యము గలదానవు. ఆయాకాలమునకుఁ దగిన యాలోచన చేయునేర్పుగలదానవు, విస్మయ విశాల విలోచన = ఆశ్చర్యకరములై విశాలములైన కన్నులు గలదానా, ప్రమాదపున్మతిన్=ఇచట స్థిరవర్ణము పరమైనను నుగాగమము- ఉ గరువ పున్మరువు. బాల-వ్యా॥

తాత్పర్యము

ఇంతసేపు నిందించి కార్యసాధన మాలోచించి యిపుడు మంథర కైకను బొగడుచున్నది. దేవీ! నీవేదో ప్రమాదవశమున నాలోచింపని దానవైతివేగాని స్వభావమున నాయీ కాలమునకుఁ దగిన యాలోచనచేయ నేర్పుగలదానవు. చేసిన యాలోచన కొనసాగించు సామర్థ్యము గలదానవు. ఈ కార్యములందు నీబుద్ధిబలముతోడను సామర్థ్యముతోడను బనిలేదు. ఎట్టివారినైన నాశ్చర్యపడఁ జేయు నీనేత్ర సౌందర్యమే యెట్టిపనియైనఁ జేయఁగలదు. కావున నామాట వినుము ముఖ్యముగా నీకుమారుని నిన్ను నన్ను రక్షించుటకొక యుపాయమును వెదకుము. నీకు మేలైనకార్యము చేయుటకుఁదగిన సమయమిదే. ఇదితప్పఁగొట్టితివా- నీకు మేలులేదు. పొరపాటుపడవలదు సుమా యని మంథర కైకను దీవరించెను.

—♦ పట్టాభిషేకవార్తఁ జెప్పినమంథరకుఁ గైక పారితోషిక మిచ్చుట. ♦—

కం॥ ఆలలితవదన మంథర, యాలాపము లాలకించి యతిహర్షమునన్
వే లేచెను శారదనిశ, లీలం బొడతెంచుచంద్రలేఖయ పోలెన్. ౧౮-౨

లలితవదన = అందమైన ముఖముగలది, శారదనిశన్=శరత్కాలరాత్రియందు, పొడతెంచు=ఉదయించు, లేఖా రేఖా శబ్దములు రెండునుగలవు.

తాత్పర్యము

సహజసుందరమై యిపుడు సంతోషముచే మఱింత వికాసము నొందిన ముఖముగ[illegible] కైక మంథర చెప్పిన మాటలువిని మిగుల సంతోషించి శరత్కాలరాత్రియ[illegible] నుదయించు చంద్రకలవలెఁ బండుకొన్నది లేచి కూర్చుండెను.

శా॥ ఆనందంబున మేను పొంగఁ బరమం♦బౌవిస్మయం బారఁగా
మేనం దాల్చినమేలిభూషణముఁ గొ♦మ్మీ యంచు నొం డిచ్చి యే
ణీనేత్రామణి కుబ్జ కిట్టు లనియెన్♦సి మ్మెచ్చితిన్ మంథరా!
దీనిన్ నా పరమప్రియంబుఁ దొలుతం♦దెల్పంగ నీవూనుటన్. ౧౮౩

తాత్పర్యము

కైక గొప్పరాజవంశమునఁ బుట్టినదైనను సాత్త్వికురాలుగాదు. ఈమెను గూర్చి భరతుఁడు భరద్వాజునితో "ఉ॥ ఏపెమహాపరాధము మునీశ్వర ప్రాణము మీఁదఁ దెచ్చెని। ష్పాపుల కన్నదమ్ములకుఁ బార్థివు స్వర్గతుఁజేసె నట్టిదౌ। పాపిని మూఢచిత్త ఖల భామిని నిష్ఠురశీల శాఠ్య సంప్రాపిత భోగదుస్స్వభగమానిని కైకయి యిద్దియేసుమీ" అయోధ్య ౨౧౧౮- గీ॥ ఆర్యరూపిణియైన యదయ పాపనిశ్చయ అని చెప్పెను. అయో. ౨౧౧౯. ఇవి కోపముచేఁ జెప్పినమాటలని యందమా యనిన భరతుఁడే తన్నుఁ బిలువవచ్చిన దూతలతో 'అత్మకామ సదా చండి యతులకోప శీలయును బ్రాజ్ఞ మానిని చెనఁటి నాదుతల్లికే వ్యాధిలేదు కదా? యని ప్రశ్నించెను, అయో ౧౭౨౮. ఈ కారణముచేఁ గైక సహజముగ సాధుమతియని పూర్వవ్యాఖ్యాతలు చెప్పినట్లుచెప్ప వలనుపడలేదు. అట్లుండినను శ్రీరామచంద్రుఁడు తన గుణములచే దశరథుకరుణకుఁ బాత్రుఁడైనట్టు కైకేయి సదభిప్రాయమునకుఁ బాత్రుఁడయ్యెను. ఇది శ్రీరాముని సౌజన్యాతిశయ బలమును దెలుపుచున్నదిగాని కైకేయి సాధుత్వమును దెలుపదు. కావున మంథర చెప్పిన వాక్యములు వినఁగానే కైక సంతోషముచే దేహముప్పొంగఁగా నత్యద్భుతమై తనకిష్టమైనవార్త తటాలున వినుటచే మిక్కిలి యాశ్చర్యపడి తాను దేహమున ధరించిన యాభరణములలో శ్రేష్ఠమైన దాని నొకటిదీసి సంతోషవార్త చెప్పినవారికి బహుమతి యిచ్చుటమర్యాద గావునఁ దీసికొమ్మని మంథరకిచ్చి నాకు మిక్కిలి ప్రియమైన వార్త మొట్టమొదట నీవు చెప్పుటచే నిన్ను మెచ్చుకొంటిని.

కం॥ ఇంతటికడుప్రియ మగువృ,త్తాంతము నెఱిఁగించునీకుఁ♦దగురీతిగ నే
నింతకు నేమి యొనర్తునొ, చింతన మొనరించి నాకుఁ♦జెప్పుము కుబ్జా.

ఇంతటి కడుప్రియము=ఇంతటి మిక్కిలి ప్రియము. ఇది సమాసము కావున పరుషము సరళముగాలేదు. "ఆంధ్రంషడ్వర్ణ పర్యంతం సంస్కృతేన సమస్యతే"

తాత్పర్యము

నాకు మిక్కిలి ప్రియమైనవార్త తెలిపిన నీకుఁదగిన రీతిగ నేనేమిప్రత్యుపకారము చేయవలయునో నీవేయాలోచించి నాకుఁ దెలుపుము. ఇప్పుడిచ్చినది చాలదనియు నింతకు నెక్కువ బహుమానమునకుఁ దగుదువనియు నెఱుంగుదును.

కం॥ రామునకు భరతునకును, నేమాత్రము భేదమెఱిఁగ ♦ నేనటుగానన్
భూమీశుఁడు పట్టంబును, రామునకుం గట్ట మనసు♦రంజిల కున్నే. ౧౮౪

తా త్ప ర్య ము

సవతికొడుకు పట్టాభిషేకము నీకెట్లు ప్రియమయ్యెనందువేమో- నా కుప చారము చేయు విషయమున భరతునకుఁ రామునకు నేను భేదమెఱుఁగను. రామునకుఁ బట్టాభిషేకమగుట నాకొడుకున కయినట్లని సంతోషింతును.

కం॥ తరమా నీకిల నింతకుఁ, బరమాహ్లాదం బొసంగు♦పలుకుం బలుకన్?
బర మయి దీనిని మించిన,వర మెయ్యది గోరుకొనెదు♦వచియింపుమనన్.

ఇంతకంటె నాకెక్కువ సంతోషము గలిగించువార్త చెప్ప నీకు శక్యము గాదు. కాఁబట్టి యిప్పుడిచ్చినదానికంటె శ్రేష్ఠమైనదానిని గోరుకొనుము.

—♦ ౮-వ సర్గము. మంథర కైకను దూషించుట. ♦—

కం॥ కోపము దుఃఖము మదికిని, దాపం బిడ నీసుకలిమిఁ♦దటుకున సొమ్మున్
వే పాఱవైచి మంథర, భూపాలకసతిని జూచి,♦పొక్కుచుఁ బలికెన్. ౧౮౭

తా త్ప ర్య ము

అని కైకచెప్పినమాటలు వినఁగానే కైక తనమాట పాటింపదయ్యెనని కోపము, రాఁబోవు కష్టదశ దలంచి దుఃఖము, తనమనస్సునకుఁ బరితాపము కలిగింపఁగా కైక యిచ్చినసొమ్ము నావల విసరిపాఱవైచి దుఃఖపడుచు నామెతో నిట్టు లనెను.

ఉ॥ బాలిశురాల! సంతసము♦పాటున కా యిది వేళ? శోకకీ
లాలధిమధ్యసీమను మె♦లంగుచు నిన్ దెలియంగ లేవ, యా
భీలమహావిపత్తు కడు♦బెట్టిదమై యిటు దాపరించిన
న్మేలని సంతసించు నిను♦నే నెటు సవ్వక తాళఁ జాలెదన్? ౧౮౮

బాలిశురాలా=మూర్ఖురాలా, సంతసము పాటునకా=సంతోషముపడుటకా- సంతసంపాటు; రూ, సంతసపాటు-సంతసముపాటు - వద్వాదులు పరంబగు నపుడు మువర్ణకమునకు లోపపూర్ణబిందువులు విభాషనగు- సు. వ్యా. సంధి. సూ.౬౯. శోకకిలాలధి=శోకసముద్రము-కీలాలము (1) నెత్తురు. (2)జలము. మధ్యసీమను=నడిమిప్రదేశమున-ఆభీల=భయంకరమైన.

తా త్ప ర్య ము

చెప్పినను దెలిసికొననేరని మూర్ఖురాలా! ఇది సంతోషసమయమా? శోక మను సముద్రము నడుమ మునుఁగుటకు సిద్ధముగానుండియు నీదశ నీవు తెలిసికోలేక యున్నదానవు-భయంకరమై గొప్పయాపద యీవిధముగా దాప రించినను దానిని మేలని యెంచు నిన్నుఁజూచి నీవు రాణివి నేను దాసిని నిన్నుఁజూచి నవ్వరాదని యెంత యణఁచుకొన్నను నిలుపలేక యున్నదానను.

ఉ॥ నీ తెలి వింతలేమికిని♦నేవగతున్, సహజారి యౌసవ
త్నీతనుజాతువృద్ధి, పయిఁ♦ద్రెక్కొన మృత్యువుమాడ్కి నిట్లు సం

జాతము దంబుసం గెరలఁ♦జాలునె ప్రాజ్ఞయు? దీని నేమిగాఁ
జేతమునం దలంచితివి♦చెప్పుము నీకు వివేక ముండినన్? ౧౮౯

సహజారి=పుట్టువు చేతనే శత్రువు-సపత్ని=సవతియొక్క, తనూజాతు=కొడుకుయొక్క, ప్రాజ్ఞ=ప్రజ్ఞగలది-చేతము-చేతస్సు-రూపాంతరము.

స్మృతి ర్వ్యతీతవిషయా, మతిరాగామి గోచరా, బుద్ధిస్తాత్కాలికీజ్ఞేయా, ప్రజ్ఞాత్రైకాలికీమతా: గడచిన విషయము మనస్సునకు గోచరించుట స్మృతి యనియు; రాఁబోవు విషయము గోచరించిన మతియనియు. తత్కాల విషయము తెలిసికొనునది బుద్ధి యనియు మూఁడు కాలములందలివి యెఱుఁగునది ప్రజ్ఞయనియుఁ జెప్పఁబడును.

తాత్పర్యము

కైకా! నీసవతికొడుకు రాజుగానున్నాఁడని నాకంత వగపులేదు. నీకొడుకునకు రాజ్యము లేదాయెఁగదా భ్రష్టుఁడగును అని నాకు వగపులేదుగాని రాచకూఁతురవగు నీకి మాత్రమైనఁ దెలివిలేదయ్యెఁగదాయని మిక్కిలి వగచుచున్నాను. పుట్టువుచేతనే పగవాఁడగు సవతికొడుకువృద్ధి మృత్యుదేవతవలె వచ్చి కుత్తుక బిగించి పట్టుకొన్నవేళ వివేకముగలది యెవ్వతె సంతోషించును? నీకుఁ దెలివి తేటలుండిన రామపట్టాభిషేకమును గుఱించి నీవేమి యెంచితివో చెప్పుము. నాకుఁ దెలియదనెదవా నేను జెప్పెద వినుము.

తే॥ రాజ్య ముమ్మడిసొమ్మౌట♦రామునకును,
బ్రాణభయసంశయంబుండు♦భరతువలన
భయముపడువానివలననే♦భయము గలుగు,
నింత దలపోసిసవిషాద♦హృద♦హృదయనైతి. ౧౯౦

ఉమ్మడిసొమ్ము=పొత్తులసొమ్ము-స్వమ్ము శబ్దభవము సొమ్ము.

తాత్పర్యము

రాజ్యము పొత్తులసొమ్ము-రామునకు మన భరతునకు నిరువురకు నిందు భాగము గలదు. ఒకసొత్తిరువురదైనపు డొకరిని జంపి మరియొకరు పూర్ణముగ ననుభవింప వలయునను కోరికయుండుట లోకమున సహజము. ఆకారణముచే రామునకు భరతునివలనఁ బ్రాణభయము గలదు. రాముఁడు చచ్చిన రాజ్యమంతయు భరతునిదే. కావున భరతుఁడు తనకపాయము చేయునను సందేహముతో శ్రీరాముఁడు భరతునకుఁ గీడుచేయును. కావున భయపడువాని వలననే భయపెట్టువానికి భయము గలదు. ఇది యాలోచించుకొలఁది రాముఁడు రాజయ్యెనేని భరతుని నెపుడు చంపునో యని భరతునివిషయమున విషాదము కలుగుచున్నది. మనుష్యులు పాములను దేళ్ళను బాధింతురు గావున నవి మనుష్యులను బాధించును.

కం॥ రామునిఁ ద్రికరణశుద్ధిగ, సౌమిత్రి భజించు చుండు♦సంతత మతివా!
రాముని లక్ష్మణురీతిని, సామంబునఁ గొలుచు భరతు♦శత్రుఘ్నుండున్.

తాత్పర్యము

లక్ష్మణశత్రుఘ్నులు గలదుకదా, వారును దాయాదులే యందువేమో వారి యిరువురందు మనోవాక్కాయములు నిష్కల్మషముగ లక్ష్మణుఁడు రాముని సేవించునట్లు శత్రుఘ్నుఁడు భరతుని సేవించుచున్నాఁడు.

కం॥ జననక్రమమాలోచిం,చిన భరతుఁడ దాపువాఁడు•చెలి! సౌమిత్రుల్
వెనుకటివా రగుదురు గా,వున రాజ్యక్రమము వారు•పొందెద రవలన్.

తాత్పర్యము ౧౬-౨

వీరంద ఱన్నదమ్ములు పుట్టిన వరుస నాలోచించినచో రాముఁడు మొదటివాఁడు రెండవవాఁడు భరతుఁడు. అవలఁ బుట్టినవారు లక్ష్మణ శత్రుఘ్నులు-కావున రాముని యనంతరము రాజ్యము భరతునిదే కాని లక్ష్మణునిది కాదు. కావున లక్ష్మణునివలన రామునకు భయములేదు. పాపపు మంథర శ్రీరాముఁడనదు.

చం॥ కరము వివేకశాలియును•క్షాత్రకళాకుశలుండు, నిండునే
ర్పరి,సమయోచితార్థముల•బాగుగఁ దీర్చెడిక్షిప్రకారియున్,
ధరణిసుతామనోహరుఁడు•తా,నటుగావున నీదుపుత్రకు
న్భరతుఁ దలంచినం గడు వ•ణంకెడి మే నిదె చూడు మానినీ! ౧౬౩

తాత్పర్యము

క్షాత్రకలాకుశలుండు = క్షత్రియధర్మమందు నేర్పరి- క్షిప్రకారి=వెంటవెంటనే పనిచేయువాఁడు-మానినీ=మానముగలదానా! ఇంతవఱకు నీవుమానము గలదానవని నాయభిప్రాయము. అగునోకాదో యిపుడు తెలియవలసియున్నది (అవమానవేళ స్త్రీలకు వచ్చుకోపమునకు మానమునిపేరు.

తాత్పర్యము

రాముఁడు సామాన్యుఁడని నీవు తలఁచితివేమో. అయన కార్యాకార్యములందు పట్టువిడుపులు తాఁకుతప్పులు చక్కఁగాఁదెలిసినవాఁడు. అట్టులని "వీరు బ్రాహ్మణులే యేకిడైన సైరింపఁగన్' అన్నట్టు లెల్లవేళ క్షమయే తాల్చియుండువాడుఁ రాజనీతియందు నసమర్థుఁడు.ఏకార్యమునైనను బూనెనామరలఁగొఱంతలేక నిశ్శేషముగఁజేయు నేరుపుకలవాఁడు సమయమునకుఁ దగిన పనిని సోమరితనములేక యప్పుడే చేయువాఁడు ఇటువంటివాఁడు కావున నీముద్దుకుమారుని భరతుని దలఁచినపుడెల్ల నేవేళకేమి మూఁడునోయని దేహము వణఁకుచున్నది. ఇప్పుడు నాదేహముచూడు మెట్లు వణఁకుచున్నదో.

కం॥ మానంబె తొడవు సతులకు।మానమె ప్రాణాధికంబు మానమఖిల సమ్మాన
ములకు మూలంబగు।మానరహితమయిన బ్రదుకు మానినికేలా"పారిజాత.

అని యుండుటచే నీవు మానవతివో మానహీనవో తెలియవలసియున్నది. మానహీనయగుటకంటెఁ బ్రాణహీనయగుట స్త్రీకి గౌరవము.

ఆ॥ ఎంతపుణ్యవతియొ•యింతరో కౌసల్య, తేపు పుష్యమందు•తేఁడు తనదు
పుత్రు యౌవరాజ్య•మున కభిషిక్తుఁ జే,యింప ద్విజులచేత•నెలమిఁగ నెడి.

తా త్ప ర్య ము

అహా! కౌసల్య యెంతపుణ్యాత్మురా లెంతపుణ్యాత్మురాలు!! ఉదయము కాఁగానే పుష్యనక్షత్రమున రాజు తనకుమారుని బ్రాహ్మణులచే యౌవరాజ్యమందు నభిషిక్తుఁజేయింపఁగా నెంతో సంతోషించునుగదా, ఏమి యామె యదృష్టము. ఏమి యామె కడుపుచలువ. తల్లియనినఁ గౌసల్య తల్లిగాని యందఱు తల్లులా!

చం॥ సిరియును బ్రీతి కీర్తియును•జెన్నలరన్ సవతాండ్రు గుందఁగాఁ
గెరలెడికోసలాత్మజకుఁ•గ్రిందయి చేతులు మోడ్చి దీనవై
వరవుడ మోపి చేయుచును•వర్తిలు చుందువు మమ్ముఁ గూడి, నీ
భరతుఁడు ప్రేష్యభావమున•బాధపడున్ రఘురాముఁ గొల్చుచున్. ౧౯౦

సవతాండ్రు=సవతులగు స్త్రీలు-ఆండ్రుశబ్దము-స్త్రీలను నర్థముగలది. జవరాలు, బాలెంతరాలు, వలె. సవతి+ఆలు.సవతాలికిఁ బతివలచిన నని భారత ప్రయోగము. ఏమ్యాదులలోఁ జేరుటచే నిత్యసంధి. కర్మధారయంబులందును దంతములమీఁద రుగాగమము బహుళముగావున సవతు+అలు=సవతాలయిన దనియైనఁ జెప్పవచ్చును. వరవుడము=దాస్యము-"వరవుడ మోపి చేయుదునో వారికి నీవెయెఱుంగఁ జెప్పుమా" ఉద్యోగ. ప్రేష్యభావము=బంటుతనము.

తా త్ప ర్య ము

కౌసల్యాదేవి తనకొడుకు రాజ్యమేలఁగా ముదుసలిరాజును దనచేతిక్రింద వైచుకొని సంపదసంతోషము సత్కీర్తి యతిశయింపఁగా సవతులెల్లఁ దన మహోన్నత పదవిఁజూచి దుఃఖమునఁ గ్రుళ్ళుచుండఁగా విఱ్ఱవీఁగ కౌసల్యకు నీవు లొంగి లొంగి చేతులుమోడ్చి దీనవై మాతోపాటు నీవు నొకతెవై యామె కనుసన్నలు మెలఁగుచు దాస్యము చేయుచుందువు ఇఁక నీకొడుకో చేతులుకట్టుకొని దాసుఁడై రాముని సేవచేయుచుఁ గష్టపడుచుండును. నీవీ సమయము తప్పఁగొట్టితివా నీగతి యిట్టులగును.

కం॥ సంతసమున రామస్త్రీ, సంతతి త్రుళ్ళంగ, భరతు•క్షయమున మదిలో
సంతాపింతురు నీస్నుష, లెంతో చింతింపు దీని•కెయ్యది తెరువో. ౧౯౧

రామస్త్రీ సంతతి=రాముని భార్యయు నామెయంతఃపుర పరిచారికలు, ఆమెకుఁగావలసినవారు. త్రుళ్ళంగన్=సంతోషముతోఁ త్రుళ్ళిపడుచుండఁగా, భరతు క్షయమునన్=భరతుని హీనదశవలన, నీస్నుషలు=నీకోడండ్రు,మాండవీ శ్రుతకీర్తులు, అనఁగా నీకోడలు నీకోడలి పరిచారికలు ఆమెకుఁగావలసినవారు. మహారాజు బిడ్డలు-పిల్లలు-సుఖము గోరువారు నీనిమిత్తమున దాసిక లగుదురు

శ్రీరామచంద్రమూర్తి యేకపత్నీకుఁడను విషయము పూర్వపీఠిక యందుఁ జర్చితము.

—• మంథరకుఁ గైక శ్రీరాముని గుణములు వర్ణించి చెప్పుట. •—

కం॥ ఈమాడ్కిఁ బ్రీతి లేకను, నామంథరవాక్యవితతి•నాలించి రఘు
గ్రామణిరాముని గుణముల, భామిని యద్దాసితోడఁ•బలుకం దొడఁగెన్. ౧౬౪

ఈ మాడ్కిన్=ఈవిధముగా, లేకను=లేక+అను=లేక వచించునట్టి ఆల కించి=విని, రఘుగ్రామణి=రఘువంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడగు.

తాత్పర్యము

ఈవిధముగా శ్రీరామునందుఁ బ్రీతిలేక పలుకుచున్న యామంథర వాక్యములను విని రఘువంశమునఁ బుట్టిన రాజులయందఱిలో శ్రేష్ఠుఁ డగుశ్రీరామచంద్రుని గుణములిది గ్రహింపలేక పోయెఁగదా ఇది యెంతటి పెడకట్టెయని తలఁచి కైక శ్రీరామునిగుణములను మంథరకు బోధింప సాగెను.

పూర్వము శ్రీరాముని గుణములకు దశరథుఁడు ప్రీతుఁడైన విధము చెప్పఁబడెను. ఇప్పుడాయన గుణములకు సవతితల్లి కైకయుఁ బ్రీతురాలయిన విషయము చెప్పఁబడుచున్నది. దీనివలన నిర్మలమనస్సు నిష్కల్మషసాధుచరిత్రవలస విరోధబుద్ధిగలవారైనను వశపడుదురని యేర్పడుచున్నది.

కం॥ మఱవఁడు మేల్, శుచినిజ మేమఱఁడున్, దాంతుండు, గురుల•మతిశిక్షితుఁడున్
మఱి రాజు జ్యేష్ఠపుత్రుఁడు, నెఱి గాదే యౌవరాజ్య•నిష్ఠితుఁ డగుటన్? ౧౬౫

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి తనకొరులు చేసిన మేలు మఱచువాఁడు కాఁడు. స్త్రీల విషయమున ధనము విషయమునఁ బరిశుద్ధమైన మనస్సుగలవాఁడు. సత్యము నేమఱఁడు. ఇంద్రియ నిగ్రహముగలవాఁడు. పెద్దలయు నాచార్యులయుఁ దల్లిదండ్రులయు మనస్సు ప్రకారము నడచువాఁడు. ఇవికలవారందఱు రాజ్యార్హులాయందువేమో రాజుయొక్క పెద్దకొడుకు కావున జన్మము చేత కర్మముచేత గుణముచేత యోగ్యుఁడగు వాఁడు రాజ్యమున కర్హుఁడు గాఁడా?

కం॥ రాముఁడు దమ్ముల భృత్యులఁ,
బ్రేమంబునఁ దండ్రివోలెఁ•బెంపఁగ నేర్చున్;
రామాభిషేకమును విని, యా మాడ్కిని దుఃఖపడియె•దేటికె కుబ్జా? ౧౬౬

తాత్పర్యము

ఆ గుణములు రామునందు లేవని యయోగ్యుఁడనిరాజ్యార్హుఁడు కాఁడని నేను జెప్పలేదు. రాముఁడు రాజ్యమేలునేని నీ కొడుకుగతి యేమియని నేనంటినందువా, యోసి శ్రీరామచంద్రుఁడు తమ్ములను భృత్యులను తండ్రివలె నెంతో ప్రేమతోఁ బెంపఁగలఁడని నీవెఱుఁగవా. ఇప్పుడట్లు లాదరించుచున్నాఁడుగదా ఇటువంటి గొప్పగుణములు గల శ్రీరామచంద్రుని యభిషేకవార్త వినియును నీవేటికే యేడ్చెదవు కుబ్జా నీదేహమెంత వక్రమో నీ బుద్ధియు నంత వక్రమాయేమి?

కం॥ వత్సరములు నూఱైనను, మత్సుతునకు రాము వెనుక♦మహి యబ్బెడి సం
పత్సంతతితో, దీనికి, గుత్సించెదు పైతృకరము♦కొమరుఁడు కనఁడే? ౨౦౦

వత్సరములు=ఏడులు, సంపత్సంతతితో=సమస్తైశ్వర్యములతో, కుత్సిం చెదు=నిందించెదవు, పైతృకరము=తండ్రిసంపద.

తాత్పర్యము

శ్రీరాముఁడు నూఱేండ్లు రాజ్యమేలినను ఆయన వెనుక నాకొడుకునకు సమస్తైశ్వర్యములతో రాజ్యము లభించును. ఈమాత్రమున కేల నిందించెదు. తండ్రి సంపద కొడుకునకురాదా.

కైక చెప్పిన యీ వాక్యమామె ప్రాజ్ఞమానిని యని భరతుఁడు చెప్పిన దానిని స్థిరపఱుచుచున్నది.

జ్ఞానము లేకున్నను జ్ఞానముగల దానివలె వర్తించునది ప్రాజ్ఞమానిని.

కం॥ ప్రాప్తించె శుభము, మీఁదటఁ, బ్రాప్తింపఁగఁ గలదు కులప♦రంపరగా సం
తప్తహృదయ వేలయ్యెదు, తృప్తిం గన వలదె న్యాయ♦రీతియుఁగనరే

తండ్రి సంపద యిప్పుడు శ్రీరామునకు వచ్చెను. ఆవలఁ బరంపరగా నాకొడుకునకు వచ్చును. ఈ మాత్రమున కేల యేడ్చెదవే. న్యాయము నీకుఁ జేఁదా యేమి.

కం॥ భరతుం డెటు మాన్యుఁడౌ త,
త్సణిరని రాముండు మాన్య♦తరుఁడగు నిచ్చల్
పరిచర్య సలుపు నాకన, వరముగఁ దనతల్లికంటె♦వఱలెడిభక్తిన్. ౨౦౨

అనవరము=మిక్కిలి దక్కువగానిది, పరిచర్య=శుశ్రూష.

తాత్పర్యము

నాచే భరతుఁడెట్లు మన్నింపఁదగినవాఁడో యంతకంటె నెక్కువగనే శ్రీరాముఁడు మన్నింపఁదగినవాఁడు. ఏలందువా. తనతల్లికెట్టి సేవచేయునో యంతకుఁ దక్కువ లేకుండ భక్తితో నాకును శుశ్రూష చేయుచున్నాఁడు.

కం॥ జనకసుతాపతి రాజై, నను భరతుఁడె రా జటంచు♦నందింతుఁ జుమీ!
తనయట్ల చూచుఁ దమ్ముల, వినవే రామునకు లేవు♦వేఱేమిబుద్ధుల్. ౨౦౩

తాత్పర్యము

శ్రీరాముఁడు రాజయ్యెనా భరతుఁడు రాజయినట్లే సంతోషింతును. తన సుఖమెట్లు చూచుకొనునో తమ్ముల సుఖమునట్టులే చూచును. ఓసి విను శ్రీరామునందు భేదబుద్ధి లేదు.

కం॥ ఇట్టులు కైక వచించిన, నిట్టూర్పుల వేఁడిగాలి♦నిగిడించుచు రా
పట్టికి మంథర యనుఁ దన, దిట్టంబగు వనట మదిని♦దీటుకొనంగన్. ౨౦౪

నిట్టూర్పు-నిడు—ఊర్పు=కడు నడు నిడు కుఱుశబ్దంబుల కచ్చుపరం బగునపుడు ద్విరుక్తటకారంబగు. దీర్ఘశ్వాసము, వనట=దుఃఖము.

తా త్ప ర్య ము

అని యీప్రకారము కైక చెప్పఁగా వేఁడిగాలి నిట్టూర్పు విడుచుచు రాచ కూఁతురగు కైకకు మంథర తన దృఢమైన దుఃఖము మదిలో నతిశయింపఁగా నిట్టులనెను మంథర కైక చెప్పిన తెలివి తక్కువమాట నాధారము చేసికొని యీమె మనస్సును జీకాకు చేయుచున్నది.

—♦ మంథర కైకకు దుర్బోధము సేయుట. ♦—

ఉ॥ ఎంతటి మూర్ఖురాలవొ క♦దే, కన లేవే యనర్థదర్శినీ!
యెంతయుఁ దీర మున్గియు న♦హీనతర వ్యసనాబ్ధి, జానకీ
కాంతుఁడు రాజుగాఁ బిదవ♦గామిని! యాతనిపుత్త్రుఁ డౌను భూ
కాంతుఁడు, నీతనూజునకుఁ♦గల్గు నటే ప్రభుతాదిభోగముల్? ౨౦౫

అనర్థదర్శినీ=కీడుకలుగ నాలోచించుదానా, అహీనతర=మిక్కిలి గొప్ప దగు-వ్యసనాబ్ధిన్=దుఃఖసముద్రమునందు-ప్రభుతాది=ప్రభుత్వము మొదలైన

తా త్ప ర్య ము

కీడుకలుగ నాలోచన చేయుదానా! చెప్పినను దెలిసికొనలేవు నీవెంతటి మూర్ఖురాలవే. వ్యసనసముద్రమందు దీరమునిఁగియు నీకు రాఁగల యాపద తెలిసి కొనలేక యున్నదానవు. రాముఁడు రాజైన పిమ్మట నతని యనంతర మతని కొడుకు రాజగునుగాని నీకొడుకునకు రాజ్యమేరీతి వచ్చునే.

కం॥ ఎందఱు సుతులుండిన నేం,డ్లందఱ రాజ్యమున నునుచు♦టనయము గాదే?
నందను నగ్రజు రాజ్యం, బం దుంతురు గడుగుణాఢ్యు♦లైనను బిన్నల్.

అనయము=దుర్నీతి, అగ్రజున్=పెద్దవానిని.

తా త్ప ర్య ము

ఒకరాజున కెందఱు సుతులుండిన నందఱను రాజ్యపదవియందుంచుట దుర్నీతి కదా. కావునఁ బెద్దవాఁడు నీతిమంతుఁడైనను గాకున్నను వానికంటెఁ జిన్నవారు నీతిమంతులైనను పెద్దవానినే రాజ్యపరిపాలనమందు రాజులు నియమింతురు.

ఉ॥ కావున బన్నముల్ పడుచు♦గాదిలిపుత్త్రుఁ డనాథునట్టిఁడై
భూవిభుతన్ సుఖంబులను♦బోకడబెట్టి శ్రమంపడంగ నే
నేవిధిఁ జూడలేమి నిను♦నిట్టులు తొందర పెట్టెదన్, సప
త్నీవిభవాభివృద్ధికయి♦నీ విసిఁ గానుక నా కొసంగెదే? ౨౦౭

బన్నము=భగ్నశబ్దభవము-అవమానము. గాదిలి=ప్రియుఁడైన,అనాథునట్టిఁడు=దిక్కులేని వానివంటివాఁడు, అట్టివాఁడు=అట్టిఁడు, ఎట్టివాఁడు=ఎట్టిఁడు అట్టి-ఇట్టి-ఎట్టి శబ్దంబులకు వాఁడు వారు పరంబులగుచో, వా, కు లోపంబు వైకల్పికంబుగ నగు. సు. వ్యా అచ్ఛిక. సూ. ౪౬ భూవిభుతన్ = భూప్రభుత్వ మును-పోకడపెట్టి=పోఁగొట్టుకొని.

తాత్పర్యము

ఈ కారణముచే నీప్రియపుత్రుఁడు దిక్కు లేనివానివలె నవమానపడుచు రాజ్యమును సుఖమును పోఁగొట్టుకొని కష్టపడుచుండ నేను చూడలేక యయ్యో పాపమని నిన్ను నీరీతి తొందరపెట్టుచున్నాను. కైకా సవతికొడుకునకు సంపద యభివృద్ధి యగుచున్నదనియా నాకు నీవు బహుమాన మిచ్చెదవు?

చం॥ కల తెఱఁగు న్వచించెద, న♦కంటక రాజ్యము రాముఁ డొంది యా
వల భవదీయపుత్రు వన♦వాసిగనో పరలోకవాసినో
చలుపఁ గలండు నమ్ము మిది,♦జాల్మతఁ బంపితి బాలుఁ బుత్రకున్
వలనటి మాతులుం గనునె♦పంబున, నింతకు మోస ముండునే? ౨౮

కలతెఱఁగు=ఉన్నవిధము=వాస్తవము, అకంటక రాజ్యము=శత్రువులు లేని రాజ్యమును-పరలోకవాసిగనో=చచ్చినవానిగనో-జాల్మత = బుద్ధిలేక-వలనటి=ఉపాయముచెడి-మాతులున్=మేనమామను,మృషాభవము మోస,మోసము

తాత్పర్యము

కైకా! వాస్తవము చెప్పెద వినుము. శత్రురహితరాజ్యమును శ్రీరాముఁడు పొందినవాఁడై నీకొడుకును నడవులపాలైనఁ జేయును. లేదా చంపనైనఁ జంపును. ఇది సత్యమని నమ్ముము. నీవు మతిలేని దానవై యుపాయము నాలోచింపక నీయొంటి కొడుకును, బాలుని, వెనుకముందు తెలియనివానిని, మేనమామను జూచు నెపమున దూరము పంపితివి. ఇంతకంటె మతిమోస ముండునా.

చం॥ చెలఁగును స్థావరంబులను♦స్నేహము దాపున నున్నమాత్రనే,
చెలువరొ! రాజవర్యునకుఁ♦జెప్పెడి దేమిఁకఁ బుత్రులందు, నీ
వలనన పోయె నద్దియును, వారక నీసుతుఁ గూర్చుతమ్ముఁడేన్
మెలఁగిన నిందు నొక్కగతి♦మే లగు, నయ్యది యైన లేదుగా. ౨౯

స్థావరములు=వృక్షాదులు.

తాత్పర్యము

కొడుకు కొడుకేకదా భరతుఁడు సమీపమున నున్న నొక్కటి, దూరమున నున్న నొక్కటియా, యెందుండిన నేమి? యందువేమో అట్లులనరాదు. వృక్షములుకూడ నొకదానికొకటి నమీపమున నుండెనేని వానికిని స్నేహభావముపుట్టుచున్నది. అట్లుండఁగా రాజునకుఁ గొడుకులందు స్నేహభావము పుట్టుట చెప్ప నేల. నీకొడుకిందుండెనేని రామునందుఁగల ప్రీతి రాజునకు నీకొడుకునందును నుండును అప్పుడు రాజు రాజ్యము వీనికిత్తమా వానికిత్తమా యను నాలోచనయైన గలవాఁడగును. నీవలన నదియునులేక పోయెను. భరతుఁడు లేకుండినఁ బోనీ శత్రుఘ్నుఁడైన నిందుండిన భరతుపక్షము వహించి మాటలాడి యుండుటో వెంటనే భరతునకుఁ దెలుపుటో యేదైనఁ జేసియుండునుగదా.

అట్టులు గాకుండఁ జేసితివి అన్ని విధముల నీకొడుకునోట విషము నీవే పోసితివి. ఇట్టిదానవు నీవు తల్లివా?

కం॥ వినమా కాననసీమల, వనజీవులచేత నఱికి•పై వంబడఁ జా
లిన తరువులు ములుపొదరులు,
పెనఁగొని నికటమున నుంట•వెఱగొనకుంటల్. ౨౧౦

చెలఁగును స్థావరంబులను స్నేహము దాపుననున్న మాత్రమే యను దానిని వివరించి చెప్పుచున్నది.

తా త్ప ర్య ము

జనులచే నఱకఁ బడఁదగిన మ్రాఁకులు దట్టమైన కంపపొదలు చుట్టుకొని యున్న కారణముచే నఱకఁబడకయుండుట నీవు వినలేదా, ఫలవృక్షములచుట్టు కంపలు బలిసియుండెనేని రాలఁ గొట్టినను ఫలములు కంపలలోఁబడును గొట్టి యేమి లాభమని జనులు ఊరలనైన ఉవ్వరు.

శా॥ రామున్ లక్ష్మణుఁ డెప్పుడేమఱఁడు, శ్రీ•రాముండు సౌమిత్రి గా
రామారన్ దయఁ బోచు, నశ్వియుగ సౌ•భ్రాత్రంబు న ట్లెంతయున్
శ్యామా! వారల భ్రాతృవత్సలత వి•ఖ్యాతంబు, సౌమిత్రికి
న్రాముం డెప్పుడుఁ గీడు సేయఁ, డది మా•నం బోదు నీపట్టికిన్. ౨౧౧

అశ్వియుగము=ఇద్దఱు అశ్వినీదేవతలు-సౌభ్రాత్రంబు=మంచి సోదర భావము. అది=కీడు.

తా త్ప ర్య ము

శత్రుఘ్నుఁడుండిన మేలంటివే-వానియన్న లక్ష్మణుఁ డిందేయున్నాఁడుగా యందువేమో. లక్ష్మణుఁడు శ్రీరాముని నొకగడియైన నేమఱియుండువాఁడుకాఁడు. అట్టులే శ్రీరాముఁడు లక్ష్మణునినెంతో దయతోఁ గాపాడును. అశ్వినీదేవతల సోదరభావ మెట్టిదో రామలక్ష్మణుల సోదరభావ మట్టిది. ఇది లోకప్రసిద్ధము. లక్ష్మణునకు రాముఁడెప్పుడును గీడుచేయఁడు. నీకొడుకునకుఁ జేయక మానఁడు.

ఉ॥ కావున నీదుపుత్రునకుఁ•గార్యము మాతులునింటనుండియే
తా వనసీమ కేగుటయు,•తద్దయు నీకిది మేలు, రాజుగా
నీవిభుఁడే భవత్సుతుని•నెమ్మి నొనర్చిన ధర్మరీతి బే
లా! విను నీదుచుట్టలు చె•లం గెడివారు ప్రహృష్టచిత్తులై. ౨౧౨

ఈకారణముచే నిపుడు నీకొడుకు మేనమామయింటనుండి యట్టులే యిక్కడికి రాక యడవులపాలయిపోవుట క్షేమంకరకార్యము. వచ్చెనా చచ్చుట నిజము. కావున నట్లుసేయుట నీకును మేలే. రాజ్యము లేకున్నఁ గొడుకైన దక్కును. అటుగాక నీకొడుకే రాజాయెనా ధర్మరీతి నీచుట్టాలెల్లరు నెంతో సంతోషింతురు.

కం॥ బాలుఁడు నిత్యసుఖోచిత,శీలుఁడు సహజాఽహితుండు•సితేశున కే
లీల న్విభవచ్యుతుఁడై, బాలా! రామునకు లొంగి•భరతుఁడు బ్రదుకున్.

నిత్యసుఖోచిత శీలుఁడు=సర్వదాసుఖానుభవ స్వభావముగలవాఁడు-సహజాహితుఁడు=పుట్టువుతోడనే శత్రువైనవాఁడు-విభవచ్యుతుఁడై=సంపద లేనివాఁడై, లొంగి=లోపడి.

తాత్పర్యము

ఏమే! నాకొడుకు వనమునకుఁ బోవునంత దుస్థ్సితి యేమివచ్చెనేయందువేమో. వచ్చెనోయమ్మా! వచ్చెను. భరతుఁడు చిన్నవయస్సువాఁడు-కావున నెదుటివారి మాయలు మర్మములు తెలియనివాఁడు.ఎప్పుడు సుఖమునకుఁదగిన స్వభావముగలవాఁడు. కాని కష్టజీవిగాఁడు. ఆయనబుద్ధియెఱిఁగి రామునకుఁ జేసిన దోషమేదియు లేదు గాని నీకడుపునఁ బుట్టిన కారణముచే రామునిచే నాగర్భశత్రువుగాఁ దలంపఁబడువాఁడు. ఇట్టివాఁడు సంపదలేనివాఁడై దరిద్రుఁడై రామునకు లోపడి యాయన కూడిగములు చేయుచు నెట్లుబ్రదుకును?

కం॥ అడవిని సింహముబారిం, బడినగజమునట్లు రాము•బారిం బడు నీ
కొడుకు న్మనుమున్న వెసం, గడుకొని కానంగ నర్హ•కార్యము నీకున్.

తాత్పర్యము ౨౧౪

ఇచ్చటికి వచ్చి రామునకు లొంగి లొంగి వంగి వంగి దండములు పెట్టుచు చెప్పినట్టులెల్ల సేవలుచేయుచున్నను నేనుఁగునకు సింహమునకువలె సహజవిరోధముపోదు. కావున నిచ్చటికి వచ్చెనా సింహముబారికి నేనుఁగువచ్చినట్లే కాఁబట్టి యట్టి యాపదరాకుండ ముందుముందే భరతుని రక్షించుట యతని తల్లివగు నీకుఁ దగిన కార్యము. భరతునకు రాజ్యము వచ్చునట్లు చేసియైన రక్షింపు. అది నీకిష్టములేదాయెనా యడవులపాలు నగచాట్లపాలు చేసియైన రక్షింపు. ఉసురుండిన నుప్పమ్మి బ్రదుకవచ్చునని యందే యేకాయగసురులు తినియో బ్రదుకును. ఇక్కడికి రానేల తేరకు చావనేల? ప్రాణమంత చేఁదా?

తే॥ నీవు సౌభాగ్యగరిమను•నిక్కిపడుచు, గర్వమున ధిక్కరింపవే•పూర్వమందు
సవతి రామునితల్లి, నా•జాణయేల,యక్క సెల్లను నీపయిఁ•గ్రక్కకుండు.

తాత్పర్యము ౨౧౫

భరతు గతియట్లుండ నీ-ఇఁక నీగతి యాలోచింపు ఇంతకు ముందు దశరథుఁడు నావాఁడని సౌభాగ్యాతిశయముచేఁ బొగరెక్కినిక్కి నీల్గి పెద్దపెండ్లముఁ గదా యే వేళ కెట్లుండునో యని యాలోచింపక. రాముఁడు రాజాయెనా యామె చేయి మీఁద నాచేయి క్రిందగునని యైనయోజింపక, మిడిసిపడి యిప్పుడు రాజుగానున్న రామునితల్లిని నీ సవతిని నవమానించితివిగదా అది యంతయుఁ గౌసల్య మఱచి యిఁక చెల్లెలాయని నిన్నుఁ గట్టుకొని కౌఁగిలించుకొని ముద్దుపెట్టుకొను ననుకొంటివా. ఆమె యాఁడుపామువలెఁ గౌసల్యావిష

మంతయు నీమీఁదఁ గ్రక్కక యుండునా? నవ్వుచుఁ జేసినది యేడ్చుచు నను భవింపవలదా? మాతల్లిని నిది యింత కష్టపెట్టఁగదా యని రాముఁడు తలం పఁడను కొంటివా?

ఉ॥ అర్ణవమేఖలావలయ•మంతయు సాచలపత్తనంబుగాఁ
దూర్ణము కైవసం బగుడుఁ•దోయజలోచన! నీకుఁ బట్టికిన్
దుర్ణయవృత్తి రాఘవుఁడు•తోరపుఁగీడు ఘటించు నమ్ముమీ;
నిర్ణయమిద్ది, దైన్యమును•నీకుఁ బరాభవ మేల తప్పెడిన్? ౨౧౬

అర్ణవమేఖలావలయము=సముద్రమొడ్డాణముగాఁ గల భూచక్రమంత యును-సాచలపత్తనంబుగన్=పర్వతములతో పట్టనములతోఁ గూడినదిగ-తూర్ణ ము=శీఘ్రము-కైవసము=స్వాధీనము-దుర్ణయ వృత్తిన్=చెడ్డ రాజనీతి నను సరించి-తోరపుఁగీడు=గొప్పయపాయము-దైన్యము = దారిద్ర్యము, పరాభ వము=అవమానము.

తాత్పర్యము

శ్రీరామచంద్రుఁడు చాల మిగుల మంచివాఁడు. నాయందు భక్తిగల వాఁడు.భరతునకంటెఁమిక్కిలి ప్రియుఁడు అని యొత్తియొత్తి చెప్పితివి.నిజమే ఇదంతయు నెంతవఱకు? రాజ్యము తన స్వాధీనమగువఱకు. ఆ నిమిత్తమై వేసిన వేషమిది. అంతియెకాని నిజమైన ప్రీతిగాదు. కావున సముద్ర పర్యంత మైన భూచక్రము కొండలతో నగరములతోఁ దనస్వాధీనము కాఁగానే శ్రీరామ చంద్రుఁడు నీకు, నీ కడుపున బుట్టిన దోషమున నోరెఱుఁగని, భరతునకు గొప్ప ముప్పు కలిగించును. ఇది నిజము. నామాటనమ్ము. పశ్చాత్తాప పడకుము. వెనుకఁ జింతించుట వెఱ్ఱితనము. నీకు దారిద్ర్యము అవమానము తప్పవు.

కం॥ నీసవతికొడుకు రాజ్య,శ్రీసహితుం డైన భరతు•చేటు నీజం బౌ;
నీసుతుఁడు రాజ్యమేలఁ బ్ర,వాసిగరాముండుగా ను•పాయముఁగనుమీ.

ప్రవాసి=దేశాంతరవాసి.

తాత్పర్యము

కాఁబట్టి రాముఁడు రాజై యైశ్వర్యవంతుఁడాయెనా నీకొడుకునకు ముప్పె తప్పదు. కాఁబట్టి నీసుతుఁడు రాజ్యమేలునట్లు రాముఁడీ రాజ్యము విడిచి దేశాంతరము పోవునట్టు లాలోచింపుము. అట్లైన మీరిరువురు బాగుపడుదురు.

— ౯-వ సర్గము. కైక మంథరను శ్రీరామపట్టాభిషేకము విఘ్నము సేయ నుపాయ మడుగుట. —

చం॥ అనవుఁడుఁ గోపరక్తనయ•నాంబుజయై, నిడువేఁడి యూరుపుల్
కొన లిడఁ, గేక యాత్మభవ•కుబ్జఁ గనుంగొని పల్కు, నిప్పుడే

వనములపాలు సేసి రఘు•వర్యుని రాముని, యౌవరాజ్యమం
దనువుగ నిల్పఁ జేసెదను•దొయ్యలి చెచ్చెర నాతనూభవున్. ౨౧౪

కోపరక్తనయనాంబుజ=కోపముచే నెఱ్ఱనైన కమలములవంటి కన్నులుగలది. కైక స్వభావము చేతనే సాధుహృదయము కలదిగాదు. అయినను శ్రీరామచంద్రుని కల్యాణగుణము లామెగుణములను మఱుఁగు పఱిచి నిప్పును బూడిదతోఁ గప్పినట్లు చేసెను. ఇప్పుడు మంథర చేసిన దుర్బోధనలు పెనుగాలికి బూడిద యెగిరిపోవునట్లు చేయఁగా మరలనగ్ని ప్రకాశించునట్టామె సహజ దుర్బుద్ధి ప్రకాశింపసాగెను.

ఆమె యిట్టు లాలోచించెను. రామునకుఁ బట్టాభిషేక మాయెనా రాజమాతయగు కౌసల్య లోకుల చేతను రాజుచేతను సవతులచేతను, పరిచారికల చేతను విశేషించి గౌరవింపఁబడుట నిజము అప్పుడు నన్ను గౌరవించు వారుండరు. కావున జీవింపఁ గోరితినా దాసికలలో నేనొక దాసిని గాపలసినదేకదా. ఇన్ని దినములు నాచేఁ బరిభవింపఁబడుచుండినది నాసవతి తన కధికారము వచ్చిన నన్ను గౌరవించునా? తప్పక యవమానించును. ఆ యవమానము నేనెట్లు సహింపఁగలను? సమయజ్ఞుఁడైన శ్రీరామచంద్రుని వినయము శుశ్రూషలోనైనవి కార్యసాధకోపాయములు గావున సత్యములని రాజైనపుడిటులే వర్తించునని యేమి నమ్మకము? ఇదంతయు బూటకముగాదనుట కేమి ప్రమాణము? అని యిట్టు లాలోచించుటచే మనస్సు విఱిగెను. భోజరాజునకైన బోదనలు చెడ్డవని సామెత కలదుగదా? తాత్పర్యము

అని చెప్పఁగాఁ గైక తన సవతికిఁ దన్ను దాసిగాఁజేయ రాజాలోచించెఁగదాయను కోపముచేఁ కన్నులెఱ్ఱగాఁజేసి దీర్ఘములై వేఁడియైన యూర్పులతిశయించుచుండఁ గుబ్జముఖముఁజూచి యిట్లు చెప్పెను. ఓసి మంథరా యిదిగోఁ జూడుమిపుడే శ్రీరామచంద్రుని నడవులపాలుచేసి యీ నిమిషమందే నాకొడుకునకుఁ బట్టాభిషేకము చేయించెదను.

ఉ॥ ఏవిధినైన రాజ్యపద•హీనునిఁ జేయఁగ రామచంద్రు, గో
త్రావిభుతాతిరేకమున•రాజిలఁ జేయఁగ నాతనూజు, నా
కేవెర వొప్పఁ జెప్పఁ గద•వే సదుపాయ మొకండు మంథరా!
నావుడుఁ బాపకార్యరచ•నాచణ మంథర కైక కిట్లనున్. ౨౧౫

గోత్రా విభుతాతి రేకమునన్=భూమి ప్రభుత్వముయొక్క యతిశయముచే. ఏ వెరవు=ఏయుపాయము - పాపకార్యరచనాచణ = పాపపుఁ బనులు చేయుటయందు చమత్కారము గలది చణశబ్దభవము జాణ.

తాత్పర్యము

మంథరా! న్యాయ్యమార్గమో యన్యాయమార్గమో యెట్టులో యొకట్లు శ్రీరామచంద్రుఁడు రాజ్యపదవిలేని వానిఁగను నాకొడుకు రాజ్యప్రభుత్వముచే

నతిశయించినవానిఁగను జేయవలయును. దీనికై మంచి యాలోచనచెప్పుము అని చెప్పఁగా నెగ్గులజాణ యగు కుబ్జ కైకతో నిట్లనియెను.

కైకేయీ మంథరల నడవడి వలనఁ బాపసహవాసమువలన నుభయలోకముల హానిగలదని యేర్పడుచున్నది. సజ్జన సజ్జన సహవాసము చందనమునఁ బచ్చకర్పూరము గలిసినట్లు, దుర్జన దుర్జన సహవాసము బంగాకుతో నుమ్మెత్త కలిసినట్లు. సహవాసము చెడ్డదిగాదు. అది మంచినీళ్ళవంటిది. మంచినీళ్ళు మామిడిచెట్టునకుఁ బోసిన మంచిఫలములు ఫలించును. ముష్టి చెట్టునకుఁ బోసిన ముష్టిపండ్లే కాయును. అట్టులే సజ్జన సహవాసము క్షేమంకరము దుర్జన సహవాసముపద్రవకరము. ఒకఁడటు లొకఁడిటులుండిన నా మైత్రి నిలువదు. సాధువుగాక దుష్టుఁడుగాక మధ్యస్థుఁడుగనుండువాఁడు సజ్జన సాంగత్యముచే బాగుపడును. దుర్జన సాంగత్యముచేఁ జెడును. తిలలు నీళ్ళు వస్త్రంబు లేవాసన గలవిగాకున్నను మంచి వాసనగల పూలులోనగు వానితోఁ జేరిన నవి మంచి వాసన గలవేయగును. దుర్వాసనగల పదార్థములతోఁ జేరిన దుర్వాసన గలవే యగును. దుర్జన సహవాసమువలన సాధువునకును గీడుగలుగును. మడుఁగులో పాముచేరిన చేపలఁ కుపద్రవమగును. కావున సహవాసము చేయుటయందు మనుజులు హెచ్చరిక గలిగి యుండవలెను. నైమిత్తిక స్నేహము స్నేహముకాదు. ఇది యమృతమునకై దేవతలు రాక్షసులు స్నేహపడినటువంటిది. ఈగ్రంథకర్త యీ యుభయ విధస్నేహఫలము లనుభవించిన వాఁడే.

చం॥ బళిర బళీరె యొండుసదుపాయము నీసుతుఁ డొంద రాజ్యమున్
దెలియఁగ లేవుగా యిదియుఁదెల్పెద విన్ము భవద్ధితార్థమున్,
దెలిసియు విస్మృతిం గనితొ? తెల్పక దాఁచెదొ నీ వెఱింగియున్?
జెలువరొ నీవె పూర్వమునఁ జెప్ప వొకో పలుమాఱు నర్మిలిన్. ౨-౩

భవద్ధితార్థమున్=భవత్=నీయొక్క, హిత=మేలైన, అర్థము=ప్రయోజనము, విస్మృతి=మఱపు, అర్మిలిన్=ప్రేమతో, బళి బళిరే=ఇవి సంతోషమును సూచించును-మన యుద్దేశము నెఱవేఱునుగదా. రామాభిషేకము విఘ్నపడును గదా యని సంతోషము.

తాత్పర్యము

బలేబలే. కైకా ఇపుడు నీవు నిజమైన యాఁడుదానవు. తెలివిగలదానవు. తనమేలు తానాలోచింపని దది యేమియాఁడుది. నీకొడుకునకు రాజ్యము వచ్చు నుపాయము నీకుఁదెలియలేదుగా. నీకు మేలైన ప్రయోజన మదియు నేనే తెలిపెద వినుము. కాదుకాదులే. నీకుఁ దెలియకయున్నదా. తెలిసి మఱచిపోయితివో నాతెలివితేటలు తెలిసికొన దాఁచి నన్నుఁ బరీక్షించెదవో నీవే పూర్వము నాకెన్ని మాఱులో యొకవిషయము చెప్పితివే. అది నీకుఁ దెలియదని నేనెట్లుతలంపఁగలను.

కం॥ నామాట వినఁగ నభిరుచి, భామిని! నీకున్న దేని•పలికెద నుపమన్
ధీమతి వై విను సర్వం, బామీఁద విమర్శ సేయు•మా యెద ననుచున్
అభిరుచి=ప్రీతి, ఉమ=ఉపాయము. ౪-౧

తాత్పర్యము

నామాట నీకు రుచించునా? నీమాటయేనీదికాని-నానోటిమాట దీసికొని నన్నగడు చేయుటకా. అటుగాదు నా స్తవముగానే యడుగుచున్నదాన నంటివా యుపాయము చెప్పెదను. నేనుజెప్పినానని నీవంగీకరింపవలసినపనిలేదు.నాకుఁ దోఁచినది నేనుజెప్పెదను. నీవు చక్కఁగ నాలోచించి సరియైనదని నీకుఁదోఁచెనా చేయుము. లేదా వదలిపెట్టుము. నాయిష్టప్రకారమే చేయుమని నేను నిన్ను బలవంతపెట్టరాలేదు. నీయుప్పుదిన్న కారణముచే నీకు మేలుచెప్పుట నావంతు గాని రాణివగు నిన్ను బలవంతపెట్ట నేనెవ్వతను? నేను జెప్పినది నీకు రుచించి నను మంచియుపాయము మంచియుపాయమని యుత్సాహపడి కేకలు వేసినను ప్రయోజనములేదు. ఆయుపాయము కార్యరూపముగఁ బరిణమింపఁజేయు టెట్లో యదియు నాలోచింపుము.

చం॥ పలికెడికుబ్జఁ గాంచి తన•పానుపునుండి యొకింత లేచి తొ
య్యలిమిహి దాని కిట్టులను•హర్షవికాసముఖారవింద యై
పలుకవె మంథరా! యొకయు•పాయము నాసుతుఁ డే ప్రభుత్వ మీ
యిలకు వహింపఁగా జనక•జేశుఁడు కూడనెకూడ దెట్టులున్. ౪-౨

తొయ్యలిమిహి=స్త్రీలయందు శ్రేష్ఠురాలు-నాసుతుఁడే=నాకొడుకే మఱి యెవ్వఁడు గాఁడు-పొత్తునుగాదు. పానుపునుండి లేచుట సావధానత్వమును దెలుపును.

తాత్పర్యము

తనుక మంథరకిచ్చి మరల పండుకొనినకైక మంథరమాటలు వినివిషయ మందలి యాదరముచేఁ గొంచెముగా లేచి సంతోషముచే వికసించిన కమలము వంటి ముఖముగలదై మంథరా నాకొడుకునకే రాజ్యమురావలెను. రామునకుఁ బట్టాభిషేకము గాఁగూడదు. నేను నిజముగా నడుగుచున్నాను. ఉపాయము చెప్పుము. తప్పక చేసెదను. నామేలుగోరి నీవు చెప్పినపుడు నిన్నేల యగడు చేసెదనే. తేరకు భయపడెదవు? కార్యముదెలిపినదానవు. దాని సాధించు నుపా యము నీవే తెలుపుము?

కం॥ అనఁ గైక పాపదర్శిని, విని మంథర రామచంద్రు•విభవాతిశయం
బును జెఱుపఁగోరి యిటు లను,దనదేవికి హర్ష మాత్మఁ•దళు కొత్తంగన్.
పాపదర్శిని=పాపపుటాలోచనగలది. ౪-౩

శ్రీరామచంద్రు విభవాతిశయముఁ జెఱుపఁగోరి యనుటచే మంథరకు, గావలసిన ముఖ్యప్రయోజనము రామాభిషేక విఘ్నమేయనియు, భరతాభి షేకనము ముఖ్యము గాదనియు నెఱుంగనలయును. రామాభిషేక విఘ్నము మాత్రము కైకకోరిన దశరథుఁడు రామునకును రాజ్యమీయను

నీకొడుకునకు రాజ్యమీయ ననినను, భరతుఁడు రాజ్యమక్కఱలేదనినను, కైక యేమిచేయఁగలదు ఇది సందిగ్ధవిషయము. మొదటిది నిశ్చయము. దేవతలకు మంథరకుఁ గావలసిన దదియే.

తా త్ప ర్య ము

అని కైక యీప్రకారము చెప్పఁగా విని పాపసంకల్పముగల మంథర శ్రీరామచంద్రుని వైభవముఁ జెఱుపఁగోరి తనరాణికి సంతోషమతిశయించునటు లిట్టు చెప్పెను.

—• {మంథర కైకకు శ్రీరామపట్టాభిషేకము విఘ్నముసేయ నుపాయంబుఁ జెప్పుట.} •—

ఉ॥ రాజును నీవు పోరె సుర•రాజు సహాయతఁ గోర, దేవతా
రాజియు రాక్షసాళి సమ•రం బొనరింపఁగ, శక్రు శంబరుం
డాజి జయింపనుండ శమ•నాశను దండకఁ బట్టిశాత్రవో
ద్వేజకవృత్తి డాయఁ బర•వీరుపురంబగు వైజయంతమున్. ౬-౭

సహాయత=సాహాయ్యము, ఆజి=దశరథుఁడు-శమనాశను-దక్షిణదిక్కు, శాత్రవోద్వేజకవృత్తి=విరోధులకు భయంకరమైన వ్యాపారము-దాయన్=సమీపింపఁగా.

తా త్ప ర్య ము

దేవతలు రాక్షసులతో యుద్ధముచేయు సమయంబున నింద్రుఁడు నీ మగనిని దమకుఁ దోడుగారమ్మని కోరెనాలేదా? అప్పుడు దక్షిణదిక్కున దండ కారణ్యమందుండు పగవాఁడైన శంబరుని పట్టనమగు వైజయంతము మీఁదికి శత్రువులు భయపడునట్లు నీమగఁడు యుద్ధమునకుఁబోవ నీవాయనతోఁడ బోయితివాలేదా?

మ॥ శతమాయుండు తిమిధ్వజాసురుఁడు, త•త్సంగ్రామరంగంబునన్
క్షతులన్ విక్షతులైనవారలను ర•క్షస్సంఘ ముద్వృత్తిని
ద్రితులన్ రాత్రుల బట్టి చంపు నెడలన్•దేవీ! భవద్వల్లభుం
డతిరౌద్రంబుగఁ దాఁకిన స్దనుజు ల•త్యంతంబు నొప్పించినన్. ౮-౯

శతమాయుఁడు=నూఱుమాయలు నేర్చినవాఁడు, ఇచట నూఱనఁగా ననేకములని యర్థము. పరులనువంచించు విద్యవలనఁగలుగు శక్తిమాయ. ఈ విద్యలు పెక్కులుగావున నూఱనియేయని చెప్పఁబడును. తిమిధ్వజాసురుఁడు=తిమిధ్వజుఁడను రాక్షసుఁడు వీఁడేశంబరుఁడు. పద్యుమ్నుని హరించుకొని పోయిన శంబరుఁడు వీఁడుగాఁడు. వీనిపేరుగల మఱియొక రాక్షసుఁడు. దశరథుఁడు తిమిధ్వజునితో యుద్ధముచేయఁగా శ్రీరాముఁడు శంబరుని కొడుకుతో యుద్ధముచేసి జయించెను. అయోధ్య, ౧౧౮౩-వ స. నందలి సుమిత్రాదేవి వాక్యములవలనఁ దెలియనయ్యెడిని. తిమిధ్వజుని మఱియొక పేరు శంబరుఁడు. శంబరులన్నవారు పెక్కురున్నట్లు తెలియవచ్చెడినిఁ శంబరుఁ డనువాఁడు ప్రహ్లాదునిపై మాయలు ప్రయోగించినట్లు విష్ణుపురాణమునఁ

చ్ఛంబర స్యాశుగామినా. బాలస్య రక్షతా దేహ, మేకైకంచనిషూదితమ్. వి.పు. ౧౯-౨౦. క్షతులన్=బాణశూలాదులచే గాయపడినవారు. విక్షతులన్=ఖడ్గపరశు పట్టనములచే బాగుగఁ గొట్టఁబడినవారు-రక్షస్సంఘము = రాక్షససమూహము-ఉపవృత్తిన్=దుష్టవ్యాపారముచే-నిద్రితులన్= పగలుయుద్ధమున దెబ్బలుతిని రాత్రివేళ నిద్రించువారిని, గాయపడి బాగుగఁ గొట్టఁబడి నిద్రచెంది యుద్ధము చేయని వారినిఁ జంపఁబూనుట దుష్టవ్యాపారముగదా.

చం॥ వెఱచిన వానిదైన్యమున వేఁడుఉచెందినవాని నిద్రవై।మఱచినవాని,సౌఖ్య
ముననమద్యము ద్రావినవాని, భగ్నుఁడై।పఱచినవాని,సాధుజడ భావము వా
నిని,గావుమంచువా।చఱచినవానిఁ గామినులఁజంపుట ధర్మముగాదు ఫల్గునా

తాత్పర్యము

నూఱుమాయలవాఁడు శంబరుఁడు (వీనిపేరే తిమిధ్వజుఁడు) ఆయుద్ధభూమియందు రాత్రివేళ గాయములు దగిలినవారిని-దెబ్బలుదిని పడిపోయినవారిని నిద్రించుచున్నవారిని వానిసేనాభటులగు రాక్షసులు ధర్మముతప్పి వధించుచుండఁగా దశరథుఁడు మిక్కిలి భయంకరమైనరీతిని వారినెదిరించి పోరుసమయంబున రాక్షసులచే ఘాతపడి దశరథుఁడు రథముమీఁదనే మూర్ఛపోయెను.

ఉ॥ ప్రాలుడు, గాయము ల్వడిన•ప్రాణవిభుం గని తచ్ఛతాంగముం
దోలుచు దవ్వుగాఁగ రణ•దోహలుఁ గావవె నీవు? తత్స్థలిన్
దూలక రాక్షసు ల్గడఁగ•దూరముగాఁ గొనిపోయి కావన
వ్వేళ వరద్వయంబు పృథి•వీపతి నీకు నొసంగఁడే సతీ! ౨౨౯

తత్శతాంగము=ఆ తేరిని, రణదోహలున్=యుద్ధమునందు మిగులనాసక్తిగలవానిని, తత్స్థలిన్=దూరముగా నిలిచిన స్థలమందు,వరద్వయంబున్=రెండు వరములను.

తాత్పర్యము

ఇట్లు సోలి గాయములుపడిన భర్తను హతసారథిగల యారథమునుజూచి యుద్ధాసక్తుఁడైన యాయన నాపదనుండి తొలఁగింపఁగోరి యాతేరిని యుద్ధభూమినుండి దూరముగాఁ దోలికొనిపోలేదా. అచ్చటికిని దఱుముకొనివచ్చిన రాక్షసుల బారిని బడకుండ నతని దప్పించి వేఱొక రహస్యప్రదేశమునకుఁ దోలుకొనిపోలేదా. ప్రాణాపాయమునుండి రెండుమార్లు దప్పించుటచే నీకు రెండువరంబు లిచ్చెదను.

చం॥ జలజదళాక్షి! యిష్ట మెది•సంతస మారఁగఁ జెప్పు మన్న నే
వలసినవేళఁ గోరుకొన•వచ్చునె నా నటు గాక యంచు నీ
చెలువుఁడు పల్కె నంచు మును•చెప్ప వొకో మఱ పెట్లు వచ్చెనే?
కలికిరొ! నీహితైషిణిని•గావుట నిల్పితి నాత్మ నీకథన్. ౨౩౦

జలజదళాక్షి=కమలములవంటి కన్నులుగలదానా! హితైషిణిని = మేలు కోరినదానను, చెలువుఁడు=ప్రియుఁడు. అటుగాక=అట్టుకానిమ్ము.

తాత్పర్యము

నీవు కోరునవి యేవో సంతోషముగఁ గోరుకొమ్మన నిప్పుడు నాకుఁ గోరఁ దగిన దేదియు లేదు. నాకక్కఱపడి యిష్టమువచ్చినవేళఁ గోరుకొనవచ్చునా యని నీవన నట్టులే కోరుకొమ్మని రాజు చెప్పలేదా. ఈవృత్తాంతమునీవే నాకుఁ జెప్పలేదా. నీవిదియెట్లు మఱచితివే? నీవు మఱచినను నీమేలుకోరినదాననగు టచే నేను జ్ఞప్తియందుంచుకొనియే యున్నదానను.

—•మంథర కైకకు రాజుపైఁ గోపము వచ్చినట్లు నటింప బోధించుట•—

శా॥ అంభోజాయతనేత్ర! నిన్విభుఁడు డాయ న్వచ్చిన న్నిండువి
శ్రంభం బారఁగఁ గోరుమా వరములన్•రామాభిషేక క్రియా
సంభారంబులు మాన్ప, నీభరతు రా•జ్య ప్రాప్తిఁ, బ్రవ్రాజనా
రంభం బొప్పఁ జతుర్దశాబ్దములు శ్రీ•రాముండు గానం జనన్. ౨౨

అంభోజాయతనేత్ర=కమలములవలె దీర్ఘములైన కన్నులుగలదానా! విశ్రంభము=నమ్మకము-ప్రవ్రాజ నారంభము = దేశాటనకార్యము-చతుర్దశాబ్దములు=పదునాలుగు సంవత్సరములు, కానన్=అడవులకై-అంభోజాయతనేత్ర యనుటచే వికాసము నొందిన కన్నులుకలదనియు ఆ వికాసమునకు సంతోషము కారణమనియు ఆ సంతోషమునకు వరములు జ్ఞప్తికి వచ్చుటయనియు నెఱుంగ నగు.

తాత్పర్యము

కమలాక్షీ! నీమగండు నీకు రెండువరములు ఋణపడియున్నాఁడుగదా. వానిని వినియోగించు విధానము చెప్పెద వినుము. పట్టాభిషేకమునకై చేయు కార్యములన్నియు రామునకైగాక నిలిపి భరతునకుఁజేసి రాజ్యమాయన కిచ్చుట యొకటి. రెండవది పదునాలుగు సంవత్సరము లడవులయందు రాముఁడు సంచరింపఁ బోవుట. ఈరెండువరములు కోరుకొనుము. పరిణయ కాలమందిచ్చిన వరమును బ్రస్తావింపక యుద్ధవేళనిచ్చిన దానిని బ్రస్తావింప నేల? వారి జాక్షలందు వైవాహికములందు....బొంకవచ్చు'. 'ప్రాణాతురుఁడై నచోఁ బరిణయంబులపట్లను బల్కు బొంకు సత్యాతిశయంబయింద్రడు' భార. అని న్యాయముండుటచే వివాహకాల వరమును గోరిన దశరథుఁడది పాటింపక పోవునేమో యని దానిని బ్రస్తావింపలేదు అదియునుగాక దానివలన భరత రాజ్య ప్రాప్తి ఘటిల్లునేమోకాని శ్రీరాము నరణ్యవాసము ప్రాప్తింపదు. రెండ వది లేక మొదటిది వ్యర్థము. అనర్థకరము.

కం॥ పదునాలుగువర్షంబులు, వదలక రాముండు వనుల•వనటంబడఁగా
మది స్నేహము స్థిరపడియెడి, ముదితా! నీసుతునెడాట•మునలోకులకున్.

వర్షంబులు=ఏఁడులు, ఎడాటమున=విషయమున, నృసింహపురాణమునఁ బంద్రెండు సంవత్సరములనియే యున్నది.

తాత్పర్యము

భరతునకు రాజ్యమిచ్చినఁ జాలదా. శ్రీరాముని నేల నిష్కారణముగ నడవులపాలు చేయవలయునందువేమో. ఇప్పుడు ప్రజలకందఱకు శ్రీరాము నందు విశేషప్రీతి. భరతుఁ డెచ్చటనుండియో యిపుడు వచ్చి నేనురాజు ననఁగానే వానియందు లోకులకు నెట్లు ప్రీతికలుగును; కావున శ్రీరాముఁ డీదేశ మందుండెనా ప్రజలందఱు రామునకు వశులై భరతుని పదభ్రష్టునిఁ జేయుదురు. కాఁబట్టి శ్రీరాముఁ డరణ్యములకుఁ బోయి యందేయుండిన రాజ్యము నిష్కంటముగ భరతునకు వశపడును. పదునాలుగు సంవత్సరము లట్లు జరగెనా భరతునందుఁ బ్రజలకుఁ బ్రీతి కలుగును. లోకులు ప్రకృతివర్గము భరతునకు వశులగుదురు. కావున రాముఁడు అంతదాఁక బ్రదికి మరలివచ్చినను భయములేదు.

పంద్రెండేండ్ల గడువు మీఱిపోవును. రాజ్యమునాది యనుటకు వలను పడదు. కావున నీరెండువరములు నీవు కోరవలయును.

ఉ॥ కింక వహించి స ట్లిపుడ • కేకయరాజతనూజ! పోయి ప
ర్యంకము లేక, కోపభవ • నాంతర ముం దొక మైల గట్టి, లో
జంకక, నేలఁ బండి, పతి • సన్నిధిఁ జేరిన నేడ్చు చుండుమీ
బొంకుగ, వానివంకఁ గనఁ • బోకుమి, పిల్చినఁ బల్కకుండుమీ. ౨౩౦

కింక=కోపము, పర్యంకము=పానుపు, కోపభవనాంతరము = కోపము వచ్చునపు డుండు నింటిలో, మైల=మాసినచీర, బొంకుగ=అసత్యముగ, కేకయ రాజతనూజ=కేకయరాజు నీతల్లి నేగతిఁ బట్టించెనో నీవు నాగతి పట్టకుండ హెచ్చరికగ నుండుము.

తాత్పర్యము

కేకయరాజు కూఁతురా! నీవు దొరసానివలె నీవిధముగఁ బానుపుమీఁదఁ గాలిమీఁద గాలు వేసికొని కూర్చుండి రాజు రాఁగానే నీవు యుద్ధవేళ నిచ్చిన వరము లిపుడిమ్ము. రామునరణ్యమునకుఁ బంపుము. రాజ్యము భరతునికిమ్ము. అంటివా నీతల్లికి నామెభర్తచే నేగతి గలిగెనో యాగతియే నీకుఁగలుగును కాఁబట్టి నీవు చేయవలసిన కార్యము అడుగవలసిన విధముఁ జెప్పెద వినుము. కోపము వచ్చినదానివలెనే కోపగృహమునకుఁ బోయి పానుపుమీఁదఁ బరుండక నేలఁమీఁద బ్రాఁతమాసిన చింపిగుడ్డ కట్టుకొని పండుకొనియుండుము. నీమగఁడు నీదగ్గరకు వచ్చెడి సడి తెలిసి కాలిచప్పుడు వినఁగానే వగలేడ్పులేడ్చు చుండుము. చీఁకటియిల్లు గావున నీకంట నీరు వచ్చెనో లేదో వగలేడుపో నిజ

మైన యేడుపో యతఁడు తెలిసికొన లేఁడుతే వాఁడు పిలిచినను వానివంక ముఖము ద్రిప్పకుము. ముఖము ద్రిప్పితివా నీముఖముఁజూచి వగ లేడ్పులని తెలిసికొనును పిలిచినను బలుకకుము. కంఠస్వరముఁబట్టి తెలిసికొనును. కావున జాగ్రత్త. మర్మము తెలియనీయకుము.ముసుఁగు బిగించికొని పండుకొనుము.

శా॥ నీ కెంతే మదిఁ గూర్చు వల్లభుఁడు సం•దేహంబు లే దింతకున్,
 నీకై నిప్పుల దూఁకు మన్న దుముకున్•నిర్నిద్ర రాగంబునన్,
 నీకోపంబును జూడ లేఁడు తరుణీ•ని నల్లఁగాఁ జేయునే?
 నీకై ప్రాణము లైన బోవ విడుచు•న్నిక్కంబుగా సుందరీ. ౼౩౧

ఎతేన్=మిక్కిలి, కూర్చున్=ప్రేమగలవాఁడగును, నిర్నిద్రరాగంబునన్= నిద్రలేని ప్రేమచే, అనఁగా ప్రేమయందు దేలోపములేదు,తరుణీ=ప్రాయపుదానా

తాత్పర్యము

సుందరీ! నేనిట్లువగలవారివేషము వేసి కోపించితినేని రాజు నామీఁదఁ గోపించి యీ పెంకెతో నాకేమి ఇది గాకున్న నాకేఁకఁ బెండ్లాలు లేరా యని వెడలి పోవునేమో. క్రొత్తనీళ్లు వచ్చి ప్రాఁత నీళ్ళుకూడఁ బోయినట్టు లిప్పటి ప్రేమయుఁ దొలఁగునేమోయని సందేహింపకుము. నీప్రియుఁడు నీయందెంత యో ప్రేమము కలవాఁడు. సందేహము లేదు. నీయందుండు ననురాగ విశేష ముచే నిప్పులలో దూఁకుమన్నను దూఁకును. అది తనకుఁ బ్రాణహానికరమని కూడఁదలఁపలేఁడు. నీసంతోషమునకై యంతటి దుష్కరకార్యము చేయువాఁడు నీకుఁ గోపమువచ్చు కార్యముచేయునా? నిజముగా నీకై ప్రాణము లిమ్మనిన నిచ్చును. ఇఁక నీవరము లేమాత్రము. ఇంత గట్టి నమ్మకము. నీకెట్లు గలిగె నందువేమో. నీవు సుందరివి మంచిప్రాయమందున్నదానవు. మగవారు స్త్రీల దేహసౌందర్యముచూచి వశపడుదురేకాని మనస్సులు చూచికాదు. అతనికిఁ గాన వచ్చునది నీదేహ సౌందర్య మేకాని నీమనస్సులోపలి విషయముగాదు. ఆకాము కుఁడు నీ సౌందర్యదాసుఁడుగాని గుణదాసుఁడుగాఁడు. కావున నిట్టి రూపవతిని వయోవతిని విడిచి ముసలి భార్యలయొద్ద కేమని పోవును? త్యతేదంత్యకులో ద్భూతాం వృద్ధస్త్రీం కన్యకాం త్యజేత్.

చం॥ తలఁకకు నీదుమాట జవ•దాఁటఁడు నీదుమగండు, చెల్వపుం
 బల మది నీకు నుండుటయు•బాలిశురాల యెఱుంగలేవుగా?
 వెలగలము త్తెముల్ పసిఁడి•విశ్రుతరత్నము లెన్ని యిచ్చినన్
 దొలఁతిరో! వానిపై మనసు•పోవఁగ నీకు, తలంపు కార్యమున్. ౼౩౨

తలఁకకు=చలింపకుము, చెల్వపుంబలము = సౌందర్యబలము, బాలిశ రాల=మూఢురాలా.

తాత్పర్యము

సందేహముచేత మనస్సు చలింపనీకుము. నీమగఁడు నీమాట మీఱఁడు. దానికిఁ గారణము నీసౌందర్యబలమే. ముగ్ధురాలా! నీకట్టిబలముండుటయు నీవాలోచింపలేకున్నదానవు. నీవీవరములు గోరినపుడు వానిని దప్పింప రాజు నీకు వెలగల మంచిముత్తెములు బంగారుప్రసిద్ధములైన రత్నములు నెన్నియో యిచ్చెదనను. వానికై యాశపడి యనుకొన్న కార్యము చెఱుప కుము. పూనిన పనినే మనస్సున దృఢముగ నుంచుకొనుము. మఱచితివా నీకు ముప్పుతప్పదు. జాగ్రత్త.

కం॥ దేవాసురరణమున ధా,త్రీవల్లభుఁ డొసఁగినట్టి•రెండువరంబుల్
నీవతనిం దలఁపించిన నీవలచిన కార్యమెల్ల•నెఱవేఱుఁ జుమీ. ౨౩౩

తలఁపించినన్=తలఁపునకు వచ్చునట్లు చేసితివేని.

తాత్పర్యము

దేవతలకు రాక్షసులకు జరిగిన యుద్ధమందు నీకతఁడిచ్చిన రెండువర ములు ముందు జ్ఞప్తికిఁ దెచ్చితివా నీవు తలపెట్టిన కార్యము తప్పకయగును ఏలన నాహా యిది నాప్రాణము గాపాడినదికదా. ప్రాణదానము చేసినదానికి నదికోరిన వరములీయక యెట్లు కృతఘ్నుఁడనగుదును. ఎట్లసత్యవాది నగుదు నని యాలోచించి నీకోరికలు నెఱవేర్చును.

ఉ॥ లాలన చేసి నిన్ను సువి•లాసిని తీర్చెదఁ గోర్కు లన్న భూ
పాలుని సత్యపాశచయ•బద్ధునిఁ దొల్త యొనర్చి వేఁడు మీ
లీల నరేంద్ర! రాముఁ దర•లింపుము వే పదునాలు గేండ్లర
ణ్యాళిఁ జరింపఁగా, భరతు•నాదట• బట్టము గట్టు ధాత్రికిన్. ౨౩౪

లాలనచేసి=బుజ్జగించి. ఇదిచరిత్రాదులలోఁ జేరినది-లాలనమున బహు దోషములని పోతనామాత్య ప్రయోగము. ౧౦ స్కం. లాలనక్రొత్త బెబ్బులి కలాసము అని శ్రీనాథుఁడు సత్యపాశచయ బద్ధునిన్ = ప్రమాణము లను త్రాళ్ళచేఁ గట్టఁబడినవానిఁగా, తొల్తన్=మొదట తరలింపుము = బయలుదేఱి పోవునట్లు చేయుము ఆదటన్=ప్రేమతో.

తాత్పర్యము

సువిలాసినీ! నిన్నురాజు కృతజ్ఞుఁడై బుజ్జగించి నీకేమి వరములు కావ లయునని యడిగినఁ దటాలున నాకీరెండు వరములు కావలెనని చెప్పకుము. తొలుత యుద్ధవేళ నిచ్చినవరము లిప్పుడిచ్చెదనని ప్రమాణబద్ధునిఁ జేయుము. అట్టి ప్రమాణము చేయించుకొని యావల శ్రీరాముఁ డరణ్యమునఁ జరింపఁ బోవునట్లు ప్రీతితో భరతునికిఁ బట్టము గట్టునట్లు కోరుము.

భరతునికి రాజ్యము వచ్చినఁజాలునని రామప్రవాస ముపేక్షించునేమో యని తనకుఁగావలసిన దానిని ముందుగఁ జెప్పెను.

ఉ॥ రాము నరణ్యవాసమునె◆రాజముఖీ! చలపట్టి కోరుమీ,
రాముఁడు కాన కేగ సుక◆రం బగు సర్వము, నీతనూజుఁ ద
న్వీ! పతి గొల్చు మూలబల◆మెల్ల ధ్రువం బగుభక్తిభీతులన్,
రాముఁడు కానలోనన వి◆రామత నొందు నిజంబు చూడుమీ. ౨౩౫

చలపట్టి=చలముపట్టి-విరామత=మరణము.

తాత్పర్యము

మీఁదఁ జెప్పిన శ్రీరామారణ్యవాసమునే మఱింతనొక్కి చెప్పుచున్నది. చంద్రముఖీ! నీవు చలపట్టి హఠముచేసి ముఖ్యముగఁ గోరవలసినది రాము నరణ్యవాసమేసుమా! శ్రీరాముఁడడవులకుబోయెనా సర్వము సులభమగును. అతఁడు పోకపోయెనా భరతునకు రాజ్యము వచ్చినను ననర్థకరమే శ్రీరామచంద్రుఁడులేని యెడల మూలబలమంతయు నెవఁడు రాజైన మనకేమిమనము చేయవలసినది సేవయేకదా. అది రాజుగానుండువానికే చేయుదము అని రాజభక్తితోనుసేవచేయకుండిన దండించునేమో ఉద్యోగమునుండి తొలఁగించునేమో యను భయముచేతను భరతునకు వశపడియుండును. రాముఁడో యరణ్యములోనే చచ్చును. ఇది నిజము. అట్లైనచోఁ బదునాలుగేండ్లని మితియేల? శ్రీరామచంద్రుఁడు శాశ్వతముగా నరణ్యములయందే యుండగోరరాదా యందువేమో యదిసరిగాదు. కాలపరిమితి యుండినయెడల గడువు తీరఁగానే రావచ్చునని శ్రీరాముఁడును. మరలి వచ్చునని ప్రజలును సమ్మతింతురు. శాశ్వతముగఁ గోరితివా శ్రీరామునందు నాశమాని ప్రజలెల్లరిపుడే తిరుగఁబడుదురు. శ్రీరాముఁడు నంగీకరింపఁడు. భరతుఁడా యిచ్చట లేఁడు. రాజా ముసలివాఁడు. ప్రజలు తిరుగఁబడిన నేమిచేయఁగలఁడు. కావున నట్టి విపరీతపుఁ గోరిక కోరరాదు. మన కార్యసాధనమునకుఁ గానెంత మాత్రము వలయునో యంతేకాని రామునెడ దీర్ఘక్రోధద్వేషములు మనకున్నట్టు వెలికిఁ దెలియరాదు.

శా॥ కాదే రాముఁడు వచ్చెఁబో మరలఁ గై◆కా! యింతలో లోకులన్
మోదస్ఫీతులఁ జేయు నీసుతుఁడు, సం◆పూజించుఁ బూజ్యాళి, సం
పాదించున్ నవమిత్రకోటి, దృఢ మై◆పాఁ తొందు రాజ్యంబు, దే
వీ! దూరంబుగ భీత నెట్టి వరము◆ల్వేఁడంగఁ గాలం బిదే. ౨౩౬

తాత్పర్యము

పదునాలుగేడుఁ లడవులలోఁ గూడు నీళ్ళులేక యాకు లలములు దిని నవసి నవసి మొండిప్రాణమై బ్రదికి మరల వచ్చినాఁడనుకో రానీ, ఇంతలో మన భరతుఁడు లోకులను దానమానములచేఁ బూజింపయోగ్యులైన వారిని బూజించును. క్రొత్త క్రొత్త మిత్రులను సంపాదించును రాజ్యము పాఁతుగొని దృఢపడియుండును.కావున శ్రీరామచంద్రుఁడు మరలి వచ్చినను భయములేదు.

కాఁబట్టి భయము వదలి కోర్కులు కోరవలసిన కాలమిదే. ఇప్పుడు జంకితివా సర్వము చెడును. ఆఁడుఁదాని సాహసము నేర్పు చూప దగిన సమయమిదే సుమా.

కం॥ కావున రాముని రాజుఁగఁ, గావింపఁగ నీకు మన్నఁ•గైకయు భృశహ
ర్షావిష్టచిత్తయగుచుం, దావిష మగునర్థ మెంచెఁ•దనహిత మనుచున్.

కావింపఁగ నీకు ము+అన్నన్=శ్రీరామచంద్రుఁడు రాజగునట్లు చేయ నీకుము- అనియు, రాముని రాజుగఁ గావింపఁగ నీకు+మన్న=మన్నే-శ్రీరామచంద్రుఁడు రాజాయెనా నీకు నేల మన్నేయనియు గ్రహింపనగు, భృశ=అధికమైన, హర్ష=సంతోషముచే,ఆవిష్ట=ఆవేశింపఁబడిన, చిత్త=మనస్సు గలది, విషమగు=హానికరమగు.

తాత్పర్యము

మీఁదఁ జెప్పిన కారణములచే శ్రీరామచంద్రుఁడు రాజగునట్లు చేయకుము చేసితివా చెడెదవు అని చెప్పఁగా రాజ్యమంతయుఁ దనకొడుకు దాయెను గదా సవతులందఱు తనదాసీ జనులయిరిగదా యని మిక్కిలి సంతోషించి కైకతనకు విషమువంటి దానిని దనకు రసాయనముగ నెంచెను.

కం॥ కారాని తెరువులన్ జనఁ, గోరిన గోడిగవిధానఁ•గొని విస్మయమున్
జారువిలోచన తమి పెం,పారఁగ నిట్లనియెఁ గుబ్జ•కతిమోదమునన్. ౨౩ల

కారానితెరువులం=చెడుత్రోవల, గోడిగ=ఆఁడు గుఱ్ఱము-విస్మయమున్ ఆశ్చర్యముతమి=సంతోషము కోరిక, ఘోటికాశబ్ద భవము గోడిగ.

తాత్పర్యము

తనకాళ్ళు విఱుగునని తలంపక గుంతలు మిట్టలు రాలు ఱప్పలు గలిగి పోవరాని త్రోవలఁ బోవఁబూనిన యాఁడుగుఱ్ఱమువలెఁ గుబ్జతెలివికి నాశ్చర్య పడి మోహాతిశయమున నిండారు సంతోషముతో కైక మంథర కిట్లనియె.

—• కైక మంథరను మెచ్చుకొనుట •—

ఉ॥ కుబ్జ! యెఱుంగ నింతవఱ•కున్ నిను నింతటిప్రోడ వంచు నేఁ,
గుబ్జలులేరె ధారిణి? నొ•కొర్తుక యేనియు నీకు సాటియే?
యబ్జహితాన్వవాయవరు•నాశయ మింత కెఱుంగ నైతి, న
న్యుబ్జమదీయశోభనము•నొక్కత వీ వెద నిల్పి నావుగా! ౨౩౯

అబ్జహితాన్వవాయవరు=సూర్యవంశపు రాజులందు శ్రేష్ఠుఁడైన దశరథునియొక్క, ఆశయము=అభిప్రాయము, అన్యుబ్జ=దీర్ఘమైన, మదీయశోభనము=నాశుభము, ఎదన్=హృదయమందు, హృదయశబ్దభవము. ఎద.ఎడఁద ఎడ్ద.

తాత్పర్యము

కుబ్జా! యాగడియవఱకు నీవింతటి సమర్థురాలవని నేనెఱుఁగనుగదా. లోకమున మఱుగుజ్జుస్త్రీలులేరా! ఏమిప్రయోజనము. పొట్టివారికిఁ బుట్టెఁడు బుద్ధులన్నట్లు కుబ్జలు సాధారణముగా బుద్ధిమతులేకాని వారిలో నొక్కతయైన నీకు సాటియగునా దశరథునభిప్రాయమింతవఱకు నాకుఁ దెలియదుగా!! ఇందఱు కుబ్జలలో నీ వొక్కతెవే కదా నా మేలు గోరినదానవు

ఉ॥ వంకరటింకరైనయతి•వల్ మఱుగుజ్జులు లేరె, యిస్సి యా
వంకఁ గనుంగొనంగ మది•వచ్చునె, ఘోరవికారదేహలన్,
గొంకిరిబింకిరి న్మెయిని•గూడియు గాలికి వంగి యున్న మే
ల్పంకజమున్ హసించెదు వి•లాసమునం బ్రియదర్శనాస్థితిన్. ౪౦

ఆవంకన్=వారిప్రక్క, మెయి=దేహము, ప్రియదర్శనా=అందెగత్తెల, స్థితిన్=ఉనికిని.

తాత్పర్యము

వంకరటింకరగా నుండు మఱుగుజ్జులులేరా. ఛీ, వారిప్రక్కయైనఁ జూచుటకు మనస్సువచ్చునా. చూచుటకే భయంకరమై వికారమైన దేహముల గలవారిని నేపనిచూడ మనస్సువచ్చును. నీవో వాతరోగముచే కొంకిరి బింకిరి దేహము గలిగి నడ్డినడుము. గూనివీఁపు. కొంకికాళ్లు కుఱుచచేతులు గలిగియు గాలికివంగు కమలమువలె, సౌందర్యమున సందగత్తెలనెల్ల నవ్వుచున్నావే.

చక్కఁదనము వస్తువునందు లేదు. చూచువారి కన్నులయందున్నది. ఇంత వఱకు వికారపు ముండగానున్న కుబ్జ కైకకు మనస్సు మాఱుటచే దేవలోక రంభగాఁ గానవచ్చెను.

కం॥ యావత్స్కంధసమున్నత,మై వఱలునురంబుఁ గొంచి•యఁణఁకువ బహుల
జ్జావిష్కృతినో సునాభం,బై వెలసెడియుదరమాది•యటు సన్నగిలెన్.

కుబ్జా సౌందర్య మింకను గైక వర్ణించుచున్నది. ౪౧

యావత్స్కంధసమున్నతమై = గూనిది గావున భుజములవఱకు నెత్తై; వఱలు=ప్రకాశించు, ఉరంబున్=ఱొమ్మును, బహులజ్జా విష్కృతినో=మిక్కిలి లజ్జాతిశయముననో, అణఁకువన్=అణఁగినదై, సునాభము మంచి బొడ్డుగలదై ఉదరము=కడుపు, ఆది=మొదలుగా, సన్నగిలెన్=సన్నముగానాయెను. గూనిది కావున వీఁపు ఱొమ్ము బలిసియుండుట స్వభావము. వాతరోగము కారణము. ఱొమ్ము బలిసినపుడు కడుపు నడుము సన్నగిల్లుటయు స్వభావమే. ఇట్టిదానికి బలిసిన ఱొమ్మును జూచి తానట్లుగాక పోయితిని గదా యని సిగ్గుపడి కడుపు మొదలు చిక్కినదనుటచే హేతూత్ప్రేక్షాలంకారము. ఓకారము ఉత్ప్రేక్షావ్యంజకము. కారణము కానిదానికి కారణము కల్పించుట హేతూత్ప్రేక్షయగు.

చం॥ నలువుగఁ బూర్ణమైన జఘ♦నంబును నుబ్బిసగబ్బిగుబ్బలు
న్విలసదనూననిర్మలవి♦నీలసరోజహితాభవక్త్రముఁన్
గలరశనాగుణాకలిత♦క్రమనినాదము సక్తజంఘలుం,
బలుచనిదీర్ఘపాదములు,♦మంథర! యెంతటి యందగత్తెవే! ౨౪౨

నలువుగన్=అందముగ, పూర్ణమైన=నిండిన, బలిసిన, జఘనము=మొల యున్, విలసత్=ప్రకాశించునదియు, అనూన = కొఱఁతలేనిదియు, నిర్మల=శుద్ధమైనదియునగు, వినీల=నల్లని, సరోజహిత=చంద్రునితో, ఆభ=సమానమైన వక్త్రము=ముఖము, కల=అవ్యక్త మధురమైన, రశనాగుణ=మొలనూలుచే, ఆకలిత=కలిగిన, క్రమనినాదము=మనోహరమైన ధ్వనియు, సక్తజంఘలున్=ఒకదానికొకటి రాచుకొను పిక్కలు=పలుచని దీర్ఘపాదములు=సన్ననై- పొడుగైన కొంగకాళ్లు.

తాత్పర్యము

అందముగ నిండుగ బలిసిన మొలయును, ఉబ్బి పైకిపొడుచుకొని వచ్చిన స్తనములు, పండువెన్నెల కాయుచు స్వచ్ఛమైన నిండు చందురునిఁ బోలు ముఖము మొలనూలి యందలి మువ్వలరవళియు నొకదానితో నొకటి యొరయుచున్న పిక్కలు సన్నగిల్లి నిడుపైన కాళ్లు వహ్వా వహ్వా మంథరా యెంతటియందగత్తెవే.

ఉ॥ తెల్లని చీరగట్టి, కడు♦దీర్ఘము లైసతొడల్ బెళంకఁగ.
న్మెల్లగ నాదుముందటను♦నీవు చన, న్మదరాజహంసినాఁ
జెల్లుదు, వల్లశంబరుఁడు♦చేడె! సహస్రము నేర్చె మాయలన్,
గొల్లలు వేనవేలు గదె♦కోమలి నీయెడఁ దక్కుమాయముల్. ౨౪౩

తనపాలిటి పిడుగని తెలియక కైక యింకను మంథరను బొగడుచున్నది మద=మదించిన, రాజహంసి=ఆఁడురాజహంస, నాన్=అనునట్లుగా, మాయ ముల్=మాయాశబ్ద తత్సమము మాయము, అల్ల=అప్రసిద్ధుఁడైన.

తాత్పర్యము

తెల్లనిచీరగట్టి కొంగకాళ్ళవలె) మిక్కిలి నిడుపైన తొడ లీప్రక్కకాప్రక్కకుఁ గదలుచుండ మెల్లఁగ దిన్నని నడకలనాముందట నీవు పోవుచుండఁగా మదించిన రాజహంసివోయన నొప్పుదువుగదా. ఓసీ శంబరాసురుఁడు వేయి మాయలే నేర్చెను. నీయందో వేనవేలు కొల్లకొల్లగాఁ గదా. వాఁడు నేయని మాయలు గూడనున్నవి.

కం॥ గురురథఘోణాయతమై, పరఁగెడి నీదీర్ఘమైన♦వక్షమునందున్
ధరణిపనీతులుఁ గుట్రలుఁ, దిరముగ నెలకొనుట నేఁడ♦తెలిసితిఁగుబ్జా!

గురురథ ఘోణాయతమై = గొప్పరథముయొక్క యిరుసువలెనిడుపై తిరముగ=స్థిరముగ, నెలకొనుట=నెలవుకొనుట, స్థానముగా నేర్పఱచుకొనుట.

తాత్పర్యము

పెద్దరథము నిరుసువలెఁ బొడుగైన నీమూపునందు రాజనీతులు కుట్రయుక్తులు స్థిరముగ నాటుకొని యున్నవని యిప్పుడే నేను దెలిసికొంటిని లోపల నిన్ని యిముడుటకై యెడము కావలసియే నీమూపంత పొడవుగా నెత్తుగా నున్నది.

చం॥ భరతుఁడు యౌవరాజ్యపద•పట్టముఁ గట్టుకొనంగ, రాముఁడున్
సరగునఁ గాన కేగినను,•జాన! భవత్స్థగుసీమఁ జుట్టెదన్
వరమణి దామపంక్తి, వద•నంబున దిద్దెద జిత్రకంబు, నా
భరణము లుంతు మేన, శుభ•వస్త్రము లిచ్చెద నీకుఁ గట్టఁగన్. ౨౪౭

సరగున=త్వరగా, భవత్=నీయొక్క స్థగుసీమన్=మూపు ప్రదేశమందు, వరమణి=శ్రేష్ఠములైన రత్నములతోఁ జేయఁబడిన దామపంక్తి=హారముల వరుస, చిత్రకంబు=తిలకము.

తాత్పర్యము

భరతుఁడు యౌవరాజ్యపట్టముఁ గట్టుకొనినను వెంటనే శ్రీరాముఁడడవులకై పోయినను ప్రియురాలా నీ మూపునందు వరుసలు వరుసలుగా హారములు చుట్టెదను. నీముఖమున నేను దిలకము దిద్దెదను. దేహమునిండ నాభరణము లలంకరింతును. నీవు కట్టుకొనఁ దెల్లని చలువచీర లిచ్చెదను.

తే॥ అబ్జబింబంబు నెకసక్కె•మాడుచున్న, నిస్తులానన మమరంగ•నిర్జరసతిఁ
బోలి కానిజనంబులఁ•బోలఁ జూచి, గర్వమున ధిక్కరింపఁగఁ•గలవు నీవు.
౨౪౮

అబ్జబింబంబు=చంద్రమండలము, ఎకసక్కెమాడు=ఎగతాళిచేయు-గేలిచేయు, నిస్తులాననము=అసమానమైన ముఖము నిర్జరసతి=అప్సరస దేవతాస్త్రీ కానిజనంబులన్=మనల ద్వేషించు మనుష్యులను - నాసవతులను వారి పరిచారికలను.

తాత్పర్యము

చంద్రబింబముతో సమమై యసమానమైన ముఖము ప్రకాశింపఁగా దేవతాస్త్రీవలెనుండు నీవు మనకు సరిపడని వారిని గర్వపుఁ జూపులఁజూచి తిరస్కరింపఁ గలదాన వగుదువు.

కం॥ ఏవేళ నన్నుఁ గొలిచెడి, యావడువునఁ గుబ్జ లెల్ల•ననవరతంబున్
నీవశవర్తినులై నీ, సేవం జేయంగ మిగులఁ•జెలఁగెదు కుబ్జా. ౨౪౯

వశవర్తినులు=స్వాధీనలై వర్తించువారు, వడువు=విధము.

తా త్ప ర్య ము

కుబ్జా! అన్నివేళల నన్నెట్లు నీవు సేవింతువో యట్లే యెల్లప్పుడు నీయాజ్ఞకు లోపడి కుబ్జలందఱు వర్తించి నిన్నుఁ గొలుచుచుండఁగా మిక్కిలి ప్రకాశింపఁగలవు. నీవు నాసేవచేయఁగా నీసేవ కుబ్జలు చేయుదురు.

ఆ॥ వేది జాతవేదు♦విధమునఁ దెల్లని, తలిమ మందుఁ బండి♦తన్నుఁబొగడు
కైకఁ జూచి కుబ్జ♦గతజలసేతుబంధమ్ముగాదె మిగులఁ♦దడవుసేయ. ౨౪౮

వేది=యజ్ఞశాలయందలి దిన్నె, జాతవేదువిధమునన్ = అగ్నిహోత్రుని వలె, తలిమము=పాన్పు, గతజలసేతుబంధము=నీళ్లుపోయిన తరువాత ననకట్ట కట్టుట, దొంగలు చొరఁబడి దోఁచుకొని పోయినతరువాత తలుపులు మూసినట్లు కార్యము మించిన తరువాత హెచ్చరిక పడుట, తడవు=జాగు, పట్టాభిషేక మయిన తరువాత నీవు వరముకోరిన నేమిప్రయోజన మని భావము. "గతోదకే సేతుబంధో, యాదృక్ తాదృజ్ మతిస్తవ! సందీప్తే భవనే యద్వత్, కూపస్య ఖననంయథా॥" భార. ౯౪౮-౨౩. నీళ్లుపోయిన తరువాత ననకట్ట కట్టుటయు, కొంప కాలుచుండఁగా బావిత్రవ్వుటయు నెట్టిదో నీబుద్ధియట్టిది.

తా త్ప ర్య ము

వేదియం దగ్నిహోత్రమువలెఁ దెల్లని పానుపునందుఁ బండుకొనితన్నుఁ శ్లాఘించుచుండు కైకనుజూచి కుబ్జ నీవీముచ్చటలతోఁ గాలము గడుపుచుండిన గార్యము మించును. ఆవల నీవు చేయు ప్రయత్నము నీరుపోయిన తరువాత ననకట్ట కట్టినట్లు వ్యర్థమగును. కావునఁ గార్యము నారంభింపుము.

—♦ కైక గోపగృహముఁ జొచ్చుట. ♦—

కం॥ లే లెమ్ము నృపతివచ్చెడి, వేళకు సరి యెదురుచూడు♦విధుముఖి యన నా
లోలాక్షి లేచి మంథర,తో లీలం గోపగృహము♦దురుసుగఁజొచ్చెన్. ౨౪౯

లేలెమ్ము=లెమ్ములెమ్ము=లేలెమ్ము ఇట్టివే రారమ్ము, పోపొమ్ము. విధుముఖి=చంద్రునివంటి ముఖము గలదానా, లోలాక్షి=చలించు కన్నులుగలది.

తా త్ప ర్య ము

చంద్రముఖీ! నీవు పండుకొనినఁ గార్యము పండుకొనును. కావున నీవు పండుకొను సమయమిదిగాదు. రాజు వచ్చెడి సమయమునకు నుండవలసిన విధముగా నుండుము. అని కార్యమం దాసక్తిగల మంథర తీవరింపఁగాఁ గైక విలాసముగ లేచి మంథరతోడ విసవిస కోపగృహము ప్రవేశించెను.

ఉ॥ కామిని స్వాభిరూప్య భవ♦గర్వవికారవిలోలితాత్మయై
భూమిపుఁ డింత చేయఁ బని♦పూనెఁ గదా యని క్రుద్ధచిత్తయై
భామహితంబులైన మణి♦భర్మవిభూషణసల్లలంతికా
స్తోమము తారహారములు♦త్రోపుడు వెట్టి వచించెఁ గుబ్జకున్. ౨౫౦

కామిని=కామముగలది, అర్థకామకైక-స్వ=తన, అభిరూప్య=సౌందర్యము వలన, భవ=పుట్టిన, గర్వ=మదముయొక్క వికారముచేత, విలోలిత=చలించు చున్న, ఆత్మయై=మనస్సుగలదై, ఇంత=ఇటువంటి ద్రోహము, పనిపూనెన్=యత్నించెను, క్రుద్ధచిత్తయై=కోపించిన మనస్సుగలదై, భామహితంబులు=కాంతిచే పొగడఁదగినవి మణి భర్మవిభూషణ = రత్నములు బంగారు నగలు, సల్లలంతికా=మంచిహారములు వీనియొక్క స్తోమము=సమూహము, తారహారములు=ముత్యాల సరులు, త్రోపుడువెట్టి = తీసివైచి, భామ + హితంబులైన యనియు పదచ్ఛేదము చేయనగు.

తాత్పర్యము

ఐశ్వర్యకామయైన యాకైక నేను సుందరి నను మదవికారముచేఁ జలించుచున్న మనస్సుగలదై యీరా రాజు నావిషయమున నెంతద్రోహము చేయఁబూనె నని కోపించినదై పెదవులు కఱచి దేహమున ధరించి కాంతులచే శ్లాఘింపఁదగిన బంగారు-రత్నములు వీనిచేఁ జేయఁబడిన యాభరణములు దండలు మంచి ముత్యాల సరములు దీసివైచి కుబ్జతో నిట్లనెను.

ఉ॥ మన్నియమంబు కుబ్జ! వినుమా, రఘురాముఁ డరణ్యసీమకున్
జన్న మదీయపుత్రుఁడు వెసన్ ధరణీశ్వరుఁ డైనఁ గావలెన్,
నన్ను నుపేక్ష సేయుజననాథునకున్ మది సంతసిల్లఁగ
గ్గన్నన నాదుచావు నయినం బలుక న్వలె నీవు మంథరా! ౫౫౧

చన్నన్=పోఁగా, క్రన్నన=శీఘ్రముగా.

తాత్పర్యము

ఓసి మంథరా! నానియమము నిశ్చయము చెప్పెద వినుము. శ్రీరాముఁ డరణ్యసీమకుఁ బోగా నాకొడుకు రాజైనఁ గావలె అటుగాకపోయెనా నన్నుపేక్ష చేసిన రాజునకుఁ ద్వరగా నీవుపోయి కైక చచ్చినదని చెప్పనైనఁ జెప్పవలె. రెంటిలో నొకటి నిశ్చయము.

కం॥ రాముసనకే యభిషేకము, భూమీశుఁడు చేసె నేని భువి నింత యంచు
మ్మీ మజ్జీవిత, మేటి కిఁ,సీ మణులును భూషణములుఁ జేలలుఁ బైఁడుల్.

రాజు రామునకే పట్టాభిషేకము చేసెనా భూమిమీఁద నాబ్రదుకినాఁటితో సరి. అట్లుండ ఛీఛీ యీరత్నములు, ఈసొమ్ములు, ఈచీరలు, ఈబంగారు, ఇవన్ని నాకేటికే.

చం॥ అనవుడుఁ గ్రూరవాక్యనిపుణాత్మిక యానృపుదేవిఁ గాంచి యి
ట్లను రఘురామచంద్రునకు సత్యహితంబుగఁ గుబ్జ భామినీ!
వినుము ధరాత్మజాధవుఁడె విశ్వవిభుం డయినన్ ధ్రువంబుగాఁ
గనెదరు నీవు నీసుతుఁడు కష్టములన్, మఱవంగఁ బోకుమీ. ౫౫౩

అనవుడున్=అనిచెప్పఁగా, క్రూరవాక్యనిపుణాత్మక=క్రూరములైనమాటలు చెప్పుటయందు నేర్పుగల స్వభావముఁగలది అత్యహితంబు=మిక్కిలి యప్రియము, ధరాత్మజాధవుఁడు=శ్రీరాముఁడు, విశ్వవిభుండు=భూమికధిపతి,రాజు, భామినీ=కోపస్వభావముగలదానా, ఇట్లనుటచే కైక యప్పుడే కోపచిహ్నములు సూచించుచున్నదని యెఱుంగవలయును. కోపనా సైవ భామిని నిఘంటువు.

తా త్ప ర్య ము

అని చెప్పఁగా కఠినవాక్యములు పలుకుటయందు స్వభావముననే సామర్థ్యము గలయామంథర శ్రీరామచంద్రునకు మిక్కిలి యప్రియమైన రీతిగ నిట్లనియె కోపనా నీకోపమునకుఁ దగిన సమయమిదే. దానిని వదలెదవుసుమీ! ఏలన: రాముఁడే రాజాయెనా నీవు నీకొడుకు జీవించియుండువఱకు శాశ్వత కష్టము లనుభవింపవలసియుండును దానిని మఱువకుము.

ఉ॥ కావున నీసుతుం డరుణ•కంజముఖీ! విభుతం దలిర్పఁగా
భావనసేయు మంచు బహు•భంగుల బోధన సేయ వాక్యబా
ణావళితాడితాత్మ యయి•హస్తములన్ హృదిఁ జేర్చి, కోపవే
గావిలచిత్తయై, విభుఁడు•హా యిటు సేయునె యంచు నెంచుచున్. ౧౫౭

అరుణకంజముఖీ=ఎఱ్ఱని కమలములవంటి ముఖముగలదానా,దీనివలనఁ గోపముచేఁ గైకముఖము రక్తవర్ణము వహించెనని యెఱుఁగవలయును. విభుతన్=ప్రభుత్వముచే, వాక్యబాణావళి తాడితాత్మ=వాక్యములను బాణములచేఁ గొట్టఁబడిన మనస్సుగలది, హృదిక్=ఱొమ్మునందు, కోపవేగ=కోపముయొక్క యుద్రేకముచే, ఆవిల=వ్యాకులపడిన, చిత్తయై=మనస్సుగలదై, ఱొమ్ము మీఁదఁ జేతులుంచుకొని కోపాతిశయమున మనస్సు వ్యాకులపడఁగా మగఁడే యింతపని చేయునా యనితలంచుచు.

కం॥ పొగడను మంథర మఱిమఱి, తెగడను నిజభర్త నవుర•తెగె నెంత కయో
మగఁ డని ప్రియుఁ డని నమ్మిన,
వగ పిడియెనె యనుచుగుబ్జ•వంకంగనుచున్. ౧౫౮

తెగడున్=దూషించును. తా త్ప ర్య ము

మంథరనుగాసేపు పొగడను. కొంతసేపు తనమగని దూషించును. మగఁడని ప్రియుఁడని నమ్మినవాఁడే యింత దుఃఖపెట్టఁబూనెఁగదాయని మంథర ప్రక్కఁజూచి యిట్లనెను.

ఉ॥ ఇక్కడనుండి కుబ్జ! విను•మేగెద సంయమనీపురంబునుం
ద్రొక్కఁగ నొండె, నొండె భర•తుండు ధరాతల రాజ్యసంపదన్
నెక్కొనన, రామచంద్రుఁడు వ•నీస్థలిఁ గ్రుమ్మర దీర్ఘకాలమున్
గ్రక్కున నాకసుల్ చలువ•గా నరుగం గనుఁగొందు మంథరా! ౧౫౯

సంయమినీపురంబున్=ఇదియమునినగరముపేరు- ఒండెన్=లేదా అటు కాదేని

తాత్పర్యము

మంథరా! యిక్కడనుండి యమపురికైనను బోయెదను. కాదేని భరతుఁడు యువరాజై రామచంద్రుఁ డడవులలో దీర్ఘకాలము తిరుగఁబోఁగా నా కన్నులు చల్లగాఁ జూడఁనైనఁ జూతును. రెంటిలో నొకటి నిశ్చయము.

శా॥ నేనా పండను బాన్పుసందుఁ జెలియా,♦నేమూల్యముల్ దాల్పనే,
నానేత్రంబుల దిద్దఁ గాటుకను, బా♦నం బేని నన్నంబునేన్
జే నంటన్, మఱి చందనంబు నలఁదన్♦జీవింతు నం చెంతువా?
నే నారాముఁడు కాననాళిఁ దిరుగ♦న్రేపే ప్రయాణింపడేన్. ౨౫౪

నేనా=ఇందలి ఆకారము కాక్వర్థకము, మూల్యముల్=పూలదండలు.

తాత్పర్యము

మంథరా! నన్నేమనుకొంటివో-రేపటియుదయమున శ్రీరాముఁడడవులకుఁ బోకపోయెనా పానుపుమీఁద నేనుబండుకొననే బండుకొనను. హారములు ధరింపను. కన్నులయందు గాటుకయుంచుకొనను. అన్నముగాని నీళ్లుగాని వ్రేలు వేసి తాఁకను. గంధము పూసికొనను. ఇవన్నియు నేమిలెక్క ప్రాణముతోనుందునని తలంచెదవా-అదికల్లసుమా-మరణించుటే నిజము.

చం॥ అని బెడిదంబులం బలుకు♦చాయలివేణి నిరస్తభూషయై,
జనితరుషాతిరేకఘన♦సంతమసావృత వక్త్రియై, గృహా
వని నునుసెజ్జ లేక మెయి♦వ్రాల్చి ధరం బడి కిన్నరింబలెన్
దనరెను దారకల్ మలుగ♦దట్టపుఁజీఁకటి పర్వు మిన్ననన్. ౨౫౫

బెడిదంబులు=భయముకలిగించు వాక్యములు-అలివేణి=తుమ్మెదలచాలువలె నల్లనైన జడగలది, కైక, నిరస్తభూషయై = తీసివేయఁబడిన యాభరణములు గలదై, జనిత=పుట్టిన, రుషాతిరేక = కోపాతిశయముచే, ఘన=గొప్పదగు, సంతమస=చీఁకటిచే, అవృత=కప్పఁబడిన, వక్త్రి=ముఖచంద్రునిగలదై నునుసెజ్జ=మెత్తనిపానుపు, శయ్యాశబ్దభవము సెజ్జ, మెయి=దేహము, మలుగన్=అస్తమింపఁగా, మిన్ను=ఆకాశము.

తాత్పర్యము

అని భయంకరవాక్యములు పలుకుచుఁ దుమ్మెదచాలువలె నున్నజడను విప్పి తల విరియఁబోసికొని కోపాతిశయమనెడి మేఘావృత గాఢాంధకారముచే గప్పఁబడిన చంద్రుఁడను ముఖముగలదై కోపగృహమందు మెత్తని పానుపు లేక కటికి నేలమీఁద దేహమును బడివైచి కిన్నరివలె నక్షత్రములు కూడ లేక మేఘావృతమునై ప్రకాశింపని యాకాశమువలె నుండెను. ఆభరణములు ధరించుటచే నక్షత్రములతోడఁ బ్రకాశించు నాకాశమువంటి కైక వానిని దీసి వేయుటచే నక్షత్రములు ప్రకాశింపని యాకాశమువలె నుండెనని భావము.

౧౦-వ సర్గము.

శా॥ ప్రేరింపం దనుఁ బాప మంథర ధరి♦త్రిన్ దిగ్ధబాణావళి
ధారావిద్ధమనోజ్ఞ కిన్నరివలెం♦దాఁ ద్రెళ్ళి కార్యంబు తీ
రారన్ నెమ్మది నిశ్చయించుకొని కుబ్జాస్యంబుఁ గన్గొంచు మేల్
గూరం జేసితి లెస్స చేసి తనుచుం♦గొండాడి, రోషంబునన్. ౨౫౯

దిగ్ధ=విషము పూయఁబడిన, బాణావళీ=బాణసమూహముయొక్క, ధారా=పదునైనయంచులచేత, ఆవిద్ధ=బెజ్జములు వేయఁబడిన, మనోజ్ఞ=అందమైన, కిన్నరివలెన్=కిన్నరస్త్రీవలె, త్రెళ్ళి=పడి, ఆస్యంబు=ముఖము, కొండాడి=పొగడి, కూరన్=కలుగున్.

తాత్పర్యము

పాపాత్మురాలగు మంథర తన్నుఁ బ్రేరింపఁగా విషముపూసిన బాణములచేఁ గ్రుచ్చఁబడినేలఁబడిన కిన్నరజాతి స్త్రీవలెఁ గైకయు మంథరా విషవాక్కులచే మనస్సు భేదిల్లఁగా నేలపైఁబడి యెట్లెట్లు చేయవలయునో కార్యము తీరంతయు నిశ్చయించుకొని కుబ్జముఖముఁజూచి నాకు మంచికలుగఁజేసితివి లెస్సజేసితి వని పొగడి.

ఆ॥ పాఁపపాప వొలెఁ♦బడఁతి నిట్టూర్పులు
సెగలువాఱఁ దనదు♦చింతితంబు
సొంత మగునొ కాదొ♦యని సందియము గొని
యాత్మహితముఁ దలఁపు♦నందుఁ జేర్చె ౨౬౦

పాఁపపాప=ఆఁడుపాము, ఔపవిభక్తికాంతము కావున సమాసంబునపాఁప యని యయ్యె. సెగలువాఱ=వేఁడిమి వ్యాపింపఁగా, సొంతము=అంతముతోఁ గూడినది.

తాత్పర్యము

ఆఁడుసర్పము బుసలుకొట్టునట్లు కైక రోషముచే నిట్టూర్పుల వేఁడిగాలి వ్యాపింపఁ జేయుచు తనకోర్కి కొనసాగునోలేదో యని సందేహించియుఁదనమే లాలోచించి నిశ్చయించుకొనెను.

ఆ॥ అర్థకామ కుబ్జ♦యానెలంతుక నిశ్చ,తంపుమది నెఱింగి♦తనకుఁ గార్య
సిద్ధి యైనయట్ల♦చెలఁగుచు నెమ్మది నధికహర్ష పులకి♦తాంగి యయ్యె.

అర్థకామ=ధనమునందాసక్తిగలది, తానుద్దేశించిన రామాభిషేకవిఘ్నమును గోరునది, నెలంతుక=స్త్రీ, కైక, పులకితాంగి=పులకరించిన దేహముగలది.

తాత్పర్యము

ధనమునందు రామాభిషేకవిఘ్నమందుఁ గోరికగల మంథర కైకనిశ్చయించుకొనిన విధము తెలిసి యిఁకభయములేదు. ఇది పట్టినపట్టు వదలునది

కాదు. కావున నాయుద్దేశము తప్పక నెఱవేఱును. అని సంతోషముచేఁ బులకరించిన దేహము గలదయ్యెను.

ఆ॥ కలికి నిశ్చయించి•కార్యవిధం బెల్ల, మహితకోపఘూర్ణ•మాన యగుచు
బొమలు ముడివడంగ•భూమిపైఁ ద్రెళ్ళుచు,
నుస్సు రనుచులోన•నుదిలకొనుచు. ౧౬_౨.

కలికి=కాంత, కైక, 'కలికియొప్పిదంబు కాంతయయ్యె' నని నిఘంటువు, మహిత=మిక్కిలి, కోప=కోపముచే, ఘూర్ణమాన = కలఁతచెందినదై, బొమలు=కనుబొమ్మలు, ఉదిలకొనుచున్=తపించుచు, త్రెళ్లుచున్=పడుచు, ఇదివఱకేనేలపై బడినట్లు చెప్పినను మరలఁ జెప్పుటచే మనస్సు నిలుకడకుదురక యున్న కారణముచేఁ గొంతసేపు పరుండి కొంతసేపు లేచి యీప్రకార మారాట పడుచున్నదని యెఱుంగవలయును.

తా త్ప ర్య ము

అందగత్తెయగు కైక మన మిట్లు పండుకోవలె రాజువచ్చి యిట్లడుగును. మన మిట్లు ప్రత్యుత్తరము చెప్పవలెనని యుత్తర ప్రత్యుత్తరములు తాను నటింపవలసిన విధము, ఇవన్నియు నాలోచించి నిశ్చయించి రాజు చేయఁదలఁచిన ద్రోహము దానివలనఁ దనకుఁ రాఁబోవు కష్టము సవతులకు రాఁబోవు మేలు ఇవన్నియుఁ దలఁచి తలఁచి మిగుల కోపముచే మనస్సు కలగుండువడఁగాఁ గనుబొమ్మలు ముడిపెట్టి భూమిపై దటాలునఁబడి యుస్సురని శ్వాసములు విడుచుచుఁ బరితపించుచు.

కం॥ ఎగఁజల్లె నెల్లయెడ నా, మగువ మహాభరణములును•మాల్యచయంబున్
దిగుపఁబడ నవియు ధారణి, జగి మీఱె సతారనభము•చెన్నురహింపన్.

తా త్ప ర్య ము   ౨౬౩

ఇంతవఱకు దేహమునుండి తీసియుంచిన యాభరణము లామాల్యములా యింటినిండ నలువంకల పడునట్టు లెగఁజల్లెను. అవియు నాలుగుప్రక్కలఁబడి మిన మిన మెఱయుచు నక్షత్రములతోఁగూడిన యాకాశమువలెఁ గనఁబడెను.

కం॥ ఒకటిగఁ బెనసినజడతో, వికటభ్రూవల్లితోడ•వికృతాకృతితో
వికలాలంకృతితోఁగా,ముక మాసినచీరతోడఁ•బుడమిం బండెన్. ౨౬౪

వికట=(వింటివంపు చెడి) హెచ్చుతగ్గులైన, భ్రూవల్లి=తీఁగవంటి కనుబొమ్మలు, వికృతాకృతితోన్=మాఱిన యాకారముతో, వికలాలంకృతితోన్=చెదరిన యలంకారముతో, కాముక=కామాతిశయముగల కైక.

తాత్పర్యము

జడవిప్పి మూఁడుకాళ్ళ నొకటిగాఁ బెనవేసి కనుబొమ్మలు ముడివడ రూపము మాఱిపోవ నలంకార హీనయై మాసినచీరగట్టి కామదాసియగు కైక మరల నేలపైఁ బండుకొనెను.

—• దశరథుఁడు పట్టాభిషేకవార్తఁ దెలుపఁ గైకగృహంబునకుఁ బోవుట. •—

తే॥ అంత దశరథవసుమతీ•కాంతుఁడపుడు, రామపట్టాభిషేచన•క్రమము దీర్ప
నాజ్ఞాపించి గురువుల•యాజ్ఞ పొంది, తననివేశమును జొచ్చె•మనసుపొంగ

కైక వృత్తమింతతో నిలిపియిఁక దశరథు వృత్తాంతము చెప్పఁబడు చున్నది;

వసుమతీకాంతుఁడు=భూమిభర్త, రాజు, నివేశనము=ఇల్లు, చొచ్చెన్=ప్రవేశించెను.

ఈప్రవేశము ౧౪౯-వ పద్యంబునఁ జెప్పఁబడెను. అతఁడట్టు లింట నుంట వెలుపల జరిగిన వృత్తాంతమంతయు నడుమఁ దెలుపఁబడెను. మరల పూర్వకథ యందు కొనఁబడుచున్నది. పూర్వోత్తర కథా సందర్భము తెలుపుటకై యీ పద్యము చెప్పఁబడెను.

తాత్పర్యము

చెప్పవలసిన విషయములన్నియుఁ జెప్పవలసినవారికిఁ జెప్పి చేయవలసిన యేర్పాటులన్నియుఁ జేసినపిమ్మట శ్రీరామపట్టాభిషేకమునకై కావలసిన కార్యము లన్నియుఁ దీర్పనాజ్ఞాపించి గురువుల యానతిపొంది సంతోషముతోఁ దనయింటికిఁ బోయెను.

కం॥ రామాభిషేకవార్తయు, భూమి నిపుడ ప్రకట మయ్యెఁ•బో, కైకేయీ
కామినికిఁ జెప్పవలదే,
యే మున్నుగఁ బోయి యనుచు•నెంచుచు నృపుఁడున్. ౨౬౬

తాత్పర్యము

శ్రీరాముని పట్టాభిషేకవార్త యిపుడేకదా లోకమునఁ బ్రకటింపఁబడెను. ఈలోపలఁ గైకేయికి నెట్లు తెలిసియుండును. ఇతరులుపోయి చెప్పుటకుముందే నేనేపోయి చెప్పవలయును. అని యాలోచించుచు రాజు (క్రియ క్రిందిపద్యమునఁ జొచ్చెను అనునది) కర్మము అగు నంతఃపురవరము ౨౭౦-వపద్యము

చం॥ ప్రియముఁ బ్రియార్హకుం దెలుపఁ•బ్రేమను జొచ్చె సితాభ్రభాసిరా
హుయుతనభంబుఁ జొచ్చు నల•యుత్పలమిత్రునిభంగిఁ గీరికా
చయకలకంఠ కేకిరవ•సాంద్రము వామనికాయుతంబు వ
వ్యయసుమభారశోభితల•తాంచిత సుందరమందిరంబునై. ౨౬౭

ప్రియము = ఇష్టమైనది. కావున ప్రియార్హమైన సంతోషవార్త విననర్హురాలు. సితాభ్ర భాసి=తెల్లని మబ్బులచేఁ బ్రకాశించునదియు, రాహుయుత=రాహువుతోఁ గూడినదియు నగు, నభంబు=ఆకాశము,ఉత్పల మిత్రుని భంగిన్=కలువలకుఁ బ్రియుఁడగు చంద్రునివలె- ననిచెప్పుటచేఁ దెల్లని మబ్బులచాటునకుఁ బోయిన చంద్రుఁడే కాంతి హీనుఁడగును. అందు రాహువుతోఁగూడిన యాకాశమునఁ జొచ్చుట రూపము కూడఁ జెప్పుటకే.అట్టులే దశరథుఁడు కైకయింటిలోఁ బ్రవేశించుటచేతనే తేజోహీనుఁడయ్యెను. అందుఁ గైకయను రాహువు బారిఁ బడుట మృత్యువు వాతఁబడినట్టాయెను. కైకయిల్లు తెలుపు గావున తెల్లని మబ్బుతోఁ బోల్పఁబడెను.కీరికాచయ=ఆఁడు చిలుకల సమూహము యొక్కయు, కలకంఠ=కోకిలలయు, కేకి=నెమిళ్ళయు, రవ=ధ్వనులచే, సాంద్రము = దట్టమైనది, వామనికాయుతంబు=కుబ్జలతోఁ గూడినది, అవ్యయ=క్షీణింపని, సుమభార=పుష్పముల బరువుచేత, శోభిత=ప్రకాశించు, లతా=తీఁగలచేత, అంచిత=ఒప్పుచు, సుందర మందిరంబునై = అందమైన యిల్లై, రాహుయుతమైన యాకాశము- చంద్రునివంటి రాజనుటచే నిది సూర్యాస్తమయానంతరచర్యయని గ్రహింపనగు.

తాత్పర్యము

ఇష్టమైన వార్త యిష్టురాలై యిష్టములను వినయోగ్యయగు కైకకుఁదెలుపుటకై ప్రియముతో తెల్లని మేఘముఁగ్రమ్మి రాహువుతోఁగూడిన యాకాశమును జొచ్చుచంద్రునివలె నాఁడు చిలుకలయొక్కయు కోకిలల నెమిళ్ళయొక్కయు ధ్వనులచే నిండినదియు మఱుగుజ్జులగు స్త్రీలతోఁగూడినదియు నెడఁదెగక యుండుపూలబరువునఁ బ్రకాశించు తీఁగలచే నొప్పి సుందరమైన యింటియందుఁ బ్రవేశించెను.

కం॥ రాజితదాంతకనకవే,దీజుష్టము నిత్యపుష్ప,దీపిత ఫలస
ద్భూజాన్వితము సురూపస,తీజాలసుశోభితంబు,త్రిదివనిభంబున్. ౨౬౮

రాజిత=రజత సంబంధము, రాజితము=వెండిరేకులుగలవియు, దాంత=ఏనుఁగుదంతముచేఁ బనిచేయఁ బడినవియు, కనక=బంగారురేకులుపటిచినవియు నగు, వేదీ=తిన్నెలచే, జుష్టము=కూడినది, నిత్య=దోహదబలమున నెడఁదెగని, పుష్ప=పూలచే, దీపిత=ప్రకాశింపఁజేయఁబడినదియు,ఫల=ఎడఁదెగని ఫలములు గలదియునగు, సద్భూజాన్వితము=మంచి వృక్షములతోఁగూడినది, సురూప=మంచియందముగల, సతీజాల=స్త్రీసమూహముచే, సుశోభితంబు=మిక్కిలి ప్రకాశించునది. అంతఃపురమందు నందఱు వికారపుఁ గుబ్జలేకాక రూపవతులు పరిచారికాదులుందురు, త్రిదివనిభంబున్=స్వర్గముతో సమానమయినదియు,దోహముల వలన నకాలమందును చెట్లుపూయును! ఆలింగనాత్కురవక, శ్చంపకోముఖ దర్శనాత్।చూతో యోషిత్కరస్పర్శాత్।తిలకో దృ।క్ప్రసారణాత్ అకర్ణనాత్కర్ణికార స్త్వశోకః పాదతాడనాత్? దాడిమీ దోహసందోహాత్ ప్రియాపర్గాన దర్శనః॥

చం॥ కనఁ బదమూనఁ బాడఁ బలుక న్నొగ మెత్తుకొనన్మథింపఁ జేయనలమఁ జల్లనూర్పనగ నంటను జాలవుగాక కాఁకచే? ఘనకుచ పువ్వుఁదీపెతిలకంబు నశోకము | పెంకణమ్మగోఁ|గునుగనకంబు కేసరముఁ గ్రోవియు వావిలి పొన్న మావియున్, వసు.

తా త్ప ర్య ము

వెండిరేకులు, ఏనుఁగుదంతములు, బంగారు రేకులు వీనిని జెక్కి సుందరముగాఁ బనిచేసిన యరుఁగులు నెల్లకాలము పూయుకాయుచెట్టు లందగత్తెలగు స్త్రీల సమూహము కలిగి స్వర్గముతో సమానమై.

ఉ॥ క్రౌంచనినాదసంయుతము•రాజతదాంతసువర్ణ పీఠికా
సంచయరాజితంబు నవ•చంపకశోభితచిత్రవల్లికా
భ్యంచిత మన్నపానశుభ•భక్ష్యసముల్లసితంబు ప్రోదిరా
యంచల నాదుపెంపును ద•తాదికవాద్యనినాదహృద్యమున్. ౧౬౯

క్రౌంచ నినాదసంయుతము=క్రౌంచపక్షుల ధ్వనులతోఁగూడినది రాజత=వెండితోఁజేయఁబడిన, దాంత=ఏనుఁగుదంతములతోఁ జేయఁబడిన, సువర్ణ=బంగారుతోఁ జేయఁబడిన, పీఠికా=పీఁటలయొక్క, సంచయ=సమూహములచే, రాజితంబు=ప్రకాశించునది, నవ=క్రొత్తగాఁబూచిన, చంపక=సంపెఁగలచేత, శోభిత=ప్రకాశముగలదిగాఁ జేయఁబడినదియు, అన్నపాన శుభభక్ష్య సముల్లసితంబు=అన్నము. పానము మంచిపిండివంటలు వీనిచేఁ బ్రకాశించునదియు, ప్రోది=పెంపుడు, రాయంచల=రాజహంసల, నాదు=ధ్వనుల, పెంపు=అతిశయముగలదై, తతాదికవాద్య=తతము-ఆనద్ధము-ఘనము-సుషిరము అను వాద్యములయొక్క, నినాద=ధ్వనులచే, హృద్యము=మనోహరము- తంతెలుగల వీణాదులకు తతమనియు, చర్మముగల మర్దలము మొదలయినవానికి అనద్ధమనియు, కంచుతాలములవానికి ఘనమనియు, వెదుళ్ళతోఁ జేసిన పిల్లంగ్రోవి మొదలగువానికి సుషిరమనియుఁ బేర్లు. ఈనాలుగు వాద్యములకు వాదిత్రము ఆతోద్యమనియుఁ బేర్లు. "తతంవీణాదికం వాద్య,మానద్ధం మురజాదికం, వంశాదికంతు సుషిరం, కాంస్యం తాళాదికం ఘనం; చతుర్విధ మిదం వాద్యం, వాదిత్రా తోద్య నామక" మని యమరుఁడు.

ఈమూఁడు పద్యములయందలి గృహవర్ణనము కామోద్దీపకమని తెలుపుటకే. ఈయుద్దీపనములవలన దశరథునకుఁ గామోద్రేకము గలుగుటను నా కామవికారముచేతఁ గైకేయి మాటల తీరు దాని యుద్దేశ్యము తెలియఁజాలఁ డయ్యెననియు ప్రవహించునది. కామాంధునకు వివేకమునకుఁ జాలి యేకదా.

తా త్ప ర్య ము

క్రౌంచపక్షుల ధ్వనులతోఁ గూడినదియు, వెండి-దంతము బంగారుతోఁ జేయఁబడిన పీఁటలుగలదియు,|క్రొత్తగాఁబూచిన సంపెంగలచేతన తము

లయిన తీఁగలచేతను నొప్పిసదియు, అన్నము పానము మంచి పిండివంటలు వీనిచేఁ బ్రకాశించునదియు పెంపుడు రాజహంసల ధ్వని యతిశయము వీణలయు తాలములయు పిల్లఁగ్రోవులయు మద్దెలలయు ధ్వనులచే మనోహరమైనదియు, క్రౌంచనాదము=కైక కంఠధ్వనిని- వెండి బంగారు పీఁటలు కైకతోఁ దాను గూర్చుండుటయు- సంపెంగలు కైకనాసికను, తీఁగలు కనుబొమ్మలను, అన్నపానాదులు కైకతోడ భుజించుటను, రాజహంసల ధ్వని రతివేళ కైక కంఠధ్వనిని స్మృతికిఁ దెచ్చుటచేఁ గామోద్దీపకము లయ్యెనని తెలియనగు. ఇందు స్మృత్యలంకారము- చెప్పనగు. కడచినది మనస్సునకు వచ్చుట స్మృతి.

కం॥ అగునంతః పురవర మా,నగధీరుఁడు చొచ్చి కామ•నారాచములన్
 బెగ డొంది శయనతలమున,మృగలోచన నెమకి కాన•కెంతయుఁ జింతన్.

నగధీరుఁడు=పర్వతమువలెఁ జలింపని ధైర్యముకలవాఁడు, ఇంతవఱకని భావము. కామనారాచములన్=మన్మథుని బాణములచే- మన్మథుని బాణములు పూవులు, వీనిచే పిడుగులు పడినను జలింపని కొండవలె నెట్టికష్టములందును జలింపనివాఁడు చలించెనని భావము. బెగడొంది=భయపడి- మనోవికారముగలవాఁడై, నెమకి=వెదకి, మృగలోచన=జింకకన్నులవంటి కన్నులు గలది.

తాత్పర్యము

మీఁద వివరించిన విశేషములుగల యంతఃపురమును పర్వతమువలె ధీరుఁడగు దశరథుఁడు ప్రవేశించి పుష్పబాణుని బాణముల ప్రేటునకుఁ జలించి రత్యర్థమై పడుకటింటియందుఁ గైకను వెదకెనుగాని యామె కాన రామిని విచారగ్రస్తుఁడయ్యెను.

కం॥ సతి యెన్నం డాసమయమునుఁ, నతివర్తించుటయు లేమి•నృధిపుఁ డెపుడా
 గతి శూన్యగృహముఁ జొచ్చిన,వితమింతకు మున్ను లేమి•వికలాత్ముండై.

విచారమునకుఁ గారణమేమన:- అతివర్తించుట=మీఱుట, శూన్యగృహము=పాడిల్లు- కైకలేనియిల్లు, వితము=విధము, వికలాత్ముఁడు = స్వస్థత దప్పిన మనస్సు గలవాఁడు.

తాత్పర్యము

ఈ దినము వఱకు ముందెన్నఁడు రాజువచ్చుసమయమును మీఱి కైక శయనగృహంబున నుండకుండినది లేదు. ఆ విధముగ నాయన కైకలేనియిల్లు ప్రవేశించినదిలేదు. కావున రామవిషయక సంతోషముతో కామోద్రేకముతో మనసార సంభోగింపఁదలఁచి వచ్చిన కామికి నాశాభంగము కలుగుటచే మనస్సు చెదరెను.

సీ॥ ఎన్నఁడే నివేళ•నెక్కడ కేగదు, పూర్వ మీ చిగురాకుఁ•బోఁడి నేఁడ
 యెచ్చట కేగెనో•యెక్కటి యని స్వార్థ,పరయుమూఢయు నయి•వనరుచుంట
 యెఱుఁగ కావంతయుఁ•బృథ్వీశుఁడును బ్రతీ,హారిని గైక యెం•దరిగె ననిన
 నదియు భయంబున•హస్తముల్ జోడించి,వినయంబు మైఁ బల్కు•విసవిసగను

తే॥ దేవ! దేవేరి క్రోధసం♦దీప్త యగుచుఁ, గోపభవనంబుఁ జేరెనా♦కుతిలపడుచు
వ్యాకులేంద్రియుఁడగుచు దు♦ర్వారశోక,
భారమునఁ గుంది కాంచెనా♦పజ్జకరిగి. ౨౨

చికురాకుఁబోఁడి=చిగురాకువలె మృదువైన పోఁడిమిగలది- పేర్వాదులటు గాగమము విభాషనగు ననుటచే చిగురాకు చిగురుటాకు నని రెండురూపంబులు. సు-వ్యా-సంధి-సూ. ౫౫ చూడుము. స్వార్థపర = తన యైశ్వర్యలాభమందే యాసక్తిగలది. కావుననే మూఢ=బుద్ధి మాలినది-ఆవంతయు, ఆవ+అంతయు= ఆవగింజంతయైన=కొంచెమైనను, ఎక్కటి=ఒంటరిగ- కైకను గోప గృహమున విడిచి మంథరయు నీవలనే యున్నది, ప్రతీహారిని=కావలి యుండు స్త్రీని, విసవిస గను = ఇది శీఘ్రగమనమును దెలుపును- దేవేరి = రాణి రూ, దేవెరి- క్రోధ సందీప్త=కోపముచే మండునది, కుతిలపడుచు=సంకటపడుచు, వ్యాకులేంద్రియుఁడు=మిక్కిలి కలతఁ చెందిన యింద్రియములుగలవాఁడు. దుర్వార శోక భారము=వారింపరాని శోకాతిశయము, పజ్జ=సమీపము.

తాత్పర్యము

చిగురాకువలె మృదువైన దేహముగల నాప్రియురాలు పూర్వమందెప్పుడైనను నీసమయమున కెక్కడ కరుగునదికాదు. ఈదినమే యందు నొంటరిగఁ జెలికత్తెయు నెవ్వతె తోడులేక యెచ్చటికిఁ బోయెనోకదా యని యామె తన లాభమేకోరి దానివలన వచ్చుకీడెఱుంగక మూఢురాలై దుఃఖించుచుండుట కొంచెమైనఁ దెలియక యందలి కావలికత్తెను రాణి యెచ్చటికిఁ బోయెనని యడిగెను. అదియును భయపడుచు చేతులు జోడించి వినయమున దేవా! రాణిగారు కోపముచే మండిపడుచు విసవిసలుగ కోపగృహము చేరెననిచెప్పఁ గైక రాన రాలేదనియే తపించువాఁడు కోపగృహముచేరె ననువార్త గోరిచుట్టుమీఁద రోఁకటిపోటువంటిదగుటచే మఱింత పరితపించి యీదినమే కోపము రావల యునా యని సంకటపడి యింద్రియములు వికలతనొంద పట్టరాని శోకమున నాకోపగృహమునకుఁ బోయెను.

కామాంధుఁడగుటచే నీకోపమునకు శ్రీరామపట్టాభిషేకము కారణమైయుండునా యను సందేహమైనఁ దోఁచినదికాదు.

సీ॥ కడునను చితగతి ♦ గడుసు నేలఁబరుండి యధిక దుఃఖావిల♦యైన దానిఁ
ద్రెంచివైచిన నునుఁ♦దీఁగ నాధరనోలినట్టి నిర్జరివోలె ♦ నమరుదాని
ద్రెళ్ళినకిన్నరి ♦ దిక్కులే కిలఁగూలి వగచు నచ్చరయన ♦ వనరుదాని
వలత్రాడులను జిక్కి♦వలనెఱుంగక స్రుక్కియున్న జింకనువోలె♦నొప్పుదాని

తే॥ మహిఁబరిభ్రష్టయైయుండు ♦ మాయవోలె
నున్నకమలాక్షి నరపతి ♦ యూథవిభుఁడు
వ్యాధదిగ్ధశ రావిద్ధ♦ యైనకరిణి
నంటుగతి వెఱలో నంట ♦ నల్ల నంటి. ౨౩

కడున్=మిక్కిలి, అనుచితగతిన్=రాజుప్రియురాలికి నయోగ్యమైన విధముగ, గడుసునేల=కఠినభూమిని, ఆవిల=వ్యాకులపడినది, నిర్జరి=దేవతాస్త్రీ, వ్యాధదిగ్ధశరావిద్ధ=వేఁటకాని విషముపూసిన బాణముచేఁ గ్రుచ్చఁబడినది. కరిణిన్=ఆఁడేనుఁగును, అల్ల=మెల్లగా.

తాత్పర్యము

రాజు నభిమానముగల ప్రియురాలికిఁ గొంచెమైనను యోగ్యముగాని విధముగ కఠినేలమీఁదఁ బండుకొని మిక్కిలి దుఃఖపడుచుఁ ద్రెంచిపడవేసిన నును పైన తీఁగయో పుణ్యక్షయమున భూమిమీఁదఁబడిన దేవతాస్త్రీయో లేక క్రిందఁ బడిన కిన్నరియో నేలఁగూలి యేడ్చు నప్సరసయో వలత్రాడులకుఁ జిక్కి తప్పించుకొనిపోవు నుపాయమెఱుంగక స్రుక్కియున్న యాఁడుజింకయో పరుల మోహింపఁజేయఁ జేసిన మాయభ్రష్టమైనదో యన్నట్లున్న కైకను బోయవాని విషబాణముచే దెబ్బదిని తప్పించు నాఁడేనుఁగును నంటునట్లు మెల్లగాఁ పటాలున గట్టిగఁ దాఁకిన మఱింత కోపించునేమోయని భయపడుచుఁ దాఁకెను.- లేఁతతీఁగ యనుటచే మెత్తని దేహముఁగలదై నేలవిడిచి లేవలేక యంటుకొని వాడి పడియున్నదనియు స్వర్గమునుండి పడిన నిర్జరి యనుటచే చూచువారికిని ఆశ్చర్యకరముగఁ బరితాపకారణముగ నున్నదనియు త్రెళ్ళిన కిన్నరి యనుటచే దయనీయ యనియు అచ్చరయన నందగత్తెయనియు మాయవోలె ననుటచే వన్నెమాఱిన దనియు జింకవలె ననుటచేఁ గదలక మెదలక యున్నదనియు గాయవడిన యేనుఁగనుటచే మిగుల సంతాపముఁగొని యున్నదనియు సూచితము. కమలాక్షియనుటచే నట్టిదుస్థితియందున్నను ఆమె కన్నులు గామోద్రేకము కలిగించుచున్నవని భావము. ఆచూపు లాదశరథునకు మన్మథుఁడు తన్నుఁగొట్ట వింటసంధించిన జోడుబాణములా యనితోఁచెను.

కం॥ ఆముదుకం డాజవ్వనిఁ, బ్రేమన్ స్వప్రాణములకుఁ • బ్రియఁ బుణ్యప్ర
జ్ఞామహితుఁడు పాపాత్మను, గామి మహాభీతి నల్ల • కాముకఁ బలుకున్. ౨౭౪

శ్రీరాముని పట్టాభిషేక మాయన సవతితల్లియగు కైక కిష్టము లేవనియు నదియే యాకోపమునకుఁ గారణమనియు దశరథుఁడు తెలిసికొనలేమికిఁ గారణము కవి చెప్పుచున్నాఁడు.

ముదుకఁడు=ముసలివాఁడు, జవ్వని=యౌవనమందుండునది, పుణ్యప్రజ్ఞామహితుఁడు=ధర్మబుద్ధిచే గొప్పవాఁడు, ప్రాణములకున్=ప్రాణములకంటె.

తాత్పర్యము

ఆముసలివాఁడు (కావుననే భార్యను ధిక్కరింపలేనివాఁడు) ఆవయస్సు దానిని ప్రేమయందుఁ దనప్రాణములకంటెఁ బ్రియమైనదానిని "ధర్మబుద్ధిగల వాఁడు కావుననే పాపాత్మురాలి కపటమెఱుంగనివాఁడై కామవశుఁడగుటచే నది ధిక్కరించినఁ దనగతియేమో యను భయముచేతను ఇట్లు పడియుండుటకుఁ

గారణము ధనాశయా కోపమా రోగమా భూతమా యను భయముచేతను నా కాముకతో నిట్లనియె.

—♦ దశరథుఁడు కైక దుఃఖించుటకుఁ గారణ మడుగుట. ♦—

చం॥ ఎఱుఁగనె సుందరీ! కినుక ♦ కేమికతం బొకొ నీకు? నిట్లు క
న్నఱపడ నేమికారణము? నా కెఱిఁగింపు, మెవండు నీకు నీ
మఱుకునఁ గూర్చె? నెవ్వఁ డవ♦మానము చేసెఁ? దలోదరీమణీ
చుఱచుఱ చూడఁదే మనము♦సొంపఱి నీ విటు ధూళిఁ బండినన్. ౨౫

సుందరీ అని సంబోధించుటచేతనే తన సౌందర్యమునకు దశరథుఁడు దాసుఁడై నాఁడని కైక గ్రహించెను. కినుకకు=కోపమునకు, కతము=కారణము, కన్నఱ=దుఃఖము, మఱకువ=సంతాపము, చుఱచుఱ=కాలుటయం దనుకరణము.

తా త్ప ర్య ము

సుందరీ! నీకోపమున కేమికారణమో నాకేమియుఁ దెలియలేదు. ఇట్లు దుఃఖింపఁ గారణమేమి? ఎవఁడు నీకీసంతాపము గలిగించెను. స్త్రీరత్నమా! నీవీ విధముగా సొంపుచెడి దుమ్ములోఁ బడియుండిన నామనస్సు సంతోషముచెడి సంతాపాగ్నిచే దావాగ్నికి గడ్డిపోఁచవలెఁ జుఱచుఱ కాలిపోదా.

ఉ॥ ఏటికిఁ బండితే కువల♦యేక్షణ! భూతము సోఁకినట్లు? ప్ర
స్ఫోటిత మౌఁ గదే మనము♦చూడఁగ నిన్నిటువంటిదుర్దశన్,
మేటులు లేరె వెజ్జు లని♦మేషవిలోచన! నిత్యపోషితుల్
పాటిలు మైతెగుల్ నుడువు♦బా గొనరింతు రొకింతమాత్రలోన్. ౨౬

ప్రస్ఫోటితము=బ్రద్దలుపాఱునది, వెజ్జులు=వైద్యులు, అనిమేషవిలోచన=మచ్చెకంటి- చేఁపవంటి కన్నులుగలదానా, నిత్యపోషితుల్=సదా కాపాడఁబడువారు, మై=దేహముయొక్క, తెగుల్=రోగము, నుడువు=చెప్పుము.

తా త్ప ర్య ము

కలువకంటీ యేలయిట్లు దయ్యముపట్టినదానివలెఁ దలవిరియఁబోసికొని నేలమీఁద చూడ భయమగునట్లు పండుకొన్నదానవు. ఇటువంటి దుర్దశలో నిన్నుఁజూడఁగా మనస్సు వ్రీలి చీలిపోవుచున్నదిగదా. ఎల్లప్పుడు మాన్యములు దిని పోషింపఁబడు రాజవైద్యులు లేకున్నారా నీకేదైన రోగమా చెప్పుము. చిటికవేయుమాత్రమున వారు బాగుచేయుదురు.

ఉ॥ ఆడుము నీకుఁ గామిని! ప్రియం బగు నెవ్వని కేమి చేసినన్,
జేడియ యేదురాత్మునకుఁ♦జే టొనరింతునొ నిన్ను నేఁచుటన్,
గో డెవఁడో కొనుం, బ్రియము♦కూడు నదెవ్వని కాన తిమ్మయో
యేషువకే తలోదరి! యి♦టేటికె దేహము స్రుక్కఁజేయఁగన్? ౨౭

తాత్పర్యము

కామినీ నీ కపరాధము చేసినవాని కెవ్వని కేమిచేసిన నీ కిష్టమో చెప్పుము నిన్ను బాధించుటచే నేనేదురాత్మునకు నేమికీడు కలిగింపవలయునో నుడువుము. ఎవనికిఁ గీడుచేయవలె నెవనికి మేలుచేయవలె, ఆజ్ఞయిమ్ము- ప్రియురాలా యేడువకే- ఏటికే దేహమిట్లు వాడఁజేసెదవు.

ఆ॥ చంపఁ దగనివానిఁ•జంపింతు నీకుఁగాఁ, జంపఁ దగినవానిఁ•జాన! విడుతు
ధనికుఁ బేదఁగాఁగ • ద్రవ్యాఢ్యుఁగా నిఱు,పేద నే నొనర్తుఁ•బ్రేమ చెపుమ.

తాత్పర్యము ౨౬౮

నీనిమిత్తముగాఁ జంపఁదగనివానిఁ జంపుదును. చంపఁదగినవాని విడుతును. ధనికుని నిఱుపేద చేయుదును.నిఱుపేదను గుబేరుఁ జేయుదును.చెప్పుము

కం॥ నావారును నేనును నీ,సేవకులము గామె యేల•చింతిలఁ దరుణీ
నీ వెదఁ దలఁచినకార్యం, బేవిధిని విఘాత మంద•నేఁ జేయుదునే. ౨౬౯

తాత్పర్యము

నేను నాకయినవా రందఱు నీకు సేవకులమేకదా. ఏల నీకీచింత- నీవు కావలయునని తలపెట్టినపని నేనా విఘ్నపఱుతును.

కం॥ నాప్రాణము గొన నీకు న,భిప్రాయం బేని చెప్ప•వే ఘటియింతున్
నాప్రేయసి! నాపై నీ,కప్రత్యయ మేల యెఱుఁగ•వా నావలపున్? ౨౭౦
అప్రత్యయము=నమ్మకములేకపోవుట, వలపు=ప్రేమ

తాత్పర్యము

నేను నీకేదైన నపరాధముచేసియుండ దానికి శిక్షగా నీప్రాణము లిమ్మని యడిగెదవా చెప్పుము. అట్టులే చేయుదును. నీకు కోపము వచ్చినతరువాత నేను జీవించి యేమి ప్రయోజనము? చచ్చుటయే మేలు. ఓ ప్రియురాలా నామీఁద నీ కేల యింత యపనమ్మకము నీపై నాకెంత మోహముండునది నీకుఁ దెలియదా.

ఉ॥ తూరుపునాఁట సింధువునఁ•దొయ్యలి యంగసమృద్ధమత్స్యసౌ
వీరతలంబుల న్మగధ•పృథ్విని దక్షిణ దేశమందునున్
వారక కాశిఁ గోసలను•వంగమునందు జనించు నెవ్వియేన్
గోరుము నీ కొసంగెదను•గోమలి నాసుకృతంబు సాక్షిగన్. ౨౭౧

తాత్పర్యము

తూర్పుదేశమందు సింధుదేశమందు నంగమత్స్య సౌవీర మగధ దక్షిణకాశి- కోసల- వంగదేశములందుఁ బుట్టునవి యేవియైనఁ గోరుము-లేదనక తప్పక నీ కిచ్చెదను.నే నిన్నాళ్ళుగాఁ జేసిన పుణ్యముసాక్షిగాఁ బ్రమాణముచేసి చెప్పెదను

కం॥ ఈ లెమ్మాయాసం బిది, యేలా యోభీరు! పల్కు • మేగతి భీతిన్
వ్యాలోలత్వము గలిగెను, బ్రాలేయముఁ దరణివోలె•భంజింతు వెఱన్.

భీరు = పిఱికిదానా, వ్యాలోలత్వము = కలఁత.

తాత్పర్యము

పిఱికీ నే నడిగినది యిచ్చునో యియ్యఁడో యని యేల భయపడెదవే. చెప్పుము. నీకేభయముచే నిట్టి కలవరము గలిగెను. దానిని సూర్యుఁడు మంచును జెఱిచినట్లు చెఱిచెదను.

కం॥ అని యూఱడఁ బల్కినఁ దన,
మనమునఁ గలవాంఛితంబు•మనుజేంద్రునకున్
వినిపింపక మును నాతని,వనటన్ మఱి మఱియుఁ ద్రోయ•భామిని దలఁచెన్

వాంఛితము=కోరిక, వనటన్=దుఃఖమందు. ౨౧౩

తాత్పర్యము

అని యీప్రకారము తనకూఱటగా దశరథుఁడు పలుకఁగా మంథర చెప్పిన ప్రకారము తనకోరిక తటాలున నిప్పుడే చెప్పరాదని తలఁచి యతని మఱిమఱి యెక్కువగా దుఃఖపడఁ జేయఁ గైక యోజించెను.

—• {౧౧-వ సర్గము. కైకకోర్కి నెఱవేర్చెద నని దశరథుఁడు ప్రమాణము సేయుట.} •—

కం॥ అలరువిలుకానిసెలక,ట్టెలతీవ్రపుఁబోటులం గ•డింది వెతల నా
కులపడువల్లభుఁ గని యా,చెలువ కుటిలవచనరచనఁ•చెప్పెం గఱకుల్.

అలరువిలుకాని=పూవులు బాణములుగాఁగల మన్మథునియొక్క, సెలకట్టెల =బాణముల, కడింది=విశేషము, వెత=వ్యథా శబ్దభవము- పరితాపము, కఱకుల్ =పరుషములైన మాటలు.

తాత్పర్యము

మన్మథబాణముల దెబ్బలచే మిక్కిలి బాధపడి తపించి భర్తనుజూచి కుటిలపు మాటలచేఁ గఠిన వాక్కులిట్లు కైక చెప్పెను.

ఆ॥ తెగులుగొంటు గాను•దేవ! నా కవమతి, సేయ రెవరు; నీవ•చేయ వలయు
సఫల మొందుకోర్కి • సలుప నిష్టమ యేని,
బాస చేసి తేని•పలుకుదాన. ౨౮౫

తెగులుగొంటు=రోగిని, అవమతి=అవమానము, బాస=ప్రమాణము.

తాత్పర్యము

దేవా నాకు వ్యాధియేదియులేదు. నా కెవ్వరవమానముచేయలేదు. చేసిన నీవే చేయవలయును. నాకోర్కి నీవు సఫలము చేయవలయును.నీకట్లుచేయుట యిష్టమేని చేసెదనని ప్రమాణము చేసెదవేని చెప్పెదను.

చం॥ అనఁ జిఱునవ్వు నవ్వి మద • నానలదగ్ధమనస్కుఁ డై నయా
జనపతి తత్సతీశిరముఁ • జయ్యన నంకముఁ జేర్చి వేనలిన్
దనకరపల్లవంబున ము • దంబున నంటుచుఁ బల్కెఁ గామినీ!
కనుఁగొన లేవుగా నిజము • గర్వితురాల! మదీయచిత్తమున్. ౨౮౬

మదనానల దగ్ధమనస్కుఁడు=మదనుఁడను నగ్నిచేఁగాలిని మనస్సుగల వాఁడు. కావున మంచి చెడ్డ ముందు వెనుక నాలోచించు శక్తి లేనివాఁడు. అంకము = తొడ, వేనలిన్=జడ - వేణీశబ్దభవము, కరపల్లవము=చిగురుటాకు వంటి హస్తము.

తాత్పర్యము

ఇన్నాళ్ళు నాతోడ నింతయైకమత్యముగాఁ గలిసియుండియుఁ దనయందు నాకెట్టి భావమున్నదో తెలిసికొనలేక పోయెఁగదా యనియు నావలనఁ గావల సిన పనికా యిది యింత శ్రమపడుట యనియు నేది కోరిన వెంటనే యిచ్చుటకు సిద్ధుఁడను బద్ధుఁడనై యుండఁ బ్రమాణము కావలయునా యనియుఁ జిఱునవ్వు నవ్వి మన్మథాగ్నిచేత దగ్ధమైన మనస్సుగలవాఁడగుటచే రాఁగల మేలు గీడు నాలోచింప శక్తి లేనివాఁడై ఆమె ముఖము తనవంకఁ ద్రిప్పుకొన నాకైక శిర స్సును దన దొడపై నుంచుకొని పెనసిన జడ మెల్లగాఁ దనచేత నంటుచు కామినీ! సౌందర్యముచే మదించినదానా, యిన్నిదినములు నన్నుఁగూడియుం డియు నీవిషయమైనామనస్సెట్టిదో తెలియలేక యున్నదానవుగదా. నీగర్వములో నామనస్స్థితి నీకెట్లు తెలియఁగలదు.

కం॥ వనితా! జగముల నీకంటెను బ్రియతమ యొండు గలదె•నెమకినయేనిన్
మనుజతతిఁ బురుషసింహుని, మనరామునికంటెఁ బ్రియుఁడు•మఱినాకున్నే.

ప్రియతమ=మిక్కిలి ప్రియురాలు, నెమకిన=వెదకిన, ఉన్నే- ఉండునే= లేఁడని భావము.

తాత్పర్యము

నన్నుఁ బ్రమాణము చేయఁగోరితివి. నాకత్యంత ప్రియమైన దానిపైఁ గదా ప్రమాణము చేయవలె. నాకు మిక్కిలి ప్రియమైనవి రెండు. వెదకినను స్త్రీలలో నీకంటెఁ బ్రియురాలు లేదు. పురుషులలో నరసింహుఁడగు మన శ్రీరామునికంటెఁ బ్రియుఁడు నాకుఁగలఁడా.

ఈకడపటి మాటయే కైక సందేహమును మఱింత బలపఱిచెను. శ్రీరాము నందున్న ప్రీతి తనకొడుకు భరతునందు లేమి స్పష్టపడియెను.

కం॥ అపరాజితుఁడును ముఖ్యుఁ డ,కృపణుండును జీవనార్హుఁ•డింతీ! రఘువం
శప యగురామునిమీఁదను,
శపథము చేసెదను జెపుమ•సలుపుదుఁ గోర్కిన్. ౨౮౮

అపరాజితుఁడును=పరాజయములేనివాఁడు, అపరాజిత శబ్దము విష్ణువు నందు నన్వయించును. అకృపణుఁడు=గొప్పవాఁడు, జీవనార్హుఁడు=నాప్రాణము కంటెను బూజ్యుఁడు. (2) నాకుఁ బ్రాణాధారమైనవాఁడు.

తా త్ప ర్య ము

శత్రువులచేఁ బరాజయములేనివాఁడును,రఘువంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడును, హేయగుణములు లేనివాఁడును నాకుఁ బ్రాణాధారమై నాప్రాణములకంటెఁ బ్రియుఁడైన వాఁడును నగు శ్రీరాముపై నొట్టు పెట్టుకొనెదను. నీవు గోరినదాని నెఱవేర్చెదను.

కం॥ తపియించి యెవని మూర్తము,చపలాక్షీ? కనక యున్న♦సత్యము బ్రతుకన్
విపులను, నారామునిపై, శపథము చేసెద నొనర్తు♦సతి! నీ పలుకున్. ౨౮౯

మూర్తము=ముహూర్తము-అల్పకాలము, విపులను=భూమిమీఁద.

తా త్ప ర్య ము

ఎవ్వని నల్పకాలము చూడకయుంటినేని పరితాపముచే భూమిపై సత్యముగా బ్రదుకలేనో యట్టి శ్రీరామునిపైఁ బ్రమాణము చేసెదను. నీమాట నెఱవేర్చెదను.

కం॥ వపువు దొఱంగెద విడిచెదఁ, గృపలే కన్యాత్మజులను♦శ్రీరామునికై
నృపవరుఁ డగురామునిపై, శపథము చేసెద నొనర్తు♦సతి ! నీపలుకున్.

వపువు=దేహము, దొఱంగెదన్=విడిచెదను, అన్యాత్మజులన్ = భరత లక్ష్మణ శత్రుఘ్నులనైనను.

తా త్ప ర్య ము

ఏ శ్రీరాముని నిమిత్తమై దేహమైనను వదలెదనో భరత లక్ష్మణశత్రుఘ్నులనైనను గొడుకులను దయలేక విడిచెదనో యట్టి శ్రీరామునిపైఁ బ్రమాణము చేసెదను. నీమాట నెఱవేర్చెదను.

చం॥ సరసిజనేత్ర! నామనము♦చందము నింత యెఱింగి బాగుగా
నరసి మదీయవాఙ్మనస♦మైక్యము నొందుట నీదుకోరికల్
సరగునఁ జెప్పుమీ, బ్రదుకఁ♦జాలఁ జుమీ, నను నుద్ధరింపుమీ,
పొరిగ నెఱింగి యాత్మబల♦ముం దగునే యిటు సంశయింపఁగన్? ౨౯౧

అరసి=విచారించి, వాఙ్మనసము = వాక్కుమనస్సు, వాక్+మనసము= అను నాసికములు పరమగుచోఁ బదాంతములైన యర్ప్రత్యాహారవర్ణంబుల కావర్గమందలి యను నాసికములు వికల్పముగ నాదేశమగును. అను నాసికములు రానిచో జశ్శులగు. అహిభుక్+నివహము. అహిభుఙ్నివహము. అహిభుగ్నివహము. సు.వ్యా.సంధి. సంస్కృత శబ్దసంధి ప్రకరణము ౧౮-వ సూత్రము.

తాత్పర్యము

కమలాక్షీ నామనస్సు విధము నిట్టిదని విచారించి నామనస్సు వాక్కు నేక రీతిగనుండుట యాలోచించి నీకోరిక యేదో త్వరగఁ జెప్పుము. నీవాలస్యము చేసిన నేను మదనతాపమున బ్రదుకలేను సుమా.కావున నన్నుద్ధరింపుము.నీబల మెట్టిదో నీవెఱిఁగి యెఱిఁగి నన్ను సందేహించుట నీకుఁదగిన కార్యముగాదు.

కం॥ నాసుకృతము సాక్షిగ నే, బాస యొనర్చెదను నీదు•వాంఛిత మొనరన్
జేసెద ననఁ గైక సము,ల్లాసభరవికాసమాన•లపనాంబుజ యై. ౫౯-౨

సుకృతము=పుణ్యము, బాస=ప్రమాణము, సముల్లాస=మిక్కిలి సంతోషముయొక్క, భర=అతిశయముచే, వికాసమాన=వికసించుచున్న,లపనాంబుజ = ముఖ కమలముగలది.

తాత్పర్యము

నాపుణ్యముమీఁదఁ బ్రమాణముచేసెదను నీమాట నెఱవేర్పనేని నాపుణ్యమంతయు నాశమగునుగాక నీకోరిక నెఱవేర్తు నని దశరథుఁడు చెప్పఁగా గైక సంతోషముచే వికాసమునొందిన ముఖకమలముగలదై (పలికె ౫౯౩-వ ప.)

తే॥ ఆత్మసంకల్ప మనుకూల•మయిన యట్ల
రాజుభావం బెఱింగి హ•ర్షమున మధ్య
వర్తు లెవ్వరు లేమి న•భ్యాగతాంత
కోపమోక్తుల నాక్రూర•యువతి పలికె. ౫౯౩

ఆత్మసంకల్పము=తనకోరిక, అభ్యాగత=తటాలునవచ్చిన, అంతక=మృత్యుదేవతతో, ఉపమ=సమానమైన, ఉక్తులన్=మాటలను.

తాత్పర్యము

రాజుభావమునుబట్టి భరతుని పట్టాభిషేకము శ్రీరాము నరణ్యావాసము కాఁగోరిన తనకోర్కి నెఱవేఱినట్లెయెంచి యిట్టికోరిక సరిగాదు ధర్మముగాదని చెప్పు మధ్యవర్తు లెవ్వరు లేకుండుటచే నెంతైన నితనిఁ బీడింపవచ్చును,ఏదైన నడుగవచ్చును. కాదనువా రెవ్వరని యాకస్మికముగ వచ్చిన మృత్యువుతో సరిపోలు మాటలను కఠినురాలయిన జగజంత యిట్లు పలికెను.

చం॥ జనవర! బాస మున్నుగ నొ•సంగెద నంటివి కోర్కి, నీనుడుల్
వినియెడువారుగాక పృథి•వీరవిచంద్రనభస్తమస్విని
దినశుచిపూర్వకాదితిస•తీసుతభూతదిశాభవన్ని కే
తనవరదేవతల్ మఱియుఁ•దక్కటి సత్త్వములున్ నిశాటముల్. ౫౯౪

పృథివీ......దేవతల్=భూమి- సూర్యుఁడు చంద్రుఁడు నభము- రాత్రి పగలు- అగ్నిహోత్రుఁడు మొదలు.గాఁగల దేవతలు- భూతములు దిక్కులు నీయిలువేల్పులు, సత్త్వములు=జంతువులు, నిశాటముల్=రాత్రిసంచరించునవి.

తాత్పర్యము

రాజా! నీవు ప్రమాణపూర్వకముగ నాకోర్కి నెఱవేర్చెద నంటివి. నీ మాటలను భూమి- సూర్యచంద్రాకాశములు రేయి పగలు అగ్నిహోత్రుఁడు మొదలైనదేవతలు భూతములు దిక్కులు- నీయిలువేలుపులందఱు విందురు గాక. నీమాటకు వీరందఱు సాక్షులుసుమీ తప్పరాదు.

కం॥ సనయుఁడు ధర్మజ్ఞుఁడు స,త్యనిరతుఁడుస్ స్వస్థచిత్తుఁ•డగునాథుఁ డొసం
గెను వరముల దయతోడ,న్వినుఁడి దేవతలు! ధారి•ణీవరుపలుకుల్. ౨౮౭

సనయుఁడు=నీతిమంతుఁడు, ధర్మజ్ఞుఁడు=ధర్మమెఱింగినవాఁడు, సత్యనిరతుఁడు=సత్యమునందు మిగులఁ బ్రీతిగలవాఁడు, స్వస్థచిత్తుఁడు=రాగాదులచే మతి విభ్రమము లేనివాఁడు- దుర్నీతిపరుఁడైనను- ధర్మ మెఱుఁగనివాఁడైనను-అసత్యవంతుఁడైనను అస్వస్థచిత్తుఁడైనను వానిమాటలు పాటికిరావు గావున నట్టిదోషము లతనియందులేవు.కావునఁ జెప్పినమాట తప్పవలనుపడదని భావము

తాత్పర్యము

నీతిమంతుఁడు ధర్మమెఱిఁగినవాఁడు సత్యప్రియుఁడు చిత్తవిభ్రమములేనివాఁడునైన రాజు నాకిచ్చిన వరములను దేవతలారా మీరు దయతో వినుఁడు. దేవతలు మధ్యమపురుషప్రయోగంబునం దారగాగమంబు లోపంబు వైకల్పికంబు

—• కైక తనపూర్వవరములవృత్తాంతము దశరథునకుఁ జెప్పుట. •—

చం॥ అని సతి బిగ్గఁజెప్పి వసు•ధాధిపుఁ గామవిమూఢు సత్యపా
శనికరబద్ధుఁ జేసియను•క్ష్మాధవ సంస్మృతికింత తెచ్చెదే,
మును నమరామరారులస•మూహము పోరెడివేళ వైరిబా
ణనిహతి నీవు సోలఁ గద•నంబునఁ గావనె యప్రమత్తతన్? ౨౮౮

బిగ్గ=పెద్దగొంతుతో గట్టిగ, కామవిమూఢున్=కామముచే మతిలేనివానిని, సత్య=సత్యమను, పాశ=త్రాళ్ళ,నికర=సమూహముచే,బద్ధున్=కట్టఁబడినవానిని, క్ష్మాధవ=రాజా, సంస్మృతికిన్=జ్ఞప్తికి, అమర+అమరారుల=దేవతల రాక్షసుల, సోలన్=మూర్ఛపోఁగా, అప్రమత్తతన్=హెచ్చరికతో.

తాత్పర్యము

అని యెలుఁగెత్తిచెప్పి కామముచే మతిపోయిన రాజును ప్రమాణపాశములచేఁ గట్టివైచి యిట్లనియె.రాజా నేను జెప్పఁబోవు విషయముకొంచెము జ్ఞప్తికిఁ దెచ్చుకొనెదవా? పూర్వము దేవతలు రాక్షసులు యుద్ధముచేయు సమయంబున రాత్రి యుద్ధమందు శత్రువులబాణముల తాఁకుడుచే నీవు మూర్ఛపోఁగా యుద్ధమందు నేను హెచ్చరికతో నిన్నుఁ గాపాడితినిగదా.

కం॥ నీవే పరముల రెంటిని, నీవే యానాఁడు, వాని•నిపు డిమ్మి, ధా
త్రీవర! సరసత నీయక, యీ వవమతి సేయఁ జత్తు•నిప్పుడ వింటే. ౨౮౯

తాత్పర్యము.

నీవే యాకాలమందు నాకు రెండువరము లిచ్చితివికదా. వాని నిపుడిమ్ము మంచితనమున నీయనంటివా నేనిప్పుడే యిచ్చటనే ప్రాణములను వదలెదను.

కం॥ వరయుగ మనునిక్షేపము, ధరణీశ్వర నీదుకడన•దాఁచితి, దానిన్
మరలం గైకొనఁ గోరుచు, నరసెద నీయం దొసంగు•మా నాకనుచున్.

వరయుగము=రెండువరములు. ౨౯౮

తాత్పర్యము

రాజా! రెండువరము లను నిక్షేపధనము నీయొద్దన దాఁచి యుంచిన దానను దాని నిపుడు మరల గ్రహింపఁగోరెదను. నావరములు నాకిమ్ము.

కం॥ పలికినమాత్రంబుననే, వలలోనికి నుఱుకులేడి•వడువున నవలా
వలలం బడి సతి కనియెం,దలఁచితి నిచ్చితిని మరలఁ•దరుణీ! యనుచున్.

తాత్పర్యము

అని యీప్రకారము కైక చెప్పెనోలేదో యామెమాట యామెనోరనుండఁ గానే యాత్రగానికి బుద్ధిమట్టన్నట్లు నన్నింత నిర్బంధించి ప్రమాణముచేయించి యడుగుచున్నదే యేమిప్రాణముమీఁదికిఁ దెచ్చిపెట్టునో యనియైన యోజింపక వేఁటకాఁడు ధ్వనిచేయఁగానే వలలోనికిఁ బరువెత్తు లేడివలె స్త్రీవలలోఁబడి జ్ఞప్తికిఁ దెచ్చుకొంటిని మరల నిచ్చితి నని తటాలునఁ జెప్పెను.

కం॥ నీవానాఁట నొసంగిన, యావరముల రెంటి నిప్పు•డడిగెద ఱేఁడా
నే వివరించెద వానిని, నీ వాలింపుము ఋతంబు•నిలుపుము బుద్ధిన్. ౩౦౦

తాత్పర్యము

నీవానాఁ డొసఁగిన వరములనే యీనాఁడడిగెదను. అవియేవంటివా చెప్పెద వినుము. సత్యమును నీపుచేసిన ప్రమాణమును మనస్సున నిలుపుము. తప్పకుము.

—• కైక భరతుపట్టాభిషేకము శ్రీరామప్రవాసము వరంబులుగఁ గోరుట •—

కం॥ శ్రీరాముని యభిషేక స,మారంభము నాఁపి తత్ప•దార్థంబులతో
నారఁగ నాసుతునభిషే,కారంభము జరుగవలయు • నది యొండు సుమీ.

సమారంభము=ప్రయత్నము, ఆఁపి=నిలిపి. ౩౦౧

తాత్పర్యము

శ్రీరామునకు నీవు చేసిన పట్టాభిషేక ప్రయత్నము నిలిపి యా పదార్థములతోనే నాకొడుకునకుఁ బట్టాభిషేకముచేయుము. ఇది యొకవరము.

కం॥ నిండుమతి దైత్యనిర్జర, చండాహవమందు నీ వొ•సంగినవర మా
రెండవది కోర నిపుడో, చండాంశుకులావతంస•సమయము వచ్చెన్.

దైత్య=రాక్షసులయు, నిర్జర=దేవతలయు, చండాహవమందు=భయంకరమైనయుద్ధమందు, చండాంశుకులావతంస=సూర్యవంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడా.

తాత్పర్యము

దేవాసురుల యుద్ధమందు నిండుమనస్సుతో నీ విచ్చిన రెండవ వరమును సూర్యవంశపు రాజులలో మేటీ! కోర సమయము వచ్చెను.కావునఁ గోరుచున్నాను, ఎట్టి యాపద దశయందు నిన్ను నేను రక్షించితినో యప్పుడెట్టి ప్రీతితో నీవు నాకు వరమిచ్చితివో యెట్టి గొప్పవంశమునఁ బుట్టితివో యెట్టిపేరు తెచ్చుకొంటివో యవి యన్నియు స్మరించియిపుడు నే నడుగు రెండవ వరమిమ్ము.

ఉ॥ నారలు గట్టి, జింక యజి♦నంబు ధరించి, జడల్ వహించి, సం
చారము చేయఁగా వలయు♦సంయమియై పదునాలు గేఁడ్లు సీ
తారమణుండు దండకను ♦ దప్ప కకంటక యౌవరాజ్యమున్
గూరెడునిప్డ నాసుతున ♦ కుం, బరమార్థము లివ్వి నామడిన్. ౩౦౩

నారలు=నారవస్త్రములు, అజినంబు=చర్మము, సంయమియై=మునియై, అకంటకము=శత్రువులవలన బాధలేనిది. పరమార్థము=పరమప్రయోజనము.

సీతారమణుఁడనుమాట కడపటఁ జెప్పిన చమత్కారముకనుఁడు.

తాత్పర్యము

శ్రీరామచంద్రుఁడు నారచీరలు గట్టుకొని కృష్ణాజినము ధరించి జడలు దాల్చి పదునాలుగేండ్లు మునీశ్వరుఁడై దండకలోఁ దిరుగుచుండవలయును. ఈవిధముగఁ బగవారిచే బాధలేని యౌవరాజ్యము నాకొడుకునకు నిపుడే లభింపవలయును. నా మనస్సునఁగల గొప్పకోరికలివి.

కం॥ మున్నీవొసఁగినయవియే, నిన్నిప్పుడు గోరు టయ్యె♦నెటి శ్రీరామున్
బన్నుగ నిప్పుడ నే నీ, కన్నులఁ జూడంగ వలయుఁ♦గానకుఁ బోవన్. ౩౦౪

మున్ను = పూర్వము (యుద్ధకాలమున)

తాత్పర్యము

రాజా! నిన్ను నేను క్రొత్తవరములుగాని నీ విచ్చిన వానికంటె హెచ్చుగఁ గాని నేను గోరలేదు. నీవిచ్చిన రెండు వరములే యిప్పుడు నిన్నుఁగోరితిని. శ్రీరాముఁడిపుడే యడవులకుఁబోఁగా నే నీకన్నులతోఁజూచి సంతోషింపవలయును.

చం॥ ధరణిని రాజరా జనఁ బ్ర♦థాలసితుండవు, గాన సత్యసం
గరుఁడవు గమ్ము, నీకుల మ♦కల్మషశీలము నీదుజన్మమున్
వరమతిఁ గాచుకొమ్ము, విన♦వా యిహముం బరమున్ ఘటింపఁగా
నరులకు సత్య మే శర ణ♦నన్ మునివర్యులు సత్యభాషణా! ౩౦౫

రాజరాజు=రాజులకెల్లరాజు-సార్వభౌముఁడవనుట, ప్రథాలసితుండవు= కీర్తిచేఁ బ్రకాశించువాఁడవు, సత్యసంగరుఁడవు=సత్యనియమముగలవాఁడవు, అకల్మషశీలము=కల్మషములేని సదాచారముగలది,సత్యభాషణా=యథార్థవాదీ?

తాత్పర్యము

యథార్థవాదీ! నీవు సామాన్యుఁడవుకావు. రాజులకెల్ల నీవు రాజవు. బల పరాక్రమములచేతను దానధర్మ కార్యములచేతను గీర్తియశస్సులఁగన్న వాఁడవు. కావున నిప్పుడును సత్యనియమముగల వాఁడవగుము ఇంతవఱకు నీ వంశమునందలి రాజులు సత్యవాదులని ధర్మాత్ములని పేరుపొందినవారేకాని యసత్యవాదులని యపకీర్తి పొందినవారుగారు. వారలందఱు సదాచార సంప న్నులు. నీవలన వారి కపకీర్తి రానీయకుము. నీ జన్మము సామాన్యముకాదు. దేవతాస్త్రీకి జనించిన వాఁడవు కావున దేవాంశ సంభూతుఁడవు. అదియును స్మరింపుము, రాజా మునీంద్రులు సత్యము వలననే యిహలోక పరలోక సౌఖ్య ములు కలుగునని చెప్పఁగా విన్నవాఁడవేకదా. నీవును సత్యసంధుఁడను బిరు దము వహించినవాఁడవేకదా.

స్మితేన రాగేణచ లజ్జయాభియా, పరాఙ్ముఖై రర్ధ కటాక్ష వీక్షణైః వచోభి రీర్ష్యా కలహేన లీలయా, సమస్త భావైః, ఖలు బంధనం స్త్రియః॥

నవ్వుచే, ననురాగముచే, భయముచే, పెడమొగము పెట్టుటచే,ప్రాఁగంటి చూపులచే, మాటలచే, నీర్ష్యచేఁ, గలహముచే, విలాసముచే నేవిధముగనైనను స్త్రీలు బంధములే ఇన్ని విధముల మగవారిని స్త్రీలు బంధించి వశపఱచుకొని తమయిష్టము చొప్పునఁ గ్రోఁతులవలె వారి నాడింతురు.

నాసాం స్నేహో నరః కార్య। స్తథై వేర్ష్యాజనేశ్వర, ఖేద మాస్థాయభుం జీత। ధర్మమాస్థాయచై వహ॥ భార-అను.

పురుషులు స్త్రీలతోడ స్నేహముచేయరాదు. విరోధింపనురాదు. స్త్రీలకు సంతోషము వచ్చినను ఖేదము కలిగినను బురుషులనే భక్షింతురు.

గీ॥ తథ్య చింతుఁ బక్షపాతంబుగాదు
నిఖి ుల యందిది నిక్కువంబు
తొయ కన్న రమ్యవస్తుపులు లేవు
వారశ ులకెల్లఁ గారణములు, భర్తృహరి.

మ తమకెంత వఱకు ననుకూలురుగ నుందురో యంతవఱకు స్త్రీలు
ననురాగ వారివలెనే నటింతురు. తమ యిష్టమును కెప్పుడు వారు విరో
ధింతురో డే వారికిఁ గీడుచేయ నాలోచించుచుందురు. కావున స్త్రీల
స్నేహ ికముగాదు.స్వారసికముగాదు. సమయోచితము.విప్రియము
లందుఁ ంగి యుండుట భీతిచేతనే కాని ప్రీతిచేతఁగాదు. దీని కప
వా ము.

—♦ ౧౨-వ సర్గము. కైక గోరినవరంబుల విని దశరథుఁడు పరితపించుట ♦—

తే॥ అన మహారాజు కైకేయి♦యధికదారుణోక్తు లాలించి తహతహ♦నొందిమిగులఁ
జింతచేఁ గుంది మూర్తంబు♦సేపు తనను,
దాన యిట్లనుకొనుఁ గడుఁ♦దత్తఱమున. ౩౦౬

అధిక దారుణోక్తులు=మిక్కిలి తీక్ష్ణములైన మాటలు, ఆలించి=విని.

తాత్పర్యము

మిక్కిలి తీక్ష్ణములై విన భయంకరములైన కైకేయి పలికిన ములుకుల వంటి పలుకులను విని దశరథుఁడు మిగుల సంతాపించి కొంచెముసేపు విచారముచేఁగుందినవాఁడై మిగుల దత్తఱపడుచుఁ దనలోఁ దానిట్లను కొనెను.

కన్నులఁ గప్పిన కామాంధకారము కైకేయి వాక్కులను తీక్ష్ణసూర్యకిరణములచేఁ దొలఁగి పోవ వాస్తవపుఁ జూపుగలవాఁడై తన దుర్దశ నాలోచించుకొనుచున్నాఁడు.

ఉ॥ హా యిది యేమి నాకుఁ గల♦యా? మతిమోహమ? పూర్వజన్మమం
దే యనుభూత మైనకృతి♦యీగతిఁ దోఁచెడినా? మనోరుజా
వ్యాయతియా? యటంచు వసు♦ధాధిపచంద్రుఁడు లోఁ దలంచు చ
త్త్యాయతచింతఁ గుంది యతి♦దారుణదుఃఖము దన్నుఁ ద్రెక్కొనన్. ౩౦౭

అనుభూతమైనకృతి=అనుభవింపఁబడిన కార్యము కం॥ ఏ వాసరమున నెద్దెస నేవయసున నెట్టికర్మ మెవఁడొనరించున్। ఆవాసరమున నద్దెస నావయసున నట్టికర్మ మతఁడు భుజించున్॥పంచ॥ అన్నట్టు లెవఁడు పూర్వజన్మమున నేమిచేసెనో యది యీ జన్మమునఁ జేసిన పుణ్యపాపములు మరణకాలమున నట్లట్లే కానవచ్చును. మనోరుజా = మానసికరోగముయొక్క, వ్యాయతియా = విస్తారమా, అయత=దీర్ఘమైన, త్రెక్కొనన్=ముంపఁగా.

తాత్పర్యము

హా! యేమి యీచర్య? నామోహ మేమి? నేనుజేసిన వాగ్దాన మేమి? కైకేయి యడిగిన వరములేమి? ప్రేమమున కిదియాప్రతిఫలము ఇట్టివాస్తవముకూడ నుండునా? నాప్రియురాలు. ప్రాణతుల్య; కైక, యిట్టు లడుగునా? అడుగదు. కావున నిది కలయేమో, కలగాదు, మేలుకొనియున్నానుగదా, మేలుకొన్న వేళ కలలెట్లువచ్చును. కావున నిది నామోహము. కావున నొకదానిని మఱియొకటిగాఁ దలఁచుచున్నాను. అదియునుగాదు. ఉన్నదున్నట్లు బోధపడుచున్నదిగదా. మతిమోస మెందుండి వచ్చెను. కావున నిదివాస్తవమే. ఇటువంటివాస్తవము సంభవింపఁ గారణమేమి ? ఈజన్మమున నిట్టి దారుణవాక్కులువినునంత పాపము నేనేమియుఁజేయలేదు. కావునఁ బూర్వజన్మమందుఁ జేసినది యిపు డనుభవమునకు వచ్చుచున్నది. అదియును నమ్మఁదగినదికాదు. నామెదడు చెడిపోవు గొప్ప

వ్యాధి లభించి యుండవలెను అని రాజు తనలోఁ దాను మిగుల నాలోచించుచు సహింపరాని మృత్యువువలె భయంకరమైన దుఃఖము తన్ను ముంపఁగా.

ఉ॥ దేవెరపల్కుముల్కులహ•తిం బడి సోలియు లబ్ధసఙ్ఞుఁడై
యావిభుఁ డెట్టకేని నొక • యాఁడుపులిం గనుఁగొన్న లేడి య
ట్లైవికలుండు దుఃఖితుఁడు • నొచు ససంవృతధాత్రినుండి మం
త్రావళియంత్రరుద్ధభుజ•గాకృతి దీర్ఘపుటూర్పు లూర్చుచున్. ౩౦౮

దేవెర=కైక, దేవీశబ్దభవము=రాణి, ముల్కులు = బాణముల, హతిన్= దెబ్బలచే, సోలి=మూర్ఛపోయి, లబ్ధసంజ్ఞుఁడై =మరలస్మృతి గలవాఁడై, అసంవృతధాత్రి=ఉత్తనేల, మంత్రావళి...ఆకృతిన్=మంత్రముచేఁ గట్టుపడిన పామువలె, ఎట్టకేని=ఎట్టెట్టో- అతికష్టము మీఁద.

తాత్పర్యము

తనరాణికైక పలుకులను బాణపుఁ బోటుల దెబ్బలచే గాటుపడి మూర్ఛ పోయి మరల నతికష్టముపై దెలివి తెచ్చుకొని కటికనేల గూర్చుండి గుండెలు చెదరి దుఃఖించుచు నాఁడుపులినిఁ జూచు జింకవలెఁ గైకవంకఁ జూచుచు మంత్ర బలముచేఁ గట్టుపడిన పామువలె నేమియుఁ జేయఁజాలక నిట్టూర్పు పుచ్చుచు.

కం॥ కోపంబున హా ఛీ యని, భూపాలుం డాడి శోక•మున మూర్ఛితుఁడై
ప్రాపించి తెల్విఁ గినుకం, జూపులఁ జూఁడెడివిధాన•సుందరి కనియెన్.

చూఁడెడి విధానన్=కాలుచురీతిని, సుందరి=నీసౌందర్యముగదా నన్నీ గతికిఁ దెచ్చినదని తలంపుగలవాఁడై

తాత్పర్యము.

కోపంబున హా ఛీ యని పలికి శోకబలంబున మూర్ఛనొంది నేలఁబడి లేచి కోపపు దృష్టులచేతనే కైకను గాల్చునట్టు లాసుందరికి నిట్లనెను.

—• దశరథుఁడు కైకను దూషించుట. •—

ఉ॥ ఓసి దురాత్మురాల! యయ•యో యదియెంతటిగట్టి వాయి వే,
యీసుజనస్తుతాన్వయము • నింకఁగఁ జేయఁగ రాతిగుండెదా
నా! ననుదెంచితే యిటకు • నా యెడ నేనియు రామునందు నే
వీసముఁ బాప మున్న నన•వే కత మే మిటు ద్రోహమెంచఁగన్. ౩౧౦

దురాత్మురాల=చెడుమనస్సుగలదానా, గట్టివాయివి=గయ్యాళివి, సుజన స్తుత=సజ్జనులచే స్తోత్రము చేయఁబడిన, అన్వయము=వంశము, ఇంకఁగన్= సమయునట్లు, రాతిగుండెదానా=కఠిన హృదయముగలదానా- దయలేనిదానా, వీసము=అల్పమైనను- (వీసము ఒకటిలోఁ బదునారవభాగము) ననుదెంచు, రూ, చనుదెంచు. లేకకాకు సంబోధనాహ్వయ కర్మధారయంబుల నచేతనముల నబ్జనాభ యన్నట్లు సంబోధనము మీఁది 'చ'కారము 'న'కారమైనదనియైనఁ జెప్పవచ్చును.

నాల్గవపాదంబునఁ గాకు స్వరయతి, కతము=కారణము.

తా త్ప ర్య ము

ఓసి దురాత్మురాలా! నీ వెంతటి గయ్యాళివే. నిర్దయురాలా సజ్జనుల స్తోత్రమునకుఁ బాత్రమైన మా వంశమును నాశము చేయుటకే మా యింటికి వచ్చితివా? ఇటువంటి ద్రోహబుద్ధి పుట్టుటకు లవమైన నాయందుఁగానీ రాము నందుఁగాని దోషమున్నఁ జెప్పుము. నీకునేను ద్రోహమును జేయలేదు.నిన్నుపే క్షింపనులేదుగదా. ఇఁక శ్రీరాముఁడో.

ఉ॥ తల్లినిబోలెఁ జూచును గ•దా నిను రాఘవుఁ డెల్ల వేళలం,
దుల్లములోన నీచెనఁటి•యుద్యమ మేటి కొనర్పఁ బూనితే!
పెల్లువిషంపుఁ బాము నిటు•వీఁకిఁడి నై నృపకన్య యన్భ్రిమం
బొల్లువడంగ నాదుగృహ • ముం జొర నిచ్చితిఁ జేటు దెచ్చితిన్. ౫౯

ఉల్లములోన=హృదయమునందు, చెనఁటి యుద్యమము = చెడ్డప్రయత్నము, వీఁకిఁడినై=బుద్ధిమాలినవాఁడనై రూ. వేకిఁడి. పొల్లు వడంగన్=చెడిపోవుటకు- (పొల్లు పడు-పొట్టువలెనగు.

౪-వ పాదంబున మువిభక్తికయతిగాని బిందుయతిగాని చెప్పవచ్చును.

తా త్ప ర్య ము

తన కన్నతల్లినే గౌరవదృష్టితోఁజూచి యామెకెట్లు సేవచేయుచున్నాఁడో యట్టిగౌరవదృష్టితో నిన్నుఁజూచి నిన్నుఁ బరిచరించుచున్నాఁడుగదా.నీవు సవతి తల్లివని యాయన చూచుటలేదుగదా. ఏటికేయిటువంటి చెడ్డప్రయత్నము చేయ మనస్సు పెట్టితివి. ద్రోహమెంచని వాని విషయమున ద్రోహమెంచుట యాసురకృత్యముగదా. నిన్నిపుడేమియని యేమి ప్రయోజనము. ఇది నా స్వయంకృతాపరాధము. రాజకన్యవని భ్రమచేతఁ బామును నింటిలోనికిఁ దెచ్చి సాఁకినట్టు నిన్ను నింటిలోఁ బ్రవేశపెట్టితిని. కొంపకే యగ్గి పెట్టితిని.

కం॥ ఎల్లప్పుడు జీవలోకము, సల్లలితగుణాఢ్యు రామ•చంద్రునిఁ బొగడన్
బెల్లుగ, నేమినెపం బిడి, కల్లరినై ప్రియతనూజుఁ•గానకుఁ బనుతున్. ౬౦

సల్లలిత గుణాఢ్యున్=మంచి మనోహరమైన గుణసంపత్తిగలవానిని, కల్లరి=(కల్ల+అరి) అసత్యమాడువాఁడు మోసగాఁడు, యువరాజుగాజేసెదనని చెప్పి చేయనివాఁడు, కానకున్=అరణ్యమునకు, పనుతున్=పంపుదును- పొమ్మని యాజ్ఞాపింతును.

తా త్ప ర్య ము

సర్వకాల సర్వావస్థలయందుఁ బ్రాణికోటి యంతయు మంచి మనోహర గుణములు కలవాఁడని శ్రీరామచంద్రుని బొగడుచుండఁగా నేనేమి నెపముపెట్టి

యసత్యవాదిని, మోసగాఁడనై నాకు మిక్కిలి ప్రియుఁడై గారాబు కొడుకగు శ్రీరామచంద్రుు నడవులపాలు కమ్మని యాజ్ఞాపింతును.

కం॥ విడిచెదఁ గౌసల్యను సిరి, విడిచెదను సుమిత్ర విడుతు•విడిచెద నసు జేన్
విడువను బితృవత్సలు నో,పడఁతీ! మదినమ్ము రామ•భద్రు సుశీలున్.౩౧౩

సిరి=సంపద, ఉసుజేన్=ప్రాణమైనను, పితృవత్సలున్=తండ్రియందుఁ బ్రేమగలవానిని, పడఁతి=ఆఁడుది, సుశీలున్=మంచి స్వభావము నడవడిగల వానిని.

శ్లో॥ ఆత్మాహిదారా సర్వేషాందార సంగ్రహవర్తినామ్॥రామా॥భర్తకు భార్యయే యాత్మ. యో భర్తా సాస్మృతాంగనా. మను. భర్తయే భార్య.

యోభరాసైవ భార్యాస్మృతా. వాజసనేయ బ్రాహ్మణము. భర్తయెవఁడో వాని భార్య వాఁడే.

అర్ధోవా ఏష ఆత్మనో యత్పత్నీ, పత్నియనునామె తనలో సగము గదా
శాస్త్ర ప్రయోగా ద్వివి ధాచ్చవేదా,దాత్మాహ్యనన్యః పురుషస్యదారాః ॥
కిష్కింధ. ౨౪

శాస్త్రప్రయోగముల వలన పలువిధములగు వేదములవలన బురుషునకు భార్య తనకంటె నన్యయముగాదు.

శ్లో॥ ద్విధాకృతాత్మనో దేహమర్థేన పురుషోభవత్, అర్ధేననారీ తస్యాంస, విరాజ మసృజత్ప్రభుః॥ మను. తన దేహమును సగము పురుషుఁడుగాను సగము స్త్రీగాను రెండుభాగములుచేసి స్త్రీభాగమందుఁ బురుషభాగముచేఁ బ్రపంచ మును బ్రహ్మ సృజించెను.

"ఆత్మానంద్వేధా పాత యత్తతః పతిశ్చ పత్నీచా భవతాం తస్మాదిదమర్ధ బృగల ఇవ. బృహ ౪ బ్రా. ౩ మం. తానే రెండుగా పతియని పత్నియని యయ్యెను. కావున నీ రెండు విత్తనమందలి చిప్పల వంటివి".

ఈ కారణముచే భార్యకెగ్గు దలంచువాఁడు తన కెగ్గు దలంచువాఁడే. జ్యేష్ఠ భార్య కౌసల్యనును వదలరాని యామెను వదలెదను. అట్టులే 'నాతిచరామి' యని ప్రమాణముచేసి వివాహముచేసికొన్న సుమిత్రను సర్వజనులందు మైత్రియేగల సుశీలను వదలెదను. అంతయేల ఆపద్ధర్మములందు సర్వము వదలియైన రక్షించుకొన వలసిన ప్రాణముల నయినను వదలెదను.

తాత్పర్యము

కౌసల్యను విడువుమని కోరెదవా విడిచెదను. అట్టులే సుమిత్రను వదలె దను. వీరికంటెఁ బ్రియమైన యందఱను విడిచియైన దక్కించుకొనవలసిన ప్రాణములను విడువుమనెదవా నీకుఁబ్రీతిగ విడిచెదనుగాని యోసీ యింతకంటెఁ బ్రియమై సత్స్వభావముగల శ్రీరామచంద్రుని వదలను సుమా నమ్ముము.

కం॥ శ్రీరాము జ్యేష్ఠసుతుఁ గ,న్నారం గనఁ గనఁగఁ బ్రీతి•యాగుబ్బతిలున్
నారాము విడిచి బ్రతుక, న్నేరుతు నే చెనఁటి!యొక్క నిమిషంబైనన్?౩౧౮॥

జ్యేష్ఠసుతున్=పెద్దకొడుకును, అగుబ్బతిలున్=అతిశయించును. "ప్రేమ యా గుబ్బతిలంగఁ జూచె నలకూబర సన్నిభునద్ధరామరున్." అని మనుచరిత్ర ప్రయోగము. చెనఁటి రూ. చెన్నఁటి=చెడునడవడిగలదానా- ఇందు భక్తులకుఁ గల భగవదనుభవలక్షణము చెప్పఁబడెను.

తా త్ప ర్య ము

శాస్త్రబలముననుబ్రేమకలిమిని విడువరాని ప్రియపదార్థములను వదలెదను. శ్రీరాముని వదలనంటివే యేమి శ్రీరామునియందు విశేషముందువా ఆయన శ్రీరాముఁడు కావున నాయనను వదలితినా నేను జ్యేష్ఠాదేవి దృష్టికిఁ పాత్రుఁడ నయిన వాఁడనే, అదియునుగాక జ్యేష్ఠసుతుఁడు ఆత్మావై పుత్రనామాసీత్. తానే కొడుకు అగును.

జ్యేష్ఠవైపతు పుత్రేణ, పుత్రీభవతి మానవః
పితౄణా మనృణశ్చైవ, సతస్మాత్సర్వ మర్హతి. మను.

మనుష్యుఁడు పెద్దకొడుకుచేతనే పుత్రవంతుఁడై పితరుల ఋణమునుండి విడువఁబడుచున్నాఁడు, కావున నతఁడు సర్వమున కర్హుఁడు.

ఎవనివలనఁ బితరుల ఋణము తీర్చుచున్నాఁడో యెవనివలన స్వర్గము కలుగునో వాఁడే ధర్మమునఁ గలిగిన పుత్రుఁడు. తక్కినవారు కామజులు జ్యేష్ఠ పుత్రుని ముఖము చూడఁగానే పితౄణము తీరును. ఈవిధముగ శ్రీరామచంద్రుఁడు నాకిహపరములకుఁ దారకమైనవాఁడు మఱియును గన్నుల కఱవు తీరఁ జూచుకొలఁది భగవదనుభవమువలె నంతకు ముందుచూచినవాఁడే కదా యని తోఁపక క్రొత్త క్రొత్తయై నాకు సంతోషము పొంగి పొంగి యతిశయించుచుండును. అట్టివానిని విడిచిన మరల నాకు సంతోషమనునది యెక్కడిది?నాకు మనస్సున సంతోషములేదాయెనా నీవు మాత్రము నాకేల! కాఁబట్టి యిటువంటి శ్రీరాముని విడిచి దుర్మార్గురాలా యొక నిమిషమైన బ్రతుకఁగలనా?

కం॥ సూరుండు లేక లోకము, నీరమ్ములు లేక పైరు•నిలుచుక్షణంబేన్,
నారాముఁ బాయ జీవం, బేరీతిని నిలువ నేర్చు•నే నాయొడలన్. ౩౧౯॥

సూరుండు=సూర్యుండు, సూర స్సూర్యార్యమాదిత్య యని యమరుఁడు. ఒడలన్=దేహమునందు.

తా త్ప ర్య ము

సూర్యుఁడులేక లోకము కొంతకాలము నిలువఁగలదు. అట్లులే నీళ్ళులేక పైరులు నిలువఁగలవు కాని నారాముని వదలితినా యేవిధముగ నాప్రాణములు నాదేహమున నుండఁగలవు. నాప్రాణములన్నియు శ్రీరామునందే యున్నవి.

శ్రీరాముఁడే నా ప్రాణము శ్రీరాముని విడుచుట ప్రాణము విడుచుటయేకదా. లేక యాధేయముండఁగలదా.

తే॥ ఏటికే యింత ఘోర మై౯గాట మైన,పాపకార్యంబునందు నన్౯బట్టుపఱుప?
మానవే దీని నోసి దు౯ర్మార్గురాల! కాళ్ళ నైనను బడియెదఁగావు నన్ను. ౩౧౬

ఘోరము=భయంకరము, గాటము=గాఢము, పట్టుపఱుపన్=బలవంత పెట్టఁగా, ఇంతచెప్పినను కైకముఖము ప్రసన్నము గాకుండుటచూచి చెప్పుచున్నాఁడు.

తా త్ప ర్య ము

ఓసి పాపాత్మురాలా! మరణకారణమగుటచే మృత్యుదేవతతో సమానమై యాకారణముచే భయంకరమైగాఢమైన పాపపుఁబనియందు నన్నేల బలవంత పెట్టెదవే. ఓసీ. నీవు భార్యవు నీకు నేను మ్రొక్కరాదు. అటులున్నను నీకాళ్ళ మీఁదఁబడి సాష్టాంగనమస్కారముఁ గావించెదను. నన్ను బ్రదుకనిమ్ము.నిష్కారణముగ నేల చంపెదవు?

సీ॥ పడఁతిరో భరతుని౯పై నాకు నెయ్యంబు, గలదో లేదో యని౯కనుఁగొనంగ
వలసి కోరితి గాక౯భరతాభిషేకంబు, పేర్మి రాముండు నా౯పెద్దకొడుకు
శ్రీమంతుఁడును మఱి౯జ్యేష్ఠుండు ధర్మంబు,నం దనియిచ్చకా౯లాడి తీవు
మున్నది యుపచార౯మున కటు గాకున్న, శ్రీరాముఁడొనరించు౯సేవకొఱకొ

తే॥ యతనిపట్టాభిషేకవృ౯త్తాంత మిప్పు, డాలకించి వ్యథాభరి౯తాత్మవగుచుఁ
గరము నను గోడుగుడిపెడు౯కఠినురాల!
పరులమాటలువినిచొచ్చి౯పాడుగృహము. ౩౧౭

రో=ఇది స్త్రీలసంబోధించు ప్రత్యయము, ఓసియాఁడుదానా- నెయ్యము =స్నేహము (ప్ర), ఇచ్చకాలు=ముఖప్రీతివాక్యములు, ఉపచారము = గౌరవార్థము, ఆలకించి=విని, వ్యథాభరితాత్మవు=శోకబాధచే నిండిన మనస్సుగలదానవు, గోడు=కీడు, కుడిపెడు=అనుభవింపఁజేసెదవు, పాడుగృహము=పాడు పెట్టఁబడిన యింటివలె నుండునిల్లు.

తా త్ప ర్య ము

ఓసీ ప్రియురాలా! నా విషయమున రామునివిషయమున నీవింతటికఠినోక్తులు మనసారఁ బలికియుందువని నేను నమ్మను. అట్లైన నిట్లాడుట కేమి కారణముందువా? నాకు భరతునిమీఁదఁ బ్రేమయున్నదోలేదో యని తెలిసికొనుటకై భరతునిపట్టాభిషేకముఁ గోరితివి. అది నీ వెట్టు లూహించితి వందువా? ఇది వఱకు నీవు గౌరవమునందు శ్రీరాముఁడు నాపెద్దకొడుకు భరతుఁడు చిన్న కొడుకు. రాముఁడు శ్రీమంతుఁడు. ధర్మబుద్ధియందు భరతునకంటెనాయనయే శ్రేష్ఠుఁడు నని నీవుచెప్పలేదా అని యిట్లు నయములాడినను మెత్తఁబడని కైకను జూచి యోహో యివియన్నియు నన్ను గౌరవించుటకును శ్రీరామునందు

నాకెక్కువప్రీతి గావున నాయనయందు నీకును బ్రీతిగలట్టు నటించిన నీయందు నేను బ్రీతిగలవాఁడనై యుందునను తలంపుతో ముఖప్రీతిమాటలు మాటలాడితివికాఁబోలు. అటుగాకపోయెనా శ్రీరాముఁడు నీసేవచేయుచుండవలయు నను తలంపుతోనో యయియుండవలెను. అటుగాకున్న శ్రీరాముని పట్టాభిషేకవార్త విని గోలుగోలున నీవేడ్చుటయేకాక నన్నుఁగూడ కష్టిపెట్టుచున్నదానవు. నీవెంతయోదయలేనిదానవు కాకుండిన నితరులు చెప్పిన మాటలు విని యిటువంటి పాడింటిలోవచ్చి పండుకొని నీవేడ్చుచు నన్నేడ్పించెదవా. ఇది నీకైపుట్టినబుద్ధి గాదు. ఎవరో పరులు దుర్బోధములు సేయఁగా నిటుచేయుచున్నదానవు. ఇది యంతయు నన్నుఁ బరీక్షింప ననుకొందునా? ఇటువంటి విపరీత పరీక్ష యెందుఁ గలదు? పరీక్షార్థము గొంతుపిసుకుటయుఁ గలదా?

తే॥ నీతిమతి వగునీకు దు•ర్నీతితోడ, మతివికారము గలిగిన•కతనఁ జేసి
వనిత! యిక్ష్వాకుసన్నుత•వంశమునకుఁ,
జేటుఁగాలంబు వచ్చెను•జెడియె నీతి. ౩౧౮

నీతిమతి=నీతిగలదానవు, మతి=మతుప్ ప్రత్యయము స్త్రీలింగము- మతివికారము=మనస్సునమఱుపాటు, కతనఁజేసి = కారణముచేత, చేసి ఇదిచేయు ధాతువు క్త్వార్థకరూపముగాదు చేతనను నర్థమున వచ్చుప్రత్యయము.

తాత్పర్యము

వనితా! నీవు స్వభావముచే నీతిగలదానవే. ఇట్టినీకు నీళ్ళలో నిప్పుపుట్టినట్టు నీతివిరుద్ధమైన వర్తనముతోడ మనశ్చాంచల్యముగలిగి మాఱుపడుటచే సజ్జనస్తోత్రమైన యిక్ష్వాకువంశమునకుఁ జెడ్డకాలము ప్రాప్తించెను. కావుననే నీతియుఁ జెడెను. అటుగాకున్న నీకివిపరీతబుద్ధి పుట్టియుండదు.

తే॥ఇంతకును పూర్వమెన్నఁడే•నింతయైన,నప్రియంబైన ననుచిత•మైనఁజలుప
విప్పుడీ విటుసేయుదే•యేటిమాట, నేను నమ్మంగఁ జాలనే•నీరజాక్షి! ౩౧౯

తాత్పర్యము

ఇంతకు ముందొకనాఁడైనఁ గొంచెమైన నప్రియముగాని యుచితముగాని మాటగాని యెన్నఁడు పలికినదానవుగావు. నేఁడుమాత్ర మిట్లుసేయుదువా? నీవు నిజముగా నిట్లు చేయుచున్న దానవని నే నెట్లునమ్ముదును? ఇంతలో స్వభావము మాఱునా ?

తే॥ భరతునట్టిఁడ శ్రీరామ•భద్రుఁడనుచు
నెన్నిమాఱులో నాతోడ•నీవ యనవె?
యట్టిధర్మాత్ముఁ డేగతి • నడవులందు
నవయఁగా నేర్చునే పదు•నాలుగేండ్లు? ౩౨౦

అట్టిఁడ=అట్టివాఁడే, నవయఁగాన్=కృశింపఁగా.

తాత్పర్యము

నా విషయమున భరతుఁడెట్టివాఁడో శ్రీరామభద్రుఁ డట్టివాఁడే. ఇరువుర యందు భేదమేమాత్రములేదు అని నీవే యెన్నిసారులో నాతోడనే యనలేదా. అట్లు నీవును మెచ్చుకొనిన శ్రీరాముఁడు పదునాలుగేండ్లడవులలో నెట్లుకృశించునే

—♦ దశరథుఁడు శ్రీరాముని గుణముల వర్ణించుట ♦—

కం॥ రాముఁడు సుకుమారుఁడు నయ,
ధాముఁడు జనహితరతుఁడు♦ధర్మాత్ముం డో
భామ! భవదీయశుశ్రూ,షామహమహితుం డదేల♦చనఁ గానలకున్? ౩౨౧

సుకుమారుఁడు=కోమలదేహముగలవాఁడు, నయధాముఁడు=నీతికిస్థాన మైనవాఁడు, జనహితరతుండు=జనులకు మేలుచేయుటయందుఁ బ్రీతిగల వాఁడు, భవదీయ=నీయొక్క, శుశ్రూషామహ=పరిచర్యయను నుత్సవమందు, మహితుఁడు=గొప్పవాఁడు.కానలకున్=అడవులకు,ధర్మాత్ముఁడు=అధర్మబుద్ధియే లేదు, కావున నడవులకుఁ బంపఁ గారణము లేనివాఁడు.

ఇందుఁ జెప్పిన కారణములన్నియు శ్రీరామచంద్రమూర్తి యడవులకు బోఁదగినవాఁడు కాఁడని తెలుపుచున్నవి.

తాత్పర్యము

అధర్మమైనను భరతుఁడు నీకొడుకు గావున ధనకాముకవై పుత్రవాత్స ల్యంబున వానికి రాజ్యము గోరితివనుకొందునుగాక. శ్రీరాముఁడో మిక్కిలి కోమలదేహుఁడు నీతికి స్థానమైనవాఁడు. జనుల మేలునందుఁ బ్రీతిగలవాఁడు ధర్మస్వరూప స్వభావుఁడు. ఇవన్నియు నెట్లులైన నగుఁగాక నీకు శుశ్రూష చేయుటయన నెంతో గొప్పయుత్సవముఁగాఁ దలంచు గొప్ప మనస్సుగల వాఁడు. అటువంటివాని నేటికే యడవులకుఁ బోవఁగోరితివి. ఆయన యడవులకుఁ బోవ నెట్టు లర్హుఁడు.

చం॥ భరతునికంటె రాముఁడ భ♦వత్పరిచర్యల మేలుచేయి, నే
నరసియుఁ గాన నీ వయిన♦నాడుము విందును రాముకంటె నీ
భరతునియందు నిగ్గొలుచు♦పట్ల విశేషము లేమి కంటివో,
వరమతి రాముఁడున్ విపిన♦వాటి విడం దగినట్టిపుత్రుఁ డే? ౩౨౨

భవత్పరిచర్యలన్=నీకు సేవలుచేయుటయందు, మేలుచేయి =గొప్ప వాఁడు, వరమతి=గొప్పమనస్సుగలవాఁడు.

తాత్పర్యము

నీతాత్పర్యమందేగాక నాయభిప్రాయమందుఁగూడ నీకు సేవచేయుటయందు భరతునికంటె శ్రీరాముఁడే గొప్పవాఁడు. అది నీయభిప్రాయమేమో నాయభిప్రా యము కాదందువా నీసేవలయందు శ్రీరామునికంటె నీభరతుఁ డేవిషయముల నెక్కడో నీవైన నాలోచించిచెప్పుము. నే నెంతవిచారించినను భరతుని

శ్రేష్ఠత్వము నాకు గోచరింపలేదు. ఇది సవతితల్లియని యిది కన్నతల్లియని భేదబుద్ధిలేక సమముగా నందఱ గౌరవించు గొప్పమనస్సుగల శ్రీరాముఁడా యరణ్యముల విడువఁదగినకొఱకు?

కం॥ సారమతిఁ బూజసేఁత న,పారగురుత్వప్రమాణ•వచనక్రియలన్
శ్రీరామునికంటెను ని, న్నే రే భజియించువారు•హెచ్చుగఁ దరుణీ? ౩౨౩

సారమతిన్=నిండునిర్మలమనస్సుతో, పూజసేఁత=గౌరవించుట, అపార=అంతములేని, గురుత్వ=గౌరవము.

తాత్పర్యము

ఓసీ! శ్రీరాముని విడనాడితివనుకో మనసార నిన్ను గౌరవించుట యందును, నీయందమితమైన మాతృభక్తియుంచి నీవు చెప్పిన కార్యములన్నియుఁ తల్లి చెప్పెనుగదా యను తలంపుతో నిన్ను సేవించుటయందును నింతకంటె నితరులెవరున్నారే? వానిని వదలితివా నీకు సరిగా శుశ్రూషచేయువారే లభింపరు.

ఉ॥ వేలకొలందు లైనయలి•వేణులనే నుపజీవులందునేన్
వ్రేలు మడంచి చెప్పఁ గల•వే యొక చేడియ యైన నెన్నఁడేన్
వాలుగగంటి! యొండుపరి•వాదమునే నపవాద మేనియు
న్లీలకునైన రాముపయి•నీకు వచించియ యున్నఁ గామినీ? ౩౨౪

అలివేణులన్=స్త్రీలయందు, ఉపజీవులందు=జీతముతీసికొని కొలుచువారియందు, ఏన్=ఐనను, ఎన్నఁడేన్=ఏదినమందైనను, వాలుగ గంటి=వాలుగచేఁపవలె నిడివియైనకన్నులుగలదానా? పరివాదము=వాస్తవముగ దోషముచేయుటచేఁ గలుగునింద, అపవాదము=నిష్కారణమైన దూఱు, లీలకున్=వేడుకకు.

తాత్పర్యము

నీవిషయమున నపరాధము చేయకుండుటేకాదు. మన యంతఃపురములందు వేనవేలుస్త్రీలు జీతములేక గౌరవార్థముగ నుండువారును గలరు. జీతములు తీసికొని సేవించువారును గలరుగదా. ఇందఱస్త్రీలలో నొక్కతెయైన శ్రీరాముఁడు పుట్టినదాదిగా నేఁటివఱ కొకనాఁడైన శ్రీరామునందు వాస్తవదోషముగాని కల్పితదోషముగాని వినోదమునకైన నీతోడనైనఁ జెప్పియుండిన వ్రేలుమడఁచి యొకటి యని లెక్కించి చెప్పుము. చూతము.

కం॥ అకలుషమతిచే రాముఁడు, సకలం బగుభూతతతికి•సాంత్వోక్తులచేఁ
బ్రకటాభీష్టదుఁడై త్యా,గకలన లోకులను జేయుఁ•గైవసపడఁగన్. ౩౨౫

అకలుషమతిచే=నిర్మలమైన మనస్సుచేత, సాంత్వోక్తులచే = సమాధానవాక్యములచే, అభీష్టదుఁడై=కోరినకోరికలనిచ్చువాఁడై, త్యాగకలనన్=త్యాగగుణముచే, కైవసపడఁగన్=స్వాధీనపడునట్లు.

తా త్ప ర్య ము

ఒకరైన రామునియందు వేడుకకైన నిందచెప్పని కారణ మేమందువా, ఆయన తన బలముచేఁ బరులను లోపఱుచుకొనువాఁడుకాఁడు. నిర్మలమైన కలుషములేని మనస్సుచేఁ గొలఁదులు గొప్పలను విచారములేక తాను నష్టపడి కష్టపడియైనను మంచిమాటలచేతనే వారు వారు కోరిన కోరికల నెఱవేర్చుచుఁ దనత్యాగగుణముచే లోకుల నెల్లఁదన వశపఱుచుకొనును.

కం॥ వరసత్యంబున లోకో త్కరము, దరిద్రులను నీవిఁ దగుశుశ్రూషన్
గురుజనముల, సంగరమునఁ బరులం దనవింట, వీర వర్యుఁడు గెలుచున్.

ఎవరెవరినెట్లెట్లు శ్రీరాముఁడు వశపఱుచుకొనునది యీ పద్యంబునఁ జెప్పఁబడెను.

వరసత్యంబునన్=నెపములేని సత్యముచే, లోకోత్కరమున్=భూలోకమును ఊర్ధ్వలోక సమూహమును, ఈవిన్=దానముచే, దరిద్రులను=పేదలను, శుశ్రూషన్=సేవచే, సంగరమునన్=యుద్ధమందు, మోసమునఁగాదు, పరులను=శత్రువులను, వింటన్=వింటిబలముచే, వింట సనుటచే, వింటిని జూపుటచేతనే యా సంరంభముఁజూచి శత్రువులు భయపడుదురనియు యుద్ధమున బాణ ప్రయోగము చేయవలసిన పనియులేదని భావము. వీర వర్యుఁడు అన్ని విశేషణముల కన్వయము, సత్యవీరుఁడు దానవీరుఁడు రణవీరుఁడు నని గ్రాహ్యము.

ఈ పద్యవిషయమున నొక యైహ్యము గలదు.

పూర్వమొక చోళదేశపురాజు తన యాస్థానమందుండు మధ్యమ వీథి భట్టారకునిఁజూచి 'ఆత్మానంమానుషంమన్యే' యని చెప్పుకొన్న శ్రీరామచంద్రుఁడు జటాయువునకు మోక్షమిచ్చె గదా. దానివలన నాయన పరత్వము ప్రకటితముఁకాలేదా యని యడిగెనఁట. ఆ పండితుఁడు 'సత్యేనలోకాన్ జయతి' 'సత్యమున లోకోత్కరము గెలుచు'నను వాక్యము మఱచితివా యనెనఁట. దానికి రాజు సంతోషించి యాయనను గౌరవించెనఁట.

తా త్ప ర్య ము

సత్యముచేఁ బదునాలుగులోకములను దాన బలముచేఁ బేదలను, శుశ్రూషచే మెప్పించి తల్లిదండ్రి నాచార్యులను వింటిని జూపుటచే యుద్ధమందు శత్రువులను రామచంద్రుఁడు గెలిచి తనకు వశపడఁ జేసికొనును.

కం॥ వర[illegible]ము దానంబును, గురుతపమున్ శుచిత మైత్రి గుణ మార్జవమున్
గురు[illegible] విద్య త్యాగము, స్థిరముగ నారామునందె చెలఁగుచు నుండున్.

శ్రీరా[illegible]నందుఁగల గుణము లీనాలుగుమాత్రమే కావనియుఁ దక్కినవారి యందు [illegible]గాక యివిస్థిరముగా రామునందే యున్నవనియుఁ జెప్పుచున్నాఁ

సత్యము = భూతహితముగాఁబలుకుట, దానము = భూలోక స్వర్గలోక ఫలము లాశించి పాత్రులకు ధనాదులిచ్చుట, తపమున్=శాస్త్రపద్ధతిని నుపవాసాదులుచేయుట, శుచిత=స్నానాదులచే దేహమును, కామాదిషట్క రాహిత్యముచే మనస్సును నిర్మల పఱచుట, మైత్రి=తన్నాశ్రయించిన వారిని రక్షించుట,ఆర్జవము=త్రికరణశుద్ధిగాఁ గపటములేక వర్తించుట, సేవ=కాళ్ళు పిసుకుట మొదలైనవి, విద్య=జ్ఞానము- దానిని గలిగించు చదువులు, త్యాగము=ప్రతిఫలాపేక్షలేని దానము.

తా త్ప ర్య ము

శ్రీరామునందీనాలుగు గుణములేకదా యున్నవందువేమో. అట్లుగాదు, నిర్వ్యాజ సత్యము, దానము, గొప్పతపస్సు, శుచిత్వము, మైత్రి, అర్జవము, గురుశుశ్రూష, జ్ఞానము త్యాగము నను గుణములు సర్వకాలములందు స్థిరముగ శ్రీరామునందే నెలకొని కాఁపురములు చేయుచున్నవి, కాని తక్కినవారి యందువలె నొకవేళయుండి యొకవేళ లేకపోవు

కం॥ ఆర్జవసంపన్నుండును, నిర్జరతుల్యుఁడు మహర్షి♦నిభతేజుండ
తూర్జితయశుఁ డగురాముఁడు, వర్జింపఁగ దగినయట్టి♦వాఁడే దేవీ? ౩౨౮

ఆర్జవ సంపన్నుఁడు=ఋజుత్వమే సంపదగాఁగలవాఁడు, నిర్జరతుల్యుఁడు =దేవతతో సమానుఁడు, మహర్షి నిభతేజుఁడు=మహర్షుల తేజస్సువంటి తేజస్సు గలవాఁడు, అతూర్జిత యశుఁడు=మిక్కిలి వృద్ధిపొందుకీర్తిగలవాఁడు,వర్జింపఁగన్=వదలి పెట్టఁగ.

తా త్ప ర్య ము

దేవీ! వివేకములేనిదానా ఋజుగుణమే సంపదగాఁ గలవాఁడును దేవతతో సమానుఁడును, మహర్షుల తేజస్సువంటి తేజస్సుగలవాఁడును నగుటచే నిగ్రహానుగ్రహశక్తిగలవాఁడును,ఈవయస్సునందే యింకను ప్రభుత్వము మొదలైనవి లేకయే విస్తారమైన కీర్తిని సంపాదించిన వాఁడునగు శ్రీరామచంద్రుఁడు విడువఁ దగిన పుత్రుఁడా ?

కం॥ అప్రియవాక్యంబును జగతీప్రియుఁ డగురాముకై మ♦దిం దలఁపఁగ లే,
నాప్రియపు తునదెట్టులు, నీప్రేరణ నప్రియంబు♦నేవచియింతున్? ౩౨౯

లోకమునకంతయుఁ బ్రియుఁడగు శ్రీరామునకు నప్రియమైనమాట యతని మనస్సే నొచ్చునో లోకము మనస్సే నొచ్చునో యని నేను మనస్సునందైనఁ దలఁపలేను. ఇట్లుండ నా ప్రియ పుత్రుఁడగు శ్రీరాముని నీప్రేరణమునకు లోపడి యోరీ యడవులకుఁ బోరాయని యెట్లు చెప్పఁగలను. అది సాధ్యముకాని కార్యము.

—♦ దశరథుఁడు కైకను వేఁడుకొనుట. ♦—

తే॥ క్షమయు దమమును ద్యాగంబు♦సత్యరతియు
ధర్మముఁ గృతజ్ఞతయును భూ♦తంబులందు
నెల్ల దయయును గలుగుసీ♦తేశుఁ బాపి
తేని యయ్యయొ నాగతి♦యేమి చెపుమ? ౩౩౦

క్షమ=సహనము-ఓర్పు, దమము=ఇంద్రియ నిగ్రహము, త్యాగము=దానమునందుఁ దెంపు, సత్యరతియు=సత్యమునందుఁ బ్రేమ, కృతజ్ఞత=చేసిన మేలు మఱువకుండుట, దయ=పరులదుఃఖమును సహింప లేకుండుట.

తాత్పర్యము

నేనొకవేళ దురుసుగ మనస్సు నొవ్వమాటలాడినను బదులుచెప్పక సహించుకొను వాఁడును, నావలెఁ గామక్రోధదాసుఁడుగాక నాధన మాశింపక, నే నియ్యలేదని రోషింపక, యింద్రియములజయించియుండు వాఁడును, తనసొత్తొకరికిచ్చునేకాని యొకరిసొత్తు తనకు రావలయునని కోరనివాఁడును, పరులిచ్చినను బుచ్చుకొననివాఁడును, తాను గష్టపడియైనను దన సత్యమునే గాక యితరుల సత్యమును రక్షించుటయందుఁ బ్రేమగలవాఁడును, సామాన్య విశేష ధర్మముల నా యా సందర్భముల వదలనివాఁడును, ఒకరెంత యల్పమైన యుపకారము చేసినను మఱవక సమయము పడెనేని ప్రత్యుపకారము చేయువాఁడును, సర్వభూతములందు దయగలిగి వానిదుఃఖమును దనదుఃఖముగాఁ జూచుకొని దాని బరిహరింపఁ జేయువాఁడును, నగు శ్రీరాముని నన్నెడఁబాసి పోవఁజేసితివేని యయ్యయ్యో నాగతియేమే నే నెట్లు జీవింపఁగలనే నన్నెవ్వరేయావల నాదరింతురు.

కం॥ పొమ్మనియెడి వీడిటు రా♦రమ్మనియెడిఁ గాడు నన్ను♦రమణీ! ముదుకన్
జుమ్మీ తపస్విని దీనుండ మ్మఱిమఱి వేఁడువాఁడ♦ననుఁ గావఁగదే. ౩౩౧

వీడు=ఇల్లు, కాడు=స్మశానము, ముదుకన్=ముసలివాఁడను, తపస్విని=చూచిన నలువురు భయపడునట్లు కృశించిన వాఁడను, దుర్బలుఁడను.

వాఁడన్ + మఱి. వాఁడమ్మఱి. ప్రాసంబున మకారంబు పరంబగుచో ద్రుతంబునకు మకారాదేశంబగు. కమ్మనిలతాంతములకు మ్మెసని యని భారతము. ఆది ౫ అ.

తాత్పర్యము

ఇన్ని నాళ్ళు నిన్ను శ్రీరాముఁడే రక్షించెనా నీవు నిన్ను రక్షించుకొనలేదా, ఇప్పుడు మాత్రము శ్రీరామచంద్రుఁడు లేకుండిన నీకు రాఁగల హాని యేమి నేనులేనా యందువా.

ఇల్లిఁక నాలోనుండవలదు పొమ్మనుచున్నది; స్మశానము నాలోనికి రమ్మనుచున్నది.అట్టి సంశయస్థితిలో నున్నవాఁడను. అట్టి తలంపు నీకేల కలిగెనందువా

ముసలివాఁడను. ఆసన్న మరణుఁడ నగుటచే దుర్బలుఁడను గృశించిన వాఁడను ధైర్యములేనివాఁడను. కావున నీ కారణములచే మునుపటివలె నన్ను నేను రక్షించుకొనఁజాలను. కావున శ్రీరాముని సాహాయ్యము దొలఁగఁ దీయవలదని నిన్నుఁ బలుమాఱు వేఁడుచున్నాను. నన్ను రక్షింపుము.

కం॥ జలనిధి పర్యంతము గల,యిల లభ్యం బయిన గవ్వ•యేనియుఁ గొన కే
గలదన మంతయు నిచ్చెద,నలుగకుమీ తరుణీ! నను ద•యామతిఁ గనుమీ.

జలనిధి పర్యంతము=సముద్రము వఱకు, ఇల=భూమి. ౩౩౨

తాత్పర్యము

సముద్రము పొలిమేరగాఁగల భూమియందు నాకు లభించిన దానిలో నాకై యొక గవ్వయైన నెత్తియుంచుకొనక సర్వము నీకే సమర్పించెదను. తరుణీ! నామీఁదఁ గోపింపకుము. నీవు వయస్సు దానవు. కావున ముసలివాఁడ నైన నాకష్టము నీ వెఱుంగవు. నాయందు దయయుంచుము. కోపింపకుము.

ఉ॥ అంజలి చేసి మ్రొక్కెడుదు•నంఘ్రుల నైన స్పృశింతు, రాముమీఁ
దం జలపట్టఁబోకు ముది•తా! శరణం బవు గమ్ము వానికిన్,
నెంజిలి మాన్పు, మి ట్లయిన•నేర దధర్మము నన్ను సోఁక సం
చుం జనవర్యుఁ డత్యధిక•శోకరసాంబుధిమగ్న చిత్తుఁడై. ౩౩౩

అంఘ్రులు=పాదములు, స్పృశింతున్=తాఁకెదను, చలపట్టి=చలము పట్టి- హఠము వహించి, శరణము=రక్షణము, నెంజిలి=మనస్సున విచారము, అత్యధిక=మిక్కిలి విస్తారమైన, శోకరసాంబుధి=శోకరసమను సముద్రమందు, మగ్న=మునిఁగిన, చిత్తుఁడై=మనస్సుగలవాఁడై.

తాత్పర్యము

ముదితా నీవు సంతోషపడుచున్నదానవు. నాకేమో ప్రాణములు పోవుచున్నవి. పిల్లికిఁజెల్లాటము- ఎలుకకుఁ బ్రాణసంకటముగదా.కావున నీకు రెండు చేతులు జోడించి మ్రొక్కెదను. అదిచాలదేని నీ రెండుకాళ్ళంటి సాష్టాంగనమస్కారము చేసెదను.ఇంతయేలయందువా శ్రీరామునిమీఁది చలము మానుము. వానికి నీవే దిక్కుగమ్ము. అట్లుచేసిన నా విషాదము మానును. ఇప్పుడు నీకేల విషాదమందువా జ్యేష్ఠునివిడిచి పిన్నకు రాజ్యమిచ్చుటచేతను సభలో రామునికి యౌవరాజ్యమిచ్చెద నన్నమాట తప్పిపోవుటను నధర్మము నన్ను బాధించును. నీకుఁ బ్రమాణముచేసి తప్పితి నన్న దోషముపోవును, నీవు క్షమించిన నన్నే యధర్మము నంటదు. నీవు క్షమింపకపోయిన రెంటిలో నేదోయొకటి నన్ను బాధించును అని యీప్రకారము వదరుచు శ్రీరామునికి రాఁగలకష్టమును రామవియోగమునఁ దనకు కాఁగల శోకము నను సముద్రములో దశరథుఁడు మునిఁగిన మనస్సుగలవాఁడయ్యెను.

కం॥ సోలుస్ ధరపయి మూర్ఛల, వ్రాలుస్ మఱి లేచు శోక•వారిధికూలం
బేలీల నైనఁ జేర్పవె, బాలా! యను నిట్లు వగచు•పార్థివుఁ గనుచున్. ౩౩౪
సోలుస్ = పడును.

తాత్పర్యము

నేలమీఁద సోలిపడును. తెలివితప్పి కొంతసేపు మూర్ఛపోవును మరల లేచును. బాలా! నీ వేవిధమునైన నన్నీశోకసాగరము తీరముఁ జేర్పుమని యేడ్చును. ఇట్టి రాజునుజూచి,

—• కైక దశరథుని దూషించుట. •—

ఉ॥ చేడియ రోషభీషణవి•శేషభయప్రదవాక్యయుక్తయై
యాడెఁ, నొసంగువాఁడనని • యాడి వరంబులు నేను గోర ని
ట్లేడుచు చున్నవాఁడ వగు•నే? యిఁక మీఁదట నీకు నెట్లునో
రాడును ధార్మికుండ నని • యందఱిలోఁ దగవు ల్వచింపఁగన్? ౩౩౫
రోషభీషణ.......యుక్తయై=కోపముచే భయంకరయై మిక్కిలి భయమును గలిగించు మాటలతోఁ గూడినదై, ఆడెన్=ఇట్లనెను, తగవుల్=ధర్మములు.

తాత్పర్యము

కైక కోపాతిశయముచే భయంకరమూర్తియై మిక్కిలి భయమును గలిగించు వాక్కులచే రాజునుజూచి యిట్లనెను. ఏమోయీ రాజా! నీవు వరములు కోరుము నే నిచ్చెదనని ప్రమాణముచేసి నన్ను నమ్మించి నామగఁడు ప్రియుఁడు సత్యవాది ధర్మజ్ఞుఁడు కృతజ్ఞుఁడు నని నేను బేలనై నమ్మి యేవో రెండువరములు కోరఁగా నవి యిచ్చుట కిట్లు గోలుగోలున ముఖమున గుడ్డవైచికొని యేడ్చుచున్నవాఁడవు. ఇది నీకుఁదగునా? ఇట్టి పగలేడ్పులచే నన్ను మోసగించెదవేని రేపు నలుగురిలో నేను ధర్మాత్ముఁడనని గద్దెపొంకములు చెప్పుటకు న్యాయములు దిద్దుటకునీకు నోరెట్లాడును. నీయంతఃకరణము నిన్నుఁ జంపదా? నలుగురు నవ్వరా? ఈరాజు ధర్మము లొకరికిఁ జెప్పువాఁడేకాని తా ననుష్ఠించువాఁడు కాఁడు అనరా.

ఉ॥ ఏయెడనన్ని ధాత్రిఁ గల • యెల్ల నృపర్షులు నీవుఁగూడుచో
నీయవనీశచంద్రుఁడు మ•హిష్ఠసుధర్మరతుండ టన్న నే
చాయ వచింతొ? యేసతిప్ర•సాదమున న్మనినాఁడ నట్టి కై
కేయి యెడాటమందు నుడి • గీడ్పడె నందువె ధార్మికోత్తమా? ౩౩౬
మహిష్ఠ=మిక్కిలిగొప్పదియగు, సుధర్మ = మేలైనధర్మాచరణమందు, రతుండు= ప్రేమగలవాఁడు, చాయ=విధము, ప్రసాదమునన్=అనుగ్రహముచే, మనినాఁడన్=బ్రతికితినో, ఎడాటమందున్=విషయమందు, నుడి=మాట, కీడ్పడెన్ =చెడిపోయెను, ధార్మికోత్తమా ఇది యెత్తిపొడుపుమాట.

తాత్పర్యము

ఓధర్మాత్ములందు శ్రేష్ఠుఁడా యేప్రదేశమందైన రాజులు ఋషులు (రాజర్షులు) నీవు కలిసినపుడు వారు నిన్నీరాజు గొప్పధర్మాత్ముఁడు సత్యవాదియని పొగడిరేని యప్పుడు నీవేమి చెప్పెదవు. మీరు చెప్పినది సత్యమేకాని యేకైక నాప్రాణములు రక్షించుటచే నింకను జీవించి యున్నాఁడనో యట్టిప్రాణదాత్రివిషయమందుమాత్రము బొంకితి నని యందువా?

ఉ॥ ఎల్లనృపాలచంద్రులకు ♦ నేర్పడ దోషము నీకతంబునన్
జెల్లునె? యిప్పు డాడినద ♦ చేయఁగ నొల్లక నీదువాక్యమే
పొల్లవడంగఁ జూచెదవు ♦ పూర్వము శైబ్యుఁడు పావురంబునున్
మల్లడిపెట్టుడేగకు స్వ♦మాంసముఁ గోసి యొసంగఁ డే నృపా. ౩౩౭

పొల్లుపడంగన్=వ్యర్థమైపోవునట్లు, శైబ్యుఁడు=శిబిచక్రవర్తి, మల్లడిపెట్టు=బాధించు.

తాత్పర్యము

ఇది యాఁడుది ఇది నన్నేమిచేయఁగల దని నాతో నసత్యమాడితివేని నీవలన రాజులకందఱకు నపకీర్తివచ్చును. వారియందుఁ బ్రజలకు నమ్మకము చెడును. రాజులమాట యెవ్వరు నమ్మరు. ఇక్ష్వాకువంశమునఁ బుట్టి గొప్పధర్మాత్ముఁడు సత్యసంధుఁడని జగములనెల్లఁ బ్రసిద్ధిగాంచిన దశరథునంతవాఁడే ఘోరప్రమాణములు చేసియు నల్పవిషయమున బొంకెనే యిఁక నేరాజుల నెట్లు నమ్మవచ్చునని లోకప్రవాదము శాశ్వతముగ వ్యాపించును. ఇప్పుడు నిమిషమునకు ముందుచేసిన ప్రమాణమునే వ్యర్థపఱుపఁ జూచెదవే యిఁక నేనాఁడోచేసిన బాసలా నీవు జ్ఞప్తియందుంచుకొని సార్థక పఱిచెదవు? సత్యస్థాపనమునకై పూర్వపురాజు లెట్లెట్లు వర్తించిరోయెఱుఁగవా? పూర్వము శిబిచక్రవర్తి యొక వనములోఁ గూర్చుండియుండ నొకడేగ యొకపావురమును దఱుముకొనివచ్చెను. శరణు శరణని యాపావురము పరువునవచ్చి శిబియొడి లోఁబడెను. వెంటనే యాడేగవచ్చి రాజా యిది నాకు వేదసమ్మతమైన యాహారము. నేనాఁకట మలమల మాడుచున్నాను. నాయాహారము నీవీయ నిరాకరించితివా నేనాఁకలిచేఁ జత్తును ఆ హింసాదోషము నీదిసుమా కావున నాయాహారము నాకిమ్మనెను. ఇది ప్రాణభయముచే నాశరణు చొచ్చినది. శరణాగతుల రక్షించుట నావ్రతము. ఆ మాట నేను దప్పను-నీకు నాహారము కావలసియుండెనేని వేఱుమాంసము నిత్తునననది నీ దేహమాంసమే యిమ్మని కోర శిబి తనచేతికత్తిచేఁ దన దేహమునందలి కండలు కోసి యిచ్చెను.ఒక యడవపక్షినిమిత్తమై యసత్యమాడరాదని యంత కార్యముచేసిన ధర్మాత్ములుండ నీయల్పవిషయమునఁ గృతఘ్నుఁడవై యెట్లసత్యమాడ సాహసించెదవు. ఆయన నీవంటిరాజుగాఁడా?

కం॥ లోచనములు నీ విమ్మని, యాచించిన(దన్ను నొక్క•యవనీవిబుధుం
డాచరితతదీయేష్టుం,డై చన(డె యలర్కనృపతి•యతులితగతికిన్. ౩౩౮

లోచనములు=కన్నులు, ఆచరిత=నెఱవేర్ప(బడిన, తదీయేష్టు(డై=వాని కోరికగలవా(డై, అతులితగతికిన్=అసమానమైన, యుత్తమగతికిన్-చన(డె= పోయినవా(డు కా(డా;

అలర్కు(డు పురూరవుని కుమారు(డగు నాయువుసంతతిలో(జేరినక్షత్ర వృద్ధుని వంశమువా(డు-లోపాముద్రానుగ్రహముచే ౬౬౦౦౦ఏండ్లు జీవించెను.

తా త్ప ర్య ము వి.పు. ౪-౮

ప్రమాణముచేసి యుపకారమునకు(బ్రత్యుపకారముగ నిచ్చెదనని యిచ్చుటకు నిట్టులేడ్చెదవే యొక బ్రాహ్మణు(డు తనకు నేత్రము లిమ్మని యాచింప(గా నలర్కు(డనురాజు వేడినదిచ్చెద నన్నమాట తప్పక తనకన్నులిచ్చి యతని కోర్కిదీర్చి యుత్తమలోకములు పొందలేదా? నీవిది వినలేదా ?

తే॥ కడలి యేటికి(జెలియలి•కట్ట దా(టి, రాదు సమయంబు చేతన•కాదె, వీని(
జక్కయోజించినీవా క్క•సత్యదూషి,తంబు గానీక నిలుపు య•శంబు జగతి.

కడలి=సముద్రము, సమయము = నియమము, అసత్యదూషితము = అబద్ధముచే(జెడినది.

తా త్ప ర్య ము

రాజా! చెలియలికట్టదా(టిరానని దేవతలకు(దానుజేసిన నియమమునకు లోపడిగదా సముద్రము పొంగి భూమిని మ్రింగకున్నది. దానికిశక్తిలేకయా. వారువారు వారివారి నియమములందు నిలువరేని లోకముచెడదా.నీవు సత్యమునకు(గట్టుపడక పోయితివేని రాజానుమతము ధర్మము రా జసత్య మాడినపుడు మనమేల యాడకాదని లోకులందఱు నసత్యమాడరా ? కావున నివియెల్ల(జక్క(గా నాలోచించి నీసత్యనియమ మసత్యముచే(జెడకుండ రక్షించుకొనుము. ఎట్టి ప్రాణగొడ్డములందును దశరథు(డసత్యమాడ(డనుకీర్తి దక్కించుకొనుము.

ఉ॥ ధర్మము రోసి సత్యము నె•దం దలపోయక రాము రాజుగా(
గూర్మిని జేసి నిత్యమల•కోసలకన్యకతో రమించెదే?
ధర్మమొ కాకధర్మమొ ఋ•తంబొ యసత్యమొ యౌను గాక, యో
దుర్మతి! నిన్ను నేను విడు•తున్ భవదాశ్రుత మీక తక్కినన్? ౩౪౦

రోసి=అసహ్యించుకొని, విడిచి; ఎదన్=హృదయమందు, తలపోయక = ఆలోచింపక. ...కన్యక=కౌసల్య, భవదాశ్రుతము=నీవుచేసినప్రమాణమును.

తాత్పర్యము

ఓరీ! దుష్టబుద్ధీ; నీవగలు నీనటనములు నీబూటకములు నేను దెలిసికొనలేనని తలంచితివా! ధర్మము నీకుఁజేఁదై వదలి సత్యము నాలోచింపక శ్రీరాముని రాజుగాఁజేసి కామదాసుఁడవై యెల్లప్పుడాకౌసల్యతోఁ గ్రీడింపఁదలంచెదవా కానీ నాచర్య ధర్మమో అధర్మమో అసత్యమో సత్యమో ఆవిచారముతో నాకుఁ బనిలేదు.నాకు నీవుచేసిన ప్రమాణము ప్రకారము నడచుకొనకపోతివా నిన్నూరక విడిచెదనని తలఁచితివా? అది భ్రమమాత్రమే. నీవు తప్పించుకొని పోఁజాలవు. నాసవతి నీకంతతీఁపై నేనంతచేఁదైతినిగదా. నయభయముల నన్ను మోస గింపఁ జూచెదవా? కానీ.

కం॥ రాముని రాజుగఁజేసెద,వా మహితవిషంబుఁ గ్రోలి•వసుధేశ! యిదే
నీముందట నీవు గనన్, నే మరణము నొందుదాన•నిక్కము సుమ్మీ. ౩౪౧

తాత్పర్యము

శ్రీరామునే నేను రాజు చేసెదను. నీవు నన్నేమి చేయగలవు అనెదవా? నేను నిన్నేమిచేయఁగలను గాని నీయట్టి మోసగానికి నసత్యవాదికి- ప్రేమలేని వానికి భార్యగానుండి యవమాన పడుటకంటె మరణించుటే సుఖము కావున నీవు చూచుచుండఁగనే నీకన్నులయెదుటనే యీక్షణమందే తీవ్ర విషముద్రాగి మరణించెదను. నామృతికి నీవు కారణమై యనృతదోషము స్త్రీహత్యాదోషము విశ్వాస ద్రోహమువలనఁ గలుగు పాప మనుభవించుచు నీపెద్ద పెండ్లాముతోనే సుఖసాగరమున నోలలాడుము. ఇది నిజము. నేను నీవలె నసత్యమాడుదానను గాను. నమ్ముము.

కం॥ కరములు మోడిచి యందఱు, నురువుగ రామాంబ కెరఁగ•నొకదినమేనిన్
ధర బ్రదికి చూచుకంటెను, మరణంబే నాకు మేలు•మనుజవరేణ్యా. ౩౪౨

నీకు వచ్చునాదాయమంతయు నాకిచ్చెద నంటివి. నేను లంచగొండినిగాను. నీధనముతో నాకుఁ బనిలేదు; ధనమునిమిత్తమైనేను భరతుని రాజ్యాభిషేకము కోరలేదు. సవతి సౌభాగ్యము నేనుజూడలేను. దానిచే నేనవమానపడలేను.

చూచుటకంటెన్, చూచుకంటెన్- కొఱకుకంటె పొంటెలు పరంబులగు నపుడు వార్థక టవర్ణంబునకు లోపంబు విభాషనగు. త్రి. క్రి. ౧౪ సూ.

పరిచారికలు పరిచారకులు లోకులందఱు చేతులు జోడించుకొని గౌరవముతో శ్రీరాముని తల్లికి నమస్కరించుచుండఁగా నొకదినమైన భూమిపై బ్రదికి చూచుచు బాధపడుచుండుటకంటె మరణబాధయైన నాకు మేలే.

ఇచ్చట నొక పూర్వవ్యాఖ్యాత మగఁడు చచ్చినను జావనీ కొడుకునకు రాజ్యము కావలయునని కోరుటచే స్త్రీలకు మగనియందుండు ప్రేమకంటెఁ బుత్రులయందుఁ బ్రేమమెండని సూచితమని వ్రాసెను. ఇది సామాన్యధర్మమే కాదనరాదు. భార. ఆది. నహి భార్యేతి విశ్వాసః, కార్యః పుంసాకథంచ న సహి

మనుధ్యాతి, నారీ పుత్రవతీసతీ॥ యని కలదు. అదియునుగాక తనకొడుకునకు విరోధముగ వర్తించెనని కాశీరాజుభార్య యొక పళ్లెరములోనివే బొరుగులు తాను దినుచువానిలో విషము కలిపియుంచిన బొరుగులను భర్తకుఁబెట్టి చంపెను జాతాపత్యాపతింద్వేష్టి=బిడ్డలుగలది మగనితో విరోధించును. అయినను కైక విషయమున సవతి మచ్చరమెక్కువయా పుత్రస్నేహ మెక్కువయా యని యాలోచించినపు డీ ౩౪౦-౩౪౨ పద్యములందు నామెవాస్తవాభిప్రాయము వ్యక్తమగుచున్నది. సవతి మచ్చరము ముఖ్యము. పుత్రస్నేహము గౌణము మంథర నొక్కి చెప్పినదియు నీవిషయమే. సపత్నీ మాత్సర్యము లేదేని శ్రీరామపట్టాభిషేకమునకుఁ గైక యాక్షేపించియుండదు. కౌసల్యచేఁ దన కవ మానము గలుగు ననుభీతియే కైకకుఁ గోపకారణము. అటని యైశ్వర్యకాంక్ష లేదనరాదు.

పాండురాజు ప్రేరణముచేఁ గుంతీదేవి మాద్రికిఁ బుత్రదమైన మంత్రము పదేశించెను. దానిచే నామె నకుల సహదేవుల నమడలఁగాంచెను. సవతియగు కుంతికి ముగ్గురు కొడుకులున్నారే నాకిరువురే. మరల నామంత్రము తనకుఁ గుంతి చెప్పునట్లు చేయుమని మాద్రి భర్తను బ్రార్థించెను. పాండురాజుకుంతికి బోధించెనుగాని కుంతీదేవి "ఈమె యొకసారికే యిరువురు దేవతలఁగోరి యిరువురు కుమారులఁగనెను. నేను మోసపోయితిని. మఱియొకసారి చెప్పిన మరల గనును. అప్పుడు నాకంటె హెచ్చగును. కావున నేను జెప్పననెను. అరుంధతి వంటి స్త్రీ వసిష్ఠునివంటివానిని సందేహించినట్లు భారతంబున నాదిపర్వంబునఁ గలదు. గాంధారి బిడ్డలఁగనెనని విని మాద్రి బొమ్మలు గుద్దుకొనెను. కుంతికి ధర్మరాజు పుట్టెనని విని గాంధారి గర్భస్రావము చేసికొనెను. కావున స్త్రీల యందుఁ పుత్రప్రేమకంటె సపత్నీ మాత్సర్యము మెండని యేర్పడుచున్నది.

—♦ కైక నిష్ఠురోక్తులకు దశరథుఁడు విహ్వలుఁడగుట. ♦—

కం॥ నృప! నాపై భరతునిపై. శపథం బొనరించుచుదానఁ♦ జక్కఁగ వినుమీ
కృప లేక రాము నడవుల, కిపు డనుపుట తక్కనొంట♦నేఁ దృప్తిపడన్.

శపథము=ప్రమాణము-ఒట్టు. ౩౪౩

తాత్పర్యము

ఓయిరాజా! నీవు నీమీఁదను నీప్రియపుత్రుఁడగు శ్రీరామునిమీఁదను బ్రమాణము చేసితివిగదా నామాటలు చక్కఁగావినుము. నామీఁదను నాకొంటి కొడుకగు భరతునిమీఁదను బ్రమాణము చేసెదను. నిష్కారణముగ శ్రీరాము నెట్లు కష్టపెట్టుదు నను దయవదలి శ్రీరాముని నడవులకుఁ బంపుటదక్కఁ,దక్కినవి నీ వెన్ని చెప్పినను, నెన్ని యుపాయములు చేసినను, నేను తృప్తి పడుదానఁగాను. ఇది సత్యము.

చం॥ మెలఁత వచించియిట్లు విర♦మించి కడు స్వగఁ గందుఁజేనితోఁ
బలుకక యుండె, నాతఁడును♦భామిని కోరినచెడ్డకోరికల్
తలఁచి మనంబు విహ్వలతఁ♦దత్తఱ మంద ముహూర్తమాత్రదా
నలుకను బల్కు మాని సతి♦నట్టె కనుంగొని దుఃఖతప్తుఁడై. ౩౮

మెలఁత=స్త్రీ-కైక.

తాత్పర్యము

ఈ ప్రకారము తన నిశ్చయమును దెలుపు చరమవాక్యము వచించి యిఁక నీయిష్ట మేమిచేసెదవో చేయుమని దుఃఖపడురాజుతోఁ బలుకక యూర కుండెను. దశరథుఁడును గైకకోరిన చెడ్డకోరికలఁ దలఁచితలఁచి మనస్సు విర విరఁబోవుచుండఁ గొంతసేపు కోపముతో దుఃఖముతోఁ దపించుచు నేమిచేయు టకుఁ దోఁపక యామె ముఖము రెప్పవ్రాల్పక చూచుచుండెను.

చం॥ పిడుగులువోలెఁ దాఁకుచుఁ ద♦పింపఁగఁ జేయుమనోఽప్రియోక్తులన్
దొడిఁబడు స్రుక్కు, నాయువిద♦దుర్వ్యవసాయము నెంచి యెంతకుం
దొడఁగెనురా దురాత్మిక య♦నుం, దనచేసినబాస నెంచుచున్
మిడుకును, రాముఁగూరిచి త♦మిం దలపోయుచు నూర్చి వెచ్చనన్. ౩౯

మనోఽప్రియోక్తులన్=మనస్సునకు నప్రియమైన మాటలను, తొడిఁ బడున్=తొట్రుపాటుపడును, దుర్వ్యవసాయము = చెడ్డనిశ్చితపుఁదలఁపును, తొడఁగెను=ప్రయత్నించెను, దురాత్మిక=చెడ్డమనస్సుగలది, బాస=ప్రమాణము

తాత్పర్యము.

కైకయాడిన యొక్కొక్క యప్రియమైనమాట యొక్కొక్క పిడుగువలెఁ దాఁకి తపింపఁజేయఁగాఁ దొట్రుపాటుపడును. ఆమెదుష్టనిశ్చితాభిప్రాయ మెఱింగి యాహా! దుష్టచిత్త యెంతపాపకార్యమునకుఁ బూనెరా యని యాశ్చర్యపడుచు దీని నని యేమిప్రయోజనము? ఆలోచనలేక యింతఘోర ప్రమాణము ముందు మించిచేసితినే యని తపించును. అయ్యో! రామా! నాయనా! నీవెట్టులురా తండ్రీ! యడవిలోఁ గష్టపడెదవు అని యాలోచించుచు వేఁడి నిట్టూర్పులు విడుచును.

కం॥ రామా రామా యనుచును, భూమీశుఁడు నేల వ్రాలెఁ♦బొలుపరి మూర్ఛన్
వే మూల మంట నఱికిన,భూమి దబా లనుచుఁ బడెడి♦భూరుహ మనఁగన్

పొలుపఱి. పొలుపు + అఱి=పొలుపుచెడి, దబాలనుచు=భారమైన వస్తువు పడుట యందగు ధ్వన్యనుకరణము, భూరుహము=చెట్టు, మూలము=వేరు.

తాత్పర్యము

ఏమిచేయుటకుఁ దోఁపక తన యవివేకమువలన నిష్కారణముగ రాఁగల దుఃఖమాలోచించి సహింపలేక యాయనయే ధ్యానించుచు రామా రామా యని

వెఱ్ఱివలె నఱచి వేరుమొదలంటనఱికిన దబాలునఁ బడు చెట్టువలె దశరథుఁడు మూర్ఛిల్లిపడెను.

తే॥ నష్టచిత్తునిరీతి నున్మత్తుజాడ, భూరితరరోగపీడితుఁబోల్కిఁ దేజు
గూలిపోవంగ మంత్రాళిఁగుంటుపడిన,
పాముగతి నయి దీనోక్తిఁబలికె విభుఁడు. ౩౪౭

నష్టచిత్తునిరీతిన్=నాశనమైన మనస్సుగలవానివాలె ఉన్మత్తుజాడన్=మనస్సుండియు స్వాధీనమందులేని పిచ్చివానివలె, భూరితర రోగపీడితుపోల్కిన్=మనస్సు తన స్వాధీనమందుండియు గొప్పరోగముచే బాధింపఁబడువానివలె, పాముగతిన్=రోగము లేకున్నను, కఱవశక్తియున్నను మంత్రములచేఁ గట్టుపడి కదలలేని పామువలె.

తాత్పర్యము

మనస్సులేనివానివలెఁ, బిచ్చివానివలె, గొప్పరోగముతో బాధపడువానివలె, మంత్రములచేఁ దన తేజస్సుపోఁగాఁ గదలలేక కాళ్లుండియుఁ బ్రయోజనము లేని పామువలె నయి రాజు దీనవాక్యముల నిట్లనెను:-

ప్రశ్న:- వివాహసమయమునఁ జేసిన వాగ్దానము లెక్కకురాదను తలంపుతో దాని నాధారముగఁ గొనక యీయుపాయము కైకచేఁ వెదకఁబడెను. అయినను రతివేళ స్త్రీలతో బొంకవచ్చు నను న్యాయము కలదుగదా, ఆ నియమము ననుసరించి రతికై కామాతురుఁడనై చేసినప్రమాణము కావునఁ బాటింపకున్న దోషములేదని యేల దశరథునకు స్ఫురించినది కాదు.

ఉత్తరము:- దశరథుఁ డామాత్ర మాలోచన లేనివాఁడుకాఁడు. రతివేళ స్త్రీలు కోరు క్రొత్తకోరికయైనయెడల నట్టులేచేసెదననిచెప్పి యావలఁ దప్పవచ్చునుగాని ఇది యట్టిదికాదు. ఇది క్రొత్తకోరికయుఁగాదు.

అపత్సమయంబునఁ బ్రత్యుపకారబుద్ధితోఁ జేసినబాస. అప్పుడిచ్చిన వరము లిప్పుడిమ్మనెనేకాని కైక క్రొత్తవికోరినదికాదు. ఇప్పుడు మాటతప్పిన యుద్ధసమయమునఁ గృతజ్ఞుఁడై యిచ్చినవరములఁ దప్పినఁ గృతఘ్నుఁడు నసత్యవాదియు నగును గాని రతివేళఁ గోరినవరముల నిరాకరించినవాఁడు కాఁబాలఁడు. రతిసమయమగుట కాకతాళీయము. రతిసమయము కాకపోయినను పూర్వప్రమాణములకు దశరథుఁడు బద్ధుఁడే. అయినను వివాహసమయమునఁ గైకకు చేసినబాస, భరతునందుఁ దనకుఁ గల సందేహము, కైక భరతుని తల్లియగుట, శ్రీరామపట్టాభిషేక సమయమందే యామె వరములుగోరుట, యివియన్నియు నాలోచించి యిపుడు ప్రమాణముచేయక యుండవచ్చునేమోగాని కామాతిశయ వేగముచే నట్టి యాలోచన యాయనకుఁ దట్టినదికాదు. 'కామాంధోపి నపశ్యతి' యనికలదుకదా.

కాముకులకుఁగన్నులులేవు. శోణితశుక్ల సంభవో మాతృపితృనిమిత్తకః తస్యప్రదాన పరిత్యాగవిక్రయేషు మాతాపితరౌభవతః" బోధాయనులు. "తల్లి దండ్రులు నిమిత్తముగ రక్తశుక్లసంయోగమువలనఁ గలిగినవాఁడు పుత్రుఁడు వానిని దానమిచ్చుటకు, వదలిపెట్టుటకు, విక్రయించుటకుఁ దల్లిదండ్రిలిరువురు నధికారులు" కొడుకు తల్లిదండ్రుల యుమ్మడిసొమ్మగుటచేఁ దండ్రియొకఁడే స్వతంత్రించి దానమిచ్చుటగాని పరిత్యజించుటగాని విక్రయించుటగాని చేయ రాదు. తల్లియనుమతి యియ్యవలెను. ఇచ్చట నట్టియనుమతిలేదు కావున దశరథుకృత్యము న్యాయ్యమైనదికాదు.

సగరుఁ డసమంజుని దండ్రియను భావముతో వెడలఁగొట్టలేదు. అసమం జుఁడు దోషి గావున రాజగు సగరుచే దండింపఁబడెను.

రాజును నధికారమునుబట్టి శ్రీరాముని నడవులకుఁ బొమ్మనె నందమా నేరము లేక రాజెట్లు శిక్షింపఁగలఁడు? శ్రీరామచంద్రమూర్తి చేసిన నేరమేమి? రాజకీయ వ్యవహారముగఁగాక గృహకృత్యముగ విచారింతమా తల్లియనుమతి లేదు. అదియునుగాక "నజ్యేష్ఠ పుత్రం దద్యాద్గృహీయాద్వాస హిసంతానా యపూర్వేషామ్॥ వసిష్ఠుఁడు. దానము విక్రయపరిత్యాగముల కుపలక్షకము. 'నమాతా నపితానస్త్రీ నపుత్ర స్త్యాగ మర్హతి. మను ౮-౮. తల్లి-తండ్రి-భార్య- కొడుకు వీరిని వదలిపెట్టరాదు. కావున నిష్కారణముగ జ్యేష్ఠపుత్రుని విడువ రాదు. ఇట్టి యధర్మకార్యమును శ్రీరామచంద్రమూర్తి యెట్టులామోదించెను? ఇది ముందు విచారింపఁబడును.

—♦ దశరథుఁడు కైకేయితో న్యాయనిష్ఠురము లాడుట. ♦—

ఉ॥ ఎవ్వఁడె నీకు నిట్టివిష♦మేచ్చను మే లని బోధ చేసె! నీ
విర్విధి దయ్య మంటినటు♦లేటికె నానయు లేక నాకడన్
గ్రొవ్విద మాడఁ జొచ్చితివి♦కోమలి! నీయె మ న్నెఱుంగనే
యివ్వికటప్రవర్తనము♦నిప్పు డ తోఁచె విపర్యయంబుగన్. ౩౪౮

భరతుపక్షము వా రెవ్వరో బోధించిరని తలఁచి దశరథుఁడనుచున్నాఁడు.

విషమేచ్ఛను=విపరీతపుఁ గోరికను, హానికరమైన కోరికను, నాన=సిగ్గు- క్రొవ్విదము=దుష్కార్యము చేయుమని గర్వోక్తిని-వికట ప్రవర్తనము=చెడు నడవడి, విపర్యయంబుగన్=వ్యత్యస్తముగా, స్వభావవిరుద్ధముగ.

తాత్పర్యము

నీకు మేలని యిట్టిహానికరమైనదాని నెవఁడు నీకు బోధించెనే. ఎవఁడైనఁ జెప్పునుగాక నీవేల యివ్విధముగ దయ్యముపట్టినదానివలె సిగ్గువిడిచిమగఁడు- రాజునైన నాయెదుటనే యనరానిమాటలనఁ బూనితివి. ఇట్టిది మనమడుగ వచ్చునా విన్నవారేమందురు అనియైన నీకుఁ దోఁచినదికాదుగదా. కోమలీ! నీదేహ మెంత కోమలమో నీమనస్సుకూడ నంతకోమలమని తలఁచి యుంటిని

గాని యిట్టి విపరీతవర్తనము ఇంతటి కఠిన హృదయము ఇంత సాహసము నీయందున్నట్టు మున్నెన్నఁడు నేని నేనెఱిఁగిన వాఁడఁగాను. ఇప్పుడు క్రొత్తగా నిట్టివార్పుగలుగ నేమికారణము?

ఉ॥ ఏటికె నీకుఁ గల్గె భయ♦మేటికె నీ విటువంటికోరికల్
పాటిగఁ గోరఁ గొండికకుఁ♦బట్టముఁ గట్టఁగ జ్యేష్ఠు రాము ను
గ్రాటవిఁ ద్రోయ, భర్తకుఁ ద్వ♦దాత్మజలోకులకుం బ్రియంబు నీ
మాటి! యొనర్ప నెంచినను♦మానఁ గదే విపరీతపద్ధతుల్. ౩౪౯

కొండిక=చిన్నవాఁడు, ఉగ్రాటవి=భయంకరమైన యడవి,త్వదాత్మజలోకులకున్=నీ కొడుకునకు లోకులకు, నీమాటి=స్త్రీలయందుత్తమురాలా!

తాత్పర్యము

నీకు భయముగలుగ నేమికారణము? శ్రీరామునకుఁ బట్టాభిషేకము కానీ; నిన్నట్లుచేసెద నిట్లు చేసెదనని యెవరైన బెదిరించిరా. చిన్నవానికిఁ బట్టాభిషేకము చేయుమని పెద్దవానిని శ్రీరాముని భయంకరమైన యడవులపాలు చేయుమని యిటువంటి విపరీతపుఁ గోరిక లేమి న్యాయమని కోరితివే. దీనివలన నెవరెవరికే మేమి కీడు కలుగునది నీవాలోచించిన దానవుగావు. నీమగనికి నీకొడుకునకుఁ బ్రజలకు నిష్టమైన కార్యముచేయను దలంపుండెనా యిటువంటి విపరీతపు మార్గములు నడువకుము. నీవు తలపెట్టిన కార్యము ముప్వురకుఁ బ్రియమైనదికాదు.

ఉ॥ ఓయదయాత్మురాల! కలు♦షోషితధర్మవిచార! క్షుద్ర పా
పాయితశీల! రాఘవుని♦పట్లను నాయెడ నేనిఁ జెప్పవే
యేయపరాధముంగనితొ♦యేయెడ నీకును దుఃఖకారణం
బాయెనొ? తేర తేర కిటు♦లాడుట నీతియొ సాధ్వీరీతియో? ౩౫౦

అదయాత్మురాల=దయలేని మనస్సుగలదానా, నీవిట్టులగుటకుఁ గారణమే మనెదవా? కలుషోషిత ధర్మవిచార=శ్రీరామునివంటి ధర్మాత్ముని నడవుల పాలుచేసి దుఃఖపడఁ జేయవలయునను తలంపుచేఁ గలిగిన పాపముచే నష్టమైపోయిన ధర్మవిషయమున నాలోచన గలదానా; శ్రీరాముని విషయమునఁ గీడు తలంచిన పాపమే నీకిది ధర్మ మిది యధర్మమను నాలోచన లేకుండఁ జేసినది అట్టి బుద్ధి నాకేల గలిగెనందువా, క్షుద్ర=నీచురాలా! నీవు నీచపుబుద్ధి గలదానవు కావున; నాకేల యట్టి నీచబుద్ధి పుట్టెనందువా! పాపాయితశీల=పూర్వజన్మములందుండియే పాపిష్ఠమగు స్వభావము గలదానవు, తేరతేరకు=నిష్కారణముగ-(రూ) తేరకుఁదేర, సాధ్వీరీతియో=పతివ్రతకుఁదగిన విధమా

తాత్పర్యము

ఓసి దయలేనిదానా! పాపముచే నశించిన ధర్మాలోచనగలదానా! నీచబుద్ధీ! యాకారము గొన్న పాపమా! శ్రీరాముని యందుఁగాని నాయందుఁగాని యేమి నేరము కనిపెట్టితివి? ఏవిషయమున మావలన నీకు దుఃఖము గలిగెను. చెప్పవే

చూతము. నిష్కారణముగా నిటువంటి మాటలాడుట నీతియుఁగాదు. పతివ్రత లకుఁ దగినవిధముగాదు.

కం॥ రాముండు లేక యుండిన, నీ మహి భరతుండు పూనఁనే యెంతైనన్?
రామునికంటెను భరతుఁడె, భామిని! ధర్మంబునందుఁ బ్రాజ్ఞుఁడుసుమ్మీ.

ప్రాజ్ఞుఁడు=విశేషజ్ఞానము గలవాఁడు, శ్రీరామునందు పారతంత్ర్యనిష్ఠ గలవాఁడు.

తాత్పర్యము

నీవేమో శ్రీరామచంద్రుఁడు నగరము విడిచిపోయిన భరతుఁడు నిష్కంటక రాజ్యమేలునని తలఁచితివి కాని నీకోరిక నెఱవేఱదు. ఏల యందువా శ్రీరామచంద్రుఁడు లేకపోయెనా భరతుఁడు భూభారమొక నాఁడైన భరింపఁడు. అదినీకెట్లు తెలిసెనందువా కోపనా! ధర్మవిచారమందు శ్రీరామునికంటె భరతుఁడే యెక్కువ తెలిసినవాఁడు కావునఁ బెద్దవాఁడుండఁగా బిన్నవాఁడు రాజ్యము భరించుట ధర్మముకాదని యెఱిఁగి రాజ్యమును గొంతయైనఁ బాలింపఁ బూనఁడు. శ్రీరాముఁడుండి కొంతభాగమాయన పాలించినఁ గొంత భరతుఁడు పాలించుట కంగీకరించునేమో. అటు గావున రాజ్యమును రెండు భాగములుగానో నాలుగుభాగములుగానో చేయఁగోరుము. లేదా యూరకనగర మందుండనిమ్ము.

కం॥ వనమున కరుగుమ రామా, యని సంతనె రాహుగ్రస్తమగు శశిబింబం
బన నొప్పి వెలవెలం జను, ఘనమతి యగు రాముమోముఁ గసనెటులోర్తున్

రాహుగ్రస్తము=రాహువుచే మ్రింగఁబడినది, శశిబింబము =చంద్ర బింబము, ఘనమతి=గొప్పమనస్సుగలవాఁడు.

తాత్పర్యము

భరతుఁడు రాజ్యమేలనీ, యేలకపోనీ, అదెట్లులైననగునుగాక. రామా నీవడవులకుఁ బొమ్మనఁగానే రాహువు మ్రింగిన చంద్రబింబమువలెఁ దేజోహీనమై వెలవెలఁబోవు శ్రీరాముని సుందర ముఖారవిందమును నేనెట్లు చూడఁగలను. చూచి యెట్లు సహింతును?

కం॥ హితసహితంబుగ మును ని,శ్చిత మగుమతి కీడు వొందఁ జెలియా! పరసం
హతినిహత మైనవాహిని,గతి నెట్లే మరలఁ జేసి కలను సుఖింపన్. ౩౨౩

హిత సహితంబుగన్=హితులతోడ, మును=ఇంతకుముందే, నిశ్చితము= నిశ్చయింపఁబడినది, మతి=మనస్సు, పరసంహతి = శత్రుసమూహములచే, నిహతమైన=కొట్టఁబడిన, వాహిని=సేన.

తాత్పర్యము

మంత్రులు పురోహితులు సామంతులు లోనగు హితులతో నాలోచించి తగిన కార్యమని శ్రీరామపట్టాభిషేకము మనస్సున నిశ్చయించితిని. శత్రువులచేఁ గొట్టఁబడిన సేనను వెనుకకుఁ ద్రిప్పినట్లు లట్టి మనస్సును ద్రిప్పి నే నే విధముగా సుఖింతునే. యుద్ధమున శత్రువులచేఁ బరాజయముగాంచిన సేనను వెనుకకుఁ ద్రిప్పిన రాజున కేరీతి కీర్తిసుఖములు లేవో యట్టులే రామరాజ్యాభిషేకమున కభిముఖమైన మనస్సునునందుండి మరలించిన నాకును గీర్తిసుఖములు లేవు.

సీ॥ దిక్కుదిక్కులనుండి♦మక్కువ మూఁగిన, వసుధేశు లే మను♦వారు నన్ను
జడమతి యాజి యే♦వడువునఁ బాలించె, నింతకాలము ధాత్రి♦నిస్సియనరె
పెద్దలు సజ్జనుల్♦విద్వాంసులును రామ,భద్రుఁ డేఁడన నేమి♦పలుకువాఁడఁ
గైకేయి పీడింపఁ♦బోకార్చితిని బుత్రు,నందనా?యదియుయ♦థార్థమయ్యెఁ
తే॥ బదుగురు వినంగ సభలోనఁ♦బలికెనట్టి,
పలుకు దీర్పమి సత్యంబు♦భంగపడదె
యెన్ని విధములఁ జూచిన♦నిహముఁబరము,
నున్న నీమాటఁబట్టిన♦సుంద రాంగి! ౩౭౪

వసుధేశులు=రాజులు, జడమతి = మొద్దు బుద్ధిలేనివాఁడు, ఆజి=దశరథుఁడు వడువునన్=విధముగ, ఇస్సీ=ఛీ, పోకార్చితిని=పోఁగొట్టు కొంటిని.

తాత్పర్యము

శ్రీరామపట్టాభిషేకమందలి ప్రీతితో నానా దిక్కులనుండి రాజులు మన నగరమున నుదయ వేళకు గుంపులు చేరుదురే. వారందఱీవార్త విని నన్నే మందురు? ఛీ. దశరథుఁడు బుద్ధిలేనివాఁడు. ఇట్టి వాఁడింత రాజ్యమేవిధమునఁ బాలింపఁగలిగెననరా వీరందఱు నాకు లోపడినవారు కావున నాయెదురుగ నేమన లేరనుకో. కులమున గుణమునఁ బెద్దలును సత్పురుషులును బండితులును వచ్చి దశరథా రామభద్రుఁడేఁ డీయన నేమందును

కైకేయి బాధింపఁగాఁ గొడుకును బోఁగొట్టు కొంటినందునాఅంటినిబో అదియథార్థమయ్యెను రాజాపదిమందిలోకులు వినఁగా రేపటియుదయము శ్రీరామునకుఁ బట్టాభిషేకము చేయుదునంటివే. ఆ పలుకేమాయె. అది యసత్యమా? యనిననేనేమి బదులాడఁగలను. ఈమాత్రమునకు సభయని లోకుల యభిప్రాయము తెలిసి కొనుటయని పట్టాభిషేకమని యీ యాడంబరమేల చేసితివనిన నేనేమందును. ఓసి సుందరీ నీమాట చొప్పున వర్తించితినా నాకిహమునఁ బేరు పెంపులేదు. పరలోక సుఖములేదు.

ఇచ్చట నొకటి విచారింపవలయును. సభలో శ్రీరామచంద్రమూర్తికిఁ బట్టాభిషేకము చేసెదనని దశరథుఁడు చెప్పెను. ఆ వెనుక నతని గైక సత్యపాశబద్ధునిఁ జేసెను. ఇట్లు పరస్పర విరుద్ధధర్మములు ప్రసక్తించి నప్పుడు ముందుచేసిన

సత్యముగదా నెఱవేర్పవలయును. "ధర్మం యో బాధతే ధర్మో న స ధర్మః కువర్త్మ తత్। అవిరోధాత్తు యో ధర్మః స ధర్మః సత్యవిక్రమ॥ భార. ౩, ౧౩౧-౧౧.

ధర్మమును బాధించు నుదియొకధర్మము ధర్మమనఁబడదు అదికుత్సిత మార్గమే. పరస్పర విరుద్ధములేని ధర్మమేదో యదిధర్మము. ప్రమాణమట్లుండ ముందుసభలోఁ జెప్పిన మాటను దృఢీకరించి రెండవదానికేల దశరథుఁడు ప్రాముఖ్యమిచ్చెను? ప్రత్యుత్తరము వరములు నిర్దిష్టములు కాలేదుగాని కైకకే ముందువరము లొసఁగబడెను. అదియునుగాక సభలోఁ జెప్పినది తనయభిప్రాయము మాత్రమే. కాని ప్రమాణము పూర్వకమునఁ జెప్పినదికాదు. కైకకిచ్చినవి ప్రమాణ పూర్వకములు గావునఁ బూర్వము దానికంటె నిది బలిష్ఠమాయెను.

కం॥ అడవులకుఁ బనుపఁ దనసుతు,
నడుగునొ యేమనుచుఁ గోస • లాత్మజ నను, నా
కొడు కేఁడీయన నే మని, నొడువుదునే విప్రియంబు • నుం జేసి యిటుల్.
లోకు లేమనుకొనిన నాకేమి యని యూరకుందునా? ౩౫౯

నొడువుదునే=చెప్పుదునే.

తాత్పర్యము

తనకుమారుని నడవులకుఁ బంపిన నన్నుఁ గౌసల్యానాథా! నాకొడుకేఁడీయన గైకేయిని సంతోషపెట్టఁగోరి కానలకుఁ బంపితినని యెట్లు చెప్పుదునే. ఇంతటి ద్రోహముచేసి నాకు నోరెట్లాడునే బదులు చెప్పుటకు.

సీ॥ సమయోచితంబుగ • సఖివలె దాసి నా, భార్యయట్టుల సొంత • భగినిరీతిఁ
దల్లిమాడ్కిఁ జరించు • దగసుప్రియంవద,
ప్రియకామ ప్రియపుత్ర • ప్రేమకెంతొ
యర్హులరాలయ్యు • నకట యాకౌసల్య, నీకతంబునఁజేసి • నేను గౌర
వింపనైతిని నవి • వేకినై నాపర్చు,పాటు లెంచినఁ గడు • భగ్గుమనియె
తే॥ నేను నీకయి చేసిన • దెల్లఁ దలపఁ, వ్యాధిపీడితుఁ డగునాతఁ • డరయ లేక
చలుపు నట్టియపథ్య భో • జనముభంగి, వనటఁ బెనుపంగ సాగెనే • వగలమారి.

సమయోచితంబుగన్=ఆయాసమయమునకుఁ దగినట్లు, సఖి=చెలికత్తె, సొంత=ఒకకడుపునఁబుట్టిన, భగిని=చెల్లెలు, సుప్రియంవద=మంచిప్రియము లేపలుకునది, ప్రియకామ=నాప్రియమునే కోరునది, ప్రియపుత్ర=నాకత్యంత ప్రియుఁడైన పుత్రునిఁగలది, నీకతంబునన్=నీకారణముచే, పర్చుపాటులు=బాధించుబాధలు, వనట=దుఃఖము

తాత్పర్యము

ఉన్నది చెప్పిన నేమి యందువా? కౌసల్య యాయాసమయమునకుఁ దగినట్టు లాటలు మొదలగువానిపట్ల చెలికత్తెవలెను, ఊడిగముచేయుపట్లఁ దానుపట్టపు

రాణి యన్నగర్వము విడిచి దాసివలెను, నేను ధర్మకార్యములు చేయునపుడు తాను సహధర్మచారిణి యని స్మరించి పట్టపుదేవియను నభిమానము వదలి నా ధర్మపత్నివలెను, తన్నుఁగాక, వేఱుభార్యలను నేను గ్రహించునపుడు వారిపై నసూయపడక వారికి నొక తల్లికడుపునఁ బుట్టినదానివలెను, భోజనాదులచే నా దేహమును బోషించుపట్టులఁ దల్లివలెను జరించునట్టిది. ఎప్పుడు మంచిప్రియ ములు పలుకును గాని నీవలె నప్రియములు పలుకునదికాదు. నాప్రియమునే కోరును గాని నీవలె నప్రియమును గోరదు. నాప్రియమెంచు పుత్రునిగలది గాని నీవంటిదిగాదు. ఇట్టిది కావున నాప్రేమకు మిక్కిలి యోగ్యురాలు. ఇట్టు లుండియు ధర్మాత్మురాలైన కౌసల్యను నీ కారణమున నీయందలి కామముచే నీవు కోపింతువో యని నేనునీకు భయపడి ఆమె యోగ్యతకుఁ దగినట్టు గౌర వించినవాఁడనుగాను. గౌరవింపకుండినఁ బోనీ తెలివిమాలినవాఁడనై యామె నెన్నియో బాధలుపెట్టితిని. అవియన్ని తలఁచుకొలఁది కడుపులో భగ్గుమని మంటలెగయుచున్నవి. ఇఁక నీకుఁజేసిన మేళ్ళు తలఁచితినా రోగముచే బాధ పడువాఁడు తనమేలు తాను విచారింపలేక నోటికిఁ దత్కాలమున రుచిగా నున్న దని చేయు నపథ్య భోజనమువలె నోసి వగలమారీ దుఃఖమును హెచ్చుచేయు చున్నదే.

ఎండ వడఁబడినవానికిఁగాని నీడ సుఖముదోఁపదు. తీపేతినువానికిఁదీపు రుచింపదు. చేఁదు తినవలసివచ్చినపుడు తీపే బాగనితోఁచును. కౌసల్య మేలిమి యిప్పుడు దశరథునకు మనస్సునకు వచ్చెను. మగఁడు తన్నుపేక్షించినను గౌసల్య పతివ్రతగావున మగనిమనస్సు నొప్పించినదికాదు. తానుజేయవలసిన సేవ చేయుచునే యుండెను.

కం॥ రామునియెడ నిట్టివి కొఱఁగాములు గావించి పనుపఁ•గానకుఁ గని న
న్నేమాడ్కి నమ్మఁజాలునొ,కో మహిళామణి సుమిత్ర•కూఁరసభీతిన్. ౩౨౭

కొఱగాములు=చేయరానిపనులు.

తాత్పర్యము

శ్రీరామునివంటి ప్రియపుత్రుని విషయముననే యిట్టి చేయరాని ఘోర కార్యములు చేయు నన్నుఁజూచి స్త్రీరత్నమైన సుమిత్ర యిఁకఁ దనకొడుకుల గతి తన గతి యేమో యని యెంత భయపడునో కదా ఇఁక నన్నెట్లు నమ్మఁ గలదు.

కం॥ పంచత నేఁ గనుటయు వన,సంచారము సేయ విభుఁడు•చను టెఱిఁగెం డా
లించి యెటు సైఁచు నయో్య,పంచాననమధ్య సీత•పటుదుఃఖంబున్.౩౨౮

పంచత=మృతి, బాల్యకౌమార యౌవన వార్ధక మృతులను పంచావస్థ లలో నైదవయవస్థ, ఆలించి=విని, పంచాననమధ్య=సింహము నడుమువంటి సన్నని నడుము గలది.

తాత్పర్యము

నామరణము నడవియందుఁ దనవిభుఁడు సంచారముచేయఁబోవుట యీరెండు వార్తలువిని సీతాదేవి తీవ్రదుఃఖము నెట్లు సహింపఁగలదు.

కం॥ కట్టా తనపతి నడవికి, నెట్టిన దుఃఖమున సీత♦చెడి మంచుం
గుట్టకడఁ గిన్నరునిఁ బోఁ,గొట్టుకొనినకిన్నరివలెఁ♦గూలుం గాదే. ౩౫౯

కట్టా=అయ్యో! సంతాపార్థకము, నెట్టిన=త్రోసిన, నెఱి = అందము మంచుంగుట్ట=హిమాలయము.

తాత్పర్యము

అయ్యో తనమగని నడవులకు బలవంతముగాఁ బంపినవార్తవిని దుఃఖముచే హిమవత్పర్వతమునొద్దఁ దనప్రియుఁడగు కిన్నరుని బోఁగొట్టుకొనిన కిన్నరివలె సీత గూలిపోవునుగదా.

కం॥ అడవికిఁ జనుసుతుఁ గంటికిఁ, గడవెఁడుగా నేడ్చుజనక♦కన్యం గనుచున్
గడుదుఃఖపడుచు నే నో, పడఁతీ! జీవింపఁ గలనె♦బహుకాల మిలన్. ౩౬౦

తాత్పర్యము

అడవికిఁబోవు పుత్రుని, గన్నులనుండి కడవలు కడవలుగాఁ గన్నీరు కార్చు జనకమహారాజు పుత్రికనుజూచి దుఃఖించుచు నేను భూమిమీఁద నిఁక దీర్ఘకాలము బ్రతుకఁగలనా?

కం॥ సీతాకాంతునిఁ బాసిన, నాతరమా వెండి బ్రదుక♦నామృతిఁ గని వే
యాతల విధవా! రాజ్యము, నీతలనే కట్టుకొమ్ము♦నీపుత్రునితోన్. ౩౬౧

సీతాకాంతుని=శ్రీరాముని, తరమా=వశమా, వెండి=మఱియును.

తాత్పర్యము

శ్రీరాము నడవులకుఁ బంపుమంటినిగాని నన్నుఁ జావుమంటినా యందువేమో విషము తినుమంటినిగాని చావుమంటినాయన్నట్లు శ్రీరామునినెడఁబాసి యాపిమ్మట దేహమునఁ బ్రాణములు ధరించియుండ నాకు సాధ్యమా. శ్రీరాముఁడే నాకుఁబ్రాణము. శ్రీరామునిపోక ప్రాణముపోక రెండు నొకసారి జరగునవియే. కావున నేను మరణించుటే సత్యము, నీవు విధవయగుటే నిజము.కావున విధవవై నీవు నీకొడుకుతో రాజ్యమంతయు నెత్తిమీఁదఁ గొట్టుకొమ్ము.

కం॥ తళతళ మనుదుర్విషస,మ్మిళితమదిరఁ గ్రోలి వెండి♦మిడుకునరువలెన్
దెలియక సతి వని యసతీ! తలపై నెక్కించుకొంటిఁ♦దాపముఁ గంటిన్.

దుర్విష=క్రూరమగు విషముతో, సమ్మిళిత=చక్కఁగాగలిసిన, మదిరన్=సారాయమును, క్రోలి=త్రావి, మిడుకు=బాధపడు, అసతీ=దుష్టురాలా.

తాత్పర్యము

తళతళమను కాంతులతో మెఱయుచున్న విషముతోఁగలిసిన సారాయమును మంచినీటికంటె శ్రేష్ఠమని భ్రమపడి త్రావి ప్రేగులు కోయఁగా దుఃఖించు మనుష్యునివలెనేనీ సౌందర్యముఁజూచి బేలుపోయి నీలోనుండు విషమబుద్ధి తెలిసికొనలేక యసతీ! తలమీఁద నెక్కించుకొని గౌరవించితిని. ఆపాపఫలమును దాపరూపమున ననుభవించుచున్నాను.

తే॥ ఇచ్ఛకపుఁగల్ల లాడి నీ•యిచ్ఛకొలఁదిఁ
జేపడిననన్నుఁ జంప నే•ర్చితివె చెనఁటి!
కాన మృగయుఁడు శ్రవ్య మౌ•గానరవము
నెఱపి జింకను వధియింప•నేర్చినట్లు? ౩౬౩

ఇచ్ఛకొలఁదిన్=ఇష్టప్రకారము, చేపడిన=స్వాధీనపడిన, చెనఁటి=దుష్టురాలా! కానన్=అడవియందు, మృగయుఁడు = వేఁటకాఁడు, శ్రవ్యమౌ= విననింపైన.

తాత్పర్యము

నాముఖప్రీతికొఱకు శ్రీరాముఁడు నాపెద్దకొడుకు. భరతునికంటె శ్రీరాముఁడే నాకుఁ బ్రియుఁడు అని యిటువంటి యసత్యము లెన్నియోచెప్పి నమ్మించి వశపడిన నన్ను దుర్మార్గురాలా చంపఁజాలితివికదా. అడవియందు వేఁటకాఁడు విననింపైన స్వరము గానధ్వనిని వ్యాపింపఁజేసి యది వినవచ్చిన జింకను జంపినట్లు కదా నీవు నావిషయమున వర్తించితివి.

కం॥ సతితోడిసుఖముఁ గోరఁగా సుతు నమ్మెడినన్నుఁ జూచి•సూరులు వీథీ
తతులందుఁ గల్లు ద్రావిన, క్షితిసురు నిందించునట్లు•చెడనాడ రొకో. ౩౬౪
సూరులు=పండితులు, క్షితిసురున్=బ్రాహ్మణుని, చెడనాడరొకో=నిందింపరా

తాత్పర్యము

సతితోడ రతిసుఖముఁగోరి సుతుని విక్రయించు నన్నుఁజూచి వివేకవంతులు నడివీథులందుఁ గల్లుద్రావిన బ్రాహ్మణుని నిందించినట్లు నిందింపరా.

సీ॥ నీమాట వినియును•నిను సైఁచు చున్నాఁడ,
నెంతకష్టం బయ్యె•యెంతదుఃఖ!
మిది తొలిజన్మమున•నే నొనరించిన, దోషంబు గుడువక•తొలఁగు నెట్లు?
పెద్దకాలముగ నిఁ బాపిని నిన్ను రక్షించి,తిని గదా యురిత్రాటి•తెరువుదోఁపఁ
జిఱుతవాఁ డొంటిసైఁ•జెడుపాము నంటిన,రీతి నిన్ గైకొంటి•మృత్యుభంగి

ఆ॥ నెంతబాలుఁ డ•నెంతటికాముకుం, డెంతదుష్ట బుద్ధి•యీవిభుండు
ముద్దు స్త్రీ కాముఁ•ముదితకై యడవికిఁ,బనుచువాఁ డిదేమి•పాపమొక్కొ

తొలిబాము=పూర్వజన్మము, భవముయొక్క తద్భవము బాము. "ఏబాము తెలియఁగక యేపారు మేటికిఁ బసులకాఁపరియింట బాముగలిగె" భాగ. కుడువక= అనుభవింపక, బాలిశుండు=మూఢుఁడు.

తాత్పర్యము

ఓసీ! నీవిన్ని కొఱుకూఁతలు కూసినను వినుచు నీకుఁ దగినశాస్తిసేయక సహించియున్నాఁడనుగదా. ఇంతకంటెఁ గష్టగాలముండునా? ఎంతదుఃఖ మెంత దుఃఖము. ఈ యనుభవము పూర్వజన్మంబున నేనుజేసిన పాపఫలము, అది యనుభవింపక నశించునా? నాభుక్తం క్షీయతేకర్మ కల్పకోటిశతైరపియని ప్రమాణవాక్యము కలదుగదా. పాపాత్మురాలవగు నిన్నుఁ జాలకాలముగ నాయురిత్రాడును నేను రక్షించినట్లు రక్షించితినిగదా. బాలుఁడు తనకు మృత్యువని తెలియక యొంటరిగా నితరులతో నాలోచింపక క్రూరసర్పమును దాఁకిన రీతి నిన్ను గ్రహించితిని. ఈ రాజెంత మతిలేనివాఁడు. ఎంతటి కామదాసుఁడు. ఎంత చెడుబుద్ధిగలవాఁడు. అయ్యో! యిట్టివాఁడుగాకుండినఁ దనముద్దుల కుమారుని నాఁడుదానిని సంతోషపెట్టుటకొఱకై యడవికిఁబంపునా? ఇట్టిపాపము కూడ లోకమునఁ గలదా?

కం॥ అని నిఖిలజీవలోకం, బనయము నను దూఱకుండునా? వ్రతములచే
తను బ్రహ్మచర్యమునఁ దా,
వనరియు సుఖవేళ సుతుఁడు వనములఁ బడెడిన్. ౩౬౬

అనయము=ఎల్లప్పుడు, ఇప్పుడేకాదు, కలకాలము, దూఱకుండునా= నిందింపకుండునా, వనరి=తపించి, కైక వరములడిగినపుడు తొలుత శ్రీరాము నరణ్యమునకుఁ బంపనని నిరాకరించెను. (౩౧౩-వ పద్యము) ఆవలఁ బంపుదునా వలదాయని సందేహంబునఁ బంపిన రాఁగల కష్టములను నాలోచించెను. ఇప్పుడు పంప నిశ్చయించుకొని మాటలాడుచున్నాఁడు.

తాత్పర్యము

అన యీప్రకారము సమస్త ప్రాణికోటు లిపుడేకాక కలకాలము నన్ను నిందింపకుండునా? ఎట్లుండఁగలదు. ఇన్నిదినములు శ్రీరాముఁడు పవాసాది వ్రతములచేతను మధుమాంసవర్జనాది బ్రహ్మచర్య నియమమునను కష్టపడుటయందే కాలము పోయెను. ఇక గృహస్థాశ్రమసుఖ మనుభవించు సమయము వఱకు నడవులపాలు కావలసి వచ్చెను.

ఒకఁడు ౨౫ సంవత్సరములవఱకు బ్రహ్మచర్యము, ౨౬ మొదలు ౫౦ వఱకు గార్హస్థ్యము, ౫౧ మొదలు ౭౫ వఱకు వానప్రస్థము, ఆవల వైరాగ్యము కుదిరెనేని సన్న్యాసము తీసికోవలయునని శాస్త్రనియమము. ఇప్పటికిశ్రీరామున కిరువదియైదు సంవత్సరములే కావున వివాహమైనను నింతవఱకు రతిసంభోగాదులు మాంసాది భక్షణము వదలి యుండెనని యేర్పడుచున్నది. ఆటుగాదేని

౧౨ సంవత్సరములు వివాహముమొదలు సతీపతులు సంభోగించియుండిన సీతకుఁగానియామె చెల్లెండ్రలో నొకతెకుఁగాని గర్భమురాక యుండునా? ఈ యభిప్రాయమునకుఁ గొన్ని సాధకములు కొన్ని బాధకములు గలవు. ఇంకను విచారింపవలయును.

కం॥ ఆమహనీయుఁడు దురితపు, భూమి యయిననాకు నేల♦పుట్టెనొ కట్టా
రాముఁ డయో నాకతమున, వామాక్షీ! తండ్రిలేని♦వాఁ డయ్యెఁ గదే.

మహనీయుఁడు=పూజ్యుఁడు,దురితపుభూమి = పాపస్థానము-కట్టా=అయ్యో నాకతమునన్=నేను గారణముగా.

తా త్ప ర్య ము

అయ్యో! భూమియగు శ్రీరామచంద్రుఁడు నావంటి పాపభూమికిఁ బుత్రుఁడై యేలపుట్టెనే. ఓసీ వక్రదృష్టి! శ్రీరామచంద్రుఁడు తండ్రిలేని వాఁడగుటకు నేనేకదా కారణమైతిని.

కం॥ వనముల కరుగుమ తనయా!యన రెండవమాట చెప్పఁ♦డటులే యను,వాఁ
డనినఁ బ్రతికూలవచనం, బనయత నాకెంతొ మేలి♦యనఁ డటులయ్యో.

ప్రతికూలవచనము=ఎదురుమాట-అనయత=వినయముతప్పి.

తా త్ప ర్య ము

నాయనా! నీ వడవులకుఁ బొమ్ము అనినేను జెప్పినంతమాత్రమున సరే పోయెద ననునేకాని నేనేల యడవులకుఁ బోవలెను. అటువంటి నేరము నేనేమి చేసితిననియైన నడుఁగఁడే. అటుగాక పుత్రుఁడు పితృవాక్య పరిపాలనముఁ జేయ వలయునను నీతితప్పియైన నేను బోను అని చెప్పినను నాకు సంతోషమే. అయ్యో! అటులనఁడే యేమిచేయుదును.

ఆ॥ నిష్కళంకుఁ డగుట♦నెటీరామచంద్రుండు,
తెలియఁడకటనాడు♦తెలుఁగుమతియు
వనికి నరుగు మన్న♦వల్లే యనుం గాని,
యడుగఁ బోఁ డదేల♦యనుచునవైన. ౧౬౯

నిష్కళంకుఁడు=నిర్మలమైన మనస్సుగలవాఁడు, వల్లె=అట్టులే కానిమ్ము.

తా త్ప ర్య ము

శ్రీరాముని మనస్సు నిర్మలమైన దగుటచే నందఱి మనస్సునట్టివేయను కొనునుగాని నా విధముగాని నేనట్లు చెప్పవలసి వచ్చిన కారణముగాని తెలియ నేరఁడు. కావున నడవికిఁబోరా నాయనా యనఁగానే తన మేలునకై మంచి బుద్ధితోఁ జెప్పుచున్నానని యంగీకరించునేకాని యేల పొమ్మనెదవనియైన నడుగఁడు. కుటిల బుద్ధితోఁ జెప్పుచున్నానని సందేహింపఁడు.

తే॥ రాము ననిచినయంత న♦రణ్యమునకు, సర్వజనముల ధిక్కృతి♦సైఁపలేని
యసమపాతకిఁ దత్క్షణ♦మంద మృత్యు,
వెట్టులున్ యమగృహమున♦కీడ్చునన్ను. ౩౭౦

౧౨ సంవత్సరములు వివాహముమొదలు సతీపతులు సంభోగించియుండిన సీతకుఁగానియామె చెల్లెండ్రలో నొకతెకుఁగాని గర్భమురాక యుండునా? ఈ యభిప్రాయమునకుఁ గొన్ని సాధకములు కొన్ని బాధకములు గలవు. ఇంకను విచారింపవలయును.

కం॥ ఆమహనీయుఁడు దురితపు, భూమి యయిననాకు నేల•పుట్టెనొ కట్టా
రాముఁ డయో నాకతమున, వామాక్షీ! తండ్రిలేని•వాఁ డయ్యెఁ గదే.

మహనీయుఁడు=పూజ్యుఁడు,దురితపుభూమి=పాపస్థానము-కట్టా=అయ్యో నాకతమునన్=నేను గారణముగా.

తాత్పర్యము

అయ్యో! భూమియగు శ్రీరామచంద్రుఁడు నావంటి పాపభూమికిఁ బుత్రుఁడై యేలపుట్టెనే. ఓసీ వక్రదృష్టి! శ్రీరామచంద్రుఁడు తండ్రిలేని వాఁడగుటకు నేనేకదా కారణమైతిని.

కం॥ వనముల కరుగుమ తనయా!యన రెండవమాట చెప్పఁ•డటులే యను,వాఁ
డనినఁ బ్రతికూలవచనం, బనయత నాకెంతొ మేలు•యనఁ డటులయ్యో.

ప్రతికూలవచనము=ఎదురుమాట-అనయత=వినయముతప్పి.

తాత్పర్యము

నాయనా! నీ వడవులకుఁ బొమ్మని నేను జెప్పినంతమాత్రమున సరే పోయెద ననునేకాని నేనేల యడవులకుఁ బోవలెను. అటువంటి నేరము నేనేమి చేసితిననియైన నడుగఁడే. అటుగాక పుత్రుఁడు పితృవాక్య పరిపాలనముఁ జేయవలయునను నీతితప్పియైన నేను బోను అని చెప్పినను నాకు సంతోషమే. అయ్యో! అటులనఁడే యేమిచేయుదును.

ఆ॥ నిష్కళంకుఁ డగుట•నెఱిరామచంద్రుండు,
తెలియఁడకటనాడు•తెలుఁగుమతియు
వనికి నరుగు మన్న•వల్లె యనుం గాని,
యడుగఁ బోఁ డదేల•యనుచునన్నె. ౯౬౬

నిష్కళంకుఁడు=నిర్మలమైన మనస్సుగలవాఁడు, వల్లె=అట్టులే కానిమ్ము.

తాత్పర్యము

శ్రీరాముని మనస్సు నిర్మలమైన దగుటచే నందఱి మనస్సునట్టివేయను కొనునుగాని నా విధముగాని నేనట్లు చెప్పవలసి వచ్చిన కారణముగాని తెలియ నేరఁడు. కావున నడవికిఁబోరా నాయనా యనఁగానే తన మేలునకై మంచి బుద్ధితోఁ జెప్పుచున్నానని యంగీకరించునేకాని యేల పొమ్మనెదవనియైన నడుగఁడు. కుటిల బుద్ధితోఁ జెప్పుచున్నానని సందేహింపఁడు.

తే॥ రాము ననిచినయంత న•రణ్యమునకు, సర్వజనముల ధిక్కృతి•సైఁపలేని
యనమపాతకిఁ దక్షణ•మంద మృత్యు,
వెట్టులున్ యమగృహమున•కీడ్చునన్ను. ౩౭౦

వంతులైన రామలక్ష్మణ శత్రుఘ్నులను మిక్కిలి దుఃఖములలోఁ ద్రోచి నీవు మాత్రము లోకులందఱు ఛీకొట్టుచుండ సర్వసుఖము లనుభవింపుము.

ఉ॥ రాముఁడు నేను లేమిని ది•రంబును సత్కృతమున్ గుణోత్కరో
ద్దామము శాంత మైనరఘు•ధాత్రిపువంశము పాడుగాఁగ నీ
వీమహి నేలు, నీసుతున•కిష్టమ యేన్ రఘురాము వీడుటల్
నామృతివెన్క నీసుతుఁడొ•నర్పఁడుగాక మదుత్తర క్రియల్. ౩౭౩

తిరంబును=స్థిరమును అనఁగా ననాదిగానుండునది, సత్కృతమున్=పుణ్యవంతమైనది, గుణోత్కరోద్దామము = గుణసమూహములచే గొప్పది, శాంతము=ఏకుటుంబచ్ఛిద్రములులేక యేకవిధముగ నిమ్మళముగనుండినది. మదుత్తరక్రియల్=నాకుమరణానంతరము చేయవలసిన నౌర్ధ్వదైహికక్రియలు

తాత్పర్యము

ఈమారఘువంశము గీర్తిమంతముగా క్షేమముగా నింకను గొన్నినాళ్లు భూమిపై నుండవలసియుండెనా శ్రీరాముఁడుండుట ముఖ్యము. ఆయనలేక పోయెనా యింకను గొన్నాళ్ళయిన నేను జీవించియుండవలెను. మేమిరువు రము లేకపోయితి మా యనాదికాలమునుండి పరంపరగా నవిచ్ఛిన్నముగా వచ్చుచుఁ బుణ్యకార్యములే చేయుచు లోకగౌరవమునకుఁ బాత్రమై సద్గుణ సమూహములచే గొప్పదనిపించుకొని యేకుటుంబకలహములు లేక యేక విధముగనుండు రఘువంశము పాడుగాఁగ నీవే యీ రాజ్యమంతయు నెత్తిపైఁగొట్టుకొని యేలుచుండుము. భరతుఁడు రఘువంశమువాఁడు కాఁడా? యందువేమో, జ్యేష్ఠాంశన్యాయము తప్పించి అన్యాయముగ రాజ్యమాక్ర మించుటచే రఘువంశరాజుల ధర్మము నిర్మూలించినవాఁడగుటచే నుద్యానవన ములోని కంపచెట్టువలె మావంశమునఁ బుట్టియుఁ బుట్టనివాఁడే. కావున శ్రీరా ముని విడనాడియుండుట నీకొడుకున కిష్టమేని యట్టి యధర్మచరిత్రుఁడు విడుచు తిలోదకములు తండ్రిని జెందఁ జాలవు గనుకవాఁడు మరణించిననాకు నూర్ధ్వలోకక్రియలు చేయఁగూడదు.

ఆ॥ ఓసి దుష్టురాల•యోసి నా పగదాన, యేను నీల్గ రాముఁ•డేగ వనికి
విధవ వగుచు నేల•వే సర్వరాజ్యంబు,నీవు సుతునితోడ•నిచ్చకొలఁది.౩౭౪

తాత్పర్యము

ఓసి దుష్టబుద్ధీ! యోసి శత్రురూపిణీ! నేను మరణింపఁగా శ్రీరాముఁడడ వికిఁ బోఁగా నీవు విధవవై నీయిష్టముకొలఁది స్వరాజ్యము నీకొడుకు తోడనీవే యేలుకో.

ఆ॥ తోర మగునకీర్తి•ధ్రువపరిభవమును, బ్రజలచే నవజ్ఞ•పాపశీల
నీదురూపుఁ గాంచి•నిలిచెనే నాయింట,నతులపాపియింటిఁ•పుండుఁబోలె.

తోరము=అధికము, స్థూలశబ్దభవము, పరిభవము=అవమానము,అవజ్ఞ= తిరస్కారము.

తా త్ప ర్య ము

పాపాత్ముల యింటియందుండవలసిన యపకీర్తి అవమానము లోకుల తిరస్కారము ననునవి నీరూపమును వహించి పాపశీలా! నాయింట నిలచెను.

ఉ॥ అంగద! వాజివారణశ•తాంగము లెక్కి చరించు నెప్పుడు
క్రంగుగ నట్టినాకొడు క•నాథువలెన్ సయిదోడు లేక యే
కాంగిగఁ గంటకోత్కరశి•లావృత మౌగహనంబునందు నే
భంగిఁ జరింపఁగాఁ గలఁడు•పాపము! బొబ్బలు వోవఁ బాదముల్? ౩౨౯

అంగద=అయ్యో, ఇది సంతాపార్థకమున సంస్కృతమునందలి బత వలెఁ బ్రయోగింపఁబడును. వాజివారణ శతాంగములు=గుఱ్ఱములు ఏనుఁగులు రథములు, సయిదోడు=సహాయుఁడు, ఏ కాంగిగన్=ఒంటరిగ- కంటకోత్కర=ముండ్లసమూహముచేతను, శిలా=ఱాలచేతను, ఆవృతము=కప్పఁబడినది, గహనము=అడవి, ఏభంగిన్=ఏవిధముగ.

తా త్ప ర్య ము

గుఱ్ఱములపై, నేనుఁగులపై, రథములపై నెప్పుడు చూడనింపుగాఁ గ్రిందఁగాలు పెట్టక తిరుగుచుండునా కొడుకు తోడులేక యొంటరిగా ముండ్ల చేతను ఱాలచేతను గప్పఁబడి త్రోవలుగూడ సరిగాలేని యడవులందు నయ్యో పాపము కాళ్లు బొబ్బలుపోవఁగా నెట్లు సంచరించునే పాపినీ.

ఉ॥ పొంకము మీఱ నా సుతుఁడు•భోజనవేళలయందుఁ గుండలా
లంకృతులైనపాచకులు•లాలసమానసవృత్తి నేన ము
న్నింకిట నేన మున్ననుచు•నెంతయు వంతులు పల్కికొంచు ని
శ్శంకము శస్తపానమును•జారుతరాన్నము పెట్టఁ గైకొనున్. ౩౩౦

కుండలాలంకృతులు=చక్కఁగా వంటచేయుటయందు సమర్థులని బిరుదులు పొందిన కుండలములకే నలంకరింపఁబడినవారు, పాచకులు=వంటచేయువారు, లాలసమానవృత్తి=శ్రీరాముని పరిచర్య తామే చేయవలయునని కోరిక గల మనస్సుగలవారై (మహారాజుల యిండ్లలో వంటకు వేఱువడ్డనకు వేఱు మనుష్యులుందురు, శ్రీరాముని విషయమందుఁ బ్రీత్యతిశయముచే శ్రీరామునకు మేమేవడ్డింపవలెనని వంటవారు వారిపోటీలు వేసికొని వాదులాడుదురట) నిశ్శంకము=సందేహములేనిది. ఇది యవ్యయీ భావసమాసము కావున నపుంసకము, శస్తపానమును=ప్రశస్తమైన పానీయము వట్టివేరు మొదలయినవి వేసి మంచివాసనగల చల్లనినీళ్ళు. చారుతరాన్నము=మనోహరమైనయన్నము "రస్యాస్స్నిగ్ధాస్థిరాహృద్యా ఆహారాసాత్త్వికప్రియా" యన్నట్లు సాత్త్వికాహారమును; కైకొనున్=గ్రహించును దీనికి నాసుతుఁడు, కర్తృపదము.

తా త్ప ర్య ము

వంటయందు సమర్థులని కుండలముల బిరుదులుగా పొందిన వంటవారిలో వడ్డనవారిలో వారిలోవారు శ్రీరామునకు నే నీవ్యంజనము చేసెదను. నే నీవ్యంజనము చేసెదనని వేలు వేలు వ్యంజనములు సిద్ధముచేసి నా వ్యంజనము ముందుతినవలె నా వ్యంజనము ముందు తినవలెనని యొకరికంటె ముందు మఱియొకరు వడ్డించి రామా నేను జేసినది భుజింపుము. నేను జేసినది రుచియైనఁ జూడుమని మనోహరమైన యన్నము పానము వంతులువేసికొని ప్రార్థింపఁగా భుజించుచుండువాఁడు నాకొడుకు.

ఉ॥ అట్టిఁడు నాదుపట్టి గహ•నాంతరమందలిచెట్టు చెట్టు పె
న్గుట్టయు గుట్టయుం దిరిగి•కొంచును గారముఁ జేఁదునుం వగ
ర్పుట్టెడి పచ్చికాయలను•భూమిని ద్రవ్వినకందమూలముల్
తెట్టువఁ బొట్టపోసికొని•దీనవలెన్ నడయాడు టెట్లొకో. ౩౪౮

అట్టిఁడు=అట్టివాఁడు, నాదుపట్టి=నాకొడుకు, గహనాంతరమందలి=అడవియందుండు, చెట్టు చెట్టు = వీప్సయందు నా మ్రేడితము- అనఁగా నొకచెట్టు వెనుక మఱియొకచెట్టు, నడయాడు=సంచరించు, తెట్టువ=సమూహము.

తా త్ప ర్య ము

అట్టి నా కొడుకు కాఱడవులయందు నేచెట్టునందుఁగాయలున్నవా యే గుట్టయందుఁ గందమూలములున్నవా యని యొక్కొక్క చెట్టు ఒక్కొక్క గుట్ట వెదకికొనుచు కారము, చేఁదు వగరుగల కందమూలములను ద్రవ్వి తిని పొట్ట పోసికొని యనాథువలె నెట్లు సంచరించునో.

కం॥ ఎంతయు వెలగలచేలలు, స్వాంతము రంజిల ధరించి•యతిసుఖపరుఁ డౌ
కాంతుండు కావిగుడ్డల, బొంతలు ధరియించి యెట్లు•భూమి వసించున్. ౩౪౯

చేలలు=వస్త్రములు- రూ. చేలములు, స్వాంతము=మనస్సు- రెండవ పాదమున నుభయయతి. కాంతుఁడు = మనోహరాకారముగల సుకుమారుఁడు, మోటువాఁడు గాఁడనుట.

తా త్ప ర్య ము

మిక్కిలివెలగల దువ్వలువలు మనస్సునసంతోషింప ధరించి యెంతోసుఖపడు సుందరుఁడు సుకుమారుఁడు. మార్గమున దొరకిన కావిగుడ్డల చింపులతోఁ గుట్టిన బొంతలు ధరించి యెట్లు భూమిపై వసింపఁ గలఁడు. తినఁగూడు కట్టఁ బట్టయు లేక యెన్నాళ్లు జీవింపఁ గలఁడు.

కం॥ ఇవ్వసుధ భరతుఁ డేలఁగ, నవ్విపినమ్ములకు రాముఁ•డరుగఁగ నయ్యో
యెవ్వఁడు చెప్పెనె కుమతీ,యివ్విధము నంచితెతఁ బు•భృశదారుణమున్.

విపినమ్ములకు=అడవులకు, కుమతీ=కుత్సిత బుద్ధిగలదానా,అచింతితము=ఇతరులకుఁ జింతింప సాధ్యముకానిది, భృశదారుణమున్=మిక్కిలి తీక్ష్ణమైనది.

తాత్పర్యము

పిన్నవాఁడైన భరతుఁ డీరాజ్యము నేలునట్లు పెద్దవాఁడు రాముఁడడవులకుఁ బోవునట్లు కుత్సితబుద్ధీ నీ కెవ్వఁడే యింతటి మిక్కిలి భయంకరమై యితరులకు మనసునకైన రాని యాలోచన చెప్పెను.

ఉ॥ నారులు క్రూరమానస లనారత మాత్మహితార్థసిద్ధియే
యేరహిఁ గోరి గూఢముగ నెంతయుఁ గీడొనరింతు రిస్సిసీ
నేరముఁ బల్కఁబోవ నవనిం గని యెల్లపొలంతులందు, నో
మారి! తగుం జుమీ భరత మాతకు మాత్రమ యట్టినిందయున్. ౩౮౧

నారులు=స్త్రీలు, అనారతము=ఎల్లప్పుడు, ఆత్మహితార్థ సిద్ధియే=తమకు మేలైన ప్రయోజనము లభించుట మాత్రమే,ఏరహిన్=ఏవిధముగనైన- ఇతరులకు మేలుగాని కీడుగాని న్యాయముగఁగాని యన్యాయముగఁగాని,గూఢముగ=రహస్యముగ, పొలంతులు=స్త్రీలు, మారి=చంపునట్టి రోగదేవత, భరతమాత=కైకయని దాని నామస్మరణము కూడఁ జేయరాదని భావము.

తాత్పర్యము

స్త్రీలు దయాహీనలు న్యాయముగనో యన్యాయముగనో యితరులకుఁ గీడుకలిగించియైనఁ దమకు మేలు కలుగునాలోచనలే సర్వదాచేయుచుఁ దమకుఁ బ్రతికూలురకు రహస్యముగ నెంతకీడైనఁ జేయుదురు. ఛీ ఛీ వారేమి మనుష్యులు- క్రూరమృగములుగాక. పొరపాటు. స్త్రీలనుటచే లోకమునఁగల స్త్రీలందఱు నిట్టి దోషములు చేయు వారని నాయభిప్రాయముగాదు. మృత్యుదేవతా! ఇట్టి నింద భరతుని తల్లివగు నీకుమాత్రము చెల్లును గాని కౌసల్య సుమిత్ర మొదలగు నుత్తమ స్త్రీలయందుఁ జెల్లదు.

చం॥ కనరున నన్ను వేఁచుటకుఁగా మతిపట్టితె క్రూర చిత్త! యో
చెనఁటి! యనర్థ కార్యపర! స్వీయహితాచరణైకశీల! యే
యనయము నెప్పుడేఁ గనితె యక్కట నాయెడ నేని సర్వలో
కనిచయమంగళాచరణ కారణుఁ డౌరఘురామునందునేన్? ౩౮౨

కనరున=కోపమున, వేఁచుటకు=కాల్చుటకు, మతిపట్టితె=మనస్సు దృఢపఱచుకొంటివా, అనర్థకార్యపర = చెడుకార్యములందాసక్తిగలదానా, స్వీయహితాచరణైకశీల=తనమేలు తనవారిమేలు మాత్రమే చేయుటయే స్వభావముగఁగలదానా, అనయము=నీతి తప్పిన కార్యము, సర్వలోక = సమస్త లోకముల యొక్క, నిచయ=సమూహమునకు, మంగళ=శుభమును, ఆచరణ=చేయుటయందు, కారణుఁడు=హేతువైన వాఁడు.

తాత్పర్యము

దయలేనిదానా! కోపముతో నన్ను బాణలిలోఁ గూరల వేఁచినట్లు శోకాగ్నిలో వేఁచుటకే మనస్సును దృఢపఱుచుకొంటివా. ఓసి దుర్మార్గురాలా! హానికరములైన కార్యములు చేయుటయందాసక్తిగలదానా! నీమేలు నీవారి మేలు మాత్రమేకోరి కార్యములుచేయుదానా! నాయందుఁగాని సర్వలోకముల మేలునకుఁ గారణభూతుఁడైన శ్రీరామచంద్రునందుఁగాని యేసమయమందైనను నేదైన దుర్నీతి కార్యముఁ గంటివా.

ఉ॥ నీ విటు నన్ను నేఁచుటయు ♦ నేనును రాముని బాయఁ ద్రోచుటల్
వావిరి చూచి నిక్కముగ ♦ భర్తలఁ దా రనురక్తలయ్యునున్
బోవిడువారు కామినులు, ♦ పోకడ పెట్టెడివారు తండ్రులా
హా విరళానుకంపఁ గడు ♦ పారఁగఁ గాంచినయట్టిపుత్రులన్. ౭౭

ఏఁచుట=బాధించుట, అనురక్తలు=ప్రేమగలవారు, పోకడపెట్టెడివారు=తొలఁగఁ ద్రోచుకొనువారు, విరళానుకంపన్=దయసన్నగిల్లఁగా.

తాత్పర్యము

నీవు నన్నుఁ బెట్టెడి బాధచూచి కైకవంటి రాణియే తన భర్తను బాధపెట్టి విడనాడెనే మనమేల యట్టులే చేయరాదని యింతవఱకు భర్తలయందుఁ బ్రేమగల సాధ్వులుకూడ నికమీఁద భర్తలను వదలి కామాతిశయమునఁ బెఱత్రోవల సంచరింతురు. శ్రీరామచంద్రుని నేను వదలిపెట్టుటచూచి తండ్రులు కుమారులందు దయలేనివారై దశరథునివంటి రాజే తన జ్యేష్ఠకుమారునే వదలి పెట్టెనే మనమేల వదలరాదని తాము కడుపారఁ గన్నకొడుకులనే యెడఁబాయుదురు. 'యథారాజా తథాప్రజా' యని కలదుగదా.

కం॥ వ్యసనాంభోధినిమగ్నుని, వసుధాతనయాహృదబ్జ♦భాస్కరుఁ గనుచున్
వెస సకలజగములును ని, న్గసరునఁ గనకుండునా ని♦కారచరిత్రా. ౭౮

నికారచరిత్రా=మోసపు నడవడిగలదానా! వ్యసనాంభోధి నిమగ్నునిన్=వ్యసన సముద్రమున మునిఁగిన వానిని, వసుధాతనయా=సీతయొక్క, హృత్=హృదయమను, అబ్జ=కమలమునకు, భాస్కరున్=సూర్యుఁడగువానిని సూర్యుని జూచిన కమలము వికసించినట్లు శ్రీరామచంద్రునిఁ జూడఁగానే సీతహృదయము సంతోషముచే వికాసము నొందును. కసరున=తిరస్కారబుద్ధితో.

తాత్పర్యము

నీవు నిమిత్తముగ నిష్కారణముగ వ్యసనసముద్రములో మునిఁగినవానిని సీతా సంతోషకారణమైన వానిని లోకులందఱుఁజూచి నీవుకదా వారి యిరువుర దుఃఖమునకుఁ గారణభూతురాలవని మోసకత్తియా! నిన్ను ఛీ ఛీ యని తిరస్కరింపకుందురా? నీవు రాణివని గౌరవబుద్ధిగల వారగుదురని తలఁచితివా.

ఉ॥ దేవకుమారరూపు వర♦దీప్య దలంకరణాభిరాము, సీ
తావిభు, నాదునందనుని, ♦ దాయఁగ వచ్చెడువానిఁ జూచి లో
భావనచేసి పొంగిపడు♦వాఁడ, సమక్షము చూచినంతనే
యౌవన మప్పుడే యొదవి♦నట్లగు నాకు ననర్థకారిణీ. ౩౯౮

దేవకుమారరూపున్ =మన్మథునివంటి సుందరుని, వర = శ్రేష్ఠములైన ప్రకాశించు భూషణములచే నలంకరింపఁబడిన వానిని, అనర్థకారిణీ=కీడు చేయుదానా, దేవకుమారున్=(౧) నారాయణుని కుమారుఁడు (౨) దేవుఁడు=క్రీడించు స్వభావము గలవాఁడు, కుమారున్=మన్మథుని- కుమారోనాసుతేస్కందే యని నానా॥ర॥.

తాత్పర్యము

లోకులు నిన్ను ఛీ కొట్టనీ ఛా కొట్టనీ. థూ థూ యననీ నాస్థితి చెప్పెద విను- మన్మథువలె సహజ సౌందర్యముగలవాఁడు, బంగారునకు వాసన యబ్బినట్లు సౌందర్యమునకుఁ దోడు శ్రేష్ఠములైన దగద్ధగాయమానములైన యలంకారములచేఁ బ్రకాశించువాఁడు, అతిరూపవతీ సీతా యన్నట్లు అయోనిజయైన సీతకు భర్తయైనవాఁడు, నాకుసంతోషము కలిగించుకొడుకైనవాఁడు, ఇట్టివాఁడు, నాసమీపమునకు వచ్చుచుండఁగా దూరమునందే చూచినంత మాత్రముననే యిట్టివాఁడు నాకుఁ బుత్రుఁడాయెఁగదా యని సంతోషాతిశయముచేఁ బొంగిపడుచుందును. ఎదురుగావచ్చి నిలిచెనేని నాకు వార్ధకమువలన వచ్చిన దుర్బలత్వములోనైన వెచ్చటికిఁబోవునో యప్పుడే నాకు మరల యౌవనముదయించినట్లు జవసత్త్వంబులు కలుగును. ఇట్టి నాకెంతకీడు కలిగింపఁ జూచుచున్నదానవే.

కం॥ రవి లేకయు,వర్షింపఁగఁ, బవిపాణియు లేక జగము♦వర్తిల్లు, మహా
టవి కేగురాముఁ గనుఁగొని,
యువిదా! ప్రాణములతోడ♦నుండునె యొకఁడున్. ౩౯౯

లేకయు=లేక ఇది వ్యతిరేకక్త్వార్థకము కళ-పవిపాణి=పర్జన్యుఁడు, లేకయు= లేకపోయినను అనుటచే రాత్రులందు సాక్షాత్సూర్యుఁడు లేకున్నను ఆయన తేజస్సు చంద్రనక్షత్రాగ్నులయందుండును.

తాత్పర్యము

సూర్యుఁడు లేకపోయినను జగము వర్తిల్లును. రాత్రులందు సూర్యుఁడు గలఁడా? ఆమాత్రమున లోకవ్యాపారము నిలిచెనా? వర్షము కురియించుటకు నింద్రుఁడు లేకున్నను జగము సమయదు. గొప్పకఱవులు వచ్చినను లోకము సమయలేదు. కాని యరణ్యమునకేగు శ్రీరామచంద్రునిఁజూచి మనుష్యుఁడగువాఁడు ప్రాణము ధరించియుండునా? ఉండినను [illegible]ప్రాయమైయుండునుగాక.

చం॥ అకట మదీయ నాశనప•రాత్మిక సైఁపఁగ రానిశత్రువున్
ప్రకటతరాపమృత్యుగతిఁ • బాపిని ని న్నిలు సేర నిచ్చితిన్,
వికటచరిత్ర! క్రూరవిష•భీకరభూరిభుజంగి నంకభా
గకలితఁ జేసినట్ల నినుఁ•గైకొని వచ్చితి నిట్లు చచ్చితన్. ౩౮౪

అకట=హాకష్టమ్మెయొక్క తద్భవము=అయ్యో, మదీయ....రాత్మికన్=నన్నునాశము చేయుటయందాసక్తిగలదాని నిన్ను, అపమృత్యు=అకాలమృత్యు దేవత, వికటచరిత్ర=విరుద్ధపు భయంకరమగుసడవడిగలదానా, క్రూర... భుజంగిన్=తీవ్రమైన విషముచే భయంకరమైన పెద్దయాఁడు పామును. అంకభాగకలితన్=తొడమీఁదఁ జేర్చిన దానిని, చచ్చితిన్=అత్యంత సమీప భవిష్యదర్థంబున భూతము. ఒక విషయము. సమీప భవిష్యత్కార్యంబున జరగుట నిశ్చయమేని యది జరిగినట్లే చెప్పబడును. "మదర్థేత్యక్తజీవితాః" నాకొఱకై ప్రాణములు విడిచిరి అనికదా దుర్యోధనుఁడు యుద్ధారంభదినమందే చెప్పెను. భగవద్గీత ౧-౯.

తాత్పర్యము

అయ్యో! నానాశనమం దాసక్తిగల సహింపరాని శత్రువును నాయపమృత్యువువలెఁ బాపాత్మురాలగు నిన్ను నాయింటిలోఁ బ్రవేశపెట్టితిని. లోకవిరుద్ధపు నడవడిగలదానా! తీవ్రమైన విషముచే భయంకరమగు నాఁడుపామును దొడమీఁదఁ జేర్చి లాలించినట్లు నిన్ను నమ్మి దగ్గఱచేర్చి యిట్లు నాశముకానున్నవాఁడను.

ఉ॥ రాముని నన్ను లక్ష్మణుఁ ది•రస్కృతి చేసి, పురంబు రాష్ట్రమున్
భూమిఁ గలట్టిబాంధవుల•పొం గడఁగన్ వధియించి, యేలనీ
యీమహి నీతనూభవుఁ డె•యీవును నాపగవారిడెందపుల్
కామిని! యోలలార్చుమ య•గాధమహాసుఖవారిరాశిలోన్. ౩౮౮

తిరస్కృతి=ధిక్కరించి, పొంగు=సంతోషమునుబ్బు, అగాధ.......రాశిలోన్=లోఁతు తెలియరాని మహాసుఖమను సముద్రములో, ఓలలార్చుము=ఓలలయని సంతోషముతోఁ గ్రీడింపఁజేయుము. "ఓలోలాంబక యోల యోల యన నోలోలంచు మేలంబునన్"- వసు.

తాత్పర్యము

శ్రీరామచంద్రుని నన్ను లక్ష్మణుఁగాదని ధిక్కరించి యయోధ్యాపురమందు కోసలదేశమందు నింకను నాస్వాధీనమందుఁగల యితరభూములందు నాకను కూలురుగనుండు బాంధవుల సంతోషాతిశయ మడఁగిపోవునట్లు వారిని వధియించి నీకొడుకే యీరాజ్యమంతయు నేలనిమ్ము. నీవో నాశత్రువుల హృదయములను మహాసుఖసముద్రమునందు నోలలాడింపుము.

యతి, వనజలోచన=కమలములవంటి కన్నులుగలదానా, ఇది ముఖప్రీతిమాట. మదిరాక్షిచెవులు తొమ్మిదిలెక్కలనరాదు అను పద్యంబున నప్పకవి హరివధ్య కాళ్ళిగుళ్ళనఁగఁగాదని చెప్పుటచే నిచటఁ గాళ్ళని ప్రయోగించుట యనౌచిత్య మని సందేహింపరాదు. అది స్తుతియందు శృంగారరసవర్ణనమందే యుచితము గాని సర్వత్ర గాదు. కలహంసకాళ్ళఁ దవులకమున్న యని వసుచరిత్రకర్త ప్రయోగింపలేదా?

తా త్ప ర్య ము

కోపము పట్టఁజాలక తిట్టి, తిట్టుటవలనఁ గార్యము సాధ్యముగాదని మరల మెత్తనిమాటలాడుచున్నాఁడు. కమలాక్షీ! నాకొడుకు అడవులపాలాయెనా నేను జీవించుట యసత్యము. ఇఁక నీతో నేనేమి సౌఖ్యము పడఁగలను. ఒకవేళ బ్రది కితిఁబో శోకమున మునిఁగియుందునేకాని సంతోషముకలవాఁడ నగుదునా? అప్పుడు నీతో నాకేమిపని? కాఁబట్టి నాకు నప్రియకారము చేయకుము.నీకాళ్ళకు మ్రొక్కెదను. మఱిమఱి మ్రొక్కెదను.

చం॥ అని యిటు భూమిపాలకుఁడు•హా యని యేడ్చు చనాథుసట్టులై
తనమతిమేర మీఱి చను•తత్సతిచేతికిఁ జిక్కి స్రుక్కి తా
వనితప్రసారితాంఘ్రులను•వ్రాలియుఁ దాఁకక, రోగపీడితుం
డనఁ బడియెన్ ధరాతలము•నందు మహార్తి వినష్టచిత్తుఁడై. ౩౯౪

వనిత=అకైకయొక్క, ప్రసారిత=చాఁపఁబడిన, అంఘ్రులను=పాదములను దీనివలనఁ గైక హాయిగా కాళ్లుచాఁచుకొనియుండినదని యేర్పడుచున్నది. మహార్తి=మిగులబాధచే, వినష్టచిత్తుఁడై=మనస్సుచెదరినవాఁడై- కాళ్ళమీఁదఁ బడునంతలో మూర్ఛముంచుటచేఁ దాఁకక నేలఁబడెననికాని ఆయన తాఁకునం తలో నామెకాళ్ళు ముడుచుకొనుటచేఁ దాఁకలేకపోయెననికాని యెంచవలయును.

తా త్ప ర్య ము

ఈప్రకారముచెప్పి దశరథుఁడు దిక్కులేనివానివలె నయ్యోయని యేడ్చుచుఁ దనయిష్టము నతిక్రమించిపోవు నాకైకచేతికిఁజిక్కి స్రుక్కి యదిచాఁచిన పాదములమీఁదఁ బడియును దాఁకక రోగబాధచే చెడుబాధపడువానివలె స్మృతి తప్పి భూమిమీఁదఁబడెను. ౧౨-వ సర్గము.

సీ॥ పుణ్యాంతమున స్వర్గ•మునసుండి త్రెళ్ళుయ, యాతినా ననుచిత•రీతి దీవ
గసి నేలఁబడియుండు•క్ష్మావల్లభునిఁ బురా,ననుభూత తాదృగ్వ్య•సనునిఁగాంచి
వెఱ పొకింతయు లేక • వెఱపెట్టుచు నసర్థ,రూప యసిద్ధార్థ•పాప మనక
మునుపటివరము లే•ముగుద దాఁ గోరుచుఁ దనపెనిమిటిఁ జూచి•తలఁకకనియె

ఆ॥ నేను సత్యవాదిఁ•నేదృఢవ్రతుఁడ న,టంచు నిన్ను నీవ•యాడుకొనెదు
నావరంబు లిట్లొ•నర్పకయే బుణ,పాతకుఁడవు గాఁగ•భ్రాంతిపడితొ. ౩౯౫

ద్రెళ్ళు=పడు, యయాతినాన్=యయాతియో యనునట్లు, యయాతి యను రాజు గొప్ప తపస్సులు దానధర్మములుచేసి స్వర్గమునకుఁబోయెను. అప్పుడింద్రుఁడు రాజా! నీవేమి పుణ్యముచేసి యింతస్వర్గసుఖము ననుభవింపవచ్చితివని యడిగెను. నేను మహాఋషులకంటె వ్రతులకంటె గొప్ప తపస్సుచేసితిని. నేను జేసినతపస్సులోఁ గొంచెముభాగమైన నీఋష్యాదులు చేసినవారుకారని గర్వించి పలికెను. నీవు గర్వివి కావున నిచ్చటనుండఁదగవు. మరల భూలోకమునకుఁ బొమ్మని యింద్రుఁడు క్రిందఁద్రోచెను. అతఁడు క్రిందఁబడుచు సాధుసాంగత్యము లేనిదోషమున నిట్లయితిని. సాధువులలోఁబుట్ట ననుగ్రహింపుమని వేఁడెను (౧౨౦౪-వ పద్యము చూడు). పురా=పూర్వమందు, అననుభూత=అనుభవింపఁబడని, తాదృక్=అటువంటి, వ్యసనుని=వ్యసనముగలవానిని, అనర్థరూప=రూపముకొన్నకీడు, అసిద్ధార్థ=నెఱవేఱని కోరికగలది.

తా త్ప ర్య ము

స్వకృతాపరాధమునఁ దాను జేసిన పుణ్యము క్షయింపఁగా స్వర్గమునుండి భూమిమీఁదఁబడు యయాతిమహారాజువలెఁ దగని విధముగా శోకతప్తుఁడయి నేలఁబడియుండువానిని,ఇంతకు ముందెన్నఁడు నిట్టిదుఃఖ మనుభవింపనివానిని, చూచి మగనిభయముగాని లోకాపవాదభయముగాని పాపభయముగాని కొంచెమైనను లేక యోయిరాజా! నీవు మాటతప్పితివా నరకము ప్రాప్తించును. లోకమున నసత్యవాదివని యపకీర్తి వచ్చును. కృతఘ్నుఁడు మోసగాఁడను పేరు వచ్చును. జాగ్రత్త అంతేకాదు. నేనిచ్చటనే మరణించెదను.నామృతికి నీవు కారణమగుటచే స్త్రీహత్యయేకాదు భార్యాహత్యయు వచ్చునని యిట్లు బెదరించుచు ననర్థమే రూపముగాఁగొని యింకను దనకోరిక నెఱవేఱని యాపాపిని పాపమని తలఁపక మునుపటివరములె మరలమరలఁ గోరుచు నిచ్చెదవా లేదాయని గద్దించుచు భర్తను జూచి చలింపక రాజా! నేను సత్యవాదిని, పట్టినవ్రతము విడుచువాఁడను గాను. అని నిన్ను నీవే పొగడుకొనుచుంటివే యిదియా నీ సత్యసంధత్వము దృఢవ్రతత్వము. నావరములు నెఱవేర్పక నాకు ఋణస్థుఁడవై చావ భ్రాంతిపడితివేమో.అది భ్రాంతియే నావరము లిచ్చువఱకు నిన్నుఁ జావనీయను.

మ॥ అని తన్నాడఁగఁ గైక యాజియును మూర్ఛాయత్తుఁడై మూర్తమున్
గనుచుం దాని సరోషవేగమున నేఁ గన్నెను లోకాంతరం
బును రాముండు మహాటవీస్థలికి సంపూర్ణేష్టవై యుండుమీ;
నను ఛీ ఛీ యన వేల్పు లోచెనఁటిదా నా! యెట్లు సైరింతు నే. ౩౯౬

అజి=దశరథుఁడు, మూర్ఛాయుత్తుఁడై=మూర్ఛకు స్వాధీనపడినవాఁడై, మూర్త ౦=ముహూర్తకాలము- అల్పకాలము, సంపూర్ణేష్టవు=నెఱవేఱిన కోరికగలదా , సైరింతునే=ఓర్చుకొనియుందునే.

చం॥ కడుకొని మింటఁజందురుఁడు • గాయుచు నుండెను రాత్రి యామయం
దుడుగనిదుఃఖవేగమున • నోటఱి యేడ్చుచు నుంట ఱేనికిన్
గడుఁగడుమాసరం బగుచుఁ • గన్పడె, నాతఁడు వేఁడియూరుపుల్
విడుచుచుఁ జూడ్కులం గగన • వీథిని నిల్పి వచించె నేడ్చుచున్. ౪౦౧

కడుకొని=అతిశయించి, మింటన్=ఆకాశమందు, త్రియామ=రాత్రి-త్రియామా క్షణదాక్షపాయని యమరుఁడు. వాస్తవ రాత్రికాలము మూఁడు జాములే. సూర్యాస్తమయానంతరము అరజాము, సూర్యోదయమునకు ముందర జాము పగటిలోఁ జేరుచున్నది. త్రియామ = మూడుజాములుగలది, ఓటఱి = సారహీనమై, మాసరము=దీర్ఘము. "మాసరములైన మధుమాసవాసరములు" అని ప్రయోగము, గగనవీథి=ఆకాశమార్గము.

తాత్పర్యము

చంద్రమండలము నిర్మలమై యాకాశమునఁ బ్రకాశించెను. వదలని దుఃఖాతిశయముచే సత్తువచెడి యేడ్చుచుండు రాజున కారాతిరి మూఁడు జాములు గలదేయైనను మిక్కిలి దీర్ఘమై యెన్నిజాములో కలదిగాఁ దోఁచెను. దశరథుఁడు వేఁడి నిట్టూర్పులు విడుచుచు నాకాశమును జూచి యేడ్చుచు నిట్లనియెను.

ఉ॥ అంజలిచేసి మ్రొక్కెద ద • యామతిఁ జూడుము నన్నుఁ దెల్లవా
ఱం జనఁబోకు చుక్కలనె • ఱాగయి సేఁత నెసంగురాతిరీ!
నెంజిలిపెట్టు నీచెనఁటి • నిర్దయ కైక మొగంబు చూచుటై
నం జనుఁగాన వేగ మయి • నం దెలవాఱుము లేచి పోయెదన్. ౪౦౨

చుక్కల నెఱాగయి సేఁత నెసంగు=నక్షత్రములచే నిండుగ నలంకరింపఁబడిన, నెంజిలి=మనస్తాపము ఆకాశము చుక్కలు గలదిగాఁ జెప్పుటచేఁ జంద్రుఁడస్తమించె నని యెఱుఁగనగు.

తాత్పర్యము

చుక్కలచే నిండుగ నలంకరింపఁబడి ప్రకాశించు నోరాత్రీ నీకుఁ జేతులు మోడ్చి నమస్కరించెదను. నన్ను దయఁజూడుము. తెల్లవాఱఁబోకుము. తెల్లవాఱితివా నలువురి మొగము నేనేమని చూతును. శ్రీరాముమెట్లు కానకుఁ బంపుదును. అటుగాదేని శీఘ్రముగఁ దెల్లవాఱుము. నన్ను బాధించు నీకైక ముఖము చూచుటయైనఁ దప్పిపోవును. లేచిపోయెదను.

కం॥ అని పలికియుఁ గైకయిమోముసు బొడఁగని హస్తయుగము • మోడిచి వనజా
క్షిని సుప్రసన్నఁ జేయఁగ, వినయోక్తుల నిట్లు వేఁడు • విపులాధవుఁడున్.

మోడిచి=ముకుళించి, సుప్రసన్నన్=అనుగ్రహము గలదానిఁగా, విపులాధవుఁడు=పుడమిఱేఁడు - రాజు.

తాత్పర్యము

అని యిట్లు పలికి మరలఁ గైకముఖముఁజూచి రెండుచేతులు జోడించి యామెను బ్రసన్నురాలిని జేయుతలంపున సవినయముగ రాజిట్లనెను.

—♦ దశరథుఁడు కైకను బ్రార్థించుట. ♦—

ఉ॥ దీనుఁడ, మంచివాఁడఁ ద్వదధీనుఁడఁ, జావఁగ నున్నవాఁడ, నో
మానిని! నీకు భర్తను? క్ష్మాపతినిం గద, యొగ్గి దోసిలిన్
మానము వీడి వేఁడెదను మన్నన సేయుము, యొంటిగాదు నేఁ
డానిఖిలావనీజనసమక్షమునం గద బాస చేసితిన్. ౪౦౪

త్వదధీనుఁడన్=నీకు వశపడిన వాఁడను, నిఖిలావనీజనసమక్షమునన్ = సమస్త భూజనులయెదుట.

తాత్పర్యము

నిర్భాగ్యుండను. మంచివాఁడను నీకు స్వాధీనపడినవాఁడను, నేఁడో రేపో చావనున్నవాఁడను. నీకుభర్తను.భూమికంతయు రాజునుగదా.ఇట్టి నేను రెండు చేతులు జోడించి అభిమానము వదలి నిన్నుఁ బ్రార్థించెదను. నన్ను మన్నింపుము. శ్రీరామునకు రేపు పట్టాభిషేకము చేసెదను. భూమి జనులందఱు వినుచుండఁ బ్రతిజ్ఞచేసితినిగాని నీకుఁ జేసినట్లు రహస్యముగఁగాదు.

కం॥ ఏలీల దానిఁ ద్రోయుదు, బాలా! కరుణాత్మురాల పరమసుశీలా!
యాలింపుము నానుడి నన్, జాలిం బెట్టకు దయం బ్రసాదింపు సతీ! ౪౦౫

ఏలీలన్ = ఏవిధముగ.

తాత్పర్యము

అట్టి ప్రమాణమును నేనేమని త్రోసిపుచ్చుదును. త్రోచిపుచ్చితినేని నన్ను లోకులేమందురు. బాలా! దయాలోలా! మంచినడవడిగలదానా! నామాట వినుము. నన్ను వ్యసన పెట్టకుము. దయచే శాంతపడి ప్రసన్నురాల వగుము.

సీ॥ నీయిచ్చు రాజ్యంబె నిత్యమౌఁ గావుత,శమియింపు నారామచంద్రు దేవి?
పరమసత్కీర్తియుఁ బ్రాపించు నీకిల, నిది రామునకు నాకు నెల్లజనుల
కును భరతునకును గురువుల కెల్లను, సమ్మతం బిది యని జాలి పుట్ట
నడలు రక్తాక్షు శుద్ధాత్ముని నశ్రుపూర్ణాక్షునిఁ బతిని మేలాడ కున్నఁ
ఆ॥ బ్రియు నదుష్టభావఁ బెంకెను బ్రతికూల, వచనఁ జూచి సుతుని వననివాస
మందు బట్టి నిలిపి యన నేర కేమియు, శోకమునను బడియె శోషమొంది.
౪౦౬

రక్తాక్షున్=ఎఱ్ఱనికన్నులుగలవానిని, శుద్ధాత్మునిన్=నిర్మల మనస్సుగల వానిని, అశ్రుపూర్ణాక్షునిన్=నీళ్ళచే నిండిన కన్నులుగల వానిని.

తా త్ప ర్య ము

దేవీ! రాజ్యము శ్రీరామునకు నీవేయిమ్ము. నాపెత్తనము వలదు. నీవిచ్చినదే నిత్యమైయుండుఁగాక. శ్రీరామచంద్రుపైఁ గోపముమానుము. క్షమింపుము దీనివలన నీకెంతోకీర్తిగలదు. అట్లుచేసితివేని రామునకు నాకేకాక సమస్తజనులకు భరతునకు కులగురువులకు సందఱకు సంతోషకరమైనదగును. అని మనస్సుకరఁగునట్లు దుఃఖించుచునట్టి దుఃఖముచేఁ గన్నులెఱ్ఱనై నీళ్ళచేనిండినవానిని నిర్మలమైన మనస్సుగలవానిని దన పెనిమిటిని జూచి మంచిమాట చెప్పకుండఁగా నంతవఱకుఁ దనయందుఁ బ్రీతి గలిగి చెడుతలంపులేకుండియు మూర్ఖురాలగు కైక నే నంగీకరింపను. శ్రీరాముఁడు వనవాసమునకుఁ బోవలసినవాఁడే. భరతుఁడు యువరాజు కావలసినవాఁడే. ఇది తప్పవు అని విరుద్ధపు మాటలాడుదానిని జూచి యిఁక శ్రీరాముని నడవికిఁ బంపక తప్పదని నిశ్చయించుకొని యేమియు ననసేరక రాజు శోకముచే మూర్ఛపోయెను.

కం॥ ఏర్చెడివంత నలంగుచు,
నూర్చుచుఁ బడియుండి నృపతి♦యుదయము కాఁగన్
బేర్చి ప్రతిబోధకాళి యొ,నర్చెడిగీతంబు లాఁపి♦నలగుడువడఁగన్. ౪౦౭

ఏర్చెడి=దహించెడి, వంతన్=వ్యసనముచే, ప్రతిబోధకాళి=ఉదయమున నిద్రలేపువారల సమూహము, నలగుడు=చిక్కు.

తా త్ప ర్య ము

దహించుచున్న వ్యసనముచే నలఁగుచు నూర్పులు పుచ్చుచుఁబడియుండి యుదయముకాఁగానే తన్నువాడుక ప్రకారము నిద్రలేపగీతములు పాడువారిని గీతములు పాడవలదని నిలిపి వెలుపలఁ బోవుటకు నచటనే యుండుటకుఁ దోఁపక కళవళ పడుచుండఁగా.

—♦ ౧౪-వ సర్గము. దశరథునకు సత్యంబు కైక బోధించుట. ♦—

సీ॥ పుత్రశోకంబున♦భూతలంబునఁ ద్రెళ్ళి,పడి మూర్ఛల నలంగు♦పతిని జూచి
పాపాత్మురా లిట్లు♦పలుకు నోపృధివీశ? బాస చేసియును ని♦ప్పాట దానిఁ
జలుపక పాపి వై♦చనఁ జూచెదవే యిట్లు ధరణిఁ బొర్లుచు? నేల♦తప్పవిడఁతు
దిటముగా లేలెమ్ము♦తీర్పుము వరములు, తలంపుమీ నీవింత♦ధర్మవిధము
తే॥ ధార్మికులు సత్యమే పర♦ధర్మ మనరె, నీవు ధర్మంబ చలుపఁగ♦నేను సత్య
మూఁతగాఁబుట్టుపఱిచెద♦నూరకేల,సత్య మెడపఁగ వలవని♦జాలిపడెదు.

బాస=ప్రమాణము. అప్పాటన్=ఈవిధముగ, దిటముగా=ధైర్యముతో-దృఢగాత్రుఁడవై, ఎడపఁగన్=తప్పఁ ద్రోయుటకు, వలవనిజాలి=అవశ్యములేని వ్యసనము.

హంతి జాతావజాతాంశ్చ, హిరణ్యార్థే నృతంవదన్
సర్వంభూమ్యనృతే హంతి, మాస్మభూమ్య నృతం వదీః. మను. ౮-౯౯

బంగారు నిమిత్తమై యసత్య మాడిన నదిపుట్టిన బిడ్డలను పుట్టఁబోవు బిడ్డలను జంపును. భూమివిషయమై యనృతమాడిన నది సర్వమును జంపును. కావున భూమివిషయమై యసత్యమాడవలదు.

తా త్ప ర్య ము

పుత్రశోకముచే భూమిమీఁదఁబడి మూర్ఛమునుఁగుచు లేచుచు నలఁగుచున్న మగనిఁజూచి యాపాప మనస్కయగు కైక యిట్లనియెను. ఓయిరాజా ప్రమాణముచేసియు దానినీవిధముగ వగలేడ్పులచే నేలఁ బొరలుటచేఁ దప్పింపఁ జూచి పాపాత్ముఁడవై పోయి చావఁజూచెదవా? ఇది నీకుఁదగదు. నేనేల వానిని దప్పిపోవఁ జేయుదును?దృఢగాత్రుఁడవై లేలెమ్ము.నావరములు నెఱవేర్పుము. ధర్మవిధ మాలోచింపుము. చేసిన ప్రమాణము దీర్చుట ధర్మమో తీర్పకుండుట ధర్మమో యోజింపుము. ధర్మాత్ములందఱు సత్యమే శ్రేష్ఠమైన ధర్మమనరా? నేను నిన్నుఁజేయరాని యధర్మకార్యముఁ జేయుమని కోరలేదు. నేను నీకు సహధర్మచారిణిని గావున నీవు ధర్మము చేయుటకై సత్యమాధారముగఁగొని నిన్ను బలవంత పెట్టుచున్నాను. ఏల నిష్కారణముగ సత్యముదప్పఁ జేయ ననావశ్యకమైన వ్యసనమునఁగుందెదవు. సత్యము నిలుపుకొన నింతయేడుపేల ? ఆఁడుదాననైన నేను బోధించినను గ్రహింపలేని నీవేమి మగవాఁడవు ? ఏమి రాజవు? తనకుఁ దెలియక యొకరు చెప్పినను విననివాని లోకులేమందురు.

కం॥ తనమాటఁ బట్టి కాదే, మును శైబ్యుఁడు తనదుదేహ◆మును డేగకుఁగాఁ
గొనుమని యిడి వెసఁ జూబిం,గొనె నుత్తమ మైనగతిని◆గువలయనాథా.

తా త్ప ర్య ము ౪౦౯

రాజా! తన మాట నిలుపుకొనుటకై కదా పూర్వము శైబ్యుఁడు తన దేహమును గోసి డేగకునిచ్చి యుత్తమ గతులు పొందెను. అట్లు నేను నిన్నేమైనఁ జేయుమంటినా? (చూ. ప. ౩౩౭)

కం॥ అందునకై కాదే తన,కుం దానముఁ గనులు వేఁడి◆కొనువిప్రునకున్
గుందక యిచ్చె నలర్కుఁడు నందితదివిజుండు తనదు◆నయనయుగంబున్.

అందునకై =ఆప్రకారము తన మాట నిలుపుకొనుటకై, నందితదివిజుండు =సంతోషపెట్టఁబడిన దేవతలుగల వాఁడు.

తా త్ప ర్య ము

శైబ్యునివలెఁ దనమాట నిలుపుకొనుటకే కదా అలర్కుఁడు తన కన్నులు దానముగా నిమ్మని కోరిన బ్రాహ్మణునకు వ్యసనపడక రెండుకన్నులు తీసి యిచ్చి దేవతల సంతోషింపఁ జేసెను.

కం॥ జలనిధి ధరణిని ముంపఁగఁ, దలఁచిన నడ్డంబు గలదె? తనమర్యాదన్
దలఁచి కదా వేలావని, వల నొప్పఁగ దాఁట కుండు◆స్వల్పంబైనన్?౪౧౧

జలనిధి=సముద్రము, ధరణిని=భూమిని, వేలావని=చెలియలికట్ట ప్రదేశము. ౪-వ పాదంబునఁ బ్రాదియతి.

తాత్పర్యము

సముద్రుఁడు భూమిని దన జలములచే ముంచి వేయఁదలఁచిన నెవ్వరడ్డము రాఁగలరు. తన మేర తలఁచిగదా కొంచెమైనను జెలియలికట్ట దాఁటి రాకున్నాఁడు.

ఉ॥ సత్య మొకండె బ్రహ్మమగు•సత్యమునంద వసించు ధర్మముల్
సత్యమ యక్షయంబు లయి•చాగెడి యాగమకోటు లన్నియున్
సత్య మొకంటనే కలుగు•శాశ్వత మైనపదంబు, గావునన్
సత్యముఁ బట్టుమీ మది నె•సంగిన నించుక ధర్మచింతయున్. ౪౧౭

తాత్పర్యము

రాజా! పరబ్రహ్మమనఁగానేది? సత్యమేకదా.సత్యం పరంబ్రహ్మ.సత్యపరం ధీమహియన వినలేదా?ధర్మములకన్నిటికి స్థానమేది?సత్యముకాదా?అక్షయవేద సమూహములన్నియు నేవి? సత్యముకాదా.శాశ్వత పదము మోక్షస్థానము దేనిచేఁ గలుగుచున్నది? ఒక సత్యముచేతనేకదా.కావున నీకుఁ గొంచెమైనను ధర్మవిచారముండెనేని సత్యమునే గ్రహింపుము.తుచ్ఛపామరత్వముపై మనస్సు పెట్టకుము.

ఆ॥ ఇంతయేని ధర్మ•చింత నీమది నున్న, సఫలముగను జేయు•క్ష్మాతలేంద్ర
నీ వొసంగి నట్టి•యావరద్వయమును,దప్పఁ బలుక నొప్పు•దానఁగాను.౪౧౩

తాత్పర్యము

ధర్మము తప్పరాదని నాలోచన నీకుఁ గొంచెమైన నుండెనా రాజా నీవిచ్చిన రెండువరములను ఫలవంతములఁ జేయుము. ధర్మముతో నాకుఁ బనిలేదం దువా పోనిమ్ము. అంతియకాని యుపాయములచేఁ దప్పించుకొనఁ జూచిన నేను సమ్మతించుదానఁ గాను. ధర్మమైన విడుము. శ్రీరాముసైన విడుము.

కం॥ దాఁటమి ధర్మము మేలని, దూఁటి యిటుల్ పలుకు దానఁ•దూర్ణమ వని కి
నాఁటన పంపుము రాముని, మూఁటికి ముమ్మాటి కిదియ•మూర్ఖత రాజా.

దూఁటి=నొక్కి, తూర్ణమ=త్వరగా. ౪౧౪

తాత్పర్యము

నీమేలుగోరి ధర్మమునకు హాని కలిగించుట సరిగాదని నొక్కినొక్కి చెప్పు చున్నదానను. శ్రీరాముని నీనాఁడే యడవికిఁ బంపుము.మూఁటికి ముమ్మాటికిఁ జెప్పుచున్నదానను. ఇదియే నామూర్ఖత్వము.

కం॥ నాతోఁ జేసిన బాసను, వే తీర్పక యుందు వేని • విను నాపలుకున్
నీతోడు నీవు చూడఁగఁ, బాతుం బ్రాణముల నిచటఁ•బడి యని కినుకన్.

పాతున్=వదలఁజేయుదును- చువర్ణంబుతోడి దుగ్ధకారంబు తకారంబగు, పాచుదురు=పాతురు- పాయునట్లుచేయుదురు.'తుష్ణపాతురు సుమతుల్'మహాభార.

ఇట్టులే త్రోచుదురు=త్రోతురు, అని యెఱుంగవలయును. షువర్ణపూర్వకమైనది లేదు గనుక పాయుదురు త్రోయుదురు అనునవి పాతురు త్రోతురుఅనికానేరవు.

తాత్పర్యము

నాకు నీవుచేసినప్రమాణ మీతక్షణమే నెఱవేర్పకపోయితివేని సావధానముగ నేను జెప్పెడిమాట విను. ఏమో చెప్పినదాననని తలఁపకుము. నీవుసాక్షిగ నీపాదములమీఁదఁబడి ప్రాణములఁ బోఁపఁజేయుదును. అని కోపముతో.

ఉ॥ జంకొకయింత లేక యిటు•జంకెన లాడెడుకైకకున్ స్వనా
శంకరదాన మిచ్చు బలి•చాడ్పున సూనృత పాశబద్ధుఁడై
బింకము దక్కి చిక్కి మది•బెగ్గిలి వెల్వెలఁబాఱుమోముతో
నంకిలిఁ గాఁడిగండ్లకును•నంతరమందలియెద్దనం గొనెన్. ౪౧౬

జంకు=శంక-బిడియము, జంకెనలు=బెదరింపుమాటలు, స్వనాశంకరదానము=తన్నునాశముచేయు దానము, సూనృత=సత్యమనెడు, పాశ=త్రాళ్ళచే, బద్ధుఁడై=కట్టఁబడినవాఁడై, బింకము=పౌరుషము, బెగ్గిలి=బెదరి, వెలవెల=తెల్లన, కాఁడిగండ్లకును=బండికాఁడికి కంటికి, అంతరమందలి=నడిమి అంకిలిన్=కలఁతను, వామనుఁడు బలిచక్రవర్తిని మూఁడడుగులభూమిని దానమడిగెను, ఆయనయు నిచ్చెను. అది యాయనచెడుటకే కారణమయ్యెను. అట్టులే దశరథుఁడు తానిచ్చిన వరములు తననాశమునకే కారణమయ్యెను. శివుఁడు వృకాసురునకు వరమిచ్చినట్లు.

తాత్పర్యము

కొంచెమైనను జంకక బెదరింపుఁబలుకులాడెడి యాకైకకుఁ దననాశమునకుఁ గారణమైన దానముచేసిన బలిచక్రవర్తివలె సత్యపాశబద్ధుఁడై దశరథుఁడు పౌరుషముమాని శ్రీరాముని నడవికిఁ బంపనందునా సత్యహాని. పెంపెదనందునా తనకుఁ బ్రాణహాని యని యాలోచించి యెటుచేయుటకుఁ దోఁపక కాఁడికి బండికంటికి నడుమఁ జిక్కుకొన్న యెద్దువలెఁ గలఁతచెందెను.

—•దశరథుఁడు కైకను విడనాడుట.•—

ఉ॥ భూవరుఁ డెట్టకేని ధృతిఁ•బూని, సతిం గని రోసి, యీసుమై
నావలిమోము నై యనె, హు•తాశనుమ్రోలను మంత్రసంస్కృతిన్
బావనరీతిఁ గైకొనిన•పాణితలంబును నిన్ను మద్భవున్
నీవలసన్ జనించుటను•నీసుతు వీడితి నేను దుర్మతీ. ౪౧౭

ధృతి=ధైర్యము, ఎట్టకేని=అతికష్టముపై, రోసి=అసహ్యించుకొని, ఈసుమై=కోపముచే, హుతాశనుమ్రోలను=అగ్నియెదుట, మంత్రసంస్కృతిన్=మంత్రములచే సంస్కరించి పావనరీతి=పవిత్రమైనరీతిగ, శాస్త్రపద్ధతిని, మద్భవున్=నాకు జనించినవానిని, దుర్మతీ=చెడుమనస్సుగలదానా.

యీమెను వదలలేదు? కౌసల్య దశరథునిజూచి "చం॥ సవతికి నీవు దక్కిననుఁ జాఁగఱ గొట్టుట నీవు గల్గియున్। ధవుఁడవు లేనివాఁడ విఁక నాసుతునిన్ వనిఁ ద్రోచితీవనా। కెవరును లేరు చుట్టములు నేగెదఁగానల కన్నచో మగం। డవు మనియుంటఁబోల దిటునాశము చేసితి నన్ను నన్నిటన్ "మగఁడవైన నీవున్న వాఁడవుకావు. చచ్చినవాఁడవు కావు. నీవు బ్రదికియుండుటచే నాకిందుసుఖము లేదు. శ్రీరామునివెంట నుండుటకు లేదు. నీవు చచ్చిన నాప్రాణము సుఖ పడును. అనెను. నీవలనఁ జెడినదానను నేనొకతనే కాదు. "చం॥ హతమయి పోయె నీవలన, జ్ఞాతల మీవును మంత్రులెల్లరున్ హతులిఁక నేను నాసుతుఁడు నాశనమైతిమి పౌరులందఱున్ హతులు" అనెను. ఇవి తిట్లు గాక దీవనలా?

ద్రౌపది భీమసేనుని "ఉత్తిష్ఠోత్తిష్ఠ కింశేషే, భీమసేన మృతోయథా నామృతస్యహి పాపీయాన్ భార్యా మాలభ్య జీవతి। భ్రాతరంచ విగర్హస్వ జ్యేష్ఠం దుర్ద్యూతదేవినమ్। యాస్మాస్మికర్మణాప్రాప్తా దుఃఖమే తదనంతరమ్॥ భీమసేనా। పీనుఁగువలె నిట్లుపడి నిద్రించుచున్నావేమి? లేలే. ఎవఁడుచేసిన కార్యమువలన నాకీకష్టమువచ్చెనో యట్టి చెడుజూదగాని మీయన్నను నిందిం పుము అనెను. ఇట్టులే శకుంతల దుష్యంతుని సభలోనే తిట్టెను. దుష్యంతుఁడు భీముఁడు ధర్మరాజు పెండ్లాలను వదలిరా. వారికంటెఁ గైక యేమియెక్కువ కోపించెను? ఇఁక నాలవది అప్రియవాదిని. ప్రమాణము జేసియుఁదా నిచ్చెద ననినదాని నియ్యకపోవుటచేఁ గఠినముగ మాటలాడెను గాని యంతకు ముందె న్నఁడు కైక యట్లు అప్రియమాడినదిలేదు. "ఇంతకును బూర్వమెన్నఁడే నింతయైన, నప్రియంబైన ననుచితమైన ననవు" దశరథుఁడే (ప. ౩౧౯). చెప్పెనుగదా.

మీఁది శాస్త్రవాక్యము సర్వదా యప్రియములు పలుకుదానిని వదలు మనుచున్నది కాని విశేషణకారణమున నప్రియమొకసారి పలికినంతన వదలు మనలేదుకదా. ఇట్లుండ నుభయలోకములందును వదలుట న్యాయ్యముగాదు.

"అదుష్టాం, వినతాం భార్యాం, యౌవనేయః పరిత్యజేత్, సప్తజన్మ భవేత్ స్త్రీత్వం వైధవ్యంచ పునఃపునః॥ ఎవఁడు దుష్టురాలుగాని భార్యను వినయముగల దానిని యౌవనమందు వదలునో వాఁ డేడుజన్మములు స్త్రీయై పుట్టి జన్మజన్మమందు విధవయగుచుండును. కావున దశరథుఁడు చేసినది సరి యైన కార్యముగాదు. అని పూర్వపక్షము.

ఈపూర్వపక్షము సరిగాదు ముందుచెప్పిన నాలుగు దోషములు కైక యందుఁ గలవు.

౧. కైక స్వధర్మమందు నిలిచినదికాదు. మగనిని నాయన ధర్మమందు నిలువఁ జేసినదికాదు. ఎట్లన :—

కైక స్వధర్మము పాతివ్రత్యము భర్తననుసరించి చరించు వ్రతముగలది పతివ్రత. "పతిసేవైన వ్రతమస్యా ఇతి పతివ్రతా" పతిసేవయే వ్రతముగాఁ గలది పతివ్రత. (గురు. బా. ప్ర.)

భారతమునఁ గపోతీయోపాఖ్యానంబునఁ గపోతి.

"నసాస్త్రీ త్యభిమంతవ్యా, యస్యాం భర్తా నతుష్యతి
తుష్టే భర్తరినారీణాం, తుష్టా స్స్యుస్సర్వదేవతాః
అగ్నిసాక్షిక మిత్యేవ భర్తావై దైవతం పరమ్
దావాగ్ని నేవనిర్దగ్ధా, సపుష్ప స బకాలతా
భస్మీభవతు సానారీ, యస్యాంభర్తానతుష్యతి
విసృజ్యధన సర్వస్వం, భర్తావైశరణం స్త్రియాః
నకార్య మిహ మేనాథ, జీవితేన త్వయావినా
మితం దదాతిహి పితా, మితం భ్రాతా మితం సుతః
అమితస్యహిదాతారం భర్తారం కానపూజయేత్
నాస్తిభర్తృ సమో నాథో, నాస్తి భర్తృసమం సుఖమ్
విసృజ్య ధనసర్వస్వం, భర్తావై శరణం స్త్రియాః
పరుషాణ్యపి చోక్తాయా। దృష్టా దుష్టేనచక్షుషా
సుప్రసన్నముఖీ భర్తుర్యానారీ సా పతివ్రతా
నకామేషు నభోగేషు, నైశ్వర్యే ససుఖే తథా
స్పృహాయస్యా యథాపత్యౌ, సానారీ ధర్మభాగినీ
పతిచిత్తా పతి హితా సాపతివ్రతభాగినీ

ఏస్త్రీనడవడివిషయమున భర్త సంతోషింపఁడో యది భార్యయని యభిమానింపఁదగదు ఏభార్యవిషయమున భర్త సంతోషించునో దానివిషయమున దేవతలును సంతోషింతురు. అగ్నిసాక్షిక వివాహమునఁ దన్నుఁగైకొన్నవాఁడే తనకు దైవతము. ఎవతె విషయమున భర్త సంతోషింపఁడో యది కాఱుచిచ్చుచేతఁ బూలు కాయలతోఁరాలిన చెట్టువలె దగ్ధమగునుగాక. ధనము సర్వము విడిచి స్త్రీకి భర్తయే శరణము. నాథా నీవులేక నాకీప్రాణములతో నేమిపని. తండ్రి, తోడఁబుట్టువు, కొడుకు మితముగ నిత్తురు. అమితముగనిచ్చువాఁడు భర్తయే. "అట్టిభర్తను నెవతె పూజింపదు? స్త్రీకి భర్తతో సమానముగు దిక్కుగాని సుఖముగాని లేదు. ధనమంతయు వదలి భర్తయే శరణముగా నెంచవలెను. భర్తపరుషములాడినను గోపదృష్టి చూచినను ఏభార్య తాను ప్రసన్నముఖియై యుండునో యది పతివ్రత. భర్తయందుండు ప్రేమకంటెఁ గామమందుఁ గాని భోగమందుఁగాని యైశ్వర్యమందుఁ గాని సుఖమందుఁగాని యెక్కువ ప్రేమలేదో యది ధర్మభాగిని. పతిచిత్తమే తనచిత్తముగను పతిహితమే తనకు హితముగను నెంచునది పతివ్రత. ఇది స్త్రీస్వధర్మము. ఇదిపతి

వ్రతాలక్షణము. ఇట్టి స్వధర్మమున నిలువక పతివ్రతగాని స్త్రీవిషయమున భారతమం దిట్లు చెప్పఁబడెను. "కామాద్ద్వేషాన్మత్సరాద్వా భర్తారం యావమన్యతే సాసప్తజన్మకం యావ, న్నారకిస్యాన్న సంశయః॥ జీవితేనాపి నారీన, భర్తారం వంచయేత్తథా। క్రిమియోని శతంగత్వా, పుల్కసీ జాయతేతతః॥ కామముచేఁగాని ద్వేషముచేఁగాని మాత్సర్యముచేఁగాని భర్తనెవతె యవమానించునో యది యేడు జన్మములు నరకముపాలగును. తనప్రాణము పోవునట్లుండినను భర్తను వంచనచేయరాదు. అట్లుచేసిన స్త్రీ నూఱుజన్మములు క్రిమిగాఁబుట్టి యావల మాలదిగాఁ బుట్టును.

ఈ ప్రమాణములచేఁ గైకేయి స్వధర్మమందు నిలచినదికాదు. పతివ్రతయుఁగాదు. ఱంకుతనమొకటి లేకపోఁగానే స్త్రీ పతివ్రత యనిపించుకొనఁబడదు. కావుననే దశరథుఁడు నీవసతివని కైకను దూషించెను. తనధర్మమందుఁ దాను నిలువకుండుటయేగాక కామక్రోధ మాత్సర్యవశయై భర్తకు ధర్మహాని గలిగించెను. ఎట్లన:- రాజ్యమునకు జ్యేష్ఠపుత్రుఁడగు శ్రీరామచంద్రమూర్తి యర్హుఁడని మంథర కైక యిరువురు నంగీకరించినవిషయమె. "కం॥ అనఘా యిక్ష్వాకులలోఁ। దనయుఁడు జ్యేష్ఠుఁడు రాజ్యతంత్రము దీర్పన్। జనుఁ గులధర్మము విడువక కొనుమీ రాష్ట్రంబు నేలుకొనుమీ ప్రజలన్॥ అని వసిష్ఠుఁడు వంశమర్యాద యనియును జెప్పెను. "ఉ॥ మాకులమందు జ్యేష్ఠుఁడ క్షమాభరమెల్ల భరింపసోదరుల్। ప్రాకట భక్తిచే జనకు భంగిని నాతని గొల్చుటొప్పు న। స్తోకపు ధర్మ మీతెఱఁగు దోఁపదా నీకిది యెల్లరాజులున్। జేకొను చంద్రు మీయెడ విశేషముగాఁ గొనియాడఁగాఁబడున్" అని భరతునివాక్యము "జ్యేష్ఠఏవతు గృహ్ణీయాత్పిత్ర్యం ధనమశేషతః। శేషాస్తముపజీవేయు ర్యథైవపితరంతథా॥ విభక్తముగాని వంశమందుఁ బెద్దకొడుకు ధర్మమందుండువాఁ డగునేని తండ్రి సర్వస్వము పెద్దకొడుకుదే. తక్కినవా రతనిఁ దండ్రినిఁ గొలిచినట్లు గొలువవలయును.

ఈవిధముగా శాస్త్రము లోకాచారము వంశాచారము ఈమూఁటిచే శ్రీరామచంద్రమూర్తికే రాజ్యమువచ్చుట ధర్మయుక్తము. అట్టి ధర్మమునకు నైశ్వర్య కామముచే, సవతియందలి క్రోధముచే ధనలోభముచే విఘ్నమాపాదించెను. అట్టైన వరములగతి యేమియందురా? పూర్వధర్మమునకు విరుద్ధమైన యుత్తమధర్మము ధర్మముగాదు. ధర్మమునకు ధర్మము విరోధింపరాదు ముందుపూనిన ధర్మమే జరగవలయును కావునఁ గైకవరము కులాగత శాస్త్రీయ ధర్మమునకు విరోధము. దశరథుఁడు ముందు సభలోఁజెప్పినమాటకు విరోధము కావున నది ధర్మమనరాదు. అదియునుగాక నిష్కారణముగ నిరవరాధిని శ్రీరామచంద్రమూర్తిని నాయన చావుగోరి యడవులపాలు చేసెను. ఇది "హా జగడాలమారి కయికా! నెఱవేఱెనుగా త్వదీప్సితం। బోజగజంత వంశ కలశోదధి చంద్రుఁడు గ్రుంకె వంశసద్బీజము పాడుచేసితి" వని సీతాదేవి

దుఃఖించుటచే నెఱుఁగనగు. యుద్ధ. ౬౭౪. "కం॥ సీతాకారణముగనే। వీతాసుఁ డవైన నీవు వేపుకరుగన్। జేతము రంజిలఁ గామాన్విత యగుచు భరతు మాత విలసిల్లుఁగదా" అరణ్య. ౯౯౪ అని శ్రీరామునివాక్యము. ఇది వారి యూహామాత్రముగాదు. మంథర కైకతో "శ్రీరాముఁడు కానలోనన విరామత నొందు నిజంబు చూడుమీ" యనెను. అయో. ౨౩౫-వ ప. ఇంతకంటె దురు ద్దేశము వేఱొకఁ డుండునా? కులఘ్ని-పతిఘ్ని సుతఘ్నియగు నిల్లాలు పతి వ్రతయన నెవరికైన నోరెట్లాడును?

కైక కోపనయగునా కాదా విచారింతము:—కోపనయనఁగా కోపస్వభా వము గలది. కోపశీలా కోపనా యని గురుబాల ప్రబోధిక. సీత, కౌసల్య, ద్రౌపది భర్తలపైఁ గోపించుట కామక్రోధ లోభములచేఁగాదు. సహధర్మచారిణి యైన తన స్వధర్మమునకు శ్రీరామచంద్రమూర్తి విఘ్నము కలిగించి తన శ్రేయస్సునకు హాని గలిగింపఁ జూచుటచే సీత గోపించెను. ఇది ధర్మ్యమైన కోపము. ప్రణయకోపము దోషయుక్తమైనది కాదు. ఇట్టులే యెవరైనను దమ స్వధర్మమునకు హానిగలిగింపఁ జూచిరేని వారిపైఁగోపింపవచ్చును. ఇఁకఁ గౌసల్యయో. తనయొంటికొడుకు, కులముద్ధరింపవలసినవాఁడు, తనకు నీళ్ళు విడువవలసినవాఁడు; ఇట్టి పరలోక సాధన భూతమైనవానిని నిష్కారణముగఁ గాముక వాక్యమునుబట్టి రెండులోకముల భ్రష్టురాలిని జేసినపుడు అట్టి కామా తురుఁడైన మగనిపైఁ గోపించుట తప్పా? ఇఁక ద్రౌపదియో తన్నుఁ గీచకుఁడు చెఱుచుటకుఁ గంకణము గట్టుకొనియున్నాఁడు. రాణియో వాని కనుకూల. ఇట్టి చోట నేవురుమగలుండియు నొకరైనఁ దనశీలము కాపాడరేని యా మగలుం డియుఁ జచ్చినవారేకదా? తాను బలాత్కారముగ నొకనిచేఁ జెడుట తనకే గాక పాండవులకును శ్రేయోహానికదా? అటువంటి సమయమునఁ దనమాన సంర క్షణము చేయుమని మగనిపైఁ గోపించుట దోషమా? కాదు.

మగఁడు తన కనుకూలుఁడుగనుండి తన యిష్టప్రకారమాడుచుఁ గోపింపఁ గారణము లేనపుడు కోపింపకుండుట శాంతిలక్షణముగాదు కోపకారణము గలిగి నను కోపింపకుండుట శాంతిలక్షణము.

కం॥ మటమటలాడెడిమోమును। జిటచిటమని కసరికొట్టు చీఁదఱపలుకుల్। కుటిలగుణంబును గలయా। పటుమాయల కైకమోముఁ బరికించుటెటో. యని కౌసల్య వాక్యము సాక్ష్యము.ఇవి సవతిమాటలు కావున నీ సాక్ష్యమంగీకార్యము గాదందు రేని" ఉ॥ ఏపెమహాపరాధము మునీశ్వరప్రాణముమీఁదఁదెచ్చెని। ప్పాపులకన్నదమ్ములకుఁ బార్థివు స్వర్గతుఁ జేసెనట్టిదొ। పాపిని మూఢచిత్తఖల భామిని నిష్ఠురశీల శాఠ్య సం। ప్రాపిత భోగదుస్స్వభగమానిని కైకయి యిద్దియే సుమీ" భామిని=కోపన. అయో ౯౧౧౪ గీ॥ ఆర్యరూపిణియైన యనార్య యదయ। పాపనిశ్చయ నాదు సంతాపమునకు, మూలకారమైనట్టి మూర్ఖురాలు, నన్నుఁగన్నదిగా నెంచు సన్ను తాథ్య, ౯౧౧౯- అను భరతుని

వాక్యములే సాక్ష్యము ఇది యన్ననునడవులపాలు చేసెనను కోపముతోఁజెప్పిన మాటలందమా యనిన. గీ॥ ఆత్మకామ సదాచండి యతుల కోప. శీలయును బ్రాజ్ఞమానిని చెనఁటినాదు। తల్లి కేవ్యాధి లేదుకదా"యనితన్నుఁ బిలువవచ్చిన దూతల భరతుఁడడిగెను. అప్పటికి నయోధ్యావృత్తాంతము భరతుఁడెఱుఁగఁడు. దీనివలనఁగైక కోపస్వభావయనుటయందు సందేహములేదు.

మగని యనుగ్రహము సంపాదించుకొను తలంపుతో మగని నిర్బంధించి నను, మంత్ర తంత్రములు మందులుఁ బ్రాకులు మాయోపాయములు చేసి నను నదియు నసతియే. "భారతమున నరణ్యపర్వమున సత్యాద్రౌపదీ సంవాదము చూడుఁడు'—గీ॥ సాధువైనవాని సత్పథ నిరతునిఁ। దేరనాపదలను గూరఁజేయ। ధర్మ హానియగుట తప్పక తెగఁగాల్చు। శక్రుతేజమైన వక్రగమన అయో. ౧౧౧౮- అను మహామాత్య వచనమువలన శ్రీరామచంద్రమూర్తి నడవికిఁ బంపుట మహాపాపకార్యము. ఇట్టి పాపకార్యమునకుఁదగిన ప్రాయశ్చిత్తము పెట్టుకొనకున్ననాశనుగుట నిశ్చయము. దానికిఁ గారణమైన కైకను వదలుటయే శాస్త్రీయ ప్రాయశ్చిత్తము. "శ్లో॥ పతిత్యాజ్యా త్వయా భార్యా, భర్తృవచనలంఘనీ। తత్రదోషోన చాస్తీతి, త్వంహి వేత్థ యథాతథమ్॥ సర్వ లక్షణయుక్తాపి యాతు భర్తృవ్యతిక్రమమ్। కరోతిసాపతిత్యాజ్యా, ఏషధర్మస్సనాతనః. బ్రాహ్మపురాణము. భర్తమాటను నతిక్రమించు భార్యను వదలిపెట్టవలయును. అట్లు వదలుటయందు దోషములేదు. సమస్త లక్షణములు సరిగానున్నను భర్తనతిక్రమించిపోవు దానిని వదలవలెను. ఇది సనాతన ధర్మము. "అధోలోకమున కరుగునీకుం జెకుఱదు సలోకసుఖము సిద్ధము పతితోన్, అని కదా భరతుఁడు చెప్పెను. కావున దశరథుఁడు కైక విడనాడుట యందే దోషములేదు.

ఉ॥ రాతిరి దీఱె, వేకువయు•రాఁ దొడఁ గెం, దనయాభిషేకకా
　ర్యాతతరక్తిపై గురుచ•యంబులు నన్నిఁకఁ దీవరించు, వి
　ఖ్యాతముగాఁగ రాముని త•దర్థము గూర్చినవస్తుకోటిచేఁ
　బ్రేతము కౌర్ధ్వదైహికముఁ•బ్రీతిని రాముఁడె సల్పుఁగావుతన్.　　౪౧౮

తన యాభిషేక కార్యతతరక్తిపైన్=నాకుమారుఁడు రాముని నభిషేకకార్యమందలి యతిశయించిన ప్రేమచే,గురుచయంబులు=గురువుల సమూహములు-మంత్రిపురోహితాదులు, తీవరించున్=తొందరపెట్టును, విఖ్యాతముగాఁగన్=ప్రసిద్ధముగ నందఱకుఁ దెలియునట్లు, రాముని తదర్థము = శ్రీరాముని కొఱకు, ప్రేతము=పీనుఁగు, ఔర్ధ్వదైహికము=దేహముఁవిడిచిన పిమ్మటఁ బ్రేతములకై చేయవలసిన కార్యములు, సత్త్వాస్తునారకాః ప్రేతాః॥ అమరుఁడు ఈదేహమును విడిచినపిమ్మట నరకమునకుఁబోవు పాపజీవులకుఁ బ్రేతములనిపేరు.నిష్కారణముగ

శ్రీరామచంద్రమూర్తిని నరణ్యములపాలుచేసిన తనకు నరకప్రాప్తి తప్పదని దశరథు నభిప్రాయమని యేర్పడుచున్నది.

ప్రేతముకున్=ఉకారఋకారంబులకు 'కు' షష్ఠిపరమగుచో నగామంబు తఱచుగనగు సు.వ్యా. తత్సమ. ౪౮. సూ. ప్రకారము ప్రేతమునకున్ అని యుండవలెను. ఆగమసూత్రమని త్యమగుటను, తఱచుగనగునని సూత్రమున నుండుటను నిషధేంద్రుబచ్చుకున్ అని నైషధంబున శ్రీనాథుండును, సంగరం బనినసుత్సవముకే గెడిక్రియనని నా చసనోమనయు, పంతుకు ననియు నిట్టి మహాకవిప్రయోగములుండుటచే నిది దోషముగాదు. దీర్ఘువువర్ణము మీఁద నకారాగమము నిత్యము "కాలకంఠుని శిరసుపూ గగనగంగ" యను శ్రీనాథుని ప్రయోగమువలన పూవుశబ్దపర్యాయము పూయనిశబ్దముగలదు. ఇది ప్రథమా విభక్తియందే ప్రయోజ్యము. కావున పూవున కనియే చెప్పవలయును. బహు వచనమందును, సమాసమందును వువర్ణమువైకల్పికముగ లోపించును.

తాత్పర్యము

రాత్రి ముగిసెను. ఉదయము కావచ్చెను. శ్రీరామాభిషేకమందాసక్తిగల మంత్రిపురోహితాదులు రా రమ్మని నన్నిఁకఁ దీవరింతురు. నేనేమో యిఁక బ్రదుకుట కల్ల. కావున శ్రీరాముని పట్టాభిషేకమునకై సిద్ధముచేసిన పదార్థము లతో మరణించిన నాకు శ్రీరాముఁడే యూర్ధ్వలోకప్రాప్తికిఁ జేయవలసిన కార్య ములన్నియుఁ జేయునుగాక.

కం॥ ఈకరణిని రాముని యభిషేకమునకు విఘ్నమీవుఁ చేయుటఁ జెనఁటీ
నీకొడుకును నీవును నవివేకిని నా కింక నీళ్ళు విడరాదు సుమీ. ౪౧౯

తాత్పర్యము

దుర్మార్గురాలా! నీ వీ విధముగ శ్రీరాముని యభిషేకమునకు విఘ్నము కలిగించుటచే నీవుగాని నీకొడుకుగాని నాకుఁ దిలోదకములు విడువఁగూడదు.

కం॥ మును పెలమి నలరు చుండఁగఁ, గనినట్టిపురీజనంబు గతహర్షం బై
కనఁగ నవాఙ్ముఖ మై కడు, వనటం బడ నెట్లుచూడ వశ మను చుండన్.

ఎలమిన్=సంతోషముతో, గతహర్షము=పోయిన సంతోషముగలది, సంతోషహీనమైనది, అవాఙ్ముఖమై=తలవంచుకొన్నదై, కడున్=మిక్కిలి, వన టంబడన్=దుఃఖింపఁగా.

తాత్పర్యము

శ్రీరామునకు బట్టాభిషేకము జరుగునని యెంతోసంతోషముతో వికాసము నొందిన ముఖములుగల జనులిదుర్వార్తనిని సంతోషముచెడి తలలువంచుకొని కన్నీరు కార్చుచుండ నూరకచూడ నాకు సాధ్యమా.

కం॥ రిక్కలు మాయఁగ జలధికిఁ, జుక్కలఱేఁ డరుగఁ దూర్పు సొబగు గనంగా
గ్రక్కున రే వేగుట గని, ద్రెక్కొను రోషమునఁ గైక నృపతికి ననియెన్.

రిక్కలు=చుక్కలు-ఋక్షశబ్ద భవము రిక్క. చుక్కలఱేఁడు=నక్షత్రాధిపతి చంద్రుఁడు-వేగుట=తెల్లవాఱుట.

తాత్పర్యము

నక్షత్రములు కానరాకపోయెను. చంద్రుఁడు పశ్చిమ సముద్రమునకుఁ బోయెను. తూర్పువికాసము నొందెను రాత్రి తెల్లవాఱెను. అవన్ని చూచి యింకను దశరథుఁడు పట్టాభిషేకము నిలుపక పనికిమాలిన మాటలు చెప్పుచున్నాఁడుగదా. అక్కడఁ గార్యము మించునేమో యని కైక కోపమున రాజుతో నిట్లనియెను.

ఉ॥ ఏ మిటు మాటలాడెదు క్షితీశ్వర! దుర్విషహోద్భవోరుతీ
వ్రామయతుల్యభాషణము లాల మిఁ కేటికిఁ? బిల్వఁ బంపుమీ
రామునిఁ గానకుం బనుప రాజు నొనర్పుము నాసుతున్ నను
న్హామిక నిస్సపత్న గ నొనర్పుము ధన్యుఁ డ వౌదు వంతటన్. ౧౨

క్షితీశ్వర=రాజా! దుర్విషహ=బొత్తుగ సహింపరానియట్లు, ఉద్భవ=పుట్టినదియు, ఉరు=గొప్పదియు, తీవ్ర=తీక్ష్ణమైనదియునగు, ఆమయ=వ్యాధితో, తుల్య=సమానమైన, భాషణములు=మాటలు, అలము=ఉపేక్ష, హామికన్=గర్వమున, నిస్సపత్నగన్=విరోధులు లేని దానిఁగ; అలంబాలంబు సేసియని తిక్కన ని. రా.

తాత్పర్యము

ఏమి రాజా! సహింపరానిదై తీక్ష్ణమైన గొప్ప సన్నిపాత రోగముపుట్టినవాఁడు మాటలాడినట్లు మాటలాడుచున్నాఁడవు. ఈప్రొద్దు పోని ముచ్చటలతోఁ గాలక్షేపము చేయవలదు. శ్రీరామునిఁ బిల్వఁబంపి యడవులకుఁ బొమ్మనుము. నాకుమారుని రాజ్యమున నభిషేకింపుము. నన్ను శత్రువులులేని దానిఁగఁజేసి గర్వపడఁజేయుము అప్పుడు నీవు కృతకృత్యుండవగుదువు.

చం॥ సతి యిటు తన్నుఁ బల్క నృప చంద్రుఁడు తీవ్రకశాభిఘాతబా
ధితగురు ఘోటకంబుగతిఁ దెప్పున రేఁగి వచించె నోసి యీ
గతి భృశధర్మపాశములఁ గట్టువడన్ వెలసెన్, వినష్టమై
స్మృతి చెడి, రామచంద్రు శుభశీలుఁ గన న్మది గల్గె నంచనన్. ౧౩

తీవ్ర=చురుకైన, కశా=కొఱడాయొక్క అభిఘాత=దెబ్బచేత, బాధిత=బాధింపఁ బడిన, గురుఘోటకంబుగతిన్=గొప్పగుఱ్ఱమువలె, తెప్పునన్=త్వరగా తటాలున, రేఁగి=విజృంభించి, భృశధర్మపాశములన్=శ్రేష్ఠమైన ధర్మమనెడి త్రాళ్ళచే, స్మృతి=తెలివి, దీనిచే శ్రీరామునిఁ గానలకుఁ బంపనిశ్చయించుకొనెనని తెలిసెడిని.

తాత్పర్యము

తనయిల్లాలు తన్నిట్లు పల్కఁగా రాజశ్రేష్ఠుఁడు చుఱుకైన కొఱడాదెబ్బ చేత బాధపడు నుత్తమజాతి గుఱ్ఱమువలెఁ బిరాఱున నెగిరిపడి యోసీ నేను నీవిధముగ నతిక్రమింపరాని ధర్మమను త్రాళ్ళచేఁ గట్టుపడవలసి నట్లేర్పడెను. తెలివి నష్టమయ్యెను. శుభచరిత్రుఁడైన శ్రీరామచంద్రుని జూడఁ గోరెదను. అని చెప్పెను.

ధర్మపాశములఁ గట్టుపడన్ వలసెనని దశరథుఁడు పలికెఁగదా. ఇది యథార్థమా యని శంక.

వాస్తవమున దశరథుఁడు ధర్మపాశబద్ధుఁడుగాఁడు. ఎట్లన:- దశరథుఁడు గృహస్థునిఁగా భావింతమా. పెద్దకొడుకును విడుచుట యధర్మము. అందును భార్యసమ్మతిలేక విడుచుట తప్పు. రాజుగా నాజ్ఞ చేసెనందమా శ్రీరామచంద్రమూర్తియందు దోషములేదు. దోషిగాని వాని దండించుట ధర్మశాస్త్రవిరుద్ధము. హానికరము. అదియునుగాక పూర్వదినమందు సభలోను దరువాత నింటిలోను శ్రీరామచంద్రమూర్తికిఁ బట్టాభిషేకముచేసెదనని చెప్పెను. ఈకారణములచే దశరథుఁడు ధర్మపాశ బద్ధుఁడు కాఁడు. సత్యపాశ బద్ధుఁడగునేమో.

పరిహారము. వాస్తవమున దశరథుఁడు సత్యపాశబద్ధుఁడే. కైకకిచ్చిన వరములు రణవేళ ప్రత్యుపకార బుద్ధితోఁ గృతజ్ఞుఁడై యిచ్చినవి. కాని భార్యయని కామబలమున రతివేళ నిచ్చినవి కావు. అవి నెఱవేర్పని యెడల దశరథుఁడు కృతఘ్నుఁడే యగును. ప్రజల కసత్యమాడ నేర్పినవాఁడే యగును. రాజాను మతము ధర్మము. యథారాజా తథా ప్రజా-యద్యదాచరతిశ్రేష్ఠ స్తత్తదేవేతరోజన" యని ప్రజ లసత్యవర్తను లగుదురు. ప్రజలలో నెవఁడైన నసత్యమాడెనేని రాజేమని దండింపఁగలఁడు. ఎవతెకోకాదు భార్యకు. ఎప్పుడో కాదు. ప్రాణరక్షణము చేసినపుడు; దేనికోకాదు కృతజ్ఞతకై చేసిన సత్యమును నీవు తప్పితివే నేను దప్పిన నేమి దోషమని యాదోషి యడిగిన దశరథుఁడేమి చెప్పఁగలఁడు? కావునఁ బెద్దకొడుకును విడిచియైనఁ బ్రాణము విడిచియైన లోకము నిమిత్తమై సత్యపాశబద్ధుఁడు కావలసి వచ్చెను. "సతాం కేనాపికార్యేణ లోకస్యారాధన వ్రతమ్। యత్పూజితం హి తాతేన, మాంచ ప్రాణంచ ముంచతా॥ ప్రభువుల కేకార్యము చేసియైన లోకారాధనముచేయుట వ్రతము. నాతండ్రి నన్నుఁ బ్రాణములను వదలి దానిని గౌరవించెను గదా" యని శ్రీరామచంద్రమూర్తి వాక్యములుగ భవభూతి రచించెను. (ఉత్తర. ౧-౪౧.) దశరథుఁ డీయధర్మకార్యము నేనెట్లుచేయుదునని యంగలార్పఁగా నీయభిప్రాయ ప్రకార మధర్మమగునేని నాయభిప్రాయ ప్రకారము ధర్మమే ఏలననేను నిన్ను సత్యమందు నిలుపుమని బలాత్కరించుచున్నాను. సత్యమునుమించిన

ధర్మములేదు. అన్ని ధర్మములలో సత్యభాషణమే శ్రేష్ఠమైనది. కావున నిది యధర్మమెట్లగునని కైక వాదించెను. ఆటయిన శ్రుతీతిహాస పురాణములందు సత్యము ధర్మము వేఱువేఱఁ జెప్పఁబడ నేలయనిన సత్యము విశేషధర్మము. ధర్మము సామాన్య వాచకము. ధర్మమునం దనేక భేదములు గలవు. అందొకటి సత్యము దేహమునందలి యవయవములలో శిరస్సువలె ధర్మములందు సత్యము. శిరస్సులేని దేహమెట్టిదో సత్యములేని ధర్మమట్టిది. "శిరోహి సర్వగాత్రాణాం ధర్మణాం సత్యముత్తమమ్" అని మనువు. కైకచెప్పినదిదియే. తలఁపుమీ నీవింత ధర్మవిధము. ధార్మికులు సత్యమే పరమధర్మమనరె. నీ వధర్మంబు చలుపఁగ నేను సత్యమూఁతగాఁ బట్టుపటిచెద" ననెను. అయో. ౪౦౮. కావున దశరథుఁడు ధర్మపాశబద్ధుఁడనైతి ననుటయందు దోషములేదు.

కం॥ అంతటఁ దూర్పున నళినీ, కాంతుఁడు తోతెంచె విరియఁగాఁ జీఁకటు ల
త్యంతముడాసె ముహూర్తం,
బంత వసిష్ఠుండు స్నాతుఁడై యోగ్యగతిన్. ౪౨౪

నళినీ కాంతుఁడు=సూర్యుఁడు, తోతెంచెన్=ఉదయించెను. (తోఁచు+తెంచు=తోతెంచు) విరియగాఁన్=విరిసిపోఁగా, అత్యంతము=మిక్కిలి, దాసెన్ సమీపించెను, స్నాతుఁడై = స్నానము చేసినవాఁడై, యోగ్యగతిన్=తగిన విధముగ.

తాత్పర్యము

ఇంతలోఁ జీఁకటులు పలుచన పాఱుచుండ సూర్యుఁ డుదయించెను. ముహూర్తము కేవలము సమీపించెను. అంత వసిష్ఠుఁడు సరయువునకుఁబోయి స్నానముచేసి తగినరీతిని

వసిష్ఠశబ్దార్థమును వసిష్ఠుఁడే యిట్లు చెప్పెను. "శ్లో॥ వసిష్ఠోస్మి వరిష్ఠోస్మి వసేవాసగృహేష్వపి వరిష్ఠత్వాచ్చ వాసాచ్చ, వసిష్ఠ ఇతివిద్ధిమామ్" భార. అను. ౧౪౭ అధ్యా.

వ్యాఖ్య

వాయుశ్చ పృథివీచేతి శ్రుతిప్రసిద్ధావాయ్వాద యోవసవస్తే యస్య స్వాధీనా భవంతి సవసుమాన్ ప్రాప్తాణి మాద్యైశ్వర్యో మహాయోగి। అతిశయేన వసుమానితి వసిష్ఠస్తాదృశోహమస్మి వసుమచ్ఛబ్దాదిష్ఠన్ప్రత్యయే పరేమతు బ్లోపేటిలోపేచ వసిష్ఠః॥ వాసగృహేషు వాపయోగ్యేషు గృహస్థాశ్రమేషు సర్వేషాముపజీవ్యేషు వసేవసామి అతోహం పస్త్యాణాం మధ్యే అతిశ్రేష్ఠ ఇతివసిష్ఠోస్మి॥ నీలకంఠ॥ వాయువుపృథివి మొదలయినవి వసువులనఁబడును. అవి స్వాధీనమందుఁ గలవాఁడు వసుమంతుఁడు. అనఁగా నణిమాద్యైశ్వర్యము గలవాఁడు. వసుమంతులయందు నేను శ్రేష్ఠుఁడను గావున వసిష్ఠుఁడను, గృహస్థాశ్రమ మందుండు వారిలో నెల్లనేను శ్రేష్ఠుఁడను గావున వసిష్ఠుఁడను.

—వసిష్ఠుఁడు పట్టాభిషేక సంభారములతోఁ జనుదెంచుట.—

సీ॥ ఛాత్రసమేతుఁడై సకలసంభారముల్, గొంచుఁ బురంబుఁ జొ త్తెంచుచోట
సిక్తసమ్మార్జిత శ్రీపథంబును మాల్య, బృందసుమాకీర్ణ సుందరంబు
చిత్రధ్వజాళిభూ షితము సంహృష్టలో, కపటలంబు సమృద్ధ విపణివీథి
కీర్తితోత్సవసమా కీర్ణంబు, చందనా, గురుధూపధూపిత కూటచయము
తే॥ నుర్విజాధవహేతుస ముత్సకంబు. చారుశోభామరావలీ సన్నిభంబు
నైనపురమును గనుచు నం దంద కడచి,
యధిపునంతపురంబు డా యంగవచ్చె ౪౨౫

ఛాత్రసమేతుఁడై=శిష్యులతోఁ గూడినవాఁడై, సకలసంభారముల్= పట్టాభిషేకమునకుఁ గావలసిన తాను దేవలసిన సకల వస్తువులు, పురంబున్= అయోధ్యానగరమును, చొత్తెంచు చోటన్=ప్రవేశించు సమయమందు దీని వలననే వసిష్ఠుఁడు సరయువునందు స్నానము చేసివచ్చెనని సూచితము. స్నానమనునది తక్కిన కర్మముల కుపలక్షణము. సిక్త=జలముచేఁ దడపఁ బడినదియు=సమ్మార్జిత=కసవు చిమ్మఁబడినదియు నయి, శ్రీ=కాంతియుక్తమైన, పథంబును=మార్గమును. మాల్యబృంద = పూలదండల సమూహముచేతను, సుమాకీర్ణ=చల్లఁబడిన విడిపూలచేతను, సుందరము=అందమైనది, చిత్ర= పెక్కుతెఱంగులగు రంగులు నాకారములుగల, ధ్వజాళి=ధ్వజముల సమూహ ములచే, భూషితము=అలంకరింపఁ బడినది, సంహృష్ట=మిక్కిలి సంతోషించిన లోకపటలంబు= జనసమూహముగలది. సమృద్ధ=అన్నిరకముల వస్తువులచే నిండియుండు విపణివీథి=అంగడి వీథులు గలది. కీర్తితోత్సవ సమాకీర్ణంబు= పొగడఁబడిన యుత్సవముచే వ్యాపించినది. చందనాగురు ధూపధూపిత కూట చయము=శ్రీగంధపుఁబొడి అగురు వీని పొగలచేతఁ బొగవేయఁబడిన యిండ్ల సమూహములు గలది. ఉర్విజాధిప=సీతాపతియగు శ్రీరాము నిమిత్తమై సంతో షించునదియు, చారుశోభామరావతీ సన్నిభంబు=మనోహరకాంతియందు దేవతా నగరమైన యమరావతితో సమానమైనదియు, అందంద=ఆయాప్రదేశములను వరుసగ, కడచి=దాఁటి.

తాత్పర్యము

వసిష్ఠుఁడు సరయువునందు స్నానముచేసి నిత్యకృత్యములు దీర్చుకొని తాను దేవలసిన పదార్థములను శిష్యులచే నెత్తించికొని పురంబునఁబ్రవేశించి రాజు నంతఃపురంబునకు వచ్చుచుఁ ద్రోవలోఁ గసవుచిమ్మినీళ్ళుచల్లి శోభిల్లఁ జేసి యందందు పూలదండలు కట్టి విడిపూలెగఁజల్లి నానావిధములైన ధ్వజములచే నలంకరించి సంతోషయుక్తులైన జనులు సంచరింపఁగా సకలపదార్థముల వారిగా నుంచిన యంగళ్ళుగల వీథులను శ్రీరామ పట్టాభిషేకము శ్రీరామపట్టాభిషేకము అని పొగడుచు సంతోషించు జనులచే వ్యాపించినవియు శ్రీగంధము అగురు వీని ధూపవాసనలచె

గుమాయించునవియు శ్రీరాముఁడు కారణముగా నాయన నిమిత్తమై సంతోష పడుచున్నవియునగు నిండ్లుగలిగి దేవతానగరమైన యమరావతితో సమానమైన పురమును జూచుచునాయా ప్రదేశములుదాఁటి దశరథునంతఃపురము సమీపంబునకు వచ్చెను.

కం॥ కలకల మనికూసెడిపక్షులతోఁ బురజనులలోడ◆శుచిమద్ద్విజకో
టులతో ద్విజతతితో సభ్యులతోఁ జెలువారు నంతః◆పురముం గనుచున్.

వసిష్ఠుఁడు వచ్చువఱకుఁ బురమున్న విధము వర్ణించి యిఁక రాజగృహమున్న విధమునగవి వర్ణించుచున్నాడు. శుచిమత్=నిత్యాగ్నిహోత్రములు గల, ద్విజకోటులతో=బ్రాహ్మణులతో, ఇట్లనుటచే నగ్నిహోత్రములు దీర్చుకొని బ్రాహ్మణులు వచ్చిరని భావము. శుచి=అగ్ని, ద్విజతతితో=ఇతర బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులతో

తాత్పర్యము

కలకలమని కూయుచున్న పెంపుడు చిలుకలు మొదలైన పక్షులధ్వనులతోఁ బౌరులతో నిత్యాగ్నిహోత్రులైన బ్రాహ్మణులతో నితర బ్రాహ్మణక్షత్రియ వైశ్యులతో సభకు యోగ్యులగు సామంతాది రాజులతో నంతఃపురము నిండియుండఁగాఁ జూచుచు.

—◆ వసిష్ఠుఁడు దనరాక దశరథునకుఁ దెలుప సుమంత్రుఁ బంపుట. ◆—

ఉ॥ మూఁగిన యట్టిమూఁకలను◆ముున్నుగఁ బాయఁగఁ జేసి ప్రీతిమై
లోఁగిటి కేగుచో నిజవి◆లోకనగోచరుఁ డౌచు వెల్పలన్
రాఁగ విశారదున్ సుమతిఁ◆బ్రాజిత మంత్రివరున్ సుమంత్రునిన్
దాఁ గనుచున్ మదాగమము◆ధారణీనేతకుఁ దెల్పు వేగమే. ౪౨౮

నిజవిలోకనగోచరుఁడు=తనకన్నులకుఁ గానవచ్చినవాఁడు, మదాగమము=నారాక, ధారణీ నేతకున్=రాజునకు, ప్రాజితన్=సారథిని.

తాత్పర్యము

గుంపులు గుంపులుగా నిలుచున్నవారిని ముందుగాఁ దొలఁగిపొండని చెప్పి త్రోవ యేర్పఱుచుకొని లోపలికి బోవునపు డెదురుగా వెలుపలనే కానవచ్చిన కార్య సమర్థుఁడును మంచి మనస్సుగలవాఁడు సారథియు మంత్రియునగు సుమంత్రుని జూచి మంత్రీ నేను వచ్చియున్నాఁడ నని వేగమే రాజునకుఁ దెలుపుము.

సీ॥ ఇవె గంగాజలపూర్ణ◆హేమకుంభంబులు,నివె సింధుజలఘటీ◆బృందములును
అభిషేకమునకుఁగా◆నాహృతంబైన యౌ,దుంబరభద్ర పీ◆ఠంబు నదిగొ
సకలబీజంబులు◆క్షౌద్రంబు మణిగంధ, దధిఘృతజలాజలు◆దర్భ లవియె
యష్టకన్యలు వారె◆యదిగొ ఖడ్గము మత్త,వారణ మదె పూలు◆పాలునవిగొ
ఆ॥ నతులహయచతుష్క◆మదిగొఁ దేరు ధనుస్సు,నరవిరాజివాహ◆నంబు నదిగొ
నదిగొఁ దెల్లగొడుగు◆నవె వెలిచామరల్,గనకకలశ మదిగొఁ◆గనఁగదయ్య.

వసిష్ఠుఁడు కార్య నిర్వహణమందుఁ దన లోపమేదియు లేదని చెప్పు చున్నాఁడు.

గాంగజల పూర్ణ హేమకుంభంబులు=గంగానది నీళ్ళతో నిండిన బంగారు కుండలు, సింధుజలఘటీబృందములు=సింధునది నీటినిగల కుండలసమూహ ములు, ఆహృతము=తేఁబడినది, ఔదుంబర భద్రపీఠము=అత్తికఱ్ఱతోఁ జేయఁ బడిన మేలిపీఁట, క్షౌద్రంబు=తేనె, సకల బీజంబులు = నవ్యధాన్యములు, లాజలు=పేలలు, మత్తవారణము=మదపుటేనుఁగు, అతులహయ చతుష్కము= సాటిలేని నాలుగు గుఱ్ఱములు, వరవిరాజి=మనుష్యులచేఁ బ్రకాశించు, వాహ నము=పల్లకి వెలిచామరల్=తెల్లవింజామరములు, కనకకలశము=బంగారు పాత్రము.

తాత్పర్యము

సుమంత్రా నేను దెప్పింపవలసిన వెల్లఁ దెప్పించితిని. ఇవిగోఁ జూడు. ఇవి గంగానదీ జలములుగల బంగారుకుండలు. ఇవి సింధునదీ జలములుగల బంగారు కడవలు. అభిషేకమునకుఁ గావలసిన యత్తిచెక్కల పీఁట. ఇవె నవ ధాన్యములు. తేనె, రత్నములు గంధము పెరుఁగు నేయి పేలలు దర్భలు కన్యలెనమండ్రు, ఖడ్గము, మదపుటేనుఁగు మనుష్యులుగలపల్లకి, తెల్లగొడుగు, తెల్లచామరలు, బంగారు కలశము. ఇవియన్ని చూడుము.

సీ. బంగారుతలుగులు♦బలుమూఁపురంబును,గల తెల్లయాఁబోతుఁ♦గాంచవయ్య
నాలుగుకోఱల♦నలువారుకేసరి, సత్వవంతము హరి♦సత్తమ మదె
సింహాసనం బదె♦చెలఁ గెడిఁ బులితోలు, నదె ప్రజ్వరిల్లుహు♦తాశనుండు
వాదిత్రసంఘంబు♦వఱలెడి నదిగొ స,మాలంకృతంబు వే♦శ్యాజనంబు
తే. బ్రాహ్మణులు వారె, యాచార్య♦రాజి యదిగొ,
నావు లవె, పుణ్యమృగపక్షు♦లవిగొఁ, బౌర
జానపదులు వైశ్యులు♦క్షత్రియులును
వారె కొలు వెల్ల నిండిన♦వారు కంటె. ౪-౨౯

ఆఁబోతు=ఆవు + పోతు=పుంగవము, కేసరి=సింహము, హరిసత్తమము =శ్రేష్ఠమగు గుఱ్ఱము, వాదిత్రసంఘము=వాద్యములు వాయించువారి గుంపు సమాలంకృతంబు=చక్కఁగా నలంకరింపఁబడినది.

తాత్పర్యము

అవిగోఁ బసులఁ గట్టెడి పలుపులు, పెద్దమూఁపురముగల యాఁబోతు, నాలుగు కోఱల సింహము, ఉత్తమజాతి గుఱ్ఱము, అదిగో సింహాసనము, పులి తోలు అదే మండుచున్న యగ్నిహోత్రము,వారె మంగళవాద్యము వాయించు వారు, సింగారించుకొన్న వేశ్యలు బ్రాహ్మణులు, ఆచార్యులు, ఆవులు, పుణ్య

మృగములు, పక్షులు, పౌరజనులు, వైశ్యులు, క్షత్రియులు, చూచితివా! వీరందఱు కొలువుకూటము నిండియున్నవారు.

తే॥ రామచంద్రుండు పుణ్యతా◆రకను రాజ్య,
మందుఁ గావుత, నీవేగి◆యవనిపాలుఁ
దీవరింపుము, రవియుఁ దో◆తెంచె ననిన,
సత్వరంబుగ నతఁ డేగి◆క్ష్మాపుకొఱకు ౪౩౦

పుణ్యతారను=శుభకరమైన నక్షత్రమున, తీవరింపుము = వేగిరింపుము సత్వరంబుగన్=వేగముగ.

పుణ్యనక్షత్రమందు శ్రీరామునకుఁ బట్టాభిషేకము జరుగవలయును. ముహూర్తము మించరాదు. కావున నీవు పోయి సర్వము సిద్ధముగానున్నదని చెప్పి రాజును జాగులేక వేగిరించి పిలుచుకొని రమ్మని వసిష్ఠుఁడు చెప్పఁగా, సుమంత్రుఁడు శీఘ్రముగ రాజుకొఱకై పోయెను.

ఆ॥ ముతుక రాజవర్యు◆మతికి నెక్కినవాని, నంతిపురికి నైన◆నడ్డులేక
విడువఁ దగు న టంచుఁ◆బుడమిఱేఁ డానతి,
నిడుట మున్నె పోవ◆విడిచె గొల్ల ౪౩౧

ముతుకన్=ముసలివానిని, గొల్ల=ద్వారపాలుఁడు.

తాత్పర్యము

ముసలివాఁడును రాజునకు సమ్మతుఁడును విశ్వాసపాత్రుఁడును నగు సుమంత్రుని నెప్పుడైన నంతఃపురములోనికి విడువవచ్చునని పూర్వమే రాజు సామాన్యముగా నాజ్ఞ యిచ్చియుండుటచే ద్వారపాలుఁ డడ్డము చెప్పక రాజాజ్ఞకై కాచుకొనక లోపలఁ బోవవిడిచెను.

—◆ సుమంత్రుఁడు దశరథుని నిద్ర మేలుకొలుపుట. ◆—

చం॥ వసుమతినాథుఁ డున్నదుర◆వస్థ యెఱుంగనివాఁడు గావున
న్వెసఁ జని యాసుమంత్రుఁ డవ◆నీపతి డాసి, ఘటించి యంజలిన్,
బస గలసూక్తులం బలికెఁ◆బార్థివవర్యునిఁ గూర్చి తాఁ బ్రభా
తసమయయోగ్యపద్ధతిని◆దద్దయు భక్తిపురస్సరంబుగన్. ౪౩౨

వసుమతినాథుఁడు=రాజు, దురవస్థ=కష్టస్థితి, వెసన్=త్వరగా. ప్రభాతసమయ యోగ్యపద్ధతిని=ఉదయకాలమున కుచితమైన మార్గమున;

తాత్పర్యము

సుమంత్రుఁడు రాజుండు కష్టదశ యెఱుఁగఁడు. కావున సుమంత్రుఁడు త్వరగా లోపలికిపోయి రాజును సమీపించి చేతులు జోడించి సారవంతమైన మంచి మాటలను నుదయకాలమునఁ బ్రబోధింప యోగ్యమగు రీతిని భక్తితో రాజునుద్దేశించి యిట్లనెను!

సీ॥ అవధారు దేవ! త♦మోరిరాకను వార్ధి, పొంగెడిరీతి ను♦ప్పొంగు మెలమి
నసురారి యైసబ♦లారి మాతలి మేలు,కొలుపుభంగిని మేలు♦కొలుపువాఁడ
సాంగవిద్యామ్నాయ♦మిజ్జసంభవుని బో,ధించుచందాన బో♦ధించువాఁడ
నవనితలంబు సూ♦ర్యాచంద్రములయట్లు, బోధించువాఁడ నిన్♦భూపవర్య
తే॥ వేగలెమ్ము మహారాజ♦వివిధరుచిర, మంగళాలంకృతుండ వై♦మహితభంగి
స్వర్ణగిరి వీడి వచ్చుభా♦స్కరుని పగిది,
రమ్ము రజేంద్ర లోకంబు♦రంజిలంగ. ౪౩౭

అవధారు=వినుము, ఇది అవధారయ యను సంస్కృత పదముయొక్క తత్సమరూపము, కొందఱు దీనిని తవర్గ చతుర్థవర్ణము కలిపిని వైకృతానింద్య గ్రామ్యమనెదరు. కాని దీనిని సాధింపనంత శ్రమపడవలసిన పనిలేదు. తమోరి=చీఁకటికి శత్రువగు చంద్రుని, తమోరి. (1) సూర్యుఁడు (2) చంద్రుఁడు (3) అగ్ని. బలారి=ఇంద్రుఁడు, మాతలి=ఇంద్రుని సారథి, సాంగ, విద్యా=శిక్ష మొదలగు నంగములతోను ఉపాంగములతోను కూడిన,ఆమ్నాయము=వేదము అబ్జసంభవునిన్=బ్రహ్మను, నామరూపంచ భూతానాంకృత్యానాంచ ప్రపంచనం వేదశబ్దేభ్య ఏ వాదౌ దేవాదీనాంచకారస" యను మను వాక్యము నిచట నను సంధింపఁదగు. సమస్తభూతములకు దేవతలకు నామము రూపము కృత్యము మొదలైనవి బ్రహ్మవేదశబ్దముల వలననే తొలుతనేర్పుకొనెను. సూర్యాచంద్రముల యట్లు=సూర్యచంద్రులవలె, దేవతా ద్వంద్వేచ=పాణిని ౬-౩-౨౬. వాయుశబ్దప్రయోగే ప్రతిషేధః అను పాణిని సూత్రప్రకారము దీర్ఘము, వివిధ=అనేకములగు, రుచిర=మనోహరమైన మంగళాలంకృతుండవు=శుభకరములైన యలంకారములు చేసికొన్నవాఁడవు, స్వర్ణగిరి=మేరుపర్వతము, ప్రకృతము సాక్షాత్సంబంధములేదు, అందు సూర్యుఁడుదయింపఁడు. అయినను గక్ష్య సంబంధము వలన నిట్లు చెప్పఁబడెను.

తాత్పర్యము

దేవా వినుము. పూర్ణచంద్రోదయమున సముద్రము పొంగినట్లు శ్రీరామాభ్యుదయంబున సంతోషముతో నీవు నుప్పొంగుము. రాక్షస విరోధియగు నింద్రుని నతని సారధి హెచ్చరించునట్లు నీకు సారథినైన నేను నిన్ను హెచ్చరించుచున్నాను. అంగములతో నుపాంగములతోఁగూడిన వేదము సృష్టి విషయమై బ్రహ్మదేవుని బోధించునట్లు నీవు జరుపవలసిన రాజకార్యములందునేను బోధించుచున్నాను. మహారాజవేగలెమ్ము, మంగళకార్యము జరుగవలసియున్నది. కావునఁ దగినరీతి నలంకరించుకొని మేరుపర్వతము విడిచి వచ్చు సూర్యునివలె నీవును లోకము సంతోషింపఁ జేయరమ్ము.

కం॥ సోముఁడు సూర్యుండును సు,
త్రాముఁడును మహేశ్వరుండు♦ధననాయకుఁడున్
భూమిప వరుణుం డగ్నియు,సోముదురు జయంబు నీకు♦నొప్పగ నిడుచున్.

సోముఁడు=చంద్రుఁడు, సుత్రాముఁడు=ఇంద్రుఁడు, మహేశ్వరుండు=శివుఁడు, ధననాయకుఁడు=కుబేరుఁడు, ఓముదురు=రక్షింతురు.

తాత్పర్యము

చంద్రుఁడు సూర్యుఁడు ఇంద్రుఁడు ఈశానుఁడు కుబేరుఁడు వరుణుఁడు అగ్ని వీరు నీకు జయ మిచ్చిరక్షింతురుగాక.

చం॥ భగవతి రాత్రి దీఱెను, ప్రభాతము మీఱె, నితః పరోచితం
బగుక్రియలన్ ఘటింప సమ♦యం బరుదెంచెను, లెమ్ము నీ వికం
దగుగతిఁ బౌరజానపద♦నైగమసంవృతుఁడై వసిష్ఠుఁడొ
ప్పుగ నటనున్నవాఁ, డిడుము♦పుత్రునిఁ బట్టము గట్ట నానతిన్. ౪౩౫

భగవతిరాత్రి=శ్రీమతి- ఐశ్వర్యవతి- కీర్తిమతి యగురాత్రి, శ్రీరాముల పట్టాభిషేకము నిశ్చయింపఁ బడిననాఁటి రాత్రి కావున నది యట్లు పొగడఁబడి నది. ఇతః పరోచితము=ఇఁక మీఁద జరుగవలసిన యర్హకృత్యము, పౌర=అయోధ్యాపురజనులు, జానపద=పల్లెటూళ్ళవారు, నైగమ=రాష్ట్రమునందలి నగరములవారు."నైగమస్తూపనిషది దంతేవణిజ నాగరే" నానా-సంవృతుఁడై=చుట్టఁబడినవాఁడై, ఆనతిన్=ఆజ్ఞను.

తాత్పర్యము

శ్రీమంతమైనరాత్రి పోయెను ప్రభాతమయ్యెను. ఇఁక జరగవలసిన కార్యములు దీర్చుసమయము వచ్చెను. నీ విఁకలెమ్ము. అయోధ్యాపురవాసులతోను గూడి వసిష్ఠుఁడు నీరాక వేచి సభామందిరమున నున్నవాఁడు. నీవు వచ్చి పుత్రునకుఁ బట్టముగట్ట నాజ్ఞ యిమ్ము.

కం॥ కాపరి లేనిపశుల్ ధ్వజ, నీపాలుఁడు లేనిసేన♦నెల లేనినిశల్
గోపతి యెడసినకదుపులు, భూపాలక! రాజు లేని♦పురరాష్ట్రంబుల్. ౪౩౬

కాపరి=కాపుచేయువాఁడు, ధ్వజనీపాలుండు=సేనానాయకుఁడు, నెల=చంద్రుఁడు, గోపతి=వృషభము, ఎడసిన=ఎడఁబాసిన, కదుపులు=ఆవులు.

తాత్పర్యము

నేను రాకుండిననేమి, కార్యముచలుప రాదాయందువేమో. రక్షకుఁడులేని పశువులు, దళవాయిలేనిసేన, చంద్రుఁడు లేనిరాత్రులు, మందకుఁ బెద్దయగు వృషభములేనియావులు, రాజులేని నగరము రాష్ట్రము సమానములు, రాజు లేక యేదియు శోభింపదు. కావున నీవేవచ్చి శ్రీరామపట్టాభిషేక కార్యముఁ దీర్పుము.

ఆ॥ అనిన నర్థవంత•మైనయాసామోక్తి, విని విషాదగరిమ•విభుఁడు శోక
శోణలోచనముల•సునిశితమర్మవి, భేదనోక్తిఁ గష్ట•పెట్టె దేల. ౪౩౭

అర్థవంతము=ప్రయోజనముతోఁ గూడినది- ప్రాతఃకాలపు మేలుకొలుపు జయప్రదము కావున జయమను ప్రయోజనముకలది (2) పట్టాభిషేకమను ప్రయోజనముకలది.సామోక్తి=మంచిమాట,విషాదగరిమన్=దుఃఖాతిశయముచే, శోకశోణలోచనములన్=శోకముచేనెఱ్ఱనైన కన్నులు,సునిశిత=మిక్కిలి పదునైన, మర్మవిభేదనోక్తిన్=మర్మములను భేదించుమాటచే.

తాత్పర్యము

ప్రయోజనముతోఁ గూడిన మంచిమాటల నిటు సుమంత్రుఁడు పలుకఁగా శ్రీరామాభిషేకము జరుగఁజాలదు. కావున నవినిష్ప్రయోజనములు క్రూరములై తోఁచుటచే దుఃఖాతిశయమున రాజేడ్చుటచే నెఱ్ఱనైన కన్నులతో నోయీ మర్మముల భేదించువాఁడివాక్యముల నన్నేల కష్టపెట్టెదవు?

కం॥ అన నృపసకరుణవాక్యము,లను విని కని యతనివిహ్వ•లత్వంబును గే
లిని మోడ్చి జరగెఁ గొంచెము,వెనుకకు సూతుండు మదిని•వెఱ నివ్వటిలన్. ౪౩౮

సకరుణ=దుఃఖముతోఁగూడిన, విహ్వలత్వంబును = వెరవెరపోవుటను, నివ్వటిలన్=కలుగఁగా.

తాత్పర్యము

అనఁగా నారాజు పలికిన శోకముతోడి మాటలను విని యతని మనస్సు చెదరియుండు స్థితినిజూచి సమయ మెఱుంగక వచ్చితినిగదా యని భయపడి కేలుమోడ్చి కొంచెము వెనుకకుఁ బోయెను.

—• కైక సుమంత్రునితో శ్రీరాముని దోడితెమ్మని చెప్పుట. •—

ఉ॥ తా నయి చెప్పలేక పతి•దైన్యమునం బడియుంటఁ జూచి యూ
హానిధి కైక పల్కె సచి•వాగ్రణితోఁ బతి రామహర్ష సం
దానితమానసుం డగుచుఁ•దద్దయు నిద్దుర లేమి శ్రాంతుఁ డై
తా నిటు లిప్డు కన్గనికె•దానఁ జుమీ వచియింపఁ డేమియున్. ౪౩౯

దైన్యమునన్=శోకమువలన దీనత్వముచే, ఊహానిధి=సమయోచితమగు నాలోచనలకు గనివంటిది, స్వకార్యసాధన తత్పరగావున నసత్యమాడుటకును జంకదు. సచివాగ్రణితోన్=మంత్రిశ్రేష్ఠునితో, రామహర్షసందానిత మానసుండు=శ్రీరాముని విషయమైన సంతోషముచేఁ గూడిన మనస్సుగలవాఁడు, శ్రాంతుఁడై=అలసినవాఁడై, కన్గనికెన్=కన్నుమూసెను.

తాత్పర్యము

శ్రీరాముని(బిలుచుకొని రమ్మని తానై చెప్పలేక శోకముచే దీనుఁడై పడియుండు దశరథుని(జూచి తన కార్యము సాధించుకొనుటయందు సమయోచితముగ నేదైనఁ జేయనేర్చిన, యూహలకు స్థానమగు, కైక యబద్ధమాడ రోయక మంత్రిశ్రేష్ఠుఁడైన సుమంత్రునితో నిట్లనెను సుమంత్రా రాత్రియంతయు శ్రీరామ పట్టాభిషేక విషయమైన సంతోషముతో నిద్దురలేకయుండి యిప్పుడే రాజు కన్ను మూసెను. కావున నేమియుఁ జెప్పఁజాలకున్నాఁడు.

కం॥ సూతా! వేగమ చని యా,సీతాపతిం దోడితెమ్ము♦చెచ్చెర నిటకున్
గాత శుభము నీ విది యే,
మో తలఁపకు మనిన నతఁడు♦ముద మెద మెదలన్. ౪౦

తాత్పర్యము

సారథీ! నీవు శీఘ్రమునఁ బోయి రాజుగారు రమ్మనుచున్నారని శ్రీరామచంద్రుని నిటకుఁద్వరగాఁ బిలుచుకొనిరమ్ము నీకు మేలగుఁగాక. నేనేమో చెప్పితినని యెంచకుము అనఁగా నతఁడు సంతోషించి తనలో.

కం॥ రామాభిషేకమునకే, యీమానిని తటిమి చెప్పె ♦ నీ గతి నిజ మీ
భూమీశుండు తదర్థమె, యీమెయి నాయాసపడెడు♦హితధర్మమతిన్. ౪౧

తటిమి=నొక్కి- తొందరపటిచి, హితధర్మమతిన్= మేలుధర్మముఁతోఁగూడిన మనస్సుతో.

తాత్పర్యము

శ్రీరామాభిషేకము నిమిత్తముగానే యీమె యిట్లు తొందరపటిచి చెప్పుచున్నది. సత్యము రాజుకూడ నావిషయముననే హితము ధర్మము నెంచుచు నాయాసపడుచున్నాఁడు.

ఉ॥ నిక్కమ రామచంద్రునకు ♦ నేఁ డభిషేక మటంచుఁ బొంగి తా
గ్రక్కనఁ గౌసలేయుఁ గను♦కాంక్షను నంతిపురంబు వీడుచున్
గ్రిక్కిఱిమూఁకలం గడచి♦కేల మహాధనముల్ వహించి లో
నెక్కువమక్కునం జెలఁగు♦హృష్టులఁ బౌరుల రాజులం గనెన్. ౪౨

గ్రక్కన=శీఘ్రముగా, కౌసలేయున్ = శ్రీరాముని, క్రిక్కిఱిమూఁకలు = పోవసందులేకుండఁ గ్రిక్కిఱిసిన గుంపులు- క్రిక్కు+ఇఱియు=క్రిక్కిఱియు- వృత్తియం దంత్యాక్షరలోపము, మహాధనముల్=కానుకలు, కాంక్షను=కోరికను, హృష్టులను=సంతోషించినవారిని.

తాత్పర్యము

శ్రీరామచంద్రునకు నేఁడభిషేకము జరగుట నిజమని పొంగి శ్రీరామచంద్రుని దర్శించుటకై వెంటనే యంతఃపురమువదలి సందులేకుండ మిక్కిలి

యిటిసికొన్నియున్న గుంపులనుదాఁటిపోయి తమహస్తములందు శ్రీరామున
కిచ్చుటకై కానుకలు ధరించి యతిశయించిన ప్రేమచే సంతోషించియున్న
పౌరులను రాజులను జూచెను. ౧౫-వ సర్గము.

సీ॥ వేగుఁబోకనులేచి•వేదపారగులైన, బ్రాహ్మణుల్ సభ దీరి•బాహిరముగఁ
బట్టనస్థులు దళ•వాయులు మంత్రులు, నితరముఖ్యులు నొక్క•యెడను జేరి
ప్రొద్దదో యుదయించె•బుష్యంబు ప్రాప్తించె,
లక్ష్మణాగ్రజుజన్మ•లగ్నమిదియ
యభిషేకమునకయి•యమరించి నట్టియా, వస్తువు లన్నియు•వఱలె నవిగో
తే॥ భద్రజలకుంభములుఁ జారు•భద్రపీఠి, సమ్యగాస్తీర్ణశార్దూల•చర్మలసిత
రథముసింధుజలంబున•భ్రనదియమున,
కలయుతలమునఁగలయుద•కంబుమఱియు. ౪౪౩

వేగుఁబోకన్=ఉదయకాలమున, వేదపారగులు=వేదమును దుదముట్ట నధ్యయనముచేసినవారు, బాహిరమున=బహిరంగప్రదేశమున, దళవాయులు=సేనానాయకులు, ప్రొద్దు=సూర్యుఁడు- ప్రధ్నశబ్దభవము ప్రొద్దు, పుష్యంబు=పుష్యనక్షత్రము, భద్ర=శుభకరము, సమ్యక్=చక్కఁగా, అస్తీర్ణ=పఱవఁబడిన, శార్దూలచర్మ=పులితోలుచేత, లసిత=ప్రకాసించు, రథము=తేరు, అభ్రనది=గంగ ఇది మొదలు పౌరులు రాజు లనుకొనుమాటలు.

తాత్పర్యము.

ఉదయమునలేచి సాంగవేదాధ్యయన సంపన్నులయిన బ్రాహ్మణులు సభదీరి బహిరంగమునఁ బౌరులు సేనానాయకులు-మంత్రులు-ముఖ్యులయిన యితరులు-నొక్కచోటఁజేరి యిట్లు మాటలాడసాగిరి. అదిగో సూర్యుఁ డుదయించుచున్నాఁడు ఇప్పుడు శ్రీరాముని జన్మలగ్నమగు కటకము జరుగుచున్నది. పుష్యము వచ్చుచున్నది. అభిషేకమునకై యమరించిన వస్తువులన్నియు సిద్ధమైయున్నవి. శుభకరములైన నీటికుండలు, మనోహరమైన పీఠము, పులితోలు చక్కఁగాఁ బఱచిన తేరు సింధుజలములు గంగాయమునాసంగమందలి జలము, ఇవిగాక.

సీ॥ ప్రాగ్వాహములయుఁ ది•ర్యగ్వాహముల యును
నూర్ధ్వవాహములయు•నుదకములును
బద్మోత్పలసమేత•వాఃపూర్ణ సహలాజ
పల్లవచ్ఛన్నసు•వర్ణ ఘటలు
సచ్ఛుభాచారలు•సర్వాభరణభూషి
తాంగలు నైనవా•రాంగనలును
జలజారికరవిక•చప్రఖ్యకాంచన
మణిభూషితంబు చా•మరము పూలు

తే॥ చంద్రమండలసంకాశ•చారుధవళ,మాతపత్రంబు పాండురం•బైనవృషము
తెల్లగుఱ్ఱంబు లెస్స మ•త్తిల్లి యున్న,పట్టపుంగౌరు దర్భలు•పాలు వెలసె. ౪౪

ప్రాగ్వాహములయు=తూర్పుముఖములై ప్రవహించు గోదావరి కృష్ణ కావేరి మొదలయిన నదులయొక్కయు, తిర్యగ్వాహములయు=దక్షిణముఖము గాను ఉత్తరముఖముగాఁబాఱు నదులయు, గండకీశోణ సింధు బ్రహ్మపుత్ర లోనైనవి ఊర్ధ్వవాహములు=(1)పైకిఁ బాఱువానియొక్కయు నైమిశారణ్యము లోని బ్రహ్మావర్తము,రుద్రావర్తము మొదలగు సరస్సులలోని యూటతీర్థములు. ఇవి యొంటిమిట్టయందలి సీతారామలక్ష్మణ తీర్థములవంటివి. (2) పశ్చిమ ముఖమై పాఱువానియొక్కయు, తపతి,నర్మద యిట్టివి. కొన్ని యెడల నీసమాస పదంబులు యువర్ణ వ్యవహితంబులు నగు క్రి. స. ౨౬. సూ. అను సూత్రప్రకా రము సమాస మధ్యంబున యువర్ణకము. ఇది సంఖ్యావాచక పదముల సమా సమునసేగాక సర్వత్ర యన్వయించును. పద్మ......ఘటలు=పద్మ=తామర లతో, ఉత్పల=కలువలతో, సమేత=కూడిన, వాః=జలముచే, పూర్ణ = నిండి నవియు, సహలాజ=బోరుగులతోఁగూడిన, పల్లవ=చిగుళ్ళచే,ఛన్న=కప్పఁబడిన, సువర్ణఘటులు=బంగారు కుండలు, సచ్ఛుభాచారలు=మంచిశుభకరమైన నడవడి కలవారు, సర్వాభరణ=అన్ని భూషణములచే,భూషితాంగలు=అలంకరింపఁబడిన యవయవములుగలవారునైన, వారాంగనలు=వేశ్యలు, జలజారి=కమలములకు విరోధియగు చంద్రునియొక్క, కర=కిరణములతో, ప్రఖ్య=సమానమగు (2) చంద్రకిరణములవలె విచివియగు కాంతిగలది, కాంచనమణిభూషితంబు=బంగారు రత్నములు వీనిచే నలంకరింపఁబడినవి, చంద్రమండల సంకాశ=చంద్రమండ లముతో సమానమై, చారుధవళము=మనోహరమైన తెల్లని కాంతిగలది యగు, ఆతపత్రము=గొడుగు, ఆతప+త్రము- ఎండనుండి రక్షించునది,పాండురంబు =తెల్లని, వృషము=వృషభము, మత్తిల్లి=మదించి, పట్టపుంగౌరు=పట్టపేనుఁగు.

తాత్పర్యము

తూర్పుముఖముగాఁబాఱు గోదావరీ కృష్ణా కావేరీ ముఖ్యనదులయు, నడ్డము గను దక్షిణముఖముగాను ఉత్తరముఖముగాఁ బాఱునదులయు, నదములైన నర్మదా తపతులయు, భూమినిభేదించుకొని పైకివచ్చు తీర్థములయు తామరలు కలువలు వీనితోఁగలిసి నీటిచేనిండినట్టియు లాజలుగలిగి చిగుళ్ళచేఁ గప్పఁబడి నట్టియు బంగారు కడవలును, మేలియాచారమును గలిగి సర్వాలంకారములు ధరించిన వేశ్యలును,చంద్రకిరణములవలెఁ బ్రకాశించునదియై బంగారు మణులచే నలంకరింపఁబడిన దండములు గల చామరములు పూలు చంద్రబింబమువలెఁ దెల్లనైన గొడుగు- తెల్లని యెద్దు- తెల్ల గుఱ్ఱము మదించిన యేనుఁగు దర్భలు పాలు.

కం॥ మంగళవాద్యోత్కరములు, మాంగళ్యాఖిలసువర్ణ • మణిమయభూషా
లింగితకన్యాష్టకము హొ, రంగుగ వందులును ఘృతము•రాణించె నటన్.

మంగళవాద్యోత్కరములు=మంగళవాద్యముల సమూహములు, మాంగళ్య=మంగళకరములైన, అఖిల=సమస్తవిధములైన, సువర్ణమణిమయ = బంగారు రత్నములు వీనితో నిండిన, భూషాలింగిత=ఆభరణములచే నిండిన, కన్యాష్టకము=ఎనమండ్రుకన్యకలు, హొరంగుగన్=అందముగ, వందులు = స్తోత్రపాఠకులు, ఘృతము=నెయ్యి.

తాత్పర్యము

మంగళవాద్య సమూహములును, శుభకరములైన యన్ని విధముల బంగారు రత్నములు వీనితోఁ జేయఁబడిన యాభరణములుగల యెనమండ్రు కన్నెలు-వందులు నెయ్యి యిచట నందముగాఁ దీరియున్నారు.

కం॥ క్ష్మాకాంతు లెల్ల నపు డి క్ష్వాకులయభిషేకవేళ•సముచిత మగు మే
లౌకానిక లాదిగ సీ,తాకాంతునికొఱకుఁ దెచ్చి•తమలో సభలోన్. ౪౪౬

క్ష్మాకాంతులు=రాజులు, ఇక్ష్వాకుల = ఇక్ష్వాకువంశజుల పట్టాభిషేక సమయంబున, సముచితమగు=అర్హమగు- మేలౌ, కానికలు=శ్రేష్ఠమైన బహుమానములు కానిక. రూ. కానుక. కానికె యని ఏదంత రూపము లేదు.

తాత్పర్యము

రాజులందఱు నిక్ష్వాకువంశపురాజుల పట్టాభిషేకసమయమునఁ దామీయ వలసిన నియమముల ప్రకారము చెల్లింపఁ దెచ్చిన శ్రేష్ఠములగు బహుమానములను శ్రీ సీతారాముల కీయఁదెచ్చి సభలోనుంచుకొని

కం॥ పుట్టెను సూర్యుఁడు పతి గ,న్పట్టఁడు రాజున కెపుఁడు•నయముగ దీనిన్
నెట్టన చెప్పఁడు దశరథు, పట్టికి నై యెల్ల సిద్ధ•పడె జా గేలా. ౪౪౭

కన్పట్టఁడు=కానరాఁడు, నెట్టన=పట్టుమని-ఇదికళ.

తాత్పర్యము

సూర్యుఁడా యుదయించెను- రాజా కానరాఁడు- ఈవిషయమును రాజునకుఁ జెప్పెడువాఁడా లేఁడు, శ్రీరామునిమిత్తమై యన్నివస్తువులు సిద్ధపడి యున్నవి. ఈయాలస్య మేటికో.

—• సుమంత్రుఁడు సామంతరాజులతో సంభాషించుట. •—

చం॥ అని తలపోయు చుండఁగ ధ•రాధిపులం గనుచున్ సుమంత్రుఁ డి
ట్లనుఁ బతి రాముఁ బిల్వుమన•నచ్చటి కేగెద, భూమిభర్తకున్,
ఘనులరు మీరు, పూజ్యులరు•క్ష్మాతనయాపతి కంతకంటెఁ, గా
వున సయిరింపుఁ డేను నిదె•పోయి నృపుం గని యుష్మదుక్తిగన్. ౪౪౮

తలపోయుచున్=ఆలోచించుచు, ధరాధిపులన్=రాజులను, సయిరింపుఁడు =ఓర్చుకొనుఁడు, యుష్మదుక్తిగన్=మీమాటగ.

తాత్పర్యము

అని యందఱాలోచించుచుండ నారాజులను జూచి సుమంత్రుఁడు రాజులారా దశరథుఁడు శ్రీరామచంద్రునిఁ బిల్వుమని యాజ్ఞాపింప నచ్చటికిఁ బోవుచున్నాఁడను. దశరథునకు మీరు గొప్పవారు- పూజ్యులరు- శ్రీరామున కంతకంటెఁ బూజ్యులరు- కావునఁ దొందరపడక క్షమింపుడు. ఇది నేనుబోయి దశరథుని మీమాటగా.

కం॥ సేమ మడిగి మేల్కనియున్, రామికి వెలి కేమికతమొ♦ప్రశ్నింతు నటం
చామహిపతి డాయం జనె, సామంతమతానుసరణ♦చరితజ్ఞుండున్. ౪౪౯

సేమము=క్షేమము, వెలికిన్=వెలుపలికి, కతమొ=కారణమొ- సామంత .... చరితజ్ఞుండున్=సామంతరాజుల యభిప్రాయము ననుసరించి చరించు విధము నెఱిఁగినవాఁడు.

తాత్పర్యము.

క్షేమము విచారించి మేల్కనియుండియు నేల రాకయున్నవాఁడో శ్రీరామునకుఁ జెప్పవలసినందుండిన నిచటనే చెప్పరాదా?ఏల యిల్లువిడిచి వెలుపలికిరాకయున్నాఁడో? కారణము విచారించి తెలిసికొని వచ్చెద నని సామంతరాజుల యభిప్రాయప్రకారము నడచుకొనువిధముఁ దెలిసిన యా సుమంత్రుఁడు.

కం॥ తుల గాననిసౌధ మన,ర్గళగతిఁ జొరఁ బాఱి పొగడి♦రాజాన్వయమున్
లలితగతి నృపునిశయ్యా,తలముఁ గదిసి తెఱ యొకండె♦తనకడ్డముగాన్.

తులగానని=సమానములేని, సౌధము=మేడ, అనర్గళగతిన్=అడ్డములేని విధముగా, చొరఁబాఱి=త్వరగాఁబ్రవేశించి, రాజాన్వయము=రాజవంశము.

తాత్పర్యము

అసమానమైన మేడయింటిలోఁ దొందరగాఁ బ్రవేశించి రాజవంశమును ముందుగాఁ బొగడి దశరథుఁడు పండుకొనియుండు ప్రదేశమునకుఁ బోయి యాయనకుఁ దనకు నొకతెఱ యడ్డముమాత్ర ముండఁగా నిలిచి యిట్లనియెను.

చం॥ అనఘము నీదువంశము మ♦హాత్మ! రవీంద్రశశీశవహ్నులున్
ధనదుఁడు పాశియున్ జయ ము♦దంబులు గూర్తురు గాక నీకు, రే
చనియెను మేలుకొమ్ము నృప♦చంద్రమ! కాఁగలయట్టి కార్యముల్
పెనువుగఁ దీర్పుమా, సభను♦వేచిరి విప్రనృపార్యసత్తముల్. ౪౫౧

అనఘము=పాపరహితము, రవి=సూర్యుఁడు, ఇంద్ర=ఇంద్రుఁడు, శశి= చంద్రుఁడు, ఈశ=శివుఁడు, వహ్ని=అగ్ని, ధనదుఁడు=కుబేరుఁడు, పాశి = వరుణుఁడు, జయముదంబులు=జయము సంతోషము, కూర్తురు=కలిగింతురు,

వేచిరి=కాచుకొనియున్నవారు- విప్ర, బ్రాహ్మణులు-నృప = రాజులు, ఆర్య = వైశ్యులు, సత్తముల్=వీరిలో శ్రేష్ఠులైనవారు.

తా త్ప ర్య ము

మహాత్మా! మీ వంశము దోషరహితమైనది. సూర్యుఁడు చంద్రుఁడు శివుఁడు అగ్ని కుబేరుఁడు వరుణుఁడు నీకు జయము సంతోషము గలిగింతురు గాక. రాత్రి వెడలిపోయెను. సూర్యోదయమయ్యెను. మేలుకొమ్ము. నీవు చేయ వలసిన కార్యములు దీర్పుము. సభయందు బ్రాహ్మణోత్తములు క్షత్రియవరులు వైశ్యరత్నములు నీరాకకై కాచియున్నారు.

—♦దశరథుఁడు సుమంత్రునితో శ్రీరామునిఁ బిలుచుకొని రమ్మని చెప్పుట ♦—

మం॥ అని కొండాడు సుమంత్రుగొం తెఱిఁగి గో♦త్రాధీశుఁ డే నిద్దురం
గనఁ జూ, రామునిఁ దోడితెమ్మనినవా♦క్యం బేలపాటింప? విం
కనయేనిం జని తోడితెమ్మిటకు వే♦గం, బన్న నావాక్యముల్
విని మేలంచును నిర్గమించి నగరిన్♦వీక్షించె మార్గంబులన్. ౪౫-౨

కొండాడు=స్తుతించు-శ్రీరాముని దోడితెమ్మని కైకచెప్పినవాక్యము=కైక చెప్పినవాక్యము నేను గాదని యననపుడు నేనుచెప్పినట్టేగదా. అప్రతిషిద్ధ మను మతమ్మను న్యాయము కలదుగదా- కాదని చెప్పకుండిన నవునని యంగీకరించి నట్టేకదా.నీవు నిద్రపోవుచు నిషేధింపలేదో మేలుకొని నిషేధింపలేదో నాకెట్లు తెలి యును.కైక కన్గుని కెనని చెప్పెనుగదాయందువా నేను మేలుకనియేయున్నాను.

తా త్ప ర్య ము

అనిపొగడుచున్నవానిని తెఱయడ్డముండుటచే స్వరమునుబట్టి సుమంత్రుఁ డని యెఱిఁగి నేను నిద్దురపోలేదు. మేల్కనియేయున్నాను. శ్రీరాముని బిలుచు కొని రమ్మని కైకచెప్పెనుగదా.ఆమాటప్రకారము నీవేలచేయలేదు.ఇప్పుడైనను బోయి శీఘ్రముగ శ్రీరాముని బిలుచుకొనిరమ్ము. అని దశరథుఁడనిన విని చిత్తము అని యిల్లు వెడలిపోయి మార్గమందు.

కం॥ ప్రేమంబున గుంపులు గొని, రామకథాలాపబహుళ♦రాగము వెలయున్
భూమీజను లుండఁగఁ గను, చామాటలు వినుచు గాఢ♦హర్షాకులుఁ డై. ౪౫-౩

రామకథాలాప బహుళరాగము=శ్రీరాముని చరిత్రములు చెప్పుటయందు మిగుల ననురాగము, గాఢ=అధికమైన, హర్ష = సంతోషముచే, అకులుఁడై = నిండినవాఁడై.

తా త్ప ర్య ము

ప్రేమపశంబున గుంపులుగుంపులై జనులు రామకథలు చెప్పుకొనుటయందు మిగుల నాసక్తిగలవారలై యుండ వారిమాటలు వినుచు లోకులందఱు శ్రీరామున కనుకూలురేకదా యని సంతోషముచే నిండిన మనస్సుగలవాఁడై.

చం॥ చని రజతాద్రి పేటునకు♦సాటి, సురేంద్రునివీటిపాటి, యా
ధనదుని మేడకున్ జత, బు♦ధప్రకరాలయశృంగతుల్యమై,
గొన బగుతల్పులున్ ముదము♦గూన్చునరుంగులు బైఁడి బొమ్మలున్।
ఘనమణి తోరణంబులును♦గల్గి శరజ్జలదోపమానమై. ౪౫౪

రజతాద్రి = వెండికొండ, సురేంద్రుని వీటిపాటి = ఇంద్రుని యింటితో సమానమైనది, బుధప్రకరాలయ = మేరు పర్వతముయొక్క, శృంగతుల్యమై = శిఖరముతో సమానమై (ఇది యెత్తుసందని గ్రహింపవలెను. రంగునకాదు) 'మేరుస్సు మేరు ర్హేమాద్రి రత్న సానుస్సురాలయ' యని యమరుఁడు. శరజ్జలదోపమానము = శరత్కాల మేఘమువలె, తెల్లనై.

తాత్పర్యము

కైలాస శిఖరమునకు సమానమై, యింద్రుని మేడకీడై, కుబేరుని యింటి కుద్దియై, మేరుపర్వత శిఖరమువలె నెత్తై, అందమయిన తలుపులనీటై, చూడ ముచ్చటగనుండు నరుఁగులు బంగారు బొమ్మలు మణులతోఁ జేయఁబడిన తోరణములు గలిగి శరత్కాల మేఘమువలెఁ దెల్లని కాంతికలదై.

సీ॥ మణివరమాల్యాళి♦మండితం బగుచును, మలయజాగరుధూప♦లలిత మగుచు
నాకీర్ణ విమలము♦క్తావళీరత్నమై, దార్ధరం బన సుగం♦ధయుత మగుచు
సారసమాయూర♦చారుస్వనంబునై, సుకృతవృకావళీ♦సుందర మయి
మేలి కాంతులచేత♦మిఱుమిట్లు గొలుపుచుఁ, దోయజరిపుసూర్యతుల్యమగుచుఁ

తే॥ బలు తెఱంగుల రంగుల♦పక్షు లమర, మేరుగుహ వోలి యంజలి♦కారులొప్పఁ
గానుకలవార లందంద♦కాచి నిలువఁ, బల్లెటూరులవారలు♦బార్లు కట్ట. ౪౫౫

మణివరమాల్యాళీ = మణులచేఁజేయఁబడిన మేలైన సరములచే, మండితంబయి = అలంకరింపఁబడినదై, మలయజ అగరు ధూపలలితమగుచు = శ్రీగంధము అగరు చెక్కలపొడిచేసైన పొగచే మనోహరమై, ఆకీర్ణ విమలము క్తావళీ రత్నమై = చల్లఁబడిన నిర్మలమైన ముత్యముల వరుసలు రత్నములుగలదై, దార్దరంబు = దర్దర సంబంధమైనది (మలయపర్వత సమీపమున దర్దరమను చందనవృక్షములుగల పర్వతము గలదు) సుగంధయుతము = మంచివాసనతోఁ గూడినది, సారసమాయూర చారుస్వనంబునై = బెగ్గురు పక్షులయు నెమిళ్ళగుంపులయు మనోహర ధ్వనులు గలదై, సుకృత = చక్కఁగాఁ జేయఁబడిన, వృకావళీ = తోడేళ్ళ సమూహముచే, అంజలికారులు = చేతులు జోడించుకొని యుండువారు.

తాత్పర్యము

తోరణములుగాఁ గట్టఁబడిన శ్రేష్ఠములైన రత్నముల దండలచే నలంకరింపఁబడినదై, చందనము అగరుచెక్కల పొగలచే ధూపము వేయఁబడి సువాసనలు కొట్టును మంచి ముత్యములు రత్నములు చల్లఁబడినదై, దర్దర పర్వతము

వలెఁ బరిమళించుచు, బెగ్గురు పక్షులయు నెమిళ్ళయు విన నింపైన కంఠస్వర ములుగలదై, చక్కఁగా ద్వారబంధములందు స్తంభములందుఁ జెక్కఁబడిన తోడేళ్ళుగలదై, దగద్ధగమను కాంతులు మిఱుమిట్లు కొలుపుచుఁ జంద్రసూర్యుల కాంతితో సమానమైన కాంతిగలిగి, నానావర్ణముల పక్షులొప్పుచుండ మేరు గుహతో సమానమై, సేవకులు చేతులు జోడించుకొని నిలిచియుండఁ గానుకలు తెచ్చిన వారచ్చట నచ్చట నిలిచి సమయమునకు వేచియుండ,వేడుక చూచుటకు రామదర్శనార్థమై వచ్చిన పల్లెటూళ్ళవారు బారులు గట్టి రెండు ప్రక్కల నిలువఁగా.

చం॥ వెలసి మహాభ్రతుల్య మయి♦వేడుక మీఱి యలంకృతంబు నై
  కలయఁ గిరాతకుబ్జజన ♦ కాండసమావృత మైనరామచం
  ద్రులభవనంబుఁ జూచి యటఁ♦దొప్పలుదోరలు మూఁగి యున్నలో
  కులఁ గని హర్షభాసురము♦ఖుం డయి, యింద్రుగృహంబుఁ బోలుచున్.

మహాభ్రతుల్యము = గొప్పమేఘముతో సమానము, మహాభ్రమనుటచే నిటునటు గదలక నిలిచియుండుట వివక్షితము, కిరాత=అల్పదేహము గలవారు, కుబ్జ=పొట్టివారు, శ్రీరామచంద్రుల = పూజ్యార్థంబున బహువచనము, దొప్పలు దోరలు=విశేషముగ- గుంపులు గుంపులుగ, హర్షభాసురముఖుండయి=సంతోష ముచేఁ బ్రకాశించు ముఖము గలవాఁడై.

తాత్పర్యము

ఒప్పుచు పెద్ద మేఘముతో సమానమై యందమై యలంకరింపఁబడినదై యల్ప శరీరమువారు మఱుగుజ్జులు వీరి సమూహముచే నావరింపఁబడినదైన శ్రీరామచంద్రుల గృహంబుఁ జూచి యచ్చట విశేషముగ గుంపులు గుంపులై మూఁగియున్న జనులను జూచి సంతోషముచే వికాసమునొందిన ముఖముగల వాఁడై యింద్రుని భవనముతో సమానమై.

ఉ॥ జానగు మేడఁ జూచి రఘు♦సత్తముమెచ్చులవారు సత్ప్రియుల్
  మానుగ నుంటఁ గాంచుచు సు♦మంత్రుఁడు నంతిపురంబు డాసి యం
  దానరపాలుసూనుభవి♦కార్థదిదృక్షుశుభప్రసంగము
  ల్వీనుల కింపుగా విని స♦లీల శకుంతనినాదజుష్టమై. ౪౫౭

జానగు=అందమైన రఘుసత్తము మెచ్చులవారు=శ్రీరామునిచే మెప్పుదల పొందినవారు, సత్ప్రియుల్=మంచి ప్రియముగలవారు, భవికార్థ=శుభప్రయో జనము, దిదృక్షు=చూడఁగోరిక గలవారి, శుభప్రసంగముల్ = మంచి ముచ్చ టలు, శకుంత నినాదజుష్టమై=పక్షుల ధ్వనితోఁ గూడినదై.

తాత్పర్యము

అందమైన మేడఁజూచి యందు శ్రీరామునిచే మెప్పుపొందినవారు ప్రియు లుండుట చూచి సుమంత్రుఁ డంతఃపురంబు చేరియం దా శ్రీరాముని శుభ మహోత్సవము చూచు కోరికగలవారి ముచ్చటలు చెవుల సందువుగా విని, పక్షులతోఁ గూడినదై.

ఉ॥ అంజలికారులున్ లసదుపాయనకోటిపరార్థ్యలోకు లా
యంజనశైలసన్నిభమదాంచదుదగ్రశరీరభవ్యశ
త్రుంజయనామకేభ మతితోత్ర మసహ్యపరాక్రమంబు రా
ట్కుంజర మౌపవాహ్యమును గుంజరవాజిరథేద్ధమంత్రులున్. ౪౫౮

అంజలికారులు=చేతులు జోడించుకొని యుండువారు, లసదు...లోకులు=ప్రకాశించు కానుకలు గ్రహించియుండు, కోటి పరార్థ్య సంఖ్యాజనులు, అంజన శైల సన్నిభము=కాటుక కొండతో సమానమైన, మదాంచత్=మదముచేఁ బ్రకాశించుచు, ఉదగ్రశరీర=భయంకరమైన దేహముగలదై, భవ్య=శుభలక్షణములు గలదై, శత్రుంజయ నామకేభము = శత్రుంజయమను పేరుగల యేనుఁగు, అతితోత్రము = అంకుశమును లక్ష్యపెట్టనిది, అసహ్య పరాక్రమంబు=సహింప రాని విక్రమముగలది, రాట్కుంజరము=పట్టపుటేనుఁగు, ఔపవాహ్యమున్ = రాజులెక్కు వాహనమును, కుంజరవాజి రథేద్ధమంత్రులున్ = ఏనుఁగులు-గుఱ్ఱములు, రథములు, మంత్రులు.

తాత్పర్యము

వినయము సూచింపఁ జేతులుజోడించుకొని నిలువఁబడిన వారును, విస్తారముగ శ్రేష్ఠములైన కానుకలు తెచ్చిన జనులును, అంజన పర్వతముతో సమానమై, మదించినదై భయంకరమైన శరీరముగలదై- యంకుశము లక్ష్యపెట్టనిదై సహింపరాని పరాక్రమము గలిగి శత్రుంజయమను పేరుగల పట్టపుటేనుఁగు, ఏనుఁగులు, గుఱ్ఱములు, తేరులు, మంత్రులును,

కం॥ ద్వారమునందు న్నిలువఁగ, వారల వీక్షించి చని యవారి తగతి వి
స్తారమణీగజరాజిత, వారిధి మకరంబు చొచ్చు వడువునఁ జొచ్చెన్. ౪౫౯

విస్తారమణీ గణరాజిత=విస్తారముగా మణుల సమూహముచేఁ బ్రకాశించు, వారిధిన్=సముద్రమును, మకరము వడువునన్=విధముగా, మణీ ఇకారాంతము ఈకారాంతమును గలదు.

తాత్పర్యము

వాకిట నిలిచియుండ వారలఁజూచి యడ్డములేని గమనమున, విస్తారముగ రత్నపురాసులచే నొప్పు సముద్రమును మకరివలె లోపలఁ బ్రవేశించెను.

౧౬-వ సర్గము.

తే॥ నడిమివయసునవారిని♦నవ్యకుండ,లోజ్జ్వలుల నప్రమాదుల♦నుత్తమాను
రక్తులను బ్రాసకార్ముక♦శక్తిధరుల, వెండి కనుఁగొనె వృద్ధుల♦వేత్రధరుల.

నవ్యకుండ లోజ్జ్వలులన్=మనోహరములైన కుండలములచేఁ బ్రకాశించు వారిని, అప్రమాదులన్=హెచ్చరిక కలిగియుండువారిని, ఉత్తమానురక్తులన్=నిర్వ్యంచనమై నిష్కామమైన ప్రేమగలవారిని, ప్రాసకార్ముకశక్తిధరులన్ = ప్రాసము విల్లు శక్తి యనునాయుధములను ధరించినవారిని, వృద్ధులన్=ముసలి వారిని, వేత్రధరులన్ = బెత్తములు పట్టుకొని యుండువారిని- శ్రీరాముఁడు కోదండమును ధరించి లోకములను గాచుచుండ వీరు దండములు ధరించి శ్రీరాముని రక్షించుచుందురనుట. ఈ దండములు ధరించుట తమ దాస్యమును దెలుపుటకే. శ్రీరామునకుఁ దుచ్ఛభట రక్షణ మవశ్యమగునేని లోకములనెల్ల నెట్లు రక్షింపఁగలఁడు.

తాత్పర్యము

నడిప్రాయపువారినిఁ, బ్రకాశించు కుండలముల ధరించినవారిని,హెచ్చరికఁగ గాచియుండు వారిని, నిజమైన ప్రేమగలవారిని, విల్లు ప్రాసము శక్తి యనునాయుధముల ధరించినవారిని,బెత్తములు ధరించిన ముసలివారిని జూచెను

తే॥ పూసి తొడి కట్టి పెట్టి ప్ర♦భూతరీతిఁ, గావిచేలలు ధరియించి♦కాచి యుండ
నిండు హెచ్చరికను సుమం♦త్రుండు పూర్వవృత్తవేది సమీపింప♦నెల్లవారు.

పూర్వ వృత్తవేది=పురాతన చరిత్రము లెఱిఁగినవాఁడు, ప్రభూతరీతిన్=విస్తారముగ.

పూసి తొడి కట్టి పెట్టి యనుచో నాత్మనేపద మనిత్యము కావున 'కొను' ప్రత్యయము లోపింపఁబడియె.పట్టముఁగట్టి యేలుము మమున్'అని భారతము. కావిచేలలు=కావివస్త్రములు, ఇది వైరాగ్య చిహ్నము. ఈ సేవకులు శ్రీరాముని భక్తివైరాగ్యములతో సేవించుచున్నారనియు జీతమునకై కాదనియుఁ దోఁచెడి.

తాత్పర్యము

గంధము పూసికొని చొక్కాలు దొడిగికొని నడికట్లు కట్టి విస్తారముగ నాభరణములు పెట్టుకొని కావివస్త్రములు ధరించి మిక్కిలి హెచ్చరికతోఁ గాచి యుండ వంశాచారము పూర్వ చరిత్రమంతయు నెఱింగిన సుమంత్రుఁడు వారి సమీపమునకు రాఁగానే వారందఱు.

తే॥ సంభ్రమంబున దిగుడు నా♦సనము లోలి, వారినాదృతినిట్లను♦వరసమర్థుఁ
డెఱుఁగఁజెప్పుఁడు వేగ సీ♦తేశునకును,
వాకిటసుమంత్రుఁడిదెయున్న♦వాఁడటంచు. ౪౬౨

అదృతిన్=ఆదరముతో, ఇదె=ఇది కేవలసామీప్యమును దెలుపుచున్నది.

తాత్పర్యము

గౌరవార్హుఁడైన సుమంత్రుఁడు తటాలున రాఁగానే తొట్రుపాటుతోఁ దటాలున వారు వారు కూర్చుండిన యాసనములనుండి దిగఁగా వారిని ప్రేమమున నాదరించి మిక్కిలి సమర్థుఁడగు సుమంత్రుఁడు అయ్యలారా మీరుపోయి యీ వాకిట సుమంత్రుఁడు కాచియున్నాఁడని చెప్పుఁడనెను.

కం॥ అన వార లెఱుఁగఁ జెప్పిరి, జనకసుతాసహితరామ◆చంద్రున కతఁడున్
జనకాంతరంగు సూతునిఁ జనవున రప్పింపఁ దనదు◆చక్కటి కతఁడున్.

జనక సుతాసహిత శ్రీరామచంద్రునకున్ = సీతాదేవితోఁ గూడియుండు శ్రీరామచంద్రునకు, జనకాంతరంగున్=తండ్రియొక్క మనస్సు దెలిసినవానిని, చక్కటికిన్=ఎదుటికి.

తాత్పర్యము

వాకిటి కావలివారు పోయి సీతాదేవితోడనుండిన శ్రీరామచంద్రునకు సుమంత్రుఁడు వచ్చియున్నాఁడని చెప్పిరి. శ్రీరాముఁడును దనతండ్రి హృదయ మెఱిఁగిన వాఁడును సారథియునగు సుమంత్రునిఁ దన యెదుటికి రప్పించెను.

—◆ సుమంత్రుఁడు శ్రీరామునితో దశరథువాక్యంబుఁ జెప్పుట. ◆—

సీ॥ రమణీయకనక ప◆ర్యంక భాగంబున, సవు రైనముత్యాల◆సరులవాని
ఘుమఘుమంఘుమితసూ◆కరరక్తనిభశుచి, గంధానులిప్తుఁడై◆గాత్రాలువానిఁ
గంకణఝుణఝుణ◆త్కారంబు దోఁపఁ జా,మర వీచుజానకి◆మరగువానిఁ
దనపార్శ్వమున నిల్వ◆ధరణిజ చిత్రాస, మేతు మృగాంకుని◆మించువాని
తే॥ భాసురంబైన నైజప్ర◆భావిశేష, పూరమున సర్వసాక్షిని◆బోలువాని
సకలసౌభాగ్యములనుపై◆శ్రవణురామ,
భద్రుఁగనుఁగొనెఁ గూర్చున్నవానినియతి. ౪౬౪

సుమంత్రుఁడు దర్శించిన శ్రీరామచంద్రమూర్తి విధమును గవి వర్ణించుచున్నాఁడు.

రమణీయ=మనోహరమైన, కనక=బంగారు, పర్యంక భాగంబునన్ = పానుపునం దొక ప్రక్కన- భాగంబున ననుటచే శ్రీరాముఁడు కూర్చుండి యున్నాఁడని గ్రహింపనగు- సూకరరక్తనిభ=అడవిపంది నెత్తుటితో సమానమై, శుచి=నిర్మలమైన, గంధ=చందనముచే, అనులిప్తుఁడయి=పూయఁబడినవాని- అలంకారము చెప్పవలసి వచ్చునపుడు స్రక్చందనాదులఁ జెప్పుట యాచారము. కావున మొదటి పాదంబున హారములు రెండవ పాదంబునఁ జందనము వర్ణింపఁ బడియె. భగవంతుఁడు సర్వగంధుఁడని శ్రుతికలదు. అట్టివానికి నాగంధము సువాసన గలిగించుచున్నది. ఈగంధపుఁబూఁత పాలవారిధి లోనఁ బండుకొను వానికిఁ గౌసల్య పాలిచ్చినట్లని యెఱుంగునది. ఆగంధమున కంతటి పరిమళమెట్లు

వచ్చెనన జానకి సాన్నిధ్యమునఁజేసి యని మూఁడవ పాదంబునఁ జెప్పు చున్నాఁడు. సీతకు యోజనగంధ యనిపేరు. అట్టిసీత దేహవాసన ప్రసరించుటచే దానికంత సువాసన గలిగెను.నూకరరక్తముతో సమానమైనదని చెప్పుటచే గంధ మందుఁ గుంకుమ పువ్వు విశేషముగఁ జేర్చియున్నారని యెఱుంగవలయును. గంధమునకు సీతవలన లభించినది వాసన మాత్రమేకాదు.ఆమె యాగంధమును బూయునపుడు ఆమె పాణితలము నందలి రక్తవర్ణ మందుఁ గలిసె ననిభావము. గంధము శుచియగుటకుఁ గారణము సీతాహస్తస్పర్శముచే ననిభావము. కాంతి వర్ణము శుచిత్వమేకాక శైత్యగుణముకూడ నామె కరస్పర్శచేతనే వచ్చెను. అను లిప్తుఁడు=తరువాతఁ బూయఁబడినవాఁడు.అనుటచే సీతముందు దాను గంధము పూసికొని యది మృదువుగాను రమ్యముగా నున్నదా యని సరిచూచి యావల శ్రీరామునకుఁ బూసెనని భావము. దీనిచే శ్రీరామున కలంకారాద్యుపచారముల సీతయే చేయుచుండెనుగాని పరిచారికలచేఁ జేయింపదని భావము. అండా ళాముక్తమాల్యదయేకదా. ఆమె తాను ముందుగ ధరించిన పూలదండలనే రంగనాయకుల కర్పించెను. మరగుట యనుపదము ఎడఁబాటును సహింపని కల యికను తెలుపును.కావునఁ దనకిట్లు గంధముపూసి చామరచేతఁ దీసికొని ప్రక్కన నిలఁబడి వీచుచున్న యప్పటి యామె సౌందర్యమును జూచి ప్రేమాతిశయమునఁ గౌఁగిలించె నని భావము. మరగుశబ్దము మీయర్థమును సూచించుచున్నది.

శ్రీరామచంద్రుని ప్రక్క సీతాదేవి యుండువిధమును దృష్టాంతముచేఁ గవి తెలుపుచున్నాఁడు. చిత్రాసమేతున్ = చైత్రశుద్ధమున పున్నమనాఁడు చిత్రా నక్షత్రముతోఁ గూడియుండు వానిని, మృగాంకునిన్=చంద్రుని, మించువాని= అతిశయించినవాని, ఆకాశమందలి చంద్రుఁడు మృగాంకుఁడు- జింకరూపపు కళంకముగలవాఁడు. ఈ శ్రీరామునందట్టిది లేదు. కావుననే ఆ చంద్రుఁడు చంద్రుఁడే. ఈయన శ్రీరామచంద్రుఁడు. ఈకారణములచే శ్రీరామచంద్రుఁడు చంద్రునిమించి యున్నాఁడని భావము.

నైజప్రభావిశేష పూరమున=స్వభావసిద్ధమైన యతిశయకాంతి ప్రవాహము చేత, సర్వసాక్షిని = సూర్యుని, సూర్యుని తేజస్సు లోకమున నలువైపుల వ్యాపించి యున్నట్లు శ్రీరాముని తేజస్సు వ్యాపించి యున్నదనుట యందే యుపమానము. చంద్రునికంటె శ్రీరామచంద్రుఁ డెక్కుడైనట్లు, నిఘంటువులఁ జెప్పఁబడిన సర్వసాక్షి (సూర్యుని) కంటె వాస్తవ సర్వసాక్షి యెక్కుడనియు, సూర్యునితేజస్సు శ్రుతిప్రకారము సూర్యునకు నైజము కాదనియు, వదియును భగవద్దత్తమేయనియు, స్వభావతేజము గలవాఁడు భగవంతుఁ డొక్కఁడే యనియు, ఆ భగవంతుఁడు శ్రీరాముఁడే, యని తెల్ప నైజప్రభాయని చెప్పఁ

బడెను. భాసురంబైన నైజప్రభా విశేష పూరమని చెప్పుటచే నిట్టికాంతి మఱి యెవ్వరికి లేదని గ్రహింపనగు. సర్వసాక్షి శబ్దమునకు భగవంతుఁడనియు నర్థము.

ఇచట భాసురంబైన యనుదానిని విభక్తిమార్చి భాసురుండైనయని గ్రహించి దివి సూర్య సహస్రస్యయని భగవద్గీతయందుఁ జెప్పినట్లు లనేక సూర్యులకాంతి కలవాఁడని చెప్పినను జెప్పవచ్చును.

1. సకల సౌభాగ్యములన్=సకలైశ్వర్యములందును, వైశ్రవణున్=కుబేరుని-కుబేరునివలె సకలైశ్వర్యములు కలవానిని- కుబేరుఁడు ధనదుఁడు కావునఁ దన యైశ్వర్యము నంతయు దానమందు వినియోగించునని భావము,

సకల సౌభాగ్యములన్ = సమస్త సౌందర్యములందును, వైశ్రవణున్= కుబేరుని-కామేశ్వరో వైశ్రవణోదదాతు. అను శ్రుతియందుఁ గుబేరుఁడు దాతగాఁ జెప్పఁబడెను. అట్టి వైశ్రవణు ననుటచేఁ భక్తులకందఱకుఁ దన సౌందర్యానుభవానందము (సాయుజ్యముక్తి) నిచ్చువాఁడని భావము.

రమణీయ....భాగంబునన్=ఆయన యంతటి యైశ్వర్యమునకుఁ దగినట్లు హృదయాకర్షణముగఁ జేయఁబడిన- చిత్రవిచిత్ర ప్రతిమలు మొదలగువానిచే నలంకరింపఁబడి మనోహరమయి యున్న, కనక=మీఁదఁ గూర్చుండిన శ్రీరామునకుఁ దగినట్లు బంగారుతోఁ జేయఁబడిన- ఆమంచముపై నాయన గూర్చుండినపుడు మేరుశిఖరమున వర్షాకాలమేఘమువలె మనోరంజకముగ నుండెనని భావము. వర్షాకాలమేఘము కృషీవలులకు దర్శనీయమైనట్లు శ్రీరాముఁడు భక్తులకు దర్శనీయుఁడై యిష్టఫలదాతయై యుండెనని భావము. పచ్చని బంగారు మంచమున నీలవర్ణుఁడైన శ్రీరాముఁడు బంగారునందుఁ బొదుగఁబడిన నీలమణివలె శోభించెననియు భావము. పర్యంక భాగంబునన్=కుసుమసుకుమారమగు శ్రీరామునకుఁ దగినట్లు మిక్కిలి మృదువుగనున్న పఱుపుమీఁద:— ఈ పర్యంక మింత విశేషముకలది గనుకనే శ్రీరాముఁడడవికిఁ బోవునపుడు సకల పదార్థములు దానముచేసినను దీనిని సుయజ్ఞుఁడను పురోహితు నొద్దనుంచెను. (ప. ౮౯౬) నియతిన్ గూర్చున్నవానిని విశాలాక్షిని బత్నినిగూడి సమర్చసలిపెన్ అని ముందు చెప్పినట్లు రంగనాథమూర్తి ధ్యానముతోఁ గూర్చుండిన వానిని, రాత్రిపూనిన వ్రతమింకను ముగియలేదు గదా. ఈమూర్తి యిక్ష్వాకునకు వాసుదేవ ద్వాదశాక్షరమంత్రానుష్ఠానముచే లభించిన విధము, ఇది యాయన వంశమువారిచేఁ బూజింపఁబడుటయు దీనిని శ్రీరామచంద్రమూర్తి విభీషణున కిచ్చుటయు నృసింహపురాణమునఁ జెప్పఁబడియున్నది. ఇది యుద్ధకాండము ౪౯౮౪ పద్యవ్యాఖ్యానంబున వివరింపఁబడును.

తాత్పర్యము

మనోహరమైన బంగారు మంచముమీఁద నందమైన ముత్యాల సరములులోనగు నాభరణములు ధరించిన వానిని ఘుమఘుమ యని పరిమళించుచుఁ బంది

నెత్తుటివలె మిగుల నెఱ్ఱనై శుచియైన గంధపుఁ బూఁతచేఁ బ్రకాశించువానిని,దన చేతి కంకణములు ఝుణంఝుణ యనుచు నుండఁగాఁ జామరము దనకేలఁ గొని వీచుచున్న జానకిని మరగినవానిని,దనప్రక్క సీత నిలఁబడియుండఁ జైత్రశుద్ధ పూర్ణిమయందుఁ జిత్రానక్షత్రముతోఁ గూడిన చంద్రుని బోలిన వానిని,సహజమైన దేహకాంతి ప్రవాహమువలె నలుదిక్కుల వ్యాపించుచుండ సూర్యుని బోలినవానిని సమస్తైశ్వర్యములఁ గుబేరుఁడగు వానిని నియతిగాఁ గూర్చుండిన వానిని శ్రీ రామచంద్రుని సుమంత్రుఁడు చూచెను.

ఈ పద్యమందలి శ్రీరాముVర్ణనము పర్యంక విద్యయందలి భగవత్స్వరూప వర్ణనమును బోలియున్నది. అది సూచించుటకే యాదియందుఁ బర్యంక శబ్దము ప్రయోగింపఁబడెను. ఈపద్యము ప్రతిదినము మనుష్యుఁడు ధ్యానింప వలసిన భగవదాకారమును సూచించుచున్నది.

కనుఁగొనెన్=కన్నులచే గ్రహించెను-అనుటచేఁ గన్నులచేతనే యాయన యాకారమంతయు మ్రింగెనా యన్నట్టు లాయెనని భావము. ఉత్కర్షమునకుఁ బరమావధి శ్రీరాముఁడు. అపకర్షమునకుఁ బరమావధి ముఖప్రీతిమాటలు చెప్పి పొట్టపోసికొను సూతుఁడు. అట్టివాని సాక్షాద్దర్శన మిట్టివాని కట్టిదశయందుఁగలుగుట యెంతభాగ్యము. శ్రీరాముని సౌశీల్య మెట్టిది. సుమంత్రుఁడు తన కంతటి ప్రియ మంత్రి యయ్యు నతని నంతఃపురమున దన యెదుటికి దశరథుఁడు రానిచ్చినవాఁడుకాఁడు. తన భార్యతోడ దానుండ నితరులు చూడరాదని యాయన యభిప్రాయము. సీతారాములు సర్వజనసులభులు.చూడఁగోరినవాని కెంతటి నీచునకైన దర్శనమిత్తురు, ఇచ్చటఁ బుత్రవాత్సల్యము, అచ్చటఁ బర పురుషశంక.

చం॥ వరదుని రాము వంది గని ♦ వందనముల్ ఘటియించి తద్గుణో
త్కరముల సన్నుతించి నయ♦తత్పరుఁడై కరముల్ మొగిడ్చి మీ
కరుసమె కా విహారశయ ♦ నాసనలీలల నెల్ల నంచుఁ దా
నరసి సుఖంబు, వెండి వసు ♦ ధాత్మభవాపతితోడ నిట్లనున్. ౪౬౫

వరదుని=కోరిన వరము లనుగ్రహించు వానిని, వంది=పొగడువాఁడు-సుమంత్రుఁడు, తద్గుణోత్కరములన్ = ఆయన సుగుణగణములను, సన్నుతించి = స్తుతిచేసి, నయతత్పరుఁడై = వినయముగలవాఁడై, వందనముల్ = అనుటచే భగవంతుని విషయమున ఒంటినమస్కారము నిషిద్ధము. విహార శయనాసనంబులన్ = సంచారమందును, పండుకొనుట యందును, కూర్చుండుటయందును, ఈ వినోదకార్యములందు, అరుసమెకా= సంతోషమేకదా- 'మీకు' పూజ్యార్థంబున బహువచనంబు-రాజైన దశరథుని నీకు నీవు అని సంబోధించిన సూతుఁడు (౪౩౩-౪౩౪-౪౩౫ ప-చూడుము.) శ్రీరాముని బహువచనంబున సంబోధించుట భక్త్యతిశయమునని యెఱుంగ వలయు, వసుధాత్మభవాపతితోన్ = శ్రీరామునితో- పైపద్యము ధ్యానింప

వలసిన మూర్తివిధమును దెలుపును, ఈ పద్యము భగవత్సన్నిధానమునకుఁ బోయినపు డదయమునఁ జేయవలసిన కార్యములు దెలుపును. స్వామిదర్శనమునకై పోయి వందియయి అనఁగా సుప్రభాతములు చదివి సాష్టాంగనమస్కారములు రెండైనను గావించి తరువాత స్తోత్రపాఠములు చదివి దేహము వంచి వినయముతో నమస్కరించి మచ్చికచే జయజయధ్వనుల మంగళాశాసనము గావింపవలెను. దీనినే ప్రాత రభిగమనమందును.కని యనుటచేఁగన్నులు గల ఫలము, వందనముల్ ఘటించి యనుటచేఁ జేతులు శిరస్సు దేహముఁగల ఫలము, సన్నుతించి యనుటచే వాక్కుగల ఫలము చెప్పఁబడెను. కమలాక్షు నర్చించు కరములు కరము లని కలదుగదా.

తాత్పర్యము

ఏకోరికలు కోరినను ననుగ్రహించు శ్రీరాముని దర్శించి సుమంత్రుఁడు సాష్టాంగనమస్కారములు చేసి యాయనగుణముల వర్ణించి వినయపరుఁడై చేతులు మోడిచి వ్యాయామములందును శయనములందును ఆసనములందును క్రీడలయందును మీకు సంతోషమేకదా యని కుశలప్రశ్నము గావించి యావల నాయనతో నిట్లనియె.

కం॥ కౌసల్యాతనయా! రా, మా! సరగున మిమ్ముఁ గనఁగ•మహిపతి కోర్కిం
జేసెను గైకేయీదే,వీసహితుం డగుచు నటకు•విచ్చేయుఁ డనన్. ౪౬౬

రామా యని యేక వచనసంబోధనము చిన్నప్పుడెత్తుకొని తిరుగుచు నేక వచనమున సంబోధించుచుండిన చనవుచేనని యెఱుఁగనగు. రామచంద్రా రామభద్రా యని తన్ను బిలుచుటకంటెఁ బ్రేమగలవారు చనవున రామా యనుటయే తనకు; బ్రీతికరమని శ్రీరాముఁడు చెప్పినట్లు భవభూతి చెప్పెను. సరగునన్=శీఘ్రముగ, విచ్చేయుఁడు=రండు.

తాత్పర్యము

కౌసల్యానందనా! రామచంద్రా! రాజు కైకేయీదేవితోడనుండి మిమ్ముఁ ద్వరగాఁ జూడఁగోరిక గలవాఁడై యున్నాఁడు అచ్చటికిరండు.

—• శ్రీరాముఁడు సీతాదేవికి రాజాజ్ఞ నెఱింగించుట. •—

ఉ॥ అనుడి హృష్టచిత్తుఁ డయి•యానరసింహుఁడు నాని సత్క్రియా
మానితుఁ జేసి, సీతఁ గని•మానిని! దేవర దేవి మత్ప్రియం
బై నప్రభుత్వదానవిష•యంబు విచారము సేయుచున్నవా,
రానుతశీల న న్గుఱిచి•యాత్మధవుం గడుఁ దీవరించెడిన్. ౪౬౭

అనుడి=ఆమాట, హృష్టచిత్తుఁడై=(1) తండ్రి తల్లితోడనుండి పిలుచుచున్నాఁడని సంతోషించుచున్నవాఁడై.(2) అవతారప్రయోజనము సార్థకమగు కాలము సమీపించెఁగదాయని సంతోషించినవాఁడై.సత్క్రియామానితున్=సత్కా

రముచే గౌరవింపఁబడిన వానిని, దేవర=రాజు, దేవి=రాణి, మత్ప్రియంబైన= నాకుఁ బ్రియమైన, ప్రభుత్వ దాన విషయంబు (1) యౌవరాజ్యమిచ్చు విషయము (2) నా ప్రభుత్వమును ఖండించి విఘ్నము చేయువిషయము.'దానం గజమదే త్యాగే శుద్ధి ఖండన యోరపి, యని నానా. విచారము=ఆలోచన.

తాత్పర్యము

(౧) ఆమాటలాడఁగానే తల్లిదండ్రులిరువురు నొకచోనుండి పిలుచు చున్నారిది యపూర్వదర్శన మని సంతోషించినవాఁడై శ్రీరాముఁడు వానిని సత్కారములచేఁ బూజించి సీతతో నిట్లనియె. దేవీ! రాజుగారురాణిగా రిరువురు నాకు మేలైనదగు యౌవరాజ్యము నాకు నిచ్చువిషయమై యాలోచించుచున్న వారు. అందుఁ బొగడఁబడిన నడవడిగల యాకైక నావిషయమై త్వరగాఁబట్టాభిషేకము చేయుమని తొందరపెట్టుచున్నది.

(౨) ఆమాట వినఁగానే తన యవతారము సార్థకమగు కాలము సమీపించెఁగదా యని సంతోషించినవాఁడై యాపురుషోత్తముఁడు వానిని సత్కారముల గౌరవించి సీతతో మనమవతరించినది పట్టాభిషేకము చేసికొని యింట సుఖమనుభవించుటకుఁగాదు. శిష్టరక్షణార్థము దుష్టశిక్షార్థము ధర్మము సంస్థాపనమునకుఁ గావున మన మాపనికై పోవులసియున్నది. పై రెంటిలో రెండవదే నాకుఁ బ్రియమైనది. కావున యౌవరాజ్య పట్టాభిషేక కార్యము భంగముచేయు విషయమును రాజురాణి యిరువు రాలోచించుచున్నవారు. అందురాణి నన్ను గుఱించి యడవులకుఁ ద్వరగాఁ బంపుమని తనభర్తను దీవరించుచున్నది.

సీ॥ వెరవరి గాన దే•వియు రాజుయోజన,యెఱిఁగి నాకు శుభంబు•నెసఁగఁజేయఁ
గోరు చుండుటఁజేసి•గొబ్బున నాయర్థ వృద్ధికై తొందర•పెట్టుఁ బతిని
వరహితకామాను•వర్తిని గేకయ క్ష్మాపాలుసుత యర్థ•కామ నాదు
జనని యదృష్టమా•మనుజేశుఁ డాప్రియు, రాలు నాయర్థకా•మాభివృద్ధిఁ

తే॥ జేతమునఁ గోరెడి సుమంత్రు•దూతగాఁగ,
బంపిరిచ్చోటికిదిగదా•పాడి దలఁప
నెట్టిదో సభ దూతయు•నట్టివాఁడ,చెలియ యువరాజు నన్నిడ•చేయుఁ జేఁడు

వెరవరి=ఉపాయము తెలిసినది, యోజన=ఆలోచన, సంస్కృతమున యోజన యను శబ్దములేదు. అర్థ వృద్ధికై= (1) ఐశ్వర్యాభివృద్ధికై (2) నా యవతార ప్రయోజనము సొంతమగుటకై, అర్థమునఁగాఁ బ్రయోజనమనుటకు, అర్థ ప్రకారే విషయే వ్యవహారే ప్రయోజనే॥ నానా-ర-) వరహిత కామాను హితమైన కోరికవర్తిని=(1) శ్రేష్ఠమై తనకు హితమైన ప్రకారము వర్తించునది. (2) నాకుహితమైన ప్రకారము వర్తించునది. అర్థకామ=(1) ధనాశగలది.(2)

నాప్రయోజనము నెఱవేర్పఁ గోరిక గలది. నాయర్థ కామాభివృద్ధి= (1) నా యర్థము కామముయొక్క యభివృద్ధి, (2) నాప్రయోజనమైన యభివృద్ధి, చేతమునన్=మనస్సునందు. రూ. చేతస్సు, పాడి=న్యాయము, చెలియయువ రాజు=చెలియా! యువరాజు(2)చెలి!య యువరాజు=యువరాజుగాకుండునట్లు.

తాత్పర్యము

(౧) ఉపాయశాలిని గనుకఁగైక రాజు తనకుఁ జెప్పకముందే నాపట్టాభిషేక విషయమైన యాలోచన దెలిసికొని నాకు మేలు గలుగఁ జేయుకోరిక గలది కావున నా కైశ్వర్యము వృద్ధియగుటకై పట్టాభిషేకము చేయుమని భర్తను దీవరించుచున్నది. భర్తకు హితమైన కోరిక ప్రకారము వర్తించునది కావున నాతల్లి కైక నాయర్థమందుఁ గోరిక కలది. నా యదృష్టమేమో నాహితార్థముగోరు సుమంత్రుఁడావేళ కచ్చుటికిఁ బోవుటచే నతని వారు పంపిరి. ఇది న్యాయ్యమేకదా.

నాతల్లిదండ్రులిరువురు నావిషయమున నెట్టి మంచి యభిప్రాయము గల వారో దూతయు నట్టివాఁడే లభించెను. ఈ సభయందలి తీరుమానమేమనఁ జెలియా నన్ను రాజిప్పుడే యువరాజు చేయును.

(౨) రాజు నన్ను యువరాజు చేయ నున్నాఁడని యాయన యభిప్రాయము నుపాయశాలిని గావున నాయన చెప్పకముందే కైక తెలిసికొని యాయన కోరిక నెఱవేటిన నాకు లోకమునఁ గీర్తి ప్రతిష్టలు లేవని తలంచి నా మేలు గోరుచుండునదిగావున నాయవతార ప్రయోజనము వృద్ధిచేయుటకై శ్రీరామునకుఁ బట్టాభిషేకము చేయవలదని భర్తను దొందరపెట్టుచున్నది. కైక నాకు మిక్కిలి హితమైన కోరికప్రకారము వర్తించునది. నా ప్రయోజనము నెఱవేఱుకోరిక గలది. ఆరాజు ఆయన ప్రియురాలు నిరువురు తనమనస్సున నాయర్థమును గామమును వృద్ధిచేయఁ గోరెడి సుమంత్రుని దూతగాఁ బంపిరి. ఆ దంపతులు నాయర్థకామాభివృద్ధిగోరునట్లె సుమంత్రుఁడును గోరువాఁడు. కావునఁ దగిన దూతయె. వారి యాలోచన పర్యవసాన మేమన చెలీ! నన్నిప్పుడు రాజు యువరాజుగాఁజేయఁడు.

కం॥ ఇదె పోయి రాజుఁ గనుఁగొని, సుదతీ! చనుదెంచువాఁడ♦సుఖముగ నీవున్
ముదితలతో నందనుకను, మదిరేక్షణ! వేడ్కనుండు♦మా యనియనుడున్

ఇదె=ఇప్పుడే, మదిరేక్షణ=సంతోషముచే మత్తత గలిగించుచూపు గలదానా! నాయైశ్వర్యము నీకన్నులయం దున్నదని భావము. తత్+ఇరా+ఈక్షణయని పదవిభాగము చేయనగు. సుదతి=శోభనములగు దంతములుగలది. దంతశబ్దమునకు దతాదేశము.

తా త్ప ర్య ము

ఇదిగో(బోయి రాజును జూచివచ్చెదను. నేను వచ్చునందనుక నీవు నీచెలి కత్తెలతో సుఖముగ నుండుము.(నేను మరలివచ్చినది మొదలు నీకు దుఃఖమే అంతవఱకే నీకు సంతోషము.)

సీ॥ ప్రాణేశసమ్మాని•తాసితేక్షణ సీత, వాకిటివఱకును•వచ్చి హృదయ
కాంతుని దివ్యమం•గళవిగ్రహుని(జూచి,యాశాసనముల ని•ట్లనియెనిన్ను
బ్రాహ్మణ జుష్టంబు•రాజ్యంబు రాజసూ,యాభిషేచనమున•నవనివిభుఁడు
బ్రహ్మపులోమజా•పతికిఁ జేయువిధాన, నభిషిక్తుఁజేయుత•హర్షమునను
తే॥ దీక్షితుని వ్రతసంపన్ను•దివ్యతేజు, నజినధరు శుచి నిన్ను నే•హరిణశృంగ
హస్తుఁ గని నిన్నుభజియింప•నాశ్రయింతు,
సర్వశుభములు నీకు నె•సంగుఁగాత. ౪౭౦

సీతాదేవి శ్రీరాముని సౌందర్యాలంకారాదులఁ జూచి యింత సొంప యిన యీ సౌందర్యాలంకారాదులుగల యాయనకుఁ దృష్టి దోషమునఁ గీడు మూఁడునో యని భయపడి యతనికి మంగళ ప్రదముగ దీవించుచుఁ గొంత దూరము వెంబడించుచున్నది.

ప్రాణేశ=భర్తచే, సమ్మానిత=గౌరవింపఁబడిన,అసితేక్షణ=కాటుకకన్నులు గల సీత, దివ్యమంగళ విగ్రహుని=దేవసంబంధమైన శుభాకారము గలవానిని, ఆశాసములన్=ఆశీర్వాదములను, బ్రాహ్మణజుష్టంబు = బ్రాహ్మణసేవ్యము. అజినధరున్=చర్మమును ధరించినవానిని, హరిణశృంగహస్తుక్=జింకకొమ్ముచేతి యందుఁ గలవానిని, ప్రాణేశసమ్మానిత=తనప్రాణములకు నీశుఁడు=ప్రాణే శుఁడు, అట్టి యీశుఁడు తన్ను విడిచి పోయెనేని వియోగతాపము సైరింపలేక వెంటనే ప్రాణములాయన వెంటనేపోవును. సీతకుఁ దనయందుఁగల పరమ భక్తి తెలిసిన శ్రీరాముఁడు అట్టి విపత్తు గలుగకుండుటకై సమ్మానితనుజేసెను= అనఁగాఁదన మెడలోనున్న కంఠహారమును ఆమె మెడలో వేసెను. ఇది గాఢా లింగన సూచనము. దానివలన నామె ప్రాణములు నిబ్బరించుకొనియుండఁ గలిగెను.

అరణ్యమున సీతావియోగ కాలమున శ్రీరాముఁడు రోదనముఁచేయు విధముఁగాంచి యేమిటి కన్నా యింతగా విలపించెదవు. నీవంటివాఁడింత కామమునకుఁ బాలుపడవచ్చునాయని యడుగ లక్ష్మణా నాకామమునకు నేను దుఃఖింపలేదు. అయోధ్యాపురమున నున్నప్పుడు సంభోగకాలమునఁ గౌఁగి లించునపుడు సీత తన దేహమునకు నాదేహమునకు నడుమఁ దనముత్యాల సరముండుటయుఁగూడ సహింపక సర్వాభరణములు దీసివైచుచుండెను. అంతటి విశ్లేష భీరువు సీత, అంతటి పరమ ప్రేమగలది నన్నెడఁబాసి మర ణించెనేమో యని యేడ్చుచున్నానని చెప్పినట్లొక కవి వర్ణించెను.

"యా మీతి ప్రియపృష్టాయాః, కామిన్యాః కంఠదఘ్నయోః, వచోజీవిత యోరాసీ, త్పురో నిస్సరణేరణః॥ భవభూతి॥ ప్రియుఁడొక ప్రియురాలితోఁ బోయెదను అనెనఁట. ఆమాటవినఁగానే వాక్కు ప్రాణములు నేను ముందు పోయెదననిన నేను ముందు పోయెదనని కలహమాడెనఁట. పోవలదనిన నవ శకునము. పొమ్మని యందమా యనినఁ బ్రాణములు ముందే పోవఁ బ్రయాణ మైనవి.

తన వియోగము సహింపలేని యీమెను నూరడింప నామెపాదములు పట్టుకొని వేఁడుకొని యూరడించెనని భట్టారకుల యభిప్రాయము.

అసితేక్షణ=అసిత+ఈక్షణ=నల్లని కన్నులు గలది. కాటుక పెట్టుకొనకు న్నను కాటుక పెట్టుకొన్నట్లెయుండు కన్నులుగలది.

(౧) నల్లని కలువ పూవులవలె నల్లని కనుచూపులు గలది.

(౨) కాటుకపిట్టలవంటి కన్నులుగలది. మొదటిది సహజసౌభాగ్య లక్షణము.

(౨) తనకుఁ దనప్రాణేశుఁడాయన హృదయమందలి హారమును నిర్మ లమై యుండుదానిని బహుమానము చేయఁగా నాకలువకంటి సీత రాముని బ్రేమదృష్టులచేఁ జూచెను. ఆ చూపులమాలికచే నల్లకలువదండ శ్రీరామునకుఁ సీత సమర్పించెను. బంగారుకాంతిగలసీత దేహమునఁ దెల్లని ముత్యాలసరము కాంతులుపడఁగా క్షీర నీరన్యాయమునఁగలయక తిలతండుల న్యాయమున (నూవులు బియ్యము కలిపినట్లు) నుండెను. అది మెచ్చక సీత నల్లకలువదండ సమర్పింపఁగా శ్రీరాముని దేహకాంతిలోఁ గలువలకాంతి కలిసిపోయెను.ఆరూప మునఁ దన ప్రేమయెట్టిదైనది సీత దెలిపెను.

శ్రీరాముఁడీమెను నింతగా సమ్మానింపఁ బ్రేమయొక్కటే కారణమా యింకను నేమైనఁ గారణములు గలవాయనినఁ జెప్పుచున్నాఁడు.

సీత, రామునివలెఁ దల్లిగర్భమునుండిరాక నాఁగటి చాలులోఁ బుట్టినది కావున సీత యయోనిజ, కావున నభిజాత్యమున శ్రీరామునికంటె సీతయేశ్రేష్ఠు రాలు. అయోనిజ తన భార్యయైనను యోనిజునకుఁ బూజ్యురాలేకదా యని భావము.

సీత యనునది గంగానదికిఁ బేరు. గంగానది యొకసారి చూచినవారిని స్పృశించినవారినిఁ బావనులఁ జేయునది. అట్టిదే సీతాదేవియును.ఇట్టియీమెతో నిత్యసంయోగముగలవాని మహిమ యేమని చెప్పసాధ్యము. అప్రమేయంహి తత్తేజోయస్య సా జనకాత్మజా" అసీత యెవనిదో యతని తేజ మప్రమేయ మని ముందు మారీచుఁడు చెప్పఁగలఁడు. కావున సీతమహిమయే రామప్రభావ మున కుద్ధారకము. వాకిటివలఱకునువచ్చె=వాకిటివలఱకు నేలవచ్చెను. అన ఆయన హృదయకాంతుఁడు గనుక. సూర్యుఁడెదుట నుండిన గములము కాంతియుక్తమై యుండును. సూర్యుఁడు మఱుగాయెనా కాంతిహీనమై ముకుళించును. అట్టితే

హృదయకాంతుఁడెదుటనుండ హృదయము సంతోషముచేఁ గాంతియుక్తమై యుండును. అవల వియోగవ్యసనాంధకారమున మునిఁగి కాంతిహీనమగును. కావున మర్యాదననుసరించి స్త్రీలెంతవఱకుఁ బోవచ్చునో యంతవఱకుఁ బోయె నని భావము. దివ్యమంగళ విగ్రహుని=అప్రాకృతమైన మంగళాకారముగల వానిని. ఈ యాకారమే యామెకు సస్థానమున భయము గలిగించినది. ఆ భయమే యనిష్టనివారణమగునట్లు దీవింపఁ జేసినది.

దివ్యమంగళ విగ్రహున్=దేవసంబంధమై యితరులకు శుభప్రదమైన యాకారముగలవానిని, దేవతల దర్శనము మనుష్యులకు వ్యర్థముపోదు. శుభ మునకే కారణమగును. అట్టి విగ్రహమునకుఁ బామరుల దృష్టిదోషముచేఁ గీడు కలిగిన లోకులకే హాని కావున నట్టి) కలుగకుండుటకై యాశీర్వదించుచున్నది.

అనియెన్=తనమనస్సులో ననుకొనెను. ఆత్మనేపద మనిత్యము కావునఁ బరస్మైపద ముపయోగింపఁబడెను, ఇచ్చట నాశీర్వచనమనఁగా మేలుకలుగఁ గోరుట. ఇది పిన్నవారు పెద్దవారికిఁ జేయునపుడు తమ మనస్సులో ననుకొన వలెఁగాని పెద్దవారు పిన్నవారికి దీవించిన ట్లితరులకు వినఁబడునట్లుగాని మంత్ర వంతముగఁగాని కూడదు.(కౌసల్య రాము నాశీర్వదించిన విధముఁ జూడుఁడు) ౭౫౦ వ పద్యము.

బ్రాహ్మణజుష్టంబు=బ్రాహ్మణులచే గౌరవింపఁబడినది. ఈ రాజ్యము బ్రాహ్మణులచే గౌరవింపఁబడినది. ఈరాజ్యమున బ్రాహ్మణులు విశేషముగరక్షిం పఁబడుటచే వారును దీని యభ్యుదయముఁ గోరుచుందురని భావము. రాజ సూయాభిషేచనమునన్=సమస్త శత్రువులను జయించి సార్వభౌములై చేయు రాజసూయ యాగమందలి యవభృథస్నానమువలె, బ్రహ్మ=చతుర్ముఖబ్రహ్మ పులోమజాపతికిన్=ఇంద్రునికి, బ్రహ్మయింద్రునభిషిక్తుఁ జేయునట్లు నిన్నును దశరథుఁడు జేయునుగాక. దీక్షితునిన్=దీక్షవహించి స్త్రీ సంసర్గము వదలి కృష్ణా జినముధరించి యజ్ఞమున కుండవలసిన యలంకారములతో నుండు వానిని, ఇట్లున్న వానిగఁగదా నిన్ను నేను జూడఁగోరుచున్నానని భావము.

వ్రతసంపన్నునిన్=వసిష్ఠుఁ డీ యజ్ఞమున నీ వుపవాసము చేయవలయు నని చెప్పి శ్రీరాముఁడు సుకుమారుఁడు గావున శుష్కోపవాసము చేయఁజాలఁ డేమోయని లఘూపవాసము (పాలు త్రాగియుండుట) విధించెను గాన శ్రీరా ముఁడో నేను శాస్త్రప్రకారము నిత్యుపవాసము చేసెద ననెను ఆ విధముగ ఋషులు చెప్పినదానికంటె శాస్త్రప్రకారము పూర్ణముగ నుపవాసాదివ్రతములు చేయు నిన్ను, సంపన్న శబ్ద మీయర్థము నిచ్చుచున్నది. సంపన్నున్=బాగు గఁగూడినవానిని దివ్యతేజున్=వ్రతాదులవలనఁ గలిగిన గొప్ప తేజస్సు గల వానిని, తపోబలమునఁ గదా ఇంద్ర చంద్ర సూర్యాగ్నుల కటువంటి తేజస్సు గలుగుట, అజినధరున్=వ్రతకాలమందు వస్త్రములు ధరించుటకంటెఁ గృష్ణాజి

నము ధరించుటే శ్రేష్ఠము. శుచిన్=పరమపవిత్రుని, వ్రతదినములందు దీక్షా కాలమునందు భార్యనుదప్ప నితరస్త్రీని దాఁకరాదని వసిష్ఠుఁడు చెప్పఁగా (చూ. ౧౫-౧౫౨ పద్యములు)సీతతో దర్భశయనమునఁ బరుండినను నామెను దాఁకక యసిధారావ్రతచర్య నాచరించెను. అంతటి శుచిమంతుఁడని భావము. హరిణశృంగహస్తునిన్=జింకకొమ్ము చేతఁ బట్టుకొన్నవానిని, యజ్ఞమున యజమానుఁడు తనదేహమును గోళ్ళతో గోకికొనరాదు. జింకకొమ్ముతో గోకుకొనవలెను. ఏకవస్త్రధరోధన్వీయన్నప్పుడుండు కాంతికంటెఁ గృష్ణాజినధారియై జింక కొమ్ము చేపట్టినప్పటికాంతి విశేషమని భావము.

నిన్నుఁగని భజియింపన్=నిన్నుఁ జూచుచు సేవచేయుటకు, ఇందుఁగనుటయే ప్రధానము, ఎవ్వరు భగవంతు సేవచేసినను భగవదనుభవమునకే కదా. అట్టి యనుభవము వలని ప్రీతిపూర్వకసేవ తర్వాత. నిన్ను నాశ్రయింతున్=క్రియాభేదముచేఁ గర్మమునకుఁ బౌనరుక్త్యములేదు, నిన్ను భజియింప నిన్నే యాశ్రయింతునని భావము. నిన్ను గనుటకున్=నిన్ను భజియించుటకు నిన్నే యాశ్రయింతుననుటచే నీయాశ్రయణము లభింపనేను వేఱొక యుపాయము వెదకనని భావము. ఇట్టిది యనన్యత్వము. ఇందు సీతాదేవి గోరిన ఫలము శ్రీరాముని గనుచుండుట, దానిని గలిగించునది సమాశ్రయణము, చేయు కార్యము భజనము. ఇదియేమి? నీవు పట్టాభిషిక్తుఁడవు గమ్ము. నేను పట్టపు రాణినై సకలైశ్వర్యము లనుభవించెదననక నిన్నుఁ జూచుచు నాశ్రయించి భజించెదనని "ఆయురారోగ్య మర్థాంశ్చ, భోగాంశ్చైవాను షంగికాన్ దదాతి ధ్యాయినాం నిత్య, మపవర్గ ప్రదోహరిః॥ మోక్షదాతయగు విష్ణువును మోక్షమిమ్మని కోరిన యెడల నట్టియోగ్యత కలుగువఱకు నాయుస్సు ఆరోగ్యము ధనము భోగము లన్నియు నిచ్చును.

సావిత్రి యమధర్మరాజును నాకు నూర్వురు పుత్రులు గలుగ ననుగ్రహింపుమనెను. ఆకారణముగ యముఁడు సత్యవంతుని బ్రతికించెను. కావునఁ బ్రధానఫలమపేక్షించినయెడల నవాంతరఫలములు తమంతటఁదామే వచ్చును.

ఈ గీతమందు శ్రీరాముఁడు పైపద్యములందుఁ జెప్పిన రహస్యవిషయమునకు రహస్యమైన ప్రత్యుత్తరముగలదు. అవతారప్రయోజనము దీర్పవలసినకాలము వచ్చినదని శ్రీరాముఁ డనఁగా పితృవాక్యపాలనావ్రతసంపన్నుఁడవై వానప్రస్థుఁడవై వనవాసదీక్షవహించునిన్నుఁ గనుచు నీసేవచేయుచుండ నీతోడ నేనును వచ్చెదని సీత ప్రత్యుత్తరమిచ్చెను. దీక్షితుని, వ్రతసంపన్నుని దివ్యతేజుని, కృష్ణాజినధరుని, శుచి, శృంగహస్తుని నను విశేషణములు వానప్రస్థునందు నన్వయించును. హరిణశృంగహస్త నన్నప్పుడు కోదండధరునని భావము. శృంగముచేఁ జేయఁబడునది శార్ఙము = చాపము, శివుని వింటికి నజగవమనిపేరు. అనఁగా మేఁక

కొమ్ముతోను ఎద్దుకొమ్ముతోను జేయఁబడినదని యర్థము. ఈవిధముగ నవతారము సార్థకమగు మార్గమును సీత సూచించెను. ఆమె సహధర్మచారిణిగదా.

తాత్పర్యము

తనభర్తచే గౌరవింపఁబడిన సీత తండ్రిని జూడఁబోవు శ్రీరామునివెంటఁ దలవాకిలి వఱకు వచ్చి యాయన దివ్యమంగళ విగ్రహముఁ జూచి దృష్టిదోషమునఁ గీడుకలుగునేమో యని భయపడి యిట్టు లాశీర్వదించెను. బ్రాహ్మణపూజ్యమైన రాజ్యమందు బ్రహ్మయింద్రు నభిషేకించినట్లు నిన్ను రాజునభిషేకించునుగాక. దీక్షవహించి పూర్ణముగా వ్రతము సాధించు దివ్యతేజుని కృష్ణాజినధరుని శుచిని జింకకొమ్ము ధరించినవానిని గని యాశ్రయించి సేవింపఁగోరుచున్నదానను. సర్వశుభములు నీకు నభివృద్ధిపొందునుగాక.

కం॥ కులిశాయుధుండు తూర్పున, నళినాప్తసుతుండు దక్షిణమున బడమటన్
జలనిధిపతి యుత్తరమునఁ, గలకాలం బైలబిలుఁడు కావుత నిన్నున్.

కులిశాయుధుండు=వజ్రపాణియగు నింద్రుఁడు, నళినాప్తసుతుఁడు=యముఁడు, జలనిధిపతి=వరుణుఁడు, ఐలబిలుఁడు=కుబేరుఁడు, కలకాలము=ఎల్లవేళ.

తాత్పర్యము

తూర్పునందు వజ్రము ధరించిన యింద్రుఁడు. దక్షిణమున మీవంశకర్తయగు సూర్యునికొడుకు దండధరుఁడును, పడమర వరుణుఁడును, ఉత్తరమునఁ గుబేరుఁడును సర్వదా రక్షింతురుగాక.

ఐలబిల మను, శబ్దము లప్రయుక్తదోషమునకు లక్ష్యములుగాఁ బ్రతాపరుద్రీయ మందును దాని ననుసరించిన నరసభూపాలీయమందును గలదుగాని భాష్యమందు నప్రయుక్తదోషమనునది లేదని శాసించియుండుటను అప్రయుక్తత్వదోషస్తు నవిరుద్ధోహరేర్మతేయని దోషయుక్తము గాని పదమునకు నప్రయుక్తదోషములేదని హరిభట్టు నథర్వణాచార్యులు నంగీకరించియుండుటను పూర్వకవిప్రయోగము లుండుటను నివి యీ గ్రంథమునఁ బ్రయోగింపఁబడియె.

ఈ పద్యమునందు సీతాదేవి శ్రీరామచంద్రమూర్తి నాశీర్వదించినట్లు చెప్పఁబడెను చిన్నవాండ్రు పెద్దవారిని నందు భార్యలు భర్తల నాశీర్వదింపవచ్చునా. ఇది ధర్మమా యని సందేహము. ఆశీస్సు అనఁగా హితముఁ గోరుట మేలుకోరి చెప్పెడుమాట ఆశీర్వాదము. మంగళాశాసనము అనఁబడును. గొప్పకార్యము సాధింపఁబోవువారికి సమీపమందు నెవరైన నవశ్యము మంగళాశాసనము కావింపవలెను. పెద్దవారు దగ్గఱలేరేని భార్యయైన నాకార్యము చేయవలెను. భగవంతుని తమ బిడ్డగాభక్తులు భావింతురు. అట్టి బిడ్డకుఁ బామరుల దృష్టి తగులునేమోయని మంగళాశాసనము చేయుదురు. అట్లే సీతయు శ్రీరామచంద్ర

మూర్తి తండ్రిని జూడఁబోవునపుడు చూపఱుదృష్టి తగులకుండుటకునుబోయిన చోటఁ గీడు కలుగకుండుటకును మంగళాశాసనము గావించెను. ఇట్టులే శివునిఁ గూర్చి తపస్సు చేయఁబోవు నర్జునుని ద్రౌపదియుఁ గృష్ణుని జాంబవతియు నాశీర్వదించిరి.

ద్రౌపది.

"తం సింహ మివ గచ్ఛంతం, సింహ స్కంధోరసం తథా
ప్రాంజలిః పాండవం కృష్ణా, దేవానాం కుర్వతీనమః
వాగ్భిః పరమశుక్లాభి, ర్మంగళాభి రభాషత
నమో ధాత్రే చ సంధాత్రే స్వస్తి గచ్ఛ వనాద్వనమ్
ధర్మస్త్వాం జుషతాం పార్థ, భాస్కరశ్చ విభావసుః
బ్రహ్మత్వం బ్రాహ్మణాం శ్చైవ, పాలయంతు ధనంజయ॥
జ్యేష్ఠాయ చాపి జ్యేష్ఠస్య, భ్రాతుర్వచన మాస్థితః
ప్రపద్యేథా వసూన్ రుద్రా, నాదిత్యాన్ సమరుద్గణాన్
విశ్వేదేవాం స్తథా సాధ్యాన్, శాంత్యర్థం భరతర్షభ
స్వస్తి తేంతరిక్షేభ్యో, దివ్యేభ్యో భరతర్షభ
పార్థివేభ్యశ్చ సర్వేభ్యో, యే కేచి త్పరిపంథినః
అని యర్జును దీవించెను.

జాంబవతి కృష్ణుని నిట్లు దీవించెను.

"సా చ మా మబ్రవీ ద్గచ్ఛ, శివాయ విజయాయ చ
బ్రహ్మశిరః కాశ్యపశ్చ, నద్యో దేవా మనోనుగాః
క్షేత్రౌషధ్యో యజ్ఞభాగా, శ్ఛందాంస్యర్షిగణాధరా
సముద్రా దక్షిణా స్తోభా, ఋక్షాణి పితరో గ్రహాః
దేవపత్న్యో దేవకన్యా, దేవమాతర ఏవ చ
మన్వంతరాణి గావశ్చ, చంద్రమా సవితా హరిః
సావిత్రీ బ్రహ్మవిద్యా చ, ఋతవో వత్సరా స్తథా
క్షణా లవా ముహూర్తాశ్చ, నిమేషా యుగపర్యయాః
రక్షంతు సర్వత్రగతం, త్వాం యాదవ సుఖాయచ
అరిష్టం గచ్ఛ పంథాన, మప్రమత్తో భవానఘ॥
ఏవం కృత స్వస్త్యయన, స్తయా హం.......
తతోభ్యనుజ్ఞాయ నరేంద్రపుత్రీమ్॥ అనుశాసనికము.

కావున సీత చేసినది యకార్యము కాదు.

పల్లాండు పల్లాండు పల్లాయిరత్తాండు పల్కోడి నూఱాయిరం॥ అనునది భగవంతునికిఁ జేయు మంగళాశాసనమే కదా.

కం॥ అంగన నిటు కృతకౌతుక,మంగళుఁ డగు నృపసుతుండు♦మరలఁగ నాజ్ఞా
సంగత నొనర్చి సూతుని,సంగతి నిలు వెడలె రామ♦చంద్రుం డెలమిన్.

అంగనన్=సీతను, కృతకౌతుక మంగళుఁడు= (౧) చేయఁబడిన పట్టాభిషేక శుభవిషయమైన దీవనగలవాఁడు. అథకౌతుకమ్ కుతుకేచ్ఛా హస్తసూత్ర మంగళై తిహ్యకర్మసు ప్రఖ్యాత హర్షయో॥ నానా.

కౌతుకమనఁగా శుభకార్యములందుఁ జేతికిఁ గట్టుకొను కంకణమునకుఁ బేరు. రాక్షసవధయను శుభకార్యమునకై కట్టుకొన్న కంకణముగలవాఁడు. మరలఁగన్=ఇంటిలోనికిఁబోవ, ఆజ్ఞాసంగతన్=ఆజ్ఞతోఁగూడిన దానిని, సూతునిసంగతిన్=సుమంత్రునితో, ఎలమిన్=సంతోషముతో.

తాత్పర్యము

పట్టాభిషేక విషయమైన యాశీర్వచనముగలవాఁడై శ్రీరాముఁడు తన తోడ వచ్చిన సీతను నంతఃపురమునకుఁ బొమ్మని చెప్పి సుమంత్రుతోడ నిల్లు వెడలెను.

—♦ శ్రీరాముఁడు దశరథగృహంబునకుఁ బోవుట. ♦—

సీ॥ కందరాంతరవిని♦ర్గతసింహమోయన, నిజమందిరము వీడి♦నీటు మెఱయఁ
ప్రథమకక్ష్యాంతర♦ద్వారభాగంబునఁ, బ్రహ్వాంజలి సుమిత్ర♦పట్టిఁ గూడి
మధ్యమకక్ష్య స♦మ్మతిఁ జేరి యచట మి,త్రార్థుల నందఱ♦నాదరించి
చని యటఁ బావక♦సంకాశ మై వ్యాఘ్ర,చర్మాంచితంబు నై♦జలదరవము

ఆ॥ నుగ్రభానుకాంతి♦యుచిత వైశాల్యంబు, కలభకల్పజవన♦గణము లమర
ధవశతాంగజవము♦నవుతేరు శ్రీరామ,చంద్రుఁడెక్కెఁ దూర్పుఁ♦జంద్రునట్లు ౪౭౩

కందరాంతర వినిర్గత సింహమో=గుహలోనుండి వెలువడిన సింహమో, నిజమందిరము=తనగృహము, వీడి=విడిచి, ప్రథమ కక్ష్యాంతర ద్వారభాగంబునన్=మొదటితొట్టి కట్టులోపలి వాకిట, ప్రహ్వాంజలి = వినయమునదేహము వంచిచేతులు ముకుళించినవాఁడైన, సుమిత్రపట్టిన్=లక్ష్మణుని, మధ్యమకక్ష్యన్ నడిమి తొట్టి కట్టును, మిత్రార్థులన్=స్నేహితులను, కార్యము నిమిత్తమై ధనార్థులై వచ్చినవారిని, పావక సంకాశమై=అగ్నిహోత్రునితో సమానమై, వ్యాఘ్ర చర్మాంచితంబునై =పులితోలుచేఁ బ్రకాశించునదియై, జలదరవము=మేఘధ్వని ఉగ్రభానుకాంతి=తీవ్రకిరణములుగల మధ్యాహ్న సూర్యునియొక్క ప్రకాశము, ఉచిత వైశాల్యంబు=నలుగురైదుగురు కూర్చుండుటకుఁ దగిన వెడల్పుగలది. కలభకల్ప=ఏనుఁగు పిల్లలతో సమానములైన, జవనగణము=శీఘ్ర గమనము గల గుఱ్ఱముల సమూహము, అమరధవ=ఇంద్రుని, శతాంగ = తేరియొక్క, జవము=వేగము గలది.

తాత్పర్యము

గుహలోనుండి బయలు వెడలి వచ్చిన సింహమోయనునట్లు తన మందిరము విడిచి తన కాంతి దిక్కుల వ్యాపించుచుండ మొదటి కక్ష్యలోపలి వాకిట వినయంబున వంగి చేతులు మోడ్చి నిలుచున్న లక్ష్మణుతోఁగూడి నడిమి కక్ష్యఁ జేరియందున్న మిత్రులను నర్థులను నాదరించి యావలఁ దాఁటిపోయి నగ్నిహోత్రముతో సమానమై పులితోలుచే నందమై మేఘధ్వనిగలదై మధ్యాహ్న సూర్యకాంతిగలిగి తగిన వైశాల్యము గలదై ఏనుఁగు పిల్లలవంటి గుఱ్ఱములు కట్టఁ బడినదై యింద్రునితేరివలె గమనవేగముగలదైన రథమును జంద్రుఁడు తూర్పుకొండ యెక్కినట్లెక్కెను.

సీ॥ ఛత్రచామరములు♦జానొప్పఁ గేల్దోయి, మెఱయ వెన్ప్రక్క సౌ♦మిత్రి గావ
సౌరమార్గమునఁబ♦ర్జన్యుని విధమున,వరశతాంగము కడు♦మొరయుచుండఁ
నుదయాద్రి వెలువడు♦నుత్పలాప్తునిఁ బోలి,
తన నికేతమువీడి♦తరలుచుండఁ
గనుఁగొనుజనముల♦కలకలనాదంబు, తుములమై పర్వంగఁ♦దోరముగను

తే॥ జందనాగరురూషిత♦జనము చాప,ఖడ్గధరకోటు లెలమి ముం♦గలనునడువ
వెనుక నూర్లకొలందులు♦వేనవేలు, హయవరంబులు నేనుఁగు♦లంటి రాఁగ

ఛత్రచామరములు=గొడుగులు వింజామరములు, జానొప్పన్=అందగింపఁగా, కేల్దోయి=రెండుచేతులు, సౌరమార్గమునన్=ఆకాశమందు, వరశతాంగము=శ్రేష్ఠమైన రథము పర్జన్యుని విధమునన్=మేఘమువలె, మొరయుచుండన్=ధ్వనించుచుండ, ఉత్పలాప్తునిన్=కలువలకు మిత్రుఁడగు చంద్రుని, నికేతము=ఇల్లు, తుములమై=కోలాహలమై, తోరముగన్=అధికముగ, చందనాగురురూషితజనము=చందనము, అగరు వీని పూఁతగల దేహముగల మనుష్యులు, చాపఖడ్గధరకోటులు=విల్లు, కత్తిధరించినవారి సమూహములు, ముంగలన్=ముందుప్రక్క, హయవరంబులు=శ్రేష్ఠములైన గుఱ్ఱములు.

తాత్పర్యము

లక్ష్మణుఁడు వెనుక ప్రక్క నొకచేత ఛత్రము మఱియొకచేతఁ జామరముఁ బూని యెండదగులకుండునట్లు లీఁగలు వ్రాలకుండునట్లు రక్షించుచుండ నాకాశమున మేఘము ధ్వనించినట్లు రథము ధ్వనించుచుండఁ దూరుపు పర్వతమును విడిచివచ్చు చంద్రునివలె నిల్లు విడిచివచ్చుచుండఁగా నాయనను జూచు జనముల కోలాహల మతిశయమగుచుండఁ జందనము అగరు పూసి కొనినవారు విండ్లు ఖడ్గములు ధరించినవారు ముందుప్రక్కనడువ వెనుకప్రక్క నూర్లకొలఁదులు వేలకొలఁదులు గుఱ్ఱములు నేనుఁగులు రాఁగా.

ఉ॥ మంగళవాద్యఘోషము ల♦మందసువందిజయారవంబు సా
రంగతురంగ రావములు♦ప్రస్ఫుటశూరమహానినాదముల్
రంగుగ నెల్లచోట్లఁ దన♦రంగ గవాక్షగభూషితాంగ లా
నంగన లెల్లఁ జల్లిరి క♦రాంజలులం గొని పూలు రాము పై. ౪౫

అమంద=అతిశయించిన, సువంది=మంచిస్తోత్రపాఠకుల,జయారవంబు=జయ జయ మను ధ్వనులు, సారంగ తురంగరావములు = ఏనుఁగులయు గుఱ్ఱములయు ధ్వనులు, ప్రస్ఫుటశూర మహానినాదముల్=మిక్కిలి స్పష్టమైన శూరుల గొప్పచప్పుడులు, గవాక్షగ=గవాక్షములందుండు, భూషితాంగలు=అలంకరించుకొనిన దేహములు గలవారు, అంగనలు=స్త్రీలు, కరాంజలులన్=చేతిదోసిళ్ళయందు.

తాత్పర్యము

మంగళవాద్య ధ్వనులు వందుల జయజయ ధ్వనులు, ఏనుగుల బృంహితములు,గుఱ్ఱముల హేషలు,శూరుల మహాసింహనాదములు నన్నిచోట్లవ్యాపింపఁగ నీవేడుకచూడ మేడల కిటికీల నిలిచిన స్త్రీలు చక్కఁగ సింగారించుకొని తమదోసిళ్ళయందుఁ బూవులు గొని శ్రీరాముపై జల్లిరి.

కం॥ నేలను సౌధంబులఁ గిటి,కీలను గనుచుండు సతులు♦కీర్తించిరి సీ
తాలలనాహృదయేశు,సుమాళీసుకుమారు నతఁడు♦హర్షమునొందన్. ౪౬

సౌధంబులన్= మేడలయందు, సీతాలలనాహృదయేశున్ = సీతాదేవిభర్తను, సుమాళీ సుకుమారున్=పూలవలె మృదువైన దేహముగలవానిని, హర్షము=సంతోషము.

తాత్పర్యము

మేడలులేనివారు పొరుగూళ్ళనుండి వచ్చినస్త్రీలు నేలమీఁదను పురమున నుండు స్త్రీలు మేడలయందలి కిటికీలయందునుండి చూచుచుఁ గుసుమసుకుమారుఁడు శ్రీరాముఁడు విని సంతోషింపఁగీర్తించిరి.

సీ॥ కౌసల్యనందనా!♦కర మలరారు నిన్,సఫలాయాత్రుఁ బదస్థు♦జననిచూచి
సీతామనోహరా!♦ సీమంతినీవర,ము న్నెట్టితపముల♦మొనసె నొక్కొ
యారోహిణి శశాంకు♦నట్టులు నినుఁ గూడి, నీ ప్రియురా లయి♦నెగడ సీత
రామచంద్రా! నిను♦రాజుఁగాఁ గన నేమి, సలిపినారమొ ప్రశ♦స్తవ్రతంబు

తే॥ రామభద్రుండు దశరథ♦రాజుకరుణ,మనకు నేలిక యయ్యెడు♦మనముఁపూర్ణ
కాములౌదుము మఱితము♦కష్టమనఁగ,నెట్టిదో యింకనీయన♦యేలుబడిని
స్త్రీలు చెప్పుకొనుమాటలు వినుపడింపబడుచున్నవి.

కరమలరారున్=మిక్కిలి సంతోషించును, సఫలయాత్రున్=ఫలముతోఁగూడిన ప్రయాణముగల,పదస్థున్=యౌవరాజ్యపద మందుండువానిని,జనని=

తల్లి కౌసల్య, సీమంతినీవర =ముత్తైదువులందు శ్రేష్ఠురాలు, సీమంతము= పాపట, అవి గలది సీమంతిని. భర్తలులేని స్త్రీలకుఁ బాపటలులేవు. వెంద్రుకలు కలయదువ్వుదురు. అదియే వైధవ్యలక్షణము. 'వీరల కెలనఁ బాపటలు లేక, ధౌతసితవస్త్రపరిధానలై తనువుల నిభృతిదోఁపఁగనున్న యిన్నెలంత లాంబికేయుకోడండ్రు కరుణా విధేయులార॥ ఆశ్రమ ౨౮. ౪౪ పద్యము. దీని వలనఁ దలవెండ్రుకలుగల విధవలు పాపటలు లేకుండునట్లు కలియ దువ్వవలయునని యేర్పడుచున్నది. ఏలిక=ప్రభువు.

తాత్పర్యము

శ్రీరామచంద్రా! తల్లి యన కౌసల్యయే తల్లిగాని యందఱు తల్లులా. ఆమె నీవు పోవు ప్రయాణము సిద్ధించి యౌవరాజ్యపదమందుండఁగా మిక్కిలి సంతోషించును. స్త్రీలనిన నందఱు స్త్రీలా నీ మనస్సాకర్షింపఁజాలిన సీతయే గాక. అటువంటి వనితామతల్లి రోహిణి చంద్రునివలె నెప్పుడుగూడియుండ నీకుఁ బ్రియురాలయియుండ సమర్థురాలగు సీత మున్నే యే తపములు చేసెనోకదా.

రామచంద్రా! ప్రజలనిన నందఱు ప్రజలా నిన్ను రాజుగాఁ బొందుటకుఁ బూర్వజన్మమున మేమే మేమిప్రశస్తములయిన వ్రతములను సల్పితిమో.

అమ్మలారా! దశరథరాజు దయచే మనకు శ్రీరామచంద్రమూర్తిరాజుగా నున్నాఁడు. మనకోరిక లన్నియు నెఱవేఱును. ఈయన పాలనమున నిఁకఁ గష్టమనఁగ నెట్టిదో మఱతుము.

చం॥ అని యిటు కాంతలెల్లఁ దను•నాడుకొనన్ విని హృష్టచిత్తుఁడై
చని హయవారణంబులయు•స్వస్తికమాగధవందిసూతపూ
ర్జనులయుఁ బుణ్యవాటులయు•సంఘము లుల్లసిలంగ రాముఁడున్
జననిబిరీససౌధగృహ•చత్వర రాజపథంబుఁ గన్గొనెన్. ౪౭౮

కాంతలు=స్త్రీలు, ఆడుకొనన్=తనవిషయమై యనుకొనుచుండఁగా,హృష్టచిత్తుఁడై=సంతోషించిన మనస్సుగలవాఁడై, హయవారణంబులయు=గుఱ్ఱముల యేనుఁగుల యొక్కయు, స్వస్తిక=స్వస్తిపలుకు వారియొక్కయు, మాగధవందిపూర్జనులయు=మాగధులయొక్కయు, వందులయొక్కయు, సారథుల యొక్కయు పౌరులయొక్కయు, మాగధులు, రాజులను మేలు కొలుపువారు. క్షత్రియ స్త్రీయందు వైశ్యునికిఁ బుట్టినవారు, మాగధులు. వందులు రాజుస్తోత్ర పాఠములు చదువువారు బట్టువాండ్రు సూతులు రాజులకు సారథ్యము చేయుట యందు స్తోత్రపాఠములు పఠించుటయందు నియమింపఁ బడినవారు.క్షత్రియునకు బ్రాహ్మణ స్త్రీయందుఁ బుట్టినవారు సూతులు. ఇవి విలోమజాతులు. పుణ్యవాటులు=పుణ్యప్రదేశములయు, ఉల్లసిలంగన్=సంతోషింపఁగా, జన=జనులచే, నిబిరీస=దట్టమైన, సౌధ=మేడలు, గృహ=సామాన్యములయిన, యిండ్లు చత్వర=ముంగిళ్లుగల, రాజపథంబు=రాజమార్గము, కన్గొనెన్=చూచెను.

తా త్ప ర్య ము

స్త్రీలందఱుఁ దనవిషయమై యిట్లు పలుకుచుండఁగా విని సంతోషించి పోయి గుఱ్ఱములు, ఏనుఁగులు, జయజయ యని ఘోషించు స్వస్తికులయు సూతవంది మాగధులయు పురజనులయు పుణ్యప్రదేశములయు సంఘమును సంతోషింప జనులచే నిండిన మేడలు ఇండ్లు ముంగిళ్లుగల రాజమార్గమును జూచెను.

౧౭-వ సర్గము.

సీ॥ కమనీయ మగుపతా•కాధ్వజతతులతోఁ, బరిమళదగురుధూ•పములతోడ
వెలిమబ్బులను బోలి•వెలయుగృహాళితో, నగరుచందననిచ•యములతోడ
వలిపంపుఁబట్టుదు•వ్వాలువలరాశితో, స్ఫటికముక్తాఫల•పటలితోడ
నుచ్చావచంబు లై•యొప్పుభక్ష్యములతో, వలనొప్పు నంగళ్ళ•వరుసతోడ
తే॥ రాజితంబయి యల యంబ•రంబునందు, దేవపథమున కుద్దియై•తేజరిల్లు
రాజమార్గంబునందు శ్రీ•రామవిభుఁడు,
సంతసంబారఁదానటు•చనుచునుండ. ౪౭౮

కమనీయమగు=మనోహరమైన, పతాకా=చిహ్నములులేని టెక్కములయు, ధ్వజ=చిహ్నముగల జెండాలయు, తతులతోన్=సమూహములతో, పరిమళత్=సువాసనకొట్టుచున్న, అగరుధూపములతోడన్=అగరుచెక్కల పొగలతో, వెలిమబ్బులను=తెల్లమేఘములను, అగరుచందన నిచయములతోడన్=అగరు చందనపుఁ జెక్కల సమూహములతోను, వలిపంపుఁ బట్టు దువ్వాలువల రాశితోన్=తెల్లని సన్నని పట్టువస్త్రముల సమూహముతో, స్ఫటికముక్తాఫల పటలితోడన్=స్ఫటికములయు ముత్తెములయు సమూహముతో, ఉచ్చావచంబులై=నానావిధములై, అంబరమునందున్=ఆకాశమందుఁగల, దేవపథమునకున్=స్వాతిమర్గమునకు, ఆకాశమున నక్షత్రములు విశేషము కానరాక వాని కాంతిచేఁ దెల్లనై బాటవలెఁగానవచ్చునది, ఉద్దియై=సమానమై.

తా త్ప ర్య ము

అందముగాఁ బేర్లు వ్రాయఁబడినవి గరుడాది చిహ్నములు గలవియగు టెక్కెములతోను ఘుమం ఘుమయని సువాసనలీను నగరుపొగలతోను తెల్ల మబ్బులవలెనుండు సున్నపుఁ బూఁతలుగల యిండ్లతోను, అగరు చందనముల చెక్కలతోను సన్నని పట్టువలువలతోను, స్ఫటికములు ముత్యములు వీని రాసులతోను నానా విధములైన పిండివంటలతోను నొప్పు నంగళ్ళవరుసలతోఁ బ్రకాశించు రాజమార్గంబునందు శ్రీరామచంద్రుఁడు సంతోషముతోఁ బోవుచుండఁగా.

కం॥ హవి దధ్యక్షతలాజలఁ, బ్రవిమలరాజార్ఘ్యదివ్య•భద్ర శ్రీధూ
పవితతుల మాల్యముల నర్ఘ్యవిధిఁ బూజితములైన•యజిరములఁగనెన్.

హవి=హవిస్సు, దధి=పెరుగు, అక్షత=అక్షతలు=పసుపుతోగూడిఁగలిసిన విఱుగని బియ్యపుగింజలు, లాజలన్=బొరుగులు,పేలాలు వీనిచేతను,ప్రవిమల=

మిక్కిలి నిర్మలమైన, రాజార్హ=రాజయోగ్యమైన, దివ్య=దేవతాసంబంధమైన, భద్రశ్రీ=చందనముల, ధూపవితతులన్=పొగల సమూహములచే, మాల్యములన్=పూలదండలచే అర్హవిధిం=తగినరీతిని, అజిరములన్=మొగసాలలను.

తా త్ప ర్య ము

హవిదధి యక్షతలచేతను లాజలచేతను నిర్మలములై రాజయోగ్యమైన దేవసంబంధమైన చందనాది ధూపములచేతను పూలదండలచేతను తగురీతి పూజితములైన మొగసాలల చేతను.

—♦ ప్రజలు శ్రీరాముని దీవించుట ♦—

కం॥ అందులవారలు దన కా♦నందంబున నీయ దీవ♦నలు వారల నె
ల్ల దగురీతిగ మార్యా,దం దెల్పుచుఁ జనఁగ వారు♦తాత్పర్యమునన్. ౪౮౧

అందులవారు=ఆప్రదేశమునుండువారలు, అందు శబ్దమున కలిగాగమము లేదను వారీరూపము గ్రహింతురు. అందు శబ్దమునకు లకారము చేర్చిన ప్రదేశార్థకమగు. "అందులకు ధరణిగల నృపనందనులెల్ల" నని భారత ప్రయోగము.

తా త్ప ర్య ము

ఆ మొగసాలలనుండువారు తన్ను సంతోషముతో దీవింపఁగా వారి నెట్లెట్లు గౌరవింపనలయునో యట్లు చిఱునవ్వు, కనుబొమలాడించుట, మాటలాడుట, చూచుట, నమస్కరించుటలోనగు కార్యములచే గౌరవించుచుఁ బోవఁ బోవ వారును నాసక్తితో.

కం॥ తాతలు ముత్తాతలు నే,రీతిం బాలించి రట్టి♦రీతిని నీవున్
భూతలనాథుఁడ వై మముఁ, బ్రీతిం బాలింప వయ్య♦శ్రీరఘురామా!

తా త్ప ర్య ము

నీ తాతలు వారి తండ్రులు భూమి నేరీతి ధర్మము చెడకుండఁ బ్రజలకు బాధలేకుండఁ బాలించిరో యట్టులే మమ్ము నీవు ప్రేమతో శ్రీరామచంద్రా పాలింపుము.

సీ॥ పొరిఁ దండ్రిదాతల♦ప్రోపుకన్న సుఖాన,రామరాజ్యంబున♦బ్రదుకఁగలము
అన్న మేటికిఁ బర♦మార్థంబు లేటికి, రాముఁడు రా జయి♦రాకయున్న
శ్రీరామపట్టాభి♦షేకంబుకంటెను, గడుశుభం బెద్ది రాఁ♦గలదు మనకు
రామమహోత్సవం♦బీమెయి వర్తిల్ల, నన్యంబులకుఁ జిత్త♦మరుగు నెట్టు
ఆ॥ లేమి పుణ్యఫలమొ♦యింతకుఁ బూర్వంబు, వెనుక నేరికిని ల♦భింప నట్టి
రామచంద్రయౌవ♦రాజ్యాభిషేక ద,ర్శనము గలిగె జన్మ♦సార్థకముగ? ౪౮౩

పొరిన్=చక్కఁగ, ప్రోపు=రక్షణము, పరమార్థంబులు=శ్రేష్ఠములైన ధనములు, ఈమెయిన్=ఈవిధముగ, వర్తిలన్=జరుగఁగా, జన్మసార్థకముగన్=పుట్టువు ఫలము కలుగునట్లుగ, సార్థకము ఇది భావప్రధానము. సార్థక్యము. ఈ పద్యమున భవద్దర్శన లాభమే యన్నిటికంటె నుత్తమ లాభమనియు నది

పూర్వపుణ్యవశమునఁగాక లభింపదనియు దానిని విడిచి మఱియొకదానికై దేవులాడువాఁడు క్షుద్రుఁడనియుఁ దెలుపఁబడును.

తాత్పర్యము

చక్కఁగా మా తల్లిదండ్రులు తాతలు మమ్ము రక్షించినపు డనుభవించిన సుఖముకంటె రామరాజ్యంబున నెక్కువ సుఖమున బ్రదుకఁగలము. శ్రీరామచంద్రుఁడు పట్టాభిషేకముఁ జేసికొని రాజయి రాకముందు మనకన్న మేలయితరములైన యుత్తమ ధనాదులేల? అనుత్తమ సుఖకరమైన శ్రీరామపట్టాభిషేక దర్శనమునకంటె మేలైనది మనకే జన్మమందైన నేది రాఁగలదు. ధనాదులు దారపుత్రాదులును సుఖకారణములు కావాయందురేమో. అవి తుచ్ఛములు. అశాశ్వతములు కావున రామపట్టాభిషేక మహోత్సవం బీ విధమున జరుగుచుండ దానిపై మనస్సుంచి యానందింపక యితరక్షుద్రకామ్యముల పై నెవ్వనికి నెట్లుపోవును. పోదు. మందారమకరంద మాధుర్యమైనఁ దేలుమధుపంబు పోవునే మదనములకు. ఔరా మనమెంతపుణ్యముచేసినవారము. శ్రీరామునితో సమకాలికులమై యుండుటేకాక పూర్వమందు మనతాత ముత్తాతలకు వారితాతముత్తాతలకునైన మన వెనుక మనమనుమలకునైనను జూడలభింపని శ్రీరామచంద్రుఁడు యౌవరాజ్యమందుఁ బట్టాభిషిక్తుఁడగుచునుండ మనము చూచి జన్మమును సార్థకము చేసికొనఁ గలిగితిమి? ఇఁక మనకు జన్మములేదు.

మ॥ అని శ్రీరామునిమీఁద నుంచిననిజా♦పాంగంబులుం జిత్తముల్
ఘనుఁ డాతండు సుదూర మేగినను లో♦కవ్రాత మొక్కింత యై
నను ద్రిప్పంగ వలంతి గాదు, బయల♦స్సంకల్ప దార్ఢ్యంబునన్
గను చుండున్ రఘునాథునాకృతిని ము♦త్కంఠాతి రేకంబునన్. ౪౮౮

నిజాపాంగంబులున్=తమ కడకంటిచూపులు, సుదూరము=మిక్కిలి దూరము, లోకవ్రాతము=జనసమూహము, వలంతి=సామర్థ్యముగలది, బయలన్=బాహ్యశబ్దభవము బయలు, ఆవరణములేని యాకాశ ప్రదేశము. సంకల్పదార్ఢ్యంబునన్=దృఢమైన సంకల్పబలముచే, ఉత్కంఠాతిరేకంబునన్=అతిశయమైన తహతహ పాటుచేత, ఈ పద్యమందు భక్తులు భగవంతుని మూర్తిని బాహ్యమందు నంతరంగమందును ధ్యానించి నిలుపు విధము చెప్పఁబడెను.

తాత్పర్యము

ఈప్రకారము చెప్పుకొనుచుఁ దాముకదలుటలేక యొకచోటనే నిలఁబడి యుండ రథము దూరముపోఁగా నాయన యెదురుగానున్నప్పుడాయనపై నిల్పిన చూపులను మనస్సును ఆయన మిక్కిలి దవ్వుగాఁగాన రాక పోయినను ఆయనమీఁద నుండి యితర పదార్థముల మీఁదికిఁద్రిప్పఁజాలరైరి. దూరముగాఁ బోయినపుడు చూపెట్లు రామునిపై నిలిపిరనఁదమ యెదుట నున్నప్పుడు చూచిన యాకారమును మనస్సున దృఢముగ

నిలుచుటచే నాయనలేనపుడును ఆరూపమె సంకల్పబలంబున వారు హృదయమున నిలిపి యన్యము మఱచి యారూపమునే యింకను జూతమా యింకను జూతమాయను నాశతోఁ జూచుచుండిరి. దీనివలన ముందు స్థూలరూపమును జక్కఁగాఁజూచి లక్ష్యము దృఢపడినపిమ్మట నారూపమునే హృదయమందులో చూపుచేఁ జూడవలయునని యేర్పడుచున్నది. దీనివలన బాహ్యలక్ష్యము వ్యర్థమను వారి వాదము నిరస్తము.

కం॥ రామునిఁ గనుఁగొనఁ డెవ్వఁడు,
రాముఁడు గనఁ డెవని వాని ◆ బ్రతుకదియేలా
భూమిని నింద్యుండై మను,నామనుజాధముని వాని ◆ యాత్మయె రోయున్.

ఇంత శ్రమించి శ్రీరామునిఁజూచిన ఫలమేమియనఁ జెప్పుచున్నాఁడు.

ఎవఁడు=ఎంతగొప్పవాఁడైనను, రామునిన్=జనులు తన్నుఁ జూచినమాత్రముననే వారిని బరిపూర్ణానందామృత సరస్సున ముంచువానినిగూడ, కనుఁగొనఁడు=చూడఁడో, స్తుతింపకున్నను, మాటలాడకున్నను బూజింపకున్నను మానునుగాక, వానిని జూచినవారు వీఁడేమి యచేతనమా? తోలుబొమ్మయా?యని భ్రాంతిపడకుండుటకై కనులనైనఁ జూడకుండెనేని,చేతనుఁడు భగవంతునియెడ నేకార్యమైనను చేయఁడేని యచేతనమునకు వీనికి నేమిభేదము? అట్లు చేయకుండుటచే నెవని శ్రీరాముఁడు కనఁడో, నరుఁడు భగవంతున కభిముఖుఁడై యుండినఁగదా భగవంతుఁడానరునిపై దయాళువై దర్శన మిచ్చునని భావము.

యమైవేష వృణుతే తేనలభ్యః, తస్యైష ఆత్మావృణుతేతనూంస్వామ్. యే యథాభజంతే మాం, తాం తథైవ భజామ్యహమ్. అని ప్రమాణములు కలవుగదా. వాని బ్రదుకు=శ్రీరాముని దర్శింపక శ్రీరామకటాక్షమునకుఁ బాత్రుఁడుగాక యుండువాని బ్రదుకు. ఏలా=ఉండియేమి ప్రయోజనము, నింద్యుండై=సర్వజనులచే నిందింపఁబడ యోగ్యుఁడై, మనున్=జీవించును- లోకమున స్త్రీలోలుఁడగువాఁడు పరు లనేకులు నిందించినను వానియాత్మకు వాఁడుచేయు పని తృప్తికరముగనే తోఁచును. వీనినో వీనియాత్మయే రోయును.

తీర్థీయము. ఎవ్వఁడు-రామునిన్=తన దేహమున నున్న రామునిన్- కనుఁగొనఁడో కాఁబట్టి రాముఁడెవనిఁ గనఁడో వాని బ్రదుకేలా? సమయము వచ్చి కన్నులార రామబ్రహ్మము ననుభవింపనివాఁడు అందఱు నిందింపఁ దగినవాఁడే? ప్రయాసము లేక భగవత్సాక్షాత్కారముచేసి ముక్తిసంపాదింప నదృష్టములేని వాఁడెన్నఁడును సంసారమును దాఁటఁడు. వాని యాత్మయే=వాని యంతర్యామియే, రోయున్=ఈపాపిష్ఠుఁడు ముక్తిని సాక్షాత్కరించి జన్మము వదలుకొనలేక యున్నాఁడుగదా యని నిందించును.

తాత్పర్యము

శ్రీరాముని నెవఁడు చూడఁడో అకారణముచే శ్రీరాముఁడెవనిఁ జూడఁడో వానిబ్రదుకు వ్యర్థము. వాఁడు భూమిపైఁ బశువులకంటె నికృష్టుఁడని నిందింపఁ దగినవాఁడు. మనుష్యులందధముఁడైన యిట్టివానిని లోకము రోయుటేకాదు. వాని యాత్మయేవానిని రోయును. ఎవఁడు భగవన్మూర్తిని దర్శింపఁడో యెవనిపై భగవత్కటాక్షము పడదో వాఁడు మరల మరల జన్మములెత్తుచుండవలసినవాఁడే కావున శ్రీరాముని మూర్తిని బాహ్యమందును అంతరంగమందును రెండు విధముల ధ్యానించువాని జన్మమే జన్మము. "రామునిఁగనుగొనఁ డెవ్వఁడు, రాముఁడు గనఁడెవని" ననుటచే భగవత్కటాక్షమునకుఁ బాత్రుఁడగుటకు ముందు పురుషుఁడు దానికై ప్రయత్నింపవలయుననియు కొంచెమైన మన ప్రయత్నములేక భగవత్కటాక్షమురాదనియు సూచన.

తే॥ నాల్గుజాతులవారిని ♦ నయముమీఱ, నన్నివయసులవారల ♦ నాదరించు
నటులు గావున జనులెల్ల ♦ ననవరతము,
ననఘుధర్మాత్ము శ్రీరాము ♦ ననుసరింత్రు. ౪౮౯

శ్రీరాముని సేవించుటయందు నధికారము నియతిలేదనియు ఆయన సర్వసముఁడనియుఁ జెప్పఁబడుచున్నది.

తాత్పర్యము

శ్రీరాముఁడు వర్ణాశ్రమ పక్షపాతబుద్ధిలేక నాలుగువర్ణములవారిని, వృద్ధులెక్కువ, పిన్నవయస్సువారు తక్కువ, స్త్రీలుతక్కువ పురుషులెక్కువ బ్రాహ్మణులెక్కువ, శూద్రులు తక్కువ యనుభేద బుద్ధిలేక వారివారి యోగ్యతానుసారముగ నందఱను నాదరించును. కావున లోకులందఱు ధర్మాత్ముఁడైన శ్రీరామునే యెల్లప్పు డనుసరించి యుందురు. భగవంతుఁడు సర్వజనసేవ్యుఁడు.

కం॥ చదుకములకుఁ జైత్యములకు, గొదకొనుదేవపథములకుఁ ♦ గోవెలలకు స
మ్మదమున సీతాకాంతుఁడు, ప్రదక్షిణముగఁ జనియెరాజ ♦ భవనంబునకున్.

చదుకములకున్=నాలుగుత్రోవలు కలియుచోటులకు, దేవపథములకున్=ఉత్సవకాలమున దేవుఁడూరేగు మార్గములకు, కోవెలలకున్=దేవాలయములకు.

తాత్పర్యము.

శ్రీరాముఁడు చదుకములకుఁ జైత్యములకు దేవపథములకు దేవాలయములకుఁ బ్రదక్షిణమార్గమున రాజునింటికిఁ బోయెను.

ఇది శ్రీరాముని శ్రద్ధాభక్తులుశాస్త్రవిశ్వాసము సదాచారసంపత్తి తెలుపును.

ఈ శ్రీరామునిచర్య దేవాలయాదులకుఁ బ్రదక్షిణముగ బోవలయునని సూచించుచున్నది. అప్రదక్షిణముగఁ బోరాదు. "ప్రశస్తమాంగల్యదేవాయతన చతుష్పథాన్ ప్రదక్షిణ మావర్తయేత" గౌతముఁడు.

"మృదంగాం దైవతం విప్రం ఘృతం మధు చతుష్పథమ్ ప్రదక్షిణాని కుర్వీత, ప్రజ్ఞాతాంశ్చ వనస్పతీన్" మను. ౪-౩౯. ప్రదక్షిణంచ కుర్వీత, సర్వానేవ వనస్పతీన్। చతుష్పథాంశ్చ కుర్వీత, సర్వానేవ ప్రదక్షిణమ్। అనుశాస, మృదంగములకు, దేవతలకు, బ్రాహ్మణులకు, నేతికి, తేనెకు, నాలుగు దోవలు కలియుచోటికి, ప్రసిద్ధవనస్పతులకుఁ బ్రదక్షిణముగఁ బోవలయును.

కం॥ అంబుదసంఘనిభం బయి,యింబగు ప్రాసాదముల ర॰హించుచు మఱి రౌ
 ప్యం బగు శిఖరికి జోడై , యంబరమును ముద్దుగొనుచు॰నమలంబగుచున్.

అంబుద సంఘ నిభంబయి = మబ్బుగుంపుతో సమానమై, రౌప్యంబగు శిఖరి=వెండికొండ- కైలాసము, అంబరమును = ఆకాశమును.

తాత్పర్యము

మేఘసమూహముతో సమానమై మనోహరమైన మేడలచేఁ బ్రకాశించుచు వెండికొండకు సమానమై యాకాశము నంటుచు మాలిన్యములేక.

తే॥ రత్నజాలపరిష్కృత॰రమ్యవర్ధ,
 మానగృహముల మెఱయుచు॰మఱిమహేంద్ర
 సదనమోయనఁ దులలేని॰సవురుపొనరి,
 దివ్యమగు తనతండ్రిమం॰దిరముఁజొచ్చి. ౪౮౯

రత్నజాల=రత్నముల సమూహముచే, పరిష్కృత=అలంకరింపఁబడిన, రమ్య=అందమైన, వర్ధమాన గృహములన్=వర్ధమానమనుపేరుగల యిండ్లచే, మహేంద్రసదనమో=ఇంద్రునియిల్లో, తులలేని=సరిలేని,సవురు=చక్కఁదనము. వర్ధమాన గృహలక్షణము బృహత్సంహిత యందిట్లు చెప్పఁబడెను. దక్షిణ ద్వారము గలదై దక్షిణమునఁబడమట వెలుపలివైపు వసారాలు(పంచపాళి)గల గృహము వర్ధమానమనఁబడును. ఇదిగాక సర్వతోభద్రము నంద్యావర్తము స్వస్తికము రచకము హిరణ్యానాభము సుక్షేత్రము చుల్లి- పక్షఘ్నము లోనగు గృహభేదములుగలవు. వీనిలో నంద్యావర్తము, వర్ధమానము ఉత్తమములు, స్వస్తికము రుచకము మధ్యములు. సర్వతోభద్రము రాజులకుపయోగించును. హిరణ్యానాభము ధనదము. సుక్షేత్రమభ్యుదయ కరము. చుల్లిధననాశకరము. పక్షఘ్నము పుత్రఘ్నము శత్రువృద్ధికరము. వీని వివరముగోరువారు వరాహ మిహిరుని బృహత్సంహిత చూడవలయును.

తాత్పర్యము

రత్నసమూహములచే నలంకరింపఁబడిన యందమైన వర్ధమాన గృహములచే మెఱయుచునింద్రు నిల్లోయను నట్టు నసమానమైన చక్కఁదనముగలదై దివ్యమైన తండ్రియింటిలోఁ బ్రవేశించెను.

తే॥ విల్లుకాఱును సుభటులు॰విడువ కెపుడు, కాపుసేసెడిపూఁడుక॰క్ష్యలను రథము
 తోడమిత్రులతో దాఁటి॰తోయజాక్షుఁ, డవలిరెండునుగాల్నడ॰నధిగమించి.

విల్లుకాఱు = విల్లుధరించినవారు-రూ. విల్లుకాండ్రు. ఏ. విల్లుకాఁడు.

తా త్ప ర్య ము

విండ్లను ధరించినవారును భటులును విడువక యెపుడు రక్షణముచేయు మూఁడు కక్ష్యలను రథముమీఁదఁ గూర్చుండియే స్నేహితులతో దాఁటిపోయి యావల రెండు కక్ష్యలను కాలినడకనే దాఁటి

ఉ॥ అచ్చటఁ దోడవచ్చినహి॰తాళుల నెల్లను నిల్పి తండ్రి పే
రిచ్చఁ జరించునంతపురి ♦ కేగ రఘూద్వహుఁ, డంత లోకులున్
గ్రచ్చఱ రామురాకకయి ♦ కాచి వసించిరి ద్వారసీమఁ బెం
పెచ్చ మహార్ణవంబు కువ ♦ లేశునిరాకకు వేచునట్టులై. ౪౯౧

కువలేశుని=కలువలఱేని- చంద్రుని, కువాలయం, కువలయం కువాలం కువలం కువమ్మని శ్రీహర్షుని ద్విరూప కోశము, క్రచ్చఱన్=శీఘ్రముగా.

తా త్ప ర్య ము

ఐదవకక్ష్యయందుఁ దనతోడ వచ్చినస్నేహితులనెల్ల నిలిపి లక్ష్మణుఁడు మాత్రముతోడ రాఁగా (చూ-వ ౨౪౦) తన యిష్టానుసారముగ సంచరించు నంతఃపురములోనికి శ్రీరాముఁడు వెళ్ళెను. లోకులును శ్రీరాముఁడెప్పుడెప్పుడు వచ్చునా యని సముద్రము చంద్రునిరాక గోరి కాచియున్నట్లు వాకిటకాచుకొని యుండిరి.

—♦ ౧౮-వ సర్గము. శ్రీరాముఁడు దశరథునిస్థితికి వగచుట. ♦—

చం॥ చని యటు రామచంద్రుఁడు వి ♦ శాలశుభాసనమందుఁ గైకతోఁ
బెనువనటన్ నిజాననము ♦ విహ్వలపాటున వాడువాఱఁగా,
గనుఁగవ నశ్రుధార లొలు ♦ కం బెడమోము యియున్నతండ్రిఁ దాఁ
గని యభివాదనం బొనరఁ ♦ గాఁ బచరించి వినీతిమంతుఁడై. ౪౯౨

విశాల శుభాసనమందున్=వెడలుపై యందమైన పడుకయందు.ఇట్లనుటచేఁ గైకయు దశరథుఁడు కోపగృహము విడిచి సుమంత్రుఁడు రాకముందే వాడుకగా పడుకొనుచోటికి వచ్చిరని తెలియనగు. పెనువనటన్ = మిక్కిలి దుఃఖముతో, నిజాననము=తనముఖము, విహ్వలపాటునన్=కలఁకతో, వాడువాఱఁగన్=వాడి పోఁగా, కనుఁగవన్ = రెండు కన్నులయందు, అశ్రుధారలు=కన్నీళ్ళు, పెడ మోము = మాఱుమోము, అభిముఖుఁడు గాక వెనుకప్రక్కగఁ దిరిగియుండ (శ్రీరాముని ముఖముచూడలేక-తనముఖము శ్రీరాముఁడు చూడనిష్టములేక) అభివాదనము=నమస్కారము, వినీతిమంతుఁడై =వినయముతోఁ గూడినవాఁడై, ఇచట నాసనమనఁగా శయ్య "కలఁకవహించి శోకమునఁ గ్రాఁగి శయ్యంబున సొమ్మసిల్లుచున్. (పద్యము ౨౩౧) అని ముందు చెప్పఁబడును. కావున నిచ్చట నాసనమన శయ్యయే యని యర్థము వ్రాయఁబడెను.

తా త్ప ర్య ము

ఆవిధముగాఁ బోయి శ్రీరామచంద్రుఁడు విశాలమైన మంచి పడుక యందుఁ గైకతో మిక్కిలి దుఃఖించుటచేఁ దనముఖము వాడిపోఁగాఁ గన్నుల రెంటను నీళ్ళుగాఱ శ్రీరామచంద్రుని ముఖమును జూచిన శ్రీరాముఁడు కోపించునో సంతాపించునో యని పెడమరగాఁ దిరిగియుండిన తండ్రికి నమస్కరించి వినయము గలవాఁడై.

కం॥ పిమ్మటఁ గైకేయీపాదమ్ముల పైఁ వ్రాలి నిలువ ♦ దశరథుఁ డతిశో
కమ్మున రామా యని వాక్యమ్మును నొం డనఁడు చూడఁ♦గానఁడు సుతునిన్.

తా త్ప ర్య ము ౪౯౩

తండ్రికి నమస్కరించిన యనంతరము కైకపాదములపై వ్రాలి నమస్కరించి నిలువఁగా దశరథుఁ డతిశోకముతో రామాయని యొకసారి యని యేమియుఁ జెప్పలేక శ్రీరాముని ప్రక్కఁ జూడనైనఁ జూడ లేక పోయెను.

కం॥ మున్నెన్నఁ డెఱుంగనియాపన్నదశం గుందు నృపతి♦భయదాకృతిఁ దాఁ
గన్నులఁ గని రాముండును, బన్నగమును ద్రొక్కు వాని♦పగిది న్వెఱచెన్.

ఆపన్నదశ = కీడుస్థితి, భయదాకృతి = వెఱపు గలిగించు నాకారము, పన్నగమున్=పామును.

తా త్ప ర్య ము

పూర్వమెన్నఁడు నెఱుఁగని విపత్తి దశయందుండి వ్యసనపడు రాజు యొక్క భయముగలిగించు నాకారమును జూచి శ్రీరామచంద్రమూర్తి పామును ద్రొక్కినవానివలె భయపడెను. ఎన్నికష్టములు వచ్చినను భయపడని శ్రీరామచంద్రుఁడు తన తండ్రి స్థితినిజూచి యట్టిస్థితికిఁ దన యపచారము కారణ మేమో యని భయపడెను. పామును ద్రొక్కినవానివలె నన్నప్పుడు తొలుత అపచారము చేసినవాఁడు మనుష్యుఁడేకదా.

చం॥ అనుపమశోకకర్శితుని, ♦ హర్షవిహీనుని, నష్టచేతనున్
ఘనతరదీర్ఘనిశ్వసను ♦ గష్టదశావశు, రాహుపీడితా
ర్కునిగతి, క్షోభితాంబునిధి ♦ కోపున, దబ్బఱ లాడినట్టిస
న్మునివలె, నున్నవానిఁ గని ♦ తొట్రిలుపాటునఁ దాను నట్టులై. ౪౯౫

అనుపమశోకకర్శితునిన్=అసమానమైన శోకముచేఁ బీడింపఁబడినవానిని, హర్షవిహీనునిన్=సంతోషము లేనివానిని, నష్టచేతనున్=మనస్సు చెదరినవానిని, ఘనతర=మిక్కిలి పెద్దవియు, దీర్ఘ=నిడుపైనవియునగు, నిశ్వాసనున్=ఊర్పులు గలవానిని, కష్టదశావశున్=కష్టస్థితికి వశపడినవానిని, రాహుపీడిత=రాహువుచేఁ బీడింపఁబడిన, అర్కునిగతిన్=సూర్యునివలె- దీనిచేఁ గాంతి హీనుఁడని తెలియు

నగు. క్షోభిత=కలఁతపడిన, అంబునిధికోపునన్ = సముద్రమువలె- (దీనిచే మనస్సు చెదరి పోయినదని సూచితము.) దబ్బఱలు=అసత్యములు- ఈయుప మానము శక్తిసామర్థ్యములు క్షీణించెనని తెలుపును. తొట్రిలుపాటు=తడఁబాటు.

తా త్ప ర్య ము

అసమానశోకముచే బాధింపఁబడి సంతోషముచెడి గుండెచెదరి నిట్టూర్పులు పుచ్చుచు నతి కష్టదశకుఁ బాలయి రాహుముఖమునఁబడిన సూర్యునివలె, పెద్ద గాలికిఁ గలవరపడిన సముద్రమువలె నసత్యము పలికిన మునివలె నుండిన వానిని దండ్రిని జూచి తడఁబాటునఁ దనవలనఁ దండ్రికింత వ్యథ గలిగెఁగదా యని తండ్రివలె నయ్యెను. అనఁగా దీర్ఘనిశ్వసనుఁడు హర్షవిహీనుఁడు నష్ట చేతనుఁడు కష్టదశావశుఁడు నయ్యెను.

కం॥ జలనిధి పరువంబునవలెఁ, గలఁతంబడి కలుగరాని ♦ గతి భూపతికిన్
గలిగె నెటోయని తనలోఁ,పల నిటు చింతించె రామ♦భద్రుఁడు భీతిన్. ౪౯౬

పరువము = పర్వదినము-అమావాస్య-పున్నమ.

తా త్ప ర్య ము

పున్నమలయందుఁ గలఁతపడు సముద్రమువలె క్షోభిల్లి రారాని యట్టిస్థితి రాజునకేల కలిగెనని తనలోపలఁ దండ్రి యేమగునో యనుభీతిచే నిట్టులనుకొనెను

ఉ॥ అక్కట నన్నుఁ జూచి ముఖ ♦ మం దిపు డేల వికాస మూనఁడో ?
యొక్కెడ దేనికేన్ గినుక ♦ నూనియు మున్ననుఁ జూచినంతనే
మక్కువ గారవించు, నల ♦ మార్గము దప్పినజాడ దోఁచె, నా
దిక్కును జూచి యిప్పు డతి ♦ దీనతఁ గుందెడి, నేమి హేతువో? ౪౯౭

కినుక = కోపము, మక్కువ = ప్రేమ.

తా త్ప ర్య ము

అయ్యో! నన్నుఁ జూచియు నేల మనస్సున సంతోషింపఁడు? నావిషయ మునఁ గాక మఱియెందైన నేకారణముచేనైన నితరులపై గోపము వహించి నపుడు నన్నుఁ జూచెనా యాకోపమంతయుఁ బోఁగొట్టుకొని శాంతుఁడై సంతో షముతో నన్నుఁ బలుకరించునే. ఇప్పుడాత్రోవ దప్పినది. ఏలన నావంకఁ జూచి కూడ వ్యసనపడుచున్నవాఁడే. దీనికేమి కారణమై యుండునో.

కం॥ అని మది నాలోచించుచుఁ,బెను పగుశోకమున మిగుల♦విహ్వలుఁ డగుచున్
దన మోము వెల్లబాఱఁగ,
ననఘుఁడు భీతాత్మయుక్తిఁ♦ప్రాంజలి యగుచున్. ౪౯౮

పెనుపగు=అధికమైన, భీతాత్మయుక్తిన్=భయపడిన మనస్సుతోఁ గూడిన వాఁడై, అనఘుఁడు=పాపము చేయనివాఁడు, కనుకనే భయము- తొట్రుపాటు.

తా త్ప ర్య ము

అని యిట్లు తనలో నాలోచించుచు శోకాతిశయమున వికలుఁడై తన ముఖము తెల్లఁబాఱఁగా నిర్దోషియగు శ్రీరామచంద్రుఁడు భయపడినవాఁడై నమస్కరించి.

—♦ శ్రీరాముఁడు కైకను దశరథుదుఃఖపాటునకుఁ గారణ మడుగుట. ♦—

ఉ॥ ఉల్లము దల్లడిల్ల వ్యస ♦ నోద్గతిఁ గైకయివంకఁ జూచి యో
తల్లి! ప్రమాదపాటునను ♦ దప్పొకఁ డే నొనరింపఁ దండ్రి, కి
ట్లొల్లఁడు నన్నుఁ జూడ, మొగ ♦ మోడెడుఁ బల్కఁగ నప్రసన్నుఁడై,
చెల్లఁ దదీయకారణముఁ ♦ జెప్పవె, తేర్పవె నీవ యేనియున్. ౪౯౯

ఉల్లము = మనస్సు, మొగమోడెడున్ = నాముఖముఁజూడ నొల్లకున్న వాఁడు, అప్రసన్నుఁడై =కలవరపడుచున్న మనస్సుగలవాఁడై.

తా త్ప ర్య ము

మనస్సు తల్లడిల్లఁగాఁ గైకనుజూచి తల్లీ తండ్రిగారివిషయమున నేనే తప్పైనఁ బొరపాటుచేనైనఁ జేసినవాఁడఁ గాను. అట్లుండియు నన్నుఁజూడ నిష్టములేనివాఁడై యున్నాఁడు. నాతో మాటలాడుటకు ముఖము చెల్లలేదు. మనస్సు శాంతముగాదు. ఏమి చేయుదునమ్మా, దీనికేమి కారణమమ్మా. నీవైన నీయనను జక్కఁజేయుము. శ్రీరాముఁడు బాలుఁడు, మీకుమారుఁడు తెలిసి తెలియక యేదైనఁ దప్పుచేసిన క్షమింపుమని నాకు మాఱుగ నీవైనఁ బ్రార్థింపుము.

ఉ॥ నాపయి నెంతయో నెనరు♦నం జరియించెడు నెప్డుఁ దండ్రి, దా
నోపఁడు మాటలాడ నిపు ♦ డోజననీ! యిది యేమి దేహసం
తాపమొ? చిత్తవేదనయొ? ♦ ధారిణిఁ బుట్టినజీవి రోగసం
తాపముఁ గాంచకుండునె, స♦దా సుఖ మబ్బునె దేహధారికిన్? ౫౦౦

నెనరు = దయ.

తా త్ప ర్య ము

తల్లీ! యెప్పుడు నాపై నెంతో దయగలవాఁడు నాతండ్రి అట్టి వాఁడిపుడు నాతో మాటలాడుటకు నిష్టములేని వాఁడై యున్నాఁడు. ఇదియేమి వ్యాధియా? లేక మనోవేదనయా? భూమి మీఁదఁ బుట్టిన దేహికి శాశ్వతముగా సుఖమే యుండునా? ఏదైన నాధియో వ్యాధియో రావచ్చునుగదా. ఇప్పుడేది వచ్చెను. చెపుము.

కం॥ వినఁడు గదా భరతుని కడ,తనయుని విషయంబునందుఁ♦దా నశుభంబుల్
కనఁడు గదా కీడును నా,జననుల పట్టులను వీత♦సమ్మదుఁ డగుచున్.

కడతనయుని = శత్రుఘ్నుని, వీతసమ్మదుఁడు = పోయిన సంతోషము గలవాఁడు.

తాత్పర్యము

భరతుని విషయమందుఁగాని శత్రుఘ్నుని విషయమందుఁగాని యశుభ వార్త యేదియువినలేదుగదా. సంతోషము చెడునట్టి కీడును నాతల్లులయందుఁ గనలేదుగదా.

కం॥ ఏవిషయ మైనఁ జెప్పినఁ, గావింపక తండ్రి నొవ్వఁ•గా ముహూర్తం బేన్
జీవింప నొల్ల ధర నే, నేవిధి జీవింతుఁ గుపితుఁ•డేనియుఁ దల్లీ. ౧౦-౧౨

నొవ్వఁగాన్ = నొప్పిచెందునట్లుగ, కుపితుఁడేనియున్ = కోపముగల వాఁడాయెనా.

తాత్పర్యము

ఏ విషయము చెప్పినను దానిని జేయక తండ్రిమనస్సు నొచ్చునట్లు చేసి యల్పకాలమైన బ్రతికియుండఁ జాలను. అట్టినేను దండ్రి నావిషయమునఁ గోపించిన నెట్లు బ్రతుఁకఁగలను.

కం॥ సత్యముగఁ దనకుఁ దరణౌ,చిత్యము గల దేహమిచ్చి•క్షితిఁ బ్రోచినయా
ప్రత్యక్ష దైవమున క,ప్రత్యయమతిఁ దండ్రి కెవఁడు•ప్రతిభాషించున్.

తరణౌ చిత్యము = జనన మరణ సాగరము దాఁటిపోవ యోగ్యము, అప్రత్యయమతి = విశ్వాసములేని మనస్సుగలవాఁడు, ప్రతి భాషించున్ = ఎదురు చెప్పును.

తాత్పర్యము

జనన మరణ రూపకమైన యీసంసార సముద్రమును దాఁటిపోవుటకు సాధన మైన దేహమిచ్చి దానిని రక్షించిన మహోపకార పరుఁడై కన్నులకుఁ గానవచ్చు దైవమైన తండ్రికి నెవఁడు విశ్వాసములేక కృతఘ్నుఁడై యెదిరించి పలుకును.

ఈ రెండు పద్యముల వలనఁ దండ్రిమాట వినక కొడు కతనిమనస్సు నొప్పింపరాదనియుఁ బ్రత్యక్షదైవమగు తండ్రిమాట కెదురాడరాదనియు నేర్పడుచున్నది.

ప్రత్యక్షదైవమునకుఁ దండ్రికనుటచే నింద్రియగోచరులుగాని దేవతలఁ బూజించుటకంటె నింద్రియగోచరుఁడగు తండ్రినిఁ బూజించుటసుకరము. పితృ దేవోభవ యని శ్రుతి. తండ్రిదైవమనియే చెప్పుచున్నది.ఇంటగెలువలేని వాఁడు రచ్చనేమి గెలువఁ గలడన్నట్లు ప్రత్యక్షదేవతలఁ గొలువలేని వాఁ డప్రత్యక్ష దేవతల నేమి కొలువఁ గలడు ఇది యవ్యక్తోపాసనమునకంటె వ్యక్తమూర్తి యుపాసనము మేలను నర్థము తెలుపుచున్నది. భ. గీ. ౧౨-౨.

శ్లో॥ యావత్త్రి యస్త్రే, జీవేయు, స్తావన్నాన్యం సమాచరేత్
తేష్వేవనిత్యం శుశ్రూషాం, కుర్యాత్ ప్రియహితే రతః॥ మను. ౨-౨౩౫

తల్లి-తండ్రి-యాచార్యుఁడు జీవించియుండు వఱకు వేఱొకధర్మము వారి యనుమతిలేకచేయరాదు. ప్రతిదినము వారికిఁ బ్రియమై హితమగుకార్యము చేయుచు శుశ్రూష చేయుచుండవలయును.

శ్లో॥ యస్సావయతి యాసూతే, యేన విద్యో పది శ్యతే
జ్యేష్ఠభ్రాతాచ భర్తాచ, పంచై తేగురవస్స్మృతాః॥
ఆత్మనః సర్వయత్నేన, ప్రాణత్యాగేన వా పునః
పూజనీయావిశేషేణ, పంచై తే భూమి మిచ్ఛతా॥
యావత్పితాచ మాతాచ, ద్వావేతౌ జనికారకౌ
తావత్సర్వం పరిత్యజ్య, పుత్రస్స్యాత్త త్పరాయణ॥ శుక్రుఁడు

కన్న తల్లిదండ్రులు, విద్యనేర్పినవాఁడు, అన్న, స్త్రీకి భర్త యీయైదు గురు గురువు లనఁబడుదురు. బాగుపడఁగోరువారీయైదుగురిని సర్వప్రయత్నములఁ దమప్రాణమిచ్చియైనఁ బూజింపవలెను. తల్లిదండ్రులిరువురు తన జన్మమునకు హేతువులు. కావున సర్వమువదలి కొడుకు వారేగతియని వారి కార్యములు చేయుచుండవలెను.

కం॥ ఈవిధి జనకుఁడు వగవఁగ, నీ వభిమానంబుబలిమి ♦ నెగ్గించుచుఁ గో
పావేశంబున నోత,ల్లీ! వఱగొడ్డంబు లాడ ♦ లేదుగ చెపుమా.   ౨౦౪

ఎగ్గించుచు=తప్పులు పట్టుచు, వఱగొడ్డంబు = విష్ఠురపుమాటలు- నిష్ఠురములు. “భీముఁడు వఱగొడ్డము లాడంగ నెట్లు కుడిచెద వధిపా” భాగ.౧.స్కం.

తా త్ప ర్య ము

ఈరీతి తండ్రివగచునట్లుగా నీవు దురభిమానముచేఁ దప్పులుపట్టుచుఁ గోప వశమున నిష్ఠురము లాడలేదుగదా. తల్లీ! చెప్పవమ్మా. ఏమిచేసితివో.

కం॥ నిక్కము వచింపు నృపతికి, నెక్కరణిని వచ్చెఁ బూర్వ♦మెఱుఁగనివ్యథ దా
స్రుక్కెడి నేటికి నీగతి, నక్కటయింతకును మూల♦మాడుము దేవి.   ౨౦౫

నిక్కము=నిజము, మూలము = ఆదికారణము, ఆడుము = చెప్పుము- ఇంతకును మూల మాఁడుము. ఇంతపని చేసితివి గావున నీవు మూలపడి చేసిన యకృత్యమునకు వగచుచు సంతాపాగ్నిచే మాఁడుచుండుము. అనియు నేర్పడును. కైకకు రాఁబోవు గతి యిదియేకదా.

తా త్ప ర్య ము

ఎన్నఁడు లేని వ్యథ రాజున కిప్పుడు రావలసిన కారణమేమి గలిగెను నిజము చెప్పుము. ఏల యిట్లు తపించుచున్నాఁడో దానికిఁ గారణమేమో దేవీచెప్పుము.

కం॥ అనురామ చంద్రుమాటలు, విని లజ్జ దొఱంగి మదిని ♦ వికలత లేక యి
ట్లనుఁ గైక యతనిఁ గనుచును,దనహితమే మదిఁదలంచి♦తగవెంచకెదన్.

తొఱంగి=విడిచి, వికలత లేక = స్థిరచిత్తముతో, తగవు = న్యాయము, ఎదన్ = మనస్సునందు.   తా త్ప ర్య ము

ఆ శ్రీరాముల మాటలువిని కైక భర్త యెదుటనే యతని కప్రియమాడ వచ్చునా యను సిగ్గు విడిచి స్వస్థచిత్తముతో శ్రీరామచంద్రునితో నప్రియ

పెట్లందునని జంకుగొంకు లేక తనహితమేకాని పెద్దపిన్నయను ధర్మము నాలోచింపక యాయనతో నిట్లనెను.

ఉ॥ కోపము లేదు రాజునకుఁ ♦ గోసలరాజతనూజ! మేనికిం
దాపము లేదు, మానసము ♦ సం గలకోర్కి వచింప నీ కెడన్
గోపము వచ్చునో యనుచుఁ ♦ గొంకెడి, నే వచియింతునా? మన
స్తాపము దీఱు రాజునకుఁ ♦ దప్పక నీ వది చేసి తేనియున్. ౫౦౭

తాత్పర్యము

నాయనా! రామచంద్రా! రాజునకు నీమీఁదఁ గోపమేమియులేదు. వ్యాధియులేదు. తన మనస్సున నొక కోరిక యుంచుకొని యది చెప్పిన నీకుఁ గోపము వచ్చునోయని భయపడి చెప్పనులేక చెప్పక యుండనులేక తపించుచున్నాఁడు. ఆయన కోరిక నీవు నెఱవేర్చితివా యాయనకు మనస్సునందలి కుందు తీఱును. చెప్పవచ్చును చెప్పమనినఁ జెప్పెదను.

కం॥ ప్రియుఁడగునీతో నెట్ల,ప్రియమును వచియింతు ననుచు ♦ భీతిల్లుట నా
ల్కయురా దితనికినీతో, నయముగ మాట్లాడ, నందు♦నా యది తనయా?

తాత్పర్యము ౫౦౮

పుత్రకా! ఎంతో నీ వీయనకుఁ బ్రియుఁడవు. అట్టి నీతో నప్రియవార్త యెట్లు చెప్పుదునా యని నీకు భయపడి యుండుకారణముచే నీతోఁ జనవుగఁ బలుకుటకు నాలుకరాకయున్నది. కుమారా నేనది చెప్పవచ్చునా?

ఉ॥ మున్న యొసంగి నాకు వర ♦ ముల్ బహుమానపురస్సరంబుగాఁ
బన్నగ నిప్డు కోరినను ♦ బ్రాకృతునట్టులు గుందుచున్న వాఁ
డన్న! ప్రతిజ్ఞ చేసియు గ ♦ తాంబుల సేతువుఁ గట్టఁ జూచెడి,
న్బన్నమ కాక న్యాయ్య మగు ♦ నా తనమాటయె తాను దప్పఁగన్? ౫౦౯

బహుమానపురస్సరంబుగన్=గౌరవ పూర్వకముగ, ప్రాకృతునట్టులు = పామరజనునివలె, గతాంబులన్=పోయిననీటికి, సేతువు=ఆనకట్ట, బన్నమ = భగ్నశబ్దభవము బన్నము-వ్యర్థప్రయత్నమే.

తాత్పర్యము

అన్నా! రామచంద్రా! మీతండ్రి కృతజ్ఞుఁడై నన్నుఁ బూర్వమెంతో గౌరవించి రెండు వరములనిచ్చెను. వానినే యిప్పుడిమ్మని నేను గోరితిని. అవి యీయలేక మహాత్ముఁడయ్యుఁ బామరువలె నేడ్చుచున్నాఁడు. నీరు పోయిన తరువాతఁ గట్టువేసిన వానివలె ముందు మాట యిచ్చి యిప్పుడు దానిఁ దప్పఁ గొట్ట యత్నము చేయుచున్నాఁడు.దీనివలనఁ దన కవమానమేకాని లాభమేమి గలదు. నాయనా! నీవు చెప్పుము. ముందుమాట యిచ్చి తప్పవచ్చునా? అది న్యాయ్యమా? నేవే చెప్పుము.

ఉ॥ నాయన! ప్రాజ్ఞులెల్ల భువ♦నంబులమూలము ధర్మ మండ్రు, మీ
నాయన నీపయి న్నెనరు ♦ నం, గడు నాపయిఁ గిన్కఁజేసి, తా
నీయెడఁ దప్పకుండు గతి ♦ నీ వయినన్ గురుబుద్ధి మేలుగా
నీ యది కీడు గాని సుత ♦ నెమ్మి నొనర్చెద వేని చెప్పెదన్. ౨౧౦

భువనంబులమూలము = అన్ని లోకములకు నాధారము, నెనరునన్ = ప్రీతిచే, కిన్క=కోపము- రూ. కినుక. గురుబుద్ధి = తండ్రిచెప్పిన మాటగదా మనను నెఱవేర్తమని గొప్పమనస్సు - చేసి నెమ్మిన్=సంతోషముతో.

తా త్ప ర్య ము

నాయనా! పండితులందఱు లోకముల స్థితికి మూలకారణము ధర్మమే యని చెప్పుదురు. అట్టి ధర్మమును నీపయి ప్రేమచేతనో నామీఁది కోపము చేతనో రాజు భంగము చేయకుండ నీవయినను మనతండ్రి చెప్పినమాటమనము సార్థకపఱుపకుండిన నెవరు సార్థక పఱుతురను గొప్ప బుద్ధితో నదిమేలు గానీ కీడుగానీ చేసెదవేని చెప్పెదను.

కం॥ భూపతితలంపుఁ జెప్పెద, నాపలుకులు వ్యర్థముగ నొ ♦ నర్పవ యేనిన్
నీపయి మోమోటను దా,నై పలుకఁడు నీకు నప్రి♦యంబో యనుచున్. ౨౧౧

తా త్ప ర్య ము

నామాట నీవు వ్యర్థము చేయనని చెప్పెదవేని రాజు నభిప్రాయము చెప్పెదను. విన్న తరువాత నీవు చేయవేని నేనుజెప్పి యేమి ప్రయోజనము. నీతండ్రి యిష్టము. నీయిష్టము. నేను చేయిచూపించి యవలక్షణ మనిపించుకొననేల? ఆయనయె యేల చెప్పరాదు. నీవు చెప్పనేల యందువేమో? నీయందలి దాక్షిణ్యముచే నీవు దాని నప్రియముగా నెంతువేమోయని భయపడి చెప్పకున్నాఁడు.

కం॥ ఈకరణిని వచియించిన, కైకం గని కుతిలపడుచుఁ♦గడు రాముఁడు భూ
మీకాంతు సమక్షంబునఁ, బ్రాకటగతిఁ బల్కెఁదనదు♦భావము దెలియన్.
కరణిన్=విధముగ, కుతిలపడుచున్=వ్యసనపడుచు. ౨౧౨

తా త్ప ర్య ము

కైక యీవిధముగాఁ బలుకఁగా శ్రీరాముఁ డాహా యేమి యీమెచిత్తవృత్తి. నాతండ్రి కోరికను నెఱవేర్తునో నెఱవేర్పనో యని యీమె నావిషయమందుఁ గూడ సందేహించుచున్నది కదా యని విషాదపడుచు రాజు వినుచుండ నాయన యెదుటనే తన యభిప్రాయము తెలియునట్లు శ్రీరామచంద్రమూర్తి స్పష్టముగాఁ జెప్పెను.

శా॥ ఇస్సీ తల్లి! యి దేటిమాట, తగవే♦యిట్లాడ నన్ రామునిన్?
లె స్సాయెన్ నృపునాజ్ఞఁ జేసి విను వ ♦ హ్నిజ్వాలకున్ దేహమున్
భిస్సామాత్రముఁ జేసెదన్, విషము లే స్వే ♦ త్రావుదుం, గంధి రం
హస్సంరంభము మీఱఁ జొచ్చెదను, శం ♦ కాతంక మింకేటికిన్. ౨౧౩

వహ్ని జ్వాలకున్=అగ్నిహోత్రజ్వాలలకు, భిస్వామాత్రము=పూర్ణాహారము, ఇచ్చట మాత్రశబ్దము కార్ణ్స్న్యర్థకము, ఉదధిన్=సముద్రమును, రంహస్సంరంభము=వేగాతిశయము, శంకాతంకము=సందేహమువలని భీతి, భాషాజ్ఞానము లేని గ్రామ్యజనులు దీని శంకాటంకమందురు, లేస్పొయెన్=ఇది వ్యతిరేకోక్తి.

తాత్పర్యము

ఛీ యేమి మాటలాడితివమ్మా నీవు. నన్ను రాముని నీవిట్లు పితృవాక్యము పాలించునో పాలింపఁడో యని సందేహించి పలుకుట న్యాయ్యమా. నీవు పలికినది బాగులేదు. రాజాజ్ఞయాయెనా మండెడు మంటలో దుముకుమనిన దుమికెదను విషము త్రాగుమనినఁ ద్రాగుదును. సముద్రములోఁ జొరుమనినఁ జొచ్చెదను. నీవేల సందేహముతో భయపడెదవు.

శ్రీరామచంద్రమూర్తి సద్గుణాతిశయ మీపద్యంబునఁ గననగు. ఇందుఁ దండ్రి యాజ్ఞచేసెనేని యాయన ప్రీతికై మంటలో దుమికెదను.సముద్రములో మునిఁగెదను. విషముఁ దినుమనినఁ దినెదననెను గాని వానిని జంపుమనినఁ జంపెదను వీనిని దండింపు మనిన దండించెదనని చెప్పినవాఁడు కాఁడు. దశరథుఁడు కైక ప్రీతికై గీ॥ చంపఁదగని వానిఁ జంపింతు, నీకుఁగాఁ జంపఁదగిన వానిఁ జాన విడుతు, ధనికుఁ బేదగాఁగ ద్రవ్యాఢ్యుఁగా నిఱు, పేదనేనానర్తుఁ బ్రేమఁ జెపుమ॥ యనెను. ఇరువురకెంత భేదముగలదో చూడుఁడు. స్త్రీదాసు లేపని చేయలేరు? శ్రీరామచంద్రమూర్తి మతమునఁ దన తండ్రి ప్రీతికై తానెన్ని కష్టములయినఁ బడవచ్చును గాని పరుల బాధింపరాదని యేర్పడుచున్నది.

కం॥ భూమిపతి గురువు తండ్రియు, నామే లెదఁ గోరు నెపు డొంనర్తు నభీష్టం
బోమాత! బాసచేసెద, రాముం డిరుమాట లాడంరాఁ డెఱుఁగుమనన్. ౨౪

తాత్పర్యము

ఈయన రాజు. కావున నీయన యాజ్ఞ పరిపాలింప వలసినది విధి. అందు గురువు. హితాహితమును బోధచేసినవాఁడు పెద్దవాఁడు. అందుఁ దండ్రి. అదియును గాక యెల్లవేళ నామేలే కోరుచుండువాఁడు. రాజాజ్ఞయు మీఱరానిది. గుర్వాజ్ఞయు మీఱరానిది. తండ్రియాజ్ఞయు మీఱరానిది. తనమేలు కోరువాని వాక్యము మీఱరానిది. ఇట్లుండ నాలుగు గుణము లొకనియందే యున్నప్పుడు అట్టివాని యాజ్ఞ నేనెట్లు వ్యర్థము చేయఁగలను. కావునఁ దల్లీ! తండ్రి కోరిక తప్పక నెఱవేర్చెదను. రాముఁడు రెండు మాటలవాఁడు కాఁడు. ముందొకమాట వెనుక నొకమాట మాటలాడఁడు. ఇది నీవు తెలిసికో. అని చెప్పఁగా.

—♦ శ్రీరామునితోఁ గైక తన వరములవృత్తాంతముఁ దెల్పుట. ♦—

కం॥ చక్కనినడవడి గలయా, చక్కనిసుతు సత్యవాది ♦ జనవినుతుని నా
టక్కరి జాణెత యిట్లను, నుక్కను గరఁగించి చెవుల ♦ నుంచినమాడ్కిన్. ౨౫

తాత్పర్యము

చక్కని నడవడి చక్కని యాకారము చక్కని నిక్కపు మాటలుగల యీ లోకస్తోత్రపాత్రుఁడైన శ్రీరామచంద్రుని మోసకత్తెయగు నా దుష్టస్త్రీ యుక్కును గరఁగించి చెవులలోఁ బోసినట్టు లీప్రకారము చెప్పెను.

ఉ॥ పూర్వము నిర్జరాసురుల ♦ పోరున నీజనకున్ సశల్యునిన్
గర్వితదైత్యకోటికిని ♦ గైవసముంపడకుండ నేను యు
ద్ధోర్విని గాచితిం గొడుక! ♦ యొప్పుగ నిచ్చె వరద్వయంబు నీ
యుర్విధవుండు తత్ప్రతిగ ♦ నుత్తమశీల! కృతజ్ఞుఁ డౌటచేన్. ౨౮౬

నిర్జరాసురుల=దేవతల రాక్షసుల, సశల్యునిన్=బాణపు ములుకులు దేహముననాటి మూర్ఛపడినవానిని, గర్వితదైత్య కోటికిని = గర్వించిన రాక్షసుల సమూహమునకు, కైవసముంపడకుండన్=స్వాధీన పడకుండునట్లు, యుద్ధోర్విని =యుద్ధ భూమియందు, తత్ప్రతిగన్=దానికి మాఱుగ, కృతజ్ఞుఁడు=చేసిన మేలెఱిఁగినవాఁడు.

తాత్పర్యము

పూర్వము దేవతలకు రాక్షసులకు యుద్ధము జరిగినపుడు రాక్షసుల బాణములు ములుకులు దేహమునందు నాటి యీరాజు మూర్ఛపోయెను. అప్పుడు రాక్షసు లీయనను జంపరాఁగా వారికిఁ జిక్కకుండునట్లు రథము తోలుకొని దూరముగఁ బోయి యీయన ప్రాణమును రక్షించితిని. ఆమేలు తలంచి కొడుకా నీ తండ్రి నాకు రెండు వరంబు లిచ్చెను. ఆరెండు వరములనే యిప్పుడిమ్మని కోరితిని.

కం॥ ఆ రెండువరంబులచేఁ, గోరితి నీతమ్ముఁ భరతుఁ ♦ గువలయపతిఁగాఁ
గూరిమి నొనర్ప దండకఁ, జేరఁగ నీ విపుడ చనఁగ♦శ్రీరఘురామా. ౨౮౭

కువలయ పతి = భూచక్రపతి- రాజు.

తాత్పర్యము

ఆరెండు వరము లేవందువా- నీ తమ్ముఁడు భరతునకు బట్టాభిషేకము చేయుట యొకటి. రెండవది నీ విప్పుడే దండకకు వెడలిపోవుట.

కం॥ నీతండ్రికి నీకును వి,ఖ్యాతిగ బొంకొదవకుండఁ ♦ గాచుకొనెద వేన్
సీతానాయక! విను సం,ప్రీతిన్ నాపలుకు దీర ♦ నృపతి కుమారా! ౨౮౮

తాత్పర్యము

నీతండ్రి నాకీవరములిచ్చెను. నామాట తండ్రిమాట పాలించెదనని నీవు చెప్పితివి కావున నీతండ్రికి నీకు నసత్యదోషము రాకుండఁ గాపాడుకొనఁ దలఁచితివేని నామాటలను దుదముట్టఁ బ్రీతితో వినుము. నీ వీరాజు కుమారుఁడ వయితివా యా ప్రకారము నెఱవేర్పుము.

సీ॥ అన్న! నాయాడిన•వన్ని వింటివి గదా, జనకువాక్యము దప్పఁజనకు మయ్య
పదునాల్గువర్షముల్•బహుళాటవులయందు, సంచరింపఁగ నిప్డ•చనఁగదయ్య
నీయభిషేకంబు•నెఱవేర్పఁ గూర్చిన, వస్తువుల్ భరతుకై•వలయు నయ్య
పట్టాభిషేకసం•భ్రమ మంతయును వీడి,
జడలుఁ జర్మముఁ దాల్చి•నడువవయ్య. ౩౧౮

తే॥ వివిధ రత్న సమాకీర్ణ • విపులవిభవ
యుక్తరథగజవాజిసం • సక్తమైన
కోసలపురంబునందు నా • కొడుకు భరతుఁ
డొప్పుగ నృపాలుఁ డయి యేలు • చుండుఁ గాక. ౩౧౯

బహుళాటవులయందున్=అనేకములైన యడవులందు, వివిధరత్న...
కోసలపురంబునందున్=నానామణులచే కూడిన విస్తారమైన యైశ్వర్యముతోఁ
గూడిన రథములు ఏనుఁగులు - గుఱ్ఱములుగల యయోధ్యాపురమునందు.

తాత్పర్యము

అన్నా నామాటలు వింటివిగదా. నీవు చేయవలసినదేమనఁగా. తండ్రి
వాక్యము తప్పిపోవఁ జేయకుము. పదునాలుగేండ్లు నానారణ్యములందు సంచా
రముచేయ నిపుడే పయనింపుము. నీయభిషేకమునకై కూర్చినవస్తువులన్నియు
భరతునకుఁ గావలయును. ఈ పట్టాభిషేక వేషము ప్రయత్నమునంతయు విడిచి
జడలు కృష్ణాజినము ధరించి తరలిపొమ్ము. నానావిధములయిన రత్నములతోఁ
గూడిన సంపద గలిగి రథములు ఏనుఁగులు గుఱ్ఱములు వీనితోఁగూడిన యీ
యయోధ్యయందు నా కొడుకు భరతుఁడు రాజై పాలింపనిమ్ము.

చం॥ అతులదయాళుఁ డైన వసు • ధాధిపుఁ డీవరయుగ్మ మిచ్చియు
న్మతి చెడినట్టు లార్తి వద • నం బిటు వెల్వెలఁ బోవుచుండ నీ
గతి నినుఁ జూడ నోడె నన • ఘవ్రత! యీతని మాటఁ జెల్లి యీ
క్షితిపతి సత్యవాది యను • కీర్తిని నిల్పి తరింపఁ జేయుమీ. ౩.౨౦

అతుల దయాళుఁడు=అసమానదయగలవాఁడు రూ. దయాళువు. బి
దయాళురు, వరయుగ్మము=రెండువరములు.

తాత్పర్యము

నాయందు మిక్కిలి దయచేరాజు నాకీ రెండువరములు మున్దిచ్చికూడ
నిపుడు మతిచెడిన వానివలె దుఃఖపడుచు ముఖము వెల వెలఁబోవనేడ్చుచు
నిన్నుఁ జూచుటకు భయపడుచున్నాఁడు. దోషరహితమైన వ్రతముగలవాఁడా
నీకు వ్రతభంగము రాకుండఁ జేసికొనెదవేని యీయన మాట నెఱవేర్చి
శ్రీరాముని తండ్రి సత్యవాదియని కీర్తిని నిలిపి యితనిఁ దరింపఁ జేయుము.

ఉ॥ ఈవిధ మైననిష్ఠురము۰లెన్నియు పల్కిన ధీరబుద్ధి శో
కావిలతం గనండు మది۰యందున యే నిసుమంతయేని, భూ
మీవిభుఁ డంతయు న్విని స౦మిద్ధవియోగమహాగ్నిఁ గ్రాఁగుచున్
వావిరి తాపవేగమునఁ۰బల్లటిలెన్ సుతశోకతప్తుఁ డై. ౨౧

నిష్ఠురములు=పరుసపుమాటలు, ధీరబుద్ధి=చలింపని మనస్సుగలవాఁడు, శోకావిలతన్=శోకముచేఁ జెదరిన మనస్సుగలవాఁడు, ఇసుమంతయేని=కొంచె మైనను, ఇసుమంత=ఇసుము + అంత = ఇసుమునంతయని యుండవలెను- కొన్నిచోట్ల షష్ఠీ సమాసమునం దుకారంబున కచ్చు పరంబగునపుడు నుగా గమంబునకు లోపంబగు- ప్రౌ. వ్యా॥ సంధి. ౧౦ సూ. సమిద్ధ=మిక్కిలి ప్రకా శించు, మహాగ్నిన్=రాఁగలయెడఁబాటు అనునగ్ని, క్రాఁగుచున్=కాలుచు.

తాత్పర్యము

రామచంద్రా! మీ తండ్రి సమాచారము నీవెఱుఁగవా. ప్రతిష్ఠ కుఁగా ముందు నీ వేనడిగిన నిచ్చెదనని ప్రమాణముచేసి చెప్పనేల? అడిగినమీఁద నియ్యవలసివచ్చెనేయని ముఖమున గుడ్డవేసికొని గోలు గోలున నేడువనేల? ముందునాకు వరము లిమ్మని నేనడిగితినా బలవంతపెట్టితినా? తానేకదా తన కృతజ్ఞత ప్రకటింపనిచ్చెదనని చెప్పెను. అవినాకేమి తేరకిచ్చుచున్నాఁడా? తన ప్రాణము రెండుమార్లు కాపాడితినే. అదియైన నెంచఁ బనిలేదా? విశ్వామిత్రుఁడు వచ్చినపుడిటులే యేదైన నడుగు మిచ్చెదననెను. నిన్నుఁదనతోడఁ బంపుమని యడిగిన నేడ్వఁ బ్రారంభించెను. ఆయన మగవాఁడు. మహాత్ముఁడు. కావునఁ గోపించియో శపింతునని భయపెట్టియో నిన్నుఁ బిలుచుకొనిపోఁగలిగెను. నేనాఁడు దాన నేమిచేయఁగలనని యిట్లు దొంగయేడ్పు లేడ్చుచున్నాఁడని యీ విధ ముగానెన్నియో నిష్ఠురములాడఁగా శ్రీరామచంద్రుఁడు ధీరబుద్ధి గావున నైశ్వ ర్యము గోలుపోవుటయేగాక యడవులకుఁ బోవలసివచ్చెఁగదాయని కొంచెమైన మనసు నందైన శోకముచే వ్యాకుల మందినవాఁడు కాఁడు. కైక పలికినమాట లన్నివిని దశరథుఁడు శ్రీరాముఁడిఁక నడవులకుఁ బోవునే యెట్టు లాయన నెడఁ బాసియుందునా యని మంటలోఁబడి పొరలినట్ల తాపాతిశయముచేఁ బుత్ర శోకముచే నార్తుఁడై తల్లడిల్లి తెల్లఁబోయెను.

—♦ ౧౯-వ సర్గము. అరణ్యమునకుఁ బోవ శ్రీరాముఁ డంగీకరించుట. ♦—

చం॥ మరణసమానముల్ సవతి ♦ మాతనుడుల్ గడునప్రియంబు లా
పరబలమర్దనుండు విని ♦ భానమునం దొకయింతయున్ వ్యథా
భరమున గ్రుక్క కిట్లనియె ♦ భామిని కైకకు, నింతమాత్రకా
నరపతి దుఃఖ మందెడిని ♦ నన్నని పల్కఁగ నొల్ల కక్కటా? ౨౨

మరణసమానముల్=మరణకాలమునందుఁ గలుగు వేదనవంటి వేదన కలి గించునవి,కటుకన్=మిక్కిలి అనిష్టములు- సాధారణముగా లోకులకునని భావము.

పరబల మర్దనుండు = శత్రుసైన్యములను సంహరించువాఁడు- ఇట్లనుటచే వలయునని కోరినచోఁ దన పట్టాభిషేకము విఘ్నముచేయఁ బూనిన వారినంద ఱను ససైన్యముగా సంహరించి రాజ్య మాక్రమింప శక్తిగలవాఁడని భావము. భామిని=కోపముగలది.

తాత్పర్యము

మఱియెట్టి వారికైనను మరణకాలమందలి వేదనవంటి వేదన కలిగింపఁ జాలు నప్రియములైన యామాటలువిని శత్రుబలహరణ దక్షుండైన యారామ చంద్రుఁడు మనసునందైనఁ గొంచెమైన వెతపడక తన్ను కోపించిపలుకుచున్న కైకను జూచి యింత మాత్రముసకా మాతండ్రి నన్నుఁజూచి పలుకక దుఃఖపడు చున్నాఁడు.

కం॥ జడలను దాలిచి నారల, నెడపక ధరియించి తల్లి!♦యిప్పుడ చనుదున్
బెడిదపుటడవులకును నృపు,నుడువుల సార్థకముఁజేయ♦నూల్కొనువాఁడన్.
నూల్కొనువాఁడన్=పూనుకొనువాఁడను. ౫-౭౩

తాత్పర్యము

తల్లీ! యిదిగో నిపుడే జడలు ధరించి నారవస్త్రములుగట్టుకొని భయంకరము లైన యడవులకుఁబోయి మాతండ్రిమాటలు యథార్థపడఁ జేయువాఁడను.

ఉ॥ నా కిది చెప్పవమ్మ జన♦నాయకుఁ డేటికి మున్ను వోలె నా
రాకకు నన్నుఁ జూచియును ♦ రంజిల నోపఁడు, నీసమక్షమం
దే కలభంగిఁ జెప్పెద, ని♦దే వనిఁ జీరజటాధరుండనై
నీ కెదఁ బ్రీతిగాఁ జనెద♦నెమ్మది నూఱడు మల్క మానుమీ. ౫-౭౪
కలభంగి=ఉన్నవిధము- వాస్తవము.

తాత్పర్యము

ఆవిషయమై నీవాలోచింపవలసినపనిలేదు గాని నాకొక విషయము మాత్రము చెపుము. రాజేల నేను వచ్చియెదురుగ నిలువఁబడి పల్కరించినను పూర్వము వలె సంతోషింపక దుఃఖపడుచున్నాఁడు. నీవు చెప్పినది యల్పవిషయము. వానికై దుఃఖింపవలసిన పనిలేదు. కావున దుఃఖపడుటకు వాస్తవ కారణమేమి చెప్పుము. నే నడవికిఁబోక తిరుగుపాటు చేయుదునేమోయని దుఃఖించుచున్నాఁ డనెదవా. అట్లైన నున్నదున్నట్లు చెప్పెదవినుము. ఇదిగో నీగడియయందే జడలు నార చీరలు ధరించి నీకు సంతోషముగాఁ బోయెదను, మదిలో నూఱట నొం దుము. నిష్కారణముగ నాయన మీఁదఁగాని నామీఁదఁగాని కోపపడకుము.

కం॥ హితుఁ డఁట మఱి జనకుం డఁట,
కృతజ్ఞుఁ డఁట గురువును నఁట♦నృపతియునఁట స
మ్మతి నమ్మి చేయు మన్నను,
క్షితి బ్రదికియు నేల ప్రియముఁ♦జేయక యుందున్. ౫-౭౫

తాత్పర్యము

రాజ్యాభిషేకము చేసికో రాజభోగము లనుభవింపుమని ప్రియముచెప్పిన సరియే యంటివిగాని యడవికిఁ బొమ్మని యప్రియమాడిన నీవు చేయుదువని నమ్ముటెట్లు? అనెదవా. అది యాజ్ఞాపించినవాఁడెవఁడు? ఇది యాజ్ఞాపించిన వాఁడెవఁడు? రెండు విషయముల నాజ్ఞాపించినవాఁడు, నామేలు కోరువాఁడు, నన్నుఁగన్నతండ్రి, కృతజ్ఞుఁడు, గురువు, రాజునగువాఁడుగదా. నాయం దన్ని విధముల వాల్లభ్యము గలిగి నీవీకార్యము చేయవలసిన దన్నప్పుడు నేనేకార్య మైనఁ జేయకుందునా? పట్టాభిషేకమనునది తండ్రిరాజు హితుఁడు నగు గురువు నాజ్ఞ కావున శిరసావహించెదను. తండ్రియాజ్ఞ నెఱవేర్చుట నాకు విధిగాని యది నాకుఁ బ్రియమా యప్రియమా యని విచారించు నధికారము నాకులేదు. కడి యనిన నోరు దెఱచి కళ్ళెమనిన నోరుమూయు గుఱ్ఱము నేమందురు? కావునఁ దండ్రికోరిన దాని నాదేహములో నూపిరియుండఁగా జేయకయుందునా?

ఉ॥ ఒక్కటికిం దపింతు నది•యుల్లముఁ గ్రాఁచెఁడిఁ జూడఁ జూడఁగా,
నక్కట తానుగా నృపతి•యాదట నన్బిలిపించి నాయనా!
మక్కువ చేసెదన్ భరతు•క్ష్మాధవుఁ జేయఁగ నంచుఁ గూర్మి పెం
పెక్కఁగ నొక్కమాట యనఁ•డేయపరాధ మొనర్చినాఁడనో. ౨-౨౬

తాత్పర్యము

పట్టాభిషేకము చేసికొను మన్నప్పుడు నేను బొంగనులేదు. ఇప్పుడునేను గ్రుంగనులేదు. కాని యొకవిషయము మాత్రము నాకు విచారము గలిగించు చున్నది. అది యేదంటివా. ఈమధ్యవర్తులతోఁ బనిలేక తానుగా నన్నుఁబిలి పించి నాయనా భరతునకుఁ బట్టాభిషేకముచేయ మక్కువపడుచున్నాను. అని నామీఁదఁ బ్రీతిగలవాఁడై యొక్కమాట చెప్పకపోయెను. జూచితివా నాయం దెంత నమ్మకము ప్రీతి లేదాయెను? ఇటు నన్ను నమ్మరాకుండుటకు నేనేమి నేరము చేసితినో కదా యని తపించెదను.

చం॥ భరతున కెంతొవేడ్క బహు•భాష లవేటికి మున్నె జానకిన్
ధరణిని బ్రాణంబున్ ధనవి•తానము నీయఁగ లేనె నేనుగా?
ధరణిపుఁ డంతె కాక మఱి•తండ్రియుఁ దానుగఁ గోర, నీకు ము
త్కరముగఁ జేయ కుండుదునె•తల్లిరో! నాదు ప్రతిజ్ఞ ప్రీతితోన్. ౨-౨౭

ధనవితానము=ధనసమూహము, ముత్కరముగన్=సంతోషకరముగ.

తాత్పర్యము

అమ్మా! యేల పెక్కుమాటలు, దీనికై యిన్నిదినాలేల కాచికొని యుండ వలె. వివాహకాలమందే సీతను భూమిని బ్రాణములను సంపదను అన్నియును రామా! భరతునకిమ్మని రాజనియుండిన భరతునికెంతో సంతోషముగ నేనేయిచ్చి

యుండనా? ఇంత వ్యవహారము కావలయునా? ఈయన రాజుమాత్రమే కాక తండ్రియునుగదా. అట్టివాఁడు కోరినప్పుడు తల్లివగు నీకు సంతోషముగ నా ప్రతిజ్ఞ నేను దీర్పకుందునా?

చం॥ ధరణిపుఁ దేర్ప వమ్మ వసు•ధాగతలోచనుఁ డౌచు బాష్పముల్
గురియుఁగ నేల దుఃఖపడ,•గొబ్బున మాతులునింటికిన్ సుతున్
భరతునిఁ దేర దూతలను•బంపుము రాజు ననుజ్ఞఁ, గాన కే
నరిగెదఁ దండ్రి చెప్పఁ డను•నంకిలి పెట్టను, నొప్పు దప్పనన్. ఇ ౨౮

తేర్పుము=సమాధానపఱిచి సంతోషపెట్టుము, వసుధాగతలోచనుఁడు=భూమి యందు దృష్టులు నిలిపినవాఁడు,ఇప్పుడు దశరథుఁడు తలవంచుకొనికూర్చుండి యున్నాఁడు. మాతులునింటికిన్=మేనమామయింటికి, తేరన్=పిలుచుకొని వచ్చుటకు, అంకిలి=అడ్డము.

తల్లీ! నీభర్తను నీవు సమాధాన పఱుపుము. నేల చూపులు చూచుచుఁ గన్నీరుగాఱ దుఃఖపడవలసిన కారణమేమున్నది. రాజాజ్ఞ తీసికొని మేనమామ గారి యొద్దకు భరతుని పిలుచుకొని వచ్చుటకై దూతలనంపుము. నేనడవికిఁ బోయెదను. నాకుఁ దండ్రిచెప్పలేదే నీవెవతెవు చెప్పుటకు నీమాటలు నిజమో యబద్ధమో యని యడ్డము చెప్పను. ఇది తప్పు. అది యొప్పు అని ధర్మా ధర్మ విచారముఁకూడఁ జేయను.

చం॥ అనురఘురామువాక్యముల•కాత్మ నితాంతము సంతసించి యా
వనితయు నట్ల చేసెదను•బంపెద దూతలఁ దోడితేర నా
తనయునిఁ, గాలయాపనముఁ•దాళను, నాసుతువార్త లేటికిన్?
వనముల కీవు తర్లు మెడ•పల్కక, సంతనకట్టు పోకకున్. ఇ ౨౯

ఎడపల్కక=అడ్డము చెప్పక, పోకకున్=అడవికిఁ బ్రయాణమగుటకు, సంతనకట్టుము=ప్రయత్నముచేసి సిద్ధపడుము.

తాత్పర్యము

అని శ్రీరాముఁడు చెప్పఁగా గైక సంతోషించి యాయనతో నిట్లనియె, నీవు చెప్పినది బాగున్నది. భరతుని బిలుచుకొనివచ్చుటకు దూతలను పంపెదను గాని నీవీముచ్చటలతోఁ గాలముగడుపుట సహింపలేను. నాకొడుకు ముచ్చటలు నీకేల? నీత్రోవన నీవుపో. నాకొడుకు వచ్చిన నేమి? రాకున్న నేమి? పిలిపింతునో పిలిపింపనో నీకేల యాజోలి? ఆనెపముపెట్టి కొన్నాళ్ళు నిలువఁ జూచుచున్నావా? అతఁడు వచ్చిన హింసింపఁ జూచుచున్నావా? నీవంతకాల మిచ్చట నుండరాదు. అడ్డము చెప్పక నీవిపుడే యడవులకుఁబొమ్ము. దానికేమి కావలయునో యాప్రయత్నములు సేయుము.

ఉ॥ సిగ్గున నీదుతండ్రి తమిఁ జేయఁడు చూపలు కాడ, దానఁ దా
సగ్గిసముగ్గిసల్ గొనెడిఁ జాలఁగ దైన్యముపేర్మి, దాని నీ
వెగ్గుగఁ జూడఁ బోకు వనికి వటుపోయెడిదాఁక ఱేఁడు దా
నిగ్గతిఁ గూడు నీళ్ళు గొనకేని యిలం బడియుండు నంచనన్. ౨౩౦

తాత్పర్యము

నీతండ్రి నీతోఁ బలుకకుండుటకుఁ గారణము తానీవిషయము నీతోఁజెప్ప సిగ్గుపడియేకాని యితరముకాదు. ఆకారణముచే మిక్కిలి దీనత్వముచేఁ జెప్ప లేక చెప్పక యుండలేక తనపీడ నామీఁదఁబోనీలే అదే చెప్పనీలే శ్రీరాముఁడు దానినే కోపగింపనీలే. లోకులు దానినే తిట్టనీలే యని గిజగిజలాడుచున్నాఁడు. నాయనా అదియొక తప్పుగానీవెంచి యాయనమాటలాడవలె నేను బోవలె ననఁ బోకుము. అడవికి నీవు పోవువఱకు రాజుగారు కూడుతినరు నీళ్లుత్రాగరు. ఈ విధముగ బిగించుకొనియుందురు. నీవుపోయిన పిమ్మట మరల యథాప్రకారము నవ్వుచుఁ బ్రేలుచునుందురు.

చం॥ చెలి నుడు లాలకించి, పతి భీ యిది యెంతటికష్ట మంచు లోఁ
గలఁక వహించి శోకమునఁ గ్రాఁగి, శయంబున సొమ్మసిల్లుడున్
బలియుఁడు లేవనెత్తి, సతి పల్కెడుమాటల కడ్డ యోజనన్
జలిపె వనాళికిం జనఁ గశాభృశతాడితఘోటకం బనన్. ౨౩౧

ఆలకించి=విని, పతి=దశరథుఁడు, శయంబునన్=పడుకమీఁద, శయ్యా యందు, సొమ్మసిల్లుడున్=మూర్ఛపోయిపడఁగా, కశాభృశతాడిత ఘోటకంబు =కొఱడాచేఁ దీవ్రముగఁ గొట్టఁబడిన గుఱ్ఱము.

తాత్పర్యము

కైకపలుకులు విని దశరథుఁడు నానిజమైన యభిప్రాయమేమి యిది చెప్పెడి విధమేమి? అదిగాదని చెప్పలేని నాదుర్దశయేమి? ఇంతమాత్రము చెప్పుటకు నాకునోరులేదాయెఁగా? యెంతటి కష్టదశ ప్రాప్తించెరా దేవుఁడా! యని తనలో కలఁతపడి బైటజెప్పలేక శోకమున మాఁడి సహింపలేక శయనము మీఁద మూర్ఛిల్లిపడెను. అప్పుడు బలశాలియగు శ్రీరామచంద్రుఁడు లేవనెత్తి కూర్చుండఁబెట్టి కైక పలికెడి నిష్ఠురోక్తులు సహింపలేక కొఱడాదెబ్బతినియు నిలువఁ జాలని యుత్తమాశ్వమువలె నొకనిమిషమైన నుండనొల్లక యడవి కపుడేపోవ నాలోచించెను.

కం॥ ఆచెడుగు దన్నుఁ బలికిన, వాచానారాచములకు వగఁ జెందక సీ
తాచపలాక్షీపతి యా,పాపపుసతి కనియెఁ దనదు భావము దెలియన్. ౨౩౨

చెడుగు=దుష్టస్త్రీ, వాచానారాచములకున్= బాణములవంటి మాటలకు, వగ=వ్యసనము.

తాత్పర్యము

భరతునిరాక నెపముపెట్టి, యడవులకుఁబోక కాలహరణముఁజేసి యతఁడు వచ్చినతరువాత నతని నేనేమోచేయనున్నానని యిటువంటి కుచ్ఛితపు మాటలాడిన కైకయొక్క మాటలను బాణములదెబ్బకు వ్యసనపడక కాముకులకిది స్వభావగుణమే వారిదోషమేమియున్నది. ఇందు లోకవిరుద్ధము శాస్త్రవిరుద్ధమేమి లేదని తన్ను దానే సమాధానపఱిచికొని శ్రీరామచంద్రుఁడాపాపాత్మురాలికిఁ దనభావము దెలియ నిట్లనియె.

చం॥ అతివ! ధనార్జనంబ పర♦మార్థముగాఁగఁ దలంపఁ బోను, నీ
క్షితి నిలువంగ నైనఁ దమి♦సేయఁ జుమీ, నిజ మీ వెఱుంగుమీ,
యతులితసత్యధర్మనియ♦మైకరతిం జరియించుసంయమి
వ్రతతులతోడ సాటి నని♦బాగుగ నిల్పుము దేవి! నీమదిన్. ౨౩౩

ధనార్జనము=ధనము సంపాదించుట, పరమార్థము= పురుషార్థములలో ముఖ్యమైనది, అతులిత=సమానములేని సత్యధర్మనియమైకరతిన్ = సత్యము ధర్మమునను నియమమందేప్రీతిచే, సంయమివ్రతతులతోన్=ఋషులసమూహముతో.

తాత్పర్యము

తల్లీ! నేను ధనకాంక్షచే రాజ్యముఁవిడిచిపోవుట కిష్టములేక జాగుచేయుటకై నెపములు చెప్పుచున్నానని నీవభిప్రాయపడుచున్నావు. ధనము సంపాదించుట నామతమున నుత్తమపురుషార్థముగాదు. ఈభూమియందుండుటకైన నాకిష్టము లేదు. ఇది సత్యమని నీవు తెలిసికో. అటయిన నీవు దేనిఁ బరమార్థమని తలంతు వందువా? సత్యధర్మనియమములందే యభిలాషగల ఋషులతో సమానుఁడని దృఢముగ మనస్సున నిలుపుము. వ్యర్థసందేహములచే బాధపడకుము.

ఇచ్చట శ్రీరామచంద్రమూర్తి యర్థమును గేవలము నిరసించెనని కొందఱందురు. అది సరిగాఁ దోఁపదు. శ్రీరామచంద్రమూర్తి సన్న్యాసిగాఁడు. గృహస్థునకు నర్థము త్యాజ్యముకాదుకాని ధర్మమునకు నర్థమునకు విరోధము వచ్చియొకటి విడువవలసివచ్చినపుడు ధర్మమునే గ్రహించి యర్థమును బరిత్యజించుననిభావము అర్థమును నిరసించిన రాజ్యమేమి యేలఁగలఁడు.

శ్లో॥ "ఊర్ధ్వ బాహుర్విరోమ్యేష, నచ కశ్చిచ్ఛృణోతిమే
ధర్మా దర్థశ్చ కామశ్చ, సకిమర్థం నసేవతే" భారతసావిత్రి

ధర్మమువలననే యర్థము ధర్మమువలననే కామము కలుగును. వానికై ప్రత్యేక ప్రయత్నము చేయవలసిన పనిలేదు. అని నేను జేతులెత్తి యేడ్చినను నామాట నొకఁడు వినఁడు. ఇది వ్యాసవాక్యము.

ఉ॥ ధర్మపథం బొకండె తనుఁ దప్పక కొల్చెడి వాని కెప్పుడున్
ధర్మము నర్థకామములఁ దప్పక కూర్చు నిజం బదెట్లనన్
ధర్మణియైన భార్య గడు ధర్మముఁ గూరుచుఁ బ్రేమఁ గామపున్
శర్మముఁ గూర్చు నర్థమును సత్సుతుమూలముగాఁగఁ గూర్చెడిన్.

అయో. ౨౯-౨

ఇది రామచంద్రమూర్తి యభిప్రాయము అనుష్ఠానముచే దృఢపఱిచెను. దానినే వ్యాసులు చెప్పెను. లక్ష్మణుఁడర్థప్రధానవాది. అర్థముండిన ధర్మము కామము లభించునని యీయన వాదము. ఈవిషయమున యుద్ధకాండమున ౧౯౩-౨ మొదలు ౧౯౬౦ వఱకుఁజూడుఁడు.

అర్థకామములకంటె ధర్మమే ముఖ్యమనుటకు "పరిత్యజేదర్థకామౌ। స్యాతాం ధర్మవివర్జితౌ॥ మను। పరిత్యజ్యేదర్థకామౌ, ధర్మపీడాకరౌ నృప। వి.పు.

తండ్రి నసత్యవాదిగఁజేసి రాజ్యము గ్రహింపవలయునా? తండ్రిని సత్యవాదినిఁజేసి రాజ్యమువదలవలయునా యను ప్రశ్న రాఁగా శ్రీరామచంద్రమూర్తి పితృవాక్య పరిపాలన మనుధర్మమునకై రాజ్యమును వదలుటయే సరియైన కార్యమని తలఁచెనని యేర్పడుచున్నది.

చం॥ ఇది యన నెంత? దేవి! విను మీ ప్రియ మెయ్యదొకండు తండ్రికిన్
మదిగొని చేయఁ గల్గినను మానక ప్రాణము లిచ్చియైన నే
నది యొనరించినాఁడ నెటులైనను, దండ్రిసపర్యకంటెఁ ద
ద్గదితము దీర్చుకంటె ధరఁ గల్గునె మేలగుధర్మ మేదియున్? ౨౩౪

సపర్య=శుశ్రూష, తద్గదితము=అయనచేఁ జెప్పఁబడినది.

తాత్పర్యము

అడవులకుఁ బోవుటదొడ్డ కష్టకార్యమని నీవు తలంచినట్లున్నది. అదియెంతటి కార్యము? అది నాకొక లక్ష్యమా? తండ్రికిఁ బ్రియమైన కార్యము చేయవలసి వచ్చెనేని యది నాప్రాణమిచ్చియైనఁ జేసినవాఁడనే. అంతటి పట్టుదల యేల యందువా? అది యాయన నుద్ధరింపఁగాదు. తండ్రిసేవకంటెఁ దండ్రిమాట ప్రకారము వర్తించుటకంటె శ్రేష్ఠమైన ధర్మము వేఱొకటి పుత్రునకులేదు. అది చేయక తక్కినవెన్ని ధర్మములు చేసినను వ్యర్థములే. కావున నన్నుద్ధరించు కొనుటకై నేను బోయెదను.

కం॥ జనకుఁడు పొమ్మన కున్నను, నీమాటఁ బట్టి చనియెద నిపుడే
వనములఁ బదునాల్గేఁడులు, గొనకొని వసియింప నీదు కోరికఁ దీర్పన్. ౨౩౫

తాత్పర్యము

కావున భరతుఁడువచ్చువఱకు నిందు నిలుతునని తలంపకుము. అంతియ కాదు. నాతండ్రియాజ్ఞ యెట్టిదో తల్లియాజ్ఞయు నట్టిదే. కావున నీవు చెప్పినదే చాలునని పదునాలుగేఁడులు అడవుల యందుండ నీకోరికఁ దీర్పఁబోయెదను.

కం॥ బలవంతపెట్టి భూపతి, నలయించితి వొక్కమాట•ననవైతివి నా
కిల నీశ్వరతర వయ్యును, దెలియఁగ లేవైతి నాదు•ధీగతి గుణమున్.

అలయించితివి=ప్రయాసపెట్టితివి, ఈశ్వరతర=నన్ను శాసించుటయందుఁ దండ్రికంటె నెక్కువ యధికారముగలదానవయ్యు, తండ్రికంటె నూఱింతలు తల్లియెక్కువనిగదా శాస్త్రము. ధీగతి=బుద్ధివిధము.

తాత్పర్యము

రాజును బలవంతపెట్టి యాయనచేఁ జెప్పింపవలయుననని యాయనను వృథా బాధపెట్టితివి. రామా నాయభిప్రాయమిదిమని యొక్కమాట నాతోననవైతివి. రాజు నాకీశ్వరుఁడు శాసింపదగినవాఁడు. నీవో యీశ్వరిగావు కేవలమీశ్వరవు గావు. ఈశ్వరతరవు. అదిగాని నేనెవరిపట్ల నెట్టియభిప్రాయము గలవాఁడనో యదిగాని నాయౌదార్యాది గుణములుగాని యిన్నాళ్లుగానన్నుఁ జూచు చుండియుఁ దెలిసికొన లేవైతివి.

కం॥ తల్లి యనుజ్ఞంగొని నా,వల్లభ నూరార్చి వచ్చు•వఱకు విళంబం
బిల్లమున సైఁపు మిదె నీ కుల్లాసముగాఁగ నడవి•నుండఁగఁ బోదున్. ౨౩౪

తాత్పర్యము

సందేహింపకుము. భయపడకుము. నాతల్లి యాజ్ఞ తీసికొని నాభార్యకుఁ దెలియఁ జెప్పివచ్చువఱకునగు కాలవిళంబనము సైఁపుము. నీకు సంతోషముగా నిదిగో నడవులనుండఁ బోయెదను.

కం॥ భరతుఁడు రాజై తండ్రికి, గురుమతి, శుశ్రూషసేయ•గుఱుకొనునట్టుల్
వరమతిఁ దెల్పుము తల్లీ, ధరణి నిది సనాతనంపు•ధర్మము కైకా. ౨౩౭

తాత్పర్యము

భరతుఁడురాజై తండ్రి గురుఁడను భావముతో సేవచేయునట్లు మంచి బుద్ధితో జెప్పుము. ముసలివాఁడు వానితో నీకు గావలసినదేమి? వేసినదింత తిని పడియుండుమనులే యని చెప్పకుము. ఏలయందువా యిది సనాతనధర్మము. సంపాదించువాఁడైనను వయసువాఁడైనను ముసలివాఁడైననుదండ్రితండ్రియే

కం॥ అనురాముని వచనంబులు, విని దుస్సహశోకభార•వేగంబునఁ ద
జ్జనకుఁడు వావిడిచి మహా,స్వనమున నావఱచినట్లు•పలవింపంగన్. ౨౩౮

దుస్సహశోకభారవేగంబునన్=సహింపరాని శోకాతిశయముయొక్క వేగమున, వావిడిచి=నోరుదెఱచి బాయని మహాస్వనమునన్=పెద్దగొంతుతో, ఆవు అఱచినట్లు.

తాత్పర్యము

శ్రీరాముఁడు చెప్పిన ధర్మవాక్యములు విని సహింపరాని శోకబలమున మనస్సు నిబ్బరించుకొనలేక నోరుదెఱచి గట్టిగఁ బెద్దగొంతుతో దూడ కానరాన పుడు ఆవు అఱచునట్లు ఏడ్చెను.

—♦ శ్రీరాముఁడు కౌసల్యాగృహమునకుఁ బోవుట. ♦—

చం॥ వలగొని మ్రొక్కి తండ్రికిని♦వందనమాజగజంత కైకకున్
సలిపి సురోచి యంతిపురి♦చయ్యన వెల్వడి యశ్రుపూర్ణదృ
క్కుల ననుజుండు వెన్కొనఁగ♦క్రోధసముజ్జ్వలితాంతరంగుఁడై;
వలనుగ నాభిషేచనిక♦భాండములన్ వలగొంచు రాముఁడున్. ౨౮౦

వలగొని=ప్రదక్షిణించి, జగజంత=గయ్యాళి, సురోచి=మంచి తేజము గలవాఁడు. దీనిచే రామచంద్రమూర్తి మనస్సునందైన వ్యసనపడలేదని యేర్పడుచున్నది. మనస్సునందుండిన ముఖముననప్పుడే కానవచ్చియుండును, అశ్రుపూర్ణదృక్కులన్=నీళ్ళతోనిండిన చూపులచే (రామకైకేయీ సంభాషణ మంతయు లక్ష్మణుఁడు వినుచుండెను). క్రోధసముజ్జ్వలితాంతరంగుఁడై= కోపముచే మిగుల మండుచున్న మనస్సుగలవాఁడై (ఇదిలక్ష్మణునకు విశేష ణము)అభిషేచనిక భాండములన్=అభిషేకమునకై సిద్ధపఱచియుండిన పాత్ర ములు, వలగొంచున్=ప్రదక్షిణముగాఁ దిరుగుచు, లక్ష్మణునందు బుద్ధివిక్షేపక మగు నవిద్యకలదనియు, రామునందది లేదనియు తిలక వ్యాఖ్య- ౨౮౮ వ పద్యవ్యాఖ్య చూడుఁడు.

తాత్పర్యము

తండ్రికిఁ బ్రదక్షిణనమస్కారములుచేసి యావల యాగయ్యాళికైకకు సమస్కరించి తేజోవంతుఁడైన శ్రీరామచంద్రుఁ డాయంతఃపురము శీఘ్రముగ విడిచి బయలుదేఱి కోపముచే మండుచున్న మనస్సుతో నీళ్ళుకాఱు కన్నులతో లక్ష్మణుఁడు తన వెనుకరాఁగా శ్రీరాముఁ డభిషేకమునకై యుంచిన భాండము లకుఁ బ్రదక్షిణముగావించి.

చం॥ ఇవి భరతాభిషేకమున♦కేర్పడుఁ గాక యటంచు వేఁడుచున్
దవులఁగ నీక వానిపయిఁ♦దద్దయు దృష్టియు రక్తి, ఛత్రమున్
నవు రగుచామరంబులును♦స్యందనమున్ స్వజనంబు వీడి తా
నవికలితేంద్రియుం డయి జ♦నావళిదుఃఖముకై వగర్చుచున్. ౨౮౧

అవికలితేంద్రియుఁడై=వికలతలేని యింద్రియములు గలవాఁడై.

తాత్పర్యము

ఇవన్నియు భరతుని పట్టాభిషేకమున కుపయోగపడునుగాక యటంచుఁ గోరుచు, వానిమీఁద దృష్టిగాని మనస్సుగాని యనురాగముగాని నిలుపక గొడుగు చామరములు తేరును తనవారిని వదలి, చలింపని యింద్రియ

ములతో నుండియు నా నిమిత్తముగాఁ బ్రజలకు నింతదుఃఖము వచ్చెఁగదా యని దీర్ఘనిశ్వాసములు పుచ్చుచు.

చం॥ చనియెను దల్లి వీటికయి♦సర్వసుఖంబులు రాజ్యభోగముల్
పొనుపడినన్ ముఖంబునను♦బొల్పు దొఱంగదు యోగి కట్లు రా
మునకు, క్షపాగమంబు జన♦మోహనమూర్తికి శీతరశ్మికిన్
గనఁగ మలీమసత్వ మొసఁ♦గంగ సమర్థమె యెన్నఁడేనియున్. ౨౪౨

తల్లివీటికిన్=తల్లి యింటికి, పొనుపడినన్=క్షీణించినను, క్షపాగమంబు=రాత్రిరాక, జనమోహన మూర్తికిన్=జనుల మోహింపఁజేయు నాకారముగల వానికి, శీతరశ్మికిన్=చంద్రునకు, మలీమసత్వము=మఱికి, దృష్టాంతాలంకారము, రెండు వాక్యార్థములతో నొకటి బింబమువలెను మఱియొకటి ప్రతిబింబమువలె నుండిన దృష్టాంతాలంకారము.

తాత్పర్యము

తల్లియింటికై బయలుదేఱిపోయెను, అట్లు శ్రీరామునకు సర్వసుఖంబులు రాజ్యభోగంబులు సర్వము చెడినను ముఖమునఁ గాంతి యోగికివలెఁ దొలఁగినదికాదు. ఎట్లన: రాత్రి చీఁకటి చంద్రునికాంతి నెక్కువగాఁ దోఁచునట్లు చేయునుగాని మలినపఱుచునా? అట్టులే శ్రీరామునకు వచ్చిన యీకష్ట మీలోకమున నాయనకీర్తి హెచ్చించుటకేకాని దానివలన నాయన కేలోటులేదు.

ఉ॥ ఏతదనిష్టవార్త వచి♦యింపఁగ నేగెడు రామచంద్రుప్ర
స్ఫీతముఖాంబుజంబున వి♦శేషముగానరు చూప ఱెవ్వరేన్
ధీతతయుక్తిమై శరదు♦దీర్ణకరుండు మృగాంకునట్లు తే
జోతిశయంబు మానఁడు, ప్ర♦హర్షము వీడఁడు కొంచె మేనియున్. ౨౪౩

ఏతదనిష్టవార్త=ఈకీడువార్త. ప్రస్ఫీతముఖాంబుజమునన్=ప్రకాశించు శ్రీరాముని ముఖ కమలమందు, విశేషము=కైకయింటికిఁ బోవునప్పటి స్థితి యందు ఇప్పటి స్థితియందు భేదము, ధీతతయుక్తిమై=విస్తారమైన బుద్ధిబలముచే, శరదుదీర్ణకరుండు=శరత్కాలమందు నధికతేజోవంతములైన కిరణములు గలవాఁడు అగు మృగాంకునట్లు=చంద్రునివలె, తేజోతిశయంబు=అతిశయకాంతిని, ప్రహర్షము=ఎక్కువ సంతోషమును, చూపఱు=చూచువారు, రామచంద్రుఁడు ఇంతవిపత్తిదశయందును నాయన యభిరామత్వము, అహ్లాదకరత్వము మానినవాఁడు కాఁడని భావము.

తాత్పర్యము.

ఈ కీడువార్త సెప్పుటకై తల్లియింటికిఁబోవు శ్రీరామచంద్రుని ముఖకమలమందు మునుపటికప్పటికిఁ దేజస్సున భేదమేమియు నెంతపరిశీలించి చూచియు నెవ్వరు తెలిసికొనలేకపోయిరి, శరత్కాలమందలి చంద్రునివలె నధిక

తేజస్సును మానినవాఁడుగాఁడు, సంతోషము వదలినవాఁడు కాఁడు, ఇఁక భేదమెందుండి వచ్చును?

చం॥ కదుకొనుదుఃఖమున్ హృదయ♦కంజమునంద యణంచి లక్ష్మణుం
డుదితపరాక్రముండు దన♦యొప్పునఁ దోఁ జనుదేర లోకులన్
ముదమున మంచిమాటలను♦మోదిలఁ జేయుచుఁ జొచ్చె మాతృస
త్సదనముఁ, జెప్ప కాత్మలయ♦శంక నిజార్థవిపత్తి నేరికిన్. ౨౪౪

కదుకొను=కదుముకొను, అతిశయించు, కడుకొనునది కదుకొను రూపాంతరము కాదు. కడున్+కొని=కడుకొని, ఇవి రెండు రూపాంతరములని దడలకు ప్రాసమైత్రి చెప్పుటతప్పు "కదుకొని వేఁడిబాష్పములు" "కందుక కేళి సల్పెడు ప్రకార"మనునవి సరియైనపాఠములు. ఉదిత పరాక్రముండు=దీనిచే లక్ష్మణుఁడు పరాక్రమముచే దశరథు బంధించి రాజ్యమును శ్రీరామునకు లభింపఁ జేయనాలోచించుచున్నట్లుతోఁచెడిని. శ్రీరామునకు దుఃఖములేదు. లక్ష్మణుఁడు దుఃఖమణఁపఁగలిగెను. ఇరుయిరువురకు భేదము. ఆత్మలయశంకన్=ప్రజలు ప్రాణము విడుతురోయను సందేహముచే. నిజార్థవిపత్తి=తన పట్టాభిషేకము విఘ్నమైనవార్త, ఏరికిన్=ఎవరికిని.

తాత్పర్యము

పెళ్ళగించుకొనివచ్చు దుఃఖమును హృదయకమలమందే యణఁచి లక్ష్మణుఁడు పరాక్రమమున రాజ్యము శ్రీరామునకు లభింపఁజేయుదునా యని యాలోచించుచుఁదనవలెనే యేమియు నెఱుఁగనివానివలెనే తోడరాఁగా శ్రీరామచంద్రుఁడు లోకులను మంచిమాటలచే సంతోషింపఁజేయుచుఁ దనకువచ్చిన యైశ్వర్యభంగవిషయముచెప్పిన లోకులు ప్రాణముపిడుతురోయని సందేహించి యెవ్వరికిఁ జెప్పక తల్లి గృహమున ప్రవేశించెను.

౨౦-వ సర్గము.

ఉ॥ అంతిపురంబు వీడి చని♦నంతన రాముఁడు ఘొల్లటంచు శు
ద్ధాంతనితంబినీజనుల♦యార్తనినాదము మిన్నుముట్టె నే
కాంతము, రామచంద్రుఁడు వ♦నాంతరవాసముఁ జేయు నంట, హా
యెంతలు పుట్టె నేమిగతి♦యేగతిఁ దాళఁగ? నేమిచేయఁగన్? ౨౪౫

ఘొల్లటంచున్=ధ్వన్యను కరణము, ఘొల్లని ధ్వనికలుగునట్లు. వర్గద్వితీయ చతుర్థవర్ణములు తెలుగునందు లేకున్నను ననుకరణంబుల ప్రయుక్తంబులగు. ఛామ్మని ఢామ్మని. ఝుళం ఝుళారవము. ఇత్యాదులు.శుద్ధాంత నితంబినీజనుల=అంతఃపురస్త్రీల. ఆర్తనినాదము=ఏడుపుధ్వని, ఇది కైకయింటివృత్తాంతము అంతఃపురస్త్రీలు వారివారి పరిచారికలు చాటు చాటుగనుండి భార్యాభర్తలయుఁగైకేయీ శ్రీరాములయుసంభాషణము వినుచుండిరని యూహ్యము. మిన్ను

ముట్టెన్=ఆకాశమంటెను, ఏకాంతము=మిక్కిలి, తీవ్రైకాంత నితాంతాని గాఢ బాఢద్భుఃఖానిచయని యమరుఁడు,వనాంతర వాసము=అడవులలోఁ గాఁపురము

తాత్పర్యము

శ్రీరాముఁ డంతఃపురమువిడిచిపోఁగానే తల్లి కొడుకుల సంభాషణమును జాటునసుండి వినుచుండిన యంతఃపుర స్త్రీలు రాజుభార్యలు నిఁక శ్రీరాముఁ డడవికిఁ బోవుట నిజమని నిశ్చయించుకొని యందఱొక్కసారిగ ధ్వని యాకాశ మునంటునట్లు ఘొల్లున నేడ్చిరి. అయ్యో! మన రామచంద్రుఁడు కాఱడవులలో వసింపఁబోవునఁట. ఆహా యెంతవిపరీతములు పుట్టెనమ్మా! ఇఁక మనగతియేమమ్మా, శ్రీరాముని విడిచి యుండుటయెట్లమ్మా! ఇఁకఁజేయవలసినదేమి? శ్రీరామునితోడ మనము పోదమా? ఇందేయుందమా.

చం॥ జనకుఁడ చెప్పకుండినను•సర్వము నంతిపురంబుకృత్యముల్
చనవునఁ దీర్చి యందఱకు•సమ్మతి మై శరణంబు దిక్కువై
జననిని గొల్చురీతిఁ దన•జన్మముఁ దొట్టి నితాంతర క్తిమై
మనలను గొల్చుతండ్రి గుణ•మాన్యుఁడు రాముఁడు కాన కేగెడిన్. ౩౪౬

తాత్పర్యము

తనతండ్రి యంతఃపురములందు నీవీ కార్యములు చేయుమని చెప్ప కుండినను మనమేలుగోరి యంతఃపుర కార్యములు విచారించుకొనుచు మంచి మాటలచేతనే యాయావారిచేఁ బనులు చేయించుచు నెవరికి నొప్పిలేక సర్వ సమ్మతమైన విధమున మనకు రక్షకుఁడు, ప్రాపునై తన తల్లిని సేవించు విధమున ఆయన పుట్టినది మొదలు మిక్కిలి యనురాగముతో మనలను సేవించు గుణపూజ్యుఁడు శ్రీరాముఁడు కానల కేగు వాఁడఁట.

దీనివలన రామచంద్రమూర్తి తన తల్లిని గౌరవించునట్టు లందఱుసవతి తల్లులను గౌరవించుచుండెనని యేర్పడుచున్నది.సత్పుత్రుఁడు గుణవంతుఁడు తన తల్లియందు సవతి తల్లులయందు భేదమెఱుంగఁడు, "శ్లో॥ యథా కుంతీ తథా మాద్రీ, విశేషోనాస్తి మే తయోః। మాతృభ్యాం సమ మిచ్ఛామి, నకులో యక్షజీవతు॥" భార. అరణ్య నాకుఁగుంతి యెట్టిదో మాద్రియునట్టిదే, వారిరువు రందు నేనుసముఁడను. కావున యక్షా! నకులు బ్రతికింపుము. అని ధర్మరాజు చెప్పెను.

చం॥ తనయెడ నెవ్వరైన నొక•త ప్పొనరించిన బ్రల్లదంబులా
డిన విని కోపగింపఁడు, వ•డిన్ విడనాడును గ్రోధనీయముల్,
గినిసినవారియందుఁ గృప•లేశము మానఁడు కోసలాత్మజా
తనయుఁడు రామచంద్రుఁడు సు•ధన్యుఁడు కానల కేగు నయ్యయో.

ఇంకను శ్రీరాముని గుణములు దలఁచి విలపించుచున్నారు. ప్రల్లదంబులు=పరుషవాక్యములు, క్రోధనీయముల్ = కోపింపఁదగినవి, కినిసినవారి యందు=తనపైఁ గోపపడినవారియందు.

తాత్పర్యము

తన విషయమందెవరైన నపరాధ మొనరించినను బరుషముగా మాటలాడినను వినియును గోపగింపఁడు, కోపకారణములగు వానిని వదలివేయును. తనమీఁద నెవరైనను గోపపడినను వారిపైఁ బగసాధింపక వారియందుఁ గొంచెమైన దయవదలఁడు. అట్టి కౌసల్యాపుత్రుఁడు శ్రీరామచంద్రుఁడయ్యో కానలకుఁ బోపునుగదా.

కం॥ గతి యెవ్వఁ డఖిలభూత వి,తతికా పుణ్యాత్ము రాము ◆ దయచెడి వనికిన్
మతి దప్పి పనుచు రాజీ, క్షితి జీవనాళిని హింస ◆ సేయకయున్నే. ౫౪౮

అఖిలభూత వితతికిన్=సమస్తభూతముల సమూహమునకు, మతితప్పి=బుద్ధిమాలి.

తాత్పర్యము

సమస్త ప్రాణికోటికి గతియెవ్వఁడో యటువంటి పుణ్యాత్ము శ్రీరామచంద్రుని దయమాలి బుద్ధిలేక యడవులకుఁ బనుపు రాజు భూమియందుఁగల జీవులనెల్ల హింసించి వాత వేసికొనకుండునా?

కం॥ అని దేవెరు లందఱు భీ,జనకంబుగఁ దన్నుఁ దెగడి ◆ సరవమ్ముగ గో
లున నేడ్వ దశరథుం డది, విని తల్పమునందు గ్రుంగి ◆ విన్నఁదనమునన్

దేవెరులు=రాణులు, భీజనకంబుగన్=భయముపుట్టునట్లు, తెగడి=దూషించి సరవమ్ముగన్=ధ్వనితోడ, తల్పమునంద=పానుపుమీఁదనే, విన్నఁదనమునన్=సిగ్గుచే, అవమానముచే, క్రుంగెన్ = కూలఁబడిపోయెను, తలయెత్తిచూపుట కాయన మనస్సొప్పినదికాదు.

తాత్పర్యము

అని రాణులందఱు నొక్కటిగ భయము పుట్టునట్లు దన్నుఁ దిట్టుచు ధ్వని కలుగునట్లు గొంతెత్తి బిగ్గ నేడ్వఁగా దశరథుఁడు సిగ్గుచేఁ బానుపునందే కూలఁబడెను.

సీ॥ సౌమిత్రిసహితుఁడై ◆ రాముఁడు దద్ధ్వని,
విని దుఃఖము నణఁచి ◆ మనమునంద
నెటిఁ గుంజరం బన ◆ నిట్టూర్పు విడుచుచు,
దల్లి యంతిపురంబుఁ ◆ దఱసి యందు
ద్వారపాలకు వృద్ధుఁ ◆ బరమపూజితు మఱి,
యందునూఁగిన యట్టి యఖిలజనులఁ
జూచి వారలు దన్నుఁ ◆ జూచి జయారవ,పూర్వకంబుగ లేవఁ ◆ బోవు చవల

తే॥ నానికక్ష్యను దాఁటి రెండవదిసొచ్చి,
యందు నృపమాన్యులై వృద్ధులైనయట్టి
వేదసంపన్ను లగుపూజ్య ◆ విప్రవరులఁ,
జూచి వారికి రాముండు ◆ సాఁగిద్రమ్రొక్కె. ౫౫౦

కుంజరంబనన్=ఏనుఁగోయన, తటిసి=సమీపించి జయరవపూర్వకంబు గన్=జయజయ ధ్వనులతో, ఆదికక్ష్యను=మొదటి కట్టును, సొరిది=వరుసగన్.

తాత్పర్యము

లక్ష్మణుతోడ శ్రీరాముఁడా యేడుపుధ్వనివిని తన నిమిత్తముగ వారికింత దుఃఖము కలిగెఁగదా యని వ్యసనముదోఁప, దాని మనసులోన నణంచి యేనుఁగువలె నిట్టూర్పు విడుచుచుఁ, దల్లియుండు నంతఃపురంబు సమీపించి, యచట ముసలివాఁడును మిగులఁ బూజ్యుఁడునగు ద్వారపాలకుని మఱియచట గుంపుచేరిన జనులనుజూచి, తన్నుఁజూచి వారు జయజయ రాఘు రామయను ధ్వనులతో లేవఁగా వారిని దాఁటి, యావలఁబోయి మొదటితొట్టికట్టు దాఁటి, రెండవదాని యందుఁ బ్రవేశించి, యచట రాజపూజ్యులై వృద్ధులై వేద సంపన్నులైన బ్రాహ్మణశ్రేష్ఠులఁ జూచి వారికి వరుసగ నమస్కరించి.

ఉ॥ ఆవలి కక్ష్యద్వార మనఁ॰యుంబును గాచుముసళ్ళ బాలలన్
వావిరి చేరఁబోవుటయు॰వారలు దీవన లిచ్చి యేగి సీ
తావిభురాక చెప్పనెడఁ॰దానును రేయి వ్రతంబుఁ బూనుచున్
వేపిన విష్ణుపాదపద॰విపరిణద్ధమనోంబుజాతయై. ౨౨౧

వేపినన్=ఉదయముకాఁగా, అనాద్యంబును, ససంయుక్తంబునగు గకారమునకు నొకానొకచో వకారంబగు సువ్యా ఆచ్ఛిక. ౬౧. సూ. అనుసూత్రము చొప్పున వేగిన యనునది వేపిన యని యయ్యె. వేపిన మేడపై వలభివేటిక యని యాముక్తమాల్యద. పదాదియం దీ మార్పురాదు. విష్ణుపాదపదవీ పరిణద్ధమనోంబుజాతయై= విష్ణువుయొక్క పాదము లనుష్ఠానమందుఁ జక్కగాఁ బంధింపఁబడిన కమలమువంటి హృదయము గలదై.

తాత్పర్యము

మూఁడవ కక్ష్యయందు ద్వారమును విడువక కావలియుండు ముసలి వాండ్రను ఆఁడుపిల్లలను సమీపింపఁగా వారు జయ జయ మని దీవనలిచ్చి లోపలికిఁబోయి కౌసల్యతో శ్రీరామచంద్రమూర్తి వచ్చినాఁడని చెప్పుసమయమునఁ గౌసల్యయుఁ దాను రాత్రియంతయు వ్రతముఁబూని యుదయము కాఁగా విష్ణుపాదకమలముల నిజహృదయంబుఁ జేర్చినదై.

— ॰ శ్రీరాముఁడు కౌసల్యను జూచుట. ॰ —

సీ॥ సుతహితార్థంబుగ॰నతిభక్తి శ్రీవిష్ణు, పూజ గావించెడి॰పుణ్యశీల
వెలివలిపము గట్టి॰నెలమి విభ్యక్తంబు, వ్రతపరాయణ యైన॰పరమసాధ్వి
మంత్రపూతంబుగ॰మంగళాకలితయై,యగ్ని వేల్చుచునున్న॰యమలచరిత
నిష్ఠలఁ గృశియించి॰నిజదైవతము సీతఁ, దన్పుచు నున్న కాం॰తామతల్లిఁ

తే॥ దల్లిఁ గని దేవపూజ కౌ•దధిఘృతంబు
హవియు లాజలు మాల్యపా•యసము లార
నిండుఁ గడవలు సమిధలు•నిర్మలంపుఁ
గృసరమును గాంచి యామెకు•నెఱఁగె భక్తి. ౨౦౨

సుతహితార్థంబుగన్=కుమారుని మేలుకొఱకు, వెలివలిపము=తెల్లని సన్న పట్టువలువ, విధ్యుక్తంబు=శాస్త్రమునఁ జెప్పఁబడిన ప్రకారము, వ్రతపరాయణ =వ్రతమున విశేషాసక్తి గలిగిన, పరమసాధ్వి=ఉత్తమ పతివ్రత, మంత్ర పూతంబుగన్=మంత్రములచేఁ బవిత్రమగునట్లు,మంగళాకలితయై=శుభముతోఁ గూడినదై, అగ్నివేల్చుచున్=అగ్నిహోత్రమున బ్రాహ్మణులచే హోమముఁ జేయించుచున్న, అమలచరిత=నిర్మలమైన నడవడిగలది, నీటఁ దన్పుచునున్న =అభిషేకము చేయుచున్న, కాంతామతల్లి=స్త్రీలయందు శ్రేష్ఠురాలు,పూజకు ఔ =పూజకుఁ గావలసిన, దధి=పెరుఁగు, ఘృతంబు=నెయ్యి, మాల్య=పూల లండలు, సమిధలు=కట్టెపుల్లలు,కృసరము=నూవులు పాలు మొదలైన నవికలిపి వండిన యన్నము.

తాత్పర్యము

తన పుత్రునకు మేలుకలుగ వలయునని మిగుల భక్తితో విష్ణుపూజగా వించెడి పుణ్యస్వభావురాలు. తెల్లని పట్టువస్త్రముగట్టి సంతోషముతో శాస్త్రమునఁ జెప్పఁబడిన వ్రతమందాసక్తిగల యుత్తమ పతివ్రత, మంత్రములచేఁ బవి త్రముచేసి శుభపదార్థములతోఁ గూడినదై హోమము చేయించుచున్న స్త్రీరత్న మునగు తల్లి నిజూచి దేవపూజకుఁ గావలసిన పెరుఁగు నెయ్యి హవిస్సు పేలలు పూలదండలు పాయసము, నీటనించిన కడవలు, కట్టెపుల్లలు (రావి మొదలై నవి) పరిశుద్ధముగా సిద్ధము చేయఁబడిన నూవుల యన్నముచూచి యామెకు భక్తితో నమస్కరించెను.

కం॥ వచ్చినసుతుఁ గని యచ్చపు,మచ్చట గోడిగ కిశోర•మునుబోలె నెదు
ర్వచ్చి తమ హెచ్చఁ గౌఁగిటఁ,
గ్రుచ్చి శిరము మూరుకొంచు•గురువత్సలతన్. ౨౦౩

గోడిగ=ఆఁడుగుఱ్ఱము, కిశోరము=పిల్లగుఱ్ఱము, గురువత్సలతన్= గొప్ప ప్రేమతో, మూరుకొంచున్=వాసనచూచి.

తాత్పర్యము

వచ్చిన కుమారునిఁజూచి తనపిల్లయొద్దకు నాఁడుగుఱ్ఱము పోవురీతి నెదు రుగా వచ్చి ప్రేమతోఁ గౌఁగిలించి శిరమాఘ్రాణించి నిండారుప్రేమతో.

కం॥ కౌసల్యాసతి యన్యదు,రాసద తేజుని రఘూద్వ•హాగ్రణి నిజహ
ర్షాసమకలశోదధిరా,కాసితకరుఁ బ్రియహితంబు•గా దీవించెన్. ౨౦౪

అన్యదురాసద తేజునిన్=ఇతరులకు సైఁపరాని తేజస్సుగలవానిని,రఘూ ద్వహాగ్రణిన్=రఘువంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుని, నిజహర్ష = తనసంతోష

మనెడి యసమానమైన పాలసముద్రమునకు షోడశకలాయుక్తుఁడైన చంద్రుని నంటివానిని, ప్రియహితంబుగాన్=ప్రియము హితము నగునట్లు.

తా త్ప ర్య ము

కౌసల్యాదేవి యన్యులకు సహింపరాని తేజస్సుగలిగి రఘువంశ రాజులలో గుణములందు మొదటివాఁడై తన సంతోషమనెడి పాలసముద్రమునకు నిండు చందురుఁడైన శ్రీరామచంద్రుని ప్రియముగాను హితముగాను దీవించెను.

కం॥ స్థవిరుల మహితాత్ముల ధ,ర్మవిదుల రాజర్షివరుల•ప్రథ యాయుస్సున్
అవనిల్లు నీకు ధర్మము,సవు రొప్పెగులాన రామ•చంద్రకుమారా. ॥౧౧॥

దీవనవిధము చెప్పఁబడుచున్నది.

స్థవిరుల=వృద్ధుల, దీనిచే దీర్ఘాయువు, మహితాత్ముల=పూజ్యమైనమనస్సుగలవారల, దీనిచే శీలము, రాజర్షివరుల=రాజర్షిశ్రేష్ఠుల, ప్రథ=కీర్తి, స్థవిరుల, కాకివలెఁ జిరకాలము బ్రదికి లాభములేదు. మనస్సు గొప్పదై యుండవలెను. మనస్సు గొప్పదికాఁగానే లాభమేమి? అది ధర్మయుక్తమై యుండవలయును. ధర్మమెఱిఁగిన లాభమేమి? ఋషిచర్యయందు గొప్పవాఁడనిపించుకొనవలయును. ఇది మోక్షసాధకము.

రాజర్షివరుల ప్రథ యాయుస్సు అనుచో రాజర్షివరుల ప్రథ, రాజర్షివరుల యాయుస్సు అని యన్వయము. ఒక్కొక్కచో సమాసగత పూర్వపదంబు వ్యవహితోత్తరంబొంటితోడను బెక్కింటితోడను నన్వయించెడిని. త్రి. సమా ౩౦ సూ.

తా త్ప ర్య ము

రఘువంశమునఁబుట్టి దీర్ఘకాలము జీవించి పూజ్యమైన మనస్సుగలవారై ధర్మమెఱిఁగినవారై రాజర్షులనిపించుకొనిన రాజులకీర్తియు, ఆయుస్సు నీకుఁగలుగును గాక. కుమారా,రామచంద్రా మనవంశమున జ్యేష్ఠుఁడు రాజ్యార్హుఁడను ధర్మము స్థిరపడెను.

కం॥ చనుమీయిప్పుడ తండ్రిని,గనుమీ సత్యప్రతిజ్ఞ•గలఁ డతఁ డీయన్
గొనుమీ యువరాజత్వము,మనుమీచిరజీవి వయి కు•మారా యనుచున్.

తా త్ప ర్య ము ॥౧౨॥

నాయనా నీవు పోయి తండ్రిని జూడుము. ఆయన సత్యప్రతిజ్ఞుఁడు. ఆడి తప్పఁడు. కావున నీకు నాయన యౌవరాజ్య మీయఁగా గ్రహింపుము. చిరంజీవివయి జీవింపుము.

కం॥ అనుకంప భోజనార్థం, బునిచినయాపీఁట నంటి•యొయ్యనఁ గేలన్
జననికిఁ గించిద్వ్రీడా,ననుఁడై కేల్మోడ్చి యు ట్లి•నంగఁ దొడంగెన్.॥౧౩॥

అనుకంపన్=దయచే, భోజనార్థంబు=భోజనముకొఱకు, కించిత్=కొంచెము వ్రీడాననుఁడై=సిగ్గుగల ముఖముగలవాఁడై, కేల్మోడ్చి=రెండుచేతులుజోడించి కేలు నిత్యైకవచనాంతము. తొడంగెన్=ప్రారంభించెను. కైకయింట జరిగిన విషయము కౌసల్యకుఁ దెలియదు. అంటి=తాఁకి, ఒకపదార్థ మొకరిచ్చినపుడు దానిని బరిగ్రహింపరాకయుఁ దిరస్కరించుట మర్యాద గాదనియుఁ దోఁచిన పుడు దానిని జేతితోఁ దాఁకవలయును. అని శాస్త్రమర్యాద. వ్రతము ప్రకారము సుఖాసనముపైఁ గూర్చుండరాదు. తల్లి యిచ్చినదాని నిరాకరింపరాదు. కావునఁ దాఁకెను.

తాత్పర్యము

తల్లి కడుపుచూచు నన్నట్లు రాత్రియంతయు నుపవాసముండి కొడుకు వచ్చెనే యని భోజనము పెట్టుటకై పీఁటవేయఁగా దానిని మెల్లఁగాఁ జేతితోఁ దాఁకి యింత ప్రేమగలయామె కీయనిష్టవార్తయేమని తెలుపుదునాయని కొంచెము సిగ్గునఁ దలవంచి చేతులు జోడించి యిట్లు చెప్పసాగెను.

కం॥ అతిమాత్రవినయగుణ మా, క్షితిజాపతికిన్ స్వభావ•సిద్ధం బందున్
నుతగుణ జనని యెడం గల,
యతిభక్తిని వినతుఁ డగుచు•ననుఁ దనపోకన్. ౧౪౹

అతిమాత్ర వినయగుణము=అధికమైన వినయగుణము.

తాత్పర్యము

శ్రీరామునకు మిక్కిలి వినయగుణము స్వభావసిద్ధము. అందు గుణము లచేఁ బొగడ్తగన్న తల్లి యెదుట నేమి యవినయముగ వర్తింతునో యామె యేమి తలంచునో యని భయము. ఇట్లు భయముతోఁగూడిన భక్తితో నమస్కరించినవాఁడై తన ప్రయాణము గుఱించి చెప్పనారంభించెను.

—• శ్రీరాముఁడు తల్లితోఁ దా నరణ్యమునకుఁ బోవువార్తఁ జెప్పుట.•—

కం॥ తల్లీ! తెలియవుగా యిపు, డుల్లం బగలించుదుఃఖ•ముగ్రత నీకున్
బల్లవకోమల సీతకు, సల్లలిత గుణాఢ్యుఁడైన•సౌమిత్రికినిన్. ౧౫

అగలించు=పగులఁదీయు, పల్లవకోమల=చిగురువలె మృదువైన దేహము గలది, సల్లలిత=మంచి మనోహరమైన, గుణాఢ్యుఁడు=గుణసంపత్తిగలవాఁడు

తాత్పర్యము

అమ్మా! నీకును మృదుగాత్రయైన సీతకు, మనోహర గుణసంపన్నుఁడైన లక్ష్మణునకు, గుండెలు పగిలించు భయంకర దుఃఖము ప్రాప్తించుట నీవింకను నెఱుఁగవుగదా.

ఇది శ్రీరామచంద్రమూర్తి మనోదార్ఢ్యమును, జితేంద్రియత్వమును, దెలుపుచున్నది.

ఉ॥ ఏటికి నీసుఖాసన? మిఁదే చనువాఁడను దండకాటవీ
వాటికి,విష్టరాసనము పై వసియింపఁగ వేళ నాకుఁ దాఁ
బాటిలె,నామిషంబు విడి పక్వఫలంబులు తేనె మూలముల్
వాటముగాఁగ మెక్కి ముని నాఁ జరియింతుఁ జతుర్దశాబ్దముల్. ౨౬౦

విష్టరాసనము=దర్భాసనము, ఇరువదియైదు దర్భలతోఁ జేయఁబడిన బుషుల యాసనమునకు విష్టరాసనమనియు, నేఁబది దర్భల బుష్యాసనమునకు బ్రహ్మాసనమనియుఁ బేరు. ఆమిషము=విషయభోగచింత, విడి=వదలి "రసవద్భోజ్యవస్తురహిత" యని వైద్యనాథీయము. ఇచ్చట ఆమిషమనఁగా మాంసమని యర్థము చేసికొని శ్రీరాముఁ డీవాక్యమునకు విరోధముగా మాంసము భుజించెఁగదా యని కొందఱు సందేహింతురు. ఆమిషశబ్దమునకు విషయచింతయనియు వైద్యనాథీయమందు రసవంతమైన భోజ్యవస్తువనియు వ్రాయఁబడియుండుటచే నింటిలో సిద్ధము చేయఁబడిన రుచిమంతములగు పక్వపదార్థములు వదలెదనని శ్రీరామచంద్రుఁడు చెప్పెనని తెలియనగు. క్షత్రియులకు మాంసాహారము నిషిద్ధముగాదు. కావున శ్రీరామచంద్రుఁడు రుచిమంతముగా నేతిలోనుడికించి పోపువేసిన మాంసము వర్జించి క్షుత్తునివారణార్థము నిప్పులలోఁ గాల్చి తినుటవలన వ్రతహానిలేదు. అదియునుగాక యాకాలంబున మునులును నిట్టిమాంసము భుజించుచుండి యావల దానివలన దోషము తెలిసి విసర్జించిరి.

తాత్పర్యము

అమ్మా! నాకేల యీసుఖాసనము? నేనిదిగో నిప్పుడే దండకాటవిలోదర్భాసనముపైఁ గూర్చుండుసమయము లభించినది. అంతియకాదమ్మా! రుచిమంతములైన యీభోజనముమాని పండినపండ్లు తేనె వేరులు చక్కఁగాఁదిని మునివలెఁ బదునాలుగు సంవత్సరము లడవులందే వసింతును.

కం॥ ధరణిపతి యౌవరాజ్యము, భరతునకు నొసంగు నన్నుఁ బదునాల్గేడుల్
చరియింపఁ బంపె దండక,ధరియించి మునీంద్రురూపుఁ దల్లీ యిపుడే.

తాత్పర్యము

రాజుగారు భరతునకు యౌవరాజ్యమునిచ్చును. నన్నుఁ బదునాలుగు సంవత్సరములు దండకలో మునివేషముతో సంచరింప నిపుడే పొమ్మనెను.

కైక చెప్పినదనినఁ గౌసల్యకు మఱింతసంతాపకరముగ నుండుననియు "అప్రతిషిద్ధమను మతమ్" కాదనకున్న నంగీకరించి నట్లేయను న్యాయము ననుసరించి కైక చెప్పినదానిని గాదని చెప్పకుండుటచే దశరథుఁడంగీకరించి నట్లే యను నభిప్రాయముతో శ్రీరామచంద్రుఁడు తన్నుఁ దశరథుఁడాజ్ఞాపించి నట్లే చెప్పెను. అట్లు గాకున్న సవతితల్లిమాట కంటెఁ గన్నతల్లిమాట యెక్కువ యాదరణీయమగును.

చం॥ వనముల నాఱు నెన్మిదియు•వత్సరముల్ విజనస్థలంబునన్
గొనకొని సంచరించుచును•గూరలు గాయలు వేరువెల్లఁకుల్
దిని, ముని రీతి నామిషము•నేఁ దల పెట్టక, ప్రొద్దుపుచ్చుచుం
దును నన గొడ్డటన్ నఱుక•దొల్లెడు కాననసాలమో యనన్. ౫౬౨

విజన స్థలంబునన్=జనములులేనిచోట-పదునాలుగు ననునది పెద్దసంఖ్యగాఁ గనఁబడునని యాఱునెన్మిది యని చెప్పెను. తల పెట్టక=తలంపక, సాలము=వృక్షము, మద్ది వృక్షము = ఆమిషము.

శ్లో॥ అధ్యాత్మరతి రాసీనో, నిరపేక్షో నిరామిషః।
ఆత్మనైవ సహాయేన, సుఖార్థీవిచరేదిహ॥ మను. ౬-౪౯.

(౧) నిరామిషః=ఆమిషం విషయాః తదభిలాషరహితః అనికుల్లూకభట్టు.

ఆమిషము నేఁ దలపెట్టక యనుటచే విషయచింతలేక, బ్రహ్మచర్య మవలంబించి యని యర్థము.

(౨) నిరామిషః=రసవద్భోజ్య, వస్తురహితః=రసవంతమైన భోజ్యవస్తువులు మాని యని వైద్యనాథీయము.

సనత్కుమార సంహితయందు

దగ్ధమన్నం ద్విపక్వంచ, మసూరాన్నం సవల్కలమ్।
ఉద్దాలకాః పర్యుషితం, మన్న మామిష ముచ్యతే॥
వృంతాకాని పటోలాని, తుంబికాచ కళింగకమ్।
బింబీఫలాని త్రపుషం, ఫలం శాకేషు చామిషమ్ ॥
చోరకాతులసీ చిల్లీ, ఛత్రాకం పోస్త పత్రకమ్।
చక్రవర్తీ రాజగిరిః. పత్రశాకేషు చామిషమ్ ॥
గృంజరం రక్త మూలంచ, పలాండుం లశునం తథా।
సర్వదై వామిషాణీ స్యుః, కార్తీకేసూరణం త్యజేత్॥

పద్మపురాణమున

ప్రాణ్యంగ మామిషం చూర్ణం, ఫలే జంబీర మామిషమ్।
ధాన్యే మసూరికాః ప్రోక్తా। వన్నేపర్యుషితం తథా।
అజాగో మహిషీక్షీరా, దన్యదుగ్ధాది చామిషమ్,
ద్విజక్రీతారసాః సర్వే, లవణం భూమిజం తథా!
తామ్రస్థితం పంచగవ్యం, జలం పల్వలసం స్థితమ్।
ఆత్మార్థం పాచితం చాన్నం, మామిషం చోచ్యతేబుధైః॥

తాత్పర్యము

అడవులందు నొకయాఱు నొకయెన్మిది యేఁడులీమాత్రముకాలము జనులు లేనిచోటఁ దిరుగుచుఁ గాయగూరలు వేరు వెల్లఁకులు దిని మునివలె నామిషము

వదలి కాలము ద్రోయుదును అని చెప్పఁగానే గొడ్డలితో నఱుకఁగాఁ బడెడు నడవి చెట్టువలె.

చం॥ దివి విడి నేలపైఁ దొరలు ♦ దేవతనాఁ బడె, ని ట్లరంటి నా
ఘువిఁ బడియున్న తల్లి సుఖ ♦ పూజ్యను మూర్ఛితఁ జూచి వేగ రా
ఘవుఁడును లేవ నెత్తి కడు ♦ గాటపుఁ బ్రేఁకను ద్రెళ్ళినట్టిగో
డివవలె ధూళి బ్రుంగుడుఁ గ ♦ డిందిగఁ గేలను మెల్లఁ బాచుచున్. ౨౬౩

దివి=స్వర్గము, విడిచి=వదలి, అరంటినాన్=అరఁటిచెట్టువలె, బ్రేఁకను = భారముచే, గోడివ=గోడిగ- ఆఁడుగుఱ్ఱము, బ్రుంగుడున్=మునుంగఁగా.

తా త్ప ర్య ము

కౌసల్య పుణ్యక్షయమున స్వర్గమునువిడిచి నేలఁదొరలిపడిన దేవతాస్త్రీయో యన నేలపై మూర్ఛిల్లిపడెను. ఇట్లు నఱుకుడుపడిన యరఁటిచెట్టువలె భూమి మీఁదఁబడియుండు తల్లిని, సుఖముచే గౌరవింపఁ దగిన దానిని, మూర్ఛచే దేహము తెలియనిదానిని,జూచి మిగుల బరువును మోయలేక నేలఁబడిన యాఁడు గుఱ్ఱమువలెఁబడి దుమ్ములో మునుగఁగాఁ శీఘ్రముగ శ్రీరాముఁడామెను లేవ నెత్తి చేతితో నాదుమ్ము తుడుచుచు

కం॥ చెంగటఁ గూర్చుండినసుతు, నిం గని సౌఖ్యార్హ పలుకు♦నెఱిశోకమునన్
ముంగలఁ గలసౌమిత్రి వి,నం గన్నులయందు జలక♦ణంబులు గురియన్.

చెంగట=సమీపమున, జలకణంబులు=జలబిందువులు.

తా త్ప ర్య ము

తన సమీపంబునఁ గూర్చుండిన కొడుకునుజూచి సుఖయోగ్యమగు కౌసల్య నిండారు శోకంబున ముందు నిలుచుండిన లక్ష్మణుఁడు వినునట్లు కన్నులనీరు గాఱుచుండ నిట్లనెను.

—♦ శ్రీరాముఁడరణ్యమునకుఁ బోవుట విని కౌసల్య దుఃఖించుట. ♦—

ఉ॥ నాయన! నీవు నాకడుపు♦నన్ జనియింపక యుండి తేని యు
త్ర్యాయతదుఃఖ మీపగిది♦నందక యుండుదుగాదె? మేలు గా
దే యిటువంటిదుఃఖములఁ♦దీఱుటకంటెను గొడ్డురాల నై
యే యెటులో ధరన్ దినము♦లేగఁగఁ ద్రోచుచు నుంట పుత్రకా? ౨౬౪

ఇది మొదలు కౌసల్యాపరితాపము వర్ణింపఁబడును. ఉండుదువని యొక యర్థమున, ఉండుదునని మఱియొక యర్థమున గ్రహింపవలెను. శ్లేషమందు నఖండ నిర్బంధుకములకు మేళనము.

తా త్ప ర్య ము

నాయనా! నీవు నా కడుపునందుఁ బుట్టకయుండితివేని యీ విస్తారదుఃఖము నీవు ననుభవించియుండవు. నా కడుపునఁబుట్టిన కారణముచే నీకీ పెనుదుఃఖము

ప్రాప్తించెను. నా కడుపున నీవు పుట్టకుండిన నాకీ దుఃఖములేదు కదా. ఒకరి నిమిత్తమై యొకరు మనమిరువురము నానుండి నీవు నీనుండి నేను నేడువ వలసివచ్చినది. ఏ భాగ్యవతి కడుపునందైన నీవు పుట్టియుండిన నీవు సుఖించి యుందువు. ఆ తల్లియు సుఖించియుండును. పుత్రశోకములేక నేను సుఖించి యుందును. అదేమమ్మా యట్టులనెదవు గొడ్డురాలగుట మేలాయందువేమో. తండ్రీ! యిటువంటి కడుపుదుఃఖముచేఁ జచ్చుటకంటెను గొడ్డురాలనయి యే విధముగానో కాలము ద్రోయుచునుండుట మేలుకదా.

కం॥ బిడ్డలు లేరని యొక్కటె, గొడ్డుంబోతులకుఁ జింత•కొడుకులు పుట్టన్
దొడ్డగ బ్రదికిన మేలగు, బిడ్డా! యిటులైన నేమి•ప్రియ మగుఁ జెపుమా.

గొడ్డుఁబోతు, పోతు అనునది తాచ్ఛీల్యార్థక ప్రత్యయము.

తాత్పర్యము

అపుడు మాత్రము విచారములేదా బిడ్డలులేనివారు బిడ్డలో బిడ్డలో యని కలవరించి పలవరించుటలేదా యందువేమో. నాయనా! బిడ్డలు లేకపోయిరిగదా యని గొడ్రాండ్లకు నొకవిచారమే. బిడ్డలు కలిగినయెడల వారు గొప్పగా జీవించిన మేలుగాని యీప్రకారము కని పెంచి కాచి నక్కలపాలుచేసిన నేమిమేలు?

ఉ॥ అక్కట! పెద్దపెండ్లమని•యైన విభుం డొకనాఁటనైన న
న్మక్కువఁ జేరఁదీసి, బహు•మానపురస్సరవాక్కు లాడి, యిం
పెక్కఁగ సౌఖ్యమో శుభమొ•యేమియుఁ గూర్ప నెఱుంగ, బిడ్డఁడే
నొక్కఁడు పుట్టనప్డయిన•నొందుదుఁగా సుఖ మంచు నుండుదున్. ౨౬౮

తాత్పర్యము

అయ్యో పుత్రకా! కట్టుకొన్న మగని నడవడికై యేడుతునా? కానక కానక కన్నబిడ్డ కానలకుఁ బోవుచున్నాఁడని యేడుతునా. రాజొకనాఁడైన నయ్యో యిది పెద్దపెండ్లాము పట్టపుదేవిగదాయనియైనఁ బ్రేమతో దగ్గఱకుఁ దీసి మర్యాదగా మాటలాడి సంతోషకరముగ నొకసుఖమో యొకమేలోగూర్పఁగా నేనెఱుఁగను. ఒక కొడుకైనఁ బుట్టిన వానియందలి ప్రేమచే వాని తల్లి గదాయను నెపముననైన నన్ను సుఖపెట్టునుగదా యని తలంచుచుంటిని.

చం॥ చనినది పోవని మ్మికఁ న•సహ్యము లై వినరానిమాటలన్
మన మవియంగ నాడ నధ•ముల్ సవతుల్ వరకాంత నెట్టులే
విసఁ గలదానరా, సతికి•వెండియుఁ గష్ట మొకండు గల్గునా?
చనినను నీవునున్ వనికి•శక్యమె సైఁప ననంతదుఃఖమున్? ౨౬౯

అవియంగన్=పగులఁగ, అధముల్=తక్కువవారు, వరకాంత=ఉత్తమ స్త్రీ.

దుష్టయగు సవతి యొక్క కైకయే యయినను నొకతె యని చెప్పినఁ గైకను సూచించినట్లగును. దానికేమి కోపమువచ్చునోయని బహువచనమునఁ జెప్పెను.

అసహ్యములైనవికొన్ని విననైనఁగూడియుండును. కొన్ని వినరానివి సహ్యములై యుండును. సవతుల మాటలు సహ్యములుగావు వినఁగూడినవిగావు.

వినరాని మాటలన్=అను బహువచన ప్రయోగముచే నింతవఱకు శ్రీరాముని తల్లిగదా యీమె ననిన శ్రీరామునకుఁ గోపమువచ్చునో శ్రీరాముని తండ్రికిఁ గోపమువచ్చునో యని భయపడి మాఱుమూలలనేవో యొకయేటుమాట యొక పోటుమాట కాకిమీఁదఁబెట్టి పిట్టమీఁదఁబెట్టి యనుచుండిరి. ఇఁకనో బహిరంగముగ నెన్నియేని యందురని భావము.

అధమల్ = పల్లెత్తి యెవరిని నొవ్వనాఁడని నీచముగాఁజూడని నేనుగూడ నధమలని యనవలసివచ్చినవారు, సవతుల్ = ఒకభర్తకు భార్యలగుటచే నందఱు సమానలమను నహంకారముగలవారు.

వరకాంతను=వారివలె నేను నధమురాలై యుండిన వారనిన నేననిన సరిపోవుచుండును. నేనోయనను లేను పడనులేను. వారు నిన్ను నేమియందురందు వేమో. ఏమనిచెప్పుదును. రాజు నాకుఁ బంపు వస్తువులు పంపకుండజేయుదురు. నాపుట్టినింటిసొత్తు నేను ధరించినను మగఁడొల్లనిదానికి దీనికిన్ని సొగసులా? ఎవని మెప్పించుటకీ సొగసులందురు. మగఁడు నాయింటికి రాకపోయినను ఎప్పుడైనా నేనై యాయన యవసరము తెలిసి మనస్సు ప్రసన్నమైనపుడు పోయినను వెంటనే వారు వచ్చి నామగనితో నీకేమి మాటలు ఆవలఁ బొమ్మందురు. ఇట్టివెన్నో కలవు ఇవి యెట్లు సహింతును. ఏమని చెప్పుకొందును. ఎవరితోఁ జెప్పుకొందును.

తాత్పర్యము

అయినదేమో యయినది. కడచిన దానికి వగచి యేమిప్రయోజనము. ఇఁక జరుగవలసిన విధము చెపుము. కులగుణవయస్సుల నాకంటెఁ దక్కువవారగు సవతులు కర్ణకఠోరములై సహింపరానిమాటలను మనసు వ్రీలిపోవునట్టు లనుచుండఁగా నెట్లురా నేను వినఁగలను? అఁడుదానికి నింతకంటె గొప్పకష్టము మఱియొకటికలదా? సవతులమాటలకేడ్తునా? మగని యవిశ్వాసమున కేడ్తునా? నీవు కానలకుఁ బోయితివని సహింపఁరాని కడుపుదుఃఖమునకై యేడుతునా ?

కం॥ పలువతనంబున సవతులు, పలుకఁగ దుర్భాషణములు♦వరవర్ణిని నై
కలనా వినుచుండఁగ? హా, తెలియను గద నాదుదుఃఖ♦దీనతలతుదిన్.

వరవర్ణిని=ఉత్తమస్త్రీ. ౪౫

తాత్పర్యము

నీచపు సవతులు నోటికి వచ్చిన దుర్భాషణములు పలుకుచుండఁగా నుత్తమస్త్రీనై యెట్టులు వినుచుండఁగలను? వినఁజాలని, సహింపఁజాలని, బదులనలేని, నాగతియేమి? నాదుఃఖమునకు దైన్యమునకు నంత మెపుడో తెలియలేదుగదా.

కం॥ నీ వుండఁగనే నాకడ, నీవిధి సంప్రాప్తమయ్యె•నిక్క, ట్లింకన్
నీవును నడవుల కేగినఁ, జా వొక్కటిదక్కనేది•శరణము తనయా! ౨౪౦

తాత్పర్యము

నాయొద్ద నీవున్నప్పుడే నాకిట్టి కష్టములు ప్రాప్తించెను. ఇఁక నీవుకూడ నడవులకుఁబోయిన నాకు మరణముతప్ప కుమారా! వేఱు శరణము గలదా.

చం॥ మగనికిఁ బ్రేమ లేమి కను•మానము లే, దిఁకమీఁద బుత్రకా
వగ చెడఁ గైక తొత్తులకు•వత్తును సాటిగఁ, గాదు కాద, యె
ట్లగు నది? వారికంటె నధ•మాధమ నయ్యెద రామచంద్ర! యే
మిగ మెయిఁ దాల్చు దాన? నెది • మేర వచింపుము దుఃఖవార్ధికిన్?

తాత్పర్యము ౨౪౧

నామగఁడు నీకారణమునసైన లక్ష్యపెట్టునుగదాయని భ్రమించియుంటిని. కన్నకొడుకును కులముద్ధరించు పెద్దకొడుకును నిన్నే యీగతి పట్టించినవాఁడు నన్నేగతిపట్టింపఁడు? కావున నతనికి నామీఁద దయలేదనుటయందు సందేహములేదు. ఇఁక మగఁడే దయలేక నిరాదరించినపుడు సవతులమాట యనవలయునా? ఇంటివారు వ్రేలఁజూపినఁ గానివారు కాలఁ జూపరా? ఇఁకనేను గైక పరిచారికలకు సమానురాలనగుదును. అదియునుగాదు. కైక తొత్తులకు నేనెట్లు సమానురాలను గాఁగలను. వారుకూడ నన్ను లక్ష్యపెట్టరు. కావున వారికంటె నధమురాలనై వారి పరిచారికగ నగుదును. ఇట్టి స్థితియందు రామచంద్రా యేమని దేహమింకను ధరింతును? నాకు దుఃఖాంత మెపుడు చెపుము.

ఉ॥ పాయనినోటిమంచి నెడ•పా తడపా ననుఁ గొల్చు వారలే
నేయెడ నైన నొక్కపరి•యేనియు నేమని పల్కరించు వా
రో యనఁ బోరు నేఁ బిలువ, • నొల్లరు మోమును జూపనింకఁ, గై
కేయితనూజుఁ జూచి వెఱఁ•గీడ్వడుచున్ సుత! దేని కేడ్చెదన్. ౨౪౨

ఎడపాతడపా=అప్పుడప్పుడు రూ. ఎడపతడప

తాత్పర్యము

ఇంతవఱకు నానోటి మంచితనముచే నమ్మాయక్కా యనుటచే నెప్పుడు గాకపోయిన నప్పుడప్పుడైన నొకప్పుడుగాకున్న నొకప్పుడైనను బిలిచిన నేమి యనువారింక నేను బిలిచిన 'నో' యని కూడ ననరు. పిలిచినఁ బిలువనీలే యని మూతిత్రిప్పికొని పోదురు. అంతేకాదు. కన్నులకుఁ గనఁబడిన నేమిపనిచెప్పుదునో యనికనులకైనఁ గానరాకుందురు. ఏల ? ఇది వారి స్వభావగుణము కాదు. కైక కొమకునుజూచి యతఁడు దండించునో యను భయముచేత నాయనా! దేనికేడ్తునో చెప్పుము.

కం॥ మటమట లాడెడిమోమును, జిటచిట యని కసరికొట్టు•చీఁదఱపలుకుల్
కుటిలగుణంబును గల యా, పటుమాయల కైకమోముఁ•బరికించు టెటో.

కోపమున మట మటలాడుచుఁ జిటచిట చీఁదరించుకొనుచుఁ గసరికొట్టు చీఁదరమాటలు కుచ్చితగుణము గల యా పెనుమాయలమారి కైకముఖమును నేనేమని చూతును. ఇఁక దాని పెత్తనముగావున దానిని జూడక యెట్లు తప్పును?

మ॥ పదునేడేఁడులనుండి యెప్పు డొకొ నా♦భంగంబు దుఃఖంబులున్
దుదగాంచున్, సుఖ ముబ్బు, నంచు మది నెం♦తో వేచి మోదింపఁగాఁ
దుద కి ట్లయ్యెనుగా! సపత్నులదురు♦క్తుల్ వించు నెన్నాళ్ళయో
మది క్షీణించుచు నుండ నేర్తుఁ దనయా♦మానంబుఁబోకార్చుచున్. ౨౭౪

పదునేడేఁడులనుండి=పదునేడనులెక్క మొదటి జన్మమునుండికాదు. రెండవ జన్మము ద్విజత్వము ప్రాప్తించినది మొదలు. అనఁగా నుపనయనము మొదలు. శ్రీరామున కుపనయనము తొమ్మిదవ సంవత్సరమున జరగెను. అది మొదలిప్పటికిఁ బదునేడు సంవత్సరములు. ఇప్పుడు శ్రీరామునకు ౨౬ సంవత్సరముల వయస్సు. ఈ విషయము సీత రావణుతోఁ జెప్పినమాటలవలన నేర్పడుచున్నది. గర్భైకా దశేషు రాజన్యమ్మను సూత్రమునకు వ్యాఖ్యానము వ్రాసినవారు ఏకాదశేషు అని బహువచన సారస్యమునుబట్టి గర్భములో నుండునది మొదలు తొమ్మిదిగాని పదిగాని పదునొకండుగాని యని వ్రాసియున్నారు. కావున శ్రీరామునికిఁ దొమ్మిదవ యేఁట నుపనయనము జరగుట శాస్త్రవిరుద్ధము కాదు.

పుట్టినది మొదలిప్పటికిఁ బదునేడేఁడులని చెప్పినయెడల సీత రావణునకు "మమభర్తామహాతేజా వయసా పంచవింశక" యని చెప్పిన మాటతో విరోధించును. ఇదిగాక పండ్రెండేండ్లు మగని యింటనుంటినని సీతయనుటచే శ్రీరామునకు వివాహకాలమునకు నైదేండ్లనియు నుపనయనము ౨వ యేఁటననియు నేర్పడును. ఇది శాస్త్రవిరుద్ధము నిర్ధారించి సీత సన్న్యాసియని నమ్మి రావణుతోఁ జెప్పినమాటతో విరోధించును. గావున శ్రీరామున కిప్పటికి ౨౮ సంవత్సరములనువారి వాదము నంగీకరింపరాదు. ఊన షోడశవర్షమ్మనుచోట నది నిర్ధారణవాక్యముగాదు. పదునాఱింటికి నెంత తగ్గినను దగ్గినదే. ౨-౩ నెలలని యేమి నిశ్చయము. ఈ విషయము బాలకాండము ౨౦౯వ పద్యవ్యాఖ్యానమందుఁ జర్చింపఁబడినది.

భంగంబు=అవమానము, వేచి=కాచుకొనియుండి, మోదింపఁగాన్=సంతోషింపఁగా, దురుక్తులు=దుర్భాషణములు, పోకార్చుచున్=నాశము చేసికొనుచు.

తాత్పర్యము

నీ యుపనయనమైనది మొదలు పదునేడు సంవత్సరములనుండి నాకొడుకెప్పుడు పెద్దవాఁడగునా, నోరు కలవాఁడగునా, వానిమూలమున నా యవమానము దుఃఖము నశించునుగదా, సుఖపడుదునుగదా, యని కాచివేచి సంతోషపడుచుండగాఁ గడపటికిట్లయ్యెనుగదా. సవతుల నిష్ఠురవాక్యములు వినుచు నెన్నాళ్ళురా నాయనా! మానము నాశముచేసికొని మనస్సులోనే క్రుళ్ళిక్రుళ్ళి నశింతును.

కం॥ ఎప్పటికి నాకు దుఃఖము, దప్పు నటం చోర్తు సవతి♦ధౌర్త్యం? బది నే
నెప్పగిదినొ యోర్చినను౯, ముప్పునఁ దద్విప్రకార♦ముల నెటు సైఁతు౯.

ధౌర్త్యము = ధూర్తత్వము, ముప్పునన్=ముసలితనమునందు,విప్రకారములు = విరోధపు మాటలు, సైఁతున్ = సహింతును.

తాత్పర్యము

నాకు సవతి పోరువలనఁగలుగు దుఃఖమెప్పటికిఁ దీఱునని నాయనా!నేను సహించుకొనియుందును. అది యెప్పటికిఁ దప్పనిదాయెఁగదా. ఒకవేళ నీ దుఃఖముల సైచితిననుకో సవతిపలుకు దుర్భాషణము లెట్లు సహింతును ?

చం॥ పొలుపున నిండుఁజందురునిఁ ♦ బోలిన నీదుముఖారవిందము౯
సలలితరీతి నొక్కనిమి♦షంబును జూడక యుండ నేర; నే
తలఁపున జీవము న్నిలుపఁ ♦ దాళుదురా పదునాల్గువర్షముల్
చెలువటి నిన్నుఁ జూడకయె♦చిన్నికుమారక! దీనురాల నై. ౨౩౬

చెలువటి = అందముచెడి, దీనురాలనై = నిర్భాగ్యురాలనై.

తాత్పర్యము

ఏదో యొకవిధముగ సవతిపోరును సహింపఁగలననుకో. ఇప్పటి నాస్థితి చెప్పెద వినుము. అందమున నిండుచందురుని బోలు నీముఖకమలమును నొక నిమిషమైనఁ జూడక ప్రాణములు నిల్పలేను. చిన్నినాయనా! యిఁకఁబదునాలుగు సంవత్సరములు నిన్నుఁజూడక యేరీతిఁ బ్రాణములు బిగఁబట్టుదునురా ఈ నిర్భాగ్యురాలికది సాధ్యమా ?

కం॥ వ్రతములు తప ముపవాసము,వెత లెన్నియొ పడుచు దుఃఖ♦వృద్ధికిఁగాఁగ౯
సుతరత్నమ! నిను సాఁకితి, నతులితనిర్భాగ్యురాల♦నగు నే నకటా. ౨౩౭

తాత్పర్యము

కుమారరత్నమా! నిర్భాగ్యురాండ్రలో నసమానురాల నగు నేను వ్రతము లుపవాసములు నితరకష్టములెన్నెన్ని పడవలయునోయన్నిపడి దుఃఖము వృద్ధి యగుటకై నిన్నుఁ బెంచితిని. అదృష్టవతులకు సుఖములనిచ్చు వ్రతోపవాసాదులు నేను నిర్భాగ్యురాలనయిన కారణముచే నాకు దుఃఖముకలిగించుటకై నిన్నుఁ గుమారుగా నొసంగెను. నిన్నుఁ బెంచుటరూపమున నాదుఃఖమును బెంచుకొంటిని.

ఉ॥ ఎక్కటి నీవు కానలకు♦నేగెద నన్నను నాదుగుండియల్
వ్రక్కలు గామిచే నిను మొ♦రాయియొ యౌ నిది నిశ్చయంబ, యొం
డొక్కటి యైన వానల మ♦హోద్ధతిఁ బాఱెడి క్రొత్త వెల్లికి౯
జిక్కినయొడ్డు నా సమసి ♦ చేడ్పడ కుండునె యింత కయ్యయో. ౨౩౮

ఎక్కటి = ఒంటరిగా, వ్రక్కలు = తునుకలు, వెల్లి = ప్రవాహమునకు, సమసి = నశించి.

తాత్పర్యము

ఒంటరిగా నీవు కానలకుఁ బోయెదవను వార్త వినఁగానే నాగుండెలు ముక్కలు ముక్కలుగఁ బగుల కుండుటచే నది యినుమో ఱాయియో యయి యుండవలెను. ఇది నిశ్చయము. అటుకానియెడల జడివానలకు మహావేగముగఁ బాఱు క్రొత్తప్రవాహముచే నొడ్డులు రూపునాయునట్లు లీ దుఃఖముచే నిప్పటి కిది నాశము గాకుండునా.

చం॥ మరణము లేదు నాకు, యము • మందిరమందుఁ దలంబు నేనియున్
దొరకదు నిక్క, మేల యనెదో విను నీదుప్రవాసవార్తకున్
భరపడి యేడ్చు నన్ను మృగిఁ • బట్టి బలాత్కృతిఁ గొంచుపోవు కే
సరికరణిన్ యముం డిపుడ • సత్వరుఁడై కొనిపోవ కుండుటన్. ౨౭౯

ప్రవాసవార్త = ఇతర ప్రదేశములకుఁ బోయెదవన్న సమాచారము, మృగిన్=ఆఁడుజింకను, బలాత్కృతిన్=బలవంతముగా, కేసరి కరణిన్=సింహమువలె, సత్వరుఁడై =త్వరతోఁగూడినవాఁడై.

తాత్పర్యము

నాకుఁ జావులేదు. ఎప్పుడు నిచ్చట నిట్లేడుచుచుండవలసిన దాననే. ఒక వేళ మరణించినా యమలోకములో నాకు స్థలము లేదు. కావున నధమగతుల యందుండవలసినదాననే. నిజము. అది నీకెట్లు తెలియునందువా విను. నీవు దేశాంతరము పోవుదువన్నవార్త వినఁగానే దుఃఖమును సహింపలేక యేడ్చు నన్ను సింహమాఁడుజింక నవలీల నీడ్చుకొని పోవునట్లు యముఁడు బలవంతముగా నీడ్చుకొని పోకయుండునా? నాకుఁ జావేలేదో యమలోకమున స్థలమే లేదో. కావుననే యముఁడూరకున్నాఁడు.

చం॥ అనఘ! సహింపరానివిపు • లార్తికిఁ జిత్తము తున్క తున్కలై
చన, దిది యుక్కుతుంట యగు • సందియ మింతయు లే,దకాలమం
దొనరదు దేహికి న్మరణ, • ముగ్రపునోములు దానముల్ తపం
బును వెతఁ గూర్చె, ము న్నెపుడు • పొందఁగ లే దిటువంటిదుఃఖమున్.

అనఘ = పాపరహితుఁడా. ౨౮౦

తాత్పర్యము

నాయనా! నీవు పాపాత్ముఁడవగుటచే నీవు నాకొడుకయిన కారణమున నాకీ కష్టము వచ్చెనని నాయభిప్రాయముగాదు. నీవు పుట్టకముందుకూడ దుఃఖములే యనుభవించుచుంటినిగదా. నావంటి నిర్భాగ్యురాలి కడుపునఁ బుట్టుటచేఁ బుణ్యాత్ముఁడవైన నీకును గష్టములు కలిగెఁగదా యని యేడ్చెదను. నాకుఁ బుట్టకున్న నీకీవనవాసాయాసము కలిగియుండదుగదా. నానిమిత్తమునఁగదా నీకీ యరణ్యవాసప్రాప్తి, సహించుటకు సాధ్యముగాని మహాదుఃఖముచేఁ జిత్తము

తునుకలు తునుకలై పోకయుండుటచే నది యుక్కుతునుకయే. సందేహము లేదు. అటయిన నదియేల పోలేదందువా? అకాలమందు దేహికి మరణము రాదు. కావున జీవించియున్నాను. లోకములో నందఱకు సుఖమిచ్చు దానములు నోములు తపస్సులు నివి యన్నియు నాకు మనోవ్యధ కలిగించెను. ఇదివఱ కెన్నిమాఱులో యెటువంటి దుఃఖములో యనుభవించితినిగాని యిట్టి దుఃఖము నేనెప్పుడు ననుభవించినది లేదు.

కం॥ కొడుకులు కొడుకు లటంచును, గొడుకా! సలిపితిని నేను ♦ ఘోరతపంబున్
గడకు నది చవిటినేలను, నిడువిత్తన మయ్యె నేమి ♦ యేడ్తును జెపుమా.

తాత్పర్యము

కొడుకులో కొడుకులో యని కొడుకుల కొఱకై ఘోరమైన తపస్సు చేసితిని. ఏమిఫలము? ఆతపస్సంతయుఁ జవిటినేల నాటినవిత్తనమయ్యెను. ఈవిపరీత ఫలమునకు నేనేమని యేడ్తును.

కం॥ గురుతరదుఃఖహతాత్ములు, మరణింపఁగ శక్యమేని ♦ మత్సుత! నీవీ
సరణిఁ జన, లేఁగఁ బాసిన,సురభి యనం బోనె యమునిఁ ♦ జూడఁగ నిపుడే.

తాత్పర్యము ౨౮౨

గొప్ప దుఃఖముచేఁ గొట్టఁబడిన మనస్సులుగల వారాదుఃఖబలమున మరణించుట సాధ్యపడునేని నాకుమారా! నీవిట్టు లడవికిఁబోగా దనలేదూడను బాసిన యావువలె నేడ్చు నేను యముని దర్శింప నిప్పుడే పోనా?

చం॥ బ్రదికియు నేమిసార్థకము ♦ రా సుత! నే నిఁక నిన్నుఁ బాసి యీ
సదనమునందు, దూడబడిఁ ♦ జక్కఁగ నేఁగెడిబక్కగో వనం
బద చనుదెంతు నీబడిని ♦ మానను నన్గొనిపొమ్మటంచు నా
సుదతి దురంతశోకమున ♦ గ్రుక్కెను గిన్నరి నా సుతార్థమై. ౨౮౩

తాత్పర్యము

మరణము సుఖమనెదవు- మరణించి యమలోకమునకుఁబోయిన నచ్చట నరకబాధ లనుభవింపవలదా యందువేమో బ్రతికి నిన్నుఁబాసి యీ యింట నుండినంత మాత్రమున నేమిప్రయోజనము- ఏమి సుఖము ? కావున మరణించుట మేలుగాదని బ్రతికి యీయింట నుండుటయు మేలుగాదు- కావున దూడ వెంటఁబోవు బక్కగోవువలె నీవెంటవచ్చెదను బద- నీవు పోవు చోటికి నన్నుఁ దీసికొనిపొమ్ము- వదలను. అని యాకౌసల్య యంతములేని శోకమునఁ గుమారు నిమిత్తమై విలపించెను.

—♦ { ౨౧-వ సర్గము. లక్ష్మణుఁడు కౌసల్యతో శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోరా దని చెప్పుట. } ♦—

కం॥ ఈసరణిని విలపించెడి. కౌసల్యం జూచి దైన్య ♦ కలితాననుఁ డై
యాసౌమిత్రియుఁ దద్వే, ళాసదృశము లైనవాక్కు ♦ ల న్వచియించెన్.

ఈసరణిని=ఈవిధముగ, దైన్యకలితాననుఁడై=వెలవెలఁబోయిన ముఖము కలవాఁడై, తద్వేళాసదృశములు=ఆకాలమునకుఁదగినవి- అనుటచే లక్ష్మణుఁడు ధర్మమును దూషించుచుఁ జెప్పెడిమాటలు పరమార్థములైన యతనియభిప్రాయములుగావనియు నన్నునేవిధముననైన నడవికిఁ బోకుండఁజేసి సుఖపెట్టంగోరి చెప్పెడి మాటలనియు గ్రహింపవలెను-ఇట్టి దనుభవమందు నేఁటికిని గననగును-దీనివలన లక్ష్మణునందు నవిద్యగలదను నభిప్రాయము సరిగాదు.

తాత్పర్యము

ఈవిధముగ నేడ్చుచున్న కౌసల్యంజూచి ముఖము వెలవెలఁబోవ లక్ష్మణుఁడు ఆకాలమునకుఁదగిన మాటల నిట్లు చెప్పెను.

ఉ॥ ఆఁడుది యాడినట్టి పలు♦కం దొకయాదరబుద్ధి నిల్పి యే
పోఁడిమి లేక రాజ్యమును ♦ భోగము లన్నియు మాని కానకు
న్వాఁడిమిఁ బాసి పోవు టన ♦ నాకును లో రుచియింప దయ్యెడున్,
ఱేఁ డన వృద్ధు వెక్కలి మఱిన్ మరుత్రిప్పులఁ జిక్కి యాడెడిన్. ౨౧౯

వాఁడిమి=పౌరుషము, వెక్కలి=మనస్సు చెదరినవాఁడు- అర్లుమర్లుకలవాఁడు, మరుత్రిప్పులన్ = కామవేదనచే.

పలుకందు=ఉదంతములైన యమహద్వాచకంబులకు 'కంటె - అందు' వర్ణకంబులు పరంబులగు నపుడు కొండొకచో నగాగమంబునునగు - పలుకందు - పలుకునందు.

తాత్పర్యము

ఎవతెయో యొకయాఁడుది నోటికివచ్చినట్లెల్ల వదరఁగా, దానియందు నాదరబుద్ధియుంచి, యేసుఖమునొల్లక, రాజ్యభోగములన్నివదలి, పౌరుషము విడిచి,యడవికిఁబోవుట యనునది నాకు సమ్మతమైనదికాదు- ఆఁడుదానిమాటలు గావే తండ్రిమాటగదాయని శ్రీరాముఁడను నేమో అయనరాజుగదా ఆయన యాజ్ఞ రాజాజ్ఞ దానిని మీఱవచ్చునా యనునేమో- యనితలఁచి యనుచున్నాఁడు స్వస్థచిత్తుడై లోపడవలసినదేవిధి- ఈరాజో వృద్ధు - ఆకారణము చేతనే స్థిరచిత్తములేనివాఁడు- దానికిఁదోడు కామవశుఁడై చిక్కి యెవతె యెట్టులాడించిన నట్టులాడువాఁడు - ఇట్టివానిమాట పాటింపఁదగునా?

కం॥ మతి చెడి విషయసుఖైకని,రతుఁడై విపరీతబుద్ధి♦రా జంగజచో
దితుఁడై యేపలు కాడఁడు? సతివలలం జిక్కువాఁడు♦జడుఁ డగు టరుదే?

తాత్పర్యము ౨౨౦

దశరథుఁడు తొలుత వార్ధకముచేతనే మతిచెడిన చపలచిత్తుఁడు- అందు విషయసుఖములందే మిక్కిలి ప్రీతిగలవాఁడు- అటుగాకున్న నింతటి ముసలివానికి,గాడు ఠమ్మని పీడు పొమ్మనఁ గాటికిఁగాళ్ళుచాఁచి యుండువాని, కింకను

గామములా? విషయసుఖమే పరమార్థముగ నెంచువాఁడు విపరీతబుద్ధి యగు టేమి యాశ్చర్యము- 'వినాశకాలే విపరీతబుద్ధి' యని కలదుకదా- అందు మన్మథ ప్రేరితుఁడై యుండువాఁడు పలుకరాని మాట యేదికలదు?అట్లు బుద్ధి లేనివాఁ డేదియైన వదును- 'కామే ప్రసక్తః పురుషః కిమకార్యం వివర్జయేత్. భార. ౧౨-౭౭-౭౧. కామాసక్తుఁడగు పురుషుఁ డేయకార్యమును వదలును? అవన్ని లెక్కకుఁదీసికొనవచ్చునా? కామదాసుఁడు బుద్ధిహీనుఁడగుట యాశ్చర్యమా? కామాన్ధోపి నపశ్యతి' యనికలదుకదా-అర్థాంతరన్యా-సాలంకారము- సామాన్యలోక న్యాయముచే విశేషము సాధింపఁబడును.

ఉ॥ తప్పదియేమొ నే నెఱుఁగఁ◆దథ్యము రామునియందు తేఁడు దా
నిప్పగిది న్వనావళికి◆నేగు మ టంటకు, నింతపాపమా?
యొప్పనివాఁడె యైన, నొక◆యొప్పమి దండితుఁ డైన, దూఱఁ గా
నెప్పు డెఱుంగ నే నెదురు◆నేనియుఁ జాటుగ నేని రామునిన్. ౫౮౪

తా త్ప ర్య ము

అటుగాదు- రాజు స్వస్థచిత్తుఁడే. మనఃపూర్వకముగానే తెలిసి చెప్పెనం దురా- స్వస్థచిత్తుఁడగు వాఁడొకని దండించునపుడు ముందుగ వాఁడుచేసిన నేర మేమో చెప్పి నీవీనేరము చేసితివికావున నీకీ శిక్షయని చెప్పవలె- రాజు శ్రీరామునం దేమినేరముమోపి దండకకుఁ బొమ్మనెను- శ్రీరాముఁడు దండకకుఁ బోఁదగిన తప్పేమిచేసెనో సత్యముగా నే నెఱుఁగను- నేరములేక యడవికిఁ బొమ్మనెనే ఇంత పాపకార్యముండునా? విరోధియైనను ఒకనేరముచేసి శిక్షింపఁ బడినవాఁడైనను శ్రీరాముని నెదురఁగాని చాటుగఁగాని దూషింపఁగా నేను విన్నది కన్నదిలేదు. ఎప్పుడు శ్రీరామునితోడనుండు నాకే తెలియనిది యెచ్చటనో మూలయింట నాఁడంగులతో ముచ్చటలాడు ముసలికెట్లు తెలిసెను? తెలిసియుండెనా చెప్పరాదా?

మత్తకోకిలము. దేవకల్పు ఋజున్ సుదాంతుని◆దేవి! శత్రుల నైన స
ద్భావుఁడై దయఁజూచు వాని ని◆తాంతపుణ్యునిఁ బూజ్యునిన్
భూవరుం డొకతప్పు లేక యుఁ◆బుత్రు నెట్టిస్వధర్మ సం
భావనం బుఱిఁబాసి పొ మ్మనెఁ?◆ ప్రాజ్ఞు లియ్యది మెత్తురే?

దేవకల్పున్=పరదైవముతో సమానుని, ఋజున్ = యథార్థప్రవర్తనము గలవానిని, మత్తకోకిల - వృత్తమునకు - రసజజ భరగణములు - ౧౧ వ యక్షరమున యతి.

తా త్ప ర్య ము

పరదైవముతో సమానుఁడై చక్కటి నడవడిగలవాఁడై యింద్రియనిగ్రహము గలవాఁడై, శత్రువులనైన మంచి యభిప్రాయముతో దయతోఁ జూచువానిని, మిక్కిలి పుణ్యవంతుని, నెల్లవారికిఁ బూజింప యోగ్యుఁడగువానిని, జ్యేష్ఠ

పుత్రుని నొకతప్పైన లేక మనుష్యమాత్రుఁడు వక్రవర్తనుఁడు ఇంద్రియ లోలుఁడు నిష్కారణముగ భార్యనిమిత్తము దండింప సిద్ధపడువాఁడు (చూ. ప-౨౭౮) నగు వాఁడేరాజధర్మము ననుసరించి పురముపడిచి పొమ్మనెను ? వివేకముగలవారు దీనిమెత్తురా.

ఉ॥ పిల్లతనంబునన్ నృపుఁడు♦ప్రేలినచో నిటు ధర్మదూరతన్
జెల్లఁగ నిచ్చునే నృపతి♦నీతి నెఱింగిన రాచబిడ్డఁ డో
తల్లి! యెవండు నైన నని♦తాలిమి పట్టఁగ లేక వెండి తా
నల్లన లక్ష్మణుండు జన♦కాత్మభవాపతితోడ నిట్లనున్. ౫౮౯

ప్రేలినచో=వదరినన్, తాలిమి=ఓర్పు, పిల్లతనంబునన్ = పిల్లవానివలె జ్ఞానములేక.

తాత్పర్యము

మూఢుఁడై రాజుధర్మ విరుద్ధముగా వదరినంతమాత్రముననే రాజనీతి యెఱింగిన యేరాజకుమారుఁడైన ఆమాటలు సాగనిచ్చునా? అని కౌసల్యతోఁ జెప్పికోపము పట్టలేక యోర్పువిడిచి శ్రీరామచంద్రునితోడనే లక్ష్మణుఁడిట్లనెను-

—♦ లక్ష్మణుఁడు శ్రీరామునితో నరణ్యమునకుఁ బోవల దని చెప్పుట ♦—

చం॥ ఇరుచెవి సోఁక కుండుమునుపే♦విషయంబు ధరాతలంబు నీ
గురుతరశాసనంబునకుఁ ♦ గోల్కొనునట్లుగ నేను దోడుగాఁ
ద్వరపడి చేయుమీ, మఱి కృ♦తాంతసమున్ నినుఁ జాపధారి నై
దురమున నేను గాచి నిలు♦తున్ మఱి నీ కొకయడ్డ మున్నదే? ౫౯౦

ఇరుచెవి = ఇరుగుచెవి- రెండవచెవి- ఈ చెవిలోఁబడినది ఆచెవిఁజేరక ముందే - అంతశీఘ్రముగ, గురుతరశాసనంబునకున్=మిగుల గొప్పయాజ్ఞకు కోల్కొనునట్లుగన్=అంగీకరించునట్లు, కృతాంతసమున్=యమునితో సమానుఁడైనవానిని, దురమునన్ = యుద్ధమందున్.

తాత్పర్యము

ఈవిషయము రెండవానిచెవిలోఁ బడకముందే యీభూమియంతయు నీ మహితశాసనమునకు లోపడునట్లు నా సాహాయ్యముతో శీఘ్రముగాఁ జేయుము యమునితో సమానుఁడవైన నీవే యెల్లవారిని జయింపఁగలవు- ఇఁకఁ గోదండము ధరించియుద్ధమందు నిన్నుఁగాచుచు నేను నిలిచెదను. ఎవరు నీ కడ్డము రాఁగలరో చూతము.

ఉ॥ భాసురతేజ! తీవ్రశర♦వారపరంపర నిర్మనుష్యమున్
జేసెద, నింతలోనఁ బురిఁ ♦ జేడ్పడఁ దాభరతాప్తు లెన్వరేన్
డాసినఁ జించి చెండెదను ♦ డాకను, మెత్తఁదనంబు చేత నే
నాసియుఁ గల్గఁబోదు, పరి♦భావితుఁ డౌఁ బరిపంథికోటిచేన్. ౫౯౧

భాసురతేజ=ప్రకాశించు తేజస్సు గలవాఁడా, నిర్మనుష్యము=మనుష్యులు లేనిదానిగా, వాసి=కీర్తి, పరిభావితుఁడు=అవమానింపఁ బడినవాఁడు, పరిపంథి కోటిచేన్ =శత్రుసమూహముచే.

సూర్యతేజా! తీక్ష్ణములైన శరసమూహముల వరుసలచే నీపురివారు నీ పట్టాభిషేకమున కడ్డమువచ్చిరేని యయోధ్యను మనుష్యరహితముగఁ జేసెదను. భరతునకుఁ గావలసినవా రెవ్వ రడ్డమువచ్చినఁ బరాక్రమమునఁ జించిచెండాడెదను. మెత్తగానున్న మొత్తబుద్ధియైనదన్నట్లు మెత్తనితనముచే నే కీర్తియు రాదు. పైపెచ్చు శత్రువులచే నవమానింపఁబడును.

కం॥ తనయాలికి లోపడి మన,జనకుఁడు పగతుండువోలెఁ♦జరియించినయేన్
గనికరములేక వలయుం దునుమంగా నొండెఁ, జెఱను♦ద్రోయఁగనొండెన్.

తాత్పర్యము ౫౯-౨

పరుల నట్లుచేయుదువు. తండ్రియే విరోధిగదా- ఆయన వచ్చిననేమి చేసెదవందువా-తనభార్యకు వశుఁడై యామెపక్షమూని మనకు విరోధివలె దశరథుఁడు వర్తించెనా తండ్రికదాయను దయలేక చంపవలెను.లేదా యూపిరితోఁ జిక్కినఁ జెఱసాలలోఁ ద్రోయవలయును.

శ్లో॥ పుత్రస్సఖా వా భ్రాతావా, పితావా యది వా గురుః
రిపుస్థానేషు వర్తంతే। హంతవ్యా భూతి మిచ్ఛతా॥ భార-౧-౧౪౦-౫౨.

కొడుకుగాని - సఖుఁడుగాని తోడఁబుట్టినవాఁడుగాని తండ్రిగాని గురువుగాని శత్రువువలె వర్తించెనా యైశ్వర్యము గోరువాఁడట్టివానిని జంపవలెను.

తే॥ కార్య మియ్యదియిదియు న♦కార్యమనుచుఁ,
దెలియకైనను గర్వంబు♦బలిమినైనఁ
గానితెరువునఁ జనియెడి♦వాని గురునినైన దండింపవలయు ధ♦ర్మైకనిరత.

ధర్మైకనిరత=ధర్మమునందే యెక్కువ ప్రీతిగలవాఁడా! అకార్యము = చేయరానిది, కాని తెరువునన్=పోరానియధర్మమార్గమున, గురునైన=తండ్రినైనను, పరశురాముని భీష్ముఁడు దండించి నట్టు లాచార్యునైనను.

తాత్పర్యము

ధర్మైకనిరతా! యది చేయఁదగినది యిది చేయరానిది యని తెలియక యజ్ఞానముచేనైనను తెలిసి తెలిసి నాకెదురెవ్వరని గర్వముచేనైనను దప్పుత్రోవలఁబోవువాని దండ్రినైన నాచార్యునైన దండించుటే తగినపని. ఇది ధర్మశాస్త్ర పద్ధతి.

ఉ॥ ఏమిబలంబు నచ్చి ధర•ణీశ్వరుఁ డేమి నెపంబు పెట్టి నీ
భూమిభరంబు నీవలనఁ•బూన్పక కైక కొసంగ నెంచెడిన్?
శ్రీమహితా! నృపాలకుఁడు•నీయెడ నాయెడ వైర మూని తా
నేమిగతిన్ ఘటించు నవ•నీశ్వరుఁగా నలకైకపుత్రునిన్ ? ౨౮౪

నచ్చి = నమ్మి. తాత్పర్యము

రాజు తానెవరి సాహాయ్యము నమ్మి యేమి నెపముపెట్టి యారాజ్యభారము నీయందుంచక కైక కీయఁదలంచుచున్నాఁడు. ఈయనకుఁగల ముఖ్యబలము మనమిరువురము-భరత శత్రుఘ్నులునందువా, వారిచ్చటలేరు. ఇట్టి సందర్భములలో మనయిరువురితో విరోధించి కైక కుమారునెట్లు రాజుగఁ జేయఁగలఁడు. అది సాధ్యమా.

మ॥ వినుమీ నామదిభంగి నోజనని దే•వీ! భ్రాతృభావంబు మై
ననురక్తుండ భవత్తనూజునకు, స•త్యాభీష్టదానాశుగా
సనరాజంబుల మీఁదఁ జేసెదను బా•సన్, సంజ్వలద్వహ్నినేన్
వనినేన్ రాముఁడు చొచ్చుచోఁ దలఁపుమా•ప్రాగ్వర్తిగా నన్నెదన్. ౨౮౫

భ్రాతృభావంబుమైన్=అన్నయను తలంపుచేత, భవత్తనూజునకు=నీ కుమారునందు, అనురక్తుండన్=అనురాగము గలవాఁడను, సత్య=సత్యముమీఁదను, అభీష్టదాన = ఇష్టదేవతార్చనమీఁదను నేనిదివఱకుఁజేసిన దానములమీదను, ఆశుగాసన రాజంబులన్ = శ్రేష్ఠమైన విండ్లమీఁదను, బాసన్=ప్రమాణమును, సంజ్వల ద్వహ్నినేన్ = మండుచున్న మంటయందునైనను, వనినేన్ = అడవియందునైనను, ప్రాగ్వర్తిగాన్=ముందు నడచువానిఁగా-

తాత్పర్యము

ఇట్లు శ్రీరామునితోఁ జెప్పి కౌసల్యనుజూచి దేవీ! నాకన్నతల్లి నాకెట్టిదో నీవు నాకట్టిదానవే. కావునఁ గన్నతల్లివని చెప్పుచున్నాను గాని సవతితల్లివని చెప్పరాలేదు. నామనస్సు విధము స్పష్టముగాఁ జెప్పెదను వినుము.అన్నయను తలంపుతో నీకొడుకునందు ననురాగము గలవాఁడనే కాని యితరాలోచనములు నితరలాభములు దలఁచికాదు. శ్రీరామునకు భరతునివలెఁ నీవును సవతితల్లి కొడుకవేకదా? చాటుగనుండి వాఁడింతచేసెను. ఎదురుగనుండి నీవెంత చేయనున్నావో ఎవరెఱుఁగు రందువా. సత్యముమీఁదను ఇష్టదేవతార్చనముమీఁదను, నేను బట్టెడు శ్రేష్ఠమైన విండ్లమీఁదను ప్రమాణము చేసెదను. శ్రీరాముఁడు మండెడు మంటలో దుముక సిద్ధపడినను అడవిలోఁ ప్రవేశింప సిద్ధపడినను నన్నాయనకు ముందుగా నడుచువానిఁగా నెంచుము.

కం॥ సూర్యుఁడు చీఁకటివలెనే, వీర్యంబున నీదుమనను•వేఁకి వెలార్తున్
గార్యం బిది చూడుఁడు నా, శౌర్యం బోజనని! రామ•చంద్రుఁడు నీవున్.

వేఁకి = తాపము, వెలార్తున్ = పోఁగొట్టుదును.

తాత్పర్యము

నీ వింతటి వ్యసనాంధకారములో మునిఁగి పరితాపపడుచున్న దానవుకదా. నీ పరితాపమును సూర్యుఁడు చీఁకటిని విరియించునట్లు రూపుమాపెదను. తల్లి యిది యిపుడు చేయఁదగిన కార్యము. ఈవిషయమున నేనెట్లు వర్తింతునో నీవు రామచంద్రుఁ డూరక చూచుచుండుఁడు. అనుజ్ఞమాత్ర మిండు.

ఉ॥ అన్నను భ్రాతృభక్తి నతఁ ♦ డాడినయానుడు లాలకించి యా
పన్నదశాప్తి కేడ్చుచును ♦ బంకజలోచన పుత్రుఁ జూచి యో
యన్న! భవత్సహోదరుఁ డె ♦ యాడినపల్కుల నాలకించి తే
పన్నగ నీకుఁ జిత్త మెటు♦వచ్చు నటుల్ ఘటియింపు పుత్రకా! ౨౮౭

ఆపన్నదశాప్తికిన్=విపద్దశ సంప్రాప్తించినందులకు,భవత్సహోదరుఁడె= నీతమ్ముఁడె.

తాత్పర్యము

అన్నవిషయమై కేవల భ్రాతృభక్తిచే లక్ష్మణుఁడు చెప్పినమాటల విని యెంత కష్టకాలమువచ్చెరా దైవమా కన్న కొడుకు కడపికిఁబోవఁజూతునా? కొడుకులు తండ్రిని వధింపఁజూతునా? ఒకప్రక్క కొడుకు ఒకప్రక్క మగఁడు.ఇద్దఱు రెండు కన్నులు- ఏకన్ను పోఁగొట్టుకొన నంగీకరింతును. అని యేమి చెప్పుటకుఁ దోఁపక కౌసల్య శ్రీరాముని(జూచి యన్నా నీ తమ్ముఁడేమి చెప్పుచున్నాఁడో వింటివి గదా. నేనేమియుఁ జెప్పఁజాలకయున్నాను. నీకు నేది ధర్మమని తోఁచునో యదిచేయుము. అడవులకుఁ బోవుటబాగని తోఁచిననట్లే చేయుము. పరాక్రమమున రాజ్యము సంపాదింపఁజూచిననట్లే చేయుము.

ఇట్టి మాట ధర్మాత్ముని తల్లియగు ధర్మాత్మురాలు చెప్పెనుగాని కైకవంటి యర్థదాసియయి యుండినఁ దండ్రిని వధించి రాజ్యమును గొనుమని చెప్పి యుండును. దుర్యోధనుఁడు యుద్ధమందుఁ దనకు జయముగలుగ దీవింపుమని తల్లియగు గాంధారి నడుగఁగొడు కధర్మమందున్నాఁడని తెలిసియుఁ బుత్రాభిమానంబున నీవే గెలువుమనక ధర్మము జయించునుగాక యని దీవించెను. ఎంతటి విపత్తియందును ధర్మాత్ములు ధర్మము తప్పరు.

కవిరాజ విరాజితము.

మనసున నాసవతాలు వచించిన♦మాటను బట్టి గృహంబున న
న్ననయము దుఃఖములందు మునుంగు మ♦టంటయు నీకును ధర్మమొకో?
ఘనమతి! ధర్మము సల్పఁగ నీయెదఁ ♦ గల్గినచోఁ బరిచర్యల నన్
దనుపఁగ రాదొకొ, తల్లిని గొల్చుట ♦ ధర్మము గాదె తనూజులకున్? ౨౮౮

అనయము=సర్వదా, ఘనమతి=ధర్మమందు గొప్ప మనస్సుగలవాఁడా, పరిచర్యలన్=సేవలచే, తనుపఁగన్=తృప్తిపడఁజేయ, తనూజులకున్=కుమారులకు, కపిరాజ విరాజితము నగణముమీఁద నాలుజగణములు నొక్కగురువు. ౧౩వ యింట యతి ఇందలి యతి గుఱించి యిదివఱకే వ్రాయబడెను.

తాత్పర్యము

నిన్నాజ్ఞాపించినవాఁడు తండ్రిగాఁడు. నాకు సహజవిరోధియగు నాసవతి. అది చెప్పినమాటను మనస్సుననిలిపి కన్నతల్లినగు నన్ను శాశ్వతదుఃఖములందు నీవు ముంచుగుమనుట నీకు ధర్మమా అర్థము నాకుఁ బరమార్థముగాదు. ధర్మమేయందువా రాజ్యములేకున్నఁబోనీ నాశుశ్రూషచేయుచు నాయింటనుండుము. కొడుకులకు మాతృసేవ ధర్మముగాదా.

మత్తకోకిలము. నిండుభక్తి భజించి తల్లిని•నిల్చి యింటనె మున్ను వి
ప్రుండు కాశ్యపుఁ డన్మనీశుఁడు•పొందఁడే సురలోకమున్,
దండిగౌరవమందు ఱేనికిఁ•దక్కు వౌనాకొ తల్లి? నీ
వుండు మిందుఁ, బ్రవాసి వౌటకు•నొల్ల నాజ్ఞనొసంగగన్. ౩౯౯

తల్లి సేవచేయుట పరమధర్మమని దృష్టాంతము చెప్పుచున్నది. కాశ్యపుఁడు కశ్యపవంశమునఁ బుట్టినవాఁడు, ప్రవాసివి = దేశాంతరవాసివి, మత్తకోకిల—౧౧వ యక్షరము. యతిరస జజభరలు గణములు.

తాత్పర్యము

కశ్యపు వంశమునఁబుట్టిన యొక బ్రాహ్మణుఁడు పూర్వము తక్కినవారివలె నడవులకుఁబోయి యే తపస్సుచేయక యింటనేయుండి మాతృశుశ్రూషచేసి దానివలననే తక్కినవారు తపస్సుచే సాధించెడి స్వర్గమును సాధించెను. విశేషగౌరవమందు రాజునకంటెఁ తండ్రికంటెఁ దల్లి తక్కువయగునా. ఏభ్యోమాతాగరీయసీ యను వాక్యము వినలేదా. కాఁబట్టి నీతండ్రియాజ్ఞకంటె నాయాజ్ఞ తక్కువయినదికాదు— నీ వింటనే యుండుమని నేనాజ్ఞ చేసెదను. ఊరువిడిచిపోవ నేనన్నుజ్ఞనీయను.

మత్తకోకిలము. నిన్నుఁ బాసి వసింపఁగల్గిన•నిశ్చయం బిది పుత్రకా!
యన్న మేటికి నీర మేటికిఁ • ప్రాణ మేటికి సౌఖ్య మం
చెన్న నేటికి? నీవు గల్గిన • నిన్ని యున్నటు దోఁచుఁగా,
తిన్నచో నునుఁబచ్చికైన మ•దిం బ్రియం బొనరించు రా!

తాత్పర్యము ౪౦౦

నిన్ను విడిచి నేనింట నుండుటయే కలిగెనేని కుమారాయొకటి నిశ్చయము. ఆవల నాకన్న మేల? నీళ్ళేల ? తుదకుఁ బ్రాణమైననేల ? ఇఁక సుఖము మాట చెప్పనేల? రామచంద్రా నీవు నాయొద్దనుంటివా యివన్నియు లేకున్నను

నున్న యట్టులే ప్రాణము సంతోషించును. లేక పచ్చిక దిన్ననునాకెంతో సంతో షముగ నుండును.

కం॥ నే నింట నేడ్చు చుండఁగ, గానలకున్ నీవు పోవఁ•గాంక్షించెదవే
నే నొల్లను జీవింపఁగఁ, బూనుదుఁ బ్రాయోపవేశ•మున్ నాతనయా. ౯౧

ప్రాయోపవేశము=మరణించువఱకుఁగూడు నీళ్ళు వదలి యొకచోఁ బడి యుండుట, అనశనవ్రతము.

తా త్ప ర్య ము

రామచంద్రా! నీవింటిలో నేడ్చుచుండుమని నీవు మాత్ర మడవులకుఁ బోవఁ గోరెదవా నేను బ్రదుక నిష్టపడను. ఇప్పుడే ప్రాయోపవేశము చేసెదను.

కం॥ నను వీడనాడి కొడుకా! వనములకుం జనెద వేని•వచ్చును జుమ్మీ
ఘననిరయ మధర్మంబున, వననిధికిన్ బ్రహ్మహత్య•వచ్చినకరణిన్. ౯౨

బ్రహ్మహత్య=బ్రాహ్మణుని దుఃఖపెట్టుటవలన వచ్చుపాపము. సముద్ర మునకు వచ్చిన బ్రహ్మహత్య యేమన!, పిప్పలాదుఁడను ఋషి సముద్రతీర మునఁగూర్చుండి తపస్సుచేయుచుండ సముద్రుఁడాయన తపస్సు సాగనీయక యాయన వస్తువులను దనలోనికిఁ దీసికొనుచు బాధించెను. దానిపై నాయన కోపించి సముద్రుని బాధింప శక్తినొకటి పంపెను. అది సముద్రుని వేధించు చుండెను. సముద్రస్నానము చేయువారలీ దోషము తమకుఁ దగులకుండుటకై యొకటియోరెండో ఱాలు సముద్రమున వైచుచు

శ్లో॥ పిప్పిలాదసముత్పన్నే, కృత్యేలోకభయంకరి
పాషాణాంతే మయాదత్త, మాహారార్థం ప్రకల్పితమ్.

అను శ్లోకమును బఠింతురు. కావున సముద్ర విషయమున బ్రహ్మహత్య యనఁగాఁబిప్పలాదుని బాధించుటచే సముద్రమునకు శక్తివలనఁ గలిగిన బాధ యని యర్థము అట్టులే నీవడవికిఁ బోయితివా నన్ను బాధించిన దోషము నీకుఁ గలుగును అని భావము.

2. అధర్మమునఁ దల్లిని దుఃఖమున ముంచి దానివలన బాధకలుగునట్లు చేయుటచే సంభవించిన పాపముచేత బ్రహ్మహత్యవలనఁ గలుగు నరకబాధ వంటి బాధకలుగునని యర్థమని కొందఱందురు.

తా త్ప ర్య ము

నన్ను వదలి నీవు వనమునకుఁబోయితివా రామచంద్రా యధర్మమున సముద్రమునకు బ్రహ్మహత్యవచ్చినట్లునీకును మాతృహత్యా దోషమువచ్చును.

కం॥ ఇటు విలపించుచు నిజకట, తటముల పొష్పంబు లురలఁ•దద్దయు దుఃఖ
త్రుటితహృదయ యగుతల్లికిఁ, బటుగతి రాముండు ధర్మ•పద్ధతిఁబలికెన్

నిజకట తటములన్=తనచెక్కిళ్ళమీదఁ, బాష్పంబులు=కన్నీరు, ఉరలన్ రాలుచుండఁగా, తద్దయున్=మిక్కిలి, దుఃఖత్రుటితహృదయ = దుఃఖముచేఁ జీల్పఁబడిన హృదయముగలది.

తా త్ప ర్య ము

ఈప్రకారము కన్నీరు చెక్కిళ్ళపై రాలుచుండ దుఃఖాతిశయముచేగుండె చెదరి యేడ్చుచుండ తల్లికి ధర్మమార్గవిధమును శ్రీరాముఁడిట్లుచెప్పెను.

—♦ శ్రీరాముఁడు కౌసల్యాలక్ష్మణుల నూరార్చుట ♦—

కం॥ తల్లీ! జనకుని వాక్యము, నుల్లంఘింపఁగను శక్తి♦యున్నదె, నీవే
యుల్లమునఁ దలఁపు, మేగెదఁ,జల్లనిచూపులను జూడు♦సాఁగిలపడెదన్.

ఉల్లంఘింపన్=దాఁటుటకు, ఉల్లమునన్=మనస్సునందు. ౬౦౪

తా త్ప ర్య ము

తల్లీ! పుత్రునకుఁ దల్లిదండ్రులిరువురు సమానపూజ్యులే అయినను ముందాజ్ఞాపించినవాఁడు తండ్రి ఆ వెనుకఁ దద్విరుద్ధముగ నాజ్ఞాపించుదానవు నీవు, ముందాజ్ఞాపించిన తండ్రివాక్యమును మీఱిపోవు శక్తి నామాట యటుండ నిమ్ము నీకైనఁ గలదా? నీవే యాలోచింపుము. కావున నన్ను నీమాట వినలేదని కోపింపకుము. నాక్షేమముఁగోరి చల్లనిచూపులఁజూడుము, సాష్టాంగముగ నమస్కరించెదను. పితురాజ్ఞా పరోధర్మః, స్వధర్మో హ్యాత్మరక్షణమ్.అను ప్రమాణము చొప్పునఁ దండ్రియాజ్ఞ పరమధర్మము.

కం॥ జనకుని వాక్యముఁ బాటిగఁ,గౌని వ్రతి యగుగండుమౌని♦గూల్పఁడెగోవున్
జననీ! ధర్మము సూక్ష్మతఁ,గనికాదె యొనర్చె?దానఁ♦గలిగెనె యఘముల్?

పాటిగన్=ధర్మముగ, వ్రతి=పితృవాక్యపరిపాలనదీక్ష, గలవాఁడు.

తా త్ప ర్య ము

తండ్రిమాటనుబట్టి యితరులకు బాధకలిగింపవచ్చునా యంటివి, తండ్రి మాటపాటించిగదా కండు మౌని గోవధముచేసెను. పితృవాక్యపరిపాలనమున గోవధరాదనికాదా ధర్మరహస్య మాలోచించి యాయన యాపని చేసెను. గోవధము చేయరాదని పితృవాక్య ముల్లంఘించియుండిన నరకమునకుఁ బోయి యుండునుగదా.

చం॥ ఇతరులమాట లేల జన♦నీ! విను మాకులమందు మున్ సరి
త్పతి ఖననంబుఁ జేసినన్నృ♦పాలురు సాగరు లుర్విఁ ద్రవ్వ చో
మతిఁ దమతండ్రిమాట గొని♦మాననిశూరత భూతకోటులన్
హత మొనరింప రొక్కొ తమ♦ప్రాణవినాశము నోర్చి యేనియున్. ౬౦౬

సరిత్పతి=నదులకుఁబతియగు సముద్రుని, ఖననంబు=త్రవ్వుట, సాగరులు=సగరపుత్రులు.

తాత్పర్యము

ఇతరుల ముచ్చటలేలగాని మావంశమందే పూర్వము సగరచక్రవర్తి కుమారులు సముద్రము ద్రవ్వుచోటఁ దండ్రిమాటఁబట్టి దయలేక యనేక జీవకోటులను దమకు రాఁగల ప్రాణాపాయమునకు భయపడక హింసించిరి.

కం॥ తండ్రి వచించె నటంచును, దీండ్రించుకుఠారధారఁ•దెగ వ్రేయఁడొకో
గండ్రలుగఁ గన్నతల్లిని, వేండ్రంబుగ భార్గవుండు•వినమా దీనన్. ౬౦౭

తండ్రిమాటలనుబట్టి తల్లినే హింసించినవారు గలరని చెప్పుచున్నాఁడు.

తీండ్రించు=మండునట్లు ప్రకాశించు, కుఠారధార=గండ్రగొడ్డలి వాదరచేత, గండ్రలుగన్=తునుకలుగ, వేండ్రంబుగన్, తీక్ష్ణముగ, భార్గవుఁడు=పరశురాముఁడు.

తాత్పర్యము

తండ్రి యాజ్ఞాపించెనని కదా పరశురాముఁడు తనపదునైన గండ్రగొడ్డలిచేత దనతల్లి శిరమును ఖండించెను. ఇది మనము విన్నదేకదా.ఇట్లుండఁ దల్లికి దుఃఖమని తండ్రిమాట దాఁటవచ్చునా.

కం॥ ఎందఱొ మహానుభావులు, బృందారకసము లొనర్చి•పితృవాక్యంబున్
జెందిరి యసంబు, నే నే, చందంబునఁ జేయకుందు•జననీ! చెపుమా.౬౦౮

బృందారకసములు=దేవతలతో సమానులు.

తాత్పర్యము

తల్లీ! దేవతలతో సమానులైన యెందఱో మహానుభావులు తండ్రివాక్యమును బాలించి కీర్తి సంపన్నులైరి, ధర్మశాస్త్రము శిష్టాచారము నిట్లుండతండ్రి యాజ్ఞ నెఱవేర్పకుందును.

సీ॥ ఏనొకండనె కాను•హితగతిఁ బితృవాక్య,పాలకుల్ పెక్కండ్రు•వసుధఁగలరు
నే నపూర్వపుధర్మ•మూని నీ కిటు ప్రతి,కూలుండ నైపోవు•కోర్కి లేదు
పూర్వులు పెంపుమైఁ•బోయినత్రోవన, యరిగెదఁ గాని యన్యం•బుగాదు
కావున జనకోక్తి•కార్యంబు, జనకుని,వాక్యంబు వినఁ కున్నఁ•బావ మొదవు
తే॥ నిశ్చయంబుగఁ జనుదు వ•నీనివాస,
మునకుఁ జింతింప వలవ దో•పుణ్యచరిత
నన్నుఁ గరుణార్ద్ర దృగ్గస•న్నాతుఁ జేసి,
కాన కంపుము దయచేసి•కనరువాసి ౬౦౯

హితగతిన్=హితమైనరీతి, పితృవాక్యపాలకుల్=తండ్రివాక్యమును బరిపాలించినవారు, అపూర్వధర్మము,ప్రతికూలుండనై=విరుద్ధభావముగలవాఁడనై,

వనీ నివాసమునకున్=అడవులందు వసించుటకు, కరుణార్ద్రిదృక్ రసస్నాతున్=దయారసముచేఁ దడిసిన చూపులను నీటియందు స్నానముచేసిన వానినిఁగా, కనరు=కోపము, పాసి=వదలి, పెంపుమై

అభ్యుదయముఁగోరి పూర్వులు చేసినవన్నియు మనము చేయవచ్చునా? చంద్రునివలె గురుద్రోహము చేయవచ్చునా? యందువేమో, చంద్రుఁడభ్యుదయము గోరిగాదు. పితృాజ్ఞచేతనుగాదు చెడ్డకార్యముచేయుట, కామాతురతఁ గావున నది సరిగాదు, మాతృవధాదులు దృష్టాంతముగాఁ జెప్పెదవు, అది సాహసకార్యమని యనుష్ఠేయముకాదని శాస్త్రము "దృష్టోధర్మవ్యతిక్రమస్సాహసంచ పూర్వేషా"మ్మని వారివాక్యముల నిందింపలేదా, యందురేని యిచ్చట శాస్త్రాభిప్రాయము వ్యాఖ్యాతలయభిప్రాయముగాదు. ఈ శ్లోకమునందు నిందింపఁబడిన సాహసము తండ్రియాజ్ఞలేక చేసిన కార్యముగాని జనకాజ్ఞచేఁ జేసినది కాదు. ఇది యాలోచింపక వ్యాఖ్యాతలు వ్రాసినదానిని సరియని గ్రహింపరాదని గోవిందరాజీయము.

"పితుశ్శతగుణంమాతా, గౌరవేణాతిరిచ్యతే" తండ్రికంటెఁ దల్లినూఱంతలు గౌరవమందెక్కువ యనుశాస్త్రవాక్యము శుశ్రూషవిషయమే కాని యాజ్ఞావిషయముగాదు, ఆజ్ఞావిషయమునఁ దండ్రిగొప్పయని భావింపవలెను. "మాతా భస్త్రాపితుః పుత్రోయస్మాజ్జతస్స ఏవస" యను భారతవాక్య మీయర్థమునే సాధించుచున్నది.

పూర్వులుపోయిన త్రోవన యరిగెదన్.

యేనాస్యపితరో యాతాః। యేనయాతాపితామహాః
తేన యాయాత్సతాంమార్గం। తేనగచ్ఛన్నరిష్యతే॥ మను. ౪-౧౭౮

తండ్రులు తాతలేమార్గమునఁ బోయిరో యట్టిసాధుమార్గమునఁబోవువాఁడు క్షయింపఁడు.

సాధుమార్గమనుటచేఁ దండ్రితాతలు దొంగతనము అంకుతనముచేసినఁ దాను జేయరాదని భావము.

తాత్పర్యము

తల్లి పితృవాక్య పరిపాలనము త్తమ ధర్మమని యెంచువాఁడను నేనొకఁడనేకాను, అది హితమైన మార్గమని తలఁచి చేసినవారనేకులు గలరు, ఇంతవఱకు నాచారమందు లేని క్రొత్తధర్మ మవలంభింపఁబూని నిన్ను ధిక్కరింపలేదు, పూర్వులు నడచిన మార్గముననే నేను నడచుచున్నానుగాని వేఱొకత్రోవఁ బూనలేదు. కావున జనకునిమాట పాలించుటే తగినపని, తండ్రిమాట వినకుండినఁ బాపము సంభవించును, కాఁబట్టి నిశ్చయముగ నడవులకుఁ బోదును, నీవు పుణ్యాత్మురాలవు నాకుఁ బాపమువచ్చు పని చెప్పకుము, వనవాసదీక్షకై

స్నానము కావలసియున్నది, కావున నీ దయార్ద్రదృష్టులను తీర్థముచే నన్ను స్నానము చేయింపుము. అడవికిఁ బోవ ననుజ్ఞయిమ్ము, నాయందు దయ యుంచుము.

కం॥ నిర్మలమతిఁ దల్లికి నిటు, శర్మంబుగఁ బలికి రామ•చంద్రుఁడు శశ్వ
ద్ధర్మ విదగ్రేసరుఁడును, ధర్మభృదగ్రేసరుండు•దమ్ముని కనియెన్. ౬౧౦

ధర్మంబుగన్=క్షేమముగలుగ, శశ్వద్ధర్మవిదుఁడు సనాతనధర్మము దెలిసినవారిలో వారిలో శ్రేష్ఠుఁడు ధర్మభృదగ్రేసరుండు=విల్లుపట్టినవారిలో శ్రేష్ఠుఁడు, శస్త్రపాండిత్యము శాస్త్రపాండిత్యము గలవాఁడని భావము.

తాత్పర్యము

నిర్మలమగు మనస్సుతోఁ తల్లికి క్షేమకరముగఁబలికి యామె సందేహములు దీర్చి సనాతనధర్మజ్ఞానమందును విలువిద్యయందును శ్రేష్ఠుఁడగు లక్ష్మణునితో నాయనను సమాధానపఱుపఁగోరి యిట్లనెను.

లక్ష్మణువాక్యములు రాజధర్మము ననుసరించి చెప్పఁబడినవి కావున నవి యధర్మములని చెప్పరాదు, అయినను రాజనీతియంతయు ధర్మముగాదు, ధర్మమంతయు రాజనీతియగును ధర్మముచే సాధింపలేనివారు రాజనీతి ననుసరింతురు. ధర్మైకనిష్ఠులు రాజనీతి ననుసరింపరు, కేవల ధర్మమేయనుష్ఠింతురు ఈ తెగలోఁజేరినవాఁడు శ్రీరామచంద్రుఁడు, ఆతెగవారి యభిప్రాయప్రకారము వాదించువాఁడు లక్ష్మణుఁడు. రామలక్ష్మణసంవాదమం దీవిషయము జ్ఞప్తియందుంచుకొనవలెను.

లక్ష్మణుఁ డన్న దుఃఖముపడుట సహింపలేక యావాదము చేసెనుగాని ధర్మద్వేషబుద్ధినిగాదు.

ఉ॥ తమ్ముఁడ లక్ష్మణా! విను స•తంబుగ నాపయి నీకు స్నేహమున్
ముమ్మర మౌటయున్ భవద•మోఘపరాక్రమసత్త్వ శౌర్య తే
జమ్ములు, నేరమిన్ జనని•చాలఁ దపించు టెఱుంగనోటు, స
త్యమ్ముశమమ్మునుందెలియు•ధన్యుఁడ వీవును నిట్లుపల్కుదే? ౬౧౧

సతంబుగన్=శాశ్వతముగ, ముమ్మరము=అధికము, భవత్=నీయొక్క, అమోఘ౽ వ్యర్థముకాని సత్త్వశౌర్యతేజమ్ములు=బలము, శూరత్వము తేజస్సు, నేరమిన్=అజ్ఞానముచే, ఎఱుంగనోటు=ఎఱుంగనాయేమి?

తాత్పర్యము

తమ్ముఁడా! లక్ష్మణా నీకు నాపై నమితమై స్థిరమైన స్నేహముండుటయు, నీ యమోఘబల పరాక్రమ తేజస్సులు, అజ్ఞానముచేఁ బుత్రమోహమునఁ దల్లి దుఃఖించుట, నే నెఱుఁగనా? ఆమె స్త్రీ. కేవలవాత్సల్యదృష్టినే చూచినది. నీవు సత్యము శమము దెలిసినవాఁడవు. నీవుకూడ నామెవలెనే యిట్లు పలుకవచ్చునా?

కం॥ నీ విటుపలికిన జననికి, భావంబున మీఱు దుఃఖ•పా టటుగానన్
గావింపకు మయ్యా నీ, వీవిధసంభాషణములు•హితమతి వగుచున్. ౬౧౨

తాత్పర్యము

తమ్ముఁడా! నీ వీ ప్రకారము పలికిన మీ యభిప్రాయమే సరియనియు, నా యభిప్రాయము తప్పనియు, నేను దెలియకయో, మూర్ఖత్వము చేతనో, యిట్లు చేయుచున్నానని యామెతలఁచి మఱింత దుఃఖింపసాగును. నా మేలు కోరినవాఁడవై తివా నీ విట్లు మాటలాడకుము?

కం॥ ధర్మమె పర మీజగతిని, ధర్మమె సత్యంబునకు ని•ధానం బగుటన్
ధర్మేద్ధ జనకవాక్యము, ధర్మంబా తప్పఁ ద్రోయ•ద త్త్వజ్ఞులకున్. ౬౧౩

ఈజగతిని=ఈలోకమందు, ధర్మమే పరము=ధర్మమే శ్రేష్ఠమైనది, నిధానము=స్థానము, ధర్మేద్ధ=ధర్మముచేఁ ప్రకాశించు తత్త్వజ్ఞులకున్ = వాస్తవ జ్ఞానులకు.

తాత్పర్యము

నాయనా! ధర్మార్థ కామ మోక్షములలో మొదటిదే ప్రధానము, అది విడిచినఁ దక్కిన మూఁడు లేవు, కావున మొదటిది మొదటిదే, సత్యమునకు ధర్మమే స్థానము, ఏ ధర్మమైనను సత్యమునందుఁ బర్యవసింపవలయును, సత్యము లేక ధర్మములేదు. కాఁబట్టి యారెంటికి నవినాభావ సంబంధము కలదు, కావున ధర్మముతోఁగూడిన జనకుని వాక్యమును దప్పఁద్రోయఁ దత్త్వ జ్ఞానులకుఁదగునా? అది యెవఁడైనఁ బామరుఁడు చేయఁదగిన కార్యముగదా

కం॥ జనకునివాక్యం బైనను, జననీ వాక్యంబునైన•న్మాబుధునుడి యై
ననుజలిపెదనని మఱి వృథ, చనఁ జేయఁగఁ దగదుధర్మ•శాలులకెందున్.

తాత్పర్యము ౬౧౪

లక్ష్మణా! తండ్రిమాటగాని తల్లిమాటగాని బ్రాహ్మణవాక్యముగాని ముందు చేసెదనని చెప్పి మరలఁదప్పుట ధర్మబుద్ధుల లక్షణముగాదు.

చం॥ పితృవచనానుసారముగఁ•బిన్నసవిత్రియు నాన తిచ్చె నేఁ
బ్రతిన యొనర్చినాఁడ సలు•పం దదభీష్ట, మ దేల తప్పుచున్,
మతిని ననార్య మౌనదయు•మార్గము క్షత్రియధర్మ మద్దిన
మ్మతిఁగనఁ బోకు, క్రౌర్యమును•మానుము, మన్మత మూనియుండుమీ.

పితృవచననానుసారముగన్=తండ్రిమాట ననుసరించి, పిన్నసవిత్రి= పిన్నతల్లి, ప్రతిన=ప్రతిజ్ఞ, అనార్యమౌ=సాధుసమ్మతముగానిదగు.

తాత్పర్యము

సౌమిత్రీ! తండ్రిమాట ననుసరించి పిన్నతల్లి చెప్పెను గాని యాయన మాట నతిక్రమించి చెప్పలేదుగదా, చెప్పినది యెవతె? దేశములోనుండు నెవ్వ

తెయోగాదు. మనపినతల్లి, వారు చెప్పుటమాత్రమేకాదు. వారియిష్టప్రకారము చేసెదనని నేను ప్రతిజ్ఞ చేసినాఁడను. అది తప్పుదునా? నీవు క్షత్రియనీతి యనుసరించి మాటలాడుచున్నావు, అది దయాహీనమైన మార్గము, అది అర్థము నిమిత్తమెంత ఘోరకార్యమైన సమ్మతించునది, దానిని నీవు గొప్పగాఁ జూడవలదు, కేవల సత్యమాధారముగాఁ గల నా ధర్మమతమును నవలంబింపుము.

కం॥ కనికరమున నిటు తమ్మున, కని తల్లిం జూచి యామె•యంఘ్రిద్వయి పై
 వినయనమితోత్తమాంగం,బును రాముఁడు నిల్చిపల్కెఁ•బుష్కలభక్తిన్.

కనికరమ్మునన్=దయచే, అంఘ్రిద్వయి=రెండుపాదములు, వినయ= అణఁకువచే, నమిత=వంపఁబడిన, ఉత్తమాంగంబును = శిరమును, పుష్కల భక్తిన్=నిండుభక్తిని.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి తమ్మునికి దయచే నిటు చెప్పితల్లి నిజూఁచియామె రెండు పాదములపై శిరస్సును నణఁకువతో వంచియుంచి నిండుభక్తితో నిట్లనియె.

శా॥ తల్లి! నాకు ననుజ్ఞ నిమ్మిపుడు కాం•తారప్రవాసార్థమై,
 పెల్లాడం గన కమ్మ, యెట్టిడుదు దే•వీ! నాదుప్రాణంబు పైఁ,
 దెల్లం బైనకృపాకటాక్షమునన్•దీవించి స్వస్త్యాదికం
 బుల్లం బార ఘటుంపుమీ, చెలఁగుమీ•సోత్సాహచిత్తంబునన్. ౬౧౩

కాంతారప్రవాసార్థమై=అడవికిఁ బ్రయాణమైపోయి యందు నివసించు నిమిత్తము, పెల్లాడన్=పెల్లు=విశేషము, ఆడన్=మాటలాడన్, కనకు=చూడకు, కనకుము+అమ్మ=కనకమ్మ, వ్యతిరేకమధ్యమమువర్ణకంబున కెల్ల యెడల లోపంబు విభాషనగు, సు, వ్యా, సూ, సంధి ౭౧ తెల్లంబు=స్పష్టము, సందేహము లేనిది, స్వస్త్యాదికంబు=స్వస్తి మొదలైనవి, ఆరన్=కొఱఁతలేక.

తాత్పర్యము

అమ్మా! ఇపుడు నేనడవులకుఁబోయి యందే వసింప నా కనుజ్ఞ నిమ్ము, విశేషించి విఘ్నవాక్యములు చెప్ప నాలోచింపకు, అట్లు చేసితివా నా ప్రాణము మీఁద నొట్టుపెట్టుదును, శంకలేని దయతోఁగూడిన నీ కడగంటి చూపులచేనన్ను దీవించి ప్రయాణము పోవువారికిఁ జేయవలసిన స్వస్తివాచనము మొదలయినవి కొఱఁతలేకుండ నుత్సాహముతోఁ జేయుము.

కం॥ జననీ! ప్రతిజ్ఞ దీఁచి, చనుదెంతు వనంబునుండి•చయ్యనఁ బురికిన్
 మునుపు యయాతియు స్వర్గం,
 బును విడి ధరనుండి మరలి•పోయిన మాడ్కిన్. ౬౧౪

తా త్ప ర్య ము

తల్లీ! పూర్వము యయాతియను మహారాజు స్వర్గమునుండి భ్రష్టుఁడై భూలోకమునకు వచ్చి సాధుసాంగత్యబలమున మరల స్వర్గమునకుఁ బోయినట్లు నేనును బదునాలుగు సంవత్సరములు వనములయందుండి మునులసంగతిఁ బ్రతిజ్ఞదీర్చి మరలవచ్చెదను.

చం॥ వగపును లోనణంపుఁ పితృ•వాక్యము దీరిచి వేగ వచ్చెదన్
మగుడఁగఁ, గన్నతండ్రి యగు•మానవపాలునిమాటఁ బట్టఁ బొం
దగుఁ గద నేను నీవు వసు•ధాత్మజ లక్ష్మణుఁడున్ సుమిత్రయుం
దగుగతిఁ, దల్లిరో! ఘనస•నాతనధర్మవిధం బిదే కదా? ౬౧౯

వగపు=వ్యసనము.

తా త్ప ర్య ము

అమ్మా! ఇట్లు గోలుగోలున నేడువకుము, అది నాకవశకునము, లోపలనే మ్రింగుము. వెలుపల రానీయకుము, తండ్రివాక్యము పాలించి త్వరగా వచ్చెదను. దీని కేడువనేల? కన్నతండ్రియు రాజునగు వానిమాట ప్రకారము నేను మాత్రమేకాదు. నీవు సీత, లక్ష్మణుడు సుమిత్ర నడుచుకొనవలసినవారలే కదా. గొప్పదియగు సనాతన ధర్మమిదియేకదా, నన్నుఁ బొమ్మన్నట్లు మీలో నెవ్వరినైనఁ బొమ్మనినఁ బోకయుందురా?

కం॥ మానిచి సంభారంబుల, నూనతనొందించి దుః ఖ•ముల్లంబున నా
కాననవాసంబునకున్, మానుగ సెల వసుమ ధర్మమార్గముఁ గనుమా. ౬౨౦

తా త్ప ర్య ము

జననీ! పట్టాభిషేకమునకై చేసిన యత్నము లెల్లవదలి మనస్సులోదుఃఖమణఁచి నే నడవులందు వసింప మనఃపూర్వకముగ సెలవిమ్మ, ధర్మమునాలోచింపుము.

తే॥ వినుతధర్మ మవ్యగ్రం బ•విక్లబంబు,నైన తనయునిమాటల•నాలకించి
తల్లి ధర సోలి తెలివొంది•తనయుజూచి,దైన్యపాటున నిట్లను•దలఁకుమదిని.

వినుతధర్మంబు= స్తోత్రముచేయఁబడిన ధర్మముగలది, అవ్యగ్రంబు =కలఁతలేనిది, అవిక్లబము=దృఢనిశ్చయముతోఁగూడినది,తలఁకు = చలించు, భయపడు.

తా త్ప ర్య ము

ఉత్తమ ధర్మమగుటచే నెట్టివారును శ్లాఘింపఁదగినదియు కొంతధర్మము కొంత యధర్మముగా సంకీర్ణముగాకుండునదియు చేయుదమా వలదాయను

తాత్పర్యము

అడవులకుఁబోవఁదలఁచిన కొడుకు నిశ్చయమెఱిఁగి కౌసల్య మిగులనాదరముతో దయతో దీవింపఁదలఁచినదియై.

—• ౨౫-వ సర్గము కౌసల్య శ్రీరాము నాశీర్వదించుట. •—

ఉ॥ గాసి తొలంచి మంచియుద•కంబుల వారిచి సాధ్వి మంగళా
శాసనముల్ వచించు, నిను•సాధ్యముగా దిఁక నాఁగ నాయనా!
వాసిగఁ బోయి రమ్ము రఘు•వంశమణీ! యిపు డీవు వైళ మా
యాసములేక క్రమ్మఱము•హాళిఁ జరింపుము సత్క్రమంబునన్. ౭-౨౪

వారిచి=ఆచమనముచేసి, మంగళాశాసనముల్=శుభకరములైన దీవనలు ఆఁగన్=అడ్డగింప, వైళము=శీఘ్రము, హాళిన్=సుఖముతో.

తాత్పర్యము

కన్నీళ్ళుకార్చుటగాని వానిని తాఁకుటగాని యపరిశుద్ధహేతువు గావున నింతకాలము శోకమునఁ గన్నీళ్ళు కార్చియుండుటచేఁ బారిశుద్ధ్యము నిమిత్తము ఆచమించి యాపతివ్రత శుభకరములైన దీవన లీయసాగి యిట్లనెను. నాయనా నిన్ను నరణ్యమునకుఁ బోకుండ నిలుప సాధ్యముగాదు, రఘువంశరత్నమా పోయి కీర్తిగలుగ సంతోషముతోఁ జరింపుము.

కం॥ ఏధర్మము నీచేత మ,హాధైర్యస్థైర్యనియతి•నవితం బయ్యెన్
సాధితశాత్రవజన! ని,న్నాధర్మమె కాచుఁగాక•యనవరతంబున్. ౭-౨౫

అవితంబు=రక్షింపఁబడినది, సాధితశాత్రవజన, సాధింపఁబడిన శాత్రవులు గలవాఁడా, అనవరతము=ఎల్లప్పుడు.

తాత్పర్యము

నీవు మహాధైర్యముతోను స్థిరబుద్ధితోను నియమముతోను నేధర్మమును రక్షించుచున్నావో ధర్మోరక్షతి రక్షిత యని యుండుటచేత నాధర్మమే నిన్నెల్లప్పుడు రక్షించునుగాక.

మత్తకోకిలము. దేవతాయతనంబులన్ రుచి•దేఱుచైత్యములందు నీ
చే వరం బగుమ్రొక్కు లందుచుఁ•జెన్నుమీఱినయామహా
దేవతల్ ఋషియుక్తులై వనిఁ•ద్రిమ్మరం జనుచుండు ని
న్వేవిధంబులఁ గాచుచుందురు•నిర్మలం బగుసత్కృపన్. ౭-౨౬

తాత్పర్యము

దేవాలయములందును నాలుగుబాటలు కలియుచోటులందును నీచే మ్రొక్కులు గొనుచున్న యామహాదేవతలు ఋషులతోడ నడవియందు సంచరింపఁ బోవు నిన్ను వేయివిధంబుల రక్షించుచుందురుగాక.

ఇందుఁ బురుషున కిరువురు గురువులు, వారు తండ్రి తల్లి, తండ్రి గురుతరుఁడు. తల్లి గురుతమ, కావునఁ దండ్రికంటెఁ దల్లియే హెచ్చు, మనువు.

శ్లో॥ పితౄన్ దశతుమాతైకా, సర్వాం వా పృథివీమపి
గురుత్వేనాభి భవతి, నాస్తిమాతా సమోగురుః॥ భార.

తల్లితో సమానుఁడగు గురువులేఁడని, దండ్రికంటెఁ దల్లియే పదంతలు శ్రేష్ఠయని యనేక వాక్యములుగలవు అంతియకాక "కాని పథమునఁ జనియెడి వాని గురునినైన దండింపవలయు"నని వాక్యములు గలవు. కాని తల్లిని దండింపు మని యొకవాక్యమైనలేదు. అంతియకాక.

పతితా గురవ స్త్యాజ్యా, నతు మాతా కథంచన
గర్భధారణపోషాభ్యాం, తేన మాతా గరీయసి॥

పతితుఁడైన తండ్రిని నాచార్యుని వదలవచ్చునుగాని పతితయైనను దల్లిని వదలరాదు. గర్భమందు ధరించుట పోషించుటచేఁ దల్లిగొప్పది.

ఇట్టి తల్లిమాట ననాదరణము చేయరాదనుట సత్యమే. అయినను విష్ణు పురాణంబున.

మాన్యః పితా సమాస్తానాం, గురుణాం పరమో గురుః॥
అందఱు గురువులలో బరమగురువు కావునఁ దండ్రి పూజ్యుఁడు.

తయోరపి పితాశ్రేయాన్, బీజప్రాధాన్యదర్శనాత్॥

తల్లిదండ్రు లిరువురిలో బీజప్రాధాన్యమునుబట్టి తండ్రి శ్రేష్ఠుఁడు. అని భారతమోక్షధర్మ పర్వంబునను పురాణసముచ్చయమునందును గలదు.

"పితా పరం దైవతం" మానవులకుఁ దండ్రియే పరదైవతమని తల్లి కంటె గొప్పవాఁడని పెద్దలు చెప్పుదురు.

అదియునుగాక "పితారక్షతికౌమారే, భర్తారక్షతి యౌవనే, పుత్రుశ్చస్థవిరే భావే, నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి॥"

బాల్యమునఁ దండ్రి, యౌవన ప్రాప్తి మగఁడు. వార్ధకంబునఁ దన యుఁడు వనితలఁకు రక్షకులు గావున స్త్రీలకు స్వాతంత్ర్యము లేదని స్మృతి చెప్పుటచేఁ దల్లికిఁ దండ్రిని గాదని యాయన యాజ్ఞకు విరోధముగా నాజ్ఞా పించు నధికారము లేదు.

శ్రీరామచంద్రమూర్తి యీ యభిప్రాయముగలవాఁడే ఎట్లన:

కం॥ తనువు నొసంగిన జననీ జనకులకంటెను సుబుద్ధి సంపదఁగూర్పన్
గనుటను నాచార్యుఁడె గురుఁడను పెనుపుం గాంచి శ్రేష్ఠుఁడయ్యెనురామా.

కం॥ ధరణీతన యాధవ నీ,గురువునకున్ గురుఁడ నేను గురుఁడన్ నీకున్
వరమతి నా నుడి వినినను, బరఁగదు సన్మార్గగతికి భంగము తండ్రీ!

అని చిత్రకూటమందు వసిష్ఠుఁడు చెప్పఁగా రామచంద్రమూర్తి నీకంటె దల్లిదండ్రులే శ్రేష్ఠులు. అందుఁ దండ్రి యాజ్ఞచేసినది కాదని నేన ట్లనఁ గలను." అనెను. అట్లైనఁ దల్లి గొప్పదను వాక్యముల గతియేమి యందురా.

"మాతుర్భరణమాత్రేణ, ప్రీతిఃస్నేహఃపితుః ప్రజా? (భారతంబున).
పితురాజ్ఞా పరోధర్మః, స్వధర్మో మాతృరక్షణమ్॥

తండ్రియాజ్ఞ నెఱవేర్చుట, తల్లిని రక్షించుట ఇవి పుత్రునకు స్వధర్మము లని యేర్పడెను. తండ్రికంటెఁ దల్లికే యెక్కువ శుశ్రూష చేయవలెను. ఆమెను గౌరవింపవలెను. పోషింపవలయును. ఆజ్ఞయందుఁ దండ్రిచెప్పినట్టు వర్తింప వలెను. అని యేర్పడుచున్నది. జీవతో వాక్యకరణార్తనికలదుకదా. భర్త యాజ్ఞకువిరోధముగా భార్య యాజ్ఞాపింపరాదుకదా. కొడుకునకుఁ దల్లి గుర్వి యైన నామెకు నామెభర్త గురువుకదా. తనగురునాజ్ఞకు విరోధముగఁ దానెటు లాజ్ఞాపింపఁగలదు. కావునఁ గౌసల్యమాట ననాదరించుట శ్రీరామునకు ననుచితముగాదు.

శా॥ అన్నా! నీ వెడఁ బాయ నేమిటికిరా•ప్రాణంబు లీబొంది! సం
పన్నం బౌపరలోక మేల? స్వధయే•ప్రాప్తించెఁబో యేల? యా
సన్నంబైనను నేటికిన్ సుధ? నిమే•షం బైన నాయొద్ద నీ
వున్నన్ శ్రేయము జీవసంచయము లెం•న్నో యుంట కం చేడ్చినన్.౯౨౩

బొందిన్=దేహమునందు, స్వధ=పితృదేవతల యాహారము, సుధ= అమృతము, ఇది దేవతల యాహారము.

తాత్పర్యము

అన్నా నీవు వదలిపెట్టిపోయితివా. అవల ఈదేహములోఁ బ్రాణములుండియు నేమిరా ప్రయోజనము?కావున జీవించియువ్యర్థమే. ఈలోకముకాకున్నఁ బరలోకమే లభించెననుకో. ఏమిప్రయోజనము-?అదిగాకున్నఁ బితృలోకమున కేగనక్కడ స్వధ సంప్రాప్తమయ్యెననుకో, ఏమిలాభము? స్వర్గము సమీపింపఁగాఁ నచట సుధయే లభించెననుకో ప్రయోజనముకలదా? అదిగాకుండిన నంతకుఁబైలోకములో బ్రహ్మలోకము పఱకునుండు వారందఱు లాభించివారితో నాలోకసుఖము లనుభవింపవలసి వచ్చెననుకో. వీని యన్నింటికంటెను నీ వొక్కఁడవు నాయొద్దనుండుటే శ్రేయస్కరము.

ఆ బ్రహ్మభవనాల్లోకాః, పునరావర్తినోర్జున
మాంప్రాప్యతు కౌంతేయ, పునర్జన్మ నవిద్యతే॥ భ.గీ.

అన్నట్లు పై యేడులోకములలోఁ గలుగు సుఖములన్ని యనుభవించుట కంటె భగవం..తు నొక్కని నాశ్రయించుట శ్రేయస్కరము. నాయొద్ద నీవున్నన్ ... సాయుజ్యమును సూచించుచున్నది. నీయొద్ద నేనున్న ననక

నాయొద్ద నీవున్ననునటచే మన ప్రయత్నముచే భగవత్ప్రాప్తిదుర్లభము. కావున "అహంస్మరామి మద్భక్తం నయామి పరమాంగతి"మ్మన్నట్లు ఆయనయేవచ్చియుండుట శ్రేయస్కరముగదా. నీప్రాప్తికై నేనుబడిన పాట్లన్నియు స్మరించి నీవు నన్ను వదలిపోకుము.

కం॥ నరు లుల్కాతతులం గొని, యరికట్టిన యేని యిచ్చ•నరిగెడికరి నాఁ
గరుణోక్తులకున్ రాముఁడు,
పర మిగుతనమతము విడఁడు•పటుధైర్యమునన్. ౬౨౪

ఉల్కాతతులన్=కొఱవులను, అరికట్టినన్=అడ్డగింపఁగా, ఇచ్చన్=ఇష్టము వచ్చినట్లు, కరి=ఏనుఁగు, కరుణోక్తులకున్ కరుణ+ఉక్తులకున్=శోకాలాపములకు పరము=శ్రేష్ఠము.

తాత్పర్యము

తన్నుఁబట్టుకొనుటకై పురుషులు నలుప్రక్కలఁ గొఱవులు తీసికొని చుట్టుకొని బెదరించినను దాని లక్ష్యముసేయక తన యిచ్చవచ్చినట్లు పోవు మదపుటేనుఁగువలెఁ గౌసల్య దీనాలాపములకు శ్రీరామచంద్రమూర్తి దృఢధైర్యముచే దన యుత్తమ మతము వదలినవాఁడుకాఁడు.

చం॥ తను వవశత్వ మొంద వసు•ధాస్థలి వ్రాలినదీనఁ దల్లి, హా
రని తనకంటికిం గడవెఁ•డశ్రులు గూర్చెడి పిన్నదమ్మునిన్
గనియును రాముఁ డొక్కరుఁడె•ఱా కిటు దుస్తరధర్మసంకటం
బున నెవఁ డోపు ధర్మమున•పొంతను బోవ నితాంతధీరతన్. ౬౨౫

తనువు=దేహము, అవశత్వము=స్వాధీనముతప్పుట, దుస్తర=తరింపఁగష్టమైన, ధర్మసంకటంబునన్=ధర్మమువలన నిబ్బంది కలిగినప్పుడు.

ఈరెండు పద్యంబులందును గవి యిట్టి సంకట సమయమందును శ్రీరామచంద్రుని ధర్మనిష్ఠధైర్యము కొనియాడుచున్నాఁడు.

తాత్పర్యము

దేహము పరవశమై మూర్ఛిల్లి తెలివితప్పిపడిన తల్లిని, హాఁరని కడవలతోఁ గ్రుమ్మరించినట్లు కాఱెడు కన్నీళ్ళుగల తమ్మునిఁ,జూచి యిట్టిధర్మసంకట సమయంబున మిక్కిలి ధైర్యముగలవాఁడై ధర్మము పొంతకుఁబోవఁ గలవాఁడు శ్రీరాముఁడుగాక మఱి యెవరుకలరు? శ్రీరామునకుఁగాక మఱియెవ్వరికైన నసాధ్యకార్యమే.

బుద్ధుఁడు భార్యను శిశువును విడిచిపోలేదా? యందురేమో? వారు మేలు కనియుండినఁ దనప్రయాణము సాగదని వారు నిదురించునపుడు మోసగించి పోయెను. అదిగాని నలుఁడు చేసినదిగాని ధీరత్వము ప్రకటింపదు.

—♦ శ్రీరాముఁడు లక్ష్మణునకు ధర్మోపదేశంబుఁజేయుట. ♦—

ఉ॥ తమ్మునిఁ జూచి యిట్టులనుఁ♦దమ్ముడ! వింతలె నాకు నీదు నె
య్యమ్ముఁ బరాక్రమమ్ముఁ, దగు♦నా యిటు లేడ్చుచుఁ దల్లితోడ నా
కుమ్మలికంబుఁ గూర్చెద, వ♦యో మదిఁ గానవు కంటె నాదుచి
త్తమ్ము తెఱంగు, ధర్మపుఁబ♦థం బెడఁబాయఁగ నొల్ల నేమియున్. ౬౨౯

ఉమ్మలికంబున్=దుఃఖమును, పథము=మార్గము, వింతలు=క్రొత్తలు.

తాత్పర్యము

తల్లికిఁ జెప్పుట చాలించి తల్లికంటె నెక్కువగా నేడ్చుచుండు లక్ష్మణుని సమాధానపఱుపఁ గోరి శ్రీరామచంద్రమూర్తి యిట్లనియె.

తమ్ముఁడా! నీకు నాయందుఁగల స్నేహము నీపరాక్రమాతిశయము క్రొత్తలుగావు. తల్లితోడ నీవుకూడ నేడ్చుచు నాకు దుఃఖము కలిగించెదవు. ఇది నీకున్యాయ్యమా? ఇది స్నేహితుని లక్షణమా. శూరునిలక్షణమా? నాయందుఁ బ్రేమగలవాఁడవు నాకు శ్రేయస్కరమైనది చెప్పవలెఁగాని యిట్లు ధర్మవిరుద్ధముగా నాయభిప్రాయమునకు విరుద్ధముగాఁ జెప్పవచ్చునా? అయ్యో! నాయనా యిన్నినాళ్ళు నాతోడనుండియు నామనస్థితి నీకుఁదెలియదాయెఁగదా. ఇప్పుడైన నేనై చెప్పెద వినుము. ధర్మమును విడిచి కొంచెమైనఁ దొలఁగుటకు నామన స్సంగీకరింపదు.

ఉ॥ ధర్మపథం బొకండె తనుఁ♦దప్పక కొల్చెడివాని కెప్పుడున్
ధర్మము నర్థకామములఁ♦దప్పకకూర్చు నిజం, బదెట్లనన్
ధర్మిణి యైన భార్య గడు♦ధర్మముఁ గూరుచుఁ, బ్రేమఁ గామపున్
శర్మముఁ గూర్చు, నర్థమును♦సత్సుతుమూలముగాఁగఁ గూర్చెడున్. ౬౩౦

ధర్మిణి=సతీధర్మమందుఁ బ్రవర్తించు పతివ్రత, శర్మమున్=సౌఖ్యమును

తాత్పర్యము.

ధర్మార్థకామము లనుమూఁటిలో ధర్మముమాత్రమే తన్నెపుడు సేవించువానికి ధర్మమును అర్థమును కామమును ఈమూఁటిని దప్పక కలిగించును. పతివ్రతయైన భార్య సహధర్మచారిణియై ధర్మాభివృద్ధి కావించును. ప్రేమచేఁ గామసుఖమును గలిగించును. పుత్రుని మూలమున నర్థమును గలిగించును.

భారతమున నీయర్థమే భారత సావిత్రియందుఁ జెప్పఁబడెను. "ఊర్ధ్వబాహుర్విరౌమ్యేష నచకశ్చిచ్ఛ్రుణోతి మే। ధర్మాదర్థశ్చ కామశ్చ సకిమర్థం నసేవ్యతే॥" ధర్మమువలననే యర్థము కామము కలుగునని చేతులెత్తి యేడ్చినను నామాట యొకఁడువినఁడే యని వ్యాసులేడ్చెను. "ధర్మమూల స్స దైవార్థః కామోర్థఫలముచ్యతే, భార. ౧౨-౧౨-౩౪- అర్థమునకు ధర్మముమూలము, అర్థఫలము కామము.

కావున నర్థకామములఁ గోరువారును వానికై ప్రత్యేక శ్రమము పడక ధర్మమునకై శ్రమించినఁ జాలును. అటుగాక ధర్మమును విడచినయెడల నర్థ కామములు లభింపవు. లభించినను నిలువవు.

ధర్మ ఏకో మనుష్యాణాం సహాయః పారలౌకికః భార. ౧౩-౧౧౧-౧౭

మనుష్యులకుఁ బరలోకమందు సహాయపడునది ధర్మమొక్కటియే. అర్థము కాదు. కామము కాదు.

ధర్మ ఏవ హతో హంతి, ధర్మోరక్షతి రక్షితః॥ భార. ౩-౩౧౩-౧౨౮.

ధర్మమే తన్నుఁ జంపిన వానిని జంపును. రక్షించినవానిని రక్షించును. అర్థకామములు తమ్ముఁ జంపినవానిఁ జంపఁజాలవు. రక్షించినవాని రక్షింపఁ జాలవు.

చం॥ కలుగవొ ధర్మ మర్థము నుఁ గామము దేనను దాని నెవ్వఁడేన్
జలుపఁగఁ బూన రా, దెటఁ బ్రశస్తపుధర్మము గల్గు దానినే
చలుపఁగ నౌ, ననేకులకు శాత్రవుఁ డౌను ధనైకకామి, కే
వలయును గామసక్తుఁడు ధ్రువంబుగ నింద్యుఁడు సుమ్ము తమ్ముఁడా.

తాత్పర్యము ౬-౨౮

లక్ష్మణా! ధర్మము, అర్థము, కామము ఈమూఁడును దేనివలనఁ గలుగదో దానిని నెవ్వఁడైనను జేయరాదు.

ఎందుఁ బ్రశస్తపు ధర్మముగలదో దానినిచేయవలెను. ధర్మమునువిడిచి ధనమునందే కామముగలవాఁడు లోకుల కనేకులకుఁ బగవాఁడగును. అట్టులే ధర్మము విడిచి కామాసక్తుఁడగువాఁడు పశుప్రాయుఁడనిలోకమున నిందింపఁ బడును.

చం॥ గురుఁడును రాజు దండ్రి ముదిఁ గూరినవాఁ డొకవేళఁ గింక నే
నరుసము పేర్మినే నతుల మౌఘృశకామముచేత నైననె
వ్వరుసున నైనఁ జేయుమని వంచినదానిని జేయకుండు నా
నరుఁడు నృశంసుఁడున్ ఖలుఁడు నష్టయశుం డగుఁ గాదె లక్ష్మణా. ౬-౨౯

తండ్రివృద్ధు, మరుత్రిప్పులఁ జిక్కియాడెడున్ అను లక్ష్మణుమాటలకు శ్రీరామచంద్రుఁడు సమాధానము చెప్పుచున్నాఁడు. కింక=కోపము, నృశంసుఁడు=క్రూరుఁడు, ఖలుఁడు=పాపి.

తాత్పర్యము

తమ్ముఁడా! గురుఁడు రాజు తండ్రి వృద్ధుఁడు వీరిలో నొక గుణముగల వాఁడైనను జెప్పినమాట దాఁటరాదు. అట్లుండ నాలుగు గుణము లొకనియందే యుండి యతఁడు కోపముచేనైనను వేడుకకేయైనను కామాతిశయముచేనైనను మఱియేవిధమునైనను జేయుమని చెప్పిన దానిని జేయని వాఁడు క్రూరుఁడు, అపకీర్తిపరుఁడు పాపియు నగునుగదా. రాజెట్టివాఁడైనను రాజాజ్ఞయెట్లుపాలింప

వలయునో యట్టులే గురునాజ్ఞ తండ్రియాజ్ఞ పాలింపవలసినది విధి. వారి యాజ్ఞతో మనకుఁ బనికాని వారి గుణములతోఁగాదు. వారిగుణముల ఫలము వా రనుభవింతురు.

శ్లో॥ గురుణాంచైవ నిర్బంధో, నక ర్తవ్యః కదాచన
అనుమాన్యః ప్రసాద్య శ్చ, గురుః క్రుద్ధో యుధిష్ఠిర!
సమ్యక్ మిథ్యాప్రవృత్తేపి, వర్తితవ్యం గురా విహ
గురునిందా దహత్యాయు, ర్మనుష్యాణాం నరాధిప॥ అను.

గురువులనెప్పుడు నిర్బంధింపరాదు. క్రుద్ధుఁడైన గురువును బహూకరించి యాయన యనుగ్రహమును బొందఁదగును. మిక్కిలి మిథ్యాప్రవర్తనముగలవాఁడై నను గురువును నిందించినచో నిందించినవాని యాయువు క్షీణించును. ఇది ౨౯౩ లోని లక్ష్మణు వాక్యమునకు బ్రత్యుత్తరము.

ఇక్కడ నొక చిన్నసందేహము. తప్పుత్రోవలఁబోవు గురువును దండింపవలయునని లక్ష్మణమతము. దండింపరాదు నిందింపనురాదు అని శ్రీరామచంద్రమూర్తి మతము. ఇందేది యనుసరణీయము. గురువు కత్తికట్టి తనమీఁదికి వచ్చెనేని భీష్మునివలె దండింపవచ్చును. ఇట్లురాక వానంతటవాఁడు దుర్వృత్తి యందుండెనేని హితము మంచిమాటలతో రహస్యముగ బోధింపవలెను. నలువురిలో నవమానింపరాదు. అక్కడికి వాఁడు వినకపోయెనా వాని సంబంధము వదలుకొని తనంతటఁ దానుండవలెను.

ప్రాణాపాయదశయందు నాత్మరక్షార్థముగఁదప్ప నెవరిని దండించునధికారము రాజునకుఁ దప్పనెవరికిలేదు. లక్ష్మణ మతము రాజనీతి ననుసరించినది. శ్రీరామచంద్రమతము కేవల శుద్ధ ధర్మము ననుసరించినది. ధర్మమంతయు రాజనీతియగునుగాని రాజనీతి యంతయు సర్వదా సర్వత్రధర్మము గాదు. కావుననే రామచంద్రమూర్తి లక్ష్మణునితో 'అనార్యమౌనదయమార్గము క్షత్రియధర్మమిద్ది సమ్మతిఁ గనఁబోకు' మనిబోధించెను. శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవఁబూనినది రాజాజ్ఞయనికాదు. తల్లిదండ్రుల కోరికయని. తల్లిదండ్రు లేగుణము కలవారై యేయుద్దేశముతోఁజెప్పినను బుత్రుఁడు తప్పకవిని లోపడవలయును. ఇది శ్రీరామమతము. అట్లుకానివాఁడు కొడుకేకాఁడు. "ప్రతికూలః పితుర్యశ్చ నసపుత్రః సతాంమతః" అని ప్రమాణము. భార. ౧. ౭౫-౨౪.

చం॥ ధరణితలేశ్వరుం డిటు య•థామతిఁ బంచిన దెల్లఁ జేయ కే
కరణి సహించువాఁడ, విను•క్ష్మాధవుఁ డేగతి నయ్యె నాకునున్
భరతునకుఁ బ్రశాస్త, మది•భావన సేయుము తల్లి కట్ల యౌ,
...రయఁగ భర్తగావె పర•మార్థము దిక్కు భార్యకున్. ౬౩౦

యథామతిన్=మనస్సుచొప్పున, పంచినది = ఆజ్ఞాపించినది, ఏకరణిన్=ఏవిధముగ, ప్రశాస్తౄ=శాసించువాఁడు.

తా త్ప ర్య ము

రాజు తన యిష్టప్రకార మాజ్ఞాపించినదంతయుఁ జేయక యెట్లుండఁగలవాఁడను. నేను రేపు రాజైనపుడెవరైన నాయాజ్ఞనుల్లంఘించిన నేనూరకయుండవలసినవాఁడనేకదా. నేను వాని దండింపఁబూనిన వాఁడు, రాజగు నీతండ్రి మాట నీవు పాలించితివా? నీవుచేసిన దోషముకాదు. నేను జేసినదోషమా? యనిన నేనేమి చెప్పవలె. ఆరాజు పట్టాభిషేకము చేసికొమ్మని భరతుని, అడవులకుఁ బొమ్మని నాకాజ్ఞపెట్టుట కెట్టి యధికారియో తల్లికట్టులేకదా. ఆమె కొకరాజు మాకొకరాజా? అంతియకాదే. ఈమెకు రాజు భర్తయును, భార్యకు నుత్తమ పురుషార్థము ధర్మము రక్షకుఁడు భర్తయే కదా.

ఉ॥ భూమిధవుండు పుణ్యపథ•భూషణుఁ డూపిరితోడ నుండఁగా
నే మని వచ్చు నాబడిని•నేసతి భర్తృవిహీనయట్లు గా?
భామిని కెయ్యెడం దగవె•ప్రాణధవుం బెడఁబాసి యుండఁగా?
భూమిఁ దనూజుకంటెఁ బతి•బూజ్యుఁడు సాధ్వికిఁ జుమ్ము లక్ష్మణా. ౬౩౧

పుణ్యపథభూషణుఁడు=పుణ్యమార్గమే భూషణముగాఁ గలవాఁడు, నాబడి=నావెంబడి, వెంట, భర్తృవిహీన=పతిలేనిది, విధవ, ఈసతి=ఈ పతివ్రత.

తా త్ప ర్య ము

తమ్ముఁడా! పుణ్యమార్గమే యలంకారముగాఁగల రాజు జీవించి యుండఁగా నీమె విధవవలె నా వెంబడి నేమని వచ్చును? ఎట్టి సమయమందైనను భార్యకు భర్తను విడనాడియుండవచ్చునా. పతివ్రతకుఁ గొడుకుసకంటెభర్తయే గౌరవింపఁదగినవాఁడు. ఇరువురిలో నొకరివిడిచియుండవలసినపుడు పతివ్రత కొడుకును విడువవలయునుగాని భర్తను విడువరాదు అని మరలఁ దల్లినిజూచి రామచంద్రమూర్తి చెప్పుచున్నాఁడు.

చం॥ వనముల కేగుదుం జనని•స్వస్త్యయనంబు నొనర్పు మాకు, న
న్గఁనుగొనుమీ ప్రసాదసుము•ఖం బగుదృష్టిని, బూర్ణమైనచో
జనకునియాజ్ఞ, గ్రమ్మఱెద•సత్యము, పేర్మినిముస్ యయాతి వ
చ్చినగతి వచ్చు వాఁడ, దయ•సేయుము చేయుము తీర్ణసత్యునిన్. ౬౩౨

స్వస్త్యయనంబు=మేలుకలుగ దైవప్రార్థనము, మాకున్=నాకు లక్ష్మణునకునని యర్థము, సీత యిచ్చట లేదు. ఆమె యభిప్రాయము తెలియదు, కావున మాకన్నచో నందు సీత చేరదు, సంజ్వలద్వహ్నినేన్వనినేన్ రాముఁడు చొచ్చుచోఁ దలఁపు మీ ప్రాగ్వర్తిగా నన్నెదన్=శ్రీరామునకంటె ముందు

లక్ష్మణుఁడు ప్రయాణమై రామచంద్రునితోడఁ బోవుట కంగీకరించుటచే లక్ష్మణుఁడు మాత్రము చేరుచున్నాఁడు. ప్రసాదసుముఖము=దయచేఁ జల్లనైనది, దృష్టి=చూపు, తీర్ణసత్యునిన్=తరించిన సత్యము గలవానిని.

తా త్ప ర్య ము

తల్లీ! నేను వనములకుఁ బోవుచున్నాను. నాకు క్షేమముగలుగ దైవప్రార్థనము, ఆశీర్వాదము చేయుము నీవు తల్లివి. నీకడుపు చలువయే నాకు శ్రేయస్కరము, నీమాటవినలేదని కోపింపకుము. అనుగ్రహదృష్టిని జూడుము. తండ్రిపెట్టిన గడువు పూర్ణముకాఁగానే మరలివచ్చెదను. సత్యము, మాటదప్పను యయాతి స్వర్గమునకు వచ్చినట్లు వచ్చెదను,దయయుంచుము. నన్నుసత్యము పరిపాలించినవానిఁగాఁ జేయుము, అసత్యవాదిని జేయకుము, అది నీకు కీర్తికరముకాదు, నాకుఁ గీర్తికరముకాదు.

ఉ॥ పోకడపెట్టి ధర్మమును•భోగములం దడియాసఁ జేసి య
స్తోకపుసద్యశంబుఁ గడు•దూరము నెట్టఁగఁ జాలఁ దల్లిరో!
ప్రాకటభంగిఁ జూడఁ ద్రుటి•భంగురమాయువు గాన, ధర్మముం
జేకొన కెట్లు హీన మగు•శ్రీలకునై తమి సేయ జాలుదున్.   ౬౩౩

పోకడపెట్టి=నాశముచేసి, ఆడియాస=అత్యాశ, అస్తోకపు సద్యశంబు=గొప్పసత్కీర్తిని, త్రుటిభంగురము=అల్పకాలములో నశించునది, తమి=కోరిక

తా త్ప ర్య ము

అమ్మా! భోగములందలి యత్యాశచేత ధర్మము నాశము గావించిరాఁగల గొప్పకీర్తిని రాకుండ దూరముగ నెట్టలేను. ఏలయందువా.ఆయు వత్యల్పకాలముండునది. కావున ధర్మమును బాటింపక తుచ్ఛమగు సంపదలనెట్లుకోరుదును.

చం॥ అని యిటు కన్నతల్లిఁ బ్రియ•మారఁగ నూఱడఁ బల్కి యాదటన్
దనహితధర్మపద్ధతులు•దమ్మునికెన్నియొ తెల్పి దండకా
వని కరుగంగఁ గోరి నర•వల్లభుఁ డంతట భక్తియుక్తుఁడై
జననికి వే ప్రదక్షిణము•చల్పఁ దలంచి మనంబులోపలన్.   ౬౩౪

ఊఱడన్=సమాధానపడునట్లు, ఆదటన్=ప్రీతిచేత, హితధర్మపద్ధతులు=హితము ధర్మమునైన తనమార్గములు, దండకావనికిన్=దండకారణ్యమునకు.

తా త్ప ర్య ము.

కన్నతల్లికిట్లు సమాధానముచెప్పి ప్రీతిచే హితము ధర్మమునైన తన మార్గములు తమ్మునికి సెన్నియోచెప్పి దండకాటవికిఁబోవఁ గోరి శ్రీరామచంద్రుఁడు భక్తితోఁ దల్లికిఁ ప్రదక్షిణముచేయఁగోరి తన మనస్సులో

౨౨-వ సర్గము.

చం॥ కుమిలెడిశోకవహ్నిగడుఁ♦గూరినదైన్యముపేర్మిఁగింక దే
హము నుడికింప రేఁగి ముఖ♦మంతయుఁ గన్నులుగాఁగఁ గ్రుద్ధస
ర్పమువలె రోఁజుచున్ వెఱుగు♦పాటున నిల్చినకూర్మితమ్మునిన్
సుమతిని లక్ష్మణుం గదిసి♦నూల్కొనుధైర్యము పేర్మి నిట్లనున్. ౬౩౫

శోకవహ్ని=శోకమనెడి యగ్ని, కింక, కోపము, ఉడికింపన్=ఉడుకునట్లు చేయఁగా, రేఁగి=విజృంభించి, క్రుద్ధసర్పము = కోపించినపాము, నూల్కొను ధైర్యము=పురికొనుచున్న ధైర్యము.

తాత్పర్యము

లోలోపల మండుచున్న శోకాగ్నియు. దీనత్వముయొక్క యతిశయము కోపము, మూఁడు కలిసి దేహమును నుడికింపఁగాఁ గోపముచే విచ్చుటచేతఁ గన్నులు గొప్పవై ముఖమంతయు నాక్రమించునట్లు కాఁగాఁ, గోపముచే బుసలుగొట్టు పామువలె రోఁజుచు, వెఱగుపడి, నిలిచియున్న కూరిమిగల తమ్ముఁడును, మంచిమనస్సుగలవాఁడునగుటచే లక్ష్మణుని విడిచిపోరాదని యాయనయొద్దకుఁ బోయి రామచంద్రుఁడు ధైర్యాతిశయముచే నిట్లనెను.

ఉ॥ మానుము రోషమున్, వగపు♦మానుము, పూనుము నిండుధైర్యమున్
మానుము దూలవచ్చె నవ♦మాన మటం చెద నెంచఁబోకుమా
మానితసమ్మదంబుఁ గను♦మా యభిషేకసమస్తవస్తువుల్
మానుము, పూనుమీ వనస♦మర్హములైన పదార్థముల్ వెసన్. ౬౩౬

తాత్పర్యము

లక్ష్మణా! కైకమీఁద, దశరథునిమీఁద, నీమాట వినలేదని నామీఁద వచ్చినకోపము వదలుము. అడవికిఁబోయిన మనకు వచ్చినభయమేమని నిండు ధైర్యము వహింపుము. మానముపోయెనే, అవమానము వచ్చెనే యని తలంపకుము. మానావమానములు వచ్చుచుబోవును. శాశ్వతములుగావు. ఆగమాపాయినో నిత్యాస్తాన్ తితీక్షస్వభారత యన్నట్లు వానిని సహింపుము. మానావమానములకు నిష్కర్షలేదు. ఒకరికి మానముగాఁదోఁచినది. మఱియొకరికి నవమానముగాఁదోఁచును. అది కేవలము మనోవ్యాపారము. పట్టాభిషేకభంగము నీ వవమానముగాఁ దలఁచెదవేమో అది గౌరవకారణమగును. ఎట్లనెదవా. ఇంతటి యైశ్వర్యము చేతికివచ్చినదానిని విడిచి తండ్రిమాట పాటింపవలెనని యడవికిఁబోయిరి కదా వీరెంతటి పితృభక్తిపరులు. ఎంత నిష్కాములని లోకము గౌరవించును. కైక గౌరవముగాఁదలఁచునదియే యగౌరవకారణమగును. కావున మానావమానములను విచారము వదలుము. విచారము వదలుటేకాదు. ఇంతటి శ్రేయస్సు కీర్తి గౌరవము సంపాదించు సమయము

లభించెఁగదా యని సంతోషింపుము. ఇట్టి పరీక్షాకాల మెల్లవేళల, నెల్లరకురాదు వచ్చినపుడు దానిని దప్పఁ గొట్టరాదు. దానిని సాధించి కృతకృత్యులము గావలయును. అది ధీరులగు బుద్ధిమంతుల లక్షణము. కష్టములు కాఁపురములు చేయవు కీర్తి శాశ్వతము. కావున నభిషేకోత్సవమునకై నీవు ధరించిన వేషము సంపాదించిన వస్తువులు వదలిపెట్టుము. వనవాసమునకు యోగ్యములైనవి గ్రహింపుము.

కం॥ అభిషేకముకొఱకై యే, విభవంబునఁ గూర్పఁ బడియె॰విశ్వంబును నా
కభిషేకనివృత్తికి నా,విభవంబున మార్పవయ్య॰వివిధార్థంబుల్. ౬౩౭

తాత్పర్యము

ఏవిభవముతో నుత్సాహముతో నభిషేకమునకుఁ గావలసినవన్నియుఁ గూర్పఁబడెనో యట్టి విభవముతో నట్టి యుత్సాహముతో నభిషేకము నిలిపి వేయుటకు సకల పదార్థంబులను మార్పుము.

మ॥ చననో రాముఁడు కానకుం జనఁడొకో॰సౌమిత్రి ప్రేరించినన్
జన నేనంచు వచించునో యనుచుఁ దా॰సందేహలోలాత్మయై
యనఘా? తత్తఱలాడు కైక మది శం॰కాతంకనిర్ముక్తముం
బను నీకియ్యెడఁ జేయ,నైఁప విచికి॰త్సం గుంద నాయంబయున్.౬౩౮

సందేహలోలాత్మయై=సందేహముచే నుయ్యలలూఁగుచున్న మనస్సు గలదై, శంకాతంకనిర్ముక్తమున్=సందేహభయమువలన విడువఁబడినది,విచికిత్సన్=సందేహముచే.

తాత్పర్యము

లక్ష్మణా! రాముఁడడవులకుఁ బోయెదననెనుగాని ప్రియభ్రాత వెలుపలి ప్రాణము కుడిభుజమునైన లక్ష్మణుఁడు పోఁగూడదని ప్రేరించినఁ బోవఁడేమో, నేను బోననునో యేమో;ఆవల నేమిచేయవలయును?బోసినోటితోఁ గఱచినట్లగునే, ఆవల నాగతియేమి? యని, కాసేపు శ్రీరామచంద్రుఁడు సత్యాత్ముఁడు కావునఁ బోవునని, కాసేపు పోఁడని, యుయ్యాలలూఁగు మనస్సుతోఁ దత్తఱలాడుకైక మనస్సు శంకనుండి భయమునుండి బొత్తిగా విడువఁబడినదానిగా నీకుఁ జేయఁదగును. శ్రీరాముఁడు సత్యాత్ముఁడు లక్ష్మణుఁ డసత్యాత్ముఁ డనుపేరు నీకేల? నాయభిప్రాయంబున మన తల్లి యీ సందేహముచే భయపడఁజేయుటయు హింసయే కావున నట్టి స్థితి నేను సైఁపను.

కం॥ వినుమా యెపుడేనియు నే, మన సెఱిఁగియొ యెఱుఁగకైన॰మాతలకేనిన్
జనకున కేనియు విప్రియ,మును నించుకయైనఁ జేఁత॰మొనయదుజ్ఞప్తిన్

తాత్పర్యము ౬౩౯

కన్నతల్లి గోలుగోలున నేడ్చుచుండ సహించి సవతితల్లి సందేహముచే బాధపడ సైఁపలేననెదవే. ఏల కైకయందు నీకంతటి యభిమానము

అనెదవా నాయనా నాపద్ధతి చెప్పెద వినుము. ఇంతవఱకు నేను దెలిసియైనను దెలియకయైనను గన్నతల్లికైనను తక్కిన సవతితల్లులందఱకైనను దండ్రికైనను వారి మనస్సునకుఁ బ్రియముగానిదానిని జేసినట్లు నాకు జ్ఞప్తియందును లేదు. ఈ యల్పమునకు నిప్పుడు నేనేల యిట్లు చేయవలెను.

కం॥ సత్యపరాక్రమవర్యుఁడు, సత్యవచస్కుండు సత్య•సంధుఁడు జనకుం
డత్యంతము పరలోకా, ప్రత్యయభీతుండు దిగులు•పాయుత మింకన్.

తాత్పర్యము ౬౪౦

సత్యపరాక్రమవర్యుఁడు=యుద్ధమున వంచనాదులులేక యదార్థమైన పరాక్రమము గలవారిలో శ్రేష్ఠుఁడు, సత్యవచస్కుండు = సత్యభాషణముగల వాఁడు, సత్యసంధుఁడు=ప్రతిజ్ఞచేసి తప్పనివాఁడు, అత్యంతము=మిక్కిలి, పరలోకాప్రత్యయభీతుండు = రాముఁడడవికిఁబోఁడాయెనా నాకసత్యదోషము వచ్చుట సత్యము, అసత్యదోషము వచ్చిన స్వర్గప్రాప్తిలేకుండుట సత్యము అని భయపడి యుండువాఁడు.

తాత్పర్యము

తల్లిమాట యటుండనిమ్ము. యుద్ధమందు సత్యమైన పరాక్రమముఁగల వాఁడు. ప్రతిజ్ఞచేసి తప్పనివాఁడు, కన్నతండ్రి స్వర్గలోకము తనకు లభింప దని మిక్కిలి భయపడుచుండువాఁడు, ఇఁక భయమువదలి సుఖింపనిమ్ము.

ఉ॥ ఈయభిషేక సంభ్రమము•లిప్పుడు మానక యుంటినేని పొ
ల్లాయె మదీయసత్య మని•యారట మొందు నృపాలుఁ డెంతయున్,
బాయనిచింతఁ దండ్రి వగ•పాటునఁ గుందఁగ నాదుచిత్త మే
చాయఁ దపింప కుండెడిని•సంతతమున్ వచియింపు లక్ష్మణా! ౬౪౧

పరలోకాప్రత్యయభీతుఁడను దాని వివరించుచున్నాఁడు. పొల్లు=వ్యర్థము.

తాత్పర్యము

ఈ యభిషేకవేషము ప్రయత్నము లిప్పుడు నేను వదలకయుంటినేని యరణ్యమునకుఁ బోవునట్లుండిన శ్రీరాముఁడప్పుడే రాజచిహ్నములు ఆప్రయత్నములు మానకుండునా. పోఁడేమో; దానికే యింకను జిహ్నములు ధరించి యున్నాఁడు. నాసత్యము వ్యర్థమయ్యెనని రాజు మిక్కిలి యారాటపడును. వదలని చింతచేఁ దండ్రి వగచుచుండ నా మనస్సుమాత్ర మిప్పుడేకాదు. తండ్రి నిట్లు వగపడఁజేసితిఁగదా యని యెల్లప్పుడును దపింపక యెట్లుండఁ గలదో నీవే చెప్పుము.

కం॥ కాన నభిషేక యత్నము, మానించి యిదే యరణ్య•మార్గముఁ బట్టం
గా నేను, గైక రాజ్య, శ్రీ నిలుపుత భరతునందుఁ•జిత్తంబలరన్. ౬౪౨

తాత్పర్యము

ఈకారణముచే నభిషేకప్రయత్నము మానునట్లుచేసి యిపుడే యడవి త్రోవఁబట్టఁగాఁ గైక భరతునియందుఁ రాజ్యలక్ష్మిని సంతోషముతో నిలుపును గాక. అదిగని తనమాట సత్యమయ్యెనని తండ్రి సంతోషించునుగాక. తల్లి దండ్రులను సంతోషపెట్టుటకంటె మనము చేయఁగల గొప్ప పుణ్యకార్యమేది? తల్లిదండ్రులు సంతోషించినఁ బరలోకమున దీర్ఘసౌఖ్యము గలదు. తుచ్ఛమై, క్షణభంగురమైన యైహికసుఖమునకై శాశ్వతపరలోకసుఖము గోలుపోవ వచ్చునా? నీవే చెప్పుము.

కం॥ చీరాజినధారి జటా, భారాన్వితు న న్నరణ్య•పథసంగతుఁ గ
న్నారఁ గని గైక యొమ్మునఁ, జేరిచి హస్తంబు నిదుర•చెందెడుఁ గాతన్. ౬౪౩

తాత్పర్యము

చీరాజినధారిన్=నారచీరలు కృష్ణాజినము ధరించినవానిని, జటాభారాన్వితున్=జడలగుంపుతోఁ గూడినవానిని అరణ్యపథసంగతున్=అరణ్యమునకుఁ బోవు మార్గము బట్టినవానిని.

తాత్పర్యము

నారచీరలుగట్టి కృష్ణాజినముధరించి జడలగుంపులు చుట్టగాఁ జుట్టి యరణ్యమునకుఁ బోవు మార్గమునఁ బోవు నన్నుఁ జూచి నిర్విచారముగఁ గైక యొమ్మ పయి చేయియుంచుకొని నిదురించునుగాక.

ఆ॥ ఎవరిబుద్ధిశిక్ష•నియ్యది ఘటియిల్ల, నిశ్చయింపఁబడియె•నెఱిగ మదిని
నట్టిపదికి నొవ్వు•పుట్టింపనేఁ జాల, నిపుడవనికిఁ బోదు•నింతనిజము. ౬౪౪

౧. ఎవరి=ఏనాయొక్క, బుద్ధి=వనవాసము చేయవలెననెడి బుద్ధియొక్క శిక్షన్=కుదురుపాటుచేత, ఇయ్యది = ఈవనవాసము, ఘటిల్లన్ = సంభవింప, నెఱిగ=న్యాయ్యమని నిశ్చయింపఁబడియె, అట్టి యామదికి నొవ్వు పుట్టింపఁ జాలను.

కైక కోరినప్రకారము వనవాసముచేయుటే న్యాయ్యమ్మని బుద్ధియందు నిశ్చయించుకొంటిని ఇప్పుడు మఱియొకవిధముగా నన్యుల బలాత్కారముచే నాబుద్ధి నొచ్చునట్లు నేను జేయఁజాలను.

౨. ఎవరి=ఏదశరథునియొక్క, బుద్ధిశిక్షన్=బుద్ధినేర్పుటచేత నా యీ కానన వాసము న్యాయ్యమని సహ్యమని తోఁచెనో యట్టి దశరథునియొక్క మనస్సు నొవ్వఁజేయఁజాలను. దశరథుఁడు నాకు వినయవంతుఁడవై జితేంద్రియుండవై నిత్యసుశీలివై నెగడవయ్య కామంబు క్రోధను గలిగించునట్టి దుర్వ్యసనంబులను బ్రీతిపడకుమయ్య అని కదా నేర్పెను. దీనికి విరుద్ధముగా నేను వార్తించిన నాయన మనస్సు నొచ్చుకొనఁడా.

౩. ఎవరి=ఏ మంథర దుర్బుద్ధిశిక్షచేఁ జక్కఁగా నీకైకచే నిశ్చయింపఁ బడెనో యాకైకకు మనస్సు నొవ్వఁజేయఁజాలను. ఈరెండును తీర్థీయ వ్యాఖ్యానములు.

తాత్పర్యము

ఎవరు బుద్ధినేర్పుటచేత నిది యిట్లు కావలయునని చక్కఁగా నిశ్చయింపఁ బడెనో యట్టివారి మనస్సు నొచ్చునట్లు నేను జేయఁజాలను. నేనిపుడే యడవికిఁ బోదును.

—• శ్రీరాముఁడు లక్ష్మణునితో మేలుగీళ్ళకు దైవము కారణమని చెప్పుట •—

కం॥ వంచనకైక ఘటించె న,టంచును గినియకుము,రాజ్య•మందుటయు నివ
ర్తించుట నావనగమనము, నెంచఁగ దైవైకకృత, మిఁ•కేలా వగవన్?

[ఇంతవఱకు ధర్మము సకలఫలములిచ్చునని చెప్పి ధర్మము కర్మము అవి యచేతనములు. అది యెట్లు ఫలమిచ్చునను సందేహముదీఱ ధర్మమును మించి దైవముగలఁడని చెప్పుచున్నాఁడు].

కైక మోసగించెనని కైకమీఁద నేల కోపపడెదవు. కైక చేయఁగలిగిన దేదియులేదు. నాకుఁబట్టాభిషేకము చేయవలయునని ప్రయత్నముచేసినవాఁడు దశరథుఁడు కాఁడు. దానికి విఘ్నము చేసినది కైకయుఁగాదు. క్రొత్తనీళ్ళు వచ్చి ప్రాతనీళ్ళుకూడాఁ బోయెనన్నట్లు ముందున్నసుఖముకూడఁబోయి యడవులపాలగుటకు నేను జేసినదోషములేదు. యీ మూఁడును గేవలము దైవకృత్యములే? మఱియొకరి కార్యముగాదు. కావున దేనికి వగచెదవు? ఎవరిపైఁ గోపపడెదవు?

ఈ దైవము అదృష్టమని కొందఱ యభిప్రాయము. పూర్వముచేసిన పుణ్యపాపముల ఫలస్వరూపము ఈశ్వరుఁడని వేదాంతుల యభిప్రాయము.

కం॥ దైవప్రేరిత మగు నీ భావన గాకున్న శక్య•పడ నేర్చునె యా
దేవికిఁ గైకకు నన్నుం, గావలె ననియిట్లు మిగులఁ•గాఱియపఱుపన్. ౬౪౬

తాత్పర్యము

ఇంత దూరాలోచనము దైవప్రేరణముచేఁ గలిగెను. కాకున్నఁ దనకే యపరాధము చేయని నన్ను నిష్కారణముగఁ గష్టపెట్టవలయునని కైకకు మనస్సునకైన వచ్చియుండ సాధ్యమా?

ఉ॥ అంతర మేనెఱుంగ హృద•యాంతరసీమను సౌమ్యశీల! యా
వంతయుఁ దల్లి లొసుగుర•యం, దలకైకకు నాత్మపుత్రుఁ డం
చెంతయుఁ బ్రేమఁ నావలన•నెంతయు నొల్లమి లేదు పూర్వ, మి
ట్లింతయు నేఁడ పుట్టుటకు•హేతు వి కెయ్యది తెల్పు తమ్ముఁడా? ౬౪౭

సౌమ్యశీల=సాధుచరిత్రా?

తాత్పర్యము

మన ముగ్గురుతల్లులయందు నాయందీమెకు నెక్కువప్రేమ యీమెకుఁ దక్కువప్రేమయని భేదము చెప్పుటకు వారిలోఁ దారతమ్యము కొంచెమైన నుండుట నే నెఱుఁగను. ఈ కైకకే నిన్నటివఱకుఁ దనకొడుకని యెక్కువ ప్రేమయులేదు. నాయందు విరోధభావములేదు. ఇదంతయు నేఁడే పుట్టుటకుఁ గారణమేమో తమ్ముఁడా చెప్పుము. ఉన్నట్లుండి యంతటిప్రేమ యింతటి విరోధముగా మాఱుటకుఁ కారణము దైవము గాకున్న మఱియేదో చెప్పుము.

కం॥ అంతటివత్సల నను నే,కాంతము=ప్రల్లదము లాడి॰కాన కనుచుటల్
చింతింప వలఁతి యగుబల,వంతపువిధిచేష్టగాక॰పరులకు వశమే? ౬౪౨

వత్సల=ప్రేమగలది, ఏకాంతము=మిక్కిలి, ప్రల్లదములు=నిష్ఠురములు, వలఁతి=సామర్థ్యముగల.

తాత్పర్యము

తనకన్న కొడుకుకంటె నెక్కువప్రేమగల యామె నన్ను నే యపరాధము చేయనివానిని నిష్కారణముగ నంతటి కఠినోక్తులాడి యూరనైననుండ నీయక యడవులపాలుచేయుట యాలోచింప నిదియంతయు నెంతకైన సమర్థమగు బలవంతమైన విధి చేష్టగాక యితరుల చేష్టగాదు. ఇతరులకు సాధ్యమునుగాదు.

ఉ॥ పుట్టువుతోడఁ బుట్టె గుణ॰పూజ్యత,మంచికులంబునందుఁ దాఁ
బుట్టెను రాచకూఁతు రయి॰పుష్కలదానదయానిధాన మై
పట్టుగఁ గీర్తిఁ గాంచె, నటు॰వంటిది కైకయి, భర్తృసన్నిధిన్
గట్టిఁడి రీతి దిట్ట యయి॰కాఱులు నన్నెటు లోపెఁ బ్రేలఁగన్! ౬౪౩

తాత్పర్యము

ఆమె స్వభావముచేతనే దుష్టురాలు. ఆ దుష్టస్వభావమే యిప్పుడామెను బ్రేరించెను. ఇఁక దైవముచేసిన దేమియందువా. సహజముగా నామె దుష్టురాలుగాదు. ఆమె పుట్టిననాఁడే యామెతోడ గుణములచే గౌరవమును బుట్టెను అది నీకెట్లు తెలియునందువా కులముకొలఁది గుణము. ఆమె గొప్ప వంశమున రాచకూఁతురై పుట్టెను. గొప్పజాతియందు గొప్పవంశమందుఁ బుట్టి గొప్పవారిచే శిక్షింపఁబడినదానికి నీచగుణము సహజమని యెట్లు చెప్పవచ్చును. దానికేమి సాలగ్రామముల గనియందు గులకరాలు పుట్టవా? సముద్రములో విషము పుట్టలేదాయందువేమో. అట్లైనచో బాల్యమునుండి నీచురాలే యయియుండవలెను. అటుగాక దానమునకు దయకు స్థానమని పట్టుగఁ గీర్తిని సంపాదించెను. సహజముగా నీచురాలగుదానికి కీర్తి లభించునా? తనతో సమానురాండ్రైన సవతులపై ద్వేషము సాధించుచున్నది. గదా అది నీచతగదా యందువేమో? ఆమె

ద్వేషించినది సపత్నీత్వమునే కాని సవతులనుగాదు. వారు సవతులు గాకున్న వారిని ద్వేషించునా? ఆఁడువారి యందఱిపై ద్వేషించుచున్నదా? తమయోగ క్షేమములకుహాని గలిగింతురని తోఁచిన సమానులను నణఁపవలయునని పట్టాభి షిక్తులైన రాజులు మాత్రము ప్రయత్నించుట లేదా?

ఉ॥ కంటికి నిద్రవచ్చునె? సుఖంబగు నేరతికేళి? జిహ్వకున్
వంటకమిందునే? యితరవైభవముల్ పదివేలు మానసం
బంటునె! మానుషంబుగల యట్టి మనుష్యున కెంతవానికిన్
గంటకుఁడైన శాత్రవుఁ డొకండు తనంతటివాఁడు గల్గినన్.—శ్రీనాథుఁడు

ఒకరికెంతైన దానముచేయునది యిపుడు పరులసొత్తునేల యాశించె? ఎంతో దయావతి యిట్టిక్రూరకార్యమున కెట్లు సాహసించెను? అటువంటి కైక నేఁడు మాఱుమూలలఁగాదు, దూతముఖమునఁగాదు, తానే తనమగనియెదు టనే తెంపరికత్తెవలె భయము భక్తి లజ్జ మర్యాద తప్పి ఱాఁగవలెఁ దెగఁబడి యెంతో ప్రీతిపాత్రుఁడనై యుండిన నన్నుఁ బనికిమాలిన మాటలన్నియుఁ బనికిమాలినవే కావు. బాధకలిగించునవి, యెట్లు వదరఁగలిగెను! దైవమావేశింప కున్నట్లు చేయఁగలిగియుండునా? సహజమైనచో నిన్నాళ్ళల యట్లు చేయలేదు.

కం॥ కావున నచింత్యమహిమము, దైవం బప్రతిహతంబు•ధర నెవ్వరికే,
నావనితయందు నాయెడ, దైవంబె విపర్యయంబుఁ•దమ్ముఁడ, కూర్చెన్.

అచింత్యమహిమము = ఊహింపసాధ్యముకాని మహిమగలది, అప్రతి హతంబు=ఎదురులేనిది, విపర్యయంబు=వ్యత్యాసము.

తాత్పర్యము

కావునఁ దమ్ముఁడా! ఇంతటి మహిమగలదియని యూహింపనైనసాధ్యము గాని ప్రభావము గలదైన దైవము నీకు నాకే కాదు.ఎట్టివారికైన దీనిచేనైనఁ గొట్టఁబడనిదే. దానికెదురులేదు. కావున నామె కా దుర్బుద్ధిపుట్టుటకు నాకు దారి ద్ర్యము వచ్చుటకు దైవమే కారణము. అదియే యింతకార్యముచేసెను.

తే॥ కార్యభూతఫలంబుల•కంటె వేఱు, చోట నించుక యైనను•జూడరాని
దుర్జయంబైనదైవంబు•తోడఁ దొడరి,
యెవ్వఁడు పోరంగఁదానుత్స•హించుఁజెపుమ ౬౨౧

కార్యభూతఫలము= కార్యమువలనఁ గలిగినఫలము, దుర్జయము= జయింపరాని.

తాత్పర్యము

నాయనా! దైవమున్నదనుటకు నేమి ప్రమాణము? దైవము నెదిరించి యిట్టికార్యము కలుగకుండ మనము పురుషకారము చేయరాదా? యందువేమో కార్యము మనము చేయునపుడు దైవమొకటియున్నదని, యేమో చేయు చున్నదని, మనకుఁ దెలియరాదు. ఫలము నందుమాత్ర మది కానవచ్చి యెట్లు

చేయదలఁచినదో యట్లు చేయును. ఫలమునందుమాత్రము కానవచ్చి వేఱు చోటులఁ గానరాక యాకారణముచే జయింపరాకయుండు దైవముతో నెవఁడు పోరుటకు నుత్సహించును. అది యే స్వరూపమున నేమిచేయుచున్నదో మనకుఁ దెలియనప్పు డెట్లు దానితోఁ బోరుట. ఈనాఁ డీగడియయం దీకార్యము సాధించుట కేయే సాధనముల సిద్ధముచేసి యుంచుకొనెనో మనకు ముందు తెలిసి యుడినఁ గదా దానికి మనము ప్రతీకారము చేయుట. కార్యస్వరూపమునఁ గానరాక ఫలస్వరూపమునఁ గానవచ్చెను. కావున దైవమున్నదనుటకు ననుమానమే ప్రమాణము, బుద్ధిబలముచే దాని నూహింపవలెను.

ఉ॥ జానగుసౌఖ్యము వ్యగపు•శాంతియుఁ గ్రోధము లాభనష్టముల్
మానని పుట్టుగిట్టుటలు•మానవకోటు లకారణంబుగా
వేనిఁ దలంచు నివ్వియును•విశ్రుత మింతకు దైవ మొక్కఁడే
తా నగు మూలకారణము•దప్ప దదెంతయు నమ్ము తమ్ముఁడా. ౯౨-౨

జానగు=మనస్సునకింపయిన, పుట్టుటగిట్టుట = పుట్టుగిట్టుటలు ద్వంద్వసమాసము, రాపోకుండఁగనేమి కాళ్ళుతెగనే. మనుచరిత్రము.

అకారణంబుగా=కారణములేనిదానిగా, విశ్రుతము=ప్రసిద్ధము, దైవమువలనఁ గలుగుఫలము లిందుఁ జెప్పఁబడెను.

తాత్పర్యము

లక్ష్మణా! కారణములేక కార్యముగలుగదు. నిష్కారణమనుటకుఁ గారణము మనకుఁ దెలియదని యర్థమేకాని కారణమేలేదని యర్థముగాదు. కావున మనకు సంతోషకరమై సౌఖ్యమునకు వ్యసనమునకు శాంతికి, రోషమునకు లాభనష్టములకు జననమరణములకు నివిగాక మనుష్యుఁడు కారణములేక కలిగెనని వేనిదలంచునో యాయన్నిటికి మూలకారణము దైవమేసుమా. ఇది తప్పదయ్యా తప్పదు.

కం॥ కామక్రోధంబులచే, నేమంబుల వఱదఁ గలిపి•నెఱిచెడి భ్రష్టుల్
గా మునులు తపసులయ్యును, సౌమిత్రీ! చెడుట దైవ•చర్యన కాదే. ౯౨-౩

వఱదన్=ప్రవాహమందు, నెఱిచెడి = నియమమర్యాదలుచెడి, ఇందు దైవమే ప్రబలము. పురుషకారము కాదనుట తెలుపఁబడెను, "దైవమేవ పరమన్యే పౌరుషంతు నిరర్థక"మ్మని భారతము.

తాత్పర్యము

లక్ష్మణా! పామరులమైన మానమాట యటుండనిమ్ము. ఘోరమైన తపస్సులు చేసి యెంతో జ్ఞానము మహిమ సంపాదించి నిత్యనియమవ్రతులై శాంతులై నిష్కాములై యెందో యడవియందు నొకమూలఁబడియుండు మునులుకూడఁ దటాలునఁ గామమునకుఁ గ్రోధమునకు లోపడి దీర్ఘకాలముగ నభ్యసించుచున్న నియమ... ల్ల నీటఁగలిపి మర్యాదతప్పి భ్రష్టులైపోవుట దైవచేష్టచేతనేకదా

తాత్పర్యము

అటుగాకున్నఁ బురుషప్రయత్న మందేలోపముగలదు? మన గురువు విశ్వామిత్రు నంతటివాఁ డెట్లు నిమిషములోఁ గామమునకుఁ గ్రోధమునకు వశుఁడై చెడెనో మనము వింటిమిగదా. శివుఁడట్లే యయ్యెఁగదా?

కం॥ ఎన్నం డెంచని దెటులో, యన్నట్టుగనుండి యగుట•యూనినవని వి
చ్ఛిన్నం బగుటయు నట్టులె, యన్నా!
యివి దైవకృతము•లగు సత్యముగన్. ౬౫౪

దైవలక్షణము చెప్పఁబడుచున్నది.

తాత్పర్యము

ఎన్నఁడైన నిది యగునని నెవరును దలంపని కార్యము తటాలుః నున్నట్లుండియగుటయు, నగునని యందఱు నిశ్చయించిన కార్యమిట్టులే విఘ్నపడుటయు నివియెల్ల దైవము చేష్టలే, ఇది సత్యము.

కం॥ ఈనిశ్చితమతిచే నా,లో నేనే గాలగతి వి•లోకించినచో
మానసమున నభిషేకవి,ధానము దప్పుటకు వగపు•దగులదు నాకున్. ౬౫౫

నిశ్చితమతిచే=నిశ్చయింపఁబడిన మనస్సుచే, విలోకించినచోన్=చూడఁగ, ఆలోచింపఁగ, వగపు=వ్యసనము, పైవిచారముయొక్క ఫలితాంశ మిందుఁ జెప్పబడెను.

తాత్పర్యము

ఈ ప్రకారము సప్రమాణముగ నిస్సందేహముగ నిశ్చయించుకొని యితరుల యుపదేశముననేకాక నాలో నేనే కాలచర్య నాలోచింపఁగా నిది దైవకృతమని దీనిలో మన దోషమేదియులేదనియు, కైక నిమిత్తమాత్రమేయనియు, ఆమె దైవమునకు సాధనమయ్యెననియు, సాధించునది దైవమేయని తోఁచుటచే నాకు వ్యసనము గలుగలేదు. ఇది తెలియక నీవు వారు చేసినారు వీరుచేసినారని పరులపై నాగ్రహపడుచున్నావు.

కం॥ కావున నీవును వగవక, నావిధమును ననుసరించి•నలు వగునభిషే
కావశ్యక కార్యంబులఁ, బోవిడువుము, చింత యేమిఁ•బూనకు మన్నా.

తాత్పర్యము ౬౫౬

కాఁబట్టి నీవుకూడ నాయనా! వ్యసనపడక నామార్గ మనుసరించి దైవకృత మనుభవింపక తప్పదని నిశ్చయించుకొని యీ పట్టాభిషేకమునకుఁగావలసిన పనులన్నియు వదలుము. చింతపడవలదు, చింతపడియుఁ బ్రయోజనము లేదు.

కం॥ మా నగునభిషేకార్థస,మానీతఘటోదకంబు•లగుఁ దాపసయో
గ్యానూనవ్రతమజ్జన, మూనిక నొనరింప నెంచి•యుండెడినాకున్. ౬౫౭

అభిషేకార్థసమానీతఘటోదకంబు = అభిషేకము నిమిత్తమై తేఁబడిన ఘటములయందలి గంగాది తీర్థంబులు, తాపసయోగ్యానూనవ్రతమజ్జనము= తపసులకు యోగ్యమైన కొఱఁతలేని వ్రతమునకై స్నానము.

తాత్పర్యము

పదార్థములు భరతుని పట్టాభిషేకమునకై యెత్తియుంచెదరనుకో గంగాది దివ్యతీర్థముల నేమిచేయవలయును. ఊఱకపాఱఁబోయవలయునా? అందువేమో. అట్లుచేయఁ బనిలేదు. పట్టాభిషేకమునకై తేఁబడిన తీర్థములు తాపసుల వ్రతముఁ బూనుటకు సిద్ధపడియుండు నాకు వ్రతారంభమునఁజేయ వలసిన స్నానమున కుపయోగపడును. దీనివలన నేవ్రతముగాని స్నానము చేసి సంకల్పించుకొని చేయవలయును అని సూచన.

కం॥ ఈరాజద్రవ్యం బగు, వారియు నా కేల? కైక•వసరదె శంకన్
ధారిణికై తోఁగెద నని? వారక నా తెచ్చునీ రె•వ్రతమున కగుతన్. ౨౪

తాత్పర్యము

లక్ష్మణా పొరపాటు. పొరపాటు. ఈనీళ్లు నే నుపయోగించుకొనెదనని యాలోచింపక చెప్పితిని. ఇదియును రాజద్రవ్యమేకదా. తపసులకు రాజ ద్రవ్యపరిగ్రహము నిషిద్ధముకదా. కావున నీ నీళ్ళు నాకుఁ బనిలేదు. రాజ్య ద్రవ్యమగుటయేకాదు. దానికేదైన నొకసమాధానము చెప్పుకొన్నను నీ నీటితో నేను స్నానము చేసితినేని పట్టాభిషేకమునకై నేను స్నానముచేసెదనేమోయని కైక సందేహముచే బాధపడును. నిష్కారణముగ నామెకేల నే నాబాధ గలి గింపఁవలెను. నేనే నీళ్ళు తెచ్చుకొని స్నానముచేసి వ్రతమారంభించెదను. తపస్వులు స్వయందాసులు.

చం॥ వగవకు మన్నలక్ష్మణ! వి•పర్యయ మందెను లక్ష్మియంచు, నీ
యగణితరాజ్యభోగము మ•హావిపినాలయవాస మొక్కరూ
పుగ మదిఁ దోఁచె, నారసిన•భూరివనాంతరవాసమే సుఖం
బగు, నటుగాన నేటికి వ్య•థావిలమానసవృత్తి దూపిలన్? ౨౫

విపర్యయము=వ్యత్యాసము, తాఱుమాఱు, అగణిత = లెక్కింపరాని, మహావిపినాలయవాసము=పెద్దయడవులయందు వసించుట, భూరివనాంతర వాసమే=గొప్పయడవులయం దుండుటయే, వ్యథావిల=వెతచేఁ గలఁతచెందిన మానసవృత్తిన్=మనోవ్యాపారముచే, దూపిలన్=శోకింపఁగా.

తాత్పర్యము

అన్నా! లక్ష్మణా! యెంత చెప్పినను నీవు శోకముమానినవాఁడవుకావు గదా.లక్ష్మి తొలఁగెను. అలక్ష్మి పట్టెనని దుఃఖింపకుము, నా యభిప్రాయమున నీ లెక్కింపరాని రాజ్యభోగ్యములు, అరణ్యవాసము రెండును ధర్మ కార్యములే గావున నొక్కటిగానే తోఁచుచున్నది. కాదు కాదు, ఒక విధమున నాలోచింప వనవాసమే సుఖమనియుఁ దోచుచున్నది. రాజ్య భోగము = సుఖరూపక దుఃఖము, వనవాసము = దుఃఖరూపక సుఖము, రాజ భోగమిప్పటికి సుఖముగఁదోఁచినను బరిణామమందే గాక నిగ్రహణమందును దుఃఖము గలది. వనవాసము నిశ్చింతము.

నిరుపద్రవము. పుణ్యఫలదము. కావునఁ దత్కాలమునదుఃఖముగఁ దోఁచినను మీఁద సుఖమిచ్చునది ఈ రెంటిలో నేదిమేలు? కావున నేల వృథావ్యథచే మనస్సుచెదరి యేడ్చెదవు.

మత్తకోకిలము. అన్న లక్ష్మణ! ప్రాప్తలక్ష్మికి•నంతరాయముఁ గూర్చె నా
పిన్న తల్లి యటంచుఁ గుందకు•ప్రీతి దప్పకు, దైవమే
యన్నెలంతుక నట్లనిష్టము•లాడఁ జేసె ముఖస్థమై
సన్నుతాత్మక! దైవ మంతకుఁ•జాలు నంచు నెఱుంగవే? ౬౬౦

ప్రాప్తలక్ష్మికి=లభించిన యైశ్వర్యమునకు, అంతరాయము = విఘ్నము, నెలంతుక=స్త్రీ, అనిష్టములు = ఇంపుగానిమాటలు, ముఖస్థమై=ముఖమందుండినదై.

తాత్పర్యము

అన్నా లక్ష్మణ! చేతికివచ్చినపండు నోటికిరాక జాఱిపడిపోయినట్లు లభించిన యైశ్వర్యమునకుఁ గైక యడ్డమువచ్చి చెఱిచెనని వ్యసనపడవలదు. ఆమెయందుఁ బ్రీతియుఁ దప్పవలదు. ఆమెను దూషింపనురాదు. ఆమె మనకుఁ దల్లి కదా. అదియునుగాక "సుఖస్య దుఃఖస్య నకోపిదాతా, పరోదదాతీతి కుబుద్ధిరేషా, అహంకరోమీతి వృథాభిమానం, స్వకర్మసూత్ర గ్రథితోహి లోకః॥" సుఖముదుఃఖమిచ్చువాఁడు నెవఁడులేడు, పరు లవికలిగింతురని దుర్బుద్ధులు తలఁతురు. నేనీకార్యముచేసెద ననుట వృథాభిమానము. ప్రతి మనుష్యుఁడు తానుజేసిన కర్మముచేఁ గట్టఁబడియున్నాఁడు. ఆమె యందు స్వతస్సిద్ధమైన దోషములేదు. పిశాచము పట్టినవారు సన్నిపాతరోగముచే బాధపడువారు నేమేమో చూచువారిని దూషించినను నది పిశాచకృత్యము రోగబలమని సహింతుమేకాని మనవా మానవుల గోపింతుమా. అట్టులే దైవము కైక నోరనుండి యిట్టి కీడుమాటలు పలికించెను. కావున గైకమీఁదఁ గోపపడి యేమి ప్రయోజనము. సజ్జనస్తోత్రపాత్రమైన మనస్సుగలవాఁడా! దైవమిట్లు చేయఁగలదని నీ వెఱుఁగవా!

౨౩-వ సర్గము. లక్ష్మణుఁడు శ్రీరామునితో దైవముకంటెఁ బౌరుషమే శ్రేష్ఠమని చెప్పుట.

కం॥ అనురామునివచనంబుల, వినమితమూర్ధుండు నగుచు•విని విని మదిలోఁ
బెనఁగొనువిషాదముదముల,కును మధ్యస్థువలె నుండి•కొండొకసేపున్. ౬౬౧

చేతదొరికిన రాజ్యము తప్పిపోవుటకుఁ బ్రబలమగు దైవమే కారణము గాని వేఱెదియుఁగాదు. కావున నీవు పరితపింపకుము. మఱియు సకల శ్రేయస్సాధనమగు ధర్మమును విడువరాదు. పితృవాక్యపరిపాలనము పుత్రధర్మము అది మొదట మనకుఁ బ్రాప్తమయినది కావున మొదటదాని నెఱవేర్పవలెను. మాతృవాక్య పరిపాలనము ధర్మమైనను నది పితృవాక్యానంతరము

తటస్థించినది కావున దాని వెనుకఁజేయవలెను అని శ్రీరామచంద్రుఁడు వివరించి చెప్పఁగా లక్ష్మణుఁడు దాని నంగీకరింపక దైవమును బురుషకారము మరల్చి దైవము విఘ్నముచేసిన పట్టాభిషేకమును బురుషకారముచే నేను ఘటింపఁ జేసెదననెను. దానిమీద శ్రీరామచంద్రుఁడు దైవలక్షణము బలములోనైనవి చెప్పెను. లక్ష్మణుఁడిఁక దన పూర్వపక్షము విశదీకరించి బలపఱచుచున్నాఁడు.

వినమితమూర్ధుండు=వంచుకొనఁబడిన శిరముగలవాఁడు=విషాదముల కును, దుఃఖమునకు సంతోషమునకు, మధ్యస్థునివలె=నడుమనుండువానివలె, కొండొకసేపు=కొంచెపుఁగాలము, విని విని యనువిప్పచేఁ బెక్కు విషయములు శ్రీరామచంద్రుఁ డుపన్యసించెనని భావము.

వినుట కిష్టములేకయు వినయముచేతను దలవంచుకొని లక్ష్మణుఁడు శ్రీరాముఁడు చెప్పిన మాటలన్ని వినివిని యయ్యో! యిటువంటి ధర్మాత్ముఁడు సుకుమారుఁడడవుల నిడుమలఁ బడనున్నాఁడే యను దుఃఖమునకు, ఆహా మాయన్న యింతటి కష్టసమయమందును నింతటి ధర్మనిష్ఠుఁడుగదా యను సంతోషమునకు, నీరెంటికి నడుమఁ గొంతకాల ముండినవానివలెనుండి, అన్న చెప్పినది సరియందునా యీయనకష్టముల కంగీకరించినవాఁడనగుదును. ఆయన చెప్పినది సరిగాదందునా ధర్మహాని ఘటించినవాఁడ నగుదును. ఏమి చేయుదునాయని యాలోచించి కైక చేసిన దుష్టచేష్ట దురాలోచనము మదికి రాఁగా రోషమును వహించి మాధ్యస్థమునువదలి రాముని సుఖపెట్టవలయునను తలంపుతో నన్న మనస్సును ద్రిప్పటకై.

సీ॥ సౌమిత్రి దీర్ఘరో•షంబున నిష్క్రహ, స్థాశీవిషముభంగి•నట్టి రోఁజి
కుటిలమై భ్రూకుటీ•చటులనిటాలత, టంబున నదియింప•డంబు మెఱసి
క్రుద్ధసింహాస్యంబు•కోపున నెమ్మోము, దుర్నిరీక్షంబయి•దోరగిల్ల
హస్తిహస్తమునట్లు•హస్తాగ్రమునుదా వి•ధూననంబొనరించి•తొరగఁబఱపి

తే॥ దృష్టినేలను నిరువంక•ద్రిప్పి మెడను, నడ్డచూపులకొనలు ని•జాగ్రజాతు
నాస్యమునయందుఁ బ్రసరింప•నధర మదరఁ,
గావిపాఱఁగ గన్నులు•కనలిపలుకు. ౧-౭

దీర్ఘరోషంబునన్=అతిశయించిన కోపముచే, నిష్క్రహస్థ=నరులు తఱు మఁగాఁ బరువిడి బిలము చొచ్చియుండు, ఆశీవిషముభంగిన్ = సర్పమువలె, రోఁజి=బుసకొట్టి, కుటిల మైవంకరయై, భ్రూకుటీ=కనుబొమలు, చటుల=కదలు చున్న, నిటాలతటంబునన్=లలాటప్రదేశంబున, డంబు=కాంతి, క్రుద్ధ సింహాస్యంబుకోపునన్=కోపించిన సింహముయొక్క ముఖమువలె,దుర్నిరీక్షంబయి= చూడరానిదై, దోరగిల్లు=ఎఱ్ఱనకాఁగా, హస్తిహస్తమునట్లు=ఏనుఁగు తొండము వలె! హస్తాగ్రమును = చేతికొనను, విధూననం బొనరించి = విదిలించి,

నిజాగ్రజాతు=తన యన్నయొక్క, ఆస్యంబునందు=ముఖమందు, అధరము= పెదవి, కనలి=కోపించి.

తాత్పర్యము

లక్ష్మణుఁడు విస్తారమైన కోపంబున దెబ్బతిని తప్పించుకొని బిలములోఁ జొరఁబడిన పామువలె బుసకొట్టి వంకరయైన కనుబొమలు చలించుచున్న లలాటప్రదేశంబున నటించుచుండఁ గోపించిన సింహము ముఖమువలె నెఱ్ఱనయి చూడరాకయుండ నేనుఁగు తొండమువలె గొనచేతిని విదల్చి దృష్టి నేల మీఁదనుంచి మెడ నీప్రక్క కాప్రక్కకు ద్రిప్పి శ్రీరామచంద్రుని ముఖము నడ్డచూపులఁ జూచుచు పెదవి యెగురుచుండఁ గన్నులు నెఱ్ఱనగాఁగాఁ గోపించి యిట్లనియె.

చం॥ జనకునిమాట దాఁటఁ గలుషం బగు నంచును, రామచంద్రుఁడే
వినఁ డఁట తండ్రిమాట యని వీఁడిమూఁకలు ధర్మసేతువున్
గొనకొని త్రెంపఁ జూచెదు నోకో యనుశంక, నరణ్యభూమికిన్
గనుకనిఁ బోవఁ జూచెదవు కాలము గా దిది తత్ప్రసక్తికిన్. ౬౬౩

కలుషము=పాపము, వీఁడిమూఁకలు=అవివేకుల సమూహములు, ధర్మసేతువున్=ధర్మము అనెడి ఆనకట్టను, జనులు తమ యిష్టప్రకారము పోయి చెడిపోకయుండుటకై ధర్మమనెడికట్ట, వంకలఁబడి వ్యర్థముగాఁ బోవునీటిని బొలమునకుఁ బాఱించుటకై వేసెడు కట్టవంటిది, సేతువు=వంతెన, ఇది యీ యొడ్డునుండి యాయొడ్డునకుఁ బోవువారికి సుఖమార్గము, అట్లులే సంసారసాగరముఁ దరింపఁగోరువారికితీరమునుండి మోక్షతీరముచేరుటకు ధర్మమునడిమి యనకట్టయని యర్థము, కొనకొని=యత్నించి, కనుకని=త్వరతో, తత్ప్రసక్తికిన్=ఆప్రసంగమునకు.

తాత్పర్యము

అన్నా రామచంద్రా; తండ్రిమాట మీఱినఁ బాపమువచ్చునను భయముచేతను, మనకన్న నెన్నియంతలో గొప్పవాఁడై మహాత్ముఁడగు శ్రీరామునంతటివాఁడే తండ్రిమాట వినలేదఁట యిఁక మనమేల వినవలె దానివలనఁ గీడుండిన నాయన యేలట్లుచేయును. కావున మనమట్లు చేసినను దోషములేదు. చేయవచ్చును. (యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరోజనః సయత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే' అనునది యిచ్చట ననుసంధించునది.) అని యవివేకులగుంపు ధర్మమనెడి యనకట్టను ద్రెంచి తాముచెడి లోకులఁ జెఱుతురను సందేహముచేతను, అడవులకు, నచట నేదో మునిఁగిపోయినట్లు, లాదరబాదరపోవఁ జూచెదవుగాని యవి ప్రస్తావింపనిది సమయముగాదు. అవి యీసందర్భమున నన్వయింపవు.

ఉ॥ ఎంతకుఁ జాల వీవు? తగు నే యసమర్థవుడై వ మిట్లు నీ
వెంతయుఁ బెద్దఁ జేయఁగ? నిఁ జెప్పితసిద్ధికి నన్యు వేఁడు, నా

క్కింతయు ముస్ను దా నిలిచి•యేమియుఁ జేయదు, దాని నీ వసం
భ్రాంతుఁడ వయ్యుఁ బ్రాకృతుని•భంగి నిటుల్ గొనియాడ నర్హమే? ౬౬౪

నిజేప్సితసిద్ధికిన్=తనయభీష్టము నెఱవేఱుటకు, వేఁడున్=ప్రార్థించును, అసంభ్రాంతుండవు=పిఱికితనముగాని, కళవళపాటుగల మనస్సుగాని, లేని వాఁడవు కొనియాడన్=పొగడఁగా, అర్హమే=తగునా,

తాత్పర్యము

అన్నా! నీవుదైవము నేమో గొప్పదిగా భ్రమపడుచున్నావు. నీవు చేయవలయునని పూనుకొంటివేని నీ కసాధ్యకార్య మేదికలదు? అట్లన్నిట సమర్థుఁడవయ్యు నే సామర్థ్యము లేనిదైవము నెంతో పెద్దచేసెదవు. అది నిజమని నమ్మి చేయుచున్నావో లేక వేఱుద్దేశ్యము మనస్సునందుంచుకొని యిది నెపముగాఁ జెప్పుచున్నావో. దైవము దుర్బలమని యెట్టులనెదవందువా అది తనకార్యము సాధించుటకు తనకు సామర్థ్యములేక యితరుల సాహాయ్య మపేక్షించును. ఇది సమర్థుని లక్షణమా?తాను ముందు నిలఁబడి యేకార్యము చేయలేదు. ఇది ధీరలక్షణమా? ఇట్లు దేనికి గొఱగాని దైవమును ధీరుఁడవు సమర్థుఁడవు చిత్తవిభ్రాంతి లేనివాఁడవయ్యును పామరునివలె గొప్పగాఁ బొగడెదవు. ఇదినీకుఁ దగునా?

ఉ॥ పాపము పాప మంచనెదు•పాపము గల్గునె పాపు లైనజా
యాపతు లాడుమాటల న•నాదృతి చేసిన? శాఠ్యరీతి ల
క్ష్మీ పదముం దొలంచి రని•చిత్తమునందు నెఱుంగ వయ్యె, ధ
ర్మోపధధర్మకంచుకులు•నుర్విని గల్గరె ధర్మతత్పరా? ౬౬౫

జాయాపతులు=దంపతులు, అనాదృతిచేసినన్ = ఆదరింపనియెడల, శాఠ్యరీతిన్=వంచనమార్గమున, లక్ష్మీపదమున్=లక్ష్మీస్థానమునుండి, పంచమ్యర్థమున ద్వితీయ, తొలంచిరి=తొలగించిరి, ధర్మోపధ=ధర్మము నెపముగాఁ బెట్టుకొని యధర్మకార్యములు చేయువారు, ధర్మకంచుకులు=ధర్మములుచొక్కాలవలెఁ గలవారు, అనఁగాఁ గుష్ఠరోగములవారు చొక్కాలు తొడుగుకొని గుడ్డలు కప్పుకొని దానిని దాఁచునట్లు తమయందలి దోషములు ధర్మవాక్యము లుపన్యసించుటచేఁ గప్పిపెట్టువారు. ఇది విశేషణోభయపద కర్మధారయము, లోకులు విశేష్యము, ధర్మతత్పరా=ధర్మమునందే విశేషాసక్తి గలవాఁడా.

తాత్పర్యము

తల్లిదండ్రులమాట మీఱినఁ బాపము పాపమని పలుమాఱనెదవు గాని పుణ్యాత్ములు ధర్మాత్ములగు వారి మాటమీఱినఁ బాపమువచ్చునుగాని పాపబుద్ధులయిన దంపతులు చెప్పినమాట నతిక్రమించినఁ బాపమువచ్చునా? ఏలయనెదవా. వారు పాపము నాశ్రయించి యుండువారు. కావున వారివిషయము బాపము చేసినను దోషముగాదు. ఇఁక వారిమాట వినకున్న దోషమెట్లు

వచ్చును? వసనాభిలో నుండు పురుగునకు వసనాభి పెట్టుట దోషమా. మన తల్లి దండ్రు లెట్టి పాపాత్ములనెదవా, నీకు రాఁగల రావలసిన రాజ్యలక్ష్మిని మోసముచేసి నీకు రాకుండఁ జేసిరియని నీవు తెలిసికొనిన వాఁడవుకావు. నీకు నల్లనివన్నియు నీళ్లు తెల్లనివన్నియుఁ బాలు అట్టులే యందఱ ననుకొనెదవు. లోకమునందు ధర్మమును నెపముగాఁగొని తాముచేయు దుష్కార్యములను ధర్మవాక్యోపన్యాసములచేఁ గప్పిపెట్టు శిశ్నోదరపరాయణులగు వారులేరా. నిర్వంచనమైన ధర్మము ధర్మముగాని వంచనతోఁగూడిన ధర్మము ధర్మమా.

ధర్మోపథ ధర్మకంచుకులు=వీరే బైడాలవ్రతులు, బకవ్రతులు, బిడాల మనఁగాఁ బిల్లి, ఈపిల్లిపాలు త్రాగునాయన్నట్టు లణఁకువతోఁ గన్నులు మూయుచుఁ దెఱచుచునుండి యొంటివంటు దొరకఁగానే పాలు త్రాగిపోవును అట్లులోకమును వేషములతోను నక్కవినయముతోను వంచించువాఁడు బైడాలవ్రతుఁడు. కొంగనీటియొడ్డున నిర్వికల్ప సమాధియందుండు యోగివలెఁ గదలక మెదలక కన్నులు వ్రాఁగన్ను పెట్టియుండి చేఁపసమీపింపఁగానే తటాలున వాత వేసికొనును. ఇట్టివాఁడు బకవ్రతుఁడు.

సీ॥ మచ్చిక బలిమిని•నిచ్చకంబులఁ దన,కొడుకునకును గైక•పుడమిఁ గోర
జతనంబుశ్రీరామ•చంద్రున కొనరింతు,వరములుగోరు మో•తరుణి!యనుచు
యుక్తియొక్కటి చెప్పి•రక్తున ట్లిచ్చట నాడంబర మొనర్చి•యటకుఁబోయి
మోసంబుచేసె నా•ముదుకండు, గాదేని, యేల గోరదు కైక•యిన్నినాళ్లు
తే॥ వరములను? భూపతియేల•పరిహరింపఁడయ్యెఁ?
డక్కిది, నిజమైన•నఖిలజనులు
వినినయది మున్నుగా నెఱ•వేర్పవలదె?
యామెకోర్కుల కిదియొకో•యర్హ వేళ? ౭౬౬

మచ్చికబలిమిని=తనయందుండు స్నేహబలమున, ఇచ్చకంబులన్=ముఖప్రీతిమాటల, జతనంబున్=యత్నశబ్దభవము, యత్నమును, రక్తునట్లు=మనయం దనురాగముగల వానివలె, ముదుకండు=ముసలివాఁడు, ఇచ్చటన్=సభామధ్యమున, అటకున్=కైకయింటికి, పరిహరింపఁడు=పూర్ణముచేయఁడు.

తాత్పర్యము

ఇందు మన తలిదండ్రులు చేసిన మోసమేమియందువా వినుము. తనయందుఁ దనభర్తకుఁ గలమోహము బలమున నాయన మెచ్చున ట్లిచ్చకంబులఁ గొన్ని చెప్పి తనకొడుకునకు రాజ్యమిమ్మనికోరఁ గామదాసుఁడై యీ ముసలివాఁడు లోకముమెచ్చ నేను శ్రీరామునకుఁ బట్టాభిషేకము చేసెదనని సభలోఁజెప్పెదను. వయసుపిల్లా! నీవు వరములు కోరుమని పెండ్లానికి యుక్తి నేర్పి యిచటసభలోనందఱు వినునట్లు శ్రీరాముని యువరాజు చేసెదనని చెప్పి కన్నీళ్ళు తుడిచి యిచట కైకయొద్దకు బోయి మోసంబుచేసి యేమి తెలియనివానివలె వగలేడుపు లేడ్చుచున్నాఁడు.

అట్లుగాదేని వరములిచ్చినదేనాఁడు? కోరునది యేనాఁడు? ఇన్నాళ్ళు కైకమ్మ యేమి చేయుచుండెను? రాజేల వానిని దీర్పలేదు? ఇదియంతయుఁగల్ల-ఒకవేళ నిజమనుకొందము. ఉదయము సభలోఁజెప్పినదిది. రాత్రిచెప్పినదిది- ముందు చెప్పినది ముందుగాఁ జేయవలదా. ఆమెకోర్కులు కోరుట కిదియా సమయము? ఇదియంతయు టక్కుగాదా. నిజమని యెవఁడు నమ్మును?

కం॥ లోకంబులు ద్వేషింపఁగ, నీకుత్రల నిన్నుఁగాక • యితరుల రాజ్య
శ్రీకలితులఁ జేయుఁగ నే, మేకొనఁగా నేర్తునే? క్షమింపుము నన్నున్. ౬౭

కుత్రలన్=వంచనలచే, ద్వేషింపఁగన్=విరోధింపఁగా, రాజ్యశ్రీ కలితులన్ = రాజ్యలక్ష్మితోఁ గూడినవారిని, మేకొనఁగా=అంగీకరింపఁగా.

తాత్పర్యము

వంశధర్మము నాశముచేసెను. పెద్దవాఁడుండఁగాఁ జిన్నకు రాజ్య మిచ్చెను. నిష్కారణముగాఁ బెద్దకొడుకును నడవులకుఁ బంపెను. ఇట్టివాఁడు రాజఁట మనము ప్రజలమఁట. ఇఁక వీని ప్రభుత్వమును మనమంగీకరింప రాదని లోకులు విరోధింపఁగా నిటువంటి మాయోపాయములచే న్యాయ్యముగా రావలసిన నీకుఁగాక యితరులకు రాజ్యశ్రీ దశరథుఁ డిచ్చెనేని నే నంగీకరింతునా. కావున నాయనంగీకారమును క్షమింపుము.

కం॥ వినతసుధీసత్తమ! నె, మ్మనమున నేధర్మచింత • మలయుట ద్వైధం
బును బొందె బుద్ధి మోహం,బున నాధర్మమున నేవ•పుట్టెను నాకున్. ౬౮

వినుతసుధీసత్తమ=పండితశ్రేష్ఠులయందు గొప్పవాఁడని పొగడఁబడు వాఁడా, మలయుట=మెలఁగుటచే, ద్వైధంబు=రెండుగా నగుట, ఏవ=రోఁత.

తాత్పర్యము

రామచంద్రా నీవు జ్ఞానవంతులగు పండితులలోఁ పండితుఁడవు. నీకుఁ దెలియనిది లేదుగాని పితృవాక్యపరిపాలనము ధర్మమనుచింతపట్టినవాఁడవగుటచే బుద్ధిమోహముచే కొంతసేపు రాజ్యము కావలయునని కొంతసే పరణ్యము నకుఁ బోవలయునని రెండుగాఁజీలెను. ఇట్టి బుద్ధిభేదము కలిగించు ధర్మము రోఁతగా నాకుఁ దోఁచుచున్నది. ధర్మ మేకవిధముగా నిశ్చితమైయుండవలెను గాని పరస్పర విరుద్ధములయిన రెండుమార్గములఁ బ్రవర్తింపఁజేయు ధర్మము ధర్మమా? వ్యవసాయాత్మికాబుద్ధిరేకేహకురునందన" భ.గీ. నిశ్చయబుద్ధి యేక విధముగలది. ముందొక్కటి నిశ్చయించుకొని, కొంతసేపటికి దానికి విరుద్ధముగా వర్తించువాఁడు చపలచిత్తుఁడుగాఁడా ? తొలుతనే రాజ్యము నాకక్కఱ లేదనియుండిన నేను వ్యసనపడను.

కం॥ ఏకృతికి నైన వలఁతివి, కైకేయీవశతఁ దండ్రి • గర్హ్యమధర్మ్యం
బౌకాలులు ప్రేలినచోఁ, జేకొనుదే మోహమునను•జేద్పడ కున్నన్ ? ౬౯

వలఁతివి=సమర్థుఁడవు, గర్హ్యము=నిందింపఁదగినది, అధర్మ్యము=అధర్మ మార్గముతోఁ గూడినది, కాఱులు=పనికిమాలినమాటలు, ప్రేలినచోన్=వదరఁగా, చేకొనుదే=అంగీకరింతువా, చేడ్పడకున్నన్=చెడిపోకున్నయెడల.

తాత్పర్యము

నీ వెంతటికార్యమునకైన సమర్థుడవు. ఇట్టివాఁడవు నీవు మోహమున బుద్ధి నాశము చేసికొనకున్నయెడల కైకేయికి వశుఁడై దశరథుఁడు నిందింపఁదగినది అధర్మయుక్తమయినదియగు రజ్జులాడిన నీవు వానిని సరిసరియని తల యూడింతువా.

ఉ॥ మోసపుబుద్ధిచేత వర ♦ ముల్ పరికల్పితమైనఁ, బెద్దగాఁ
జేసెదు గాని వాని నిర ♦ సింపవు సాధుతపేర్మి, దానికై
గాసిలి దుఃఖ మందెదను ♦ గాని యిఁ కేమియు లేద, యిట్టిచో
వాసిఁ దొలంచు ధర్మపథ ♦ వర్తన గర్హ్యము గాదె యేరికిన్? ౬౭౦

పరికల్పితమైనన్=సృష్టింపఁబడఁగా, నిరసింపవు=తిరస్కరింపవు, సాధుత్వముపేర్మిన్=సాధుత్వాతిశయముచే, గాసిలి=కష్టపడి, వాసి=పేరుపెంపు, గర్హ్యము=నింద్యము.

తాత్పర్యము

నీకు న్యాయ్యమార్గమున రాజ్యము దొలంగియుండిన నేను దుఃఖింపను. ఇప్పుడట్లు జరగలేదు. లోకులను నిన్ను మోసగింపవలెనని వరములను కొన్ని కల్పింపఁగా వానిని నీవు గొప్పగాఁదలంచెదవు గాని నీవు మిగులసాధువు గావున నావంటివారే యందఱు నన్నేల వారు మోసము చేయుదురని వానిని దిరస్కరింప కున్నావు. ఈ మోసము నీవు తెలిసికొనలేకపోయితివిగా యని నేను దుఃఖించు చున్నాను గాని రాజ్యముపోయెనని కాదు. ఇట్టి సందర్భములందు వీరు బుద్ధి లేనివారు మోసము గనుఁగొనలేకపోయిరని కీర్తిప్రతిష్ఠలుపోఁగొట్టి యపకీర్తి యప్రతిష్ఠతెచ్చు ధర్మమార్గమున వర్తించుట నాకేగాదు. ఎవరికైన నింద్యమే.

ఆ॥ తల్లి తండ్రి యనఁగఁ ♦ దగనిపేరులు దాల్చి, కామవృత్తులైన ♦ కానివారు
పలుకువానినెల్లఁ ♦ బాటింప వచ్చనే, యన్న! మనసునందు ♦ నైన నీవు? ౬౭౧

తగనిపేర్లు=వారియోగ్యతకుఁదగని పేర్లు, కామవృత్తులైన=కామవ్యాపారముగలవారైన, కానివారు=శత్రువులు.

తాత్పర్యము

కైకేయీ దశరథులు తల్లిదండ్రులు నడువవలసిన రీతి నడవలేదు. కావున వారిని దల్లిదండ్రు లనుట తప్పు. ఆపేర్లకు వారు తగరు. (ఈ యభిప్రాయము తోనే "భూమిపు వెడలేదు జనకబుద్ధి సుమంత్రా"యని చెప్పఁబోవును (చూ.ప. ౧౫.౨౩) ఆ పేర్లకుఁదగని నడవడిగలవారు ఆ గౌరవమున కెట్లు తగుదురు? అట్టి

పేర్లుపెట్టుకొని కామబలమున నిష్టమువచ్చినట్లు సంచరించు పగవారు చెప్పినట్లెల్ల నీవు చేయవచ్చునా? చేయవచ్చునని మనస్సునందైన నీవనుకొన వచ్చునా?

కం॥ వారలదుర్మంత్రము నీ,వారఁగ దైవికమటంచు • నాత్మఁ దలఁచినన్
దీరగునీకుం దదుపే,క్షారంభము నాకు నరుచి • యయ్యెన్ దానన్. ౬౭౦

దుర్మంత్రము=దురాలోచనము, దైవికము=దైవతంత్రమువలననయినది, తదుపేక్షారంభము=దానినుపేక్షించు యత్నము, దానన్=అద్దైవమందు.

తాత్పర్యము

కైకేయీ దశరథుల యాలోచన నీవు దైవతంత్రమంటివి. దైవమిట్టి దురాలోచనము కలిగించునేని యాదైవమును నీవుపేక్షించుటయే తగినకార్యము.అట్టి దైవము నాకు రుచింపదు. కుత్రలు ప్రేరించు దైవము దైవమా పూజ్యమా.

కం॥ బలహీను లల్పతేజులు, బలవంతము దైవ మనుచుఁ • బలికెద రన్నా
బలయుతులు కీర్తికాములు, కలనైనం దలఁపఁ బోరు•గా దైవంబున్.

తాత్పర్యము ౬౭౧

బలములేనివారు అల్పతేజస్సుగలవారు దైవము బలిష్ఠమనుచుందురు. ఏల? వారు కార్యములు సాధించుబలము తెలివిలేక నిందతమయందు మోపుకొన నిష్టములేక దైవముపైఁ బెట్టుచుందురు. ఇఁక బలవంతులు_ కీర్తినిగోరువారు దైవమొకటియున్నది అని కలయందైన ననుకొనరు. పురుషకారముచే స్వకార్యమును సాధించి కీర్తి పొందుదురు. అట్టివారిని దైవమేమి చేయఁగలిగెను.

దైవం క్లీబా ఉపాసతే. భార. ౧౨. ౧౩౮. ౮౨.
కారింపఁబడక = బాధపడక.

కం॥ పౌరుషబలమున దైవము, దూరంబుగ నెట్టుఘనుఁడు•తుద దైవముచేఁ
గారింపఁబడక నిజకా,ర్యారంభముఁ దీర్చుకొను స•మర్థుం డగుటన్. ౬౭౪

తాత్పర్యము

బలముగల గొప్పవాఁడు పౌరుషబలముచే దైవమును దగ్గఱరాకుండఁ దఱుముఁగొట్టి కడపట దైవముచే నేబాధపడక సమర్థుఁడగుటచేఁ దనకార్యము చక్కఁజేసికొనును.

కం॥ దైవబలంబే యెక్కుడొ, వావిరిపురుషునిబలంబె • వరమొ, లోకుల్
దైవపురుషబలభేదం, బోవిరవతంస! చూతు•రొప్పుగ నిపుడే. ౬౭౫

అన్నయ్యా! నీవు దైవబల మెక్కువ యనుచున్నావు. నేను పురుషబల మెక్కువనుచున్నాను. దైవము చేయునది చేసినది. ఇఁక పురుషబలముచే సాధ్యమైనది చేసెదను. అప్పుడు దైవబలమే యెక్కుడో పురుషబలమే యెక్కుడో లోకులిప్పుడే చూచెదరుగాక.

ఉ॥ దైవముచేతఁ గీడ్వడిన ♦ తావక పట్టమహోత్సవంబు నా
దౌవరపౌరుషంబున ర ♦ యంబునఁ దీర్పఁగ, ధారణీజను
ల్దైవము పౌరుషోద్ధతిని ♦ లావఱి కూలినఁ జూచి, యాత్మలో
దైవముకంటెఁ బౌరుషమె ♦ తద్దయు మేలని యెంచఁ జేసెదన్. ౬౨౬

కీడ్వడిన=చెడిన, తావక = నీయొక్క, పట్టమహోత్సవంబు = పట్టాభిషేక మహోత్సవము, తీర్పఁగన్=చక్కఁజేయఁగా, పౌరుషోద్ధతిని=పౌరుష + ఉద్ధతిని = పౌరుషాతిశయముచేత, లావఱి=లావు+అఱి=బలముచెడి.

తాత్పర్యము

దైవముచేతఁ జెడిన నీ పట్టాభిషేకమహోత్సవము నా పురుషకారబలమునఁ ద్వరగాఁ జక్కఁజేయఁగా లోకమునందలి జనులు పురుషకారముచే దైవతంత్రము బలహీనమై చెడిపోవుటచూచి దైవముకంటెఁ బురుషకారమే బలమని తలఁచునట్లు చేసెదను.

ఉ॥ భూరిమదోత్కటంబు సృణి ♦ పోటులఁ జిక్కక ఛిన్నశృంఖలం
బై రయమారఁ బైనుఱక ♦ నట్టి మరల్చెడిరీతి దైవమున్
సారతరోగ్రపౌరుషమె ♦ సాయముగాఁగ మరల్తుఁ జూడుమీ
యోరిమి, నామతంబునకు ♦ నూఁకొనుమీ, కనుమీ యథాస్థితిన్. ౬౨౭

భూరిమదోత్కటంబు=గొప్పమదపుటేనుఁగు, సృణిపోటులన్=అంకుశము పోడవులచే, ఛిన్నశృంఖలంబై=త్రెంచుకొన్న సంకెలలుగలదై, సారతర = మిక్కిలి సత్తువగల, ఉగ్ర=భయంకరమైన' పౌరుషమే=పురుషప్రయత్నమె, సాయము=సహాయము, ఓరిమిన్=ఓర్పుచేత, ఊఁకొనుమీ = అంగీకరింపుమీ, యథాస్థితిన్ = ఉన్నదున్నట్టు.

తాత్పర్యము

గొప్ప మదించిన యేనుఁగు అంకుశముల దెబ్బలను లక్ష్యముసేయక సంకెలలు ద్రెంచుకొని వేగముగఁ దనమీఁదికిఁ బరువెత్తిరాఁగా మరలించునట్లు దైవమును బలవంతమైన పౌరుషము సహాయముగా మరలించెదను. తాలిమిగలిగి చూడుము. నా యభిప్రాయము నంగీకరింపుము. ఉన్నదున్నట్టు చూడుము.

శా॥ అన్నా! నీయభిషేకముం జెడఁగఁజే ♦ యన్ లోకపాలాళి యా
సన్నంబై యెదిరించి నిల్చిన జగ ♦ త్సంఘాతముల్ పూని డీ
కొన్నన్ నేరవు, తండ్రి జెప్పవలెనా ♦ ఘోరాటవి న్నిన్ను నా
పన్నుం జేయఁగ గోరువారి ననుతుం ♦ బద్నాలుగేం డ్లుండఁగన్. ౬౨౮

లోకపాలాళి=అష్టదిక్పాలురు సేనలతోడ, ఆసన్నంబై=సమీపించి, జగత్= లోకముల, సంఘాతములు=సమూహములు, ఆపన్నున్=ఆపదనొందువానిఁగా.

తా త్ప ర్య ము

అన్నా! నీపట్టాభిషేకమును జెఱుపఁగోరి యెనమండ్రుదిక్పాలురు సేనల తోడ నెదిరించి నిలిచినను వారేమిలెక్క యన్నిలోకముల జనులేకమై డీకొనినను వారివలనఁగాదు. ఇఁకఁ దండ్రియెదిరించిన నతఁడొకలెక్క. ఆయన రానే వచ్చెనా- నిన్నుగదా పదునాలుగేండ్ల డవిలోవిపత్తుల పాలుచేయఁ జూచు చున్నాఁడు. ఆపదునాలుగేండ్లాయన యడవిలోనుండఁ బంపెదను.

కం॥ నీ కభిషేకము సేయక, యాకొడుకున కవనిఁ గూర్చు • నాజనకున కా
కై కేయి కాశఁ గోయుచుఁ, బ్రాకటముగ వారినెట్లు • పఱతునొ కనుమీ. ౬౩౯

తా త్ప ర్య ము

అభిషేకము నీకుసేయక వారికొడుకునకు రాజ్యమీయఁ జూచు దశరథు నికిఁ గై కేయికి ఆశ నాశముచేసి వారేపాట్లుపడఁ జేయుదునో చూడుము.

కం॥ పరిపంథులకును నాభీ,కరపౌరుష మెట్లు దుఃఖ • కారణ మగు నా
కరణిని దైవము వారికిఁ, బరఁగింపఁగ లేదు సుఖము • పద్మదళాక్షా. ౬౪౦

పరిపంథులకును = పగవారికి, భీకరపౌరుషము = భయంకరమైన పౌరు షము, ఆకరణిని = ఆవిధముగ.

తా త్ప ర్య ము

కమలనయనా! శత్రువులకు నా భయంకరపౌరుష మెట్లు దుఃఖము కలి గించునో యట్లు దైవము వారికి సుఖము కలిగింపలేదు.

చం॥ భరతున కెట్లు వచ్చు మహి? • పాలన సేయుచు వేలయేండ్లు నీ
వరిగినఁ గాన కంత భవ • దాత్మజు లుర్వి వహించువారుగా
కరయఁ బురానృపాచరిత • మట్టిద కాదె? జనంబులన్ సుతో
త్కరములఁ నేలఁ జెప్పి మఱి • కానల కేగరె తొల్లి భూపతుల్? ౬౪౧

భవదాత్మజులు=నీకొడుకులు, పురానృపాచరితము=పూర్వపురాజు లాచ రించినది, సుతోత్కరములన్ = పుత్రసమూహములను.

తా త్ప ర్య ము

అన్నా! భరతునకు రాజ్య మెప్పుడైన నెట్లువచ్చును? నీవరణ్యమునకుఁ బోవలసిన కాలమేది? నీవు వేలయేండ్లు భూమిపాలించి యడవికిఁబోఁగా నీ కొడుకులుగదా రాజ్యము పాలింపవలసినవారు.పూర్వపురాజు లట్టులేకదా చేసిరి. పుత్రులారా మీరు జనులఁబాలింపుఁడని చెప్పి యావలఁగదా వానప్రస్థులై తొల్లి రాజులు వనములకేగిరి. నీవేదిలేక యెట్టు లడవికిఁ బోయెదవు.

ఉ॥ చంచలచిత్తుఁ డానృపతి • శాత్రవ మూనిన రాజ్య మెట్లు ని
శ్చంచలవృత్తిఁ గ్రాలు నని • సందియపాటునఁ బూనవేని, నీ

యంచితరాజ్య మంతయు మ • హాంబుధి నాఁగెడివేలభంగి ర
క్షించెద, బాస చేసెద, న • శించుతఁ దప్పిన వీరలోకముల్. ౨౨

చంచలచిత్తుఁడు=స్థిరబుద్ధి లేనివాఁడు, నిశ్చంచలవృత్తి=కలఁతలేక నిమ్మళముగా.

తాత్పర్యము

అన్నా! నీకు మఱియొక సందేహముండవచ్చును. అదియేమనెదవా? నీవు పట్టాభిషేకము చేసికొనఁగా స్థిరబుద్ధిలేనిరాజు తనకుఁ దనవారికి రాజ్యములేక పోయెఁగదాయని విరోధము పూనెనేని రాజ్యమున నల్లకల్లోలములు పుట్టకుండునా యను సందేహముతో రాజ్యభారముఁ బూనుట కిష్టపడవేని నేను ప్రమాణముచేసి చెప్పెదను. రాజ్యమంతయుఁ జెదరకుండ సముద్రమును జెలియలికట్ట నిలిపినట్లు నేను నిలిపెదను. అట్లుచేయకపోయితినేని నావీరలోకములు నశించిపోవునుగాక.

కం॥ అభిషేకమునకు నియ్యెడ, శుభవిధిగా నియ్యకొనుము • చొర నిమ్ము మదిన్
ప్రభువుల నెల్లను నాబల, విభవంబున నే నొకండ • విదళింతుఁ జుమీ. ౨౩

శుభవిధి=శుభకార్యము, బలవిభవము=బలసంపద- అధిక బలము, విదళింతున్=చీల్చివైచెదను, ఇయ్యకొనుము=అంగీకరింపుము.

తాత్పర్యము

రామచంద్రా శుభకరముగ నభిషేకమునకు నంగీకరింపుము. దానియందు మనస్సుపోనిమ్ము. మనకు విరోధించిన నెల్లరాజులను నాబలాతిశయముచే నేనొకఁడనే విదళించెదను సుమా. నీ వూరక చూచుచుండుము.

శా॥ అన్నా! మద్భుజదండయుగ్మమిది శో • భార్థంబు గాదన్న, వి
ల్లన్నన్ నా కది భూష గాద, యసినా • నాబంధనార్థంబు గా
దెన్నన్ బాణము తూణి మోఁత కయి కా • దీనాల్గు ద్విట్చక్రమున్
ఛిన్నాంగంబుగఁజేసి కండలను బ్ర • చ్ఛేధింపఁగా జుమ్మనిన్. ౨౪

మద్భుజదండయుగ్మము=దండములవంటి నారెండు భుజంబులు, శోభార్థంబు=ప్రకాశించుకొఱకు, భూష=అలంకారము, అసినాన్=కత్తియనఁగా, ఆబంధనార్థంబు=నడికట్టు దానియందలి బాకు, చూచువారు ఇది వీరులయలంకారమని తలంచుకొఱకుఁగాదు. తూణి=అంబులపొది, మోఁతకయి = బరువు తక్కువయని మోసికొని తిరుగుటకుఁగాదు, ద్విట్చక్రమున్=శత్రువుల సమూహము, ఛిన్నాంగంబుగన్=ఛేదింపఁబడిన యవయవములఁ గలది యగునట్లు, ప్రచ్ఛేదింపఁగాన్=మిక్కిలి నఱికివైచుటకు.

తాత్పర్యము

అన్నా! అడ్డగడియ ప్రమాఁకులవలెనుండు నారెండు భుజములు దేహమును శోభిల్లఁజేయుటకుఁగాదు. విల్లు నాకు నలంకారమునకుఁగాదు. ఖడ్గము వీరా

లంకారముగా నడికట్టున దోపుటకుఁగాదు. మఱిదేనికై యివి ధరించితి నందువా శత్రు సమూహమును యుద్ధమందు ఛిన్నము భిన్నముచేసి కండలను తునకలు తునకలుగా నఱికివైచుటకుఁ జుమా.

కం॥ ఏవాఁడు నాదువగతుం, డై వర్తిలు వానియునికి • నైన సయింప నే
నావజ్రినైనఁ ద్రుంచెద, శ్రీవిద్యుచ్చలితకాంత • శితఖడ్గమునన్. ౬౮౫

వగతుఁడు=విరోధి, ఉనికి=జీవించి యుండుటయైన, వజ్రి=ఇంద్రుఁడు, శ్రీవిద్యుచ్చలిత...ఖడ్గమునన్=కాంతిగల మెఱుపువలెఁ జలించు కాంతిగల పదునైన కత్తిచేత.

తాత్పర్యము

నాకు విరోధియెవఁడో వాఁడు ప్రాణముతోనుండుటయైన సహింపను. అట్టి వాఁడింద్రుఁడైనను మిగుల కాంతిగల మెఱుపులవలెఁ జలించు కాంతులుగల ఖడ్గముచే దూరముననుండి బాణములచేఁగొట్టికాదు పైపడిపోయి ఖండించెదను.

తే॥ ఖడ్గనిష్పేషనిష్పిష్ట • గజనరాశ్వ,హస్తమూర్ధోరుసంచయ • వ్యాప్తిధరణి
దుశ్చరంబయిగహనమై•తోఁపఁజిత్ర,
గతులమెఱయుచుఁబగతురఁ•గుతిలపఱుతు. ౬౮౬

ఖడ్గ....ధరణి – ఖడ్గనిష్పేష=కత్తిదెబ్బలచేత, నిష్పిష్ట=తెగఁగొట్టఁబడిన, గజ=ఏనుఁగులు, నర=మనుష్యులు, అశ్వ = గుఱ్ఱములు వీనియొక్క హస్త = చేతుల, మూర్ధ=శిరముల, ఉరుసంచయ=గొప్పకుప్పలచే, వ్యాప్తి = వ్యాపించుట, ధరణి=భూమి, దుశ్చరంబయి=మనుష్యులు సంచరింప సాధ్యముకాక, గహనమైచొచ్చుటకును సాధ్యముగాకయుండునట్లు, తోఁపన్ = కనఁబడఁగా, వగతురన్=శత్రువులను, కుతిలపఱుతున్=నశింపఁజేయుదును.

తాత్పర్యము

కత్తిదెబ్బలచేత నఱకుడు పడిన యేనుఁగులయు మనుష్యులయు, గుఱ్ఱములయు తొండములయు చేతులయు శిరములయు గొప్ప కుప్పలు భూమినిండ వ్యాపింపఁగా మనుష్యులు సంచరించుటకనేల లోపలఁ జొచ్చుటకే సాధ్యపడనట్లు చిత్రగమనములఁ బ్రకాశించుచు శత్రువులను నాశము చేసెదను.

తే॥ మామకీననిశాతోగ్ర • మండలాగ్ర,చటులధారావిదారిత • శాత్రవేభ
మండలంబులు శంపాస•మగ్రవారి,ధరములట్టుల వ్రాలును • ధరములట్లు.

మామకీన=నాయొక్క, నిశాత=పదునైన, ఉగ్ర=భయంకరమైన, మండలాగ్ర=కత్తియొక్క, చటులచే=కదలుటచేఁ దదళక్కు తళక్కుమని మెఱయు, ధారా = వాదరచేత, విదారిత = చీల్పఁబడిన, ఇభమండలంబులు = ఏనుఁగు గుంపులు, శంపాసమగ్ర=మెఱుపులతోనిండిన, వారి ధరములట్టులు=మేఘములవలె, ధరములట్లు=కొండలవలె, వ్రాలును=నేలఁబడును.

లోహితోదాం, కేశతృణాం, మహీం కరోతి యుద్ధేషు
క్షత్రియో యస్సధర్మవిత్॥ భార. ౧౨. ౨౨. ౧౮.

నెత్తురనెడి నీళ్ళు, కేశములనెడి గడ్డిపోఁచలు, ఏనుఁగులనెడి కొండలు, ధ్వజములనెడి చెట్లుగలదానిగా భూమిని నెవఁడు యుద్ధమందుఁ జేయునో యా క్షత్రియుఁడు ధర్మమెఱిఁగినవాఁడు.

వధమేవ ప్రశంసంతి శత్రూణా మపకారిణామ్. భార. ౧-౧౪౦-౧౦
అపకారముచేసిన శత్రువులను జంపుటే శ్లాఘ్యము.

తాత్పర్యము

పదునై భయంకరమైన నాకత్తియొక్క చలించువాదరచేఁ జీల్పఁబడిన యేనుఁగు గుంపులు మెఱుపులతోడి మేఘములవలెఁ గొండలవలె నేలఁగూలును.

తే॥ బద్ధగోధాంగుళిత్రాణ•పరిగృహీత, భూరిచాపుఁడనై రణ•భూమి నిల్వ
నెవఁడు శూరుండనని వచ్చి•యెదుట నిలుచు,
గుండెగలవాఁడు ధారిణీ•మండలమున? ౭౭

బద్ధ=కట్టఁబడిన, గోధా=ఉడుముచర్మముచే చేయఁబడిన, అంగుళత్రాణ =వ్రేళ్ళను రక్షించు జీరా (Glove) చేత, పరిగృహీత = చక్కఁగా గ్రహింపఁ బడిన, భూరిచాపుఁడనై=పెద్ద విల్లుగలవాఁడనై.

తాత్పర్యము

ఉడుముచర్మముచే వ్రేళ్ళకు రక్షకముగాఁ జేయఁబడిన కవచముతోడ పెద్ద వింటిని ధరించినవాఁడనై యుద్ధభూమియందు నిల్వఁగా నేను శూరుఁడ నని యెదిరించి వచ్చి నాయెదుట నిలువఁగల ధైర్యముగలవాఁడు భూమండల మున నెందుఁగలఁడు.

కం॥ ఒక్కనిఁ బెక్కుశరంబులఁ, బెక్కుర నొక్కంటఁ గ్రుచ్చి•పీనుఁగు పెంటల్
గ్రక్కునఁ జేయనె పగఱం? జెక్కాడనె వారివాజి•సింధురరథముల్? ౭౮

శరంబులన్=బాణములచే, పగఱన్=శత్రువులను, వాజి=గుఱ్ఱములను, సింధుర=ఏనుఁగులను, రథములన్=తేరులను, చెక్కాడనె=చెక్కలు చెక్కలుగా నఱికివైవనా.

తాత్పర్యము

ఒకని పెక్కు బాణములచేతను పెక్కుర నొక్క బాణము చేతను నొక్క టిగాఁ గ్రుచ్చి పగవారిని బీనుఁగు పెంటలుగాఁ జేయనా వారి గుఱ్ఱములను ఏనుఁగులను రథములను జెక్కలు ముక్కలు చేయనా.

కం॥ ఇప్పుడ నృపునేలుబడిం, దప్పించి ప్రభుత్వమెల్లఁ • దటుకున నీకే
యప్పించెదిఁ గనుఁగొనుమీ, మెప్పైన మదస్త్రలసద•మేయబలంబున్.

ఏలుబడిన్=ప్రభుత్వమును, అప్పించెదిన్=అర్పించెదిని, మదస్త్ర=నాయస్త్రముల, లసత్=ప్రకాశించుచు, అమేయ=మితి మీఱిన, బలంబున్=బలమును, అర్పించు- తద్భవము అప్పించు- సర్పము=సప్పమైనట్టని యూహించునది.

తాత్పర్యము

అన్నా! పరిమితిపెట్టరాని, నాయస్త్రబలమునుజూడుము; ఇప్పుడే యిప్పుడే యీముహూర్తమునందే దశరథుని ప్రభుత్వముఁ దప్పించి దానిని నీకే యర్పింపఁగలను.

ఉ॥ చందనసుందరంబులు, ప్రశస్తతరాంగదరంగభూము, ల
స్పంద వసుప్రదానవిభవంబులు, మిత్రజనావనక్రియా
నందనముల్, సుయోగ్యములు నాభుజదండము లిప్డు సల్పెడిన్
జిందఱవందఱల్ త్వదభిషేకనివారణకర్మశీలురన్. ౬౧

చందనసుందరంబులు=శ్రీగంధపుఁబూతలచే నందమైనవి, ప్రశస్తతర=మిక్కిలి ప్రశస్తములైన, అంగద=భుజకీర్తులయొక్క, రంగభూములు=నాట్యమాడుస్థలములు- అనఁగా నుండునవి యనియర్థము. అస్పంద=చలింపని, వసు=బంగారు మొదలగు ధనములయొక్క, ప్రదాన=విశేషముగ దానముచేయుటయును, విభవంబులు=ఐశ్వర్యముగలవి, మిత్రజన=స్నేహితులగువారిని, అవన=రక్షణను, క్రియా=కార్యములందు, ఆనందనముల్=మిక్కిలి సంతోషించినవి, సుయోగ్యములు=ధరింప మిగుల నర్హములు గలవియగు, భుజదండములు=దండములవంటి నాభుజములు, త్వదభిషేక నివారణ కర్మశీలురన్=నీయభిషేకమును నడ్డగించు కార్యము స్వభావముగాఁగలవారిని, చిందఱవందఱ=ఒకటిగా లేక చెదరఁబోయి కలఁతపడునట్లుగా.

తాత్పర్యము.

గంధపుఁబూఁతలచే నందమై-మిగులఁ బ్రశంసింపఁదగిన భుజకీర్తులు ధరించునవియై విశేషధనముల దానముచేయుగుణమే యైశ్వర్యముగాఁగలవై మిత్రజనుల రక్షించుకార్యముపట్ల సంతోషముగలవై యిట్టికార్యములకు మిగులఁ దగినవైన నాభుజదండములు నీపట్టాభిషేకము జరుగనీయక యడ్డము వచ్చువారిని నానాముఖములఁ జెదరఁగొట్టి కలవరపడఁజేయును.

కం॥ నీకింకరుండ, ధారిణి, నీ కెట్లు లభించుదాని నిం దెలుపుమ, యి
ష్టా కానివాని నిలఁ బ్రాణాకలితుఁడు గాక యుండ నలఁచెద నధిపా. ౬౨

కింకరుఁడన్=బంటను, కానివానిన్=దానికడ్డమువచ్చు విరోధిని, ప్రాణాకలితుఁడు=ప్రాణముతోనుండువాఁడు, అలఁచెదన్=బాధించెదను.

తాత్పర్యము

రామచంద్రా! నేను నీసేవకుఁడను. కావున నీయాజ్ఞాప్రకారము వర్తింప వలసినవాఁడనే కాని స్వతంత్రించి నేనేకార్యము చేయు యోగ్యత నాకులేదు.

నీవాజ్ఞాపించినది చేయుట నాకువిధి- కావున నేవిధముగ రాజ్యములభించునో దానిని నీవేచెప్పుము. నీయిష్టప్రకారము వర్తించునపు డెవఁడు దానికి నడ్డము వచ్చునో యావిరోధిని ప్రాణముతో నుండనీయను. నీయాజ్ఞ వేచియున్నాను.

కైకేయి దశరథుల యిష్టముచొప్పునఁ దా నరణ్యమునకుఁ బోయెదనని శ్రీరామచంద్రమూర్తి కౌసల్యతోఁ జెప్పినపుడు లక్ష్మణుఁడు నీవట్లు చేయుట సరిగాదు. నీకు రాజ్యమురాకుండఁజేయుటకై వారు కుట్రవుఁ బన్నాగము పన్నిరే కాని యది నిజముగాదు. వంచకులవంచన ఫలింపఁజేయరాదు. కావున నీవరణ్యమునకుఁబోరాదనెను.

లక్ష్మణా! నీవు కైకేయిని దూషింపరాదు. ఈరాజ్యాభిషేక విఘ్న మామె కృతముగాదు. దైవకృతము. ఆమె నిమిత్తమాత్రమే. కావున నామెమీఁద నీవేల యాయాసపడెదవు. దైవమే మేళ్ళకీళ్ళకుఁ గారణము. ఆమె కాబుద్ధి పుట్టించినది దైవమే. అటుగాకున్న నామీఁద నెంతో ప్రేమకలిగి వర్తించువారికి నిట్టి విషమబుద్ధి నిమిషములో నేలకలిగెను. దైవ మప్రతిహతము. ఏవేళకు నెవరిచే నేమిపని యెట్లు చేయించునో తెలియదు. అట్టివానితో నెవఁడు పోరఁ గలడు. అని రామచంద్రమూర్తి సమాధానము చెప్పెను.

లక్ష్మణుఁడు అన్నా! నీవు చెప్పినది సరిగాదు, దైవము పరాధీనమైనది. అది స్వతంత్రించి యేకార్యము చేయఁజాలదు. అట్టిదానిని నమ్ముకొని దైవమిచ్చునని పురుషప్రయత్నము చేయకుండుట సరిగాదు. దైవేనదేయమితి కాపురుషావదంతి, అసంశయందైవపరః క్షిప్రమేవ వినశ్యతి-భార-౧-౨-౧౦౩-౨౨- దండఏవహి రాజేంద్ర క్షత్రధర్మోనముండనమ్-భార-౧-౨-౩- -౪౩ దైవమేగతియని యుండువాఁడు శీఘ్రముగ నిస్సందేహముగ నాశమగును. రాజులకు దండము ధర్మముగాని ముండనము (సన్న్యాసము)గాదు,దైవము బలిష్ఠమని నీవనినఁబౌరుషము బలిష్ఠమని నాయభిప్రాయము. దైవపక్షమున దశరథుఁడు లోనగు భరతపక్షులు రానిమ్ము-పౌరుషపక్షమున నేను నీయాజ్ఞచొప్పున నిలిచెదను. నీదైవ మేపాట్లుపడునో చూడుము, అనెను. దీనివలన దైవమునకంటెఁ బౌరుషమే శ్రేష్ఠమని లక్ష్మణువాదము, అది నిరాధారమైనదికాదు.

మహాభారతంబున :—

శుభేన కర్మణా సౌఖ్యం, దుఃఖం పాపేనకర్మణా,
కృతంఫలతి సర్వత్ర, నాకృతం భుజ్యతే క్వచిత్
కృతీ సర్వత్రలభతీ, ప్రతిష్ఠాభాగ్య సంయుతామ్.
అకృతీ లభతేభ్రష్టః, క్షతేక్షారావసేచనమ్.
తపసారూపసౌభాగ్యం, రత్నానివివిధానిచ,
ప్రాప్యతే కర్మణాసర్వం, నదైవాదకృతాత్మనా,

సర్వం పురుషకారేణ, కృతేనేహోపలభ్యతే
జ్యోతీంషి త్రిదశానాగాః, యక్షశ్చంద్రార్కమారుతాః
సర్వేపురుషకారేణ, మానుషా దేవతాంగతాః.
అర్థోవా మిత్రవర్గోవా, ఐశ్వర్యం వా కులాన్వితమ్
శ్రీశ్చాపి దుర్లభాభోక్తుం, తథైవకృత కర్మభిః
స్వంచేత్కర్మఫలం నస్యా, త్సర్వమేవా ఫలంభవేత్.
లోకేదైవ సమాలంబ్య, ఉదాసీనోభవేన్నతు।
అకృత్వా మానుషంకర్మ - యోదైవ మనువర్తతే.
వృథాశ్రామ్యతి సంప్రాప్య, పతింక్లీబమివాంగనా ॥

శుభకార్యములు చేసినవాఁడు మేలు, పాపకార్యములు చేసినవాఁడు కీడు ననుభవించుచున్నాఁడు గాని చేయనివానికి ఫలములేదు. కార్యముచేయువాఁడే యెందుఁజూచినను భాగ్యముతోఁ బ్రతిష్ఠగాంచుచున్నాఁడు కార్యముచేయని వాఁడు భ్రష్టుఁడగుచున్నాఁడు. తపస్సుచేతనే రూపసౌభాగ్యములు వివిధరత్న ములు గలుగుచున్నవి. కర్మముచేతనే సర్వము కలుగుచున్నవి. కానిచేయని వానికి దైవమేదియు నిచ్చుటలేదు. స్వర్గము - భోగము - నిష్ఠామనీషిత్వము సర్వము పురుషకారముచేతనే లభించుచున్నది. దేవతలు నాగులు యక్షులు- సూర్యచంద్రమారుతులు లోనైనవారు మనుష్యులుగానుండి పురుషకారముచేఁ గదా దేవతలైరి. అర్థము- మిత్రులు నైశ్వర్యములోనైనవి పురుషకార లభ్య ములే- కర్మఫలము లేదనునెడల సర్వము నిష్ఫలమైపోవును. లోకము దైవము నాలంబనముగాఁ గొని పురుషకారమునందుదాసీనులుకారాదు. మనుష్యుఁడు చేయవలసిన కర్మముచేయక దైవమున్ని యిచ్చునని యుండువాఁడు నపుం సకుఁడగు భర్తను గట్టుగొన్న స్త్రీవలె వ్యర్థుఁడు. ఇత్యాదివాక్యములచే దైవముని కంటెఁ బౌరుషము బలిష్ఠమని తోఁచుచున్నది. రామచంద్రమూర్తి దైవమే బలిష్ఠ మని చెప్పెను. దైవ పౌరుషములకుఁ బరస్పర విరోధము కానవచ్చుచున్నది. ఇదియెట్లనినఁ బురుషకారమే లేక దైవ మేకార్యము చేయఁజాలమి సత్యమే- దైవసాహాయ్యమే లేక కార్యము ఫలింపమియు సత్యమే. కావున నొకఫలము గావలసిన రెండును గావలసినవే.

గీ॥ పౌరుషము దైవంబు తోడ్పాటులేక ఫలముఁ గాంచంగనేరదు పార్థివేంద్ర
విత్తు సహకారి కాకున్న రిత్తనేల వంధ్యమగుఁగాక తాఫలవంతమగునె ?

చం॥ వెరవున లావునం గృషికివేయివిధంబుల మేలొనర్చినం
దొరకొనునె ఫలంబు దడితోఁదగు వర్షములేకయున్న నె
ప్పరుసున లెస్సచేసినను బౌరుషముల్ ఫలియించుటెల్ల నా
రణము నం బ్రసన్నమగు దైవముచేఁ తన చూపెఫల్గునా.

యథాగ్నిః పవనోద్ధూతః । సూక్ష్మోపి సుమహాభవేత్
తథా కర్మసమాయుక్తం, దైవం సాధువివర్ధతే.

గాలి విసరెనేని సూక్ష్మమైనదైనను నగ్ని యెట్లు పెద్దగా విజృంభించునో యట్లు పురుషకారముతోఁగూడిన దైవము మిక్కిలి వృద్ధిచెందును.

ఇట్లుండ రామచంద్రమూర్తి యేల పురుషకారమున కనుజ్ఞయీయలేదు. రామచంద్రమూర్తి పురుషప్రయత్నము వ్యర్థము. దైవమే కార్యసాధక, మను నభిప్రాయముగలవాఁడుకాఁడు. అట్టి యభిప్రాయము గలవాఁడై యుండెనేని సీతాదేవి నిమిత్తమై యంతటి పురుషకారము చేసియేయుండఁడు. దైవమే సీతను దెచ్చియిచ్చునని యూరకుండును. ధర్మవిరుద్ధ పురుషకార్యము రామ చంద్రమూర్తికి సమ్మతముగాదు. లక్ష్మణు పురుషకారమునకుఁ బ్రథమ కబళము దశరథుఁడగును. అనఁగా రాజ్యకాముకత్వముచే తండ్రిని బీడించినవాఁడగును. అదితుచ్ఛము. కావున రామచంద్రమూర్తి యీవిషయమునఁ బురుషకార మంగీకరించినవాఁడుకాఁడు. రామచంద్రమూర్తి యీయభిప్రాయము గల వాఁడని యాయన లక్ష్మణుతోఁ జెప్పినమాటలవలనఁ దెలియనయ్యెడి. అయో- ౧౪౨౨ పద్యము.

చం॥ ఏనొకరుండనే పుడమినెల్ల నయోధ్యను శాతబాణ సం
తాన విదారితంబుగ నొనర్పఁగఁజాలనె? కారణంబులే
కేను బరాక్రమింపఁదగునే? పరలోకభయంబు ధర్మ భీ
జ్ఞానము మాన్చెడి న్నను నసాధ్యమై పట్టము కట్టుకొంటయున్.

శ్రీరామచంద్రమూర్తి యభిప్రాయము దీనివలన స్పష్టము.

కావున నాయన పురుషకారవిరోధిగాఁడు, అన్న యరణ్యమునకుఁబోయి కష్టపడుట కిష్టములేక యెట్లులైన నన్న నయోధ్యయందుండఁజేయు సద్భావ ముతో లక్ష్మణుఁడు వాదించెనేకాని యాయన దైవవిరోధిగాఁడు.

ఇచ్చట లక్ష్మణువాదము సాధువాదమా దుర్వాదమా యని విచారింప వలయును.

వంశసంప్రదాయమునుబట్టి శాస్త్రమర్యాదనుబట్టి శ్రీరామచంద్రమూర్తి జ్యేష్ఠుఁడగుటచే రాజ్య మాయనకు లభింపవలసినది విధి.దానిని దప్పించు నధి కారము దశరథునకు లేదు. రాజ్యము దశరథ స్వార్జితముకాదు. తనయిష్టప్రకా రము వినియోగించుటకు పైతృకము కావున వంశమర్యాదయనుల్లంఘనీయము. ఇంటిలోని వస్త్రాభరణాదులవలె రాజ్యము దశరథునకు సొంతద్రవ్యముఁగాదు. రాజ్యపాలన నిమిత్తమై రాజులేర్పడిరిఁకాని రాజులనిమిత్తమై రాజ్యము పుట్టలేదు కావునఁ గ్రొత్తరాజేర్పడునప్పుడు ప్రజలసమ్మతి యావశ్యకము. అది శ్రీరాము నకే యనుకూలమై యున్నదని దశరథుఁడు చేసిన సభయందును నావల జనుల చర్యచేతను స్థాపితము. ప్రజలు సమ్మతించినవాఁడే రాజు. దానికి విరుద్ధముగా

వర్తించు నధికారము దశరథునకు లేదు. కావున దశరథుఁడు శ్రీరామునకు రాజ్యము రాకుండఁజేయుట లేనియధికారము తలపైఁ బెట్టుకొనుట యయ్యెను. ఇట్టి సందర్భమందు న్యాయ్యముగా శ్రీరామునకు రావలసినది సౌమ్యమార్గమున రాకున్నఁ బరాక్రమముచేనైన రాఁబట్టుకొన యత్నించుట లక్ష్మణునకుఁ దగినకార్యమేగాని విరుద్ధచర్యగాదు. యుద్ధముచేసినను నది ధర్మయుద్ధమే యగునుగాని యధర్మయుద్ధము కాదు.

దశరథుఁడు కైకేయీ వివాహకాలమందు రాజ్యముంకువ యిచ్చెఁగదా. ఆకారణమున శ్రీరామునకు రాజ్యము రాఁగూడదందురేని నూఱబద్ధాలాడి యొక పెండ్లిచేయు మన్నసామెతప్రకారముగను, "బరిణయంబులయందును బల్కు బొంకు సత్యాతిశయంబ" యగుటను వివాహకాలమునాఁటిమాట యీవిషయమునఁ బాటింపరాదు. అదియునుగాక శాస్త్రప్రకారము కౌసల్యాపుత్రునకు జ్యేష్ఠునకు శ్రీరామునకు రావలసినదని యుండుటచే శాస్త్రవిరోధముగా దశరథుఁడు వర్తించుటచే నాదానము దానముగాదు. వివాహమైనయనంతర మెంతకాలమైనను కౌసల్యకు, సుమిత్రకు సంతానము లేనికారణమున సంతానార్థియై దశరథుఁడు కైకను వివాహమాడెను. వంధ్యాసంభోగము వ్యర్థమని కైకతోనే భోగించుచుండెను. కౌసల్యకుఁ బుత్రులు గలుగరని నమ్మి కైకకు రాజ్యముంకువగ నిచ్చెను.

అదిగాకున్న యుద్ధకాలమునాఁటి వరములు గలవుగదా యందురేని యదియు గ్రాహ్యముగాదు. మగనిని భార్య బ్రతికించుకొనుట విధి. బ్రతికించుకొనకయున్న నానాఁడే విధవయై మూలఁబడియుండును. రామాయణమే పుట్టియుండదు. సత్యవంతుని బ్రదికించుకొనిన సావిత్రికి మగఁడేమియిచ్చెను. కైక తాను జేయవలసిన కార్యము తన మాంగల్యమునకై చేసెనేకాని లోకోపకారబుద్ధినిగాదు. అయినను దశరథుఁడుమెచ్చి బహుమానములు తన ధనము భూములో పుట్టలో ఆభరణములో యిచ్చియుండవచ్చునుగాని శాస్త్రప్రకారము పరునిదై తనదిగాని దానిని దానెట్లు శాస్త్రవిరుద్ధముగా వినియోగపెట్టఁగలఁడు. కావునఁ దనసొంతసొత్తువలె రాజ్యమును యథేచ్ఛముగా భరతున కిచ్చునధికారము దశరథునకు లేదు. ఎటు చూచినను దశరథురాజు చేసినది సరిగాదు.

అట్లైనచో స్వధర్మ నిర్వహణదీక్షఁ బూనిన శ్రీరామచంద్రమూర్తి శాస్త్రప్రకారము తనకు రావలసినరాజ్యము రాఁబట్టుకొని క్షాత్రధర్మమున వర్తింపవలసియుండఁగా స్వధర్మమును విడిచి పరధర్మమైన వానప్రస్థాశ్రమమున నెట్లు మునివలెనుండ నంగీకరించెను. స్వధర్మనిధనంశ్రేయః పరధర్మో భయావహ యనుట శ్రీరాముఁడేల మఱచెనందురా.

శ్రీరామచంద్రమూర్తి దృష్టిపథము వేఱు. ఆయనవాదము వేఱు. రాజ్యము కావలయునని కాని వలదనికాని యావిషయమున నభినివేశముగలవాఁడు కాఁడు. రాజ్యతంత్రదృష్టి లక్ష్మణుఁడు చూచెను. గృహధర్మదృష్టి శ్రీరాముఁడు చూచెను

కావున నిరువురకు దృష్టిభేదము కలదు. జీవతో వాక్యకరణాత్తని తండ్రి జీవించి యున్నప్పుడు ఆయన యాజ్ఞ నెఱవేర్పవలసినది పుత్రునకు విధి. ఆతండ్రి రాజైననుసరియ బిచ్చగాఁడైనను సరియ. తండ్రి తండ్రియే. ఆయనయాజ్ఞ యనుల్లంఘనీయము. కావున రామా! పట్టాభిషేకము చేసికోయనునఁ జేసికొనెద ననెను. రామా యడవులకుఁ బొమ్మనినఁ దథాస్తనెను.ఇది పుత్రుని స్వధర్మము కాదా. అర్జునునివలె శ్రీరాముఁడే క్షత్రియధర్మమును తానై వదలి బ్రాహ్మణధర్మ మును గ్రహింపఁబూనినవాఁడుకాఁడు. కావున బరధర్మావలంబన భీతి శ్రీరాము నకులేదు. అటుగాక రాజ్యము దశరథుని స్వతంత్రపదార్థమని దాని వినియోగ మందతనికి నధికారము గలదని యందురా. ఉండునుగాక అప్పుడును దశ రథుఁడు తండ్రియే శ్రీరాముఁడు కొడుకే. పితృవాక్యపరిపాలన మవశ్య కార్యమే. తండ్రియిచ్చినది తీసికొనుట పుత్రధర్మము కాని ధనదాసుఁడై తండ్రితోఁ దమ్ములతోఁగలహించుట పుత్రధర్మముగాదుగదా.కావున శ్రీరాముని నిశ్చయము పితృవాక్యపరిపాలనము మేలైనను గీడైనను లాభకరమైనను నష్టి కరమైనను పుణ్యమైనను పాపమైనను బుత్రున కవశ్యకర్తవ్యమనునదిగాని, జ్యేష్ఠాంశము పోఁగొట్టుకొనరాదు. తండ్రిని దోడఁబుట్టువులను జంపియైనఁ దన భాగము రాఁబట్టుకొనవలయునను విషయము స్థాపింపవలయుననికాదు. కావున నీవిషయమున భగవద్గీతా సందర్భమునకు దీనికి సంబంధము లేదు. ఈచర్యను ౬౯౩-వ పద్యమున శ్రీరాముఁడు పరిష్కరించుచున్నాఁడు.

చం॥ అని వచియించుతమ్మునయ • నాంత వినిర్గతబాష్పవారి నొ
య్యనఁ దనకేల బోఁ దుడిచి • సాదరభాషలఁ దేర్చి నాయనా!
జనకునిమాట పట్టుటయె • సత్పథ మద్ది దొలంగనేర నే
ననయత దానిఁ దీర్చుటయె • సమ్మత మంచు నెఱుంగు మంచనన్. ౬౯౩

నయనాంత=కనుగొనలనుండి, వినిర్గత=బయలువెడలు, బాష్పవారిన్= కన్నీళ్ళను, ఒయ్యనన్=మెల్లగా, కేలన్=చేతితో, సాదరభాషలన్=ఆదరముతోఁ గూడిన మాటలచే, తేర్చి = సమాధానపఱచి, సత్పథము = మంచిమార్గము, ననయత = నీతితోఁగూడినట్లు.

తాత్పర్యము

ఈప్రకారము చెప్పుచున్న లక్ష్మణుని కనుఁగొనల నుండి జాఱుచున్న కన్నీ ళ్ళను దనచేతితో మెల్లగాఁదుడిచి,యూఱడించి శ్రీరాముఁడు ప్రేమపూర్వకముగా నిట్లనియె; నాయనా! జనకుని యాజ్ఞప్రకారము వర్తించుటయే మంచిమార్గము- "జీవతో వాక్యకరణాత్ ప్రత్యబ్దం భూరిభోజనాత్ గయాయాం పిండదానేన,త్రిభిః పుత్రస్య పుత్రతా." తండ్రి జీవించియుండఁగా నాయన చెప్పినట్లు చేయుటవల నను మరణించెనేని ప్రతి సంవత్సరము మృతిదివసమునాఁడు విస్తార మన్న దానము చేయుటవలనను, గయయందుఁ బిండము పెట్టుటవలనను, బుత్రుఁడు

పుత్రుఁడగు చున్నాఁడు అట్టివానియందుఁ బుత్రశబ్దము సార్థకము. కావున నట్టి మంచి మార్గమందుండి తొలఁగనేరను. మంచి నీతిమార్గమవలంబించి యా వాక్యమును జక్కఁజేయుటయే నాకు సంతోషకరమైన కార్యము ఇది నాయభిప్రాయమని తెలిసికొనుము. అనిచెప్పఁగా.

—♦ ౨౪-వ సర్గము. కౌసల్య శ్రీరామునిశ్చయ మెఱింగి పరితపించుట. ♦—

చం॥ జనకనియోగపాలనమె ♦ చల్పఁగ నిశ్చితచిత్తుఁడైన పు
 త్రునిఁ గని కోసలాత్మభవ ♦ తోయజనేత్ర సుశీల బాష్పవా
 రినిచయరుద్ధలోచన య♦రీణసధర్మపథావలంబి రా
 మునిముఖపంకజంబు సుత♦మోహమునం దిలకించి యిట్లనున్. ౬౯౪

జనకనియోగపాలనమె=జనకుని యాజ్ఞపాలించుటయె, నిశ్చితచిత్తుఁడు=మనస్సున నిశ్చయించుకొనినవాఁడు, సుశీల=మంచిస్వభావముగలది, బాష్పవారి=కన్నీటి, చయ=సమూహముచే, రుద్ధ=అడ్డగింపఁబడిన, లోచన=చూపులుగలది, అరీణ=వంకరలేని, సధర్మ=ధర్మముతోఁగూడిన, పథావలంబి=మార్గమునవలంబించినవాఁడు, శ్రీరాముని ముఖపంకజంబు=శ్రీరాముని ముఖకమలము- ఇది యేకదేశి సమాసము- ధర్మపథావలంబి యను విశేషణము శ్రీరాముని ముఖపంకజంబు అను సమాసములోని శ్రీరాముని యనునొకపదముతో నన్వయించెను, కౌరవ ప్రాగసరుండు ధర్మసుతుపన్పిది - భార. ఇత్యాదిప్రయోగములు గలవు. శ్రీరాముని యనుషష్ఠ్యంత విశేష్యమునకు ధర్మపథావలంబియను ప్రథమాంతపదము విశేషణము. సుతమోహమునన్=పుత్రుఁడను మోహముచే, తిలకించి=చూచి, తనకొడుకను వ్యామోహముచేఁజూచి వగచెనుగాని లోకోద్ధారకమునకై పుట్టినకొడుకను దృష్టిఁ జూచినదికాదు. ఈవిషయము సీతాదేవిముందు చెప్పఁగలదు.

తాత్పర్యము

తండ్రియాజ్ఞ పాలింప నిశ్చయముచేసికొనిన కుమారునిఁజూచి సాధుచరిత్రయగు కౌసల్యాదేవి కన్నీళ్ళు దృష్టుల అడ్డగించుచుండఁగా చక్కని ధర్మమార్గమందు నడువఁబూనిన రామచంద్రమూర్తి ముఖకమలమును బుత్రవ్యామోహముచేఁ జూచి యిట్లు చెప్పెను.

ఉ॥ ఎన్నఁడు దుఃఖముం చనఁగ ♦ నెట్టిదొకో యెఱుఁగండు, ధర్మసం
 పన్నుఁడు సర్వభూతహిత ♦ మార్గుఁడు దెప్పుడు, నాకు నాజికు
 త్పన్నుఁడు, విక్రమాఢ్యుఁడు,ప్ర ♦ థావిభవుం, డెటులొక్కొ కానలో
 నెన్నుల నొక్కటొక్కటిగ ♦ నేఱి భుజించు, భజించుఁ గష్టముల్. ౬౯౫

ధర్మసంపన్నుఁడు=ధర్మమే సంపదగాఁగలవాఁడు, సర్వభూతహిత మార్గుఁడు=సర్వభూతములకు హితమునే వెదకువాఁడు.సర్వభూతములకు హితమైన బాణ ముగలవాఁడు ఎవరికైనఁగీడుచేయుటయందు బాణప్రయోగము చేయఁడని

భావము. రాక్షసవధాదికము లోకహితకార్యమే, అజికిన్=దశరథునకు, విక్రమాఢ్యుఁడు=పరాక్రమమున గొప్పవాఁడు, ప్రథావిభవుండు=కీర్తియును సంపద గలవాఁడు,ఎన్నుల నేఱికొని=పైరుకోయఁగా రాలినగింజల నేఱికొని జీవించుట సిలవృత్తి కళ్ళములయొద్ద - తోళ్ళయొద్ద రాలినగింజలనేఱి తినుట - ఉంఛవృత్తి- ఇవిరెండు నయాచిత వృత్తి జీవించువారి జీవనోపాయములు.

తాత్పర్యము

ఈ రామచంద్రుఁ డింతవఱకుఁ గష్టమనఁగా నెటువంటిదో యెఱుఁగఁడు. (ఇదివఱకుఁ గష్టము లనుభవించియుండిన యెడల నిప్పుడిది విశేషకష్టముగాఁ దోఁపకుండును) ధర్మమే తనకు సంపదగాఁ దలఁచువాఁడు. ఎల్లభూతములకు నెవరికినేమి నేమి మేలు చేయుదునాయని వెదకుచుండువాఁడు. ఉత్తమ స్త్రీనగు నాకు దశరథునివంటి చక్రవర్తికి మహాత్మునకుఁ బుత్రుఁడైనవాఁడు. పరాక్రమవంతులలో గొప్పవాఁడు. గొప్పకీర్తిని సంపాదించినవాఁడు. ఇట్టివాఁడు కాఱడవులకుఁబోయి యందు నాఁకలి దీర్చుకొనుటకుఁగాను నివ్వరిగడ్డిగింజల నొక్కొక్కదానినే, యదియైనఁదెచ్చియిచ్చువారులేక తానే, సిలోంఛ వృత్తులవలంబించి యెట్లుతినఁగలఁడు? కష్టములెట్లు సహింపఁగలఁడు? వనవాసమందుఁగల కష్టనులను శ్రీరాముఁడు సీతకు వివరించెను. ౪౯ మొదలు ౮౧-౨ వఱకు.

కం॥ ఎవ్వనిభృత్యులు దాసులు, మవ్వముగ భుజింప నిష్ట◆మంజుల భోజ్యం
బవ్విభుఁడు మూలఫలముల,నెవ్విధి నమలుచును గడుపు◆నెరగలి నార్పున్.

మవ్వముగ = మృదువుగ-నెమ్మదిగ నేవిచారములేక, ఇష్ట మంజుల భోజ్యంబు=ఇష్టమైమనోహరమై రుచిగల భోజన పదార్థములు, కడుపు నెరగలి= జఠరాగ్నిని - కడుపుచిచ్చును.

తాత్పర్యము

తనపరిచారకులు దాసులు నింటనుండి కడుపారఁ దమకిష్టమైన రుచిమంతములైన వ్యంజనములు పిండివంటలు అన్నములు హాయిగాఁ దినుచుండ స్వామియగు తాను నడవులలోఁ గందమూలములు కాయగసురులు దిని కడుపుచిచ్చెట్లార్పఁగలఁడు ?

కం॥ కరుణాపాత్రుని సుగుణా, భరణుని శ్రీరాము నడవి ◆ పా ల్పేసినయా
ధరణిపుచరితము విన్నను,
నరుఁ డెవ్వఁడు నమ్ము వెఱపు◆నం బడకుండున్. ౬౯

కరుణాపాత్రునిన్ = దయకు స్థానమైనవానిని- ఒకరియందు దయనే చూపించువాఁడు- కరుణచూపించుటచే యోగ్యుఁడగువానిని,అదియేలయనఁగా సుగుణాభరణుని = సద్గుణములే యలంకారముగాఁ గలవానిని, శ్రీరామున్ = శ్రీరామశబ్దము సార్థకముగఁ గలవానిని.

తా త్ప ర్య ము

దయకుస్థానమై యెట్టివారియందును దయయేచూపించుటచే నితరులకు దయనీయుఁడై సుగుణములే యాభరణములుగాఁ గలవాఁడై సంపదచే రమించు వాఁడై త్రిలోకైకసుందరుఁడై, కాంతిసంపన్నుఁడై యుండు శ్రీరాముని నడవులపాలు చేసిన రాజు చరిత్రము వినిన నరుడెవ్వఁడు "మనయందు దోషము లేకున్న మనకు రాజువలని భయములేదు" అని భయపడకుండును. నిష్కారణముగ నిరపరాధిని కన్నకొడుకును దేశము వెడలఁగొట్టి యడవులపాలుచేసిన వాఁడు మనల నేవేళకేమి చేయునో యని జనులు భయపడుచుందురనిభావము నరులగతి యిట్లుండ నారులకతి జెప్పవలసినదేలేదు.

కం॥ లోకాభిరామ! రామా! యీకరణిని నిన్ను నడవి • కేగించుటచే
లోకమున దైవ మొక్కం,డే కడుఁ బ్రబలుండు దేని • నేని ఘటింపన్. ౬౯౮

తా త్ప ర్య ము

రామా లోకాభిరాముఁడవగు నిన్నే యీవిధముగ నడవికి సాగించుటచే లోకమున దైవమే దేనినైన ఘటించు ప్రబలశక్తిగలదని తోఁచెడిని.

రామాయణమున సీతారామలక్ష్మణుల చరిత్రమున వారి మాటలచేవారి బోధములు పౌరుషమునకంటె దైవమే ప్రబలము కావున దైవమే సేవ్యమను విషయము పలుతావులఁ జెప్పఁబడెను. భారతము నేర్పునదియు నిదియే. దుర్యోధనుఁడు మరణకాలమున "దైవమేవ పరంమన్యే పౌరుషంతు నిరర్థక" మ్మనియేకదా చెప్పెను. కావున మనుష్యులు దైవమును ధిక్కరించి పౌరుషమునే యాశ్రయింపక దైవము నాశ్రయించి యథాశక్తి యథాశాస్త్రము నిష్కాములై స్వకర్మములు చేయుచుండవలెను. రామాయణమువలన మనము నేర్చుకొనవలసిన ముఖ్యవిషయమిదియే. భగవద్గీతోపదేశ మిదియే. సన్న్యాసులై పరపిండ నిరతులు కమ్మని కాదు.

సీ॥ నాయనా! శోకాగ్ని • నాయుదరంబున, జనియించి భవదద • ర్శనసమీర
మున రేఁగి దుఃఖైధ్మ • ములచేత వర్ధిల్లి, నశ్రుహుతాహుతి • వ్యాప్తమగుచుఁ
జింతోష్మధూమసం • చిత మయి నిశ్వస,నాయాస సంకలి • తాభ్యుదయత
నీవు లేకుండుట • నెఱిహిమాత్యయమున, నెందుపొదరుగుమి • నేర్చుకారు
తే॥ చిచ్చునా నన్ను నీఱుగాఁ • జేయ కున్నె,యట్లగుట లేఁగ వెనుకొను • నావునట్లు
వత్తునను దోడికొనిపొమ్ము • వత్స! యనుచు,
శోకహతయైనతల్లికి • సుతుఁడుపలుకు. ౬౯౯

శ్రీరాముఁడు వనవాసము నిశ్చయించుకొనుట తెలిసి యిఁకఁ బోవలదనుట వ్యర్థమనితలఁచి యడవికిఁ దన్నుఁగూడఁ బిలుచుకొని పొమ్మని కౌసల్య యడుగుచున్నది.

తాత్పర్యము

నే నొకత లేకున్న నేమి యాయనకుఁ గొఱఁత. నూర్లకొలఁది భార్యలున్నారు గదా, వా రాదరింపక యుందురా? యనెదవేమో. ఆదరించువారుండనీ లేకపోనీ నీకర్తవ్యము నీవుచేయవలదా? భర్తను వదలిపోవు స్త్రీలు భ్రష్టలేకదా యగుదురు. దుష్టస్త్రీల నడవడి పతివ్రతయగు నీవు మనసునందైనఁ దలఁపవచ్చునా. తలఁపనేరానిదానిని చేయుట యెట్లుతగును? నాకు నీవు తల్లివై యట్లుచేయుటతగదు. నీవలన నాకును నపకీర్తివచ్చును.

కం॥ ఎందాఁక బ్రతుకు జనకుం, డందాఁకను నీకు నతని•నర్హసపర్యా
స్పందగతిఁ గొలువుమీ యా,నందమున సనాతనంపు•న్యాయం బిదియౌ.

అర్హసపర్యాస్పందగతి=తగిన శుశ్రూషయందుఁ జలింపని మార్గమున,

తాత్పర్యము

మాతండ్రి యెందాఁక జీవించియుండునో యంతదనుక నీవు నాయనకుఁ దగిన శుశ్రూషలందు లోపముచేయక సేవింపవలయును. ఇతరులుచేయువారున్నను నీభారము నీకుఁదప్పదు. ఇది సనాతన ధర్మము.

కం॥ ఆపుణ్యశీల శుభచ, ర్యాపరుఁ డౌనిజతనూజుఁ•డాడెడిధర్మా
లాపమ్ముల విని ప్రీతిని, నాపట్టిని జూచి యట్ల•యౌఁ గాక సుతా. ౨౦౩

పుణ్యశీల=పుణ్యకార్యములఁజేయు స్వభావముగలది, శుభచర్యాపరుఁడు=శుభకార్యములు చేయుటయందే యాసక్తిగలవాఁడు, నిజతనూజుఁడు=తన కొడుకు, ధర్మాలాపములు, ధర్మయుక్తములైన మాటలు, పట్టిని=కుమారుని, బిడ్డను.

తాత్పర్యము

పుణ్యకార్యము స్వభావముగఁజేయు కౌసల్య తాను చెప్పినది సరిగాదని శుభకార్యములందే యాసక్తుఁడైన తనకొడుకు చెప్పెడి ధర్మపుమాటలచే నెఱిఁగి యాయన ధర్మబుద్ధికి సంతోషపడి నాయనా యట్టులే యగుఁగాక.

కం॥ అని మఱి వగకూరెడినిజ, జననిం గని దుఃఖశాంతి•సంపాదింపన్
జనకసుతావిభుఁ డిట్లను, వినయంబు నయంబు దోఁప•విశదోక్తులతోన్ ౨౦౪

వగకూరెడి=వ్యసనపడు.

తాత్పర్యము

ఈప్రకారము చెప్పియును దుఃఖమాఁపలేక వ్యసనపడు తల్లికిదుఃఖము శాంతింపఁ జేయుకొఱకు వినయముతోను నయముగను శ్రీరామచంద్రమూర్తి ముందు చెప్పినదానినే విశదముగాఁ జెప్పుచున్నాఁడు.

చం॥ గురుఁడును, భర్త, రాజు, జన•కోటుల కెల్ల నధీశుఁ,డౌఁ గదా
యరయఁగఁ దండ్రి? యట్టిప్రభు•నాజ్ఞఁ జరింపఁగ నాకు నీకునున్

కం. భరతుండును ధర్మాత్ముఁడు, కరుణామతి కీడు పలుకఁ◆గానం డెవరిన్
గురుభక్తిని భవదుక్త్యను, సరణము మానండు పలదు◆సందియపడఁగన్.
భవదుక్త్యనుసరణము=నీమాట ననుసరించి వర్తించుటను. ౭౧౦

తాత్పర్యము

కైక పగదాయెను. ఆమెకొడుకు రాజై నిన్నేమిబాధించునో యనికదా నీభయము. నీభయమునకుఁ గారణములేదు. ఏలన భరతుఁడు ధర్మాత్ముఁడు. దయగలవాఁడు. ఎవరిని జెడ్డమాట పలికెడువాఁడుగాఁడు. ఇఁక నిన్నుఁ బలుకునా? కావున నీవు తల్లివను గొప్పభక్తిచే గురువాక్యము మీఱరానిదని నీ వాక్యము చలుపక మానఁడు. నీకు సందేహపడఁ గారణములేదు.

చం॥ అడవికి నేను బోఁ గడుపు◆నారటపాటున ఱేఁడు వృద్ధుఁడున్
బడుగును గాన దుఃఖపడి◆ప్రాణముఁ గోల్పడు నొక్కొ యంచు నే
జడిసెదఁ, దండ్రికి న్మదికి◆సంకటపాటొదవంగనీక యె
వ్వడువున నప్రమత్త వయి◆వర్ణితశీల! భజింపు ప్రేముడిన్. ౭౧౧

కడుపునారటపాటునన్=పుత్రశోకముచే, బడుగు=మిక్కిలి బలహీనుఁడు, కోల్పడున్=కోలుపోవును, పోఁగొట్టుకొనును, జడిసెదన్=భయపడెదను,ఎవ్వడువునన్=ఏవిధముగనైన, అప్రమత్తవు=ప్రమాదములేనిదానవు, ప్రేముడిన్=ప్రేమచేత, వర్ణితశీల=స్తోత్రము చేయఁబడిన యాచారముగలదానా.

తాత్పర్యము

నీవు సదాచారసంపన్నవని లోకులందఱు నిన్ను స్తోత్రముచేయుచున్నవారు దానికి నీవు భంగము రానీయరాదు. ఏలన నేనడవికిఁ బోఁగానే పుత్రశోకముచే రాజు ముసలివాఁడు బలములేనివాఁడు కావున, శోకించి ప్రాణములు పోఁగొట్టుకొనునో యని భయపడుచున్నాను. కావునఁ దండ్రిమనస్సునకు సంకటము తోఁపకుండునట్లు ప్రమాదపడక యేవిధముననైనఁ బ్రేమచే సేవింపుము. నన్ను నడవులకుఁ బంపెనని కోపంబున నుపేక్షింపకుము. ప్రమాదము పడకుము.

చం॥ హితమతిఁ బెద్దవారలకు◆నెప్పుఁడు మ్రొక్కక యున్నఁగాని, దే
వతల యజింప మానినను◆వారిజనేత్రకు భర్తృసేవ స
ద్గతి సమకూర్చుఁ దల్లి! నియ◆తవ్రత యై సతతోపవాస యై
సతి పతిభక్తిఁ గొల్వమిని◆సత్యముగా నిరయంబునం బడున్. ౭౧౨

నియతవ్రతయై=నియమములతోఁగూడిన వ్రతములుగలదై, సతతోపవాసయై=ఎల్లప్పుడు నుపవాసవ్రతముచేయునదై, నిరయంబునన్=నరకంబున

తాత్పర్యము

కాముకుఁడై నాసవతిమాటలకు లోనై నన్ను దుఃఖపెట్టుటయేకాక నాయొంటి కొడుకును అడవులపాలుచేసినవానిని వాఁడు మగఁడైన నగునుగాక యేమని ప్రేమతో సేవింతునందువా. అట్లులనరాదు. హితబుద్ధితోఁ బెద్దవారల కెప్పుడు

తే॥ తల్లివగలను బొగులువి•ధంబుఁగాంచి,
యుల్లమెరియంగ నశ్రువు•లొలుకనిట్లు
సానునయముగ నను రామ•చంద్రుఁడపుడు,
కన్నతల్లికి ధర్మంబు•కడమవడక. ౭౦౮

ఉల్లము మనస్సు, ఎరియఁగన్=మండఁగా, అశ్రువులు=కన్నీళ్ళు, సానునయముగన్=ఊరటతోఁగూడినట్లుగ, కడమ పడక=కొఱఁతలేక.

తాత్పర్యము

మగనిని విడిచిపోవుట సరిగాదని తెలిసియుఁ బుత్రమోహముచే మరల నట్లే చెప్పుచు వ్యసనపడుచుండు తల్లినిజూచి తనవలన నామెకుఁ గలిగిన దుఃఖమునకై మనస్సు తపింపఁ గన్నీరుగాఱ నూరార్పుమాటలతోఁ గన్నతల్లికి ధర్మము పూర్ణముగాఁ జెప్పఁ గోరి యిట్లనెను.

వ్యసనంబులు జనములకును బొసఁగిన దా నధికదుఃఖమును బొందును. (అయో.౭౬వ.)అన్నట్లు వారువారు చేసికొనిన పాపములచే వారువారుదుఃఖింప వారికై వ్యసనపడినవాఁడు తననిమిత్తమై పరులకు వ్యసనముగలిగిన మఱెంత దుఃఖింపఁడు? ఇంతవఱకుఁ దాను దుఃఖించినఁ దన వ్రతభంగమగును. కావున నిబ్బరించుకొని యుండెను. తన వనవాసము తల్లి యంగీకరించెను. కావున నామెదుఃఖమును జూచి తాను దుఃఖించెను. శ్రీరాముని శోకమునకుఁ గరుణ కారణము, కౌసల్య శోకమునకు మోహముకారణము. రూపమున నొక్కటయ్యు భావమున భేదము.

ఉ॥ జీవము గల్గునంతకును•జేడెలకుం బతియే ప్రభుండునున్
దైవము, గాన శాసకుఁడు•ధారిణీనాథుఁడె చుమ్ము నీకు నా
కోపరశీల! నీకు నతఁ•డుండ ననాథత యెట్లు గల్గెడిన్?
గావునఁ జిత్తశాంతిఁ గను•కాతరభావముఁ బొంద నేటికిన్? ౭౦౯

శాసకుఁడు=శాసించువాఁడు. తప్పొప్పులు నేర్పి శిక్షించువాఁడు, అనాథత=దిక్కులేనిదానితనము, కాతరభావము=భీతి.

తాత్పర్యము

స్త్రీలకుఁ బ్రాణముండువఱకు భర్తయే ప్రభువు. భర్తయేదైవము గావున నిన్ను నన్నుశాసించువాఁడు రాజే. ఆయన జీవించియుండ నీ వెట్లనాథవయ్యె దవుకావున నీభయమువదలి శాంతివహింపుము.

బాల్యే పితృవశే తిష్ఠే, త్పాణిగ్రాహస్య యౌవనే
పుత్రాణాం భర్తరి ప్రేతే, నభజేత స్వతంత్రతామ్॥ ॥మను॥

బాల్యమునఁ దండ్రివశమున, యౌవనమునఁ బెండ్లిచేసికొనినవాని వశమున నతఁడు మరణించెనా పుత్రునివశమున స్త్రీ యుండవలెను. స్వతంత్రగా నెప్పుడు నుండరాదు.

గాని నమస్కరింపక యున్న నుండునుగాక దేవతలఁ బూజింపమానినమానును గాక స్త్రీకిఁ బతిసేవ యొక్కటే సద్గతులు గలిగించును. నియమముతో వ్రతము లాచరించుచు నిరశనవ్రతముఁ బూనినదై పతిని గొలువనిభార్య సత్యముగా నరకములఁ గూలును. పతిసేవతోడ దేవపూజాదులుండిన నుండవచ్చునుగాని అవి నిషిద్ధములు గావు. అదిలేక యుండిన నవి నిష్ప్రయోజనము లగుటయే కాక నరకకారణము లగును. అట్టిదాని నేపెద్దలు నేదేవతలు కాపాడఁజాలరు.

ఈపద్యము స్త్రీలు జపములు తపములు ఉపవాసములు చేయనేరాదని నిషేధింపదు. భర్త యాజ్ఞఁబొంది యవి చేయవచ్చును. భర్తయాజ్ఞలేక చేయ రాదు. అవి చేయుచున్నానని పతి నుపేక్షింపరాదు అవి యేవిచేయక పతిసేవ యొకటిచేయుచున్నను బుణ్యలోకములుగలవు. భారతములోని యీపద్య మీ యర్థమును స్పష్టపఱుచుచున్నది. అనుశాస. ౨౨౫-౨౨౬-౨౨౭-౨౨౨ ప. చూడుఁడు.

"అతనిమతమునఁ దేవతా పితృసమర్చ, నములు నతిథి పూజనములు సన్మతి సమాచ। రించుచును బతిహితము వాటించి నడపు। సతి పతివ్రత యిహ పరసౌఖ్య మహిత।

వ. ఏతద్విషయంబయిన యొక్క నిదర్శనం బవధరింపుము.

సీ॥ బ్రాహ్మణుఁ డొకనికి భార్య లిద్దఱుగల, రందొక భామిని యతనిహితము
నడపెడు నవధానమెడలి యాతఁడుపంప, కయుఁదాన సురపితృకార్యపరత
నడచుఁదక్కటియింతి నాథుఁబాటించుచుఁ, దన్మతంబునఁజేయు ధర్మవిధులు
వారు ముగ్వురు విధివశమున నొక్కట, మ్మృతిఁబొంది రాపతివ్రతవరుండు
చనిన సుగతికిఁ జెనఁ బెఱ వనిత జముఁడు, నీకుఁ బోరాదు మరలుము నీశరీర
మునకయని యాఁగెనది శోకమున సబాష్ప,
యైనఁగన్గొని యతడు దయార్ద్రుఁడగుచు

కం॥ పతి మతము గొనక ధర్మము, సతిప నడప బొప్పదింకనైనను సతికిన్
హిత ములగువానిఁ జేసిన,
సతనిఁ గలయు దనినఁ జనియెనదియును మరలన్

సతులకుఁ బతిసేవయుఁ, బతియాజ్ఞచే దేవసేవయు రెండు జేయుటవిశేష శ్రేయస్కరము. రెండును జేయుటకు సాధ్యముగానప్పుడు దేవసేవవదలి భర్త సేవచేయవలయును. పతిలేని స్త్రీకి దేవసేవ, బ్రహ్మచర్యము, వ్రతనిష్ఠ యని వార్యములు.

కం॥ శ్రుతులందులు స్మృతులందును,
హితగతి క్షితిఁ బూర్వదృష్ట•దృష్టాంతములన్
సతి పతిహితరత యయి సమ్మతి సేవించుటయె ధర్మ•మార్గము దల్లీ.

శ్రుతులందును=వేదములందును, స్మృతులందును=వేదముల కుపబృంహణ ములైన స్మృతులందును, క్షితిన్=భూమియందు, పూర్వదృష్టదృష్టాంతములన్=

గాని నమస్కరింపక యున్న నుండునుగాక దేవతలఁ బూజింపమానినమానును గాక స్త్రీకిఁ బతిసేవ యొక్కటే సద్గతులు గలిగించును. నియమముతో వ్రతము లాచరించుచు నిరశనవ్రతముఁ బూనినదై పతిని గొలువనిభార్య సత్యముగా నరకములఁ గూలును. పతిసేవతోడ దేవపూజాదులుండిన నుండవచ్చునుగాని అవి నిషిద్ధములు గావు. అదిలేక యుండిన నవి నిష్ప్రయోజనము లగుటయే కాక నరకకారణము లగును. అట్టిదాని నేపెద్దలు నేదేవతలు కాపాడఁజాలరు.

ఈపద్యము స్త్రీలు జపములు తపములు ఉపవాసములు చేయనేరాదని నిషేధింపదు. భర్త యాజ్ఞపొంది యవి చేయవచ్చును. భర్తయాజ్ఞలేక చేయరాదు. అవి చేయుచున్నానని పతి నుపేక్షింపరాదు అవి యేవిచేయక పతిసేవ యొకటిచేయుచున్నను బుణ్యలోకములుగలవు. భారతములోని యీపద్య మీ యర్థమును స్పష్టపఱుచుచున్నది. అనుశాస. ౨౨౫-౨౨౬-౨౨౭-౨౨౨ ప. చూడుఁడు.

"అతనిమతమూఁది దేవతా పితృసమర్చ, నములు నతిథి పూజనములు సన్మతి సమాచ। రించుచును బతిహితము వాటించి నడపు। సతి పతివ్రత యిహ పరసౌఖ్య మహిత।

వ. ఏతద్విషయంబయిన యొక్క నిదర్శనం బవధరింపుము.

సీ॥ బ్రాహ్మణుఁ డొకనికి భార్య లిద్దఱుగల, రందొక భామిని యతనిహితము
నడపెడు నవధానమెడలి యాతఁడుపంప,కయుఁదాన సురపితృకార్యపరత
నడచుఁదక్కటియింతి నాథుఁబాటించుచుఁ,దన్మతంబునఁజేయు ధర్మవిధులు
వారు మువ్వురు విధివశమున నొక్కట, మృతిఁబొంది రాపతివ్రతవరుండు
చనిన సుగతికిఁ జెనెఁ బెఱ వనిత జముఁడు,నీకుఁ బోరాదు మరలుము నీశరీర
మునకయని యాఁగెనది శోకమున సబాష్ప,
యైనఁగన్గొని యతడు దయార్ద్రుడగుచు

కం॥ పతి మతము గొనక ధర్మము, సతిప నడప బొప్పదింకనైనను సతికిన్
హిత ములగువానిఁ జేసిన,
సతనిఁ గలయు దనినఁ జనియెనదియును మరలన్

సతులకుఁ బతిసేవయుఁ, బతియాజ్ఞచే దేవసేవయు రెండు జేయుటవిశేష శ్రేయస్కరము. రెండును జేయుటకు సాధ్యముగానప్పుడు దేవసేవవదలి భర్త సేవచేయవలయును. పతిలేని స్త్రీకి దేవసేవ, బ్రహ్మచర్యము, వ్రతనిష్ఠ యనివార్యములు.

కం॥ శ్రుతులందుఁను స్మృతులందును,
హితగతి క్షితిఁ బూర్వదృష్ట•దృష్టాంతములన్
సతి పతిహితరత యయి సమ్మతి సేవించుటయె ధర్మ•మార్గము దల్లీ.

శ్రుతులందును=వేదములందును, స్మృతులందును=వేదముల కుపబృంహణ ములైన స్మృతులందును,క్షితిన్=భూమియందు,పూర్వదృష్టదృష్టాంతములన్=

పూర్వులయందుఁ గానవచ్చు దృష్టాంతములచేతను, పతిహితరత=భర్త యొక్కహితమునందును నాసక్తిగలది.

తాత్పర్యము

స్త్రీలసమాచారము నీకేమి తెలియునందువా ఇది నాకల్పితముగాదు. వేదములందును వేదార్థము విశదీకరించు స్మృతులందును, పూర్వులయందుఁ గానవచ్చు నాచారములచేతను, భార్యభర్తకు హితమైన నడవడిగలదై యాయనను సేవించుటయే ధర్మమార్గమని తెలియవచ్చెడిని.

కం॥ కావింపుము హోమములన్, భావింపుము దేవతలను♦ బ్రాహ్మణపూజల్
వావిరి నాకొఱకై, యో, దేవీ! గావింప వమ్మ♦తెరలనిభక్తిన్. ౭౧౪

తాత్పర్యము

భర్తపోయి సవతియింటిలోఁ గూర్చుండెను. నీవుపోయి యడవిలోఁ గూర్చుండుదునంటివి నేనిక్కడనుండి యెవరికేమి చేసినట్టు లనెదవా? పతిసేవ లభింపలేదని యాయనను వదలి దేశముమీఁదఁ బోరాదు.

పతి దేశాంతరగతుఁడైనను, లోకాంతరగతుఁడైనను సతి తన ధర్మమును విడువరాదు. ఆయన దేశముమీఁదఁ బోయెనని తాను బోరాదు. ఇంటియందుండి యాయనకు యశస్కరము శ్రేయస్కరమునైన కార్యములే చేయుచుండవలెను.

కావున నీ విచటనే యుండి నామేలుగోరి భక్తితో హోమములు చేయింపుము. దేవతల ధ్యానింపుము. బ్రాహ్మణపూజలు చేయుము. దానివలననాకును శ్రేయస్సు గలదు.

ఉ॥ ఇక్కరణిన్ మదాగమన♦మెంతయు వేచి చరింప వమ్మ, పే
రక్కఱ నేమముల్ జరుప♦వమ్మ, భుజింపుము నీత మౌగతిన్,
మక్కువఁ బ్రాణనాథు బహు♦మానయుతం బగుసేవఁ దన్పుమీ,
తక్కుమి చింత సాధుచరి♦తా! హృదయంబున నాయెడాటమై. ౭౧౫

ఇక్కరణిన్=ఈవిధముగ, మదాగమనము = నారాక, వేచి=ఎదురుచూచుచు, పేరక్కఱన్=మిక్కిలిశ్రద్ధతో, బహుమానయుతము = గౌరవముతోఁ గూడినది, తన్పుమీ=తృప్తిపడఁజేయుము, తక్కుమి=వదలుము, నాయెడాటమై =నావిషయంబున.

కం॥ వనవాసం బే నొనరిచి, చనుదెంచెడి యంతదాఁక♦జనకుఁడు సుఖియై
మనెనేనియు నీమదికిన్, ఘనతరసంతోష మొదవఁ♦గల్గును దల్లీ. ౭౧౬

ఘనతర సంతోషము=మిక్కిలి హెచ్చైన సంతోషము.

తాత్పర్యము

నేను వనవాసము పూర్తిచేసి మరల వచ్చువఱకుఁ దండ్రి సుఖముగా బ్రతికియుండినయెడల నీమనస్సునకు ఇప్పుడు నాకుఁ బట్టాభిషేకమైనచోఁ గలుగు సంతోషముకంటె మిక్కిలి సంతోషము గలుగఁగలదు.

కౌసల్యతోఁ జెప్పునప్పుడెల్ల మరలివచ్చి నినుఁజూచెదనని శ్రీరాముఁడు చెప్పుచుండును. దశరథునితో నినుఁజూచెదననిన వాఁడుకాఁడు. దశరథుఁడు అంతదాఁక బ్రదుకఁడని రామునకు నిశ్చయమే.

సాధారణముగ బిడ్డలయందుఁ దండ్రికంటెఁ దల్లికిఁ బ్రేమమెండుగదా. అట్లుండఁ బుత్రశోకమున దశరథుఁడు చావనేల? కౌసల్య సహించి యెట్లుండ గలిగెను? ఇది సామాన్యవిషయమైనను పుత్రశోకమును దల్లులు సహించియుండ వెఱ్ఱిపట్టిన తండ్రులుగలరు. దశరథుని మృతికిఁ బ్రబలకారణము వానప్రస్థ శాపము.

—• శ్రీరాముని వనవాసంబునకుఁ గౌసల్య యీయకొనుట •—

కం॥ ఈలీలఁ బలుకుతనయుని, నాలోకించుచును గో•సలాత్మజ యను నేఁ
జాలను నీమదిఁ ద్రిప్పఁగఁ, గాలంబు నతిక్రమిపఁ•గా మనవశమే? ౭౧౭

ఈలీలన్=ఈవిధముగ, తాత్పర్యము

ఈవిధముగఁ జెప్పుచుండు కొడుకునుజూచి కౌసల్య నాయనా నీ మనస్సును ద్రిప్పఁజాలకున్నాను. కాలము నతిక్రమింప నెవరివశము.

ముందుచెప్పిన దైవము, ఇచ్చటికాలము రెండుపర్యాయపదములు గ్రహింపవలెను. ఈయర్థమునందే విధియను శబ్దముగూడ రామాయణమందుఁ బ్రయోగింపఁబడినది.

కం॥ చని రమ్మేకాగ్రత నీ, కనయము శుభ మగుతఁ దండ్రి•యన్నిదశల, నీ
పునరాగమనంబును గని, వనటల నేఁ బాయుదాన•వారిజనయనా. ౭౧౮

ఏకాగ్రతన్=హెచ్చరికతో, అనయము=సర్వదా, పునరాగమనంబును= మరలిరాకను, వనటలన్=దుఃఖములను.

తాత్పర్యము

తండ్రీ! నీమనస్సు నేను ద్రిప్పలేనైతిని. కావున హెచ్చరిగాఁబోయిరమ్ము, నీకు సర్వవేళల సర్వదశల శుభమగుఁగాత, నీవు మరలివచ్చినపుడు నిన్నుఁ జూచి నాదుఃఖములఁ బాయుదును. అంతవఱకు నిట్లేడ్చుచుండవలసినదాననే.

ఆ॥ జనకుఋణముఁ దీర్చి•సలిపి నీవ్రతముఁ గృ,
తార్థుఁడ వయి మరలి•యరుగుదేర
నోమహానుభావ•యొండెద సుఖమంత, దాఁక నుగ్గఁబట్టు•దాన నుసుఱు

జనకుఋణము=కైకేయికి దశరథుఁడు చేసినవరమనుసప్పు, తీర్చి=చెల్లించి నీవ్రతము, దండకారణ్యమున మునివలెఁ బదునాలుగేండ్లుందునని నీవుపూనిన

వ్రతము నెఱవేర్చి కృతార్థుఁడవు=భూమిమీఁద నవతరించి చేయవలసిన కార్యములు చేసినవాఁడవై రెండు ఋణములుదీర్చి జన్మము సఫలము చేసికొనినవాఁడవు. ఉగ్గఁబట్టుదానన్=బిగఁబట్టుదానను, ఉసుఱు=ప్రాణము.

తాత్పర్యము

తండ్రిని ఋణవిముక్తునిఁజేసి పూనినవ్రతము సాంతముచేసి కృతకృత్యుఁడవై మరలి నీవు రాఁగాఁజూచి మహానుభావా! సుఖపడెదను. అంతదాఁక నెట్లో యొకయట్లు ప్రాణములుపోకుండ బిగఁపట్టియుండెదను.

కం॥ నామాటలు పెడచెవి నిడ, నీమాడ్కిని నీమనంబు దృఢపఱిచెఁ గదే
యామాయదైవ మకటా, యేమనుజుఁడు దైవచిత్ర మెఱుఁగఁగ నేర్చున్.

పెడచెవినిడన్=ఉపేక్షింప, ఎడమచెవిలోఁబెట్టి, శ్రద్ధతో వినువారు కుడిచెవితో విందురు. అశ్రద్ధతో వినువారు ఎడమచెవితో విందురు.

తాత్పర్యము

నాయందు నీవెంతో భక్తివిశ్వాసములుకలవాఁడవు. ఎన్నఁడేవిషయమందును నామాట నతిక్రమింపనివాఁడవు. అట్టి నీవు నామాట యుపేక్షించునట్లు ఆమాయలమారి దైవము నీమనస్సును గట్టిచేసెఁగదా. దైవముయొక్క యద్భుతశక్తి యెవఁ డెఱుఁగఁగలఁడు.

కం॥ పొమ్మీ తనయా! యిప్పుడ, రమ్మీ సౌఖ్యముగ మరల రాజితశుభవా
క్యమ్ములఁ దియ్యఁదనమునన్, సమ్మతి నను దేర్ప వన్న నారామన్నా.

ఇప్పుడ=ఇపుడే, అంత శీఘ్రముగనని యర్థము, రాజితశుభవాక్యమ్ములన్ సంతోషముచే నొప్పు మంచిమాటలచేత, తేర్పుము=తేలఁజేయుము.

తాత్పర్యము

కుమారా! పొమ్ము, ఇటుపోయి యిటువచ్చునంతలోఁ బదునాలుగేండ్లు శీఘ్రముగఁ గడచిపోవునట్లు సుఖముగరమ్ము, వచ్చి నీవుపోయి యుండివచ్చిన శుభవార్తలెల్ల మంచి తియ్యనిమాటలచేఁ జెప్పి నన్ను సంతోషమునఁ దేలింపవన్నా రామన్నా,

కం॥ జటలం దాలిచి నారలు, కటితలమునఁ గట్టినీవు గ్రమ్మఱఁగ వనీ
తటినుండి వేళ యిదెయై, ఘటియిల్లునె? యంతశుభము గలదే యనుచున్ ౭౨

వనీతటినుండి=వనప్రదేశమునుండి.

తాత్పర్యము

జడలుధరించి నారచీరలు నడుమునందుఁగట్టి వనప్రదేశమునుండి నీవు వచ్చెడి వేళయిదే యగునా. అయ్యో! అంత శుభముగూడఁగలదా.

కం॥ అడవులకరుగఁగ నెంచిన, కొడుకుసునిశ్చిత మెఱింగి కోసలసుత దాఁ
గడునాదరమున నిట్లని, తడయక దీవింప నెంచి తద్దయుఁ గరుణన్. ౭౩

తాత్పర్యము

అడవులకుఁబోవఁదలఁచిన కొడుకు నిశ్చయమెఱిగి కౌసల్య మిగులనాదరముతో దయతో దీవింపఁదలఁచినదియై.

—• ౨౫-వ సర్గము కౌసల్య శ్రీరాము నాశీర్వదించుట. •—

ఉ॥ గాసి తొలంచి మంచియుదకంబుల వారిచి సాధ్వి మంగళా
శాసనముల్ వచించు, నిను•సాధ్యముగా దిఁక నాఁగ నాయనా!
వాసిగఁ బోయి రమ్ము రఘు•వంశమణీ! యిపు డీవు వైళ మా
యాసములేక క్రమ్మఱుము•హాళిఁ జరింపుము సత్క్రియంబునన్. ౭౨౪

వారిచి=ఆచమనముచేసి, మంగళాశాసనముల్=శుభకరములైన దీవనలు ఆఁగన్=అడ్డగింప, వైళము=శీఘ్రము, హాళిన్=సుఖముతో.

తాత్పర్యము

కన్నీళ్ళుకార్చుటగాని వానిని తాఁకుటగాని యపరిశుద్ధహేతువు గావున నింతకాలము శోకమునఁ గన్నీళ్ళు కార్చియుండుటచేఁ బారిశుద్ధ్యము నిమిత్తము ఆచమించి యాపతివ్రత శుభకరములైన దీవన లీయసాగి యిట్లనెను. నాయనా నిన్ను నరణ్యమునకుఁ బోకుండ నిలుప సాధ్యముగాదు, రఘువంశ రత్నమా పోయి కీర్తిగలుగ సంతోషముతోఁ జరింపుము.

కం॥ ఏధర్మము నీచేత మ,హాధైర్యస్థైర్యనియతి•నవితం బయ్యెన్
సాధితశాత్రవజన! ని,న్నాధర్మమె కాచుఁగాక•యనవరతంబున్. ౭౨౫

అవితంబు=రక్షింపఁబడినది, సాధితశాత్రవజన, సాధింపఁబడిన శాత్రవులు గలవాఁడా, అనవరతము=ఎల్లప్పుడు.

తాత్పర్యము

నీవు మహాధైర్యముతోను స్థిరబుద్ధితోను నియమముతోను నేధర్మమును రక్షించుచున్నావో ధర్మోరక్షతి రక్షిత యని యుండుటచేత నాధర్మమే నిన్ను నెల్లప్పుడు రక్షించునుగాక.

మత్తకోకిలము. దేవతాయతనంబులన్ రుచి•దేఱుచైత్యములందు నీ
చే వరం బగు మ్రొక్కు లందుచుఁ•జెన్ను మీఱినయా మహా
దేవతల్ ఋషియుక్తులై వనిఁ•ద్రిమ్మరం జనుచుండు ని
న్వేవిధంబులఁ గాచుచుందురు•నిర్మలం బగుసత్కృపన్. ౭౨౬

తాత్పర్యము

దేవాలయములందును నాలుగుబాటలు కలియుచోటులందును నీచే మ్రొక్కులు గొనుచున్న యామహాదేవతలు ఋషులతోడ నడవియందు సంచరింపఁబోవు నిన్ను వేయివిధంబుల రక్షించుచుందురుగాక.

దీనివలన దేవాలయములందుండు దేవతలకేకాక వీథులయందుండు భజనమందిరములవంటి వానియందును స్థాపింపఁబడిన దేవతలకుఁగూడ శ్రీరాముఁడు నమస్కరించుచుండెనని యేర్పడుచున్నది.

కం॥ ప్రీతుండై గాధితనూ, జాతుఁడు నీకొసఁగినట్టి శస్త్రాస్త్రంబుల్
నీతంబుగ నిను సద్గుణ, పూతుని రక్షించుఁగాక పుణ్యచరిత్రా! ౭-౨౭

ప్రీతుఁడై=సంతోషించినవాఁడై, గాధితనూజుఁడు = విశ్వామిత్రుఁడు, నీతంబుగన్=నియతితో, సద్గుణపూతునిన్=మంచిగుణములచేఁ బవిత్రుని, అస్త్రములు=మంత్రములచేఁ బ్రయోగింపఁబడునవి, శస్త్రములు=చేతిబలముచేఁ బ్రయోగింపఁబడుకత్తి శూలములోనైనవి.

తాత్పర్యము

నీభక్తిబలములకు సంతోషించినవాఁడై విశ్వామిత్రుఁడు నీకొసఁగిన యస్త్రశస్త్రములు మంచిగుణములచేఁ బవిత్రుడవైన నిన్ను రక్షించునుగాక. నీవు పుణ్యచరిత్రుఁడవు గావున నవి నిన్నుఁ బ్రయాసములేక సంతోషముతో రక్షించును.

కం॥ జనకునిఁ గొలిచిన ఫలమును, జననీశుశ్రూష ఫలము సత్యఫలంబున్
వనవాసాయాసము నీ, కొనరక యుండంగఁ బ్రోచుచుండుఁ గుమారా!

తాత్పర్యము ౭-౨౮

జనకునిఁ సేవచేఁ గలిగినఫలము మాతృసేవచేలభించినఫలము సత్యమును రక్షించుటచే నగు ఫలముకుమారా వనవాసమున నాయాసము కలుగనీయక నిన్ను రక్షించునుగాక.

చం॥ సమిధలు, దర్భలున్, జగతిచాలును, నాయతనాళి, వింత లై
కొమరగు స్థండిలంబులును గొండలుఁ, జెట్లులు, గుజ్జుచెట్లు, సిం
హములుఁ బతంగకోటి, పవనాశనమండలముల్, మడుంగులున్,
విమలదయన్ నినున్ సకలవేళలఁ బ్రోచుచునుండు నాత్మజా! ౭-౨౯

జగతిచాలును=యజ్ఞవేదులును, అగ్నిస్థానములును, ఆయతనములు=దేవళములు, వింతలై=నానాకారముగలిగి కొమరగు=వినోదకరములై, స్థండిలంబులును=దేవపూజాస్థలములు, గుజ్జుచెట్లు=పొట్టిచెట్లు, గున్నమామిడిలోనైనవి పతంగకోటి=పక్షుల సమూహములు, పవనాశన మండలముల్ = పాముల గుంపులు.

తాత్పర్యము

హోమమున కుపయోగించు కట్టెపుల్లలు, దర్భలు, అగ్నిహోత్రస్థానములు, దేవాలయములు, నానావర్ణములుగల పూజాస్థలములు, కొండలు చెట్లు గున్నమామిడి లోనగు పొట్టిచెట్లు సింహములు పక్షులు, పాములు మడుఁగులు వీని యధిష్ఠాన దేవతలు నిన్ను నిర్మలమైన దయతో సర్వకాలములందును రక్షించుచుండునుగాక.

ఉ॥ స్వస్తి ఘటింత్రు నీకు ఋషి•సాధ్యమరుత్తులు, విశ్వ, లాస్థమై
స్వస్తి విధాతృధాతలును•స్వస్తి ఘటింత్రు భగార్యమార్కులున్
స్వస్తి దిశాధినాయకులు•శక్రముఖుల్ ఋతుపక్షమాసముల్
స్వస్తి క్షపాబ్దఘస్రములు•స్వస్తిఘటించుత సన్ముహూర్తముల్. ౭౩౦

స్వస్తి=శుభము, ఆస్థమై=ప్రీతితో, స్వస్తి = యత్సుఖంత్రిషులోకేషు। వ్యాధివ్యసనవర్జితమ్, యస్మిన్సర్వేస్థితాః కామా, స్తత్స్వస్తీత్యభిసంజ్ఞితః॥ యమ॥ మూఁడు లోకములందువ్యాధి వ్యసనములేని సుఖమేదిగలదో యెందు సమస్తమైన కోరికలు ఫలించియుండునో దానికి స్వస్తియనిపేరు.

తా త్ప ర్య ము

నీకుఁ బ్రీతితో ఋషులు, సాధ్యులు, మరుద్గణములు, విశ్వదేవతలువిధాత ధాత యమదేవతలు, భగుఁడు, ఆర్యముఁడు అర్కుఁడు అనుసూర్యులుదిక్పాలకులు. (ఇంద్రుఁడు మొదలయినవారు) ఋతువులు పక్షములు, మాసములు, (వీని యధిష్ఠానదేవతలు) రాత్రి, సంవత్సరము, పగలు వీనిదేవతలు మంచి ముహూర్తములు నీకు శుభము కలిగించునుగాక.

కం॥ స్మృతియును ధృతియునుధర్మము,
సుతరత్నమ!నిన్నుఁ బ్రోచు•సుఖదములగుచున్
సితకరగురుగుహకమలజ, సుతసప్తర్షులు సతంబు•సఖముల నిడుతన్.

స్మృతి=ధ్యానము, ధృతి=నిశ్చలమైన బుద్ధి, ధర్మము=మీఁదఁజెప్పిన ధర్మములుగాక యితరమైనది, సుఖదములు = సుఖమునిచ్చునవి, సితకర= చంద్రుఁడు, గురు=బృహస్పతి, గుహ,కుమారస్వామి,కమలజసుత=నారదుఁడు సప్తర్షులు, భరద్వాజాదు లేడుగురు ఋషులు, సతంబు=ఎల్లప్పుడు.

తా త్ప ర్య ము

స్మృతిధృతి ధర్మము నీకు సుఖకరములై రక్షించునుగాక. చంద్రబృహస్పతి కుమారస్వామి నారద సప్తర్షులు నీకు నెల్లప్పుడు సుఖము లిడుదురుగాక.

కం॥ దిక్కులు దిక్పతులును నా,మ్రొక్కుల నంగీకరించి•మునుకొని యెపుడున్
దిక్కగుత నీకుఁ దండ్రీ, దిక్కటి వనవీథులందుఁ•ద్రిమ్మరువేళన్. ౭౩౨

దిక్పతులు=ఇంద్రాదులు, దిక్కటి=దిక్కులేక.

తా త్ప ర్య ము

దిక్పాలురతోడి దిక్కులు నామ్రొక్కుల నంగీకరించినవారై దిక్కులేక నీవు వనములందుఁ దిరుగువేళ నీకు నాయనా దిక్కగుదురుగాక.

కం॥ గిరిసింధువరుణగగనాం,తరిక్షవసుధానదులును•దారాగ్రహశ
ర్వరులు దినంబులు సంధ్యలు,
గురురక్ష యొనర్చు నడవిఁ•గ్రుమ్మరు నీకున్. ౭౩౩

గిరి=కులపర్వతములు, సింధు=సింధునది, వరుణ=వరుణుఁడు, గగన=స్వర్గము, అంతరిక్షము=ఆకాశము, వసుధా=భూమి, నదులును=దక్కిన నదులును తారా=అశ్వనీమొదలగు ౨౭ నక్షత్రములు, గ్రహ=సూర్యాదిగ్రహములు శర్వరులు=రాత్రులు, దినంబులు=పగళ్ళు, సంధ్యలు=ప్రాతస్సంధ్య సాయంసంధ్య, గురురక్ష=గొప్పరక్షణము.

తాత్పర్యము

కులగిరులు, సింధునది, నదుల కధిపతియైన వరుణుఁడు, స్వర్గము, ఆకాశము, భూమి, తక్కిననదులు, ఇరువదియేడు నక్షత్రములు, నవగ్రహములు, రాత్రులు, పగళ్ళు, రెండు సంధ్యలు, అడవియందుఁ దిరుగు నిన్ను మిక్కిలి రక్షింతురుగాక.

కం॥ ఋతుషట్కము మాససమల్, హితగతిఁ గాష్ఠలును గలలు•బృందారకులున్
దితిసుతులుఁ బ్రోవుతన్ సుత,
ధృతముని వేషమునఁ గానఁ•దిరిగెడి నిన్నున్. ౨౩౪

ఋతుషట్కము=వసంతము మొదలగు నాఱు ఋతువులు, మాససమల్=నెలలు సంవత్సరములు, కాష్ఠలు=కలలు, ఇవి కాలమునందలి యల్పభాగములు, బృందారకులు=దేవతలును, దితిసుతులు=దైత్యులు, ధృతమునివేషమునన్=ధరింపఁబడిన మునివేషముతో, కానన్=అడవియందు, ఇందు ముందు జెప్పఁబడినవారే మరలఁ జెప్పఁబడిరి. భూయోభూయో నమామ్యహమ్మన్నట్టిది యాదరాతిశయమున నని యెఱుఁగునది.

తాత్పర్యము

ఆఱుఋతులు, నెలలు, సంవత్సరములు, కాష్ఠలు కలలు దేవతలు, దైత్యులు కుమారా యడవియందు మునివేషము ధరించి తిరుగుచుండు నిన్ను రక్షింతురుగాక.

ఆ॥ క్రూరకర్మనిరత•ఘోరపిశాచాది, రాక్షసాళివలన•రూక్షవన్య
మృగచయంబువలన•నేభయంబును నీకుఁ,
గలుగకుండుఁ గాతఁ•గాననముల. ౨౩౫

క్రూరకర్మనిరత=దయలేక కార్యములు చేయుటయందు మిక్కిలి యాసక్తిగల, ఘోరపిశాచాది=భయంకరములైన పిశాచములు మొదలయినవానివలనను, రాక్షసులవలనను, రూక్ష=క్రూరములగు, వన్యమృగ చయంబువలనన్=అడవియందలి మృగముల సమూహమువలన, కాననములన్=అడలయందు.

తాత్పర్యము

హింసాది క్రూరకార్యములు చేయుటయందు విశేషాసక్తిగల భయంకర పిశాచాదులవలనను రాక్షసాళివలనను క్రూరములైన సింహ వ్యాఘ్రాదులవలనను నీకేభయము కలుగకుండునుగాక.

ఉ॥ మాటికి మాటికిన్ శుభము•మానక కూర్చుత మిన్ను, దేవతా
కోటులు, నీదుశాత్రవులు•కూరిమి సోమగురుల్, కుబేరుఁడున్,
బాటిగ సూర్యుఁ, డగ్నియును•వాయువు ధూమము మంత్రపాళి ఘో
రాటవులందు నీరములు•నాడఁగ నీకు శుభం బొసంగుతన్. ౪౮౦

మిన్ను=ఆకాశము.

తాత్పర్యము

ఆకాశము, దేవతల సమూహములు, నీ విరోధులయినను విరోధముమాని వారును, చంద్ర బృహస్పతులు కుబేరుఁడు సూర్యుఁడు నీకు మీఁద మీఁద శుభమును గలిగింతురుగాక, అగ్ని వాయువు హోమ ధూమము నీవునేర్చిన మంత్ర సమూహములు భయంకరములైన యడవులందు స్నానముచేయు నపుడు నీకు మేలు కలిగించునుగాక.

తే॥ సర్వలోకవిభుండును•సర్వసాక్షి, బ్రహ్మభూతైకభర్తయు•బ్రహ్మఋషులుఁ
దక్కు దేవతలును వనీ•తలమునందుఁ,
దిరుగునినుఁ బ్రోచుచుందురు•దివ్యతేజ. ౪౮౧

సర్వలోకవిదుండును=సమస్తలోకములను దెలిసినవాఁడును, సర్వసాక్షి=తటస్థుఁడై యుండి సర్వమును జూచువాఁడును భూతములకెల్ల నొక్కఁడే భరించువాఁడును, తక్కు=మిగిలిన, దివ్యతేజ=దేవతేజస్సు గలవాఁడా! వనీతలము=అటవిప్రదేశము.

తాత్పర్యము

సమస్తలోకుల వృత్తములఁ దెలిసినవాఁడును, దటస్థుఁడై సర్వమును జూచువాఁడును బ్రహ్మమును భూతములకెల్ల దానొక్కఁడేయై భరించువాఁడును, నగు విష్ణువు బ్రహ్మఋషులు దక్కినదేవతలు నడవులయందుఁ దిరుగు నిన్ను దివ్యతేజా రక్షించుచుందురు.

అనుచు వేల్పులనెల్ల•నాపుణ్యసాధ్వి•యమలమాల్యంబుల•నతులగంధముల
ననురూపవినతుల•నర్చించి మఱియు•ననఘవిప్రునిచేత•నగ్నుల వేల్మి
తనయునకును శుభ•దం బగురీతి•ధవళమాల్యముల ఘృ•తంబుల సమిధ
లను దెల్లయావల•లలనలమిన్న•లలితంబుగాఁగఁ జ•ల్పఁగ ఘటియించె.

వేల్పులన్=దేవతలను. అమలమాల్యంబులన్=నిర్మలమైన పూలదండల చేతను, అతులగంధములను=అసమానమైన చందనాది పరిమళ పదార్థముల చేతను అనురూప వినతులన్ = తగినవిధములగు నమస్కారములచేతను, అర్చించి=పూజించి అనఘవిప్రునిచేత=దోషరహితుఁడైన బ్రాహ్మణునిచే, వేల్మి=హోమము, శుభదము=మేలిచ్చునది, ధవళమాల్యంబులన్ = తెల్లనిపూవులచే (నల్లనివి, యెఱ్ఱనివి విష్ణుపూజకుఁ బనికిరావు) ఘృతంబులన్=నేతులచే.

ప్రాసముమాఱుగ యతిగూర్చినద్విపద తరువోజ యగును. మూఁడింద్ర గణములు- నొక సూర్యగణము-మరల మూఁడింద్రగణములు నొకసూర్యగణము మూఁడవ మూఁడవ గణాదిని ౪ యతులు కూర్చినఁ దరువోజ పాదమగును.

తాత్పర్యము

ఈప్రకారము దేవతలనెల్ల నా పుణ్యరాలగు పతివ్రత నిర్మలములై దోష రహితములైన పూలదండలచేతను, అసమానమైన చందనాదులచేతను దగిన నమస్కారములచేఁ బూజించి తనకు హోమాధికారములేమిని బ్రాహ్మణునిచే నగ్నులయందుఁ దనకుమారునకు క్షేమముగలుగఁ దెల్లని పూలదండలు నేతులు సమిధలు దెల్లయావలు వీనితో నాస్త్రీరత్నము చక్కఁగా హోమముచేయించెను.

తే॥ ఒజ్జలు నిరామయముగ శా♦స్త్రోక్తసరణి,
శాంతికై వేల్చి వెలుపలి♦స్థానములను
బలిని గల్పింప మధుదధి♦పటలి నేత,నక్షతల స్వస్తివాచంబు♦లనిరి బుధులు.

ఒజ్జలు=గురువు- ఉపాధ్యాయ శబ్దభవము ఒజ్జ, నిరామయము=ఏబాధ లేనట్లుగ, మధు=తేనె, నేత=నెయ్యిచేత.

తాత్పర్యము

ఉపాధ్యాయుఁడు రోగబాధలేకుండ శాస్త్రమునఁ జెప్పినట్లు శాంతికై హోమముచేసి హోమప్రదేశమునకు వెలుపలి ప్రదేశములందుఁ దేనె పెరుఁగు నేయి వీనిచేత బలిని గల్పింపఁగాఁ బండితులు స్వస్తివాచనము శ్రీరామునకు నడవులందు మేలు గలుగుటకై కావించిరి.

తే॥ ఆద్విజేంద్రుల కెల్లర♦కర్హరీతిఁ, దృప్తి వెలయంగ దానంబు♦లిచ్చి రాము
మాతసత్కీర్తిపూతప్రే♦మమున రామ,
చంద్రుఁ గనుఁగొని దీవించు♦సారమతిని. ౭౪౪

తాత్పర్యము.

ఆ బ్రాహ్మణశ్రేష్ఠుల కెల్లవారికి వారివారి యోగ్యతకుఁ దగినట్లు దానము లిచ్చి సత్కీర్తిచేఁ బవిత్రురాలగు శ్రీరాముతల్లి ప్రేమచే నింతవఱకుఁ జేసిన మంత్రాశీర్వచనముగాక తాను స్వయముగ దీవించుచున్నది.

—♦ కౌసల్య శ్రీరామునకు మంగళాశాసన మొనర్చి రక్ష గట్టుట ♦—

కం॥ ఏమంగళ మొదవెనొ నా నామరపూజ్యునకు దశశ♦తాక్షునకును సం
గ్రామమున వృత్రుఁ జంపఁగ, నామంగళ మొనరుఁగాక♦యన్నా! నీకున్.

నానామరపూజ్యునకు=అనేక దేవతలచేఁ బూజింపఁబడువానికి,దశశతాక్షునకు = నూఱు గన్నులుగల యింద్రునకు-

తాత్పర్యము

అహల్యను జెఱిచిన కారణమునఁ గోపించి గౌతముఁడు నీకు స్త్రీలయోనులం దింత యాశగలవాఁడవు కావున నీదేహమంతయు యోనులగునుగాక యని శపించి మరల వేఁడుకోఁగాఁ జూచువారికవి కన్నులవలెఁ గానవచ్చునని యనుగ్రహించెను. పార్వతి శాపముచేఁ జిత్రకేతుఁడను గొప్పవిష్ణుభక్తుఁడు వృత్రాసురుఁడై పుట్టెను. ఇంద్రునిఁ జంపు కుమారునిఁగోరి కశ్యపుఁడు హోమము చేయఁగా స్వరభేదమున నింద్రునిచేఁ జచ్చువీఁడుపుట్టెను. వీని నింద్రుఁడు దధీచి వెన్నెముకచేఁ జేయఁబడిన వజ్రాయుధముచేఁ జంపెను. ఇందు రావణవధాది శత్రుసంహారము సూచితము.

కం॥ ఏమంగళము సుపర్ణున, కామాత ఘటించె వినత•యమృతముఁ దేరం
బో మదిఁ బూనినవేళను, నామంగళ మొనరుఁగాక•యన్నా! నీకున్. ౨౪౬

సుపర్ణునకు=గరుత్మంతునకు, వినత=గరుత్మంతుని తల్లి, తేరన్=తెచ్చుటకు కద్రువవినతలు కశ్యపునిభార్యలు-వీరిరువురు నొకనాఁడు సాయంకాలమున వెలుపల సంచరించునపుడు ఇంద్రునిగుఱ్ఱమగు నుచ్చైశ్శ్రవమును జూచి వినత యీ గుఱ్ఱమునందు నలుపనునది లేదనెను. కద్రువ యున్నదనెను. ఇట్లు వాదించి యెవరోడిపోదురో వారు గెలిచినవారికి దాసియైయుండఁ బందెములు గట్టిరి. వారు నేఁడు సాయంకాలమైనది రేపు చూతమని యింటికిఁ బోయిరి. అందుఁ గద్రువ న్యాయమున గెలువలేమిని దనపుత్రులనుబిలిచి మీలో నెవ్వరైన నొకరు ఉచ్చైశ్శ్రవమున నలుపు కనఁబడునట్లు చేయవలయు ననెను. ఈ మోసకృత్యమును శేషుఁడుసహింపక యిదుష్ట సహవాసము సరిగాదని తపస్సునకు వెడలిపోయెను. తక్కినవారును దిరస్కరించిరి. ఈ తిరస్కరించినవారినెల్ల మీరు జనమేజయుని సర్పయాగమున నాశముకండని కద్రువ శపించె. ఒక ముద్దుకొడుకుమాత్రము నేను జేసెదనని పోయి గుఱ్ఱపుఁదోఁకయందలి వెండ్రుకలలో నొక వెండ్రుకగా వ్రేలుచుండెను. మఱునటి దినము సవతు లిరువురు గుఱ్ఱమును బరీక్షించిరి. కద్రువ చేసిన మోసము వినత తెలిసికొనలేక తానే యోడిపోయితినని సవతికి దాసియై యుండెను. ఆవల నామెకు ననూరుఁడనువాఁడు తొడలులేక పుట్టి సూర్యుని సారథియయ్యెను. రెండవపుత్రుఁడు గరుత్మంతుఁడు. జరిగిన మోసమంతయు తల్లివలన విని గరుడుఁడు కద్రువతో నీకేమి యిచ్చిన నాతల్లిని దాస్యమునుండి విడిచెదవనెను. అమృతము దెచ్చియిచ్చిన మీరు దాస్యము చేయవలసిన పని లేదనఁగా గరుత్మంతుఁడు స్వర్గమునకుఁ బోయి యింద్రుని జయించి యమృతభాండమును దెచ్చి కద్రువకిచ్చి తల్లిని దాస్యమునుండి విముక్తురాలినిజేసెను. ఆభాండమును గద్రువ దర్భలపైనుంచి స్నానముచేసి యుపయోగింతమని బిడ్డలతో స్నానమునకుఁ బోయెను. ఇంతలో నింద్రుఁడు వచ్చి యా భాండము

నెత్తికొని పోయెను. ఆభాండము నుంచిన దర్భలు నాకుటచే పాముల నాలుకలు రెండుగాఁ జీలెను, అది మొదలు పాములు రెండునాలుకలు గలవయ్యె.

తాత్పర్యము

అన్నా రామచంద్రా తల్లికష్టమును బాపుటకై గరుత్మంతుఁడు అమృతమును దెచ్చుటకుఁ బోవునపుడాయనతల్లి యేమంగళాశాసనములు గావించెనో యామంగళ వాక్యములచేఁ గలిగినమేలే నీకును గలుగునుగాక. శ్రీరాముఁడు కష్టకార్యము సాధించి మరలఁ దల్లిని సంతోషపెట్టుట సూచితము.

కం॥ ఏమంగళ మదితియు సు, త్రామునకు ఘటించె మును సు♦ధాలబ్ధి నరి
స్తోమము నిర్మూలింపఁగ, నామంగళ మమరుఁగాక♦యన్నా! నీకున్. ౪౮౪

సుధాలబ్ధిన్=అమృతము సంపాదించుటయందు, అరిస్తోమము = శత్రువుల సమూహము, నిర్మూలింపఁగన్=నాశము చేయఁగా.

తాత్పర్యము

అమృతము నిమిత్తమై పాలసముద్రమును దేవతలు రాక్షసులు మథించి నపుడు ఇంద్రునకు నమృతము లభించునట్లు శత్రువులు నాశమగునట్టు లదితి యేమనిదీవించెనో యా దీవనవలనఁ గలిగిన శుభమే నీకును గలుగునుగాక.

సుధాశబ్దస్త్రీలింగ సారస్యముచే సీతయు, నిర్మూలించు శబ్దముచే రాక్షసవంశ నాశము ఇంద్రునకు సుధవలె శ్రీరామునకు సీత లభించుటయు సూచితము.

కం॥ వామనుఁడై మూఁడడుగుల,చే మహిఁ గొలువంగ వృద్ధిఁ♦జెందెడు వేళన్
శ్రీమధుహరి కేమంగళ, మామంగళ మమరుఁగాక ♦ యన్నా! నీకున్. ౪౮౭

శ్రీమధుహరికి = విష్ణువునకు.

తాత్పర్యము

విష్ణువు వామనావతారమున బలిని మూఁడడుగుల నేలవేఁడి యాయన యీయఁగా మూఁడడుగులతో లోకమునంతయుఁ గొలిచి యాక్రమించినపుడే శుభము కలిగెనో యాశుభమే నీకుఁ గలుగునుగాక.

దీనివలన శ్రీరాముఁడువచ్చి సార్వభౌముఁడవుట సూచితము.

కం॥ ఋతుజలధిద్వీపంబులు, శ్రుతులును లోకములు దిశలు♦శుభమంగళముల్
సతతము నిను సన్మంగళ,యుతుఁగాఁ గావించుఁగాత ♦ మెప్పుగ, బుత్రా.

ఋతుజలధి ద్వీపంబులు = ఋతువులు- సముద్రములు ద్వీపములు, శ్రుతులు=వేదములు, దిశలు=దిక్కులు, శుభమంగళములు=మంగళమునందు మంగళములు.

తాత్పర్యము

ఋతువులు సముద్రములు ద్వీపములు వేదములు లోకములు దిక్కులు మఱి శుభకరములైనవన్నియు నిన్ను శుభవంతునిఁగా జేయునుగాక.

సీ॥ అని తనూజునకు శే•షాక్షతల్ శిరమునఁ,గదియించి మిగిలిన•గంధ మలఁది
దృష్టఫలంబు లై • యెసఁగుమూలికల వి,శల్యకరణిని ర • క్షగను గట్టి
జపియించి మంత్రముల్•సాధ్వి దుఃఖితయయ్యుఁ,
బరితుష్టవోలెవె • ల్వలికిఁదోఁప
శిరముమూర్కొని(ప్రేమ•పరతఁ గౌఁగిటఁగ్రుచ్చి,గద్గదవాణివా•జ్మాత్రఁబలుకుఁ

తే॥ బోయిరా పుత్ర! సిద్ధార్థ • పూతుఁ డవుగ
సౌఖ్యముగ నీవు కార్యముల్ • చక్కఁజేసి
మరలి యీయయోధ్యను రాజ • మార్గవర్తి
వైననినుఁ గాంతుఁ గాక నా • యనుఁగుఁగుఱ్ఱ. ౬౫౦

శేషాక్షతల్=మిగిలిన యక్షతములను, అలఁది=పూసి, దృష్టఫలంబులై= కానవచ్చు ఫలముగలవి, విశల్యకరణిని=దేహమునందు నాటిన ములుకలులోనై నవి బయటకులాగుమూలిక, పరితుష్ట = సంతోషించినది, సిద్ధార్థపూతుఁడవు = కార్యముసాధించుటచేఁ బవిత్రుఁడవు, అనుఁగుఁగుఱ్ఱ=ముద్దుగలబిడ్డా,మూర్కొని = వాసనచూచి.

లక్ష్మణుని మూర్ఛకాలమున హనుమంతుఁడు హిమవంతమునకుఁ బోయి విశల్యకరణి సంధానకరణి సంజీవనిలోనైనవి తెచ్చెనే ఇచ్చట నిది యామె కెట్లు లభించెనని సందేహింపవలసిన పనిలేదు. సంజీవని నెఱిఁగినవారు లేరన వచ్చును. గాని విశల్యకరణి సంధానకరణి తెలిసినవారు నేఁటికిని గలరు. ఇవి యడవులందు దొరకును.

వాఙ్మాత్రన్=వాక్కుతోమాత్రము- పోయిరమ్మనుమాట నోటితోఁజెప్పెను గాని పోవుటకు నిష్టములేక మనఃపూర్తిగాఁ జెప్పలేదు.

తా త్ప ర్య ము

ఈప్రకారము దీవించి మిగిలిన యక్షతలను శ్రీరాముని శిరముపైనుంచి మిగిలిన గంధముపూసి వెంటనే ఫలమునిచ్చు మూలికలచే విశల్యకరణిచే రక్షగాఁ గట్టి మంత్రములు జపించి యా పతివ్రత లోపల దుఃఖముగలిగియు దానివెలుపలికి రానీయక సంతోషముగల దానివలెనే శ్రీరాముని శిరసు వాసన చూచి ప్రేమతోఁ గౌఁగిలించుకొని మాట తడఁబడుచుండఁ గుమారా పోయి రమ్ము. వనవాసకార్యము సాధించి ఋణవిముక్తుఁడవై చేయవలసిన కార్యములుచేసి (రావణవధాదికము) మరలి యీ యయోధ్యను రాజమార్గమందు వర్తించు నిన్నుఁ గన్నులారజూతునుగాక.

కం॥ నష్టంబులుగా దుఃఖము, రిష్టాప్తికి నలర మోమ • హీనముగ వనీ
కష్టమణీ వచ్చునిన్ను, న్శిష్టనుతా! యుదయదిందు • నింబలెఁ గాంతున్.

ఇష్టాప్తికిన్ = ఇష్టములభించిన కారణముచే, అహీనముగన్ = మిక్కిలి గొప్పగ, కష్టమణీ = కష్టము + అణీ=క్షయించి, శిష్టనుతా = పెద్దలచే స్తోత్రము

చేయఁబడువాఁడా, ఉదయదిందునింబలెన్ = ఉదయత్ = పుట్టుచున్న, ఇందు నింబలెన్ = చంద్రునివలె.

తాత్పర్యము

దుఃఖములు నాశముకాఁగా నిష్టము ప్రాప్తించుటచే ముఖము మిక్కిలి వికాసమునొందఁగా నడవులయందలి కష్టముతొలఁచివచ్చు నిన్ను నుదయించు చున్న చంద్రునిఁ జూచినట్లు చూతును.

మ॥ వనవాసంబుఁ దరించి, యాయవనిప • వ్యాహారమును దీర్చి, వ
చ్చి సమద్ద్వేషణః భద్రపీఠమున నా • సీనుండవై యుండ నిన్
గనుదుం గావుత నావధూమణియు నేఁ • గాంక్షించు నర్థంబులున్
ఘనసంవర్ధిత మాచరింపు చిరముం • గల్యాణయుక్తుండ వై. ౭౫౨

తరించి=దాఁటి, అవనిపవ్యాహారము=రాజువాక్యము, తీర్చి=చక్కజేసి, నమత్=నమస్కరించుచున్న, ద్వేషణ=శత్రువులుగలవాఁడా, భద్రపీఠమునన్= సింహాసనమందు, నావధూమణియు=నాకోడలు సీత, కాంక్షించు నర్థంబులన్= కోరిన కోరికలను, ఘనసంవర్ధితము = గొప్పగా వృద్ధిపొందునవి- సీతయర ణ్యమునకుఁ బోవునని కౌసల్య తలంచినదికాదు, చిరమున్ = స్థిరముగ, కళ్యాణ యుక్తుండవై =శుభముతోఁగూడినవాఁడవై.

తాత్పర్యము

వనవాసము గడువుదాఁటి రాజువాక్యమును నెఱవేర్చివచ్చి శత్రువులును నమస్కరించుచుండఁగా సింహాసనమునఁ గూర్చుండియుండఁగా, నిన్ను నేను జూచెదనుకాక- నీవట్లువచ్చి శుభకరుఁడవై నాయొక్కయు నాకోడలియొక్కయుఁ గోరికలనెల్లఁ బూర్ణముగ స్థిరముగఁ బూర్ణముచేయుము.

కం॥ (నాయర్చించెడిసురమును,లాయీశుఁడు భూతములు మ•హాసురఫణులున్
నీయేగెడువనముల న,త్యాయతకృపఁ బ్రోచుచుండు•రన్నా నిన్నున్.)

ఈ సమాప్తపునరావృత్తపద్యమునకు మూలశ్లోకము ప్రక్షిప్తమని తోఁచు చున్నది. పూర్వవ్యాఖ్యాత లెవ్వరు దీనికి వ్యాఖ్యానమును వ్రాయలేదు.

ఈశుఁడు=శివుఁడు, మహాసురఫణులున్=గొప్ప యసురులు సర్పములు, అత్యాయతకృపన్ = విస్తారమైన దయచే.

తాత్పర్యము

నేను బూజచేయు దేవమునులును నారదాదులు శివుఁడు భూతములు గొప్ప యసురులు సర్పములు నీవు పోవు నడవులందు నిన్ను మిక్కిలి కృపతో రక్షింతురుగాక.

మ॥ అని యశ్రుప్రతిపూర్ణనేత్ర యయి తా • నాశాసనంబుల్ సమా
పనముం జేసి యథావిధిన్ సుతునిసౌ • భాగ్యార్థమై ప్రేమపె

చ్చునఁదా మంత్రితరక్షఁ గట్టి వలగొం • చుం బుత్రునాశ్లేషణం
బున సాధ్వీమణి దేల్పఁ బ్రీతుఁడయి రా • ముం డుత్తమశ్రద్ధమై. ౭౫౪

అశ్రుప్రతిపూర్ణనేత్ర=కన్నీళ్ళతోనిండిన కన్నులుగలది, ఆశాసనంబుల్=దీవనలు, సమాపనము=ముగింపు, యథావిధిన్ = శాస్త్రప్రకారము, సౌభాగ్యార్థమై=ఐశ్వర్యనిమిత్తము, ప్రేమపెచ్చునన్=ప్రేమాతిశయముచే, మంత్రితరక్ష = మంత్రింపఁబడిన మూలిక రక్షగా, కట్టి=చేతికిఁగట్టి, వలగొంచున్ = ప్రదక్షిణముచేయుచు – ఇది రక్షార్థము, ఆశ్లేషణంబునన్=కౌఁగిలింతచేత.

తాత్పర్యము

ఈప్రకారముచెప్పి కన్నులు నీటిచేనిండ నాశీర్వచనములు ముగించి శాస్త్రప్రకారము కొడుకునకు మేలుకలుగఁగోరి ప్రేమాతిశయముచే మంత్రింపఁబడిన మూలికను జేతికి రక్షగాఁగట్టి యష్టదిగ్బంధనముచేసినట్టు రక్షార్థమై చుట్టుదిరిగి కొడుకును గౌఁగిలించుకొని సంతోషింపఁజేయఁగా శ్రీరాముఁడును శ్రద్ధాతిశయముచే.

కం॥ జననికి వలగొని పదముల, వినయంబున వ్రాలి వెండి • వెండియు సీతా
వనజాక్షినిలయమునకుఁ,జన నెంచె మహాయశుండు • స్వశ్రీ వెలుఁగన్. ౭౫౫

వలగొని=ప్రదక్షిణించి, వెండి వెండియు=పలుమారు, నిలయమునకున్=గృహమునకు, మహాయశుండు=పితృవాక్యపరిపాలన దీక్షాదక్షుఁడను గొప్పకీర్తి, స్వశ్రీ=తన సహజకాంతి, తల్లివ్యసనము చూచుటచేఁ గలిగిన వికారముపోయినవాఁడై యని భావము.

తాత్పర్యము

తల్లికిఁ బ్రదక్షిణించి యామె పాదములమీదవ్రాలి మఱిమఱి ఆధ్యాత్మిక-ఆధిభౌతిక ఆధిదైవికములను మూఁడు తాపములు పోవుటకై ముమ్మారు నమస్కరించి లేచి సీతాగృహమునకుఁ బితృవాక్య రక్షాదీక్షాదక్షుఁడను కీర్తిగల శ్రీరాముఁడు తన సహజకాంతితో వెలుఁగుచుఁ బోవనెంచెను.

—• ౨౬-వ సర్గము. శ్రీరాముఁడు సీతను జూడఁ బోవుట. •—

తే॥ తల్లి దీవింప వలగొని • తరలి యచటఁ,దనదుకల్యాణగుణముల • పెనుపుఁ జేసి
భృశ మాకృష్టచిత్తులై • యెల్లజనులు,దన్ను వీక్షింపఁజనియె సీ • తను గనంగ.

వలగొని = శ్రీరాముఁడు అను పదము అధ్యాహారము, ప్రదక్షిణించి, తరలి=ప్రయాణమై, తనదు=తనయొక్క, దుస్సంబంధార్థే-యనిసూ, కల్యాణగుణముల పెనుపుఁజేసి = శుభగుణముల యాధిక్యమువలన, భృశసమాకృష్టచిత్తులై=మిక్కిలి యాకర్షింపఁబడిన మనస్సులుగలవారై.

తాత్పర్యము

మీఁదఁజెప్పిన ప్రకారము తల్లి దీవింపఁగా నామెకుఁ బ్రదక్షిణముచేసి యచటనుండి బయలుదేఱిపోయి ప్రియవాదిత్వము- పూర్వభాషిత్వము మొదలగు తన కల్యాణగుణాతిశయముల గొప్పతనమువలన మిక్కిలి యాకర్షింపఁబడిన మనస్సులుగలవారై యెల్లజనులు దన్నుఁ జూచుచుండఁ దాను సీతను జూడఁబోయెను. కల్యాణగుణాధిక్యమువలన లోకులు తన్నుఁజూడఁ దాను సీతను జూడఁబోయె ననుటచే శ్రీరామునియందలి కల్యాణగుణములకంటె సీతయందుఁ గల్యాణగుణములు మెండనియు వానిచే శ్రీరాముఁ డాకర్షింపఁబడెననియు భావము.

ఉ॥ అక్కడ భూమిపుత్రి యొకఁ • డైన నెఱుంగమి సీయుదంతమున్,
  మ్రొక్కుచు యౌవరాజ్యపద • మున్ వహియించుత భర్త యంచుఁ, బె
  న్మక్కువ దైవపూజల స • మంజసరీతిని దాన తీర్చి, జో
  కెక్కి కృతజ్ఞ గంధతతు • లెల్లను గూరిచి భర్తృపూజకై.   ౭౨౭

అక్కడ=సీతాదేవి యంతఃపురంబున యందు, భూమిపుత్రి=సీత, ఉదంతము=వృత్తాంతము, సమంజసరీతిని=చక్కఁగాఁ గొఱఁతలేకుండ, తాన=స్వయముగ- అనఁగా నితరులచేఁ జేయింపలేదనుట, మ్రొక్కుచు = ఇష్టదేవతలకు నమస్కరించుచు, జోక + ఎక్కి=ఉత్సాహమతిశయించి, కృతజ్ఞ = భర్తలకుఁ బట్టాభిషేకము కాఁగానే పట్టపురాణులు చేయవలసిన కార్యములు తెలిసినది- కావున, భర్తృపూజకై కావలసిన, గంధతతులు=గంధము పూలు లోనగు పూజాద్రవ్యములుచేర్చి కైకకుఁ బట్టాభిషేకవార్త తెలిసినపిమ్మట నామెయొద్దకుఁ బోయి కార్యము పాడుచేసికొనిన దశరథునివలెఁగాక శ్రీరాముఁడీ పట్టాభిషేక విఘ్నవృత్తాంతము సీతకుఁ దెలియకముందే యామెయొద్దకుఁ బోయెను.

తాత్పర్యము

అంతఃపురమందున్న సీతాదేవి శ్రీరాముని యావసవాసవార్త యెఱుఁగనిది కావునఁ దనభర్త యౌవరాజ్యపదవి నలంకరించునుగాక యని యిష్టదేవతకు నమస్కరించుచు నితర దేవపూజలనన్నిటిని మిగులఁ బ్రేమముతోఁ దానేనెఱవేర్చి యుత్సాహపూరితయై పట్టాభిషేకముచేసికొని భర్తరాఁగాఁ దానుజేయవలసిన కార్యములన్నియుఁదెలిసినది కావున భర్తను బూజించుటకై పూలు గంధము లోనైనవి సేకరించి యుంచుకొన్నదై.

కం॥ నృపనీతివిదుషి యగునా, విపులాయతచారునేత్ర • శ్వేతచ్ఛత్రా
  దిపరివృతుం డగునాథుం, డెపు డెప్పుడు వచ్చు ననుచు • నెదురుంజూడన్.

నృపనీతివిదుషి=పట్టాభిషేకము చేసికొని రాజకుమారుఁ డింటికి వచ్చునపుడే వేషముతో నెట్లురావలయునో యది తెలిసినది కావున, విపులాయతచారునేత్ర = విశాలములై, దీర్ఘములై మనోహరములైన కన్నులుగలది- ఇట్లనుటచే

సహజముగనే విశాలాక్షియగు సీత తనభర్త పట్టాభిషిక్తుఁడై యెపుడెపుడు వచ్చునాయని కన్నులువిచ్చి సంతోషాతిశయముచే బ్రోవచూచుచుండెనని యూహ్యము; శ్వేతచ్ఛత్రాది పరివృతుండగువాఁడు=తెల్లని గొడుగు, తెల్లచామరము, ఏనుఁగులు లోనగువానిచేఁ జుట్టఁబడినవాఁడై.

తాత్పర్యము

పట్టాభిషిక్తుడైన రాజకుమారుఁ డింటి కేవేషముతో నేచిహ్నముతో నేపరివారముతో వచ్చునో యారాజనీతియంతయు నెఱిఁగినది కావున నావిపులాయత చారులోచన తనపతి తెల్లనిగొడుగు వింజామరములు భటవర్గపరివారముతో నెప్పు డెప్పుడు వచ్చునా యని యాయనవచ్చుత్రోవ నెదురుచూచుచుండెను.

ఉ॥ చారువిభూషితంబు ఘన•సమ్మదహృష్టజనాకులంబు స్వా
గారముఁ జొచ్చి సిగ్గుపడి • క్రన్న నవాఙ్ముఖుఁ డైననాథునా
కారముఁ జూచి మేను వణఁ•కన్ సతి దిగ్గన లేవ, శోకదు
ర్వారత సైఁపలేక రఘు•వర్యుఁడు దూపిలె బాహిరంబుగన్. ౭౨౯

చారు విభూషితంబు=మనోహరముగా నలంకరింపఁబడినది, ఘనసమ్మద=మిక్కిలి సంతోషముచే, హృష్టజనాకులంబు=గగ్గురుపాటుగల జనులచేఁ గలఁత చెందియుండునది, స్వాగారము=తనయిల్లు, సిగ్గుపడి=తనయింటికిఁ జేసియున్న యలంకారములేమి తానుండుస్థితియేమి యనికాని యీకష్టవార్త సీత కెట్లుచెప్పుదునా యనికాని లజ్జవహించి, అవాఙ్ముఖుఁడు=తలవంచుకొన్నవాఁడై, ఇంగితజ్ఞయగు సీత తనముఖముచూచి యేదోకీడు కలిగినదని యూహించి తత్తఱలాడునేమో యని ముఖమామెకుఁజూప జంకి, మేను=దేహము, దిగ్గన=తటాలున, శోకదుర్వారత=నివారింపరాని శోకముచేత, బాహిరంబుగన్=అందఱకుఁదెలియునట్లు, దూపిలెన్ = శోకించెను.

అయోనిజయై కావుననే దేవతాస్త్రీయై, జనకమహారాజువంటివాఁడు పెంపఁగా బెరిఁగి మిగుల సుకుమారియై తనమగఁడు పట్టాభిషిక్తుఁడగును దాను బట్టపురాణి నగుదునని కొండంతయాశతో నువ్విళ్ళూరుచుండు నిటువంటి సీత యాశత్రుమధ్యమున నిందేయుంతునా, నాతోడఁ బిలుచుకొనిపోదునా ఆకష్టము లీకోమలాంగి పడఁగలదా పుట్టినింటికిఁ బంపుదునా అదియెంత యవమానకరము. అయ్యో నానిమిత్తమై యీచిన్నవయసు కోమలాంగి కింత దుఃఖము గలిగెఁగదా యని, కౌసల్య దుఃఖించి నపుడును దుఃఖింపని శ్రీరాముఁడు, సీతను జూడఁగానే బాహిరముగానే యేడ్చెను. హృష్టజనాకులమనుటచే శ్రీరామునింట నెవరికి నీవార్త తెలియదని యేర్పడుచున్నది.

తాత్పర్యము

మనోహరముగా నలంకరింపఁబడినదియు మిగుల సంతోషముగల జనులచే గూడినదియునగు తనయింటిలోఁ బ్రవేశించి సీతముఖము చూడ సిగ్గుపడి తల

వంచుకొనిన తనయాకారముఁజూచి సీత భయమున దేహము వణఁకఁగాఁ గూర్చుండిన యాసనమునుండి తటాలున లేవఁగా దుఃఖము నణఁపలేక శ్రీరాముఁడు స్పష్టముగానే శోకించెను.

కౌసల్యయంత దుఃఖించినను గన్నీరుకార్పని రామచంద్రమూర్తి సీతాదేవినిజూడఁగానే యేలయేడ్చెను ? మాతృవియోగదుఃఖమునకంటె భార్యావియోగదుఃఖముతీవ్రతరమా?

ఉత్తరము:- మాతృవియోగ దుఃఖమునకంటె భార్యావియోగ దుఃఖము తీవ్రతరమగుటచే కామముచే శ్రీరామచంద్రమూర్తి దుఃఖింపలేదు. తనవలనఁ దల్లికిఁ బుత్రవియోగదుఃఖము గలిగెఁగదా యనియు సీతాదేవికి భర్తృవియోగ దుఃఖము కలిగెఁగదాయనియు సంతాపించెను. తల్లియొద్ద బాహిరముగ నేడ్చినఁ దన వనవాసాయాసమునకై దుఃఖించుచున్నాఁడనియు, నిష్టములేక తండ్రియాజ్ఞ నిర్వహింపఁబూనెననియుఁ గౌసల్య గ్రహించి యడవికిఁబోవల దని మఱింత గట్టిపట్టు పట్టును. తనవియోగమువలనఁ దల్లికి స్థితిహానిగాని గౌరవహానిగానిలేదు. కౌసల్యయే కువలయాక్షికి నూర్గురు కొడుకులున్నఁ బ్రాణ పతిలేమి సౌఖ్యంబుఁ బడయరాదని చెప్పెను. భర్తృవియోగమువలన భార్యకు వియోగదుఃఖమేగాక స్థితిహాని గౌరవహానియు గలుగును. పుట్టినింటనున్నను అత్తగారింటనున్నను భర్తలేనిది బానిసగా నెంచఁబడును. తన్ను భర్తగాఁ గొనుటచే మహారాజపుత్రికకు బాలికకు నటువంటి నీచస్థితి నిష్కారణముగా వచ్చుట యెక్కువ దుఃఖకరము గదా.

చం॥ వెలవెలఁ బాఱునెమ్మొగము • స్వేదజలార్ద్రితమైన దేహముఁన్
బలితపుదుఃఖభారమును • పద్మవిలోచన గాంచి శోకవి
హ్వల యయి ప్రాణనాథః చెపు • మా యిటు లీసమయంబునందు నీ
వెలమిఁ దొఱంగి యుండుటకు • హేతు వ దెయ్యది కల్గె వల్లభా? ౭౬౦

స్వేదజలార్ద్రితము=చెమట నీటఁదడిసినది, శోకవిహ్వల=శోకముచేఁ జెదరిన మనస్సుగలదై, ఎలమి=సంతోషము, తొఱంగి=తొలఁగి.

తాత్పర్యము

సుందరమైన ముఖారవిందము తెల్లఁబాఱియుండుటయు దేహము చెమటచేఁ దడిసియుండుటయు బలమైన దుఃఖాతిశయమును నా కమలాక్షి సీత చూచి శోకముచే గుండెచెదరి తెల్లఁబోయి ప్రాణేశ్వరా చెపుమ. ఎంతో సంతోషముతోనో యుండవలసిన యీసమయమందు సంతోషమువిడిచి యిట్లు దుఃఖించుటకుఁ గారణమేమి కలిగెను. వల్లభా- నాయందు నీకుఁ బ్రేమగలదేని చెప్పుము.

చం॥ అలగురు దేవతాకము శ • భాకరపుష్యము నేఁడ యంచు వి
ప్రులు వచియించి, రేమిటికిఁ • బొల్పఱ తీగతి దుర్మనుండ వై?
లలితవిశాలమున్ శతశ • లాకము పుష్కరఫేనతుల్యమౌ
వెలినునుగొడ్గునీడఁ బృథి • వీవరః యేటికి రావు చెప్పుమా? ౭౬౧

అలగురుదేవతాకము=శుభకరుఁడని ప్రసిద్ధినొందిన బృహస్పతిని దేవతగాఁ గలది, శుభాకరము = రెండవతార కావున సంపత్కరమైనదియగు పుష్యము, పొల్పుటతివి = పొలుపుచెడినవాఁడవై తివి, దుర్మనుండవై=దుఃఖముతోఁగూడిన మనస్సుగలవాఁడవై, లలితవిశాలము=మనోహరమైన వెడల్పుగలది, శతశలాకము=నూఱుకమ్ములు గలది, పుష్కరఫేనతుల్యము = నీటియందలి నురుగుతో సమానమయినది- నురుగు నేలమీఁదఁబడిన మురికియగును గావున నట్టి మురికి లేనిదని తెలుప పుష్కరఫేన మనఁబడెను. 'పుష్కరమంబుని ఖేఖే' యని నానా, వెలి=తెల్లని, నును=మృదువైన గొడ్గునీడ,పుష్యము=పుష్యమి యనుటసరిగాదు.

తాత్పర్యము

పట్టాభిషిక్తుని చిహ్నము లెఱిఁగినది కావున సీత యవియేల లేవని ప్రశ్నించుచున్నది. నాథా ప్రసిద్ధశుభగ్రహము గురుని దేవతగాఁగలిగి సంపత్కరమైన పుష్యనక్షత్రము నేఁడేయని బ్రాహ్మణులు చెప్పిరి. అట్లు శుభమైనకాలమందు నీవిపుడు కాంతిహీనుఁడవై శోకముతోఁగూడిన మనస్సుగలవాఁడవైతివి. ఏల? అందమై వెడలుపుగలదై నూఱుకమ్ములుగలదై నీటియందుండు బుగ్గవలె నిర్మలమై శ్వేతచ్ఛత్రము నీడను నీవేల రావైతివి చెపుము.

సీ॥ చంద్రహంసప్రకా♦శంబు లౌచామరల్, విసర రేల ముఖార♦విందమునను?
వాగ్మలు వందులు ♦ పరమసమ్మదమునఁ, బొగడ నేటికి రారు ♦ పుణ్యశీల?
సూతమాగధు లేల ♦ శుభమంగళంబుల, నీవెంట రారైరి ♦ నీరజాక్ష?
వేదపారగులైన ♦ విప్రులు నభిషిక్త,శిరమున నుంచరే♦పెరుగుఁ దేనె?
తే॥ మంత్రు లేటికి నీతోడ♦మలయ? రేల, పౌరజానపదుల్ వెంట♦రా? రదేల
స్వర్ణభూషితనిస్తుల♦జవనహయచ,
తుష్కయుతపుష్యరథముముం♦దుగనుబోదు? ౭౬.౨

చంద్రహంస ప్రకాశంబులు, చంద్రునివలె హంసవలెఁ దెల్లగాఁబ్రకాశించునవి, వాగ్మలు=చమత్కారముగ మాటలాడువారు, వందులు=స్తోత్రముచేయువారు, వేదపారగులు=వేదాధ్యయనము సాంతముగఁ జేసినవారు, అభిషిక్తశిరమునన్=జలముచే నభిషేకింపఁబడిన శిరమునందు, మలయరు=నడచిరారు, పౌరులు=పురజనులు, జానపదుల్=పల్లెటూళ్ళవారు, స్వర్ణభూషిత = బంగారుసొమ్ములచే నలంకరింపఁబడిన, నిస్తుల = సమానములేని, జవన=వేగముతోఁ గూడిన, హయచతుష్కము = నాలుగు గుఱ్ఱములతో, యుత = కూడిన, పుష్యరథము = యుద్ధార్థమైగాక వినోదార్థమై చేసినతేరు.

తాత్పర్యము.

చంద్రమండలమువలె గుండ్రముగను దెల్లగను హంసవలె స్వచ్ఛముగఁ బ్రకాశించు చామరములు నీ ముఖకమలమున నేల విసరరు?వాగ్మలు వందులు

సంతోషముతో జయజయధ్వనులతో నిన్నుఁ బొగడుచుఁ బుణ్యచరిత్రా యేలరారు? సుతమాగధులు శుభములైన మంగళములు పాడుచు నీవెంట రారేల? వేదాధ్యయన సంపన్నులైన బ్రాహ్మణు లభిషేకజలముచేఁదడిసిన నీ శిరమునందుఁ బెరుగుఁ తేనె యేల యుంచలేదు. నీతోడ నీమంత్రులు రాని కారణమేమి? పౌరులు పల్లెటూళ్ళవారు వేడుకచూచుటకై నీ వెనుకరాని హేతు వేమి? ఏల నీకుముందుగ బంగారుసొమ్ములచే నలంకరింపఁబడి యసమాన వేగముగల నాలుగుగుఱ్ఱములచేఁ గట్టిన పుష్యరథముపోదు.

చం॥ అరుగ దదేల కృష్ణజల ♦ దాద్రినిభంబు సులక్షణంబు నా
కరిపతి నీదుముంగలను? ♦ గాంచనచిత్రము భద్రపీఠ మో
సురచిరరూప! మున్నుచనఁ ♦ జొప్పడ దేల? యపూర్వవర్ణమై
యరుసముఁ బాసె మోము చెపు•మా యభిషేకమువేళ దాసియున్? ౭౬౩

కృష్ణజలదాద్రినిభంబు=నల్లనిమేఘము కొండతో సమానమై, సులక్షణం బునై=శాస్త్రప్రకారము మంచిసుళ్ళుగలదగు, కరిపతి=పెద్దయేనుఁగు, కాంచన చిత్రము=బంగారుఱేకులచేఁ జిత్రముగాఁ జేయఁబడిన, భద్రపీఠము=సింహాస నము, సురుచిరరూప=అందమైన యాకారముగలవాఁడా, అపూర్వవర్ణము = ముందెన్నఁడులేని రంగుగలది, అరుసము=సంతోషము- హర్షశబ్దభవము.

తాత్పర్యము

నల్లనిమబ్బువలె నీలవర్ణమై కొండవలెనెత్తై మంచిసుళ్ళుగల యేనుఁగు నీముందు పోదేల? బంగారు కమ్ములచేతను రేకులచేతను జిత్రపుఁబనిచేసిన సింహాసనము నీకంటె ముందేలపోదు? ఇవి యిట్లుండఁగా నెన్నఁడులేని వన్నె గలదై నీముఖము సంతోషము చెడియున్నది. అభిషేకసమయము సమీపించెనే మీరిట్లుండ నేమి కారణము?

—♦ శ్రీరాముఁడు సీతతోఁ దా నరణ్యమునకుఁ బోవువార్తఁ దెలుపుట. ♦—

కం॥ అని కరుణంబుగ విలపించినసతిఁ గని రాముఁ డనియె ♦ సీతా! నన్నున్
వనములకుఁ బొమ్మటంచును, బనిచిరి సుమి తండ్రిగారు•పద్మదళాక్షీ ౭౬౪

కరుణంబుగన్=శోకముతో, విలపించిన=ఏడ్చిన, పనిచిరి=ఆజ్ఞాపించిరి- తండ్రిగారు, తఱచుగా స్త్రీసమంబుల కడపలఁ గొన్నింటికే కవచనంబునఁ బూజ్యతయందు గారు శబ్దంబగు- సు-వ్యా. ౧౭ సూ. తండ్రియందుఁగల భక్తి గౌరవము దెలుప నిట్లు చెప్పెను.

తాత్పర్యము

అని శోకముతో సీత యేడువఁగా శ్రీరాముఁడామెతో నిట్లనియె- సీతా! నన్ను నడవులకుఁబొమ్మని తండ్రిగా రాజ్ఞాపించిరి సుమీ.

నన్ను = నిన్నుఁగాదు, నీతోడనుగాదు.

వనములకు=పూలతోఁటలకు నుద్యానవనములకుఁగాదు. అడవులకు.

పొమ్ము = పొమ్మనిరేఁగాని మరల రమ్మనలేదు.

పనిచిరి = వేడుకమాటగాదు ఆజ్ఞ.

తండ్రి = ఎవరో కా దాజ్ఞాపించినది కన్నతండ్రి.

తండ్రిగారు = తండ్రి పూజ్యుఁడు కావున నాయనమాట ధిక్కరింపఁ దగినదికాదు. గౌరవింపవలసినదే.

ఇది నాస్థితి. ఇఁక నీవో

కం॥ గొప్పకులంబునఁ బుట్టితి, వొప్పుగ ధర్మముల నేర్చి • తోసతి! ధర్మం
బెప్పుడుఁ దప్పవు జానకి! చెప్పెద విను నిబ్బరముగఁ • జెల్లినతెఱఁగుల్.

తా త్ప ర్య ము ౨౬౭

కులముకొలఁది బుద్ధి. గొప్పకులమునఁ బుట్టితివి గావున నీవు గొప్పబుద్ధి గలదానవు. గొప్పకులమునఁ బుట్టుటచే వచ్చినది గౌరవము తెలివియేకాదు. చక్కఁగ ధర్మముల నేర్చితివి.

సతి=నీవు పతివ్రతవు. భర్తయాజ్ఞమీఱరాదని యెఱిఁగినదానవు. ధర్మములు నేర్చుకొనుట మాత్రమేకాదు. అనుష్ఠానమందును ధర్మము తప్పవు. కావునఁ దొందరపడక నిబ్బరముగ స్థిరచిత్తముతో నేను జెప్పునది వినుము. జరగిన వార్త చెప్పెదను. నేనుగూడ వచ్చెదననకుండుటకై యీ యుపోద్ఘాతము.

చం॥ జనకుఁడు సత్యవాదియును • క్ష్మాతలనాథుఁడు నైనయాజి నా
జననికిఁ గైకకున్ మునుపు • సమ్మత రెండువరంబు లిచ్చె, నా
వనితయు వాని నాత్మ నిడి • వర్తిల నేఁ డభిషేకయత్నముల్
గని, యవి ధర్మమార్గమున • క్ష్మావిభుఁ దీర్పఁగఁ గోరె జానకి. ౨౬౮

కౌసల్యవలె సీత సులభసాధ్యగాదు. ఆమె అమ్మా! నేనడవికిఁబోయెద ననఁగానే గుండెచెదరి పుత్రశోకమున నేడువసాగెను గాని నిబ్బరమున నాలోచించు శక్తిగలది గాదాయెను. ఆకారణమున నామెను రాముఁడు సులభముగ నంగీకరింపఁజేసెను. సీతయొద్ద నాయాటలు సాగవు. అది తెలిసి శ్రీరాముఁడు మాటలతోనే ముందరికాళ్ళకు బంధాలు వేయుచున్నాఁడు.

జనకుఁడు=కన్నతండ్రి, సత్యవాది=అసత్య మెన్నఁడు నాడనివాఁడు, క్ష్మాతలనాథుఁడు=భూమికంతయు నధిపతి, ఆజి=దశరథుఁడు, జననికి = కన్నతల్లితో సమానురాలైన కైకకు.

జనకుఁడు - నన్నాజ్ఞాపించువాఁ డెవఁడోకాఁడు కన్నతండ్రి. ఆకారణము చేతనే యాయనయాజ్ఞ మీఱరాదు. సత్యవాది. ఎన్నఁడు నాడితప్పనివాఁడు. అట్టివాఁ డిప్పుడుమాత్రము నానిమిత్త మసత్యమాడునా? ఇచ్చిలేదనిచెప్పునా కావున నాయనమాట యథార్థపడవలసినదే. అది తప్పదు.

క్ష్మాతలనాథుఁడు- రాజు కావున రాజాజ్ఞ వేదశాసనమువలె మీఱరానిది- ఆక్షేపింపరానిది- కావున నేనేల యడవులకుఁ బోవలయునని యడుగు నధికారము నాకులేదు.

అజి=అజమహారాజునకు దేవతాస్త్రీయందు జనించినవాఁడు కావున మనుష్యులకంటె గొప్పతరగతిలోఁ జేరినవాఁడు. జానకి=నీవు జనకరాజు కూఁతురవు- రాజధర్మము నీ వెఱుఁగనిదికాదు.

తాత్పర్యము

జానకి! కన్నతండ్రియు సత్యవాదియు రాజునగు దశరథుఁడు నాతల్లికిఁ గైకకుఁ బూర్వము రెండువరములు సంతోషముతో మంచిమనస్సుతో నిచ్చెను. ఆకైక వానిని మనస్సులోనుంచుకొని నేఁడు నా కభిషేకప్రయత్నములు జరగఁగాఁజూచి యా వరములను ధర్మమార్గమున నెఱవేర్పఁగోరెను, అవి యేవందువా?

శా॥ ఈరే డేఁడులు దండకాటవులలో ♦ నేఁ గ్రుమ్మరం బోవ, భూ
భారం బెల్ల వహింపఁగా భరతుఁ డీ ♦ భంగి న్వరంబుల్ గొనెన్,
సారారణ్యవిహార కేళిఁ జలుపం ♦ జంద్రాస్య! నేఁ బోవుచున్
జేరన్ వచ్చితి నిన్నుఁ జూచుటకునై ♦ సీతా! సతీరత్నమా! ౨౬౭

ఈరేడేఁడులు=పదునాలుగు సంవత్సరములు, ఇరు+ఏడు=ఈరేడు, రెండేళ్ళు పదునాలుగు.ఈరు వృత్తియం దచ్చుపరంబగుచో రెంటికాదేశమని శబ్దరత్నా. ఈరాఱు- ఈరేడు, సారారణ్య విహారకేళిన్ = పుష్ప ఫలవృక్షములతో నిండి సారవంతములైన యరణ్యములందు నాటలయందు నాడుకొనుటవలె సంచరించుటకు,చంద్రాస్య=చంద్రబింబమువలె నెప్పుడు నిర్మలమైన ముఖము గలదానా, నీ విప్పుడే ముఖకాంతి మార్చుచున్నదానవు- అది నీకుఁ దగదు, నీ సహజకాంతి వదలకుము. సతీరత్నమా=పతివ్రతాశిరోమణీ = నీవు పతివ్రతవు గావున నీవు మంచిమనస్సుతో ననుమతించి పంపిన నాకు శ్రేయస్కరమని నిన్నుఁజూచి చెప్పిపోవ వచ్చితిని. నేను నిర్విచారముగా నేజంజాటములేక హాయిగాఁ దిరుగుచుండఁగా నీ భూమిభారమంతయు భరతుఁడు మోయవలయునని వరములు. వీనియందు నా తల్లిదండ్రులు నాయందే యెక్కువ దయ చూపినవారైరి.

ముందటి కాళ్ళకు బందాలువేయుటయందు శ్రీరామచంద్రమూర్తి కగ్ర తాంబూలమియ్యవలెను.

సీత తన వెంట వచ్చెదనని చెప్పునని తెలియును. దానికై ముందుగానే విఱుపులు చెప్పుట. సీతా = నీజన్మము స్మరింపుము, సతీరత్నమా = నీ శీలము స్మరింపుము.

ఈ చమత్కారము మున్ముందు లక్ష్మణ భరతాదులతో మాటలాడునపుడు గమనింపవలెను.

ఈయన చమత్కారములు నిశ్చయ మనస్కులైనవారియెదుట బనికి రాలేదు.

తాత్పర్యము

ఆవరము లేవి యంటివా? ఒకటి నేను రెండేళ్ళసంవత్సరములు దండకాటవులలోఁ దిరుగఁబోపుట. రెండవది భరతుఁడే రాజై భూభారము వహించుట. ఈ రెండువరములు కైక కోరెను. నాతల్లికిఁ దనకొడుకునందుకంటె నాయందెంత ప్రేమయో చూచితివా. నేను భారముమోయ భరతుఁడు సుఖసంచారము చేయవలసియుండఁగా నాభారము వానిపై వేసి నన్ను హాయిగా నిశ్చింతముగా నేజంజాటములేక తిరుగఁ బొమ్మనిరి.

కావున నేనును ఫలవృక్షములు-పూలతీఁగలు వింతపక్షులుగల సారవంతమైన యరణ్యములందు సుఖముగా నాటవలె విహారముసేయఁబోవుచుఁ జంద్రవదనా నీవు పతివ్రతవుగావున నీకుఁ జెప్పి నీసమ్మతిమీఁదఁ బోయిన క్షేమమని తలఁచి నిన్నుఁ జూడవచ్చితిని.

—• శ్రీరాముఁడు సీతకు నీతులు చెప్పుట. •—

చం॥ భరతునిమ్రోల నన్బొగడి • పల్కకు మెన్నఁడు, వృద్ధియుక్తులా
పురుషులు సైఁతురే యితర • పూరుషసంస్తవ, మట్లుగావునన్
భరతుఁడు నీకు మ్రొక్కనిట • వచ్చినవేళల వానితోడ నో
తరుణీ! ప్రశంస సేయుమి హి • తం బగు మద్గుణజాతవర్ణనల్. ౭౬౮

వృద్ధియుక్తులు=ఐశ్వర్యము- అధికారము వీనిచే వృద్ధినొందియుండువారు, సంస్తవము=స్తోత్రము, మద్గుణజాతవర్ణనల్=నాగుణ సమూహములస్తోత్రములు, తరుణీ = వయోగర్వముచేఁదాఁకు తప్పులు మఱపురావచ్చును- అట్టివి రానీయకుము.

తాత్పర్యము

నీకుఁ గొన్నివిషయములు చెప్పవలసియున్నవి. చెప్పెద వినుము. భరతుని యెదుట నెప్పుడేకాని నన్నుఁ బొగడి మాటలాడవలదు. ఏలందువా? ఐశ్వర్యముచే అధికారముచే వృద్ధినొందియుండువారితరులఁ బొగడినఁ దమ్ముదూషించినట్లుగా నెంచి కోపింతురు. కావున భరతుఁడు నీకు నమస్కరించుటకై యిచ్చటికి వచ్చిన సమయమందు వానితోడ వయోగర్వముచేఁ దాఁకు తప్పులు మఱచి నాగుణములను నీవు ప్రశంసింపవలదు.

ఉ॥ లోకము పాడి నీవు పది • లోఁ బదునొక్కటిగాఁగ నుండు, మ
స్తోకతరానుకూలతస • త్రోయుట మే లగు నీకుఁ గాలమున్,
గైక తనూజు నింక మన • క్ష్మాపతి పూన్చుట యౌవరాజ్యమున్
నీకుఁ బ్రసాద్యుఁ డాతఁ డవ • నీపతియే కద చక్కఁ జూడుమా. ౭౬౯

పదిలోఁ బదునొక్కటి=ఇదిలోకోక్తి- పదుగురిలోఁ దానొక్కతెగా వారితో పాటుండవలయునుగాని ప్రాముఖ్యము వహింపరాదు. అస్తోకతర = మిక్కిలి అధికమైన, అనుకూలతన = అనుకూలభావముచేతనే, ప్రసాద్యుఁడు = అనుగ్ర హింపఁదగినవాఁడు, పాడి=న్యాయము-ధర్మము.

తా త్ప ర్య ము

లోకన్యాయము ననుసరించి పదిమందిలో నీవు పదునొకండవదానవుగా నుండు మంతియెకాని నేనీయింటికిఁ బెద్దకోడలనని, జనకరాజు పుత్రికనని, న్యాయముగా రాజ్యము మాదే, యని యిటువంటి యభిప్రాయములు పెట్టు కొని విఱ్ఱవీఁగకుము. నీ వందఱకు మిక్కిలి యనుకూలవై తిరుగుచుండుమం తియేకాని యెవరితోనైనఁ బ్రతికూలింపకుము. మనరాజు భరతుని యువరాజు చేయుటచే నీకతఁ డనుగ్రహింపఁ దగినవాఁడేకాని నిగ్రహింపఁదగినవాఁడు కాఁడు. కావున వానిపైఁ గోపింపకుము. వాస్తవమున నతఁడేకదా రాజు. చక్కఁగా నాలోచింపుము.

కం॥ జనకుని ప్రతిజ్ఞ దీర్పఁగఁ, జనియెదఁ గానలకు నిపుడ • స్థైర్యముఁ గొనుమీ,
వనముల నే నుండఁగ నిటఁ,జను నీకు వ్రతోపవాస • సంగతి యనఘా. ౪౪౦

వ్రతోపవాససంగతి=భర్తసమీపమున లేనపుడు పతివ్రతలగు స్త్రీలు సొగ సులు చేసికొనరాదు. పూవులు, మంచి వస్త్రములు, కాటుక, గంధమాల్యాదులు ధరింపరాదు. సుఖశయ్యలఁ బరుండరాదు. ఇష్టమృష్టాన్నములు భుజింపరాదు. ఏకాదసులం దుపవసింపవలెను. పొరుగిండ్లకుఁ దిరుగఁబోరాదు. పరిహాసము కారాదు. వ్రతము లాచరింపవలెను. ఇట్టి నియమములన్నియు పతివ్రతవు నీవెఱిఁగినవేకదా.

తా త్ప ర్య ము

నేను స్థిరబుద్ధితో మాతండ్రియాజ్ఞ దీర్పఁగఁ బోయెదను. నీవును దిగులు పడక స్థిరబుద్ధివై యుండుము. వనములందు నేనున్నప్పుడు నీవిచటనుండి ప్రోషిత భర్తృకయగు పతివ్రత యేయే నియమములు వహించియుండ వలయునని శాస్త్రములు చెప్పుచున్నవో యట్లుండుము.

ఉ॥ ప్రొద్దున లేచి వేల్పులకు • మ్రొక్కి, యథావిధిఁ బూజఁ దీర్చి, యో
ముద్దియ! నాదుతండ్రికిని • మ్రొక్కుము, ధర్మ మెఱుంగ యూఁతగాఁ
దద్దయు వృద్ధదుఃఖభర • తప్తయు నైనమదీయమాత నీ
వొద్దిక భక్తిమైఁ గొలుచు • చుండుము, పూజలఁ దన్పుచుండుమీ. ౪౪౧

వృద్ధ=ముసలిది, దుఃఖభరతప్త=దుఃఖభారముచేఁ దపించునది, ఒద్దికమై= అనుకూలభావముతో.

తా త్ప ర్య ము

శాస్త్రప్రకారము నీవు చేయవలసినది నీ వెఱుఁగుదువు. నేను జెప్పఁ బనిలేదు. కాని నేను జెప్పవలసినవి కొన్నిగలవు- చెప్పెదను- విను. ఉదయము

ననేలేచి దేవతలకు నమస్కరించి శాస్త్రప్రకారము పూజచేసి యావల నాతండ్రికి నమస్కరింపుము. నా తల్లి కౌసల్య ముసలిది. దుఃఖాతిశయముచేఁ దపించునది— ఆమెకు నామెధర్మము తప్ప నాలంబన మేదియులేదు. నీవును ధర్మమునే యాధారము చేసికొని యనుకూలవై యామెను భక్తితో సేవించి పూజింపుము.

ఉ॥ ఖ్యాతచరిత్ర! తక్కుగల • యంబలు నీకును వంద్య లెప్పుడున్
మాతలు నాకు నందఱు స • మానలు ప్రీతిని సౌహృదంబునన్
భ్రాతలరీతిఁ బుత్రకుల • భంగిని మిక్కిలి చూడు కైకయీ
జాతుని లక్ష్మణానుజుని • సమ్మతి వారలు నాదుప్రాణముల్. ౨౨౨

ఖ్యాతచరిత్ర=ప్రసిద్ధమైన సదాచారముగలదానా, వంద్యలు=నమస్కార యోగ్యులు.

తాత్పర్యము

నీవు సదాచారసంపన్నవని ప్రసిద్ధికెక్కినదానవు. కావున నా తల్లివలెఁ దక్కిన తల్లులందఱుకూడ నీ నమస్కారమునకు యోగ్యురాండ్రే. వారందఱితో నాకేమి పని యనవలదు— ఏలయందువా. నాకుఁ దల్లులందఱు ప్రీతిచేతను స్నేహభావముచేతను సమానలు. నాకుఁ గన్నతల్లియని యెక్కువ, యటుగాదని తక్కువ ప్రేమలేదు. కావున నీవును నావలె వారినందఱి సొంతయత్తలవలె గౌరవింపుము. కైకకొడుకగు భరతుని నీ సోదరునివలెఁ జూడుము— పిన్నవాఁడగు శత్రుఘ్నుని గొడుకువలెఁ జూడుము. ఏలన వారు నాకుఁ బ్రాణములు.

ఇందు లక్ష్మణుని పేరు చెప్పకుండుటకుఁ గారణము తానాయనను వెంటఁ దీసికొనిపోవు నభిప్రాయముండుటయే.

కం॥ కులమునకు దేశమునకున్, వలనొప్పఁగ రాజు ప్రభువు•భరతుఁడు కానన్
జలజాక్షి! యెప్పుడేనియు, వల దప్రియముల్ ఘటింప•వానికిఁ గినుకన్.

తాత్పర్యము ౨౨౩

మనవంశమునకు దేశమునకు రాజు ప్రభువు భరతుఁడే కావున నీవు వానిపైఁ గోపించి వాని కప్రియములయిన మాటలు పలుకవలదు.

కం॥ భూపతు లారాధితులై, భూపుత్రీ! శీలయత్న • ముల లోకులచేఁ
బ్రాపింతురు సమ్మదముం, గోపింతురు తద్విరుద్ధ•గుణములఁ గనినన్. ౨౨౪

శీలయత్నములన్ = మంచియణఁకువతోడి నడవడిచే, ఆరాధితులై = ప్రేమచేఁ బూజింపఁబడినవారై, సమ్మదమున్=సంతోషమును, తద్విరుద్ధగుణములు = అణఁకువ దప్పినను, నడవడి తమకనుకూలముగ లేకున్నను.

తాత్పర్యము

రాజులు లోకులచే ననుకూలమైన నడవడిచే నారాధింపఁబడినవారై సంతోషింతురు. వారు సంతోషించిన సౌఖ్యసంతోషములు గలవు. అటుగాక విరుద్ధ

గుణములు గలవారిపైఁ గోపింతురు. కోపమువచ్చినా కీడుచేయుదురు.

కం॥ కడుపునఁ బుట్టినబిడ్డలు, దుడుకున నహితంబు సేయఁ•దొడఁగిర యేనిన్
విడుతురు భూపతు, లన్యుల గడియింతురు కార్యసాధ•కతఁ గ్రాలినచోన్.

తా త్ప ర్య ము ౩౩౫

నేను వదినెను, తల్లితో సమానురాలను, నాపైఁగూడ భరతుఁడు గోపించునా యందువేమో రాజధర్మము నీ వెఱుఁగవా. తమకు హితముగానిదానిని జేయువారు కడుపునఁబుట్టిన బిడ్డలేయైనను వారిని రాజులుదూరమున వదలుదురు. తమకార్యము చేయుసామర్థ్యముగలవారిని నితరులనైనను దగ్గఱ చేర్చికొందురు.

ఉ॥ కావున నింద యుండుము సు•ఖంబుగ, రాజమతానుకూలస
ద్భావమునన్ స్వధర్మచరి•తంబును సత్యపరాయణత్వముం
బ్రోవకు, ప్రేయసి, పరుల•నొవ్వఁగఁ జేయకు మేరినైన, సం
భావన సేయు నాపలుకు•భామిని! నేఁ జనువాఁడఁ గానకున్. ౩౩౬

రాజమతానుకూల సద్భావమునన్ = రాజునభిప్రాయమునకు ననుకూలమైన మంచి మనస్సుతో, స్వధర్మచరితంబును = స్త్రీకి. నింటికోడలికిఁ, బ్రోషిత పతికకు (పరదేశములనుండు భర్తగలదానికి) పరాధీనురాలికి నేది స్వధర్మమో యట్టి ధర్మచరితంబును, సత్యపరాయణత్వమున్ = ఇవన్నియుఁ జేయుచున్నానని గర్వింపక సత్యమునందుఁబ్రీతిని, ప్రోవకు = వదలకు, ప్రేయసీ = ఇట్లు వర్తించిననే నీవు నాకుఁ బ్రియురాలవు, భామిని = కోపము గలది.

శాస్త్రీయమైన మన స్వధర్మమందు మన ముంటిమేని భగవంతుఁడు తనంతటఁ దానే సంతోషించును. భక్తులమని స్వధర్మముల విడనాడువారి విషయమున భగవంతుఁడు సంతోషింపఁడు. తనయాజ్ఞమీఱి వర్తించు స్వజనుల విషయమునఁ బ్రభువు సంతోషించునా? అను విషయము దీనివలన గ్రహింపనగు.

శ్రుతిస్మృతి ర్మమైవాజ్ఞా, యస్తాముల్లంఘ్య వర్తతే
ఆజ్ఞాచ్ఛేదీ మమద్రోహీ, మద్భక్తోపిన వైష్ణవః॥ అని ప్రమాణము.

తా త్ప ర్య ము

కాబట్టి యిందే నీవుండుము. రాజునభిప్రాయమున కనుకూలమైన మంచి తలంపే కలదానవగుము. నీ స్వధర్మ మేదియో దానిని వదలకుము. సత్యమును విడనాడకుము. నీవునాకుఁ బ్రేయసివి కావున నాకుఁ బ్రియమైన కార్యములే మీఁదఁ జెప్పినట్లు చేయుచుండుము. ఇతరులు మనసు నొచ్చుకొను పని చేయకుము. నామాటయం దాదరముంచి గౌరవింపుము. కోపపడకుము. నే నడవులకుఁ బోవుచున్నాను.

-•౨౭-వ సర్గము. సీత శ్రీరామునితో నరణ్యమునకుఁ దానువచ్చెదనని చెప్పుట•-

కం॥ అణుమధ్య ప్రియార్హయు స ద్గుణవతి ప్రియవాదిని సతి•గురువిప్రియభా
షణములు దనుఁ బతి పల్కిన, బ్రణయామర్షమున సీత•పలికెన్ విభునిన్.

అణుమధ్య=సూక్ష్మమైన నడుముగలది, నడుము సూక్ష్మము కావున భారమగు నూర్ధ్వకాయమును ధరింపలేక జవజవలాడుచుండును, ఇప్పు డా భారము చాలదని మగఁడడవికిఁ బోవుచున్న శోకభారముఁ, దన్నుఁ బిలుచుకొనిపోఁడన్న కోపభారము తోడయ్యెను. కావున నామె నిలువలేక కూలఁబడు స్థితియందుండెను. ప్రియార్హ=ఈమె యప్రియములు పలికినను బరు లీమెనుగూర్చి ప్రియములే పలుకఁదగినది. అటేల యనిన నప్రియముఁలాడినను నామె నిష్కారణముగ నాడదు. ఏలన నామె సద్గుణవతి = నిత్యముగ సద్గుణములే కలది, అంతియేకాదు. ప్రియవాదిని=ప్రియములైన మాటలనే మాటలాడునది, సతి=పతివ్రత యగు సీత, గురు విప్రియభాషణములు = ప్రియమునకు మిక్కిలి విరుద్ధములైన పలుకులు. ఈ పలికినవారెవరో యన్యులుకారు, పతి=కట్టుకొన్నవాఁడే, తన్నుఁ బాలింపవలసినది విధిగాఁగలవాఁడే, ప్రణయామర్షమునన్=ప్రణయకోపముచే=ప్రేమవలనఁ గలిగిన కోపముచే, విభునిన్=భర్తను, ప్ర+నయ-ప్రణయ-ఇచ్చట న కారము వ్యాకరణ సూత్రప్రకారము ణ కారమయ్యెను గానఁ దక్కిన కారణములతోఁ బ్రాసముచెల్లెను. ప్రణయకోపమనుటచేఁగైక మగనిమీఁదఁ గోపించినట్లుకాదని తెలియవలెను.

తాత్పర్యము

సన్నని నడుముగలదియుఁ బ్రియమువినుటకే యోగ్యురాలును మంచి గుణములే కలదియుఁ బ్రియములే మాటలాడునదియుఁ బతివ్రతయునగు సీత శ్రీరాముఁడు పలికిన మిక్కిలి విరుద్ధములై యప్రియములైన మాటలనువిని చనవువలనఁ గలిగిన కోపముచేఁ దనపతితో నిట్లనెను.

కం॥ ఏ మిది!! యిటు పల్కెద వో, రామా! యీపేదపలుకు•రాజకుమారా!
నీ మాటలు విని నంతన, నామాత్రకు నాఁపరాని•న వ్వుదయించెన్. ౭౭౹

శ్రీరాము డెట్లు పురుషులకు స్వధర్మనిర్వహణమే పరమసాధనమని స్థాపింప నవతరించెనో యట్టులే స్త్రీలకును స్వధర్మనిర్వహణమే పరమసాధనమని స్థాపింప సీత యవతరించెను. ఇంతవఱకు శ్రీరాముని పుత్రధర్మ నిర్వహణవిధము చెప్పఁబడెను. ఇఁక సీతాదేవియొక్క స్వధర్మనిర్వహణవిధము చెప్పఁబడుచున్నది. శ్రీరాముఁడు చెప్పిన మాటలు స్వధర్మనిర్వహణమునకు విరోధించునవి కావున నామెకోపించెను. ఈకోపము స్నేహకారణముచేనైనది కాని కోపముచేనైనదికాదు.

ఇది మొదలు సీతా వైశిష్ట్యమును బాఠకులు గమనింతురు గాక.

కౌసల్యవలె నీ వడవికిఁబోవలదని సీతాదేవి ప్రారంభింపలేదు. అది న్యాయమా అన్యాయమాయనియు విచారింపలేదు? ఇవన్నియుఁ దన ధర్మములు కావనియామె యభిప్రాయము. కావునఁ దనకు సంబంధించినదైన తన స్వధర్మ మేదియో దానినే స్థాపింప సర్వవిధములఁ బ్రయత్నించెను.

శ్లో॥ శాశ్వతోయం ధర్మపథః, సద్భి రాచరిత స్సదా
యద్భార్యాం పరిరక్షంతి, భర్తారోల్పబలా అపి॥ భార. ౩-౧-౨-౬౭

ఎంతటి బలహీనుఁడైనను భార్యను రక్షింపవలసినది శాశ్వత సనాతన ధర్మమై సజ్జనా చరితమై యుండఁగా నిదియేమి మతిపోయినవానివలె మాటలాడుచున్నావని భావము.

ఇదియేమి=ఇదియేమి యాశ్చర్యము, ఇటుపల్కెదవు, ఎన్నఁడిట్లు పలికిన వాఁడవుకావే.

రామా=(1) బచ్చెన బొమ్మవలెఁ జూచుటకు నందమైయుండువాఁడా. (2) ఇతరులను స్వభావముచేతనే రమింపఁజేయువాఁడా. (3) ఆఁడుదానా.

రాజకుమారా=రాజవంశమున రాజగువానికిఁ బుట్టినకారణముచే రాజకుమారుఁడని యనవలసియున్నది గాని నీ ధైర్యస్థైర్యములచేఁ గాదు. ఇది పండితపుత్ర శబ్దమువలె గ్రహింపనగు. పండితపుత్రుఁడనఁగా శుంఠయని యర్థము.

తాత్పర్యము

ఇది యేమి యాశ్చర్యము!! నీ వెన్నఁడిట్లు పలికినవాఁడవు కావే. ఈ పిఱికిపంద మాట లిపుడేలవచ్చెను. నీవు స్వభావముచేతనే యెట్టివారినైన నెవరినైన సంతోషింపఁజేయుదునని రాముఁడని పేరు పెట్టుకొన్నవాఁడవు. ఇట్టి నీ వాఁడుదానివలె మాటలాడితివి. నీవు లోపల సారములేని పైపై వన్నెలచేఁ బ్రకాశించు పేఁడబొమ్మవలె పై సౌందర్యము గలవాఁడవు గానున్నావేకాని లోపల సారమున్నట్టు కానరాలేదు. అట్టులనెదవేమి నేను రాజకుమారుఁడను గానాయందువేమో. నీవు రాజుకొడుకగుటచేఁ బండితపుత్రుఁడన్నట్టు రాజకుమారుఁడవైతివేకాని రాజకుమారునియం దుండవలసిన స్థైర్య ధైర్య శౌర్య సాహసాదిగుణములుండుటచేఁ గాదు. అవిగల నిక్కపు రాజకుమారుఁడవైన నీవిట్లు మాటలాడియుండవు. నామాటలలో నీవేమి లోపము కనుఁగొని నన్నిట్టు లనెదవందువా చెప్పెదనుగాని నీ పేదపలుకు వినఁగానే నావంటి యాఁడుదానికి నందు బాలికకు నిలుపరాని నవ్వుదయించెను. ఇఁక మగవారు రావవారు విన్న నేమందురోకదా.

చం॥ తన తన పుణ్యపాపములు • తాను భుజించుచు నాత్మభాగ్య మా
పనులు ఘటించు చుండెడిని • భ్రాతయుఁ దల్లియుఁ గోడలున్
దనయుఁడు, భర్తృభాగ్యమును • దప్పక భార్య యొకర్తె పొందుఁ, గా
వున నినుఁ గాన కేగు మనఁ • బొమ్మనినట్టులే నన్ను వెంటడిన్. ౭౭౯

భాగ్యము=శుభాశుభకర్మము, భాగ్యం కర్మశుభా శుభమ్మని యమరుఁడు

తాత్పర్యము

నేనేమి యంత తెలివితక్కువగా మాటలాడితినని నీవు నవ్వెదవండువా వినుము.

తోడఁబుట్టినవాఁడు తల్లి, తండ్రి, కోడలు, కొడుకు వీరందఱు తాము తాముచేసిన పుణ్యపాపముల ఫలమే తామే యనుభవింతురు గాని యొకరు చేసిన పుణ్యముగాని పాపముగాని యితరులకు సంక్రమింపదు. పురుషుని భాగ్యమును పుణ్యమును వానితో సమానాధికారముగల వాని భార్యయొకతెయే పంచుకొనును. కావున రాజునిన్నడవికిఁ బొమ్మన నన్నుఁ బొమ్మనిచెప్పినట్లే. అర్థోవైఏష ఆత్మనో యత్పత్నీ యను శ్రుతివలన నీసగముకదా నేను. నీసగము దేహము నింటఁబెట్టి సగము దేహముతో నడవికిఁబొమ్మని రాజు చెప్పెనా.నన్ను నీ వింటవిడిచిపోయిన జనకునాజ్ఞ రాజాజ్ఞపూర్ణముగా నెఱవేర్చినవాఁడవు కావు. అఱగొఱగాఁ జేసినవాఁడవగుదువు.

నీవు గొప్పధర్మము చేయఁబోయెదవుకదా. అట్టి ధర్మము నన్నువిడిచి నీవెట్లు చేయఁదలఁతివి? వివాహమునాఁటి వాగ్దానమును మఱచితివా? నీవు చేయు ధర్మమందు సగము నాకు భాగముకలదు కదా. అది నేనుగూడ నుండి మీ శుశ్రూష చేసిన వచ్చునా? నే నింటనుండిన వచ్చునా?

సీ॥ శాస్త్రనిర్దిష్ట ప్రశస్తకర్మములను, రాగవిద్వేషవర్జనముగాఁగఁ। దన శక్తి కొలఁది శ్రద్ధాపురస్కృతిగాఁగఁ బ్రతిదిన మాచరింపంగవలయు। విను నరుల్ నిజజాతి విహితలోకములఁ బ్రాజాపత్యముఖములఁ జాలఁగ్లేశ। ములఁ బొందుదురు శ్రమంబున నిట్లు పురుషుల, చేతఁ గష్టమున నార్జింపఁబడిన॥ తే-గీ-సకలపుణ్యంబులందును సగము వనితలొందుదురు పతిశుశ్రూషయొప్పఁ జేసి, శ్రాద్ధముపవాసములు వేఱజన్నములనును, లేక వసియింతురీప్సిత లోకము లను॥ కం॥ సురలకుఁ బిత్రాదులకున్, బురుషుండొనరించునట్టి పూజాదులలో, వరశుశ్రూషన్ సతిత, త్పరతననన్యాత్మయైనఁదా సగముఁగొనున్. భార-అను లాగ అధ్యా. ౧౩ శ్లో॥ భర్తాకరోతియాన్ సాధ్వీ, యత్కించిత్కురుతే శుభమ్, తస్య పుణ్యస్య సంపూర్ణ, మర్ధం ప్రాప్నో త్యసంశయః॥ గారు॥ భర్తయే కొంచెము పుణ్యముచేసినను నా పుణ్యములో సగము పతివ్రతయగు సతని భార్యను జెందును. సందేహములేదు.

ఇట్లు నాకు న్యాయముగా ధర్మశాస్త్రప్రకారము రావలసిన పుణ్యము రాకుండ మీరెట్లు చేయఁగలరు. అట్టి యధికారము మీకుఁగలదా.

భారతపద్యంబున ననన్యాత్మయనఁగా మగఁడు వేఱు తాను వేఱనుభావము లేక శక్తునకు శక్తి, సముద్రమునకు నల. చంద్రునకు వెన్నెల, సూర్యునకు నెండ, యెట్లో యట్లని భావించియుండుట, ఉభయలోకంబుల భార్యాభర్తలకవి నాభావసంబంధముగలదు.

కం॥ జనకుండు కాఁడు,కానిద జనని,యాత్మ సుతుఁడు కాఁడు•సకియలుగా రిం
దును నందు నెల్లకాలము, ఘనవేణికి, భర్త యొకఁడె•గతి ప్రాణేశా. ౭౮౦

ఘనవేణికి=మేఘమువలె నల్లనైన జడగలదానికి=స్త్రీకి.

తాత్పర్యము

ప్రాణేశ్వరా! వినుము- స్త్రీకి నీలోకమందుఁగాని పరలోకమందుఁగాని యొకరాలోకమందు నొక రీలోకమందున్నఁగాని యెల్లకాలము శాశ్వతముఁగా భర్తయొక్కఁడె గతికాని తండ్రికాఁడు. తల్లిగాదు. కన్నకొడుకుగాఁడు. స్నేహితురాండ్రుగారు. ఏల? సతి ప్రాణమునకు నీశుఁడు భర్తగాని యితరులుగారు. కావుననే యాయనకు ప్రాణేశ్వరుఁడు జీవితేశ్వరుఁడనియుఁ బేరు.

ఉ॥ కానల కేగెదేనియును•గాంతుఁడ! నీకును మున్నువోవు చేఁ
గానవమార్గసీమఁ గుశ•కంటకముల్ దొలఁగించి మార్దవం
బూనఁగఁ జేయు చుండెదను,•నొడ్డులు ద్రావఁగఁ దక్కు నీరమున్
మానినరీతి నావయిని•మానుము రోసము నీసుఁ బ్రీతిమై. ౭౮౧

తాత్పర్యము

నేనేమి పెండ్లికిఁ బోవుచున్నాఁడనా? ఉద్యానవనక్రీడకుఁ బోవుచున్నాఁడనా. అడవికి నీవు వచ్చియేమి చేసెదవు? అందువేమో. ఇక్కడ నేనుజేయు పనియే యక్కడఁజేసెదను, ఇక్కడ నీవు కూర్చుండు నాసనమునఁ గసవు లేకుండఁ జిమ్మిమృదువుగా నాసనమేర్పాటుచేయునట్లే నీకుముందుగాఁబోవుచు నడవిత్రోవలయందు దర్భలు ముండ్లు దొలఁగఁ ద్రోచి మెత్తగానుండఁజేసెదను. ఇది నాకు వాడుకపడిన పనియే కావునఁ గష్టకార్యముగాదు. కావునఁ బరులు ద్రావిన నీళ్ళను వదలినట్లు నే నింటనుండు మనిన నుండనని తిరస్కరించి మాటలాడుచున్న దానను కోపము, నాతోడ నడవికి వచ్చియచట నేను జేయు పుణ్యములో సగము దాను బంచుకొనుట కాలోచించుచున్నదనియీర్ష్య, ప్రేమచే వదలిపెట్టుము. ఉచ్ఛిష్టజలము గ్రాహ్యముఁగా నట్టిలీగుణములు గ్రాహ్యములుగావు ఉచ్ఛిష్టమనఁగా భుక్తశేషము "పీతావశేషితం పీత్వా, పానీయం బ్రాహ్మణః క్వచిత్। త్రిరాత్రంతు వ్రతంకుర్యా, ద్వామహస్తేన వాసునః॥ శంఖ॥ త్రావఁగా మిగిలిన నీరు బ్రాహ్మణుఁడు త్రాగినను, ఎడమ చేతితోఁ (భోజనవేళఁదప్ప) ద్రాగినను,మూఁడురాత్రులు వ్రతమాచరింపవలెను

ఉ॥ మానధనాఢ్య! వీరవర?•మానుము బాలిక నొంటిదానినేఁ
గానకుఁ దోడుకొం చరుగఁ•నా నెటు లౌ ననుసందియంబు, న
న్మానక తోడుకొం చరుగు•మా, నిను, బాసియు జీవయుక్తనై
యే నిట నుండునంతయఘ•మేమి యొనర్పను గాదె వల్లభా. ౭౮౨

మానధనాఢ్య=మానమను ధనముచే గొప్పవాఁడా, నీవు అవమానధనాఢ్యుఁడవు కాకుండుమని భావము. నీవు మానధనుఁడ వెట్లైతివో యెఱుఁగుదువా.

వీరవరుఁడవగుటచేత. ఒక్క యాఁడుపిల్లను గాపాడ భయపడువాఁడవు వీర వరుఁడ వెట్లగుదువు కావున నీవు వీరవరుఁడవు మానధనాఢ్యుఁడవు సత్యముగ నైనచో నన్ను వదలిపోకుము. నీ సందేహము నే నెఱుఁగుదునులే. ఇది యాఁడుది. అందులో బాలిక అందు నొంటరిది. ఎట్లు నేనడవులకుఁ బిలుచుకొని పోదును. అని సందేహించుచున్నావు. అట్టి సందేహము వలదు. అది నీ వీర వర్యత్వమును మానధనాఢ్యత్వమును నాశముచేయును. కావున నన్నుఁదప్పక తోడుకొనిపొమ్ము.నిన్నుఁబాసి యావలఁ బ్రాణములతో నుండునంతటి పాపము నేనేమియుఁ జేయలేదు గదా. వల్లభా=ప్రియుఁడా, నీవు నాకు వల్లభుఁడవు? నేను నీకు వల్లభను. ఈ పరస్పర సంబంధమును నెట్లు ద్రెంపఁగలవు.

తా త్ప ర్య ము

మానధనాఢ్య! వీరవర్యా! యిది యాఁడుపిల్ల దీని నెట్లు నే నడవులకుఁ బిలుచుకొని పోదును. అను సందేహము వదలిపెట్టుము. అది నీకుఁ గీర్తికరము కాదు. కావునఁ దప్పక తోడుకొని పొమ్ము వల్లభుఁడవైన నిన్ను నెడఁబాసియుఁ బ్రాణములతోనుండునంత పాపము నేనేమియుఁ జేయలేదు. పాపాత్మురాలికిఁ గాని భర్తృవియోగము సంభవింపదు.

చం॥ అతులితసౌధవీథులను•హాయిగఁ గ్రుమ్మరుకంటె, దేవతా
తతులవిమానసీమల స•దా విహరించుటకంటె వ్యోమప
ద్ధతులఁ జరించుకంటెను, వె•తల్ పడుచున్నను నేయవస్థలన్
సతికిని భర్తృపాదపరి•చర్యయె యుత్తమ మార్యసత్తమా. ౭౮౩

అతులిత=అసమానమైన, సౌధవీథులను=మేడలవరుసలయందు-విమాన సీమల=దేవతావిమానములపై, వ్యోమపద్ధతులను=ఆకాశమార్గములందు,వెతల్ =దుఃఖములు, భర్తృపాద పరిచర్యయె=మగని పాదములకు సేవచేయుటయె, ఉత్తమము=శ్రేష్ఠము.

తా త్ప ర్య ము

సీతా! నీవింతవఱకు వివేకముగలదాన వనుకొంటిని. అది పొరపాటని తోఁచుచున్నది. ఏలయందువా. ఇటువంటి సార్వభౌమవాస యోగ్యములైన యిండ్లయందలి సుఖావాసము వదలి నీవు వివేకముగలదానవైతివేని యడవికి వచ్చెదనందువా. అనెదవా? అటయినఁ బతివ్రతల స్వధర్మము నీ వెఱుఁగ వనియే చెప్పుదును వారిధర్మమెట్టిదన. అసమానమై సార్వభౌములగువారికి యోగ్యమైన మేడలయందుండి భూలోకసుఖమనుభవించుటకంటెను, జచ్చి దేవతల విమానములపైఁగూర్చుండి సుఖవిహారములు చేయుటకంటెను, లేక యణిమాది యోగసిద్ధుల సాధించి యాకాశగమనము చేయుటకంటెను,పతివ్రత యగు స్త్రీకి నేగుడిసెలోనుండినను నేలోకమున నుండినను, ఏశక్తియు లేక యుండినను, ఎంతటికష్టదశయందుండినను, భర్తయొక్క పాదసేవ చేయుచు

నతని వెంటనుండుటయే శ్రేష్ఠము. ఇది యార్యులయందు, నందుఁ బండితు లందు, నట్టివారిలో గొప్పవాఁడవగు నీవు నెఱుఁగవా?

దీనివలన భర్త యెట్టి కష్టదశయందుండినను భార్య యాయనను వదలి యుండరాదని సూచితము.

ఈ విషయమున దమయంతి వాక్యములు చూడుఁడు.

గీ॥ అఖిలదుఃఖరోగార్తున కౌషధంబు। సురుచిరంబుగ భార్య యు చూవె యెందు।
నౌనర భార్యాసమేతుఁడై యున్నవాని। కెంత లాపదలయ్యును నెఱుకపడవు

కం॥ అలయునెడ, డయ్యునెడ, నాఁ।
కలియుఁ దృషయునైన యెడలఁ గడుకొనిధరణీ।
తలనాథ పురుషునకు ని। మ్ముల భార్యయ పాపుఁ జిత్తమునదుఃఖంబుల్॥

పతివ్రత లందఱీవిషయమున నేకాభిప్రాయముగలవారే, ఇట్టివారు ద్రౌపది, చంద్రమతి, దమయంతి, సీతాదేవి లోనగువా రనేకులు గలరు.

ఉ॥ అంబయుఁ దండ్రి మున్న వివి•ధాశ్రయముల్ పతిఁ గొల్చుభంగి స
ర్వంబును నేర్పి, రియ్యెడ న•వంబుగ నేర్చెడునద్ది లేదు, నే
నింబుగ వచ్చెదాన, హృద•యేశ్వర! మానవవర్జితంబు దు
ర్గంబు పృదాకుభల్లుకత•రక్షువికీర్ణము నైనకానకున్. ౭౮౪

వివిధాశ్రయముల్ = పెక్కుతీరులు, నవంబుగన్=క్రొత్తగా, మానవ వర్జితంబు=మనుష్యులచే విడువఁబడినది, దుర్గంబు=పోవ ద్రోవలేనిది, పృదాకు=సర్పములు, భల్లుక=ఎలుఁగులు, తరక్షు=చిఱుతపులులు, వీనిచే వికీర్ణము=వ్యాపించినది యగు, కానకున్=అడవికి.

తాత్పర్యము

నీవు చిన్నదానవు. నీధర్మములు నీ వింకను బెద్దలచాటుననుండి నేర్చు కొమ్మనెదవా. నే నేయే దశలయందు భర్తృసేవ యెట్లెట్లు చేయవలయునో యా పద్ధతులన్నియుఁ జిన్ననాఁడే నాతల్లి దండ్రులు నాకు నేర్పిరి. ఇప్పుడు నేను క్రొత్తగా నేర్చుకొనవలసినదేదియు లేదు. కాఁబట్టి నాకృత్యము నాకుఁ దెలియును. కనుకనే సంతోషముతో వచ్చెదను. అడవికిఁ బోవలసి వచ్చెనేయని యేడ్చుచుఁ గాదు. అడవులయం దేమియుండునది నాకుఁదెలియకకాదు. కావునఁ బ్రాణనాథా! మనుష్యులు లేనట్టియుఁ, బాములు, ఎలుఁగులు, చిఱుతపులులు వీనిచే వ్యాపింపఁ బడియుండునట్టియుఁ బోవఁ ద్రోవలేనట్టియు నడవులకు వచ్చెదను.

కం॥ పుట్టినయింటను ఁజె నే, నట్టడవుల హాయి నుందు•నాథా, చింతల్
దొట్టవు మది ముల్లోకము, లిట్టైనఁ, బ్రతివ్రతంబ•యెంచుచు నుందున్.

తాత్పర్యము

నాథా! అత్తలకాఁడుబిడ్డలకు భయపడుచు నేమి చేసినఁ దప్పో-ఏమి చేయకుండినఁ దప్పో-పలికిన నేమి తప్పో-పలుకకుండిన నేమి తప్పోయని భయపడుచు నత్తగారింట నుండునట్లుగాదు వారి మనస్సు నాకుఁదెలిసి నా మనస్సువారికిఁ దెలిసియేమి చెప్పిన నేమిచేసినను నాక్షేపింపరు కోపింపరను భయములేక పుట్టినింటఁ దల్లిదండ్రుల చాటున సుఖముగానుండునట్లు నడవులలో నౌకరియంగెన పంగెనలేక సుఖముగా నుందును. ఈపూఁడు లోకములు తలక్రిందులైనను మఱి ప్రలయము వచ్చి రూపనాశమైపోయినను ముక్తుఁడై భగవత్ప్రాప్తి లభించిన వానివలె నేచింతలేకయుండును. నేను నాభర్తకు సేవ చేయుదునను తలఁపు తప్ప నాకితర విచారములేదు. పరిపూర్ణ బ్రహ్మను భవాత్మికాముక్తియని ముక్తిలక్షణము.

ఉ॥ ఘుమ్మనిపువ్వుఁ దేనియల•కమ్మనితావులు గ్రమ్మ నాయర
ణ్యమ్ముల నేమ మొప్ప నన•యమ్మును దాలిచి బ్రహ్మచర్యము
స్సమ్మతి నీపదాబ్జభజ•న మ్మొనరించుచు నిన్నుఁ గూడి నే
సమ్మదకేళిఁ దేలెదను•శౌర్యధనా! యిది సమ్మతింపవే. ౭౮౯

తావులు=వాసనలు-నేమము=నియమము-అనయము=అడవులందున్నంత కాలము-శౌర్యధనా=శౌర్యముధనముగాఁగలవాఁడా.

తాత్పర్యము

అడవులందుఁ బులులు సింహములుండునని తెలిసి తెలిసి వచ్చెదనందువే. ఇది యేమిపిచ్చియనెదవా. అవి యడవులయందెందో యుండును. సర్వత్ర యుండునవికావు. పువ్వు దేనియల కమ్మని వాసనసర్వత్రవ్యాపింపగా నాయరణ్యములందుండువఱకు సంతోషముతో బ్రహ్మచర్యవ్రతమవలంబించి నిండు మనస్సుతో, నీపాదకమలముల సేవచేయుచు నీతోడ సంతోషసముద్రములందుఁ గ్రీడలాడెదను. ఈమాత్రమునకు సమ్మతింపఁగూడదా? నేనేమి యాభరణములు దెమ్మంటినా? వస్త్రములు దెమ్మంటినా! సంతోషకరములైన పదార్థములు తెమ్మంటినా? నాకు రథములు కావలెనంటినా? నిన్ను మోసికొనిపొమ్మంటినా? నీతోడ నడచి వచ్చెదననిన నేలవలదనెదవు.

కం॥ ఏమనుజులనైన వనీ, భూముల రక్షింపఁ గలవు•పొరపడ కింకన్.
నామాటఁ జెప్ప నేటికి, నోమానద! పూర్ణకరుణ•యుంపుము నాపై. ౭౮౭

తాత్పర్యము

నీవు శూరుఁడవు నీకు శౌర్యమే ధనము. భర్తద్రవ్యము భార్యయు ననుభవింపవలసినదే కదా. దానినే నేను కోరుచున్నాను ఏ మనుష్యులనైనను నీవు శౌర్యముచే నడవులయందేపొరపాటులేక కాపాడఁగలవు. ఇఁకనన్నుఁ [illegible]పనుట చెప్పనేల? నిండారుదయ నాయందుంపుము. నేను గోరునది

యది యొక్కటియే. భగవదనుగ్రహ మొకటియుండిన నెందున్నను భయము లేదు. సర్వభూతరక్షకుఁడు తన్నొకనిని రక్షింపఁడాయను మహావిశ్వాసముండ వలయును. ఈవిశ్వాసము లేనివారిని భగవంతుఁడు చేరఁదీయఁడు అది కలదా లేదా యనియే యింతపరీక్ష.

ఉ॥ సందియ మింతలేదు, నృప•చంద్రమ! వచ్చెద నీదు వెంట, నా
డెందము నిశ్చయం బిది, క•డింది సుమీ మరలింప నీకు, నీ
కెందును గష్ట మీయను, బ•తీ! ఫలమూలము లారగించి లోఁ
గుందక నిన్నుఁ గూడి మదిఁ•గూర్చెద మోదము, నన్ను నమ్ముమీ. ౭౮౮

కడింది=మిగులఁగష్టము, అసాధ్యము.

తా త్ప ర్య ము

రాజశ్రేష్ఠా! నీవెంట నేను వచ్చెదను. ఇందు సందేహములేదు. ఇది నా మనోనిశ్చయము. దీనిని మరలింప నీకు సాధ్యపడదు. నేను నీ కెట్టి కష్ట మీయను. ఆహార మేమనెదవా కందమూలములు ఫలములు తినెదను. లోపల నొచ్చుకొనను, నీతోడనుండుటే నాకు సంతోషము అపారవస్త్రాభరణాదులుచేఁ గలుగుసంతోషము సంతోషముగాదు. అది క్షుద్రస్త్రీలు గోరుసంతోషము.

ఉ॥ కోరెదఁ బ్రాణనాథ! నినుఁ•గూడి చరింప వనీధునీఝరీ
తీరగుహాళులన్ విబుధ•ధీరజనాగ్రణి! జల్లు లాడఁగా
గోరెద హంససారసని•కూజిత రాజిత పద్మినీధ్ధకా
సారములన్ మనోజ్ఞరుచి•సారములన్ మనసార నేఱులన్. ౭౮౯

వనీ=అడవులయందు, ధునీ=మహానదుల యొక్కయు, ఝరీ=కొండవంకలయొక్కయు, తీర=ఒడ్డులందుఁ గల, గుహాళులన్=గుహలపంక్తులయందు, విబుధ=సర్వము తెలిసినవాఁడా, ధీరజనాగ్రణీ = ధైర్యవంతులలో మొదటివాఁడా, జల్లులాడఁగాన్=జలక్రీడలాఁడగా హంస, కాసారములన్ = హంసల యొక్కయు, బెగ్గురు పక్షులయు ధ్వనులచేఁ బ్రకాశించునవియై తామర పువ్వులచేఁ బ్రకాశించుకొలఁకులయందు,మనోజ్ఞ రుచిసారములన్=మనసున కింపైన రుచిగల జలములు, మనసారన్=మనస్సునకుఁ దృప్తికలుగునట్లు.

తా త్ప ర్య ము

ప్రాణేశ్వరా! యడవులయందు, నదులయుఁ గొండవంకలయుఁ దీరము లందుండు గుహలయందు నిన్నుఁగూడి సంచారము చేయఁగోరెదను. మఱియు హంసములయు బెగ్గురుపక్షులయుఁ గలకలనాదముతో నిండి తామరలచేఁ బ్రకాశించు కొలఁకులందుఁ దియ్యని యింపైన నీళ్లుగల యేఱులందు జలక్రీడలాడఁ గోరెదను. ఇది నాకోరిక, ఈమాత్రము నెఱవేర్పరాదా.

చం॥ అలరుచు నీదుసంగతి శ•తాయుతవర్షము లైనఁ గానలో
నలజడి లేక యుందు, ధవ•నాకమ యైనను నాకు మోదమున్
గొలుపదు, నిశ్చయంబు నినుఁ•గూడఁగఁ గల్గక యున్నఁ, గావునన్
బలిముఖసింహవారణవి•భాసము కానకు వెంట వచ్చెదన్. ౮౯౦

అలరుచు=సంతోషించుచు, నీదు సంగతి=నిన్నుఁగూడి యుండుటచే, శతాయుతవర్షములు=లక్షసంవత్సరములు, అలజడి=బాధ-రూ. అడజడి, ధవ=నాథా, నాకమయైనను=వైకుంఠమేయైనను, బలిముఖ=క్రోఁతులచేతను రూ. వలిముఖము, వలీముఖము, వబలకభేదము, సింహ = సింహములచేతను, వారణ=ఏనుఁగులచేతను, విభాసము=ప్రకాశించునది.

తాత్పర్యము

నీతోడ సంతోషముగా లక్షసంవత్సరము లైనను నేబాధలేక యడవిలో నుందును. పదునాలుగు సంవత్సరము లేమిలెక్క? నీతోడ నే నుండకపోయితినా వైకుంఠమందున్నను నాకు సంతోషములేదు. కావునఁ గ్రోఁతులు సింహములు, నేనుఁగులు వీనిచేఁ బ్రకాశించు కానలకు నేను వచ్చెదను.

చం॥ జనకగృహంబుచందమున•సౌఖ్యముగా నివసింతు, నీకు నా
య్యనఁ బరిచర్య సేయుదు, న•నన్యమనస్క, దృఢానురక్తచి
త్తను, నను వీడితేని మెయి•దాల్ప నిజంబుగఁ, దోడుకొంచుఁబొ
మ్మనఘ! ఘటింపు కోర్కి, నిను•నంతటివానికి నిద్దిభారమే? ౮౯౧

అనన్య మనస్కను=వేఱగు మనస్సులేనిదానను, నాధారణమునకు, పోషణమునకు, నునికికి, గతికి, నీవే యాధారమైనవాఁడవను మనస్సుగలదానను, నిన్నుఁ గూడియుండుటతప్ప, నీసేవతప్ప వేఱుఫలముఁ గోరనిదానను, దృఢానురక్తచిత్తను=చలింపని యనురాగముగల మనస్సుగలదానను, మెయి=దేహము రూ.మై.

తాత్పర్యము

నాతండ్రియింటియందున్నట్లు సుఖముగా నడవులందు నుందును. నీకు సేవ సేయుదును. నీమనస్సే నామనస్సు. నామనస్సే నీమనస్సు. కావున నిన్నుఁదప్ప వేఱొక లాభమునుగోరను. ఈ ప్రాప్తికి నిన్నుఁదప్ప వేఱొక సాధనమునుగోరను. భయముతో గూడిన మనస్సుగాదు. నిశ్చలభక్తితోఁ గూడినమనస్సు. నీవు నన్నువదలితివా నేను దేహమును వదలెదను. ఇది సత్యము. తోడుకొనిపొమ్ము, ఈనాకోరిక నెఱవేర్పుము. నీయంతటివానికి సర్వవిధముల సమర్థున కిదియొంత బరువా.

ఇదియే పరమభక్తిలక్షణము. "పునర్విశ్లేష భీరుత్వం పరమాభక్తి రుచ్యతే" యని పరమభక్తి లక్షణము.

-• ౨౮-వ సర్గము. శ్రీరాముఁడు సీత కరణ్యమందలి కష్టంబులఁ జెప్పుట. •-

కం॥ అనుచు వచించిన సీతను, గని ధర్మరతుండు మదిని•గైకొనఁ డయ్యెన్
వనితను గొనిచన, మఱియును, వనజాక్షికి నిట్టులనియె•వనదుఃఖములన్.

తా త్ప ర్య ము ౮౯౨

అని చెప్పు సీతను శ్రీరాముఁ డడవులయందలి కష్టములఁ దలఁచి (నామెధర్మమందామె యుండుటకు సంతోషించినవాఁ డయ్యును) నామెను బిలుచుకొనిపోవ నంగీకరింపలేదు. మఱియును నామెకు వనములయందలి కష్టముల నిట్లు చెప్పఁదొడగెను వనవాసమందలి కష్టములు తెలియక చెప్పుచున్నది తెలిసినఁ జాలించుకొనునేమో చూతమని యామె పరీక్షార్థము వనదుఃఖములఁ జెప్పుచున్నాఁడు.

కం॥ వనవాసక్లేశంబుల ఘనుఁ డాలోచించి బాష్ప•కలితేక్షణఁ దాఁ
జనవున నాశ్వాసించుచు,వనవాసోద్యమము మాన•వనితకు ననియెన్. ౮౯౩

వనవాసక్లేశంబున్=అడవులలో వాసము చేయుటయందుఁ గలకష్టములను, ఘనుఁడు=గొప్పవాఁడు, బాష్పకలితేక్షణ= కన్నీటితోఁగూడిన కన్నులు గలది, ఆశ్వాసించుచున్=ఊరడించుచు, వనవాసోద్యమము = వనవాసవిషయమైన ప్రయత్నము.

తా త్ప ర్య ము

గొప్పబుద్ధిగల శ్రీరాముఁడు సీతను దోడ్కొనిపోవ నిష్టము గలవాఁడయ్యును వనవాసమునందలి కష్టము లాలోచించి ఆమె యాకష్టములను సహింపలేదని తలఁచి కన్నీరుగార్చుచున్న యామెను జనవున నూరడించుచు వనవాసప్రయత్నము మానుకొనుటకై యిట్లుచెప్పెను.

ఉ॥ పుట్టితి గొప్పవంశమునఁ•బూని చరించెదు ధర్మనిష్ఠ, లోఁ
దట్టిన దెల్లఁ ద్రోవగ య•థాసుఖవృత్తిఁ జరింపఁబోకుమీ,
పట్టుగ నింద యుండుము, శు•భం బగు ధర్మము నాచరింపు, మే
నెట్టు వచింతు నప్పగిది•నీ వొనరించుట కార్య మౌఁ జుమీ. ౮౯౪

తా త్ప ర్య ము

సీతా! నీవు గొప్పవంశమునఁ బుట్టినదానవు, నీవు ధర్మము నిష్ఠగలిగి చరించెదవు. కావున వానికి రెంటికి నపకీర్తివచ్చునట్లు మనసునకుఁ దోఁచినదెల్లఁ ద్రోవఁగా సుఖమనితోఁచినటెల్ల స్వచ్ఛందవృత్తిఁ జరింపకుమా. కావున నేను జెప్పినట్టు లిందే నీవుండుము. ఇచ్చటనే ధర్మమాచరింపుము. నేను నీకుభర్తను. నాయాజ్ఞ నీవు మీఱరాదు కనుక నేను జెప్పినట్లు నీవు చేయుటయే తగినకార్యము కాని నన్ను ధిక్కరించి నామాటవినకనీయిష్టప్రకారము సంచరించుట నీకుఁదగదు

కం॥ అడవులకుఁ జనఁగఁ గోరికి, విడుపుము, బహుదుఃఖకరము♦విపినం, బే నీ
యెడఁ బ్రేమకలిమిఁ జెప్పెదఁ, బడఁతీ!సుఖ మన నెఱుంగ♦వనవాసమునన్
విపినము=అడవి. ౭౮౫

తాత్పర్యము

అడవులకుఁ బోవలయుననుకోరికవదలుము, నీవెఱుఁగవు.అడవి మిక్కిలి దుఃఖము కలిగించునది. నీయందలి ప్రేమచే నీవు కష్టపడఁ జూడలేక చెప్పుచున్నాను వనవాసమందు సుఖమన నెట్టిదో యెఱుఁగను.

కం॥ విను మబలా! కాంతారము, ఘనతరదుఃఖముల కునికి♦గావునఁ జుమ్మీ
వన మని చెప్పం బడియెడి, వనమున సౌఖ్యంబు గలదె♦వరరుహనయనా!
కాంతారము=అడవి. ౭౮౬

తాత్పర్యము

అబలా! అడవియనిన నేమని తలఁచితివో- నేను వచ్చెదననెదవు,మిక్కిలి గొప్పకష్టములకు స్థానము కావుననే దానికి వనమనిపేరు, వనములలో సుఖము కూడ నున్నదా.

కం॥ మానిత చరిత్ర, శైలగుహానివసద్భూరిశరభ♦హరిరవము ఝరీ
ధ్వానము కర్ణకఠోరము, కాన నరణ్యంబు దుఃఖ♦కరము లతాంగీ! ౭౮౭

శైలగుహా=కొండగుహలయందు, నివసత్=వసించు, భూరి=గొప్పదగు, శరభ=శరభములయు, హరి=సింహములయు, రవము=ధ్వని, ఝరీధ్వానము= కొండవంకలచప్పుడులు, ఇవి కర్ణకఠోరము = చెవులకు భయంకరముగా నుండును. కాఁబట్టి లతాంగీ=తీఁగవంటి దేహముగలదానా! గాలిగొట్టిన వణఁకి నేలఁబడు కోమలదేహపు-దీనినెట్టు సహించెదవు.

తాత్పర్యము

కొండగుహలయందుండు పెద్ద పెద్ద శరభములు సింహములుచేయు ధ్వనులును, సెలయేళ్ళ చప్పుడులును, నీవు విన వాంఛకపడిన వీణానాదములు గావు. చెవులు పగిలిపోవునట్లు దిగులగునట్లుండును. కావున నరణ్యము దుఃఖ కరము.

లతాంగీ=అన్నప్పుడు లత లడవులలో నుండునవి చెట్టునాశ్రయించుకొనియుండునవి. కావున నాకును నడవి పుట్టినిల్లువంటిదే అందు నీప్రాపుండ నాకేమి భయమురాఁగలదని సీతాపక్షమున నర్థము.

కం॥ మానవవర్జిత తలకే,శీనిశ్చలనిరతమదమ♦లేమసమృగసం
తానము పయిఁ బఱ తెంచును, గాన నరణ్యంబు దుఃఖకరము లతాంగీ!

మానవవర్జిత తల=మనుష్యులచే విడువఁబడిన స్థలమునందు,కేళీనిశ్చల నిరత=ఆటలయందు స్థిరమైన ప్రీతిగలిగి, మదమలీమస=మదముచే మలినమైన మృగసంతానము=అడవిమృగములగుంపు.

తాత్పర్యము

మనుష్యులులేని స్థలమందు నిర్భయముగా నిశ్చలముగా నాటలాడుట యందుఁ బ్రీతిగల మృగములు మనుష్యులను జూడఁగానే మీఁదికిఁ బరువెత్తి వచ్చును. కావున నరణ్యము దుఃఖకరము భార్యాభర్తలకు, నేకాంతవాసమే కదా విహారమందుఁ బ్రియమగునది. అని సీతాదేవి పక్షమున నర్థము.

కం॥ మానిని! పంకయుతంబు మ, హానక్రవిభీషణము మ,దానేకపసం
స్థానము సరిద్వితానము, కాన నరణ్యంబు దుఃఖకరము లతాంగీ! ౭౯

పంకయుతంబు = బురదతోఁగూడినది, మహానక్రవిభీషణంబు=పెద్ద మొసళ్ళచే భయంకరమయినది, మద=మదించిన,అనేకప=ఏనుఁగుల, సంస్థానము=క్రీడించు నెలవు, సరిద్వితానము=నదుల సమూహము.

తాత్పర్యము

నేను హాయిగా నీళ్ళలో జలక్రీడ లాడెదనంటివి. వానియందేమియుం డునో తెలియునా? కాలు పెట్టితివా బురదలో దిగఁ బడెదవు.అట్లైనస్నానము చేసెదమని నీళ్ళలోనికిఁ బోయినఁ బెద్ద పెద్ద మొసళ్ళు పట్టుకొనవచ్చును. వానిని జూడఁగానే భయమగును. మదించిన యేనుఁగులు నీళ్ళలో దిగి యాఁడు చుండును. ఆడుటకుఁ దటాలునవచ్చును. ఏటిస్నాన మనిన నిన్నిగండములు గలవు.

కం॥ ఓనవలా! కంటకశా,ఖానిచితము తామ్రచూడ,ఖరరణితము ని
ష్పానీయము దుర్గము వని, కాన నరణ్యంబు దుఃఖకరము లతాంగీ!

కంటక శాఖానిచితము=ముండ్లకొమ్మలచేనిండినది, తామ్రచూడ ఖరరణితము=అడవికోళ్ళ కఠినధ్వనులుగలది, నిష్పానీయము=నీళ్లులేనిది, దుర్గము=చొరమార్గములేనిది.

తాత్పర్యము

నీళ్ళలోఁబడిపోకున్న మెట్టమార్గమునఁ బోరాదా చెట్లయందలి పూలు గుమగుమ పరిమళించుచుండునే యందువా ఏను; అడవియను నది యుద్యాన వనముగాదు. ముండ్లకొమ్మలుగల చెట్లచే నిండియుండును.అందు నీకొమ్మలు అల్లిన శిఖ అల్లుకున్నఁ గాళ్ళన్నట్లు తలయెత్తిపోయితివా ఎత్తుకొమ్మలు వెంట్రుకలను బట్టుకొనును నేలకొమ్మలు కాళ్ళకుఁ జుట్టుకొనును. అడవికోళ్ళు చెవులుపగిలిపోవఁబరుషముగాఁ గూయుచుండును. నీళ్ళుండవు. ప్రవేశించుటకు మార్గముండదు.

కం॥ తానుగఁ బడునాకులగుమి, పై నగచాట్లెన్నొ పగలు,పడి నరుఁడునిశన్
మేను పడ వైన వలయును, గాన నరణ్యంబు దుఃఖకరము లతాంగీ!

అగచాట్లు=కష్టములు.

తాత్పర్యము

హాయిగా నెచ్చటనైన రాత్రులందైనఁ బండుకొందమా యనినఁ బగలంతయు నెన్నియో కష్టములుపడి మనమై యాకులు గోయరాదు. కావున వాని యంతట నవియే రాలిన యాకులమీఁద రాత్రులందు దేహమును బడనేయవలయును. కావున వనవాసము దుఃఖకరము. ఆకులు కోయుటయు హింస యనియే శాస్త్రాభిప్రాయము.

కం॥ తానుగ రాలినఫలసం,తానమ్మును రాత్రులన్ దిఁనమ్ముల నియతిన్
దాను దిని ముదముఁ గొనఁదగుఁ,గాన నరణ్యంబు దుఃఖకరము లతాంగీ!

తాత్పర్యము ౮౦౨

చెట్లయందు ఫలములు దండిగానుండును. ఇచ్చవచ్చినట్లు దినవచ్చును గదా యనుకొంటివేమో.

వానప్రస్థాశ్రమమందుండువారును సన్న్యాసులును జీవహింసయగునను కారణముచేఁ జెట్లయందలి పండ్లను గోయక తొడిమ యూడివానంతట నవియే నేలపై పడిన పండ్లను రేయిగాని పగలుగాని తిని వానితో సంతోష పడవలయును. కావున వనవాసము దుఃఖకరము.

శ్లో॥ పుష్పమూల ఫలైర్వాపి, కేవలైర్వర్తయేత్సదా,
కాలపక్వైస్స్వయంశీర్ణైః వైఖానసమతే స్థితాః॥ మను. ౬-౨౧.

వానప్రస్థాశ్రమమందుండువాఁడు చెట్లనుండి తమంతఁబండి తమంత రాలిన పండ్లచేతను, పుష్పములచేతను దానుగానెండిన దుంపలచేతను, నెల్లప్పుడు కాలముపుచ్చవలయును. వైఖానస శబ్దవిషయము అరణ్యకాండమున వ్రాయఁబడును.

చం॥ జడలు ధరింపఁగావలయుఁ జానకి! నారలచీర లెప్పుడున్
విడువక కట్టఁగా వలయుఁ బెండ్లును నోపినయంత వస్త్రులం
దడఁజడి పొందఁగా వలయుఁ నాగత మౌనతిథివ్రజంబు నె
ప్పుడుఁ బరిచర్యఁ దన్పు, విధిఁపూర్వకదైవతపూజ, లొప్పఁగన్. ౮౦౩

తాత్పర్యము

వానప్రస్థులైనవారు జడలు ధరింపవలయును. ఎల్లప్పుడు నారచీరలే కట్టవలయును. శక్తియున్నంతవఱకుఁ బస్తులచే బాధపడవలయును. ఇట్లుండియు వచ్చిన యతిథుల సమూహమును సేవచేఁ దృప్తి పఱుపవలయును. శాస్త్రప్రకారము దేవపూజలు చేయవలయును.

శ్లో॥ జటాశ్చ బిభృయాన్నిత్యం శ్మశ్రులోమ నఖాని చ
ఔపాసనాగ్నిహోత్రంచ, పంచయజ్ఞాన్ సమాచరేత్

వన్యాం త్రైర్వి విధైర్మేధ్యై, శ్శాకమూలఫలై ర్వసేత్
చీరవాసా భవేన్నిత్యం, స్నాత్వా త్రిషవణంశుచిః॥ హరీ

జడలు ధరింపవలయును. మీసములు, వెండ్రుకలు, గోళ్ళు తీసివేయరాదు. ఔపాసనాగ్నిహోత్రపంచయజ్ఞములు చేయవలయును. అడవులందలి పవిత్రశాకములు ఫలములు దిని జీవింపవలెను. ఎప్పుడు నారచీరలే కట్టవలెను. దినమునకు మూఁడుమార్లు స్నానము చేయవలయును.

కం॥ మానవతిః మూఁడుప్రొద్దుల,
దైనందినమును మునుంగఁ●దగు, నేమములన్
బూనఁగ వలయును గావునఁ, గాననవాసంబు దుఃఖ●కరము లతాంగీ!

తాత్పర్యము ౮౦౪

ప్రియురాలా! దిన దిన ముదయము మొదలు సూర్యాస్తమానము లోపల మూఁడుమార్లు స్నానముచేయవలయును. నియమవ్రతములను జరుపవలయును. కావున వనవాసము దుఃఖకరము.

ముప్పూఁటస్నానమునకే త్రిషవణస్నానమనిపేరు. త్రి+సవన=త్రిషవణ.

కం॥ మానితవిధియుక్తంబుగఁ, దానుగఁ బూవుల గడించి●తగ వేదిని శ్ర
ద్ధానతి బలి కిడ వలయుం, గాన నరణ్యంబు దుఃఖ●కరము లతాంగీ!

తాత్పర్యము ౮౦౫

సర్వసమ్మతమైన శాస్త్రరీతిని దానే పూవులను సంపాదించి తెచ్చివేదిని శ్రద్ధతోడి నమస్కారముతో బలికిగానియ్యవలయును. కావున వనవాసము దుఃఖకరము పరులు దెచ్చినపూలు పత్రితోఁబూజచేసిన సగముఫల మవి తెచ్చి యిచ్చినవారికిఁబోవును. శాస్త్రరీతిఁ బూవులు గడించుట యనఁగాఁ దటాలునఁ గోయక వానికిఁ జెప్పవలసిన మంత్రములు చెప్పియావలఁ గోయవలయును.

కం॥ ఏనాఁటికి నేమాత్రం, బోసలినాక్షీ! లభించు●నుదరము నింపన్
దా నంత తృప్తి గొనఁ దగుఁ, గాన నరణ్యంబు దుఃఖ●కరము లతాంగీ!

తాత్పర్యము ౮౦౬

ఏదినమునకు నెంతమాత్రము లభించునో దానితోఁ గడుపునించి తృప్తి పడవలయునుగాని లభింపలేదే యనికాని కొంచెమే లభించెనే యనికాని తలంపరాదు. హెచ్చుగాదొరికిన రేపటికని యెత్తియుంచరాదు. ఇట్టివారికి సద్యఃప్రక్షాలకులని పేరు.

కం॥ మాననియాఁకలి హోరని, మానని గాలియును నిరులు●మా వెఱపు సదా
మానక యుండెడిఁ గానలఁ,గాన నరణ్యంబు దుఃఖ●కరము లతాంగీ!౮౦౭

యమా వెఱపు=మహాభయము, మహాశబ్దభవము మా, ఇరులు=చీఁకటి, ఇది నిత్యబహువచనాంతము. దీనికేకవచనములేదు. కురులు ఇట్టిదే.

తాత్పర్యము

అడవులలోనుండువారి కెల్లప్పుడాఁకలియే. ఒక నాఁడైనఁ గడుపునిండ నాహారము దొరకదు. విడువక హోరని వీచుగాలి, చీఁకటి, ఏరాక్షసుఁడు వచ్చి చంపునో, ఏమృగమువచ్చి వాతవేసికొనునో యని మహాభయము. ఇది విడువక యెప్పుడునుండును. కావున వనవాసము దుఃఖకరము.

కం॥ నానారూపంబులు గల, నానాగిరిఫణులు ఘూని॰నాదముల నర
ణ్యానుల నిచ్చగఁ దిరుగును, గాన నరణ్యంబు దుఃఖ॰కరము లతాంగి!
గిరిఫణులు=కొండపాములు, అరణ్యాళులన్=అడవుల వరుసలయందు.

తాత్పర్యము

అనేకరూపములుగల యనేకములైన కొండపాములు ఘూఘూయని బుసలు కొట్టుచు నిచ్చ వచ్చినట్టు లరణ్యములఁ దిరుగుచుండును. కావున వనవాసము దుఃఖకరము.

కం॥ చాన! నదీవక్రంబు ల,హీనధునీనిలయఫణులు॰నెపు డడ్డం బై
కానఁబడు మార్గములలోఁ, గాన నరణ్యంబు దుఃఖ॰కరము లతాంగి!౧౮
చాన=స్త్రీ, సీత, నదీవక్రంబులు=ఏళ్ళవలె వంకరగా నడచునవి, అహీన ధునీ నిలయఫణులు=పెద్దనదులయందు వాసము చేయుసర్పములు.

తాత్పర్యము

సీతా! నదులవలె వంకరగాఁబోవు పెద్దనదులయందు వాసముచేయు పాములు మనము నడచుచున్నపుడు మనకడ్డముగా నెన్నియో పోవుచుఁ గాన వచ్చును. కావున వనవాసము దుఃఖకరము.

కం॥ జానకి! యీఁగలు దోమలు,గానఁగ భయమిచ్చువృశ్చి॰కంబులు పురుగుల్
మే నెల్ల ముసిరి కఱచును, గాననరణ్యంబు దుఃఖ॰కరము లతాంగి!౧౯

తాత్పర్యము

ఈఁగలు దోమలు చూచిననే భయము గలిగించు తేళ్ళు మండ్రగబ్బలు, పురుగులు దేహముమీఁద మునరికొని కఱచును కావున వనవాసము దుఃఖకరము

కం॥ ఓనెలఁత! ముండ్లచెట్టు ల, నూనం బగు దర్భ జెల్లు॰నోగి వ్రేలెడి శా
ఖానికరము కొన లాడెడిఁ,గాన నరణ్యంబు దుఃఖ॰కరము లతాంగి!౨౦
అనూనము=అధికము, శాఖానికరము=కొమ్మల సమూహముల, కొనలు= కొనలయందు.

తాత్పర్యము

అడవి నందంతయు నెందుచూచినను ముండ్లచెట్లునిండి యుండును, వీనిలోఁ జేరిన దర్భజెల్లు, వ్రేలాడుచున్న కొమ్మల కొనలు కదలుంచుండును. మనము వానికిఁ దొలఁగిపోవుచున్నను గాలికిఁ గదలి మనకు బాధకలిగించును. కావున వనవాసము దుఃఖకరము.

కం॥ కాననవాసుల కెందును, నానాతను కష్టములు న•నంతవ్యథలున్
మానసభీతియుఁ బాయవు, గాన నరణ్యంబు దుఃఖ•కరము లతాంగీ! ౨౧౨

కానన వాసులకు = అరణ్యములందు వాసముచేయువారికి, నానాతను కష్టములు=అనేకవిధములైన దేహకష్టములు, అనంతవ్యథలున్=అంతములేని వెతలు, మానస భీతియు = మనస్సున భయము.

తాత్పర్యము

అడవులందు వసించువారికిఁ బలువిధములైన దేహకష్టములు, మితములేని వెతలు, మనోబాధలు వదలకయుండును. కావున వనవాసము దుఃఖకరము.

కం॥ మానసముఁ గ్రోధలోభ, స్థానముఁ జలుపంగ రాదు•తప మును వగు, నె
ద్దానికి భయపడఁ జెల్లదు, కాన నరణ్యంబు దుఃఖ•కరము లతాంగీ! ౨౧౩

మానసము = మనస్సును, క్రోధలోభస్థానము=కోపమునకు, లోభమునకును స్థానము చేయరాదు.

తాత్పర్యము

మనస్సును గ్రోధమునకు లోభమునకు నునికిపట్టుగఁ జేయరాదు. తపము చేయుట తగును. దేనికిని భయపడరాదు. కావున వనవాసము దుఃఖకరము.

ఆ॥ వలవ దుడుగు మబల•వనవాసగమనంబు,
పడఁగఁ జాల వచటి•యిడుము లెల్ల,
నింతవట్టు చూడ•నెన్ని యో దోషముల్, గాన వచ్చెఁ గాదె • కాన ననిన.

తాత్పర్యము ౨౧౪

కాఁబట్టి నీవు దుర్బల వగుటచే వనవాసదుఃఖము సహింపఁజాలవు గనుకఁ బ్రయాణము మానుకొనుము. ఇప్పుడు నేను జెప్పినవే చూచినను అడవియందెన్నో దోషములు కానవచ్చెనుగదా. నేను జెప్పనివి యింకనెన్నియో యున్నవి.

మీఁదఁ జెప్పినవన్నియు వానప్రస్థధర్మములు. కలియుగమున వానప్రస్థము నిషిద్ధము.

—•{ ౨౯-వ సర్గము. సీత శ్రీరామునితోఁ దా నడవికి వచ్చుటకుఁ గారణములు చెప్పుట. }•—

ఉ॥ రాముఁడు దన్నుఁ దోడ్కొని య•రణ్యతలంబున కేగ నిష్టమున్
లేమి నెఱింగి శోకమున•లేమ ప్రసక్తతరాశ్రుధార యై
యోమహనీయ తేజ ? భవ•దుక్త వనాంతరవాన దుఃఖముల్
నామదిఁ దోఁచె నమ్ముము గు•ణమ్ములె నీ దగు ప్రీతి పెంపునన్. ౨౧౫

ప్రసక్తతరాశ్రుధారయై = కొంచెముగాఁ గారుచున్న కన్నీటి ధారలు గలదై, భవదుక్తవనాంతర వాసదుఃఖముల్ = నీచేఁ జెప్పఁబడిన యడవిలో వాసముచేయుటయందుండు కష్టములు.

తా త్ప ర్య ము

శ్రీరాముఁడు తన్ను నడవులకుఁ బిలుచుకొనిపోవుట కిష్టములేక యడ్డములు చెప్పుచున్నాఁడని తలఁచి కొంచెముగాఁ గన్నీళ్ళు ధారగాఁ గాఱఁగా నాఱిక యేడ్చిన మూర్ఖత్వ మనుపించుకొనునే కాని యుక్తియుక్తముగ నుండదని తలఁచి సమాధానము చెప్పుచున్నది. గొప్ప తేజస్సుగలవాఁడా వనవాసము నందలి దుఃఖములని నీవు చెప్పినవన్నియు నాకు గుణములుగాఁ గనఁబడు చున్నవి. కాని నీవు తలఁచినట్లు దోషములుగాఁ గానవచ్చుటలేదు. అది యేల యందువా నీ ప్రీత్యతిశయముచేత- నామీఁద నీకుఁ బ్రీతియుండెనా యవ న్నియు గుణములే. నీకుఁ బ్రీతిలేదాయెనా యిక్కడి సుఖములని నీవు చెప్పిన వన్నియు నాకుదుఃఖములే.

త్వయి ప్రసన్నే మమకిం గుణేన । త్వయ్యప్రసన్నే మమకిం గుణేన
రక్తే విరక్తేచ వధూవరాణాం । నిరర్థకః కుంకుమపత్త్రభంగః
అనునది యను సంధించునది.

కం॥ మృగశరభసింహవారణ,ఖగసృమరము లెప్పు డేని ♦ కాననిరూపున్
దగ నినుఁ గని మార్మొగ మై, బెగడునఁ బరువెత్తు; వెఱవ♦వే భయ మైనన్.

తా త్ప ర్య ము ౮౧౬

అడవి మృగములు భయంకరములని చెప్పితివి. నీవు చెప్పిన జింకలు శరభములు ఇవన్నియు నెప్పుడు తత్పూర్వము చూడని నీరూపుచూడఁగానే భయపడి ముఖము త్రిప్పుకొని పరువెత్తునుగాని మనమీఁది కెట్లు రాఁగలవు? భయకారణము కలిగినప్పుడు భయపడవాయేమి?

కం॥ గురుజనులయాజ్ఞ చొప్పునఁ, గరుణాత్మక! వచ్చు టొండె♦గానకు నీతోఁ
బొరి నెడఁబాసిన నిప్పుడ, మరణించుట యొండె నొండు♦మార్గము గలదే.

తా త్ప ర్య ము ౮౧౭

ఈ మాటలతో నాకుఁ బనిలేదు, నాకు రెండే త్రోవలు. కరుణాశీలా! పెద్ద వారి యాజ్ఞచొప్పున నీతో నరణ్యమునకు వచ్చెదను. నావెంటరాఁగూడదు. అంటివా నీ యెదుటనే మరణించెదను, ఈ రెండు త్రోవలుగాక నాకు వేఱు త్రోవలేదు. ఈ రెంటిలో నేమి చేయుమనెదవో చెప్పుము.

కం॥ నీకడ నే నుండఁగ సు,శ్లోకా! కన్నెత్తి తేఱి ♦ చూడం గలఁ డా
నాకేశుఁడైన నాదెస? నాకింతయుఁ దెలియదాయె♦నా జితవైరీ? ౮౧౮

తా త్ప ర్య ము

సత్కీర్తిగలవాఁడా? పిల్లలను బూచి యని బెదిరించినట్లు మృగములు మృగములని నన్ను బెదరించెదవే- మృగములమాట యటుండనిమ్ము. నీయొద్ద నేనుండఁగా నింద్రుఁడైన నాప్రక్కకన్నెత్తిచూడఁగలఁడా- ఈమాత్రముకూడ

నాకుఁదెలియదని తలఁచితివా. ఏశత్రువైనను నీచే జితుఁడేకాని నిన్ను గెలుచువాఁడెవఁడు ?

కం॥ పతియెడఁ బాసినసాధ్వియు, క్షితి బ్రదుకం జాల దనుచుఁ•జెప్పరె మీరే
మతి నాకుఁ బార్వ? మిపు డా,హితగతికిని నన్యథాత్వ•మేగతిఁ గలిగెన్?

తాత్పర్యము ౭౧౯

నేను నీ వెంటవచ్చుట యధర్మకార్యమని నీనోరరాలేదు. నన్ను భయపఱచి నానోరనే నేను రానని యనిపింపఁ జూచెదవు.అది కానిపని- ఏలనఁ బతిని విడిచియుండుపతివ్రత బ్రదుకఁ జాలదని మీరే చెప్పితిరి. నన్నుఁ బతివ్రతయంటిరి గదా. అటయిన నేను జీవించియుండరాదను తలంపుతో నన్ను విడిచిపోయెదవా? అటుగాకున్న నా హితమార్గమునకు నేఁడేల వైపరీత్యము వచ్చెను.

ఉ॥ ఇంతియకాక నే జనకు•నింట వసించినయప్డు ప్రాజ్ఞ సి
ద్ధాంతులు చెప్ప వింటి, గహ•నాంతరవాసము గల్గు నా కటం
చంతటిలక్షణజ్ఞులును•నాడిరి మున్న భవిష్యదర్థ, మ
ట్లంతయుఁ దప్పు నెట్లు? వృథ•లా మహనీయులయాడువాక్యముల్ ?

తాత్పర్యము ౭౨౦

నేను వనవాసము చేయవలసియున్నదని యిపుడు నీవు బెదరింపఁబని లేదు. అది నా కీవఱకే తెలియును. నేను దండ్రియింటనుండు కాలమున బుద్ధిమంతుఁడా! కొందఱు సిద్ధాంతులు నా జాతకముఁజూచి నాకు వనవాసము గలదని చెప్పిరి. అట్టి జ్యోతిశ్శాస్త్ర లక్షణములు తెలిసినవారు ఈరాఁగలవిషయములు మున్నేచెప్పిరి. అదియంతయు నెట్లు దప్పును. పూజ్యులాడు వాక్యములు వ్యర్థములగునా ?

కం॥ సాముద్రికశాస్త్రజ్ఞులు, రామా! నే వనులఁ గ్రుమ్మ•రం జనుదు ననం
గా మది నువ్విళులూరుదు, నామెయి నే నెన్నఁడొక్కొ•యరుగుదు ననుచున్.

తాత్పర్యము ౭౨౧

జ్యోతిశ్శాస్త్రజ్ఞులు మాత్రమేకాదు సాముద్రిక శాస్త్రజ్ఞులును నాచేయి చూచి యీమె యడవులలో సంచరింపఁబోవును అని చెప్పఁగానే నెప్పుడడవికిఁ బోదునా యని విశేష మాశగలదాననై యుందును.

శా॥ వారల్ చెప్పిన యట్ల కల్గె గహనా•వాసంబు, నే బ్రాహ్మణా
జ్ఞారీతిం జరియించు టర్హమె కదా•సత్యంబుగా వారివ్యా
హారం బూనియ వెంట వచ్చెదను, లే • దన్యంబు కాలం బిదీ,
ధీరా! యాదుర గాక విప్రులు యథా • ర్థీభూతసద్భాషణుల్. ౭౨౨

తాత్పర్యము

వారు చెప్పినట్లే వనవాసము నాకు లభించెను. బ్రాహ్మణుల యాజ్ఞప్రకారము నేను వర్తించుట తగినదేకదా. నిజముగా వారి మాట యాధారము చేసికొని

నీవెంటవచ్చెదను. మఱియొక విధములేదు. దానికిదే కాలము, ధీరుఁడా! బ్రాహ్మణులు సత్యమాడినవా రగుదురుగాక.

కం॥ అకృతాత్ములైనవారికి, వికటంబులు గాక బహుళ•విపినశ్రమముల్
వికటంబులె మనబోంట్లకు, సుకరంబులు గాక నిజము•చూడుము వీరా!

తాత్పర్యము

అకృతాత్ములు=మనస్సు చక్కఁగా శిక్షింపఁబడనివారు, వికటంబులు = భయము కలిగించునవి, బహుళవిపినశ్రమముల్=అనేకములైన యడవియందలి కష్టములు, సుకరంబులు=సులభముగాఁ జేయఁదగినవి, వీరా=వీరుఁడా- నీవు వీరుఁడవయ్యు నిట్లేల పిఱికి పందవలె భయపడెదవు.

ఉ॥ పిన్నటనాఁట నే జనని•వీట వసింపఁగఁ గన్య నౌచు మున్
సన్నుతశీల యైనయొక•సంయమనీమణి భావిఁ బల్కె నీ
చిన్నది భర్తతోడఁ దమి•సేయు నరణ్యనివాసలీలకున్
బన్నుగఁ దోడికొంచరుగు•భర్తయు నంచని యోహృదీశ్వరా! ౮-౨౪

సంయమినీమణి=తపస్సుచేయు స్త్రీలలో శ్రేష్ఠురాలు, భావి=జరుగఁబోవునది, పిన్నటనాఁటన్=చిన్నవయస్సున, పిన్నటనాఁటనుండి ననుఁబెద్దగఁజూచిన వంశవృద్ధులన్" జై. భా. ౧ అ అని ప్రయోగము.

తాత్పర్యము

చిన్ననాఁట నేను తల్లియింటఁ బెండ్లికాక కన్యగానే యున్నప్పుడు సదాచార సంపన్నయగు నొక తపస్విని భవిష్యత్తు నీప్రకారము చెప్పెను. ఈ చిన్నది భర్తతోడ నరణ్యమునకుఁ బోవ నాశపడును. ఈమెభర్తయుఁ దనతోడఁ గొనిపోవును. అని.

కం॥ ఇచ్చటనే యుత్సుకనై, సచ్చరితా! నిన్ను నెన్ని•సారులొ యెట్లె
ట్లిచ్చమెయి వేఁడ లేదే, మచ్చిక నీతోడ వనుల•మలయఁగ నాథా! ౮-౨౫

ఉత్సుకనై = ఆశగలదాననై.

వారు వీరు చెప్పినారన్నమాట పోనిమ్ము- నేనెంతోయాశపడి యడవులలో సంచారము చేయఁ బోదము రండని యెన్నివారులో ప్రార్థింపలేదా.

కం॥ ఓడక యడవులకును నీ,తోడన చనుదెంచి శౌర్యధుర్యా! నీకున్
వీడక సేవలు సేయఁగ, వేడుక పడియెడి మనంబు•వినవే మనవిన్. ౮-౨౬

ఓడక=భయపడక, మృగములకు రాక్షసులకు వెఱవక, శౌర్యధుర్యా= ఇది విరాధఖరాది సంహారము సూచించును. దీనివలన నవతారకార్య నిర్వహణమందు సీత యుత్కంఠగలదని సూచితము.

తాత్పర్యము

అడవులకు నీతోడవచ్చిన నేదో ధనలాభమువచ్చునని నే నాశపడలేదు. నేను గోరెడు లాభము నీ సేవయే. అది యిచ్చటనున్నపుడు నీవు కార్యాంతరాసక్తుఁడవై యిందు నందుఁ బోవుచుండుటచేతను మంత్రులు మొదలగు పురుషులతో మాట్లాడుచుండుటచేతను- నే నొకమేడయందు నీవొక మేడయందుండుటచేతను- నిర్విఘ్నముగ నీ సేవసేయ నాకు లభించినదికాదు. వనములందున్నప్పు డిట్టి విఘ్నములులేవు. సర్వకాలముల సర్వవిధముల సేవచేయుచుండు పుణ్యము లభించును. నా మనవి నాలకించి యింతమాత్రము నా ప్రార్థన చెల్లింపరాదా (భక్తుఁడుకోరునది యిట్టి యేకాంతసేవయే.)

కం॥ శుద్ధచరిత్రా! కరుణా,బద్ధుని నిను భర్తఁగొలిచి•పావని నగుదున్
　సిద్ధము వేయేటికి నా,బుద్ధిని దైవంబు నాదు•పురుషుఁడ చుమ్మీ. ౮౩౭
　కరుణాబద్ధునిన్=దయచేఁ గట్టఁబడినవానిని, పావనిన్=పవిత్రురాలను.

శ్లో॥ పతిర్హి దేవో నారీణాం, పతిర్బంధుః పతిర్గతిః
　పత్యాసమగతి ర్నాస్తి, దైవతంవా యథాపతిః.

స్త్రీలకుఁ బతియే దైవము. పతియే బంధువు- పతియే గతి- పతితో సమానమైన గతిగాని దైవముగాని లేఁడు.

　వ్రతైర్నోపవాసైశ్చ, ధర్మేణ వివిధేన చ,
　నారీ స్వర్గమవాప్నోతి, ప్రాప్నోతి పతిపూజనాత్.

వ్రతములచే, నుపవాసములచే- నానాధర్మములచే స్త్రీలకు స్వర్గము కలుగదు. పతిపూజలవలననే యది కలుగును.

తాత్పర్యము

నిర్మలచరిత్రా! కరుణచేఁ గట్టఁబడిన నిన్ను భర్తనుగొలిచిన నేను బవిత్రురాలనగుదును. ఇది సత్యము. వేయుమాటలేలగాని నా యభిప్రాయమున దైవమనఁగా నా పురుషుఁడే. ఆయననువిడిచి నాకు వేఱొక దైవములేదు. కావునఁ బ్రతిదినము దైవపూజలేక నే నేదియైన నెట్లు భుజింతును? (కావుననే సీత లంకలో నుపవాసముండినది.)

కం॥ ఈలోకము మా టేటికి, నాలోకమునందు నైన•ననఘాత్మక? నీ
　తో లీలాగతి నుండుట, యే లాభము నెల్లశుభ మిఁ•కేలా మాటల్. ౮౩౮

తాత్పర్యము

రామా! వేయుమాటలేల? ఒక్కటి చెప్పెద వినుము. ఈ లోకమందైనను- ఆ లోకమందైనను నీతో విలాసముగానుండుటయే నాకు సమస్తశుభములు.

కం॥ సతి జనకునిచే ధారా,యుతముగ నెవ్వనికి దత్త•యోగ్యచరిత యా
　సతి కాపతి పరమున నగు, శ్రుతు లిట్టని మొఱలు వెట్టు•సుమతీ వినవే.

ధారాయుతముగన్=జలధారాపూర్వకముగఁజేయు వివాహమే ప్రశస్తమైనదని సూచితము.

పురుషునితోడి సాలోక్యము పతివ్రతయగు భార్యకే కాని తక్కినవారికెవ్వరికిలేదు. ఏల- పురుషుని యాత్మయే భార్య. కావున నా యిరువుర యాత్మలు వేఱుపడవు.

తాత్పర్యము

సుమతీ! తండ్రి తాతలు మొదలగువారిచే నీటిధారతోడ నెవతె యెవనికి దానముచేయఁబడినదో పరలోకమందుఁగూడ నా భార్య యా భర్తదే. ఇట్లని వేదములు మొఱలుపెట్టుచుండలేదా. ఇవన్నియు నీ వెఱుఁగనివి కావు. నీకుఁ దెలియనిది బోధింప నేను యత్నించుటయులేదు. నీ యిప్పటి చర్య శాస్త్రసమ్మతమైనది కాదు. నీయంతఃకరణ మంగీకరించినది కాదని తెలుపుచున్నాను.

శా॥ ఈలా గుండఁ బ్రమాణపద్ధతులు నీ యిల్లాలి, సద్వృత్త, స
చ్ఛీలాత్మం బతిదేవతన్, వినయసుశ్రీయుక్త, నీభక్త, చిం
తాలోలన్, వరసౌఖ్యదుఃఖములఁ దుల్యన్, నాదు ప్రాణేశ! నీ
వేలా తోడ్కొనిపోవ నొల్లవు? హితంబే యిద్ది నీకోటికిన్? ౨౩౦

ఇల్లాలిన్=భార్యను, గృహిణిని- నీ కింటిస్వరూపముగానుండుదానను. నగృహం గృహమిత్యాహుః, గృహిణీ గృహముచ్యతే. ఇల్లిల్లు గాదు. ఇల్లాలే ఇల్లు. నీ వెందున్నను నేనుగూడ నుంటినా నీ వింటియందుండినట్లు సుఖముగా నుండువాఁడ వగుదువు. సద్వృత్తన్=సాధువుల నడవడిగలదానను, నేను చెడు నడవడిగలదాననైనయెడ నీవు నన్నుఁ ద్యజింప వచ్చునుగాని మంచినడవడిగల నన్ను నీవేమని విడనాడెదవు? సచ్ఛీలాత్మన్ = మంచి స్వభావముగల మనస్సుగలదానిని, నా సద్వృత్తము కాలోచితముగ గ్రహించినదికాదు. స్వభావముచేతనే లభించినది. తక్కిన యన్నివిషయంబుల సరిగానుండి నిన్ను నుపేక్షించితినా? నాభర్తయే నాదైవము. నాకు వేఱొండు దైవముతోఁ బనిలేదు అని యున్నదాననే. వినయ సుశ్రీయుక్తన్=అణఁకువయనెడు మంచి సంపదతోఁ గూడినదానను- నేనెన్నఁడు నీ కవిధేయురాలనై వర్తింపలేదు. ఇఁక వర్తించుటయు లేదు. వినయమే నాకు శ్రీ. అది లేకపోయిన నేను నిర్భాగ్యురాలనే, నీభక్త=నీయందు భక్తిగలదానను- ప్రేమతో నీ సేవను నీవలని ఫలము లేనియుఁ గోరకచేయుదానను-నాది నిష్కామప్రేమ. చింతాలోలన్=దీనురాలిని, వరసౌఖ్యదుఃఖములఁ దుల్యన్=మంచిసుఖమందుఁగాని చెడ్డ దుఃఖమందుఁగాని నీకు సమానురాలను నీ దుఃఖమే నాకు దుఃఖము, నీ సుఖమే నాకు సుఖము. నాకు వేఱుగ సుఖములేదు- దుఃఖకరములేదు. నాదు ప్రాణేశ్వరుఁడవు = నా ప్రాణములు నీ స్వాధీనములు కావున నీవు నన్ను విడుచుట నా ప్రాణములతో నీకుఁ బనిలేదనియే కదా యర్థము.

తాత్పర్యము

ప్రబలమైన వేదప్రమాణ మిట్లుండఁగా నీ గృహిణిని మంచి నడవడిగల దానను- స్వభావముగనే సదాచారసంపన్నను- భర్తదప్ప వేఱొకదైవము నెఱుఁగనిదానను, వినయసంపద గలదానను, నీ భక్తురాలను- నిన్ను విడువలేక దీనురాలనై యున్నదానను. సుఖదుఃఖములయందు నీతో సమానురాలను. ఇట్టి నన్ను నాప్రాణేశ్వరుఁడవై యేల తోడుకొనిపోవ నిష్టపడవు? నీవంటివాని కిది తగినకార్యమా?

తే॥ రామ నన్నిందు దుఃఖవా◆రాశిఁ ద్రోచి, కానలకు నీవ పోవంగ◆గడఁగెదేని
యగ్నిచేనైన విషములఁ◆నైన నీళ్ళనైన మేను త్యజింతు స◆త్యంబు సుమ్ము.

తాత్పర్యము ౮౩౧

రామా! నన్నిచ్చట దుఃఖసముద్రములోఁ బడవైచి నీవు కానలకుఁబోవ యత్నించితివా నేనగ్నిలోనైన దుముకుదును. విషములనైనఁ దిందును. నీళ్ళలోనైనఁ బడుదును. నీకుఁ బనికిరాకవిడిచిన యీ దేహము ప్రాణము నాకుమాత్ర మేల? నేనును వదలెదను.

ఇట్టి బలాత్కారమరణము పాపముగాదా ? ఇట్టివారు సూర్యకాంతి లేని యంధతామిస్ర నరకమునఁ గూలుదురని శ్రుతి కలదుగదా యందువేమో. ఇది పతివ్రతల విషయముగాదు. పతివ్రతల దేహము పతిసేవనిమిత్తమే కాని స్వప్ర యోజనార్థముకాదు. భర్తుఁడు పతివ్రత సమానధర్ములు. ఇతరుల సేవకు దానిని వినియోగింపరాదు. సతికి భర్తసేవ కుపయోగపడని దేహముండియు ప్రయోజనము లేదు. కావున నట్టి దేహము వదలవలయును. ఇది పతిభక్తిచేతనేకాని కామ క్రోధములచేఁ గాదు. మఱుజన్మంబుననైన భర్త కుపయోగపడఁగల దేహము కలుగునుగాక యను భావన. కావుననే సీతాదేవి లంకలోఁ దను రామచంద్ర మూర్తి స్వీకరింప నిరాకరించినపుడు-

కం॥ నుతగుణతతులన్ మెచ్చని,పతిచేఁ బేరోలగమునఁ బరిహృతయగునా
సతికిన్ యోగ్యంబగునా, గతిఁజేరెద వహ్నిఁజొచ్చి కాకుత్స్థవరా.

యుద్ధ. ౨౯౮౭

అని చెప్పెను.

పతిమరణానంతరము సతులుచేయు సహగమనము బలాత్కారమరణ ముగాఁజాలదు. దానికి భక్తి కారణము. మగఁడు దుఃఖించిన దుఃఖించునది, యతఁడు సంతోషించిన సంతోషించునది మరణించిన మరణించునది పతివ్రత యనఁబడును.

భర్తరిప్రేతే బ్రహ్మచర్యం తదన్వారోహణం వేతి॥ విష్ణు.

మగఁడు మరణించెనా బ్రహ్మచారిణిగానైన నుండవలె సహగమనమైనఁ జేయవలెను.

పతివియోగమును బతివ్రత సహింపదు. ఇది ప్రోషితభర్తృక విషయము గాదు. భగవత్ప్రీతికై భక్తుఁడు ప్రాణమువిడుచుట యెట్టిదో భర్తనిమిత్తమై స్త్రీ ప్రాణమువిడుచుట యట్టిద. భరతుఁడు శ్రీరామచంద్రమూర్తి పదునైదవ సంవత్సరము మొదటిదినము మరలి రాకుండిన నగ్నిప్రవేశము చేసియుండును గదా. ఇచ్చట భక్తి ప్రధానము కావున దోషములేదు.

కం॥ ఇంతయుఁ దాఁ జెప్పినఁ దన, కాంతారనివాస మతఁడు॰కాదన సీతా
కాంత కనుసేటఁ దోఁగిన, సంతాపముఁ బాపె రామచంద్రుఁడు కూర్మిన్. ౮౩౨

తోఁగినన్ = స్నానముచేయఁగా.

తా త్ప ర్య ము.

ఇన్నివిషయములు దాఁజెప్పినను తన వనవాసమునకు శ్రీరాముఁ డంగీకరింపకుండుటచే సీతాదేవి కన్నీటివఱదచే స్నానముచేయఁగా రామచంద్రుఁడు కూరిమిచే నామె సంతాపము నణఁచెను.

—• ౩౦-వ సర్గము. సీత శ్రీరాము నిష్ఠురంబు లాడుట. •—

ఉ॥ ఊఱడఁ దన్నుఁ బల్కుపురు॰షోత్తముఁ గన్గొని వెండి సీత దాఁ
గాఱడవిం జరించుమతి॰గల్గుట యిట్లను నిండునెయ్యపుం
గోఱడముల్ మనంబు వెఱఁ॰గొట్టుకొనం బరికంపమాన యై
మీఱినకింకఁచే బతి న॰మేయపరాక్రము నట్టె చూచుచున్. ౮౩౩

ఊఱడన్ = సమాధానపడునట్లు, నిండునెయ్యపుం గోఱడముల్ = పూర్ణస్నేహముచేనైన పరుషవాక్యములు, పరికంపమానయై=వణఁకుచున్నదై, కింకచేన్=కోపముచేత, అమేయపరాక్రమున్=కొలఁత చెప్పరాని పరాక్రమముగలవానిని-ఇట్టి శక్తిగలవాఁడయ్యుఁ బిలుచుకొనిపోఁడే యని కోపము. ఇది ప్రణయకోపమే కాని కైక కోపమువంటిదికాదు. ప్రణయకోపము పానకములో మిరియపుఁ బొడివంటిది.

తా త్ప ర్య ము

కార్యభాగము సున్నచేసి శుష్కోపచారములు చెప్పుచున్న పురుషశ్రేష్ఠుఁడగు శ్రీరామునిఁజూచి తాను వనములయందు సంచారముచేయవలెనను మనస్సు గలదగుటచే మెత్తనిమాటలఁ గార్యముకాదని స్నేహభావముచేతనే పరుషవాక్యములను, దన్నువిడిచిపోవునేమో యనుభయముచే గుండెలు తటతట కొట్టుకొనఁగా గడగడ వణఁకుచు మిక్కిలి కోపంబునఁ దనభర్త నమితపరాక్రమవంతుని జెప్పవాల్పక చూచుచు నిట్లనియెను.

తే॥ నాదుజనకుండు మిథిలాధి॰నాథుఁ డిప్పు
డిది వినంగనై చేహఁ దే॰మెంచు నిన్ను
రామ! జామాత పురుషవి॰గ్రహముఁ గొన్న
స్త్రీ యటంచును దలఁపఁడే॰చిత్తమునను. ౮౩౪

రామా! ఇప్పు డిటులు నీవు నన్నుడవికిఁ దోడుకొనిపోక యింటనే విడిచి పోయిన వార్త విదేహనగరరాజు మిథిలదేశాధిపతియగు నాతండ్రి వినెనా నిన్ను నేమని తలంచును. తన యల్లుఁడు స్త్రీ. ఎవతెయో మగవేషమువేసికొనివచ్చి తన పుత్రికను బెండ్లాడికొనిపోయెనని తలఁపఁడా? ఆవశ్యకము తలఁచును. రామ =చూపుగుఱ్ఱమువలె నందముచే నందఱను భ్రమింపఁజేయువాఁడా! నీ యంతస్సారమెఱుఁగక నీసౌందర్యముచూచి యందఱు మోసపోవుచున్నారు.

నాదు=నాయొక్క, నేను నీవలె స్త్రీగర్భమునఁబుట్టినదాననుగాను అయోనిజను- అట్టి నాయొక్క జనకుండు=తండ్రి- పెంపుడుతండ్రియయినను గన్నతండ్రికంటె శ్రేష్ఠుఁడు, భూమిలో దొరికిన పిల్లను రక్షించు భారము తనయందు లేకున్నను గన్నతండ్రివలె రక్షించెను. నీవు అగ్నిసాక్షిగాఁ బెద్దల యెదుట ధర్మేచ అర్థేచ కామేచ నాతిచరామి యని ప్రమాణముచేసి కట్టుకొన్న భార్యను, భర్తయగు నీవు, శాస్త్ర దృష్టిని లోకదృష్టిని భరింపవలసిన నీవు, విడిచిపోయెదననుచున్నావు. నీవంటివాఁడుకాఁడు నా తండ్రి.

నాతండ్రి జనకుఁడు=తండ్రివలె నందఱఁ బోషించును గావునఁ దన నగరవాసులచేతనేకాక జానపదులచేతను జనకుఁడు జనకుఁడని సార్థక బిరుదము నొందినవాఁడు నీవలె నేతిబీరకాయ యన్నట్టు రాముఁడని పేరుపెట్టుకొని కట్టుకొన్న భార్యనే దుఃఖింపఁజేయువాఁడుకాఁడు.

జనకుఁడు=కర్మణైవహిసంసిద్ధి మాస్థితా జనకాదయ యన్నట్టు వైదిక కర్మనిష్ఠుఁడగుటచే భార్యాసహితుఁడై కర్మములన్నియుఁ జేయువాఁడు. నీవు కర్మహీనుఁడవు. వైదికకర్మయందు నీకు శ్రద్ధలేదు. చేయునిచ్ఛయులేదు. కనుక నీకు భార్యతోఁబనిలేదు. మిథిలాధినాథుఁడు=మిథిలానగరాధిపతి- నీవొక్క యాఁడుపిల్లను భరింపలేక యున్నావు. నాతండ్రి మిథిలానగరము పల్లెటూళ్ళతోడ భరించుచున్నాఁడు. వైదేహుఁడు=విదేహుని వంశమునఁ బుట్టినవాఁడు. నీవో సదేహు వంశమునఁ బుట్టినవాఁడవు. కావుననే యాయనయందు జ్ఞానము నీయందుఁ బామరత్వము నెలకొనియున్నది.

ఇప్పుడు = ఈసమయమున, ఇది = నీవు నన్నునింట విడిచిపోవుటను, వినంగ = వినఁగానే, నిన్ను = ఒక్కభార్యను జిన్నపిల్లను భరింపలేని నిన్ను- అకార పుష్టిగల నిన్ను.

ఏ మెంచునో=ఏమని తలఁచును. నిన్నెవరిలోఁజేరినవానిఁగా గణించునో నీకుఁ దెలియునా.

రామ=ఓ ఆఁడుదానా! ఆఁడుదియని యెంచును. స్త్రీలను లెక్కించునప్పుడు నిన్ను వారిలో గణించును. అట్లైన రాముఁడని నన్నుఁ బుంలింగ శబ్దవా

చ్యుని(గాఁ జెప్పుచున్నారుగదా యందువేమో. దానికేమి వనమెుక్కఁడు పులి యెుక్కఁడు బసవఁడని చెప్పుటలేదా. అట్టులే నిన్ను.

జామాత = తన యల్లుఁడు.

పురుషవిగ్రహము గొన్నస్త్రీ = మగవేషము వేసికొనినస్త్రీ- వాస్తవ పురుషత్వము లేదని భావము.

చిత్తమునఁ దలఁపఁడే=ఒకస్త్రీ నాటకములందువలెఁ బురుషవేషము వేసికొని నాపుత్రిని వివాహమాడెనని చెప్పిన సిగ్గులచేటని మనస్సులోనే యెంచుకొనును. ఒకరిదోషము లెంచువాఁడుగాఁడు గనుక మనస్సులోనే యనుకొనును.

ఒక వ్యాఖ్యాత దీని మూలశ్లోకమునకు మఱియొకటి రెండర్థములు వ్రాసెను. గాని యవి ప్రకరణానుసారములుగావు గనుక వదలి పెట్టఁబడెను.

తే॥ అధిప: ఖరకరుఁ డగునర్కు•నందుఁబోలెఁ,
బరమతేజంబు శ్రీరామ•భద్రునందు
లేద యని పల్కు జ్ఞానంబు•లేని లోక,
మన్నృత మది యెట్లుసైరింతు•నక్కటకట. ౨౩॥

ఖరకరుఁడు=తీక్ష్ణకిరణములుగలవాఁడు, అర్కునందుఁబోలెన్=సూర్యుని యందువలెనే, పరమతేజంబు = i మిక్కిలికాంతి, ii మిక్కిలిపరాక్రమము, అనృతము=అదియసత్యము, సైరింతున్=ఓర్చుకొందును.

తాత్పర్యము

(1) తీక్ష్ణ కిరణుఁడైన సూర్యునియందువలెఁ బరమతేజంబు శ్రీరామచంద్రునందు లేదు అని జ్ఞానములేని లోకులుపల్కఁగా నట్టి యన్నృతము నేనెట్లు విని యయ్యో సైరింతును. ఇచ్చట సూర్యుఁడు వ్యతిరేక దృష్టాంతము.

(2) తీక్ష్ణ కిరణుఁడైన సూర్యుని యందువలెఁ బరమతేజము శ్రీరామచంద్రునందులేదా? అనఁగాఁగలదు అని లోకు లసత్యమాడ విని యయ్యో! యెట్లుసైరింతును.

లేద - ఇచట కాకువు.

(3) తెలివిలేని లోకము పరమతేజంబు శ్రీ రామభద్రునందుఁ బోలె ఖరకరుఁడగు నర్కునందులేదు. అని యసత్యము పలుకఁగా వినియును అయ్యో యెట్లు సైరింతును.

వాక్యంబునఁ బూర్వపరనియమంబు కొన్ని శబ్దంబులకుఁ దక్కఁగానరాదు. సు.వ్యా. కారకసూ. ౨౩ అను సూత్రము శరణము.

ఇంతమాట శ్రీరామునందుఁ దానై చెప్పినట్లు చెప్పనొల్లక పాపము నివారింపఁ దానన్నమాట లోకులన్నట్లు సీతాదేవి చెప్పెను.

ఉ॥ ఏమిటికై విషాదము వహించితి వీగతి ? భీతికారణం
బేమి ఘటిల్లె నీకు? ననునేటి కనన్య పరాయణన్ సతిన్
బ్రేమ దొలంగి పాయ మదిఁ బెట్టితి? వొక్కని నిన్నుఁ దక్కఁ నే
నామనమందు నేనియుఁ గనం గులపాంసనివోలె నన్యునిన్. ౭౩౬

తాత్పర్యము

'ప్రళయాగ్నిసముఁడు కోపంబు గదుర' నని పేరొందిన నీవు నన్నుఁ బిలుచుకొని పోవలయుననిన నేమోచేయరాని దుష్కార్యము చేయవలసినట్టు లేద్చెదవేల? నేను భార్యను భర్తవ్యను. నీవు భర్తవు కావునఁ జేయవలసిన కార్యము చేయుటకు నింతదుఃఖమా "వృద్ధౌ చమాతాపితరౌ, సాధ్వీభార్యాసుృత శ్శిశుః । అప్యకార్య శతం కృత్వా, భర్తవ్యా మనురబ్రవీ"త్తని మనువు చెప్ప లేదా. అటని నిన్ను నే నేమైనం జేయరానిపని చేయుమంటినా? "భర్తవ్యారక్ష ణీయాచ పత్నీహి పతినాసదా" భార. ౩. ౬౮. ౪౧. భర్త భార్యను భరింప వలెను. నీవేమి కారణముచే భయపడుచున్నావు (రావణుఁడు నన్నెత్తుకొని పోవు నని నీకు భయమా) నీవు తప్ప వేఱుగతిలేనిదానను. పతివ్రతను గావున వానికి వశపడనని నీ వెఱుఁగవా) నిన్నొక్కనిఁదక్కఁ బంకుటాలివలె నే నితరుని మనసు నందైనఁ దలంపను- నమ్ముము- (రావణువలన నేను జెడుదు నను భయము నీ కక్కఱలేదు.) ఇది వ్యతిరేక దృష్టాంతము.

కం॥ నీవశవర్తిని నగున, న్నో వరనుతశీల! మది సమూహింపుము మున్
సావిత్రి సత్యవంతున, కేవిధ మావిధ మటంచుఁ బృథ్వీశసుతా! ౭౩౭

వశవర్తిని = నీకు స్వాధీనురాలనై వర్తించుదానను.

తాత్పర్యము

నీకు స్వాధీనపడి నీకు మేలగుమార్గమున నడచు నన్ను సత్యవంతునకు సావిత్రి యెట్టిదో నీకు నేనట్టులని యూహింపుము. సత్యవంతునివెంట సావిత్రి యరణ్యమునకుఁ బోవుట యామె సుఖసంతోషములకై కాదు.ఆయనను రక్షించు టకే. అట్టులే నేను నీతోడ నరణ్యమునకు వచ్చుట నీ నిమిత్తమై నీక్షేమమునకై నీ సౌఖ్యమునకై నీ కార్యమందుఁ దోడుపడుటకై. నేను లేక నీవు మాత్రము పోయి చేయు కార్యమేదియని భావము. రావణు నెట్లు నేను లేక చంపఁగలవు సావిత్రిదేవి మరణించినపతిని యమునితోఁ గలహించి మరల బ్రతికించుకొనెను.

శ్లో॥ నచభార్యాసమంకించి, న్నరస్యార్తస్య భేషజమ్ నిత్యంహి సర్వదుఃఖేషు, సత్య మేతద్బ్రవీమితే, నాస్తి భార్యాసమం మిత్రంనరస్యార్తస్య భేషజమ్॥ భార-వనప. (సర్వదుఃఖమందు సర్వదా) ఆర్తుఁడగు వానికి భార్యతో సమాన మగు నౌషధము లేదు. నేను సత్యము చెప్పుచున్నాను. ఆర్తునకు భార్యవంటి మిత్రముగాని మందుగానిలేదు.

కం॥ నీయిల్లాలను గౌమరుం, బ్రాయపుసుందరిని సతిని•మతి నధ్యుషితన్
జాయాజీవుని పోలికి, మాయురె యన్యుల కొసంగ•మదిఁ దలఁచెదనే?

తాత్పర్యము ౭౩౨

నీగృహిణిని. కనుకనే నన్ను విడిచి నీధర్మముచేయఁబోరాదు.అందు లేఁత వయస్సుగలిగి యౌవనారంభ దశయందున్న నందకత్తెను, ముట్లుడిగిన ముసలి దాననుగాను కురూపినిగాను, (ఇప్పటికి సీతకు ౧౮ సంవత్సరములు.)అంతియు కాక పతివ్రతను. నాతండ్రి నన్ను నీకు దానము చేయునపుడు సహధర్మచరి యని చెప్పలేదా? నీతోడ నేను ధర్మము చేయవలసిన దాననే కదా? నీతండ్రి నీకెట్లో నాతండ్రి నాకట్లేగదా. నీవు పితృవాక్య పరిపాలనము చేయఁబూనినట్లు నేను తండ్రి సత్యమును గాపాడుదాననేకదా ? నా స్వధర్మమునకు నీవేల యడ్డము వచ్చెదవు, రాజులు తాము స్వధర్మమందు నిలుచుటయేకాక తక్కిన వారు వారివారి స్వధర్మమందుఁ బ్రవర్తింపఁజేయవలసినదివిధి. బోయవాఁడు కూడఁ దన స్వధర్మమందుఁ దానుండకుండిన నాతండ్రి దండించునని భయ పడుచుండును. నీవో నీకంటియెదురనుండు నన్నే నాస్వధర్మమైన పాతి వ్రత్యమునందు నుండనీయకున్నావు. అధ్యుషితన్=చిరకాలముగ నీయొద్దనే యున్నదానను. కావున నన్ను విడిచిన నాశ్రితత్యాగదోషము వచ్చును. ఇట్టి నన్ను భార్యలను బరుల కప్పగింపఁజూచు నట్టుపవానివలె నౌరా! పరుల కప్ప గింపఁ జూచెదవా.

కం॥ ఏరికి హితముం జలుపఁగ, వారించెదు నన్ను నట్టి•వారికి నీవే
కూరిమి వశ్యుఁడ వగుచున్,దీరత! చరియింపుమీ వి•ధేయుఁడ వగుచున్.

ఓయి! బుద్ధిమంతుఁడా! నీవెవరికి హితముచేయఁగోరి నన్ను నివారించు చున్నవాఁడవో యట్టివారికి నీవే వశపడి దాసుఁడవై ప్రేమతో వర్తింపుము.నేను నీకు దాసురాలినేగాని యితరులెవ్వరికినిగాను. కావున నీకు సమ్మతమేని విధే యుఁడవై యితరుల దాస్యము నీవుచేయుము నీదాస్యము నేను జేసెదను.

నీవెవరి హితముఁగోరి నన్ను వారించుచున్నాఁడవు నాహితముఁగోరియే కదా. అట్లైనఁ బ్రేమతో నాకు విధేయుఁడవై నేను జెప్పినట్లు చేయుము. నాకేది మేలు అది నాకుఁ దెలియునుగాని నీకేమి తెలియును. కావున నామేలు కోరిన వాఁడవైతివా నేను జెప్పినట్లు వినుము.

'భరతుని మ్రోల నవ్వొగడి పల్కకు మెన్నఁడు'నని నీవు భరతుని మేలు గోరిగదా నన్ను వారించుచున్నావు. అట్టి భరతునకు నీవు దాసుఁడవై వర్తింపుము. వానితో నాకేమిపని. నీప్రధానులు నీమంత్రులు లోనగువారు నీకు దాసులు. వారి భార్యలుకూడ నీకు దాసురాండ్రా!

మ॥ నను వెంటం గొనిపోక పోఁదగదు కాం ♦ తారాశికిన్ నీవు కా
నన మైనం, దప మైన, స్వర్గ మయినన్ ♦ నా కెప్డు నీతోడిదే
యనఘా! లోకము, బాట నే నలయఁ జూమ్మా, నిన్ను వెన్నంటి వ
త్తును, నుద్యానవిహారమందువలెఁ గూ♦ర్తుం బ్రీతి నత్యంతమున్. ౮౪౦

తాత్పర్యము

ఈ కారణములచే నడవులకు నన్నువిడిచి నీవు పోవుట మర్యాదగాదు. నీవడవులయందుండినను దపస్సుచేసినను స్వర్గలోకమందుండినను నాకు నదే లోకము. భార్యకుఁ బతిసాలోక్యమనుట యెఱుఁగవా. నీ వొకచోనుండిన నేను వేఱొకచోట నెట్లుండఁగలను? త్రోవనడచుటయందు నేను బడలను జూమ్మీ (నీ సాలోక్యము సాధించు మార్గమందు నే నలయను. శ్రమ మనక జేయవలసిన వన్నియుఁ జేసెదను.) నీ వెన్నువెంట=నీ వెన్ను నీతోడ నెట్లువచ్చునో యట్టులే నేను వచ్చెదను. ఉద్యాన వన విహారమందువలె నే నెంతో సంతోషపడుదును. (ఉద్యాన విహారము దేవతా విమానములందు సంచరించినట్లు మిక్కిలి సంతోషపడుదును.) భర్తవ్యా, రక్షణీయాచ పత్నీహి పతినా సదా. భార. ౩-౬౯-౪౧. భార్యను భర్త యెల్లకాలము భరింపవలెను, రక్షింపవలెను.

భార్యాహి పరమోహ్యర్థః పురుషస్యేహ పఠ్యతే: అసహాయస్య లోకేస్మిన్ లోకయాత్రాసహాయినీ॥ పురుషునకు భార్యయే పరమప్రయోజనము అసహాయుఁడగు వానికి నీ లోకయాత్రయందు సహాయురాలు భార్యయే.

కం॥ నీ వెంట నేను జనునో, వావిరి కుశకాశములును♦బల్లెరుగాయల్
భావింతు జింకచర్మము, కైవడిఁ దూలికలపోల్కిఁ♦గష్టం బేదీ? ౮౪౧

తాత్పర్యము

నీవు మార్గమందు దర్భలు రెల్లు పల్లెరుగాయ లుండుననిచెప్పితివి. అవియన్నియు నేను జింకచర్మములని దూదేకులని తలఁచెదను. అనల నేదీకష్టము? సుఖదుఃఖములు మనోగతములుగాని వస్తుగతములు గావు. కావునఁ బూర్ణానందమనుభవించు నన్ను నవి బాధింపఁజాలవు. కష్టములేక యేకార్యము సాధ్యము ? అట్లని యెవరే కార్యము చాలించినారు? నీకుఁ బల్లేరుగాయలుగానుండునవి నాకు దూదేకులు.

పల్లెరుగాయల్-ఆరాటాదులం బ్రథమేతర దీర్ఘంబునకు హ్రస్వంబు విభాషనగు పల్లేరు - పల్లెరు - నేరేడు - నేరెడు లోనైనవి. సు. వ్యా. సూ. ప్రకి.

కం॥ క్రందుగఁ గాంతారంబుల, యందలిసుడిగాలి ధూళి♦యలమిన యేనిన్
డెందంబున వల్లభ! నును,గందంపుంబొళ్ళభంగి♦గ్రహియింతుఁ జూమీ.

తాత్పర్యము ౮౪౨

అడవియందు హోరని గాలిగొట్టుచుండు నంటివి. అడవియందలి సుడిగాలివ [illegible] దుమ్ము దట్టముగ నాదేహమునందుఁ గ్రమ్ముకొనెనేని నా

మనస్సులో నే నదియే గందపుఁబొడ పూసికొన్నట్లు తలఁతును. నీకది సుడిగాలి దుమ్మగునుగాక. నాకది గంధపుఁబొడి పల్లేరుగాయలు సుడిగాలిధూళి యను భావముగల నీవే కష్టమని తెలిసి సహింతమని సంచరింపఁ బోవుచున్నావే. ఇఁక నవి దూదేకులుగాను గందపుఁ బొడిగాను భావించు నేను సంచరింతు ననుట వింతయా.

కం॥ లేఁబచ్చికపట్టుల నీఁతోఁ బవళింపంగ సుఖము•దొరకొన నేలా
లోఁ బుట్టుఁ గంబళంబుల,పైఁ బండఁగ నాశ? యెక్కు•వలె తత్సుఖముల్?

లేఁబచ్చికపట్టులన్=లేఁత పచ్చికయుండు స్థలములందు, దొరకొనన్ = లభింపఁగా, లోన్ = మనస్సులో, పండఁగన్=పండుకొనన్.

తాత్పర్యము

లేనునుఁ బచ్చిక పట్టులందు నీతోడఁ బండుకొను సుఖము లభించెనేని రత్నకంబళములమీఁదఁ బండుకొను నాశయేల కలుగును. నునుఁ బచ్చికకంటెఁ గంబళి నునుపుగా మెత్తగా నుండునా చల్లగానుండునా.

ఉ॥ ఆకులొ యలములొ పండులొ? నాకుం గొంచెంబొ గొప్పొ•నయముగ నీవే
చేకూర్చి చేతులారఁగఁ, బ్రాకటముగ నిడిన నమృత•పానము సమమౌ.

తాత్పర్యము ౮౪౪

చెట్లయందలి యాకులు పండ్లుగోయరాదని యంటివి సంతోషమే.వానితో నాకేమిపని? ఆకులో యలములో పండ్లోకాయలో కొంచెమో గొప్పో నీవు సంపాదించి సీతా యిది తినుమని ప్రీతితో నాచేతిలోఁబెట్టినఁ దిందును. పెట్టకున్న నూరకుందును. నీవేది పెట్టెదవో నాకదియే యమృతము, ఆహారపదార్థములు సేకరించుట నాపనిగాదు. నీవు తెచ్చిన దానిని భుజింపయోగ్యమగునట్లమర్చుట నాకార్యము. నీవు తినఁగా మిగిలినది నాకమృతము.

చం॥ తలఁపను దల్లినిం, దలఁపఁ • దండ్రి, స్మరింపను దోడఁబుట్టులన్
దలఁపను నిల్లు వాకిలి, యథామతి నీవయి నాదుచేతిలో
వలఁ దమి నుంచు కాయలనొ•పండునొ మెక్కెద, నొక్కకష్టమేన్
గలుగఁగ నీను నీకు, నొక•కాఁతియ గల్గదు నమ్ము రాఘవా. ౮౪౫

తాత్పర్యము

అక్కడనొంటిగానుండవలె నంటివి. నేనుగోరునది యదియే. నేను తల్లిని గాని తండ్రినిగాని తోడఁ బుట్టినవారినిగాని చూడను గోరను. వారిని స్మరింపనైన స్మరింపను? ఇల్లేమయి పోయెనో వాకిలేమయిపోయెనో యని తలఁపను. నీకు సమ్మతమైన ప్రకారము నాచేతిలో నీవై ప్రేమతోఁ గాయలే యుంచెదవో యొక్కపండేయుంచెదవో దానినే నేను దినెదను నీకుభుజింపయోగ్యమైనది నాకుఁగాదా. నేనేవిషయమందును దెలిసి నీకుఁ గష్టముగలుగనీయను. తెలియకయైన నీకు నొకబాధ నావలనఁగలుగదు. నమ్ముము.

కం॥ నీతోడ నున్న స్వర్గము, నీతోడు రహింపకున్న • నిరయం బదియే,
నాతలఁ పిది మది నెఱుఁగుము, యేతెంచెద మాన్పకుండు•మీప్రాణేశా!

తా త్ప ర్య ము ౮౪౬

నీతోడ నెందుందునో యదియే నాకు వైకుంఠము. నీతోడులేక యుండ వలసివచ్చెనా యదియే నాకు నరకము. ఇది నానిశ్చయము. తెలిసికొనుము. కావున నిటనుండి నరకబాధపడలేక నీతోవచ్చి సుఖింపఁగోరెదను. ప్రాణేశ్వరా యడ్డగింపకుము.

కం॥ తగునని తోడ్కొని పోవక, వగఁ గుందఁగ నన్ను నిచటఁ•బాసెద వేనిన్
దెగి విషముఁ గ్రోలుదానను, బగతురచేఁ జిక్కి కష్ట•పడ నోపుదునే?

తా త్ప ర్య ము ౮౪౭

ఇది తగిన కార్యమే. దీనిని బిలుచుకొని పోదమని తలఁచి తోడుకొని పోవక నీవిందే యేడుచుచుండుమని వదలి పోయితివా నేను తెగఁబడి విషము ద్రావెదనుగాని విరోధులచేతిలోఁజిక్కి నేను గష్టపడఁగలనా ?

ఉ॥ ఒంటిమి నన్ను వీడి చన•నోర్చెద వేని వియోగబాధ నీ
వెంటనె వచ్చుఁ బ్రాణములు•విన్ము పరోక్షపుఁజావుకంటె నీ
కంటికిముంద నీచరణ•కంజములం బడి చచ్చు టుత్తమం
బొంటరమింటరంబు లను•నొవ్వనివారలఁ గొల్చుచుందునే? ౮౪౮

ఒంటిమి = ఒంటిరిగా- ఇంటనిండ నూరినిండ మనుష్యు లుండినను నాపాలికిది నిర్మానుష్యమే.

తా త్ప ర్య ము

అటుగాక నన్నువదలి నీవొంటరిగాఁబోవ సహించెదవేని నన్ను విడిచి నీవు బ్రదుకఁ గలవు. గాని నిన్నువిడిచి నేను బ్రతుకలేను. చేఁపను విడిచి నీళ్ళుండఁగలదు. నీళ్ళను విడిచి చేఁపయుండలేదు కాఁబట్టి నాదేహమిందున్నను వియోగబాధచేఁ బ్రాణములు నీతోడఁ దమంతటఁ తామే వచ్చును. కావున నీవెదుట లేనపుడు చచ్చుటకంటె నీపాదకమలములమీఁదఁబడి నీకంటికెదుర మరణించుటే యుత్తమము. కాని పరుషవాక్యములు పలుకు పగవారిని నేను సేవించుచుందునా. ఇక్కడఁ బగవారెవ్వరందువా. నీవియోగమే నాకు శత్రువు.

చం॥ పదియును మూఁడు నొండు నఁట•వర్షము లొక్కట దుఃఖవార్ధిలో
గొదకొని యుండ నేర్తునె? య•కుంఠితరీతిని నొక్క మూర్తమేన్
మది ధృతి నిల్పఁ జాలఁ గను•మాటయినన్ విను నాథ! నీవటం
చదవద రాముఁ గట్టుకొని•హా యనుచుం బలవించె నార్త యై. ౮౪౯

గొదగొని=అతిశయించి, అదవదన్=దుఃఖముతో, పలవించెన్=గొంతెత్తి యేడ్చెను.

తా త్ప ర్య ము

ఓసి పాపాత్ములారా! విషము దిని చచ్చెదననెదేల అది యాత్మహత్యగదా. ఆత్మహత్యచేసికొన్న వారి కంధతామిస్రనరకమనుట యెఱుంగవా ? యనెద వేమో. పదిసంవత్సరాలఁట- పైన మూఁడు సంవత్సరాలఁట. పైన నొక సంవత్సరమఁట. ఓయమ్మ యిన్నియేండ్లు వియోగమువలనఁ గలిగిన దుఃఖమను సముద్రములో బాధపడుచుందునా? అది నాకు సాధ్యమా. వెంటనే ప్రాణము పోవునట్లు విషము తీసికొనుట మేలుగాని యిన్ని సంవత్సరము లింతబాధనెట్లు సహింతును. సహింపలేను. అదేమన నల్పకాలము నీవు కనుమఱుఁగై కానరాక యున్నప్పుడే ప్రాణము నిలుపు ధైర్యములేక యిపుడే బాధపడుచున్నాను. అన్ని సంవత్సరములు నే నెట్లు ప్రాణము నిలుపఁగలను అని దుఃఖాతిశయముచే శ్రీరామునిఁగట్టుకొని హాయని గట్టిగ నేడ్చెను.

తే॥ అరణియదరులు విడుచు న•ట్లామృగాక్షి,కార్చెదీర్ఘనిరుద్ధాశ్రు•కణములపుడు
విసపుఁగోలలు నాటిన•విహ్వలించు, కరణిపోలికఁ బతివచో•ఘాతములను.

అరణి=యజ్ఞమున నగ్నికై చిలుకుకట్టె, అదరులు=మిణుఁగురులు, దీర్ఘనిరుద్ధాశ్రుకణములు=కన్నీరు కార్పరాదేయని ధైర్యముతో దీర్ఘకాలముగ లోపలనే మ్రింగి యణఁచుచుండిన కన్నీటిబిందువులు, విసపుఁగోలల=విషముపూసిన బాణములు, విహ్వలించు=విరవిరఁబోవు, కరిణిపోలికన్=ఆఁడేనుగువలె, పతి = భర్తయొక్క వచోఘాతములన్=మాటలనెడి దెబ్బలచే.

తా త్ప ర్య ము

విషముపూసిన బాణములు నాటిన విరవిరఁ బోవునాఁ డేనుఁగువలెనై సీత భర్తయాడిన మాటలను దెబ్బలచే మథింపఁబడిన హృదయముగలదై చిలికినపుడు యరణివిడుచు నిప్పు మిణుఁగురులవలె నింతకాల మడ్డగించియుంచిన కన్నీళ్ళ బిందువులను విడిచెను.

అరణి=సీత హృదయము, మిణుఁగురులు=సీతకంటినుండి జాఱు వేఁడి నీళ్ళ బిందువులు, వచోఘాతములు=మాటలను దెబ్బలను.

కం॥ తమ్ములనీరమువలెఁ గం,దమ్ములలో నుండి జాఱెఁ • దద్దయుఁ గన్నీ
రమ్ముద్దియకును సంతా,పమ్ముభరమ్మునను గాంతి•స్ఫటికాభం బై. ౧౮

తమ్ములనీరము=తామరయందలి నీళ్ళు, కందమ్ములు=కన్నులను కమలములు, ఆముద్దియకును=సీతకు,సంతాపము భరమ్మునను=దుఃఖాతిశయముచే, స్ఫటికాభంబై =స్ఫటికముతో సమానమై. తెల్లగా.

తాత్పర్యము

తామరపువ్వులనుండి నిర్మలమైన నీరు కాఱునట్లు దుఃఖాతిశయముచే సీత యేడువఁగా నా నీటిచేఁ గాటుకకరఁగిపోయి స్ఫటికమువలెఁ దెల్లనికాంతితో నామె నేత్రకమలములనుండి బాష్పములు కాఱెను.

తే॥ అమ్మహాభాగవిమల చం•ద్రాభ మైన, వదననీరజ మెంతయు•వాడు వాఱె
విడువక స్రవించుకన్నీటి•వేఁడిములకు,
నీటఁ బాపిననెత్తమ్మి•సాటి యగుచు ౨౨౨౧

మహాభాగ=గొప్ప పుణ్యముచేసిన సీతయొక్క, విమలచంద్రాభము= నిర్మలమైన చంద్రునితో సమానము, వదననీరజము=ముఖకమలము,నెత్తమ్మి =అందమైన కమలము, నెఱి+తమ్మి=నెత్తమ్మి.

తాత్పర్యము

శ్రీరాముని వెంటఁబోవు మహాపుణ్యముచేసిన సీతయొక్క నిర్మలమైన చంద్రబింబముతో సమానమైన ముఖకమలము వదలకకాఱుచున్న కన్నీటివేఁడిమిచే నీటినుండి వెలుపలవేయ సూర్యకాంతిచే వాడినకమలములవలె మిక్కిలి వాడిపోయెను.

సీతాదేవి వాక్యములన్నియుఁ బరమభక్తిగలవారి భావమును ఆచారమును దెలుపుచున్నవి. ఇంతటి భక్తి, విరక్తిగలిగి భగవద్విశ్లేషము కొంచెమైనసహింప లేక యది వచ్చునేనియేడ్పు, కన్నీరు, డగ్గుత్తిక కలవారై ప్రాణముపోవునం తటి స్థితికి వచ్చినఁగాని భగవదనుగ్రహము కలుగదు.

ఇవి పరమభక్తునియుఁ నార్తప్రపన్నులయు లక్షణములు, పరమభక్తుఁడు భగవద్వియోగము సైఁపఁడు. ఆర్తప్రపన్నుఁడు శరీరమును సైఁపఁడు.

—• శ్రీరాముఁడు సీత వనంబునకు వచ్చుట కంగీకరించుట. •—

చం॥ పరవశ యైన యట్లు వెత•పాటున నేడ్చుచు నున్న జానకిన్
గరమనురక్తిఁ గ్రుచ్చి తన•కౌఁగిట నూఱడఁ బల్కి, నమ్మికల్
పరఁగఁగఁ జెప్పి, యిట్టు లను•భామిని నీకు వ్యథాకరంబు నై
జరగెడిస్వర్గ మైన నది•సమ్మత మెట్లగు నాకు నిల్వఁగన్? ౨౨౩

పరవశయైనయట్లు=దేహము తన స్వాధీనముతప్పినదానివలె‌_ వెతపాటు నన్=వ్యథపడుటచే, వ్యథాకరము=మనమునకుఁ దాపము కలిగించునది.

తాత్పర్యము

దేహము తన స్వాధీనముతప్పి పడిపోవుదానివలెనై వెతపడుచు నేడ్చుచు నుండు జానకిని మిక్కిలి ప్రేమతోఁగ్రుచ్చి కవుంగిలించుకొని వ్యసనపడకుము. నాతోడఁ బిలుచుకొనిపోదును లెమ్ము అని సమాధానవాక్యములు చెప్పి సత్య ముగాఁ బిలుచుకొనిపోదునని చేతిలోఁ జేయివైచి ప్రమాణముచేసి నమ్మిక

పుట్టించి భామినీ నీ వెంత కోపశీలవే.సీత చిలుకవంటిదే కాని రేఁగిన తేఁచుకుక్క యనుసామెత నిజముచేసితివి,నీ మనస్థితిఁ దెలియఁగోరి రావలదనఁగానే యెన్ని కఠోరవాక్యములాడితివి, నీకు దుఃఖము కలుగుచుండఁగా నాకు స్వర్గము లభించినను నందు నిల్వ నేను సమ్మతింతునా? ఈమాత్రమెఱుఁగ లేవైతివికదా

ఉ॥ ఇంచుకయైన నాకు భయ•మెందును లేదు స్వయంభునట్టు, లో
చంచలనేత్ర! నీమనసు•చంద మెఱుంగమిఁ జేసి, కావఁగా
నంచితశక్తి గల్గియు వ•నాంతరవీథుల నిన్ను, నేను దో
డ్కొంచుఁ జనంగ నడ్డములు•కొన్ని వచించితి సైఁపు మాత్మలోన్. ౨౨॥

ఇంచుక=కొంచెము, స్వయంభునట్లు=బ్రహ్మవలె, సర్వజీవులకు నాయువు భాగ్యము మొదలైనవి కల్పించువాఁడును దీసివేయువాఁడును గదా చతుర్ముఖుఁడు, అట్టివాని కెవరివలన నెట్లు భయములేదో యని తీర్థీయము.

(౨) స్వయంభునట్టులు=నారాయణునకువలె, ఆయనకుఁ గదా యెవరి వలనను భీతిలేనిది. బ్రహ్మకువలెననుట యుక్తముగాదు. బ్రహ్మకు మధుకైటభులచే నొకప్పుడు భీతికలిగెను. శివునిచే శిరస్సు నఱకఁబడెను.

చంచలనేత్ర=చలించు కన్నులుగలదానా, చంచలనేత్ర, నీ కన్నులవలె నీ మనస్సుకూడఁ జంచలముగా నుండునేమోయని తలంచితినని సూచన.

కావఁగాన్=రక్షింపఁగా, సైఁపుము=క్షమింపుము.

తాత్పర్యము

సీతా! నేను నిన్ను నడవులందుఁ గాపాడలేక భయపడి నీవు రావలదని చెప్పలేదు. బ్రహ్మమువలె నాకెవరివలనను భయములేదు. ఆ బ్రహ్మము నేనే కదా. భయము వదలుము. నీ కన్నులు చూడఁగానే నీ వెంత భయపడినది, నీ గుండె యెంత చెదిరినది తెలియవచ్చుచున్నది నీ వుపచారమునకే చెప్పుచున్నావో పరమార్థబుద్ధితోఁ జెప్పుచున్నావో నీ మనస్సు విధము నాకుఁ దెలియక నీ కన్నులవలె నీ మనస్సు చంచలమని తలఁచితిని. అది తెలిసికొనఁగోరి యడవులయందు నిన్ను రక్షింప శక్తి కావలసినంతగలిగియు నీ విరహము నోర్వ శక్తిలేకున్నను, ఎందును భయము లేకున్నను నిన్నుఁ బిలుచుకొని పోవుటకుఁ గొన్ని యడ్డమాటలు చెప్పితిని. క్షమింపుము. కోపగింపకుము.

కం॥ నాతో నరణ్యవాసముఁ, బ్రీతిం జేయుటకె నిన్ను•విధి సృష్టించెన్
బాతునె నిను నాత్మజ్ఞుఁడు, ఖ్యాతివలెన్, నీకు నేల•కళవళపడఁగన్. ౨౩॥

విధి=బ్రహ్మ, సృష్టించెన్=ఇది లోకమువారి మాటఁబట్టి చెప్పినది. సీతారాములు బ్రహ్మసృష్టికి లోపడినవారుకారు. అవతారరహస్యము మఱవలేదని యామెకుమాత్రము సూచించుటకై యితరుల కా రహస్యము బోధపడకుండుటకై యట్లుచెప్పెను. ఆత్మజ్ఞుఁడు=ఆత్మజ్ఞానముగలవాఁడు, ఖ్యాతి=కీర్తి, కళవళపడఁ

గన్=మనస్సు కలవరపాటుచెందఁగానేల, పర్వతమందు లక్ష్మీనారాయణులు బ్రహ్మాదిదేవతలు రావణవధార్థమై శరణుచేయఁగా వారి కభయమిచ్చి రావణ వధార్థమై శ్రీరామావతారంబునఁ దాము చేయవలసిన కృత్యము లాలోచించియే యా నియమమనుసరించి యవతరించిరి, ఆ రహస్యము సూచించుటకే, విధిసృష్టించెన్=నీవు పుట్టినదే వనవాసముకన్నప్పుడు నీ వీ యవతారమునఁ జేయ సంకల్పించిన నియమము స్మరింపుమనిభావము.

తాత్పర్యము

ప్రాణేశ్వరీ! నాతోడ నీవు వనవాసముచేయుటకే బ్రహ్మదేవుఁడు నిన్ను సృష్టించెను. ఆత్మజ్ఞానముగలవాఁ డెన్ని కష్టములువచ్చినను శాంతము నెడఁబాయనట్లు నిన్ను నెడఁబాయఁ గలుగుదునా. నీవేల నవ్వులమాటలకు విచారపడెదవు?

మ॥ కరినాసోరు! మహాత్ము లీకరణి ముం॥గ్గావించి యున్నారు, దాఁ
దరుణిం దోడ్కొని కాన కేగుటయు స॥ద్ధర్మంబ, తద్ధర్మమౌ
సరణి న్నేను జరించువాఁడ, జలజా॥స్యా! రమ్ము నా వెంట భా
స్కరుని న్వెన్కొనునాసువర్చలగతిన్॥సంతోష మేపారఁగన్. ౮౨౮

కరినాస+ఊరు=ఏనుఁగు తొండము వంటి తొడలుగలదానా, మహాత్ములు =గొప్పమనస్సుగలవారు, సద్ధర్మము=ఉత్తమధర్మము, తద్ధర్మమౌసరణిన్=ఆ ధర్మమున కనుకూలవిధమున, జలజాస్యా=కమలమువంటి ముఖముకలదానా అనుటచే దుఃఖము విడిచి ముఖము ప్రసన్నమాయెనని సూచన, భాస్కరుని= సూర్యుని, సువర్చల.

తాత్పర్యము

నేను నిన్ను నడవికిఁ బిలుచుకొనిపోవుట శిష్టాచారమే కాని నీమీఁది మోహముచేఁజేయు కార్యముగాదు, పూర్వము గృహస్థధర్మమందుండి గొప్ప వారు తా మరణ్యమునకుఁ బోవునపుడు తమ భార్యలను దమ వెంటఁ బిలుచు కొని పోయియున్నారు. కావున భార్య చిన్నవయస్సుదైనను తరుణియైనను దనతోడఁ దోడుకొనిపోవుట యుత్తమధర్మమే. ఆ ధర్మమార్గమందే నేను సంచ రించెదను జలజాస్యా! సూర్యునివెంట నాయన భార్య సువర్చల వచ్చినట్లు నీవును నావెంట సంతోషముతో రమ్ము.

-॥శ్రీరాముఁడు సీతతో నరునకుఁ బితృపూజ యవశ్యకర్తవ్య మని చెప్పుట॥-

ఉ॥ పో నన రాదు నాకుఁ బువుఁ॥బోఁడీ! వనాంతరసీమ, కిప్పుడా
మానిని కార్యుచేసిన ప్ర॥మాణము లీడ్చెడి నన్నుఁ గానకున్
జానకి! తల్లిదండ్రులవ॥చస్స్థితి నిల్పి చరించు టెంతయున్
మానఁగ రానిధర్మ,మది॥మాని మనంగ సహింతు నేగతిన్. ౮౨౯

ఆర్యుచేసిన ప్రమాణము=తండ్రి చేసిన ప్రమాణము ఆర్యుఁడు చేసిన ప్రమాణము అనుదానిని సమానముగ వ్రాయుచో ప్రథమకు షష్ఠియగు- 'భీష్ము కొంపోయినదాని'కని తిక్కన-ఆమానినికి=కైకకు, మనంగన్=జీవింపఁగా.

తాత్పర్యము

నీవేల యడవికిఁ బోయెదవని సీతాదేవి యడిగినదికాదు. కాకున్నను లక్ష్మణునకువలె నామె మనస్సులో నేమైన సందేహముండునేమో యని దానిని వారింపఁ గారణము తానే చెప్పుచున్నాఁడు.

(౨) తల్లి దండ్రులు ప్రత్యక్ష దేవత లని కైకేయీ దశరథులయెదుట ముఖప్రీతికై చెప్పినమాటకాదు. హృద్గత వాస్తవార్థ మదియేయని తెలుపుటకై యిచ్చట మరలఁ దెలుపుచున్నాఁడు.

నావలన నీకుఁ గౌసల్యకు లక్ష్మణునకు మిగుల వ్యసనముఃకలుగుట నే నెఱుఁగుదును, పరులు దుఃఖించుకార్య మేలచేసెదవనెదవా? ఏమిచేయుదును. అడవికి నిప్పుడు పోను అని నేను జెప్పరాదు. ఏల చెప్పరాదందువా? మాతండ్రి కైకకుఁజేసిన ప్రమాణములు నన్నునడవికి నీడ్చుకొనిపోవుచున్నవి. నిలుప శక్యముగాదు. నిలిచితినా-మాతండ్రి సత్యవ్రతము నేను నాశముచేసినవాఁడ నగుదును అదియునుగాక పుత్రులకుఁ దల్లిదండ్రుల మాటప్రకారము వర్తిం చుట మానరానిధర్మము. దాని కపవాదములేదు. కావునఁ బుత్రునకుఁదగిన ధర్మమార్గమునువదలి నే నెట్లు జీవింపఁగలను. ఇందుంటినా నాప్రాణము పోవును?

కం॥ స్వాధీనదేవతల బింబాధర! తనతల్లిఁ దండ్రి•నాచార్యనరున్
దా ధిక్కరించి నరుఁడ, స్వాధీనపుదైవ మెట్లు•చనుఁ బూజింపన్? ౨౫౨

బింబాధర=దొండపండువంటి పెదవిగలదానా, అధరశబ్దమంగాదులలోఁ జేరమిచే జీప్పురాదు గానబింబాధరి యనరాదు. ఇట్టులే పద్మనేత్రియనుటయుఁ దప్పు. నాసికా, ఉదర, ఓష్ఠ, జంఘా, దంత, వర్ణ, శృంగ, అంగ, గాత్ర,కంఠ పృచ్ఛయివియంగాదులు. వీని కుభయ రూపములు గలవు. నరుఁడు=ఈజాతి వాఁ డాజాతివాఁడనక యీ వయస్సువాఁడావయస్సువాఁడనక మనుష్యస్వరూ పముగల యెవ్వఁడైనను. నరుఁడని యేకవచనమునఁ జెప్పుటచేఁ బ్రతిమనుష్యు నకిది యనివార్యకార్యమని భావము.

అస్వాధీనపుదైవము=అర్చకుని స్వాధీనమునలేని దైవము, ఒండు=ఇది కాదని మఱియొకటి.

నరుఁడని పుంలింగమును బ్రయోగించుటచే వివాహితలైన స్త్రీలకు వీని కంటె భర్తృసేవయే శ్రేయస్కరమని యేర్పడుచున్నది.

తాత్పర్యము

తలిదండ్రులమాట మీఱిన నేమి-ఇంటనే యుండి దేవతాచర్చనాదులు చేయుచుండిన నాపాపముపోదాయందువేమో. పూజించువాని కెదుటనుండి యుక్తాయుక్తములుబోధించి, యతని యిష్టప్రకారముండెడి దేవతలు తల్లిదండ్రులు, ఆచార్యుఁడు, ఇట్లు తన స్వాధీనమందుండు దేవతలను దిర స్కరించి నరుఁడు కనులకుఁ గానరాక, తన స్వాధీనమందు లేక యుండుదైవ మును బూజించుటెట్లు? ఎవరివలనఁ బ్రత్యక్షముగా మనము ఫలమనుభవించు చున్నామో వారియందే భక్తి లేకున్నఁ దనయధీనమునలేని యప్రత్యక్ష దేవ తలయందు భక్తి యెట్లుకుదురును. పూజ యెట్లుచేయును. కావునఁ బరోక్షదేవ తలఁ బూజించినను బూజింపకుండినను బ్రత్యక్షదేవతలఁ బూజింపకయుండ రాదు. ఈవిధముగా సాకారధ్యానము అర్చాపూజయే ప్రశస్తమని యనివార్య మని శ్రీరాముఁడు సూచించెను.

కం॥ ఆముష్మిరఁ గొలిచిన నరుఁ డామూఁడుజగంబులైననగు సాధింపన్
వాసూక్షి! తత్సమానం, బౌమహితపవిత్ర మొండుఁ నలవడ దవనిన్.౨౭॥

అముష్మిరను=తల్లిని దండ్రిని అచార్యుని, పవిత్రము=మనుష్యులను బావనముచేయునది, 'పవిర్వజ్రే మహాభయ'మ్మని యుండుటచే పవియనఁగా సంసారభయము దానినుండి రక్షించునది పవిత్రము. 'నహిజ్ఞానేన సదృశం పవిత్రమిహవిద్యతే'॥భ.గీ. యని కలదుగదాయనిన పవిత్రులఁజేయు యోగము లందది శ్రేష్ఠమనియు దానికంటె నిది సుకరము సర్వసామాన్యము, అధికారా పేక్షలేనిది కావున నిదియేశ్రేష్ఠమని యూహించునది. అలవడదు=లభింపదు.

తాత్పర్యము

తల్లిని దండ్రికిని నాచార్యుని సేవచేయు మనుష్యుడు స్వర్గమర్త్యపాతా ళంబులను నా మూఁడు జగంబులనైనను సాధింపఁగలఁడు. అట్టి పితృసేవతో సమానమయినదై, మిగులఁ బవిత్రవంతునిఁ జేయునది, సంసారభయము మాపునది, యిది కాదని మఱియొకటి భూమియందులేదు.

శ్లో॥ తయో ర్నిత్యం ప్రియం కుర్యా,దాచార్యస్యచ సర్వదా
తేష్వేవ త్రిషు తుష్టేషు,తప స్సర్వం సమాప్యతే॥

తల్లిదండ్రులకు నాచార్యునకు నెల్లవేళఁ బ్రీతిగలుగ వర్తింపవలయును వారు ముగ్గురు సంతోషించిరా సమస్తతపములు సమాప్తమునొందును. ఆవల వాఁడే తపస్సుచేయఁ బనిలేదు.

శ్లో॥ తేషాం త్రయాణాం శుశ్రూషా, పరమం తపఉచ్యతే
నతై రభ్యనుజ్ఞాతో,ధర్మ మన్యం సమాచరేత్॥

తల్లిదండ్రుల యాచార్యుల శుశ్రూషయే పరమతపమని చెప్పఁబడు చున్నది. వారి యాజ్ఞలేక పురుషుఁ డితర ధర్మమేదియుఁ జేయరాదు.

శ్లో॥ త ఏవ హి త్రయో లోకా, ఏవ త్రయ ఆశ్రమాః
త ఏవ హి త్రయో వేదా, స్తఏవోక్తా స్త్రయోగ్నయః॥

ఆ ముువ్వురు త్రిలోకప్రాప్తికి హేతువులు. వారే మూఁడాశ్రమములు. వారే మూఁడు వేదములు. వారే మూఁడగ్నులు. అనఁగా నా ముగ్గురశుశ్రూష చేయువారికి మూఁడాశ్రమములందుండి మూఁడు వేదములు చదివి మూఁడ గ్నులఁ గొలిచిన ఫలమబ్బును.

పితాప్యై గార్హపత్యోగ్ని, ర్మాతాగ్ని ర్దక్షిణ స్స్మృతః
గురు రాహవనీయ స్తు,నాగ్ని త్రేతా గరీయసీ॥

తండ్రి గార్హపత్యాగ్ని, తల్లి దక్షిణాగ్ని, గురువాహవనీయాగ్ని, ఈ మాతాపితృ గురురూపమైన యగ్ని మిగుల శ్రేష్ఠమైనది. అనఁగా నాయగ్నులఁ గొలుచుటకంటె నీయగ్నులఁ గొలిచిన నెక్కువ ఫలముగలదు.

త్రి ష్వప్రమాద్య న్నే తేషు,త్రీన్ లోకాన్ విజయేద్గృహీ
దీప్యమానః స్వవపుషా, దేవవ ద్దివి మోదతే॥

ఈ ముువ్వురిసేవయందుఁ బొరపడని బ్రహ్మచారి గృహస్థుఁడు మూఁడు లోకములను జయించును. మఱియు దివ్యశరీరముగలవాఁడై దేవతలవలె స్వర్గమునఁ బ్రకాశించుచుండును. ౧౬౨౫౪ పద్యము చూడుము.

మాతా పితృ గురూణాంచ, కార్య మేవాను శాసనమ్
హితం వాప్యహితం వాపిన, విచార్యం నర్ష భ.

తల్లి తండ్రి గురు వాజ్ఞాపించినదానిని హితమా యహితమా యను విచారములేక చేయవలయును.

నాస్తి మాతృసమం దైవం, నాస్తి పిత్రా సమో గురుః
తల్లితో సమానమైన దైవములేఁడు. తండ్రితో సముఁడైన గురువు లేఁడు.

కం॥ దానము మానము సత్య మ,నూనసుదక్షిణము జన్న•మోజానికిఁ? యే
మానవున కైనఁ బిత్రుసే,వానియతిఫలం బొసంగ•వశమె పరమునస్?

మీఁదఁజెప్పిన మాతా పిత్రాచార్యసేవ శ్రేష్ఠమనుట నహినిందా న్యాయముచేఁ గాదనియు నది వాస్తవార్థమనియుఁ దెలుపుచున్నాఁడు.

జన్నము=యజ్ఞము, నహినిందా న్యాయమనఁగా, నొకదానిని స్తుతించుట మఱియొకదానిని దూషించు తలఁపుచేఁగాదు చెప్పఁదలఁచినదానిని విశేషించి చెప్పుటయే యుద్దేశము.

తాత్పర్యము

'తస్మాద్దానం పరమం వదంతి' యని శ్రుతియందుఁ గొనియాడఁబడిన దానముగాని, మానముగాని, యింత యేల యన్నిధర్మములు సత్యమందుఁ బ్రతిష్ఠితములని చెప్పఁబడిన సత్యముగాని, కొఱఁతలేని దక్షిణలతోఁ జేయఁ

బడిన యజ్ఞముగాని, యే మనుష్యునకైనఁ బితృసేవచేయునియమ మిచ్చు ఫలమును బరలోకమున నీయఁజాలదు.

కం॥ సురలోకమొ ధాన్యమొ ని,
ర్భరసుఖమో ధనమొ సుతులొ◆భాగ్యమొచదువో
గురుశుశ్రూషాబలమునఁ, దరుణీ! దుస్సాధ మగుప◆దార్థము గలదే? ౨౬౧

తాత్పర్యము

స్వర్గమో, ధాన్యమో అధిక సుఖమో ధనమొ, సుతులో, భాగ్యమోచదువో వీనిలో నేదైనను గురువుల సేవలవలనఁగలుగు బలమున సాధింపఁ గష్టమైనది కలదా, లేదు.

కం॥ మాతాపితృ సుపరాయణు, లై తనరుమహాసుఖావు◆లశ్రమమున గో
పైతామహసురగంధ, ర్వాతతలోకములు గన స◆మర్థులు చెలువా! ౨౬౨

తాత్పర్యము

మాతపితృ సుపరాయణులు, తల్లిదండ్రులే పరమగతియని సేవించువారు. (పాణిని ౬-౩-౩౨) అశ్రమమున=శ్రమములేక సుఖముగా, గోలోకము గాని, బ్రహ్మలోకముగాని, దేవలోకముగాని, గంధర్వలోకముగాని, విస్తారములైన యితరలోకములుగాని, బొందుటకు శక్తిగలవారై యుందురు.

కం॥ నాతండ్రి సత్యధర్మో, పేతమనస్కుండు చెప్పె◆నెది యది సలుపన్
జేతమునఁ దలఁచినాఁడ, సనాతనధర్మైక పథము◆నవలా! యిదియే.

సత్యధర్మోపేతమనస్కుండు = సత్యరూపకమైన ధర్మముతోఁగూడిన మనస్సు గలవాఁడు, సనాతన ధర్మైకపథము = ముఖ్యమైన సనాతనధర్మ మార్గము, నవలా=స్త్రీ, ఇచట సంబోధనము. దీనికి హ్రస్వాంతరూపము ప్రయోగంబులఁ గలదు.

తాత్పర్యము

సత్యమును ధర్మముతోఁగూడిన మనస్సుగల మా తండ్రి యెదిచెప్పెనో యావనవాసముచేయ నామనస్సున నిశ్చయించుకొన్నాఁడను. ఇది ముఖ్యమైన సనాతనధర్మము.

కం॥ నీమత మెఱుంగఁ జాలమి, నామెయి వలదంటి, నిశ్చ◆యంబుగను వనీ
భూమి కరుదెంతు నంటివి, శ్యామా! ని న్నెట్లు విడిచి◆చన శక్తుండన్. ౨౬౪

తాత్పర్యము

నీ యభిప్రాయము దెలియని కారణముచే ముందు నేను జెప్పిన విధముగా నాతోడ రావలదంటిని. అట్లుగాదు, నిశ్చయముగా నే నడవికి వచ్చెదనని నీ దృఢాభిప్రాయముఁ దెలిపితివి. అట్టి యభిప్రాయము నీకుండెనేని నిన్ను విడిచి నే నెట్లు బోవఁగలవాఁడను, నీవు రానకదువేమో, నేనే పోదమని చూచితిని. శ్యామా యౌవనమధ్యస్థా యని శ్యామయనఁగా నడిమివయస్సు స్త్రీయైనను, సీతకిప్పటికి ౧౮ సంవత్సరములే గనుక బాల్యము పోయి

పోక యౌవనమువచ్చిరాక యున్నది. కావున సామాన్య స్త్రీ వా చ క ము గా నే యిచ్చట గ్రహింపవలయును.

కం॥ అనవద్యగాత్ర! నిన్నున్, వనవాసము చేయుకొఱకె • బ్రహ్మ సృజించెన్
వనజాక్షి! దీనికినై, వనరెద వేమిటికి రమ్ము • పయనింపు మిఁకన్. ౮౬౫

అనవద్యగాత్ర=దోషరహితమైన దేహముగలదానా, వనజాక్షి=కమలము వంటి కన్నులుగలదానా. వనమందుఁ బుట్టినదానివంటి కన్నులుగల నీవు వనమును జూడఁగోరుట న్యాయ్యమే. వనరెదవు=దుఃఖించెదవు, పయనింపుము=ప్రయాణముచేయుము. తా త్ప ర్య ము

ఏ దోషముండిన వనవాసకష్టము లభించునో యట్టిదోషము నీయందు లేదు. అయినను వనవాసము చేయుకొఱకే నీవు పుట్టితివి. ఇది కర్మవశమున వచ్చినదిగాదు. స్వేచ్ఛాలబ్ధము కావున దీనికై యేల దుఃఖించెదవు, పోదము. రమ్ము. ప్రయాణము సేయుము.

ఉ॥ లెమ్ము మనంబునందుఁ బని • లే దిఁక సందియ మూన నీకు లే
శమ్మరుదెమ్ము, ధర్మసహ • చారిణి వై వెనువెంట నీదువం
శమ్మునకున్ మదన్వయయ • శంబునకుం గడుయోగ్య మైనశీ
లమ్మును నిశ్చయించితివి • శ్లాఘ్యము కా కిది యేమి దోసమే? ౮౬౬

లెమ్ము=ఇది సీత శ్రీరాముని పాదములు పట్టుకొనియున్నదని సూచించుచున్నది, పనిలేదు=అవశ్యకములేదు, సందియము=సందేహము, ఊనన్=పొందన్, లేశమ్ము=కొంచెమైనను, ధర్మసహచారిణివై=ధర్మమునందుకూడఁ జరించి తోడుపడుదానవు. ఇట్లనుటచే నేను జేయఁబోవు రావణవధాదికార్యమందు నీ సాహాయ్యము కావలసియున్నదని భావము, మదన్వయ యశంబునకున్=మా వంశకీర్తికి, శీలమును=సదాచారమును, శ్లాఘ్యము=పొగడఁబడఁదగినదే.

తా త్ప ర్య ము

ఇఁక నీ విట్లుండవలసిన పనిలేదు. లేలెమ్ము. కొంచెమైన సందేహింపకుము. నావెంబడి సహధర్మచారిణివై నేను జేయు ధర్మమందుఁ దోడై రమ్ము, నీ వంశమునకు నావంశ కీర్తికిఁ దగినట్లు నీవు నిశ్చయించుకొంటివి. ఇది శ్లాఘింపఁదగినదే కాని యిది యేమి దోషమా.

— • శ్రీరాముఁడు సీతను దానము సేయ నియోగించుట • —

శా॥ ఆరంభింపు మరణ్యయాత్రకును యో • గ్యంబైన కార్యంబులన్,
దూరీభూతపరస్పరంబు నమృతాం • ధో లోకమున్ నే మదిం
గోరన్, విప్రులకున్ ధనంబు లిడు, భి • క్షువ్రాతము న్నిస్తులా
హారప్రీతముఁ జేయు, సిద్ధపడు జా • యా! యింక జాగేటికిన్. ౮౬౭

దూరీభూతపరస్పరంబు=మనలో నొకరి నొకరు నెడఁబాసి దూరముగ నుండఁజేయునది, అమృతాంధోలోకము=అమృతమాహారముగాఁగల దేవతల లోకము, స్వర్గము, భిక్షువ్రాతము=బిచ్చగాండ్ర సమూహము, ఇచ్చట భిక్షుశబ్ద మునకు సన్న్యాసి యని యర్థముగాదు. బౌద్ధమతముతో మనదేశమున సన్న్యాసులు వెల్లివిరిసినారు. అంతకుముందు యోగ్యతగలవాఁడెవఁడోవాఁడే కోటికొక్కఁడు సన్న్యాసము గ్రహించు బ్రాహ్మణుఁడుండెను. ఇప్పుడది శిశ్నో దర పరాయణులకు నిరపాయము నిశ్చయమునైన జీవనోపాయమైనది. నిస్తులా హారప్రీతము=అసమానమైన యాహారముచే సంతోషపెట్టఁబడినది, జాయా= ఇల్లాలా, జాగు=ఆలస్యము.

తా త్ప ర్య ము

జాయా! యిఁక నరణ్యయాత్రకు యోగ్యమైన కార్యములేవో యవి చేయుము, మనలో మన మొకరినొకరు విడిచియుండవలసివచ్చినా యట్టి వియోగముచే నాకు స్వర్గము లభించిన నే నంగీకరింపను. బ్రాహ్మణులకు ధనమిమ్ము బిచ్చగాండ్రకు నన్నము కడుపులు నిండఁబెట్టుము. ప్రయాణము నకు సిద్ధపడుము. ఇఁక నాలస్య మేలచేసెదవు.

తే॥ బ్రాహ్మణానంతరమున వ•స్త్రములు నగలుఁ
 బాన్పులును వాహనంబులుఁ•బైఁడిబొమలు
 వేడ్కవస్తువు లన్నియుఁ•వెలఁది నావి
 పరమమతి నిమ్ము యనుజీవి•వర్గములకు.   ౮౬౮

తా త్ప ర్య ము

"నేను కట్టువస్త్రముతో మీవెంటవచ్చుటకు సిద్ధపడియేయున్నాను. నా యాలస్యములేదు. నేను జేయవలసిన దేమైననుండినఁ జేసెదను అని చెప్పిన సీతకు శ్రీరాముఁ డిట్లు చెప్పుచున్నాఁడు.

బ్రాహ్మణులకు ధనము లిచ్చినతరువాత వస్త్రములు, ఆభరణములు, పాన్పులు, వాహనములు, బంగారుబొమ్మలు ఇంకను నా వినోదపదార్థములు నన్నియు నిండుమనస్సుతో మనల నాశ్రయించి బ్రదుకు సేవకులకు నిమ్ము.

ఇచ్చట నొక సందేహము. "భార్యా పుత్రశ్చ దాసశ్చ త్రయ ఏవాధనాః" భార్యకుఁ బుత్రునకు దాసునకు ధనములేదు. అను న్యాయముండఁగా శ్రీరాముఁ డెట్లు తండ్రి జీవించియుండఁ దండ్రి యాజ్ఞలేక ధనమును దానముచేసెను. ఇది యధర్మము కాదా. కాదు. ఈధర్మము కుటుంబసాధారణమైన సొత్తువిషయము. కొడుకునకు స్వతంత్రధనము లేకపోలేదు.

పితృభ్యాం యస్య యద్దత్తం, తత్తస్యైవ ధనంభవేత్, యాజ్ఞ
తల్లిదండ్రు లెవని కేదియిత్తురో యది వాని ధనమే.

పితృద్రవ్యా విరోధేన, యదన్యస్స్వయ ముపార్జితమ్
మైత్రమౌద్వాహికం చైవ, మధుపార్కిక మేవచ
అనుపఘ్నన్పితృ ద్రవ్యం, శ్ర మేణ యదుపార్జయేత్
స్వయంమే హితలబ్ధంతం, నాకామోదాతు మర్హతి॥

పితృద్రవ్యమునకు హానిలేక తాను గష్టించి సంపాదించునదియు, మిత్రు లిచ్చినదియు, వివాహమువలన వచ్చినదియు, మధుపర్కముగా లభించినదియు నివన్నియు వానివాని సొంత సొత్తులే. కావున రామచంద్రమూర్తి తన సొత్తు దానము చేసెనుగాని కుటుంబద్రవ్యమును దానముచేయలేదు. ౬౧౬వ పద్యముఁ జూడుఁడు. ధర్మవిక్రమ గుణార్జితవిత్తములు, దానముచేసెనని చెప్పఁబడెను.

కం॥ అని ప్రీతచిత్తమునఁ ద, న్ననుమతి సేయుటయుఁ బొంగి•యవనీసుతరా
 మునిపనిచినయట్టుల నిజ,
 ధనవర్గము దాన మీయఁదటుకునఁ బూనెన్. ౮౬౯

ప్రీతిచిత్తమునన్=సంతోషించిన మనస్సుతో, అనుమతి=అనుజ్ఞ, రాముని పనిచిన యట్టుల=శ్రీరాముఁ డాజ్ఞాపించిన విధముగానే, తటుకునన్=ఏయాలస్యము సేయక వెంటనే.

తాత్పర్యము

అని సంతోషముతోఁగూడిన మనస్సుతోఁ దనరాక సమ్మతించి కార్యములఁ జేయ నియోగించుటయు సందేహమువదలి సంతోషముతో నుప్పొంగి సీత శ్రీరాముఁ డాజ్ఞాపించినట్టులు తమ ధనసమూహమును వెంటనే దానమీయఁ బూనెను.

— • { ౩౧-వ సర్గము. లక్ష్మణుఁడు తాను వనమునకు వచ్చెదనని శ్రీరాముం బ్రార్థించుట. } • —

ఉ॥ ఇంతయు నాలకించి మును•పే రఘురామునితోడ వచ్చి త
 త్ప్రాంతమునందు నున్నపిన•తమ్ముఁడు లక్ష్మణుఁ డయ్యో! సీతకే
 యింతటికష్టసాధ్య మఁట•యేగతి నన్ను ననుగ్రహించు న
 న్వంత సహింపలేక భృశ•బాష్పసమాకులితాస్యబింబుఁ డై. ౮౭౦

ఆలకించి=విని, తత్ప్రాంతమునందు=శ్రీరాముని సమీపమందు, వంత=శోకము, భృశ=అధికమైన, బాష్ప=కన్నీళ్ళచే, అకులిత=కలతపడిన, ఆస్యబింబుఁడై=ముఖబింబముగలవాడై.

తాత్పర్యము

శ్రీ సీతారాముల సంవాదమంతయు శ్రీరామునితోడవచ్చి వారి సమీపమందేయుండి వినుచుండిన లక్ష్మణుఁడు, అయ్యో, కట్టుకొన్న భార్య, అర్ధాంగలక్ష్మి, నిత్యానపాయిని, యయిన సీతకే వనవాసగమనమునకై యింతకష్టము మీఁదఁ గన్నీరుగాఱ వేడుపఁజేసి యనుమతియిచ్చెనే సవతితల్లి కొడుకైన

నన్నేవిధముగ ననుగ్రహించును? అనుగ్రహింపఁడేని నా గతియేమి? యను వ్యసనమునసహింపలేక మిక్కిలి కన్నీరుకాఱఁగా వ్యాకులపడిన ముఖముగల వాఁడై. ప్రాంతమనుటచేఁ గొంచెము దూరముగ నుండెనని భావము. భార్యా భర్తలు సంభాషించునపుడు మఱియొకరు వారి సమీపమునకుఁ బోరాదనిసూచన.

ఇచ్చటఁ గొందఱు 'పితృసమోజ్యేష్ఠ' యను న్యాయముననుసరించి యన్న తండ్రితో సమానుఁడు కావున శ్రీరాముని వెంట లక్ష్మణుఁడు పోవ సమ్మతించెనందురు. అది సామాన్యధర్మము. అదియైనను దండ్రి మరణానం తర మన్వయించును గాని తండ్రి బ్రతికియుండఁగాఁ గాదు. కావున శ్రీరామ కైంకర్యాభిలాషియయి యే లక్ష్మణుఁడు శ్రీరామచంద్రమూర్తి వెంటఁబోయె నని ప్రసన్నమతము, తల్లి తండ్రీ జీవించియుండఁగా వారి సేవ వదలి వారి యాజ్ఞలేక యన్న వెంటఁబోవుట సందిగ్ధధర్మము. ఏలన:

తల్లిదండ్రులకు వెనుకటివాఁడన్నగాని వారికంటె శ్రేష్ఠుఁడుగాఁడు. 'జ్యేష్ఠభ్రాతా పితృసమో, మృతేపితరి భూసుర॥ కనిష్ఠాస్తం నమస్యేరన్, సర్వే ఛందానువర్తిన॥ తండ్రి మరణించిన వదపడి యన్న తండ్రితో సమానుఁడు. చిన్నవాండ్రాయనకు నమస్కరించుచు నతని యభిప్రాయప్రకారము నడవ వలసినదని యుండుట సత్యమే. లక్ష్మణునకుఁ దల్లిదండ్రు లనుజ్ఞయిచ్చుటచే నన్న వెంటఁ బోవుట తప్పుగాదందరు లక్ష్మణుఁడు వారి యనుజ్ఞతీసికొని పయ నింపలేదు. ప్రయాణమునకు సిద్ధపడి సర్వమువదలి సీతారాముల వెంటఁబోవు నపుడు వారనుమతించిరి. ౬౩౧ పద్యము చూడుఁడు. కేవల కైంకర్యకతాను నకు జనకాజ్ఞగౌణము.

ఉ॥ అన్నపదంబులం బడి మహామతి గట్టిగఁ బట్టుకొంచు, నా
యన్నులమిన్న సీతఁ గని యామెను బ్రార్థనచేసి మున్నుగా,
నన్నకు నన్మహావ్రతున కార్తి ననున్ వనసీమ కేగి దే
నిన్నినుఁ గొల్చి వత్తుఁ గరుణింపుము నాపయి దీనవత్సలా! ౮౩౧

మహామతి=గొప్ప మనస్సుగలవాఁడు, అన్నులమిన్నన్ = స్త్రీలయందు శ్రేష్ఠురాలు, మహావ్రతునకున్=గొప్పవ్రతముగలవానికిన్, ఆర్తిన్=వ్యసనముచే దీనవత్సలా=దీనులందుఁ బ్రేమగలవాఁడా.

ఈ పద్యమున శరణాగతి యను ప్రపత్తియు దాని కుపదేశమునొంద వలసిన ద్వయమంత్రార్థము చెప్పఁబడినది. అప్పుడీయర్థమును గ్రహింప వలెను. మున్నుగన్=మొదట, సీతనుజూచి యామెను బ్రార్థనచేసి యనుటచే ముందు పురుషకారము ప్రార్థింపబడుట చెప్పఁబడెను. పురుషకార పూర్వకము గానే శరణాగతి చేయువలయును.

ఇచ్చటఁ బురుషకారభూత సీత. తన సంకల్పము నెఱవేఱునట్లు దాని కను కూలముగా భగవంతునితోఁ జెప్పి రక్షింపఁ జేయుట పురుషకార మనఁబడును

పూర్వపద్యములోని లక్ష్మణుఁడు అను దానిని గర్తృపదముగా గ్రహింపవలెను.

శ్రీరామశుశ్రూష యను ప్రయోజనము కోరి వేఱొండుపాయమునవలంబింపని లక్ష్మణుఁడు, మహామతి=తానుజేయుశరణాగతికిఁ బ్రతికూలమైనదాని వర్జించి యనుకూలమైనదానినే గ్రహించిన బుద్ధిమంతుఁడు. అన్న యనుటచే శ్రీరామలక్ష్మణులకు విడువరాని సంబంధము కావున లక్ష్మణునకు శ్రీరాముఁడు శరణ్యుఁడగుట యుక్తమని సూచితము. పదంబులంబడి యనుట శరణాగతిని దెలుపును. గట్టిగఁ బట్టుకొంచున్=అనుటచే శరణాగతికిఁగావలసిన మహావిశ్వాసము తెలుపఁబడెను. మున్నుగాఁగని ప్రార్థనచేసి యనుటచేఁ పురుషకారముగా నుండునట్లు వేఁడుట సూచింపఁ బడెను. అన్నల మిన్న యనుటచేఁ బురుషకార భూతయగు నధికారము సీతయందుఁ గలదని భావము. సత్+మహత్+వ్రతునకున్=శ్రేష్ఠమైన గొప్పదగు వ్రతము కలవానికి 'సత్యజేయం కథంచన, ఏతద్వ్రతం మమ' యను మహావ్రతము గలవానికి, ఆర్తిన్=దీనిచే శరణాగతి చేయ నధికారము గలదని చెప్పఁబడెను.

శరణాగతి యైహికాముష్మికఫలములలోదేని నైనఁగోరి చేయవచ్చును మోక్షార్థమే చేయవలయునను నియమములేదు కావునఁ దనయభీష్టము చెప్పుచున్నాఁడు. ఇదియే గోప్తృత్వవరణము.

అన్న పదంబులంబడి మహామతి గట్టిగఁబట్టికొంచునను వఱకు ద్వయమంత్రములోని మొదటిభాగము నర్థము చెప్పఁబడెను. అన్నకు ననుటచే నామంత్రములోని రెండవ భాగము నర్థము చెప్పఁబడెను. అన్నల మిన్నను బ్రార్థనచేసిమున్నుగాననుటచే శరణాగతిని ఫలప్రార్థనకును గావలసిన పురుషకార ప్రార్థన చెప్పఁబడెను ఏ ఫలముఁగోరి లక్ష్మణుఁడు శరణాగతి చేసెనో యావిషయమింకఁ జెప్పఁబడును, వనసీమ కేగుదేనిన్ = వనసీమకుఁ బోయెడి పక్షమున, అనుటచే నీ వరణ్యములకుఁ బోవుట నాకు సమ్మతి గాదని సూచించుచున్నాఁడు, కౌసల్యవలె సీతయుఁ బోవలదని చెప్పునేమోయని చూచెనుగాని యామె యీవిషయమే ప్రస్తావించినదికాదు. ఏలపోయెద వనియైన నడుగలేదు అది తన పని కాదని యామెకుఁ దెలియును.

కావున గట్టిగాఁ బోవలదని చెప్పలేక లక్ష్మణుఁడు తన యభిప్రాయము సూచించెను. నినుఁగొల్చివత్తును=నీ సేవచేయవచ్చెదను, దీనవత్సలా=అహంకారము గలవారికి నీవు విముఖుఁడవేకాని దాసులయందు వాత్సల్యము కలవాఁడవే కదా నేను దీనుఁడను, నాయందుఁ గరుణింపుము.

ఉ॥ కేలను విల్లు పూని మృగ•కీర్ణ మహావనిఁ ద్రోవ దీయు చే
లీలగ మున్నువోవ నవ•లీలఁ జరింపఁగ వచ్చు మీకు, స
త్త్వాళిమృగోత్క రాన్వితమ•హావనసీమల నెన్ని యేని య
న్నా! లలి మీరు గ్రుమ్మరఁగ•నోఁ జుమి నే వెనువెంట వచ్చినన్. ౭౩-౨

తాను జేయఁబోవు కైంకర్యమును సాధనములను జెప్పుచున్నాఁడు.

కేలను=చేతియందు, విల్లుపూని=ధనుస్సు ధరించి, అది యేల యంటివా మృగకీర్ణమహావనిన్=మృగములచే నిండిన గొప్పయడవియందుఁ ద్రోవఁ దీయుచు, మున్నుబోవన్=ముందుగాఁబోఁగా, అవలీలన్=సుళువుగా మీకుఁ జరింపవచ్చును. అడవులలో మనమై దోవలు చేసికొనుచుఁ బోయినఁగాని త్రోవ యుండదు. ఆపని నేను జేయుచు ముందు పోయిన మీరు నా వెనుక సుఖముగా రావచ్చును. లేకయున్న మీరే యాపని చేయవలసియుండును. మీరాపని చేసెదరా సీతను రక్షించెదరా? సత్త్వా...సీమలన్ = వ్యాఘ్రములులోనగు నడవి జంతువుల సమూహము జింకలు మొదలయిన మృగముల సమూహములు వీనితోఁగూడిన గొప్ప యడవి ప్రదేశములందు, మీరు=ఆలుమగఁడు, ఇరువురు క్రుమ్మరఁగనౌన్=సంచరింపసాధ్యపడును, వెనువెంటన్ = వెంబడి, దీని వలన "నేను సమస్తదేశములకును సర్వావస్థలకును సర్వకాలంబులకు ననుకూల మయిన విధమున సర్వకైంకర్యములను జేయఁగలవాఁడ"నని ప్రార్థన చేసి నట్లేర్పడుచున్నది.

తాత్పర్యము

చేతవిల్లుధరించి గొప్పమృగములతో నిండిన వనమందు నపాయములేని మార్గములుగాఁ జూపుచు నేను ముందుపోవుచుండఁగా నావెనుక మీరిరువురు ఏ ప్రయాసములేక వనవినోదము చూచుచు రావచ్చును. సంచరింపవచ్చును.నేను మీవెంటవచ్చితినా పెద్దపులులు లోనైన సత్త్వములు జింకలు లోనగు మృగములు గల పెద్దయడవు లెన్నింటియందైనను మీరు హాయిగా సంచారము చేయవచ్చును. నేను రాకున్న మీకు సుఖప్రయాణము సాగదు.

తే॥ దేవలోకాక్రమణ మైన♦దేవ యుల్ల,నిర్జరత్వంబ యైనను♦నిఖిలలోక
ములయు నైశ్వర్యమైనను♦వలచువాఁడఁ,గాను నీలేని చోటమ♦హానుభావ.

లక్ష్మణుఁడు ప్రకృతి ఫలముసకై యెట్లు వేఱొండుపాయమును బరిగ్రహింపక శ్రీరాముఁడే యుపాయమని గ్రహించెనో యట్లే, తనకు శ్రీరామకైంకర్యముతప్ప వేఱుఫలముకూడ నక్కఱలేదనుచున్నాఁడు. వేఱుదైవమును, వేఱుపాయమును వేఱుఫలమును నాశ్రయింపక నాశింపక యుండుటే యేకభక్తి యని యనన్యభక్తి యని అవ్యభిచారభక్తి యని చెప్పఁబడును.

దేవ=ప్రభూ! దేవలోక='దేవానాంపూరయోధ్యా' యన్నట్లు దేవలోకమనఁగా వైకుంఠము, ఆక్రమణము=దానిని బొందుట దేవలోకమనఁగా నింద్రలోకమనుట సరిగాదు. నీలేనిచోటన్=నీవు నాతోడనుండి నాకైంకర్యము పరిగ్రహింపనపుడు, నిర్జరత్వంబయైనను=జరామరణమోక్షయ యన్నట్టి కైవల్యమనెడి మోక్షమైనను, అఖిల....ఐశ్వర్యమైనను=సమస్తలోక ప్రభుత్వము,చతుర్ముఖ

పదవియైనను, వలచువాఁడఁగాను, నీపరిచర్యలేనప్పుడు వైకుంఠవాసమే. నాకుసమ్మతి లేకయుండఁగా నిఁకఁగైవల్యము బ్రహ్మలోకము వీనిమాటచెప్పనేల

తాత్పర్యము

దేవా! మహానుభావా! నీవు లేనిస్థలము వైకుంఠమైనను నాకు వలదు. వైకుంఠమె వలవనివాఁడను కైవల్యమును దానికంటె హీనమైన బ్రహ్మపదవిని నేను గోరుదునా? కేవలాత్మోపాసకుల గమ్యస్థానము కైవల్యము.

కం॥ సౌమిత్రి యిట్లు పలికిన, రాముఁడు వచియించి పెక్కు•ప్రత్యూహోక్తుల్
సామంబున నూరార్చినఁ, దా మరల సుమిత్ర పట్టి•దగ నిట్లనియెన్.

సౌమిత్రి=లక్ష్మణుఁడు, ప్రత్యూహోక్తుల్=విఘ్నపు మాటలు, సామంబునన్=మంచిమాటలచే, ఊరార్చినన్ = సమాధానపఱుపఁగా, సుమిత్రపట్టి=సుమిత్రపట్టిసుమిత్రకుమారుఁడు.

తాత్పర్యము.

లక్ష్మణుఁ డిట్లు చెప్పఁగా శ్రీరాముఁడు విఘ్నకరములైన ప్రతికూలములైన మాట లనేకములుఁ చెప్పి యూరడింపఁగా మరల లక్ష్మణుఁ డిట్లనియె.

కం॥ అంగీకరించి మున్నే,భంగిని వారించె దిపుడు•ప్రతిషేధము సే
యం గత మెది చెప్పుము? నా,సంగతి వీడెదవు దీన•సందియమయ్యెన్. ౪౭॥

అంగీకరించిమున్ను=పూర్వమే నావనగమనము నొప్పుకున్న వాఁడవై, (౬౩౨-౬౩౬-౬౫౬-౭౭౨ పద్యములఁ జూమనది.) ఇప్పుడీవిధముగా వారించెదవు=అడ్డగించెదవు, ప్రతిషేధము=రావలదని నిషేధించుటకు, కతము = కారణము, సంగతి, సాంగత్యము, కూడియుండుటను, సందియము=సందేహము.

తాత్పర్యము

పూర్వము నీతోడ నారాకను సమ్మతించి మాటలాడితివి. ఇప్పుడీవిధముగా వలదని నిషేధించుచున్నావు. దీనికేమి కారణము చెప్పుము. ఏలనా సాంగత్యము విడువనెంచితివి. పుట్టినది మొదలు బాల్యాదపి సుస్నిగ్ధః రామస్య దక్షిణో బాహుర్వన్నట్లు నన్ను నాసేవ నింతకాలము గ్రహించి యిప్పుడు నాయందేదో దోషముండుటచే రావలదని నిషేధించుచున్నావని నాసందేహము. ఆ సవతికొడుకట్లుచేసెను. ఈ సవతి కొడుకేమి చేయునో యని సందేహమా. తెలియఁ జెప్పుము.

—•శ్రీరాముఁడు లక్ష్మణుని నయోధ్యయందుండు మని చెప్పుట.•—

ఉ॥ చేతులు మోడ్చి మున్నచన•సిద్ధుఁడునై తను వేఁడుచున్న వి
ఖ్యాతచరిత్రు లక్ష్మణునిఁ•గాంచి వచించును రామచంద్రుఁడున్
భ్రాతవు, ప్రాణతుల్యుఁడవు•వశ్యుఁడవున్, వరధర్మశాలివిన్,
ఖ్యాతగుణుండవున్, సఖుఁడ•వున్, బలశాలివి, నీవు నెయ్యుఁడున్. ౪౮॥

తా త్ప ర్య ము

రెండుచేతులు జోడించి తనకంటె ముందు పోవఁ బ్రయాణ సన్నాహముననుండి తన యనుమతి మాత్రమెదురుచూచుచు దాని నిమ్మని ప్రార్థించుచున్న కీర్తికరమైన దానిచేత స్నేహద్రోహబుద్ధి లేని నడవడిగల లక్ష్మణునిఁగాంచి రామచంద్రు డిట్లనియె. లక్ష్మణా నీవునాకుఁ బుట్టవు చేతనే తమ్ముఁడవు. అంతే కాదు. ప్రేమ యందు నా ప్రాణములతో సమానుఁడవు. నాకు వశపడి నేను చెప్పినది చెప్పినట్టు వినయమునఁ జేయువాఁడవు. గొప్పధర్మముచేఁ బ్రకాశించువాఁడవు. పవిత్రవంతములైన కల్యాణగుణములు గలవాఁడవు. చెలికాఁడవు. బలవంతుఁడవు. స్నేహితుఁడవు. వీనిలో నొక్కగుణమున్నను నీవు త్యాజ్యుఁడవుగావు. అట్టులుండ నిన్నిగుణములుగల నిన్ను నిష్కారణముగా వదలిపోదునా. నీయందు దోషముండుటచే నిన్ను వదలి పోవఁ దలఁపలేదు. నాయాలోచన విధముచెప్పెద వినుము. ఇదియును సీతాదేవి పరీక్షవంటిదే.

చం॥ వనులకు నీవు నాబడిని•వచ్చెద వేనియు నెవ్వ రయ్యె నా
జననిని నీదుతల్లినిటఁ•జక్కఁ భరించెడివారు? భూమికిన్
ఘనతరవృష్టియట్టులు సు•ఖం బొడఁగూర్చెడియట్టినాథుఁ డా
జనకుఁడు కామపాశచయ•సంపరిబద్ధుఁడు నీ వెఱుంగవే. ౮౭౭

నాబడిని=నావెంట, చక్కన్=ఏలోపము లేకుండునట్లు, ఘనతర వృష్టి=గొప్పవర్షము, కామపాశచయ సంపరిబద్ధుఁడు=మన్మథుని త్రాళ్ళసమూహముచే బాగుగఁగట్టబడినవాఁడు.

తా త్ప ర్య ము

నావెంట నీవు వచ్చితివనుకో, తరువాత నీ తల్లిని నా తల్లిని లోపము లేకుండ వారిని భరించువారెవరు? అది యేమి మన తండ్రి రాజులేఁడా యందువా, ఉన్నాఁడు. ఏమి ప్రయోజనము. జడివాన దేశమందంతట గొప్పగాఁగురిసినట్టు లందఱకు సుఖము గూర్పవలసిన మనతండ్రి వారి భర్తయగువాఁడు కామపాశసమూహములచే బాగుగఁ గట్టఁబడి పడియుండుట నీ వెఱుఁగవా. భర్త యాగతి, కొడుకు లీగతి, యైన మన తల్లుల గతి యేమి?

ఉ॥ మే లొనరింపఁబోవదు సు•మీ నవరాంధ్రడకు దుస్సహవ్యథా
లోలల కల్లకైక యిల•లోఁగొనుటన్, భరతుండు తల్లి పె
న్లాలనఁ జేసి వారల మ•నంబున నైన స్మరింపఁబోఁడు, తం
డ్రీః లలి నీవయైన నిట•నిల్వుము వారలకుండు మాన్పఁగన్. ౮౭౮

తా త్ప ర్య ము

భరతుఁడు లేఁడా కైక లేదా వారామాత్రము విచారింపరా యనుదువేమో. కైక రాజ్యమంతయుఁ దన స్వాధీనమగుటచే మన కొఁకరివలనఁ గావల

సినదేమియని గర్వించి తన సవతులకు, నందు దుఃఖించుచుండువారికి, మేలు చేయదు. వారి కొడుకు లరణ్యమునకుఁబోయిన కారణముచే వా రేడ్చుచున్నా రని యామె తలఁపదు. తన కొడుకు రాజైనాఁడని యేడ్చుచున్నారని వారి మీఁదనింద మోపి యనాదరించును. ఇఁక భరతుఁ డందవహాయనిన వాఁడు తల్లిలాలనలకు లోపడి కౌసల్యా సుమిత్రులను మనసునందైనఁ దలఁపఁడు. కావున నాయనా! నీవైన నిటనుండి వారల వ్యసనము మాన్పుచుండుము.

భరతునిపై లక్ష్మణునకుఁ గోపముగలదని శ్రీరాముఁ డెఱుఁగును. దాని ననుసరించి యాయనను బరీక్షింపఁజెప్పిన మాటయేగాని భరతుఁ డట్టివాఁడని నమ్మి చెప్పిన మాటగాదు.

కం॥ సౌమిత్రీ! స్వయముగనో, భూమిధవానుగ్రహంబుఁ బోఁడిమినో యిటన్
నామాతను భరియింపుము, నామాటనుబట్టి నిలుము నయమతివగుచున్.

స్వయముగనో=రాజసహాయములేక యైనను, భూమిధవా నుగ్రహంబు పోఁడిమినో=రాజానుగ్రహము సంపాదించియైనను, సౌమిత్రీ=నీవె, సుమిత్ర కొడుకవుసుమా అది మఱువకుము. ఆమెయెంత సాత్త్వికురాలో యాలోచించి యట్టి సత్త్వగుణము కలవాఁడవేకమ్ము.

తాత్పర్యము

సుమిత్రానందనా! నీ పితరుల సహాయము గోరకయైనను సరియు. లేదా రాజానుగ్రహము సంపాదించుకొని యతఁడిచ్చు ధనాదులచేనైన సరియ నీవి చ్చటనేయుండి నాతల్లిని భరింపుము. నామాటయందు గౌరవముంచి నీతి శాలివై యన్నమాట మీఱరాదు గదాయని నిలువుము.

ఉ॥ నాదువియోగపాటున వనారిలుతల్లికి నీవు నిల్చిన
న్మోదము గల్గు, నాయెడ ననుత్తమ మౌభవదీయభక్తి నిం
పాదిగఁ దోఁచెడిన్, గురుల భక్తిభజించిన ధర్మమూర్జితం
బౌ దురితంబు వాయు ననఘా!యటు సేయుము సమ్మతం బగున్.౧౧౦

వియోగపాటునన్=విడిచియుండుటచే. వనారిలు=శోకించు, మోదము= సంతోషము, అనుత్తమము=మిక్కిలి యుత్తమము, దేనికంటె నుత్తమైనది లేదోయది యనుత్తమము, ఇట్టిదే యఘోరము, నింపాదిగన్=బాగుగ, ఊర్జి తము=అభివృద్ధి, దురితంబు=పాపము.

తాత్పర్యము

నేను విడిచిపోవుటచే శోకించు నాతల్లి నీవు నిల్చితివేని నిన్నుఁజూచి నే నున్నట్లే భావించి సంతోషించును. అంతియగాదు. నాయందు నీకుఁగలయుత్త మోత్తమ భక్తియు సమృద్ధమై కానవచ్చెడినినాకు సేవసేయుటకంటె నాకుఁబ్రియ మైనవారి సేవచేసిన నాకెక్కువ సంతోషముగదా. పెద్దవారిని భక్తితో సేవిం

చుటచేఁ బుణ్యము వృద్ధియగును. పాపము నశించును. దోషరహితుఁడా! నీ విటుసేయుట నాకు సమ్మతమైన కార్యము.

కం॥ నామాట వినఁగదయ్యా, సౌమిత్రీ! రఘుకులాబ్ధి•చంద్రమ నాకై,
యేమాడ్కి సుఖింతురు చెపు,మా మనమిరువురును లేమి•మనతల్లు లిటన్?

శ్రీరాముఁడు నయవాక్కులచే నిచ్చకములచే సౌమిత్రుని వశపఱచుకొనఁ జూచుచున్నాఁడు.

తా త్ప ర్య ము

అన్నా! లక్ష్మణా! రఘువంశ మను పాలసముద్రమునకు నీవు పూర్ణచంద్రునివంటి వాఁడవు. నా నిమిత్తము నా మాట వినవయ్యా! నీవు నే నిరువురము లేనియెడల మన తల్లు లీ శత్రుమధ్యంబుననుండి విచారించువారు లేక యెట్లు సుఖింతురు?

చం॥ అని రఘురాముఁ డిట్లు సన•యంబుగఁ జెప్పినతీవ్రవాక్యముల్
విని విని లక్ష్మణుం డను వి•వేకధనా! భరతుండు నీదుత
ల్లిని మఱి మత్పవిత్రి నమ•లీమసచిత్తమున న్భరించు, నీ
యనుపమ తేజమున్ దెలియఁ•డా? యటు లేటికిఁ జేయు నెన్నఁడేన్.

సనయంబుగఁ జెప్పిన తీవ్రవాక్యముల్=చక్కెరపూసిన విషపుటుండవలె పైకి సామముగాఁ గనిపించినను లోపల మర్మములు గోయుమాటలు, వివేకధనా=తప్పొప్పులుఁ దెలిసికొను జ్ఞానమే ధనముగాఁగలవాఁడా, మత్పవిత్రిన్=నాతల్లిని, అమలీమసచిత్తమునన్=మాలిన్యములేని మనస్సుతో-

తా త్ప ర్య ము

అని శ్రీరాముఁడు మంచిగానే చెప్పిన కఠోరవాక్యములు వినివిని లక్ష్మణుఁడిట్లనియె వివేకసంపన్నా! భరతుండు నీ తల్లిని నిర్మలమనస్సుతోనే భరించును. స్త్రీలను నందుఁ దల్లులను నేల బాధించును? ఒకవేళ భక్తితోఁ బోషింపకున్నను వారి ననాదరణముచేసిన నీవు కోపింతువని నీ యసమానమైన తేజస్సు తెలియనివాఁడా? వారి విషయము నతఁ డెప్పటికి నట్లు చేయఁడు. భక్తి లేకున్న నీ భయముచేనైన వారి నాదరించును.

మ॥ ననుబోంట్లా భరియించువారు జనని•గ్గౌసల్య నార్యామణిన్
ననుబోంట్లన్ భరియించు వేల్కొలఁది నా•నాదానపూజాదులన్
దనసేవం జరియించువారి కతులౌ•దార్యంబునం గూర్మి ని
చ్చెను గ్రామంబులు వేయి, యేమిపని వ•చ్చెన్ వారితో వీరితోన్. ౪౨౩

ననుబోంట్లా=నావంటివారా! ఆర్యామణిన్=ఆర్యస్త్రీలయందు మణివంటి దానిని, అతులౌదార్యంబునన్=అసమానమైనదాన గుణముచే.

అన్నా నన్నుఁ బిలుచుకొనిపోరాదని తలఁచి యేవియో నెపములుచెప్పు చున్నావో, నన్నుఁ బరీక్షించుటకే యిట్లు చెప్పుచున్నావో, నే నెఱుఁగను. అటు గాక న్న నార్యస్త్రీరత్నమైన కౌసల్యాదేవిని నావంటివారా భరింపవలసినవారు. ఆమెయే నావంటివారిని వేలకొలఁదులను బహువిధములైన దానములచే గౌర వములచే భరింపఁగలదే. ఎట్లనఁ దన సేవయందుండువారికే తన దానగుణము ప్రకాశింప వేయిగ్రామములిచ్చెను. వాస్తవమిట్లుండ నామె పోషణమునకై వాఁతో వీరితో నేమి పని వచ్చెను. ఆమెను నేను భరింపవలసిన పనిలేదు. (కౌసల్యా వివాహకాలమున దక్షిణకోసలయంతయు నరణముగ నామె పుట్టి నింటివా రిచ్చిరి.)

తే॥ తనను గౌసల్య భరియించు•కొనెడిరీతి
నసఘ! నా తల్లియు భరించు•కొనఁగఁ గలదు
గ్రామములు పెక్కులున్నవి•బ్రదుకుకొఱకుఁ
గాన ననుబోంట్ల రక్షింపఁ•గలదు దేవ. ౮౮౪

తాత్పర్యము

కౌసల్య తన్ను భరించుకొను విధముననే సుమిత్రయుఁ దన్ను భరించు కొనఁ గలదు. ఆమె జీవనార్థ మనేక గ్రామములున్నవి. కావున నామె నావంతి వారిని రక్షింపఁగలదు. కావున వారిరువురు వాసోగ్రాసముల కితరులపై నాధార పడియుండవలసిన పనిలేదు.

కం॥ అనుచరునిఁగాఁగ న న్నేఁ,ల్కొనుమీ వైధర్మ్యమిందు•గొఱలదు నేనున్
మనఁ గలుగుఁ గృతార్థుఁడనై, విను నీకుఁ బ్రయోజనంబు•వెలసెడిదీనన్. ౮౮౫

అనుచరునిగాఁగన్=బంటుగా-వైధర్మము-ధర్మవిరుద్ధము-కృతార్థుఁడనై= జన్మసాఫల్యముగలవాఁడనై-మనఁగలుగుఁన్=జీవింపవలను పడును.

తాత్పర్యము

అన్నా! నీవు నన్ను బంటుగా నేలుకొనుమీ. ఇందు ధర్మహానిలేదు. అన్నను దమ్ముఁడు బంటువలెఁ బరిచరించుట ధర్మవిరుద్ధమగు కార్యముగాదు. అన్న తండ్రితో సమానుఁడుగదా. అట్లు గ్రహించితివేని నేను నీ సేవచే జన్మ సాఫల్యము గలిగించుకొందును. దీనివలన నీకును ప్రయోజనము కలదు. అడవులయందు నీకుఁ గావలసిన కందమూలాదులు లభింపఁజేయుదును.

నన్నున్=అందు నిందు నీ దాస్యమే నా స్వరూపముగా సత్వముగానుండు నన్ను, ఇంతకాలము నిన్నొకగడియయైన విడిచియుండని నన్ను, నీ కైంక ర్యమే పరమపురుషార్థముగా నెంచియుండు నన్ను, అనుచరునిగాఁగన్ = నీతో

సమానుని గాఁగాదు, అడవిలో నిన్ను రక్షించుటకై వచ్చెదనని చెప్పలేదు. నేను సేవచేయుటకై నన్నుఁ బిలుచుకొనిపొమ్మని ప్రార్థించుచున్నాను.

ఏలుకొనుము=పాలించుకొనుము. ఏలుమనక యేలుకొనుమని యాత్మనే పదరూపము ప్రయోగించుటచే ఫలము కర్తనుబొందును గావున నన్నేలిన ఫలము నీదిగాని నాదిగాదు. దీనివలన లక్ష్మణుఁడు ఫలసమర్పణము గావించినవాఁడయ్యెను.

వైధర్మ్యము=స్వభావముగా నీవు నా స్వామిని. నేను నీసొత్తును. నీ సొత్తును నీ వుపయోగించుకొనుటలో ధర్మహాని యేమున్నది? నీ సొత్తును నీవు కాపాడుకొనకుండుట. ధర్మహాని కాని కాపాడుకొనుట ధర్మహాని కాదుగదా.

కృతార్థుఁడనై మనఁగలుగును=నా సొత్తును నేనుపయోగించిన నీకురాఁగల లాభమేమి యందువా? ఒకస్వామి (సొత్తుకలవాఁడు) తనసొత్తును నానా విధముల వినియోగింపవచ్చును అటుగాక తాను స్వయముగాఁ దనకై యుపయోగించుకొనుటచే వాని విశేషానుగ్రహమునకుఁ బాల్పడిన యావస్తువుజన్మము సార్థకము. అటులే నీసొత్తైన నన్ను నీవు వేయివిధముల నుపయోగింపవచ్చును గాని నీకే యుపయోగపడుటవలన నా జన్మము సార్థకమగును.

మనఁ గలుగుదును అని చెప్పక మనఁగలుగును అని ప్రథమపురుషమునఁ జెప్పుట శరణాగతికంగమైన వినయము (కార్పణ్యము) సూచించుచున్నది.

నిన్నేలుకొనుటవలన నాకేమి లాభమందువా? నీకు వ్రతహానిలేకుండుటయు, నాశ్రితరక్షాదీక్ష సార్థకపడుటయు నీకు లాభములు. నీవు చేయవలసినది నీవు చేయకుండుట ధర్మహాని గదా.

ఆ॥ గంప గడ్డపాఱ•గైకొని యొక కేల, విల్లుబాణములును•వెలయ నొకట
నీకు ముందుపోయి•నెఱిగాఁగ మార్గంబుఁ,
జూపువాఁడ శ్రమముఁ•బాపువాఁడ. ౮౮౬

తాత్పర్యము

నీవు నాతోడవచ్చి చేయఁగలకార్య మేమియందువా? ఒకచేత గంపగడ్డపాఱ, మఱియొకచేత విల్లుబాణములు గ్రహించి నీకు ముందుగానడచి మార్గము చక్కఁజేసి నీ కీ కష్టము లేకుండఁ జేసెదను. నేను లేనియెడల నివన్నియు నీవే కదా చేసి శ్రమింపవలయును. నీవలసినపుడు విసరుదును,పాదసేవచేయుదును

ఉ॥ పండులుఁ గడ్డలున్ వననివాసులు గ్రాసముగాఁగ మెక్కు వే
ఱొండు నెద్దైనఁ దెచ్చెదను•నుర్విజ నీవును గూడియాడుచున్
గొండలపేటుల న్నిదురఁ•గూరియ యున్నను మేలుకొన్న కో
దండధరుండనై మెలఁపుఁ•దాలిచి సర్వము నేన తీర్చెదన్. ౮౮౭

గ్రాసము=ఆహారము, మెక్కు=తిను.

తాత్పర్యము

ఇంతియేకాదు, పండ్లు, దుంపలు, ఇవిగాక యరణ్యమందుండువా రాహారముగా భుజించు మఱివేనినైనఁ దెచ్చియిచ్చెదను. సీతయు నీవునుగూడి వినోదముగా వర్తించుచుఁ గొండలశిఖరములయందు మీరు నిదురించుచున్నను మేలుకొన్నను నేను చేతవింటిని ధరించినవాఁడనై హెచ్చరికతో మీ సర్వకార్యములు నేనే తీర్చెదను.

ఈ కారణముచేతనే పట్టాభిషేకసమయంబున తక్కినవా రొక్కొక్కటి ధరించిన లక్ష్మణుఁడు రెండుచేతుల రెండు, ఛత్రము చామరము, ధరించినట్లు ౪౫౪వ పద్యను ప్రథమపాదంబున యుద్ధకాండమున ౨౮౪౪ వ పద్యంబు సందును జెప్పఁబడియె.

సీతతోడనుండు నీకు సర్వవిధ కైంకర్యములు సర్వకాలములఁ జేసెదననుటచే దేవీసహితుఁడైన దేవునే యర్చింపవలయునుగాని బాలకృష్ణునిఁదప్ప నేకమూర్తినిమాత్ర మర్చింపరాదని యేర్పడుచున్నది.

మీరు నిదురించియున్నను మేలుకొనియున్నను నేను గాచియుండెదననుటచే లక్ష్మణుఁ డీ పదునాలుగు సంవత్సరములు నిదురయే పోలేదని కొందఱందురుగాని ౧౪౬౦ వ పద్యమునఁ బ్రథమపాదమున లక్ష్మణుఁడు నిదురించినట్లు శ్రీరాముఁడు మేలుకొలిపినట్లు చెప్పఁబడెను.

—• లక్ష్మణుఁ డరణ్యమునకు వచ్చుటకు శ్రీరాముఁడు సమ్మతించుట. •—

చం॥ అన విని ప్రీతచిత్తుఁ డయి•యన్న వచించెను లక్ష్మణా! వెసన్
జని భవదీయమిత్రులకు•సర్వముఁ దెల్పుము. మామ యజ్ఞమున్
జలిపెడుచోఁ బ్రచేతసుఁ డొ•సంగె స్వయంబుగ భీమదర్శనం
బులఁ బెనువిండ్ల రెంటి రవి•బోలుచు హేమపరిష్కృతంబులై. ౨౨౨౨

వెసన్=శీఘ్రముగా, భవదీయమిత్రులకున్=నీ స్నేహితులకు, మామ=మన మామ జనకుఁడు, భీమదర్శనంబులన్=చూచుటకు భయంకరములైనవి, హేమపరిష్కృతంబులై=బంగారుచే నలంకరింపఁబడినవై.

తాత్పర్యము

'నీవాఁడను' అని యాశ్రయించిన వారినిఁ బరిగ్రహింతును అనువ్రతము గల శ్రీరాముఁడు పరమార్థయుక్తములై శరణాగతి ధర్మయుక్తములైన లక్ష్మణుమాటల విని శరణు విని శరణు అనఁగానే అభయమ్మనవలసిన తా నింతసేపు జాగుసేయుటయే తప్పయియుండ నింకను బరీక్షించుట దోషమని యడ్డములు చెప్పక సంతోషించిన మనస్సుగలవాఁడై యిట్లు చెప్పెను. లక్ష్మణా! త్వరతోఁజని నీ మిత్రులకందఱకు సర్వ వృత్తాంతము మనము మువ్వుర

యజ్ఞముచేయు సమయంబున వరుణుఁడు బంగారుచే నలంకరింపఁబడి సూర్యునివలెఁ బ్రకాశించుచుఁ జూచుటకే భయంకరమగు రెండువిండ్ల నిచ్చెను.

కం॥ వెలిఁగెడి రెండుకటారుల, ములుకులు నెపుడేని వెలితి•పోవనిపొదులన్
జెలు వగునభేద్యకవచం,బులదోయిని వాని దినముఁ•బూజింపంగన్. ౭౮౯

కం॥ మనగురువులసదనంబున, నునిచితి నవి యెల్ల మనకు•నుపయోగపడున్
వనసీమలఁ గావునఁ జని, కొనిరమ్మి యిటకు నీవు•గొబ్బున ననుడున్.

తాత్పర్యము ౭౯౦

ప్రకాశించు రెండు కటారులు అక్షయబాణతూణీరములు భేదింపరాని కవచములు రెండును వరుణుఁ డిచ్చెను. వానిని బ్రతిదినము పూజించుటకై గురువుల యింట నుంచితిని. అవి మనకు నడవులందు (రాక్షసవధార్థమై, వేఁటకగు నేని యిట్టివేల) నుపయోగపడును, కావున నీవుపోయి శీఘ్రముగ నిచ్చటికే తెమ్ము.

ఈయాయుధములను వరుణుఁడు శ్రీరామలక్ష్మణుల కిచ్చినట్లు బాలకాండమునఁ జెప్పకున్నను నిచటఁ జెప్పుటచేత నచ్చటను నీ కథ ననుసంధించునది. ఇది వాల్మీకి శైలి లక్షణము. ఒకసందర్భమున జరిగినవన్నియు నొకచోటనే చెప్పఁడు. సందర్భోచితముగాఁ గొంత యొకచోటఁ గొంత మఱియొకచోటఁ జెప్పును. వరుణుఁడు లక్ష్మణునకు శ్రీరామునకు ధనురాదికముల నిచ్చెనని బాలకాండమునఁ జెప్పినను జెప్పకున్నను నిచ్చటఁ జెప్పకతప్పదు. ఇచ్చటఁ జెప్పకుండినయెడల నవి వెంటఁదీసికొని పోవనట్లేర్పడును. అచ్చటఁ నిచ్చట జెప్పుట వ్యర్థము.

అట్లులే కాకాసురవృత్తాంతము చిత్రకూటమున జరిగెను. దాని నయోధ్యా చెప్పెను. ఇట్టివి కాండమునందుఁ జెప్పియుండవలెను. అచ్చటఁ జెప్పక సుందరకాండమందు సీతచేఁ జెప్పించెను. అది తనకు శ్రీరామునకు మాత్రము తెలిసిన రహస్య విషయమని యామె చెప్పెను. కావున దాని నిచ్చట బహిరంగపఱుపక రహస్యముగానేయుంచి యౌచిత్య మనుసరించి తగినచోటఁ జెప్పెను.

అట్లులే మణిబంధ విషయము దుందుభి విషయము రెండు మూఁడుసారులు చెప్పెను. ఇట్టివి మఱియుఁ గొన్నిగలవు ఇందెల్ల మొదటఁ జెప్పకపోవుట మఱపుచేతఁగాదు. ఏది యెక్కడ నెంతచెప్పవలయునో యక్కడ దాని నంతే చెప్పుట యాయన శైలిలక్షణము.

ఉ॥ అర్యమతేజుఁడుం జని హి•తాళుల కెల్ల నెఱుంగఁ జెప్పి యా
చార్యునివీటి కేగి యుల•సాధనరాజములన్ గ్రహించి వే
యార్యవిభుండు రామునకు•నన్నియుఁ జూపిన సంతసించుచున్
గార్యముతీ రెఱింగి యిటు•గ్రక్కున వచ్చితి వెంచినంతలోన్. ౭౯౧

అర్యమతేజుఁడు=సూర్యుని తేజస్సువంటి తేజస్సుగలవాఁడు, ఇంతవఱకుఁ దన కైంకర్యమును శ్రీరాము డంగీకరించునో యంగీకరింపఁడో యనుచింతచే

వాడువాఱీసముఖముతోఁ దేజోహీనుఁడై యుండినవాడు. శ్రీరాముఁడు తన్నను గ్రహించెఁ గదా యను సంతోషముతోఁ దేజోవంతుఁడయ్యెను.

తాత్పర్యము

సూర్యతేజుఁడైన లక్ష్మణుఁడు తన హితులకెల్లఁ దమ వనవాసయాత్రా విధముఁ దెలియఁజెప్పి శ్రీరాముఁడు చెప్పిన యాయుధములను దీసికొనివచ్చి శ్రీరామునకుఁ జూపఁగా శ్రీరాముఁడు సంతోషించుచు లక్ష్మణా మేలు! కార్యవిధ మెఱింగినవాఁడవై జాగుసేయక యింకను లక్ష్మణుఁడు రాలేదేయని తలఁచితినో లేదో శీఘ్రముగ వచ్చితివి.

మ॥ అనుచున్ మేలు వచించి నాకుఁ గలయర్థాళి న్నీనుం గూడి చ
 య్యన బ్రాహ్మణ్యతపస్వికోటులను గుర్వారాధకాత్మోపజీ
 వినికాయంబులను న్విశేషముగ నీవిం దృప్తులం జేయుదున్
 జని వాసిష్ఠు సుయజ్ఞుఁ దక్కఁగలశిష్టవ్రాతముం బిల్వుమీ. ౨౩

అర్థాళిన్=ధనములను, బ్రాహ్మణ్య తపస్వికోటులన్=బ్రాహ్మణలగు తపస్వుల సమూహమును, గుర్వారాధకాత్మోపజీవులనున్=గురువుల నారాధించు వారిని, మన సేవకులను, విశేషముగన్ = ఎప్పుడిచ్చుదానికంటె నెక్కువగ, ఈవిన్=దానముచే, వాసిష్ఠున్=వసిష్ఠకుమారుని సుయజ్ఞుఁడనువానిని, "బ్రాహ్మణ్యబాడబ్యేతు ద్విజస్మనామ్" అమరకోశము.

తాత్పర్యము

అని మెచ్చుకొని నాకుఁగల ధనము నితరపదార్థములను నీతోడ బ్రాహ్మణులగు తపస్వులకు గురువుల నారాధించువారికి మన సేవకులకు నెప్పుడు నిచ్చుదానికంటె హెచ్చుగనిచ్చి సంతోషపెట్టుదును. కావున వసిష్ఠుని కుమారుఁడైన సుయజ్ఞుని దక్కిన పెద్దలను బిలువుము.

—• ౩౨-వ సర్గము. శ్రీరాముఁడు తనపదార్థముల దానము చేయుట. •—

సీ॥ అని పల్క శుభము ప్రియం బగుసుడిని సు,
 యజ్ఞునింటికి నేగి యగ్నిగృహము
 నందు నాతనిఁగాంచి వందనంబు లొనర్చి,
 కడిఁదికార్యము సల్పఁ గడఁగియున్న
 రామునియింటికి రారమ్ము మిత్రమా,
 యన సంధ్యవార్చి యాయనఘుతోడ
 శ్రీరమ్యసుందర శ్రీరామమందిరం, బును జొచ్చె,వచ్చెడి పుణ్యమూర్తి
తే॥ వేదవిదునకు రాముండు వేదిజాత,తోడ నగ్నికిఁబోలె నెదురుగఁబోయి
 యంజలి ఘటించి మ్రొక్కి యాయనఘమతికి,
 నిచ్చెఁదనవస్తువులను బెం పచ్చుపడఁగ ౧

కడిఁదికార్యము=ఇతరుల కసాధ్యమగు కార్యము, సంధ్యవార్చి = ఇది మాధ్యాహ్నికసంధ్య కావున నిప్పటికిఁ బదునొకొండు గంటలకాలమయినది,వేది

జాత=సీత, దీనివలన మాధ్యాహ్నిక సంధ్యయు నిత్యముగా గ్రహింపవలసి యున్నది.

తాత్పర్యము

ఈ ప్రకారము తనకుఁ శుభముఁ బ్రియమునగు మాటచెప్పిన వినివెంటనే సుయజ్ఞు నింటికిఁబోయి యగ్నిగృహమం దాయనయుండ నచటికిఁబోయి నమస్కారము లాచరించి మిత్రమా యసాధ్యకార్యము చేయఁబూనిన శ్రీరాముని యింటికి రమ్మని పిలిచిన నాయనయు మాధ్యాహ్నిక సంధ్య వార్చి కాంతిచేత రమ్యమై యందమైన శ్రీరాముల గృహమును బ్రవేశింపఁగా వచ్చుచున్న పుణ్యాత్ముఁడును వేదవేత్తయునగు నా సుయజ్ఞునకు నగ్నికిఁబోలె సీతతోడ శ్రీరాముఁ డెదురుగాఁజని మ్రొక్కి యా నిష్కల్మషమైన మనస్సుగల యాయనకుఁ దన వస్తువులన్నియు నిచ్చెను.

ఉ॥ బంగరుటంగదంబులును•భ్రాజితకుండల హేమసూత్రముల్
రంగగు చేకడెంబులును•రత్నకిరీటములున్ విభూషలున్
బంగరుటుంగరంబులును•బంధురరత్నచయంబు లెల్లని
చ్చెం, గమలాక్షి ప్రేరణము•చే నిటు వెండియుఁ బల్కె నాతనిన్. ౮౬౪

ఇచ్చిన వస్తువులనెల్లఁ జెప్పుచున్నాఁడు.

బంగరు టంగదంబులున్=బంగారు భుజకీర్తులు, కర్మధారయంబులం దత్తున కచ్చుపరంబగునపుడు టుగాగమంబు బహులంబు సు-వ్యా-సంధి ౫౬ వ సూ. భ్రాజిత=ప్రకాశించు, కుండలహేమ సూత్రములును = కుండలములు బంగారు మొలత్రాడులును, చేకడెంబులును=చేతధరించు కడియములు-రత్న కిరీటములు=రత్నములు చెక్కిన కిరీటములు, భూషలున్=ఇతరాలంకారములు, బంధుర రత్నచయములు=మనోహరమైన రత్నసమూహములు.

తాత్పర్యము

బంగారు భుజకీర్తులును, తళతళమను కుండలములు బంగారు మొలత్రాడులును, చేతికడియములును,రత్నకిరీటములును ఇతరములైన యలంకారములును, బంగారు చేతియుంగరములు మనోహరములయిన రత్నసమూహములు నివన్నియు నిచ్చెను. మఱియు సీతాదేవి ప్రేరింపఁగా నిటు లనెను.

కం॥ హారము సారసనపరి,ష్కారంబును హేమసూత్ర•సత్తమమును గే
యూరంబుల నంగదముల, దారార్థము నీకొసంగు•ధరణిజ కొనుమీ.

హారము=ముత్యాలసరము, సారసనపరిష్కారము=స్త్రీలు నడుమున ధరియించు ముప్పేట మొలనూలు, హేమసూత్రసత్తమము=మేలైన స్త్రీలు మెడలో ధరించు తీఁగవంటి సొమ్ము,కేయూరములన్=రెట్టకడియములను, దారార్థము= నీ భార్యకొఱకు, ధరణిజ=సీత.

తా త్ప ర్య ము

అయ్యా! నీ భార్య ధరించుటకై ముత్యాలసరము ముప్పేట మొలనూలు, బంగారుతీఁగ, రెట్టకడియములు భుజకీర్తులు సీత యిచ్చుచున్నది. తీసికొనుము

కం॥ తల్పంబును మణిరచితా, కల్పంబు నొసంగు జనక•కన్యక గొను నీ
తల్పముకై వనగమనా, నల్పవినిశ్చయముఁ జేసి•నారము విబుధా!

తల్పంబును=పానుపును, మణిరచితా కల్పంబును=మణులచే రచియింపఁబడిన యాభరణములు గలది, కొనుము=నీయొద్ద నుంచుకొనుము, ఈమంచము భద్రపఱచియుంచుటకై యియ్యఁబడెను గాని నమమ యని దానముగానీయఁబడలేదు, వనగమనానల్ప వినిశ్చయము=వనగమనమందు దృఢనిశ్చయము– విబుధా=పండితుఁడా, తల్పము=భార్య. ౪౬౪ ప. వ్యాఖ్య చూడుఁడు.

తా త్ప ర్య ము

మణులుచెక్కిన యాభరణములచే నలంకరింపఁబడిన పానుపును నీయొద్ద నుంచుకొనుము. వనవాసమునకై ప్రయాణముచేయ దృఢనిశ్చయము చేసినారము.

తే॥ మేనమామయొసంగిన•మేటిగజముఁ,
గొనుముశత్రుంజయాఖ్యంబుఁ•గూడనిడుదు
వేయిగజము లటంచు వే•ర్వేఱ నీయ,
నన్నిగైకొనిరామువా•క్యంబుఁ బట్టి. ౮౯౭

శత్రుంజయాఖ్యంబు=శత్రుంజయమను పేరుగలది. ఇది శ్రీరామునకై మేనమామ యిచ్చినది, ఈ పేరుగలది దశరథునకు నొకటిగలదు. ఇది యది కాదు. దీనితోడ నింక వేయి యేనుఁగులిచ్చెదను, తీసికొనుమని వేఱువేఱుగా నీయన్= ప్రత్యేకప్రత్యేకముగా నీయఁగా– సంయుక్తమున నలఘురేఫము లఘువగును. కావున వేర్వేఱయ్యెను. తా త్ప ర్య ము

నాకు మా మేనమామ యిచ్చినది శత్రుంజయమను పేరుగల యేనుఁగు గలదు, దానిని వేయి యేనుఁగులతోడ నిచ్చెదను. గ్రహింపుము అని వేఱు వేఱుగా నీయఁగా శ్రీరాముని మాటప్రకారమే వానిని గైకొని

సీ॥ ప్రీతి సుయజ్ఞుండు•విధ్యుక్తరీతిని, రామలక్ష్మణుల ధ•రాతనూజ
దీవించి యరుగ ని•జావరజుం గని, యాయగస్త్యుని గా•ధేయసుతుని
నర్చించి పైరున•కంబువుల్ గూర్చిన, గతి నిమ్ము వారికి•గవులు వేలు
వెండియుఁ బైఁడియు•వివిధరత్నములుఁ,గౌసల్యభక్తిమైఁ•గాంక్షతోడ
తే॥నాశ్రయించినతైత్తిరీ•యగురువునకుఁదన్వికొనుదాఁకయానముల్•దానిపిండు
పట్టుఁబుట్టంబుల నొసంగు,•పశుకములను!
నాలవేయింటి రత్నధ•నాంబరముల. ౮౯౮

విధ్యుక్తరీతిని=శాస్త్రములోఁ జెప్పిన ప్రకారము, నిజావరజున్=తన తమ్ముని, అంబువుల్=నీళ్లు, గవులు=గోవులు, పశుకములను=అల్పపశువులను–

ఇచట కప్రత్యయ మల్పార్థకము. పైరునకు నీళ్ళు గూర్చినట్టులను నుపమానము సత్పాత్ర దానమును సూచించుచున్నది. అపాత్రదానము బీటికినీళ్ళు కట్టినట్లు వ్యర్థము.

తాత్పర్యము

సంతోషముతో సుయజ్ఞుఁడు శాస్త్రమునఁ జెప్పఁబడిన ప్రకారము సీతా రామలక్ష్మణులను దీవించిపోఁగా శ్రీరాముఁడు తన తమ్మునితో నిట్లనియె. అగస్త్యకుమారుని విశ్వామిత్రకుమారుని బూజించి పైరునకు నీళ్ళుగూర్చి నట్లు వారికి వేయి యావులను వెండిబంగారు అనేక విధములైన రత్నములనిమ్ము. కౌసల్యాదేవి నాశ్రయించియుండు నట్టియు తిత్తిరీశాఖాధ్యయనము చేయు వారికి నధ్యాపకుఁడైనట్టి వానికిఁ దనివి దీర వాహనములు, దాసుల సమూహ ములు పట్టువస్త్రములు మేఁకలు మొదలగు సన్నజంతువులను వేయి యావు లను రత్నములు ధనములు వస్త్రములు నిమ్ము.

తే॥ పెద్దకాలంబుగాఁగ నా॰వీట నున్న, సూతునకుఁ జిత్రరథునకుఁ బ్రీతి॰నిమ్ము
ధనములును వస్త్రతతులుర॰త్నములుఁ,
జాలుఁ, జాలుననియెడునందాఁక॰సంతసింప ౮౯౯

తాత్పర్యము

చాలఁగాలముగ నాయింటనుండు చిత్రరథుఁడను సూతునకు ధనములు వస్త్రములు రత్నములు నాకుఁ జాలుఁ జాలునని యతఁ డనుదాఁక నిమ్ము.

తే॥ వటుకఠులు మఱికాలాప॰వర్గములును, నధ్యయనశీలు రగుట ని॰రంతరంబు
నన్యమేదియుఁ జేయక॰యలసు లగుచు,
వాచవిగఁ దినఁ గోరెడు॰వారుమఱియు ౯౦౦

వటుకఠులు=బ్రహ్మచారులు, కఠుఁడు చెప్పినవేద శాఖ నధ్యయనము చేయువారు, కాలాపచరములు=కలాపిచెప్పిన వేదశాఖ నధ్యయనముచేయు బ్రహ్మచారుల గుంపు, అధ్యయనశీలురు=అధ్యయనము చేయుటయే ప్రధాన కార్యముగాఁగలవారు, అగుటన్=అయిన కారణమున, అలసులు=సోమరులు, వాచవిగన్=నోటికి రుచిగ, ఆశ్రమంబులందుండు శిష్యులు అధ్యయనము చేయనికాలమందు నడవులకుఁబోయి గురువునకుఁ దమకుఁ గావలసిన సమి ధలు, ధర్భ, కందమూల ఫలాదులు తెచ్చుచుందురు. వీరు రాజధానియం దుండు వారగుటచే నట్టికార్యము లేవియులేవు కావునఁ జదువు తిండి తప్ప వేఱేమియుఁ నెఱుఁగరు కావున సోమరులనఁబడిరి.

మితాహారనియమము బ్రహ్మచారులకు లేదు.

శ్లో॥ అష్టౌగ్రాసా మునేర్భక్ష్యా, షోడశారణ్య వాసినః
ద్వాత్రింశతం గృహస్థస్త-హ్యమితం బ్రహ్మచారిణః

ఎనిమిది కబళములు సన్న్యాసియుఁ బదునాలు వానప్రస్థుఁడును, ముప్పది రెండు గృహస్థుఁడును, అమితముగా బ్రహ్మచారులును భుజింపవలెను. కబళ మనఁగా ఒకసారి నోటినిండఁ బట్టునంతటి పిడికిటి ముద్ద.

శ్లో॥ ఆహితాగ్నిరన డ్వాంశ్చ, బ్రహ్మచారీ చతేత్రయః
అశ్నంత ఏవ సిధ్యంతి, నైషాం సిద్ధి రనశ్నతామ్.

అహితాగ్నియు, ఎద్దులు, బ్రహ్మచారి, ఈముగ్గురు తినుటచేతనే యిష్ట సిద్ధిఁగాంతురు. వీ రుపవాసములవలన సిద్ధిఁగాంచరు అని వసిష్ఠుఁడు చెప్పెను.

తా త్ప ర్య ము

బ్రహ్మచారులు కఠశాఖచదువువారు కలాపిశాఖచదువువారు వేదాధ్యయనము చేయువారగుటచే నే పనియుఁ జేయక సోమరులయి నోటికి రుచిగ తినఁ గోరువారు.

తే॥ గొప్పవారలమెప్పులఁ•గూరినార
లగుట నెనుబదిలొట్టిల•నవ్వి మోయు
రత్నములతోడ నిమ్ము క్షీ•రంబు పెరుఁగు
ఘృతము లభియింప వేయాల•నిమ్ము మఱియు.   ౬౧౧

తా త్ప ర్య ము

గొప్పవారల మెప్పు పొందినవారగుటచే నెనుబదియొంటెలు నవిమోయు రత్నములు వారికిఁ బాలు పెరుఁగు నెయ్యిలభించునటులు వెయ్యియావుల నిమ్ము.

కం॥ ఇమ్ము కృషికర్మమగువృష,భమ్ముల నిరువాలు మఱియు•వ ద్లొకవెయిగో
తమ్ము లవి మోయునెద్దులఁ, దమ్ముఁడ వేవేగ యిచ్చి•తరలింప వయా.

తా త్ప ర్య ము

మీఁద జెప్పినవిగాక సేద్యమున కుపయోగించు రెండు నూర్లయెద్దులను వెయ్యిగోతముల వడ్లను నవిమోయు నెద్దులను త్వరగా నిచ్చి వీరినిబంపుము.

తే॥ వటులసంఘంబు కౌసల్య•భవనమునను,
గలుగు నం దొక్కరొకరికిఁ•గాంక్షదీర
వేయి వెయి యాలనీవయ్య•వేలు వేలఁ,
దల్లి మెచ్చంగవలయు నా•దానవిధిని.   ౬౦౩

తా త్ప ర్య ము   ౬౦౨

కౌసల్యయింట బ్రహ్మచారులు పెక్కురు గలరు. వారిలో నొక్కొక్కరికి వారి కోర్కిదీర వేయియావులవంతున వేలువేలు నిమ్ము. నాదానవిధానమును దల్లి మెచ్చవలయును. కృతేయుగే బలిర్దాతా. త్రేతాయాం రఘునందన" యను నది స్మరింపనగు.

తే॥ తక్కినద్విజాతులకు నెల్లఁ దగినరీతి, మక్కువ నొసంగుమీ నీవు తక్కుధనమ
టన్న సౌమిత్రి రాముని యాజ్ఞ రీతి, ధనదునట్టులు సర్వంబుఁ దాన మిచ్చె.

తా త్ప ర్య ము   ౯౦४

తక్కిన బ్రాహ్మణులకు నెల్లవారివారికిఁ దగినట్లు ప్రేమతో మిగిలినధనము నెల్లనిమ్ము. అని చెప్పఁగా శ్రీరాముని యాజ్ఞప్రకారము లక్ష్మణుఁడు కుబేరుని వలె సర్వము దానము చేసెను.

ఉ॥ కన్నుల నీరు జాలుకొనఁ గాఁతియపాటున నిల్చియున్న యా
సన్ననిజానుజీవులకుఁ జాలధనంబులు వేఱు వేఱ తా
మన్నన మున్నుగా నొసఁగి మామక గేహముఁ దమ్మునిల్లు ము
న్నున్నవిధంబుగా నరయుచుండుఁడు మాయిటవచ్చునంతకున్.   ౯౦౫

జాలుగొను=ప్రవహింపఁగ, ఆసన్ననిజాను జీవులకున్=సమీపించియున్న తన సేవకులకు, మామక గేహము=నాయిల్లు, తమ్ముని గేహము = లక్ష్మణుని యిల్లు, మున్నున్న విధంబుగా=ఇంతవఱకు నెట్లో యట్లే. అరయుచుండుఁడు= విచారించుచుండుఁడు.

తా త్ప ర్య ము.

అందఱికన్నియు నియ్య లక్ష్మణునకుఁ జెప్పి కన్నీరు వెల్లు వగాఁ బాఱఁ దన సమీపంబున నిలఁబడియుండు తన సేవకులంజూచి వారికిఁ దానే సగౌరవ ముగాఁ జాలధనము వేఱువేఱుగా నందఱికిచ్చి మీకు జీవనహాని భయములేదు. మేము మరలి వచ్చువఱకు మాయిల్లు లక్ష్మణుని యిల్లు మీరిప్పటివలెనే కనిపెట్టి యుండుఁడు మీరు వీనిని విడిచి యెందును బోవలదు.

చం॥ అనుమను వారితో నని ధనాధిపతిం గని విత్త మెల్ల వే
కొని యిటు రమ్మ టన్నఁ జని గొబ్బున వాఁ డరుదేర నిచ్చె ని
ర్ధను లగుబాలవృద్ధులకుఁ గ్రచ్చఱ సద్ద్విజవర్యకోటికిన్
జనసుతకీర్తిశాలి రఘుచంద్రుఁ డు లక్ష్మణసంయుతంబుగన్.   ౯౦౬

తా త్ప ర్య ము

అని వారికిఁ జెప్పి తన ధన కోశాధిపతినిఁ జూచి నాకుఁగల ధనమంతయు నిటకుఁదెమ్ము. అన వాఁడు శీఘ్రముగఁ దేఁగ దాని నెల్లబాలురకు వృద్ధులకు సద్బ్రాహ్మణుల సమూహమునకు లక్ష్మణుతోడ శ్రీరాముఁడిచ్చెను.

—• త్రిజటుఁ డను బ్రాహ్మణు వృత్తాంతము •—

ఉ॥ నాఁగటికఱ్ఱు గుద్దలియు నాఁగలియుం గొని యుంఛవృత్తికిన్
లోఁగి దినంబునన్ వనములోనఁ జరించుచు, లేవడిం గడున్
దోఁగి, జరాభరంబునను దూలుచు జవ్వని నాలి బిడ్డలన్
బ్రేఁగునఁ బ్రోవుసేయు నొక పింగళవర్ణుఁడు గార్గ్యుఁ డత్రిజటున్.   ౯౦౭

నాఁగలి, దోఁటి, ఉంచవృత్తి=పొలములలో రాలిన గింజలనేఱికొని తిని జీవించువృత్తి, లేవడిన్=దారిద్ర్యముచే, తోఁగి=మునిఁగి, జరాభరంబునను=అతిశయించిన ముసలితనముచే, జవ్వని=యౌవనవంతురాలిని, ప్రేఁగునన్=కష్టముతో, ప్రోపు=రక్షణము, పింగళవర్ణుఁడు=దారిద్ర్యముచే బూజు పాఱినమేని రంగుగలవాఁడు, గార్గ్యుఁడు=గర్గుని వంశమునఁ బుట్టినవాఁడు, అర్తిటిన్=ఆసమయమందు.

తాత్పర్యము

నాఁగేటికొన ములికియు, గడ్డపాఱయుఁ బండ్లు కోయుగోఁటియుఁ గొని యుంఛవృత్తికిలోపడి దిన దినము వనములో సంచరించుచు దారిద్ర్యమున మునిఁగి మిక్కిలి ముసలివాఁడై నడువలేక యూఁగుచు వయస్సుభార్యను బిడ్డలను నతికష్టముతో రక్షించు గర్గవంశమునఁ బుట్టినవాఁడు పేదఱికముచే బూజు వాఱిన దేహముగలవాఁడు త్రిజటుఁడను బ్రాహ్మణుఁడు ఆసమయంబున.

విష్ణుపురాణము ప్రకారము వివాహకాలమునఁ గన్యకకు నెనిమిది సంవత్సరములయినచో వరునకు నిరువదినాలుగు సంవత్సరము లుండవలయును. కావున స్త్రీకి మంచిప్రౌఢవయస్సు వచ్చునప్పటికి (30) భర్తకు నలువదియాఱు సంవత్సరములగును. అయినను బ్రాహ్మణస్త్రీలు దపములచే వ్రతములచేఁ గాలము గడుపుచుందురు కావునను ఋతుకాలమందు మాత్రమే సంగమింతురు కావునను బ్రహ్మచర్యదీక్షగలవారు కావునను వారికి కామబాధవలనఁగలుగు దుష్టచేష్టలపై మనసుపోదు.

ఉ॥ దైవవశంబునం బురిని•దారఁగఁ గల్గుట భర్తఁ జూచి యా
పావని పాఱ గుద్దలిని•బాఱఁగ వైవుము రామచంద్రునిన్
నావచనంబు చేకొని క•నం జనుమీ మముఁ దెల్ప ధర్మస
ద్భావనుఁ డించు కేనియుఁ గృ•పన్ దయచేయఁడె యాలమేటికిన్. ౯౦౮

దైవవశంబునన్=దైవసంకల్పమున, (2) వాని భాగ్యము కారణముగ, తారఁగన్=సంచరించునట్లు, పావని=పతివ్రతయైన యతనిభార్య, మముఁ దెల్పన్=మమ్ముగుఱించి చెప్పఁగా, ధర్మసద్భావనుఁడు = ధర్మముతోఁగూడిన మంచి యభిప్రాయముగలవాఁడు, ఆలము=ఆలస్యము-ఉపేక్ష.

తాత్పర్యము

ఆయన యదృష్టము కొలఁది దైవసంకల్పమున నా నగరమందు సంచరింపఁ గలుగునట్లు తటస్థింపఁగలుగుటచేఁ బతివ్రతయగు నాతనిభార్య మగనితో పాఱగుద్దలి పాఱవైచి నామాటవిని శ్రీరామచంద్రునిఁజూడఁబొమ్ము. భార్య బిడ్డలు గలవాఁడ దరిద్రుఁడనని దెలుపుము. ధర్మబుద్ధిగల శ్రీరాముఁ డేకొంచెమో దయచేయకుండునా పొమ్ము. ఆలస్యము చేయకుము.

కం॥ అని బోధించినఁ ద్రిజటుఁడు, తన పుట్టముచింపులెల్ల•దశరథసుతుఁడున్
గనకుండ దాఁపఁ జుట్టుచు,ననువుపడక చనియె రాము•నాలయమునకున్.

పుట్టము=వస్త్రము, దాఁపన్=మఱుఁగుపడునట్లు, అనువుపడక=సాధ్యము గాక.

తా త్ప ర్య ము

అని బోధింపఁగాఁ ద్రిజటుఁడు తాను గట్టిన వస్త్రమునందలి చింపులెల్ల శ్రీరామునకుఁ గానరాకుండునట్లు దాఁచిపెట్టఁగోరి యిటునటు ద్రిప్పి దోఁపియేమి చేసియు దాఁచుటకు సాధ్యముగాక శ్రీరాము గృహమునకుఁ బోయెను.

కం॥ కొంచ కెద నంగిరో భృ, గ్వంచితతేజుఁ డగుత్రిజటుఁ•డరుగఁగ నతనిన్
బంచమకక్ష్యవఱకు వాఁ,రించినవాఁ డెవఁడు లేఁడు•శ్రీరామాజ్ఞన్. ౯౧౦

ఎదన్=హృదయమందు, అంగిరో భృగ్వంచితతేజుఁడు = అంగిరువలె భృగువువలె గొప్ప బ్రాహ్మణ తేజస్సుగలవాఁడు, పంచమకక్ష్య=ఐదవకట్టు, వారించినవాఁడు=వలదని చెప్పినవాఁడు.

తా త్ప ర్య ము

మనస్సులో సంకోచింపక కూటికిఁ బేదయయ్యుఁ దపము బలమున నంగిరుతోను భృగువుతోను సమానమైన బ్రాహ్మణ తేజస్సుగల యా త్రిజటుఁడు శ్రీరాముని యింటిలోనికిఁబోఁగా ముందే పంచమకక్ష్యవఱకు నెవరినైనఁ రానిండు అడ్డగింపవలదని శ్రీరాముఁ డాజ్ఞాపించియుండుటచే నాయనను నెవరు పోవల దను వారు లేరైరి.

కం॥ జనపతిసుతు డాయఁగఁ జని,
యనియెం ద్రిజటుండు రాఘ•వా!నిఱుపేదన్
గనికరముం జూపుము నే, పని బ్రదికెద నుంఛవృత్తి•బహుపుత్రకుఁడన్.

తా త్ప ర్య ము ౯౧౧

శ్రీరాముని సమీపమునకుఁబోయి త్రిజటుఁ డీట్లనియెను. రామచంద్రా నిఱుపేదను, పెక్కురు బిడ్డల, గలవాఁడను. ఉంఛవృత్తిచే జీవించుచున్నాను. నాయందుఁ గనికరింపుము.

శ్లో॥ యాత్రామాత్ర ప్రసిద్ధ్యర్థం, స్వైః కర్మభిరగర్హితైః
అక్లేశేన శరీరస్య, కుర్వీత ధనసంచయమ్.

దేహయాత్ర జరుగుటకుఁగాను శాస్త్రనిషిద్ధముగాని స్వకర్మములచే శరీర క్లేశములేక గృహస్థుఁడు ధనము సంపాదింపవచ్చును. బ్రాహ్మణకర్మములలోఁ బ్రతిగ్రహము చేరినది కావున నిది శాస్త్రనిషిద్ధము కాదు. దేహధారణమునకై కుటుంబరక్షణమునకై యడిగెను గావున గర్హితముగాదు. బ్రాహ్మణుఁడు ధనముఁగూర్చి దాఁచియుంచవలెనని యార్జింపరాదు, యాచింపరాదు, కుచే లునివలె.

"నరాజ్ఞః ప్రతిగృహ్ణీయా ల్లుబ్ధస్యోచ్ఛాస్త్ర వర్తినః"
యని రాజులవలనను లోభులవలనను ప్రతి గృహము నిషిద్ధముగదా ఎట్లుత్రిజ టుఁడు శ్రీరామునిసొత్తు గ్రహింపఁగోరెను. ఇది యాపదలందు, ధర్మనిష్ఠులు రాజు లయినపుడు నన్వయింపదు. అదియునుగాక
దేవాతిథ్యర్చనకృతే, గురువృత్త్యర్థ మేవచ
సర్వతః ప్రతిగృహ్ణీయా, దాత్మవృత్త్యర్థ మేవచ.
దేవతలనతిథుల నర్చించునిమిత్తము, గురువును బోషించునిమిత్తము, తన దేహధారణము నిమిత్తము సర్వత్ర ప్రతిగ్రహింపవచ్చును. అదియునుగాక
వృద్ధౌచ మాతాపితరౌ, సాధ్వీభార్యా, శిశుస్సుతః
అప్యకార్య శతంకృత్వా, భర్తవ్యా మను రబ్రవీత్.
ముసలి తల్లిదండ్రులను, పతివ్రతయగు భార్యను పసిబిడ్డయగు కొడుకును నూ అకార్యములు చేసియైన రక్షింపవలయునని మనువు చెప్పెను. కావున త్రిజటుని యాచన దూష్యముకాదు.

చం॥ అన దరహాసభాసురముఖాంబుజుఁడై రఘురాముఁ డాడు నో
యనఘచరిత్ర! నామొదవు-లం దొకవేయియుమాత్ర చిక్కె, నీ
వును నొకదండమున్ విసరి-పో విడుమీ, యది యెంత మేర లోఁ
గొను నది యంత నీకిడుదుఁ-గొల్చుము నీ భుజశక్తి నావుడున్. ८१-३१

దరహాసభాసుర ముఖాంబుజుఁడై=చిఱునవ్వుచేఁ బ్రకాశించు ముఖకమలముగలవాఁడై, అనఘచరిత్ర=పాపములేని నడవడిగలవాఁడా, చిక్కెన్=మిగిలెను, మొదవులందున్=ఆవులందు.

తాత్పర్యము

అని చెప్పఁగా శ్రీరాముఁ డింత ముసలియుఁ దపస్వియునయ్యు దారపుత్రాదులనిమిత్తము యాచింపవలసినవాఁడయ్యెఁ గదా. ఈయన సత్తయెంతో తెలిసికొందము అని యాయనను జూచి పుణ్యచరిత్రా నాయావులందు దానమీయఁగా మిగిలినవి వేయియున్నవి. నీవు నొక కఱ్ఱతీసికొని యామందపై విసరివైవుము. అది యెంతదూరమునఁబడునో యిచ్చటనుండి యంతవఱకుఁ గల యావులనన్నిటిని నిచ్చెదను. ఏదీ నీ భుజబలమును బరికొల్చుము. అనఁగా.

ఉ॥ దోవతి యెత్తి చెక్కి, పయి-దుప్పటి చక్కబిగించి చుట్టి, యా
పై వల కేల దండమును-బట్టి, పదంబులు ముందువెన్కగాఁ,
జేవను నీలకర్చికొని-చెచ్చెరఁ బ్రాణము లెల్లఁ, బాఱుఁడున్
దా విసు రొప్ప వీచి ప్రమ-దంబున గోవులలోన వైచినన్. ८१३२

వలకేలన్=కుడిచేతియందు, ఈలకర్చికొని=దంతములు గట్టిగాబిగించి, పాఱుఁడు=బ్రాహ్మణుఁడు, ప్రమదంబునన్=సంతోషముతో.

తాత్పర్యము

వ్రేలాడుచున్న దోవతియంచులను పైకెత్తి చెక్కియది జారిపోకుండ మీఁద దుప్పటి బిగించి చుట్టి యావలఁ గుడిచేత దండమునుబట్టి కాళ్లుముందు వెనుకలుగాఁబెట్టిశక్తికొలఁది ప్రాణములను నీలకర్చికొని పండ్లు బిగించి యా బ్రాహ్మణుఁడు దానిని త్రిప్పి త్రిప్పి విసరునసంతోషముతో నావుల గుంపులో వైచెను.

ఆవులన్నిటిని బ్రాహ్మణున కీయవలయుననిమనస్సునందుండినను బ్రాహ్మణ ప్రభావము వెలిపఱుపఁగోరి నవ్వులాటకు రామచంద్రమూర్తి యిట్లను టచే నంతటి కష్టదశప్రాప్తించినను నది యాయనకు రపంతయైన మనస్సున నాటలేదని యీ పరిహాసచర్య దెలుపుచున్నది. ఇట్లు పనిచేయించి పరీక్షించి యిచ్చుటచే బ్రాహ్మణుని యాచనాదోషమును దొలఁగించినవాఁడయ్యెను. బ్రాహ్మణుఁడు కష్టించి సంపాదించినవాఁడయ్యెను.

చం॥ ఫలపవనాంబు భోజనశుభవ్రత వృత్తులఁజేసి చూడ దు
ర్బలతనులయ్యు బ్రాహ్మణ లపారతపోబల సంపదన్ మహా
బలయుతు లట్టివారలకు భవ్యులకెందు నసాధ్య మెద్దియుం
గలదె?చరాచరాఖిల జగంబులఁ బెద్దలుగారె సద్ద్విజుల్.భార-ఆది-౭౧౮౪

ఈకాలమున బ్రాహ్మణులు భ్రష్టులగుటకు తపస్సులేకుండుటయే కారణము.

కం॥ సరయూతీరమునందుం, బరఁగెడివేవేలయాలఁబసవనలకడన్
ధరణీసురకరముక్తము, గురుదండము పడఁగఁజూచిఁగౌఁగిలిన ప్రేమన్.

వేవేలయాలన్=వేలకొలఁదినుండు నావులలో, బసవనలకడన్=ఎద్దుల యొద్ద, ధరణీసురకరముక్తము=బ్రాహ్మణుని చేతివలన విడువఁబడినతి, గురుదండము=పెద్దకట్టె, కౌఁగిలినప్రేమన్=అతిశయించిన ప్రేమచేత.

తాత్పర్యము

బ్రాహ్మణునిచే విసరివేయబడిన యా గొప్పకట్టె సరయూనది యొడ్డునం దొప్పుచున్న యావులగుంపుల నన్నిదాఁటి యెద్దులసమీపమందుఁబడఁగా శ్రీరామచంద్రమూర్తి యతిశయించిన ప్రేమచే.

ఉ॥ కౌఁగిటఁ జేర్చి యావిబుధకాంతుని నాసరయూతటంబు నై
మ్రేఁగినయాల నెల్లఁ గొని వ్రేఁడులు మౌనివరాశ్రమంబునన్
వీఁగక తోలుఁ డంచుఁ బృథివీతనయారమణుండు పల్కి ని
న్నే గనలేక కోఁడమువలేమొ వచించితి నన్ను నైఁపవే. ౯౧౫

విబుధకాంతుని=బ్రాహ్మణశ్రేష్ఠుని, ఆ సరయూతటము=సరయూతీరము వఱకు, మ్రేఁగినయాలన్=ఆవరించుకొన్న యావులను, వ్రేఁడులు=గొల్లజాతి వారలు, మౌనివరాశ్రమంబునన్=మునిశ్రేష్ఠుని యాశ్రమమందు, వీఁగక=

వెనుదీయక: పృథివీతనయారమణుండు, కనలేక=తెలిసికొనలేక, కోఱడములు=పరిహాసవాక్యములు, ఏమొ=ఏవేవో, సైఁపవే=మన్నింపుమా.

తాత్పర్యము

ఆ బ్రాహ్మణ శ్రేష్ఠునిఁ గౌఁగిలించి గొల్లలారా మీరు సరయూతీరము పఱకుఁగల యావులనెల్ల, దోలుకొనిపోయి, దానము తీసికొన్నవారు గదా తోలికొనిపోవలయు ననక, యీ మునీశ్వరు నాశ్రమమందుఁ దోలిరండు అని చెప్పి త్రిజటునిఁజూచి తపోధనా నీశక్తి తెలిసికొనలేక నవ్వులమాట లేవేవో మాటలాడితిని క్షమింపుమీ.

చం॥ అలుగకుమీ మహాత్మక! దుఃరత్యయ మౌభవదీయ తేజముం
దెలియఁగఁ గోరి వేసుకకుఁనే నటు పల్కితి, నింకఁ గొంతయే
కలదు ధనంబు, గోరు మదిఁకాంక్షిత మేని యొసంగువాఁడ, నా
పలుకు నిజంబు నాధనముఁబ్రాహ్మణకోటినిమిత్తమే సుమీ. ౯౧౬

అలుగకుమీ=కోపింపకుమీ, మహాత్మ=గొప్ప మనస్సుగలవాఁడా. దురత్యయము=మీఱరానిది, భవదీయతేజమున్=నీ తేజమును, కాంక్షితమేని=కోరికగలదేని.

తాత్పర్యము.

మహానుభావా, నాపై గోపింపకుము వార్ధకమునకుఁ దోడాహారములేక కేవలదుర్బలమైన నీదేహమునందుఁగల తేజస్సులోకులకుఁ దెలుపంగఁగోరి వినోదార్థము నే నటుపలికితినిగాని నీ కావు లీయవలసివచ్చునని కాదు. ధనమందునునిఁకఁ గొంతగలదు నీకుఁ గోరికకలదేని యదియు నిచ్చెదఁ గైకొనుము. నేనునిజము చెప్పుచున్నాను. మునుపటివలెఁ బరిహాసవాక్యములు గావు. నా ధనమంతయు బ్రాహ్మణ సంఘరక్షణార్థమేకాని నా నిమిత్తమైకాదు.

ఆవృత్తానాం గురుకులా, ద్విప్రాణాం పూజకోభవేత్
నృపాణామక్ష యోహ్యేష, నిధి బ్రాహ్మోభిధీయతే. మను. ౭౮-౨

గురుకులమున వేదాధ్యయనము పూర్తిగావించి మరలివచ్చిన వివాహార్థులగు బ్రాహ్మణులను రాజులు ధనధాన్యములొసఁగి శాస్త్రప్రకారము పూజింపవలెను. ఇట్లు బ్రాహ్మణులం దుంపఁబడిన ధనధాన్యాదులు నిధివలెఁ దఱుఁగనివై యెల్లప్పుడు వీరికి మేలు గావించును.

కం॥ నినుబోఁటి మహాత్ములకున్, ధన మెల్లను నీయఁగా నిఁతాంతయశంబున్
ఘనసంప్రీతియుఁ గలిగెడు,
నన నాతఁడు తుష్టుఁ డగుచుఁనావాక్యములన్. ౯౧౭

నినుబోఁటి=నీవంటి, నితాంతయశంబున్=మిక్కి కీర్తియు, ఘనసంప్రీతియు=గొప్పసంతోషము, తుష్టుఁడు=సంతోషించినవాఁడు, శ్రీరాముని దుఃఖస్థితి యేమో పరిహాసమునందు మనస్సుపోవుటయేమో !! ఆయనకుదుఃఖము మనస్సునకుఁ దగులనేలేదు.

తాత్పర్యము

సీవంటి మహాత్ములకు ధనమంతయు నిచ్చిన విస్తారకీర్తియు గొప్పసంతోషమును గలుగును అనిన వాక్యముల కాయన సంతోషించి ధనముతో నాకేమియుఁ బనిలేదని తీసికొనక

తే॥ యశముబలమునుబ్రీతియు•నతులసుఖము,
వృద్ధియగునంచు దీవించి•విప్రవర్యుఁ
డాలితోడను జేకొన్న•యాలతోడ, స్వాశ్రమావనికిని నేగె•నంత విభుఁడు.

తాత్పర్యము ౯౧౫

కీర్తి, బలము, సంతోషము, అసమానమగు సుఖము వృద్ధియగుఁ గాక యని దీవించి భార్యతోడను తనకు శ్రీరాముఁడిచ్చిన యావులతోడను దన యాశ్రమభూమికిఁ బోయెను.

చం॥ అనుపమధర్మవిక్రమగు•ణార్జితవిత్తము లాప్తకోటికిన్
ఘనుఁ డతిగౌరవంబు మును•గా మనసార నొసంగె, విప్రమి
త్రనిచయభృత్యపాళికి వ•దాన్యవరుండు దరిద్రభైక్ష్యజీ
వనపరసంచయంబుల క•వారిగ నిచ్చె యథార్హపూజలన్. ౯౧౬

అనుపమధర్మ విక్రమగుణార్జిత విత్తములు=అసమానమైన ధర్మము,ధర్మముతోఁగూడిన పరాక్రమముచే నార్జింపఁబడిన ధనములు. ఇట్లనుటచే నాయన ధనమంతయు స్వధర్మమునను సరించి ధర్మపద్ధతి సంపాదించినదేకాని యన్యాయార్జితమందుఁ గొంచెమైననులేదు. ఇది పితృధనమునుగాదు అనుట, ఆప్తకోటికిన్=ఆప్తులసమూహములకు,గౌరవంబు మునుగాన్=ముందుగా గౌరవించి, మనసారన్=నిండుమనస్సుతో- ఉన్నదంతయు నందఱకు నీయవలసివచ్చెనే యను విచారములేక యిట్లిచ్చుట తటస్థించెఁగదా యను సంతోషముతో, విప్రమిత్రనిచయ భృత్యపాళికిన్ = బ్రాహ్మణులకు మిత్రుల సమూహమునకు-భృత్యులసమూహమునకు, వదాన్యవరుండు = దాతలయందు శ్రేష్ఠుఁడు, యథార్హపూజలన్=వారివారి యోగ్యతకుఁ దగినట్లు గౌరవించి.

తాత్పర్యము

అసమానమైన సత్యపరాక్రమత్వముచే స్వధర్మమనుసరించి తానుసంపాదించిన ధనము లాప్తులను గౌరవించి సంతోషముతో నిండుమనస్సుతో నిచ్చెను. వారికేగాక బ్రాహ్మణులకు స్నేహితులకు సేవకులకు దరిద్రులకు భిక్షమెత్తి జీవించువారికి వారివారికిఁ దగినరీతి గౌరవించి యలక్ష్యబుద్ధిలేక విస్తారముగ నిచ్చెను.

—• { ౩౩-వ సర్గము. సీతారామలక్ష్మణులు తండ్రియొద్దకుఁ బోవఁజూచి ప్రజలు దుఃఖించుట. } •—

ఉ॥ ఈవుల నెల్లవారలను • దృప్తులఁజేసి రఘూద్వహుల్ ధరి
త్రీవరకన్యతో నరుగు • దేరఁగఁ దండ్రిని జూడఁ గోరి శో

భాఽవిరళంబులున్ మలయ•జార్చితముల్ వరసాధనంబులున్
గ్రేవల(గ్రేల(బోవ(గ(బు•రీజనముల్ గని దుఃఖతప్తులై. ౯–౧౦

ఊవులన్ = దానములచే, శోభాఽవిరళంబులున్ = దట్టమైన కాంతిగలవి, మలయజార్చితముల్ = చందనముచే(బూజింప(బడినవి, వరసాధనంబులున్ = శ్రేష్ఠములైన యాయుధములు, గ్రేవలన్ = పార్శ్వములందు.

తాత్పర్యము

దానములచే నెల్లవారిని(దృప్తుల(జేసి రామలక్ష్మణులు సీతాదేవితో(దండ్రిని(జూడ(గోరి యిల్లువిడిచి వెలుపలికిరా(గా దట్టమైన కాంతులుగలిగి గంధముచే నర్చింప(బడిన యాయుధములు ధనుస్సులు ఖడ్గములులోనైనవి ప్రక్కల వ్రేలాడుచుండ(బోవుచుండ(గా(బురమునందలి జనులు మిగుల దుఃఖముచే(దపించినవారై.

సీ॥ మిద్దెల నెత్తగు • మేడల(బ్రాసాద,శిఖరంబు లెక్కి వీ•క్షించువారు
నెఱసినమూ(కల • యిఱకటంబున(జూడ(, గానమి నగరెక్కి•కాంచువారు
పట్టంగ గొడుగును•బంటొక్క(డును లేక,నడుచురాముని(గని•యడలువారు
కటకటా యెంతటి•కష్టంబు వచ్చెరా, రాముున కని వెత(•గ్రా(గువారు.

తే॥ భవ్యచతురంగబలములు•పటిమ మెఱయ,
వెంబడినిరా(గ వేంచేయు•విభు(డు నే(డు
కాలినడకను దమ్ము(డు•నాలు(దోడు,రా(గ(జనియెడి(గాయని•వే(గువారు.

అడలువారు = దుఃఖించువారు, చతురంగ బలముల = రథములు, ఏను(గులు, గుఱ్ఱములు, కాలిబంటులనెడి నాలుగువిధముల సేనలయొక్క, వే(గువారు = తపించువారు.

ఇది మొదలు ప్రజలకు శ్రీరామునందు(గల ప్రీతి విశ్వాస గౌరవములు ఆయనను విడుచుటవలన వారికి(గలిగిన దుఃఖము వర్ణింప(బడుచున్నది.

తాత్పర్యము

మిద్దెలమీ(దను, మేడలలోను, సౌధములమీ(దను నెక్కిచూచువారును, వ్యాపించియుండు గుంపుల యిఱకటంబున(బడి నలుగుటలో శ్రీరాముని(జూడ(గానక నగరెక్కిచూచువారును, పట్ట(గ గొడుగైనను బంటైనను లేక కాలినడక పోవు శ్రీరాముని(గని దుఃఖించువారును– అయ్యయ్యో మన శ్రీరామునికెంత కష్టము వచ్చెరాయని శ్రీరాముని(జూచి వ్యథచే(దపించువారును ఇంతకు ముందు నాలుగువిధములైన సేనలు వెంబడిరా(గా వేంచేసిన ప్రభువు నే(డు కాలితో నడచి భార్య తమ్ము(డు తోడురా(గ బోవుచున్నా(డుగదా యని నిప్పులలో(బొరలినట్లైనవారును.

కం॥ శ్రీరుచి మరగియుఁ గోర్కులు, కోరెడువారలకు ముదముఁ • గూర్చెడువాఁడై
నేరండు ధర్మగౌరవ, కారణమునఁ దండ్రిమాటఁ • గాకుం జేయన్. ౬-౨౨

కాకున్=వ్యర్థము. తాత్పర్యము

ఐశ్వర్యము రుచి యెట్టిదో యనుభవించి తెలిసినవాఁడైనను కోర్కులు కోరువారికి సంతోషముఁ గలిగించువాఁడయ్యును, ధర్మము నందుండు గురుత్వము కారణముగాఁ దండ్రిమాట వ్యర్థము చేయఁజాలకున్నవాఁడు.

కం॥ ఆకాశచరులకే నా, లోకింపన్ రాదు మున్ను • లోలాంబక నీ
రాకన్నె సీత నిపు డ, స్తోకం బగు తెరువుమూఁక • చూడం గలిగెన్. ౬-౨౩

ఆకాశ చరులకేన్ = ఆకాశమున విమానములమీఁద సంచరించుదేవతలకైనను, అస్తోకము=గొప్పది, తెరువుమూఁక=వీథులలోఁ దిరుగు బీదజనము.

తాత్పర్యము

పూర్వమాకాశమునఁ దిరుగు దేవతలకైనఁగానరాని యారాజకుమారి సీతాదేవిని నిపుడు కన్నవారు గుంపులు గుంపులై చూడ సాధ్యమయ్యెను గదా.

కం॥ హరిచందన సేవిని యగు, పరమోజ్జ్వలితాంగరాగ • పాత్రను గనుచున్
బురజనములు కనునీటిం, బొరిఁబొరిఁ దొరఁగించి రుష్ణ • ముగ శీతముగన్.

హరిచందన సేవిని=హరిచందనమును బూసికొనినది, పరమోజ్జ్వలితాంగరాగపాత్రను = మిక్కిలి ప్రకాశించుమైపూఁతకుఁ బాత్రురాలిని, ఉష్ణముగన్=వేఁడిగ, శీతముగన్=చల్లగా.

తాత్పర్యము

మిగులఁ బ్రకాశించు మైపూఁతలకు యోగ్యురాలై హరిచందనముపూసికొనియుండు సీతనుజూచి పురమునన్నున్న జనములు మీఁద మీఁద మిక్కిలి ధారలుగా శోక బాష్పములను హర్ష బాష్పములను గురియించిరి.

ఇటువంటి గొప్పదానికింతకష్టము వచ్చెఁగదా యని వేఁడికన్నీళ్ళను ఆమె పాతివ్రత్యమునకు సంతోషించి యానంద బాష్పములును గురియించిరి.

—• పౌరులు కైకేయీ దశరథుల నిందించుట. •—

కం॥ దయ్యంబు సోఁకి దశరథు, నియ్యనువునఁ బలుకు నిప్పు • డిది నిక్కం బౌ
నెయ్యెడనైనం బతి తన, నెయ్యపుసుతు నడవి కనుచు • నే దుర్నీతిన్.

తాత్పర్యము ౬-౨౫

అవి దశరథుఁడాడినమాటలుగావు. ఆయన మీఁదఁ బిశాచ మావేశించి యిట్లు పలికినది. అట్లుగాకున్న నెప్పుడైన నేదేశమందైనఁ దండ్రియగు వాఁడు నీతిదప్పి తన గారాబు కొడుకును నడవులపాలు సేయునా.

కం॥ కొడుకు గుణహీనుఁ డైనను, వెడలఁగ నడువంగఁ దగునె? • విశ్వములను మే
ల్నడవడి గెల్చినఘనుఁ దగు, బుడుతని నిటు పాయునట్టి • పురుషుఁడు గలఁడే.

తాత్పర్యము ౯-౨౬

కన్నకొడుకు గుణములేనివాఁడైనను వెడలఁ గొట్టరాదు. న్యాయమిట్లుండఁ దన మంచిగుణములచే లోకమును జయించిన చిన్నపిల్లవానిని నిటువదలిపెట్టు పురుషుఁడుకూడనుండునా. మంచి గుణములు లేవని కొడుకును విడువరాదు. కాని దుష్టగుణములుగలవాఁడై యధర్మవర్తియై యపకీర్తి తెచ్చువానిని సగరువలె వదలవచ్చును.

చం॥ ఒరులకు నొప్పి నీయమి, య • నుత్తమ మౌ దయ, శాస్త్ర చింతనా
పరతయు, సత్స్వభావమును, • బాయనియింద్రియనిగ్రహంబు, ని
ర్భరతరచిత్తశాంతి, రఘు • రాముని పెట్టనిసొమ్ము లౌట, నీ
పురుషవరోత్తమున్ సుగుణ • భూషణుఁ గోల్పడువారు నుందురే. ౯-౨౭

తాత్పర్యము

మనోవాక్కాయములఁ బరులకు నొప్పినీయకుండుటయు, నుత్తమోత్తమ దయయు, శాస్త్రమును జింతసేయుటయందే యాసక్తియు, సాధుస్వభావమును, నేసమయమునందైనను ఇంద్రియములను వానియిష్టప్రకారము పోనీయక వానిని దన స్వాధీనమం దుంచుకొనుటయు, మిక్కిలి యధికమైన శాంతము నీయాఱు గుణములు శ్రీరామచంద్రునకు ధరింపని సొమ్ములు- ఇట్టి పురుషోత్తముని కల్యాణగుణములే యలంకారముగఁ గలవానిని వదలిపెట్టువారుకూడ నుందురా. వివేకము గలవాఁ డెవ్వఁడైన నుండఁడని భావము.

ఉపనిషత్తులందుఁ జెప్పఁబడిన యాఱు హేయగుణములు లేకుండుటయేగాక వానికి మాఱు కల్యాణగుణములేకలిగి కల్యాణగుణములే యాభరణములుగాఁ గల భగవంతుని జీవకోటికంటె నుత్తముని వదలువాఁడు నొకఁడుండునా? అధోలోకములపాలయి పోవువారుందురుగాని బాగుపడఁగోరువా రుండరని భావము.

కం॥ నీరమున బ్రదుకుజీవులు, నీ రిగిరిన గ్రీష్మమునను • నెఱిచెడుమాడ్కిన్
శ్రీరాముఁ డిట్టిధన్యుఁడు, దూరంబుగఁ జనఁగఁ బ్రాన • దూపిలె జనముల్.

తాత్పర్యము ౯-౨౮

శ్రీరాముని విడువలేక జనులింత తపించుటకుఁ గారణము కవి చెప్పుచున్నాఁడు. నీటియందు బ్రతుకు జీవులు గ్రీష్మమున నీరిగిరినఁ బూర్ణముగాఁ దమ స్వరూపముననే చెడునట్లు శ్రీరాముఁడు ప్రజలకు జలజంతువులకు జీవనమైన జలము వంటివాఁడు. దూరముగఁ బోవఁబూనఁ బ్రజలు శోకించిరి. ఇచట నారాయణ శబ్దార్థము వివక్షితము. సమస్తభూతకోటులకు అయనమనఁగా స్థానమైనవాఁడు. జలచరములకు జలమువలె భూతకోటికిఁ దానైనవాఁడు. అట్టివాఁడు దూరముగఁ బోయిన వానినాశ్రయించిన వన్నియుఁ జెడవలసినవే. కావున భగవ

త్సమాశ్రయణముగలవాఁడు చెడఁడుగాని తక్కినవారు చెడెడివారు. అట్టి యాశ్రయము దొలఁగిపోయినచో వివేకి యెవఁడు దుఃఖింపకుండును ?

కం॥ జగదీశ్వరుఁ డగురాముఁడు, వగ పొందిన జగము లెల్ల•వగ చెందుఁ గదా
తగ వేరు హానిఁ జెందిన, నగములఁ బూవులును బండ్లు•నాశము గావే.

తాత్పర్యము ౯౨౯

శ్రీరాముఁడు జగదీశ్వరుఁడు. సమస్తమునకు మూలమైనవాఁడు. ఆయనకు వ్యసనము సంభవించిన లోకములెల్ల దుఃఖించుట యేమివింత. ఎట్లన:– చెట్టు వేరునకు హాని వచ్చెనేని యాచెట్టునందలి పూలు పండ్లు నాశము కావా ?

వేరునకుఁ జెట్టునకుఁ జెట్టునందలి పూలకుఁ బండ్లకు నెట్టిసంబంధమో భగవంతునకుఁ బ్రపంచమునకుఁ బ్రపంచమందలి ప్రాణికోటికి నట్టిసంబంధము తెలియవలెను. ఇందుఁ బరిణామవాదము సిద్ధాంతితము. వాదాద్వైతులలోఁ గొందఱు దీనిని సమ్మతించి కొందఱు సమ్మతింపకున్నను మన్వాదులు ననుభవాద్వైతులందఱు దీనిని సమ్మతించినవారే. రామగీతఁ జూడుఁడు.

కం॥ వరధర్మసారుఁ డతిదు,ర్భరతేజుఁడు వే రితండు•ప్రజలకు, నితరుల్
నరు లాకులు పుష్పంబులు, గురుశాఖలు పండ్లు గారె•గుఱుతుగఁ జూడన్.

తాత్పర్యము ౯౩౦

మీఁది పద్యంబునఁ జెప్పినదానిని గవియే విశద పఱుచుచున్నాఁడు.

శ్రేష్ఠమైన ధర్మమే సారముగాఁ గలవాఁడును మిక్కిలి యధికమైన తేజస్సు గలవాఁడును, నగు శ్రీరాముఁడు ప్రజలకు వేరు– ఇతరులు నరులు ఆకులు పుష్పములు పెద్దకొమ్మలు పండ్లుగదా.

వేరునకు జలమెట్లు సారమో శ్రీరామున కుత్తమ ధర్మము తేజము సారము. వేరులోని జలము వలననే చెట్ల కొమ్మలు కాయలు పూలు పండ్లు ఆకులు జీవించి తేజోవంతములై యుండునో యట్టులే భగవంతుని శక్తిచే జీవకోట్లన్నియు క్షేమముగ నుండఁగలిగినవి.

ఊర్ధ్వమూల మధశ్శాఖ, మశ్వత్థం, ప్రాహురవ్యయమ్, అని భ.గీ. ఉపనిషత్తు లిట్లే చెప్పుచున్నవి. వేరు సత్యమైనపుడు దాని పరిణామమయిన చెట్లు కాయలు పండ్లు పూలు ఆకు లెట్లు సత్యములో భగవంతుఁడు సత్యమైనచో సమస్త ప్రపంచము సత్యమే. మన్ను సత్యమైనచోఁ గుండలు సత్యములే.

నరులు = (1) మనుష్యులు (2) జీవాత్మలు.

ఉ॥ ఆఁటఁగ వచ్చునే రఘుకు•లాగ్రణి రామునిఁ బాసి, యేల యీ
తోఁటలు గేహముల్ వనులు•దొడ్లును లక్ష్మణురీతి వీడి యే
పూఁటకు రాముఁ డెందు నిలఁ•బూను సుఖార్థుల నేకమై యటన్
మాఁటుగలట్టి చుట్టముల•మానినులం గొని యేఁగి యుండమా. ౯౩౧

ఆఁటఁగన్=సహింపఁగా, సుఖార్తులన్=సుఖమునందు దుఃఖమునందు, ఏకమై=సమానమై యొకటై ఏకశబ్దమునకు సమానమని యర్థము. శ్రీరాముని సుఖము వంటి సుఖము శ్రీరాముని దుఃఖమువంటి దుఃఖముగలవారలై యని యర్థము. "రామ సుగ్రీవయోరైక్యం దేవ్యేవం సమజాయత" రామసుగ్రీవుల కైక్య మీ విధముగాఁ గలిగెను అని హనుమంతుఁడు చెప్పెను.'ఏకం సాంఖ్యంచ యోగంచ యఃపశ్యతి- సాంఖ్యము యోగము రెండు నొకటియే యని యెవఁ డెఱుఁగునో వాఁడే వాస్తవ మెఱిగినవాఁడు దీనికి మూలము 'ఏకసుఖదుఃఖాః' అనుటకు తీర్థీయులు సమాన సుఖదుఃఖా యనియే వ్యాఖ్యానించిరి.

తాత్పర్యము

మీఁదఁజెప్పిన కారణముచే మనము శ్రీరాముని నెడఁబాసి యెట్లు సహింపఁ గలము. మనకుఁ బ్రాణము శ్రీరాముఁడు. ఆయన విడిచిపోయినపిమ్మట సీతోఁట లేల- యిండ్లేల- మడులేల-దొడ్లేల? కావున లక్ష్మణునివలె మనము సర్వసంగ త్యాగముఁజేసి యే దినమందే గడియయందు శ్రీరాముఁ డెందు నిలుచునో యే సుఖము దుఃఖ మనుభవించునో యందే మనము నిలుచుచు నట్టి సుఖము నట్టి దుఃఖమునే యనుభవించుచు మనకుఁ గేవలము కావలసిన బంధువులను భార్యలను బిలుచుకొనిపోయి యందే యుందమా.

సీ॥ నిక్షేపముల నెల్ల ♦ నెఱపెల్లగించియు, భవనాంతరము లెల్లఁ ♦ బాడువెట్టి
ధనధాన్యములనెల్ల♦మనవెంటఁ గొనిచనఁ,గులదేవతలు వీనిఁ♦దొలఁగిచనఁగఁ
జిమ్మువారలు లేక ♦ దుమ్ములు రేఁగుచు, బాదట్టు తీఁగెలు♦పాఱుచుండఁ
గొక్కుబొక్కల మట్టి♦కుప్పలు నిండఁగ, నెలుక లిచ్చగఁ బర్వు♦లెత్తుచుండ.
తే॥ మంత్రహోమజపము లను♦మాట లేక,బోఁకిపెంకులు నిండఁగఁ♦బొలుపు వాసి
మనము విడిచినగృహముల♦మనసుదీరఁగ్రైక
తలఁగొట్టుకొనియెడిఁ♦గాకయింక. ౯౩-౧

నిక్షేపములన్=పూడ్చియుంచిన ధనములను, భవనాంతరములు=ఇండ్ల లోపలిభాగములు, చిమ్మువారు=కసవుద్రోయువారు, పాదట్టు=బూఁజు, పొలుపు= అందము.

తాత్పర్యము

రక్షణార్థమై భూమిలో దాఁచియుంచిన ధనమును బెల్లగించుకొని యిండ్ల న్నియుఁ బాడుపెట్టి ధనము ధాన్యము కైకకుఁ జిక్కకుండునట్లు మన వెంటఁ దీసికొనిపోఁగాఁ బూజించువారు లేమిని నిలువేలుపు లీయిండ్లను దొలఁగిపోవఁ గసవు చిమ్మువారలు లేమిచే నేలదుమ్ములు రేఁగుచు మిద్దెలబూఁజుల తీఁగలు వ్రేలాడుచుండఁ గొక్కులుతోడఁగా మట్టికుప్పలు నిండ్లునిండ సదరుబెదరు లేక యెలుకలు తమ యిచ్చకొలఁదిఁ బరువులెత్తుచుండ మంత్రమని హోమమని జప

మని తలఁచువారు లేక కుండపెంచికలు నిండఁగఁ గాంతి చెడఁగా మనము విడిచిన యిండ్లను దన మనసారఁ గైక తలపైఁ గట్టుకొననీ.

కం॥ రాముం డుండెడివనమే, శ్రీమానిత మైనపురము • సీతేశుండున్
లేమని మనమును విడుచుట,చే మహితారణ్య మిదియ•సిద్ధం బగుతన్.

తాత్పర్యము　　౬౩౩

శ్రీరాముఁడుండు వనమే సంపదచేఁ గలకలలాడుచుండు నగరము. ఆయన లేమిని మనము విడుచుటచే నిదియే పెద్ద యరణ్యము.

ఉ॥ నెట్టన యింద తేగిన వ•నీగుహలందలిసింహముల్ కరుల్
పుట్టల నున్నపాములును • భూధరసానుగ తోగ్రపక్షులున్
దొట్టినభీతిచేఁ బఱచి • దూరము పాడఱి యున్నయట్టి యీ
పట్టనమందిరాళి నిర•పాయముగా సుఖియించుఁ గావుతన్.　　౬౩౪

నెట్టన=అందఱొకమాటగా- ఇదికళ- ద్రుతాంతముగాదు- రూ. నెట్టనము, వనీగుహలందలి = అడవులయందలి గుహలయందలి, భూధరసానుగతోగ్రపక్షులున్=కొండల చఱులయందుండు భయంకరమైన పక్షులును, పాడఱి=పాడుపడి- మనుష్యసంచారములేని, ఈపట్టనమందిరాళిన్ = ఈనగరమందలియిండ్ల వరుసలయందు, నిరపాయముగాన్=అపాయములేక.

తాత్పర్యము

అడ్డములేక మనమందఱు మొకపట్టుగ నిందుండక వెడలిపోయి యడవులలోఁ గాఁపురముండఁగా నడవులలో గుహలలోఁ గాఁపురముండు సింహములు ఏనుఁగులు- పుట్టలలోనుండు పాములును కొండచఱులయందుండు పెద్ద పక్షులు నిలువనీడలేక మనకు భయపడి దూరముగాఁ బరువెత్తిపోయి మఱియెందు స్థలముగానక పాడుపడిన యీ యూరియిండ్లలో నే యపాయములేక హాయిగా సుఖించునుగాక.

ఉ॥ రామునితోడ నెల్లర మ•రణ్యముఁ బట్టినయంత మీఁద గా
రామసుతుండు చుట్టలు ని•రంతరమున్ భజియింప నుండనీ
భూమెలకైక మాంసమును • బూరియుఁ గాయలు మెక్కు వానిపై
దీమస మారఁగాఁ గఱవు • దీఱఁ బ్రభుత్వపటుత్వసంపదన్.　　౬౩౫

భూమెలకైక=మాయలకైక, పూరి=గడ్డి, దీమసము=ధైర్యము, అరఁగాన్=నిండఁగా.

తాత్పర్యము

శ్రీరామునితోడ మనమందఱము నరణ్యమును జేరఁగానే యావల మాయలమారి కైక తన ముద్దుకొడుకు బంధువులు నెల్లప్పుడు సేవచేయుచుండ నిందే మాంసము మెక్కుపులులు- సింహములు- తోడేళ్ళు- గడ్డితిను జింకలు

మొదలైనవి-కాయలుదిను పక్షులు మొదలైనవి- యగువానిపై దిగులులేక యానుగాదనువారులేక తన యధికారమంతయుఁ జూపుచు నుండనింపు.

ఉ॥ శోకముపేర్మి నిట్లనెడి॰చూపఱవాక్యము లాలకించుచున్
స్తోకవికారమే నగనక ॰ దూరమునన్ మడికాసు కొండతో
జోక రహించి మించు పితృ ॰ సుందరమందిరవాటిఁ జూచి సీ
తాకమనుండు డాయఁ జని ॰ తద్గతవీరజనాళిఁ జూచుచున్. ౯౩౬

చూపఱ=చూచువారియొక్క, ఆలకించుచున్=వినుచు, స్తోకవికారమేన్= కొంచెము మార్పైనను, కనక=పొందక, మడికాసుకొండతోన్ = వెండికొండతో 'ఒంటిగా మడికాసుగుంటిపై' నరసభూపాలీయము, జోకన్ = పోలికన్, పితృ సుందరమందిరవాటిన్=తండ్రియుండెడి యందమైన యింటిని,సీతాకమనుండు =శ్రీరాముఁడు, తద్గతవీరజనులన్=అందుండు వీరులగు మనుష్యులను.

తాత్పర్యము

శోకాతిశయముచే నిట్లు పలుకుచున్న చూడవచ్చినవారాడుకొనుమాటలు వినుచుఁ గొంచెమైనను మనస్సులో వికారమునొందక దూరమునందు వెండి కొండతో సమానమై ప్రకాశించు తండ్రియుండు నింటినిజూచి శ్రీరాముఁడు చేరఁబోయి యందుండు వీరజనులఁజూచుచు.

కం॥ వారలయార్తికి మది నవి, కారుండై మందహాస ॰ కలితాననుఁడై
భూరితరదైన్యయుతు నవి దూరస్థు సుమంత్రుఁ జీరి॰తోరపురక్తిన్. ౯౩౭

అవికారుండై=మనస్సు చలింపనివాఁడై, మందహాసకలితాననుఁడై=చిఱు నవ్వుతోఁగూడిన ముఖముగలవాఁడై, భూరితరదైన్యయుతున్=మిక్కిలి యధిక మైన దుఃఖముతోఁ గూడినవానిని, అవిదూరస్థున్ = సమీపముననుండువానిని, చీరి=పిలిచి, తోరపురక్తిన్=అధికమగు ననురాగముచే.

తాత్పర్యము

వారల వ్యసనముఁజూచి మది చలింపనీయక చిఱునవ్వుతోఁగూడిన ముఖము గలవాఁడై మిక్కిలి వ్యసనపడుచుఁ గొంచెము దూరముననుండు సుమంత్రునిఁ బిలిచి మిక్కిలి యనురాగముతో-

—॰ ౩౪-వ సర్గము. శ్రీరాముఁడు దనరాకను దండ్రికిఁ జెప్పి పుచ్చుట. ॰—

చం॥ జనకునిఁ గాంచి యాజ్ఞ గొని॰సాగెదువాఁ డయి యిట్లు పల్కెనో
యనఘ! మదాగమంబు మను॰జాగ్రణికిం దెలుపంగదే యట
న్నను నతఁ డార్తి నీరు నయ॰నంబులఁ గాఱఁగ లోని కేగి యా
మనుజవరేణ్యు దుఃఖభర॰మగ్నుని గ్రస్తదివాకరుం డనన్. ౯౩౮

సాగెడువాఁడు = ప్రయాణమైపోయెడివాఁడు, మదాగమంబు=నారాక, దుఃఖభరమగ్నుని=అధిక దుఃఖమున మునిఁగినవానిని, గ్రస్తదివాకరుండు = గ్రహణముపట్టిన సూర్యుఁడు.

తాత్పర్యము

రాజును జూచి యాజ్ఞగొని ప్రయాణమై పోవఁదలఁచి యిట్లనెను. పుణ్యాత్ముఁడా నారాక తండ్రికిఁ దెలుపుమా యన నాతఁడు మిగుల దుఃఖముచేఁ గన్నుల నీరుగాఱఁగ లోపలికిఁబోయి దుఃఖమునమునిఁగి రాహువుపట్టిన సూర్యునివలె-

ఉ॥ నీఱ లలమంగ నిప్పనఁగ • నిర్జల మైనతటాకమో యన
స్నీఱినదుఃఖభారమున • నివ్వెఱమై సుతు రామచంద్రుఁ బ
ల్కాఱును సంస్మరించుచు వి • లాపము సేయునృపాలుఁ గాంచి తాఁ
దాఱనిభక్తి మ్రొక్కి మును • దద్ద జయోక్తులు సన్నుతించుచున్. ౯౩౯

నీఱు=బూడిద, అలమంగన్=కప్పఁగా, నిర్జలము=నీళ్ళులేనిది, నివ్వెఱ నిండు + వెఱ = పూర్ణభయము- సమాసంబుల లోపనుగాగమ లోపద్విత్వంబు లన్యశబ్దంబులమీఁదను గానంబడెడి- సు. వ్యా. సంధి ౨౬,తాఱని=తక్కువగాని.

తాత్పర్యము

బూడిదగప్పిన నిప్పు,నీళ్ళులేని చెఱువు అన్నట్లు అతిశయించిన దుఃఖాతిశయముచే నిండుభయముచే- దిగ్భ్రమగొని తన కుమారుఁడైన శ్రీరాముని బలుమాఱు సంస్మరించుచు నేడుచుచుండఁగా నా రాజునుగాంచి కొఱఁతలేని భక్తి నమస్కరించి జయజయ యని పొగడుచు.

సీ॥ ఏమని చెప్పుదు • నీవార్త యనువెఱ, నేడ్పున గుదిపడ్డ • యీఱెలుంగు
గ్రాల మెల్ల వచించు•రామచంద్రుం డిదె, ద్వారంబునందున్న•వాఁడు దేవ
ద్విజులకు నుపజీవి•విసరంబులకు నెల్ల,విత్తంబు లొసఁగి సు•హృత్తములకు
నెల్లరకును జెప్పి • పృథ్వీశ మీయాజ్ఞఁ, గొని కాననములకుఁ•జనఁగఁగోరి

ఆ॥ వచ్చియున్నవాఁడు•వచ్చిక మిముఁ జూడ,
నడవి కరుగు నింకఁ•గొడుకుఁజూడ
వయ్య రశ్మిపాళి • నర్కుని పోలిక, రాజగుణము లొప్పు • తేజరిల్ల. ౯౪౦

గుదివడ్డ=అణఁచుకొనిపోయిన, ఈఱెలుంగు=సన్నని ధ్వని, ద్విజులకున్= బ్రాహ్మణులకు, ఉపజీవి విసరంబులకున్=సేవక సమూహములకు, విత్తంబులు= ధనములు, సుహృత్తములకున్=స్నేహితులకు, రశ్మిపాళిన్=కిరణముల సమూహములచే, అర్కునిపోలికన్=సూర్యునివలె.

తాత్పర్యము

నీకొడుకు కడవులకుఁబోవుచుఁ జెప్పవచ్చినాఁడన్న కీడువార్త నేనేమని చెప్పుదునని యేడ్చుచు దానివలన గొంతుగుదివడ సారథిమెల్లగా నిట్లనియె.

దేవా శ్రీరామచంద్రుఁడు బ్రాహ్మణులకు సేవకులకుఁ దన ధనమెల్ల దానముచేసి స్నేహితులకందఱకుఁ జెప్పి మీ యాజ్ఞతీసికొని యడవులకుఁబోవ నిదిగో వాకిట నిలఁబడియున్నాఁడు. ప్రేమచే మిమ్ముఁజూడఁ గోరుచున్నాఁడు. జాగుచేసిన నాయన వెడలిపోవును. ఆవలఁ గనులచూపులుకూడఁ గలుగవు. ఇట్లు లేడ్పుచుఁ బడియుండుట రాజధర్మముగాదు. అయినదేమో యయినది. ఇప్పుడేడిచి యేమి ప్రయోజనము కావున ధీరుఁడవై కాంతులచే సూర్యునివలె రాజగుణములచే నీవును బ్రకాశించుచుఁ గొడుకును గన్నులనైనఁ జూడుము. ఆ భాగ్యముకూడ లేకుండ నేల చేసికొనెదవు.

కం॥ అన వననిధిగంభీరుఁడు, జననుతధర్మైకరతుఁడు ♦ జలధరమార్గం
బున విమలుఁడు సత్యాత్ముఁడు, జననాథుం డిటు లనియె♦సచివాగ్రణితోన్.

వననిధి గంభీరుఁడు=సముద్రమువలె లోతెఱుఁగనీయనివాఁడు, జననుత ధర్మైకరతుఁడు=జనులచే స్తోత్రములు చేయఁబడిన ధర్మమునందే ప్రీతికల వాఁడు, జలధరమార్గము=మేఘమార్గము- ఆకాశమువలె, విమలుఁడు=నిర్మల మైనవాఁడు, సత్యాత్ముఁడు=సత్యముపలుకుట స్వభావముగాఁగలవాఁడు, సచివాగ్రణితోన్ = మంత్రులతో మొదటివానితో.

తాత్పర్యము

సముద్రమువలె గాంభీర్యముగలవాఁడును, ప్రజలస్తోత్రము చేయఁబడిన ధర్మమందే యాసక్తిగలవాఁడును, ఆకాశమువలె నిర్మలమైనవాఁడును- సత్య మాడుట స్వభావముగాఁగల యా దశరథుఁడు మంత్రితో నిట్లనెను.

శా॥ నాయిల్లాంద్రురఁ నెల్లఁ దోడ్కొని సుమంత్రా! యిందు ర, మ్మేను భా
ర్యాయుక్తంబుగఁ జూడఁ గోరెదను ధ ♦ ర్మస్థేయు శ్రీరాము, నా
నాయాజ్ఞం జని రాణివాసముల కా ♦ ర్యల్! రండు భూనాథుఁడు
న్వే యందుం జనుదెం డటంచుఁ బలికె ♦ న్నిమ్మెల్ల నా నాసతుల్. ౯౪౩

ఇల్లాంద్రురన్=భార్యలను- ఆల్వాదులలోని లువర్ణంబునకును బూర్ణబిందు పూర్వకద్రకారం బాదేశంబగు, ఇల్లాలు=ఇల్లాంద్రు సూ. ౧౩ సు. వా. కొన్ని బహువచనాంత నామంబులమీఁద బహువచనంబగు- ఈ బహువచనమున లువర్ణకముపై లువర్ణకము రువర్ణకముపై రువర్ణకమువచ్చును. రాఁగా ఇల్లాం ద్రురు అని రూపమేర్పడియె. సు. వ్యా. అచ్ఛిక ౨౫. భార్యాయుక్తంబుగన్= భార్యతోఁగూడినవాఁడనై, ధర్మస్థేయున్=ధర్మమున స్థిరబుద్ధిగల, రాణివాస ములకున్=అంతఃపుర స్త్రీలకు, ద్వి-రాణివాసద్రోహి రావణుఁబట్టి, పోఁడిమి చెఱు పవాబుధులు నుతింప॥ రంగ. ఆర్యల్=ఆర్యలారా! మధ్యమపురుషంబునం

దారగాగమంబు లోపంబు వై కల్పికంబు, వేశీఘ్రముగ- రాజాజ్ఞయని చెప్ప కున్నఁ గైకయింటికి నొకతెయు వచ్చియుండదు.

తా త్ప ర్య ము

ఇచటికి నా భార్యలనందఱఁ దోడుకొని రమ్ము. భార్యలతోఁ గూడినవాఁడనై పితృవాక్యపరిపాలనధర్మమందు స్థిరబుద్ధిగల శ్రీరామునిఁ జూడఁగోరెదను. నేను మాత్రము చూచిన శ్రీరామచంద్ర ముఖదర్శనమైనను వారికి లేకపోవును. అదియునుగాక తల్లులు గావున వారంద ఱేకవాక్యముగఁ బ్రార్థించిన వారి మాట విని నిలుచునేమో కావున నా యాజ్ఞప్రకారముపోయి (రాజాజ్ఞలేక యంతఃపురములకుఁ బురుషులెవ్వరు పోరాదు) రాణులనందఱఁ బిలువుమన సుమంత్రుఁడు పోయి రాణులనందఱఁజూచి యార్యలారా! రండు రాజు మీరంద ఱచ్చటికి రావలయునని యానతిచ్చెను అని చెప్పఁగా నా స్త్రీలు

దీనివలన గృహస్థులు భగవద్దర్శనము తా మొకరేచేయక భార్యలతోడఁ జేయుట శ్రేయస్కరమని సూచన.

తే॥ మూఁడువందలయేఁబడి ♦ ముద్దరాండ్రు
కెంపువాఱినకన్నులఁ ♦ గీడుపడుచు
సరగఁ జనుదెంచి రటకుఁ గౌ ♦ సల్య బలసి
యంతట సుమంత్రు సుతుఁ బిల్వు ♦ మనియె నృపతి. ౯౪౩

మూఁడువందల యేఁబది=మున్నూటయేఁబదిమంది, ముద్దరాండ్రు= స్త్రీలు, కర్మధారయంబున నదంతశబ్దములకు రాలుశబ్దము పరంబగునపుడు నిత్యముగను ఉదంతములమీఁద బహుళంబుగ రుగాగమంబగు- ముద్దరాలు- పేదరాలు లోనైనవి సు. వా. సంధి ౫౫ సూ. ముగ్ధశబ్దభవము ముద్ద- కెంపు వాఱిన కన్నులన్=కన్నుల నీరుకాఱ నేడ్చుటచే నెఱ్ఱనైన కన్నులతో, బలసి = చుట్టుకొని, కీడుపడుచున్=కన్నులనిండ నీరుండుటచేఁ ద్రోవకానరాక పడుచు లేచుచు వచ్చిరని భావము.

తా త్ప ర్య ము

మున్నూటయేఁబది మంది భార్యలు రాజాజ్ఞ తిరస్కరింపరాదని శ్రీరామునిఁ జూచు కోరికగలవారగుటను నేడ్చుటచే జోతులవలె నెఱ్ఱగానుండు కన్నులతో బాధపడుచుఁ దొందరగాఁ గౌసల్యను జుట్టుకొని యచ్చటికి వచ్చిరి. అంతట దశరథుఁడు శ్రీరాముని లోపలికిఁ బిల్వుమని సుమంత్రుతోఁ జెప్పెను.

భర్త యాజ్ఞనిచ్చెనేని భార్యలు భగవద్దర్శనార్థమై యాయనతోడఁ బోరానిచోటులకైనఁ బోవచ్చునని సూచన.

కం॥ ఆమాట యెఱుఁగఁ జెప్పిన, రాముఁడు లక్ష్మణుఁడు సీత♦రాఁ దనవెంటన్
భూమీశు డాయఁ జనియెం, జేమోడ్పున నట్లు వచ్చు♦సీతాకాంతున్. ౯౪౪

తాత్పర్యము

సుమంత్రుఁడు రాజుగారు రమ్మనినారు లోపల రండని చెప్పఁగా సీతయు లక్ష్మణుఁడు తనవెనుక రాఁగాఁ జేతులు జోడించుకొని శ్రీరామచంద్రమూర్తి రాజును జేరఁబోయెను. ఇట్లు వచ్చు శ్రీరాముని

—♦ దశరథుఁడు సీతారామలక్ష్మణులఁ జూచుట. ♦—

కం॥ అంతంతం గని ధరణీ,కాంతుం డాసనమునుండి ♦ కడువడి దుఃఖా
క్రాంతమనస్కుం డయి త,త్కాంతలతో లేచె రాము♦దాయం జనఁగన్.

కొంచెము దూరమునందే చూచి రాజు తానున్న యాసనమునుండి దుఃఖముచే నాక్రమింపఁబడిన మనస్సుగలవాఁడై తన వెంటలేచిన స్త్రీలతోడ శ్రీరామున కెదురుగాఁబోవఁ దాను లేచెను. దాయన్. రూ. డాయన్.

కం॥ రాముున కెదురుగఁ బరువిడి, భూమీశుఁడు పోవలేక♦పుడమిం బడియెన్
సాము తెరువునన్ దుఃఖభ,రామితజని తాశ్రుముకుళి♦తాక్షుం డగుచున్. ౯౪౮

సాము=సగము, దుఃఖ........తాక్షుండు = దుఃఖాతిశయముచే నమితముగాఁ బుట్టిన కన్నీటిచే మూఁతలుపడిన కన్నులుగలవాఁడై.

తాత్పర్యము

శ్రీరామున కెదురుగఁ బరువెత్తుచుఁబోయి దుఃఖాతిశయముచే నమితముగఁ బుట్టిన కన్నీళ్ళచే త్రోవగానరాక పోవలేక సగముదూరమునందే భూమిమీఁదఁ బడెను.

శా॥ ఆరంగూరినయార్తిమై నిపతితుం ♦ డైనట్టి భూకాంతునిం
జేరం బోవుచు రామలక్ష్మణులు చే ♦ సేనెత్త హా రామ రా
మా రామా యనుకామినీజనుల హా ♦ హాకారముల్ భూషణో
దారారావము మిశ్రమై బలిసె నా ♦ ధాత్రీశుగేహంబునన్. ౯౪౭

ఆరంగూరిన=పూర్ణముగాఁగలిగిన, నిపతితుండు=పడినవాఁడు, చేసేతన్=ఒకరిచేతులమీఁదనుండి మఱియొకరి చేతులమీఁదికి— "చేసేతం బృథివీశులంది కొనఁ గాశీ పుణ్యతోయంబులన్ జేసెన్ మజ్జనము" అని తిక్కన నిర్వ, హాహాకారములు=హాహా యను ధ్వనులు, భూషణోదారారావము = సొమ్ములయతిశయించిన ధ్వని, ధాత్రీశుగేహంబునన్=రాజు నింటియందు.

తాత్పర్యము

నిండారుదుఃఖముచే భూమిమీఁదఁబడిన రాజును సమీపించి శ్రీరామలక్ష్మణులు చేచేనెత్తఁగా హా రామా హా రామా హా రామా యను స్త్రీల హాహాకారములు, వారు ధరించిన భూషణములరవళి వారు తల బొమ్మ కొట్టుకొనుటచేఁ గలిగిన ధ్వనులు రాజునింటఁ గలసి యతిశయించెను.

కం॥ రాముండును సౌమిత్రియు, భూమీశ్వరుఁ దమకరములఁ♦బొదవుచుసీతా
వామాక్షితోడ నేడ్చుచు, నామంచముమీద నుంచి♦రాసీనుఁడుగన్. ౯౪౮

శ్రీరాముండును లక్ష్మణుఁడును సీతావామాక్షితోడ భూమీశ్వరుఁ దమ కరములఁ బొదవుచు నేడ్చుచు ఆమంచముమీఁద నుంచిరని యన్వయక్రమము.

తాత్పర్యము

దీనివలన నెంతటి పతివ్రతయైనను నిష్కామదృష్టిచేఁ దాఁకవలసినంత కార్యముపడినపుడు తండ్రివావి గల పురుషుఁ దాఁకుట దోషముగాదు.సకామయై తండ్రి దోడులనైనఁ దాఁకరాదు. భావము ప్రధానము. దశరథుని దాఁకుటచే, విరాధుని దాఁకుటచే, రావణుఁ దాఁకుటచే,సీత పాతివ్రత్యమునకు హానిరాలేదని యామె యగ్నిప్రవేశకాలమునఁ జేసిన ప్రమాణములును- హానిచెందకుండు టయు సాక్ష్యము. తనభావముకొలఁది పుణ్యపాపములుగాని యితరుల భావముఁ బట్టికాదు.

శ్రీరామలక్ష్మణులు సీతాదేవితో రాజును దమ కరములతోఁ బొదివి దుఃఖించుచు నా మంచముమీఁద నా మువ్వురు గూర్చుండఁబెట్టిరి.

ఉ॥ మూరుత మూరకుండి నృప♦ముఃఖ్యుఁడు మూర్ఛను దేఱ నంజలిన్
జేరిచి తండ్రిఁ జూచి యను ♦ శ్రీరఘురాముఁడు మాకు నెల్ల క్షో
ణీరమణుండ వీవు దగు♦నే ధృతి దప్పఁగ దండకాటవిన్
జేరఁగ బోదు నాజ్ఞ దయ♦సేయుము చూడుము చల్లఁజూపులన్. ౯౪౯

మూరుతము=అల్పకాలము ప్ర. ముహూర్తము. ౪౮ నిముషములకాలము.

తాత్పర్యము

కొంచెము కాలము మాటలాడకుండి రాజు మూర్ఛనుండి లేవఁగానే శ్రీరాముఁడు చేతులుజోడించి తండ్రినిజూచి యిట్లనియె. మాకు నందఱకు నీవు రాజవు. నీవే యిట్లు ధైర్యము విడువఁదగునా? దండకారణ్యమునకుఁ బోవుచున్నాను. ఆజ్ఞయిమ్ము. మమ్ము దయార్ద్రదృష్టితో శాంతముతోఁ జూడుము.

—♦ శ్రీరాముఁడు సీతాలక్ష్మణులతో వనమునకుఁ బోవ ననుజ్ఞ వేఁడుట. ♦—

కం॥ సీతయును లక్ష్మణుండును, నాతోడ న్వచ్చువారు ♦ నయగతి నెంతెం
తో తథ్య హేతువుల నా,చేత నయినయంతపట్టు♦చెప్పితి నిలువన్. ౯౫౦

తాత్పర్యము

సీతయును లక్ష్మణుఁడును నావెంట నరణ్యమునకు వత్తురు- న్యాయము ననుసరించి సత్యమైన కారణముల నెన్నెన్నో చెప్పి నిలుపుటకు నాచే నయినంత ప్రయత్నముచేసి చూచితిని.

కం॥ నే నెంతయు వారించిన, మానక నాతోడ రాఁగ♦మతిగొని నిలువన్
గా నొల్లరైరి యిచటం, గానన్ మైకొంటి వారు♦కానకు రాఁగన్. ౯౫౧

మైకొంటిన్ = అంగీకరించితిని.

తాత్పర్యము

నే నెంత వలదు వలదని యడ్డగించినను వదలక నా వెంటవచ్చు మనస్సు గలవారై యిచ్చటనుండుట కిష్టపడినవారుగారు- కావున వారు నావెంట వచ్చుట కంగీకరించితిని.

కం॥ మానుము దుఃఖము నాకున్, జానకికిని లక్ష్మణునకు•సరగున సెలవి
మ్మా నాయన! ప్రజ కజువలె, నా నపనీవిభుఁడు పల్కె•నందనుతోడన్.

తండ్రీ! దుఃఖము వదలుము. నాకు- సీతకు- లక్ష్మణునకుఁ బ్రజకు బ్రహ్మదేవునివలెఁ ద్వరగా ననుజ్ఞయిమ్ము అనియడుగఁగా రాజు శ్రీరామునకిట్లనియె.

శ్రీరామచంద్రమూర్తి తన విషయమై లక్ష్మణు విషయమై యనుజ్ఞ వేఁడ వచ్చునుగాని భర్తస్వాధీనయగు సీతావిషయమునఁ దండ్రియాజ్ఞ యేల? భార్య తన స్వాధీనురాలయినను దాను దండ్రికి నధీనుఁడు కావున నాయనకుఁ దెలుపక యేపని చేయరాదు.

తేషా మనుపరోధేన, పారత్ర్యం యద్యదాచ రేత్ ।
తత్తన్ని వేదయే త్తేభ్యో, మనోవచనకర్మభిః॥   మను. ౨౩౬

కొడుకు మనస్సుచేఁగాని, వాక్కుచేఁగాని కాయముచేఁగాని పారలౌకిక కార్యము తండ్రి శుశ్రూషకు విఘ్నములేకుండ నేదిచేయునో యది యెల్లఁ దండ్రికిఁ దెలుపవలయును. భారతమున విపులోపాఖ్యానంబున శిష్యుఁడు గురుభార్య నేవిధముగా రక్షించినది గురువునకుఁ జెప్పనికారణముచేఁ బాపము నొందెను. కావున సీత కనుజ్ఞవేఁడుట ధర్మ్యమే.

చం॥ తలఁపఁగ లేక మున్ను వ•రదానవిమోహితబుద్ధిఁ గైకమా
యలవలలందుఁ జిక్కుకొని • యారట మందుచు నుంటఁబట్టి యిం
తలు జనియించె, నన్నిపుడ • తండ్రి! నిరాకరణం బొనర్చి భూ
తలము సమస్తముం గొనుము • తథ్యము నాపలు కాదరింపుమీ. ౯౦౩

వరదాన విమోహితబుద్ధిన్ = వరముల నిచ్చుటచే మోహముచెందిన బుద్ధిచే, ఇంతలు=ఇంతటి విపరీతములు, "ఇంతలు పుట్టినచోటను" అని తిక్కన భారతము, నిరాకరణంబు=తిరస్కారము, తథ్యము=సత్యము.

తాత్పర్యము

రాఁబోవు కష్టము లాలోచింపక వరములనిచ్చుటయే కదా యని దీనివలన నేమి కీడురాఁబోవునని యజ్ఞానినై కైక పన్నినమాయవలలోఁ జిక్కుకొని పరితపించుచుండుటచేత నింతటి విపరీతములు పుట్టెను. వలదంటినా సత్యహాని- పొమ్మంటినా ప్రాణహాని- ఈ రెండుగండములలోనుండి నీవు నన్నుఁ దప్పింపవలయును. నన్నుధిక్కరించి యిపుడు సేనడవికిఁబోనంటివా నాకు సత్యహాని లేదు. ప్రాణహాని లేదు. కావున నట్లుచేసి సమస్తరాజ్యము నీవే తీసికొనుము. ఇది సత్యము. నే వలదనువాఁడఁగాను. ఈమాత్రము నామాటయం దాదరణ ముంచుము.

ఇంతవఱకు దశరథుఁడు తానై నోరుదెఱచి శ్రీరామచంద్రమూర్తిని నీవడవికిఁబొమ్మని చెప్పలేదు. అట్లు చెప్పినది కైక. ఇప్పుడు నీవు పోవలదనుచున్నాఁడు. ఇది పితృాజ్ఞకాదా? ఏల శ్రీరామచంద్రమూర్తి దీని నిరాకరించెను.

తనయెదుటఁ గైక చెప్పినమాటను నెపుడు దాను ప్రత్యాఖ్యానముచేయలేదో యప్పుడే దశరథుఁ డంగీకరించెననుట స్పష్టము.

ఇతఁ డిప్పుడు చెప్పునది యుపచారము మాటయే. కాని పరమార్థవాక్యము గాదు. ఏలన రామచంద్రమూర్తికిఁ బ్రత్యుత్తరముగఁ బోయిరమ్మనెను.కావున నుపచారపుమాటలఁ బాటింపరాదు. అదియునుగాక తన్ను ధిక్కరించి రాజ్యము గ్రహింపుమనెను. అది పుత్రుని స్వధర్మమునకు విరుద్ధకార్యము. స్వధర్మవిరుద్ధమైన కార్యము నెవరు చెప్పినను వినరాదు. యస్స్వధర్మ పరిత్యాగీ పాషండితుచ్యతే బుధైః॥ స్వధర్మము విడుచువాఁడు పాషండుఁడు పతితుఁడగును. ఆ స్వస్థచిత్తుఁడైన కారణమున స్వధర్మహాని కలిగించు కార్యము తండ్రి చెప్పినను గొడుకు వినరాదు. భర్తచెప్పినను భార్యయు వినరాదు. కావుననే సీత నిరాకరించెను.

పత్యురప్యవలిప్తస్య, కార్యాకార్యమజానతః
తదాజ్ఞా నతు కర్తవ్యా, పతితస్యతు సర్వదా.

గర్వముచే నిది చేయఁదగినది యిది చేయరానిది యని తెలియక యాజ్ఞాపించిన భర్త యాజ్ఞగాని పతితుఁడైన భర్తయాజ్ఞగాని భార్య యెప్పుడు చేయనేరాదు.

చం॥ అనిన నృపాలుఁ జూచి జన♦కాత్మభవాహృదయేశుఁ డాడు నీ
వనఘ! సహస్రవర్షములు♦హాయిగ నేలుము దేశ మింక, నీ
వనృతము పల్కనేల సుకృ♦తాత్మక! నాదునిమిత్త మక్కటా
చనియెద దండకాటవికి ♦ సౌఖ్యము మీఱఁగ నంద యుండెదన్. ౯౩౪

జనకభవా హృదయేశుఁడు = జనకరాజు పుత్రికయైన సీతకుఁ బ్రాణవల్లభుఁడు- రాముఁడు, అనఘ=పాపరహితుఁడా, ఇంతవఱకు నీవేమి పాపముచేసినవాఁడవు కావు. ఇప్పుడు నాకారణమున నీకేల పాపము రావలెను, సహస్రవర్షములు=వేయేండ్లు, హాయిగన్ = సుఖముగ, అనృతము = అసత్యము, సుకృతాత్మకా=పుణ్యాత్మా.

తాత్పర్యము

అని చెప్పిన రాజునుజూచి శ్రీరాముఁ డిట్లనియె. పుణ్యాత్మా! నీ వింతవఱకు నేపాపముచేసి యెఱుఁగవు.ఇప్పుడు నా నిమిత్తముగ నీవేల యసత్యమాడినవాఁడవు కావలయును. నేనడవికిఁబోకుండిన నీవిచ్చిన వరములు వ్యర్థములగుటచే నీ వసత్యమాడినవాఁడవే కదా యగుదువు. ఆ దోషము వ్యర్థముపోవునా? నిన్నా

దోషమునుండి తప్పించు శక్తి నాకుండియు దానిఁ జేయనేని దోషము నాకును గలుగును గదా? నన్నుఁ జెఱుచుకొని నిన్నుఁ జెఱిచిన రాఁగల లాభమేమి? దేహ కష్టము పడఁగానే నేమి హాని. దేహకష్టమునకు వెఱవవలయునా? పరలోకహానికి వెఱవవలయునా? ని న్నసత్యమాడించి తిరస్కరించి యవిధేయుఁడనై వర్తించి రాజ్యమంతయు గ్రహించినను, నాకేమి సంతోషము- కావున దండకారణ్యము నకుఁ బోయెదను. సుఖముగా నందేయుండెదను.

కం॥ తొమ్మిదియు నైదు నేండ్లు వ,
నమ్ములఁ గ్రుమ్మరుచు నుండి•నాబాసయుఁ దీ
ర మ్మరలఁ దండ్రి నీపా,దమ్ముల. దర్శించువాఁడఁ•దథ్యం బనినన్.

క్రుమ్మరుచున్=సంచరించుచు, బాస = బాషాశబ్దభవము = ప్రమాణము, తీరన్=చక్కఁబడఁగా, పాదమ్ముల దర్శించువాఁడన్=లంకలో రావణవధానంత రము దశరథుని దర్శించుటచే నిది సత్యమయ్యెను.నిన్నుఁ జూచెదనని చెప్పెనే కాని కౌసల్యకుఁ జెప్పినట్లు మరల నిటవచ్చి అని చెప్పలేదు,తథ్యము=సత్యము.

తాత్పర్యము

తొమ్మిదియైదు సంవత్సరములు వనములందుఁ దిరుగుచుండి నాప్రమా ణము చక్కఁబడఁగా నీ పాదదర్శనము చేయువాఁడ- ఇది సత్యము.

తీరమ్మరలన్=తీరన్+మరలన్ - ప్రాసంబున మకారంబు పరంబగుచో ద్రుతంబునకు మకారాదేశంబగు లయ - 'కమ్మనిలతాంతముల కుమ్మొనసి- భార. ఆది. ౨ ఆ. మత్త. వృష్టిఁ జేరిసెమ్మహానది దీర్ఘకాసరసీవనంబులు నిండఁ గాన్' అర. ౩ ఆ. ప్రౌ. వ్యా. సంధి ౨౨.

ఆ॥ సత్యవాక్యపాశ•సంయుతుం డయి రహ,స్సీమఁ బత్ని చేతఁ•జెప్పఁబడుట
నార్తిఁ గూరుచును ని•జాత్మజు శ్రీరామ,చంద్రుఁ గాంచి పలుకు•జనవిభుండు.

సత్యవాక్యపాశ సంయుతుండయి=సత్యవాక్యమనెడి త్రాటిచేఁ జక్కఁగాఁ గట్టఁబడినవాఁడై , రహస్యము=ఏకాంతమున- మఱెవ్వరు లేనిచోట, ఆర్తిఁగూరు చును = దుఃఖపడుచు.

తాత్పర్యము

ఏకాంతమం దెవ్వరులేనిచోట భార్యచేఁ జెప్పఁబడి సత్యవాక్యమను పాశ ముచేఁ గట్టబడినవాఁడగుటచేత మిగుల దుఃఖపడుచుఁ దన కొడుకు శ్రీరామ చంద్రునిఁజూచి రాజిట్లనియె.

—• శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవ దశరథుఁడు సమ్మతించుట. •—

కం॥ ఇహమునఁ బెంపును బరమున,
మహితాభ్యుదయంబుగాఁ గు•మారా! యిఁక భీ
రహి తాధ్వమునను జిరశుభ,సహితంబుగఁ బోయి మరలి•చయ్యనరమ్మా.

ఇహమునన్=ఈ భూలోకమందు, పెంపు=గొప్పతనము, పరమునన్= ఆ లోకమందు- గొప్ప మేలుకలుగునట్లు, భీరహితాధ్వమునన్ = భయములేని

మార్గమున, చిరశుభసహితంబుగన్=శాశ్వతశుభముతోఁగూడినవాఁడవై, చయ్యనన్ = శీఘ్రముగా.

తాత్పర్యము

ఇహమందు గొప్పతనము పరమందు గొప్ప మేలుగలుగునట్లుగా నాయనా యిఁక మేలుకలుగుమార్గమున శాశ్వతశుభముతోఁ గూడినవాఁడవై పోయి శీఘ్రముగా మరలిరమ్ము.

ఉ॥ ప్రాకటధర్మశీలుఁడవు•బంధురసత్యరతుండ వట్టిని
న్నా కగునే మరల్ప రఘు•నందన శక్యము, కోర్కె నొక్కటిం
జేకొని తీర్పు, మీనిశ వ•సింపుము నాకడఁ గాన కిప్పుడే
పోకుమ, యొండుపూఁ టయిన•బుచ్చెద హాయిగ నీదుకూటమిన్. ౨౧

ప్రాకట ధర్మశీలుఁడవు=ప్రసిద్ధముగా ధర్మమును నాచరించు స్వభావము గలవాఁడవు, బంధురసత్యరతుండవు=సత్యమందు నధిక ప్రేమగలవాఁడవు.

తాత్పర్యము

ప్రసిద్ధధర్మము స్వభావముగాఁగలవాఁడవు- సత్యమునందు మిక్కిలి ప్రీతిగలవాఁడవు. అట్టి నిన్ను రాఘవా! మరలింప నాకు శక్యముగాదు. అయినను నాకొక్క కోర్కెగలదు. అది నెఱవేర్పుము. ఈరాత్రి నాయొద్దనుండుము. ఇప్పుడే యడవికిఁబోకుము. ఒకపూఁటయినను నీతోడ హాయిగాఁ గడపెదను.

ఉ॥ తల్లిని జూడ వన్న! ననుఁ•దండ్రిని జూడుము పుత్ర! మాకుఁగా
నుల్లము రంజిల న్నిలుము•యొక్కదినం బిట నాశ దీరఁగా
నెల్ల నొసంగి నీకుఁ గని•దృప్తివహింతుము, నీప్రతిజ్ఞ యుం
జెల్లఁగ వేఁగుబోకటను•జేయ వయా పయనంబు నిచ్చమై. ౨౨

వేగుఁబోకటన్ = రేపటి ఉదయమున.

తాత్పర్యము

అన్నా! రామచంద్రా నిన్నుఁ గన్నతల్లిని జూడుము. నీ వడవికిఁబోయెదవని యెట్లు పొక్కి పొక్కి యేడ్చుచున్నదో- కుమారా- తండ్రిని వృద్ధుఁడను నన్నుఁ జూడుము. మా నిమిత్తమై మా మనస్సులకు సంతోషముగలుగ నొకదినంబిటనుండుము. మా యాశదీర సమస్తము నీకుఁ గట్టపెట్ట నిచ్చి చూచి తృప్తిపడుదుము. నీ ప్రతిజ్ఞదీర్ప నీ యిష్టప్రకార ముదయంబున లేచిపొమ్ము.

కం॥ ఎంతయుఁ బ్రియములఁ బాయుచుఁ,
నాంతారముఁ బోవ నీవు•గడఁగితి సీతా
కాంతా! నాప్రియమునకై, యెంతటి దుష్కరము సేయ•నెంచితి పుత్రా.

తాత్పర్యము

నీకు మిక్కిలి ప్రియములగు వాని నెల్లవదలి నాకుఁ బరలోకమున సంతోషము గలిగింప నీ వడవులకుఁ బోవఁబూనితివి. కొడుకా యెంతకష్టకార్యము చేయ నాలోచించితివి.

ఇచ్చటఁ బ్రియమనిన నిహలోక ప్రియముగాదు. శ్రీరామునరణ్యగమనము దశరథునకుఁ బ్రియమనుటమీఁది పద్యమునకు వాస్తవమునకు విరుద్ధము. కావునఁ బరలోకమునఁ బ్రియమనియే చెప్పవలయును.

ఉ॥ బాస యొనర్తు సత్యమునఁ • బాప మొకండును నే నెఱుంగ- న
న్మోసము చేసి యాకుటిల • మోహమునన్ మసికట్పివహ్ని యా
దోసమురాశి వంశగుణ • దూషక యింతలు చేసె, నీవు న
య్యో సతివాక్యమే నిలుప • యోజన చేసితి వేమి చేయుదున్. ౯౬౧

తాత్పర్యము

కుమారా! సత్యము మీఁదఁ బ్రమాణముచేసి చెప్పుచున్నాను. నే నేపాప మెఱుఁగను. నీ విషయమున ద్రోహబుద్ధి నాకు లేదు. ఈ కుచ్చితురాలు మోహముచే నన్ను మోసము చేసెను. ఈ బూడిదె కప్పిన నిప్పు, ఈ పాపములరాశి, వంశగుణమును నిందలపాలు చేసినది, యింత ఘోరకార్యములుచేసెను. అయ్యో నీవుకూడ దాని మోసమునే నిల్పఁజూచెదవు.ఇఁక నేనేమి చేయఁగలను.

కైక మోసముచేసెనంటివి. ఆమె చేసినది యేమి? నీవు పూర్వ మిచ్చెద నన్న వరములనే కదా కోరెనందువా. అది సత్యమేకాని లోకమున వరములు గోరువారు తన్ను నమ్మి దగ్గఱఁ జేరిన వాని గొంతుకోయునట్లు భార్యగదా నా యందుఁ బ్రేమగలదికదా నాకేల యహితము గోరునని విశ్వసించి నీ వరముల నిచ్చెదనన్నమీఁద నాచేఁ బ్రమాణము చేయించుకొని యింతటి ఘోరములైనవి కోరవచ్చునా? ఇది వేశ్యాలక్షణమేకాని పతివ్రతలక్షణమా, తన కొడుకునకు రాజ్యముఁ గోరినఁ గోరనీ- నీవేల యడవులకుఁబోవలె. ఇది కుచ్చితముగాదా, ఇది మోసముగాదేని యిఁక మోసమన నెట్టిది ?

కం॥ ఇది యేమి వింతకార్యము, పెదకొడుకై నీవు గలుగఁ • బేరేమి నాకున్
మదిఁ దలఁతె యనృతదోషముఁ,
బొదవింపఁగ నెంత లైన•బుధనుత యనినన్. ౯౬౨

తాత్పర్యము

నీ వడవికిఁ బోవుటయనునది యేమి యాశ్చర్యమైన కార్యము. నీవు నాకుఁ బెద్దకొడుకై యుండి యెంతకష్టములు వచ్చినను నా కసత్యదోషము గలుగ వర్తింతువా అనఁగా.

—• శ్రీరాముఁడు తన మనోనిశ్చయముఁ దండ్రికిఁ జెప్పుట •—

కం॥ జనకుని యార్తాలాపము, విని రాముం డనుజుఁగూడి•విరవిరవోవన్
దను విట్టు లనియెఁ దండ్రికిఁ, జనునే నీబోఁటి కిట్లు•సంతాపింపన్. ౯౬౩
తనువు=శరీరము తాత్పర్యము

తండ్రిచెప్పిన శోకముతోఁగూడిన మాటలనువిని శ్రీరాముఁడు తన తమ్మునితోడ దేహము విరవిరఁ బోవుచుండ నీ ప్రకారము చెప్పెను. తండ్రీ! నీ విట్లు సంతాపించుట పాడిగాదు.

కం॥ భూపాల! నీ వొసంగెడు, నాపరమపదార్థసమితి•నందినవాఁడన్
ఈ పెవ్వ రిత్తు రయ్యా? యీపాటికిఁ గాన వాని•నిచ్చింపఁ జుమీ. ౯౬౪
తాత్పర్యము

రాజేంద్రా! నీ వియ్యఁదలఁచిన యన్ని పదార్థములు నేను గ్రహించినవాఁడనే. గ్రహించిన నెంత సంతోషమో నీమాట వలన నంత సంతోషించితిని. అయ్యా! యీనాఁడు నీవిచ్చిన ఈపీవేళ కెవరిత్తురు? ఈపటినుండి లేనివి యీనాఁడొకనాఁడు లేకున్ననేమి కొఱఁత-కావున వాని మీఁద నాకుఁ గోరికలేదు.

కం॥ అర్థిమెయి నీ వొసంగుప, దార్థములకు మాఱు నేను•దగ నీబాసన్
వ్యర్థంబుచేయ కెటులేన్, సార్థకముగఁ జేయ నిమ్ము•యఱిగెద వనికిన్.
అర్థిమెయిన్ = ప్రేమతో. ౯౬౫
తాత్పర్యము

నా కక్కఱలేని పదార్థముల నిచ్చెద నంటివి. అవి నాకేల! నాకుఁగావలసినది కోరెదను. వానికి బదులుగానిమ్ము. అది యేమనెదవా? నీ ప్రమాణము వ్యర్థముగాకుండునట్లు సార్థకమగునట్లు నన్నుఁ జేయనిమ్ము. అడవికిఁ బోయెదను.

మ॥ వనవాసంబున కీయకొంటి నిఁకఁ దప్పం బోదు నానిశ్చయం
బనఘా! సక్షితిలోకపూగధనధా•న్యం బైనయైశ్వర్యమున్
మును నీకైకకుఁ జెప్పినట్లు భరతుం•బూన్పం గదే-నేను నీ
పనుపారం బదునాలుగేఁడులు వనీ•వాసాళితో నుండెదన్. ౯౬౬

ఈయకొంటిన్ = అంగీకరించితిని, సక్షితి లోకపూగధనధాన్యంబు=భూమితోను- జనులసమూహముతోను- ధనములతోను- ధాన్యములతోను గూడినది, ఐశ్వర్యము=ప్రభుత్వసంపద, పనుపు=ఆజ్ఞ, ఆరన్=పరిపూర్ణమగునట్లు, వనీవాసాళితోన్=అడవులందుఁ గాఁపురముచేయువారితో- ఋషులతోనని యర్థము.
తాత్పర్యము

అడవులందుఁ బదునాలుగు సంవత్సరములుండునని యంగీకరించితిని- ఆనానిశ్చయము తప్పదు. తప్పెనేని నేనసత్యవాది నగుదును. భూమి-జనసమూ

హము- ధనము ధాన్యముతోఁగూడిన ప్రభుత్వసంపద సర్వము పూర్వము నీకైకకు నీవు చెప్పినట్లు భరతుఁడు పూనునట్లు చేయుము. నేను నీయాజ్ఞపూర్తి చేయుటకు ఋష్యాదులతోడ నుండుదును.

కం॥ అవనీశ సౌఖ్యమునకై, యవనివిభుత్వంబునకుఁ బ్రియంపడ నీవే
తవు నటు సేయు మనన్నే, నవు నని యీకొంటి నీదునాజ్ఞం దీర్పన్.

తాత్పర్యము ౯౯౭

"రాజేంద్రా! ప్రభుత్వమువచ్చిన సుఖమువచ్చునుగదా యని సౌఖ్యాభిలాషమున నేను యువరాజుగానుండ నంగీకరించినవాఁడనుగాను. నీవే ఇది తగును నీవిట్లు చేయు"మని చెప్పఁగానే నీయాజ్ఞ మీఱరాదు గావున నీయాజ్ఞ నెఱవేర్ప నే నంగీకరించితిని.

ఉ॥ మాను విచారమున్, ధరణిమండల మెల్లను గైక పట్టినిం
బూనుపు, మెల్ల రాజ్యమునుభోగము లొల్లఁ, బ్రియంబు లొల్ల, నీ
యానతిఁ దీర్చువాఁడ, హృదయంబున మానుము దుఃఖ, మ్రశులన్
బూనకు, మాపగాధవుఁడుపొందునె క్షోభము నెన్నఁ డేనియున్? ౯౯౮

ఆపగాధవుఁడు=సముద్రుఁడు, క్షోభము=కలఁత, పూనుపుము=పూనునట్లు చేయుము, పూనునకిది ణి జంతరూపము.

కం॥ కాంచన మాలాలంకృత, చంచత్తనులీల మెఱయుజవనాశ్వములం
బూంచి రథంబున, మణిమయ, పంచానన కేతు వెత్తెబంధురభంగిన్॥
భారత. విరా. ౪-౪౫-౧౨.

తాత్పర్యము

నీవు దుఃఖమును మానుము- భూమండలమంతయు భరతుఁడు భరించునట్లు చేయుము. నేను రాజ్యమెల్లను- భోగములు నొల్లను- ప్రియపదార్థము లొల్లను- నాకుఁ గావలసినది నీయాజ్ఞ నెఱవేర్చుటే- దానిని జేయువాఁడను. హృదయమున దుఃఖము మానుము. బైటికి బాగుండినను లోపలఁ గ్రుళ్ళుచుండిన నేమి లాభము. కన్నీళ్ళు కార్పకుము. అది యెట్లు సాధ్యమందువేని సముద్రుఁడెప్పుడైన లోపల భాగమునఁ గలఁతనొందునా. సముద్రమున నెంత క్షోభముగలిగినను మీఁదిభాగమందే కాని లోపల నేకలఁతయునుండదు.

ఉ॥ ఒట్టిడుకొందు సత్యమునఁ నొప్పుగ నీదుసమక్షమందు నీ
వెట్టును సత్యవాది వగుటే మదిఁ గోరెద, నొల్ల రాజ్యమున్
దొట్టిసుఖంబు, లొల్లఁ బ్రియఁదోయజనేత్రను సీత, నొల్ల నె
ట్టిట్టివి కోర్కు, లొల్ల దివిజేంద్రునిపట్టన, మెల్లఁ బ్రాణముల్. ౯౯౯

ఒట్టిడుకొందున్ = ప్రమాణముచేసెదను, ఎట్టును = ఏవిధముగనైనను, తొట్టి = మొదలుగాఁగల.

తాత్పర్యము

సత్యముపై నీయెదుటనే ప్రమాణముచేసెదను. నా కోరికయంతయు నీవు సత్యవాదివి కావలయుననియే. కావున దానికి విరోధించెనేని రాజ్యము మొదలుగాఁగల సుఖములొల్లను. నా యర్ధాంగలక్ష్మి సీతను నొల్లను. ఇంకనేవేవి కోరఁదగిన కోర్కులున్నవో వానినొల్లను. ఈ లోకమునందలివేకావు దేవేంద్రుని పట్టనమిచ్చినను నొల్లను- ఇంతయేల నా ప్రాణములైన నే నొల్లను.

శా॥ తండ్రీ! నేను నిమేషమైన నిచటం॰దారంగ రా దింక, నీ
కంద్రావిం గని దుఃఖ మొందకుము ని॰క్కం బింత నామాట వే
ఱొండ్రాఁ బోవదు కోరెఁ గైకయియు నం॰న్నుగ్రాటవిం బోవఁగాఁ
బండ్రెండు న్నటి రెండువత్సరము లం॰వ్వాక్యంబు నే నొప్పితిన్. ౯౭౦

తారంగరాదు=నిలువరాదు, కంద్రావి=చూచుటకు ఘోరమైనది- ఇది దేశ్యపదము- నామాట వేఱొండు రాఁబోవదు.

తాత్పర్యము

తండ్రీ నేనొక నిమిషమైన నిచట జాగుచేయుచు నిలువరాదు. ఈ ఘోరమునుజూచి దుఃఖింపకుము. ఇది నిజము. నానోట నిదితప్ప వేఱొండుమాట రాఁజాలదు. నీవు నన్నుఁ బొమ్మనలేదు. నేను నీతోఁ బోయెదననలేదు. కైక నన్నుఁ బదునాలుగేఁడులు వనములందుండఁ బొమ్మనెను. ఆమాట నే నంగీకరించితిని.

కం॥ ఆసత్యముఁ బాలించెదఁ, వాసిగ నానావిహంగ॰వరమృగపాళీ
వాసిత మరణ్యదేశము, వాసముఁ గావింతు మేల॰వగచెదు జనకా. ౯౭౧

తాత్పర్యము

నేను జేసిన సత్యమును గాపాడుకొనెదను. నీ వరణ్యమునకుఁ బొమ్మంటివని నేను బోయితినని యాయాసపడను.కావున నీవలన నాకే కష్టము ప్రాప్తించెనని వగవకుము. ఆ తల్లి చెప్పినది- ఈకొడుకు పోయినాఁడని యూరడిల్లుము. కావున నా మాటప్రకారము అనేకవిధములైన పక్షులు పెద్దమృగములు వాసము చేయు నడవికిఁబోయెదను. తండ్రీ! యేలవగచెదవు.

కం॥ దేవతల కైనఁ దండ్రీ! దైవము జనకుండ యనుచుఁ॰దగ వినియుంటన్
దైవంబ వనుచు నీనుడిఁ, గావించెడివాఁడ నేల॰కాఁతియపడఁగన్? ౯౭౨

దేవతలకైనను దైవము జనకుఁడేయని వినియున్న కారణమున నీయాజ్ఞ దేవునియాజ్ఞగాఁ దలఁచి నీమాట సార్థకముచేసెడివాఁడను. దీనికై యేల బాధపడెదవు.

కం॥ కఁతచనఁ బదునా ల్గబ్దము, లడవులలోఁ బిదపఁ జూడ॰నగు నీవు ననున్
గడతేఱఁ గృతార్థుఁడ వై, విడువుము శోకంబు నన్ను॰విడు మిప్పటికిన్.

కడచనన్ = తుదముట్టఁగా- కడఁచిపోఁగా, కృతార్థుఁడను = అనుకొన్న కార్యము చేసినవాఁడను.

తాత్పర్యము

పదునాలుగేఁడు లడవులలోఁ గడచిపోఁగాఁ బిదప ననుకొన్న కార్యము చేసిన నన్నుఁ జూడవచ్చును. కావున శోకము వదలుము. ఇప్పటికి నన్ను వదలుము.

ఉ॥ నీవగపాటు గాంచి జన • నీముఖసర్వజనంబు బాష్పధా
రావికటీకృతాక్ష మయి • రావిడి చెందెను, వారిఁ దేర్పఁగా
నీవ కనయ్య యింక, నిటు • నీవ వగంబడఁ దేర్చువార లే
రీ, వసుధాస్థలిం భరతుఁ • బ్రీతిని గూర్పుము నేను వీడితిన్. ౬౩౪

వగపాటు=వ్యసనపడుటను, జననీముఖ సర్వజనంబు=తల్లులు మొదలగు జనులందఱును, బాష్పధారావికటీకృతాక్షము=కన్నీటి ధారలచే నెఱ్ఱగా భయము కలుగునట్లుగఁ జేయఁబడిన కన్నులుగలవారై, రావిడి=బాధ.

తాత్పర్యము

నీవు పడెడి వ్యసనమునుజూచి నాతల్లి మొదలగువారందఱు నాకై యటుండ నీ నిమిత్తమైకూడఁ గన్నీటిధారలచే రూపుమాఱిన కన్నులతో బాధ పడుచున్నారు. వారిని సమాధానపఱుపవలసినవాఁడ వింక నీవేకదా. నీవే యిట్లేడ్చుచుండిన నీకు సమాధానము చెప్పువారెవరు? వారికి సమాధానము చెప్పువారెవరు? ఎవ్వరు లేరు. కావున నీవు దుఃఖముమాని భరతుఁడు రాజ్య భాగము పూనునట్లుచేయుము. నేను రాజ్యమును వదలితిని.

రాజ్యమిచ్చుటకు నీయకుండుటకుఁ దండ్రి దశరథుఁడు స్వతంత్రుఁడు పుత్రాజ్ఞతోఁ బనిలేదు. రామచంద్రమూర్తి దనుటకు నాయనకుఁ బట్టాభిషేకము గానులేదు. ఇట్లుండ నేను విడిచితి- నీవు రాజ్యము భరతునకిమ్మను నధికారము శ్రీరామున కెందుండివచ్చెను. ఇది లేని యధికారము వహించి చెప్పిన మాట కాదా ?

శ్లో॥ మణిముక్తాప్రవాళానాం, సర్వస్యైవ పితాప్రభుః
స్థావరస్యతు సర్వస్య, నపితా నపితామహః ॥

రత్నములు, ముత్తెములు, పగడములు లోనగు చరపదార్థములకుఁ దండ్రి ప్రభువు. స్థావరములకుఁ దండ్రిగాఁడు. తాత గాఁడు. అను వాక్యముండుట చేతనే శ్రీరామచంద్రమూర్తి సాద్రిసకాననంబుగానని చెప్పెను. అదియునుగాక తాను రాజ్యము వదలుకొంటిననుటచే వంశపరంపరాగతరాజ్యమును జ్యేష్ఠున కీయక కనిష్ఠునకిచ్చెనను నిందయుఁ బెద్దకొడుకు సమ్మతిలేకయే స్థావరములను బరులు పాలుచేసెనను నిందయుఁ బూర్వదినమునఁ జేసిన రాజ్య ప్రదాన ప్రతిజ్ఞకు భంగము లేకుండుటకుఁ గానట్లు చెప్పెను.

ఉ॥ ఏఁ జనినంతటన్ భరతుఁ ♦ డీమహి సాద్రిసకాననంబుగాఁ
బౌఁజులు దీరి మంది తను ♦ భక్తి భజింపఁగ నేలుఁగాక యే
గోఁజును లేక, నీసుడిని ♦ గోర్కిని దీర్చెద, నానిమిత్తమై
రోఁజెద వేల యిట్టు లతి ♦ రూక్షముగాఁ, బయనింప నిమ్మికన్. ౯౭౫

ఏన్ = ఏను- నేను మొదటిరూపము- నేను నీవు వాఁడు లోనగు కొన్ని తొలుతనజాదులుగానుండి యాపల హలాదులు నయ్యెను. ఏను ప్రథమావిభక్తి రూపము గావున కళయని నొకఁడు సాధింప వ్యర్థముగఁ బ్రయత్నించెను. కాని యది ద్రుతప్రకృతికమే. ఏనులోని నువర్ణముమీఁది యచ్చుపోఁగా, ఏన్ అని యయ్యెను. భారతమునందంతట నేను అను రూపము కానరాదు, మహి = భూమి, సాద్రి=పర్వతములతోఁ గూడినది, సకాననము=అడవులతోఁ గూడినది, పౌఁజులు కట్టి=బారులుదీఱి- ఇది యన్యదేశమని తోఁచుచున్నది. పౌఁజునకుఁ దురకబాసయందు సేన యని యర్థము. సేనయందు భటులు చాలులు చాలులుగా నెట్లుందురో యట్లని యర్థము, మంది=జనులు, గోఁజు=బాధ, రోఁజెదవు = నిట్టూర్పులు విడిచెదవు.

తాత్పర్యము

నేను దండకారణ్యమునకు వెడలిపోఁగా భరతుఁడు కొండలతో నడవులతోఁ గూడిన యీ రాజ్యమునంతయుఁ బారులుదీఱి జనములు తన్ను భక్తితో సేవింపఁగా నే బాధయులేక పరిపాలించునుగాక నీ యాజ్ఞప్రకారము నీ కోరిక దీర్చెదను. నా నిమిత్తమై యేల యింత క్రూరముగ నిట్టూర్పులు విడుచుచున్నావు, నా ప్రయాణము సాగనిమ్ము.

ఇంద్రవంశము. ధీమజ్జనుల్ మెచ్చెడి ♦ దేవరానతిన్
నేమంబుమైఁ దీర్పఁగఁ ♦ నేనుగోరిన
ట్లీ మేలిభోగంబుల ♦ నిచ్చగింపఁ జూ
భూమీశ నాకై యిటు ♦ పొక్క నేటికిన్. ౯౭౬

ధీమల్ + జనుల్ =బుద్ధిమంతులగు మనుష్యులు, దేవరానతిన్=ప్రభుఁడవైన నీ యాజ్ఞను, నేమంబుమై=నియమముతో, పొక్కన్=వ్యసనపడ, ఇంద్రవంశవృత్తమునకుఁ దతజరగణములు తొమ్మిదవ యక్షరము యతి.

తాత్పర్యము

బుద్ధిమంతులు మెచ్చెడి నీ యాజ్ఞను నియమముతో వ్రతముగాఁ బూని నెఱవేర్ప నేను గోరినట్లి శ్రేష్ఠంబులైన భోగంబులను గోరను జుమా. రాజా! యేల నాకై వ్యసనపడెదవు.

తే॥ కల్లలాడించి నిను నేను ♦ గాంక్ష సేయు, వాఁడనే రాజ్యకామజీ ♦ వములనకట?
సీతయైనను నా కేల ♦ చెప్పెద విను, నీదుసత్యవ్రతం బెందు ♦ నెగడుఁగాక.

తాత్పర్యము

నీచే నబద్ధమాడించి రాజ్యమును, భోగములను, ప్రాణములను నేనా కోరువాఁడను? సత్యమును విడువవలయునా? సీతను విడువవలయునా? యను సందేహము వచ్చునేని యెట్టి కష్టదశయందును విడువరానిదియుఁ, బ్రాణముల కంటెఁ బ్రియమైనదియు, నూఱసత్యములు చెప్పియయిన భరింపవలసినదియు నని శాస్త్రములు విధించు భార్యనైన వదలెదనుగాని సత్యమును వదలను.

శా॥ వ్యాఖ్యానం బిఁక నేల తండ్రి ఫలమూలాలీదళవ్యూహమే
ముఖ్యాహారముగా మలల్ సదులసొంపుల్ చూచుచున్ దండకా
ప్రఖ్యాతాటవిఁ జొచ్చి కల్పలతికాప్రఖ్యద్రుమచ్ఛాయలన్
సౌఖ్యం బారఁగ నుందు నీకు నిట సంతోషఖ్యంబు సంధిల్లు నాన్. ౯౬౮

వ్యాఖ్యానంబు=వి+ఆఖ్యానంబు=విశేషించి చెప్పుట, ఫలమూలాలీ దళ వ్యూహమే=పండ్లు- వేరులసమూహములు=ఆకులగుంపులు- వీనినే, మలల్ = కొండలు, ప్రఖ్యాతాటవి=ప్రసిద్ధమైన యడవి, కల్పలతికా ప్రఖ్యద్రుమచ్ఛాయ లన్=కల్పవృక్షముల సన్నని తీఁగలవంటి కొమ్మలతో సమానములైన చెట్లనీడల యందు-

తాత్పర్యము

తండ్రీ! చెప్పెద విను పెక్కుమాటలతోఁ బనిలేదు. కార్యము జరుగవలసి నది ప్రధానము. జరుగవలసిన దేమియందువా- పండ్లుకందమూలాదులు ఆకులు ఇవి ముఖ్యమైనయాహారముగాఁ (దీనివలన మాంసము పూర్ణముగా నిషేధింప లేదు) గొని కొండలు నందమైన యేళ్ళను జూచుచు దండకయని ప్రసిద్ధి కెక్కిన యడవియందుఁ గల్పవృక్షముకొమ్మలతో సమానమైన చెట్లనీడల వసిం చుచు హాయిగా నుందును- నీవో యిచ్చట సుఖముగా నుండుము.

కం॥ శోకంబునఁ దాపంబున, వ్యాకులుఁడై దశరథుండు నాత్మజు సంశ్లే
షాకలితుఁ జేసి సోలెం, బ్రాకటచేష్టావిహీనుపగిదిన్ ధరపై. ౯౬౯

వ్యాకులుఁడై=మనస్సుకలఁత చెందినవాఁడై, ఆత్మజున్ = కొడుకును, సంశ్లేషాకలితున్=ఆలింగనముతోఁగూడిన వానిని, ప్రాకటచేష్టావిహీనుపగిదిన్= బొత్తిగాఁజేష్ట లేనివానివలె- నసఁగాఁ బీనుఁగువలె.

తాత్పర్యము

శ్రీరాముఁడు తన్ను విడిచిపోవునే యను శోకముచేత నిద్రాహారములు లేక విశేషించి యేడ్చుటవలని దేహతాపముచేత గుండెచెదరినవాఁడై దశరథుఁడు కొడుకును గౌఁగిలించుకొని శవమువలెఁ గాలు సేతులాడింపక నేలమీఁదఁబడెను.

శా॥ హాహాకారము నిండఁగా నృపతియి◆ల్లాండ్రందఱున్ జేసిపె
న్మోహంపున్సతి కైక దక్క వగలో◆మున్గన్, సుమంత్రుఁడు వ్యా
మోహోద్దామత మూర్ఛ సుక్క, నవలా◆మూఁకల్ దురంతవ్యథన్
హాహా నాఁగ, సుమంత్రుఁ డంతఁ బటుకో◆పాటోప మేపారఁగన్. ౯౮౦

తా త్ప ర్య ము

దశరథుని ముద్దుభార్య కైక తప్పఁ దక్కిన రాజభార్యలందఱు హాహా యను ధ్వనులచే నేడువఁగా(కైక దశరథుఁడు చచ్చినఁ జావనీ తనకొడుకునకు యౌవరాజ్యము మాఱు పూర్ణరాజ్యము వచ్చుననియుఁ దా నేడ్చినఁగార్యహాని యనియు నూరకుండెను-) సుమంత్రుఁడు మిగుల మోహాతిశయముచే శోషిల్లఁగా నితర స్త్రీలందఱు నపారదుఃఖముచే నయ్యో, అయ్యో! యనఁగా సుమంత్రుఁడు లేచి తీవ్రమై యతిశయమైన కోపముతో. దీనికిఁ గ్రియ ౯౮౧-వ పద్యములోని 'వచించు' ననునది.

మోహంపున్సతి. వ్యాకరణము. "గరువపున్మరుపులోనగు స్థలముల స్థిర వర్ణము పరమైనపుడు నుగామముగలదు." సు-వ్యా-సంధి-౪౫. సూ.

—◆ ౩౫-వ సర్గము. సుమంత్రుఁడు కైకను దూషించుట. ◆—

చం॥ కటకట పండ్లు గీఁటి, యెస◆కంబునఁ గేలు విదిర్చి, కన్నులన్
జొటచొట నిప్పు లుర్ల, మెయి◆సొంపఱఁ, బైపయి వెచ్చ నూర్చుచున్,
జిటచిటలాడుచున్, నృపతి◆చిత్తముజాడ నెఱింగి, కైకకుం
బటపట గుండియల్పగిలి◆బ్రద్దలు వాఱఁగ, వాక్ఛరంబులన్. ౯౮౧

గీఁటి = కొఱికి, ఎసకంబునన్ = మిగులఁద్వరగా, విదిర్చి = విదలించి, నిప్పులు=నిప్పులవంటి వేఁడినీళ్ళు, ఉరలన్ = రాలఁగా, మెయిసొంపు = దేహకాంతి, అఱన్=చెడఁగా, వాక్ఛరంబులన్ = మాటలను బాణములచే.

వ్యా- వాక్ఛరము- వాక్ + శరము = పూర్వమందు ఝయ్యులును బర మందు 'అమ్మ'లును గల శవర్ణమునకు ఛకారము వికల్పంబుగనగు. "వాక్శరము" అనియునగును. సు-వ్యా-సం-౨౨-సంస్కృతశబ్దసంధి ప్రకరణము.

తా త్ప ర్య ము.

కటకటయని ధ్వనికలుగునట్లు పండ్లుకొఱికి మిక్కిలి వేగముగఁ జేతిని విదలించి కన్నులనుండి నిప్పులవంటి వేఁడినీళ్ళు చొటచొట రాల దేహకాంతిమాసి పోఁగా మీఁద మీఁద వేఁడి యూర్పులు పుచ్చుచుఁ గోపముచేఁ జిటజిటమని రాజు మనస్సు విధము దెలిసికొని కైకను దాను దిట్టినను రాజు కోపింపఁడని తెలిసి కొని కైకకు గుండెలు పట పట పగిలి తునుకలుగాఁగ వాక్కు లను బాణములు.

చం॥ హృదయము గాఁడి పాఱ, నుడి•యేటుల మర్మము లెల్ల వ్రయ్య, దు
ర్మదచరితన్ వచించు నిటు•ప్రాణధవున్ జగతీప్రభున్ దయా
సదనుని నాజినిన్ విడువఁ•జాలిననీ కొనరింపరానియ
ట్టిది యొకఁ డుండునే ధరఁ గ•డింది, యదేమిటి యాఁడుదానవే. ౯౮౨

తాత్పర్యము

హృదయమున నాఁటి దూసికొని యావలఁ బోవఁగా మాటలను దెబ్బలచే దేహము నలిగులిగాఁగఁ బొగరుపోతు నడవడిగలదానిని జూచి యిట్లనెను. ఓసీ-ప్రాణభర్త, భూమిపతి, దయావంతుఁడునగు దశరథుని వదలిననీకుఁ జేయరాని కార్యము వేఱొకటిగలదా. నీవేమియాఁడుదానవే- ఎంత దుష్టస్త్రీయైన నిట్లు చేయునా?

చం॥ తలఁకెడివాఁడు గాఁడు వసు•ధాపతి శైలమురీతి, నింద్రుఁడుం
బలె గెలువంగ దుర్జయుఁడు•వారిధి పోలెఁ గలంగఁ డట్టి యా
బలియుని నీకుచేష్టలను•భంగము పెట్టితి వెంతజాణవే ?
తలఁతుఁ బతిఘ్ని వంచుఁ జెడు•దాన కులఘ్నివి గావె వెండియున్.

తాత్పర్యము ౯౮౩

ఈరాజెంత యాపదలు వచ్చినను గొండవలె ధైర్యము విడిచెడివాఁడు కాఁడు. ఇంద్రునివలె నెట్టి శత్రువునైన జయింపఁగల శక్తిగలవాఁడు. సముద్రమువలె క్షోభము లేనివాఁడు. అటువంటి దేహబలము మనోబలము గలవాని నీవు కుచ్చితపుఁ జేష్టలచే నడుములు విఱిగి కూలఁబడునట్లు నలుగురిలో నవమానపడునట్లు చేసితివి. ఎంత నేర్పరివే. ఓసిదుర్మార్గురాలా! నీవు పతిని జంపిన దానవేకావు. కులముకూడ నాశము చేసిన దానవని తలంతును.

శ్లో॥ అవిద్వాంస మలంలోకే । విద్వాంస మపివాపునః ।
నయంతి హ్యపథం నార్యః । కామక్రోధవశానుగమ్॥ భార-౧౩-౪౮-౩౭

అవిద్వాంసునిఁగాని విద్వాంసునిఁగాని కామక్రోధములకు వశపడిన వానిని స్త్రీలు చెడుమార్గముల నీడ్తురు- దశరథుఁడు శైలము- ఇంద్రుఁడు- సముద్రముఁవంటి వాఁడైనను గామదాసుఁడగుటచే సతనిని గైక యిన్ని యాటలాడింపఁగలిగెను మూత్రపాత్రములపై వ్యామోహముగల మగవారి బ్రదుకిట్టిదే- "కలంచునే సతుల మాయల్ ధీరచిత్తంబులన్"- మనుచరిత్ర సుమంత్రుఁడు కైకను బతిఘ్నివని తిట్టవచ్చునా? తిట్టుట తప్పుగాదు.

౧. దశరథుని యప్పటిస్థితిచూడఁ బెక్కునాళ్ళు బ్రదుకఁడని స్ఫుటముగఁ దోఁచెను. బ్రదికినను జీవచ్ఛవమే.

౨. అగ్నిర్గురు ద్విజాతీనాం । వర్ణానాం బ్రాహ్మణోగురుః । పతిరేకో గురు స్త్రీణాం। సర్వస్యాభ్యాగతోగురుః॥ వృద్ధమనువు॥ బ్రాహ్మణుల కగ్ని గురువు.

అన్ని వర్ణములవారికి బ్రాహ్మణుఁడు గురువు. స్త్రీలకు భర్తయొకఁడే గురువు. అందఱకు నభ్యాగతుఁడు గురువు.

"గురుర్మమ గురు స్త్వం వై । యతోదైవతదైవతః ।
దేవాతిదేవ స్తస్మాత్త్వం । సత్తూనాధత్స్వమేప్రభో.
అశ్వమేధము_ సక్తుప్రస్థ చరిత్రము.

ప్రభూః నా గురువునకు నీవు గురువు. నాదైవమునకు నీవు దైవము.దేవతల నతిక్రమించిన దేవుఁడవు. కావున నాపాలి పిండియుఁ గైకొనుము. ఇది కోడలు మామతోఁ జెప్పినమాట_ కావున స్త్రీలకు భర్తను మించిన గురువు లేఁడు.

"త్వమిత్యుక్తాతునిహతో, గురుర్భవతి భారత
గురూణా మవమానోహి, వధ ఇత్య భిధీయతే
అథర్వాంగిర సీహ్యేషా, శ్రుతి రేషా సనాతనీ ॥

గురువును నీవు నీవు అని పలుకుటయే యతనిఁ జంపినట్లు_ గురువు నవమానించుటయే యతనిఁ జంపుట యని వేదము చెప్పుచున్నది. ఇది శ్రీకృష్ణ వాక్యము భార_ కర్ణ. ఈకారణముచేఁ గైక మగని నవమానించి పలుకుటచేఁ జంపినదే యయ్యెను. దశరథుఁ డదృష్టవంతుఁడు గావున మరణించెను.లేకున్న నలువురిలో నేమని తలయెత్తి తిరుగఁ గలఁడు? కావున సుమంత్రుఁడు పలికినది దుష్టముగాదు.

కం॥ కొడుకు లొకకోటి యుండినఁ, బడఁతికి విభు ననుసరింప•భవ్యం బగు నీ
యెడ వరదుఁడు మగఁడు న్నీ,
వుడుగక కాకింపఁ దగునె•యువిదా యిట్టుల్? ౯౦౪

తాత్పర్యము

ఒకతెగకుఁ గోటిమందికొడుకులున్నను పతి యసమర్థుఁడైనను మగని ననుసరించియుండవలసినది విధి. అదియే క్షేమమార్గము. అటులుండ నీయన నీవు కోరిన వరము లిచ్చువాఁడును మగఁడును. అట్టివానిని నీవు వయస్సు పొగరుచే నిట్లు బాధింపవచ్చునా? యువతి శబ్దభవము ఉవిద.

తే॥ కాలధర్మంబుఁ గనెనేని•క్ష్మావరుండు,నవల వయసునఁ బెద్ద రా•జ్యంబు సేఁత
ధర్మ, మీరాజు జీవించు•తరుణమంద, కాఁపఁబుపంగఁ జూచెదా•పాడి నేఁడు.
కాలధర్మము=మరణము, పాడి=న్యాయము. ౯౦౫

తాత్పర్యము

లోకములోని ధర్మప్రకార మొకరాజు మరణించిన వెనుక నతని పెద్దకొడుకు రాజ్యము చేయుటయు శాస్త్రసమ్మతమైన కార్యము_ న్యాయమిట్లుండ నీరా జూపిరితోనుండఁగానే యాన్యాయము చెఱుపఁ జూచుచున్నదానవు.

ఉ॥ నీకొడుకే ధరిత్రిఁ గొన•నీ, ప్రభుతం గననీ, ధ్రువంబుగా
లోకుల మెల్ల రాముఁ డెట•లోలమతిం జరియించు నంద ము
చ్ఛ్రీకుల మై చరించెద, మి•సీ, నెఱిమాలిననీదువీటిలో
నేకరణి న్వసింతురు సు•ధీంద్రులు సజ్జను లార్యసత్తముల్. ౯౧౬

లోలమతిన్ = ఆసక్తిగలమనస్సుతో, ముత్+శ్రీ+కులమై=సంతోషలక్ష్మి గలవారమై, నెఱిమాలిన=న్యాయము వదలిన, సుధీంద్రులు=బుద్ధిమంతులలో శ్రేష్ఠులు, సజ్జనులు=సాధువులు, ఆర్యసత్తముల్=ఆర్యులందుత్తములైనవారు.

తాత్పర్యము

నీ కొడుకే రాజ్యము గొనెనా- ప్రభువయ్యెనా- దృఢముగాఁ జెప్పెద వినుము- శాశ్వతంబుగా లోకుల మగు మేమందఱము శ్రీరాముఁడెందు నాసక్తితోఁదిరుగుచుండునో యందే సంతోషసంపద ననుభవించుచు వసించెదము. శ్రీరాముఁడెచటనున్నాఁడో యచటనే మాకు సర్వసౌఖ్యములు- సర్వభోగములు- సర్వసంతోషములుగాని నీతిమాలి న్యాయము దప్పిన నీయూరిలో మంచిబుద్ధి గల పండితులు మంచినడవడిగల సాధువులు-పెద్దవారు నెవరుందురు.

కం॥ ఇట్టిభవచ్చరితకు హా, చిట్టలు క్షితితల మదేల•చీలదొ రెండై
తిట్టరుకా ఛీ యని నృపు, పట్టిం గారించు నిన్నుఁ•బరమమునీంద్రుల్. ౯౧౮

చిట్టలు=చిత్రములు, నృపు పట్టిన్=రాజకుమారుని,

తాత్పర్యము

ఆహా! యేమి చిత్రము- నీ యిటువంటి లోకధర్మవిరుద్ధపు నడవడికి భూమి రెండై పగిలిపోకయున్నదే- అధర్మము సహింపని యీవసిష్ఠాది మహామునులు నిన్నేల శపింపక క్షమించి యూరకున్నారో.

కం॥ మామిడిని నఱికి గొడ్డట, వేమును బా ల్పోసి పెంప•వెలయునె తీ పై
నీమాతయట్ల నీవును, వేమున స్రవియించునొక్కొ•వెలఁదీ తేనెల్. ౯౧౧

వేము = వేఁపచెట్టు.

తాత్పర్యము

మామిడి చెట్టును గొడ్డలిచే నఱికి పాఱవైచి దాని స్థానమున వేఁపచెట్టును నాటి పాలుపోసి పెంచినను నదితీపుకాఁగలదా. పట్టమహిషియగు కౌసల్యను నాదరింపవలసియుండఁగా నిన్నొక గొప్పచేసి యాదరించి దశరథుఁడు నెత్తిపై కెక్కించుకొనఁగానే నీవు మంచిదానవు కాఁగలవా. కాలేవు. నీతల్లి యెటువంటిదో నీవటువంటిదానవే- వేఁపచెట్టునుండి తేనెలు కాఱునా.

కం॥ నినుఁ గన్నతల్లియగుణము, వినినారము పూర్వమునను•విశ్రుతరీతిన్
గనినార మిపుడు నీయెడ, వనితా! యెటు దాఁప నౌ స్వ•భావగుణంబుల్.

అగుణము=చెడ్డగుణము, విశ్రుతరీతిన్=ప్రసిద్ధముగా. ౯౪౯

తా త్ప ర్య ము

నిన్నుఁ గన్నతల్లిచెడ్డగుణము పూర్వము సుప్రసిద్ధము గావింటిమి- అట్టి గుణము నీయందిపుడు కంటిమి- స్వభావగుణములు దాఁచుటకెవరికి వశము. తేలునకుఁ గుమ్మరిపురుగు పుట్టునా ?

చం॥ ఎఱుఁగమె నీదుతల్లికథ • నెవ్వఁడో సిద్ధుఁడు నీదుతండ్రికిన్
నెఱి మృగకోటిపల్కెఱుఁగు • నేర్పు ఘటింప వరంబు పేర్మిఁ దా
నెఱుఁగుము నుండి పాన్పున శ•యించినవేళను బైఁడిచాయయై
కొఱలెడిచీమపల్కునకు•గొల్లున నవ్వె నృపాలుఁ, డంతటన్. ౯౯౦

తా త్ప ర్య ము

నీ తల్లిచేసిన దుశ్చేష్ట చెప్పెద వినుము. ఎవరికిఁ దెలియదని తలఁచితివేమో. ఒక సిద్ధుఁడు నీ తండ్రికిఁ బశు పక్ష్యాదుల మాటలు తెలిసికొను నేర్పు వరంబుచే ననుగ్రహించెను. ఒకనాఁడు పడుకటింటిలో భార్యతోడ శయనించి యుండిన సమయమందు బంగారువన్నెగల చీమమాట కాయన గొల్లుననవ్వెను.

సీ॥ కినుక పెంపార నీ•జనని యాతనిఁ జూచి,
యేల నవ్వితి పది•యెఱుఁగఁ దెలుపు
మన్న నోదేవి! నే•నాడరా దది చెప్పి, నంతన మరణంబు•నందువాఁడ
ననిన నాతనిఁ జూచి•యపహసించెదె నన్ను, నేల నీ కింతటి•యెల్లిదంబు
చావుము బ్రదుకు మే•చందమైనను గన్ను, చెప్పక విడ నంచుఁ•జేడె పలుక
తే॥ వరము లిచ్చినఘనున కా•వార్తఁ దెలుపఁ, బాడు గానిమ్ము చావనీ•పడఁతి జేఁడ
చెప్పకుమటన్న నట్ల యా•చెడిపెవిడిచి, హాయిగ జరించె ధనదుని•యట్టులతఁడు.

ఎల్లిదంబు=హేళనము, చెడిపె=చెడ్డస్త్రీ, ధనదునియట్లు=కుబేరునివలె.

తా త్ప ర్య ము

అట్లు రాజు నవ్వఁగాఁ గోపాతిశయముచే నీ తల్లి యాయనను జూచి యేల నీవు నిష్కారణముగా నవ్వితివి. చెప్పుమనెను. నేనది చెప్పరాదు. అది చెప్పిన వెంటనే మరణము ప్రాప్తించునని నా గురువు నాజ్ఞ. కావునఁ జెప్పననెను. అసెనన్నవమానించిన పిమ్మట నీవు చచ్చిననేమి, బ్రతికిననేమి, చచ్చినఁ జావుము. బ్రదికిన బ్రదుకుము. నీవు నవ్వినకారణము చెప్పకతప్పదు. నన్నుఁజూచి నవ్వియవమానించితివి అని నిర్బంధింపఁగా నా రాజు తనకు వరమిచ్చిన సిద్ధున కా వార్త తెలిపి యేమిచేయుమనెదవనెను. ఆయన రాజా యది యెటులైనఁ బాడుగాఁ బోనీ చావనీ. నీవుమాత్రము దానికి మర్మము చెప్పవలదనెను. ఆమాటప్రకారము నీతండ్రి దుష్టురాలైన నీ తల్లిని నూప వెడలఁగొట్టి సుఖించెను.

అట్లుచేయక నీకు దాసుఁడగుటచే నీ రాజి ట్లేడ్చుచున్నాఁడు. తా నేడ్చుటే కాక లోకమునంతయు నేడ్పించుచున్నాఁడు.

చం॥ అనయపుఁజెట్టసేఁతఁ దలి♦యంతటిదానవు నీవు కావె? దు
ర్జనులు చరించుత్రోవను న♦సద్విషయంబున నోసి పాపినీ!
జనపతి నేఁచె దీ విపుడు♦సత్యమ తల్లినిబోలి కూఁతురున్
జనకునిఁబోలి పుత్రుఁడును♦సంభవ మందుదు రన్న నానుడుల్. ౯౯౨

అనయపుఁ జెట్టసేఁతన్ = నీతిమాలిన చెడుకార్యము చేయుటయందు, ఏంచెదు = బాధించెదవు, నానుడి=సామెత.

తా త్ప ర్య ము

నీతిమాలిన చెడుకార్యము చేయుటయందు నీతల్లి యంతటిదానవు నీవు కావా? అంతకంటె నెక్కువైనదానవే. దుష్టజనులు పోవుత్రోవఁబోవుచుఁ జెడు విషయమునందుఁ బాపాత్మురాలా రాజును బాధించెదవు. ఇది యథార్థమే. ఎట్లన:— తల్లినిఁబోలి కూఁతురు తండ్రినిబోలి కొడుకు పుట్టుదురన్న సామెత కలదు గదా. అది యేల తప్పును.

చం॥ జనము వినంగఁ బల్కినర♦సాపతివాక్యము సాగ నిమ్ము నీ
జనినిని బోలఁ బోకు, పతి♦సమ్మతిఁ గొల్వుము, పౌరకోటికిన్
ఘనతర సమ్మదం బమరఁ♦గా శరణం బవు గమ్ము, దేవరా
జనిభుని లోకభర్తఁబతి♦సంకటపెట్ట కధర్మ మూనఁగన్. ౯౯౩

రసాపతి = భూమిపతి. రాజు.

తా త్ప ర్య ము

లోకులందఱు వినునట్లు పలికిన రాజుమాట చెల్లనిమ్ము. నీతల్లివలె రాజును జంప యత్నింపకుము. భర్తను భక్తితో సేవింపుము. పురజనులకు మిక్కిలి సంతోషము గలుగునట్లు దిక్కగుము. ఇంద్రునితో సమానుఁడైన భూమి భర్తను నధర్మకార్యము చేయుమని బాధింపకుము.

చం॥ వరములు పొల్లుపోవు నని♦వారిజనేత్ర తలంప, కింతకున్
గురుతర మైనసంపదలఁ♦గూర్చెడు నీధరణీశ్వరుండు, దు
ర్భరబలశాలి జ్యేష్ఠు జన♦రక్షణశీలు స్వధర్మరక్షకున్
బరమవదాన్యు రామవిభుఁ♦బట్టముఁ దాల్పఁగ నిమ్ము దేవెరీ! ౯౯౪

పొల్లుపోవును = వ్యర్థములై పోవును, పరమవదాన్యు = గొప్ప దాతను, దేవెరీ = దేవీ.

తా త్ప ర్య ము

నాకిచ్చిన వరములు వ్యర్థములాయెనని తలంపకుము. ఇప్పుడు నీకుఁగల యైశ్వర్యముకంటె హెచ్చుసంపదలను రాజు నీకుఁ గలిగించును. మిక్కిలి బల

వంతుఁడు కావుననే రాజ్యరక్షణమందు సమర్థుని, జ్యేష్ఠున్, శాస్త్రప్రకారము వంశాచారము ప్రకారము పట్టాభిషేకమున కర్హుఁడైన పెద్దకొడుకును- జనులను రక్షించుటే స్వభావముగాఁ గలవాఁడు కావుననే సామర్థ్యము హక్కుమాత్రమే గాక స్వభావముచేతను రాజుగానుండఁదగినవాఁడు. స్వధర్మరక్షయందుఁ బట్టు తలగలవానిని- మిగుల దాతను లోభితనములేక తాను సంపాదించినదంతయు నే నెపముచేనైన మరలఁ బ్రజలకే యిచ్చువానిని. ఇటువంటి శ్రీరామునిఁ బట్టముఁ గట్టుకొన నిమ్ము.

కం॥ ధరణిపతిఁ దండ్రిఁ బాయుచుఁ నరిగిన శ్రీరామచంద్రుఁ•డడవులకును సు
   స్థిర మై జగంబునందుం, బరివాదము నీకుఁ గల్గుఁ•బరికింపు మెదన్.
   పరివాదము = నింద.

తాత్పర్యము

శ్రీరామచంద్రుఁడు రాజును దండ్రిని వదలిపెట్టి యడవులకుఁబోయెనా నీకు నిందతప్పదు. చక్కఁగాఁ బరిశోధించి చూడుము. నాకు రాజు వరము లిచ్చెదననెను నేను గోరుకొంటిని నాకేల యపనింద యనెదవా రాజును విడిచి శ్రీరాముఁడు పోయెనా మీఁదఁజెప్పిన రాజలక్షణములుగల శ్రీరాముఁడు లేమిని రాజ్యమరాజకమగును. ఇఁక నీరాజును గౌరవించువాఁడెవఁడు? ఉండియు లేనట్లే. లేదా శత్రువులువచ్చి మీఁదఁబడిరేని యీ ముసలిరాజేమి చేయఁ గలఁడు? రాజ్యము పరాధీనమగును. అప్పుడు నీ కపకీర్తి తప్పదు.

తండ్రియగు దశరథుని రామచంద్రమూర్తి వదలిపోయెనా దశరథు నంతటివాఁడే శ్రీరామునివంటి కొడుకును వదలెనే మన మేల వదలరాదని లోకులు వక్రమార్గములఁబోయిరా యట్టివారి నీ రా జేముఖము పెట్టుకొని శిక్షింపఁగలఁడు? ఆ యనర్థమునకు నీవు కారణమగుటచేతను నీకు నింద తప్పదు. ఇది బాగుగ నాలోచించుకొనుము.

ఉ॥ రాముఁడు గాన కేగినఁ బు•రంబున నంతటివాఁడు గల్గఁ డో
   భామిని! కాన రాజ్యమును•బాలన సేయఁగ నిమ్ము రామునే,
   రాముఁడు రాజిలంగ యువ•రా జయి యేఁటు పురాచరిత్రమున్
   దా మది నెంచి కానకు య•థామతిఁ బోవుఁ దపంబు సల్పఁగన్.   ౯౯౬

తాత్పర్యము

శ్రీరాముఁడు వనములకుఁబోయెనా రాజ్యపరిపాలనమం దంతటి సమర్థుఁడు లేఁడు. కాఁబట్టి కోపస్వభావురాలా- నీ కోపమువదలి శ్రీరాముఁడే రాజగునట్లు చేయుము. శ్రీరాముఁడు రాజుకాఁగాఁ బెద్దలచరిత్రము ననుసరించి రాజు వాన ప్రస్థాశ్రమ మంగీకరించి యడవులకుఁబోయి తపస్సు చేసికొనునుగాక.

చం॥ నయముగ, నిష్ఠురంబుగ, మనంబు గలంగఁగఁ, గేలు మోడ్పునన్,
ఘనుఁడు సుమంత్రుఁ డాడినను గాఁటియ పొందదు, స్రుక్కదింతయున్
మనమున, నాస్యసీమ రుచి మార్పదు, కింకను దింప దేమియున్
వనిత నిజాశయంబ నెఱపన్ సమగట్టుట గట్టివాయి యై. ౯౯౭

నిజాశయంబ=తన యభిప్రాయమే, గట్టివాయి=గయ్యాళి.

తాత్పర్యము

నీతియుక్తముగను బరుషముగను మనసు కలఁతపాఱునట్లు చేతులు ముకు ళించియే గొప్పవాఁడగు సుమంత్రుఁడు పల్కఁగాఁ (దన యభిప్రాయమే కొన సాగవలెనని గయ్యాళి ప్రయత్నించుటచే) మనసునఁ గైక యేబాధయుఁ బొందినదికాదు. కొంచెమైన స్రుక్కదు- ముఖకాంతి మార్పదు- కోపమును దగ్గింపదు.

—{ ౩౬-వ సర్గము. దశరథుఁడు శ్రీరామునితోడ సైన్యాదులు పంప సుమంత్రునితోఁ జెప్పుట. }—

తే॥ కైకమోము ప్రసన్నతా కలన గనక, యుంటఁ గనుఁగొని జనపతి కంటినీరు
జాలువాఱఁగఁ బైపయిఁ జాలవెడలు,నూర్పులను బల్కఁ దనవర మూహచేసి.

ప్రసన్నతాకలన = ప్రసన్నమైయుండుటను. ౯౯౮

తాత్పర్యము

ఇంతచెప్పినను కైక మోము ప్రసన్నముగాకుండుట చూచి రాజు కన్నీరు వెల్లువగఁగార్చుచు మీఁదమీఁద వేఁడియూర్పులు విడుచుచుఁ దానిచ్చిన వరముల నూహించి దశరథుఁడు సుమంత్రునితో నిట్లనియె.

కం॥ సూతా! సంతనకట్టుము, సీతాపతితోడ నరుగ క్షిప్రమ రత్నో
పేత చతుర్విధసేనా,జాతంబుల నస్త్రశస్త్ర సంఘంబులతోన్. ౯౯౯

సంతనకట్టుము=సిద్ధముచేయుము, క్షిప్రమ=వేగను, రత్నోపేత=రత్నము లతోఁగూడిన, చతుర్విధ సేనాజాతంబులన్ = నాలుగువిధములైన సేనాసమూ హములను.

తాత్పర్యము.

సారథీ! శ్రీరామునితోఁ బోవుటకై రత్నాదులతో రథగజతురగపదాతుల తోడి సేనలనన్నిటిని అస్త్ర శస్త్ర సమూహములను శీఘ్రముగా సిద్ధముచేయుము.

కం॥ గాణల రూపాజీవా, శ్రేణుల ధనవద్వణిజుల సిద్ధపఱుపుమీ
వోణిమి రామునిసేనల, రాణింపఁగఁజేయ వస్తురాసులతోడన్ ? ౧౦౦౦

గాణలన్=గానముచేయువారిని, రూపాజీవా=వేశ్యల, శ్రేణులన్ = వరుస లను- రూపముచే జీవించువారు గనుక వేశ్యలు రూపాజీవలు,ధనవద్వణిజులన్= ధనవంతులైన వైశ్యులను- “వారస్త్రీ గణికా వేశ్యారూపా జీవా” అమరకోశము.

తాత్పర్యము

చక్కఁగా బాడువారిని, అందకత్తెలగు వేశ్యలను, ధనవంతులగు వైశ్యులను సిద్ధముచేయుము, వీరందఱు వారివారి వస్తువులతో సేనలతోఁబోయి శ్రీరాముని నానందింపఁజేయవలయును.

కం॥ రామునియాశ్రితజనమును, సాముల గరిడీల రామ•చంద్రుని మెచ్చౌ
నామనుజులఁ దరలింపుము, హేమాదు లొసంగి వారి•కిచ్ఛకొలందిన్.

తాత్పర్యము ౧౦౦౧

శ్రీరాముని నాశ్రయించియుండువారిని సాములు గరిడీలు చేయువారిని నింకను శ్రీరామునికి మెప్పైనవారిని వీరికందఱకుఁ గావలసిన బంగారు మొదలగునవి వారి కోరికదీరనిచ్చి పయనము చేయింపుము.

కం॥ ప్రకటముగ నాయుధీయుల, శకటంబులఁ బౌరజనుల • సాగింపు, వనా
టకు లగుబోయలఁ జెంచుల, వికలత లే కనుపు రామ•వీరుని వెంటన్.

ఆయుధీయులన్=ఆయుధములచే జీవించువారిని, శకటంబులన్=నూనె, నెయ్యి మొదలగు వస్తువులుగల బండ్లను, వనాటకులు = వనమునఁ దిరుగువారు, సాగింపుము=ప్రయాణమై పోవఁజేయుము.

తాత్పర్యము

ఆయుధములచే జీవించువారిని, నూనె నెయ్యి మొదలగు పదార్థములను దీసికొనిపోవ బండ్లను, పౌరజనులను, ప్రయాణమైపోవునట్లు చేయుము. త్రోవ చూపుటకై వనసంచారులైన బోయలను జెంచులను శ్రీరాముని వెంటఁ బంపుము.

కం॥ నొంచుచుఁ గరులను మృగములఁ,
ద్రుంచుచుఁ బలునదులలోనఁ•దోఁగుచునాస్వా
దించుచుఁ గమ్మని తేనెల, సంచితరాజ్యంబు మఱచి•యట సుతుఁ డుండున్.

నొంచుచున్=నొప్పికలిగించుచు, త్రుంచుచున్=నఱకుచు, తోఁగుచున్ = స్నానముచేయుచు, ఆస్వాదించుచున్=త్రాగుచు.

తాత్పర్యము

ఏనుఁగులను నొప్పించుచు, మృగములను ఖండించుచు, అనేక నదులలో స్నానముచేయుచుఁ, దియ్యనితేనెలఁ ద్రాగుచు, నీ మనోహరరాజ్యమును మఱచి యచటనే కొడుకుండును గాక.

కం॥ మనుజులు మిట్టాడనియా, వనములఁ జరియించు రామ•భద్రునితోడన్
బనుపుము నాకుం గలయా, ధనధాన్యము లెల్లఁ గొడుకు•వద్ద సుఖింపన్.

మిట్టాడని = సంచరింపని.

తాత్పర్యము

మనుష్యసంచారములేని యా యడవులందు సంచరించు రామభద్రుఁడు సుఖించుటకై యాయనవెంట నాకుఁగల ధనము ధాన్యములన్నియుఁ బనుపుము.

ఉ॥ మంచితలంబులం దొగి స◆మంచితరీతిని యజ్ఞకోటిఁ గా
వించుచు మౌనివర్యులకు ◆ విప్రచయంబుల కెల్లఁ బ్రీతి సం
ధించుచు భూరిదక్షిణల ◆ దివ్యమహర్షులతో సదా ప్రసం
గించుచు హాయి నుండెడిని ◆ గీడొకయించుక లేక కానలోన్. ౧౦౦౫

ఒగిన్=చక్కఁగా, ఇంచుక=కొంచెమైనను.

తాత్పర్యము

మంచి ప్రదేశములందు జక్కఁగాఁ దగినరీతిని యజ్ఞములను జేయుచు మునిశ్రేష్ఠులకు బ్రాహ్మణులకు సంతోషముకలుగ భూరిదక్షిణలనిచ్చుచు దేవర్షుల తోడను మహర్షులతోడను నెల్లప్పుడు ముచ్చటలాడుచు నేయాపదలేక యడవిలో శ్రీరాముఁడుండునుగాక.

కం॥ భరతుఁడు ధరణీరాజ్యముఁ, బురమున నిట నిల్చి సకల ◆ భోగంబులతోఁ
బరమముదమ్మున నేలుతఁ,ద్వరపడుమీ రామవిభుఁడు◆వనముల కరుగున్.

తాత్పర్యము ౧౦౦౬

భరతుఁడు పురమందు నిలిచి సకల భోగంబులతో సంతోషముతో రాజ్యముఁ బరిపాలించునుగాక. ఇవన్నియుఁ ద్వరగాఁ గానిమ్ము రామచంద్రుఁ డరణ్యములకుఁబోవఁ ద్వరపడుచున్నాఁడు.

చం॥ అనుచు ధరాధవుం డన భ ◆ యాకుల యై మొగ మెల్ల వాడఁగాఁ
గనుకనిఁ బెన్విషాదమున ◆ గద్గద తోఁపఁగ నాల్కతొట్రిలన్
జనపతియాస్య మట్టె కని ◆ సాధువరేణ్యుఁడ! పీతమండమ
ద్యనిభము పాడురాజ్య మజ ◆ నాన్విత మేటికి నాదుపట్టికిన్? ౧౦౦౭

భయాకులయై=భయముచే మనస్సు కలఁతపడినదై, గద్గద=డగ్గుత్తిక, పీతమండమద్యనిభము = మండము = మీఁగడ- పెరుఁగులో మీఁగడ యెట్టిదో సారాయములో నట్టిదైనవస్తువు- అది త్రాగఁగా మిగిలిన కల్లుతో సమానము. మడ్డిత్రాగిన ముడ్డికి సత్తువ యని త్రాగుబోతులలో నొక సామెతకలదు- అజనాన్వితము=జనులలేమిచేఁ గూడినది, పాడురాజ్యము = జనులు వాసముచేయని రాజ్యము, సాధువరేణ్యుఁడ=సాధువులలో శ్రేష్ఠుఁడా. ఇది యెత్తిపొడుపుమాట,

తాత్పర్యము

దశరథుఁ డట్లెత్తిపొడిచినట్లు మాటలాడఁగా నిజముగా నటుచేయునేమో యని భయపడి ముఖము వాడిపోవ వికలతనొంది పెద్దదుఃఖముతో మాట డగ్గుత్తికపడ నాలుక తడఁబడ రాజుముఖము నిలువుచూపులఁ జూచుచు నోయీ

యు త్తమ సాధువా నీవు చాలఁ బెద్దమనుష్యుఁడవుగా నున్నావే.సారముపోయిన కల్లువంటి జనములేని పాడురాజ్యము నాకుమారునకేల ?

ఉ॥ సిగ్గు దొఱంగి క్రౌర్య మెదఁ • జేర్చి పచించెడికైకఁజూచి యో
యెగ్గులమారి! నెత్తిపయి•నెత్తియు నెత్తఁగరానిమోపు నీ
విగ్గతి వెండి యేఁచెద వ•టే, చెనఁటీ! మును వేఁడినా వటే?
యగ్గలికంపుటీసుమెయి • నాడెడవా చలపట్టి యీయెడన్ ? ౧౦౦౮

ఎగ్గులమారి = చెడుపుచేయు స్వభావముగలదానా, అగ్గలికంపుటీసు మెయిన్=అధికమైనకోపముచే, చలపట్టి=చలముపట్టి

తాత్పర్యము

సిగ్గువిడిచి క్రూరత్వమే మనసులోనుంచుకొని వచించుచున్న కైకను జూచి యో యనిష్టురాలా నానెత్తిమీఁద నెత్తరాని భారమెత్తియు నింకను బాధించెదవా? ఓసి చెనఁటీ! నన్ను నీవు వరములు వేఁడువేళ శ్రీరామునివెంట నెవరు పోరాదని కోరితివా? ఇష్టమువచ్చినవారు పోవుదురు. లేనివా రుందురు. అధికమైన కోపముచేఁ జలముపూని యీప్రకారము సిగ్గు భయములేక మాటలాడెదవా?

చం॥ అని కనరారఁ బల్కుమను•జాగ్రణి గుబ్బెత యిబ్బడించు కిం
కను భవదన్వయంబునన•కా సగరుండు నిజాగ్రపుత్రకుం
బనిచి సుకీర్తిఁ గాంచె నస•మంజుని నాగతి రామచంద్రుఁడున్
జనుటయె రిక్తచేతులను • సమ్మత మంచన భూమిపాలుఁడున్. ౧౦౦౯

కనరారన్ = నిండుకోపముతో, గుబ్బెత = స్త్రీ- కైక, గుబ్బెత = పెద్ద గుబ్బలుగలది, గుబ్బలు=స్తనములు, ఇబ్బడించు=రెండంతలగు.

తాత్పర్యము

అని రాజు నిండుకోపముతోఁ బలుకఁగా నోహో వీఁడు మఱియొక ప్రకారమున నాకోరిక వ్యర్థముచేయఁదలఁచినాఁడని వయసుపొగరుగల యీ కైక యంతకు రెండంతలుగాఁ గోపించి నీవంశమునందే కదా సగరచక్రవర్తి తన పెద్దకొడుకును నసమంజుని నడివికి బంపి మంచికీర్తిని గాంచెను. అటులే నీ పెద్దకొడుకుగూడ రిక్తచేతులతో నడవికిఁబోవుటయే నాకు సమ్మతము.

కం॥ఛీ యనుటను వినువారలు,మాయురె యని లజ్జఁ దలలు•మఱఁచుటయేన్ గై
కేయి గణింపద, యీయెడఁ, జేయలఁతిని వృద్ధమంత్రి•సిద్ధార్థుండున్.

చేయలఁతి=సమీపము, మాయురె=ఆశ్చర్యార్థకము. ౧౦౧౦

తాత్పర్యము

ఛీ యిదియేమి తెలివితక్కువ మాటలాడుచున్నది యనుటగాని- యీమె మాటలు వినువారు స్త్రీలు బౌరా దీనివలన స్త్రీజాతికంతయు నపకీర్తి వచ్చు

చున్నదే. ఇఁక నే యాఁడుదాని నే పురుషుఁడు నమ్మును అని సిగ్గుచేఁ దలలు వంచుకొనుటగాని కైకేయి లక్ష్యముచేసినది కాదు. ఆ సమయంబున సమీప మందున్న ముసలిమంత్రి సిద్ధార్థుఁడనువాఁడు.

—♦ సిద్ధార్థుఁడు కైకకు బుద్ధి చెప్పుట ♦—

తే॥ భూపుమన్నన గలవాఁడు♦పుణ్యశీలుఁ,డనియెఁ గైకేయి! తెలిసిన♦యట్టులేల
మాటలాడెద: వాయస♦మంజుఁ డేల,
వెడలఁగొట్టంగఁబడియె నా♦విధమువినుము. ౧౧౧

తాత్పర్యము

రాజుచే గౌరవింపఁబడువాఁడు, పుణ్యస్వభావముగలవాఁడు కైకేయితో నిట్లనెను. కైకేయీ! తెలిసినదానివలె నేల మాటలాడెదవు. అసమంజుఁ డేల నగరమునుండి వెడలఁగొట్టఁబడెనో యావిధము వినుము.

ఉ॥ ఆయసమంజుఁ డీనగరి♦యర్భకు లెల్లరు నాట లాడుచో
డాయఁగ బోయి వారిని గ♦డంకను దా సరయూజలంబులన్
గూయిడుచుండ వైచి పసి♦కూనలు మున్గుచుఁ దేలి కొట్టుకోఁ
గోయని యార్చి వేడుకలు♦గూర్చును బుగ్గలు లేవ దుష్టుడై. ౧౧౨

అర్భకులు=పిల్లవాండ్రు, కడంకను=బలముచే, కూయిడుచుంటన్=ఏడ్చుచుండఁగా, పసికూనలు=చిన్నపిల్లవాండ్రు.

తాత్పర్యము

ఆయసమంజుఁ డీపట్టనమున వీథులలో నాడుకొను పిల్లవాండ్రను బలవంతముగాఁ బట్టుకొనిపోయి సరయూనదినీళ్ళలో వారు కుయ్యోమొఱ్ఱోయని కూఁతలు పెట్టుచున్నను విడువకవైచి వా రానీళ్ళలో మునుఁగుచుఁ దేలుచుఁ గాళ్ళుచేతులు కొట్టుకోఁగా కోయని కేకలువేయుచు వారు మునిఁగి బుగ్గలులేవఁగా దుష్టుఁడై వినోదించుచుండెను.

ఉ॥ ఆతనిఁ జూచి నాగరజ♦నావళియెల్లను గోపగించి త
ద్భూతలనాథు నిట్లనియెఁ♦భూమిజనంబుల నొండె నీతనూ
జాతుని నొండెఁ గోరికొని♦సాగఁగఁ బంపుము తక్కువారి నా
ఖ్యాతలభర్త యిట్లనియెఁ ♦ గారణ మేమిటు పల్కఁ జెప్పుడీ. ౧౧౩

నాగరజనావళి=నగరమందుండు జనములసమూహము.

తాత్పర్యము

ఇట్లు శిశుహత్యచేయు నసమంజుని జూచి నగరమునమున్నవారందఱు వానిపైఁ గోపగించి యా సగరచక్రవర్తినిజూచి అయ్యా రాజా నీవు భూమిజనుల నైనఁ గోరికొనుము. నీ కొడుకునైనఁ గోరికొనుము.వీరిలో నొకరిని గోరి తక్కిన వారి నూరువెడలఁగొట్టుము. అనఁగా రాజు లోకులారా మీరిట్లు చెప్పుటకుఁ గారణమేమో.

చం॥ ప్రకృతిజనంబులార! యనఁ • బార్థివసత్తమ యేమి చెప్పఁగ
న్వికటవిరుద్ధ వర్తనుఁడు • నీసుతుఁ డాడెడియూరిబిడ్డలన్
దికమికలాడఁ గొంచుఁ జని • తెప్పునఁ దా సరయూజలంబులన్
వికలుఁడు గాక ముంచుచును • వేడుకఁ జూచెడిఁ జచ్చు చుండఁగన్.

ప్రకృతిజనములారా చెప్పుఁడనిన వారిట్లనిరి. రాజా యేమని చెప్పుమనెదవు. భయంకరము లోకవిరుద్ధములగు నడవడిగల నీకొడుకు కాడుకొనుచుండెడి యూరివారిబిడ్డలను వారు తికమికలాడుచుండఁగాఁ దీసికొనిపోయి తటాలున సరయువు నీటియందు మనసునఁ గొంచమైనఁ గలఁతలేక ముంచుచు వారు చచ్చుచుండ వేడుకచూచుచున్నవాఁడు.

చం॥ అని జనముల్ వచింప మను • జాగ్రణి వారలతుష్టిపొంటెఁ బు
త్రుని సహభార్యుఁ గానలను • ద్రోయఁగఁ జచ్చెడుదాఁక వాఁడునున్
గొని యొకకట్టు గంపయును • గ్రూరమహాటవులందు దిక్కుది
క్కునఁ జరియించెఁ గందములు•గూడుగ నాకులు వేళ్ళు మెక్కుచున్.

తాత్పర్యము ౧౦౧౩

అని జనములు చెప్పఁగా విని రాజు వారలను దృప్తిపఱుపఁ గొడుకును పెండ్లముతో నడవులందుఁ ద్రోయఁగా వాఁడు చచ్చువఱకుఁ గట్టుగంప తీసికొని ఘోరములైన పెద్దయడవులందు దిక్కుదిక్కులుదిరిగి దుంపలు అకులు వేళ్ళు నాహారముగాఁ దిరుగుచుండెను.

ఆ॥ పాపి యైనసుతునిఁ • బాసె ధర్మాత్ముఁడు, సగరచక్రవర్తి•చాన! చెపుమ
పాప మేమి రామ•భద్రునియెడఁ గంటి, విట్టులడవి కరుగ•నెట్టుటకును.

తాత్పర్యము ౧౦౧౪

ధర్మాత్ముఁడైన సగరచక్రవర్తి పాపాత్ముఁడైన తనసుతుని వదలెను. శ్రీరామునియందు నీవేమి దోషము తెలిసి యడవులకుఁ బంపుమనెదవు. ఆ దోషమేదియో చెప్పుము.

ఉ॥ మే మొకదోషమేని నిర • మిత్రుఁడు రామునియందుఁ గాన మో
భామిని! సోఁక నేర్చునొకొ • పంకము చందురునందుఁ, బల్కు ,నీ
వేమియుఁ గాంచి యున్నయెడ • నిప్పుడ రామునిఁ ద్రోచి పుచ్చ నౌ
భీమమహాటవీస్థలికిఁ • బెంకెతనం బిది యేర రిత్తకున్. ౧౦౧౫

నిరమిత్రుఁడు=శత్రువులు లేనివాఁడు, భీమమహాటవీస్థలికిన్=భయంకరమైన పెద్ద యడవిప్రదేశమునకు, పంకము=ఖురద.

తాత్పర్యము

పగవాఁడనువాఁడులేని శ్రీరామునందు మాకొక దోషము కానరాలేదు. సముద్రమునఁ బుట్టిన కారణముచేఁ జంద్రునికి ఖురదతగులునా ? నీవేమి

దోషము గంటివో చెప్పుము. ఇప్పుడే భయంకరములైన యడవులకుఁ ద్రోచి వేయవచ్చును. నిష్కారణముగా నేల యీ మూర్ఖత.

ఆ॥ సాధు వైనవాని•సత్పథనిరతునిఁ, దేర నాపదలను • గూరఁజేయ
ధర్మహాని యగుటఁ•దప్పక తెగఁగాల్చు,శక్రు తేజ మైన•వక్రగమన. ౧౦౧౧॥

సత్పథనిరతునిన్=మంచిమార్గమందుఁ బ్రేమగలవానిని, తేరన్=తేరకు-కారణములేక, వక్రగమన=వంకరపోకలు గలదానా.

తాత్పర్యము

సాధువై సన్మార్గమందుఁ బ్రీతిగలిగినవాని నిష్కారణముగ నాపదలపాలు చేయుట ధర్మహాని కావున నాదోషము వంకరనడతగలదానా! యింద్రునైన దహించును. ఇఁకఁ దక్కినవారి మాటయేల.

ఉ॥ కావున రాజ్యలక్ష్మిని వి•ఘాతము సేయకు రాముఁ డొందఁగా
దేవిరో, యీసు మాను మిఁకఁ • దేరకుఁ దెచ్చెద వేల హావళిన్
రావడిపోవనీకు మది • రాజసతీ? యపనిందఁ బాపుకో
నా విని కైకఁ గాంచి నర•నాథుఁడు పల్కు భృశార్తియుక్తుఁడై. ౧౦౧౯

విఘాతము=విఘ్నము, ఈసు=ఈర్ష్య, హావళిన్= ఆపద, రావడి పోవనీకుము=రాతివలె గట్టిగానీకుము, భృశార్తియుక్తుఁడు=మిక్కిలి వ్యసనముతోఁ గూడినవాఁడు.

రావడు- రాయి+పడు - 'రావడిపోయెఁగాక ధృతరాష్ట్రుఁడు గన్నది యేమి యీసభన్' భార.

తాత్పర్యము

కావున నోదేవీ శ్రీరామచంద్రమూర్తి యౌవరాజ్యపట్టాభిషేకమునకు విఘ్నము కలిగింపకుము. ఈర్ష్యవదలుము. ఏల నిష్కారణముగ నాపదదెచ్చి పెట్టెదవు. మనసు రాయిచేయకుము. అపకీర్తిని బోఁగొట్టుకొనుము అనిచెప్పఁగా రాజు మిగులదుఃఖపడుచుఁ గైక కిట్లనియె.

ఉ॥ ఈవచనంబు లెల్ల రుచి•యింపవు గాదటె నీకుఁ బాపినీ!
భావన సేయ లేవు హిత•పద్ధతి నాకును నీకు, దుష్టమౌ
త్రోవల లోభివృత్తిఁ గొని • త్రొక్కెదు, నీచపుఁజేఁత మాన వీ
కావల మేల కట్టుకొని•కాఱియ పెట్టెద వెల్లవారలన్. ౧౦౨౦

పాపినీ=పాపాత్మురాలా, కావలము=మూర్ఖత్వము, కాఱియ=బాధ.

తాత్పర్యము

పాపాత్మురాలా! యీమాట లేవియు నీకు రుచింపవుగదా. నీకు నాకు నేది మేలో యది యాలోచింపలేవు. లోభగుణములచేఁ జెడ్డత్రోవలఁబోవఁజూచెదవు

నీచమైనకార్యము చేయవదలవు. ఏల మకురుతనమును గట్టుకొని యెల్లవారిని బాధపెట్టెదవు.

ఉ॥ నీవును నీసుతుండు నిఁక ♦ నెత్తినిఁ గొట్టుకొనుండు శాశ్వతం
బౌవసుధాధిపత్యము దు ♦ రాత్మకురాల! సుఖంబు విత్తమున్
భూవిభుతన్ దిగ న్విడిచి ♦ పోయెద రాముని వెంటఁ గానకున్
నీవికటాధిపత్యమును ♦ నేర్తు నటే గన నొక్కపూఁటయేన్. ౧౦౭౧

వసుధాధిపత్యము = ప్రభుత్వము, దురాత్మకురాల = చెడుమనస్సుగలదానా, విత్తము=ధనము, భూవిభుతన్=భూప్రభుత్వమును, వికటాధిపత్యమును =నీయక్రమాధిపత్యమును.

తాత్పర్యము

ఓసీ చెడ్డమనస్సుగలదానా! సుఖము ధనము రాజ్య ప్రభుత్వము సర్వము వదలి శ్రీరామునివెంబడి నేను నడవులకుఁబోయెదను. శాశ్వతమైన యీ ప్రభుత్వము నీవు నీకొడుకు నీ నెత్తిపైఁ గొట్టుకొనుఁడు. నీ యన్యాయప్రభుత్వము నే నొకపూఁటయైనఁ జూడఁగలనా.

—♦ ౩౭_వ సర్గము. కైక సీతారామలక్ష్మణులకు నారచీర లిచ్చుట. ♦—

కం॥ సచివుఁడు జనకుఁడు పలికిన,వచనంబుల నాలకించి ♦ పరమవినీతుం
డచలధృతి రామభద్రుఁడు, వచియించెం దండ్రిఁజూచి♦వఱలెడిభక్తిన్.

సచివుఁడు=మంత్రి, పరమవినీతుండు=మిక్కిలి వినయముగలవాఁడు, అచలధృతి=చలనములేని ధైర్యముగలవాఁడు, వఱలెడి=ప్రకాశించు.

తాత్పర్యము.

మంత్రియును దండ్రియును జెప్పిన మాటలవిని మిగుల వినయము చలింపని ధైర్యముగల రామభద్రుఁడు భక్తియతిశయముచే నిట్లనెను.

ఉ॥ ఏటికి మీర లెల్ల నట ♦ కెల్లసుఖంబులు వీడి దండకా
వాటిని సర్వసంగములఁ ♦ బాసి చరించుచు వేరు వెల్లఁకుల్
గాటముఁగాగ మెక్కుచును ♦ గాలము ద్రోయఁగ నున్ననాకు, నీ
కేటికి భ్రాంతి,యర్థమొకొ ♦ యేనుఁగు నిచ్చియుఁ ద్రాడుకోరఁగన్.

తాత్పర్యము ౧౦౭౩

తండ్రీ! మీరందఱు నడవులకు వచ్చెదమనెదరే ఏమిచేయను? నేనో సర్వసుఖములు వదలి సర్వసంగములు విసర్జించి దండకావనమందుఁ దిరుగుచు వేరు వెల్లఁకులు దండిగాఁదినుచుఁ గాలముద్రోయుచుందును. నాకు మీతోడి జంజాటములేల? ఇంకను నీకుభ్రాంతియేల? ఏనుఁగును దానముచేసి త్రాటినీయఁ గలహించెదవు.

ఉ॥ పంపఁగ నేల నాఁడిని ♦ వాహినికోటుల, వానిఁ గైక హ
ర్షింపఁగ నేన యాభరతుఁ ♦ జేర్చెద, నాకవి యేల తండ్రి! తె

ప్పింపుము నారచీరలను ♦ వేగమ గంపయు గడ్డపాఱ, నే
నింపుగ నుండువాఁడఁ బది ♦ యేఁడులు నాలుగుఁ గాననంబులన్.

వాహినికోటులన్ = సేనలసమూహములను. ౧౦-౨౪

తాత్పర్యము

ఈ సేనలగుంపులను నా వెంబడిపంప నేమిప్రయోజనము? నే నెవరిమీఁద నైన దండెత్తిపోవుచున్నానా? కైక సంతోషించునట్లు వానినెల్ల నేనే భరతుని కిచ్చెదను. నా కివియన్నియు నేల? నాకుఁ గావలసినవి నారచీరలు- గంప- గడ్డపాఱ అవి త్వరగాఁ దెప్పింపుము. చాలును. నేను పదునాలుగు సంవత్సరము లరణ్యమునం దుండెదను.

తే॥ రాముఁడిటుపల్కవిని ప్రహ♦ర్షమునఁ బొంగి,
తాన నారలఁ గొనివచ్చి♦దాశరథికిఁ
గట్టుకో వీని ననియిచ్చెఁ♦గైక జనుల,
మధ్యమున సిగ్గు బిడియంబు♦మదిని గొనక. ౧౦-౨౫

ప్రహర్షమునన్=మిగుల సంతోషముచే, నారలన్=నారవస్త్రములు గట్టి- "నారలుగట్టి కూరలశనంబుగ"సని భారత ప్రయోగము.

తాత్పర్యము

దశరథుఁడు చెప్పినది శ్రీరాముఁ డంగీకరించునేమో, సమస్తజనులు సేనలు శ్రీరాముని వెంటఁ బోవునేమో, నాకోరిక వ్యర్థమగునే అప్పుడిది నే నడుగకపోయితినే యని విచారపడుచున్న కైక శ్రీరాముని మాటలువిని దక్కెరా రాజ్యమని మిగుల సంతోషించి యుప్పొంగి నారచీరలు తానే తెచ్చి "రామా వీనిని గట్టుకో" యని నందఱు జనులనడుమ సిగ్గుగాని జంకుగానిలేక శ్రీరామున కిచ్చెను.

ఉ॥ ఇవ్విధిఁ గైక హస్తమున ♦ నీయఁగఁ గైకొని నారచీరలన్
దువ్వలువల్ దొలంగ నిడి ♦ తుష్టి మెయిన్ ధరియింప రాఘవుం
డవ్వల లక్ష్మణుండు మను ♦ జాగ్రణి తండ్రి గనుంగొనంగఁ దాఁ
జివ్వనఁ దాల్చె నారలను ♦ చిత్తమునందుఁ గళంక దీఱఁగన్. ౧౦-౨౬

దువ్వలువల్=సన్ననివస్త్రములు, తుష్టిమెయిన్=సంతోషముచే, అవ్వలన్=శ్రీరాముఁడు ధరించినవెనుక, చివ్వనన్=ఆలస్యములేక.

తాత్పర్యము

ఈవిధముగఁ గైక నారలను దనచేతితోఁ గట్టుకొమ్మని శ్రీరామునకీయఁగా శ్రీరాముఁడును దాను ధరించియున్న సన్నవస్త్రములను దీసి యావలఁబెట్టి సంతోషముతో నారవస్త్రములు గట్టుకొనెను. ఆయనఁ గట్టుకొన్న పిమ్మటఁ దండ్రి యెదుటనే యాయన చూచుచుండఁగనే త్వరగా నారచీరలను గైక మనస్సునందుఁ గళంకము దొలఁగునట్లు సౌమిత్రి గట్టుకొనెను.

శా॥ పట్టుంబుట్టము గట్టియున్న జనకా • పత్యంబు కైకేయి యా
పుట్టంబుల్ ధరియింపు మం చొసఁగినం • బూఁబోఁడి సిగ్గున్ వ్యథం
దొట్టన్ భీతిలె నాఁడుజింక వలఁ గ • న్గొన్నట్టులై వానిఁదా
నట్టే చూచుచు, వెండి చేతఁగొని ధ•ర్మాభిజ్ఞ చింతారతిన్. ౧౦-౨౭

పట్టుంబుట్టము=పట్టువస్త్రము, జనకాపత్యము = జనకునిబిడ్డ-సీత, పుట్టంబుల్=వస్త్రములు, ధర్మాభిజ్ఞ=ధర్మము తెలిసినది, చింతారతిన్=ఆలోచించినదై.

ఇది స్త్రీలు పట్టుపట్టినపుడు వారికిఁగల తెంపరితనము లజ్జాభయహీనత క్రౌర్యపరిమాణము దయా దాక్షిణ్య శూన్యత తెలుపును.

వారు చేసినంత సాహస మేజాతిపురుషుఁడైనను జేయఁజాలఁడు.

తాత్పర్యము

శ్రీరామలక్ష్మణులు నారవస్త్రములు కట్టుకొన్న పిమ్మట నీవు వీనిని గట్టుకొమ్మని కైక తనచేతికి నారవస్త్రము లీయఁగాఁ బట్టువస్త్రముఁ గట్టుకొనియుండిన యా జానకి సిగ్గు వెత దగులఁగా వలను జూచిన యాఁడుజింకవలె భయపడి యావస్త్రముల నెగాదిగఁజూచుచుఁ బతివ్రతాధర్మమెఱింగిన సీత- మగఁడు దీనిని గట్టుకొన్నప్పుడు నేనేల కట్టుకొనరాదని యాలోచించి వానిని దనచేతికిఁ దీసికొని

కం॥ ఏమియుఁ జేయఁగఁ దెలియక, తా మది దూపిల్లి ధర్మ • దర్శిని బాష్ప
స్తోమపరిపూర్ణ లోచన, యై మఱి గంధర్వనిభుని•నాత్మహృదీశున్. ౧౦-౨౮

ధర్మదర్శిని=పతివ్రతాధర్మమును స్వానుష్ఠానముచే లోకమునకు బోధింప నాలోచించినది, దూపిల్లి = శోకించి, బాష్పస్తోమ = కన్నీళ్ళసమూహముచే, పరిపూర్ణలోచనయై=నిండిన కన్నులుగలదై, గంధర్వనిభుని=గంధర్వులతో సమానమైన సౌందర్యముగలవానిని, ఆత్మహృదీశున్ = తనప్రాణేశ్వరుని.

తాత్పర్యము

వస్త్రములు చేతికిఁ దీసికొని యిటువంటి కఱుకువస్త్రము లాగంధర్వులతో సమానుఁడైన నామగఁడు ధరించెఁగదా యని శోకించి నీటిచేనిండిన కన్నులతో భర్తనుజూచి-

కం॥ ఎట్టులొకో మౌనిజనుల్, కట్టెద రీవల్కలములఁ • గానల నని తా
నిట్టట్టు ద్రిప్పి వానిని, నెట్టును నేరకయ భ్రాంతి•నెసఁగుచు మఱియున్.

వల్కలములు=నారచీరలు, కానలన్=అడవులయందు. ౧౦-౨౯

తాత్పర్యము

నాథా యీ నారవస్త్రములను నడవులలో మును లెట్లు కట్టుకొందురోయని వానిని గ్రిందికిఁ బైకిఁ ద్రిప్పి యెట్లు కట్టుకొనవలయునో తెలియక భ్రమచెంది

ఉ॥ కైకొని యొక్క చీరఁ దన♦కంఠమునం దవిలించి యొండు దాఁ
జేకొని కేల నేమియును ♦ జేయఁగ నేరక నిల్వ సిగ్గున
న్వే కని రామభద్రుఁడును ♦ నీరజలోచన పట్టుఁజీరపైఁ
బ్రాకటరీతిఁ దాన కొని ♦ వల్కలముల్ ధరియింపఁ జేసినన్. ౧౦౩౦

తాత్పర్యము

ఒకచేత నొకచీర తీసికొని మెడక్రిందఁ దగిలించి గడ్డముతో నదిమిపట్టి రెండవది తీసికొని యేమిచేయుటకుఁ దెలియక సిగ్గుపడి నిలువఁగాఁజూచి శ్రీరాముఁడు తటాలునఁబోయి యామె కట్టుకొన్న చీరమీఁదనే దానిని ధరింపఁ జేయుచుండెను.

ఈ నారచీరలు మూరెడు మూఁడు జేనెలుగల చెట్లపట్టలు. వలవలెనుండును. వీనిని గొంచెముగాఁ డెంకాయచెట్లయందుఁ జూడవచ్చును. ఱొమ్ము మీఁదనొకటి కట్టుకొనవలయును. మొలకుముం దొకతునుక వెనుక నొకతునుక కట్టుకొనవలయును. మూరెఁడు మూరెఁడు గుడ్డతుండ్లు రెండో మూఁడో యిచ్చి యిప్పటి యాఁడువారిని గట్టుకొనుఁడనిన నావిధము తెలియును. అందునవి చెట్లపట్టలు గావున గఱుకుగానుండును.

—♦ సీతను దోడ్కొని పోవలదని రాజకాంతలు శ్రీరామునిఁ బ్రార్థించుట. ♦—

కం॥ రాముఁడు తానై తనప్రియ,భామకుఁ జీరలను గట్టఁ♦బరికించి యటన్
రామలు తమతమలోచన,సీమల నశ్రువుల నించి♦చిడిముడిపడుచున్.

తాత్పర్యము ౧౦౩౧

శ్రీరాముఁడు తానే తన ప్రియభామకుఁ జీరలు గట్టుచుండఁగాఁ జూచి యందున్న స్త్రీలందఱు కన్నులనుండి నీళ్ళుకాఱఁ దొట్రుపాటుపడుచు.

కం॥ రామా! యెవ్వరు సీతా,భామను నిటుగాన కరుగఁ ♦ బలికిరి? యేలా
సీమాటిని గొనిపోయెదు? మామాటలు వినఁగదయ్య♦మానఁగదయ్యా.

తాత్పర్యము ౧౦౩౨

రామా! సీత నడవికిఁబొమ్మని యెవరుచెప్పిరి? ఈ యుత్తమస్త్రీని నీవేల యడవులకుఁ బిలుచుకొనిపోయెదవు. అయ్యా! మా మాటలు వినుము. పిలుచుకొనిపోకుము.

కం॥ జనకునినిర్బంధముచే, వనములకు న్నీవు పోవ ♦ వత్సా! నీమా
ఱనయంబు నీమె నైనను, గనుఁగొని మే మూఱడిల్లఁ♦గాఁ జేయఁ గదే.

తాత్పర్యము ౧౦౩౩

మీ తండ్రి నిర్బంధమువలన నీ వడవులకుఁబోఁగా నాయనా! నీమాఱుగ నీమెను జూచియైన మేము వ్యసనము మానునట్లు చేయవయ్యా.

కం॥ తమ్ముఁడు నీవును తోడుగఁ,గ్రుమ్మర, వనులకును బొండు♦కోమలి బాలన్
ఇమ్ముగ్ధ మృదులగాత్రి. వ,నమ్ముల మునిభంగి నెట్లు♦నవసెడిఁ బుత్రా.

తాత్పర్యము

మగవారు తమ్ముఁడు నీవు నొకరినొకరు తోడుగ నడవులకు సంచారము చేయఁబోండు. నాయనా! కోమలియు బాలయునునగు నీ ముగ్ధ కోమలదేహము గలది యడవులయందు మునులవలె నెట్లు కష్టపడఁగలదు.

చం॥ వినఁగద వయ్య మాపలుకు•వీడుము జానకిఁ దండ్రి! మానుడిన్
గొనవుగదయ్య నీవు నిటఁ•గూరిమి నిల్వఁగ ధర్మబుద్ధి నం
చును నట నున్న భామ లను•సూక్తుల వించును నాదరింప కా
ఘనమతి నారచీరలను•గట్టెను సీతకుఁ దుల్యశీలకున్. ౧౦౩౫

మానుడిన్ = మామాటను.

తాత్పర్యము

అయ్యా? మా మాటలు వినవయ్యా! జానకిని వదలి పెట్టిపోవయ్యా. నీకుఁ బుణ్యమగును. నీవు ధర్మముఁ దలఁచి పితృవాక్యపరిపాలనమునకు నీవు పోయెదవేని పొమ్ము అని యచ్చటనున్న యంతఃపురస్త్రీలు పల్కెడి మంచి మాటలు వించును గైకేయి చెప్పుమిచే నా పలుకుల నాదరింపక శీలమునందుఁ దనతో సమానురాలయిన సీతకు నారవస్త్రములును గట్టెను.

—• సీత నారచీరలు గట్టఁగూడ దని వసిష్ఠుఁడు నిషేధించుట. •—

ఉ॥ చీరలు చక్కఁ గట్టుకొను•సీతను నాఁగి వసిష్ఠమౌని యా
క్రూరచరిత్రఁ గైకఁ గని•రోషముమై నను వంశపాంసనీ!
ఘోరకుశీల! యోచెనఁటి•కూళవిధంబున మోసగించియున్
ఘోరమణుం, బ్రమాణపథ•సంస్థితి నొల్ల వదేల దుర్మతీ? ౧౦౩౬

చీరలు=వస్త్రము- ఆంధ్రభారతకాలమునందును వస్త్రపర్యాయముగ చీరలను శబ్దము వాడుకయందుండెను. ఇప్పుడు స్త్రీలవస్త్రములందే వాడుకలో నున్నది.

సైన్యము లింతవడియుఁ దలల చీరలెఱుఁగక॥ విరా. ౨ ఆ.

తాత్పర్యము

శ్రీరాముఁడు నేర్పినప్రకారము చీరలను జక్కఁగాఁగట్టుకొనుచున్న సీతను గట్టుకొనవలదు కట్టుకొనవలదనిచెప్పి వసిష్ఠమౌని నిర్దయమైన నడవడిగల యా కైకనుజూచి కోపముచే నిట్లనియె. ఓసీ వంశనాశకురాలా! భయంకరచరిత్రా యోసి దుష్టపునడవడిగలదానా! వంచనచే రాజును మోసగించియు నీ వెంత ప్రమాణము చేయించుకొంటివో యంతలో నిలువక యేల మర్యాదమీఱి పోవుచున్నావే దురాత్మురాలా?

ఉ॥ పోవఁగ రాదు రాముపువుఁ•బోఁడి హృషీశ్వరు వెంటఁ, బట్టపుం
దేవెరి యై నిజేశ్వరుని•దివ్యమహాసన మెక్కుతన్, గృహ

స్థావితథాశ్రమస్థులకు • నర్మిలిభార్యయ యాత్మయా౽ గదా
కావున రాము మాఱు సతి • క్ష్మాతల మెల్లను నేలు చుండెడిన్. ౧౦౩౭

గృహస్థావితథాశ్రమస్థులకున్ = వ్యర్థముఁగాని గృహస్థాశ్రమమందుండు వారికి, అర్మిలిభార్యయ=ప్రేమగల భార్యయే.

తా త్ప ర్య ము

సీతాదేవి నారచీరలను గట్టనురాదు. అడవికిఁ బోవనుగూడదు. ఇచటనే పట్టపుదేవియై (పట్టాభిషేకము చేసికొనిన రాణియై) తనమగఁ డెక్కవలసిన సింహాసనమును దానెక్కనుగాక. అది యేన్యాయమనుసరించి యందువా గృహస్థధర్మమందుండు పురుషునకు వానిభార్యయె వాని యాత్మ కావున శ్రీరామునిమాఱు సీతయే రాజ్యమంతయు నేలునుగాక.

పురుషునకు వానిభార్యయె యాత్మయని కిష్కింధాకాండమున 'శాస్త్ర ప్రయోగాద్విపిధాచ్చ వేదాదాత్మాహ్యనన్యః పురుషస్యదారా' యని ౨౪-వ సర్గమునందుఁ దారావాక్యము గలదు. చూడు కిష్కింధ పద్యము ౬-౨౩.

ఆత్మాహిదారా సర్వేషాం, దారసంగ్రహ వర్తినామ్.

శ్లో॥ ద్విధా కృతాత్మనోదేహ, మర్ధేన పురుషోభవత్
అర్ధేననారీతస్యాంసః, విరాజ మసృజత్ప్రభుః ॥మను॥
ఆత్మానాం ద్వేధాపాతయ త్తతః పతిశ్చ పత్నీచాభవతాం
బృహదారణ్యకము.

యోభర్తా సా స్మృతాంగనా. మను. ౯-౪౫.
యోభర్తాసైవ భార్యాస్మృతా. వాజసనేయ బ్రాహ్మణము.

ఈ ప్రమాణములచే భార్యాభర్తల కభేదము గావున భర్తమాఱు భార్య సింహాసన మెక్కవచ్చునని వసిష్ఠుఁడనెను. రామాయణవాక్యమే వేదప్రమాణము. దానికిఁ బ్రమాణములు చూపుట సూర్యుఁడున్నాఁడని ఋజువుచేయ దివిటీలెత్తినట్లే.

కం॥ అట్టిది కా దని జానకి, పట్టుగఁ బతివెంటఁ జనఁగఁ • బనిపూనిన మే
మెట్టును దోఁ జనువారము, పట్టనమే పోవు రామ • భద్రుని వెంటన్.

తా త్ప ర్య ము ౧౦౩౮

నామగఁడు కాననములందు నల్లాడుచుండ నేను సింహాసనమునఁ గూర్చుండి ప్రభుత్వము నిర్వహింతునా అదియేటి స్త్రీధర్మమని సీత పట్టాభిషేక మంగీకరింపక పట్టుపట్టి శ్రీరాముని వెంటనే పోయెదనని పూనెనా మేమును వారి వెంటఁబోవువారమే. మామాటయేల అయోధ్యానగరమే శ్రీరాముని వెంటఁ బోవును. ఇది లక్షణావృత్తి. అయోధ్యపోవుననఁగా నయోధ్యయందలి జనము లందఱు పోవుదురని యర్థము.

ఉ॥ జాయయుఁ దాను రాఘవుఁడు • సాగెడిచోటికి నంతపాలకుల్
వ్యాయతవిత్తదాసశక • టాదిగఁ బోయెడివారు, పూర్వజుం
డేయెడ నుండు నవ్వనికి • నేగు భవత్తనయుండు సానుజుం
డై యజినంబు వల్కలము • లాదటఁ దాలిచి మౌనివేషియై. ౧౦౩౯

జాయ=భార్య, అంతపాలకుల్=రాష్ట్రాంతపాలకులు- దండనాయకులు, వ్యాయతవిత్తదాసశకటాదిగన్=విస్తారమైన ధనము- దాసులు- శకటములోనైన జీవాజీవరూపపదార్థములతోఁ గైముత్తిక న్యాయముచే భార్యలు బిడ్డలును గ్రాహ్యము. పూర్వజుండు=అన్న, భవత్తనయుండు=నీకొడుకు, సానుజుండై=తమ్ముఁడగు శత్రుఘ్నునితోఁగూడినవాఁడై, అజినము=జింకచర్మము, వల్కలము=నారచీర, ఆదటన్=ప్రీతితో, మౌనివేషి = మునివేషమును ధరించిన వాఁడునై.

తాత్పర్యము.

శ్రీరాముఁడు తనభార్యతోడ పోయెడిచోటికిఁ దమ భార్యలు బిడ్డలు ధనము దాసులు బండ్లులోనగు జీవనుగల జీవములేని పదార్థములతో సేనానాయకులు పోవుదురు. వారు మేము పోవుట యటుండనీ. నీ కొడుకు భరతుఁడే తమ్ముఁడగు శత్రుఘ్నునితోడఁ గృష్ణాజినము నారచీరలు ప్రీతితోధరించి మునివేషమున నన్నయున్నచోటికిఁ బోవును.

కం॥ అంతటఁ బాడఱు రాజ్యము, నంతయు జనతాఽహితాప్రి • యాత్మిక! కొని య
త్యంతాధికారమును ని, శ్చింతంబుగఁ జూపు చెట్టు • సేమల మీఁదన్. ౧౦౪౦

పాడఱు=పాడుపడిన, జనతా=మనుష్యసమూహమునకు, అహిత = మేలుకానిదియు, అప్రియ = అనిష్టకరమైనదియునగు, ఆత్మిక = మనస్సుగలదానా, నిశ్చింతంబుగన్ = విచారములేక- అవ్యయీభావసమాసము గావున నపుంసకలింగము, చెట్టుసేమలు=చెట్టులు చేమలు, చెట్టుసేమలు- ద్వంద్వసమాసంబునఁ బదంబుకంటెఁ బరంబులయిన పరుషములకు గసడదవలగు. సు. వ్యా. సంధి ౪౦ సూ.

తాత్పర్యము

అంతటఁ బాడుపడిన రాజ్యము సర్వము జనులకు నహితము నప్రియము నైన మనస్సుగలదానా! గ్రహించి నీ యధికారమంతయుఁ దప్పొప్పులు ప్రశ్నించువాఁడు లేమిని నెట్టి విచారములేక చెట్లమీఁదఁ జేమలమీఁద యథేచ్ఛముగఁ జూపుము.

త్రికాలవేదియగు వసిష్ఠుఁడు చెప్పినదంతము యథార్థమయ్యెను. వాన ప్రస్థువలె నందిగ్రామమందుఁ గదా భరతుఁడుండెను.

కం॥ రాముఁడు పాలింపనిచోఁ, గామిని! రాష్ట్రం బ దెప్డుఁ • గానేరదు, శ్రీ
రాముఁడు నిలిచినవనమే, శ్రీమానిత రాష్ట్ర మగును • సిద్ధము సుమ్మీ.

తాత్పర్యము.

రాష్ట్రము రాష్ట్రమనెదవు. ఓసి కాముకా శ్రీరాముఁడు పాలింపనియెడ నది రాష్ట్రమయ్యును రాష్ట్రము గాదు. శ్రీరాముఁడు నిలిచినది వనమైనను రాష్ట్రమే యగును.

చం॥ తనకును బ్రీతిపూర్వకముగఁ • దండ్రి యొసంగనిరాజ్య మేల నే
యనువున నర్హుఁ డౌ భరతుఁ • డాపలు కట్టుల యుండ నిమ్ము, నీ
తనయుఁడె యీమహీపతికిఁ • దా నుదయించుట కల్గె నేని ని
న్నును దనతల్లిగాఁ దలఁప • నూల్కొనునే కనుఁగొమ్ము నానుడిన్.

ఏలింపన్=పాలింపఁగా, అనువునన్=విధముగ. ౧౦౪౩

తాత్పర్యము

తనకుఁ బ్రీతితోడఁ దండ్రి యియ్యని రాజ్యము పాలింప భరతుఁ డెట్టు లర్హుఁడగును. అగునుగాక కాకపోవును గాక. ఆమాట యటుండనీ. భరతుఁడీ రాజుబీజమునకే పుట్టియుండెనా నిన్నుఁ దన తల్లిగా నెంచుటకైనా నుత్స హించునేమో నామాట చూడుము. కలదు గదా పితౄన్ సమనుజాంతే నరా యను న్యాయము.

తే॥ నేలనుండియు నీ వెంత • నింగి కిపుడు,
మిడిసిపడినను భరతుండు • మిటుకులాఁడి
పితృకులాచార ధర్మసం • వేది యేల, తప్ప నడచును ధర్మంబు • ముప్పగదుర.

తాత్పర్యము

భూమిమీఁదనుండి యాకాశమునకు నీవెంత యెగిరిపడినను ఓసి మిటుకు లాఁడి! దండ్రివంశము నాచారమెఱింగిన భరతుఁ డా ధర్మమునకు హానివచ్చ నట్లేల నడచును.

కం॥ కొడుకునెడఁ బ్రేమకతమున, నిడుమలు తెచ్చితివి వాని • కిది యెఱుఁగవొకో
పుడమిని రాము భజింపని, జడమతి యొకఁడేని లేఁడు • సత్యము కైకా.

తాత్పర్యము ౧౦౪౪

కొడుకునందలి ప్రేమకారణముగ వానికిఁ గష్టములు తెచ్చిపెట్టితివి. ఇది నీవెఱుఁగవుగదా. నీ నెత్తిపై మట్టి నీవే వేసికొనుట తెలియలేకయున్నావు. అట్లేల జరుగునందువా. శ్రీరాముని సేవింపని మూఢుఁడొకఁడైన లేఁడు. కైకా యిది సత్యము.

చం॥ కనియెదు గాక నీ విపుడ • కైక! వసుంధరఁ గల్గుగొడ్డులున్
జనములుఁ బాములున్ శకున • సంతతులున్ రఘురాము వెంబడిన్
జనఁ బురి బాసి చెట్టులను • సత్ఫలపల్లవపుష్పకోటితో
వెనయిక లేక రామవిభుఁ • డేగెడిత్రోవకు నున్ముఖంబు లౌ. ౧౦౪౫

కైకా నీ విపుడే నీ కన్నులారఁ జూచెదవు. తొందరపడకుము.ఏమిచూచెద నందువా. నామాట నిజమో యబద్ధమో చూచెదవు. భూమియందునిగల పశువులు, మనుష్యులు, పాములు, పక్షిసంఘము లయోధ్యవిడిచి శ్రీరాముఁ వెంబడిపోవఁగా నడవఁ గాళ్ళులేని చెట్టులు మంచి ఫలములు చిగుళ్ళు పూలు వీనిఁసమూహముతో నొద్దికలేక యవి రాలిపోవుచుండఁగా నవియన్నియు శ్రీరాముడుండు దిక్కుభూనకే తిరిగియుండును. (చూ ౧౨-౨౩—౧౨-౨౪—౧౨-౨౨ వ.)

కం॥ ఇమ్మీభూషణములు గైకొమ్మీ నారలను మరలఁ • గోడలిచే నం
చమ్మునితల్లజుఁ డావస, నమ్ములఁ గట్టంగ నీక • నాతికి ననియెన్. ౧౦౪౬

తాత్పర్యము

సీతకు సొమ్ము లిమ్ము. కోడలిచేఁ జీరలు మరలఁ గైకొమ్ము అని యా మునిశ్రేష్ఠుఁడు సీతను నా నారచీరలఁ గట్టనీయక కైకతో నిట్లనియె.

ఉ॥ రాముని నొక్కనిం గద య • రణ్యనివాసముఁ జేయఁ గోరి, యీ
భామినితోడ నేమి పని • పాపకుశీల? నిజాధినాథుతో
నీమహిళావతంసమును • నెప్పటియట్టుల తా నలంక్రియా
శ్రీమహనీయ యై చనుతఁ • జెల్వెడఁబాయక సర్వయుక్తయై. ౧౦౪౭

తాత్పర్యము

పాపపుఁ గుత్సితచరిత్రా! నీవు శ్రీరాముఁ డొకనినేకదా యడవులకుఁబోవఁ గోరితివి. తక్కినవా రెవ రెట్లుపోయిన నీకేల? వారినేల నీవు నిర్బంధించెదవు. ఈమె యెట్లుపోయిన నీకేల? కాఁబట్టి యీమె తనభర్తతో నెప్పటియట్టు లలంకరించుకొని కాంతియుక్తయై యామెకుఁ గావలసినవన్నియుఁ దీసికొనిపోవునుగాక.

కం॥ యానంబులు సురుచిరపరి,ధానంబులు భూషణములు • దాసీజనసం
తానంబులు మఱి తక్కువి,ధానంబులు గూడి సీత • ధవువెంటఁ జనున్.

యానంబులు=వాహనములు, సురుచిరపరిధానములు=మిక్కిలి సుందరమైన చీరలు, భూషణములు = సొమ్ములు, దాసీజనసంతానంబులు = దాసుల గుంపులు.

తాత్పర్యము

వాహనములు, అందమైన చీరలు, సొమ్ములు, దాసీజనుల గుంపులు మఱియు నింకను గావలసిన యేర్పాటులతోడ సీత మగని వెంటఁ బోవలయును.

కం॥ వరదానకాలమున నీ,వరవర్ణిని సీత దాల్ప • వల్కలములు నో
తరుణీ! యడుగుట లేదుగ, తొరతొర నారల నిటుల • తొయ్యలి కీయన్.

వరవర్ణిని=శ్రేష్ఠమైన దేహకాంతిగలది- ఉత్తమస్త్రీ, తొరతొర=శీఘ్రముగ.

తాత్పర్యము

నీవు నీ భర్తను వరములడుగుకాలమున నీ యుత్తమస్త్రీ సీత నారచీరలు కట్టుకొనవలయునని యడుగలేదు గదా. ఏల యాదర బాదర యేమో మునిఁగి పోయినట్టు లామెకు నారచీర లిచ్చితివి.

కం॥ అని గురుఁడు విప్రముఖ్యుం, డనుమాటల నాత్మ నిడక • యతివ ధరించెన్
దనపతి చనియెడి తెరువునఁ, జనఁ గోరుట నారచీర • సంతస మారన్.

తాత్పర్యము ౧౦౫౦

అని యాప్రకారము గురుఁడు బ్రాహ్మణ ముఖ్యుఁడునగు వసిష్ఠుఁడు పలికిన మాటలను మనసునఁ దవులనీయక తన పతిపోవుమార్గమునందే తాను బోవుటయందిష్టముగలది గావున సీత నారచీరయే సంతోషముచే ధరించెను.

ఇట్టి యభిప్రాయముగలది సీత మరల నెట్లు మంచి వస్త్రములు ధరించె ననఁ బతియాజ్ఞచేనని యెఱుఁగునది. పతి యెదుటనున్నప్పుడు సతి యలంకార యుక్తయైయుండుట శాస్త్రనిషిద్ధముకాదు.లోపాముద్రాదు లిట్లు చేసినవారే కదా.

ఇంతకు శ్రీరాముఁడు కార్యార్థమై పరులబలాత్కారమున వానప్రస్థవేషము వేసికొనెనేగాని విరాగియై వానప్రస్థాశ్రమ స్వీకారము చేసినవాఁడు కాఁడు.

-• ౩౮-వ సర్గము. సీతకు నారచీర లిచ్చుటకు దశరథుఁడు కైకను నిందించుట •-

కం॥ ఆచీర లట్లు సీత స,మీచీనమతిన్ ధరింప • మిక్కిలి జనముల్
వాచాపారుష్యంబునఁ, జీ చీ యని దశరథు న్వ•చించుచు నేడ్వన్. ౧౦౫౧

సమీచీనమతిన్ = చక్కని మనస్సున, వాచాపారుష్యంబునన్ = పరుషపు వాక్కులచే.

తాత్పర్యము

వసిష్ఠుని మాటయందు మనస్సుంచక సీత యా నారవస్త్రములను మన స్సునఁ గోపాదులులేక పట్టుచీరలు ధరించునప్పటి మనస్సుతోనే ధరింపఁగాఁ జూచినవారందఱు కఠినవాక్కుల దశరథుని ఛీ ఛీ యనుచు నేడ్వఁగా.

శా॥ ఆనాదం బతిదుస్సహం బగుడుఁ దా • నాలించి భూపాలుఁడున్
మానెన్ దేహముపై యశంబుపయి ధ • ర్మంబందు శ్రద్ధం, గడుం
బూనెన్ దుఃఖము, నంతఁ గైకఁ గని యూ • హూఁ బోటి యీనారలన్
మేనం దాలిచి పోవరాదు వనికిన్ • నిక్కంబు సుమ్మింతయున్. ౧౦౫౨

తాత్పర్యము

చూచెడివారందఱు పెట్టు చీవాట్లధ్వని వారల యేడుపుధ్వని విన సహింపరాని దగుటచే నిఁక మనము బ్రతుకుట వ్యర్థము. మరణమే తగిన శరణము. ఒకవేళ బ్రతికినా యిదివఱకు వచ్చినకీర్తి నాశమయ్యెను. ఇఁక రాఁబోవునది యప కీర్తియే. ఇంతటి యధర్మము నాయెదుట జరుగఁగా గన్నులారఁజూచి యేమియుఁ

జేయఁజాలని నాకు ధర్మవిచార మెందుండివచ్చును. నావలన లోకమే ధర్మశూన్యమగుననియు దేహముఁ గీర్తి ధర్మము నివి నాకుఁ దక్కవనియు నమ్మి మిక్కిలి దుఃఖించి కైకను జూచి యీ సుమకోమలాంగి యీ నారచీరలు గట్టి యడవికిఁబోరాదు. ఇది నిజము.

కం॥ పాప నెఱపూపవయసుది, పాపము! సుకుమారి సీత • వని కరుగంగా
నోప దని కూడ దని కదుఁ, బాపం బని నిజము గురుఁడు • పలికెం గైకా.

పాప=చిన్నపిల్ల, నెఱపూపవయసుది=మిక్కిలి లేఁతవయస్సుది, సుకుమారి=కోమలమైన యవయవములు గలది.

తాత్పర్యము

ఈ లేఁతవయస్సు చిన్నపిల్ల అయ్యో! పాపము సుకుమారియగు సీత యడవులకుఁబోఁజాలదని పోఁగూడదని పోయినచో బంపినవారికి మిక్కిలి పాపమని వసిష్ఠుఁడు సత్యము చెప్పెను.

మత్తకోకిలము. భూపచంద్రముపుత్త్రి యై ధరఁ•బుట్టి సాధుచరిత్ర యై
పాపమెద్ది యెఱుంగ నట్టిది•బాల శ్రీమతి యేరికే
పాపముం బచరించెనే యిటు•వల్కలంబులతోడుతన్
దాపసిం బలె నెల్లరుం గనఁ•దా సభాస్థలి నిల్వఁగన్! ౧౦౩౪

తాత్పర్యము

మహారాజు కూఁతురై లోకములోనివారివలెఁ గాక భూమియందుఁ బుట్టి పతివ్రతయై యేపాపము నెఱుఁగని బాలశోభావతి సీత యీప్రకారము తాపసివలె నారచీరలుగట్టి యందఱుచూడ సభాప్రదేశమున నిల్చుటకు నేమిపాపము చేసెనే, మత్తకోకిలవృత్తమునకు, రసజజభరలు గణములు పదునొకండవ యింటయతి.

మత్తకోకిలము. చేసినాఁ డనె నీకు బాసను•సీత నారలతో వనీ
వాసముం బచరింప, నీగతి•బందిపెట్టెద వేటికే?
తా సుఖంబుగ సర్వరత్నవి•తాన సంయుత యై చనున్,
గాసి యేటికి నొంద?నారలు•గట్ట కుండెడుఁ గావుతన్.౧౦౩౫

బాస=ప్రమాణము, బందిపెట్టెదవు=నిర్బంధపఱచెదవు, సర్వరత్నవితాన సంయుతయై=సమస్తరత్నాభరణములతోఁ గూడినదై.

తాత్పర్యము

ఓసీ! సీత నారచీరలతో వనవాసముచేయఁ బంపెదనని నీకు నేను బ్రమాణముచేసితినా? ఏల యిట్లు నిర్బంధపఱచెదవు. యథాసుఖముగ సమస్తాభరణములతోఁ బోవును గాక. ఆమె యేల నిష్కారణముగ నాయాసపడవలయును. కావుననారచీర లామె కట్టరాదు.

సీతాదేవి పతివ్రతయని తుల్యశీలయని (ప. ౧౦౩౪) చెప్పఁబడెనుగదా. అట్టి యుత్తమపతివ్రత తనమగఁడు నారచీరలు కట్టుకొనియుండఁ దానెట్లు పట్టుచీరలు ధరించెను? ఇది వ్రతభంగము కాదా? కాదు.

ఏలన:—ఆమె కామాసక్తయై భోగము, సుఖముఁగోరి కట్టుకొన్నదిగాదు. పతివ్రత తుల్యశీల గనుకనే వసిష్ఠుఁడు మొదలగువారు వలదువలదనినను (ప. ౧౦౫౦) నారచీరలు సంతోషముతోఁ గట్టుకొనెను. కాని గురువునకు గురువగు మామగారు మంచిచీరలు కట్టుకొనిపోవలసినదని చెప్పుటచేతను, భర్త దానినామోదించుటచేతను వారి యిరువుర యభిప్రాయములకు విరోధముగఁబోరాదు గావున వారి యిష్టప్రకారము కట్టుకొనెను. తన తండ్రి యభిప్రాయమునకు విరోధముగ వర్తించు నిష్టము లేకయే రావణువధానంతరము, శ్రీరామచంద్రమూర్తి విభీషణునితో "కం॥సీతను వసుంధరాసం. జాతను దివ్యాంగరాగ•సకలాభరణో, పేతనువేగమమూర్ధ స్నాతనుగాఁజేసి తోడి•చయ్యనఁదెమ్మా" యుద్ధ ౨౬౩౮ యని చెప్పెను. అదియునుగాక యనసూయ సీతాదేవికి వస్త్రములంగరాగములిచ్చి ధరింపుమన ధరించి శ్రీరాము నొద్దకుఁబోయి యా సమాచారమంతయుఁ జెప్పఁగ శ్రీరామచంద్రమూర్తి సంతోషించెనుగానివలదనఁడయ్యె. (అయో ౨౫౬౮ ప.) కావునఁ బతి యనుమతి సీతాదేవి మంచివస్త్రములు ధరించి యాయనతోడనే యుండుటచేఁ బాతివ్రత్యనియమ హానిలేదు. భర్త పరోక్షమందు స్త్రీ సొగసులు చేసికొనరాదు.

ఉ॥ కాటికిఁ బోవ నా కిపుడు•కాలము దాపుగ రాఁగఁ గూళనై
పాటి దొలంగి ఘోర మగు•బాస యొనర్చితి నీచబుద్ధి, నా
మాటయె నన్ను గాల్చెడిని•మానక వేణువు దానిపువ్వసన్,
బాటిల కున్నె దుఃఖములు•పాపపు జంతలమాటఁ బట్టినన్? ౧౫౬

కాటికిన్=స్మశానమునకు, కూళనై=దుష్టుఁడనై, పాటి=క్రమము, జంతలు=గయ్యాళిస్త్రీలు, అర్థాంతరాన్యాసాలంకారము.

తాత్పర్యము

స్మశానమునకుఁ బోవుటకు నాకుఁ గాలము సమీపించుటచే 'వినాశకాలే విపరీతబుద్ధి' యన్నట్లు దుష్టుఁడనై క్రమమువిడిచి కామాసక్తమైన నీచబుద్ధినై క్రూరమైన ప్రమాణముచేసితిని. శ్రీరామునిమీఁదఁ బ్రమాణముచేసితిని. మాట దప్పినను శ్రీరామునకే కీడు. మాటప్రకారము జరిపినను శ్రీరామునకే కీడు. కావున వెదురునందుఁబుట్టిన పువ్వు వెదురునే చెఱుచునట్లు నామాటయే నన్నుఁ గాల్చుచున్నది. పాపాత్మురాండ్రైన దుష్టస్త్రీల మాటవినిన దుఃఖములురావా. తేలునకు గర్భము, వెదురునందుఁ బూవు, అరఁటియందు గొల, ఇవన్నియు మూలనాశమునకే. అళీకుళీకర్కటి వేణురంభా వినాశకాలేఫలము ద్వహంతి.

కం॥ అల్లీల బాసలం గొని, యిల్లీలను బేరుఁ బెంపు•నిందును నందున్
బొల్లవడఁ జేయువరములఁ, బిల్లతనముచేత వలచి•ప్రేలెదు కంటే. ౧౦౫౪

తా త్ప ర్య ము

అవిధముగాఁ బ్రమాణములు చేయించుకొని యీ విధముగా నిహ మందుఁ బరమునందుఁగూడఁ గీర్తి, గొప్పతనము నాశముచేయు వరములను గొప్పబుద్ధి యాలోచనములేక కోరి యెట్లు వదరుచున్నావో చూచితివా.

ఉ॥ మాటకు నైనఁ జూత మొకమాటు రఘూత్తమునందుఁ బాపముం
బాటిలె నందువేఁ దెలుపు•మా కనుఁగొందము, పల్కు వింద మీ
పాటలగంధియందుఁ గల•పాప మొకం డయినన్, దురాత్మురా
లా! టకటొంకు మాన విది•లక్షణ మే మగనాల వైనచోన్. ౧౦౫౬

టకటొంకు=మోసము, మగనాలవు=పతివ్రతవు, మగని+ఆలు=మగనాలు =లంజకాదనుట.

తా త్ప ర్య ము

శ్రీరామునం దొకపాపము మాటమాత్రముననైనఁ గలిగెనా నంగీకరించె దను. ఒకటి చెప్పుము. చూతము. అట్టులే యీ సీతయందు నొకపాపముండినఁ జెప్పుము. దుష్టబుద్ధిగలదానా! నీవు మోసము మానవైతివి. మగనితోఁ గాఁపు రము చేయు స్త్రీలక్షణమా యిది.

తే॥ హితచరిత్రక హరిణాక్షి•మృదులశీల, బాలసాధుతపస్విని•పార్థివేంద్రు
కన్య భూసుత మిక్కిలి•కరుణ గలదు,పాపమెయ్యది గంటివే•పరుషతకును

తా త్ప ర్య ము ౧౦౫౬

సీతయం దొక్కొక్క గుణము చూచినను నామె విషయమై యిట్లువర్తిం చుట నరిగాదు. లోకహితమైన నడవడిగలది. జింకకన్నులవంటి కన్నులుగలది మృదుస్వభావముగలది. చిన్నవయస్సుది. మంచి తపస్సు చేయునది. (పతి వ్రత) మహారాజుకూఁతురు. మిక్కిలి దయగలది. క్రౌర్యమెట్టిదో యెఱుఁగదు. ఇట్టి యీమెయందు నేమిపాపము కనిపెట్టి యింతటి క్రౌర్యమునకుఁ దెగించితివే.

శా॥ ఓసీ! రామవివాసనాకలితపా•పౌఘంబె యాత్మాంతమున్
గాసిం బెట్టఁగఁ జాలి నారకమునం•గ్రాఁచున్ నినున్, వెండియున్
శ్రీసీతాసతి లోభబుద్ధి నిటు క•స్తిం బెట్టఁగాఁ గల్గునీ
దోసంబుల్ నిను నేమి చేయఁ గలుగున్•దుర్దాంత మై యెంతయున్.

రామవివాసనాకలితపాపౌఘంబె= రాముని నరణ్యములకుఁ బంపుటచే సంపాదించిన పాపసమూహమే, ఆత్మాంతమున్=ఆత్మయుండువఱకు, శాశ్వత ముగా, నారకము=నరకము, క్రాఁచున్=కాల్చును, కస్తి=కష్టము, దుర్దాంతమై =అణఁపరానిదై.

తాత్పర్యము

ఓసీ! రాము నడవులకుఁబంపుటచే సంపాదించిన పాపమే నిన్ను శాశ్వత నరక బాధల ననుభవింపఁ జేయఁజాలియున్నది. ఇఁక నీ శ్రీ సీతను లోభ బుద్ధిచేఁ బెట్టెడు కష్టములవలనఁ గలుగు పాపములు ప్రాయశ్చిత్తాదులచే శమింపఁజేయ సాధ్యముకానివైనను నిన్ను నేమిచేయఁగలవు. శాశ్వతనరకాను భవముకంటె ఘోరశిక్షలేదుగా.

కం॥ రాముఁ డభిషేకమునకై, యీ మేడకు వచ్చియున్న•యెడ నాతనితో
రామా! వనికిం బొమ్మన, నామాటయె వింటి నన్య•మాడవు కాదే.

తాత్పర్యము ౧౦౬౧

అభిషేకమునకై శ్రీరాముఁ డీమేడకువచ్చినపు డాతనితో రామా యడ వికిఁ బొమ్మంటివి. అంతమాత్రమువింటిని అంతియకాని యిఁకనేమాటయు జెప్పలేదుగదా.

మ॥ వినవే రామవివాసనం బొకఁడ న•న్వేఁడంగ నీకొంటి, నీ
వనఘన్ సీతను వేడ, వేఁ బ్రతిన సే•యన్, దాఁటి యా మేర యీ
వనజాక్షీమణి నారచీరలను ని•ల్వం జూడఁగాఁ గోరుటన్
జనఁగాఁ జూచెదు దుర్గతిం బడఁగ, నిన్•సైరించునే కాలుఁడున్. ౧౦౬౨

తాత్పర్యము

ఓసీ విను. రాము నరణ్యమునకుఁ బంపుమనియే నీవు కోరితివి. నేను దాని నంగీకరించితిని సీతను గురించినది నీవు కోరినదిలేదు. నేను బ్రతిజ్ఞచేసి నది లేదు. ఆ మర్యాదవిడిచి యీ స్త్రీరత్నము నారగుడ్డలుకట్టుకొని నిలువంబ డఁగాఁ జూడఁ గోరినదానవగుటచే నీవు నరకములఁబడఁ జూచుచున్నావు. నిన్ను యముఁడు క్షమించునా.

కం॥ అని విలపించుచు బహుళా, ర్తిని, గుందుచు దశరథుం డ•తివ్యథ నిలఁ బ్రా
లినఁ గని జనకునితో నిటు, లనియెన్ శ్రీరామచంద్రుఁ•డతివినయమునన్.

తాత్పర్యము ౧౦౬౩

అని యేడ్చుచు మిక్కిలి వ్యసనమునఁ బరితపించుచు దశరథుఁడు మిగుల బాధపడుచు నేలఁబడఁగా జూచి తండ్రితో శ్రీరామచంద్రుఁ డతివినయ మున నిట్లనియెను.

—• శ్రీరాముఁడు తనతల్లిని గాపాడుమని తండ్రిని వేడుకొనుట. •—

సీ॥ నాతల్లి కౌసల్య•నవ్యగుణాకల్ప, సాధుతపస్విని•సత్యశీల
యిదివఱ కెన్నండు•మది దుఃఖ మెఱుఁగదు,
నే నెడఁబాయుట•నేఁడు మొదలు
పుత్రశోకంబునఁ•బొగులుచు నుండును, నేండ్లు చెల్లిన యది•యెట్టులైన
నాదుఃఖమున మర•ణంబు నందక యుండ, నీమెను బాలింపు•మీమహాత్మ

తే॥ నిన్ను మదినైన నెపుడు నిం•దింపఁబోదు,
నన్నుఁదలఁచుచుఁ దలఁచుచు•సన్నగిల్లి
కాలుపురి కేగ కుండఁగఁ•గావ వయ్య,
నాదుప్రార్థన నోనర•నాథచంద్ర. ౧౬౪

నవ్యగుణాకల్ప=అందమైనగుణములే యాభరణములుగాఁ గలది, సాధు తపస్విని=మేలైనతపస్సు చేయునది, సత్యశీల=సత్యమే స్వభావముగాఁగలది దుర్గుణములుగలదై తపస్సనునది యెఱుఁగక యసత్యమాడ జంకని నీ ముద్దు పెండ్లాము కైకవంటిది గాదనుట,మరణంబు నొందకయుండన్=చావకయుండు నట్లు, భోగ్యవస్తువులిచ్చి పోషింపకున్నను ప్రాణముతో నుండనిచ్చినఁజాలును అని భావము. నే నిచటనుండఁగనే యామె ననాదరించినవాఁడవు. నేను లేన ప్పుడు నీ వేమి యాదరింతువు. కాని ప్రాణముపోవు పనిమాత్రము చేయకుము

తాత్పర్యము

నరేశ్వరా! నా తల్లి కౌసల్యాదేవి శ్లాఘ్యమైన గుణములే యాభరణ ములుగాఁ గలది. బాగుగాఁ దపస్సుచేసినది. సత్యమాడుట స్వభావముగాఁ గలది. ఇదివఱ కెన్నఁడిట్టి దుఃఖమనుభవించినది కాదు. నేను విడిచిపోవు కారణ మున నీ దినము మొదలు కడుపు దుఃఖమునఁ దపించుచుండును. దానికిఁ దోడు వయస్సు మీఱిన ముసలిది. నాదుఃఖముచేఁజావక దేహము ధరించియైన నుండునట్లు లీమెను రక్షింపుము. అంతమాత్రము చేసిన నీవు మహాత్ముఁడవే అట్లు చేయకుండుటకుఁ గారణముండదు. నీ విట్లుచేసితివని యామె నిన్ను నిందింపదు. నన్నుఁ దలంచుచుఁ దలంచుచుఁ జిక్కి యమపురి కేగకుండు నట్లు కనిపెట్టియుండఁ గోరెదను. ఇదియే నా ప్రార్థన. మఱియేదియుఁ గావ లయునని నిన్ను నేను గోరను.

కం॥ అడవులలోఁ దిరుగుచు నే, నిడుమలఁ బడు చుందు ననుచు•నెంతోవనటన్
బడుచుఁ గృశించుచు మిడికెడు,
మడియకయుండంగ నాదు•మాతంగనుమీ. ౧౬౫

అటవులలోఁ దిరుగుచుఁ గష్టములు పడుచుందునని మిక్కిలి దుఃఖ పడుచు బక్క చిక్కి తెల్లపాఱియుఁ జావకుండునట్లుమై మిక్కిలి సంతాపించు చున్నది. మడియకయుండన్‌కాన్ = మడియకయుండునట్లు నాతల్లిని జూచి కొనుము. ఇదియే నా ప్రార్థన.

తాత్పర్యము

నే నడవులలోఁదిరుగుచుఁ గష్టపడుచుందుననియే మిక్కిలి శోకించుచు శుష్కించి దుఃఖించును గాని యితరులవిషయ మాలోచించినదికాదు. కావున నా తల్లిని జావకుండఁ గాపాడుము.

కం॥ అనురాముని వచనము విని, మునివేషముఁ గొనినయతని•మోమునుం గన లే
కను బల్కనేరకయు నాం,ద్రుడును దానుం ద్రెళ్ళి ధరణి•రూఢపుమూర్ఛన్.

తాత్పర్యము

అని శ్రీరాముఁడు చెప్పుచుండఁగా దశరథుఁ డాయన మాటలువిని ముని వేషముననున్న యాయన ముఖమును జూడ లేక తన భార్యలు దానుఁ గ్రూర మైన మూర్ఛ మునిఁగి భూమిమీఁదఁబడి.

క్త్వార్థకసంధి.

కనలేకను=వ్యతిరేక క్త్వార్థకమైన (లేక) కళయే. లేకయును అనుదానిలో 'యు'లోపింపఁగా మిగిలినరూపము లేకను. అర్థవిశేషమం దిట్లు కళలకును నువర్ణంబు చేర్పఁబడును. వెండిన్, మఱిన్. ఇత్యాదులు ప్రయోగంబులఁగలవు.

"వాటువడి మూర్ఛవోయిం। బోటఁడిదైత్యుండు. ఉ. హ. ౪ ఆ

"అనఘయిది యేటితపమే। మనువమ దుఃఖితులమగుట నాధారములే। కనుసంతానచ్ఛేదం। బున వ్రేలెద మధమలోకముల తెరువుసనన్॥ భార. ఆది-౨. ౧౩౯.

—♦ ౩౯-వ సర్గము. మునివేషధరుండైన శ్రీరామునిఁ జూచి దశరథుఁడు దుఃఖించుట. ♦—

ఉ॥ ఇంచుక తేఁకీ భూమితన♦యేశునిఁగూర్చి మహీశుఁడుం బ్రలా
పించు నయో పురాకృతము♦ప్రేఁపక పోవునె నన్ను, లేఁగలన్
గ్రించుతనాన నెన్నింటికిఁ♦గీడుగఁ బాపితి నొక్కొ గోవులన్
గొంచక యెన్ని ప్రాణులకుఁ♦గూర్చితినో దురితంపు హింసలన్. ౧౦౬౭

కొంచెము తెప్పరిల్లి రాజు శ్రీరామునిఁగూర్చి యిట్లు ప్రలాపించెను. అయ్యో! పూర్వముచేసిన పాపము నన్నుఁగాల్పక వ్యర్థమైపోవునా? కీడు గలుగునట్లు దూడలను వాని తల్లులనుండి నీఁచుఁడనై సంకోచింపక యెడఁ బాపితినో, ఎన్ని జీవులకుఁ బాపకరమైన హింసలఁ గావించితివో, ఆపాపము నేఁడు నన్నిట్లు బాధించుచున్నది.

ఉ॥ వెల్గెడివాఁడు తేజమున♦వీతవహుం డన నాదుపుత్రుఁ, డీ
నల్గురుఁ జూడ నాయెదుట♦నారలు గట్టుకొనంగ సైఁచెదన్,
నీల్గను గైకబారిఁ బడి♦నిర్భరదుఃఖ మిఁ కొండు గల్గునే?
కల్గ దనాగతం బయిన♦కాలమునన్ మరణంబు దేహికిన్. ౧౦౬౮

వీతవహుండు=అగ్ని, అనాగతంబు=రానిది.

తాత్పర్యము

అగ్నివలెఁ దేజముచేఁ బ్రకాశించువాఁడు కదా. నా కొడుకు అట్టివాఁ డీ లోకులు చూడ నాయెదుటనే నారచీరలు కట్టుకొనఁగాఁ జూచి సహింపవలసి వచ్చెను. ఈ దురవస్థఁజూచి సహించి ప్రతిక్రియచేయలేని యనాథత్వమున కంటె భరింపరాని దుఃఖమేదికలదు. ఈకైక బారిఁబడి చచ్చినవాఁడనుగాను, మరణము మాత్ర మకాలమందు రమ్మనిన నెట్లువచ్చును. అది యసాధ్యము. కావున ననుభవింపవలసినదే విధి.

కం॥ వంచించి నన్ను స్వార్థం, బెంచి కటాకైక యొకతె•యీయున్న ప్రజా
సంచయముం గారించెడి,
నంచును రామా యటంచు•నశ్రులునించెన్. ౧౦౬౯

తాత్పర్యము

ఒక్కకైకయయ్యో నన్ను వంచించి ధనకాముయై తన లాభము మాత్రముచూచుకొని యింతమంది జనులను బాధించుచున్నది కదా. శ్రీరామా యని కన్నీరు కార్చెను.

కం॥ రామా యని యొకపరి పై, నేమాటయుఁ బలుకలేక•యేడ్చి సుమంత్రున్
భూమీశుఁ డనియెఁ దెమ్మా,
రామున కుపవహనయోగ్య•రథ మెుం డిటకున్. ౧౦౭౦

అని=చెప్పి, ఒకపరి=ఒకసారి, ఉపవహనయోగ్యము = ఎక్కిపోవుటకుఁ దగినది.

తాత్పర్యము

ఒకసారి రామా యనిపలికి యామీఁద నేమాటయుఁ బలుకలేక యేడ్చి సుమంత్రునిఁజూచి శ్రీరాముఁ డెక్కిపోఁదగిన తేరు తీసికొని యిటకు రమ్ము.

కం॥ కొని చని మహానుభావుని, జనపదముల నెల్లఁ గడచి•చని యట విడుమీ
యనవుడు నాతఁడు తేరం,
గొనితేరఁగఁ జనిన ననియెఁ•గువలయపతియున్. ౧౦౭౧

కువలయపతి=భూచక్రమున కధిపతి-రాజు.

తాత్పర్యము

అరథముపై శ్రీరామునిఁ దీసికొని యూళ్ళెల్ల దాఁటిపోయి యచ్చట వదలి పెట్టుము అని చెప్పఁగా నతఁడు రథము తీసికొనివచ్చుటకుఁబోయెను.

ఆ॥ నోరులేనివాని•వీరుని నడవులఁ, దల్లిదండ్రు లిట్లు•దలఁగఁ ద్రోయ
నరసి సాధుగుణుల•యమలగుణంబుల,
ఫలము నిట్టిదనుచుఁ•దలఁచువాఁడ. ౧౦౭౨

నోరులేనివానిన్=పెద్దలకుఁ బ్రత్యుత్తరము చెప్పఁజాలనివాని, ఇట్లుచెప్ప లేకపోవుట దుర్బలత్వముచేత నాయనినఁ గాదు, వీరునిన్=బలపరాక్రమశౌర్యములు గలవానిని, అట్లయిన నేల నిరాకరింపలేదు. చెప్పినవారు తల్లిదండ్రులు ఆకారణముచే బదులు చెప్పలేక చిక్కుపడినాఁడు. వారికిఁ బ్రత్యుత్తరము చెప్పనురాదు. వారియందు శౌర్యము చూపనురాదు. ఇఁక నేమిచేయఁగలఁడు అరసి=ఆలోచించి.

తాత్పర్యము

పెద్దలను ధిక్కరింపలేనివాఁడు, వారేమియనినను సైరించియుండు వాఁడు. వీరుఁడై ధిక్కరింప శక్తిగలవాఁడు. ఇట్టివానిని మనము చెప్పినదానికి నెదిరించి చెప్పఁడు గదా యను ధైర్యముతో రక్షింపవలసిన తల్లిదండ్రులే యిట్లు దగ్గఱనుండకుండ దూరముగా నెట్టివైచుట యాలోచింపఁగా సాధుచరిత్రుల నిర్మలగుణముల ఫలమిట్టిదేకదా. ఇట్టి సద్గుణములు కలవాఁడు

లోకమున సుఖపడఁడు అని తలఁచెదను. మెత్తగానున్న మొత్తబుద్ధియయ్యె నను సామెతగలదు గదా. కావున మెత్తఁదనము వ్యర్థము.

కం॥ త్వర త్వర కార్యముఁ జేయఁగ, నెరవరి యగుసారథియును•వేవే తేరిన్
దురగములఁ బూన్చి ధరణీ,శ్వరచంద్రముఁ డుండునింటి•వాకిట నిలిపెన్

నెరవరి=ఉపాయశాలి, వేవే=త్వరత్వరగా, తురగములన్=గుఱ్ఱములను, పూన్చి=పూనునట్లుచేసి,

తాత్పర్యము

ఆలస్యములేక కార్యముచేయు నుపాయము తెలిసిన సారథియును మిగుల శీఘ్రముగాఁదేరిని సిద్ధముచేసి గుఱ్ఱములనుగట్టి రాజుండు నింటివాకిటి నిలిపెను.

కం॥ కనకాలంకృతిభూషిత, మును బరమజవాశ్వయుక్త•మును నరదంబున్
గొని వచ్చితి రామునికై, యని యాతఁడు విన్నవింప•నాష్మాధవుఁడున్.

కనకాలంకృతిభూషితమును=బంగారుసొమ్ములచే నలంకరింపఁబడినది, పరమ జవాశ్వయుక్తమును=మిక్కిలివేగముగాఁబోఁగల గుఱ్ఱములఁ గూడినది, అరదము=తేరు, రథశబ్దభవము అరదము, తద్భవంబున వర్ణాధిక్యము.

తాత్పర్యము

బంగారుసొమ్ములచే నలంకరించి మిగుల వేగముగఁబోఁగల గుఱ్ఱములనుగట్టి శ్రేష్ఠమైన రథమును దెచ్చితినని సుమంత్రుఁడు విన్నవింపఁగారాజు

సీ॥ విత్తకోశాధ్యక్షు•సత్తము దేశకా,లజ్ఞు నిశ్చితుఁ బిల్చి• ప్రాజ్ఞ వర్య
వెల గలనగలు దు•వ్వలువలుఁ బదునాలుఁ, గేఁడుల కగునట్టు•లీలతాంగి
కీయఁగఁ గొని తెమ్ము•యీా వన నతఁడేగి,
యన్నియుఁ గొనివచ్చి•యప్పగింపఁ
గోడలి కన్ని యా•కువలయపతి యిచ్చె, నిచ్చిన వానిని•బుచ్చుకొనుచు

తే॥ మేలిభూషణములఁ గొన్ని•మేనఁ దాల్చి
మెఱుపునకు మెఱుఁ గిచ్చిన•మేల్మి దనర
వెలిఁగెఁ దత్కాంతి గృహ మెల్ల•వేగుఁబోక
బాలసూర్యునిచే మిన్ను•వఱలునట్లు. ౧౦౫౫

విత్తకోశాధ్యక్షున్=బొక్కసమునకు నధికారి, సత్తమున్ = సజ్జనులందు శ్రేష్ఠుని, దేశకాలజ్ఞున్=ఏప్రదేశమున నేకాలముల నెట్లు నడువవలయునో యది తెలిసినవాఁడు, నిశ్చితున్=నిశ్చయబుద్ధిగలవానిని, ప్రాజ్ఞవర్య = బుద్ధిమంతు లలో శ్రేష్ఠుఁడా, అప్పగింపన్=ఒప్పగింపఁగా, కువలయపతి=భూచక్రాధిపతి, మేనన్=దేహమునందు, తాల్చి=ధరించి, వేగుఁబోకన్ = ఉదయకాలమునందు, మిన్ను=ఆకాశము.

తాత్పర్యము

ధనశాలకు నధిపతియు, సాధువర్తనము గలవారిలో నుత్తముఁడును, బొక్కసమునం దెంత ధనముండునది వాస్తవజ్ఞానము గలవాఁడునునగువానిని

బిలిచి బుద్ధిమంతుఁడా! వెలగల భూషణములు, సన్నని పట్టువస్త్రములు ఇవి పదునాలుగేఁడులకుఁ జాలినన్ని యీ సీత కిచ్చుటకై తెమ్ము అని రాజాజ్ఞాపింపఁగా నతఁడుపోయి యన్నియుఁదెచ్చి రాజున కిచ్చెను. అందుఁ గొన్ని భూషణములు దేహముమీఁద ధరించెను (నారచీరలు కట్టుకొనునపుడు కట్టుకొన్న చీరతోపాటు ఆభరణములను దీసివైచెను.) ఇట్లు ధరింపఁగా బంగారు దేహకాంతిగల యామె యా భూషణములను ధరించుటచే మెఱుపునకు మెఱుఁగు పెట్టినట్లయ్యెను. ఆకాంతిచేత బాలసూర్యునిచే నాకాశము ప్రకాశించునట్టులా గృహమంతయుఁ బ్రకాశించెను.

—♦ కౌసల్య సీతకు ధర్మోపదేశముఁ జేయుట. ♦—

కం॥ డెందమునఁ జింత యేమియుఁ,
జెందక నిలుచున్న స్నుషను♦సీతను దలుఁ జే
రం దిగిచి కోసలాత్మజ,పొందుగఁ గౌఁగిటను గ్రుచ్చి♦పొలఁతుక కనియెన్

డెందమునన్=హృదయమందు, ఏమియున్=కొంచెమైనను, స్నుషను=కోడలిని, తిగిచి=లాగుకొని, పొలఁతుకకున్=స్త్రీకి, సీతకు.

తా త్ప ర్య ము

అడవినిఁబోవలసివచ్చెఁగదా యను విచారము కొంచెమైనను లేక బాగున్నప్పుడుండుదానివలెన్ నిలఁబడియున్న కోడలిని సీతను తనయొద్దకుఁ జేయిపట్టి లాగికొని కౌసల్యాదేవి కౌఁగిలించుకొని యామె కిట్లనెను.

కం॥ కలిమియు సౌఖ్యము సతతము,
నలువుగఁగూర్పఁగను బ్రాణ♦నాథుఁడు కీవిన్
గులుకుచు, సిరులు దొలంగినఁ,
గులటలుగద పతిని దూఱు♦గుణహీనసతుల్. ౧౦౪౪

కలిమి=సంపద, నలువుగన్=చక్కఁగా, ప్రాణనాథుఁడు = భర్త, కులటలు=కులధర్మము నతిక్రమించి నడచువారు, అంకుటాండ్రు, దూఱు=నిందించు, గుణహీనసతుల్=పతివ్రతాగుణములులేని స్త్రీలు.

తా త్ప ర్య ము

సంపదసౌఖ్యము నెల్లప్పుడు చక్కఁగాఁ దమ భర్తలు తమకుఁ గలిగించువఱకు విలాసముతోఁ గులుకుచుఁ, గాలము కారణముగా నా సంపదలుదొలఁగి పేదఱికము వచ్చినపుడు ఆ భర్తలను నిందించువారు అంకుటాండ్రేకదా. ఇఁక నైశ్వర్యము కలిగించుచు బాగుగనున్నప్పుడే భర్తను నిందించుచు గోడుకుడిపించు కైకవంటివా రెటువంటివారని నేను జెప్పఁగలను అని భావము.

కం॥ తొలుత సుఖ మనుభవించియుఁ, గలికీ! నుతి పతి కెదేని♦కష్ట మొఁదవుటన్
దొలఁగ సుఖమతని నిందలు, పలుకుట పాయుటయు స్త్రీస్వ♦భావము తల్లీ

తొలుతన్=ముందు, కలికీ=సుందరీ, 'కలికి యొప్పిదంబు కాంతయయ్యె' యని నిఘంటువు, ఏదేని=ఏదోయొక.

తాత్పర్యము

మొట్టమొదట నార్జనపరుఁడైన భర్తతో సుఖ మనుభవించియు నావల నేదో యొక కష్టము వానికి రాఁగా నాకారణమున సుఖము దొలఁగఁగా నతని నిన్నుఁ గట్టుకొని నేనేమి సుఖముపడినాను. ఇట్లు కష్టపడుటకా నేను నిన్నుఁ గట్టుకొన్నది యని తిట్టుటకు నతని విడిచిపోవుటయుఁ ఒల్లి స్త్రీల సహజగుణము లోకాపవాదమునకు, నరకమునకుఁ బతనమునకుఁ, వేఱుగతిలేదేయని, భయ పడుటచే స్త్రీలు భర్తలుతోడఁ గాఁపురము చేయుదురుగాని యీవిచారములు లేనివారు భర్తలతోఁ గష్టకాలములందుఁ గాఁపురములు చేయనొల్లరని భావము.

ఉ॥ బొంకులపుట్టినిండ్లయి స్వ•పూరుషు గేలిగ వెక్కిరించుచున్
గొంకక దుష్టచింతనల•కున్ నిధులై భృశగూఢచిత్తలై
మంకుతనంబునన్ వయసు•మంపున రోయఁగఁ జేయుచుందు రే
ణాంకముఖుల్ నిమేషమునఁ•బ్రాణమువోలెను జూచుభర్తనేన్ ౧౦౭౬

గేలిన్=పరిహాసముగా, భృశగూఢచిత్తలై=మిక్కిలి రహస్యముగఁ దమ మనస్సులను దాఁచువారై, మంకుతనంబునన్=మూర్ఖత్వముచే, వయసుమంపునన్=వయస్సుమదముచే, రోయఁగన్=అసహ్యించుకొన, ఏణాంకముఖుల్= చంద్రబింబమువంటి ముఖముగలవారు స్త్రీలు, నిమేషము=నిమిషము,అత్యల్ప కాలము.

తాత్పర్యము

అసత్యములకు జన్మస్థానములై, హేళనముగాఁ దమ భర్తలను వెక్కి రించుచు, దురాలోచనలు చేయుటయందు జంకులేక, తమ మనస్సును వెలు పలివారికిఁ దెలియనీయక, మకురుతనముచేత, వయస్సుమత్తున, దేహము తెలియక వర్తించుచు స్త్రీలు తమ ప్రాణమువలె రక్షించుకొనుచుండెడి భర్తల మనస్సులైనను నిమిషకాలములో రోఁతపుట్టఁ జేయుదురు.

చం॥ కులముమహత్త్వముం గన ర•కుంఠితరక్తి విభుండు సేయుచే
య్వుల మదిఁ జేర్ప, రాత్మవిభు•నుజ్జ్వలపాండితి మెచ్చ రెంతయున్
దలఁపరు పాణిసంగ్రహము•దత్తధనాదుల నెంచ రాత్మలన్
జలజదళాక్షి! జాఁగ లగు•చంచలచిత్తలు మత్తకాశినుల్ ౧౦౭౭

కులముమహత్త్వమున్=కులముయొక్క గొప్పతనము, అకుంఠితరక్తిన్= మొక్కపోని యనురాగముచే, విభుండు=మగఁడు, చెయ్వులన్=కార్యములను చెయుపు మొదటిరూపము, ఉజ్జ్వలపాండితిన్=జ్ఞానాతిశయముచేఁ బ్రకాశించు పాండిత్యము, పాణిసంగ్రహము=వివాహము, దత్తధనాదులన్ = తమకియ్యఁ

బడినధనములులో నైనవానిని, జారగలు=జంకుటాంగ్రడు, ధూర్తస్త్రీలు, చంచలచిత్తలు=చపలమనస్సుగలవారు, మత్తకాశినుల్=మదముచేఁ బ్రకాశించువారు.

తాత్పర్యము

తాము పుట్టిన కులముయొక్కగాని వంశముయొక్కగాని గొప్పతనమును నాలోచింపరు. మన మీచేయరానిపని చేసిన మన కులమునకు మన వంశమునకు నపకీర్తి వచ్చునే యని యాలోచింపరు. తమయందుఁ దమ భర్తలు కొఱఁతలేని యనురాగముతోఁ దమ్మాదరించి చేయు పనులను మనస్సునందు నిలుపరు. తమభర్తల పాండిత్యము దానివలనవారు సంపాదించిన కీర్తి నాలోచింపరు. తమ యకార్యములవలనఁ దమ భర్తల కపకీర్తివచ్చునే యనియుఁ జూడరు. పాణిగ్రహణకాలమందుఁ జేతిలోఁ జేయివైచి ప్రమాణముచేసినట్టులగ్నిసాక్షికముగాఁ జేయి పట్టుకొంటిమే దాని నెట్లు విడువవచ్చునా యనియు నాలోచింపరు. తమకంతవఱకు వారిచ్చిన ధనము వస్త్రములులోనగు పదార్థములను మనస్సున గణింపరు. ఇవన్నియుఁ జేయువారెవరు? అందఱుకారు. చపలచిత్తములు గలిగి నిలుకడయగు బుద్ధిలేక మదముపట్టి తిరుగు స్త్రీలు కైకవంటివారు.

కం॥ పతిహిత యయి శీలంబును,
శ్రుతమును సత్యంబు శమము♦సొబగును గలయా
పతివత్నిరత్నమునకుఁ,
బతి యొక్కఁడె పరమగతియుఁ♦బావనగతియున్. ౧౦౪౧

స్తంభమును దృఢముగా నాటఁగోరువారు ముందు గుంతలోనుంచి యిటునటు లూఁచి యావల బిగించుట గలదు అట్టులే కైకచేసినట్టు చేయవలదని త్యాజ్య విషయములు దుష్టస్త్రీల లక్షణములు తొలుతఁజెప్పి యావల ననుసరించుటకు సాధ్వులగు స్త్రీల లక్షణమును దెలుపుచున్నది.

పతిహిత=తనభర్తకు మేలుకోరునది, శీలంబును = పాతివ్రత్యమును, శ్రుతము=పెద్దలవలన వినికిడి, శమము=ఇంద్రియనిగ్రహము, పతివత్నిరత్నమునకు=భార్యామణికి, పతిగలది పతివత్ని.

తాత్పర్యము

తన భర్తకు నుభయలోకంబుల శ్రేయస్సుగలుగఁ గోరుచుఁ బతివ్రతయై పెద్దలవలన ధర్మాధర్మ పుణ్యాపుణ్య సదాచార దురాచారములు మొదలగునవి విని సత్యము దప్పక కామాదులచే నింద్రియదాసి గాక సౌందర్యమునుగల భార్యామణికిఁ బతియొక్కఁడె గతి. ఆయనయే పావనమైన గతి.

కం॥ అక్కట నాదుతనూజుఁడు, దిక్కఁటీ వనవాసియగుట♦దెప్పకు మమ్మా
రొక్కము గలిగిన లేవడిఁ జిక్కిన దైవత మతండె♦చెలువా!నీకున్. ౧౦౪౨

రొక్కము=ధనము, లేవడి=లేమిడి=పేదతనము.

తాత్పర్యము

పతివ్రత లక్షణ మిట్టిదియగుటచేతను నీవు పతివ్రతవగుటచేతను గొప్ప వంశమునఁబుట్టి పెద్దలవలన శాస్త్రమర్యాద పాతివ్రత్యము తెలిసికొన్నదాన వగుటచేత నయ్యో నాకొడుకు దిక్కులేక యడవులపాలు పడవలసివచ్చుటకు నిందింపకుము. తల్లీ! ధనము గలిగినను దారిద్ర్యమునఁ జిక్కువడినను నీకు సుందరీ దైవమతఁడే సుమా.

కం॥ అత్త వచించినమాటలు, చిత్తంబున నిలిపి సీత•చేమోడ్పునఁ దా
హత్తించి దనదుచూపా,మత్తచకోరాక్షియందు• మానుగఁ బలికెన్.

చేమోడ్పునన్=అంజలిచేత-ఆమత్తచకోరాక్షియందుఁన్ = ఆమదించిన చకోరములవంటి కన్నులుగల కౌసల్యయందు, హత్తించి=పొందించి, మానుగన్=చక్కఁగ.

తాత్పర్యము

అత్తగారు చెప్పినమాటలు బాగుగ మనస్సునఁ బొందుపఱచి కేలు ముకుళించి తన చూపు నా కౌసల్యయందు నిలిపి అందమైన యోగ్యమైన మాటలిట్లు చెప్పెను.

ఉ॥ అత్తరో! మున్ను వింటి జన•కావసథంబున నుండి భక్తి సం
పత్తిని వల్లభుం గొలుచు•పద్ధతు లన్నియు, మీరు చెప్పిన
ట్లత్తనరక్తిఁ గొల్చెద న•నార్యులతో సరిచేయఁ బోకుఁడీ,
పుత్తునె ధర్మముం, దొలఁగఁ•బోవునె వెన్నెల చంద్రుఁ బాయుచున్?

౧౦౪౮

జనకావసథంబునన్=తండ్రి యింటియందు, వల్లభున్=భర్తను, అనార్యతోడన్=దుష్టస్త్రీలతో,

తాత్పర్యము

అత్తరో! నేను బూర్వము తండ్రిగారి యింటనుండు కాలమునందుభక్తి సమృద్ధిచే భర్తను సేవించు విధములన్నియు విన్నదానను, మీరు చెప్పినట్లు భక్తితోడను అనురాగముతోడను మీకొడుకును సేవించెదను. దుష్టస్త్రీలవలె నేను జేయుదునని మీకొడుకును విడిచిపోవుదునని, దరిద్రుఁడని నిందలాడుదునని, తలఁపకుఁడు. ధర్మము నెప్పుడైన వదలుదునా? చంద్రుని విడిచి వెన్నెల యుండఁగలదా! భార్యాభర్తల కవినాభావసంబంధము కలదుగదా.

పతివ్రతా ధర్మములు.

శాండిలియను పతివ్రత తాను స్వర్గమున విశేషసుఖ మనుభవించుటకుఁ గారణము సుమనయను నామెతోఁ జెప్పుచున్నది. భారతము అనుశా ౧౪౫వ యధ్యాయము.

శ్లో॥ నాహం కాషాయవసనా, నాపివల్కల ధారిణీ
నచముండాచ జటిలా, భూత్వా దేవత్వమాగతా

అహితానిచ వాక్యాని, సర్వాణి పరుషాణిచ
అప్రమత్తాచ భర్తారం, కదాచి న్నాహ మబ్రువమ్
దేవతానాం పితౄణాంచ, బ్రాహ్మణానాంచ పూజనే
అప్రమత్తా సదాయుక్తా, శ్వశ్రూ శ్వశురవర్తినీ
అపైశున్యే ప్రవర్తామి, నమమైతన్మనోగతమ్
అద్వారి నచతిష్ఠామి, చిరం నకథయామిచ
అసద్వా హసితంకించి, దహితంవాపి కర్మణా
రహస్య మరహస్యంవా, నప్రవర్తామి సర్వథా
కార్యార్థే నిర్గతంచాపి, భర్తారం గృహమాగతమ్
ఆసనే నోపసంయోజ్య, పూజయామి సమాహితా
యదన్నం నాభిజానాతి, యద్భోజ్యం నాభినందతి
భక్ష్యంవా యదివాలేహ్యం, తత్సర్వం వర్జయామ్యహమ్
కుటుంబార్థే సమానీతం, యత్కించి త్కార్య మేవతు
పునరుత్థాయ తత్సర్వం, కారయామి కరోమిచ
అగ్ని సంరక్షణపరా, గృహశుద్ధిం చకారయే
కుమారాన్ పాలయేనిత్యం, కుమారీం పరిశిక్షయే
ఆత్మప్రియాణి హిత్వాపి, గర్భసంరక్షణేరతా
బాలానాం వర్జయేనిత్యం, శాపం కోపం ప్రతాపనమ్
అవికీర్ణాని ధాన్యాని, నాన్నవిక్షేపణం గృహే
రక్తవత్సప్రహయే, గేహే, గావస్సవయవ మోదకాః
సముద్గమ్యచ శుద్ధాహం, భిక్షాందద్యాం ద్విజాతిషు
ప్రవాసం యదిమేయాతి, భర్తాకార్యేణ కేనచిత్
మంగళైర్బహుభిర్యుక్తా, భవామి నియతాతదా
అంజనం రోచనంచైవ, స్నానం మాల్యానులేపనమ్
ప్రసాధనంచ నిష్క్రాంతే, నాభినందామి భర్తరి
నోత్థాపయామి భర్తారం, సుఖంసుప్త మహం సదా
ఆతురేష్వపి కార్యేషు, తేనతుష్యతి మేమనః
నోత్థాపయే సుఖంసుప్తం, హ్యాతురం పాలయేపతిమ్
నాయాసయామి భర్తారం, కుటుంబార్థేపి సర్వదా
గుప్తగుహ్యా సదాచాస్మి, సుసంమృష్ట నివేశనా
ఇమంధర్మపథంనారీ, పాలయంతీ సమాహితా
అరుంధతీవనారీణాం, స్వర్గలోకే మహీయతే. భార. అను.

అర్థము

కాషాయవస్త్రము కట్టిగాని నారచీరలు ధరించిగాని తల బోడిచేసికొనిగాని జడలు పెంచికాని యిట్టి వేషములచే నాకు దేవత్వము రాలేదు. అహితములైనవి పరుషములైనవి యగు మాటలను బొరపాటుననైన నేను భర్తనాడిన దానఁగాను. దేవపితృ బ్రాహ్మణపూజయందు నెప్పుడు హెచ్చరికకలిగి వర్తించితిని. అత్తమామల సేవ చేసితిని. నే నొకరిమీఁదఁ గొండెములు చెప్పినదానఁగాను. నే నొకరిని మోసగింపరాదని నా నియమము. నేను వాకిటనిలిచిన దాననుగాను. చాలసేపు పరులతో మాటలాడినదానఁగాను. నేను జెడుపని యేదియుఁ జేయలేదు. నేను పకపక నవ్వలేదు. అహితమైన కర్మము చేయలేదు రహస్యమని నాకొకరు చెప్పినదానిని నేను మఱియొకరికిఁ జెప్పలేదు. కార్యార్థమై బయటఁబోయియుండిన మగఁడు యింటికిరాఁగానే కూర్చుండుటకుఁ బీఁటవేసి యుపచరింతును. నా మగనికి సంతోషకరము ప్రియముకాని యన్నముగాని భక్ష్యముగాని భోజ్యముగాని లేహ్యముగాని నేను దినుఁదానఁగాను. కుటుంబము నిమిత్తమై పదార్థములు తెచ్చినపుడు యెంత కొంచెమైనదైనను నేను లేచి యవన్నియు నేనే చక్కఁజేసెదను. లేదా చేయించెదను. అగ్నులను జక్కఁగా రక్షింతును. గృహమును బరిశుద్ధముగా నుంచుదును. కొడుకులను రక్షింతును. పుత్రికలకుఁ దెలియనివి చెప్పి పనులు నేర్పుదును. నాకుఁ బ్రియమైన పదార్థములు వదలియైన గర్భమును రక్షింతును. పిల్లవాండ్రను నేను గోపింపను. తిట్టను. ఆవులకు నేనే మేపువేయుదును. బ్రాహ్మణులకు నేనే లేచిపోయి భిక్షమువేయుదును. నాభర్తయేదేనికార్యముపై గ్రామాంతరముపోయెనేని మంగళసూత్రముఁదప్ప మఱి యేయలంకారము ధరింపను. కాటుకపెట్టుకొనను. స్నానము చేయను. పూలుపెట్టుకొనను. గంధము పూసికొనను. అలంకారము చేసికొని సంతోషింపను. నాభర్త సుఖముగ నిద్రించునపుడెంతటి కార్యముఃపడినను నేను నిద్రలేపను. దేహబాధ కలిగినపు డుపచారముచేసి రక్షింతును. కుటుంబముఃనకుఁ గావలసినవాని నిమిత్తమై భర్తను బీడింపను. నాకు భర్త చెప్పిన రహస్యమును రక్షింతును. ఇల్లలికి ముగ్గులు పెట్టి పరిశుద్ధముగ నుంతును. ఇట్టిచర్యగల స్త్రీ, స్త్రీలలో నరుంధతివలె స్వర్గ సుఖ మనుభవించును.

తే॥ తంత్రిలేకున్న వీణనా◆దంబు లేదు, చక్ర మెడసిన శకటంబుఁ◆సాగఁబోదు
కువలయాక్షికి నూర్గురు◆కొడుకులున్నఁ,
ప్రాణపతిలేమి సౌఖ్యంబుఁ◆బడయరాదు. ౧౦౮౫

తంత్రి=తంతె, ఎడసినన్=తొలఁగిన, శకటంబు=బండి, కువలయాక్షికిన్= స్త్రీకి.

తా త్ప ర్య ము

తంతెలులేని వీణయందు నాదము కలుగదు. చక్రము దొలఁగిపోయెనా బండి పయనింపదు. కావున స్త్రీలకు నూర్వురు కొడుకులున్నను అష్టైశ్వర్యములున్నను భర్తలేకున్న సౌఖ్యము సాధ్యముకాదు.

కం॥ మితముగనిచ్చును జనకుఁడు,
మితముగఁ దల్లియును సుతుఁడు•మితముగనిచ్చున్
మితిలేని సుఖము నిచ్చెడు, పతినిన్ భజియింప దెవతె•పరమపవిత్రా.

పరమపవిత్రా=మిగులఁ బవిత్రురాలా. ౧౦౮౬

తా త్ప ర్య ము

మిగులఁ బవిత్రురాలా! స్త్రీకిఁ గన్నతండ్రియు మితముగా నిచ్చునేకాని తనకుఁ గలదియంతయు నీయఁడు. కొడుకు తనకుఁ దన భార్యబిడ్డలకుఁ గావలయునని యంతయు దాఁచి యేదో కొంచెము నిచ్చును. తల్లియు నంతియ. ఒక భర్తమాత్రమే మితిలేక తనకుఁగల దంతయు భార్యకునిచ్చును తన దేహమును బుణ్యమునుగూడఁ బంచియిచ్చును. ఇటుండ నటువంటిభర్తను దన మేలుగోరు నెవతె సేవింపకుండును?

కం॥ వింటిని బెద్దలవలనను, మంటిని సద్ధర్మగతిని•మఱి విభు నేలా
గెంటసములాడుదును, వాల్గంటికి దైవతమనంగ•గాంతుండ కదా.

మంటిని=మనితిని, జీవించితిని, గెంటసములు=నిష్ఠురములు, వాల్గంటికిన్=వాలుఁగంటికిన్=నిడుపాటి కన్నులుగలదానికి, కాంతుండ=భర్తయే.

తా త్ప ర్య ము

పెద్దలవలన మంచి సెడ్డలవింటిని. అందు మంచిమార్గమవలంబించిజీవించితిని. ఇంతచేసినపిమ్మట నేనేల నా భర్తను బరుషము లాడుదును. స్త్రీకిదేవుఁడనఁగా భర్తయేకదా.

కం॥ అన విని వనటయు నెలమియుఁ,
బెనఁగొనఁ గౌసల్య బాష్ప•వితతులు రాల్పన్
గని సవతులలో నుండెడి, జననికి వలగొనుచు రాము•చంద్రుం డనియెన్॥

వనట=దుఃఖము, ఎలమి=సంతోషము, పెనఁగొనన్=పెనసి పురికొనఁగా, వలగొనుచున్=ప్రదక్షిణించి సమస్కరించుచు.

తా త్ప ర్య ము

నాకోడ లిటువంటి యుత్తమస్త్రీ గదాయని సంతోషము. ఇటువంటి దానికెంత కష్టము వచ్చెనని దుఃఖము. రెండును బెనవేసికొనఁగాఁ గౌసల్య కన్నీళ్లు రాల్పఁగాఁ గని సవతులలోఁ దాను గొప్ప, పెద్దది, పట్టమహిషి యను గర్వము లేక వారితోఁ గలిసి కూర్చుండిన తల్లికిఁ బ్రదక్షిణముచేసి రామచంద్రుఁ డిట్లనెను.

—• శ్రీరాముఁడు కౌసల్యాదిమాతలయొద్ద సెలవు తీసికొనుట. •—

చం॥ అడలకు మమ్మ! నాజనకు•నాదర మొప్పఁగఁ జూడవమ్మ నా
కడవుల నాలుగుం బదియు•నబ్దము లేగెడి నీదునిద్రలో,
పడిఁ జనుదెంచి మిత్రహిత•వర్గముతో వెలయంగఁ గాంతు వం
చడ లుడుగంగఁ బల్కి తన•యుం బవిధంబున నేడ్చువారికిన్. ౧౦౮౯

అడలకుము=పరితాపపడకుము, అడలు=దుఃఖము.

తాత్పర్యము

తల్లీ! వ్యసనపడకుము, నానిమిత్తమై దుఃఖించుచుఁ దండ్రిని నాదరింపకుండెదవేమో. నీకోడలికి నీవు చెప్పిన మాటలు నీవును మదియందుంచుము. ఏ కారణమున నేవ్యసన మెంతతగిలినను భర్తనుపేక్షింపరాదు. నాతండ్రినన్నడవులకుఁ బంపెనను కోపముచే నీవీయనను నుపేక్షింపరాదు. నీవు నిద్రపోయి లేచినంత యల్పకాలములో నాకుఁ బదునాలుగేఁ డడవులలోఁబోవును. అది తీరఁగానే త్వరగావచ్చి మిత్రులతోను హితులతోను గూడిన నన్ను నీవు చూడఁగలవు అని దుఃఖముపశమింపఁ బల్కి తన తల్లివలెనే దుఃఖించు.

కం॥ మున్నూటేఁబదితల్లుల, కు న్నతుఁ డై మోడ్చి కేలు•కొమరుగ ధృతిసం
పన్నుఁడు ధర్మయుతం బగు, నన్నెఱి పచియించె వారి•నందఱఁగనుచున్

నతుఁడై=నమస్కరించినవాఁడై, ధృతిసంపన్నుఁడు=ధైర్యమే సంపదగాఁ గలవాఁడు, నెఱి=విధము.

తాత్పర్యము

మూఁడు వందల యేఁబది మంది తల్లులకు నమస్కరించినవాఁడై చేతులు జోడించి ధైర్యసంపద వెలయఁగ ధర్మముతోఁగూడిన విధముగ వారి నందఱను జూచి యిట్లనెను.

కం॥ జ్ఞానము లేమినొ, చనవుననో, నీతి దొఱంగి పలికి•యుండిన మిమ్మున్
నానేరము క్షమియించుచు. నానతి నా కిడుఁడు తల్లు•లారా! కరుణన్.

తాత్పర్యము ౧౦౯౧

మీ కష్టములు తెలియని కారణముచేతనో, తెలిసినను నాకుఁ దెలివి లేకుండుటచేతనో, నీతివిడిచి పలికియుంటినేని తల్లులారా! నా నేరము క్షమించిదయచే నాకు వనమునకుఁబోవ ననుజ్ఞయిండు.

మ॥ అనినన్ రామునిమాటలన్ విని సరో•జాక్షుల్ భృశార్తిన్ మహా
నినదం బారఁగఁ గ్రౌంచ లట్లఱవ ము•న్నిస్తుల్యవాద్యధ్వనిన్
గొనబౌ భూమిధవేంద్రుహర్మ్యము మహా•కోలాహలోపేత మై
వనజాతాయతలోచనానికరరా•వస్ఫూర్తి సొంపారుడున్. ౧౦౯౨

సరోజాక్షుల్=కమలములవంటి కన్నులుగల యాస్త్రీలు, భృశ+ఆర్తిన్=అధిక దుఃఖముచే, మహానినదంబు=పెద్దధ్వని, కొంచలు=క్రౌంచములు, మున్=

పూర్వము నిన్నటివఱకు, నిస్తుల=అసమానమైన వాద్యధ్వనిన్=వీణలు మొదలయినవాని ధ్వనిచేత, గొనబౌ=అందమైన, మహాకోలాహలోపేతమై= గొప్ప సంకులధ్వనితోఁగూడినదై, వనజాతాయతలోచనా=కమలాక్షులయొక్క, నికర= సమూహముల, రావస్ఫూర్తిన్ = ధ్వనియతిశయముచే, సొంపు+అఱుడున్= అందముచెడిపోఁగా.

తాత్పర్యము

ఆ మాటలువిని యాస్త్రీలందఱు మహాపరితాపముతోఁ బెద్దపెట్టునఁ గ్రౌంచములవలె గొల్లుననేడువఁగా నిన్నటివఱకు వీణెలు మద్దెలలు, పణవములు తాలములు లోనగు మంగళవాద్యములతో నిండియుండిన రాజుమేడ పెద్దకోలాహలధ్వనితో స్త్రీల గుంపుల నేడ్పుధ్వనితో నందముమాఱెను.

-• ౪౦-వ సర్గ. సుమిత్ర లక్ష్మణునకు శ్రీరామువెంటఁబోవ ననుజ్ఞయిచ్చుట •-

కం॥ రాముఁడు సీత కృతాంజలి, సౌమిత్రియు దైన్య దుఃఖ•సంతాపములన్
భూమీశ్వరు వలగొని శ్రద్ధామతిఁ జరణముల వ్రాలి•తగుగతిఁ బిదపన్.
౧౦౯౩

కృతాంజలి=చేమోడ్పుగలవాఁడు, వలగొని=ప్రదక్షిణించి, తండ్రికివలెఁ దల్లికిని బాదములంటియే యభివాదనము చేయవలెను. కృతాంజలి కాకాక్షి న్యాయముచే నుభయత్ర యన్వయించును.

తాత్పర్యము

శ్రీరాముఁడు, ఆయనవెనుక సీత, ఆమెవెనుక చేమోడ్పున లక్ష్మణుఁడు దీనత్వము దుఃఖము, సంతాపము వీనితోఁగూడి రాజునకుఁ బ్రదక్షిణముచేసి శ్రద్ధతోడి మనస్సులతో నాయనపాదములపైఁ దగినవిధముగ వ్రాలియావెనుక.

కం॥ జనకతనూజను దమ్మునిఁ, దనతల్లికి మ్రొక్కఁ బనిచి•దైన్యవశుం డై
వనజేక్షణుండు తానును, వినయమున నమస్కరించె•వెలఁదుకమిన్నన్.

తాత్పర్యము
౧౦౯౪

శ్రీరాముఁడు ముందుగ సీతను లక్ష్మణునిఁ దనతల్లికి మ్రొక్కుఁడని చెప్పి యావలఁ బ్రతిదినము వీరిసేవ యిఁక నాకు దుర్లభముగదా యని దీనాననముగఁ దానును నామెకు వినయమున నమస్కరించెను.

కం॥ అనుపదమున లక్ష్మణుఁడును, ఘనభక్తిని వాఁగి మ్రొక్కి•కౌసల్యకు, వెండిని దనజనని సుమిత్రకు,వినయంబున మ్రొక్కె భక్తి•వివశుం డగుచున్

అనుపదమునన్=వెంబడి, వెండిని=వెండియును, వెండిశబ్దముకళ, దీనికి "యును" సముచ్చయములు చేర్పఁబడినవి. అందలి 'యు' లోపింపఁగా వెండిను అని నిలిచి ఈధాతు యుష్మదర్థంబులమీఁదఁ దక్క నికారై కాంత

శబ్దమునకు ద్వితీయాషష్ఠుల నిందత వర్ణకములగు, తత్సమ, ౪౫ సూ. ప్రకారము వెండిని సయ్యెను. ఇది సీతారాములతోడఁ జేసిన నమస్కారముగాక ప్రత్యేకనమస్కారము.

తాత్పర్యము

కౌసల్యకు శ్రీరాముఁడు నమస్కరింపఁగానే మిగుల భక్తితో సాఁగిలఁబడి లక్ష్మణుఁడు కౌసల్యకు నమస్కరించి మఱియును దనతల్లిసుమిత్రకు వినయమున భక్తిపరవశుఁడై మ్రొక్కెను.

ఆ॥ వందమానుఁడైన•నందనుఁ జేరంగఁ, దిగిచి యశ్రు లురల•వగపుతోడ
శిరము మూరుకొనుచుఁ•దరుణీమతల్లి సు,
మిత్ర హితముఁ గోరి•పుత్రుననియె. ౧౦౯౬

వందమానుఁడు= నమస్కరించుచున్నవాఁడు, నందనున్=కొడుకును, ఇచ్చట సంతోషపెట్టువాఁడను నర్థముగల నందన శబ్దము సార్థకము. శ్రీరాముని వెంట లక్ష్మణుఁడుపోవుట సుమిత్రకు మిక్కిలి సంతోషకరమని భావము. అశ్రులు=కన్నీరు, మూరుకొనుచున్ = అఘ్రాణించుచు, తరుణీమతల్లి=స్త్రీల యందు శ్రేష్ఠురాలు.

తాత్పర్యము

తనకు నమస్కరించుచున్న కొడుకును దగ్గఱఁదీసికొని కన్నీరుగాఱ వ్యసనముతో నాయన శిరస్సువాసనచూచి స్త్రీలయందుత్తమురాలైన సుమిత్ర లక్ష్మణు శ్రేయస్సుగోరి కొడుకుతో నిట్లనెను.

సీ॥ నిఖిలసుహృద్వర•నియతానురక్తత, రామునితోడ న•రణ్యములకుఁ
బోవ జన్మించితి•పో మ్మానతిచ్చెద, నేమఱదెవు సుమీ•యెప్పుడైన
నీమనంబుననేని•రాముఁ డేగ వనాళి, వ్యసనియైన సమృద్ధి•నెసఁగు చున్న
నీతండె గతి నీకు•నెల్లడ ధర్మంబు, జ్యేష్ఠానువర్తియై•చెలఁగు చుంట

తే॥ పుత్రక! సనాతనంబైన•పుణ్యవృత్త
మీకులంబున నిదియ సు•మ్మీ తలంప
దానమును యజ్ఞదీక్ష యు•ద్ధమున మృతి య
టంచు బోధించి పో పొమ్ము•టంచు మఱియు ౧౦౯౭

నిఖిలసుహృద్వర నియతానురక్తతన్=(1) సమస్త సుహృత్తులయందు శ్రేష్ఠమై నియతమైన యనురాగము కలిమిచే (2) సకల సుహృత్తులయందు శ్రేష్ఠుఁడైన శ్రీరామునియందలి నియమమైన యనురాగముచే, (3) నిఖిల సుహృద్వర=సకలస్నేహితులందు శ్రేష్ఠుఁడా, జన్మించితి=పుట్టితివి, ఆనతిచ్చెదన్=అనుజ్ఞయిచ్చెదను, ఏమఱెదవు=హెచ్చరిక తప్పెదవు, వనాళిన్=వనముల వరుసలయందు, జ్యేష్ఠానువర్తియైన = పెద్దవాని ననుసరించి వర్తించుట, పోపొమ్ము=కార్యమునందలి యాదరాతిశయముచే రెండుమార్లు చెప్పెను, పోయిరమ్మనక=పొమ్మనుట యవలక్షణముగదా యనరాదు. తన కొడుకు

శ్రీరాముని వెంట సర్వకాలములనుండుట ప్రధానము రమ్మనిన శ్రీరాముని వెంటఁ గొంతకాలమే యుండి తన్నావల రమ్మని యర్థము చేసికొనునేమో యని యామాట చెప్పలేదు. శ్రీరాముఁడు వచ్చిన నీవు రమ్ము ఆయనరాకున్న నీవు రావలసిన పనిలేదు.

లక్ష్మణునివలెఁ గైంకర్యము చేయువారు భార్యను దల్లిని విడిచి చేయ వలసినట్టు లేర్పడెనేని వారికి పోషణమార్గము భర్తనో, కొడుకులనో చూపియట్లు చేయవచ్చునని యేర్పడుచున్నది. అంతియకాని యది నెపము పెట్టుకొని వారిని దిక్కులేనివారిగ విడువరాదు.

తాత్పర్యము

అన్నా! లక్ష్మణా! లోకరక్షణార్థము కౌసల్య కడుపున శ్రీరాముఁ డెట్లు పుట్టెనో యట్లులే సకలసుహృజ్జనశ్రేష్ఠుఁడగు నాయనకు సహాయుఁడవై నియత మైన యనురాగముతోఁ జరింప నీవు నాకడుపునఁ బుట్టితివి. కావున శ్రీరాముని వెంట నీ వరణ్యములకుఁబోయి నీ జన్మము సార్థకము చేసికొనుము. అట్లాయన పోవునపు డాయన పుష్పఫలభరితవృక్షంబుల యందము చూచుచు హెచ్చరిక తప్పునపుడు నీవు నట్లయ్యెదవు సుమా. ఆయన స్వవిషయమునఁ బ్రమాదపడి నను నీ వాయనవిషయమునఁ బ్రమాదపడరాదు. కావున దిక్కులు చూచుచుఁ బోక యాయనయందే దృష్టి నిలిపినపుడు ఆయన గమనసౌందర్యమునఁ గలి గిన యానందమునఁ బరవశుఁడవై నిన్ను నీవు మఱచెదవు సుమా. అటయిన నాయన రక్షణమందు హెచ్చరిక తప్పెదవు, జాగ్రత్త. ఇచ్చట సుఖముల మరగి నాయందు భార్యయందుఁగల ప్రేమచే శ్రీరాముని నేమఱియుండే యుండుట బాగని తలఁచెదవేమో. అట్టిపొరపాటును బడకుము మమ్మునందఱ విడిచియైన నీవు పోవలసినవాఁడవే, నిలువరాదు, శ్రీరామచరణసేవకనియే నీవు పుట్టితివే. నీకు నేను జెప్పవలసినదేమున్నది. పలువిధముల దాస్యమునందు నీవు ఆదిశేషుఁడవే కదా. ఏయే సమయములం దెట్లెట్లు దాస్యము చేయవలయునో నేను నీకుఁ జెప్పవలయునా? నాయనా నే నాఁడుదానను. శ్రీరాముని వెంటఁ బోయి యాయనను సేవించుభాగ్యము నాకులేదు. నీమూలమున నాయనసేవ చేయఁగోరుదానను. నీవు చేసితివా నీ పుణ్యమున నేను దరించెదను. అప్పుడు నేను నిన్నుఁ గన్నందునకు సార్థకము. నీవు సకల సుహృత్తులయందు నియత మైన యనురాగము కలవాఁడవు. ఇఁక సుహృద్వరుఁడైన శ్రీరామునందు ననురాగము కలిగియుండుమని నేను జెప్పవలయునా? నేను దానిఁ జెప్పవల సినపని లేదుగాని నేను జెప్పవలసినది యొకటి కలదు. అది యేమంటివా, ఎప్పుడైన నాయన విషయమునం దేకారణమునైన నేమఱుపాటుగలవాఁడవు గాకుము. అనతిచ్చెదఁ బొమ్ము. శ్రీరాముఁడు కౌసల్య నడిగినట్లు నీవు నన్నానతిమ్మని యడుగఁ బనిలేదు. నీ వడుగకముందే నేనే యాజ్ఞయిచ్చె దను పొమ్ము. శ్రీరాముఁడు దరిద్రుఁడే యాయనను గొలిచిన నేమి

లాభమందువా. అట్లనకుము. రాజ్యహీనుఁడై దరిద్రుఁడైనను రాజై సంపన్నుఁడైనను నీకు గతి యతఁడే. శ్రీరాముఁడు దరిద్రుఁడైనను నీకు రాఁగల నష్టి లేదు. ఆయన సంపన్నుఁడైన నీకు రాగల లాభములేదు. నీవు శ్రీరామునందు భక్తిగలవాఁడవైతివా బాగుపడెదవు శ్రీరామునందు భక్తిలేనివాఁడవైతివా చెడెదవు. నిన్ను రక్షించునది చెఱుచునది నీ భక్తియే. కావున నాయన యే దశయందుండిన నీకేమి? పెద్దవాని ననుసరించి తిరుగుట పిన్నవానికిధర్మము. దాసునకు స్వామిసేవ ధర్మము. దరిద్రుఁడైనను స్వామి స్వామియే సంపన్నుఁడైనను స్వామి స్వామియే. పతివ్రతా ధర్మముపంటిదే దాసధర్మము. కావున నీ స్వత్వము ఆయన స్వామిత్వము నాలోచించి సేవచేయుము నాయనా యిఁక వంశాచారమును జెప్పెద వినుము. సనాతనపుణ్యాచార మీరఘువంశమునఁ బిన్నవాఁడు జ్యేష్ఠానువర్తియై యుండుటయేకాక దానికంటె ముఖ్యములైన పరమధర్మములు దానము, యజ్ఞములందు దీక్ష, రణమున మరణము, ఇవి వంశధర్మములు కావున వీనిని గాపాడుకొనుము పోయిరమ్ము. ఈమూఁడైనను నీవు శ్రీరామునికొఱకే చేయుము. దానము చేసినను శ్రీరామునికొఱకే. యజ్ఞదీక్షయు శ్రీరామునికొఱకే. రణమున మరణము శ్రీరాముకొఱకే.

తే॥ రాముఁడ యెఱుంగుమీ దశరథుఁడు నిజము
నను దలంపు మా జనకునితనయఁ బుత్ర!
యటవియ యయోధ్య యంచు నీవాత్మఁ జూచు
పోయి రమ్ము యథాసుఖముగను దండ్రి. ౧౦౯౮

ఇట్లు శ్రీరామునివెంట లక్ష్మణుఁ డిపుడుపోయినను బోయినచోటఁగష్టము తోఁచినపుడు మరలఁ దల్లిదండ్రులను నగరమును స్మరించునేమో యని తలఁచి సుమిత్ర వానికిఁ బ్రతినిధులఁ జూపుచున్నది.

శ్రీరాముఁడ యెఱుంగుమీ దశరథుఁడు, ఈదశరథుఁడు సోపాధికుఁడగు తండ్రి. వానిపైఁ బ్రేమవదలుము. సోపాధికబంధువుల నమ్మినవచ్చెడుగతి చూచితివిగదా. శ్రీరాముఁడు నిరుపాధిక స్వాభావికమైనతండ్రి. కావున నతని యందే ప్రేమయుంపుము.

ననుఁదలఁపుమీ జనకతనయ, నన్ను=సోపాధికమాతనైన నన్ను. కావున నాపైఁ బ్రేమయుంచకుము. నాపై నీవెంతప్రేమయుంచియు నీపై నాకెంతో ప్రేమగలిగియు నేమి ప్రయోజనము నేను నీకష్టముఁ దొలఁగింపఁ గలిగితినా కావున నాయందు మాతృభావముంచుటవలన ఫలములేదు. ఈ జనకతనయ= జానకి ఈమె నీకు స్వభావమునఁ దల్లి. ఈమెకు నీవొక్కనమస్కారము చేసినను నిన్నీమె కాపాడఁగలదు. ప్రణతి ప్రసన్నజానకి యని సుందరకాండమునఁ జెప్పఁబడును.

అటవీయయయోధ్యయంచు నీవాత్మఁజూడు=ఈయయోధ్య శ్రీరాముఁడు లేని కారణమున నయోధ్యకాదు. ఇదియొక యడవినంటిదే దేవానాంపూ రయోధ్యాయని నాయోధ్యే త్యపరాజితేతి యనునట్లు శ్రీరాముఁ డుండినఁగదా యాపేరుసార్థకము. ఆయనయుండుచోటే యయోధ్య కావున మమ్మును దీనిని స్మరించి వీనియందుఁ బ్రీతియుంచి ప్రయోజనములేదు. శ్రీరాముఁడుండు స్థానమే నీకుఁ బ్రాప్యమగుస్థానము.

౨. రాముఁడ=రాముఁడే, దశరథుఁడు=జ్యేష్ఠభ్రాతాపితృసమః అన్న తండ్రితో సమానుఁడు. అను న్యాయము ననుసరించి శ్రీరాముఁడే దశరథుఁడని తలఁచి తండ్రియం దుంచవలసిన గౌరవము భక్తి రామునందుంచి యాయననే పూజింపుము.

నను దలఁపుమీ జనకతనయఁ బుత్ర=అన్నయందుఁ దండ్రిభావముంచినపుడు వదినెయందుఁ దల్లిభావముంచుట స్వభావసిద్ధమేకదా. కావున నన్నుఁ దల్లినని యెట్లు గౌరవించి భక్తితోఁబూజించెదవోయట్లే సీతను భక్తితో గౌరవించి పూజింపుము.

౩. రాముఁడ యెఱుంగుమీ దశరథుడు="గుణైః దశరథోపమః" గుణములచే దశరథునితో సమానుఁడని చెప్పఁబడుటచే దశరథునియం దెట్టిగుణములున్నవో యట్టిగుణములే శ్రీరామునియందును గలవు కావున శ్రీరాముఁ డెదురుగానున్నప్పుడు దశరథుఁడు స్మరణమునకు రావలసిన కారణమే కలుగదు.

అట్లులే. నను దలంపుమీ జనకతనయన్=నాయందు నెట్టిగుణములు కలవో యట్టిప్రీతి వాత్సల్యములు సీతయందును గలవు. కావున సీతాసన్నిధానమున నన్ను స్మరింపఁ గారణములేదు.

అటవియ యయోధ్య=అయోధ్యయందుండునవి కృత్రిమ రమణీయ పదార్థములు, అవియెట్లు నీకు భోగ్యములో యట్టులే యడవియందలి సహజ సౌభాగ్యవంతములయిన పదార్థములు నీకు భోగ్యములే యగును. కావున నయోధ్యను స్మరింపఁ గారణము కలుగదు.

౪. రాముఁడ దశరథుఁడు=దశరథుఁడెట్లు స్త్రీపరవశుఁడో శ్రీరాముఁడు నట్టివాఁడే. యథాపితా తథాపుత్ర యను న్యాయము గలదుగదా. ఇదిమాయామృగ వృత్తాంతమందుఁ గననగు. దశరథుఁడు స్త్రీకి వశుఁడై సమయమునఁ గైక మాయోపాయము చెప్పెడువాఁడు లేక చెడెను.)శ్రీరాముఁడట్టులే భార్యకు వశుఁడై చెడిపోవనుండెనేని నీవు హెచ్చరింపుము. మనకేమిలే యని యూరకుండకుము.

నను దలంపుమీ జనకపుత్రిన్=ఇప్పుడు నిన్నెట్లడవులపాలై పొమ్మనుచున్నానో యట్టులే సీతయు శ్రీరామునిమీఁది ప్రేమచే నిన్నుఁ బొమ్మనఁ గలదు.

అడవియ యయోధ్య=ఇప్పు డయోధ్యవిడిచి యరణ్యమునకుఁ బోవునపుడు నీవెట్లు రక్షింప వెంబడిపోవుచున్నావో యట్టులే యడవి విడిచివేతొక

చోటికిఁ బోవునపుడును నీవు వెంటనేపొమ్ము. నీమాటవినలేదని వారిపైఁ గోపింపకుము.

౫. రాముఁడ దశరథుఁడు=దశరథుఁ డెట్టిశూరుఁడో శ్రీరాముఁడు నట్టి శూరుఁడే. దశరథుఁడు దేవతలపక్షమున రాక్షసులతో యుద్ధము చేసినవాఁడు రోహిణీ శకటభేదనము చేయకుండ శనినాఁపినవాఁడు.అంతటివాఁడే శ్రీరాముఁడు.

ననుఁదలంపుమీ జనకపుత్రి=దశరథు శ్రేయస్సునకు నే నెట్లు సంతోషించుదాననో సీతయుఁ దన భర్త శ్రేయస్సునకు సంతోషించునదే.తందృష్ట్వా శత్రుహంతారమ్మని అరణ్యకాండమునఁ జెప్పఁబడును.

అయోధ్య యెట్లు భూతకోటికి నాధారమైయున్నదో యరణ్యము నట్లే జీవకోటి కాధారమైయున్నది.

౬. రాముఁడ దశరథుఁడు=దశరథుఁడు శ్రీరాము నెట్లెడఁబాసియుండలేఁడో యట్లే శ్రీరాముఁడు దశరథు నెడఁబాసి యుండలేఁడని యెఱుఁగుము. నే నెట్లు మిమ్మెడఁబాసియుండలేనో సీతయు మిమ్మెడఁబాసియుండలేదు. శ్రీరాము నెడఁ బాసి యయోధ్య యెట్లుచెడెనో అట్లే యరణ్యముకూడ శ్రీరామవియోగమును సహింపలేదు. 'అపివృక్షాః పరిమ్లానా' చెట్లుకూడ రామవియోగమున వాడిపోయెనని సుమంత్రుఁడు చెప్పఁగలఁడు. ౧౫౩ ప.

౭. రాముఁడు దశరథుఁడు=దశరథుఁడెట్లు చక్రవర్తిగా నిప్పుడున్నాఁడో శ్రీరాముఁడు నట్లే చక్రవర్తి కాఁగలఁడని తెలియుము. నే నిప్పు డెట్లు పట్టపు రాణినై యున్నానో యట్టులే సీతయు నుండఁగలదు. అడవి.......యయోధ్య, అయోధ్య యెట్లు సర్వసమృద్ధికలదై యున్నదో యట్లేయరణ్యముఁ బుష్పఫలాదులచే సమృద్ధమైయుండును.

౮. రాముఁడ దశరథుఁడు=రాముని నిపుడు కాలినడక తిరుగు మనుష్యమాత్రునిఁగా నెంచి యవమానదృష్టిఁ జూడకుము. పుష్పకాదులగు ననేకరథంబుల నెక్కి తిరుగఁగలఁడు దశరథుఁడు=పదితేరులు గలవాఁడు, ననుఁదలంపుమీ జనకుని తనయన్=నేనెట్లు దశరథునితో నానావాహనంబుల దశరథుఁడు యుద్ధమునకుఁ బోవునపుడు పోవుచుంటినో యట్లేసీతయుఁ బుష్పకాదుల సంచరింపఁ గలదు. అటవియ.......యయోధ్య, మీకెట్లడవియందు నిత్యసంచారము గలుగఁ గలదో ఆవల నయోధ్యయందును నిత్యసంచారము గలుగఁ గలదు.

౯. రాముఁడ దశరథుఁడు = శ్రీరాము నెట్లు పరిపూర్ణమైన తండ్రిగా భావించెదవో యట్టులే దశరథుని బరిపూర్ణమైన తండ్రిగా భావింపుము.'భూమిపు నెడలేదు జనకబుద్ధి' యని తండ్రి నవమానింపకుము. శ్రీరాముఁ డెట్లుతండ్రిని గౌరవించునో యట్లే నీవు గౌరవింపుము, నను...జనకతనయన్=ఆ గోచిలోనిదే కదా యాప్రాంత యన్నట్టు లాదశరథుని భార్యగదా యీమెయు శ్రీరామునికిఁ గైకవంటి సవతితల్లియేకదా ఏవేళ కేమి కీడు శ్రీరామునకుఁ

జేయునోయని నన్నాదరింపకుము. సీతయం దెట్టి గౌరవముంచెదవో యట్టి గౌరవమే నాయందు నుంచుము.

అటవియ యయోధ్య=శ్రీరాముఁడున్నదే నగరము, శ్రీరాముఁడులేనిది యడవియని "వనం నగరమేవాసు యత్ర రామో మహీపతి" యన్నట్లు లయోధ్య నవమానింపకుము ఇందును శ్రీరాముని పాదుక లుండఁగలవు. ఇది యును శ్రీరామునకు వాసస్థానము కాఁగలదు. కావున దీని నవమానింపకుము.

దశరథుఁడు రాముఁడ=దశరథుఁడు వెరాముఁడే. రాముని నెడఁబాసి మరణించుననని యెఱుంగుము. శ్రీరాముని నెడఁబాసి దశరథుఁడు బ్రతుకలేఁడు అని తెలియుము, నను........జనకతనయన్=దశరథుఁడు మరణించిన పిమ్మట నన్నెవ్వరిచ్చట నాదరింపవా రుండరు,కావున నాకు దశరథు భార్యయను గౌర వమిచటఁ గలుగదు కావున నా పుట్టినిల్లు చేరపలసినదాననే. అచ్చట నెవ్వరనిన మగధదేశమున వారు మన రాజుకూఁతురని యఁదురు, కావున నన్నుఁ జనకుని కూఁతురని యెంచుము, అయోధ్యాపతి భార్యయని తలంపకుము,

అటవియ యయోధ్య, శ్రీరాముఁ డరణ్యమునకుఁబోయి దశరథుఁడు స్వర్గమునకుఁబోఁగా నిఁక నయోధ్య యడవివలెనుండునని యెంచుము, నీవు తలఁచుకొని విచారపడవలసినది దిందేదియు నుండదు.

౧౧. రాముఁడ దశరథుఁడు, (౭) దశమనఁగా కొఱుకునది. పాములు మొదలగువానిఁ గొఱికితినువాఁడు గరుడుఁడు, రథమనఁగాఁ దేరు, వాహనము, శ్రీరాముఁడు గరుత్మంతుని వాహనముగాఁగల విష్ణువని యెఱుంగుము, దశ మనఁగాఁ జిలుకలోనగు పక్షి, పక్షివాహనముగాఁ గలవాఁడు విష్ణువు, దశః పక్షీ విహంగమయని నిఘంటువు, కొఱుకునది దశము.

దశరథుఁడు "రథోదేహేపి" నానా. అనుటచే రథశబ్దమునకు దేహమనియు నర్థముగలదు. కావున దశరథుఁడనఁగా దశరూపములు గలవాఁడని యర్థము. "దాశార్హో దశరూపభృ" త్తని యమరుఁడు. కావున దశరథుఁడనఁగా దశావతార ములుగల విష్ణువు.

నిజమునను=సత్యముగా, జనకతనయన్ = సీతాదేవిని, మాన్=లక్ష్మీ దేవిఁగా "మారమా మంగళ దేవతా", "మాశ్రీ మానేమృతావేలా మేధాశ్రీ మత్స్య మాతృషు"నానా, కావున సీతను లక్ష్మినిగా నెంచుము. సీతాలక్ష్మీర్భవాన్ విష్ణువని యుద్ధకాండమున సీతయే లక్ష్మి నీవు విష్ణుఁడవని బ్రహ్మాదులు స్తుతింతురు.

అడవియ యయోధ్య దేవానాం పూరయోధ్యా యను శ్రుతివలన వైకుంఠ మయోధ్య యని తెలియనగు. కావున నడవియే లక్ష్మీనారాయణులుండు వైకుంఠమని తలంపుము.

౧వ. తత్త్వము విచారించిన నీకు వాస్తవముగఁ దండ్రియనఁగాఁ దండ్రివలె రక్షకుఁడు దశరథుఁడా శ్రీరాముఁడా యని యాలోచించితివేని రాముఁడ=రాముఁడే యని యెఱుంగుము అట్టులే నీకు నిజమైన మా=తల్లి నేనా సీతయా యని యాలోచించితివేని పారమార్థిక జనని జనకతనయయె యని యెఱుఁగఁగలవు. యోగ్యమైన వాసస్థానమీవి యయోధ్యయా యడవియా యందువేని రాముఁడుండు నడవియే నీకు వాసయోగ్యస్థలము ఇన్ని గుణములుండుటచే నిప్పటికి వనవాసము దుఃఖకరముగాఁ దోఁచినను దానినంతగాఁ బాటింపకుము. పోయిరమ్ము. ఏమార్గమున శ్రీరాముఁడు పోవునో నీవు నామార్గముననేపోయి శ్రీరాముఁడు వచ్చునప్పుడు రమ్ము. ఈ లోపల రాకుము. శ్రీరాముఁడు నీ మనస్సు పరీక్షించుటకై పొమ్మనును. ఆ మాట నీవు విని నీ సహజకైంకర్యలక్ష్మిని విడనాడకుము. "ఏతత్సామగాయన్నాస్తే" యన్నట్లు వైకుంఠమునందువలె భగవంతునితో నేకస్థలవాసము గోరక "రామరూప్యను సంచరన్" అన్నట్లు రాముఁ డెందెందుఁబోవునో నీవు నందం దాయనతోడఁ బోయి శుశ్రూషచేయుము అని భావము యథాసుఖముగను "కోదండధరుండనై మెలవుదాలిచి సర్వము నేన తీర్చెదన్" అని చెప్పితిని గదా. అట్టి కైంకర్యసుఖము నీ చేతిలోనున్నది. ఈ సుఖముచెడక లభించునట్లు పోయిరమ్ము (౨) రామునకు యథాసుఖముగను ఏవిధముగ నీవు వర్తించిన రామునకు సుఖహాని కలుగదో యట్లు వర్తించియుండుము. "భావజ్ఞేన కృతజ్ఞేన ధర్మజ్ఞేనచ లక్ష్మణ" యని ముందు రాఁగలదు. అయోధ్యయందు నీకెంత సుఖముగలదో నీ కంత సుఖ మడవియందుఁ గలదు. 'పలుఁచువాఁడఁగాను నీ లేనిచోట' పద్యము ౨౭౩ అని చెప్పితివికదా ఆమాట వాస్తవపడనిమ్ము. నీవు గోరినది రామసహవాసముగదా. అది యడవియందు నిరంతరము నిరంతరాయముగా లభించును. ఆఁడుపిల్ల సీత శ్రీరామునితోఁ 'వలఁపను దల్లినిం దలఁపఁ దండ్రి స్మరింపను దోడఁబుట్టులన్ దలఁపను నిల్లువాకిలి' ననియె. నీతోడనున్న స్వర్గము, నీతోడు రహింపకున్న నిరయంబదియె" యని చెప్పెఁ గదా. ఆ చిన్నదానికున్నంత ధైర్యము శ్రీరామసహవాసమందనురక్తియు మగవాఁడవైన నీకుండవలదా.

తండ్రి=ఈయనకు శ్రీరామసేవ యనర్ఘముగా లభించెను. ఈయన యెంత భాగవతుఁడో ఎంత పుణ్యాత్ముఁడో అట్లుగాకున్న నిట్టి శ్రీరామసేవ యెవరికి లభించును అని తండ్రియని సగౌరవముగాఁ బిలుచుచున్నది. భాగవతు లెట్టివారికైనను దండ్రులవలెఁ బూజ్యులు, పుత్రకాంక్షచేఁ గైక యపకీర్తిపాలాయెను. నీవు శ్రీరామసేవజేసి నాకుఁ గీర్తి తెచ్చెదవని నమ్మియున్నాను నీవలన నా కపకీర్తిరాకుండ బిడ్డను దండ్రివలెఁ గాపాడుము. శ్రీరామసేవచేయు కొడుకులు తల్లిదండ్రుల నుద్ధరింతురు. అట్టివాఁడు గాని కొడుకుండిననేమి? మండిననేమి? కావున శ్రీరామసేవచే నీవు ధన్యుఁడవై నన్ను

ధన్యురాలినిఁ జేయుము. నిజము నన్నుఁ + దలంపుమాయనియు నిజము నను+దలంపుమాయనియు సందర్భానుసారముగఁ బదవిభాగము చేసికొన వలయును. నన్నుఁ దలంపుమన్నచో నర్ధబిందువు శ్లేషకారణమున లోపించెను. శ్లేషేసబిందు నిర్బింద్వోర్మేళనం కుత్రచిన్మతమ్ అనికారిక. ఇట్టి ప్రయోగ ములుగలవు.

ఈ సందర్భమున లక్ష్మణచర్యయే కఠినమైనదను కొందమనిన వాల్మీకి హృదయమంతకంటెఁ గఠినము. తన వనప్రయాణమునకు నాజ్ఞగొనుటకైనఁ జెప్పుటకైన లక్ష్మణుఁడు సుమిత్ర, ఊర్మిళ యిండ్లకు బోయినవాఁడు కాఁడు. శ్రీరాముఁడైనను దల్లియాజ్ఞ దీసికొనిరమ్మనికాని భార్యకుఁ జెప్పిరమ్మనిగాని యనినవాఁడుకాఁడు. సుహృత్తులకుఁజెప్పి శీఘ్రముగ రమ్మనెను. ఆయనయు నట్లే చేసెను. తల్లికి భార్యకుఁ జెప్పఁబూనినఁ దనకుఁగలిగిన కాలహరణమే లక్ష్మణునకుఁ గలుగును. ఆ దినము ప్రయాణముసాగదని శ్రీరాముఁడు దలంచియుండవచ్చును. లక్ష్మణు నభిప్రాయమదియేయైయుండును. సుమిత్ర నింతకుముందు చూడనికారణముచేతనే యామెయిపుడింత విశేషించి చెప్ప వలసివచ్చెను. బాలకాండమున నేమిచెప్పఁబడెనో యంతయేకాని యావల వాల్మీకియూర్మిళ పేరు స్మరించినవాఁడు కాఁడు. ఏమిటికో? తాను జెప్పఁబూనిన కథాప్రపంచమున కనావశ్యకమనియె. సీత యూర్మిళ యిరువురిలో నూర్మిళకే యెక్కువ దుఃఖమని చెప్పవలసియున్నది. సందర్భబలముచేఁ బ్రసిద్ధిచెందినది సీతాదేవి. అపహరణాది సందర్భములు పొసఁగకుండిన సీతాదేవియంత ప్రసి ద్ధికి వచ్చియుండదు. ఆమె భర్తతోడనుండిన కారణమున నామె దేహకష్టముల మనస్సున గణించినదికాదు. ఇతరుల విషయమనుకొనునది కాదు. ఊర్మిళయో పతి ప్రవాసియైన కారణమున సర్వభోగములు వర్జించి యలంకారాదుల మాని శ్రమణివలెనై సర్వదా పతిని స్మరించుచు నడవులలోఁ బతికి నేవేళ కేమోయేమి తినుచున్నాఁడో యెట్లున్నాఁడో యని భయపడుచు వ్యసనపడుచు నుండెను. సీతాదేవికంటె నూర్మిళాదేవికే విశేష మనోవేదనయని చెప్పవలసియున్నది.

చం॥ అని సుతుచిత్తదార్ఢ్యమునకై యిటు బోధముచేయ నంత నా
మనుజవరేణ్యు రాముని సుమంత్రుఁడు మాతలి యింద్రునట్లు స
ద్వినయమున న్వచించె నడతే రరుదెం డెట కేగ నాజ్ఞచే
సిన నట కెన తోలెదనుజేయుఁడు తొందర యాల మేటికిన్. ౧౧౯

చిత్తదార్ఢ్యమునకై=మనస్సు దృఢపడుటకుఁగాను.

తాత్పర్యము

ఈ ప్రకారము సుమిత్రాదేవి శ్రీరామునితోడఁ బోవఁబూనిన లక్ష్మణు మనస్సు చలింపక దృఢపడుటకై చెప్పఁగా నావల శ్రీరామునిఁజూచి సుమం త్రుఁడు మాతలి యింద్రునివలె నిట్లు సంబోధించెను. రామచంద్రా, అదిగోఁ దేరు సిద్ధముగానున్నది, రండు, మీరెచ్చటికేగ నాజ్ఞచేసెదరో యచ్చటికి నేనే

తోలెదను, తొందరపడుఁడు. జాగేల? పదునాలుగు సంవత్సరములలో నొక దినము కడచినను గడచినదే కదా.

—• సీతారామలక్ష్మణులు తేరెక్కి వనములకై పోవుట. •—

చం॥ వనముల నాలుగుం బదియు•వర్షము లుండఁగ మీర లిప్పుడే
చనుఁ డని చెప్పెఁ గైక, యది•సాగుత నేఁడు మొదల్గ రాఘవా,
యన నినసన్నిభం బయి య•నంతమణీమయ మౌశతాంగమున్
జనకతనూజ యెక్కె నరు•సంబున భూషణభూషితాంగియై. ౧౧౦౦

ఇన సన్నిభంబు=సూర్యునితో సమానము, అనంతమణీమయమౌ=లెక్క లేని రత్నములు విశేషించి చెక్కఁబడిన, శతాంగము=తేరు, అరుసంబునన్= సంతోషముతో, భూషణ భూషితాంగియై=సొమ్ములచే నలంకరింపఁబడిన యవయవములు గలదై.

తాత్పర్యము

రామచంద్రా! యిప్పుడే మీరడవులలోఁ బదునాలుగువర్షము లుండఁ బొండని కైక చెప్పెనుగదా. ఆమె చెప్పినప్రకారము నేఁడే మొదటిదిన మగును గాక అనఁగా బాలసూర్యునితో సమానమై యనేక రత్నములు చెక్కిన యారథ మును బతివెంటఁబోవు భాగ్యము లభించెఁగదా యని సీతాదేవి సంతోషముతో సమస్తాభరణములు ధరించి ముందెక్కెను.

కం॥ అనలోపమాన మగుచుం, గనకమయం బైనరథము•గౌసల్యానం
దనుఁడును సుమిత్రపట్టియు, ననుమానము లేక యెక్కి•రత్యుత్సుకతన్.

అనలోపమానము=అగ్నితోసమానము, కనకమయము=బంగారుతోనిండి నది, అత్యుత్సుకతన్=మిక్కిలి సంతోషముతో.

తాత్పర్యము

అగ్నిహోత్రముతో సమానమై బంగారుమయమైన యాతేరిని శ్రీరాముఁడు లక్ష్మణుఁడును సంతోషముతో సందేహింపక యెక్కిరి.

కం॥ వనవాసార్థము పతితో, ననుగమనము సేయుసతికి•నవనీసుతకున్
జనపతి మామ యొసంగిన,
యనుపమభూషణములును మ•హాధనచయముల్. ౧౧౦౨

వనవాసార్థము=వనమునందు వసించుటకొఱకు, అనుగమనము సేయు= వెంటఁబోవు.

తాత్పర్యము

తనభర్తతో వనవాసము చేయుటకై పోవుచున్న సీతకు ఆమె మామ దశరథుడిచ్చిన యసమానములైన సొమ్ములు, విశేష ధనసమూహములు.

కం॥ ఆయిరువురకవచంబులు, నాయుధముల్ చర్మయుక్త•మగుగుద్దలియున్
వే యుంచి రరదమున నా, చాయం గని తేరు దోలె•సారథి వడిగన్.

తాత్పర్యము

శ్రీరామ లక్ష్మణుల కవచములు, విండ్లు, బాణములు, కత్తులు లోనగు నాయుధములు, చేతికి రాపుదగులకుండుటకై తోలుగప్పిన గుద్దలిని, ద్వరగా సేవకులు తేరిపై నుంచిరి. ఆపెట్టినవిధముఁజూచి మెల్లగఁదోలినఁ బౌరులు నంతఃపుర జను లడ్డమువత్తురు ప్రయాణము సాగనీయరను నభిప్రాయముతో సారథి తేరిని వడిగాఁదోలెను.

చం॥ అనిలజవంబునం బఱచు•నట్లు సుమంత్రుఁడు దోల నయ్యయో
యని బలితంపుమూర్ఛఁ గొని•రందఱు పౌరులు వేడ్కఁ జూడవ
చ్చినజనముల్ బలంబులు వి•శేషపుఁగాలము, క్రుద్ధమ త్తదం
తినిచయవాజిశింజితము•నెక్కొనె సంకుల మైనయాపురిన్. ౧౧౦౪

అనిలజవంబునన్=వాయువేగమున, పఱచు=పరువెత్తు, క్రుద్ధ=రోషించిన మత్త=మదించిన,దంతినిచయ=ఏనుఁగుల గుంపులయొక్కయు,వాజి=గుఱ్ఱము లయు, శింజితము=సొమ్ముల ధ్వని, నెక్కొనెన్=అతిశయించెను, సంకులము= జనులకోలాహలముచే నిండినది.

తాత్పర్యము

సుమంత్రుఁడు వాయువేగముతోఁ బోవునట్లు గుఱ్ఱములను దోలఁగాఁ జూడవచ్చిన జనులు పురముననున్న జనులు సేనలు చాలఁగాల మయ్యయో యని వ్యసనముచే గాఢమూర్ఛనొందిరి. జనులకోలాహలముచే నిండిన యా పట్టనమందుఁ గోపించిన మదించిన యేనుఁగులయు గుఱ్ఱములయు సొమ్ముల ధ్వను లతిశయించెను.

—• శ్రీరాముని పోకకుఁ బ్రజలు దుఃఖించుట. •—

ఉ॥ రామునివెంట నెండలను•, గాఁగినవారలు నీటికిన్వలెన్
వే ముదుసళ్లు బాలురును•వీడక పాఱిరి, యశ్రుపూర్ణ మౌ
మోములనార్తనాదముల•మోరల నెత్తి రథంబుచాయకున్
రాముని తేరు పట్టుకొని•ప్రక్కల వెన్కల వ్రేలి కొందఱున్. ౧౧౦౫

తాత్పర్యము

ఎండవేఁడిమికిఁ దపించినవారు నీళ్ళకై పరువెత్తినట్లు త్వరత్వరగా ముసలి వారు బాలురుకూడ శ్రీరామునివెంట వదలక కన్నీళ్ళచే నిండిన ముఖములతో నేడుపుధ్వనులతో రథముప్రక్క ముఖములెత్తికొని కొందఱు తేరుపట్టుకొని ప్రక్కలవెనుక వ్రేలాడుచుఁ గొందఱు పరువెత్తిరి.

కం॥ పోవుచు నీగతిభృశదుః,ఖావేశవినష్టసత్త్వు•లై సూతునితో
నీవిధమున వాకొందురు, పోవయ్య సుమంత్ర మెల్లఁ•బుణ్యం బగుతన్.

భృశదుఃఖావేశ వినష్టసత్త్వులై=అధికమైన దుఃఖమావేశించుటచే నశించిన బలముగలవారై, వాకొందురు=చెప్పుదురు.

జను లీవిధముగఁ బోవుచు మిగులదుఃఖము వారి నావేశించుటచే బలము లేనివారై సారథితో నయ్యా సుమంత్రా! నీకుఁ బుణ్యములభించును మెల్లగాఁ దోలుమని యందురు.

ఉ॥ ఎన్నఁడు చూడఁగాఁ గలమొ॰యారఘురాముని మోముఁ గ్రమ్మఱన్
దిన్నగఁ దోల వన్న! యిటు॰లీవర మేటికి రన్న, పగ్గముల్
మన్ననఁ బట్ట వన్న! యొక॰మా టయినం గనుఁగొందు మిప్పుడే
సన్నుతశీలుఁ డై నరఘు॰చంద్రముచారుముఖారవిందమున్ ౧౧౦౪

సుమంత్రునితోఁ బౌరులు చెప్పెడుమాట లింకను జెప్పఁబడుచున్నవి.

తాత్పర్యము

అన్నా! సుమంత్రా! శ్రీరాముని యందమైన ముఖకమలమును మరల నెన్నాళ్ళకుఁ జూడఁగలమో యేమో యిప్పుడే యింకొకమాటు చూడనీవయ్యా మెల్లగఁ దీనిని దోలవయ్యా, ఏమయ్యా! యిప్పుడుతొందర. పగ్గములను బిగఁ బట్టవయ్యా.

సీ॥ రామునితల్లికి॰రాయియో యినుమొ యుండెఁ,
గాఁబోలు గుండియ॰గాకయున్న
దేవగర్భోపముఁ॰డీ వనజాక్షుండు, వనికి నేఁగఁగఁ బెట్టి॰పడక యున్నె,
కాంచననగము న॰ర్కప్రభ పాయని, చంద మై తననాథుఁ॰జాయవోలెఁ
గొనకొని వెన్కొని॰చనియెడి యీమె పో, ధన్యాత్మురాలన॰ధరణియందు
తే॥ వీర లక్ష్మణ నీవే కృ॰తార్థుఁడ విల,
ననయమును బ్రియవాదిని॰ననుఁగుభ్రాత
దేవసంకాశు నిర్మల॰భావమునను,
బరిచరింపఁగఁ గనెదు నీ॰భాగ్య మహహ! ౧౧౦౫

దేవగర్భోపముఁడు=దేవకుమారునితో సమానుఁడు వనజాక్షుఁడు=పుండరీకాక్షుఁడు, ఎఱ్ఱకమలములవంటి కన్నులుగలవాఁడు, పుండరీకము=ఎఱ్ఱకమలము పుండరీకం సితాంభోజ మనుట ప్రమాదము, కప్యాసం పుండరీకమక్షిణీ యని శ్రుతి కాంచననగము=బంగారుకొండ, మేరువు, ప్రియవాదిని=ప్రియమే చెప్పువానిని, దేవసంకాశున్=నారాయణుతోసమానుని, పరిచరింపఁగన్=సేవచేయ.

తాత్పర్యము

శ్రీరామునివంటి కుమారునిఁ గన్న కడుపుగల తల్లిగుండె రాయియో యినుమో యైయుండవలయును అట్లుగాదేని మన్మథునివంటి సౌందర్యముగల యీ పుండరీకాక్షుఁ డడవికిఁబోవుచుండఁగా శోకాగ్నిచేఁ బెటిలి తునకలై యెగిరి పడకయుండునా? సూర్యుఁ డేప్రక్కనుండినను ఆయన కాంతి మేరుపర్వతమును నెడఁబాయక యంటియుండునట్లు తన భర్తను విడువక ఆయన నీడ వలె నాయన వెంబడి సీత పోవుచున్నది. పుణ్యాత్మురాలన నీమెగదా.

ఔరా లక్ష్మణా! భూమియందుఁ బుట్టినవారలలో నీవే జన్మమును సఫలము చేసి కొన్నవాఁడవు. ఏలయందువా. ఎప్పుడును ప్రియవాక్యములే పలుకువాఁడును నారాయణుతో సమానుఁడునగు నీ కూర్మిసోదరుని, శ్రీరామచంద్రమూర్తిని నిర్మలమనస్సుతో సేవించుటకై పోవుచున్నావు. ఆహా ఏమి నీభాగ్యము.

కం॥ రామునితో నీ పోవుట, యే మానుగఁ బరమసిద్ధి•హేతువు కల్యా
 ణామల బీజంబిదియే, పో మానక నాకమార్గ•మును నని వనటన్. ౧౧౦౯

పరమసిద్ధిహేతువు=మోక్షకారణము, కల్యాణామలబీజము = శ్రేయస్సులకు నిర్మలమైన విత్తనము, నాకమార్గము=స్వర్గమునకుఁ ద్రోవ.

తాత్పర్యము

లక్ష్మణా! శ్రీరాముని వెంట నీవు పోవుట మోక్షమునకుఁ గారణమగును అటుగాక యైహికసుఖము గోరువారికి శుభము శ్రేయస్సు నను ఫలమిచ్చు వృక్షమునకు విత్తనమిదియే. లేదా స్వర్గసుఖముఁ గోరువారికిని నిదియే మార్గము. శ్రీరామానుసరణము, భుక్తి స్వర్గమోక్షములందు వారువారు కోరిన ఫలమునిచ్చునని భావము.

కం॥ ఉడుగక కనులను బొడబొడ, జడిగొని వర్షించుబాష్ప•జలములు పోవం
 దుడువఁగ జాలక రాముని, బడి నేగిరి పౌరు లెల్ల•బటుదుఃఖమునన్.

జడిగొని=జడివానవలె. ౧౧౧౦

తాత్పర్యము

ఈప్రకారము తపించుచు విడువక యేకధారగా జడివానవలెఁ గన్నుల నుండి కాఱునీళ్ళను దుడువఁగ సాధ్యపడక యవి యట్లు కాఱుచుండఁగనే శ్రీరాముని వెంటఁబోయిరి.

—• దశరథుఁడు శ్రీరాముఁనిఁజూడ వచ్చుట. •—

ఉ॥ రామునిపోకఁ గందునని•రామలతో నిలు వీడి వచ్చి సు
 త్రామసమానుఁ డాజి తన•దాపున బద్ధమతంగజార్తమౌ
 భీమక రేణుకారవము•పెల్చన సారసపత్రలోచనో
 ద్దామనినాదముల్ చెలఁగఁ•దద్దయు గ్రస్తమృగాంకు నట్లయై, ౧౧౧౧

పోక=పోవుట, రామలతో=స్త్రీలతో, సుత్రామసమానుఁడు=ఇంద్రునకు దీటైనవాఁడు, అజి=దశరథుఁడు, బద్ధమతంగజార్తమౌ=బంధింపఁబడిన యూథనాథుఁడగు నేనుఁగు నిమిత్తమైన, భీమ=భయంకరమైన, కరేణుకారవము=ఆఁడేనుఁగులధ్వని, సారసపత్రలోచనా=కమలముల రేకులవంటి కన్నులుగల స్త్రీల యొక్క, ఉద్దామనినాదముల్=అతిశయమగు ధ్వనులు, గ్రస్తమృగాంకునట్లు =రాహువుచేఁ బట్టఁబడిన చంద్రునివలె.

తా త్ప ర్య ము

శ్రీరాముఁ డడవికిఁబోవుట చూచెదనని (పౌరులవలె వెంటఁబోవుటకుఁ గాదు. నిలుపుటకుఁ గాదు) యంతఃపుర స్త్రీలతోడ నిల్లువదలివచ్చి దశరథుఁడు తన సమీపమందు బంధింపఁబడిన యూథనాథుఁడగు నేనుఁగునకై యేడ్చు నాడేనుఁగుల పెద్దధ్వనివలె స్త్రీలందఱు నొక్కపెట్ట గొంతెత్తి యేడువఁగా దశరథుఁడు రాహువుపట్టిన చంద్రునివలెఁ దేజోహీనుఁడయ్యెను.

కం॥ అరుదెంచుతండ్రిఁ గనుఁగొని, స్థిరమతి రాముండు సూతుఁ • దీవరపఱిచెన్
దురగంబులఁ బోనిమ్మి,సరగున నీవంచు నట్లు • సలిపె నతండున్. ౧౧౧౨

స్థిరమతి=వనవాసమునుండి చలింపని మనస్సుగలవాఁడు, సరగునన్= శీఘ్రముగా.

తా త్ప ర్య ము

వచ్చుచున్న తండ్రినిఁజూచి చలింపనివాఁడై శ్రీరాముఁడు సారథీ! రథము శీఘ్రముగఁ బోవఁదోలుము అని తీవరింపఁగా నతఁడట్లే చేసెను.

కం॥ తోలుము తోలు మటంచును,వాలాయింపఁగను రామ • భద్రుఁడు,జనముల్
తాళుము తాళు మటంచన, నేలీలం జనక సూతుఁ • డిఱికెన్నడుమన్.

వాలాయింపఁగను=బలవంతపెట్టఁగ, ఇఱికెన్=ఇఱుకుకొనెను. ౧౧౧౩

తా త్ప ర్య ము

దశరథుఁ డెదిగెనేని ప్రయాణ మాలసించునేయని తోలుము తోలుమని శ్రీరాముఁడు తీవరింపఁగా జనములు దానివెంటఁ బరువెత్తలేక సారథీ! మెల్లగా మెల్లగాఁ దోలవయ్యా! నిదానింపుము నిదానింపుమని మొఱలుపెట్టఁగా సారథి యెటుచేయుటకుఁ దోఁపక యిరువురినడుమ నిఱుకుకొని మిఱికెను. ప్రజలనిమిత్తమై మెల్లగాఁ జననిచ్చిన దశరథుఁ డెదుగును, ఆయన నిమిత్తమై త్వరగాఁ బోనిచ్చిన వెంటవచ్చు ముదుసళ్ళు బాలురు దుర్బలులు పరువెత్తలేక, బాధ పడెదరు.

కం॥ హరిఖురఘట్టన జనముల, చరణహతిన్ రేఁగుదుమ్ము • జనసంచయని
ర్భరశోకజాతఘనరస, సరిదాళి నడంగెఁ బుడమి • జంబాలముగన్. ౧౧౧౪

హరిఖురఘట్టనన్=గుఱ్ఱముల గిట్టలయొక్క త్రొక్కుడులచే,ఘట్టనశబ్దము చరిత్రాదులలోఁ జేరినది, చరణహతిన్ = కాలిత్రొక్కుడులచే, జన=జనము యొక్క, సంచయ=సమూహములయొక్క, నిర్భర=అతిశయించిన,శోక=వ్యసనమువలన, జత=పుట్టిన, ఘనరస=నీళ్ళ, సరిత్ + ఆళి=ఏటివరుసలచే, జంబాలము=బురద.

తా త్ప ర్య ము.

గుఱ్ఱముల గొరిజల త్రొక్కుడులచేతను జనములపాదముల త్రొక్కుడులచేతను రేఁగిన దుమ్ము జనుల కన్నులనుండి వెలువడిన జలప్రవాహములచే నేల బురదయగుటవలన శమించెను.

శా॥ హాహా నిస్వనపూరితం బగునయో•ధ్యాపట్టనంబందు సీ
తాహృన్నాథుప్రయాణవేళను నితాం•తదూ్యన మయ్యెం బ్రజా
వ్యూహం బెల్ల,విసారసంక్షుభిత మం•భోజాళి నా నావరా
రోహాళుల్ గనుసీరు గార్చెను మహా•క్రూరంపుశోకవ్యథన్. ౧౧౧౭

హాహా నిస్వనపూరితంబు=హాహా కారధ్వనులచే నిండినది, దూ్యనము=దుఃఖించినది, వ్యూహము=సమూహము, విసార=చేఁపలచే, సంక్షుభిత=మిక్కిలి క్షోభచెందిన, అంభోజాళినాన్=కమలసమూహమో యనునట్లు, వరారోహాళుల్=స్త్రీలవరుసలు, వరారోహ=పెద్ద పిఱుఁదులుగలది, మహాగొప్పదై, క్రూర=తీవ్రమైన, శోకవ్యథన్=శోకబాధచే, శ్రీరాముని వెంటఁబోవు పురుషుల గతి చెప్పి యయోధ్యయందు నిలిచిన స్త్రీజనముల దశను జెప్పుచున్నాఁడు, 'మత్స్యో మీనో వైసారిణోండజః విసారశ్శకులీచ' అమరుఁడు.

తా త్ప ర్య ము

హాహా కారధ్వనులచే నిండిన యా యయోధ్యాపట్టనమందు శ్రీరాముఁడు ప్రయాణమైపోవు సమయమున జనసమూహమంతయును దుఃఖమగ్నమయ్యెను.చేఁపలచేఁ గదలింపఁబడిన తామరపూవులనుండి జలజల రాలు నీళ్ళవలె స్త్రీలు సహింపరాని శోకబాధచేఁ గన్నీరు కార్చిరి.

ఉ॥ ఏకమనంబుతోడిజన•బృందము నెల్లను గాంచి ఱేఁడు శో
కాకులచిత్తుఁ డౌచు మొద•లంటఁగఁ గొట్టినవృక్షముంబలెన్
జోక దొఱంగి వ్రాలుచును•జూపఱు హాయని యేడ్వ సాగి ర
స్తోకముగాఁగ ఱేఁడు భృశ•దుఃఖితుఁ డై ధర నొలి యుంటకున్. ౧౧౧౮

ఏకమనంబుతోడి=రాముని వెంట నందఱము పోవలసినదే యను నొక్కయభిప్రాయముతోనుండెడి, జనబృందమున్= జనసమూహమును, శోకాకులచిత్తుఁడు=శోకముచేఁ గలఁతనొందిన మనస్సుకలవాఁడు, జోక=బాగు, దృఢస్థితి, తొఱంగి=తొలఁగిపోయి, చూపఱు=చూచువారు, అస్తోకము=అధికము.

తా త్ప ర్య ము

శ్రీరాముని వెంట మనము పోవలసినదే. ఇందు నిలువరాదను నొక్క నిశ్చయాభిప్రాయముతోఁ బోవుచుండు ప్రజలను జూచి నే నెంతమందికి దుఃఖము కలిగించితినని దుఃఖముచేఁ గలఁతనొందినవాఁడై వేరు ముట్టనఱకిన చెట్టువలె దృఢస్థితితప్పి నేలపైఁబడి మూర్ఛపోయెను. రాజు నేలపైఁబడి యుండుటను నందున్నవారు రెండవవిపత్తు వచ్చెనే యీయన చచ్చునేమో యని యాయనకై యేడువసాగిరి.

కం॥ ఆయెడఁ గొందఱు కౌసల్యా యనుచున్ రామరామ•యని కొందఱు దుః
ఖాయితమతులై యేడ్చిరి, హాయని యంతఃపురంబు•ను విడలు కలఁకన్.

తాత్పర్యము

అందుఁ గొందఱు కౌసల్యా కౌసల్యా యని, కొందఱు రామా రామా యని, యంతఃపుర స్త్రీలు దుఃఖస్వరూపము నొందిన మనస్సులతో హాయని యేడ్చిరి.

ఉ॥ భ్రాంతమనస్కుఁ డై వెనుక • వచ్చునృపాలునిఁ దల్లి జానకి
కాంతుఁడు పాశబద్ధ మగు • కర్కకిశోరము దల్లి జూచున
ట్లింతయు ధర్మరజ్జుల న • హీనముగాఁ బరిబద్ధుఁ డౌట నే
త్రాంతములం గనిం గనఁడ • యంతగఁ గానఁగ నొల్లకుండుటన్. ౧౧౧౮

భ్రాంతమనస్కుఁడు=దిగ్భ్రమనొందిన మనస్సుగలవాఁడు, పాశబద్ధము=త్రాటిచేఁ గట్టఁబడినది. కర్కకిశోరము=తెల్లపిల్లగుఱ్ఱము, కర్కస్తుదర్పణే, ఘటభేదే సితాశ్వేగ్నౌ॥ నానార, ధర్మరజ్జులన్=ధర్మమను త్రాటిచే, పరిబద్ధుఁడు=చక్కఁగాఁ గట్టబడినవాఁడు, నేత్రాంతములన్ = కనుఁగొనలచే, కనిన్=కనియును, అర్థవిశేషమున సముచ్చయము, అంతగన్=పూర్ణముగ.

మనస్సుచెదరి దిగ్భ్రమనొంది తన వెంటవచ్చు తండ్రిని దల్లినిద్రాటిచే గట్టఁబడిన గుఱ్ఱపుపిల్ల తల్లిని జూచునట్లు పితృవాక్యపరిపాలనమను ధర్మపాశముచేఁ గట్టఁబడినవాఁడగుట శ్రీరాముఁడేమియుఁ జేయఁజాలక వారినిఁ బూర్ణముగఁజూచుటకు మనసొప్పలేక యోరచూపులఁ జూచియుఁ జూడనివానివలె నుండును.

తే॥ యానముల వచ్చుటకు యోగ్యు • లయ్యు రిత్త,
గాళ్ళ వచ్చెడివారి సు • ఖంబు గలిగి
శోకభరితుల రాముండు • చూచి సూత, తోలు తోలు మటంచును • దొందరించె

యానము=వాహనము. ౧౧౧౯

తాత్పర్యము

వాహనములమీఁద వచ్చు యోగ్యతగలిగియు నుత్తకాళ్ళ వచ్చువారిని, నెంతో సుఖింపవలసినవారయ్యు దుఃఖమగ్నులైనవారిని, దల్లిదండ్రులను జూచి శ్రీరాముఁడు వారికిఁ గానరాకుండఁబోవుట మేలని తలఁచి సారథి శీఘ్రముగఁ దోలుమని తీవరించెను.

తే॥ కోలపోటును సైఁపని • కుంజరంబు,
పగిది జనకుండు జననియుఁ • బడెడిదుఃఖ
ములను జూడంగ నోపండ • జలజలోచ,
నుండు రాముండు కరుణాత్మ • కుండుగాన. ౧౧౨౦

కోలపోటు=అంకుశముతోడి పొడుపును, కుంజరము=ఏనుఁగు, కరుణాత్మకుండు=దయగల మనస్సుగలవాఁడు.

తాత్పర్యము

దయామయుఁడు కావునఁ బరుల దుఃఖముచూచి సహింపలేని శ్రీరాముఁడు అంకుశముపోటును సహింపలేని యేనుఁగువలెఁ దల్లిదండ్రులు పడెడు బాధను జూడలేకపోయెను.

ఉ॥ కట్టఁగఁబడ్డలేఁగకయి ♦ కాంక్షను బాఱెడిగోవువోలె నా
పట్టపుదేవి తేరుబడి ♦ పర్విడుచుం దనయా! రఘూత్తమా!
పట్టి! కుమార! లక్ష్మణ! కృ♦పాపర! యయ్యయొ తల్లి జానకి!
యెట్టు సహింతురా యనుచు♦నేడువ రాముఁడు చూచెఁ బల్మఱున్. ౧౧౨౧

తాత్పర్యము

త్రాటఁ గట్టివేయఁబడిన దూడయొద్దకుఁ బరువెత్తుగోవువలెఁ బట్టపురాణి యగు కౌసల్య తేరువెంబడి పరువెత్తుచుఁ గొడుకా- కొడుకా- రఘువంశదీపకా- బిడ్డా- పుత్రా- లక్ష్మణా- దయావంతుఁడా అయ్యయ్యో తల్లీ జానకి మిమ్ము విడచి నే నెట్లుసహింతునని యేడువఁగా శ్రీరాముఁడు పలుమాఱు చూచెను.

తే॥ నిలు నిలు మటంచు నఱవంగ ♦ నృపతి పిఱుఁదఁ
బద పద మటంచు రాముండు ♦ పలుకు చుండ
బండికలుదోయిఁ జిక్కిన♦వానిభంగి
మిడికెను సుమంత్రుమన మంత ♦ నుడుకు గదర. ౧౧౨౨

తాత్పర్యము

వెనుకనుండి రాజు సుమంత్రా! నిలుపు రథము నిలు నిలు మని యఱచు చుండఁగా శ్రీరాముఁడో ఊఁ ఊఁ తోలు తోలు మని తొందర పెట్టఁగా బండికండ్లకు రెంటికినడుమఁ జిక్కినవానివలె సుమంత్రునిమనస్సు తపించెను.

ఉ॥ క్రమ్మఱి నీవు పోవఁగ ధ♦రావతి నిన్నని యేల యాశతాం
గమ్మును నిల్పవైతి నుడి ♦ గైకొన వేటి కటన్నఁ జెప్పనా
నెమ్మది నీదువాక్యముల ♦ నే వినఁగాన నటంచు, నేల నా
నిమ్మహితార్తి దీర్ఘమగు ♦ నేనియు దుస్సహ మౌను జేనికిన్. ౧౧౨౩

క్రమ్మఱి=తిరిగి, శతాంగమును=తేరిని, నుడి=మాట, ఇమ్మహితార్తి=ఈ గొప్పవేదన, దీర్ఘము=నిడివి, దుస్సహము=సహింపరానిది.

తాత్పర్యము

నీవు మరలి యూరికిఁ బోయినపుడు రాజు నిన్నుఁజూచి నేను దేరిని నిలుపు మనిన నేల నిలుపవైతివి. నామాట యేల నీకులక్ష్యములేదాయెను అని ప్రశ్నించె నేని నీమాట నాకు వినఁబడలేదని చెప్పుము. అసత్యమేల చెప్పవలె ననిన నాయన మాటప్రకారము నిలిపితివా యాయన వచ్చి యేడుగును. నన్ను విడువ లేక పరితపించును. ఇది నేనెఱుగఁ గానవచ్చువఱకుండును. కావున నేనుండు

కొలఁది నాయనకు దుఃఖము క్రమక్రమముగ హెచ్చునేకాని తగ్గదు. ఇంత దుఃఖము దీర్ఘకాలముపడెనా యాయన సహింపక మరణించును (౬౧-వ స. నిజమరివ్యాఖ్య చూడుఁడు) ఇట్టి యసత్య మసత్యముగాదు. దశరథుని మేలుకై చెప్పఁబడినది పరులకు నిష్కారణముగ నష్టి- భయము తాపము గలిగించునదియుఁ దనకు నన్యాయముగఁ దుష్టిలాభము గలిగించునదియు నగు నసత్య మసత్య మగునుగాని పరులమేలునకై చెప్పు నసత్య మసత్యముకాదు. తేరునిలుపుటవలనఁ గార్యహాని ధర్మహాని దశరథునకుఁ బ్రాణహాని.

చం॥ అని రఘురాముఁ డాడఁగ శ•తాంగము వెంబడి వచ్చు నెల్లరన్
సనయత నిల్వఁ జెప్పి రభ•సంబుగఁ బోవుగుఱాల సూతుఁడున్
ఘనరయ మారఁ దోలుటయు•సౌధపుకాంతలు నార్తి రామచం
ద్రుని వలగొంచు నిల్చిరి మ•నోజలజంబులు కంద నస్రులన్. ౧౧-౨౪

శతాంగము=తేరు, సనయత=మంచిమాటలతో, రభసంబుగన్=శీఘ్రముగ, ఘనరయము=మిక్కిలిత్వర, వలగొంచు=ప్రదక్షిణించి.

తాత్పర్యము

అని శ్రీరాముఁడు చెప్పుచుండఁగాఁ దన రథమువెంటవచ్చు నెల్లవారిని మంచిమాటలచే నిలుఁడని శ్రీరామునిచేఁ జెప్పించి త్వరగాఁబోవు గుఱ్ఱములను మఱింతత్వరగాఁబోవునట్లు సూతుఁడు తోలఁగా రాజునకు సంబంధించిన స్త్రీలు వ్యసనముతో వేఁడికన్నీళ్ళచే హృదయము గందిపోవఁ దమ దేహములను నిలిపిరిగాని దృష్టులు మనస్సు శ్రీరామునివెంటఁ బోకుండ నిలుపలేరైరి.

కం॥ అతివేగంబునఁ జనియెడి,క్షితిపతిసుతురథముతోడఁ•గ్రేవల నశ్రూ
ద్ధతి నంధు లగుచుఁ బఱచుచు,
మతిఁదలఁపరు మనుజులెవరు•మరలెడిమాటన్. ౧౧-౨౫

తాత్పర్యము

అంతఃపురస్త్రీలు శ్రీరామునివెంటఁ బోవలేక దేహములను నిలిపిరిగాని లోకులాపనియుఁ జేయఁజాలక యతివేగమునకుఁబోవు రాజకుమారునితేరితోడఁ బ్రక్కలఁ గన్నీళ్ళతో గ్రుడ్డివారై కనలేక యున్నను బరువెత్తుచు నిలుతమను మాటనైనఁ దలఁచినవారు కారు. ఇదియే బంధువులకు హితులకుఁ గలభేదము.

ఉ॥ దూరము పోవ రాదు సుమి•తూర్ణమ క్రమ్మఱఁగోరువారితో
భూరమణా! యనన్ సచివ•పూగము, సర్వగుణోపపన్ను లా
వారలమాటఁ బట్టి సహ•భార్యుఁడు నై ప్రవిషణ్ణరూపుఁ డై
వారి స్రవింప మేన నిలు•వంబడె నచ్చట రాముఁ జూచుచున్. ౧౧-౨౬

తూర్ణమ=శీఘ్రముగ, సచివపూగము=మంత్రులసమూహము, సర్వగుణోపపన్నులు = ఎల్లసద్గుణములతోఁ గూడినవారు, సహభార్యుఁడు = భార్యలతోఁ

గూడినవాఁడు, ప్రవిషణ్ణరూపుఁడు=మిక్కిలి విషాదముతోఁగూడిన మనస్సుగల వాఁడై, వారి=నీళ్ళు, ప్రపింపన్ = కాఱఁగా.

తాత్పర్యము

రాజేంద్రా! పోవువారు శీఘ్రముగా మరలి రావలయునని కోరువారు పోవువారివెంట దూరముఁబోరాదు అని మంత్రులుచెప్పఁగా మంచిగుణములు గలవారు చెప్పిన హితవాక్యముఁవిని భార్యలతో మిక్కిలి విషాదపడుచు దేహముఁన జెమటలు కాఱుచుండ శ్రీరాముని జూచుచు నచ్చటనే దశరథుఁడు నిలుచుండెను.

—• ౪౧-వ సర్గము. శ్రీరామునకై యంతఃపురస్త్రీలు దుఃఖించుట. •—

కం॥ మ్రొక్కుచుఁ దల్లికిఁ దండ్రికి, నక్కరణిని రామచంద్రుఁ • డరిగిన నాపై
నొక్కమొగి నంతిపురమున, మిక్కుటమై యార్తరవముఁ•మింటికి నెగసెన్.

ప్రస్తుతము శ్రీరామప్రజల వృత్తాంతము చెప్పుటచాలించి యీలోపల నంతఃపురమున జరిగిన వృత్తాంతమును గవి చెప్పుచున్నాఁడు.

అక్కరణిని = ౧౦౬౩-౧౦౬౫ పద్యములలోఁ జెప్పినవిధముగా, ఒక్కమొగిన్=ఒక్కసారిగ, మింటికి = ఆకాశమునకు- దీనివలన నంతఃపురస్త్రీలలోఁ గౌసల్యాసుమిత్రా కైకేయులు వారి పరిచారికలు కొందఱుమాత్రమే రథము వెంట వీథులఁబడి వచ్చిరని మున్నాటయేఁబది ముద్దరాండ్రు రాజాజ్ఞలేమిని గాఁబోలు రారై రని తోఁచెడిని. తల్లికి ఏకవచనము వివక్షితము. తల్లులందఱకని యర్థము.

తాత్పర్యము

ముందుచెప్పినవిధముగ శ్రీరాముఁడండఱు తల్లులకుఁ దండ్రికి నమస్కరించి రథమెక్కి పయనమై పోఁగా నంతఃపురమున మిక్కిలి యధికమైన యేడుపుధ్వని యాకాశమున కెగసెను.

కం॥ గతి యెవ్వఁ డనాథులకున్,
గతి యెవ్వఁడు దుర్బలులకుఁ•గడుఁదపసులకున్
గతి యెవఁడు శరణ మెవఁ డా,పతి గతిచెడి యెచటి కేగు•వాఁడో యకటా.

అనాథులకున్=దిక్కులేని స్త్రీపురుషులకు, అనాథలు+అనాథులు=ద్వంద్వమున నేకశేషమునఁ బుంలింగ రూపము, దుర్బలులకు=బలముఁలేని స్త్రీపురుషులకు- ధనబలము-బంధుబలము దేహబలము లోలైనవి లేనివారికి.

తాత్పర్యము

దిక్కులేనివారికిని బలములేనివారికిని నెవఁడు పొందఁదగినవాఁడో తపస్సు చేసికొనువారికిఁ బ్రాపింపఁ దగినవాఁడు రక్షకుఁడు నెవఁడో యట్లందఱకు రక్షకుఁడు ప్రాప్యుఁడునైనవాఁడు ప్రాపురక్షకుఁడులేక యయ్యో యెక్కడఁ బోవుచున్నాఁడో.

సీ॥ తనమీఁద నెవరైనఁ దంట లాడిన నైనఁ, గోపంబు చెందఁడే కొమ్మలార!
యేమి చేసిన నది యెవరి నొప్పించునో, యని జంకుచుండునే యమ్మలార!
యెవ్వరేనియుఁ గింక నొవ్వంద వారల, నూఱట లాడునే యువిదలార!
పరసుఖదుఃఖముల్ స్వసుఖదుఃఖము లట్లు,పరికించు చుండునే తరుణులార!
తే॥ కన్నతల్లిని గౌసల్యఁ గన్నపగిది
మనల నందఱఁ జూచునే మగువలార!
యట్టిపుణ్యాత్ముఁ డటువంటి యనఘ చరితుఁ
డెచట నున్నాఁడొ కటకటా యెందుఁ జనునొ. ౧౧౨౯

తంటలు=కొండెములు, కింక=కోపముచే, నొవ్వ=నొప్పి.

తాత్పర్యము

తనమీఁద నెవరైనను గొండెములు చెప్పినను గోపింపఁడు. తానుజేయు కార్య మెవరిమనసునకైన నొప్పికలిగించునో యని సందేహించి యట్లెవరి మనసు నొవ్వని కార్యములే చేయుచుండును. తనమీఁద నెవరైనఁ గోపించి నొప్పిచెందినను వారలను సమాధానపఱుచును. ఇతరులసుఖము తనసుఖముగను ఇతరుల దుఃఖము తన దుఃఖముగను జూచుచుండును. కన్నతల్లిని గౌసల్య నేవిధముగఁ జూచునో యట్టులే మనలనందఱఁ జూచును. అటువంటి పుణ్యాత్ముఁడు అటువంటి నిర్దుష్ట చరిత్రుఁడు ఎందున్నాఁడో-యెందు బోవుచున్నాఁడో.

కం॥ నచ్చి తను డాయఁ గైకయు,
మచ్చరియై యేఁప విభుఁడు మతిచెడి విడిచెన్
సచ్చరితులోకరక్షకు, నెచ్చటఁ జనుచున్నవాఁడొ యెయ్యది గతియో. ౧౧౩౦

నచ్చి=నమ్మి, మచ్చరి=మచ్చరముకలది, ఏఁపన్=బాధింపఁగా.

తాత్పర్యము

భార్యగదాయని నమ్మి దగ్గఱకుఁబోఁగాఁ గైక శ్రీరామునిమీఁద మచ్చరము కలదై తన్ను బాధింపఁగా దానిబాధపడలేక మనస్సుచెడి మంచినడవడిగల లోక రక్షకుని రాజు వదలిపెట్టెను. అయ్యో శ్రీరాముఁ డెచ్చటఁ బోవుచున్నాఁడో. ఆయనగతి యేమో.

ఉ॥ ఎంతటిబుద్ధిహీనుఁడొ కదే ధరణీశుఁడు జాలి మాలి యే
కాంతము సత్యశీలుని జగజ్జనతాప్రియు ధర్మమూర్తి దు
ర్దాంతపరాక్రమాఢ్యుని నరణ్యములం బడఁ బంచె నంచు శు
ద్ధాంతనితంబినీజనము హా యని యేడ్చెను దుస్సహవ్యథన్. ౧౧౩౧

ఏకాంతము=మిక్కిలి, జగత్=లోకమునందలి, జనతా=జనసమూహము లకు, ప్రియున్=ప్రియుఁడైనవానిని, ధర్మమూర్తిన్=ఆకారముగొన్న ధర్మమును, దుర్దాంత = అణఁపరాని, పరాక్రమాఢ్యునిన్ = పరాక్రమ సంపత్తిగలవానిని, శుద్ధాంతనితంబినీజనము = అంతఃపుర స్త్రీసమూహములు, దుస్సహవ్యథన్ = సహింపరాని దుఃఖబాధచే-

తా త్ప ర్య ము

ఈరాజెంతబుద్ధిలేనివాఁడోకదా. అటుగాకున్నఁ గొంచెమైన దయలేక మిక్కిలి సత్యమాడుట స్వభావముగఁ గలవాఁడును, లోకములోని జనసమూహముల కందఱకుఁ బ్రియుఁడైనవాఁడును, ధర్మస్వరూపుఁడును, శత్రువులకు నణఁపరాని పరాక్రమసంపన్నుఁడును, నగు కొడుకును శ్రీరామచంద్రమూర్తిని నడవులపాలు చేయునా యని యంతఃపురస్త్రీలందఱు సహింపరాని దుఃఖబాధచే హా యని యేడ్చిరి.

కం॥ లేఁగలఁ బాసినయావులు,నాఁ గమలేక్షణలు బిగ్గ♦నాదున నార్తిన్
 గ్రాఁగఁగ మ్రోఁగుడు విని ధర,
 మ్రాఁగెన్ బ్రూఁగన్నుతోడ♦మనుజవిభుండున్. ౧౧౩౨

నాదు=ధ్వని, క్రాఁగఁగన్=తపింపఁగా, మ్రోఁగుడు=ధ్వని, మ్రాఁగెన్=సోలెను, ప్రూఁగన్నుతోడన్=మూఁతలుపడుచున్న కన్నులతో-

తా త్ప ర్య ము

లేఁతదూడలను విడిచిన యావులవలె నాస్త్రీలందఱు గట్టిగా నేడ్వఁగా శోకముచేఁ దపించుచు నాధ్వని విని రాజు బ్రూఁగన్నుతోడ మూర్ఛపోయెను.

సీ॥ వండరు గృహమేధు♦లిండులలోపల, వేల్వరగ్నులలోన♦విబుధు లెవరు
 మనుజుఁడొక్కండైనఁ♦బనికిఁబోనొల్లఁడు,
 మార్తాండబింబంబు♦మఱుఁగుపడియెఁ
 గరులు దిండి తొఱఁగి♦కన్నీరు గార్చెను, నాలు లేఁగలఁ జన్ను♦లంట నీవు
 తొలిచూలు మగబిడ్డ♦గలిగియు జనయిత్రి, యానంద మంద దా♦వంత యైన
తే॥ దారుణంబుగ గురుబుధాం♦గారకులఁ ద్రి,
 శంకువును నాక్రమించి రే♦ఱాంకు, వీత
 కాంతిఁ జుక్కలు గ్రహములు♦గ్రాలధూమ,
 యుక్తమయ్యెవిశాఖయు♦వ్యోమవీథి. ౧౧౩౩

గృహమేధులు=గృహస్థులు, విబుధులు=పండితులు, వేల్వరు=హోమము చేయరు, మార్తాండబింబంబు=సూర్యబింబము, మఱుఁగుపడియెన్ = కానరాకపోయెను, కరులు=ఏనుఁగులు, వ్యోమవీథిన్=ఆకాశమందు.

తా త్ప ర్య ము

గృహములందు స్త్రీలు పురుషులు దుఃఖించుచుఁబడియుండిన కారణమున స్త్రీలు వంటచేసినవారు కారు- పురుషులు వంట యయినదా యని యడిగినవారు గారు. నిత్యాగ్నిహోత్రులయిన పండితులుకూడ దుఃఖాతిశయముచేఁ గర్తవ్యతామూఢులై హోమము చేయఁబూనినవారు కారు. అగ్నులును జల్లారియుండెను. ఒక మనుష్యుఁడైన నాఁడు విధిగాఁజేయవలసిన కార్యమైనను జేయఁబో నిచ్ఛగింపఁడు. ప్రొద్దుగ్రుంకువేళ గాకపోయినను దనవంశమునఁ బుట్టిన భగవదవ

తారమూర్తికే యిట్టి కష్టదశ వచ్చెఁగదా దీని నేనేమని చూతునని సూర్యుఁడు కానరాకపోయెను. ఏనుఁగులు తిండివదలి కన్నీరు గార్చుచుండెను. ఆవులు తమ దూడలు పాలుత్రాగవచ్చినను ద్రావనీయక తన్నెను. తొలిచూలు మగబిడ్డను గనియు నా తల్లి అయ్యో శ్రీరాముఁడే నా పెద్దకొడుకని తొడమీఁదఁబెట్టుకొని శైశవంబున లాలించి ముద్దాడుచుంటినే. అట్టివాఁడే యిట్లాయెనే ఇఁక వీఁడా నన్నుద్ధరించువాఁడు. కౌసల్య యెన్నెన్నో తపసులు ధారవోసి లేకలేక కాంచి యెంతో హెచ్చరికగాఁ బెంచిన పెద్దబిడ్డఁడే యిట్లయ్యెనే యిఁక నల్పవ్రతములు చేసియో అవియుఁ జేయకయో కన్న యీ కొడుకు గతియేమోయని తల్లికొంచెమైన సంతోషించినదికాదు.

గురువు, బుధుఁడు, అంగారకుఁడు అను గ్రహములు క్రూరముగ నిక్ష్వాకు వంశమువారి కూటస్థపురుషుఁడగు త్రిశంకువును జంద్రుని నాక్రమించిరి. గురువు, బుధుఁడు స్వయముగఁ గ్రూరగ్రహములు గాకున్నను గ్రూరగ్రహమైన యంగారకునితోఁ జేరుటచేతనో వేఱొక క్రూరస్థానమునకు వచ్చుటచేతనో వారును గ్రూరులైరి.

“పూర్ణే చతుర్దశేవర్షే పంచమ్యాం భరతాగ్రజ” అని పదునాలుగు వర్షములు పూర్తికాఁగాఁ బదునైదవ సంవత్సరపు మొదటిదినమైన పంచమియందు శ్రీరాముఁడు భరద్వాజాశ్రమముఁ జేరెను. కావున శ్రీరాముని ప్రయాణదినము పంచమియైయుండవలెను.

ఈనాఁడు పుష్య నక్షత్రము కావునఁ జంద్రుఁడు కర్కటరాశియందుండును. బుధుఁ డెప్పుడు సూర్యుని సమీపముననుండు కావున నేఁడతనికిఁ జంద్ర సంబంధము కలుగదు. అట్లుండ బుధచంద్ర సంబంధము చెప్పుట తప్పని పూర్వపక్షము. చంద్రునియెదుట యనఁగాఁ జంద్రునితో నేకరాశియందుండుట యని మాత్రముగాదు. అతని వీక్షణము చాలునుఁ కావునఁ జంద్రవీక్షణమును బట్టి చంద్ర సంబంధము చెప్పఁబడెను. ఆ కారణముచేతనే గురు బుధులతోఁ గలిపి చెప్పక ప్రత్యేకముగాఁ జెప్పఁబడెను అని సిద్ధాంతము. వక్రగతిగాఁ జంద్ర సంబంధమని కొందఱు చెప్పుదురు. కాంతిహీనములై యశ్విన్యాది నక్షత్రములు–సూర్యాది గ్రహములుండఁగా విశాఖానక్షత్రము ధూమకేతువుతోఁ గూడినదయ్యెను. సూర్యుఁడు విశాఖానక్షత్రమున జన్మించెను. శ్రీరాముని వంశము సూర్యవంశము. ఇక్ష్వాకుల కులతార విశాఖ. దీనికి ధూమకేతువు క్రమ్ముట రాఁగల దశరథుని మరణము సూచించెను. ఒక మహాత్ముని దుఃఖమునకు లోకమంతయు దుఃఖించును.

త్రిశంకువిషయమై విశాఖవిషయమై శ్రీరాముఁ డిట్లు లక్ష్మణునితోఁ జెప్పెను.

"త్రిశంకుర్విమలోభాతి రాజర్షి స్సపురోహితః
పితామహవరోస్మాక, మిక్ష్వాకూణాంమహాత్మనామ్
విమలేచ ప్రకాశేతే విశాఖేనిరుపప్లవే
నక్షత్రపరమస్మాక, మిక్ష్వాకూణాం మహాత్మనామ్.

"మనకుఁ బితామహుండు నిర్మలనృపర్షి" యు-౪. స.

సహపురోహితుఁడగుఁ త్రిశంకుఁడదిగొ మింట వెలుఁగుచున్నాఁడు మేలిరుచుల॥ యుద్ధ ౮౦.

కం॥ మనయిక్ష్వాకులతారకఁ గనుము విశాఖను, వెలింగెఁగడు విశదంబై తనరి నిరుపద్రవంబుగ. యుద్ధ. ౮౯.

తే॥ కాళికానిలరయమునఁ • గడలి కళవళించుచందమునఁ బుర మెల్ల • సంచలించె
నిరులు గప్పెను దిక్కుల • నెల్లఁజుక్క, యైన గ్రహమైన నెల్గద • యంబరమున.

కాళికా=మేఘపంక్తితోఁగూడిన, అనిల=వాయువుయొక్క, రయమునన్=వేగముచే, కడలి=సముద్రము, కళవళించు చందమునన్=కలఁతపడునట్లు, ఇరులు=చీఁకట్లు- ఇది నిత్యబహువచనాంతము, అంబరమునన్=ఆకాశమందు.

తాత్పర్యము

మేఘపంక్తులతోఁగూడిన గాలియొక్క వేగముచే సముద్రము క్షోభించు విధముగాఁ బట్టణమెల్లను సంచలించెను. దిక్కులయందుఁ జీఁకట్లు క్రమ్మెను- ఆకాశమున నక్షత్రమైనను గ్రహమైనను బ్రకాశింపలేదు.

కం॥ దారుణదైన్యము పేర్మి వి, హారాహారములయందు • నానగరమునన్
బూరుషులు సతులు నొకరేన్, గూరుపరు మనంబునందుఁ • గోరిక యైనన్. ౧౧౩౫

దారుణదైన్యము పేర్మిన్=భయంకరమైన దుఃఖముయొక్క యతిశయముచే, విహారాహారములయందున్=సంచారమందును భోజనమందును-

తాత్పర్యము

తీవ్రమైన దుఃఖాతిశయముచేత నా పట్టనమందు నాఁడు వారియందుఁ గాని, మగవారియందుఁగాని యొక్కరైన నాసమయమందు వేడుకగాఁ దిరుగుటయందుఁగాని భోజనమందుఁగాని కోరికగలవారు లేకుండిరి.

తే॥ వేఁడినిట్టూర్పులూర్చుచుఁ • బోఁడిమిచెడి,
వ్యసననంతప్తమైయయో • ధ్యాజనంబు
కాటువేసిన నెత్తురన్ • మాట లేని, వదనములఁ బల్లటిల్లెను • ముదముఁ బాసి.

నిట్టూర్పులు=నిడివిశ్వాసములు, నిడు+ఉర్పు=నిట్టూర్పు- కుఱు- చిఱు- కడు- నడు- నిడు శబ్దంబుల ఱడల కచ్చుపరమైనపుడు ద్విరుక్తటకారంబగు-

సు. వ్యా. సంధి ౩౮ సూ. ఊర్చుచున్ = విడుచుచు, వదనములన్=ముఖము లతో, పల్లటిల్లెన్=తెల్లఁబోయెను.

తాత్పర్యము

వేఁడియు నిడివియునగు శ్వాసములు పుచ్చుచు నందముచెడి వ్యసనముచే మిగుల సంతాపపడి యయోధ్యయందలి జనులు గత్తితోఁ గోఁచినను నెత్తురను మాట లేని ముఖములతో సంతోషముచెడి తెల్లఁబోయిరి.

కం॥ వీవఁడు వాయువు చల్లగఁ, బావకుఁడుం జల్లపడియె • భానుఁడు తాపా
భావత నొప్పెను శశియు, న్నావిరి నిజసౌమ్యదర్శ•నత్వము మానెన్.

తాపాభావతన్ = తాపములేమిచే, సౌమ్యదర్శనత్వము=ప్రసన్నుఁడై కాన వచ్చుటను, మానెన్=వదలెను.

తాత్పర్యము

వాయువు చల్లగ వీవలేదు- అగ్నియుఁ జల్లనయ్యెను- సూర్యుఁడు వేఁడిమి లేనివాఁడాయెను- చంద్రుఁడు ప్రసన్నుఁడై యుండుట మానెను.

ఇదంతయుఁ బురజనుల దుఃఖాతిశయమును దెలుపును.

ఉ॥ పాలకు నేడ్వఁ డెవ్వఁడును•బాలుఁడు తల్లిని జూచి, తల్లులున్
బాలురఁ దమ్ము లన్నలును•భార్యలు భర్తలఁ జుట్టపక్కముల్
చాలఁగ రామునంద తమ•స్వాంతము నిల్పి యొక ళ్ళొకళ్ళలన్
దూలుచుఁ బాసి పోయి రెటొ•దుస్సహశోకభరంబు ప్రేఁకనన్. ౧౧౩౮

చుట్టపక్కములు=చుట్టము + పక్కము=చుట్టపక్కము:లు- ద్వంద్వ సమా సంబునఁ బదంబుకంటెఁ బరంబయిన పరుషములకు గసడదవలు ప్రాయికం బుగనగు- సు. వ్యా. సంధి ౪౦ సూ. ప్రాయికమనుటచే నిందు ‘పకారమునకు వకారము రాలేదు. స్వాంతము=మనస్సు, ప్రేఁకనన్=భారముచే.

తాత్పర్యము

అంత పట్టనమం దొక పసిబాలుఁడైనను దల్లిని జూచి పాలకై యేడ్వఁడు- తల్లులను బిడ్డలు- బిడ్డలను దల్లులు తమ్ములన్నలను అన్నలు తమ్ములను భార్యలు భర్తలను, భర్తలు భార్యలను నొకరినొకరు విడిచి సహింపరాని శోక భారముచేఁ దమ దేహములు మఱచి తా మెక్కడికిఁ బోవునది తమకే తెలియక మనస్సులు శ్రీరామునందుంచి యెందెందో పోయిరి.

తన యొంటికొడుకు శ్రీరామునివంటివాఁడు అడవికిఁబోవుచుండఁ దల్లి యుపేక్షించెఁగాని యేమి సాహాయ్యము చేయఁగలిగెను. తల్లులందఱు నిట్టివారే కదా యని కొడుకులు తల్లుల నుపేక్షించిరి. దీర్ఘకాలము నోమరాని నోములన్ని నోఁచి తపస్సులు ధారవోసి కానక కానక యొక్కకుమారునిఁగాంచి వీఁడు మన

కిహపరములకు ధారకుఁడుగానుండునని యెంతో యాశయుంచుకొనిన తల్లిని శ్రీరాముఁడు విడిచిపోయెను. ఇఁక నే కొడుకు తల్లిని రక్షించును. కొడుకుల నమ్మిన నీగతియేకదా యని తల్లులు బిడ్డల నుపేక్షించిరి. భార్యలనఁగా నెప్పుడును తమ సుఖము చూచుకొని దానికై కైకవలె భర్త నెట్టికష్టములపాలైనఁ జేయువారేకదా వీరి నమ్మిన నేమి ప్రయోజనమని భర్తలు భార్యల నుపేక్షించిరి. పెద్దభార్య కౌసల్య నుపేక్షించి యామె కుమారుని నడవికిఁబంపిన దశరథునిఁజూచి భర్తలనఁగా సమయము వచ్చినపు డెంత గుణవతియైనను వదలువారేకదా యని భార్యలు భర్తల నుపేక్షించిరి. పుట్టఁగా భ్రాతలు- పెరుఁగఁగా జ్ఞాతులన్నట్లు భరతుఁడు కదా శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవుటకు హేతువయ్యెను. కానఁ దోడఁబుట్టువులందఱుఁ దమ యన్నలకుఁ దమ మేలునకై ద్రోహముచేయువారే యని యన్నలు తమ్ముల నుపేక్షించిరి. ముఖ్యులగువారే యిట్లయిన నిఁకఁ జుట్టములు పక్కములా మనలను రక్షించువారు. వీరు మనము పెట్టినఁ దినిపోవువారేయని బంధువు లొకరినొక రుపేక్షించిరి. వీరందఱు నమ్మరానివారే శ్రీరాముఁడొక్కఁడే తల్లియైనను-దండ్రియైనను-అన్నయైనను-దమ్ముఁడైనను-భర్తయైనను-బంధువైనను అని మనస్సంతయు నాయనపై నుంచిరి. దీనివలన సోపాధికబంధువులందఱు నక్కఱ లవసరముల నాదుకొనువారు కారు. కావునఁ ద్యాజ్యులనియు నిరుపాధిక బాంధవుఁడు శ్రీరాముఁడే యెందున్నను విశ్వసింపఁదగినవాఁడనియు నెప్పుచున్నది.

౨-వ పాదంబున నుభయయతి.

ఉ॥ రామునిమిత్రు లందఱు భరం బగుశోకముపేర్మి దిగ్భ్రమన్
ధామములంద ఱేలుచును దద్దయు మానరు సెజ్జ లడ్డు, సు
త్రామునకు న్వణంకుసధరాధరధారిణినా నయోధ్య శ్రీ
రాముఁడు లేమిచే వడఁకెఁ గ్రాలినభీతియు నార్తిముంపఁగన్. ౧౧౩౯

ఱేలుచున్=ఏడ్చుచు, సుత్రామునకున్=ఇంద్రునకు, సధరాధరధారిణి= పర్వతములతోడి భూమిని.

తాత్పర్యము

బాంధవులందఱు నమ్మరానివారేయగుదురు గాక ప్రాణపదములుగానుండు మిత్రులేల శ్రీరాముని నిలుపరైరి యనుటకు సమాధానమును గవి చెప్పుచున్నాఁడు. శ్రీరాముని మిత్రులందఱు భారమైన శోకాతిశయముచే దిక్కుతెలియక యిండ్లయందే యేడ్చుచుఁ బండుకొనియుండిరి. బంధువులందఱు దేహములమీఁద స్మృతియైనఁ గలవారై సంచరించుచుండిరి గాని వీరికి దేహస్మృతియు లేదాయెను. నిలుచుటకుఁ గూర్చుండుటకుఁగూడ శక్తిచాలక పడిపోయిరి. దీనివలన వారి దుఃఖాతిశయము తెలియనగు.

శ్రీరాముఁడు తన తల్లిదండ్రులకును దెలుపని రహస్యముల నెవరికిఁ జెప్పునో యట్టి స్నేహితులు వీరు తమ ప్రాణమైనను వదలి శ్రీరాము రక్షించువారు. అందఱున్=అందఱు నిట్టివారే కాని దీనికి వ్యతిరేకముగా నడచువాఁడొక్కఁడైన లేఁడు. అందఱు నొక్కవిధమువారు. చక్రవర్తి సర్వస్వతంత్రుఁడగు తండ్రి యడవికిఁ బో నాయనా యని పంపెను. తల్లియగు కౌసల్య యడవికిఁ బోయి నపుడచట నేమి కీడు మూఁడునో యని దీవించి పంపెను. ఈ మిత్రులు వారివంటివారు కారు. శ్రీరాముఁ డడవికిఁబోవునన్న వార్త వినఁగానే మూర్ఛిల్లి పడిపోయిరి. మరల లేచినవారు కారు. కావున వీరు కౌసల్యా దశరథులకంటె శ్రీరామునియెడల మిగులఁ బ్రీతిగలవారని భావము.

అంతటి ప్రేమఁగలవారైనచో శ్రీరాముని కాళ్లు పట్టుకొనియైన రామా యడవికిఁ బోకుమా యని నేల మరల్పరైరి యనిన దుఃఖాతిశయముయొక్క భారముచే దిక్కు తెలియక పిడుగడిచినవారివలె నేమియుఁ దోఁపకయుండుటచే నింటియందే యేడ్చుచుండిరి.అపుడు=అట్టి పరవశస్థితిలో పడుకపెట్టినవారు కావున మరల లేవవలె శ్రీరామున కడ్డముపోవలెనని వారికిఁ దోఁచినదికాదు. బుద్ధి చక్కని స్థితిలోనుండినఁ గదా శ్రీరామునకై పోవుట వేఁడుట పిలుచుకొని వచ్చుట వీరో దిగ్భ్రమచే నేమిచేయుటకు నాలోచింపలేని స్థితిలోనున్నవారు. ఇట్టి స్థితిలో వారేమి చేయఁగలరు.కొండంత బరువు వ్యసనముమీఁదఁ బడుటయే దీనికిఁ గారణము. కొండ తటాలున మీఁదఁబడిన లేచుటయుండునా. బుద్ధి పూర్వకముగాఁ బండుకొన్నవారు లేతురుగాని మతిచెడి పడినవా రెట్లు లేతురు? కావున వీరు శ్రీరామునిఁ బ్రార్థింపనులేదు. ఆయన వెంటఁబోవను లేదు. కొండల రెక్కలు ఖండింప వజ్రమెత్తిన యింద్రునకుఁ గొండలతోడి భూమి వణఁకినట్లు శ్రీరాముఁడు లేమిచే నయోధ్యయు భీతిచేతను వ్యసనముచేతను వణఁకెను.

—• ౪౨-వ సర్గము. దశరథుఁడు మరలి తనగృహమునకుఁ బోవుట •—

ఉ॥ రామరథోత్థితం బగుప•రాగము దోఁచెమనంతదాఁక నా
భూమివిభుండు పుత్రకుని•బోయినవంకను జెప్ప వ్రాల్పఁ, డా
భూమిపరాగమున్ సుతుని•బోవుట భూపతి చూచునంతకున్
స్తోమముగాఁగ రేఁగెఁ బతి•స్రుక్కక యుండెడిగాక యంచునో. ౧౧౪౦

రామరథోత్థింబగు=శ్రీరాముని రథముపోవుటవలన లేచిన, పరాగము=దుమ్ము, స్తోమము=సమూహము.

తాత్పర్యము

శ్రీరాముని రథము పోవు వేగమున లేచిన దుమ్ము కానవచ్చువఱకు దశరథుఁడు కొడుకు పోయిన ప్రక్క చూచుచు జెప్పవ్రాల్పకయుండెను. కొడుకు పోవుట రాజు చూచుచుండువఱకు దుమ్ము విశేషముగా లేఁగుచుండెను.

శ్రీరాముఁడు కానరాకపోయిన పక్షమున దశరథుఁడు దుఃఖముమాని యింటికిఁ బోవునను తలంపుచేతనో యేమో దుమ్మట్లు రేఁగెను.

ఉ॥ ధూళియు మాయ మైన ధృతి•దూలి ధరం బడి యున్న యల్లభూ
పాలకు రాముతల్లి కుడి•ప్రక్కను గైకయి వామభాగమం
దోలిన పట్టి యెత్తుటయు•నొయ్యనఁ దెప్పిఱి లేచి భూధవుం
డాలరికైకఁగాంచి యిటు•లాడె మనం బెరియన్ వ్యథాగ్నులన్. ౧౧౪౧

మాయమైనన్=కానరాకపోఁగా, ధృతిదూలి=ధైర్యముచెడి, ఆలరి=దుష్టురాలు, వ్యథాగ్నులన్=వ్యసనమనెడు నిప్పులచే, ఎరియన్ = కాలఁగా.

తాత్పర్యము

రథము చూపుమేరదాఁటి చాలదూరము పోవుటచే దుమ్ముకూడఁ గానరాకపోఁగా ధైర్యముచెడి దిటముదప్పి రాజు నేలఁబడఁగాఁ గౌసల్య కుడిప్రక్కను, గైకేయి యెడమప్రక్కను బాగుగఁబట్టి లేవనెత్తఁగా మెల్లనఁదెప్పిఱిల్లి లేచి దుర్మార్గురాలగు కైకనుజూచి శోకాగ్నిచే మనసు కాలిపోవుచుండ రాజిట్లనెను.

ఉ॥ అంటకు మింక నన్ను దురి•తాత్మిక! పొమ్మటు, నీదుమోమునున్
గంట కసహ్య మయ్యెడిని•గా వికఁ బాంధవి, భార్య గావు, నీ
యుంట సహింప నోప, విను•ముర్విని నీయసు వుండుదాఁక ని
న్నంటినవారు నా కహితు•లట్టులె నేనును వారి కిం కిటన్. ౧౧౪౨

దురితాత్మిక=పాపపు మనస్సుగలదానా, పొమ్మటు=అటు దూరముపొమ్ము.

తాత్పర్యము

ఓసి పాపాత్మురాలా! నన్నుఁ దాఁకకుము-దూరముగాఁబొమ్ము. నీముఖము చూచుటయే యసహ్యముగానున్నది. ఇఁక నీవు తాఁకిన నెట్లు సహింపఁగలను. నేను సైరింపను. నీవు చచ్చుటయే నాకు సంతోషకరము. ఈ భూమిమీఁద నీప్రాణ మెంతవఱకుండునో యంతవఱకు నీవేకాక నీకుఁ గావలసినవారందఱు కూడ నాకు శత్రువులే. నావారందఱు నీకు నట్టివారే.

ఆ॥ కేవలార్థపరవు•క్లిష్టధర్మవు నీవు, గాన నగ్నిసాక్షి•కముగఁ గొనిన
తావకీనకరముఁ•దద్దయు విడిచితి, నిందు నూర్ధ్వలోక•మందుఁ గూడ.

కేవలార్థపరవు = ధనమునందు మాత్రమే నీ వాసక్తిగలదానవు, క్లిష్టధర్మవు=నాశముచేయఁబడిన ధర్మముగలదానవు, తావకీనకరము=నీచేయి.

తాత్పర్యము

నీవు ధర్మము నాశముచేసియైన యర్థమే సాధింపవలయునను తలంపుగలదానవు-నీకు ధర్మముతోఁ బనిలేదు, గావున నగ్నిహోత్రుఁడు సాక్షిగా వివాహకాలమున నేను గ్రహించిన నీచేతిని నీలోకమందుఁ బరలోకమందుఁగూడఁ బూర్ణ

ముగ విడిచితిని. ఈలోకమందు నీక నా భార్య వెట్లు గావో పరలోకమందు నాతోడి సాలోక్యము నీకు లేకపోవునుగాక. (౧౮౪౦ పద్యము చూడుఁడు.)

కం॥ భరతుం డీరాజ్యముఁ గొని మురియుట కలిగినను వాఁడు•మొగిని నివాపా
చరణం బొనరుపఁ దండ్రికిఁ,బరగతి నవి నాకుఁ గాక•పరఁగుత మనుచున్.

ఇట్లు కైకతోడి భార్యా భర్తృ సంబంధమును రెండులోకములందును దెగఁదీసి కైకయికిఁ బుట్టిన కారణముచే భరతుని పుత్రత్వ సంబంధము దెగఁ దీయుచున్నాఁడు. అంకుటాలితోడి భార్యా సంబంధము ఘటశ్రాద్ధముతో ముగియును. అంకుటాలి కొడుకు తన కొడుకుగాఁడు. అట్లే కైక సంబంధము దాని కొడుకు సంబంధమును వదలించుకొనుచున్నాఁడు.

నివాపాచరణంబు=తిలోదకతర్పణము.

తాత్పర్యము

భరతుఁ డీ రాజ్యము గ్రహించి సంతోషింపఁ గలిగెనా వాఁడు నాకుఁ బుట్టినవాఁడు కాఁడు. తండ్రితో ద్వేషించువాఁడు అన్యరేతస్సునకుఁ బుట్టిన వాఁడు. కావున వాఁడు నాకుఁ బుత్రుఁడు కాఁడు. కావున వాఁడు అస్మత్పితరమ్మని విడుచు నివాపములు తిలోదకములు పరలోకమున నాకుఁ జెందకయుండునుగాక. నాకు వాఁడు పుట్టియుండెనా యీ రాజ్యమును వాఁడంగీకరింపఁడు.

ఉ॥ ధూళిని బ్రుంగియున్నపతిఁ•దోయజలోచన రాముమాత దాఁ
గాలుప గట్టునశ్రువులఁ•గన్నులు మూఁత పడంగఁ బాముకొం
చోలిని దోడుకొం చరిగె•నుర్వరభర్త సుతుం దలంచి తాఁ
గేలను నిప్పు నంటినటు•కీర్తితు బ్రాహ్మణుఁ జంపినట్లులై. ౧౧౪౨

అని యిట్లు చెప్పుటచేఁ గైకేయి దూరముగఁ దొలఁగిపోయెను.

బ్రుంగి = మునిఁగి, ఉర్వరభర్త = భూమిభర్త- ఇది సాధ్యసమానము గావున దీర్ఘము రాలేదు- ఇందు రెండును దత్సమశబ్దములే- కౌసల్యయొక్కతెయె రాజును బట్టుకొనె ననుటచే రాణులున్న కారణమునఁ బురుషులెవ్వరు సమీపింపరైరని తోఁచెడిని- పరిచారికలుండినను వారు దాఁకుటకై ధైర్యము చాలదు.

తాత్పర్యము

దుమ్ములోఁబడి మునిఁగియున్న భర్తను శ్రీరాముని తల్లి కౌసల్య కన్నీళ్ళు కాలువలై పాఱుచుండుటచేఁ గన్నులు మూఁతలు పడుచుండినను నెట్లెట్లో పట్టుకొని మెల్లగాఁ బిలుచుకొనిపోయెను. రాజు తన కొడుకును దలఁచి తానై నిప్పును జేతితోఁ దాఁకి యది కాల్పఁగా బాధపడునట్లు కీర్తిమంతుఁడైన బ్రాహ్మణుఁ జంపి బ్రహ్మహత్యచేఁ దేజురూపుమాసి వికారస్వరూపుఁడైనట్లు.

ఆ॥ సొక్కి మరలి మరలి • చూచుఁ దే రరిగిన, జాడ గ్రస్తుఁ డైన • సవితృనట్లు
మాఱుపడఁగ రూపు • మఱి మఱిపలవించుఁ, బుత్రుఁగవనుదాఁటి • పోక యెఱిఁగి.

సొక్కన్=మూర్ఛపోవును, గ్రస్తుఁడైన=రాహువుచే మ్రింగఁబడిన, సవితృనట్లు = సూర్యునివలె- షష్ఠీసమాసంబులం దుకారఋకారముల కచ్చుపరమగు నపుడు నుగాగమంబగు. సు. వ్యా. సంధి ౪౬.

తాత్పర్యము

మూర్ఛపోవును- లేచును- తేరుపోయిన దిక్కు మరలి మరలి చూచును. రాహువు మ్రింగిన సూర్యునివలె రూపు మాఱుపడఁగ కొడుకు గవను దాఁటి పోయెనని విని మీఁద మీఁద నేడ్చును.

కం॥ కొడుకును గొని పఱచెడిత, త్తడిమిన్నలయడుగు లివిగొ • ధరఁ గనఁబడెడిన్
కొడు కేకనరాఁడే యెటు, మిడుకుదునో సుకృతిఁ బాసి • మేదినిమీఁదన్.

తత్తడి=గుఱ్ఱము, మిన్న=శ్రేష్ఠము- మణిశబ్దభవము మిన్న ఉత్తమములైన గుఱ్ఱములయొక్క, సుకృతిన్=పుణ్యాత్ముని, మిడుకుదునో=దుఃఖితునో.

తాత్పర్యము

కొడుకును మోసికొనిపోవు నుత్తమాశ్వముల యడుగుల గుఱుతు లవిగోఁ గానవచ్చుచున్నవి కాని కొడుకే కానరాకయున్నాఁడు. అటువంటి పుణ్యాత్ముని విడిచి భూమిపై నెటులు దుఃఖించుచు బ్రదుకుదును.

ఉ॥ హాయి నలంది గంధము మ • హార్హులు చేడెలు వీచు చుండ భ
వ్యాయతతల్పమందు సుఖి • యై నిదురించెడి నాతనూభవుం
డేయెడ వృక్షమూలమున • నేగతిఁ దా దెసమాలి కట్టియో
చేయియొ ఱాయొ దిండుగను • జేసి ధరం బడి యుండు వాఁ డొకో. ౧౧౪౮

అలంది=పూసికొని, మహార్హులు=యోగ్యురాండ్రు, భవ్యాయతతల్పమందున్=సుఖకరమై నిడివియైన పానుపునందు, దెసమాలి=దిక్కులేక.

తాత్పర్యము

చందనమును సుఖముగాఁ బూసికొని యుత్తమస్త్రీలు వింజామరలు వీచుచుండ సుఖకరమై నిడివియైన పానుపునందు సుఖముగా నిద్రపోవు నాకొడుకేస్థలమునందు నే చెట్టుమొదల నేవిధముగా దిక్కులేనివాఁడై, కట్టెతుండో చేయియో ఱాయియో దిండుగానుంచుకొని నేలఁబడియుండువాఁడో.

తే॥ వందిమాగధనుతులను • వాద్యములను
మేలుకొనువాఁడు కృపణుఁ డై • ధూళి దులుపు
కొనుచుఁ బ్రస్రవణాంతిక • కూటములను
లేచును వశాళి యూథపు • లీల సుతుఁడు. ౧౧౪౯

సుతులను=పొగడ్తలచే, వాద్యములను=మంగళ వాద్యధ్వనులను, కృపణుఁడై=దీనుఁడై, ప్రస్రవణాంతికకూటములను = కొండవంకల సమీపప్రదేశములందు, వనాళిన్=వనముల వరుసలయందు, యూథపులీలన్=గజనాయకునివలె.

తాత్పర్యము

స్తోత్రపాఠకులయు వంశపరంపరలఁ బొగడువారలయు స్తోత్రములచేతను, మంగళధ్వనులచేతను నిద్రమేలుకొనువాఁడు దీనుఁడై దుమ్ము దులుపుకొనుచు సెలయేళ్ళ సమీపప్రదేశములందు వనములందు గజసమూహనాయకునివలె నాకొడుకు లేచునుగదా.

ఆ॥ త్రిజగములకు విభుఁడు • దీర్ఘబాహుఁడు పట్టి, దిక్కు లేనివాని • తెరువు దోఁప
నడవిఁ బడుచుఁ బోవ • నటవీచరుల్ జనుల్, గన్నులారఁ గాంచ • నున్నవారు.

త్రిజగములకు=మూఁడు లోకములకు, విభుఁడు=ప్రభువు, దీర్ఘబాహుఁడు=నిడివియైన చేతులు గలవాఁడు, పట్టి=నా బిడ్డఁడు, తెరువు = మార్గము, అటవీచరుల్ = అడవియందుఁ దిరుగువారు.

తాత్పర్యము

మూఁడు లోకములకుఁ బ్రభువై యాజానుబాహుఁడై చక్రవర్తియగు నా కొడుకు దిక్కులేనివానివలె నడవులంబడి పోవుచుండ నడవిలోఁదిరుగుఁ చెంచులు బోయలు- యెఱుకులు లోనగువారు కన్నులపండువుగఁ జూడఁగలరు.

చం॥ వల దన మాన దయ్యె జన • వందిత యౌజనకేంద్రుకూఁతు, రా
కలికి సదా సుఖోచిత స • కంటకభూములఁ బోవు చుండు, న
చ్చెలువ యరణ్య మే మెఱుఁగుఁ • జేడ్పడి భీతిని శ్వాపదాళికూఁ
తలకుఁ దలంకుఁ బెన్గలఁకఁ • దత్తఱ మందు గభీరహుంకృతిన్. ౧౧౫౧

కలికి=సుందరి, సదా = ఎల్లప్పుడు, సుఖోచిత=సుఖింప యోగ్యురాలు, సకంటకభూములన్=ముండ్లతోఁగూడిన నేలలందు, చెలువు+అ=చెలువ=సౌందర్యము గలది, చేడ్పడి = దిగాల్పడి, శ్వాపదాళి = హింసించు స్వభావముగల, పులులు సింహములతో తోడేళ్ళు మొదలయినవాని సమూహములయొక్క, తలంకున్=బెదరును, గభీరహుంకృతిన్=గంభీరమైన హుమ్మను ధ్వనిచే.

తాత్పర్యము

పోవలదమ్మా పోవలదనిన వినదయ్యెను. జనులచేఁ బొగడ్తకన్న జనకరాజు కూఁతురు అట్టి సుందరి యెప్పుడు సుఖింప యోగ్యురాలు- ముండ్లనేలలోఁ బోవుచుండును గదా. ఆ రూపవతి యడవియనిన నెట్లుండునో యేమి యెఱుఁగును. మాంసము దిను క్రూరమృగముల కూఁతలకు భయముచే దిగాల్పడి బెదరునుగదా.

కం॥ ఓవిధవా! రాజ్యంబును, నీవే తలఁ గొట్టుకొమ్ము • నీయిష్టము మై
నావనజనేత్రుఁ బాయుట, జీవింపఁగ నొల్ల గడియ•సేపును గైకా. ౧౧౫౨

కైకను సంబోధించుటచేఁ గైక యింకను దశరథు సమీపమందేయున్నదని యూహింపవలయును. లేదా స్మరణమనియైనఁ దలంపవచ్చును.

తాత్పర్యము

ఓసి విధవా! నీ యిష్టప్రకారము రాజ్యము నీవే తలకుఁగట్టుకొని యూరేగుము. కమలమువంటి ముఖము కన్నులుగల నా రామచంద్రు నెడఁబాయుటచే నింక నొకగడియయైనను నేను బ్రదికియుండ నిష్టపడను. కావున నన్నుఁ జచ్చినవానిఁగా నిశ్చయించుకొమ్ము.

కం॥ అని పలవించుచు జనపతి, జనసంఘము వెంట రాఁగఁ•జనియె నరిష్టం
బు నగుపురంబునకును దా,వనట మృతస్నాతుఁబోలి•వస పఱి మఱియున్.

పలవించుచున్=ఏడ్చుచు, అరిష్టంబు=అశుభము, వనటన్=శోకముతో, మృతస్నాతున్=చచ్చినవారికై స్నానముచేసి వచ్చువారివలె, వసమఱి=వశము చెడి.

శ్రీరాముని వెంబడిపోయి యాయనను సాగనంపి తిరిగి తనపురముఁ బ్రవేశించువానిని మృతస్నాతుఁడని చెప్పుట యశ్లీలము- అమంగళము కదా యని యాక్షేపము. రాజదృష్టి ననుసరించి యిది దోషముగాదు. ౧౧౫౧-వ పద్యమందుఁ జేడ్పడి భీకనిశ్వాపదాళి కూఁతలకుఁ దలంకు పెన్గలఁకఁ దత్తఱమందుసని యరణ్యమున సీత కేదో కీడుకలుగుట సత్యమని దశరథుఁడు నిశ్చయించుకొనెను. ఆ కారణమున శ్రీరామునకు విపత్తు రాఁగలదు. ఆ మూలమునఁ దనకుఁ గీడు కలుగుట సత్యమని యాయన యభిప్రాయము. కావుననే కైకను విధవాయని సంబోధించి రాజ్యంబును నీ యిష్టమైనట్లు నీవే తలఁగట్టుకొమ్మని చెప్పెను. ఈ యనిష్టపరంపరలు హృదయమునఁ గలవాఁడు కావున నాయనను మృతస్నాతుఁడనుట దోషముగాదు.

ఇచ్చట మృతస్నాతుఁడనుటకు స్నాతుఁడైన మృతుఁడు- స్నానము చేయింపఁబడిన శవమని యర్థముచెప్పుట బాగని తోఁచెడి-మృతునకై కర్మమారంభించునపుడు శవమును స్నానముచేయింతురు గదా, వసమఱి = పరవశుఁడై - వశముచెడి యనుపద మనుగుణముగానున్నది- చెమటచేతను కన్నీటిధారలచేతను దడిసినవాఁడగుట స్నాతుఁడే.

తాత్పర్యము

ఈప్రకార మేడ్చుచు దశరథుఁడు జనులగుంపు అనఁగా మంత్రులు లోనగువారును శ్రీరాముని వెంటఁబోఁజాలని బడుగులు తన వెంటరాఁగా నమంగళకర

మైన పురమునకు మృతస్నాతువలెఁ బరవశుఁడై పరులు తన్నుఁ దీసికొనిరాఁగా వచ్చెను.

చం॥ జనములు లేనిగేహములు • చావడులున్ బలహీనలోకరో
దనములు మూఁతలుం బడిన • దైవతకూటము లాపణంబులున్
గనుఁగొన నెందునే నొకఁడు • గాఁగ మహాపథమంద తోఁపఁగా
మనుజవరుండు చూచుచు స్వ • మందిరముం జొరఁబాఱెఁ నేడ్చుచున్.

గేహములు=ఇండ్లు, బలహీన=బలముపోయిన, లోక=జనులు, రోదనములు=ఏడ్పులు, దైవతకూటములు=దేవాలయములు, ఆపణములు=అంగళ్ళు, మహాపథమంద=పెద్ద రాచబాటయందు మాత్రమే, తోఁపఁగాన్=కానరాఁగా- బలహీనలోకమనుటచే నేమాత్రమైనను నడువ శక్తిగలవారును శ్రీరాముని వెంటఁ బోయిరని భావము.

తాత్పర్యము

మనుష్యులులేని యిండ్లు- చావడులు- బలము లేని కారణమున శ్రీరాముని వెంటఁబోలేక నిలిచిన బడుగులయేడ్పులు, మూఁతలుపడిన దేవాలయములు, నంగళ్ళు గలదై పెద్ద రాచబాటయందు మాత్ర మెచ్చటనో యొకఁడు కానరాఁగా రాజు పాడుపడినదానివలెనుండు పట్టనమును జూచుచుఁ దన యింట నేడ్చుచుఁ బ్రవేశించెను.

ఈ పురవర్ణనము స్మశానమును దలపించుచున్నది- కావున మృతస్నాతుఁడనుటకు మీఁదఁ జెప్పిన రెండవ యర్థమే పొసఁగియున్నది.

తే॥ గరుడహృతపన్నగం బయి • క్రాలునక్షు,
భితమగుహ్రదంబుచొచ్చిన • గతిని, సవిత
మబ్బుమాటున కరిగిన • మాడ్కిసుతులు, సీతయును లేనియింటిస • జేరి యచట

గరుడహృతపన్నగము = గరుడునిచే నపహరింపఁబడిన పాము గలది, అక్షుభితము=కలఁతనొందనిది, హ్రదము=మడుఁగు, సవిత=సూర్యుఁడు.

తాత్పర్యము

తనయందున్న పామును గరుడుఁడు హరించుకొని పోఁగాఁ గలఁతలేక స్తిమితముగానుండు మడుఁగునందుఁ బ్రవేశించునట్లు సూర్యుఁడు మేఘముల చాటునకుఁ బోయినట్లు కొడుకులు కోడలులేని యింటిని సమీపించి యచట.

పాముగల మడుఁగునందు జనులు ప్రవేశింప భయపడుదురు. అట్టులే శ్రీరాముఁ డున్నప్పుడు శత్రువు లయోధ్యయందుఁ బ్రవేశింప భయపడు చుండిరి- ఇప్పుడా భయము లేకుండుటచే వాకిలి దెఱచిన యింటఁ గుక్కలు ప్రవేశించినట్లు శత్రువులు ప్రవేశింప ననుకూలపడెను.

తే॥ గద్గదస్వరయుక్తుఁ డై • క్ష్మావరుండు,
మృదులమందార్థవాక్కుల • నీ రెలుంగు
తోడ ని ట్లను (గనుఁగొని • తోడివారి,
నాకు నిచ్చట నిలువ మ • నంబులేదు. ౧౧౨౬

గద్గదస్వరయుక్తుఁడై = డగ్గుత్తికతోఁగూడిన స్వరముగలవాఁడై, క్ష్మావరుఁడు = రాజు, మృదులమందార్థ వాక్కులన్ = మెల్లనివియు, మందార్థ - అర్థముకొంచెముగాఁ గలిగినవియునగు వాక్కులచే, ఈరెలుఁగుతోడ = సన్ననిగొంతుతో.

తాత్పర్యము

డగ్గుత్తికచే మాటుపడిన స్వరముతో మెల్లగా నర్థము కొంచెముగాఁగల మాటలను సన్ననిగొంతుతోఁ దోడనున్నవారినిఁజూచి యిచ్చటనుండ నాకు నిష్టములేదు.

— • దశరథుఁడు కౌసల్యాగృహమునకుఁ బోవుట. • —

కం॥ తీసికొని పొండు నన్నిఁకఁ, గౌసల్యాగేహమునకుఁ • గలుగదు హృదయా
శ్వాసం బొండెడఁ గడువి, శ్వాసంబునఁ జూచు రాము • జననియ నన్నున్.
హృదయాశ్వాసము = మనస్సునకూఱట, విశ్వాసము = శ్రద్ధ. ౧౧౨౭

తాత్పర్యము

కైకేయికొంపలోఁగాని నా యింటిలోఁగాని యిఁక నుండుటకు నా కిష్టము లేదు, కౌసల్యామందిరమునకు నన్నుఁదీసికొనిపొండు, ఆ రామజననియే నన్ను శ్రద్ధతో విచారించును.

ఇదియే భోగినికిఁ బత్నికిఁగల భేదము.

కం॥ అన మార్గదర్శకులు స, ద్వినయంబున రాముజనని • వీటికిఁ గొనిపో
యిన నచటఁ బడియుఁ దల్పం,
బున లుళితమనస్కుఁడగుచుఁ • బొక్కుచు నేఁడున్. ౧౧౨౮

మార్గదర్శకులు = త్రోవచూపువారు, సద్వినయంబునన్ = మంచి వినయంబున, దీనివలన శ్రీరాముని విషయమున నింత క్రూరుఁడైన వీఁడేమి రాజని యతని నుపేక్షించినవా రపుడాయన కైకచే మోసగింపఁబడెననియు, నది బుద్ధిపూర్వకముగ మనస్పూర్తి చేసిన కార్యము గాదనియు, నెఱింగి యథాప్రకారము వర్తించిరని భావము, తల్పమునన్ = పానుపునందు, లుళితమనస్కుఁడు = కలఁతనొందిన మనస్సుగలవాఁడు.

తాత్పర్యము

తనకు ముందుపోవుచుఁ ద్రోవచూపు భటులు నిజమైన వినయముతో దశరథుని గౌసల్యయింటికిఁ దీసికొనిపోవ నచట నాయన పానుపుమీఁదఁ బడియు మనస్సు నెమ్మదిలేక యేడ్చుచునేయుండెను.

కం॥ కోడలు నిద్దఱుకొడుకులు, వీడినయవ్వీడు విగత•విధు వగునభమున్
జూడఁగని బాహు వెత్తుచు, వీడితెరామా! యటంచు•బిగ్గర నేడ్చెన్. ౧౧౫౯

విగతవిధువు=చంద్రుఁడులేనిది, నభము = ఆకాశము- ఇచటఁ జంద్ర శబ్దము గ్రహనక్షత్రముల కుపలక్షణము.

తాత్పర్యము

కోడలు నిద్దఱు కొడుకులు లేని యా యింటిని చంద్రుఁడు నక్షత్రములు గ్రహములులేని యాకాశమువలెఁ జూచుచు దశరథుఁడు రెండుచేతులెత్తి రామా వదలిపోయితివా యని గట్టిగ నేడ్చెను.

కం॥ సేమమున మరలి వచ్చిన,రామునిఁ గని కౌఁగిలించి•రమణఁ జెలఁగఁగా
నీమహి నంతకు బ్రదికెడి, యామహితాత్మకులె ధన్యు•లవురా యనుచున్.

తాత్పర్యము ౧౧౬౦

క్షేమముగా శ్రీరాముఁడు మరలి రాఁగా నాయనను గౌఁగిలించి సంతోషించుటకు నంతవఱకు జీవించియుండువారె సార్థకజన్ములు- నాకంత పుణ్యము లేదు.

ఆ॥ పొరలి పొరలి మిగులఁ•బొక్కు చుండఁగ నిట్లు. రాజుపాలి కాళ•రాత్రినాఁగ
రాత్రి వచ్చె, నర్ధ•రాత్రంబువేళను, నాతఁ డనియెఁ గోస•లాత్మజకును.

పొక్కుచున్=దుఃఖించుచు, కాళరాత్రి=ప్రలయకాలపు రాత్రి- సర్వభూత సంహారకమగు నిది మిగుల భయంకరమైనశక్తి, అర్ధరాత్రంబు=నడిరేయి- ఏక దేశ సంఖ్యావ్యయంబులకును సర్వ సంఖ్యాత పుణ్యశబ్దంబులకును బరమైన రాత్రి శబ్దము అకారాంతమగు సు. వ్యా. సమాస-౨౪ సూ. అర్ధరాత్రియనుట తప్పు.

తాత్పర్యము

పొర్లి పొర్లి మిక్కిలి యేడ్చు రాజు పాలిమృత్యుదేవత కాలరాత్రివలె రాత్రి వచ్చెను. ఆ నడిరేయిని నాయన కౌసల్యతో నిట్లనియె.

చం॥ వినఁ గదె రామచంద్రు వెను•వెంటను బోయిననాదుచూపు లా
ఘను విడనాడి యిప్పటికిఁ • గ్రమ్మఱి రా, వటుగాన నిన్ను నేఁ
గనుఁగొన నేర నయ్యెదను • గొంతరో? దాపునఁ జేరి నీకరం
బున నను నంటు లెస్స యనఁ•బొక్కుచు నుగ్మలి చేరి నాథునిన్. ౧౧౬౨

దశరథుని పంచేంద్రియములలో నొకటొకటియు శ్రీరామునకే లోపడినవి. అవి యనన్యార్హ శేషంబులనుట యీ పద్యమునఁ జెప్పఁబడినది. శ్రీరామచంద్రుని వెనువెంటను=సకల కల్యాణగుణమణులకును సముద్రుఁడగు శ్రీరాము వెంబడిపోయి- చూపులు క్రమ్మఱిరావు. (౧) సముద్రములోఁబడినది మరలి వచ్చునా? అట్లే గాంభీర్యమున సముద్రుఁడు గుణములకు మహాకరము అని చెప్పఁబడిన చంద్రునికంటె నభిరాముఁడగు నా శ్రీరామచంద్రునియందు నాటుకొనిన నా చూపులు మరలిరావు. (౨) రామ....చూపులు=రామం.రమయతాం

వరమ్మన్నట్లు ఇది జడపదార్థము, ఇది యజడపదార్థమను భేదములేక యందఱ నొక్కవిధముగా సంతోషింపఁజేయునవిగదా శ్రీరాముని గుణములు. లోకమున వస్తువును గ్రహించునపుడు దృష్టి తానుగఁబోయి గ్రహించును. నా విషయమందో యిప్పుడు నాదృష్టులు శ్రీరాముని గ్రహించుటలేదు. శ్రీరాముని యాకారమే నాదృష్టులను గ్రహించెను. ఆయాప్రకారమే వానిని గ్రహించి విడువకుండుటచే నందే బద్ధములై మరలి రాకయున్నవి. అదిగాక లోకమున దృష్టులు తమ సమీపమునకు వచ్చినవానిని గ్రహించుట న్యాయ్యమైయుండ నాదృష్టులే సంచారము చేయుచుఁబోయి శ్రీరాము నాకారమందు నిలిచినవి- చూచితివా- చేతనకార్యమగు సంచారమును అచేతనదృష్టులు చేయుచున్నవి. ఇది కాలవైపరీత్యముచేఁగదా "కామరూప్యనుసంచర" న్నని పరమపదమున భగవంతు ననుసరించునట్లు ఇచ్చట సంసారమున నాదృష్టి శ్రీరామునందు చేయఁదొడఁగెను. (౩) రామ........చూపులు=చక్షుర్దేవానా ముతమర్త్యానా" మన్నట్లు దేవతలకు మనుష్యులకు నందఱకు దృష్టివంటివాఁడు గదా శ్రీరాముఁడు. అట్టివాఁడు ముందుపోవుచుండఁగా నేనుమాత్ర మిందుందునా యని నా దృష్టి తలఁచి శ్రీరాముని వెంబడించినది. చూపు అనఁగా జూచునదియని కదా యర్థము. సారాసారములఁ జక్కఁగఁ జూచునదే నాదృష్టి కాఁబట్టియే శ్రీరాముని వెంబడించినది. నాకు మేలు చేయునది తనకు మేలు చేసికొనదా. తాను అస్వతంత్రయైనను శేషికి హితముచేయవలసినదే శేషవస్తువు కార్యమైనను, ఇవు డెట్టి స్వాతంత్ర మంగీకరించినది చూచితివా- శేషుఁడనఁగా భృత్యునివలె లోపడియుండువాఁడు. శేషి=స్వామి- లోపఱుచుకొనియుండువాఁడు- దృష్టిరమ్య వస్తువునేకదా చూడఁగోరును. శ్రీరామునికంటె రమ్యవస్తువు మఱియొకఁడుండినఁ గదా చూపులు శ్రీరాముని విడిచి మఱియొకదానికై పోవును. 'మందార మకరంద మాధుర్యమునఁదేలు మధుపంబుపోవునే మదనములకు' నన్నట్లు రాము సౌందర్యానుభవము మరగిన దృష్టి మఱియొకదానికై యెట్లు పోవును.

నాదు చూపులు- (౧) అఱువదివేలేండ్లు పుత్రునకై యనేక వ్రతములను నుపవాసములను జేసి కొడుకు పుట్టునా పుట్టునాయని యేకారి యెదురు చూచుచున్న నా చూపు. (౨) జన్మప్రభృతి నాతోడఁ బరిచయముగల నా చూపు, నేఁడు శ్రీరాముని జూడఁగానే వెడలిపోయెఁగదా. కావున నిది యొక యభిసారికయేమొ. అభిసారికయనఁగా ప్రియుని సంకేతస్థలమునకు నీవు రమ్ము నేను వచ్చెదనని యభిసరింపఁజేయునది యభిసరించునదియగు నాయిక. (౩) కైకేయి మొదలగు దుష్టచిత్తల దృష్టియైనచో శ్రీరాముని ననుగమింపదు. ఇది నాదృష్టి. నేనన్ననో "నందామి పశ్యన్నపి దర్శనేన" నాదునందనుని డాయఁగవచ్చెఁడు వానిఁజూచి పొంగిపడువాఁడ సమక్షముచూచినంతనే యౌవన మిప్పుడే యొదవినట్లగు"

ఇటువంటి స్థిరస్నేహముగల నాదృష్టి. (౪) "పృథివినధిపులు నూతనప్రియులు గారె యన్నట్లు వింతవస్తువులకై పరువెత్తునది కదా నాదృష్టి. నిమిష నిమిషమునకుఁ గ్రొత్తవైభవముతోఁ గానవచ్చు శ్రీరాముని సౌందర్యమును ననుభవింపక నా దృష్టియెందుఁ బోఁగలదు. (౫) సమస్తవిషయములందును జాపలము కలది కదా నా దృష్టి. కాన శ్రీరామునియెడఁ జాపలము చెందినది. నా చపలగుణము నా చూపునకు వచ్చినది. కారణగుణము కార్యమునందు సంక్రమించును గదా. కూఁతురు భర్తనువదలి తండ్రియొద్దకుఁ బోయినను దండ్రియామె నా కూఁతురని యభిమాన ముంచులాగున నాదృష్టి నన్నువదలి శ్రీరామునియొద్దకుఁ బోయినను నాకు దానియందుండు చిరపరిచయము నాదియన్న యభిమానమును బోఁగొట్టుకొన్నది. ఈచూపు నాదియేయైన పక్షమున నన్ను వదలిపోక నన్నే యనుసరించి యుండును. ఇది యిట్లతని వెంబడించుటచే నాది కాదని తోఁచుచున్నది. (౬) శీలవతి భర్తనువిడిచి యెన్ని దినములు పుట్టినింట నుండఁగలదు, హృషీకేశుని (ఇంద్రియాధిపతిని) విడిచి నాదృష్టి పుట్టినయిల్లైన నా నేత్రములం దెన్నినాళ్లుండఁ గలదు. కావున నది దాని పతియొద్దకుఁ బోయెను.

ఇంద్రియములు విషయముల ననుసరింపవా యది యొక దోషమా యనినఁ జెప్పుచున్నాఁడు. ఆ ఘనువిడనాడి యిప్పటికిరావు=ఇప్పటికిన్=ఆయన నగరము పొలిమేరను దాఁటిపోయినప్పటికిని, అఘనున్= శ్రీరాముఁడు ఘనుఁడు నేనో అఘ+నుఁడను=పాపముచేఁ బరిక్లిష్టుఁడను, వంధ్యా సూక్ష్మపరిక్లిష్టశూన్యభేదేషు నఃస్త్రిషు. నానా అట్టివానిని విడిచి యిట్టివానియొద్ద కెట్లువచ్చును, తనకు గోచరమగుచున్న శ్రీరాముఁడు తన మేరను దాఁటిపోయినను మరలిరాదు, దీనికిఁ గారణము గైకేయి ముఖము చూడవలసివచ్చునని సిగ్గుచేతనో లేక "నచపునరావర్తతే" యన్నట్లు శ్రీరామునితోఁ గలిసినదానికిఁ బునరాగమనము లేదో చెప్పలేను.

దృష్టి శ్రీరాముని విడిచి మరలి రాలేదని నీకు నెట్లు తెలియును ననఁగాఁ జెప్పుచున్నాఁడు.

అటుగాన నినుఁ గనుఁగొన నేరనయ్యెదను. అటురాలేదు గనుకనే నిన్ను నేను జూడలేకయున్నాను, వచ్చియుండిన నీవేల నాకుఁ గానరావు, కావునఁ దిరిగి రాలేదు. (౨) నేను గానరాకున్నన్నుద్దేశించి యెట్లు మాటలాడుచున్నవాఁడ వందువేమో నీ స్వరమునుబట్టి తెలిసికొనుచున్నాను గాని నీ రూపమును జూచి గాదు. శ్రీరాముని ముఖము కానరాకున్నను రాముని తల్లివైన నీ ముఖమైనఁ జూతమనిన నదియు నాకుఁ గానరాకున్నది. (౩) శ్రీరామునియందు మునిఁగియున్న చూపు వేఱొకపదార్థమును జూచునా కావున నా చూపు నీయందును బ్రసరింపకున్నది. కాంతరౌ=మనస్సున కింపైనదానా (1) నా దృష్టి పోయినను వాగింద్రియముమాత్రము నశింపలేదు. కావున నిన్నుఁజూచి

సంతోషింపలేకున్నను నీతో మాటలాడియైన సంతోషించెదను. నీకు గైక కదా కాంత, నేనెట్లయితినందువేమో "రాముని రాజుగఁజేసెద, వా మహితవిషంబుఁ గ్రోలి వసుధేశ యిదే, నీయుండట నీవుగనన్, నేమరణము నొందుదాన, నని చెప్పిన కైక యెక్కడ? నీవును గానలకేగినఁ జావొక్కటితక్క నేది శరణము తనయా' అనిన నీవెక్కడ? మమప్రాణాహిపాండవా యన్నట్లు శ్రీరాముఁడేనాఁ ప్రాణము. అట్టి శ్రీరాముని వెడలఁగొట్టినది నాకుఁ గాంత యెట్లగును? ప్రాణ మిచ్చినదానవు నీవు, దానిని తీసిన దది, (౧) కౌసల్యా లోకభర్తారం సుషు వేయం తపస్వినీ" యన్నట్లు లోకభర్తను బుత్రునిఁగాఁ గంటివి, నీవు ధన్యురా లవే కాని నాకారణమున నీకతఁడు దుఃఖకారణమే యయ్యెను. దోషిని నేనే కాని నీవు కావు.

ఇట్లు రాజు పలవించుటనుఁజూచి కౌసల్య శ్రీరాముఁడు తన్నువదలి యడ వికిఁబోయినట్లు దశరథుఁడును బరలోకమునకుఁ బోవునని భీతిల్లి దగ్గఱకు వచ్చెను. అప్పు డామెతో దశరథుఁడు చెప్పుచున్నాఁడు.

దాపునఁజేరి నీకరంబున నంటులెస్స=ఇంకను నాదగ్గఱకువచ్చి నాశ్రమ యెల్లఁదీరునట్లు నీచేతితో నా దేహమంతయు బాగుగ నిమిరి నాకూఱట గలిగిం పుము. నిన్నుఁజూడమిని నా కన్నులు పోయినవనుకొనుచున్నాను. నీ మాటలు వినుటవలన వీనుల కలవనుకొనుచున్నాను. నాకిప్పు డేవాసనయుఁ దెలియుట లేదు.కావున ఘ్రాణేంద్రియము నా పుత్రుని శిరము మూర్కొనుటకై పోయెనని తలఁచుచున్నాను. ఇఁకఁ ద్వగింద్రియముఁకూడ నున్నదా పోయినదాయని తెలిసికోవలసియున్నది. కాఁబట్టి నన్నుఁ దాఁకిచూడుము.

ఒక దొంగ యొక యింటఁ జొరఁబడి వస్తువులను దొంగిలించుకొనిపోఁగా నాయింటి యజమానుఁడు మేలుకొని పిదపఁ దెలిసికొని భార్య దీపము తెచ్చు లోపల వస్తువు లేవియున్నవో యేవి పోయినవోయని కనుఁగొనుటకుఁ దొంద రపై దీపము నెదురుచూడక చీఁకటిలోనే వస్తువులను దడవుచుఁజూచి తనభార్య నసుగుమండునో యట్లైనది యిప్పటి దశరథుని స్థితి (౨) ఇతఁడు కైకేయితో నేదో సంకేతము చేసికొని నిష్కారణముగ నిరపరాధిని నాకుమారుని శ్రీరాముని వెడలఁగొట్టెను. ఇప్పుడు నాయొద్ద నక్కవినయములు చేయుచున్నాఁడు. ఇటు వంటి ద్రోహిని పాపిని నేనెట్లు దాఁకుదునని తలఁపకుము. నేనీకార్య మజ్ఞానము చేతనే చేసితిని గాని బుద్ధిపూర్వకముగాఁగాదు. కావున నిర్దోషినని తలఁచి తాఁకుము. అదిగాక నాకీ మనఃకాలుష్యము ప్రకృతి సంబంధమువలనఁ గలిగి నది. కావున నీవు వేఱుగాఁ దలఁపక నన్ను బాగుగఁ దాఁకుము. (౩) నీవు వివాహకాలమున నెట్లగ్నిసాక్షికముగా నత్యంతప్రీతితోఁ దాఁకితివో యట్లేయిప్పు డును దాఁకుము. (4) శ్రీరాముఁడు నాదేహముతాఁకిన నా ప్రాణములుండును ఆయన తాఁకకున్నఁ బోవును. ఇట్టి స్థితిలోనుండు నన్ను శ్రీరామునకు మాఱుగ

నాయనతల్లివైన నీవు దాఁకినఁ గొంచెము కాలమైన నిలుచును. భగవత్స్పర్శ సాక్షాత్తుగలేకున్నను నతని సంబంధుల స్పర్శముండినను నదియే ప్రాణధారకమగును.

కౌసల్యా దశరథులకు శ్రీరాముని పరత్వజ్ఞానములేదు. వాల్మీకిఋషియే యా శ్రీరాముని పరత్వము నా యా పాత్రములముఖమునఁ దా ననుసంధించుకొనుచున్నాఁడు. ఆ వాల్మీకి ప్రయోగించిన మాటలసారస్యమునుబట్టి కవి హృదయమిందు సూచింపఁబడియెనని సంప్రదాయ సిద్ధసమాధానము, తీర్థీయము, రామచంద్రు........క్రమ్మఱిరావు="రమంతే యోగినోనంతే సత్యానందే చిదాత్మని" యన్నట్లిచ్చట రామశబ్దమునకుఁ బరమాత్మయని యర్థము అట్టివానిని జూడఁబోయినవి కావున నా చూపులు క్రమ్మఱిరావు. భగవంతుఁ బొందినవారు "నపునరావర్తతే" మరలి రారు అని కలదుగదా. అటుగాన నిన్ను నేఁ గనుఁగొన నేరనయ్యెదను. నా కన్నులు శ్రీరామునియందే ప్రేమవడి యందే నిలిచినట్లు తక్కిన యింద్రియములు నిలిచెనా లోకులందఱిలోను నేనే గొప్పవాఁడ ననుకొందును. అట్లవియున్నవో లేవో చూడవలయును. కాఁబట్టి మొదటఁ ద్వగింద్రియమున్నదో లేదో పరీక్షింపుము. చూచెద ననుచున్నాఁడు.

౪౩-వ సర్గము. కౌసల్య శ్రీరామునిఁ దలంచి దశరథునితోఁ జెప్పుకొని యేడ్చుట

తే॥ కడుపుదుఃఖంబునను దన•కాంతుఁజూచి,పలుకుఁగౌసల్య,శ్రీరామ•భద్రుమీఁదఁ
గ్రక్కికౌటిల్యవిషమెల్లఁ•గైక కుబుస,
మెడలఁ బన్నగసతియన•నెలమిఁగనియె. ౧౧౬౩

కడుపుశోకంబునన్=కడుపునఁబుట్టిన కుమారుని విషయమైన దుఃఖము చేత, కాంతున్=భర్తను, కౌటిల్యవిషమును=క్రూరస్వభావమనెడి విషమును,కుబుసము=పాముదేహముపై చర్మపుఁబొర, ఎడలన్=ఊడిపోఁగా,పన్నగసతి=ఆఁడుపాము, ఎలమిన్=సంతోషమును, కౌసల్య పుత్రశోకమున నీ క్రిందివిధముగఁ జెప్పుచున్నది, కాని భర్తపై ద్వేషబుద్ధిచేఁగాదు కావుననే తనకాంతున్ అని చెప్పుట.

తాత్పర్యము

కౌసల్య పుత్రశోకముచేఁ దనభర్తను జూచి యిట్లనియె. శ్రీరామచంద్రు మీఁదఁ దన కుటిలత్వమను విషమును గ్రక్కి కైక కుబుసము విడిచిన యాఁడు పామువలె సంతోషించెను.

కం॥ రాము నిలువెడల నడచుటఁ, గామిని కైకేయి లబ్ధ•కామయు నగుటన్
ధామమునందలి నాగుం, బా మన వెఱ పెట్టి నను నృ•పాలక మిగులన్.

ఇలువెడల నడచుటన్=ఇంటినుండి వెడలగొట్టుటచేతను కైకేయి తన కోరిక కొనసాగించుకొనుటచేతను, మంత్రగాఁ డిల్లు వెడలిపోయిన పిమ్మట నిర్భయముగఁ దిరుగు నాగుఁబామువలె నన్నుఁ గైక మిగుల భయపెట్టుచున్నది.

ఉ॥ అక్కట బిచ్చ మెత్తి తిని•యాసవతాలికి దాసుఁడై సుతుం
దొక్కట నింటిలోనఁ బడి•యుండఁగ నిచ్చిన లెస్స గాదె, నీ
వక్కలకంఠి కట్టివర•మాదట నీయఁగరాదె, రాజ్యమున్
దక్కకయున్న మానె గుణ•ధన్యుఁడు కానల కేల పోవఁగన్? ౧౧౬౫

కలకంఠి=స్త్రీ, కల=అవ్యక్తమధురము, ఆదటన్=ప్రీతితో, దక్కక=లభింపక, అట్టివరము=ఊరిలో బిచ్చమెత్తితిని యింటిలోఁ బడియుండువరము

తాత్పర్యము

అయ్యో! నాకొడుకు కూరిలో బిచ్చమెత్తితిని నా యా సవతికి దాసుఁడై యితరములగు జంజాటములులేక యింటిలోఁ బడియుండనిచ్చిన మేలు గదా నీకు దాని తియ్యనిమాటలయందంత ప్రేమయున్న నీ వా మధురవాణికి నట్టి వరమే యియ్యరాదా. న్యాయ్యముగా శ్రీరామునకు లభింపవలసిన రాజ్యము లభింపకుండినఁ బోనిమ్ము. వాఁడు నిష్కారణముగ నడవులపాలేల కావలె? దానివలన నీకు రాఁగల లాభమేమి?

ఉ॥ అకటా! యాహితాగ్ని యగు•నాతఁడు దర్శలఁ బూర్ణమాసలన్
ప్రాకట మైననిర్జరుల•పాలిహవిస్సును రాక్షసావళుల్
గైకొన నిచ్చిన ట్లిపుడు•కైక కొసంగి యథేచ్ఛ మీపు సు
శ్రీకము రాజ్యమున్ సుతుని•జ్యేష్ఠు గుణిన్ వెడలంగఁ గొట్టితే. ౧౧౬౬

ఆహితాగ్ని=అగ్నిహోత్రము నుంచుకొనియుండువాఁడు, దర్శలన్=అమావాస్యలందు, పూర్ణమాసలన్=పున్నమలందును, నిర్జరులపాలి=దేవతల పాలి, హవిస్సును=హోమముచేయఁగా మిగిలిన యన్నము నెయ్యి, యథేచ్ఛము=ఇష్టానుసారము=అవ్యయీభావసమాసము గావున నపుంసకలింగము, సుశ్రీకము=మంచి సంపత్తుగలది, గుణిన్=గుణవంతుని, అకట=హాకష్టమ్, ప్ర.

తాత్పర్యము

అయ్యో! యాహితాగ్నియైనవాఁడు అమావాస్యలందుఁ బున్నమల యందుఁజేయు హోమములందలి హవిస్సును దేవతల కియ్యవలసినదానిని రాక్షసుల కిచ్చినట్లు కైక కోరినదని నీ యిష్టప్రకారము సంపత్తుతోఁగూడిన రాజ్యము దుష్టురాలగు దానికిచ్చి గుణవంతుఁడైన కొడుకును వెడలఁగొట్టి కొంటివికదా.

కం॥ కేల శరాసముఁ దాలిచి, యాలును దమ్ముండుఁ దోడ•నరుదేర వనీ
పాళిని గజపతిగతి నీ, తాలలనాథపుఁడు చొచ్చుఁ•దా నింతటికిన్. ౧౧౬౭

శరాసము=శరములను జిమ్మునది, విల్లు, వనీపాళిని = అడవులవరుసల యందు.

తాత్పర్యము

చేత విల్లుధరించి భార్యయుఁ దమ్ముఁడు తోడరాఁగా నడవులయందుఁ గరిరాజువలె శ్రీరాముఁ డిప్పటికి నడవి ప్రవేశించుచుండును.

కం॥ వనవాస దుఃఖ మిట్టిది, యని యెఱుఁగనివారిఁ గైక•యనుమతి నీ వా
యనఘులఁ గానల నెట్టితి, కన నయ్యెడ వార లేమి•గతి పట్టెదరో. ౧౧౬౮

అనఘులన్=ఏపాప మెఱుఁగనివారిని, అనుమతి=ఇష్టప్రకారము.

తాత్పర్యము

అడవులలో వసించుటయందుఁగల కష్టమిట్టిది యని తెలియనివారిని గైక యిష్టప్రకార మడవులలోఁ ద్రోచితివి. అక్కడ వా రేమైపోదురో కదా.

కం॥ ఎలప్రాయపువారల సుఖ,ఫలకాలమునందు నెడలఁ•బాపితి వయ్యో
ఫలమూలాశనులై యే,చెలువున జీవించువారు•చెపుమ యనదలై. ౧౧౬౯

ఎలప్రాయపువారలన్=లేఁతవయస్సువారిని, సుఖఫలకాలమునందున్=సుఖఫలము ననుభవింపవలసిన సమయమున, ఫలమూలాశనులై=పండ్లు వేళ్లు ఆహారముగాఁగలవారై, ఏ చెలువునన్=ఏవిధముగా, అనదలు=అనాథులు, దిక్కులేనివారై, ఎల=వర్ణవ్యత్యయములచే ల+ఏ=లే యయ్యెను.

తాత్పర్యము

లేఁతవయస్సువారిని సుఖఫల మనుభవింపఁదగిన సమయమునందు నింట నుండకుండఁ జేసితివి. పండ్లు వేరులు తిని వా రే విధముగఁ బ్రాణము ధరించి దిక్కులేనివారై యెట్లుండఁగలరో నీవే చెప్పుము.

కం॥ రారాదా రాముఁడు సహ,దారుం డై యనుజుతోడఁ•దటుకున నిపుడే
కారాదా నాదుఃఖం, బారఁగ నశియింపఁ జేయు•నద నిది శుభ మౌ.

సహదారుఁడు= భార్యతోఁగూడినవాఁడు, అనుజుతోడన్=తమ్మునితో ఆరఁగన్=పూర్ణముగా, అదను=సమయము.

తాత్పర్యము

భార్యతోడను దమ్మునితోడనుగూడి యిపుడే పదునాలుగు సంవత్సరములయినవని రారాదా. నా దుఃఖము పూర్ణముగా నశియింపఁజేయు సమయ మిదే కారాదా.

సీ॥ ఎప్పుడు వత్తుకో•తెప్పున మేల్కాన్న,రమణ నయోధ్యాపు•రంబునకును
నెప్పు డెత్తుదు రొకో•యెల్లెడ హృష్టులై, తోరణధ్వజము లే•పౌరజనులు
ఎప్పుడు పొంగునో•యిప్పుర మెల్లను, ఋన్నమనాఁటియం•భోధివలెను
నెప్పుడు తే రెక్కి•యేతెంచుసీతతో, నావు వెన్కానుకో డె•యనఁగసుతుఁడు

తే॥ ఎప్పుడొకొ రాచబాటల•నీపురంబుఁ, జొచ్చి వచ్చెడు నాముద్దు•సుతులపైఁబ
జనసహస్రంబు లాజలఁ•జల్లఁ గనులు,
చల్లగాఁగందు నాకుందు•సమయుచుండ ౧౧౭౧

తెప్పునన్=తటాలున. అంభోధి =సముద్రము, లాజలన్=పేలలను, కుందు=వ్యసనము.

తాత్పర్యము

నిద్రపోవువారు తటాలున మేలుకొనునట్లు నాకొడుకులు కోడ లయోధ్యా పురమునకు నెప్పుడు వత్తురో వారి రాక విని యన్ని ప్రదేశములందు సంతోషించినవారై యూరిజనులు తమ సంతోషమును సూచించు తోరణధ్వజము లెప్పు డెత్తుదురో, ఈనగరమంతయు, వారు వచ్చినారనిన సంతోషముతోఁ బున్నమనాఁటి సముద్రమువలె నెప్పు డుప్పొంగునోకదా. ఆవు వెంటవచ్చు కోడెవలె సీత వెంట శ్రీరాముఁడు వచ్చుటఁక నెప్పుడో, రాజవీథుల వెంబడి వచ్చు నా ముద్దుకుమారులమీఁద నీ యూరిజనులు లాజలు చల్లఁగాఁ నా కన్నులు చల్లగా జూచి యెప్పుడు నా దుఃఖమునుండి పాయుదునో.

కం॥ సురుచిరకుండలయుతు లై, దరకరనిస్త్రింశచాప•ధరులై శిఖర
స్ఫురదవనీధరము లనం, బురిఁజొచ్చెడిసుతులఁ జూచు•పుణ్యం బెపుడో.

సురుచిరకుండలయుతులై=మనోహరమైన చెవుల పోగులుగలవారై= దరకర=భయముకలిగించు, నిస్త్రింశచాపధరులై=కత్తి విల్లు ధరించినవారై, శిఖరస్ఫురత్=శిఖరములచేఁ బ్రకాశించు, అవనీధరములు=పర్వతములు.

తాత్పర్యము

మనోహరమైన కుండలములుగలవారై భయంకరములైన కత్తి, విల్లు ధరించినవారై శిఖరములతోడి పర్వతములో యనునట్లు నగరము ప్రవేశించు కొడుకులను జూచు పుణ్య మెపుడు కలుగునో.

చం॥ కనుఁగొను టెన్నఁడొక్కొ ద్విజ•కన్యలు పుష్పఫలాళిఁ జేతులం
గొని ముద మారఁగాఁ బురిఁ•గోర్కి చెలంగఁ బ్రదక్షిణించుటల్,
ఘనపరిపక్వబుద్ధి, శచి•కాంతుఁడు ప్రాయమునందు, నోరు మె
త్తనిముగుదుండు, వానిముఖ•తామరసంబెటు గాంచు టబ్బునో ౧౧౬౩

ద్విజకన్యలు=పెండ్లికాని బ్రాహ్మణజాతి కన్నెలు, పుష్పఫలాళిన్=పూలయుఁ బండ్లయు మొత్తములను, ఘనపరిపక్వబుద్ధి=బాగుగఁబడిన బుద్ధిగలవాఁడు, ప్రాయమునందు=వయస్సున, శచికాంతుఁడు = ౨౫ ఏండ్ల వాఁడగు నింద్రుఁడు, దేవత లెప్పుడు నిరువది యైదేండ్లవారే, ఈయుపమానము శ్రీరామున కిప్పటికి నిరువదియైదు సంవత్సరములని సీత చెప్పిన వాక్యమును బలపఱచు చున్నది, ముఖతామరసము=ముఖకమలము, ముగ్ధుఁడు, తద్భవము ముగుదుఁడు.

తాత్పర్యము

బ్రాహ్మణజాతి కన్యకలు చేతఁ బూలు పండ్లు తీసికొని సంతోష మతిశయింపఁగా నగరప్రదక్షిణము చేయుట నే నెన్నఁడు చూతునో. గొప్పదై యారితేఱిన జ్ఞానముగలవాఁడు, వయసునఁ దింద్రుని ప్రాయమువాఁడు, కఠినముగఁ

బలుకలేని ముగ్ధుఁడునగు శ్రీరామచంద్రుని ముఖకమలము చూచుట యెప్పుడు కలుగునో.

కం॥ మూఁడేండ్లముద్దుబాలుని, పోఁడిమి నాత్రోల సుతుఁడు•పొడకట్టఁగ నే
నాఁడు కనులారఁ గందునొ, యేఁడీ రాముండు తనయుఁ•డేఁడీ నాకున్.

పోఁడిమి=చందము, పొడకట్టఁగన్=కనఁబడఁగా, ఏఁడీ=ఎక్కడనున్నాఁడు, అర్థవిశేషంబున, ఏఁడి, ఏది, ఏరి, ఏవి యనునవి ఊకారాంతములగు అర్థవిశేషము=ఎక్కడ? అనఁగా లేఁడే యని భావము.

తా త్ప ర్య ము

ఆడుకొను మూఁడేండ్ల ముద్దుబాలునివలె నాయెదుట నాచిన్ని శ్రీరామ చంద్రుఁడు కనఁబడగా నెప్పుడు కన్నులారఁ జూతునో=అట్లు చేయుటకు శ్రీరాముఁ డెక్కడనున్నాఁడు, అయ్యో అంతటి పుణ్యాత్మురాలనా? నాకుఁ గొడుకుకూడ నున్నాఁడా నాకుఁగూడఁ గొడుకున్నాఁడా?

ఉ॥ సందియ మింత లేదు తొలి•జన్మమువేళను నేను దల్లు లా
నందముతోడఁ జన్గుడుప•నందనులం గరముం గదర్యనై
కందులనోటిచన్నులను•గండలఁ గ్రొవ్వునఁ గోసివైచితిన్
దందడియాయఘం బిటులు•దారుణభంగిని నన్ను మ్రింగెడిన్. ౧౧౭

చన్గుడుపన్=చన్నులపాలు ద్రావింపఁగా, కదర్యనై=నీచురాలనై, అత్యంత లోభినై, కందుల=శిశువులను.

తా త్ప ర్య ము

ఏల యిటువంటి పుత్రవియోగమునాకు లభించెనని యాలోచింపఁగానేది పూర్వజన్మమునఁ జేసితినో యదియే యీ జన్మమున లభించును గావున నేను బూర్వజన్మమందుఁ దల్లులు సంతోషముతోఁ దమ కొడుకులకుఁ జనుపాలిచ్చు చుండఁగా మిక్కిలి నీచబుద్ధినై యాబిడ్డల నోటనుంచుకొని త్రాగుచున్న చన్ను లను గండపొగరుచేఁ గోసివైచితిని. ఆపాపమే యిప్పు డీ విధముగ భయంకర ముగ నన్ను మ్రింగుచున్నది. సందేహములేదు.

ఇంతటి ఘోరకార్యము చేయువారరుదు గాని యిప్పుడు మఱియొక విధ ముగఁ దల్లుల పాలు బిడ్డలకు లేకుండఁ జేయువారు పెక్కురున్నారు.

శ్లో॥ నవారయే ద్గాం ధయంతీం, నచాచక్షీత కస్యచిత్
నదివీంద్రాయుధం దృష్ట్వా, కస్యచిద్దర్శ యేద్బుధః॥ మను.౪-౫౯

నీళ్లు త్రాగు గోవును, దల్లి పాలు త్రావు దూడను నివలి కీడ్వరాదు. ఇత రుల దూడలు పాలు ద్రావునపుడు వారికిఁ జెప్పరాదు. ఇంద్రధనుస్సునుజూచిన వాఁడు దాని నితరులకుఁ జూపరాదు. పాలు పిదుకునపుడు దూడను నివారింప

వచ్చునని కుల్లూకభట్టు వ్రాసెనుగాని దూడ కడుపునిండఁ బాలు త్రాగువఱకుఁ దీయరాదు. అందు వేఱు మేపు దినని దూడలవిషయమున ముఖ్యము. సంసృష్టాంచవత్సేనా నిమిత్తే, ఆపస్తంబులు, పాలు ద్రావు దూడను నిష్కారణముగ నీవలి కీడువరాదు. స్వార్థము సరియైన కారణముకాదు. లేదూడలు పాలు విశేషించి త్రావిన జీర్ణించుకొనలేకపోవును. రోగము వచ్చును. అట్టి సమయమందుఁ దగినంత త్రావఁగానే యావలికి లాగవచ్చును. మన పొట్టలు నించుటకై (టీ, కాఫీలకుఁగాను) తల్లిపాలు బిడ్డలకు లేకుండఁ జేయుటకంటె ఘోరపాప మేది గలదు. ఆవుపాలు హోమ యజ్ఞాది దేవతాకార్యములకు, తల్లులులేని బిడ్డలకు, పయోవ్రతులకు, రోగులకు వినియోగించినయెడల నా యుపయోగించినవారికిని గోవులకును సుకృతముగలదు గాని కేవల స్వకుక్షిపూరులకుఁ బాపమే ఫలము ఈకాలమున బిడ్డలు విశేషించి చచ్చుటకు, బిడ్డలపాలు తల్లులిచ్చు భాగ్యము లేకుండుట కది ముఖ్యకారణమై యుండవచ్చును.

సీ॥ సింహంబుచేత హిం•సితవత్సగోవు, వి,వత్స యైనట్టులు•వత్సల యగు
నేను గైకేయిచే•నీగతి సుతహీన, నైతి నిం కే మని•యనుకొనంగ
నట్టిసద్గుణజుష్టు•నఖిలశాస్త్రాభిజ్ఞు, విడి యేకపుత్రుని•మిడుకు బట్టు
లే మని బ్రదుకుదు•నేగతి బ్రదుకుదు, నా నెఱసరి నిష్టుఁ•గాన కున్న
తే॥ మండువేసంగి నెట్లు మా•ర్తాండుఁ డెల్ల,
యుర్వరను గరవాఁడి మ•యూఖములను
వ్రేఁచు నాగతి నాదుశ•రీర మెఱియఁ,
జేయు చున్నది సుతశోక•జాయతాగ్ని. ౧౧౭౬

హింసితవత్సగోవు=చంపఁబడిన దూడగల యావు, వివత్స=దూడలేనిది, వత్సల=బిడ్డలయందుఁ బ్రేమగలది, సద్గుణజుష్టున్=మంచి గుణములచేఁ బూజింపఁబడినవానిని, అఖిలశాస్త్రాభిజ్ఞున్=సర్వశాస్త్రములందుఁ బండితుని, నెఱసరి=శూరుని, ఉర్వరను=భూమిని, కరవాఁడి మయూఖములను = మిక్కిలి తీక్ష్ణమైన కిరణములచే, షడ్వర్ణపర్యంతంబైన యాంధ్రశబ్దంబు తత్సమశబ్దంబుతోడ సమసించు, సు, వ్యా, సమాస ౪౧ సూ. కొందఱు ఆంధ్ర సంస్కృత శబ్దములు కలిసిన సమాసమంతయు నాఱువర్ణముల మించియుండరాదందురు. అది సూత్రాభిప్రాయముగాదు. ఆంధ్రం షడ్వర్ణపర్యంత మన్నప్పుడు ఆఱక్షరములుగల ఆంధ్రశబ్దమనియే యర్థము, 'కటికిచీఁకటి దిండికరముల గిలిగింత' యను పెద్దన్న ప్రయోగ మీ నియమము నతిక్రమించియున్నది.

కరము+వాఁడి, కరవాఁడి, సమాసంబునఁ బ్రత్యయలోపంబు, ద్వంద్వ కర్మధారయంబులఁ బూర్వపదాంత మువర్ణకము లోపించి యెక్కడ సమసించు కరము+వాఁడి, కరవాఁడి, పుట్టము+గోఁచి=పుట్టగోఁచి, చుట్టము+పక్కము= చుట్టపక్కములు. సు. వ్యా. సూ. సమా ౧౯, వ్రేఁగు, వ్రేఁచు=

ప్రవేయించు=తపించునట్లుచేయు, సుతశోకజ= పుత్రశోకమువలనఁ బుట్టిన, ఆ యతాగ్ని=విస్తారమైన యగ్ని. తాత్పర్యము

సింహముచేఁ జంపఁబడిన దూడగల యావు దూడలేనిదియగునట్లు పుత్రప్రేమగల నేను కైకేయిచేఁ బుత్రుఁడు లేనిదాననైతిని, ఇఁక నేమనుకొనిననేమి ప్రయోజనము. అటువంటి సద్గుణములు గలవానిని సమస్త శాస్త్రములందుఁ బండితుని నొంటికొడుకును శూరుని నిష్ఠుఁడైనవానిని విడిచి యెంతని దుఃఖింతును, ఏమని బ్రదుకుదును, ఎట్లు బ్రదుకుదును.మండుచున్న నెండకాలమందు సూర్యుఁడు భూమియంతయుఁ దన తీక్ష్ణకిరణములచేఁ గాల్చునట్లు పుత్రశోకమను నగ్ని నా శరీరమంతయుఁ గాలునట్లు చేయుచున్నది.

—♦ ౪౪-వ సర్గము. సుమిత్ర కౌసల్యకు శోకోపశమనంబు సేయుట. ♦—

కం॥ అని వగచెడి కౌసల్యా, వనితామణిఁ గాంచి ధర్మ•పథవర్తిని యి
ట్లనియె సుమిత్ర సధర్మము,సనయంబుగ నీకునేల•సంతాపింపన్. ౧౧౭౪

వగచెడి=దుఃఖించు, ధర్మపథవర్తిని=(1) ధర్మమార్గమందు నడచునది (2) ధర్మ=సిద్ధధర్మము, భగవంతుఁడు=రాముఁడు, ఆయన పథము=ఆయన కనుకూలమైన మార్గమునందు వర్తించునది, ఆనుకూల్య సంకల్పముగలది, (3) ధర్మము=పూర్వజన్మసుకృతము, సుమిత్రను ధర్మపథవర్తిని యనుటచేఁ గౌసల్య మార్గమంత శుద్ధ ధర్మయుక్తము కాదని కవి యభిప్రాయము. కౌసల్యది రాజసమార్గము. కైకేయిది తామసమార్గము. సుమిత్రది సాత్త్వికమార్గము. సత్యసంధుఁడగు భర్త తనకు మనస్తాపము కలిగించెనని యెగ్గులాడుట యుత్తమమార్గము గాదు, సధర్మము=ధర్మముతోఁ గూడినట్లు, సనయముగన్=నీతితోఁ గూడినట్లు.

శ్రీరాముఁడు పరమాత్మ యనువిషయము సుమిత్ర వాక్యములచే వాల్మీకి వెల్లడి చేయుచున్నాఁడు, ఈసర్గమందుఁ దారామందోదరులకుఁబోలె సుమిత్రకును జన్మాంతర కృతపుణ్యమువలన శ్రీరాముని వాస్తవస్థితి చక్కఁగఁ దెలియు నని పెద్దల సంప్రదాయము. ఇట్టి కవియభిప్రాయమునుబట్టి కొన్ని ధ్వన్యర్థములు కలవని చెప్పఁబడును.రామాయణమంతయు ధ్వనికావ్యమేగదా. ఆలంకారికులు నిట్టి ధ్వన్యర్థము నంగీకరించియున్నారు.

దశరథ శబ్దమునకు గరుడవాహనుఁడైన మహావిష్ణు వర్థమని ౧౮౯౭-వ పద్యవ్యాఖ్యానమున వ్రాయఁబడెను. అట్టి మహావిష్ణువునకు శరీరభూతయగు ప్రకృతి భర్తవ్యయగుట భార్యయట్టిది. అట్టిప్రకృతి మూఁడుగుణములుకలది. సత్త్వము, రజస్సు, తమస్సు. సత్త్వము సుమిత్ర, కౌసల్య రజస్సు కైక తమస్సు. 'ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవా మ్యాత్మమాయయా' యన్నట్లు ఆత్మావై పుత్రనామాసియన్నట్టుపరోక్షమహావిష్ణువే ప్రత్యక్ష శ్రీరాముఁడయ్యెను• కావుననే శ్రీరాముఁడు తండ్రిని బోలినవాఁడని కొన్నిచోటులఁ జెప్పఁబడెను.

తాత్పర్యము

ఈప్రకారము విలపించు కౌసల్యనుగని ధర్మమార్గమందు నడచు సుమిత్ర ధర్మము నీతితోఁగూడిన మాటల నిట్లనియె. మహాభాగా। నీవేల పరితాపపడెదవు

చం॥ అనుపమసద్గుణుండు నప॰రాజితుఁడుం బురుషోత్తముండు నీ
తనయుఁడు, వానికా కృపణ॰తన్ విలపించెద వార్య యిట్లు? దా
వనముల కేగు టెల్ల జన॰వర్యుని దండ్రిని సత్యవాదిఁ జే
యన కద? దానికై వగవ॰న్యాయ్యమె చెప్పుము ధర్మమానసా? ౧౧౪౨

అనుపమసద్గుణుఁడు=అసమానమై కల్యాణగుణములు గలవాఁడు. అపరాజితుఁడు=(1) పరాజయమెట్టిదో తెలియనివాఁడు, (2) విష్ణువు. అపరాజితౌ హరీశౌ అని నానా.ర. పురుషోత్తముండు = పురుషశ్రేష్ఠుఁడు, జీవాత్మలకంటె నుత్తముఁడు, ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః భ.గీ.శ్రీపతిః పురుషోత్తమ యని నిఘంటువు. కృపణతన్=దీనత్వముచే, ఆర్య=భాగ్యవంతురాలా. నీవెంత పుణ్యవతివో కనుకనే నీకిట్టివాఁడు పుత్రుఁడయ్యెను.

తాత్పర్యము

నీతనయుఁడు-అసమాన కల్యాణగుణములు కలవాఁడు. పరాజయము నొందనివాఁడు పురుషశ్రేష్ఠుఁడు ఇట్టివాని గుఱించియా భాగ్యవతీ! నీవు దీనత్వమున విలపించెదవు? నీకొడుకు కడవులకుఁబోయిన కారణమేమి?నేరముచేసియా? కాదుగదా తండ్రిని సత్యవాదిఁగాఁ జేయుటకేకద, తండ్రిని సత్యవంతుని జేయఁబోయినవాని గుఱించియా ధర్మయుక్తమగు మనస్సుగలదానా! దుఃఖించెదవు. ధర్మవిచారము నేల యడుగున ద్రోచితివి? ఎంత తీవ్ర దుఃఖమైనను ధర్మము మఱవవచ్చునా?

కం॥ పెద్దలు మోక్షముఁ గొఱకై, తద్దసడచు చుండు నట్టి॰ధర్మపథముఁనన్
ముద్దులసుతుఁడును నడచెను, నెద్ది దోసంబు దీన॰నేటికి వగవన్? ౧౧౪౩

తాత్పర్యము

మోక్షము సంపాదింపఁగోరిన పెద్దలేధర్మమార్గమున నడచిరో యాధర్మమార్గమునందే నీకొడుకును నడచెను. దీనిలో నేమి దోసము?ఏమి పాపకార్యము శ్రీరాముఁడు చేసెనని యేడిచెదవు? నాకొడుకు శ్రీపతియంటివే యట్టివానికి కష్టమేలయందువా? శిష్టాచారము నిలుపుటకే, లోకులకు మార్గదర్శియగుటయే శిష్టధర్మముకదా. నిత్యవిభూతియందు నిత్యానందరూపుఁడైన భగవంతుఁడు లీలా విభూతియం దవతరింపనేల? ఆలోచింపవా?

ఆ॥ అప్రమాదబుద్ధి॰యఖిలభూతములజా,లములఁ గరుణ గలఁడు॰లక్ష్మణుండు
నుత్తమంపువృత్తి॰నున్నవాఁ డమ్మహా,
త్మునకు నదియె లాభ॰మునుఘటించు. ౧౧౪౪

అప్రమాదబుద్ధి=పొరపాటుపడని జ్ఞానముగలవాఁడు కైంకర్య విషయమునఁ బొరపాటుపడియుండిన శ్రీరాముని వెంటఁబోయియుండఁడు, జాలములన్ = సమూహములందు, కరుణగలఁడు=దయగలవాఁడు.

తాత్పర్యము

లక్ష్మణుఁడు తనకు స్వరూప స్వభావసిద్ధమైన కైంకర్యమందుఁ బెద్దవారిని సేవించుటయందు హెచ్చరికగలవాఁడై సమస్తభూతములు భగవత్స్వరూపములను జ్ఞానముతో దేనిని హింసించినను భగవంతుని నొప్పించుటయని యన్నింటియందు దయగలవాఁడునగు లక్ష్మణుఁడు తన స్వధర్మమైన కైంకర్య వ్యాపారమం దున్నవాఁడు. శ్రీరాముఁడు తన స్వధర్మమందున్నట్లు లక్ష్మణుఁడును దన స్వధర్మమందు హెచ్చరిక తప్పకయున్నవాఁడు. ఆ మహాత్మునకు నదియే=ఆ కైంకర్యమే మహాఫలమును గలుగఁజేయును. వారి వారిని రక్షించి యుత్తమ గతులను గలిగించునది వారి వారి స్వధర్మానుష్ఠానమే కదా. కావున లోకానుగ్రహార్థమై 'యద్యదాచరతి శ్రేష్ఠస్తత్త దేవేతరో జనాః॥ భ.గీ. కామవృత్తస్త్వయంలోకః, కృత్స్నస్సముపవర్తతే యద్వృత్తాసంతిరాజాన, స్తద్వృత్తాస్సంతిహి ప్రజా' యని రామాయణమునఁ గలదు కావున స్వధర్మమున వర్తించు శ్రీరామునకై యెట్లు విచారపడఁబనిలేదో యట్టులే తన స్వధర్మమందున్న లక్ష్మణునకై విచారపడఁ బనిలేదు- లాభకారియగు వృత్తియందుండువారికై వగచుట న్యాయ్యమా. దీనివలన జీవునికి భగవత్కైంకర్యమే స్వరూప స్వభావములని సూచన. ఎట్టివారికిని స్వధర్మనిర్వహణమే పరమధర్మము.

కం॥ వనవాసంబున నడజడి, జనకజ సుఖశీల యెఱుఁగ(*)జాలకయా తాఁ
    జనియె? నటు లెంచకుము నీ,
        తనయుని ధర్మాత్ముఁ గొలుచు(*)తమిఁ దోన చనెన్. ॥౮॥

తాత్పర్యము

వనవాసమునఁగల కష్టము తెలియక సీత శ్రీరాముని వెంటఁబోయెనని తలఁచితివి కాఁబోలు-అది పొరపాటు-ఆమె సుఖశీల-సుఖమునిచ్చు నాచారముగలది-సుఖానుభవముచేఁ బ్రకాశించునది. ఈలోకసుఖము సుఖముగాదు. పరలోక సుఖమే సుఖము. ఆ సుఖము గలిగించు నాచారముగలది-అదెట్లనెదవా- ఆమె మహాజ్ఞానియు యోగియునగు జనకరాజు కూఁతురు జనకుఁడు వైదేహుఁడు. "వైదేహస్తువిదేహత"యని విదేహముక్తిని సదేహుఁడయియే యార్జించినవాఁడు. విదేహుఁడు ప్రత్యగాత్మయే కదా. అట్లు కేవల జ్ఞానానందస్వరూపమగు నాత్మనుండి దీపమునుండి వచ్చిన దీపమువలెనుండు నయోనిజ సీత. అట్టియామె యజ్ఞానముచే రాముని వెంబడించెనని తలంపకుము. ఆమె సహధర్మచారిణి "స్త్రీణాం భర్తాహి దైవత"మ్మనుట యెఱిఁగినది కావున నామె స్వధర్మమామె రక్షించుకొనుటకై కేవల ధర్మస్వరూపుఁడైన భర్తను సేవించు కోరికతో నాయన

వెంటఁబోయెను. ఇట్లా ముప్పురు స్వధర్మాచరణమే యుత్తమోత్తమ ధర్మమార్గ మని స్వానుష్ఠానపూర్వకముగ లోకమున కుపదేశింపఁబూనియుండ వారికై యేడ్చెద వేలమ్మా.

కం॥ కీర్తిధ్వజ మెల్లెడలఁ బ్రవర్తింపఁగఁ జేయు జగతిఁ • బ్రభుఁ డగువిసల
న్మూర్తి వ్రతసత్యధర్మ, స్ఫూర్తిధనుం డతని కేల• పొనరుం గొదవల్.

విలసన్మూర్తి=విశేషముగఁ బ్రకాశించు నాకారముగలవాఁడు, వి + లసత్ + మూర్తి=పరమాత్మయొక్క యీలోకమునఁ బ్రకాశించు నాకారముగలవాఁడు- విశ్వభుషివ్యోమ్నివాతే పరమాత్మని పక్షిణి॥ నానా. ర. పరమాత్మయే యీలోకమున నంతర్యామివలెఁగాక నీయాకారమున సర్వజనగోచరుఁడై ప్రకాశించుచున్నాఁడు- వ్రత సత్య ధర్మస్ఫూర్తిధనుఁడు- వ్రత=శరణాగతరక్షణమే నా వ్రతమని, ఏతద్వ్రతమ్మని శ్రీరాముఁడే చెప్పినట్లు శరణాగతరక్షావ్రతము, సత్య=రాముం డిరుమాటలాడఁ డెన్నండున్- అన్నట్లు సత్యము, ధర్మము- "రామో విగ్రహవాన్ ధర్మః" రాముఁ డాకారమును గొన్న ధర్మమన్నట్లు ధర్మము, వీనియొక్క ప్రకాశమే,ధనుఁడు=ధనముగాఁగలవాఁడు, కీర్తిధ్వజము =వ్రతసత్య ధర్మధనుఁడు రాముఁడను కీర్తిధ్వజమును. "తస్యనామ మహ ద్యశ" యను శ్రుత్యర్థమిందు వివరింపఁబడియె- ప్రభువు = (1) సమర్థుఁడు (2) ప్రభువు- ప్రభూ శక్తాధిపౌ॥ నానా॥ ర॥

తాత్పర్యము

శ్రీరాముఁడు తన కీర్తిటెక్కెమును లోకమునందుఁ బ్రవర్తింపఁజేయును- ఆయనకీర్తి లోకమున శాశ్వతముగ నిలువఁగలదు. అటువంటి ప్రభువు అంతటి సమర్థుఁడు అటువంటి యుత్కృష్ట జన్మగలవాఁడు వ్రతము ధర్మము సత్యము వీని ప్రకాశమే ధనముగాఁ గలవాఁడు. ఇట్టివానికి నడవినుండిననన్నియుఁ బూర్ణముగ లభింపవని యింటనుండిన లభించుననియూ నీ యుద్దేశము ? ఆయన యెక్కడనున్నను బూర్ణుఁడే. ఆయనకే కొఱఁతయు లేదు. పూర్ణమదః పూర్ణమి దమ్మనుటకు శ్రీమధ్వాచార్యులవారీ యర్థమునే వ్రాసిరి.

సీ॥ ఆరాముఁ బ్రచితామ•హత్త్వంబు లెంతయు,వ్యక్తంబు లగుటను•వనజహితుఁడు
దనకిరణంబులఁ•దాపంబుఁ గూర్పఁడు, వానికిఁ గానన•వాటులందు
యుక్తశీతోష్ణ మై•యొప్పఁగఁ గమ్మని, మందవాయువు సుఖ • మంద వీచు
శయనించుననఘుపై•జనకునట్టులు మిహి,కాంశుఁడు కరములు•నంటి మిగుల

తే॥ హర్ష మొనగూర్చు, నాశంబ•రామరారి
తనయు వధియింప మెచ్చి వి•ధాత యొవని
కిచ్చె దివ్యాస్త్రముల నాయ•హీనసత్త్వుఁ
డుండు నట లెస్స యింటియం•దున్నయట్లు.

అది యెట్లు? అడవులలోఁ బోవునపు డెండ గాలి తాపము గూర్పఁగుండునా! సుకవాసి శ్రీరాముఁ డివి యెట్లు సహింపఁగలఁడని కౌసల్య యడుగునని తలఁచి దానికి సుమిత్ర సమాధానము చెప్పుచున్నది. సమస్త దేవతలు నాతని యాజ్ఞా ప్రకారము నడచువారే కావున నతనికి ననుకూలురై యే యుందురని వివరించు చున్నది.

> భయాదస్యాగ్ని స్తపతి। భయా త్తపతిసూర్యః
> భయాదింద్రశ్చవాయుశ్చ। మృత్యుర్ధావతిపంచమః॥
> మృత్యుర్యస్యోపసేచనం। కఇత్థావేదయత్రసః॥

అను కఠోపనిషద్వాక్యంబులు స్మరణీయంబులు.

శుచితా=మనస్సు, వాక్కు, కాయము అను త్రికరణముల శుద్ధి (౭) అవ గుణములు లేకుండుట అపహత పాప్మాతిగుణములని తీర్థీయము,మహత్త్వము =అందఱు తన యాజ్ఞప్రకారము నడచుకొనునట్లుచేయు గొప్పతనము, వ్యక్తము=అందఱకు స్పష్టముగఁ దెలిసినది, వనజహితుఁడు=సూర్యుఁడు, తాపంబు=వేఁడిని, కూర్పఁడు=శ్రీరామునకుఁ గలిగింపఁడు "భీషోదేతిసూర్య" యను శ్రుతిప్రకారము ఏ పరమాత్మకు సూర్యుఁడు భయపడుచుండునో యట్టి పరమాత్ముని శ్రీరాముని సూర్యుఁడు తపింపఁ జేయఁగలఁడా, చేయునా, ఇంత వఱకు భీతోదేతి సూర్య యను శ్రుత్యర్థము వివరించి యిఁక భీషాస్మాద్వాతః పవతే ఈయనకు భయపడుచు గాలి వీచును అను శ్రుత్యర్థమును వివరించు చున్నది, కానన వాటులందున్=అడవిప్రదేశములందు ఇందుండివచ్చు గాలి పుష్పములపైనుండి వచ్చుటచే సువాసనగలదై యుండును. చెట్లయాటంకము వలన మందమైయుండును గాని హోరనియుండదు, ఇదియే వివరింపఁబడు చున్నది. కమ్మని=మంచివాసనగలదైన మందమారుతము, యుక్తశీతోష్ణమై= ఆయాసమయములకుఁ దగినట్టు లెండలవేళ చల్లగాను శీతాకాలమున వేఁడి గాను, సుఖము గలుగునట్లు విసరును. ఇఁక రాత్రులందు మిహికాంశుఁడు= మంచు కిరణములుగల చంద్రుఁడు, కరములన్ = కిరణములచే, అంటి = తాఁకి, జనకునట్టులు = తండ్రివలె, హర్షము = సంతోషము, ఒనగూర్చున్ = కలిగించును, ఈవిషయమున ఏతస్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచంద్ర మసౌవిధృతౌ తిష్ఠంత" యను శ్రుత్యర్థము విశదీకరింపఁబడెను, ఈ చిల్లరదేవతలే కాదు దేవజ్యేష్ఠుఁడగు బ్రహ్మయు శ్రీరాముని గారవించును. ఎట్లనిన శంబరాసురారితనయు=తిమిధ్వజుఁడను శంబరాసురుని కొడుకును వధియింపన్=చంపఁగా, విధాత=బ్రహ్మ, అహీన సత్త్వుఁడు=హీనముగాని బలముగలవాఁడు, (చూ. పద్యము ౬౫ ప్రథమ పాదము ౫౫౪,౫౫౫ పద్యములు) రాముఁడు పూర్వమొకప్పుడు దండ కారణ్యమునకుఁబోయి యందువైజయంతమను పట్టణమున వసించుశంబరా సురుని కొడుకును జంపెను. అప్పుడు బ్రహ్మ సంతోషించియనేక దివ్యాస్త్ర

ము లు శ్రీరామున కిచ్చెను. పూర్వవృత్తమును సమయోచిత సందర్భము లందుఁ జెప్పుట వాల్మీకిశైలియందలి విశేషము. ఇది ముందే చెప్పఁబడెను.

ఇందలి సినపాదవిషయమునుబట్టి చూడ నాదినుండి త్రికరణశుద్ధిగలవారికి భౌతికతాపములు గలుగవనియు నెండగాని గాలిగాని బాధింపవనియు,వానివలన నేబాధలేనపుడు మృగాదుల బాధలును గలుగవనియు నేర్పడుచున్నది.

శ్రీరాముఁడు త్రికరణములందును బరిశుద్ధుఁడని లోకమునకంతయు స్పష్ట ముగాఁ దెలియుటచే సూర్యుని కిరణము లాయనకు వేఁడిగానుండవు. గాలియు సువాసనగలదై మెల్లగా సమయమునకుఁ దగినట్లు వేఁడిగను జల్లగను విసరును. శ్రీరాముఁడు పండుకొనినవేళ చంద్రుఁడు తన కిరణములచేఁ దండ్రివలెఁ దాఁకి సంతోషము గలిగించును. శంబరాసురుని కొడుకును జంపినపుడు బ్రహ్మ మెచ్చుకొని దివ్యాస్త్రము లనేకము లిచ్చెను. అటువంటి పరిపూర్ణ సత్త్వుఁడు భవనమువలె వనమునందును సుఖముగానేయుండును.

తే॥ ఏనిశరములమార్గంబు•లోన గోచ,రించుమార్తురు ముట్ట న•శించువార
లట్టివిక్రమశాలి నీ•పట్టి వాని,యాజ్ఞ వర్తింప కెటు లుండు•నఖిలధరణి.

మార్తురు=విరోధులు, ముట్ట=మొదలుముట్ట-సమూలము.

తాత్పర్యము

సాధువులు గుణములఁజూచి మెత్తురుగాని యసాధువులు మెత్తురా? కీడు చేయకుందురా ? యనెదవేమో అభయములేదు. ఎవని బాణము పోవునంత ప్రదేశములోనుండు శత్రువులు నిశ్శేషముగా నశింతురు గాని సమీపమునకైన రాఁజాలరు. అట్టివారికిఁ గీడేమి చేయఁగలరు. దుష్టులను శౌర్యముచే జయిం చును గావున వాని యాజ్ఞప్రకారను సమస్తభూమియు వర్తించును. ఆయనను అతిక్రమించువారు లేరు కావున శ్రీరాముఁడు మరలి వచ్చినపుడు భరతుఁడాయ నకు రాజ్యమీయఁడను భయములేదు. సామముచే నీయకున్న దండముచే నిచ్చును.

తే॥ బలము శౌర్యంబు కాంతిసం•పదయు నెపుడు
వెలుఁగు నెవ్వానియందు నా•వీరవరుఁడు
కాననావాసమునుండి•క్రమ్మఱంగ
వచ్చి తూర్ణంబ పాలించు•వసుధ యెల్ల. ౧౧౧౮

ఎపుడు=సర్వకాల సర్వదేశములందును.

తాత్పర్యము

అమ్మా! లోకములోఁ దక్కిన యందఱియందు బలము శౌర్యము తేజము కొంతకాలముండి కొంతకాలము లేకయుండును. ఒక ప్రదేశమునందుండి వేఱొక

చోట లేకయుండును. శ్రీరామునం దట్లుకాదు. అవి సర్వకాలముల సర్వదేశముల నాయనను విడిచియుండవు. అటువంటి యుత్తమవీరుఁడు అడవియందు వసియించి మరలి శీఘ్రముగ వచ్చి రాజ్యమంతయుఁ బాలించును. ఇది మంథర ౨౩౫, ౨౩౬ పద్యములందుఁ జెప్పిన విషయమును ఖండించుచున్నది. పదునాలుగేఁడులు శ్రీరాముఁ డరణ్యవాసము చేయుటయందుఁ జచ్చినను చావవచ్చును ఒకవేళ బ్రదికివచ్చినను నీలోపల ప్రజలు సేనలు నీ భరతున కనుకూలురైయుందురు గావున ఏకాంగియైన శ్రీరామునకంటె ససైన్యుఁడయిన నీ కొడుకు బలవంతుఁడగును. కావున రాముఁడు జయింపలేఁడని మంథర యుపాయము చెప్పెను. సుమిత్ర యీయభిప్రాయమును ఖండించుచు లోకమంతయు శ్రీరాముని యాజ్ఞకే లోపడియుండును. అన్ని లోకము లేకమైనను శ్రీరాముని జయింపఁజాలవు. గావున శ్రీరామునకు రాజ్యము నయముననో భయముననో రాకతప్పదని చెప్పెను.

ఉ॥ భానునకుం బ్రభాకరుఁడు•పావకపావకుఁ, డల్ల శ్రీకినిం
దా నగు శ్రీ, ప్రభుండు ప్రభు•నామకకోటికిఁ, గీర్తి కీర్తికిన్
మానుగ వేల్పువేలుపు, క్ష•మాక్షమ, భూతతతిం బ్రభూత మౌ,
వానికి లోప ముండు నొకొ•పట్టనమందునయేని కాననేన్? ౧౧౪౬

తమేవభాంత మనుభాతి సర్వమ్మన్య శ్రుత్యర్థమిందు వివరింపఁబడుచున్నది. భగవంతుఁడు తాను బ్రకాశించుచుఁ దన ప్రకాశముచే సర్వము ప్రకాశింపఁజేయుచున్నాఁడని యర్థము.

భానునకున్ = సూర్యునకు- ప్రకాశించువాఁడని వ్యుత్పత్త్యర్థము- అట్టివానికి, ప్రభాకరుఁడు=సూర్యుఁడు- కాంతిగలిగించువాఁడు, పావక=పావనము చేయువాఁడు- అగ్ని- అట్టిదానిని, పావకుఁడు=పావనము చేయువాఁడు, శ్రీలకున్=లక్ష్ములకు, శ్రీ=లక్ష్మి, కీర్తికి=కీర్తి, వేల్పు=దేవత, క్షమా=భూమికి, క్షమ=ఓయున యట్టి మహాత్ముఁడు, ప్రభునామకకోటికిన్=ప్రభువులని పేరుగలవారి సమూహమునకు, ప్రభువు=అధిపతి. బ్రహ్మరుద్రాదులు భగవంతుని యాజ్ఞానువర్తులు గదా. 'ఏవిభుని దివ్యకళాంశజు లజ్జగర్భ గౌరీపతి ముఖ్యదేవ ముని బృందములు॥ భాగ॥ బ్రహ్మకు బ్రహ్మత్వము రుద్రునకు రుద్రత్వము ఇంద్రునకింద్రత్వము వారివారి నాయాయధికారములు మాహాత్మ్యము లీశ్వరసంకల్పాధీనములే కదా. కీర్తికిం గీర్తి, తస్యనామ మహద్యశ యన్నట్లు కీర్తి యితనినాశ్రయించియుండుటచేతనే యందమువలెఁ గాక మాహాత్మ్యము చెందినది. కానఁ గీర్తికిఁ గీర్తి కలిగించువాఁడు భగవంతుఁడే. వేల్పు వేల్పు = దేవతలకు దేవత "తందైవతానాం పరమంచదైవత"మ్మన్న శ్రుత్యర్థ మిచ్చట వివరింపఁబడెను. క్షమాక్షమ=అన్నిటిని ధరించు భూమినిచూడ ధరించువాఁడు- "యస్మిన్ ద్యౌః పృథివీచాంతరిక్షంచ" యను శ్రుతి యిందు వివరింపఁబడెను. భూతతతిం

ప్రభూతము=భూతసమూహములందెల్లఁ బెద్దభూతము- "ఏకో విష్ణుర్మహాభూతం పృథగ్భూతాన్యనేకశ" యను శ్రుత్యర్థ మిందు వివరింపఁబడెను. ఇట్లు శ్రుతిప్రతిపాదితుఁడైన భగవంతుఁడు శ్రీరాముఁడే యని యాయనయందుఁగల కల్యాణగుణములను వర్ణించి యాయనయందు హేయగుణ మొకటియైనలేదని చెప్పి యట్టివానికి లోపముండు నొకొయని చెప్పెను. పట్టనమందున యేని కాననేన్= పట్టనమందున్నను అడవియందున్నను లోపములేదు. అనఁగా నిత్యవిభూతియందుండిన గుణములన్నియు లీలావిభూతియందును గలవు కాని లీలావిభూతియం దేలోపము వికారములేదని భావము. నిత్యవిభూతితోఁ బోల్చినపుడు మనకు లీలావిభూతి యసహ్యమై కానవచ్చును. ఆయనకు రెండును సమానములే. అది వాసగృహమైన నిది క్రీడాశాల. కొండమీఁదనుండి చూచువానికి క్రింది మిట్టలు పల్లములు సమానములే. చక్రవర్తి పట్టనమందైనను జక్రవర్తియే, వనమందైనను జక్రవర్తియే. నేలనడచువానికిఁగదా మిట్టలు పల్లములు- పూర్ణమదః పూర్ణమిదం అను శ్రుత్యర్థ మిచట ననుసంధించునది, లోపము=దుర్గుణము- భగవంతుఁడు హేయప్రత్యనీక కల్యాణ గుణైకతానుఁడు గదా.

తాత్పర్యము

శ్రీరాముఁడనిన నేమని తలఁచితివో- సూర్యునకు సూర్యుఁడు, అగ్నికి నగ్ని, శ్రీకి శ్రీ, ప్రభువులకుఁ బ్రభువు, కీర్తికిఁ గీర్తి, దేవతలకు దేవత, భూమికి భూమి, భూతములందెల్ల మహాభూతము- ఇట్టివాఁ డరణ్యముననున్నను మహానగరమందున్నను నేమి లోపముండును. ఆయనకు రెండు సమానములే- భేదదృష్టిగల మనకు భేదము తోఁచును.

ఉ॥ శీలవతీమణీ: సుతుఁడు చెచ్చెరవచ్చి ధరాధరాసుతా
శ్రీలను గూడి వేడ్క నభిషేకము ముప్పొరితోడఁ గైకొనన్
జాలుగబాష్పపూరములు జాఱ నవారిగ లోచనంబులన్
హాళిని లోకులెల్లరుఁ గనెంగలవార లపాస్తశోకులై. ౧౧౮

శీలవతీమణీ=పతివ్రతారత్నమా, చెచ్చెరన్=చెరచెర చెచ్చెర=శీఘ్రముగ, ధరా, ధరాసుతా, శ్రీలను=భూమిని సీతను సంపత్తును, జాలుగన్ = ప్రవాహముగ, అపాస్తశోకుఁడై =పోయిన వ్యసనముగలవాఁడై ధరాధరాసుతాశ్రీలు ముప్పొరితోడనసుటచే=శ్రీ భూనీళలు స్ఫురించెడిని.

తాత్పర్యము

పరమపదమందు శ్రీ భూనీళలతోఁగూడిన భగవంతునివలె శ్రీరాముఁడు త్వరగా నరణ్యమునుండి వచ్చి భూ-సీతా-లక్ష్ములతో నభిషేకము చేయించుకొనఁగా లోకులందఱు సంతోషముతో నానందబాష్పములు వెల్లువలుపాఱ దుఃఖము వదలినవారై చూడఁగలరు.

కం॥ భామహితుని నపరాజితు, స్వామిని గుశచీరధరుని • బద్మాలయ నా
భూమిసుత యనుగమనించెను, రామునకునుదుర్లభంబు • గ్రాలునె యెందున్.

భామహితునిన్ = కాంతిచేఁ గొప్పవానిని, అపరాజితున్ = పరాజయము లేనివానిని, స్వామిని=స్వమ్ముగలవాఁడు స్వామి-స్వమ్ము=సొమ్ము. లోకస్వామి భగవంతుఁడొకఁడే-భామహితునిన్-భామ! హితునిన్ = ఓయమ్మ! తనకు హితుఁడైనవానిననియుఁ బదవిభాగము చేయవచ్చును. కుశచీరధరుని = దర్భలతోఁ జేయఁబడిన వస్త్రమును ధరించినవానిని,పద్మాలయనాన్=లక్ష్మీదేవివలె- కుశచీర యనఁగా దర్భలవలెఁ గఱకైన నారవస్త్రములని భావము. లేక దర్భలచే నల్లఁబడినదనియైనఁ జెప్పవచ్చును.

తాత్పర్యము

కాంతిచేఁ బ్రకాశించువానిని, దనకు హితుఁడైనవానిని బరాజయ మెఱుఁగనివానిని సర్వమునకు స్వామియైనవానిని గుశలతోఁ జేయఁబడిన వస్త్రమును ధరించినవానిని లక్ష్మీదేవివలె సీత వెంబడించెను. కావున శ్రీరామునకు దుర్లభం బెందైనఁ గలుగునా. లక్ష్మీదేవి వనవాసము పోయినట్లని సామెత- శ్రీమంతుల కాపద లెక్కడివి యన్నట్లు లక్ష్మీతోడనుండువానికి నసాధ్యమేదిగలదు. అన్నియు నామెయే సంఘటింపఁజేయును. భగవత్కార్యములు చేయునది భగవచ్ఛక్తియేకదా.

ఆయన స్వశక్తి యటులుండ "అప్రమేయంహి తత్తేజోయస్యసా జనకాత్మజా" యన్నట్టు లాయనతేజస్సామె సాంగత్యమువలన నపరిమేయముగ వెలుఁగును. కావున శ్రీరాముఁ డెందున్నను శ్రీమంతుఁడే కావున విచారపడకుము.

కం॥ భీమధనుర్ధరసత్తముఁ డో మహిళా! ఖడ్గమార్గ • ణోగ్రుఁడు నడువన్
దా మున్నుగ లక్ష్మణుఁ డా,రామునకును దుర్లభంబు • గ్రాలునె యెందున్.

రాక్షసులో దుష్టమృగములో తటాలున మీఁదఁబడిన నాఁడుపిల్ల సీత యేమి చేయఁగలదందువా అట్లు భయపడఁ గారణములేదు. ఏలందువా?

భీమ=భయంకరమైన, ధనుః=వింటిని, ధర=ధరించిన, సత్తముఁడు=ఉత్తముఁడు- భయంకరమైన విల్లు ధరించువారిలో శ్రేష్ఠుఁడు- విల్లు దూరమందున్న శత్రువుల వధింప నుపకరించును, ఖడ్గమార్గణోగ్రుఁడు = కత్తి- బాణములచే భయంకరుఁడు- తటాలున సమీపమున వచ్చినవారినిజంప నివి యుపకరించును.

తాత్పర్యము.

భయంకరమైన విల్లు బాణములు కత్తి ధరించి లక్ష్మణుఁడు ముందుపోవుచుండఁ జూచిన రాక్షసులు క్రూర మృగములు భయపడి దూరమందే పరువెత్తఁగలవు. ఇఁక మీఁదికి నెట్లు రాఁగలవు- ఒకవేళ వచ్చెనా లక్ష్మణునిఁ జంపి కదా రామునిమీఁదికి రావలెను.ఇంతలో శ్రీరాముఁడు హెచ్చరిక పడఁడా కావున నా కొమకు లక్ష్మణుఁ డూపిరితోనుండువఱకు నీకొడుకు శ్రీరామునకు దుర్లభములేదు.

కం॥ ఒట్టగు శపథం బగు నీ,పట్టి యరణ్యంబునుండి • వచ్చిన మరలన్
దొట్టినముదమునఁ జూచెదు, కట్టాశోకంబు మోహ•గరిమయు విడుమీ.

ఒట్టవున్ = ఒట్టుపెట్టుకొని చెప్పెదను- శపథంబవున్ = ప్రమాణముచేసి చెప్పెదను- ఎక్కువ నమ్మకము గలుగుటకై రెండుమార్లు చెప్పుట, పట్టి = కొడుకు, తొట్టినన్=కలిగిన, గరిమ=అతిశయము- రూ. గరిమము-విశ్వకర్మాత్మ శబ్దంబులు ఇమనిజంతంబులు నకారాంత మనుష్యశబ్దంబులు బహుళంబుగ స్త్రీ సమంబులు- సు- వ్యా. తత్సమ ౪౪ సూ.

తా త్ప ర్య ము

ఒకటి రెండు మార్లు ప్రమాణముచేసి చెప్పెదను వినుము- నామాట తప్పదు- నీకొడు కరణ్యమునుండి మరలి క్షేమముగా రాఁగా నీవు సంతోషముతోఁ జూడఁగలవు కావున శోకము మోహము వదలిపెట్టుము.

కం॥ ఈనీపదములఁ బడి యో, మానిని! నీతనయుఁడే న•మస్కృతిఁ జేయన్
జానుగ నుదితాబ్జునివలెఁ, గానం గల వేల నీకుఁ•గాఱియపడఁగన్. ౧౯౧

ఉదితాబ్జునివలెన్=ఉదయించు చంద్రునివలె ననఁగా శుక్లపక్షమునఁ బాడ్యమినాఁటి చంద్రునివలెనని భావము- పూర్ణచంద్రుఁడని చెప్పిన నావల క్షీణదశ సూచించును, కాఱియ=దుఃఖము, ఈ నీ పదమునన్=జన్మాంతరమునఁ గాదు. ఈ జన్మమందే నీపుత్రన్నకొడుకే మఱియెవ్వఁడోగాఁడు. ఈనీపదములందే మఱియెవ్వరి పాదములందోకాదు.

తా త్ప ర్య ము

నీయొక్క యీ పాదములందే వడి నీ కొడుకు నమస్కరింపఁగా సంతోషముతోఁ గ్రొత్తగాఁ బుట్టు చంద్రునివలె నీవు చూడఁగలవు- ఏల వృథా బాధ పడెదవు, నీవు జీవించియుండఁగనే నీకొడుకు మరల రాఁగలఁడు.

కం॥ క్రమ్మఱి పురికి న్వచ్చి సు,ఖమ్ముగ నభిషిక్తుఁ డైన•గాదిలిపుత్రున్
నెమ్మది నానందాశ్రులు, గ్రమ్మఁగఁ గనులారఁ జూడఁ•గలవు సుశీలా.

తా త్ప ర్య ము　　౧౯౨

అడవినుండి మరలి యయోధ్యకు సుఖముగా వచ్చి పట్టాభిషేకము చేసి కొన్న ప్రియపుత్రుని నే విచారములేని మనస్సుతో సంతోషమువలనఁ గన్నుల యందు నీరు గ్రమ్ముచుండఁ గన్నుల పండువుగ నీవే చూడఁగలవు. ఎక్కడి పదునాలుగేండ్లు? ఎక్కడి నేను? అంతవఱకు నేను జీవింతునని యేమినమ్మకము. నేను జీవించియుండినను రాముఁడు జీవించి మరలి వచ్చునని యేమినమ్మకము? ఏధైర్యముతో నీవీమాట చెప్పెదవందువా నీవు సుశీలవు. నీకు దీర్ఘశోకము భగవంతుఁడు కల్పింపఁడు. ఇప్పటిశోకము మబ్బునీడవంటిది.

కం॥ శోకింపకు మమ్మా దుః,ఖాకుల విటు గాక పుత్రు•నందవు కీడుల్
వే కాంచెదు సహలక్ష్మణు, జ్మాకన్యాసహితు రామ•చంద్రుని నిచటన్.

దుఃఖాకులవు=దుఃఖముచేఁ గలఁతనొందినదానవు. ౧౭

తాత్పర్యము.

అమ్మా! యేడువకుము- దుఃఖముచేఁ గలఁతనొందకుము- నీ కొడుకున కేహానియు రాదు. లక్ష్మణుతోడను సీతతోడను గూడిన నీ కొడుకును శ్రీరామచంద్రుని నీయూరనే, నీయింటనే, పరలోకమందుఁగాదు చూడఁగలవు.

కం॥ ఇందఱు నూరార్పఁగ నీ,కుం దగ వగుఁ గాక నీవ•కోమలి వగపుం
జెందఁగ ని న్నూరార్పఁగ, నిం దెవ్వరు గల రిదేమి•యేడ్చెద విట్టుల్.

తాత్పర్యము ౧౮

శ్రీ సీతారాములకై యిందఱు దుఃఖించుచున్నారు. అంతియగాక నీదశ చూచియు నీకై శోకముపడుచున్నారు. వీరినందఱును నీవు ధైర్యము వహించి యూరార్పవలయును, గాని నీవిట్లు దుఃఖపడుచుండిన నిందు నిన్నెవ రూరార్చువారుగలరు? సీతారాముల దుఃఖముగాక నీదుఃఖము మాకందఱకుఁ గలిగింప న్యాయ్యమా?

కం॥ రాము జనయిత్రి వై గుణ,ధామా! దుఃఖింప నీకుఁ•దగునే చెపుమా
రామునికంటెను వే ఱొకఁ, డిమహి సన్మార్గవర్తి•యేఁడి లేఁడే. ౧౯

గుణధామ=గుణములకు నిల్లైనదానా.

తాత్పర్యము

శ్రీరామునివంటి ధీరునకుఁ దల్లివై నీ విట్లు శోకింప నీకుఁ దగునా? నీవే చెప్పుము-తల్లి గుణములుకదా కొడుకునకు వచ్చును. నీ వెంతటి ధీరవోకాక మంకి యొకదానవైన నీకడుపున శ్రీరామునివంటి ధీరుఁ డెట్లు పుట్టును. నీవు సద్గుణములకు స్థానమైనదానవు కదా శ్రీరామునికంటె సన్మార్గమందు నడచువాఁడు వేఱొకఁడుండిన జెప్పుము- ఏఁడీ- ఎక్కడనున్నాఁడు- లేఁడు కదా.

ఆ॥ వందమానుఁ డైన•నందను సహమిత్రుఁ, గాంచి కూర్మిపుత్రుఁ•గన్నులారఁ
గారునందు నీరు•గార్చు మబ్బున హర్ష,జలకణాళి విడుపఁ•గలవు నీవు.

కారునందు=వానకాలమున, వందమానుఁడు=నమస్కరించుచున్నవాఁడు, నందనున్=కుమారుని, సహమిత్రున్=మిత్రులతోఁ గూడినవానిని, హర్షజలకణాళి = ఆనందబాష్పములు.

తాత్పర్యము

స్నేహితులతోఁ గూడినవాఁడును నమస్కరించుచున్నవాఁడును నగు నీ ముద్దులకొడుకును గన్నులారఁజూచి వానకాలమందు మేఘము వర్షము గురియునట్లు లానందబాష్పములు కురియింపఁగలవు.

ఉ॥ వైళమ వచ్చి త్వచ్చరణ•వారిజముల్ దనమెత్తచేతులన్
పాళిని బట్టి నీతనయుఁ•డాతనిశీర్షముమీఁద నశ్రువుల్
శైలముమీఁదఁ గార్మొయిలు•లాగునఁ జాలుగొనంగఁ జేయఁగాఁ
జాలెద వీవ, యిప్పుగిది•జాలిఁబడం బని యేమి చెప్పుమా. ౧౧౯౩

వైళమ = శీఘ్రముగానే, త్వచ్చరణవారిజముల్ = నీ పాదకమలములు, జాలుకొనంగన్=వెల్లువపాఱఁజేయఁగా, జాలి=వ్యసనము.

తాత్పర్యము

శీఘ్రముగా వచ్చి నీకుమారుఁడు శ్రీరాముఁడు నీ పాదకమలములను తన మెత్తని చేతులచే సంతోషముతోఁ బట్టుకొని నమస్కరింపఁగా నతని శిరము మీఁదఁ గారుమబ్బు జడివాన కురియించునట్టు లానందబాష్పములు నీవే వెల్లువ పాఱఁజేయఁగలవు. అట్టి నీవే వ్యసనపడఁ గారణమేమి?

కం॥ ఈసరణినుడులచే నా,శ్వాసింప సుమిత్ర పెక్కు•చందంబుల నా
కౌసల్య శోక మంతం, బాసెను శరదల్పవారి•వారిద మనఁగన్. ౧౧౯౪

ఈసరణిమాటలన్=ఇట్టి మాటలచే, ఆశ్వాసింపన్=ఊరార్పఁగా, శరదల్పవారి వారిదము=శరత్కాలమందుఁ గొంచెము నీళ్ళుగల మేఘము.

తాత్పర్యము

ఇటువంటి మాటలచే సుమిత్ర పెక్కువిధముల కౌసల్య నూఱడింపఁగా నామెయుఁ గొంచెము నీరుగల శరత్కాలమేఘ మా నీటిని విడిచినట్లు శోకమంతయుఁ బాసెను.

—• ౪౫-వ సర్గము. శ్రీరాముఁడు పౌరులను మరలిపోవఁ బ్రార్థించుట. •—

సీ॥ అక్కడ శ్రీరాముఁ•డడవిమార్గముఁ బట్టి, చనుచుండ ననురక్తి•జనము లెల్ల
రథము వెంబడిఁ బోవ•రాజును సచివులు, వల దని వారింప•వారు వినక
పోవుచు నుండిరి•పురమునవారికి, నతులయశస్వి రా•కాబ్జునట్టి
వాఁడు పౌరులు దన్నుఁ•పలదయ్యె, మరలుమంచును వేఁడ•మరలఁడయ్యెఁ

తే॥ దనదుజనకుని సత్యవా•దిని నొనర్ప, నిట్లు పోవుచుఁ దనవెంట•నేగుదెంచు
ప్రజలనెల్లరఁ దనకన్న•ప్రజలయట్లు,
స్నేహమునఁ జూచి యను రఘు•శేఖరుండు. ౧౧౯౫

శ్రీరామ నిర్గమనానంతరము పౌరులయు నంతఃపురమువారలయు నవస్థయు సుమిత్ర కౌసల్యకు దుఃఖోపశమనముఁ గావించుటయుఁ దెలిసి యిఁక శ్రీ సీతారామలక్ష్మణుల వృత్తము చెప్పఁబడుచున్నది— అక్కడన్ = పురము వెలుపల, అనురక్తిన్=ప్రేమముచే, సచివులు=మంత్రులు, పురమునవారికి = పురమునందలివారికి "చేటుపురంబున వారి కెమ్మెయిన్" భార. విరాటపర్వము. అతులయశస్వి=అసమానకీర్తిగలవాఁడు, రాకాబ్జునట్టి=రాకా=షోడశకలాపూర్ణుఁ

డైన చంద్రునిఁగల రాత్రియందలి, అబ్జినట్టి=చంద్రునివంటి, తన కన్న ప్రజలు=తాను గన్నబిడ్డలు.

తాత్పర్యము

పురము వెలుపల శ్రీరాముఁ డడవిత్రోవఁబట్టి పోవుచుండ ననురాగము గలవారగుటచే జనులందఱు రథము వెంటఁబోవుచుండ రాజును మంత్రులు పోవలదు పోవలదని నిలిపినను వారు నిలువకపోవుచునుండిరి.

బంధువుల ప్రేమకు లోకులభక్తికి నెంత భేదము కలదు!! పురమునందలి వారికి నసమానకీర్తిగల శ్రీరామచంద్రుఁడు పదునాఱు కళలతోఁ గూడిన చంద్రునివంటివాఁడు కావునఁ బున్నమనాఁటి నిండు చందురుని జూడఁబోవలదు. మూలయింటఁ గూర్చుండుఁడనిన నెవరువిందురు. రాజులుమంత్రులు శ్రీరాముని వెంట మీరుపోవలదని చెప్పినఁ బ్రజలు విననట్లు ప్రజలు పోవలదు పోవలదని చెప్పినను శ్రీరాముఁడు తండ్రిని సత్యవాదినిజేయఁ దలంపు గలవాఁడగుటచే వినఁడయ్యె. మనో నేత్రాహ్లాదముగోరి జనులు నిలువనపుడు పరలోక సౌఖ్యము తండ్రికిఁ గలిగింపఁగోరిన శ్రీరాముఁడా నిలుచును. ఇట్లు పోవుచుఁ దనవెంట వచ్చుచున్న పురజనులఁజూచి శ్రీరామచంద్రుఁ డిట్లనియె. దీనివలన రాజాజ్ఞ మీఱియైన భగవదనుగమనము చేయవలయునని యేర్పడుచున్నది.

కం॥ నాయందలిమీప్రీతియు, నాయందలిగౌరవంబు • నయగుణులారా
చేయుఁడు భరతునియెడ మీ,
రాయదియే నాకుఁ గడుఁ బ్రి • యం బగుఁ జుండీ. ౧౨౦౦

నయగుణులారా=న్యాయ్యవర్తనమే గుణముగాఁగలవారలారా.

తాత్పర్యము

నాయందు మీకుఁగల ప్రీతిగౌరవములు, భరతునియందుంపుఁడు-అట్లు మీరు చేసితిరేని నన్ను మీరు గౌరవించుటవలన సంతోషపడుటకంటె హెచ్చుగ సంతోషపడెదను. భగవంతుఁడు తన్నర్చించువారికంటెఁ దన భక్తుల నర్చించు వారి విషయమున నెక్కువగ సంతోషించునుగదా.

తే॥ అతఁడు కైకసుతుఁడు క • ల్యాణచరితుఁ
డారఁ బ్రియము హితం బగు • నవియ యెల్ల
మీకు ఘటియించు నెద మెర • మెర విడుఁడు
పదఁడు మీమీగృహములకుఁ • బౌరులార. ౧౨౦౧

కల్యాణచరితుఁడు=లోకులకు మేలగు మంచి నడవడిగలవాఁడు, మెర మెర=దుఃఖము సందేహమువలనఁ గలుగు మనోవికారము, పదఁడు=పొండు.

తాత్పర్యము

భరతుఁడు కైక పుత్రుఁడు గదా యని మీరు సందేహింపవలసిన పనిలేదు. అతఁడు మంచి నడవడిగలవాఁడు- మీకు నింపైనవి మేలైనవియగు కార్యము

లన్నియుఁ జేయును. మీ కహితము చేయఁడు. ఏమోయని సందేహముగాని భయముగాని దుఃఖముగాని వలదు_ పౌరులారా మీమీ యిండ్లకు మీరు పొండు.

కం॥ వినుఁడు వయస్సున బాలుం,
డును జ్ఞానమునందు వృద్ధుఁ డును మృదుగుణుఁడున్
ఘనవీర్యవంతుఁ డాతం, డనురూపపుభర్త మీకు నగు భయ మేలా.

భరతుఁడు పిల్లవాఁడు. ఆయనకు లోకులవిచార మేమి కాఁబట్టినదని తలఁప వలదు. వయస్సునఁ జిన్నవాఁడైనను జ్ఞానమునందు వృద్ధుఁడు. మీఁదు మిక్కిలి పిల్లతనపుఁ జేష్టలు లేకుండుటే కాక మృదువైన గుణము గలవాఁడు. అటువంటి మెతక మమ్మేమి రక్షించునందురేమో_ వీర్యము గలవాఁడు నయమున లోపడనివారిని దండించు శక్తిగలవాఁడు. కావున మీకుఁదగినభర్తయే. నిష్కారణభయము మీకేల?

కం॥ రాజగుణలక్షితుఁడు యువ,రాజుగ నియమింపఁబడె భరతు డటుగానన్
రాజాజ్ఞ కార్యమగుఁగా,యోజింపుఁడు నాకు మీకు నున్నజనులకున్.

ఉన్న=తక్కిన. తాత్పర్యము ౧_౨౦౩

రాజగుణలక్షితుఁడు=గొప్ప రాజులయం దుండవలసిన గుణములన్నియుఁ గలవాఁడు కావున భరతుఁడు మీకు యువరాజుగా రాజుగారిచే నియమింపఁ బడెను. అట్టి రాజాజ్ఞప్రకారము మీరు నేను తక్కిన జనములు నడువవలసిన వార మేకదా.

ఉ॥ నాకుఁ బ్రియంబు సేతయు మనంబున మీకు రుచించు నేని యో
లోకులు! నే నరణ్యములలోఁ జరియించెడివేళఁ దండ్రికిన్
స్తోకముఁ గుందు లేనిగతిఁ జూచికొనుం డని చెప్పఁ జెప్ప ధ
ర్మైకరతాత్ము భూపతిగ నందఱుఁ గోరిరి రాము నయ్యెడన్. ౧_౨౦౪

లోకులు=లోకులారా, స్తోకము=అల్పము, కుందు = దుఃఖము, ధర్మైకరతాత్మున్=ధర్మము నొక్కదానియందే_ ప్రేమగల మనస్సుగలవానిని.

తాత్పర్యము

లోకులారా! నాకు సంతోషము గలిగింప మీకు నిష్టమేని నే నడవులలోఁ దిరుగు కాలమందు మా తండ్రికిఁ గొంచెమైన వ్యసనము మనస్సునకుఁ దగులకుండునట్లు కనిపెట్టుఁడు అని యెంత చెప్పినను ధర్మము నొక్కదానియందే ప్రీతిగల శ్రీరాముఁడే రాజుగనుండ వారెల్లఁ గోరిరి. మొదట యువరాజుగా నిన్నే కదా రాజు నియమించెను. ఆ యాజ్ఞ నీవు మేము దాఁటరాదుగదా రారమ్ము పోదమనిరి.

కం॥ ఎంతెంత జనకతనయా, కాంతుఁడు ధర్మంబునుండి కదలఁడొ తిరుఁడై
యంతంత పౌరులును భూ,కాంతునిఁగా రామవిభునిఁ గాంక్షించు రెదన్.

తిరుఁడై = స్థిరుఁడై. ౧_౨౦౫

తా త్ప ర్య ము

శ్రీరాముఁడు మనస్సు స్థిరముచేసికొని ధర్మమునుండి యెట్లు చలింప లేదో ప్రజలను నిటువంటి ధర్మాత్ముఁడు గదా మనకు రాజుగా నుండఁదగిన వాఁడు కావున నీయననే మనము మరలించుకొనిపోయి రాజుగాఁ జేసికొన వలయునని వారును బట్టుపట్టిరి.

కం॥ కన్నుల బాష్పము లురల, న్విన్నని మోమునను వచ్చు•నిఖిలజనములన్
ప్రన్నని తనగుణముల నా, యన్న సలక్ష్మణుఁడు గట్టి•యాకర్షించెన్.

విన్నని=తెల్లఁబోయిన, మోమునను=ముఖములతో- మోమునను అను నేకవచనప్రయోగముచే నందఱ ముఖము లేక విధమునఁ దేజోహీనమైయుండె నని భావము. ప్రన్నని=మనోహరములగు,తన గుణములన్=తన గుణములను, త్రాళ్ళచే=శ్లిష్టరూపకము, సలక్ష్మణుఁడు = లక్ష్మణునితోడి శ్రీరాముఁడనుటచే ధర్మమునందు నిరువురు సమానులని భావము. అనఁగాఁ గౌసల్యయొద్ద మాట లాడినట్లు పౌరులపక్షమున మాటలాడక శ్రీరాముఁడు చెప్పినదానికనురూపముగ లక్ష్మణుఁడు చెప్పెనని భావము, ఆకర్షించెన్=లాగెను.

తా త్ప ర్య ము

కన్నుల నీళ్ళుకాఱఁగాఁ దెల్లవాఱిన ముఖములతో వచ్చు నెల్ల జనులను లక్ష్మణుతోడి శ్రీరాముఁడు తన మృదుగుణములను త్రాళ్ళచేఁగట్టి యీడ్చుకొని పోయెను. కన్నుల నీళ్ళనిండి త్రోవకానరాకయున్నవారిని దానే లాగుకొని పోయెనని భావము.

కం॥ జ్ఞానవయస్తేజముల న,నూనంబుగ వృద్ధులైన•యుర్వీజనముల్
మానక తల వడఁకెడివా, రీనెఱి వెను చిక్కి యనిరి•యెలుఁగెత్తి వ్యథన్.

జ్ఞానవయస్తేజముల్ = జ్ఞానమునందు వయస్సునందు తేజమునందు, అనూనంబుగన్=మిక్కిలి, ఈనెఱి=ఈవిధముగ,ఎలుఁగెత్తి=పెద్దధ్వనితో- రెండవ పాదంబున నఖ యతి. తా త్ప ర్య ము.

జ్ఞానమునందు, వయస్సునందు, తపస్సువలనఁగలిగిన తేజమునందు మిగుల వృద్ధులగువారు తల వడఁకుచుండ రథము వెంటఁ బరువెత్తఁజాలక వెనుకఁజిక్కి మిగుల దుఃఖము బాధపడుచు గొంతెత్తి పెద్దధ్వనితో నిట్లనిరి.

ఉ॥ ఓరఘురాము మోసికొని•యుద్గతిఁ బోయెడిజాతివాజులా
రా! రమణున్ వివాసిగ న•రణ్యముకై కొనిపోదు వే యిటు
ల్దూరిరజవంబుమాని మర•లుం డిఁకఁ బోకుఁడు, దాఁటఁ డెప్డు సీ
తారమణుండు వృద్ధలపి•తంబులు మీ రిటు నీఱఁ బెల్లునే. ౧౦-౨౦౮

ఉద్గతిన్=మిగులవేగమున, జాతివాజులారా! ఆ మంత్రణంబున విశిష్టా౽ విశిష్ట సంబోధ్యవాచకంబునకు ముందు విభాషగ ఓ యగు. ష. వ్యా. తత్సమ-

సూ. ౫౮. ఉత్తమజాతి గుఱ్ఱములారా, ఉద్గతి=ఊర్ధ్వగమనము- శ్రీరాముని మోచికొనిపోయిన కారణమున నా సేవాఫలముగ గుఱ్ఱములకుఁగూడ నూర్ధ్వ లోకగతులుగలవని భావము- జాతియనఁగా నుత్తమజాతియనియే భావము. 'సానలఁదీరిన జాతిరత్నముల్' వసుచరిత్ర ౧ ఆశ్వా, వాజి=గుఱ్ఱము- వాజము గలది- పూర్వమున గుఱ్ఱములకు ఱెక్కలుండుటచే నీ పేరు వచ్చినది, రమణుస్= ప్రియుఁడైనవానిని, క్రూరజవంబు=తీవ్రవేగము. అచేతనజవము క్రూరముగాదు- క్రూరుఁడైనవాఁడు పరులకు బాధ గలిగించునట్లు మీవేగము మాకు బాధకరముగ నున్నదని భావము- మిమ్ము వేగముగఁదోలువాఁడు నిర్దయుఁడు- అతఁడు శ్రీరామాజ్ఞ ప్రకారము వర్తించువాఁడు గనుక శ్రీరాముఁడు నిర్దయుఁడని భావము. శ్రీరాము ననలేకయు వానిని సంబోధించిన శ్రీరామునకు దయవచ్చు నను తాత్పర్యముతోను గుఱ్ఱముల సంబోధించుచున్నారు, వృద్ధలపితంబులు= పెద్దలమాటలు.

తాత్పర్యము

శ్రీరాముని మోచికొనిపోవు నుత్తమాశ్వములారా! మీరు పశువులు కావున మీరు సత్కార్యముచేయునది అసత్కార్యము చేయునది మీకుఁ దెలియలేదు. తెలిసియుండిన లోకరమణుఁడైన శ్రీరాముని నరణ్యములో విడిపింప నిటు లేమో మునిఁగిపోయినట్టు లింత వేగముగఁబోదురా. మీరు చేయు కార్యము లోకుల కెంత బాధగలిగించునదో పశువులైన మీకేమి తెలియును. ఇఁకఁ బోవ వలదు. వెనుకకు మరలుఁడు మీకై తోఁపకున్నఁ జెప్పినమీఁదనైన వినుఁడు. పెద్దవారి మాటలు శ్రీరాముఁ డతిక్రమింపఁడే. శ్రీరాముని గుఱ్ఱములై మీరతిక్ర మింపవచ్చునా? పోవలదన్నను బోవచ్చునా?

తే॥ కర్ణవంతము లయినమృ•గంబులందు,
గుఱ్ఱములె శ్రేష్ఠములు గదా•కోర్కెగలిగి
యెన్నఁడెవరిని వేఁడము•యిట్టిమేము,
మిమ్ముఁ బ్రార్థించెదము వేగ•క్రమ్మఱుండు. ౧౦౯

కర్ణవంతములు =చెవులుగలవి- సూక్ష్మధ్వనినైన గుఱ్ఱములు గ్రహింపఁ గలవు. ఇట్టి మీకు మా మాటలు వినరాలేదా- ఇది పొగడ్తమాటయునగు- మిమ్ము=పశువులైన మిమ్ము- మనుష్యులమైన మేము.

తాత్పర్యము

చెవులుగలవానిలోనెల్ల సూక్ష్మధ్వనినైన గ్రహించుశక్తి మీయందు విశేష ముగఁగలదు. అట్టి మీకు మా మాటలు వినరాలేదా. అట్లు పోవుచున్నారేమి? ఇంతవఱకు మే మెవరిని దేనినేని యాచించినవారముగాము- ఇప్పుడు మిమ్ముఁ బ్రార్థించుచున్నాము. వెనుకకుఁ దిరుగుఁడు- ఇది మా ప్రార్థన- యాచకుల

యాశ వ్యర్థముచేయనివాఁడు శ్రీరాముఁడు. అట్టి శ్రీరామునియొద్దఁజేరి మీ రిట్లుచేయుట తగదు. దీనివలన నాయనకు నపకీర్తివచ్చును.

కం॥ వీరుఁడు ధర్మైకసదా,చారుఁడు పూతుండు రామ•చంద్రుం డతనిన్
మీరలు పురికిని గొనిరా, కారణ్యతలాళి విడువ•నరిగెద రేలా! ౧౨౧౦

ధర్మైకసదాచారుఁడు=ధర్మమే ప్రధానముగాఁగల మంచి యాచారము గలవాఁడు, పూతుఁడు=పరిశుద్ధుఁడు.

తాత్పర్యము

శ్రీరాముఁడు శూరుఁడును ధర్మమే ప్రధానముగాఁగల మంచి యాచారము గలవాఁడు త్రికరణములందుఁ బవిత్రుఁడైనవాఁడు. ఇట్టివానిని మీ రితర దేశములందున్నను మన యూరికిఁ బిలుచుకొనిరావలసియుండఁగా మన యూరనున్నవాని నడవులలో విడిపింపఁ దీసికొనిపోయెదరేల? ఎంత మీరు పశువులైనను నీమాత్రము జ్ఞానములేదా. (ఈ నిందాగర్భవాక్యములు పరంపరగా శ్రీరామునకే యన్వయింపవలయును.)

—• పౌరవృద్ధులు శ్రీరామునిఁ బురికి రాఁ బ్రార్థించుట. •—

చం॥ అని ప్రలపించుసద్ద్విజుల•యార్తనినాదము లాలకించి గ్ర
క్కన తనభార్య దమ్ముఁడు ది•గం దనతోడ రథంబుఁ గాల్నడన్
జనియెను సన్నికృష్టపద•చారములం దనవెన్క నున్నయా
జను లెయిదన్, రథస్థుఁ డయి•సాధ్యము గామి మరల్ప వారలన్. ౧౩౧౧

ప్రలపించు=ఏడ్చు, సద్ద్విజుల=బ్రాహ్మణశ్రేష్ఠులయొక్క, ఆర్తనినాదము=ఏడుపుధ్వని, సన్నికృష్టపదచారములన్=దగ్గఱ దగ్గఱ నడుగులు పెట్టికొనుచు, వీరెదుగఁదురు గాక యని తాత్పర్యము- మరలుట వ్రతభంగము- నిలుచుట ఆలస్యకారణము కావున మెల్లగ నడచిరి. పెద్దవారు నడచివచ్చినపుడు పిన్నలు వాహనము లెక్కరాదు- "తస్మాజ్జ్యాయాంకనీయాన్ ప్రత్యవరోహతి" శ్రుతి॥ పెద్దవారిని జూచి వాహనములం దున్నవారును దిగవలెను.

"దారుకుని చతురత్వంబునఁ దురంగంబుల పటుత్వంబున నత్యంత సమీచీనంబైన యానంబును మనంబలరంజనిచని యొక్కయెడ నారద జమదగ్ని కణ్వాదులగు మహామునులం గొందఱంగని రథంబుదిగ్గి నమస్కరించి కృష్ణుఁడు" భార. ఉద్యో. ౩. ౧౪౫, ఎయిదన్=ఎదిగి కలిసికొనఁగా.

తాత్పర్యము

ఈప్రకారము నేడ్పుధ్వనితో బిగ్గఱగాఁ బలుకుచుండు నాబ్రాహ్మణశ్రేష్ఠుల మాటలు విని త్వరగా రథము పోనిచ్చిన వారు కలిసికొనలేక దశరథునివలె వెనుకకు మరలిపోవుదురని తలఁచి రథమును ద్వరగాఁ దోలించెను- గాని వారు మరలక వెంటనే వచ్చుచున్న కారణముచే నిఁకఁ ద్వరతోఁబోయిన వారికి నెక్కువ బాధ

గలిగించినవాఁడనగుదునని శ్రీరాముఁడు సీతాలక్ష్మణులతోఁ దేరు దిగ్గి వారు కలిసికొందురుగాక యని మెల్లగ నడుగులో నడుగు పెట్టుకొనుచుఁ బోయెను.

కం॥ తేరిన్ డిగ్గియుఁ గాల్నడ, చారిత్రసువత్సలుండు • చనఁగఁ గృపాక్షున్
జేరి యిటు లనిరి ద్విజులో, శ్రీరామా యిట్లు సేయఁ • జెల్లునె నీకున్.

చారిత్రసువత్సలుండు=సదాచారమందు మిగులఁ బ్రీతిగలవాఁడు-గనుకనే మరలలేదు-నిలువలేదు, కృపాక్షున్=దయారసముచే నిండిన కన్నులుగలవాఁడు-గనుకనే తన వ్రతము చెడకుండునట్లు వారికి బాధలేకుండునట్లు రథము దిగి నడచెను. శ్రీరామా యిట్లుచేయఁ జెల్లునె నీకున్=ఇట్లు చేసిన శ్రీరాముఁడను పేరు నీకుఁ దగునా? శ్రీరాముఁడనఁగా వేషముచేత-వాక్కుచేత-రచనాదులచేతఁ గాంతిచేత సంపత్తుచేత లోకులను రమింపఁజేయువాఁడవు గదా. ఇటు మమ్ము దుఃఖపడఁజేసిన నీకెట్టు లాపేరు సార్థకమగును.

తా త్ప ర్య ము

తేరుదిగి మరలక నిలువక కాలినడకచేఁ బోవుచుండు సదాచార ప్రీతిగల శ్రీరాముని కరుణారసపూర్ణనేత్రుని గలిసికొని యా బ్రాహ్మణు లిట్లనిరి. శ్రీరామా శ్రీరాముఁడని పేరుగల నీవుకూడ నిట్లు చేయవచ్చునా. ఇట్లు చేసితివేని నీకా పేరు నేతిబీరకాయవంటిదేగదా యగును.

సీ॥ బ్రహ్మణ్యుఁ డగునిన్ను • బ్రాహ్మణ్య మిది యెల్ల,
వెనుకొని వచ్చెడిఁ • గనఁగదయ్య
యరణులయందు సం • మారోపితంబు లై, యగ్నులు వచ్చె ద్వి • జాంసములను
వాజపేయాధ్వర • ప్రాప్తాతపత్రముల్, శరదభ్రగతి వచ్చె • జాడఁ గనుము
ఛత్రహీనత నీవు • సంతాప మిటు లేల, పొంద నెందకు దివ్య • సుందరాంగ
తే॥ యస్మదీయముల్ వాజపే • యార్జితంబు,
లయినగొడుగులు పట్టెద • మయ్య వాని
చాయలనురమ్ము వేదాను • సారిణిమతి వసుల సీతోడఁ దిరుగంగ • వాంఛపడియె.

బ్రాహ్మణు లిట్లు దీనులై చెప్పుకొన్నను శ్రీరాముఁ డంగీకరింపకుండుట చూచి యిటులైనఁగాని మరలఁడని నీవు మావెంట వచ్చెదవా-మమ్ము నీవెంటఁ బిలుచుకొని పోయెదవాయని యడుగుచున్నారు. బ్రహ్మణ్యుఁడు=బ్రాహ్మణో మమ దేవతా యన్నట్లు బ్రాహ్మణులు తనకుఁ బ్రియులుగాఁ గలవాఁడు, బ్రాహ్మణ్యము=బ్రాహ్మణసమూహము, అరణులయందు=చిలికి నిప్పుకలిగించెడి కొయ్యలందు, సమారోపితంబులై=ఆరోపింపఁబడినవై, ద్విజాంసములను=బ్రాహ్మణుల మూఁపులమీఁద, వాజపేయాధ్వర=వాజపేయమను యాగమునందు, ప్రాప్త=లభించిన, ఆతపత్రముల్=గొడుగులు, శరదభ్రగతిన్=శరత్కాలమందలి తెల్లని మేఘమువలె, జాడ=విధము, ఛత్రహీనత=గొడుగులేక, అస్మదీయము=మావి, వాజపేయార్జితంబులు=వాజపేయమందు సంపాదించినవి- "బృహస్పతి

సవేనవా ప్రత్యవరోహిణీయేన యజేతశ్వేతచ్ఛత్రీ భవతీతివిజ్ఞాయతే"- యని వాజపేయయాగము చేసినవారు యావజ్జీవము తెల్లనిగొడుగు ధరింపవలెను, ఛాయల=నీడలందు, వేదానుసారిణీమతి=మేమింతవఱకు నిశ్చింతముగా వేదాధ్యయన జపతపములచేఁ గాలము గడపువారము- ఇప్పుడు నీ వరణ్యమునకు బయలుదేఱ వానినన్ని వదలి నీ వెంబడి రాఁదొడఁగితిమి- ఇఁకమీఁద నవి జరగకుండిన నాదోషము నీదేయని భారము శ్రీరాముని మీఁద వైచుచున్నారు, వేదానుసారిణి=వేదాభ్యాసముచేతను మంత్ర జపముచేతను వేదములనే యనుసరించియున్న మనస్సు- వైదికకర్మములను వదలినవారు వ్రాత్యులగుదురుగదా యనిన నెవని నిమిత్తమెయనఁగా నెవనిఁ బ్రాపించుటకై యీవైదికకర్మముల నెల్ల మేము చేయుచున్నామో యట్టి కర్మఫలమగు నీవు మమ్ము వదలిపోయిన నిష్ఫలకర్మములఁజేసి యేమి లాభము- మాకుఁ బ్రాప్యము నీవుగాని యవి గావు- ఇంతవఱకుఁ గర్మముల నుపాయముగాఁగొని నిన్నుఁ బ్రాపింపఁ గోరియుంటిమి- ఇఁక వానితో మాకుఁ బనిలేదు- నీవే యుపాయమని నీ సేవయే కర్తవ్యమని నీవెంటనే వచ్చెదము-

చం॥ కటకట మోసపోయితిమి కాంతలపాటియు బుద్ధిలేదు నేఁ
డిటహరిఁ గానఁబోనెఱుఁగ మేముదురాత్మకుల మేముకల్మషో
ద్భటులము విష్ణుదూరగుల ప్రాజ్ఞతలేల తపంబులేల ప
ర్యటనములేల శీలములు యాగములున్ మఱియేలకాల్పనే॥

అను భాగవతవాక్యము స్మరించునది-చేత వెన్నయుంచుకొని నేతికై పరులఁ బ్రార్థించువాఁ డేమాత్రము బుద్ధిమంతుఁడు. భగవత్ప్రాప్తికై భగవంతుని యాశ్రయము వదలి కర్మములఁజేయువాఁ డేపాటి బుద్ధిమంతుఁడు.

తాత్పర్యము

బ్రాహ్మణప్రియుఁడవైన నీవెంట బ్రాహ్మణసమూహము వచ్చుచున్నది. ఇందేమి దోషము మమ్మేల రావలదనెదవు- మీరు నిత్యాగ్నిహోత్రులు- మీరిటు వచ్చిన నగ్నులు చెడునుగదా యందువేమో- అగ్నుల నరణులయం దారోపించితిమి- వానిని బ్రాహ్మణులు భుజములమీఁద నుంచికొని మోచి తెచ్చుచున్నారు. నిరతాగ్నిహోత్రులే కాదు- వాజపేయయాగము చేసినవారుకూడ వచ్చుచున్నారు. అదిగోఁ జూడుము- వారి తెల్లనిగొడుగులు- నీవేల యెండలో నిట్లు నడచిపోవవలయును. వాజపేయయాగమందు మేము సంపాదించి యావజ్జీవము ధరింపవలసిన గొడుగును నీకుఁ బట్టెదము- ఫలభోక్తవు నీవేకదా. నీవు వాని నీడలలో రమ్ము- వేదముల నేమి చేసెదరనుదువా- నీతోడనుండి, యుండినచోటనే, యధ్యయనము చేసెదము-వేదముల ననుసరించియే మా మనస్సులున్నవి- వేదములందుఁ బ్రాప్యుఁడవు నీవే యని చెప్పఁ దెలిసికొంటిమి- అట్టి ప్రాప్యమగు నీవు విడనాడిపోయిన మాయజ్ఞములేల? తపస్సులేల? వేదము

లేల? వానివలనఁ గలుగు ఫలమున కంటె నీతోడనుండుటే యెక్కువ ఫలము. కావున నీతోడ మేమును నడవులందుఁ దిరిగెదము. నీతోడనుండువఱకు మాకుఁ గర్మలోపభయములేదు. నీసేవకు విరుద్ధమగు కర్మము త్యాజ్యమనికదా శాస్త్రము చెప్పుచున్నది.

"నాయమాత్మా ప్రవచనేనలభ్యః, నమేధయా న బహునా శ్రుతేన యమే వైషవృణుతే తేనలభ్య" యను శ్రుతివాక్య మిచ్చట ననుసంధించునది- ఈ యాత్మ వేదాధ్యయనముచే లభింపదు-బుద్ధిబలముచేతను లభింపదు-పెక్కులు వినుటచేతను లభింపదు- తన్ను వరించువానికి లభించును అని యర్థము. ఈ వేదవాక్యము ననుసరించి మనస్సుగలవారమగుట మేము నీవెంటఁబడినారము. నీవే మమ్ము ననుగ్రహించి స్మరించి వరించి రక్షింపవలసియుండఁగా మేము నిన్ను వరించినను నిరాకరించెదవేల? శ్రుత్యర్థము వ్యర్థమా? ఈఫలము గలి గింపవేని యా వేదాధ్యయనము యజ్ఞములు లోనైనవి వ్యర్థములు.

కం॥ పాతివ్రత్యసురక్షిత, లౌతరుణులు నిలుచువార • లాలయములలోఁ
బూతాస్మత్పరమార్థము,లై తగు వేదములు నిల్చు • నాత్మల మాకున్.

బ్రాహ్మణులారా! యగ్నిహోత్రముల నరణులయం దారోపించి తెచ్చు చున్నారు సంతోషమే. ఎవరివలన మీకా యగ్నిహోత్రములు లభించెనో యట్టి భార్యల నేమిచేసెదరు అనెదవా.

పాతివ్రత్య సురక్షితను=పాతివ్రత్యముచేఁ జక్కగఁ గాపాడఁబడినవారు- వారి పాతివ్రత్యమే వారిని గాపాడును- మేము కాపాడునది యేమున్నది. ఆలయములలోన్=ఇండ్లలో, పూత=పవిత్రములై, అస్మత్పరమార్థములై = మాకుత్తమ పురుషార్థములైన.   తాత్పర్యము

మా భార్యలను మేము కాపాడవలసిన పనిలేదు- వారి పాతివ్రత్యమే వారిని రక్షించును- వారు పతివ్రతలు కాకుండిరా అప్పుడును వారి భరించు భారము మాయందు లేదు.

కం॥ చేలములు ప్రహరులాలయ జాలంబులునిద్ది రాజసత్కృతులు తెఱల్
చాలవు చెలువలఁగావఁగ స్త్రీలకుసంరక్షకంబు శీలంబెపుడున్. యుద్ధ. ౧౧౪౨౮

అని నీవే చెప్పఁగలవు కదా. కావున వా రిండ్లయందేయుందురు. ఇఁక మాకుఁ బరమార్థములైన పవిత్రవేదములో మా మనస్సులందేయుండును. కావలసి నప్పుడంతయు నెందుండిన సందే వల్లింతుము.

ఉ॥ మానఁగదయ్య నీహృదయ • మార్గము, మామతినిశ్చయంబు ని
ట్లౌను గదయ్య, మామనవి • యారయ కీవ యుపేక్ష సేయుచున్
దీనికి మేలిధర్మమును • దేని నొనర్పఁగఁ జూచె? దీవ యి
ట్లైనను విప్రవాక్యమును • నారయువా రెవ రింక ధారిణిన్?   ౧౨౧౩

తాత్పర్యము

అయ్యా! రామచంద్రా! నీవు హృదయమునఁ దలంచిన వనవాసమార్గము వదలుము- మేము మనస్సులో నిశ్చయించుకొన్నది యిది. వచ్చితివా- మా వెంట నగరంబునకు రా- రానంటివా నీవెంట మేము వచ్చెదము- ఈ మా మన విని విచారింపక నీవుపేక్షించితివేని యింతకంటె గొప్పధర్మము నీవేమి చేయ గలవు- బ్రాహ్మణరక్షణమునకంటె గొప్పకార్య మేదికలదు- బ్రాహ్మణప్రియుఁడ వైన నీవే యీ ప్రకారము బ్రాహ్మణులమాట లక్ష్యముసేయనియెడల నింక నీ భూమియందుఁ జేయువారెవరు?

కం॥ తల వణఁకాడఁగ వెలిగువ్వలఁబోలిన నరల నొప్పు•వారము నిన్ జాఁ
గిలిపడి యీదుష్కృన ని,ర్మలశీలా! వేఁడెదము మ•రల్పుము తేరిన్.

వెలిగువ్వలన్=హంసలను- తెల్లనిపక్షులను, నరలన్=నరసిన వెండ్రుక లను- "కలయనరలువచ్చి తల తెల్లనైనంత"- యని భారతము. చాఁగిలఁబడి వేఁడెదము=ఇది నమస్కారరూప శరణాగతి- "నమస్కుర్యా ర్జనార్దన"మ్మని కలదుకదా. అట్టైన శరణాగతి వ్యర్థముపోవచ్చునా యనిన శరణాగతి వ్యర్థము కాదు. బలిష్ఠప్రారబ్ధ మడ్డుపడినఁ గాలవిలంబనమగును. ఇచ్చట పితృవాక్యపరి పాలన రూప ప్రారబ్ధము ముందుగానే యడ్డుపడుటచే దానికి విరుద్ధముగఁ జేయఁబడిన యీశరణాగతి కాలాంతరమున ఫలించెను. భరతుని శరణాగతి వెంటనే ఫలింపకుండుట కిదియే కారణము. ముందువచ్చినది ముందు వెనుక వచ్చినది వెనుక ననుభవింపవలయును. రేయి-పగలువలెఁ బరస్పర విరుద్ధము లైనవానికి నేకకాలప్రసక్తి లేదు.

తాత్పర్యము

శ్రీరామచంద్రా! తలవణఁకఁగ హంసలవలె నరసిన తెల్లని వెండ్రుకలు గలిగియున్న పండు ముసలివారము. ఇట్టి మేము నీకి దుమ్మునందుఁబడి సాష్టాంగ నమస్కారము చేసెదము. మలినములేని యాచారముగలవాఁడా! రథమును బురమువంకఁ ద్రిప్ప నాజ్ఞాపింపుము.

క్షత్రవైశ్యాభివాదేన, ప్రాయశ్చిత్తం కథంభవేత్
బ్రాహ్మణానాం దశాష్టౌవా అభివాద్యవిశుద్ధ్యతి
అభివాద్య ద్విజశ్శూద్రం, సచేలస్నాన మాచరేత్
బ్రాహ్మణానాం శతం సమ్యగభి వాద్యవిశుద్ధ్యతి. స్మృతిదర్పణము.

ఇట్లుండుటచే బ్రాహ్మణులు తక్కిన జాతివారికి నమస్కరించుట శాస్త్రవిరు ద్ధము-అందు జ్ఞానవృద్ధులు- వయోవృద్ధులు- పిల్లవాండ్రకు నమస్కరించుట మఱింత నిషిద్ధము. ఇట్లుండ వీరు క్షత్రియకుమారుఁడగు శ్రీరామునకు నమస్క రించుటకుఁ గారణము సాక్షాత్ భగవంతుఁడను జ్ఞానముచేతనే.

కం॥ ఇం దరుదెంచినసద్ద్విజు, లెందఱొ యజ్ఞముల కూని•రెల్లను సిద్ధం
బందునకు నవి సమాప్తిం, బొందించుట నీవశంబ•పుణ్యచరిత్రా. ౧౨౧౮

తాత్పర్యము

ఇచ్చటికి వచ్చిన సద్బ్రాహ్మణు లెందఱో యజ్ఞములు చేయఁ బ్రయత్నించి యున్నారు. వానికిఁ గావలసిన పదార్థములన్నియు సిద్ధముగానున్నవి. నీవు వచ్చి వానిని సమాప్తిఁబొందింపవలసినది. అది సాంతముచేయుట నీ స్వాధీనమం దున్నది. నీవు రాకున్న నవియెల్ల విఘ్నములగును. ఆదోషము నీదియే.

తే॥ జంగమాజంగమంబు లౌ•సకలభూత
తతులు నీయందు భక్తిమం•తములు నూవె
వేఁడుకొను చున్న భక్తుల•విషయమునను
గరుణ చూపుము మదిఁ దేకి•ఖలవిదారి. ౧౨౧౯

తాత్పర్యము

ఖలవిదారి=దుష్టులను ఖండించువాఁడా! నీవు దుష్టులనుగదా ఖండించువాఁడవు. సాధువులమగు బ్రాహ్మణులము మమ్మేల యిట్లు బాధించెదవు. నీయందు భక్తిగలవారము మేముమాత్రమేకాము. మానిమిత్తమైమాత్రమే నిన్ను వేఁడుచుండుటలేదు. జంగమములైన పశు పక్షి మనుష్యాదులును అజంగమంబులై సంచరింపని వృక్షగుల్మాదులునుగూడ నీయందు భక్తిగలవై యున్నవి. నోరులేనివి గావున పశుపక్షి వృక్షాదులు వేఁడుకొనలేక తమలోఁదామే దుఃఖించుచున్నవి. నోరుగలవారమగుట మేము ప్రార్థించుచున్నాము. కావున మాప్రార్థన యంగీకరింపుము 'స్నేహపూర్వమనుధ్యానం భక్తి రిత్యభిధీయతే" స్నేహపూర్వకమైన ధ్యానమునకే భక్తియనిపేరు.

ఉ॥ వేరులు నేలఁ బాఁతికొన•వెల్వడి నీబడి రా సమర్థతా
దూరములై కుజంబు లవె•తో యజలోచన! నిన్నుఁ జూచుచున్
బౌరులఁబోలె మమ్ము నెడఁ•బాసెదవే రఘురామ యంచుఁ దా
మూరక గాలివేగమున•హో రని యేడ్చుచు నున్న వక్కటా. ౧౨౨౦

నీబడి=నీవెంట, సమర్థతాదూరములై=సామర్థ్యము లేనివై, కుజంబులు=చెట్లు.

తాత్పర్యము

అజంగమంబులైన వృక్షాదులు మావలెఁ జెప్పుకొన నోరులేకున్న నంతస్సంజ్ఞములు గావున నీవియోగదుఃఖమునఁ దపించుచు నీవెంటవచ్చుటకు నేలఁ బాదుకొనిన వేళ్ళను బెకలించుకొను శక్తి లేక నిన్నుఁజూచుచు రామా పౌరులను వదలినట్లే మమ్ముఁగూడ నెడఁబాసెదవా నీకు మనుష్యులుగదా యపరాధము చేసినవారు మే మేదియుఁ జేయలేదుకదా మమ్మేలవిడిచెదవని గాలి వేగమున హోరని యేడ్చుచున్నవి చూడుము.

చెట్లకు సుఖ దుఃఖములుండుట శాస్త్రసిద్ధము, ప్రత్యక్షసాధ్యము, కావున నిట్లు జరగుటయందు వింత యేమియు లేదు.

తే॥ సర్వభూతానుకంపి వై జరగునిన్నుఁ, గదలమెదలక యాహారకలవ లేక
చెట్లకొమ్మలయంద నిశ్చేష్టితాండ,
జాళి యాచించుచున్నవల్లదిగోఁ గంటె. ౧౩౩

సర్వభూతానుకంపివి=సమస్తప్రాణులయందు దయగలవాఁడవు, ఆహారకలన లేక=ఆహారము గ్రహింపక, నిశ్చేష్టితాండజాళి=చేష్టలుడిగిన పక్షులగుంపు.

తాత్పర్యము

సమస్త ప్రాణికోటులయందు దయగల నిన్నుఁ గదలక మెదలక ఋషులవలెనై యాహారము గ్రహింపక యెగిరిపోక చెట్లకొమ్మలయందు నెందున్న వందేయుండి చేష్టలుమాని పక్షులగుంపులు నిన్నుఁ బోవలదని యాచించుచున్నవి. అదిగోఁ జూడుము.

—॰ ౪౬-వ సర్గము. శ్రీరాముఁడు తమసానదీతీరముఁ జేరుట. ॰—

తే॥ అనుచు రాము మరల్ప నాయఖిలజనము,
యాచన యొనర్ప శ్రీరాము నడ్డగింప
వచ్చెనో యనఁ దమసయన్వాహిని యట,
నడ్డముగ వచ్చెవారలయరుగుత్రోవ. ౧౩౧

తాత్పర్యము

ఈప్రకారము సమస్త జనులు మరలఁ బురంబునకు మరలింపఁ బ్రార్థించుచుండఁగ వారి మాట నాదరింపకపోవుచుండు శ్రీరామునిఁ బోకుండ నడ్డగింప వచ్చెనో యనునట్లు తమసయనునది వారు పోవు త్రోవ కడ్డముగవచ్చెను.

వారలయరుగుత్రోవ=వారలయొక్క యరుగునట్టి త్రోవ, సమాసంబునఁ బ్రథమకుషష్ఠి "హింసచేసినవారలయరుగుగతికి" భారతము.తమసానదినిప్పుడు **Toms** యందురు. ఇది గంగానది కుపనది. ఇచట నొక విశేషము గమనింపవలసియున్నది. "తమసః పరస్తాత్" "తమసః పరముచ్యతే" యన్నట్లు ప్రాకృతమండలమునకుఁ బొలిమేరవలెఁ దమస్సను సూక్ష్మప్రకృతియుండి "యవనికామాయా" యన్నట్లుపరదావలె భగవంతుని నడ్డగించుచున్నది. తమస్సును దాఁటియే భగవంతుఁడు ప్రాకృతమండలముందుఁ బ్రవేశింపవలెను. అట్టులే శ్రీరాముఁ డీతమసను దాఁటియే యరణ్యమును బ్రవేశించును, కృష్ణావతారమందును నల్లనినీళ్ళ యమునసుదాఁటియే యందుండు నరణ్యమును బ్రవేశించెను.దుఃఖకరమైన యీప్రపంచము జ్ఞానికి భక్తునికి నరణ్యమే.

తమసానది యడ్డమురాఁగానే శ్రీరాముని ప్రయాణము నిలిచిపోయెనని జనులు సంతోషించిరి గాని తమస్సు ఇంద్రియసుఖాసక్తి వదలని తమకడ్డమని తలంపరైరి.

ద్వి॥ అందఱకును రాత్రియగు నేదిదాని
యందు మేల్కొనియుండు నర్జునాయోగి
అందఱు జాగ్రత్తనంది యెందుండు
రందు యోగివరుండు నందును నిద్ర. ద్విపద. ౮.౧.

ఇందుఁ బూర్వార్ధమందుఁ జెప్పబడినవారు సీతాలక్ష్మణ సుమంత్రులు, ఉత్తరార్ధమున జెప్పఁబడినవారు ప్రజలు.

తమస్సు (నిద్ర) తమస, ప్రజల నతిక్రమించెఁగాని లక్ష్మణాదుల నతిక్రమింపఁ జాలదయ్యెఁగదా.

ఉ॥ అంత సుమంత్రుఁ డచ్చట హయంబుల దేరిని బాపి మార్గవి
శ్రాంతి దొలంగ నీరములఁ ద్రాపియు మేపు నొసంగి మేని నా
ద్యంతయుఁ దోమి కొంతవడి యట్టిటు త్రిప్పుచు నుండ జానకీ
కాంతుఁడు సీతఁ జూచుచును గాదిలితమ్మునితోడ నిట్లనున్. ౧-౨-౩

తాత్పర్యము

ఇట్లు తమసానది యద్దమునఁగా సాయంకాలమగుటచే సుమంత్రుఁడు రథమునిల్పి గుఱ్ఱములను దేనుండి విప్పి దారినడిచిన గాసిపోవ నీళ్ళుద్రాపి మేపుపెట్టి దేహమంతయుఁ జక్కఁగా రుద్ది కొంచెముకాల మిటునటు త్రిప్పుచు నుండఁగా శ్రీరాముఁడు సీతను నామె యంగీకారార్థమై చూచుచుఁ బ్రియసోదరుతో నిట్లనియె.

కం॥ మనకాననయాత్రావ్రత, దినములలో నిదియ మొదటి దిన మరిగెడి నో
యనఘా చేరితి మడవియు, వనవాసంబెట్లో యనుచు వగవకు మన్నా. ౧-౨-౩

తాత్పర్యము

కాననయాత్రావ్రతదినములు = అడవికిఁబోవుటకై పూనిన వ్రతదినములలో ననఁగాఁ బదునాలుగు సంవత్సరములలో మొదటిదినము చెల్లిపోవుచున్నది. అడవి చేరితిమి, వనవాసమిఁక నెట్లు చేయుదుమా యని విచారపడకుము.

ఈ మాటలు సీతకు ముఖ్యముగా నన్వయించును.

కం॥ మనుష్యవున నెలవులకుఁ గను, వన్యమృగవిహంగమాది వర్గంబులచే
శూన్యాటవు లేడ్చెడి క్రియ, మాన్యగుణా! తోఁచు చున్న మార్గము కంటే. ౧-౨-౪

మనుష్యవునన్=శోకముచే, నెలవులకున్=తమతమ యునికిపట్టులకు, వన్యమృగ విహంగమాది వర్గంబులచేన్=అడవియందుండు మృగములు పక్షులు మొదలైన వానిచే, శూన్యాటవులు=మనుష్యులులేని యడవులు,

తాత్పర్యము.

సాయంకాలమగుటచేఁ దమతమ గూండ్లకుఁ జను పక్షులు, గుహలకుఁ బోవు మృగములు చేయు ధ్వనుల నెపమున జనసంచారములేని యీ యడవులు శోకమున నేడ్చుచున్నట్లున్నవి. ఉత్ప్రేక్షాలంకారము.

ఉ॥ అక్కట మామకీనజన•కానుపమోజ్జ్వలరాజధానిలో
మక్కువ నెంచుచున్ మనల•మానవతీపురుషాళి మిక్కిలిం
బొక్కుచు నుండఁగా! సతత•మున్ భరతుం బినతమ్ము నిన్ను న
న్నక్కటికంబుతోడ వసు•ధాధిపునిం బ్రజ ప్రేముడించెడిన్. ౧౨౨౫

అడవిలోఁ బక్షుల యేడుపు పురములోని ప్రజలయేడుపు స్మరణమునకుఁ దేఁగా ననుచున్నాఁడు. మామకీన=నాయొక్క, జనకు=తండ్రియొక్క, అనుపమ=అసమానమై, ఉజ్జ్వల=ప్రకాశించు రాజధానిలో, మక్కువన్=ప్రేమచే, పినతమ్మున్=శత్రుఘ్నుని, అక్కటికంబు=దయ, ప్రేముడించు = ప్రేమించు, దశరథుఁడని పేరు చెప్పక, వసుధాధిపుఁడనుటచే శ్రీరామునకు దశరథునందుఁ గల భక్తిగౌరవములు ఆయన గర్వహీనత వెల్లడించుచున్నది. మానవతీపురుషాళి యని స్త్రీలను ముందు చెప్పుటచేఁ పురుషులకంటె స్త్రీలే యెక్కువగ నేడ్చుచున్నారని భావము.

తాత్పర్యము

అయ్యో! ఎంతకష్టము మనతండ్రియొక్క అసమానమై ప్రకాశించు రాజధానియందు మనలను ప్రేమతోఁ దలంచుచు స్త్రీలు పురుషులు మిక్కిలి దుఃఖించుచుందురు గదా. మన మడవులకుఁ బోయిన నూరివారికేల దుఃఖమనిన వారు భరతుని శత్రుఘ్నుని నిన్ను నన్ను దయతో రాజును ప్రేమించుటయే కారణము. మన మీఁద నెంతప్రేమయో యంత శోకముగాఁ బరిణమించెను.

భరతుని ముందుచెప్పి తమ్ముఁ గడపటఁ జెప్పుటచేఁ దనయందుండు ప్రేమకంటె భరతునందే ప్రజలకు నెక్కువ ప్రేమగలదని భావము.

చం॥ జనకుఁ దలంప దుఃఖ మగు•సాధ్వి యశస్విని వృద్ధ యైననా
జననిఁ దలంప గుండియలు•ఝల్లు మనున్ జుమి యంతకంతకున్
గొనకొని యేడ్చి యేడ్చి కడు•గోరముగాఁ గనుదోయి వాఁచఁగా
జనకులు చీఁకు లౌదు రొకొ•సందియ మయ్యెఁ గదయ్య లక్ష్మణా. ౧౨౨౬

సాధ్వి=పతివ్రత, యశస్విని=కీర్తిగలది, వృద్ధ = ముసలిది, గోరము= ఘోరము, చీఁకులు=అంధులు, జననీ+జనకుఁడు=జనకులు, ఏకశేషవృత్తి.

తాత్పర్యము

ఊరిలోవారు దుఃఖించుట యటుండ మనతండ్రినిదలంప దుఃఖమగుచున్నది. పతివ్రతయుఁ గీర్తిసుతియు,వృద్ధురాలునగు నాతల్లిని దలంచిన నంతకంటె దుఃఖమున గుండెలు ఝల్లు మనుచున్నవి. మనలను దలఁచి తలఁచి

యంతకంతకు దుఃఖము వృద్ధికాఁగా మిగుల ఘోరముగా రెండుకన్నులు వాఁచునట్లేడ్చుటచే మన తల్లిదండ్రులు గ్రుడ్డులగుదురో యని లక్ష్మణాసందేహముగానున్నది.

చం॥ కలఁడు గదా సుధీరతుఁడు కైకతనూజుఁడు తల్లిదండ్రుఁ దా
నలమట పొందకుండ నట నాదర మారఁగ సూఱడింపఁగాఁ
దలఁచి మఱిన్ మఱిన్ భరతు ధర్మర తత్వదయార్ద్రబుద్ధులన్
దలర నొకింతయేని తలి దండ్రులపట్ల సెడంద లక్ష్మణా. ౧౨౨౭

తల్లిదండ్రులమీద నీకంత ప్రేమయుండిన మరలఁ బోరాదా యని లక్ష్మణుఁడనునేమోయని దానికిఁ బరిహారము చెప్పుచున్నాఁడు.

సుధీరతుఁడు=మిగుల బుద్ధిమంతుఁడు, పండితులయందుఁ బ్రీతిగలవాఁడు, అలమట=బాధ, ధర్మరతత్త్వ=ధర్మమునందలిప్రీతియు. దయార్ద్రబుద్ధులన్=దయచేఁదడిసిన బుద్ధియు, తలరన్=చలింపను, ఎడఁదన్=హృదయమందు, మఱిన్=మఱియున్, యు లోపింపఁగా మిగిలినరూపము.

ఇది భరతునియందు లక్ష్మణునకుఁగల సందేహము నివర్తింపఁ జెప్పినమాట

తాత్పర్యము

అయినను దల్లిదండ్రుల విషయమై నాకు విచారము లేదు. ఏలనఁగా, భరతుఁడు కైకకొడుకైనను మిగుల బుద్ధిమంతుఁడు. కావునఁ దల్లిదండ్రులు దుఃఖింపకుండునట్లు లాదరించి యూఱడించుటకు భరతుఁడున్నాఁడుగదా, ఆయన ధర్మాసక్తి, దయతోఁ గూడినబుద్ధి వీనిని దలఁచి తలఁచి తల్లిదండ్రుల విషయమై నాకుఁ గొంచెమైనను విచారములేదు.

ఉ॥ మే లొనరించి తీవు నటు మేకొని నాబడి వచ్చి యీయర
ణ్యాళిని సీతఁ గావఁగ సహాయుఁడ వౌటను, నేఁటిరేయి యిం
దే లలి వన్యమూలము లనేకము లుండియు నీరుమాత్రమున్
గ్రోలి యుపాస ముండెదను గోరిక యయ్యెడు నట్లు సేయఁగన్. ౧౨౨౮

వన్యమూలములు=అడవియందు బుట్టినవేళ్లు, మేకొని=అంగీకరించి.

తాత్పర్యము

లక్ష్మణా! నీవు నా వెంటవచ్చుట కంగీకరించి యీ యడవులయందు సీతను రక్షింప సహాయుడవగుటచే నాకెంతో యుపకారము చేసినవాఁడవైతివి, ఈ యరణ్యమందు సేసు భుజింప ననేకములు దుంపలుగలవు, కాని నీళ్ళుమాత్రము త్రావి యుపవాసముచేయఁ గోరుచున్నాను. (నిన్నరాత్రి యుపవాసము, ఈ దినమంతయు నుపవాసము.)

కం॥ అనుచు సుమంత్రుం గనుఁగొని, యనఘా
గుఱ్ఱములఁ జూడు మవధానిత నాఁ
జని ప్రొద్దు గ్రుంక వాజుల,కును నీరును మేఁపు వెట్టి కొద లేకుండన్.

అవధానిత=హెచ్చరికతో, నాన్=అనఁగా. ౧౨౨౯

తాత్పర్యము

అని లక్ష్మణునకుఁ జెప్పి సుమంత్రుని జూచి పాపరహితుఁడా హెచ్చరికగా గుఱ్ఱముల నాదరింపుము అని చెప్పఁగాఁ బోయి యతఁడు సూర్యుఁ డస్తమింపఁగాఁ గుఱ్ఱములకుఁ గొదువలేకయుండ నీరు మేపుపెట్టి.

ఉ॥ ఆరసి మ్రొక్కి సంధ్యకును • నాతఁడు లక్ష్మణుతోడ నానదీ
తీరమునందు నాకులను • దీర్పఁగ శయ్యను బ్రీతియుక్తుఁ డై
చేరె రఘూద్వహుం డచటఁ • జేడియతోఁ బినతమ్ముతోడుతన్
గూరిమి, నన్నయున్ వదినె • కూరుకు చెందిన యంత వారలన్. ౧౨౩౦

తాత్పర్యము

వానిని విచారించి సూతులకును సంధ్యలందు సమంత్రకముగ సూర్యుని నమస్కరించుట కలదు. కావున సంధ్యాధిదేవతకు నమస్కరించి లక్ష్మణుతోడ నాయేటియొడ్డున నాకులతోఁ బడుక యేర్పాటు చేయఁగా సంతోషించినవాఁడై శ్రీరామచంద్రుఁ డాశయ్యయొద్దకు లక్ష్మణుతో సీతతోఁ బోయెను. అవల నన్నయు వదినెయు నిదురింపఁగా.

ఉ॥ చూపి సుమంత్రుతో ననియె • శూరకులాగ్రణి లక్ష్మణుండు కం
టే పడి యున్నవారు నవ • నీరజనేత్రులు సౌఖ్యపాత్రు లం
చీపగిదిన్ రఘూత్తము న • హీనగుణంబులు చెప్ప మూయ కె
న్నోపలుకాడు చుండఁగనె • యుగ్రకరుం డుదయింప నున్నెడన్. ౧౨౩౧

కంటే=కంటివా, చూచితివా, నవనీరజనేత్రులు=క్రొత్త కమలమువంటి కన్నులుగలవారు, ఇది సీతారాముల కిద్దఱి కన్వయము, నీరజనేత్రా+నీరజనేత్రుఁడు=నీరజనేత్రులు, ఏకశేషవృత్తి, సౌఖ్యపాత్రులు=సుఖార్హులు, ఇదియు నేకశేషమే, అహీనగుణంబులు=గొప్పగుణములు, ఉదయింపఁబోవుచుండఁగన్=శుక్రోదయముకాఁగా, చెప్పుచుండఁగనే=రాత్రి ముగిసెనుగాని శ్రీరాముని గుణవర్ణన ముగియలేదని భావము, "రాత్రి రేవవ్యరంసి" త్తనునట్లు.

తాత్పర్యము

లక్ష్మణుఁడు వారి నిరువురఁ జూపి సుమంత్రుతో నిట్లనియె, సుమంత్రా క్రొందామరలవంటి కన్నులు గలవాడును సుఖార్హులునగు శ్రీసీతారాములు నేలమీఁద నెట్లు పడియున్నారో చూచితివా అని యీ విధముగ శ్రీరాముని యెన్నో యుత్తమగుణములు కన్నుమూయక చెప్పుచుండఁగనే సూర్యుఁ డుదయించు చిహ్నము కనఁబడఁగా.

తే॥ గోకులాతులతీర మై • కొమరుమీఱు, నల్లతమసానదీతీర • మందుఁ బౌర
జనులతోడుత నారాత్రి • సంవసించె,
నాలుఁ దమ్ముండుఁ గొలువ గు • ణాకరుండు. ౧౨౩౨

గోకులాకులతీరమై=గోవుల గిట్టలచేఁ గలఁతపడిన తీరముకలదై, కొమరు మీఱు=అందమైన, గుణాకరుఁడు=సద్గుణముల స్థానమైనవాఁడు.

తాత్పర్యము

నీళ్ళు త్రావవచ్చు గోవులగిట్టలచేఁ గలఁతనొందిన యొడ్డుగలదై యందమైన యా తమసానదీతీరమునందుఁ బురవాసులతోడ భార్యయుఁ దమ్ముఁడు సేవింప గుణరత్నముల గనియగు శ్రీరాముఁ డారాత్రి సుఖముగా వసించెను.

—• శ్రీరాముఁడు పౌరుల మోసగించి పోవుట. •—

ఉ॥ అంతట మేలుకాంచి యట•నంతట నంతట నిద్దురం బథి
 శ్రాంతిని గూరి యున్న జన•సంఘములం గని కంటె లక్ష్మణా
 యెంతలు పుట్టె నాస విడి•యిండ్లపయిన్, మనమీఁది ప్రేమ సే
 గుంతల మిట్టం బడియుఁ•గూర్కెరి చెట్ల మొదళ్ళ నీజనుల్. ౧౩—33

అంతటన్=సూర్యోదయము కానున్న సమయమున, పథిశ్రాంతిన్=త్రోవ పయనించిన గాసిచే, కూరి=నిద్రపొంది.

తాత్పర్యము

ఉదయసమయమున శ్రీరాముఁడు నిద్దురమేలుకొని యానదీతీరమందు నచ్చట నచ్చట గుంపులు గుంపులై దాఁనడచిన గాసిచే నిద్రపోవు జనులగుంపులఁ జూచి లక్ష్మణా చూచితివా యెంతటి విపరీతములు పుట్టెనో యీ పౌరులు మన మీఁద ప్రేమచే నిండ్లమీఁద నిల్లాండ్రమీఁద నాసలువాని గుంత లనక మిట్టలనక పడి నిద్రపోవుచున్నారు.

చం॥ వలవదు మౌర్ఖ్య, మేఁ బురికి•వచ్చెడువాఁడను గాను, బొందనం
 బొలఁగరు, వెంబడిం బడిరి•నొక్కినచిఁచితి నేని ప్రాణము
 ల్దొలఁ గెడివారు, నిక్కమిది•లోకులు నిద్దుర గూరి యుండఁగా
 మెలసి రథంబు నెక్కి వన•మేదిని నిర్భయ మార్గసీమలన్. ౧౩—3౪

మౌర్ఖ్యము=మూర్ఖత్వము, హఠము, నొక్కి=ఒత్తిగట్టిగా, తొలఁగెడివారు=విడుచుటకు సిద్ధపడియున్నారు, నిక్కము=నిజము, మెలసి=జాగ్రత్త గలిగి, వనమేదిని=వనభూమిని, నిర్భయమార్గసీమలన్=భయములేని త్రోవప్రదేశము లందే.

తాత్పర్యము

ఓ జనులారా! యీ హఠమేల, వలదు, నే నూరికిరాను మీరు మరలి పొండని నేనెంత చెప్పినను వదలినవారు గారు, వెంటఁబడినారు, గట్టిగాఁ జెప్పితినా ప్రాణము విడుతురు, ఇది నిజము కావున వీరు నిదురించుచుండఁగనే మనము హెచ్చరికతో రథమెక్కి వనభూమియందు భయములేని మార్గములఁ బోదమా.

తే॥ పోదమా వీరలెల్లరు•నాదమఱచి, నిద్రగూరిరియిఁక నిట్లు•నిద్రఁగొనరు
ప్రజల స్వకృతంపు దుఃఖంబుఁ•బాపవలయు, నృపుఁడు;
నాకయివీరేల•నెగులు గొనఁగ ౧౨౩౫

ఆదమఱచి=ఆత్మశబ్దభవము ఆద, తమ దేహములు తమకుఁ తెలియక, కూరిరి=పొందిరి, స్వకృతంపు=దుఃఖంబు=వారై తెచ్చుకొన్న దుఃఖము, ఇది స్వేచ్ఛాప్రారబ్ధము, మనది పరేచ్ఛాప్రారబ్ధము, నెగులు=దుఃఖము.

తా త్ప ర్య ము

వీరు దేహములు తెలియక నిద్రపొందిరి, ఈనాఁడు వీరు నిద్రపోయినట్లు లిఁక నెన్నఁడు నిద్రపోరు- అంత గొసిపడియున్నారు, అయినను రాజనువాఁడు ప్రజలు తామై తెచ్చుకొన్న దుఃఖమును దొలఁగింపవలయును.

ఈనాఁడు నిద్రపోయినట్లు వీరిఁక నిద్రపోరు, ఒకసారి ప్రమాదపడిమహా ధనము గోల్పోయినవాఁడు మరల హెచ్చరికగానేయుండునుగదా, అట్టులే మన మింద్రియసుఖలోలురమై నిద్రించుటచేఁ గదా శ్రీరామసాన్నిధ్యము గోలుపోయితిమని యిఁకమీఁద హెచ్చరికగలిగి ప్రవర్తింతురు.

ప్రజల దుఃఖంబు నృపుఁడు పాపవలయుననుటచే రాజు తాను గష్టపడి నను దనమిత్తమై ప్రజలఁ గష్టపెట్టరాదు.

శ్లో॥ ఆవిష్టఇవ దుఃఖేన, తద్గతేన గరీయసా
సమన్వితః కరుణయా, పరయాదీన ముద్ధరేత్—కామందకము.

ఈనిద్ర సహజనిద్రగాదు, సహజనిద్రయైనవారిలో నొకఁడైన మేలఁకువ గలవాఁ డుండఁడా? ఇది మాయాప్రయోగమే, కృష్ణావతారంబునఁ గృష్ణుఁడు కారాగృహము వెడలిపోయినపుడు కావలివారిని గ్రమ్మిన మాయయే యిది యును.

ఉ॥ మేలు త్వరం జనంగ నన•మేకొన నావచనంబుఁ దమ్ముఁ, డా
వేళ సుమంత్రుఁ జూచి పృథి•వీతనయాపతి పల్కెఁ దేరి గు
఼ఱ్ఱాలను బూన్పు మేలుకొని•ఱం పొనరింపకమున్న యీ ప్రజల్
లీలగ దాఁటి పోవుదము•లె మ్మన నాతఁడు నట్లు చేయుచున్. ౧౨౩౬

మేకొనన్=అంగీకరింపఁగా, ఱంపు=ఱచ్చ.

తా త్ప ర్య ము

త్వరగాఁబోవుటమేలు అని శ్రీరాముఁడు చెప్పఁగా లక్ష్మణుఁడు దాని నంగీకరించెను. అప్పుడు శ్రీరాముఁడు సుమంత్రునిజూచి రథమునకు గుఱ్ఱాలను గుట్టుము. వీరు మేలుకొనిరా ఱచ్చచేయుదురు. కావున వారుమేలుకోక ముందే మనముసులభముగా నీ నదిని దాఁటి పోవుదము. లెమ్ము. అన నాతఁ డట్లుచేసెను.

ఉ॥ ఆయిత మయ్యెఁ దేరు మహి•తాత్మక నీవు సలక్ష్మణుండ వై
జాయను గూడి యెక్కు మనఁ•జయ్యన నాతఁ డొనర్ప నట్ల య

త్యాయతవేగ మైనతమ•సాపగ దాఁటఁగఁ దోలె సాది యం
దాయనఘుండు కాల్నడ మ•హాపథముం గని చొచ్చి యయ్యెడన్. ౧౬౩౭

అయితము=సిద్ధము, మహితాత్మక=గొప్పమనస్సుగలవాఁడా, జాయను=భార్యను, చయ్యనన్=శీఘ్రముగ, అత్యాయతవేగమైన=మిక్కిలి వేగముగల, తమసాపగ=తమసానది, సాది=సారథి, మహాపథమున్=పెద్దబాటను.

తాత్పర్యము

మహాత్మా! తేరు సిద్ధమయ్యెను, నీవు లక్ష్మణుతోడ భార్యతోడ రథము నెక్కుమనిన శీఘ్రమున శ్రీరాముఁడు నట్లుచేసెను. సారథియు మిక్కిలి వేగముగఁ బాఱు తమసానది దాఁటి రథము తోలెను. ఆవలిగట్టు సమీపమున నీళ్ళలోనే ముగ్గురు దిగి నడిచిపోయి యావలియొడ్డున పెద్దబాటను జూచిరి.

ఉ॥ పౌరుల మోసగింప నిటు పల్కె సుమంత్రునిఁ జూచి నీవొకం
డే రథ మెక్కి తూర్ణముగ•నేగుమ యుత్తరదిక్కుగాఁ, గడున్
దూరమునందునుండి పెడ•త్రోవను గ్రమ్మఱు మెట్టులైన నీ
పౌరులు మమ్ముఁ గన్గొనని•భంగి నొనర్పు సుమంత్ర! నావుడున్. ౧౬౩౮

తూర్ణముగన్=వేగముగ, పెడత్రోవను=తప్పుదారిని, దారిగానిదారిని, క్రమ్మఱుము=తిరిగిరమ్ము.

తాత్పర్యము

పురజనులను మోసగించుతలఁపున సుమంత్రునిఁజూచి శ్రీరాముఁ డిట్లనియె. సుమంత్రా! నీవొకఁడవే రథమెక్కి త్వరగా నుత్తరముఖమై యయోధ్యాపురముపైపుగ మిగులదూరముపొమ్ము అచ్చటనుండి రథముఁజూడపడనిత్రోవగఁ జూచి రథమును తప్పుత్రోవను తోలుకొనిరమ్ము. ఎట్టులయిననుసరియె. ఈ జనులు మమ్ముఁజూడక యుండువిధము చేయుము అని చెప్పెను.

తనయందింత ప్రేమయుంచి తనకై ప్రాణములైన విడువసిద్ధపడి యిండ్లు,వాకిండ్లు వదలి వచ్చిన భక్తులను శ్రీరాముఁ డిట్లు మోసగింపవచ్చునా యని యాక్షేపము.

సమాధానము:- ఒకనికి నొక గొప్ప వ్రణములైన యది యంతకంతకు నతిశయించినచో నపాయకరమని తోఁచినపుడు చికిత్సకుఁడు దాని ఛేదించి కుదిరించును. ఛేదించునపుడు రోగికిఁ గష్టముగానే యుండును గాని పిమ్మట నది సుఖకరముగానుండును. అట్లారాముఁడు పౌరులతో ననేకదినములుండ వారియానందము మితిమీఱినది. ఇఁకఁ గొన్నిదినములుండిన నది భరింప వారికి శక్యముగాక చిత్తవిభ్రాంతికిఁ గారణ మగును.

ఏ దేహముచే నేది యెంత భరింపసాధ్యమో యంతయే భరింపవలయును. అంతకుమించి భరించినఁ గీడుకలదు. కావున నిపుడే యేదోయొక నెపము

పెట్టి యా యానందమును దగ్గించివారి యనుభవ సాధ్యమగు మాత్రమానంద మియ్యవలయునని శ్రీరాముని సంకల్పము కావున శ్రీరాముఁ డీమార్గము త్రొక్కవలసివచ్చెను. ఇది పిదప వారికి సౌఖ్యకరమేయగును. కావున వంచన కాదు. ఇది శ్రీరాముఁడు బుద్ధిపూర్వకముగ వారిమేలుకోరి చేసినమోసము. అట్లు శ్రీరాముఁడు సంకల్పించి మాయ ప్రయోగింపకుండినచో నందలుజనులలో నొకఁడైన మేలుకొని యుండఁడా అందఱు బ్రాహ్మముహూర్తమునకు మేలు కొన నలవాటు పడినవారేకదా. ఈవిధముగ గోవిందరాజీయ వ్యాఖ్యానమున సమాధానము వ్రాయఁబడినది. గోపికలవిషయమున శ్రీకృష్ణప్రవర్తన మిట్టిదే.

ఒకబాలుఁడు రుచిగల పదార్థమును దనకడుపు పరిమాణమును దెలియక జిహ్వాచాపలముచే నెక్కువగఁ దినవలయు ననినను దల్లి పెట్టదు. ఒకవేళ బాలుఁడు దినినను వెంటనే వాంతికో విరేచనమునకో యిచ్చును.

అట్లులే యేజన్మమున నెవఁడెంత పుణ్యము సంపాదింపవలయునని భగ వదిచ్ఛయో యంతయే లభింపఁజేయును గాన యంతకుమించి పోనీయఁడు. ఈకారణము చేతనే అగస్త్యుఁ డింద్రద్యుమ్నునకు శాపము పెట్టుటచేఁ దపస్సు నష్టిపఱుచుకొనెను. గోపికల విషయమునఁ గృష్ణు డిట్లుచేసినవాఁడే, ఎంతవఱకు వారికానందము గలిగింపవచ్చునో యంతయుఁ గలిగించి యిఁకమించిన వారు భరింపలేరని తోఁచినపుడు వియోగదుఃఖము కలిగించెను.

స్వలాభాపేక్షగాని పరులకు నష్టికలుగ వలయునని తలంపుగాని లేక ప్రేమతోఁ జేసినపుడు అసత్య మసత్యముగాదు హింసహింసగాదు వంచన వంచనకాదు.

ఇట్టి యుపాయము చేయకుండిన శ్రీరాముఁడు దోషియైయుండును. అంతటి ముసలిగువ్వలు అడవులలోఁ దిరిగి కందమూలాదులు దిని యెన్నాళ్ళు జీవింపఁగలరు. జీవించినను ఎంత బాధపడవలసియుండును అది యంతయు నిపుడు తప్పెఁగదా.

చం॥ పనివిని యట్లుచేసి రఘు•వల్లభు నాతఁడు దాయ వారుఁ జ
యన రథ మెక్కి సారథి ప్రయాణశుభై కనిమిత్త దర్శనం
బునకయి యుత్తరంబుగను•ముందుగఁ దేరిని ద్రిప్పి పిమ్మటన్
పనులకు నేగుమార్గమున•వాజులఁ దోలె జవంబు మీఱఁగన్. ౧౮-౧౯

పనివిని=ఆజ్ఞప్రకారము వెడలిపోయి, ఈశబ్దము భృత్యాదుల విషయ మున నుపయోగింపఁదగునుగాని స్వామ్యాదుల విషయమున నుపయోగింప రాదు. సీత మాట మేరకు శ్రీరాముఁడు పనివినియె ననరాదు. ఇచ్చట పని యనఁగా నాజ్ఞయని యర్థము. ప్రయాణశుభైక దర్శనంబునకయి = ప్రయాణ మగు సమయమున శుభమే కలుగు శకునము చూచుటకై, వనులకున్=అడవు లకు, జవము=వేగము, ప్రయాణముపోవువారు మొదట దక్షిణాభిముఖులై పోరాదు. ఉత్తరాభిముఖులై పోవలయును. "తస్మాదుత్తరతోఽభిప్రయా

యీ జయతి" తైత్తిరీయ శ్రుతి. ఉత్తరాభిముఖుఁడై ప్రయాణముచేయువాఁడు జయించును. ఇట్టులే పాండవులు వనవాసము చేయఁబోవునపు డుత్తరాభిముఖులై పోయిరి.

తాత్పర్యము

ఆరామాజ్ఞ ప్రకారము సుమంత్రుఁడు వెడలిపోయి యాయన చెప్పినట్లు చేసి శ్రీరాముని జేరరాఁగా సీతారామలక్ష్మణులు రథమెక్కఁగా సారథిప్రయాణ కాలమున నుత్తరదిక్కుగాఁ బ్రయాణమగుట శుభకరము గావున నుత్తర దిక్కుగా రథముఁద్రిప్పి పిమ్మట నడవులకుఁబోవు మార్గమునఁ ద్వరగ గుఱ్ఱములను దోలెను.

— ౪౭-వ సర్గము. పౌరులు శ్రీరాముని గానక దుఃఖించుట. —

ఉ॥ ఆవలువాత లేచి జను•లందఱు రాముని గాన కార్తిచే
దేవురు నొంది మూర్ఛలను•ద్రెళ్ళుచుఁ గన్నుల నీరు గాఱఁగా
నీవల నావలన్ వెదకి•యెందును వారలజాడ లేమి దుః
ఖావిలచిత్తులై రఘువ•రా! యని యార్చుచు వెచ్చ నూర్చుచున్. ౧-౪౫

వలువాతన్=ఉదయమున, దేవురునొంది=దైన్యమును వహించి, దుఃఖావిలచిత్తులై=దుఃఖముచేఁ జెదరిన మనస్సులు గలవారై.

తాత్పర్యము

ఆ యుదయమునలేచి జనులందఱు శ్రీరాముని గానక దుఃఖముచే దీనులై మూర్ఛపోయి పడుచులేచుచుఁ గన్నీరుకాఱఁగా నీప్రక్క నాప్రక్క వెదకి యెందును వారుపోయిన జాడతెలిసికొనలేక దుఃఖముచేఁ గలఁతనొందిన మనస్సుగలవారై రామాయని యఱచుచు వేఁడినిట్టూర్పులు పుచ్చుచు నిట్లనిరి.

ఉ॥ నిద్దుర పాడుగాను, దల•నెక్కొని యిట్టులు చేసె నయ్యయో,
బుద్ధి పరాకు చెందె, నెటు•పోదుము. గానఁగ రాఁ డెటన్, మహా
పద్దశ సంభవించె, నిజ•భక్తుల నెల్లర వీడి కానకున్
బద్ధుగ నేగె, నెన్నఁడును•వంచన నేరఁ డిదేమొ నేఁడిటన్. ౧-౪౬

నెక్కొని=నెలకొని

తాత్పర్యము

అయ్యో నిద్దుర పాడై పోను,తలమీఁదనెక్కి యీప్రకారము సేసెఁగదా. బుద్ధి ప్రమాదపడియె. ఇఁక నెక్కడపోదుము. ఎక్కడనున్నాఁడని బోదుము ఎక్కడ గానరాఁడే అయ్యోయెంత విపత్తు సంభవించెను. తనభక్తుల నందఱ వదలి శ్రీరాముఁడు పంతముపట్టినట్లుపోయెనే. శ్రీరాముఁ డింతవఱకు వంచన యెట్టిదోయెఱుఁగఁడే. నేఁడుమాత్రమే యేమియిట్లుచేసెను. నాయమాత్మా బలహీనేనలభ్యః నచప్రమాదాత్ తపసో వాప్య లింగాత్ అని శ్రుతి నిట ననుసంధింపఁ గు. ప్రమాదబుద్ధులకు భగవత్ప్రాప్తి యెట్లు కలుగును.

కం॥ ఎట్టులు గూడఁగఁ గలునో, యట్టి పృథూరస్కునిన్ మ•హాభుజు రామున్
బట్టొని యెట్టిపనియేన్, బట్టుగ నెఱవేర్చునట్టి•పార్థివపట్టిన్. ౧-౪౭

వృథూరస్కానిన్=గొప్ప వక్షస్థ్సలముగలవానిని, నెట్టుకొని=పనిపూని

తాత్పర్యము

అట్టి విశాల వక్షస్థ్సలము గలవానిని నిడివియగు భుజములు గలవానిని పనిపూని యెట్టిపనినైనను బట్టుబట్టి సాధించు రాజకుమారుని శ్రీరాముని మన మేవిధముగాఁ జూడఁగలమో.

కం॥ తనకన్నబిడ్డలను దయ, జనకుఁడు రక్షించురీతి•సంరక్షించున్
మనలసదా యిపు డేటికిఁ, జనియెనొ యిందఱను వీడి•సాహసమతియై.

తాత్పర్యము ౧-౪౩

తాను గన్నబిడ్డలను దండ్రి రక్షించురీతి మనల నెల్లవేళ సంరక్షించువాఁ డిపుడేలా మనలనందఱ వదలి తెగించి వెడలిపోయెనో.

ఉ॥ రాముఁడు లేకయున్న మన•ప్రాణము లుండిన నేమి? పోయెఁ బో
నే మటు గానఁ బ్రాణముల•నియ్యెడఁ బాచుకొనంగ మేలు కా
దే మన కెల్ల? నొండె నిఁక•మృత్యుముఖాభిముఖంబుగా నుద
క్పమున పోవు టొప్పు, నెది•చేయుట యుత్తమభంగి చెప్పుఁడా. ౧-౪౪

మృత్యుముఖాభిముఖంబుగా = మృత్యుదేవత ముఖమున కెదురుగా, ఉదక్పమను=ఉత్తరపుదిక్కుగా దీనికే మహాప్రస్థానమని పేరు.

తాత్పర్యము

మన ప్రాణములకుఁ బ్రాణమైన శ్రీరాముఁడు లేకయుండిన మనప్రాణము లుండిననేమి పోయిననేమి. మనప్రాణము లిచ్చుటనే వదలుట మేలుకదా. ఈ ప్రకారమిచ్చుటనే ప్రాయోపవేశము చేయుదమా. అటుగాక యుత్తరాభిముఖముగా మహాప్రస్థానము పోవుదమా. రెంటిలో నేదిమేలో చెప్పుఁడు.

కం॥ దండిగ నున్న విటం గడు,నెండినకట్టియలు వీని•నెల్లను జితగా
మండించి దానిలోఁ బడి, దండధరుం జూడఁ జనఁగఁ•దగు మనకున్.

తాత్పర్యము ౧-౪౫

ఇచట మిగుల నెండినకట్టెలు దండిగనున్నవి. వీనినన్నిటిని జితిగాఁ బేర్చి మండఁజేసి దానిలోఁబడి యముని జూడఁబోవుట తగినకార్యము. ఆ రెండు మార్గములందును మరణమునకుఁ గాలవిలంబము సహించి ప్రాణముపోవు వఱకు శ్రీరామవియోగతాపము నోర్చియుండవలసివచ్చును. ఈ మార్గమునం దట్టిబాధలేదు. అగ్నిబాధలేదా యందురేని శ్రీరామ వియోగాగ్నిచేఁ గాలుచున్న యీదేహములను బ్రాకృతాగ్ని యంతకుమించి యేమిచేయఁగలదు. కావున నగ్నిప్రవేశమే తగిన కార్యము.

కం॥ ఆనెయ్యం బాతియ్యం, బానీతియు నీసు లేమి•యామృదువాక్యం
బానిస్తులగుణసంపద,యొనరులం గందు మింక•నే మనుకొనఁగన్. ౧-౪౬

తాత్పర్యము

అస్నేహము, అమాధుర్యము, అనీతి, అసహనము యాతియ్యని పలుకులు ఆ యసమాన సుగుణసంపత్తి యింకనేవారియందు మనము చూడఁగలము.

ఉ॥ ఊరికిఁ బోవ వృద్ధులును • నోపనివారును స్త్రీలు బాలు ర
యయ్యారె రఘూద్వహుం డెచట? నాదటఁ గ్రమ్మఱివచ్చునే? యనన్
వారల కెల్ల రాము వన•వాటికి సాగఁగ నంపి వచ్చు చు
న్నార మటంచుఁ జెప్ప నగు•నా? మఱియేమని చెప్ప శక్యమౌ. ౧౨౪౭

ఓపలేనివారు=రాలేనివారు, ఆదటన్ = ప్రీతితో, వనవాటికిన్ = అడవిప్రదేశమునకు.

తాత్పర్యము

శ్రీరాముని విడిచి యయోధ్యకుఁ బోదమనుకొందు, మనము శ్రీరాముని దోడియైనఁ దెచ్చెదము. లేదా శ్రీరామునివెంట మేము పోయెదమనికదా చెప్పి వచ్చితిమి. కావున మనరాకచూచి మనవెంట రాఁజాలక నిలిచిన ముదుసళ్ళు, రోగాదిబాధలచే రాఁజాలనివారు, ఆఁడువారు, పిల్లవాండ్రు, ఔరా రాముఁడేఁడీ రాముఁడేఁడీ, మనయందు దయతలఁచి మరలివచ్చెనాయని ప్రశ్నింపవారికందఱకు నేమని ప్రత్యుత్తర మీయఁగలము, శ్రీరాముని నడవికి సాగనంపి వచ్చుచున్నామనవచ్చునా, అటు చెప్పకున్న మఱియేమని చెప్పసాధ్యమగును.

కం॥ రామునితోడుత వచ్చియు, రామునిఁ దోడ్కొనక చనిన•ప్రజఁ గని వృద్ధ
స్త్రీమాణవకోపేతం, బౌమననగరంబు మిగుల•నడలదె యార్తిన్. ౧౨౪౮

మాణవ కోపేతము=బాలురతోఁ గూడినది.

తాత్పర్యము

మనమందరము శ్రీరామునితోడ మేము శ్రీరామునివెంటఁ బోయెదమని దంభములుపల్కి మహాడంబరముతో బయలుదేఱివచ్చి శ్రీరాముని బిలుచుకొని పోక యుత్తచేతులతోఁబోయిన ముసలివారేమందురు, స్త్రీలేమందురు, బాలురేమందురు, వీరందఱు మనము శ్రీరామచంద్రుని బిలుచుకొని వచ్చెదమని నమ్మి ధైర్యముతోఁ బ్రాణములు బిగఁబట్టుకొని యున్నారు. వారీవార్త విని మహాదుఃఖములో మునిఁగిపోరా? మనము పోక యుండే మరణించితిమేని మనముగవారు శ్రీరామునివెంటఁ బోయినారు, శ్రీరామునకు భయములేదు. క్షేమముగ నుండఁ గలఁడని ధైర్యముతో నుందురు.

కం॥ రామునితోడుత వచ్చియుఁ, బ్రేమంబున నింతవట్టు•వెండియు నగరం
బీమెయి నే మోములతో, నే మని చొర మనసు లొప్పు•నెట్లని చింతన్.
౧౨౪౯

తోడుతన్=ద్రుతాంతమైన యవ్యయము, రామునితోడుతన్=సుప్పుపేతి సమాసము.

తాత్పర్యము

ప్రేమగలవారివలె మనమింతదూరము శ్రీరామునితో వచ్చితిమి, ఇప్పు డేముఖములతో మనము మరల నూరిముఖము చూతుము. ఏమని లోపలఁ బ్రవేశింతుము. ప్రవేశించుటకు మనస్సొల్లొల్లోర్చును. అని విచారపడుచు.

కం॥ క్రేపులఁ బాసినగోవుల, రూపునఁ దమబాహు లెత్తి రోదనసహితా
లాపములఁ బెక్కు తెఱంగుల,
వాపోయిరి యెల్ల జనులు వల నెఱుఁగమిచేన్. ౧౮-౨౦

క్రేపులన్=లేఁతదూడలను, రూపున=విధముగ, రోదనసహితాలాపములన్=ఏడుపుతోఁగూడిన మాటలతో, వాపోయిరి=ఏడ్చిరి, వలను=ఉపాయము.

తాత్పర్యము

లేఁగలను బోఁగొట్టుకొనిన గోవులవలె దమచేతులెత్తి యేయుపాయముఁ తోఁచమిచే నేడుపుతోడి మాటలతో ననేకవిధముల రోదనము గావించిరి.

కం॥ తేరి తెరువునను గొండొక, దూరము చని దానిజాడ తోఁచమి నవలన్
బౌరులు నిర్భాగ్యుల మం,చూరక తముఁ దిట్టుకొనుచు నుత్తలపడుచున్.

కొండొక=కొంచెము, తోఁచమి=కానరాకుండుటచే, ఉత్తలపడుచున్=పరితాపమందుచు.

తాత్పర్యము

రథముపోయిన జాడపట్టుకొని కొంచెము దూరముపోయి యచట వచ్చిక మీఁదఁ బొదలసందునఁ దీఁగెలమీఁద సుమంత్రుఁడు రథముతోలుటచే నావల జాడ కానరాకుండుటచే నాపురజనులు అయ్యో మనమెంత యదృష్టహీనులము రామసాంగత్యము వదలిపోయెఁగదా యని తమ్ముఁ దిట్టుకొనుచుఁ బరితాప పడుచు.

కం॥ ఏమి యుపాయ మేమి గతి యిం, కేమి యొనర్పంగ వచ్చు నిందఱ దైవం
బే మోసము చేసెఁ గదే, యీమాడ్కి నటంచు నేడ్చు చేగిరి పురికిన్.

తాత్పర్యము ౧౯-౨౧

ఏమియుపాయ మనమొకటి తలఁచిన మఱియొకవిధ మయ్యెనే, ఇఁక నేమి గతి, ఏమిచేయవలయును? ఇందఱకు గాఢనిద్రవచ్చునట్లు దైవమే చేసెను. ఇది దైవకృత్యము గాకున్న నెన్నఁడురానినిద్ర యిందఱ కేకకాలమున నిట్లు వచ్చునా, యని యేడ్చుచుఁ బురమునకుఁ బోయిరి.

—॥ ౪౭-వ సర్గము. పౌరు లయోధ్య మరలఁ జేయుట. ॥—

ఉ॥ పౌరజనట్లు పోవఁ బెమ పట్టన మంతయు రాముఁ డున్న యూ
రీ దుఃఖాస్పదం బగుచు వీడ్వడెఁ గంటిదె, పక్షిరాజు వెం

టాడి పడిన్ వెలార్పఁగ జ॥లాశయమో శశిలేనిమిన్నొ నీ
రూడినకంధియో యనఁగ॥నొప్పు దొఱంగె నటంచుఁ జింతచేన్. ౧-౨౨౩

పాడఁటినట్లు=పాడుపెట్టినట్లు, తోఁపన్=కనఁబడఁగా పక్షిరాజు=గరుత్మంతుఁడు, ఫణిన్=సర్పమును, వెలార్పఁగన్=వెడలింపఁగా. జలాశయమో=మడుఁగో, శశి=చంద్రుఁడు, మిన్నో=ఆకాశమో నీరూడిన=నీళ్లింకిపోయిన, కంధియో=సముద్రమో, ఒప్పు=అందము, దొఱంగెన్=మాఱుపడెను.

తాత్పర్యము

పట్టణమంతయుఁ బాడుపెట్టినట్లు కనఁబడఁగా శ్రీరాముఁడుండిన గృహమమంగళమై రూపమే మాఱిపోయెను చూచితిరా, గరుత్మంతుఁడు వెంటఁబడి తఱిమి పామును వెడలింపఁగా నుండు మడుఁగో చంద్రుఁడులేని యాకాశమో నీళ్లింకిపోయిన సముద్రమో యయినట్టు లందమే మాఱిపోయెను. అని చింతచే

తే॥ కనులు వాఁచఁగ నేడ్చుచుఁ॥గడిసి తమ్ముఁ
దమ జనంబులుఁ బెఱవారుఁ॥దద్దగనఁగ
వారి గుర్తింప లేరై రి॥వనటకలిమి
బాష్ప విప్లుతనేత్రులై॥ప్రాలి పడుచు. ౧-౨౨౪

బాష్పవిప్లుతనేత్రులై=కన్నీటిచే బాగుగఁదడుపఁబడిన కన్నులుగలవారై

తాత్పర్యము

కన్నులు వాఁచునట్లేడ్చుచుఁ దమయొద్దకువచ్చి తమబంధువులు లోనగువారును, దక్కినవారును ముఖములో ముఖముపెట్టిచూచినను దుఃఖావేశము చేఁ గన్నులనిండ నీళ్ళుండిన కారణమున వారిని గుర్తింపలేరైరి.

ఉ॥ రాముని వెంట నంటి యిటు॥గ్రమ్మఱి వారలు పీనుఁగులట్టులై
ధామములందుఁ జొచ్చి నిజ॥దారసుతావృతులౌచు దీనతన్
మోములఁ జేతు లూనుచు ము॥మూర్షను హో యని బిగ్గ యేడ్చిరిం
కేమి తెఱంగొ యేమిగతి॥యెక్కడ కేగుద మంచు సంతతన్. ౧-౨౨౫

పీనుఁగులట్టులై=పీనుఁగులవంటివారై, ధామములందున్ = ఇండ్లయందు, నిజదార సుతావృతులౌచున్=తమ భార్యలతోను బిడ్డలతోను జుట్టఁబడినవారై, ముమూర్షను=మరణమందవలెనను కోరికచే.

తాత్పర్యము

శ్రీరామునివెంటఁబోయి మరలివచ్చి శవములవలెనై. వారివారి యిండ్లయందుఁ బ్రవేశించి తమ్ముఁ దమభార్యలు బిడ్డలను చుట్టుకొని నాయనా మన రాముఁడేఁడీ నగరునకు వచ్చినాఁడా యని బిడ్డలను ఏమండీ మనరాముని బిలుచుకొనివచ్చినారుకదా యని భార్యలు ప్రశ్నింపఁగా సిగ్గుచేతను

శోకముచేతను ముఖములు వెలవెలఁబోవ ముఖములపైఁ జేతులుంచుకొని చావఁగోరినవారై గట్టిగా నింకేమిగతి యేవిధమున వర్తింపవలె నెక్కడకుఁ బోదమని యేడ్చిరి.

ఉ॥ క్రొత్తగ మిత్రు లబ్బుటకుఁ◆గూర్పరు మోదముఁ, గ్రొత్తవస్తువుల్
హత్తియు హర్షమూన రట◆సంగడు లుంపరు వైశ్యు లెవ్వరున్
గ్రొత్తగ నత్తలిండులకుఁ◆గోడలురా మురిపెంబు గాన రెం
దత్తఱిఁ బ్రొయ్యి రాఁజ నిడ◆రార్తిఁ బురిన్ గృహమేధు లెవ్వరున్. ౧-౨౫

హత్తియు=లభించియు, మురిపెంబు=సంతోషము, గృహమేధులు=గృహస్థులు.

తాత్పర్యము

క్రొత్తస్నేహితులు లభించినను సంతోషింపరు, క్రొత్తపదార్థములుదొరకినను మోదముగొనరు, కోమటు లంగడులుంపరు, క్రొత్తకోడండ్రింటికి వచ్చినను నత్తలు సంతోషింపరు. వ్యసనముచే గృహస్థులెవ్వరును వంటకై ప్రొయ్యులు రాఁజవేయరు.

కం॥ పలుధనములు లభియించియు, నలరరు చిరనష్టవిత్త◆మంది మురియరున్
దొలిచూలుఁగొడుకుఁగాంచియుఁ,
దలఁపుననేమ్మదముగనదు◆తల్లియుఁబురిలోన్. ౧-౨౬

చిరనష్టవిత్తము=చాలఁగాలముక్రిందఁబోయిన ధనము, మురియరు=సంతోషింపరు.

తాత్పర్యము

విశేషముగఁ గ్రొత్తగ ధనము లభించినను జాలఁగాలముక్రింద నష్టపడియిఁక రాదనుకొన్నధనము మరలవచ్చినను దల్లులు తొలిచూలు కొడుకుఁగాంచియు మనస్సునందైన సంతోషింపరు.

—◆పౌరు లయోధ్యకుఁ బోవ స్త్రీలు వారిని నిందించుట◆—

కం॥ ఇంటింట నేడ్చువాలుం, గంటులు తమపతులు రాఁగ◆గని యిండులకున్
గెంటసములాడి రార్తిని, గంటులు పడ
నంకుశమునఁ◆గరి నడుచుక్రియన్. ౧-౨౭

పురుషులదుఃఖమును వర్ణించి శ్రీరామ వియోగమువలనఁ గలిగిన స్త్రీల దుఃఖమును గవి వర్ణించుచున్నాఁడు.

వాలుంగంటులు=స్త్రీలు, నిడివికన్నులు గలవారు, గెంటసములు=కఠినపు మాటలు, గంటులు=గాయములు.

తాత్పర్యము

శ్రీరాముఁ డడవికిఁబోయెనే యని యింటింట నేడ్చుచున్న స్త్రీలు మన మగవారాయన వెంటఁ బోయిరిగదా ఎటులైనఁ బిలుచుకొని రాఁగలరనికొంచెము నిబ్బరించుకొని యుండిరిగాని శ్రీరాముని బిలుచుకొనిరాక వారుమాత్రము

వచ్చుటఁజూచి ఛీ వీరేమి మగవారు: శ్రీరాముని విడిచి మరల నిండ్లని భార్య లని బిడ్డలని కాముకులై వచ్చిరని దుఃఖము కోపము పెనఁగొనఁగా నేనుఁగును నంకుశముతోఁ గొట్టినట్లు నిష్ఠురములాడిరి.

ఉ॥ రామునితోడఁ బోయియును ♦ రాజశిఖామణిఁ దోడితేక యి
ట్లేమని వచ్చినార లొకొ ♦ యిండ్లకుఁ గ్రమ్మఱి, యిండు లేటికో ?
యేమిటి కాలుబిడ్డలు? న♦హీనసుఖంబులు విత్త మేటికిన్?
రాముని గన్నులారఁగఁ గ♦నన్ సుకృతాత్ములు గానివారికిన్. ౧౭౯

అహీన సౌఖ్యంబులు=తక్కువగాని సౌఖ్యములు, విత్తము=ధనము, సుకృతాత్ములు=పుణ్యాత్ములు.

తాత్పర్యము

ఓమగవారలారా! శ్రీరామునితోడఁ బోయినవారు రాజశ్రేష్ఠుఁడగు శ్రీరామచంద్రమూర్తిని బిలిచికొనిరాక మీరేముఖము పెట్టుకొని యేయభిప్రాయములతో మరల నిండ్లకు వచ్చినారు శ్రీరామునిఁ గన్నులారఁ జూచుచుండు పుణ్యము లేనివారికి నిండ్లేల పెండ్లాలేల బిడ్డలేల సుఖములేల ధనములేల శ్రీరాముని ముఖావలోకనము చేయుచుండుటకంటె నివన్నియు సుఖములని యానందకరములని తలంచి వచ్చితిరా.

ఇంతటి విషయవాంఛగల పాపాత్ములు మీరెక్కడ శ్రీరామచంద్రమూర్తి యెక్కడ- ఇంతటి చపలచిత్తులు కొంపలోఁ బడియుండక మీరేల శ్రీరాముని వెంటఁ బోయితిరి మమ్ముఁ బొమ్మనిన మేముపోయి పిలుచుకొని వచ్చియుందుమే చుట్టు చుట్టుకొని పాదములమీఁదఁబడి గట్టిగఁ బ్రాణాచారముపడిన మమ్ముఁద్రోసికొని యెట్లు రామచంద్రుఁడు పోయియుండఁగలఁడు- మీకా మాత్రము తోఁపనేలేదో అవమానముగనే తోఁచెనో- పెండ్లాలమీఁద భ్రాంతిపడి పరువెత్తి వచ్చితిరోకదా మీకు మగపంతములు మగువలమీఁదనేకాని భగవద్విషయంబునఁ గాదుకదా.

ఉ॥ ఒక్కఁడ లక్ష్మణుండు సుజ♦నోత్తముఁ డీజగమందు భక్తి పై
మక్కువ రామచంద్రుని క్ష♦మాతనయాన్వితుఁ గొల్వఁ గానకై
చక్కఁగ నేగె, నాయడవిఁ ♦ జారుధునీసరసీవరంబులం
దక్కమలాక్షుఁ డాడ నహ ♦ హా యవి యేసుకృతంబుఁ జేసెనో. ౧౮౦

సుజనోత్తముఁడు=సజ్జనులందు శ్రేష్ఠుఁడు, క్షమాతనయాన్వితున్=సీతతోఁ గూడినవానిని, చారు=మనోహరములైన, ధునీ=నదులందును, సరసీవరంబులన్ = శ్రేష్ఠములయిన కొలఁకులందును, ఆడన్ = స్నానముచేయుటకు, సుకృతంబు=పుణ్యము- క్షమాతనయాన్వితు శ్రీరామునసుటచే సీతాసహితుఁడైన శ్రీరామునే కొల్వవలయునుగాని యిరువురిలో నొకరిని మాత్రము పూజింపరాదు.

తాత్పర్యము

ఈ ప్రపంచమందు సజ్జనశ్రేష్ఠుఁ డెవ్వఁడనిన లక్ష్మణుఁ డొక్కఁడే- ఏలనః- సీతాసమేతుఁడైన శ్రీరాముని జక్కఁగఁ గొల్వఁగఁ బ్రేమతో నిల్లువాకిలి తల్లి భార్య సర్వసుఖములు వదలి నాయనవెంటఁ బోయెను. శ్రీరాముల సేవింప నటువంటివా రర్హులుగాని మీవంటివారా యర్హులు. ఆయడవియందుండు మనో హరములైన నదులలోఁ గొలఁకులలో శ్రీరాముఁడు స్నానముచేయుటకు నవి యెంతపుణ్యము చేసెనో మనము కన్నులఁ జూచుటకైన భాగ్యములేక యేడ్చు చుండఁగా నవి యెంతపుణ్యము చేయకున్న శ్రీరాముని గాత్రసంస్పర్శము లభించి పవిత్రములయిన వగునా- వానిజన్మము సార్థకము మనజన్మము వ్యర్థము.

కం॥ కాంతారకసంతానము, కాంతానూపములు నదులఁ • గటకప్రస్థా
క్రాంతధరాధరములు న,త్యంతము శోభిల్లఁ జేయు • నాశ్రీరామున్.

కాంతారకసంతానము=అడవులసమూహము, కాంతానూపములు నదులు= మనోహరములైన బురదనేలలుగల నదులు, కటకప్రస్థాక్రాంత=పేఁటులచేతను- విశాలములైన పలుపునేలలచేతను ఆక్రమింపఁబడిన, ధరాధరములు =పర్వత ములు, అత్యంతము=మిక్కిలి.

తాత్పర్యము

అడవుల సమూహములు శ్రీరామునకు ఫలములు పుష్పములు నీడలు నిచ్చియు, నదులు తమప్రాంతములనుండు నీటఁ దడిసిన నేలలచే శ్రీరాముని పాదములకుఁ బాన్పులు పఱచినట్లు మెత్తగా నుండఁజేసియుఁ, బర్వతములు విహార శయ్యాసనములకు ననుకూలపడియు, శ్రీరాముని సేవించుచు నాయనను సంతోషముచేఁ బ్రకాశింపఁజేయును. స్థావరములు నచేతనము లిట్లు శ్రీరామసేవ చేసి జన్మములను సార్థకపఱచుకొనుచుండ మనుష్యులమైన మనము వ్యర్థజీవి తులమైతిమి.

కం॥ కాననములేని శైలము, లేని ప్రియాతిథినిఁబోలి • యేతెంచినసీ
తానాథుని నర్చింపక,మానఁగ నెటు లోపు నవి స•మర్చావిధులన్.౧౭౬౦

శైలములు=పర్వతములు, అర్చింపక = పూజింపక, సమర్చావిధులన్= అతిథులను బూజింపవలసిన నియమములచొప్పున.

తాత్పర్యము

అడవులు, పర్వతములు, జడములైన నగుఁగాక. అవియును బ్రియుఁడైన యతిథివలెఁ దమయొద్దకు వచ్చిన శ్రీరాముని దగిన యర్చానియమముల ప్రకా రము పూజింప కెట్లుండఁగలవు అవి స్థావరములు గావున శ్రీరాముఁ డున్న చోటికవి పోలేకపోయినను ఆయనయే తమయొద్దకు వచ్చినపుడైన నెట్లు పూజిం పకయుండగలవు. మీలో మనుష్యులై ఆయనయొద్దకు నడచిపోవఁ గాళ్ళుం డియు స్థావరములు చేసిన మాత్రము చేయలేకయున్నారుగదా- మీరు స్థావర ములకంటె నికృష్టులలైతిరి.

కం॥ నెరయుంగ మొకరితేఁటులు, వరకుసుమాపీడము లయి•పలుమంజరులన్
సరసం బయి వనవిటపులు,దరిసింపఁగ గలవు రాము•ధన్యము లగుచున్.

నెరయుంగన్=వ్యాపించునటులు, మొఁకరితేఁటులు=ధ్వనించు తుమ్మెదలు, వరకుసుమాపీడములయి=శ్రేష్ఠములయిన పూవులను దలయందు ధరించినవై, వనవిటపులు=అడవి వృక్షములు.

తాత్పర్యము.

భగవద్దర్శనము చేయునపుడు మధురస్వరముల మంగళగానము సేయు స్త్రీలవలె ఝుంకారముచేయుచుఁ దేనెటీఁగలును శిరములందుఁ బూవులు ముడిచి చేతఁ బూలగుత్తులు గొనిపోవు స్త్రీలవలె నడవియందు వృక్షములు పూవులను గుత్తులను సుందరములై శ్రీరాముని దర్శించి తమజన్మములు సార్థకముచేసి కొనఁగలవు. మనుష్యస్త్రీలమైన మాకంతటిభాగ్యము మీనిమిత్తమున లేదాయె.

కం॥ కాలంబు గాక యుండియు, బాళిని బూవులును బండ్లు•బరమాదృతిపై
శైలంబు లొసఁగు సీతా,బాలాహృదయేశ్వరుండు•పజ్జల డాయన్.

తాత్పర్యము ౧౭౬౪

భగవంతుఁడు ప్రభువు- తమ సమీపమునకు వచ్చినపుడు కానుక లీయక యూరకుండరాదు గనుక తమపార్శ్వముల విహరింప శ్రీరాముఁడు వచ్చినపుడు పూవులు పండ్లుగలకాలము గాకపోయినను ప్రేమచే బిడ్డలఁ జూచినపుడు వాత్సల్యాతిశయంబునఁ బాలులేని స్త్రీలకుఁ జనుబాలు వడిసట్లు పర్వతములు మిగుల నాదరముతోఁ బూపులను బండ్లను సమర్పింపును.

కం॥ సెలయేఁటుల నిర్మలతర,జలపూరము చిత్రముగను • జాలు గొన మహా
చలములు సలుపును దమతమ,
పొలిమేరలు చేరఁ బురుష•పుంగవుఁ డాస్థన్. ౧౭౬౫

నిర్మలతరజలపూరము = మిక్కిలి తేటయగు నీటిప్రవాహమును.

తాత్పర్యము

శ్రీరాముఁడు తమతమ పొలిమేరల చేరినపుడు గొప్ప పర్వతములు పాద్యమో యన్నట్లు కొండవంకలందు మిగులఁ దేటయగు నీటిని వెల్లువగఁ బాదములపైఁ బాఱఁజేయును.

కం॥ ఎండకు సొటసొట లాడుచు, దండను దమకాలిసొవ్వుఁ•దలఁగింపఁగ వా
డుండఁగఁ గొమ్మల వీచుచు,
దండిగ రపియింపఁ జేయు•ధరణీరుహముల్. ౧౭౬౬

సొటసొట లాడుచున్=తపించుచు, దండను = సమీపమున, ధరణీరుహముల్ = వృక్షములు.

తాత్పర్యము

ఎండవేఁడిమికిఁ దపించుచుఁ దమనీడల లోకి ధరణీసుత సీతయు ధరణీ విభుఁడు శ్రీరాముఁడు రాఁగా వారికాలినొప్పి యెండతాపము పోవునట్లు ధరణీ రుహములు వింజామరలతో వీచు స్త్రీలవలెఁ గొమ్మలచేఁ జల్లగాలి తగులునట్లు విసరును. ఆచెట్లకొమ్మలు చేసినపుణ్యము మేము చేయమైతిమి-

—• పురస్త్రీలు శ్రీరాముఁ దలంచి దుఃఖించుట. •—

ఉ॥ ఎచ్చట రామచంద్రుఁడు మ • హిష్ఠగుణోత్కరసాంద్రుఁ డుండునో
యచ్చట భీతి లేదు చుఁడీ • యచ్చట లేదు పరాభవంబు నా
సచ్చరితుండు దూరముగ • సత్వరుఁ డై చనకుండు మున్న పెం
పచ్చుపడంగ లెండు పదఁ • డా చని యంద వసింత మర్మిలిన్. ౧౫-౬౭

మహిష్ఠగుణోత్కరసాంద్రుఁడు=గొప్పగుణముల సమూహముచే నిండినవాఁడు, పరాభవము=(1) అవమానము-2) మఱుజన్మము, భీతి=1) భయము-2) సంసారభయము, సత్వరుఁడై=త్వరతోఁ గూడినవాఁడై, అర్మిలిన్=ప్రేమతో.

తాత్పర్యము

అయ్యా! పురుషులారా! యడవులలోఁ గ్రూర మృగము లుండునని భయ పడవలదు. పామరులు వీ రడవులపాలై యాలుఁ మగఁడు పోయినారని యవ మాన వాక్కు లాడుదురని చింతింపనువలదు. ఏలన శ్రీరాముఁడున్నచోట నే భయము లేదు. ఏయవమానములేదు. ఆవిషయమై మీరాలోచింపవలదు.ఆసాధు చరితుఁడు వేగముగ దూరము పోకముందే మనముపోయి కలిసికొందము లేలెండు-పదుఁడు-ప్రయాణముకండు-మేముసిద్ధముగా నున్నాము-ఇక్కడఁ జేయు కాఁపురము లక్కడనే చేయవచ్చును- అందేపోయి యుందము మీకు రాకున్న మీరందే యుండుఁడు మాకనుజ్ఞయిండు- మేము శ్రీరామచంద్రు సన్నిధికిఁ బోయెదము.

ఉ॥ ఆతఁడ జీవకోటికిఁ బ • రాయణ మాతఁడ ప్రాప్య మాటచేఁ
బ్రీతని నమ్మహాత్ము సద • రీణగతిం బదసేవఁ గొల్వఁగాఁ
జేతము లుల్లసిల్లెడిని • సీతను భక్తిని గొల్తు మేము, మీ
రాతరుణార్కతేజుఁ బ్రియ • మార భజింపుఁడు లెండు పోవఁగన్. ౧౬-౬౮

పరాయణము=సర్వవిధముల నాధారమైనవాఁడు, ప్రాప్యము=ఎప్పటి కైనను బోవలసిన స్థలము, సదరీణగతిన్ = మంచి వంకరలేనివిధముగా, చేతములు=మనస్సులు, ఉల్లసిల్లెడిని = సంతోషపడుచున్నవి, తరుణార్కతేజున్ = బాలసూర్యునివంటి కాంతిగలవాని.

తాత్పర్యము

ఇంత తొందరయేల యందురేమో సమస్త జీవకోటులకు ధారణ పోషణము లకు నాధారమైనవాఁడు శ్రీరాముఁడే, ఎప్పటికైనను మనము పొందఁదగిన

వాఁడు శ్రీరాముఁడే; కావున నేనాఁడో మనమైవెదకుచుఁ బోవలసిన చోటికి నదే యిపుడు సమీపమున నుండఁగానే పోదము- మనము సోమరులమై యాలసించిన యాయన దూరము పోవును- దుర్లభుఁడగును- అక్కడికిఁబోయి యేమి చేయవలెనందురా- ఆ మహాత్ముని పాదసేవ యథావిధి చేయఁగా మామనస్సులువ్విళ్ళూరుచున్నవి. మేము సీతను భక్తితో సేవింతుము. మీరు బాలసూర్య తేజుఁడైన శ్రీరాముని నిత్యకృత్యముగ సూర్యోపాస్తి చేయునట్లు ప్రీతితో సేవింపుఁడు ఇంకనేల యాలస్యము-శుభస్య శీఘ్రము లెండు పోదము-

దీనివలనఁ బరమాత్మయుఁ బ్రాప్యుఁడును శ్రీరాముఁడే యనియు నాయనను బొంది ముక్తదశయందును జేయవలసిన కార్యము భక్తిపూర్వకసేవ యనియు భగవత్ప్రాప్తివిషయమై యాలస్యము చేయక యీజన్మమందే త్వరపడి సాధింపవలయుననియు వ్యంగ్యము-

కం॥ మీయోగక్షేమంబుల, నాయనఘుం డరయుచుండ•నవనిజ గూర్చున్
మాయోగక్షేమంబుల, నేయడలును లేదు వారి•నే కొలువంగన్. ౧౬

యోగక్షేమంబులన్=యోగము=లేనిది సమకూర్చుట, క్షేమము = ఉన్నదానిని రక్షించుట, అరయుచుండన్ = విచారించుచుండఁగా, అవనిజ = సీత, గూర్చున్=సంఘటించును, అడలు=భయము.

తాత్పర్యము

సీతసేవ మేముచేసెదమంటిరే- సీత ఆఁడుది చిన్నది యామె మీకేమి బదులు చేయగలదందురేమో శ్రీరాముఁడు మీకేమికావలయునని మీయోగక్షేమములు మిమ్ము విచారించును- అది యుక్తవాగ్వ్యాపారమే. కార్యముచేయవలసినది మాసీతమ్మయే- పతియాజ్ఞగొని యాశ్రితులకుఁ జేయవలసిన వన్నియు నామెయే చేయును. ఆఁడుబిడ్డలకుఁ గావలసినది తల్లియేయగును. కావున నామెను మేమడుగవలసిన పనియేలేదు. మాకుఁ గావలసినది యామెయే తెలిసికొని మా క్షేమమునకై యేమేమి చేయవలయునో యన్నియామెయే తనంతటఁ దానే మాప్రార్థనలేకయే తల్లివలెఁ జేయును- కాఁబట్టి యితరులసేవలు మాని వారినే సేవించితిమా మనకే భయములేదు. కావలసినదిలేదాయెననికాని, యున్నదిపోవుననికాని భయములేదు. ఆపదలనెల్ల శ్రీరామచంద్రమూర్తి హరించును సంపదలనెల్ల శ్రీసీతాదేవి సంఘటించును కావున వారియొద్దనుండిన మనకేలోపము కలుగదు.

ఆపురస్త్రీలు- సుమిత్ర- తార- మండోదరి భగవద్విషయ జ్ఞానముగలిగిన భక్తురాండ్రగుటయుఁ బురుషులు మొద్దుగాండ్రగుటయుఁ జిత్రము. స్త్రీజనపక్షపాతి వాసుదాసుఁడుమాత్రమేకాఁడు- వాల్మీకియు నట్టివాఁడే- ఇరువురు సాధ్వీజన పక్షపాతులేకాని దుష్టస్త్రీ పక్షపాతులు గారు. ఇరువురు సాధుస్త్రీల స్వభావ మెఱిఁగి యున్నదున్నట్లు వచించినవారే. సాధ్వీపక్షపాతి కాకుండిన వాల్మీకి

రామాయణము రచించియేయుండఁడు. ఈస్త్రీలు చెప్పినట్లు పురుషులకు మాఱు స్త్రీలు శ్రీరాముని వెంబడించి పోయియుండిన నాయనను మరలించి తెచ్చియుందురో ఆవలఁ బోనీయక యుందురో ఏలన గోపికలు 'కితవయోషితః కస్త్యజేన్నిశి' నీనిమిత్తమై పతిసుతాదుల విడిచి వచ్చిన మమ్ముఁ జీఁకటిలో విడిచిపోయెదవాయని యేడ్చినప్పుడుకదా కృష్ణుఁడు గోపికలకు మరలఁ బ్రత్యక్షమాయెను. అట్టులే స్త్రీలేడ్చియుండిన శ్రీరాముఁడు మరలి యుండునేమో- పురుషులు కావున నెట్లైన వారివారి కొంపలు వారువారు చేరుదురని శ్రీరాముఁడు విడిచిపోఁగలిగెను. స్త్రీలవిషయమున నంతక్రూరముగాఁ బ్రవర్తించియుండఁడు. ఆఁడుకుయిలు-ఆలకుయిలు విని సాధువులు సహించియుండరు.

సీ॥ అప్రశస్తంబు నై • యమనోహరంబు నై, యవలక్షణంబు నై • యాత్మనాశ
కం బయి మిగుల నుత్ • కంఠఁ గల్గించు నీ,కొంపపై నెవ్వఁడు • కూర్మిసేయుఁ?
గైకేయి రాజ్యంబు • గావింప ధర్మశూన్యము దిక్కులేని దౌ • నగర మింక
నెక్కడి బ్రతుకుపా • టెక్కడిబిడ్డలు, నెక్కడిధనము ల • దేటిమాట ?

తే॥ భాగ్యసంప్రాప్తికై తన • పతి విడిచె, మగని నెడఁబాసె నట్టిమ • ర్యాద్గురాలు
వంశపాంసని యింక నె • వ్వానినేమి,
చేయ కుండెడి మన మేమి • చేయఁగలము. ౧౩-౨౦

పురస్త్రీలు శ్రీరామపదసేవ వలనఁ గలుగు నిహపరసుఖములఁజెప్పి శ్రీరాముని విడిచి సంసారమున నుండినఁ గలుగు కష్టంబులఁ జెప్పుచున్నారు.

అప్రశస్తము=ప్రశంసింపరానిది, అమనోహరము = మనసునకు నింపుగానిది, అవలక్షణము=దుర్గుణములుకలది,ఆత్మనాశకంబు=(1) తన్ను నాశము చేయునది,(2) ఆత్మజ్ఞానము నశింపఁజేసి యాత్మ నధోగతులపాలు చేయునది, ఉత్కంఠ=ఎప్పటికేమో యెప్పటికేమో యని దుఃఖస్మరణమునఁ దహతహపాటు గలిగించునది, అటువంటి యీకొంపపై =(1) ఈయింటిమీఁద, (2) ఈసంసారముమీఁద- (3) ఈదేహముమీఁద- (4) ఈయూరిమీఁద, కూర్మిసేయున్ = ప్రేమచేయువాఁడగును, ధర్మశూన్యము=ధర్మములేనిది, భాగ్యసంప్రాప్తికై= సంపద లభింపవలయునని, పతి=కుమారుని.వంశపాంసని=కులము చెఱచునది.

తాత్పర్యము

మీరు శ్రీరామునివెంటఁ బోయినఁ గొంపలగతి యేమి యందురేమో ఈ కొంప జ్ఞానవృద్ధులు నిలువఁదగినది కాదు. మేలని ప్రశంసింపఁ దగినది కాదు. మనస్సు నాకర్షించునట్టి మంచిగుణము దీనియందు లేదు. కావలసినన్ని దుర్గుణములే కలవు. దీనియందు మనము ఉంటిమా యేవిధముగనైన మనము నాశమైపోవుట సిద్ధము. అదియునుగాక యేవేళకేమి కీడుకలుగునో యని భయము. ఇట్టి యూర నెవఁడు ప్రేమయుంచును. ఇన్ని యిప్పుడే యెట్లువచ్చెనందువా- ఇఁకఁ గైకరాజ్యము. స్త్రీనాయకమైన రాజ్యమున సుఖమెందుండివచ్చును.

(ప్రకృతి స్త్రీ- ఈదేహము ప్రకృతిపరిణామము ఆత్మమీఁద నీదేహాధికారము వెల్లనేని యావల నాత్మ నాశముగాక యెట్లుతప్పును.) కైక రాజ్యమున ధర్మ మెక్కడిది- (౨) ప్రాకృత విషయంబుల మరగిన యింద్రియదాసునకు ధర్మాధర్మ విచారముండునా- కావున రక్షకుఁడు లేనిదగును. శాసకుఁడైన యీశ్వరుఁడు నుపేక్షించి యూరకుండును. ఇఁక నీకైక రాజ్యంబున సుఖజీవనమెక్కడిది- ఎక్కడి బిడ్డలు- ఎక్కడి ధనము- కైక యాజ్ఞయని యెదండుగలు రాజభటులు గొందురో- అట్టిల కైకచేయునందురా- ఐశ్వర్యము నిమిత్తమైకదా తనకొడుకు విడిచెను- మగని నెడఁబాసె- అటువంటి దుర్మార్గురాలు అటువంటి కులక్షయకారిణి యెవ్వనికేవేళ కేమిచేయునో యెవ్వరెఱుఁగుదురు. అట్లామెచేసిన మనమేమిచేయఁగలము. వెనుక జింతించుట వెఱ్ఱితనము- కావున ముందుగనే హెచ్చరిక గలిగి యుండవలెను.

కం॥ కైకేయి బ్రతికియుండఁగ, నామెకడం గూలివాండ్ర॥మగుచును బ్రదుకన్
మా కోర్వదు మది నిక్కం, బీకొడుకులమీఁద శపథ॥మిదితమిచుండి.

స్త్రీల సాహసము పట్టుదల యీ పద్యమునఁ దెలియఁగలదు. [౧౮-౫౧

తాత్పర్యము

కైకేయి జీవించి ప్రభుత్వము చేయుట కలిగినా యామెయొద్ద మేము కూలివాండ్రమై జీవింప మా మనస్సు లొప్పవు. అట్టిదశ మేము సహింపలేము. ఇది యిప్పటి యుద్రేకముమీఁదఁ జెప్పెడిమాటగాదు. ఇదిగో మా యెదిలో నుండు నీకొడుకులపైఁ బ్రమాణముచేసి చెప్పుచున్నాము.

ఉ॥ రాజకుమారునిం గనిక॥రఁ బనుమాట యొకింత లేక దు
ర్యోజన వన్యులన్ నవయఁ॥ద్రోసినదుర్మతి దుష్టశీల న
య్యోజ్య జగజంతఁ గొల్చి యెమఁ॥డో సుఖ ముందెడివాఁ, డనాయకం
బై జనహీన మై నగర॥మంతయుఁ బా డయిపోవు నీవయిన్. ౧౮-౫౨

ఇంత ఘోరప్రమాణము చేసెదరేల యందురా.

దుర్యోజనన్=దురాలోచనముచే, వన్యులన్=వనసమూహములందు, నవయన్=కృశించునట్లు, దుర్మతి = చెడుమనస్సుగలది, దుష్టశీల = చెడునడవడిగలది, జగజంత=మిగుల గయ్యాళి, అనాయకంబు=నాయకుఁడు లేనిది, జనహీనము=మనుష్యులు లేనిది. తాత్పర్యము

ఇంతఘోరప్రమాణము చేయుటకుఁ గారణము చెప్పెదము వినుఁడు. దిక్కు లేని యమాయి బిడ్డనుగాడు. రాజుగారి కుమారుఁడే. ఏరాజుకుమారుఁడో కాదు. తనకు మగఁడైన రాజుగారి కుమారుఁడే. దయ యనుమాట కొంచెమైనను లేక దురాలోచనచేసి యడవులందుఁ గృశించి చావుమని త్రోచినట్టి చెడుమనస్సు గలది. తన యాలోచన తనలోనుంచుకొనక యాప్రకారము నడచునది, ఇటువంటి

గయ్యాళిని గొలిచి యెవఁడు సుఖముందఁగలఁడు. కావున నెవరు నీ నగరమం దుండరు. ప్రజలు లేకుండిన నాయకుఁడేల. కావునఁ బ్రభువు నుండఁడు. కావున నీ పట్టనమంతయు మనుష్యులులేనిదై పాడుపడి పోవును.

ఉ॥ రాముఁడు గానకుం జనుట • రా జిఁకఁ జచ్చును, మీఁద నేడ్పె యీ
భూమిని, క్షీణపుణ్యు! లిది • బుద్ధిఁ దలంచి విషంబుఁ గ్రోలుటో
రామునివెన్నడిం జనుటొ • క్రచ్చుఱ నీనగరంబువార్త పే
రేమి వినంగ రాని మహి•కేనియుఁ బోవుటొ నిశ్చయింపుఁడీ. ౧-౨౩

తాత్పర్యము

శ్రీరాముఁ డడవులకుఁ బోయిన కారణమున రాజిఁకఁ జచ్చును. రాజు కూడఁ జచ్చెనా యరాజకమైన నీరాజ్యమం దెందును నేడ్పుధ్వనులే విన వచ్చును. కావున శ్రీరామునివెంటబోయి మరలివచ్చిన నిర్భాగ్యులారా! యింత మాత్ర మాలోచించి విషముద్రావుటమేలో శ్రీరామునివెంబడి పోవుటమేలో- అది యిదిగాకున్న నీయూరివార్త చెవిని బడని దూరదేశమునకుఁ బోవుటో యీ మూఁటిలో నేదియో యొక్కటి నిశ్చయింపుఁడు. ఇక్కడ నుండుటమాత్రము తగదు.

చం॥ అలుకక మోసమై దశర•థావనినాథుఁడు రాముఁ దమ్మితో
జలజదళాక్షితో వనికి•సాగఁగ నంపి దయావిహీనుఁ డై
మలఁగక మిమ్ము మమ్ము దెస•మాలినవారిని బోయవానిపుం
గలఁ బశుజాల ముంచుగతిఁ•గైకయిపట్టికి నప్పగించెడిన్. ౧-౨౪

రాజు చచ్చినతరువాతి ముచ్చటగదా మీరుచెప్పునది. రాజుండువఱకు నిందే యుండవచ్చునుగదా యందురేమోయదియును సరిగాదు. ఏలయందురా.

అలుకక=జంకక, మోస+మై=మోసముచేత- మోస రూ. మోసము.

తాత్పర్యము

రాజుమాత్రము మంచివాఁడా. ఆయనయు దుష్టుఁడే. ఇదివినిన నెవరేమను కొందురో యను బంకులేక మోసముచేసి పట్టాభిషేకముచేసెద రమ్మని పదు గిరిలోఁ జెప్పి యింటికిఁబోయి నీవడవులకుఁ బొమ్మని శ్రీరాముని సీతను లక్ష్మ ణుని నడవులకు దయాహీనుఁడై పంపినవాఁడు మనవిషయమున నయ్యో పాప మనునా. ఆయన చేయఁబోవునది తెలియునా ? తన యభిప్రాయమునుండి మరలక దిక్కులేని మిమ్ము-మమ్ముఁగూడ బోయవానిముందు పశువులనుంచు విధమునఁ గైకేయికొడుకునకు నప్పగించును. కావున నీరాజు బ్రదికియుండినను మనకు మేలులేదు.

సీ॥ నిండుఁజందురుఁబోలు•నెమ్మోముగలవాఁడు, నహితపాళికిఁగాలుఁ•డైనవాఁడు
గూఢజత్రులకల్మి • రూఢి కెక్కినవాఁడు, నుత్తమాజానుబా•హువులవాఁడు
కమలంబులనుబోలు•కందోయి గలవాఁడు, తానముమున్నుగఁ బల్కు•నానువాఁడు
కమ్మనిపల్కులు • నెమ్మి నాడెడివాఁడు, మాఱు లేనిపరాక్ర• మంబువాఁడు

తే॥ సౌమ్యుఁ డగువాఁడు, మఱి జగ • జ్జాలమునకు
నమృతకరునట్లు చూడఁ బ్రి • యంబు నైన
వాఁడు, పురుషోత్తముఁడు ఘోర • వనచయంబు
శోభితముఁ జేయ కుండునే • సుకృతరతుఁడు. ౧_౩౪

కైకేయీదశరథుల స్మరించిన పాపము పోవుటకై శ్రీరాముని గుణముల స్మరించియైన దుఃఖమార్పఁదలంచి శ్రీరాముని గుణముల వర్ణించుచున్నారు.

అహితపాళికిన్=శత్రువుల సమూహమునకు, కాలుఁడు=యముఁడు, గూఢజత్రులకల్మిన్ = బలసిన మూఁపులు కలిగియుండుటచే, రూఢికిన్ = ప్రఖ్యాతికి, ఉత్తమ=శ్రేష్ఠములైన, ఆజానుబాహువుల వాఁడు=మోఁకాటివఱకుఁగల చేతులు గలవాఁడు, నెమ్మిన్=స్నేహభావమున, జగజ్జాలమునకున్=లోకసమూహములకు, అమృతకరునట్లు=చంద్రునివలె, ఘోరవనచయంబు=భయంకరమైన వనముల సమూహమును, శోభితమున్=ప్రకాశించునదిగ.

తాత్పర్యము

పూర్ణచంద్రునివంటి ముద్దుముఖము గలవాఁడును విరోధులకు మృత్యుస్వరూపమైనవాఁడును, బలసిన మూఁపులచేఁ బ్రసిద్ధుఁడును మోఁకాలినంటు నుత్తములైన చేతులుగలవాఁడును, కమలములవంటి కన్నులజంట గలవాఁడును, తానే ముందుగఁ బలుకరించువాఁడును, స్నేహభావముతోఁ దియ్యని పలుకులు పలికెడివాఁడును ఎదురులేని శౌర్యము గలవాఁడును, ప్రసన్నుఁడును, లోకుల కందఱకుఁ జంద్రునివలెఁ జూడఁ బ్రియమైనవాఁడును, పుణ్యకార్యములం దాసక్తి కలవాఁడుననగు శ్రీరామచంద్రమూర్తి యీపాటికి నరణ్యములను బ్రకాశింపఁ జేయకుండునా?

కం॥ రాముండు సత్యభాషా,ధాముఁడు దానాభి రాజి • తద్విపగమనుం
డామహనీయుఁడు నిజతను,
ధామంబున వెలుఁగఁ జేయుఁ•దద్వన మెల్లన్. ౧_౩౬

సత్యభాషాధాముఁడు=సత్యవాక్కులకు స్థానమైనవాఁడు, దాన=మదజలముచే, అభిరాజిత=మిక్కిలి ప్రకాశించు, ద్విప=ఏనుఁగునడకవంటి, గమనుండు=నడకగలవాఁడు, నిజతనుధామంబునన్=తనదేహకాంతిచే.

తాత్పర్యము

సత్యవాక్కులకు స్థానమైనవాఁడును మదించిన యేనుఁగు నడకవంటి నడక గలవాఁడును నగువాఁడు మన శ్రీరామచంద్రమూర్తి అట్టి మహనీయుఁడు తనదేహకాంతిచే నావనమంతయుఁ బ్రకాశింపఁజేయు చుండును.

కం॥ ఈకరణిఁ బురమునం గల,యాకరిణీయాన లెల్ల • నలమటపడ న
స్తోకంబుగ మృత్యుభయ,వ్యాకులల ట్లంతఁ బంక•జాప్తుఁడు గ్రుంకెన్.

ఈకరణిన్=ఈవిధము, కరిణీయానలు=ఆడు యేనుఁగుల నడకగలవారు స్త్రీలు, అలమటపడన్=బాధపడుచుండఁగా, అస్తోకంబుగన్=మిక్కిలి, మృత్యుభయ వ్యాకులలు = మరణభయముచేఁ గలఁతచెందినవారు. ఇది పరమభక్తి లక్షణము.

తాత్పర్యము

ఈవిధముగఁ బురస్త్రీలు దుఃఖముచే మిక్కిలి మృత్యుభయముచేఁ గలఁత నొందిన పామరులవలె రామవియోగతాపంబున బాధపడుచుండుట చూచి వారి దుఃఖము చూడలేనివానివలె సూర్యుఁడస్తమించెను. ఇది రెండవనాఁటి పగటి వృత్తాంతము. ఈదినము షష్ఠీతిథి.

ఉ॥ వేలుప రగ్నిహోత్రముల • విప్రులు, వేదపురాణసత్కథల్
బాలిఁ బఠింప రెవ్వరును • బాఢతమంబు పురంబు ముంపఁగా
జాలి మునింగి దిక్కు చెడి • సంతస మింతయు లేక శూన్యప
ణ్యాళియు నై గ్రహోడురహి • తాభ్రముభంగి నయోధ్య చెన్నఱెన్. ౧౫౫౮

బాఢతమంబు=గాఢాంధకారము, శూన్యపణ్యాళి=వస్తువులులేని యంగళ్ళ వరుసలుగలది, గ్రహోడురహితాభ్రముభంగిన్ = గ్రహములు నక్షత్రములు లేని యాకాశమువలె, చెన్నఱెన్=కాంతిహీనమయ్యెను.

తాత్పర్యము

బ్రాహ్మణులెవ్వరు నగ్నిహోత్రముల హోమములు చేయరు. వీథుల యందు వేదపురాణములందలి మంచికథ లెవ్వరు పఠింపరు. గాఢాంధకారము పట్టణమంతయు ముంచుటచే వ్యసనాంధకారములో మునిఁగి దిక్కులేక సంతోషమనునది కొంచెమైనములేక పాడుపెట్టఁబడినట్లుండు నంగళ్ళవరుసలతో నయోధ్యాపురము గ్రహములు నక్షత్రములులేని యాకాశమువలె నుండెను.

చం॥ తమతమముద్దుబిడ్డలను • దమ్ముల నన్నలఁ బాసినట్లుగాఁ
గమలదళాక్షు లాపురిని • గాదిలిరాముని కంగలార్పఁగా
శమకరగీతనృత్యములు • చారుతరోత్సవముల్ దొలంగి సం
శమితజలార్ణవంబుగతి • జానఱి పట్టన మొప్పె నయ్యెడన్. ౧౫౫౯

గాదిలిరామునకు=ప్రేమాస్పదమైన శ్రీరామునకై, అంగలార్పఁగా=అంగలి + ఆర్పఁగాన్=గొంతెండునట్లేడ్వఁగా, శమకరగీతనృత్యములు = శాంతికలిగించు పాటలు నాటలు, చారుతరోత్సవముల్ = మనోహరములైన పండుగలు. దొలంగి=పోయి, సంశమితజలార్ణవంబు=అలలు నీళ్ళులేని సముద్రము, జానఱి = అందముపోయి.

తాత్పర్యము

తమతమ ముద్దుబిడ్డలను దమ్ముల నన్నలఁ బాసినట్లుగా నాపురమందలి స్త్రీలు ముద్దులకావన్నా మోహనరామన్నా నాయనా తండ్రీ యని యేడువఁగా

శాంతికరములైన యాటలు మనోహరములైన యుత్సవములు లేక యెండి పోయిన సముద్రమువలె సొంపుచెడి యయోధ్యాపుర ముండెను.

—• ౪౯-వ సర్గము. శ్రీరాముఁడు కోసలదేశంబు దాఁటి పోవుట. •—

సీ॥ అక్కడ శ్రీరాముఁ•డాకొంతరేయిని, గడుదవ్వు చని రేప • కడను వార్చి
యావిషయం బెల్ల • నతితరించుచు దూర,మందలియూరులు•సుందరంపుఁ
దోఁటలు, వి త్తెడు•దుక్కిమళ్ళను జూచు,చును సత్వరంబుగఁ•జనుచు నుండి
యును మెల్లగాఁ జను•నొప్పు దోఁపఁగ నట, వఱలెడిగ్రామనం•వాసజనులు

తే॥ తత్కుమారులఁ గనుఁగొని•దశరథుండు ఛీఛీఛీయాఁడుదానికిఁ•జెవ్వినిచ్చెఁ
గామవశుఁ డయి యయ్యయో•కైకయెంత,
పాప పాపానుబంధిని•భ్రష్టురాలు. ౧-౫౮౦

ఇంతవఱకుఁ బురజనుల వృత్తాంతముఁదెలిపి రెండవదినమందలి సీతా రామలక్ష్మణుల వృత్తాంతముచెప్పఁ గవి యారంభించెను.

కొంతరేయిని=రాత్రి యింకను మిగిలియుండఁగా, రేపకడను=ఉదయమున, వార్చి=సంధ్యవార్చి, విషయంబు = ఉత్తరకోసలదేశము, అతితరించుచున్ = దాఁటుచు,పాపానుబంధిని=ఎప్పుడు పాపమువెంటఁ బాపము చేయుచుండునది.

తాత్పర్యము

అక్కడ శ్రీరాముఁ డారాత్రి యింకను గొంతయుండఁగానే మిక్కిలి దూరముపోయి యుదయమునఁగా సంధ్యవార్చి యుత్తరకోసల దేశంబెల్ల దాఁటిపోయి దూరమందలియూళ్ళను సుందరమైనతోటలు విత్తుచున్న దుక్కిమళ్ళు చూచుచు మిగుల వేగముగఁ బోవుచుండియు గుఱ్ఱములనడక నేర్పుచేతను-చుట్టునుండు వినోదములఁ జూచుచుఁ బోవుచుండుటచేతను మెల్లగఁ బోయి నట్లుండ నందందుఁగల పెద్దయూళ్ళలఁ జిన్నపల్లెల జనము లాకుమారులఁ జూచి ఛీఛీ దశరథుఁడు కామవశుఁ డయి యాఁడు దాడించినట్లెల్ల నాడెనుగదా. కైక యెంతపాపాత్మురాలు. ఒక్కటివెనుక నొకటి పాపకార్యములే చేయుచుం డును. భ్రష్టురాలు.

ఉ॥ ఎంతటిమానహీన, యది • యెంతటికౄర! యదెట్టిపాపదు
శ్చింతకురాలొ, యీయనఘుఁ, • జిన్నిసుతుం గరుణాలవాలు స
చ్ఛాంతు జితేంద్రియున్ వనికి • సాగఁగ నంపె, మహానుభావ యీ
కాంత విదేహపుత్రి యటె • కాఱడవిం బడు నట్టి దుఃఖముల్. ౧-౫౮౧

మానహీన=సిగ్గుమాలినది, కౄర=దయలేని దుష్టురాలు, పాప దుశ్చింత రాలో=పాపపుఁ జెడ్డాలోచనకలది, అనఘున్ = ఏపాప మెఱుఁగనివానిని, చిన్ని సుతున్=ముద్దుకుమారుని, కరుణాలవాలు=దయకుఁ బాదైనవానిని, జితేంద్రి యున్=ఇంద్రియముల గెలిచినవానిని- విషమాలంకారము.

తా త్ప ర్య ము

కైక యెంతసిగ్గుమాలినది- యెంత క్రూరురాలు- ఎంత పాపచింతకలదో కదా యిటువంటి ముద్దుకుమారుని, దయకుఁ బాదైనవాని, శాంతచిత్తుని, నింద్రియముల జయించినవాని,నడవులపాలుచేసెఁగదా- మహానుభావురా లీసీత విదేహరాజు కూఁతురఁట యడవులలో దుఃఖములుపడునఁట ఏమియీవిపరీతము.

ఈ యల్పకాలములో నింతదూర మీవార్తవచ్చుటకుఁ బూర్వమే సదుపాయము లుండెనో-అంతియకాదు ఆసమయమున నాత్రోవ శ్రీరాముఁడు వచ్చునని చుట్టునున్న పల్లెలలోఁగూడఁ దెలిసినఁగదా వారువచ్చి చూచుట తటస్థించెను.

కం॥ అయ్యో దశరథుఁ డెంతటి,నెయ్యంబును లేనివాఁడొ ♦ నిజపుత్రకుపై
నియ్యనఘు లోకహితునిన్,దయ్యన్ ఘోరాటవులఁ బ♦డం ద్యజియించెన్.

నెయ్యము=స్నేహము, త్యజియించెన్=వదలిపెట్టెను. ౧౨౮౨

తా త్ప ర్య ము

అయ్యో! చిన్నకుమారునిపై దశరథుఁడెంత పుత్రస్నేహము లేనివాఁడో కదా ఇటువంటి పుణ్యాత్ముని- ఇటువంటి లోకహితమెంచువానిని గాసిపడునట్టు లడవులలో వదలిపెట్టెను.

కం॥ ఈరీతి నాడ నయ్యా,యూరులవా రాలకించు ♦ చొయ్యనఁ గడచెన్
వీరుఁడు కోసల దేశం, బారఘుకులుఁ డంతఁ జేరి♦యాపగ నొండున్.

తా త్ప ర్య ము

ఈవిధముగ నాయాయూళ్ళల జనములు పలుకుచుండ వానిని వినుచుఁ గ్రమక్రమమున శ్రీరాముఁ డుత్తరకోసల దేశంబంతయుఁ గడచెను. ఇట్లుగడచి యచట నొక నదిని గాంచెను.

కం॥ వేదశ్రుతి యనుదానిని, మోదంబున దక్షిణాభి♦ముఖుఁడై చనుచున్
భూదయితుసుతుఁడు గోమతి, సాదరమతిఁ గాంచి దానిఁ♦జయ్యన దాఁటెన్.

తా త్ప ర్య ము ౧౨౮౪

ఆవేదశ్రుతి యను నదిని సంతోషముతోదాఁటి దక్షిణదిక్కుగాఁ బోవుచు గోమతి యనుదానిఁజూచి దానిని దాఁటెను.

కం॥ శారీకీరీమత్తమ,యూరీకలహంసకలక ♦ లోద్భటరుచిరో
దార యగుస్యందికానది,తీరంబును దాఁటి విభుఁడు♦దేవికి ననియెన్.

శారీ=ఆఁడు గోరువంకలయు, కీరీ=ఆఁడుచిలుకలయు, మత్త=మదించిన, మయూరీ=ఆఁడునెమిళ్ళయు, కలహంస=ఒకజాతిహంసలయు, కలకల=కలకలమను, ఉద్భట=అధికమైనదియు, రుచిర=మనోహరమైనదియు, ఉదార=దండిగ నీళ్ళుగలిగి గంభీరమైనదియు, స్యందికానది = స్యందికయనుపేరుగల నది యొక్క, దేవికి=సీతకు.

తాత్పర్యము

ఆఁడుగోవపంకలు- ఆఁడుచిలుకలు- ఆఁడునెమిళ్లు కలహంసలు వీనియొక్క కోలాహలమై యధికమై మనోహరమై గంభీరమైన స్యందికానది యొడ్డును దాఁటి శ్రీరామచంద్రుఁడు సీతాదేవి కిట్లనియెను. ఈ యాఁడుపక్షులవలె నీవు నడవిలో సంతోషింపవలెఁ జుమా యని సూచింప నాఁడుపక్షు లెక్కువగఁ జెప్పఁబడెను.

తే॥ కమలలోచన! యీనది•గరుసుగాఁగ, మను వొసంగెను నిక్ష్వాకు•మనుజపతికిఁ
దక్కినదియెల్లఁ గరదులై•ధరణినాథు,
లేలుచుందురు సంప్రీతి•యెసక మెసఁగ. ౧౮౦౬

గరుసు=ఎల్ల-పొలిమేర, కరదులై=కప్పముకట్టువారలై, ఎసకమెసఁగ= అతిశయింపఁగా-

గీ॥ ఏక భోగంబుగాఁగ నేలేలు గరుసు
కడలి సీమంబు గౌతమి గంగ యవధి. భీమ. ౫. ఆ.

తాత్పర్యము

కమలనేత్రా యీనది యెల్లగాఁగఁ గోసలదేశము నంతయు నీ వేలుకొమ్మని మొదటిరాజైన మనువు మావంశమునకు మొదటివాఁడైన యిక్ష్వాకుమహారాజున కిచ్చెను. ఇంతవఱకు నిక్ష్వాకువంశమువారు స్వయముగాఁ బాలింతురు. తక్కిన దేశము నితరరాజులు మాయధికారమునకు లోవడి మాకుఁ బన్నులుచెల్లించి సంతోషముగా వారువారేలుచుందురు. అవి మాప్రత్యక్షపాలనమునకు లోవడినవి కావు. కాని వానియందు మాకు స్వామిత్వము కలదు.

ఈకారణముచేతనే శ్రీరాముఁడు వాలితో 'ఇక్ష్వాకూణా మియంభూమి సశైల వనకాననా' యని చెప్పెను. హనుమంతుఁడును సురసతో నీవు శ్రీరాముని దేశమం దున్నదానవని చెప్పెను.

చం॥ అని తనసూతుఁజూచి యను•హంసకలస్వరలక్ష్మితోడ నో
యనఘ సుమంత్ర! యెన్నఁటికి • నబ్బునో నే సరయూతటంబునన్
గొనబగుతోఁటలందు జన • కుండును దల్లియుఁ దోడ రా మృదం
బున మృగయావిహారరతిఁ • బోఁడిమిగాఁ జరియించుపుణ్యముల్. ౧౮౦౭

సూతున్=సారథిని, హంస=హంసలయొక్క, కలస్వర=అవ్యక్తమధుర ధ్వనియొక్క (స్పష్టముగాక వినుటకు నింపైన ధ్వనితో), లక్ష్మితోన్=సంపదతో, గొనబగు=అందమైన,మృగయావిహారరతిన్=వేఁటకై తిరుగుటయందలి ప్రీతిచే, పోఁడిమిగాన్=వినోదముగా- రాఁగల జనకవియోగమును దలఁచి దుఃఖించుచు దగ్గుత్తికతో మాటలాడుచున్నాఁడని కల శబ్దము సూచించుచున్నది.

ఈప్రకారము సీతాదేవికిఁజెప్పి సారథినిఁజూచి రాఁగల తండ్రివియోగమును దలఁచి వ్యసనపడుచు హంసల యవ్యక్త మధురస్వరమువంటి స్వరముతో నిట్లనియె. సుమంత్రా! యిఁక నెన్నఁటికేని సరయూతీరమందు సందమైన తోఁటలయందుఁ దల్లిదండ్రులు దోడరాఁగా సంతోషముతో వేఁటలాడుచు వినోదముగాఁ జరించు భాగ్యము మరలరాఁగలదా.

తే॥ భువనములయందు రాజర్షి॰పుంగవులను వేడుకకు నయి,
పితృకార్య॰వేళలందు
సజ్జనులు, విలుకాలు ల॰క్ష్యంబుపొంటె, వేఁట చనుదురు నాకంత॰వేడ్కలేదు.

భువనములయందు=లోకములయందు, పితృకార్యవేళలందు=శ్రాద్ధాది పితృ కార్యములను జరుపు సమయమందు, విలుకాలు=విలుకాండ్రు, లక్ష్యంబు పొంటె=గుఱికొట్ట నేర్చుకొనుటకు.

తాత్పర్యము

లోకములో రాజులు వినోదార్థము, సజ్జనులు పితృకార్యములు చేయు సమయమందును, విలువిద్యనేర్చువారు చలించు వస్తువులను గుఱికొట్ట నేర్చు కొనుటకునై, వేఁటలాడుదురు. ఈమూఁటితోను నాకుఁబనిలేదు. కావున నాకు వేఁటమీఁద విశేష ప్రీతిలేదు. గోబ్రాహ్మణ ప్రజారక్షణార్థమో మఱియేదైన నప్పు డైన నావశ్యకము పడినఁ గ్రూరమృగములను జంపుటగలదు.

వెలఁది, జూదంబు, పానంబు, వేఁట, పలుకు ప్రల్లదంబును, దండపారు ష్యము వ్యర్థముగ ధనము వ్యయముచేయుటయును నవి సప్తవ్యసనములు.

వ్యసనము (వి + అసనము) ఒకదానియందు విశేషాసక్తిగలిగియుండుట. వీనివలన వ్యసనమే కలుగును గావున వీనికి వ్యసనములనిపేరు. ఇవి యీవ్యస నములుగ నిషిద్ధములుగాని యీకార్యములే మొదలుముట్ట నిషిద్ధములుగావు. అట్లైన భార్యాసాంగత్యముకూడ మానవలసివచ్చును. రాజసూయయాగమందు "తస్యా సభాయామధ్యేఽధిదేవన ముద్ధత్యావోక్ష్యక్షాంతన్నివపే" త్తని జూద మాడుట విధిచోదితమైయున్నది. దుష్టవిషయమై పరుషముగ మాటలాడవలసి వచ్చును గావున నెపుడో యొకప్పు డీకార్యములు చేయుట దోషముగాదు. నిరం తరము చేయుట దోషము, స్త్రీవ్యసనమున రావణుఁడు, జూదమువలన నలధర్మ రాజులు, పానముచే యాదవులు, వేఁటచేఁ బాండురాజు చెడిపోయిరికదా.

తే॥ కోసలేంద్రుఁడు రాజుల॰గుణములిట్లు,
మనసునకుఁదెచ్చికొనుచు సు॰మంత్రుఁజూచి
హర్ష మువ్పార ముచ్చట॰లాడుకొనుచు, వేగఁ గోసలదేశంబు॰నెల్ల దాఁటె.

౧౨౪౬

తాత్పర్యము

రామచంద్రుఁడు రాజులగుణము లీరీతి స్మరించుచు సంతోషముతో సుమంత్రునితోడ ముచ్చటలాడుచు దక్షిణకోసలదేశము మేరదాఁటిపోయెను. ఈ ముచ్చటల విషయము సుమంత్రుఁడు రాజుతోఁ జెప్పునపుడు విశదపడును.

౫౦-వ సర్గము

కం॥ మును పురజనసమ్మర్దము,నను బ్రొక్కఁగ వలను పడమి॥నవసారసలో
చనుఁడు పురిదిక్కు మొగమై,
వినయోక్తుల బ్రొక్కియిట్లు॥వేఁడెనయోధ్యన్. ౧-౫౦

మును=పూర్వము, సమ్మర్దము=జనుల త్రొక్కుడు,నవసారసలోచనుఁడు=క్రొత్తకమలములవంటి కన్నులుగలవాఁడు.

తాత్పర్యము

పురమువిడిచి రాఁగానే పురాధిదేవతకు నమస్కరించుట పూర్వాచార సిద్ధము. అది పురజనుల సందడివలన నప్పుడే చేయుటకు సాధ్యపడినదికాదు కావున శ్రీరాముఁ డుత్తరదిశగా నయోధ్యాపురము దిక్కు ముఖమై వినయముతో మ్రొక్కి యిట్లని ప్రార్థించెను.

అవిప్లవాయ ధర్మాణాం, పాలనాయ కులస్యచ
సంగ్రహాయచలోకానాం, మర్యాదా స్థాపనాయచ
ప్రియాయమమవిష్ణోశ్చ, దేవదేవస్యశార్ఙ్గిణః
మనీషీవైదికాచారం, మనసాపినలంఘయేత్॥

ధర్మము చెడకుండుటకును కులము పాలించుకొనుటకును, లోకమును నను వర్తింపఁజేయుటకును, శాస్త్రము కట్టుపాటు స్థాపించుటకును, నాయొక్కయు దేవదేవుఁడగు విష్ణువుయొక్కయు ప్రియము నిమిత్తముగను, బుద్ధిగలవాఁడు వైదికాచారమును మనసుచేనైన నుల్లంఘింపరాదు.

లోకసంగ్రహ మేవాపి సంపశ్యన్కర్తు మర్హసి. భ.గీ. ౩-౨౦

లోక క్షేమము గోరువాఁడవై వారిని బ్రవర్తింపఁజేయు నీ ధర్మమును నీవు చేయవలయును.

సక్తాః కర్మణ్య విద్వాంసో, యథాకుర్వంతి భారత
కుర్యాద్విద్వాన్ స్తథాసక్త,శ్చికీర్షు ర్లోకసంగ్రహమ్. భ.గీ. ౩-౨౫

అర్జునా! యజ్ఞాని కర్మముల నెట్టి లాసక్తితోఁ జేయునో యట్టులు జ్ఞానియు ఫలాసక్తిలేక కర్మములను లోకము ననువర్తింపఁజేయఁ గావింపవలయును. ఇచ్చట నీవాక్యములను సంధింపఁగు.

శ్రీరాముఁడు భగవంతుఁడుగదా యీప్రకారము క్షుద్రదేవతలకు నమస్కరింపవచ్చునా? యని పూర్వపక్షము. స్వానుష్ఠానముచే లోకమున శిష్టాచార స్వధర్మ

ములు స్థాపింపవచ్చిన యవతారమూర్తిగదా శ్రీరాముఁడు. కావున నిచ్చటఁగాని మఱియెచ్చటఁగాని సీతారాములు నదీ వృక్షాది దేవతాదులకు నమస్కరించుట లోకశిక్షార్థమేకాని తమకంటె వారు గొప్పవారను నభిప్రాయమునఁగాదు. 'లోక సంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి' యను భగవద్గీతావాక్యము ప్రకారము శిష్టాచారస్థాపనకై తనకుఁ బ్రయోజనములేని కర్మములను లోకశిక్షకై జ్ఞానియుఁ జేయవలయును.

ఉ॥ ఓరఘువంశ పాలితపు • రోత్తమమా! నిను గ్రామదేవతా
వారము నీయెడన్ వెలసి • వర్తిలు వేల్పుల నెల్లఁ గ్రమ్మఱం
దీరిచి తండ్రియప్పను వ • నీస్థలిఁ గ్రుమ్మరి తల్లిదండ్రులం
గూరిమిఁ గూడి వెండిఁ గనుఁ•గొందును నన్ను ననుగ్రహింపుమా. ౧. ౨౬౧

రఘువంశపాలిత పురోత్తమమా = రఘువంశరాజులచేఁ బాలింపఁబడిన పట్టణశ్రేష్ఠమా, గ్రామదేవతావారము = గ్రామదేవతల సమూహము, నీయెడన్ = నీయందు.

రఘువంశమున జనించిన రాజులచే రక్షింపఁబడు నయోధ్యా నగరమా! నిన్ను గ్రామదేవతా సమూహమును నీయందుండు దేవతలనెల్లఁ దండ్రియప్ప దీర్పనడవులయందుఁ దిరిగి తల్లిదండ్రులను గలిసికొని యాపిమ్మట మిమ్ముఁ జూచెదను దయయుంచుఁడు.

మనమొకరికి నమస్కరించునపుడు వారి దేహములకుమాత్రము గాదు మనము నమస్కరించుట దేహములోనుండు నీశ్వరునకును. అట్టులే యన్నిటికి ననియెంచవలయును. "నేనుగృశుఁడ" నన్నప్పుడు నే ననునది కేవలమాత్మకే యన్వయింపరాదు. ఏలన నాత్మకు స్థూలత్వ, కృశత్వములులేవు. స్థూలత్వ కృశత్వములు దేహలక్షణములు. దేహమే యాత్మయను భ్రాంతిచేఁ జెప్పఁబడినదియుఁ గాదు. కావున నేననఁగా దేహవిశిష్టుఁడైన యాత్మయని యెఱుఁగవలయును. భగవంతుఁ డాత్మకాత్మయయిన కారణమున నెవరికి నమస్కరించినను జీవప్రకృతి విశిష్టుఁడై యంతర్యామియగు నీశ్వరునకేయని యెఱుంగనగు.

కం॥ అని యిట్లు పలికి జేగుఱుఁ, గనుఁగవలన్ బాష్పవారి•గాఱఁగఁ గుడిచే
తిని నెత్తి యచట మూఁగిన, జనపదజనములను జూచి•సమ్మతిఁ బలికెన్.

జేఁగుఱుఁగనుఁగవలన్ = ఎఱ్ఱని రెండుకన్నులయందు, మూఁగిన = గుంపు చేరిన, జనపదములజనములను = ఊళ్ళయందలి మనుష్యులను.

తాత్పర్యము

ఈప్రకారము పలికి తన్నుఁ బాసినకారణమున నూరిలోని స్త్రీలు పురుషులు తల్లిదండ్రులెంత తపించుచున్నారోయని తోఁపఁగా కన్నులెఱ్ఱగాఁగా దూరమున

నున్నవారగుటచేఁ కుడిచేతినెత్తి తన్నుఁజూడవచ్చిన యా ప్రాంతపుటూళుల జనములఁ జూచి నిండుమనస్సుతో నిట్లనియె.

సీ॥ అనఘాత్ములారః మీ॰రనుకంపయును నను,
క్రోశంబుఁ దగురీతిఁ॰గూర్చుకతన
నావయి, మీకిట్లు॰పాపీయ మౌచిర,దుఃఖంబు ఘటియిల్లెఁ॰ద్రోవ వసమె
పొందు మీమీకార్య॰ముల నవరింపఁగ, స్వార్థసిద్ధికి నేను॰నరుగువాఁడ
నని వల్కి,వారు మ॰హాత్ముని రాముని,వలగొని యేడ్చు చా॰వలనుగనుచు
ఆ॥ నిలిచి యచట నచట॰జలజాక్షుఁ జూచుచుఁ,బోవు చుండఁ దృప్తి॰పొందకెడల
వారికెల్ల మఱుఁగు॰పడి చను చుండె ని, శాముఖంబునందు॰సవితవోలె.

అనుకంప=దయ, అనుక్రోశము=ఆదరము, కతనన్=కారణముచే, పాపీయము=మిగుల నశుభమైనది, చిరదుఃఖము=దీర్ఘకాల మనుభవింపవలసిన దుఃఖము, ఘటియిల్లెను=సంభవించెను, వసమె=సాధ్యమా, ప్ర-వశము. స్వార్థసిద్ధికిన్=(1) పదునాలుగు సంవత్సరములు వనవాసముచేయుటకై (2) అవతారప్రయోజనమగు రావణాది వధార్థమై, వలగొని=ప్రదక్షిణించి, వలను=దిక్కు, నిశాముఖమున=సాయంకాలమునందు, సవిత సూర్యుఁడు. సాయంకాలమున సూర్యుఁడు లోకమునకు మఱుఁగుపడునేకాని దానివలన నాయనకు తేజోహీనతలేదు. ఉదయము, అస్తమాన మనుకొనుట మనస్థితినిబట్టియేకాని సూర్యునకు నా రెండును లేవు. అట్లులే శ్రీరామునకును. ఆయనను జూడనేరని జనులు నిర్భాగ్యులు.

తాత్పర్యము

పుణ్యాత్ములారా! మీరు నాపయిచాలినంత దయయును నాదరమును గలవారగుటచే మీకిట్టు లశుభకరము చిరకాలదుఃఖము కలిగెను. ఇది తప్పింప సాధ్యముకాదు. కావున మీ మీ కార్యములు చక్కఁజేయుటకై మీరుపొండు, నాస్వప్రయోజనసిద్ధికిఁగాను నేను బోయెదను. అనివల్కి వారు మహాత్ముఁడగు శ్రీరామునకుఁ బ్రదక్షిణ నమస్కారములుచేసి యేడ్చుచు నాయనపోవుదిక్కు నచట నచట నిలిచి నిలిచి చూచుచుఁ దృప్తిలేక పోవుచుండ శ్రీరాముఁడును సాయంకాలమున సూర్యునివలె వారికిఁగానరాక మఱుఁగుపడిపోయెను.

సీ॥ చనుచు నీరీతిఁ గో॰సల్యాతనూజుండు, పురుభూతధనధాన్య॰పుంజిత మగు
దానశీలప్రజా॰మానిత మగుచును, లలిత సౌభాగ్యసం॰కలిత మగుచు
నకుతో భయంబునై॰యధికరమ్యంబునై,
చైత్యయూపోత్కర॰సాంద్ర మగుచు
గున్న మామిడితోఁట॰చెన్నుల మీఱుచు,సంపన్న వరజలా॰శయము నగుచుఁ
తే॥ బుష్టతుష్టజనాకీర్ణ॰పురములగుచు, నాలమందలపందలు॰లీల నెగడ
బ్రహ్మఘోషంబు లొప్పారఁ॰బార్థివేంద్ర,
లక్షణీయంబునగు కోస॰లంబు శుభము. ౯౬౭

పురుభూత=అధికమైన, ధనధాన్యపుంజితమయి=ధనముచేతను ధాన్యము చేతను నిండినదై, దానశీలప్రజామానితము = దానముచేయు స్వభావముగల ప్రజలచేత గౌరవింపఁబడినదై- దీనివలన ధనధాన్యములు కలుగుటకు ముఖ్య ప్రయోజనము దానమని యేర్పడుచున్నది. తాననుభవించుట ముఖ్యప్రయోజనము గాదు. లలితసౌభాగ్య సంకలితమగుమన్.=మనోహరమైన సౌందర్యముతోఁ గూడినదగుచు, అకుతోభయంబు = దేనివలనను భయములేనిది, అధికరమ్యంబు=మిక్కిలి సుందరము, చైత్యయూపోత్కరసాంద్రము = దేవాలయములచేతను సర్వతోముఖ యాగాదులందుఁ జెప్పఁబడిన యూపాకారములైన స్తంభములచేతను దట్టమై, గున్న=గుజ్జు, సంపన్నవరజలాశయము=సంపూర్ణములు శ్రేష్ఠములునగు మడుఁగులు గలవై, పుష్టతుష్టజనాకీర్ణపురములు=దేహపుష్టియు మనస్తుష్టియుఁగల జనులచేనిండిన పురములు, ఆలమందలువందలు=నూర్లకొలఁది యావులమందలు, బ్రహ్మఘోషంబులు=బ్రాహ్మణులుచేయు వేదాధ్యయనరవములు,పార్థివేంద్రలక్షణీయము=రాజులకును వింతగఁ జూడఁదగినది.

తాత్పర్యము

శ్రీరామచంద్రుఁ డీరీతిఁ బోవుచు ధనధాన్యములు పెద్దరాసులుగఁగలదియు దానస్వభావముగల ప్రజలచేత గౌరవింపఁబడినదియు, మిగుల సుందరమైనదియు, దేనివలనను భయములేనిదియు, మిగుల రమ్యమైనదియు, దట్టముగ దేవాలయములు యూపస్తంభములు గలదియు, గుజ్జుమామిడితోఁటలచే నందమై నీళ్ళచేనిండిన శ్రేష్ఠములైన మడుఁగులుగలిగి దేహపుష్టియు మనస్సునకు సంతోషముగల మనుష్యులచే నిండినవియునగు పురములుగలిగి నూర్లకొలఁది యావులమందలు వ్యాపించియుండ బ్రాహ్మణుల వేదరవము లొప్పుచుండుటచే రాజులకుఁగూడఁ జూడ వినోదకరములైన పల్లెలుగలది, శుభమైనది కోసలదేశము.

కం॥ కనుచును వినుచును నడుమను, గన నగునుద్యానవాటిఁ•గడచుచు భూభృ
జ్జనభోజ్యము రాజ్యము విడి,చనియెను ధీరోత్తముండు•వని యచ్చోటన్.

భూభృజ్జనభోజ్యము = రాజుల కనుభవింప యోగ్యమైనది, ధీరోత్తముండు = మనస్సుచలింపనీని ధైర్యముగలవారిలో శ్రేష్ఠుఁడు "త్యక్త్వాసుదుస్త్యజ సురేప్సిత రాజ్యలక్ష్మీ" మన్నట్లు లింతటి భోగభాగ్యసంపన్నమై విడువరానిదైన రాజ్యమును శ్రీరాముఁడు ధీరజనోత్తముఁడు కావునఁ దృణము వలెఁ దలంచి ధర్మమే శ్రేష్ఠమని దాని ననుసరించెను.

తాత్పర్యము

ఇటువంటిదేశమును జూచుచు నడుమ నడుమఁ గానవచ్చు నుద్యానప్రదేశములఁ జూచుచు రాజభోజ్యమగు రాజ్యమువదలి ధీరవరుండైన శ్రీరాముఁడు పోవుచు నాస్థలమునందు.

—• శ్రీరాముఁడు గంగానదిఁ గాంచుట. •—

లయగ్రాహి
అంగుగ దినేశకుల•పుంగవుఁడు మోద మల
 రంగను గనుంగొనె న•భంగతరభంగో
త్సంగను శివాంబుచయ•రంగను మహాఋషిని
 షంగను శుభాశ్రమచ•యాంగను సురీవ్యా
సంగనుతసుందరవి•హంగకుల రాజిత త
 రంగకజలాశయవి•భంగను నరౌఘో
త్తుంగభవభీహనన•చంగను నభంగురశు
 భాంగను దరంగముఖ•రంగ నలగంగన్. ౧౭౯౬

దినేశకులపుంగవుఁడు=సూర్యవంశపురాజులలో శ్రేష్ఠుఁడు, అభంగతర=మిక్కిలివృద్ధియగుచున్న, భంగ=అలలతో, ఉత్సంగను=కూడినదానిని, శివాంబుచయరంగను=స్వచ్ఛమైన జలసమూహముచేఁ బ్రకాశించుదానిని, మహాఋషినిషంగను = గొప్పఋషుల సాంగత్యముకలదానిని, శుభాశ్రమచయాంగను=ధర్మముచే శుభకరములగు నాశ్రమ సమూహముల సమీపించియుండుదానిని, సురీవ్యాసంగ=క్రీడాకాలమందు దేవతాస్త్రీల సంబంధము కలదగుటచే, నుత=శ్లాఘింపఁబడిన, సుందర=అందమైన, విహంగకుల=పక్షిజాతులచే, రాజిత=ప్రకాశించు, తరంగక=అలలుగల, జలాశయ=మడుఁగులయొక్క, విభంగను=విభాగములుగలదానిని అట్టియయ్యును,నరౌఘ=జనసమూహముయొక్క,ఉత్తుంగ=అతిశయమైన, భవభీ=జననమరణ భయమును, హనన = పోఁగొట్టుటయందు, చంగను=సమర్థమగుదానిని, అభంగురశుభ=అధికమైన శుభమునిచ్చు,అంగను=అవయవములు గలదానిని, తరంగముఖరంగన్=అలలుగల ముఖభాగముగల దానిని, ఇట్టి-అల=ప్రసిద్ధమైన, గంగను=గంగానదిని, అంగుగన్=అందముగ, కనుంగొనెన్=చూచెను- లయగ్రాహి, భ జ స న- భ జ స న భయలు గణములు. ౧౩వ యక్షరము ప్రాసయతి- ఇట్లీపి పాదమునకు నాలుగుండవలెను.

తాత్పర్యము

శ్రీరాముఁడు సంతోషముతోఁ బెద్దపెద్ద యలలుగలట్టియు- స్వచ్ఛమైన జలములు గలదియు మహర్షుల సంబంధము గలదియుఁ బుణ్యకార్యములు చేయఁబడు నాశ్రమములను దన తీరములందుఁగలదియు,స్నానమాడు దేవతాస్త్రీలుగలదై పొగడఁబడు నందములైన పక్షిజాతులచేఁ బ్రకాశించు నలలుగల మడుఁగులందందుఁ గలదియు- మనుష్యసమూహముల యతిశయమైన జనన మరణభయమును బోఁగొట్టు సామర్థ్యముగలదియు- అధికశుభము నిచ్చునవయవములు గలదియు- అలలుగల ముఖభాగము గలదియు, నగు గంగ యను ప్రసిద్ధికెక్కినదానిని సంతోషముతోఁ జూచెను.

కం॥ ఖేలాలోలామరవర, బాలాతతి కేళిశైల•పాళీశతమున్
లీలావనమాలాచయ, హేలాభర మొప్పనయన•హిత మగుదానిన్. ౧౮౭

ఖేలాలోల=క్రీడయందునాసక్తిగల, అమరవరబాలా=దేవతాశ్రేష్ఠకన్యకల యొక్క, తతి=సమూహములయొక్క, కేళిశైల = క్రీడాపర్వతములయొక్క, పాళీశతమున్=అనేకములగు కొండనెత్తములుగలదియు, లీలావనమాలా= లీలా=క్రీడార్థమైన వనమాలా=తోఁటలపంక్తులయొక్క, చయ=సమూహముల యొక్క, హేలాభరము=అందముయొక్క యతిశయము, నయనహితము= కన్నులకింపు, అగుదానిని గనుఁగొనెనని పూర్వపద్యమందలి క్రియలో నన్వయము.

తాత్పర్యము

క్రీడలయందాసక్తిగల దేవకన్యకలు క్రీడించు పర్వతముల నెత్తములు గలదియు, క్రీడార్థమైన తోఁటల పంక్తులచే నందమైనదియుఁ, గన్నులకు నింపుగా నుండునదియు.

సీ॥ అంబుచయాఘాత•జాట్టహాసోగ్రయై, భాసురఫేనసు•హాసిని యయి
యొక్కచో వాఁకయై•యొకచోట సుడిగల్గి, పెరచోట స్థిమితగం•భీరయగుచు
నుండుచో వడిగ సు•ద్దండతఁ బాఱు చొ, క్కొకచోట గంభీరని•ర్ఘోష యగుచు
నొక్కొక్కచో భైర•వోగ్రనిస్వన యయి, దేవసంఘాప్లుత•దీర్ఘ యగుచు
ఆ॥ నమరకమల యగుచు•విమలకువల యయి•పళపుటిసుకతిప్ప•లొఱపుచూపఁ
దెల్లయిసుము గల్గి•దివ్యసారసహంస, చక్రవాకనాద•సంకుల యయి.

అంబు....హాసోగ్రయై=నీళ్ళసమూహముయొక్క, ఆఘాతక=అలలొక దాని తోనొకటి కొట్టుకొనుటచేత నలలు రాలకుఁదగులుటచేతఁ గలిగిన శబ్ద మనెడి. అట్టహాస=పెద్దనవ్వుచే, ఉగ్రయై=భయంకరమైనదియై, భాసుర=ప్రకా శించు, ఫేన=నురుగనెడి, సుహాసిని=చిఱునవ్వుకలదియై, వాఁక=వంక, వికృతి హ్రస్వంబులకు ననునాసికములు పరములగుచో రూపాంతరమున హ్రస్వంబు నకు దీర్ఘంబును అనునాసిక స్థానంబున నర్ధబిందువునగు, సు.వ్యా. సంజ్ఞ-౩౨ -సూ. వంకరగాఁబోవునది వంకపెఱచోట=మఱియొకప్రదేశమున, స్థిమితగంభీర =నిశ్చలయును, గంభీరయునై, గంభీరనిర్ఘోష=భేరివలె గంభీరమైనధ్వనిగలది, దేవసంఘ=దేవతాసమూహములచే, ఆప్లుతస్నానము చేయఁబడినదియు, దీర్ఘ= దీర్ఘమైనదియు, స్నానముచేయఁబడిన దిగుడు రేవులు గలదియు, అమర కమల=దేవతలకు యోగ్యమైన కమలములు గలది, విమలకువలయ=స్వచ్ఛ ములైన కలువలుగలది, పళపు=వెడల్పుగల, ఇసుకతిప్పలు = ఇసుకదిబ్బలు, ఒఱపు=అందము, ఇసుము=ఇసుక, సారస=బెగ్గురులు, హంస=హంసలు, చక్రవాక=జక్కవలు, వీనియొక్క. నాద=ధ్వనులచే; సంకులమై=కలఁతనొందిన నదె ఈపద్యమునందు గంగానది స్త్రీగావర్ణింపఁబడినది-వాఁక నూగారు సుడిబొడ్డు

ఇసుకతిప్పలు పిఱుఁదులు- కమలములు, మోములు, కలువలు కన్నులు- స్త్రీల కన్నులనే కలువలతోఁ గవులుపమింతురు.

తాత్పర్యము

ఱాలపై నీళ్ళు దూఁకుటచేతను, అలలు ఒకదానితో నొకటి కొట్టుకొనుట చేతను, గలిగిన ధ్వనియనెడి పెద్దనవ్వును-నురుగనెడి చిఱునవ్వును గలదై యొక చోట వంకగాఁ బాఱుచు, నొకచో సుడిగలదై, మఱియొకచోట మెల్లఁగా లోఁతుగాఁ బాఱుచు, నొకచోట మహావేగముగఁ బాఱుచు, నొకచోట గంభీరధ్వని గలదై, యొకచోట భయంకరధ్వనికలదై, దేవతలు స్నానముచేయు రేవులు గలదై, దేవత లుపయోగించు కమలములు నిర్మలములైన కలువలుగలిగి, వెడ లుపుగల యిసుక దిబ్బలు, తెల్లయిసుక కలిగి బిగ్గురులు, హంసలు చక్రవాక ములు, వీని ధ్వనులు కలదై-

శ్రీరాముఁడు చూచినచోటనే యిన్ని యున్నవని తలఁపరాదు. బదరీ నారాయణమునుండి గంగను జూచుచువచ్చిన నిందలి ప్రతివిశేషణము సత్య ముగాఁ గానుపించును.

సీ॥ ఒకచోటఁ దీరజా • తోర్వీజపంక్తులు, లలితమౌహారవ • ల్లరులు గాఁగ
నొక్కచో నవవిక•చోత్పలచ్ఛన్నయై యొక్కచోఁ గుముదషం•డోజ్జ్వలయయి
యొక్కచో వివిధపు•ష్పోత్కరజోధ్వస్త, యై సమదాకృతి • యమరుచుండ
నొకచో మయిల లేని•యొఱపుటద్దముభాతి, నిగనిగ లాడుచు•నిర్మలయయి
తే॥ దిగ్గజంబులు వనకరుల్•దేవతోప, వాహ్యములురొద సేసెడి•వనులు వెలయ
భూషణోత్తమసద్రత్న•భూషిత గుఁగు.
ప్రమదయుఁబోల్చి కన్నుల•పండువగును. ౯-౧౦

తీరజాత=ఒడ్డునందుఁబుట్టిన, ఉర్వీజపంక్తులు=చెట్లవరుసలు, లలితమౌ= అందమైన, హారవల్లరులు=తీఁగలవంటి హారములుకాఁగా, నవవికచోత్పలచ్ఛ న్నయై=క్రొత్తగా వికసించిన కలువలచేఁ గప్పఁబడినదై, ముందుచెప్పఁబడిన కలువలు అక్కడక్కడ విడిగానున్న కలువలు- ఇచ్చట దట్టముగాఁ గుంపులు గుంపులుగా నున్నవని చెప్పఁబడినవి, కుముదషండోజ్జ్వలయయి=తెల్లకలువల గుంపుచేఁ బ్రకాశించునదియై- 'సితేకుముదకైరవే' అమరుఁడు వివిధ పుష్పో త్కరజోధ్వస్తయై=నానావిధములయిన పుష్పముల సమూహముల పుప్పొడులచే రంగుమాఱినదై, సమదాకృతిన్=మదించిన స్త్రీయొక్క యాకారము పుప్పొడు లచే నెఱ్ఱరంగుకలదగుటచే యౌవనమదమున ముఖాదులందు నెఱ్ఱని కాంతిగల స్త్రీతోఁబోల్పఁబడియె, మయిల=మఱికి, ఒఱపుటద్దముభాతిన్=నిగనిగ మెఱయు నద్దమువలె, వనకరుల్ = అడవి యేనుఁగులు, రొద = శబ్దము, భూషణోత్తమ సద్రత్నభూషిత=శ్రేష్ఠమైన సొమ్ములచేతను, రత్నములచేతను, అలంకరింపఁ బడినది, ప్రమద=మదముగలస్త్రీ.

తాత్పర్యము

గంగానదిని నింకను శ్రీరాముఁడు వర్ణించుచున్నాఁడు. తీరములందుఁ బుట్టిన చాలుచెట్లు మెడలోధరించిన తీఁగలవంటి హారములుగను- ఒకచోటఁ గ్రొత్తగా వికసించిన యుత్పలములచేఁ గప్పఁబడినదై (స్త్రీల పిఱుఁదులమీఁది గుంతలకు ఉత్పలములని పేరు) ఒకచోటఁ గుముదముల గుంపులచేఁ బ్రకాశించునదియై, ఒకచో నానావిధ పుష్పముల గుంపుల పుప్పొడిచేఁ దెల్లనిరూపు మాఱి యెఱ్ఱనై, యౌవన మదంబుననుండు స్త్రీనిబోలినదై, యొకచోట నిర్మలమైన యద్దమువలె నిగనిగ మెఱయుచు, దిగ్గజములు, అడవియేనుఁగులు దేవతలెక్కితిరుగు నేనుఁగులు ధ్వనిచేయు నడవులు కలిగి మేలైనభూషణములచేతను మంచి రత్నములచేతను నలంకరింపఁబడిన మదించిన జవ్వనివలెనై కన్నులకానందము కలిగించుచు-

సీ॥ లసమాన ఫలపుష్ప•కిసల యావృత మయి,
పొదలఁ బక్షుల నొప్పు•పొదలదాని
శింశుమారభుజంగ • సేవిత యగుదాని, హరిపాదసంచ్యుత•యైనదానిఁ
బాపహీనాత్మను • బాపవినాశిని, భవజటాజూటవి • భ్రష్ట యగుచు
నంభోధిఁ గలయుచు • గంభీర యగుదాని, నద్రిపట్టపుదేవి • యయినదాని
తే॥ సారసక్రౌంచకారండ • వారభటులఁ, జారు వగుదాని గంగను•జహ్ను లలనఁ
జేరి కనుఁగొని యటశృంగి•బేరపురముఁ,
జేరఁ జనెరామచంద్రుఁడు•శీఘ్రగతిని. ౧౩౦౦

లసమాన = ప్రకాశించు- ఈశబ్దప్రయోగమును గొందఱు సందేహించెదరు గాని రామరాజభూషణాదుల ప్రయోగములు కలవు. ఫలపుష్పకిసలయ=పండ్లచేతను- పూలచేతను-చిగుళ్ళచేతను, ఆవృతమయి=ఆవరింపఁబడినదై, పొదలదాని=పొదలుగలదానిని, శింశుమార=(1) మొసళ్ళచేత (2) సీటిక్రోఁతులచేత- శింశుమారస్త్వంబుకపిః అని వైజయంతి, భుజంగ=పాములచేత, సేవిత యగుదాని=సేవింపఁబడుదానిని, హరిపాదసంచ్యుత=విష్ణుపాదమువలన విడువఁబడినదానిని 'విష్ణుపాదపదాంగుష్ఠనఖస్రోతోవినిస్సృతే తద్భక్తి విష్ణురూపా త్త్వం గంగేమాం మోచయైనసః" అన్నట్లు త్రివిక్రమావతారమున భగవంతుని యెడమ పాదాంగుష్ఠమునఁగల గోటినుండి గంగ వెలువడెను- అపల నది బ్రహ్మలోకముఁ జేరెను. ఆవల నాకాశమునుండి హిమాచలమున శివుని శిరస్సునుండి వెలువడి భూమిమీఁదఁ బ్రవహించెను. కావున బాలకాండమునఁ జెప్పినదానికి దీనికి విరోధములేదు. పాపహీనాత్మను=పాపములేని మనస్సుగలదానిని, పాపవినాశిని = ఆకారణముచేతనే యితరుల పాపము నాశముచేయుదానిని, భవజటాజూటవిభ్రష్టయగుచు=శివుని జడలగుంపునుండి జాఱిపడినది, అంభోదిన్ = సముద్రమును, గంభీర=లోతుగలది, సారస=సరస్సున నుండఁదగిన, క్రౌంచకారండ

వారభటులన్=క్రౌంచములయు- కారండవ=నీటికోళ్ళయొక్కయు- ఆరభటులన్=ధ్వనులచే, చారువు=అందము, చక్షులలరన్=కన్నులు సంతోషింపఁగ.

తాత్పర్యము

ప్రకాశించు పూలచేఁ బండ్లచేఁ జిగుళ్ళచేత నావరింపఁబడి పక్షులచే నొప్పు పొదలు గలదానిని, మొసళ్ళు, నీటిక్రోఁతులు పాములచే సేవింపఁబడినదియై విష్ణుపాదమునుండి విడువఁబడినదానిఁ బాపములేనిదానిని, జరులపాపములఁ బోఁగొట్టుదాని, శివుని జటాజూటమునుండి నేలఁబడినదాని, సరస్సులనుండ యోగ్యమైన క్రౌంచములయుఁ గారండవములయు ధ్వనులచే మనోహరమైన దాని, గంగను గన్నులపండువుగఁజూచి దానితీరమందున్న శృంగిబేర పుర మును రామచంద్రుఁడు వేగముగఁ జేరఁబోయెను.

—• శ్రీరాముఁడు గంగాతీరంబుఁ జేరుట. •—

కం॥ రంగత్తరంగమాలా, సంగతి రంగారె గంగ • సరసత సూతా!
రంగగు మన కిప్పుడు నివ్వంగను నిట నిలుపు రథము•వల సగుచోటన్.

రంగత్తరంగమాలాసంగతన్ = నాట్యమాడుచున్న యలలకూడికచే, రంగారెన్=అందగించెను.

తాత్పర్యము.

నాట్యమాడువానివలె మనోహరముగఁ గదలుచున్న యలల వరుసలతోడ శృంగారముతోఁగూడినదై గంగానది సొరఁబీ యందమైయున్నది. మనకిచ్చట నిప్పుడు నిలువ ననుకూలపడును.కావునఁ దగినస్థలమున జూచి తేరిని నిలుపుము.

కం॥ అల్లదిగొ దాపునసె యొక, ఫుల్లకుసుమవిసరవిటప•పూగంబులచే
మొల్లమగుగారచెట్టిఁక, మెల్లగఁ గొనిపొమ్ము తేరు•మెలఁగుద మచటన్.

దాపునసె = సమీపమందే, ఫుల్ల = వికసించిన, కుసుమ = పూలయొక్క, విసర=సమూహముచేతను, విటప = చిగుళ్ళ, పూగంబులచే = ప్రోవులచేతను, మొల్లము=అందము, మెలఁగుదము=సంచరింతము.

తాత్పర్యము

అదిగో సమీపమందే వికసించిన పూలగుంపులచేతను జిగుళ్ళరాసులచేతను నందమైన గారచెట్టు కానవచ్చుచున్నది. ఇఁకఁ దేరుమెల్లగఁ బోనిమ్ము. మన మక్కడనే యుందము.

ఉ॥ అచ్చట గంగ లెస్స గన • నౌ సురదానవమానవాళిచే
మచ్చిక సంచరించు మృగ • మంజులపక్షులచే దహింపఁగా
మెచ్చుగ నన్న లక్ష్మణుఁడు • మేకొన సూతుఁడు దోలె వాజులన్
జెచ్చెర నింగుదీతరువుఁ•జేరఁగ ముమ్మరు డిగ్గి రచ్చటన్. ౧౩౦౪

సురదానవ మానవాళిచేన్=దేవతలచేతను, దానవులచేతను, మనుష్యుల చేతను, మృగమంజులపక్షులచే = మృగములచేతను సుందరములైన పక్షుల చేతను, రహింపఁగాన్=ప్రకాశింపఁగా, మేకొనన్=అంగీకరింపఁగా, వాజులన్= గుఱ్ఱములను, చెచ్చెరన్=శీఘ్రముగ, ఇంగుదీతరువు = గారచెట్టు, మువ్వురు= సీతారామ లక్ష్మణులు.

తాత్పర్యము

అచ్చట మనసు నిలిచి యేమేని దేవతలు దానవులు మనుష్యులు వీరిచేతను జనవుగఁ దిరుగు మృగములు సుందరములైన పక్షులు వీనిచేతను ప్రకాశించు గంగానదిని మనము బాగుగఁజూడ సాధ్యపడును. అనిన లక్ష్మణుఁ డంగీకరింపఁగా నాలస్యముచేయక యచ్చటికి సుమంత్రుఁడు గుఱ్ఱములఁ దోలఁగా సీతారామ లక్ష్మణులు మువ్వురు నచట దిగిరి.

కం॥ ఆవల సుమంత్రుఁడును దుర, గావళిఁ బో విడిచి మేపు • నమరిచి యుర్వీ
జావిరళచ్ఛాయాశ్రితుఁ, డౌ విభుకడ కరిగెఁ దాఁ గృ • తాంజలి యగుచున్.

తురగావళిన్=గుఱ్ఱములవరుసను, ఉర్వీజ=చెట్టుయొక్క, అవిరళ=దట్టమైన, ఛాయాశ్రితుఁడై =నీడయందున్నవాఁడు, విభుకడకున్ = శ్రీరామునియొద్దకు, కృతాంజలి=చేమోడ్పు.

తాత్పర్యము

ముగ్గురు తేరుదిగినతరువాత సుమంత్రుఁడు గుఱ్ఱములవిప్పి మేఁపుపెట్టి చెట్టునీడనుండెడి శ్రీరామునియొద్దకుఁ జేమోడ్పుతోఁ బోయెను.

ఉ॥ అప్పుడు రామునత్సఖుఁడు • ప్రాణసముండు నిషాదజాతుఁడున్
గొప్పబలంగ మొప్పెడియ • కుంఠితవీర్యుఁడు బోయనాయకుం
డిప్పగిదిన్ రఘూద్వహుఁడు • వృక్షమునీడను నుంట వింటఁ దాఁ
దెప్పున వచ్చె వృద్ధహిత • ధీసచివాదికబంధుయుక్తుఁడై. ౧౩౦॥

అప్పుడు=వారందఱు చెట్టునీడనుండు సమయంబున- ప్రాణసముండు- ప్రాణముతో సమానమైనవాఁడు, సత్సఖుండు = మంచిస్నేహితుఁడు అనుటచే శ్రీరామునకు గుహునకు నింతకుఁబూర్వమే మైత్రిగలదని సూచితము. దీనివలన శ్రీరాముఁడింతకుఁబూర్వ మీప్రాంతములనేకాక తమరాష్ట్రములోని యూరూరు పల్లెపల్లెతిరిగి యందఱ జనుల యోగక్షేమములు విచారించి పరిచయము చేసికొన్నట్లు స్ఫురించెడిని. కావుననే పల్లెటూళ్ళవారికిని శ్రీరామునందంత ప్రేమ కలుగఁ గారణమయ్యెను. దూరమునందలి కుగ్రామములందును శ్రీరాముని నెఱుఁగనివాఁడు లేఁడు. నిషాదజాతుఁడున్ = బోయకులమునఁ బుట్టినవాఁడును, బలంగము=సేన, అకుంఠితవీర్యుఁడు=మొక్కపోని శౌర్యముగలవాఁడు,తెప్పునన్ = శీఘ్రముగ, వృద్ధహిత ధీసచివాదికబంధుయుక్తుఁడై = పెద్దలు-హితులు కార్యాలోచనమందు సహాయపడు మంత్రులు మొదలగు బంధువులతోఁగూడినవాఁడై వచ్చెను.

శ్రీరాముఁ డుత్తమక్షత్రియుఁడు- గుహుఁడు హీనజాతివాఁడు- 'హీనప్రేష్యం, హీనసఖ్యం, హీనగేహనిషేవణ'మ్మని నీచసేవ నీచులతోడి స్నేహము నీచుల యింటనుండుట యనునివి యుపపాతకములలోఁ బరిగణింపఁబడుటచే శ్రీరాముఁ డెట్లు గుహునితో మైత్రిచేసెను. అని పూర్వపక్షము దీనికి సమాధానము.

(1) 'నిషాద, స్థపతింయాజయే'త్తని నిషాదునకు యజ్ఞముచేయు నధికారము గలదని శ్రుతియే చెప్పుచున్న కారణముచే నిషాదుఁడు స్నేహము చేయరానంతటి నీచజాతివాఁడు కాఁడు.

(2) ఈతనిజాతి హీనజాతియైనను అత్యంత రామభక్తుఁడగు గుహుని నీచునిగా గణించుట దోషము. ఏలన:- 'నశూద్రా విష్ణుభక్తాశ్చ, విప్రాః భాగవతాస్స్మృతాః సర్వవర్ణేషుతేశూద్రా, యేహ్యభక్తాజనార్దనే' విష్ణుభక్తిగలవాఁడు శూద్రుఁడుగాఁడు వాఁడు విప్రుఁడనియు భాగవతుఁడనియుఁ జెప్పఁబడును. అనఁగా వారివలెఁ బూజ్యుఁడు. ఏజాతియందైనను విష్ణుభక్తిలేనివారు శూద్రులు అని యర్థము.

విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుఁడే, పాదయుగముతోడి పశువుగాక. ॥భాగ॥

యశ్శూద్రం భగవద్భక్తం నిషాదం శ్వపచంతథా
వీక్షతే జాతిసామాన్యా త్సయాతి నరకం నరః.

శూద్రునిగాని, నిషాదునిగాని, మాలవానినిగాని విష్ణుభక్తుఁడైనవానిని జాతి సామాన్యదృష్టి నెవరుచూతురో వారు నరకమునకుఁ బోదురు.

అని ప్రమాణములు కలవు. కావున నితనితోడి స్నేహము శ్రీరామునికి దోషముకాదు. "గుహేన సహితో రామః లక్ష్మణేనచసీతయా" యని సీతాలక్ష్మణులతో సమానునిగ నారదుఁడు గుహునిఁ జెప్పెను.

అంతటి భక్తిగలవాఁడు గనుకనే సీతకుఁదప్ప మఱియెవనికిలేని స్వాతంత్ర్యము- గౌఁగిలించుట యనునది- గుహుఁడు కలవాఁడయ్యెను ౧౩౦౭-వ పద్యము చూడుము. ౧౩౦౯-౧౩౧౦ పద్యములందుఁ దనకుఁగల సర్వస్వము శ్రీరామునకు సమర్పించెను.

ఇతఁడిట్టివాఁడు గనుకనే నిషాదుఁడనుట సరిగాదని నిషాదజాతుఁడని చెప్పఁబడియె. అనఁగా జాతిచే నిషాదుఁడేకాని భక్తిచేఁగాఁడని యర్థము. అట్టులే బోయనాయకుఁ డన్నప్పుడు బోయలకు నాయకుఁడనియె గ్రహింపవలెను గాని బోయయగు నాయకుఁడని యర్థము గ్రహింపరాదు. ఇచ్చట నాయకత్వ ప్రాధాన్యము వివక్షితము. ఇట్టులే విభీషణుఁడును జెప్పుకొనియెఁగదా.

తాత్పర్యము

ఆసమయంబున శ్రీరామునకుఁ మంచి స్నేహితుఁడును ప్రాణసముఁడును, బోయజాతియందుఁ బుట్టినవాఁడును, గొప్ప సేనగల మహావీరుఁడును, బోయలకు నాయకుఁడును, నగు గుహుఁడీవిధముగ శ్రీరాముఁడు చెట్టునీడ నిలువఁబడి

యున్నాఁడని విని తత్క్షణమే యున్నవాఁ డున్నట్టులే చెప్పులైనఁ దొడుగుకొనక ప్రభువు రావలసిన విధముగా రాక కులము పెద్దలు హితులు-కార్యాలోచనము తెలుపు మంత్రులు మొదలుగాఁగల బంధువులతోఁ గూడినవాఁడై నడచి శ్రీరాము నొద్దకు వచ్చెను. తానెంత గొప్పవాఁడైనను, భగవద్దర్శనమునకు బోవునపుడు పాదరక్షలు-పావుకోళ్ళు మొదలయినవి తొడిగికొనిగాని వాహనముల మీఁదఁ గాని పోరాదని సూచన.

—• గుహుఁడు శ్రీరాము దర్శించుట. •—

కం॥ చనుదెంచుగుహుని దవ్వునఁ, గని సహలక్ష్మణుఁడు సీత•కాంతుఁడు హర్షం
బునఁ బొంగి యతనిఁ గలియఁగఁ,
గని రామునివేష మతఁడు•కడుదుఃఖితుఁడై. ౧౩౦౬

సహలక్ష్మణుఁడు=లక్ష్మణుతోఁ గూడినవాఁడు- అనుటచే లక్ష్మణునం దెంత ప్రేమయో గుహునందంత ప్రేమగలదని భావము. సహలక్ష్మణుఁడు అనుటచే ఆయన భక్తికి నిరువురు గౌరవించినఁగాని చాలదని భావము. రామునివేష మతఁడు కని యని యన్వయము, ఎదుర్కొనఁ బోవుటచేఁ దానెంత గొప్పవాఁడైనను మహాభక్తుఁడు తనయొద్దకు వచ్చుచున్నవార్త తెలియఁగనే యతని నెదురుగాఁబోయి గౌరవింపవలెను గాని నాయొద్దకువచ్చినపుడు లేచెదనులే యని కూర్చుండరాదు. ఆయన తనకు దూరమందుఁ గనఁబడఁగానే లేచి యెదుర్కొన వలెను.

తాత్పర్యము

వచ్చుచున్న గుహుని దూరమునందే చూచి సంతోషమున నుప్పొంగి శ్రీరాముఁడు లక్ష్మణుతోడ నాయన నెదుర్కొనఁబోయి కలిసికొనఁగానే శ్రీరాముని మునివేషము నతఁడు చూచి మిగుల దుఃఖించినవాఁడై.

ఉ॥ క్రుచ్చి కవుంగిటం బలుకుఁ • గూరిమితోడ నయోధ్య యెట్టులో
యిచ్చఁ దలంపు మియ్యదియు • నీకటు లంచును దేనిఁ జేయుదున్
సచ్చరితా! వచింపుము, వ • శంబె లభింపఁగ నిట్టిసత్ప్రియుం
డిచ్చకు వచ్చునయ్యతిథి • యేసుకృతంబు లొనర్చినాఁడనో. ౧౩౦౭

ఏసుకృతంబులు=అనుటచే నొకటిరెండు పుణ్యములు చేసినంతమాత్రమున భగవద్దర్శన ప్రాప్తికలుగదు అని సూచితము. నీకు నయోధ్యయెట్టిదో యిదియు నట్టిదే యనుటచే నీకు నిత్యవిభూతి వైకుంఠము వంటిదే యీలీలా విభూతి యను ప్రపంచమని భావము. నీకయోధ్యయందుఁగల స్వాతంత్ర్యము- ప్రాభవమిందుఁ గలదు.

నీవంటి యతిథి నీవేకాని "ఏకమే వాద్వితీయం బ్రహ్మ" యన్నట్లు రెండవ వాఁడు నీకుసమానుఁడు నీకంటె నధికుఁడు లేఁడని భావము. "ఏకమేవ+అద్వితీయం బ్రహ్మ"=బ్రహ్మమొకఁడే. అట్టివాఁడు రెండవవాఁడు లేఁడని యర్థము. అతిథిపాత్ర మేకాక ప్రియుఁడును, అందు సత్ప్రియుఁడును, అందు నిట్టి సత్ప్రి

యుఁడునగు మహాపురుషుఁడు ఎవనికైన నెట్లు లభింపఁగలఁడు- భరద్వాజాది మహర్షులకు- శబరివంటి భక్తురాండ్రకు లభించును గాని భక్తిహీనులకు లభింపఁడని భావము.

తాత్పర్యము

ఆయనను గట్టిగఁ గౌఁగిలించుకొని కూరిమితో నిట్లనియె. శ్రీరామచంద్రా నీకయోధ్య యెట్టిదో యిదియు నట్టిదే యని మనస్సునఁ దలంపుము. సుశీలా! నీకు నేనేమి చేయవలయునో చెప్పుము. నీవంటి మంచి ప్రియుఁడు- మనస్సునకు సమ్మతమైన యతిథి యెవనికైన నెట్లు లభింపఁగలఁడు. నాకు లభించుటకు నేనెన్ని పుణ్యములు చేసినాఁడనో.

కం॥ అని వివిధము లగునన్నము,లును రుచిమత్పానకంబు•లును నర్ఘ్యంబుల్
గొనివచ్చి సమర్పించియు,
వినయనతశిరస్కుఁ డగుచు•వెండియు ననియెన్. ౧౩౦౮

రుచిమత్=ప్రశస్తమైన రుచిగల; పానకంబులు, అర్ఘ్యంబులు = పూజా ద్రవ్యంబులు, వినయనత శిరస్కుఁడు=అణఁకువచే వంపఁబడిన శిరస్సుగలవాఁడు. రిక్తహస్తేన నోపేయాత్, రాజానం దైవతం గురుమ్మని యుండుటచే- రాజునొద్దకు దేవునియొద్దకు గురువునొద్దకుఁ గానుక నేదైనఁ దేకికొనకపోరాదని యుండుటచే నన్నాదులు గొనివచ్చెనని భావము. అది భక్తిలక్షణము. శ్రీరామునందు రాజచిహ్నములైన లేకుండుటచే రాజను గౌరవబుద్ధితో తేలేదు. దైవతమని తెచ్చెనని భావము.

తాత్పర్యము

అని పలికి నానావిధములయిన యన్నములు, మంచిరుచిగల పానకములు. పూజాద్రవ్యంబులు గొనివచ్చి సమర్పించియు వినయముతో నమస్కరించినవాడై మఱియు నిట్లనియె. ఇది నమస్కారరూపక శరణాగతి- వినయనత శిరస్కుఁడనుటచేఁ బ్రపత్తికంగమైన కార్పణ్యము చెప్పఁబడియె.

తే॥ స్వాగతము నీకు శ్రీరామ•చంద్ర దేవ,నిఖిలధారిణివలయంబు•నీద చుమ్ము
నీదుకింకరులము మేము•నిర్మలాత్మ.
మమ్ముఁ బనిగొమ్ము నెమ్మి రా•జ్యమ్ము నేల. ౧౩౦౯

శుష్కనమస్కారము శూన్యాలాపముమాత్రము శరణాగతి లక్షణముగాదు• శాస్త్రార్థమై యేకొంచెమో అన్నమో నీళ్ళో సమర్పించుటగాక తన సర్వస్వము శ్రీరామునకు సమర్పించుచున్నాఁడు. దీనికే యాత్మనిక్షేపమని పేరు.

శ్రీరామచంద్రదేవ=అనుటచే గుహునకు శ్రీరామునందు దేవుఁడను భక్తి గలదుగాని రాముఁడొక మనుష్యుఁడు తన స్నేహితుఁడనిమాత్ర మాయనఁ దలఁచినవాఁడు గాఁడని భావము. కావుననే సర్వస్వ సమర్పణము.

సు+ఆగతము=స్వాగతము-మంచిరాక. ఈరాక నీకు కీర్తికరమైనది సుఖకరమైన దగునుగాక, నిఖిలధారణివలయంబు=నాసమస్తభూచక్రము, నీద=నీదే.

ఇట్లుచెప్పుటచే నింతకుఁ బూర్వమే తనరాజ్యమంతయు మానసికముగ శ్రీరాము నకు సమర్పించియుండి యిప్పుడు స్వరూపముతోనే సమర్పించెనని భావము. ఈ రాజ్యము నాది యను మమకారము గుహునందు లేదని సూచితము. దీనికం తయు నీవు సహజస్వామివి. కావున నీది నీవు పరిగ్రహింపుము. అనుచున్నాను గాని నాది నేనిచ్చెదను నీవుతీసికొమ్మని నేను జెప్పరాలేదు. ఏలన? నీదుకింకరు లము=నీకై యెటువంటి యల్పపుఁ బనియైనఁ జేయువారము. నీదాసులము. దీనివలన గుహునందు నహంకారమునులేదని దాసోహంభావము కలదని తెలియు నయ్యెడిని. నిర్మలాత్మ=మలినము లేని మనస్సుగలవాఁడా యనుటచే- వీఁడు నీచజాతివాఁడు నాకు లోపడియుండువాఁడు లోనగు భావములు నీయందు లేవనియు వీఁడు మనవాఁడు అను ప్రేమమాత్రమే నీవు నాయందుఁగలవాఁడవని నేనెఱుఁగుదుననియు భావము. మమ్ముఁ బనిగొమ్ము=నీకుఁ గావలసిన పనియేదో యది మాచేఁ జేయించుకొమ్ము. నీకుఁ గైంకర్యము చేసినఁగదా నేను నీకింకరుఁ డనుటకు సార్థము. కావున నన్ను నీవు కింకరుఁగా గ్రహించుట వాస్తవమేని పని చెప్పి నాచేఁ జేయించుకొని నీకింకరకోటిలోఁ గలుపుకొనుము-పనిగొమ్ము. కైంక ర్యము చేయింపుమనక చేయించుకొను మనుటచే కైంకర్యఫలభోక్తవు నీవేకాని నేనుగానని భావము. దీనిచే ఫల సమర్పణము చెప్పఁబడెను. నీవు శ్రీరాము కింకరుఁడవైనచో నీవు శ్రీరామున కేకైంకర్యము చేసితివి ? నీకైంకర్యము శ్రీరాముఁ డంగీకరించెనా యని తక్కిన నీకింకరు లడిగిన నేమిచేయుక యేమని ప్రత్యుత్తరమిత్తును? నన్ను నీవు స్వీకరించితివని యెట్లు నమ్మెదును. నెమ్మి రాజ్యమ్ము నేలుము=నేనవాప్త సమస్త కాముఁడనే నాకుఁ గోరికలేలేవే నేనేదికోరి నీవు తెమ్మని నీకుఁ జెప్పెదను. నీకుఁగావలసినదేమైన నుండిన నీవే యడు గుము. ఇచ్చెదనందువా నీసుఖమునకై కాదు. మమ్ము గృతార్థులఁ జేయుటకై నీవు మాకు సాక్షాత్ప్రభుఁడవుగానుండి యీరాజ్య మేలి మమ్మునెల్లఁ బాలింపుము. నాశరణాగతికి నేనుగోరు ఫలమిదియే. ఇది గోప్తృత్వవరణమును దెలిపెడిని. నెమ్మిరాజ్యమ్ము నేలుమనుటచే=భరసమర్పణము గావింపఁబడియె.

తాత్పర్యము

దేవా! శ్రీరామచంద్ర- నీరాక మేలగునుగాక- ఈ భూచక్రమంతయు నీదే-నీవయోధ్యలో నున్నట్టు లిచ్చట నుండవచ్చును- మేమందఱము నీకింకరు లమే కావున నీవు సేవకులులేరని సందేహింపఁ బనిలేదు. నిర్మలాత్మా మమ్ము ధన్యులఁజేయ మాకేదైన పనిచెప్పి చేయించుకొమ్ము.

ఆ॥ భక్ష్యభోజ్యలేహ్య•పానీయములు నివె, పండుకొనఁగ నివిగొ•కాన్పు లశ్వ
ములకు భావనంబు•వలసిన వెల్ల న,నుగ్రహించి వెసఁ బ•రిగ్రహింపు. ౧౩౧

భక్ష్యము=కొఱికి తినఁదగిన వడలు మొదలయినవి, భోజ్య=నమిలితినఁదగిన యన్నము మొదలైనవి, లేహ్య=నాకి తినఁదగినవి తేనె మొదలైనవి, పానీయము

=త్రాపఁదగినవి- పానకము మొదలైనవి-బహువచన ప్రయోగముచేఁ జోష్యము లును గ్రాహ్యము. చోష్యములనఁగా=వేయించిన వడియములు మొదలైనవి. ఇవి పంచభక్ష్యములు. ఖాదనము=మేపు. దీనివలన భగవత్ భాగవత పరిచార కులును సేవ్యులని భావము. అనుగ్రహించి పరిగ్రహింపు మనుటచే నీకక్కఱపడి గాదు నన్ను నీవు కృతార్థుని జేయుటకై. నీకక్కఱయుండినను లేకున్నను స్వీక రింపుము. ప్రపత్తి శాస్త్రప్రకారము గుహుని శరణాగతి సర్వాంగ సంశోభితమై యున్నది. ఈశరణాగతికి భరతుని శరణాగతి సమమగునేమో కాని విభీషణుని శరణాగతియు సమముకాదని తోఁచెడిని. ఆభాగము వ్రాయునంతవఱకు వీఁడు జీవించి యుండవలయునని భగవత్సంకల్పమేని రెంటి తారతమ్య మచ్చట యుద్ధకాండమున విశదీకరింపఁబడును.

తా త్ప ర్య ము

నాయనా రామచంద్రా! తండ్రీ ఇవిగో భక్ష్యములు. ఇవిగో భోజ్యములు. ఇవిగో లేహ్యములు. ఇవిగోఁ బానీయములు. నీకుఁ బండుకొనఁ బానుపులివిగో. నీకుఁ బరిచర్యసేయ భాగ్యము గలిగిన గుఱ్ఱములకు మేపిదిగో. వీనిలో నీకుఁ గావలసినవన్ని నాయందు దయయుంచి నన్నుఁ గృతార్థుఁ జేయుటకై పరిగ్ర హింపుము.

ఉ॥ అచ్చపుభక్తినాతఁ డిటులాడిన రాముఁడు పల్కె మిత్రమా!
వచ్చె భవత్కృతంబులు సపర్యలు, తుష్టుఁడనైతిఁ గాల్నడన్
నచ్చుట నెయ్యపున్నుడులు వాకొనుటన్, వినుమింత యేల యే
యొచ్చెము లేదటంచు బిగి యొత్తి కవుంగిటఁ బీనబాహులన్. ౧౩౧౧

అచ్చపు భక్తి=స్వచ్ఛమైన భక్తి. భక్తి-సేవాభక్తి రుపాస్తియని నిఘం టువు. "సాపరమప్రేమరూపా" "సాపరానురక్తిరీశ్వరే"అని నారదశాండిల్యులు. కావున భజసేవాయామ్మను ధాతువువలనఁ గలిగిన భక్తిశబ్దమునకుఁ బ్రతిఫలా పేక్షారహితమై ప్రేమతోఁ గూడిన భగవత్సేవ- యని యర్థము. భవత్కృతం బులు=నీచేఁ జేయఁబడిన, సపర్యలు = ఉపచారములు, వచ్చెన్ = అన్నియు గ్రహించినవాఁడనే, తుష్టుఁడనైతిన్ = సంతోషించిన వాఁడనైతిని; నెయ్యపు న్నుడులు=స్నేహవాక్యములు, వాకొనుటన్ = చెప్పుటచే, ఒచ్చెము = లోపము, బిగి=గట్టిగా, పీనబాహులన్=బలసిన చేతులచే- బలసినచేతులు సుఖకరములు- శుష్కించిన చేతులైనచో నెముక లొత్తుకొనుటచే సుఖములేదు.

ఆహా! యేమి గుహుని పూర్వజన్మ సంస్కారబలము!! అంత శ్రమించిన యాంజనేయునకు లభించిన రాముకౌఁగిలి యేశ్రమములేక గుహునికి లభిం చెను. (చూ. యుద్ధ. ౧౨౨)

తాత్పర్యము

నిర్మలమైన భక్తితో గుహుఁడు చెప్పిన మాటలువిని శ్రీరామచంద్రుఁ డాయనతో నిట్లనియె. మిత్రమా నీ సేవలన్నియు గ్రహించితిని. నీవు కాలి నడకతో వచ్చుట నీస్నేహవాక్యములు పలుకుట యీ రెంటిచేతనే సంతోషించి తిని. ఇన్ని మాటలేల. నీ సేవయందు లోపమేమియులేదు అని దానికి లక్ష్య ముగా నతనిని బలసిన తన రెండుచేతుల గట్టిగాఁ గౌఁగిలించెను.

తే॥ అనియె నాభాగ్యవశమునఁ గనుటగల్గె,
బంధుయుతు నిన్ను నారోగ్యవంతునిపుడు
నెచ్చెలీ! లెస్సలా మన నిఖిలహితులు,
ధనము రాష్ట్రము కుశలితఁ దనరు నయ్య. ౧౩౧

నాభాగ్యవశమునన్=నాయదృష్టమువలన- మన కదృష్టవశమున మహా భాగ్యము లభించిన నెట్లు సంతోషింతుమో యట్లే భగవంతుఁడును దక్షుఁడైన భక్తుఁడు దొరికి యతఁడు సంతుష్టుఁడైనపుడు తాను సంతోషించును. చూ. ప. ౬౬. అయోధ్య. బంధుయుతున్ = చుట్టములతోఁ గూడినవానిని, ఆరోగ్యవం తుని=రోగబాధలేక యుండువానిని నెచ్చెలీ-నెఱ+చెలీ=నెచ్చెలి. ఏలోపము లేని చెలిమికలవాఁడా. మన=నీయనక మన యనుటచే నీవారందఱు నావారే యని భావము. "పశుర్మనుష్యః పక్షీవా యేచ వైష్ణవ సంశ్రయాః । తేనైవతే ప్రయా స్యంతి, తద్విష్ణోః పరమంపద" మ్మన్నట్లు పశువుగాని మనుష్యుఁడుగాని పక్షి గాని విష్ణుభక్తుని నాశ్రయించినవాఁడు వానితో విష్ణువుయొక్క పరమపదమును బ్రాపించును.

తాత్పర్యము

మిత్రుఁడా! బంధువులతోఁగూడి యారోగ్యవంతుఁడవైన నిన్ను నాభాగ్య వశమున నిపుడు చూడఁగలిగితిని. మనహితులందఱు బాగున్నారుకదా ధనము రాష్ట్రము కుశలముగా నున్నవా.

చం॥ నిఖిలము నానిమిత్తముగ నెయ్యము మై సమకూర్చు టెంతయున్
బ్రభుఁడ యెఱుంగుదున్, మిగుల సంతస మయ్యెను, గాని నీవుదిం
బ్రఖరతనాఁ దలంప, కిది భావ్యముగా దొకటేనియుం గొనన్
సుఖముల నెల్లఁ బాసి వనిఁ జొచ్చెడి నా కివి యేల చెప్పుమా? ౧౩౨

నిఖిలము=కావలసిన పదార్థములన్నియు, నెయ్యము మై=స్నేహభావముచే (నేను రాజకుమారుఁడనని భయముచేఁ గాదనుట), ప్రఖరత = మిక్కిలి కఠి నత్వము, భావ్యముగాదు=యుక్తము గాదు, వనిన్=అడవియందు.

తాత్పర్యము

మిత్రుఁడా! నాకొఱకై నీవు సమస్త పదార్థములు కేవల స్నేహముచేతనే సమకూర్చుట యెఱుఁగుదును. నాయందుఁగల స్నేహభావమునకు మిగుల సంతో

షించితిని. కాని నేనొకమాట చెప్పెదను. రాముఁడింత కఠినుఁడా యనిమాత్ర మాలోచింపకు. అది యేమంటివా నీవు తెచ్చిన పదార్థములం దొకటియైన నేను గ్రహించుట యుక్తముగాదు. సర్వ సుఖములు వర్జించి యడవులందుఁ గంద మూలములఁ దినఁబోవు వానికిఁ బఱుపులేల దిండులేల భక్ష్యభోజ్యములేల నీవే చెప్పుము. అటు చేయవచ్చునా?

కం॥ చీరముఁ గృష్ణాజినమును, వారక ధరియించి వనుల•ఫలమూలము లా
హారముగా మునినై సం,చారము చేయంగ నేను•జనియెద హితుఁడా.

తా త్ప ర్య ము ౧౩౧౪

స్నేహితుఁడా నేనేల యిచ్చటికి వచ్చితిని. ఎచ్చటికిఁ బోవుచున్నాను నీవెఱుఁగవా? నారచీరలుగట్టి జింకచర్మము ధరించి యడవులందు ఫలమూల ములు దిని మునివలెఁ దిరుగఁ బోవుచున్నాను.

కం॥ మావులకు గడ్డియొక్కఁడ కావలయున్ నీవు దానిఁ•గల్పించుటచే
వేవిధములఁ బూజల నను, భావించినయట్ల తలఁతుఁ•బరమపవిత్రా.

మావులకున్=గుఱ్ఱములకు, వేవిధములన్=వెయ్యివిధముల. [౧౩౧౫

తా త్ప ర్య ము

భక్తిపూతుఁడా నాకుఁగావలసినది గుఱ్ఱాలకు గడ్డి యొకటి. అది నీవు తెచ్చి యిచ్చితివి. దాని నిచ్చుటచే నన్ను వెయ్యివిధములఁ బూజించినట్లు తలఁచెదను.

తన్నుఁ బూజించువారి విషయమునఁ గలుగు సంతోషమునకంటెఁ దన యాశ్రితులఁ బూజించువారి విషయమున భగవంతుఁడు విశేషముగ సంతో షించునని సూచన.

"స్వారాధనం విహాయాపి, స్వభక్తా నర్చయంతియే
తేభ్యః ప్రసన్నో భగవాన్, సిద్ధిమిష్టాం ప్రయచ్ఛతి"

తన యారాధనము వదలియైనఁ దన భక్తుల నర్చించువారి యెడ భగవం తుఁడు ప్రసన్నుఁడై వారి కోరికల నెఱవేర్చును.

అనాదృతసుతం గేహీ, పురుషం నాభినందతి
తథానర్చిత సద్భక్తం, భగవాన్నాభి నందతి॥

తన కొడుకును నాదరింపనివాని విషయమున గృహస్థుఁ డానందింపఁడు. అట్లులే సద్భక్తు నర్చింపని వానివిషయమున భగవంతుఁడు కొంచెమేని సంతో షింపఁడు.

కం॥ ఈవారువములు దశరథ,భూవిభునకు మిక్కిలి ప్రియ•ములు గావున నీ
వీవాజులఁ దన్పుట న, న్సేవించినయట్ల ముదము•నెందుదు సఖుఁడా.

వారువములు=గుఱ్ఱములు, వాజులను=గుఱ్ఱములను, తన్పుటచే=తృప్తిఁ బొందించిన కారణమున నన్ను నీవు సేవించినట్లే యెంతును.

తాత్పర్యము

స్నేహితుఁడా! నీగుఱ్ఱములు దశరథరాజువి. కావున నీవీ గుఱ్ఱములఁ దృప్తిఁ బొందించుటచే నన్ను సేవించిన యట్లే సంతోషింతును.

చం॥ అనఁ దగువారిఁ బంచె గుహుఁ • డశ్వవిమర్శకుఁ గాఁగ నీళ్లు మే
పును ఘటియింప రేయిఁ గడుఁ • బ్రోపొనరింపఁగ, సోత్తరీయుఁడై
సనయుత వార్చి లక్ష్మణుఁడు • జాహ్నవితీర్థముఁ దేర సీతతో
నసఘుఁడు క్రోలి యిద్దఱును • హాయిగ నేలఁ బరుండ నంతటన్. ౧౩౧౭

సోత్తరీయుఁడై = ఉత్తరీయము గలవాఁడై- అనుటచే స్నానము చేయ లేదని భావము.

ఈప్రకారము శ్రీరాముఁడు చెప్పఁగా గుహుఁడు గుఱ్ఱములకు నీళ్ళు మేపు గావలసినవన్ని తెచ్చి యిచ్చి రాత్రివేళ మిక్కిలి రక్షింపవలసినదని తగినవారికి నాజ్ఞచేసెను. ఆవల లక్ష్మణుఁడు గంగానది తీర్థము తీసికొనిరాఁగా దానితో సంధ్యవార్చి సీతయుఁ దాను ద్రావి శ్రీరాముఁడు హాయిగ నేలమీఁదఁ బండుకొనెను.

ఉ॥ అన్నకుఁ బాదము ల్గడిగి•యార్చి తడిం బని వృక్షమూల మం
దున్నెడ లక్ష్మణుం, డలగు•హుండు సుమంత్రునిఁ గూడి తద్గుణా
భ్యున్నతి ముచ్చటించుచుఁ బ్రి•యోన్నతి సజ్యశరాసనుండు నై
కన్ను మొగుడ్ప కానిశను•గాచుచు నుండెను రామచంద్రునిన్. ౧౩౧౮

తద్గుణాభ్యున్నతిన్=ఆయన గుణముల గొప్పతనమును, ముచ్చటించుచున్=ప్రసంగించుచు, ప్రియోన్నతిన్=ప్రేమాధిక్యముచే, సజ్యశరాసనుండునై =ఎక్కుపెట్టిన విల్లుగలవాఁడునై, మొగుడ్పక=మూయక. 'అన్నకుఁ బాదముల్ కడిగి యార్చి తడిన్' ఇది దేశాచారమో- రాజోపచారమో- లక్ష్మణ కైంకర్య విశేషమో. లక్ష్మణుఁడు వింటబాణము సంధించియే సీతారాముల చుట్టు ప్రదక్షిణించుచు వారిని గాచుచుండెను. గుహుఁడును నట్లె విల్లెక్కుపెట్టి బాణము సంధించి లక్ష్మణు వెనుకప్రక్కగఁ దిరుగుచుండెను. ఏలన నొక సవతితల్లి కొడుకు వలన శ్రీరామునికింత విపత్తు సంభవించెను. ఈ సవతితల్లి కొడుకేమి చేయునో యని ఆయన యేమైన కొంచెము చెనకెనా వెంటనే యాయనపై బాణము ప్రయోగింప గుహుఁడు సిద్ధపడి యుండెను. ఇది పౌరాణిక చమత్కార కల్పనము మాత్రము గుహుని భక్త్యతిశయము దెలుపునది. ఈనాఁడు గుహుఁడు కాచినఁ దక్కిన ౧౪ సంవత్సరము లెవరుగాచిరి?